# పంచదశ పరిచ్ఛేదము

## ఆశీర్వచనము : 1

## దీక్షాగురుస్థలము :

ఇంతకుక్రితము అంగ స్థలాంతర్గతమైన నలుబది నాలుగు అవాంతర స్థలముల గురించి తెలిసికొనియుంటిరి. ఇంకను, లింగ స్థలములైన యాభైయేడు అవాంతర స్థలముల గురించి తెలిసికొనవలసి యున్నది.

శివాద్వైత సిద్ధాంతము ప్రకారము సృష్ట్యాది యందున నుండెడి, యీ ప్రపంచ ముత్పత్తి, స్థితి మరియు లయలకు కారణభూతమైన స్థలతత్త్వమే తన వినోదమునకై అంగ మరియు లింగరూపముల యందున లీలావిగ్రహమును దాల్చి లీలలను రచించును. ఈ లీలలలో నంగముగా వ్యవహరించెడి జీవుడు తన సాధన చేత పునః లింగరూపమును పొందినప్పుడే యతనికి శాశ్వతమైన శాంతి లభించును. ఈ విషయమున జీవునికి జీవన్ముక్తిని ప్రతిపాదించెడి శ్రీ భగవత్పాదుల వారి యుపదేశము నీ క్రింది విధముగా నున్నది.

శ్లో॥ షట్స్థలోక్తసదాచారసంపన్నస్య యథాక్రమమ్।
లింగస్థలాని కథ్యంతే జీవన్ముక్తి పరాణి చ॥ (సి.శి. 15-1)

షట్స్థల సిద్ధాంతమందున నుపదేశింపబడిన యట్లు సదాచార సంపన్నుడై ఐక్యస్థితిని పడసిన సాధకునికి నికముందు జీవన్ముక్తి స్థితిని తెలియపరచెడి లింగస్థలము గూర్చి యుపదేశింతును. (ఓ అగస్త్య మహర్షీ!) చిత్తమిడి యాలించుము.

అగస్త్యుడు నీ క్రింది విధిన ప్రశ్నించెను.

శ్లో॥ భక్తాద్యైక్యావసానాని షడుక్తాని స్థలాని చ।
లింగస్థలాని కానీహ కథ్యంతే కతి వా పునః॥ (సి.శి.15-2)

భక్త స్థలమును మొదలుకొని యైక్యస్థలము వరకు గల షట్స్థలముల గూర్చి తాము నింతకుక్రితమే యుపదేశించితిరి. అటులైన, లింగ స్థలములెట్టివి? అవి యెన్ని? ఇవి తమరు తెలియపరచుడి అని అగస్త్య మహర్షి ప్రశ్నించగా, అప్పు డగస్త్యునితో శ్రీ భగవత్పాదులవారిట్లనిరి.

శ్లో॥ గుర్వాది జ్ఞాన శూన్యాంతా భక్తాదిస్థలసంశ్రితాః।
స్థలభేదాః ప్రకీర్త్యంతే పంచాశత్ సప్తచాధునా॥ (సి.శి. 15 : 3)

దీక్షాగురు స్థలమును మొదలుకొని జ్ఞాన శూన్య స్థలము వరకు గల 57 స్థలములను లింగస్థలములని యందురు. ఇవి షట్స్థలముల ప్రకారము, నారు విధములుగా విభజింపబడినవి. ఇందులోను భక్తాది షట్స్థలములు జీవన్ముక్తిని సాధించుటకై సహాయకములుగా నుండును.

మొదటి షట్స్థలములు ముక్తికి ఆధారభూతములు కాగా, ఈ చివరివి జీవన్ముక్తికి సాధనములై యుండును. శ్రీ భగవత్పాదులవారు, భక్తిస్థలములో గల తొమ్మిది లింగస్థలములను నీక్రింది విధిన వివరించిరి.

శ్లో॥ ఆదౌ నవ స్థలానీహ భక్తస్థల సమాశ్రయాత్।
కథ్యంతే గుణసారేణ నామాన్యేషాం పృథక్ శ్రుణు॥
దీక్షాగురుస్థలం పూర్వం తతః శిక్షాగురుస్థలమ్।
ప్రజ్ఞాగురుస్థలం చాథ క్రియాలింగ స్థలం తతః।
భావలింగస్థలం చాథ జ్ఞానలింగస్థలం తతః॥
స్వయం పరం చరం చేతి తేషాం లక్షణ ముచ్యతే॥ (సి.శి. 15 : 4-6)

ఈ స్థలమున తొమ్మిది ఉపస్థలములు గలవు. అవి దీక్షా గురుస్థలము, శిక్షాగురు స్థలము, జ్ఞానగురు స్థలము, క్రియాలింగ స్థలము, భావలింగస్థలము, జ్ఞానలింగ స్థలము, స్వీయ స్థలము, చర స్థలము మరియు పరస్థలము. శ్రీ భగవత్పాదుల వారు దీక్షాగురువుని గూర్చి ఈ క్రింది విధముగా నుపదేశించిరి.

**శ్లో॥ దీయతే పరమం జ్ఞానం క్షీయతే పాశబంధనమ్।**
**యయా దీక్షేతి సా తస్యాం గురుర్దీక్షా గురుః స్మృతః॥** (సి.శి. 15-7)

ఉత్కృష్టమైన శివజ్ఞానమును గల్గించెడిదియును, మలమాయాది పాశబంధమును ఖండించునదియును నగు సంస్కార విశేషమే దీక్షయని పిలువబడుచున్నది. ఇంతటి జ్ఞాన క్రియాత్మకమైన దీక్షా సంస్కారము ననుగ్రహించెడి జీవన్ముక్తుడైన గురువును దీక్షాగురువని పిలుతురు. గురు శబ్దములో నిమిడియున్న యర్థ గౌరవమును నెంత వివరించినను కష్టమే. అక్షరమునకు నర్థమును చెప్పెడి భాష సుస్కృతభాష యని చెప్పబడినది. ఈ భాషయొక్క తజ్ఞులు "గురు" అనెడి రెండక్షరముల అర్థమును అజ్ఞానమును దూరము చేసెడిదానిగా నభివర్ణించిరి. శిష్యుని హృదయములో నణగి యుండెడి యనాది కాలపు అజ్ఞానమును దూరము చేసెడి ఉపదేశపు సామర్థ్యపు ఘనత సద్గురువునందున యుండును.

ఆవు, ఎద్దు మొదలగు పశువులను పగ్గముల చేత కట్టివేయుదురు. ఇదే విధిన పాశము చేత కట్టబడిన జీవులను పశువులని పిలుతురు. శాస్త్ర దృష్టిచేత పరిశీలించిన యెడల జీవియు పశువేయగును. ఇచ్ఛాశక్తి యొక్క సంకోచ రూపమే ఆణవమలము. జ్ఞానశక్తి సంకోచము చెంది మాయామలమగును. అదే విధిన క్రియాశక్తి వలన కార్మిక మలము గల్గును. ఈ మూడు పాశములచేత కట్టబడెడి జీవి, తాత్వికముగా పశువని యెంచబడుచున్నాడు.

ఈ శక్తి త్రయము పూర్ణముగా వికసితమై యుండుట చేత శివునిలో యున్న యీ శక్తులచే శివునికి బంధనము లేకుండును. జీవుని స్థితియట్టిదికాదు. శక్తులు సంకుచితమై, జీవుని పాశబద్ధుని చేయుచున్నవి. పశువులకు కట్టబడిన పాశబంధములను తొలగించుకొనుటకు వలయు సామర్థ్యము జీవులకుండదు. పశువుల పాశములను విడదీసెడివాడు మనుజుడైతే, మనుజుడనెడి వాని పాశములను దొలగించెడి వాడేశ్రీ గురువు. ఎంతవరకు జీవుడు శ్రీగురువుకు శరణాగతుడు కాడో, అంతవరకు జీవి యొక్క పాశవిక గుణములు దూరము కాజాలవు. ఆ విధిన శరణాగతులుగ కాకుండగ యీ సంసారమున తిరుగాడెడి వారిని గాంచి జ్ఞానులు, "మనుష్య రూపేణ మృగాశ్చరంతి" యని అందురు. ఆహార, నిద్రా భయ మైథునములు పశువులకును, మనుజులకును సమానముగానే యుండును. జీవన చరమదశ వరకు వీటినే చేస్తూ ఉండెడి వానిని జ్ఞానులు మనుష్య-పశువని అందురు. ఆత్మ పరమాత్మల జ్ఞానమును పొందిన పిదప మనుజుడు పశువులకంటెను భిన్నుడగుచున్నాడు. అప్పుడైననూ గురువునకు శరణాగతి కాని యెడల ఫలితముండదు. శిష్యుని పాశవీయ సంస్కారములను దూరము చేయుట కొరకే సద్గురువు శిష్యునియందు శక్తిపాత చిహ్నములను పరిచ్ఛేదము చేసి అతనికి దీక్షా సంస్కారమును ప్రదానము చేయుచున్నాడు. గురువునుండి అనుగ్రహింపబడిన వేధా దీక్షా సంస్కారము వలన శిష్యుని ఆణవపాశము నివృత్తమగును. మంత్రదీక్షచేత మాయాపాశము వైదొలగును. క్రియాదీక్షవలన కార్మికపాశము నివృత్తి చేయబడును. ఈ విధముగా శిష్యునియొక్క త్రివిధ పాశములను నివృత్తి చేయుటకు త్రివిధములగు దీక్షను యిచ్చువాడే దీక్షాగురువు.

గురువుకు సమర్పించెడి కాలము కంటె పూర్వమున మాంసపిండమని యనిపించుకొనెడి ఈ శరీరాదులు దీక్షా సంస్కారముల పిదప మంత్ర పిండమని పిలువబడుచున్నవి. ఇందుకొరకే శరణులు ప్రసాదకాయులని పిలువబడుచున్నారు. ఏదో ఒక పదార్థమును సద్గురువుకు గాని, ఈశ్వరునికిగాని సమర్పించిన పిదప దానిమీద మనకు గల మమత్వబుద్ధి తొలగిపోవును. దీక్షా సంస్కారములను పొందిన సాధకుడు తన శరీరాదులపైన మమత్వ భావమును త్యాగము చేయవలెను. ఇవన్నియును ఈశ్వరునికొరకే ముడుపు గట్టబడినదని భావించవలెను. తనయొక్క స్థూల, సూక్ష్మ, మరియు కారణ శరీరముల చేత గురువు మరియు ఈశ్వరుని అనుగ్రహమునకు పాత్రములయ్యెడి కార్యములనే చేయుచుండిన దీక్షా ప్రయోజనము సిద్ధమగును. ఇంతటి దీక్షా సంస్కారమునిచ్చెడి యధికారము షట్స్థల బ్రహ్మనిష్టుడైన జీవన్ముక్తుడగు సద్గురువుకే గలదు. అది తెలియజెప్పుటయే ఈ స్థలము యొక్క ప్రముఖమైన వుద్దేశ్యమని గుర్తెరుగవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 01-08-1992
స్థలం : **భికుబాయి మేనకుదళె**
**మంగళ కార్యాలయము, పూనె**

## విశేష ప్రదీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు లింగస్థలముల గురించిన సామాన్య విషయములను తెలిపి "దీక్షాగురు" లింగ స్థలమునకు సంబంధించిన మౌళికాంశములను వివరించిరి.

లింగస్థలముల వివేచన వీరాగమాదులలో గలదు. ఉపనిషద్వాదులు దేనిని బ్రహ్మమని పిలుతురో దానిని తంత్రవాదులు లింగమని యందురు. లింగము నామరూప క్రియా రాహిత్యము గల నిరాకార నిరంజన బ్రహ్మము. శైవ పురాణములలో నిదే భావముండిననూ శైవేతర పురాణములుగా పరిగణింపబడెడి భాగవతాదులలో త్రిమూర్తులలోని శివుని యొక్క నిరాకార రూపమే లింగము. బ్రహ్మ విష్ణు శివాత్మకమైనది లింగమని కొందరనగా, శివశక్తుల సంయోగ రూపమే లింగమనెడి వారు మరికొందరు. ఈ విధముగా లింగమును గురించిన భిన్నాభిప్రాయము లెన్నియో కలవు.

వాతూల తంత్రమునననుసరించి వ్రాయబడిన శివానుభవ సూత్రము బ్రహ్మమనగా స్థలము. "స్థీయతే లీయతే యత్ర జగదేతచ్చరాచరమ్। తత్ బ్రహ్మ స్థలమిత్యాహుః స్థలతత్త్వ విశారదైః" అనెడిది స్థలమునకు నిర్వచనము. సృష్టికంటెను పూర్వమున చరాచర జగత్తు యెచ్చటనుండెనో అదియే స్థలముయని యర్థము.

ప్రవృత్తి మార్గమున శక్తి క్షోభచేత స్థలము లింగాంగములుగా విభజితమగునని తెలుపబడినది. లింగాంగములకు ఉపాస్య ఉపాసక సంబంధముండును. ఉపాసనా బలము వలన అంగము లింగములో లీనమై లింగాంగములకు గల భేదము సమసిపోవును. ఈ కారణమున లింగస్థలములు అంగస్థలములకు ప్రేరణ నిచ్చెడివని గ్రహించవచ్చును.

అంగస్థల మవిద్యా వశమున అండస్థలిగా రూపొంది భవము ననుభవించెడి దశలో నట్టి జీవుని కాపాడి సద్బోధల వలన నివృత్త్యోన్ముఖత గల్పించి, పాత్రను పోషించెడి స్థలమే "దీక్షాగురు" లింగ స్థలమని గుర్తించగలరు.

*- శివం భూయాత్ -*

## ఆశీర్వచనము - 2 :

## దీక్షాగురుస్థలము :

జగత్తున జన్మనెత్తిన వారందరూ ఈశ్వరుని దర్శించాలనెడి కోరికను కలిగి యుందురు. అయితే ఈశ్వరుడు మాయాశక్తి విశిష్టుడై వుండుటచేత సహజముగా ప్రతి ఒక్కరూ అతనిని చూచుటకు సాధ్యముకాదు. అందుచేత కనిపించని దైవమును చూపించెడివాడే సద్గురువని యెరుగవలెను. శాస్త్రములన్నియు గురువునే ప్రత్యక్షపరమాత్మయని తెలియజెప్పినవి. పూజ్యపాదులు శ్రీరేణుక భగవత్పాదులవారు దీక్షాగురువు స్థలమునందున గురువుయొక్క స్వరూపమును గురువనెడి రెండక్షరముల అర్థ వివరణతో తెలియజేసిరి. గమనించుడి.

**శ్లో॥ గుణాతీతం గుకారం చ రూపాతీతం రుకారకమ్।**
**గుణాతీతమరూపం చ యో దద్యాత్ స గురుః స్మృతః॥** (సి.శి. 15-8)

'గురు' అనెడి శబ్దమునందు రెండక్షరములు గలవు. గు అనగా గుణాతీతుడు అనెడి అర్థము. 'రు' అనగా రూపాతీతుడు అనెడిది అర్థము. గుణాతీతుడు, రూపాతీతుడునూ అయియుండి నిర్గుణ, నిరాకారమైన పరమాత్మ స్వరూపమును తెలియజెప్పెడి సామర్థ్యము గలవాడే గురువు. ప్రకృతమున సత్వ, రజ, తమస్సులు అనెడి మూడు గుణములుండును. అటులనే ప్రకృతినుండి జనించిన ప్రపంచమునందున, ప్రపంచమునుండి జనించిన ప్రతి వ్యక్తియందున ఈ మూడు గుణములు హెచ్చుతగ్గులుగానైనను ఉండియుండును. సమస్త సృష్టియంతయు త్రిగుణమయమై యుండును. త్రిగుణములే సృష్టి వ్యవహారమునకు కారణభూతములగుచున్నవి. సత్వగుణము వలన మనుజుడు శాంతుడు, ధీరుడు, దైవీసంపత్తు గలవాడుగను, రజోగుణము యొక్క ప్రభావము వలన కామియు, క్రోధియు, సాంసారిక వ్యవహారములయందున ఎంతో ఆసక్తి కలవాడుగను, అటులనే తమోగుణ ప్రభావము వలన సోమరియు, మూఢుడును, కలహప్రియుడునూ అగుచున్నాడు. జగత్తునందున మనుష్యుల స్వభావ వైపరీత్యమునకు ఈ గుణములే మూలకారణములగుచున్నవి. ఏ గుణము యొక్క ప్రమాణము అధికముగా నుండునో ఆ స్వభావము అతనియందున బహిర్గతమగును. మనుజుడు తన స్వభావమును మార్చుకొనవలసిన యెడల తనగుణములను మార్చుకొనుటకు ప్రయత్నించవలెను. ఈ త్రివిధ

గుణముల యందున రజ మరియు తమో గుణములు దుఃఖమయమైన సంసారమునందున జీవిని బంధించివేయుచున్నవి. ప్రస్తుతము ఈ సంసారమునందున సుబుద్ధిని కలిగించెడి సాత్వికగుణము కలవారి సంఖ్య తక్కువగానే వుండును. దీనికి విరుద్ధముగా రజ, తమో గుణములు గలవారి సంఖ్య హెచ్చుగానుండును. సత్వగుణి అయినవారు కాచిన నీరు బాష్పమై ఊర్ధ్వగామి యగునటులనే తమ త్యాగము, తపస్సు, ఔదార్యము మొదలగు గుణములచేత ఉత్కృష్ట విచారములు గలవారగుచున్నారు. క్రిందకు పడిన నీరు సహజముగా పారిపోవునటులనే రజోగుణములు గల మనుజుడు అధో ముఖముగా ప్రక్కుందన వనితాది విషయముల యెడల ఆసక్తుడగుచున్నాడు. ఇంకను మంచుముద్దగడ్డగా మారి పైకిపోకనూ, క్రిందికి జారకనూ పెట్టిన కడనే యుండునటుల తమోగుణముగల మనుజుడు సోమరిపోతై అలసత్వముతో కాలమును వృధా చేయుచుండును.

ఒక అత్యంత తమోగుణియు, అలసత్వము గలవాడును అయిన వ్యక్తి తన పొలమునందున రేగిపళ్ళ చెట్టు క్రింద పరుండియుండెను. ఆ చెట్టు మీది పండ్లు పక్వములై యుండుటచేత అవన్నియు క్రిందకు రాలి నేలమీద పడెను. పరుండిన వ్యక్తికి ఆ పళ్ళను తినెడి కోరిక కలిగెను. కాని వాడికి లేచి ఆ పళ్ళను తెచ్చికొని తినెడి ఓపిక లేకుండెను. అదృష్టవశాత్తున ఒక పండు అతని యెదమీద పడెను. దానిని చేతితో తీసికొని నోటిలో యెటులవేసికొనవలెను అని ఆలోచించుచూ అటులనే పరుండియుండెను. అంతనొక రౌతు ఆ మార్గమున వచ్చెను. ఈ పరుండినవాడు అది గమనించి ఆ రౌతును కేకలు వేసి పిలిచెను. రౌతు యితనిని వీక్షించి ఏ కారణమువలననో నేలమీద పడియున్నాడు, లేచుటకు కూడా శక్తి లేనట్టులయున్నది. అందులకే నన్ను పిలుచుచున్నాడు. నేను వెడలి అతనికి సహాయము చేయుట యనెడిది నైతిక ధర్మము అని ఆలోచించుచూ రౌతు దయాభావము గలవాడై పరుండిన వానికడకు విచ్చేసెను. ఏమయ్యా! ఏమైనది నీకు. ఏమి చేయవలెనో చెప్పుము. నాచేతనైన సహాయమును నేను చేసెదను అని రౌతు తెలియజేసెను. పరుండిన వ్యక్తి ఏమియులేదు. నా యెదమీద ఒక రేగుపండు పడియున్నది. దానిని తీసి నా నోటియందు వేయుము అని అనెను. రౌతు ఏమయ్యా! నీవింత సోమరిపోతువా? ఎదమీద పడిన పండును నోటిలో వేసికొనుటకు నీతో కాదా? నేనీ పని చేయవలెనా? నోటిలో వేసినను నోరాడించుకొనుచూ తినవలసి యుండును కదా! అది నీవే చేయవలయును కదా! ఇంత సోమరివై భూమికి భారమై జీవించుచున్నావా! అని నాలుగు చీవాట్లు పెట్టుచు గుఱ్ఱపు హంటరుతో నాలుగైదు పెట్లను పెట్టెదననుచు దానిని ఝుళిపించగానే ఆ సోమరి యువకుడు లేచి పరుగెత్తిపోయెను. ఇది తమోగుణము యొక్క పరమావధికి ఉదాహరణ. జగత్తునందున తమోగుణి అయినవారు దీనికంటెను కొంచెము హెచ్చుతగ్గులుగా వుండి వుందురని గ్రహించగలరు. రజోతమోగుణములు మనుజుని సంసారమునకు అభిముఖులుగా చేయును. సత్వగుణము గలవారు మాత్రము ఆ గుణము ప్రభావము వలన పరమాత్మునికి అభిముఖులుగా అగుచున్నారు. ఈ కారణము వలన భక్తుడు రజోతమోగుణముల ప్రమాణమును తగ్గించుకొని సత్వగుణాధిక్యతను పెంపొందించుకొని ఆధ్యాత్మిక మార్గమునందున ప్రవృత్తులు కావలెను. జీవ జగత్తులు త్రిగుణములతో కూడుకొని యుండిననూ పరశివుడు మాత్రము త్రిగుణాతీతుడై, రూపాతీతుడై యున్నాడు. మహర్షులు నిరాకారుడైన పరమాత్మనారాధించుటకందరికీ సాధ్యము కాదని అతనికనేక యాకారములను కల్పించినారు. భారత సంస్కృతియందు గల పౌరాణిక జగత్తులో ఒకటి కాదు. రెండు కాదు. మూడు కాదు. ముప్పది మూడుకోట్ల ఆకారములయందు పరమాత్మని పూజించుట కన్పట్టుచున్నది. పరమాత్ముని ఈ నామరూపములు యిన్ని విధములుగా కన్పించిననూ అతని మూల స్వరూపము ఒకటిగానే యుండి 'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి' అని చెప్పుట జరిగినది. దీనినే వచనకారులు దేవుడొక్కడే. నామములనేకములని ఉపదేశించిరి. ఉపనిషత్తులయందున 'అశబ్దమస్పర్శ మరూపమవ్యయమ్' అని చెప్పుటను గాంచగలము. శబ్ద స్పర్శ రూపాదులు లేకుండా వుండెడి స్థితియే పరమాత్ముని యొక్క వాస్తవికమైన స్థితియై యున్నది. ఇటులైననూ సదా ప్రపంచము యొక్క ఆకారమునందుననే అనురక్తమై యుండెడి చిత్తమును దానినుండి దూరము చేయుటకొరకు పరమాత్మునకు ఒక ఆకారమును కల్పింతురు. మన్నును తిని సంతోషపడుచున్న పిల్లవాడిని అదలించి అతని చేతినుండి మన్నును తీసి విసరివేసిన, పిల్లవానికి సమాధానము కాదు. దానికి బదులుగా తీపి పదార్థమును యిచ్చినప్పుడు ఆ పిల్లవాడు తనకు తానే మన్నును విడచిన యటుల ప్రపంచమునందున అనురక్తమైన వారి మనస్సును అందులోనుండి ముక్తి పొందించుటకై పరమాత్మునికి పలు దివ్యమైన ఆకారములను కల్పించినారనెడిది వూహించవచ్చును. మన్నుతినెడి పిల్లవాడి చేతినుండి మన్నును విడిపించిన యటులనే ఒక దినమున ఆ పిల్లవాని చేతినుండి తీపిపదార్థమును కూడా విడిపించెడి అవసరము వచ్చును. అటులనే ఒకానొక సమయమందున పరమాత్ముని ఆకారమును కూడా లౌకిక రూపమునుండి దూరము చేయవలసి యుండును. గురువు తన శిష్యునికి పరమాత్ముడు నిరాకారుడని చెప్పవలసిన అవసరమున్నది. ఈ విధముగా చివరి దశలో శిష్యునికి నిర్గుణపరమాత్మను తెలియజెప్పెడి వాడే 'గురువు' అని తెలిసికొనవలెను. 'గురు' వను పదములోని అంతరార్థమిదియే.

వీరశైవ సిద్ధాంతమునందు ప్రతిపాదించబడిన ఇష్టలింగ పూజ నిర్గుణ నిరాకారమైన పరమాత్మునికి ప్రతీకయైయున్నది. ఈ నిర్గుణ నిరాకారుడైన పరమాత్మ ప్రతి ఒక్కరి మనస్సులయందున తిష్ట వేసుకొని యుండును. బీజమునందున అంకురము వుండునటులనే హృదయము నందున పరమాత్ముని అస్తిత్వము వుండును. దీనిని తెలియజేయుటకే ఇష్టలింగమును హృదయముమీద ధరించెడి పద్ధతి కొనసాగుచున్నది. ఈ యిష్టలింగపు ఆరాధనారూపమైన శివయోగమువలననే ప్రాణలింగ మరియు భావలింగముల పూజను చేయుట సాధ్యమగుచున్నది. జగత్తునిండా నిండియుండెడి పరమాత్మ ప్రతియొక్కరి హృదయమునందు వుండిననూ అంతర్ముఖి కాని వాని కతడు అగోచరుడుగానే యుండును. తీర్థముల యందుననూ, క్షేత్రములయందుననూ దేవుడిని వెతికెడివారే ఎక్కువగా యున్నారు. హృదయము నందుండెడి శివునిని అనుభవించెడివారు అతి తక్కువే. 'కశ్చిద్ధీరః ప్రత్యగాత్మానమైక్షత్ వ్యావృత్తచక్షుః అమృతత్వమిచ్ఛన్' అని ఉపనిషద్వచనము.

విపరీతమైన కోరికలను కోరుచూ పరమాత్మునికి కష్టము కలిగించెడు జనుల వలన కలిగెడు బాధనుండి తప్పించుకొనుటకు తానెక్కడనుండవలెననెడి సందేహము కలిగినప్పుడు పరమాత్ముడు దేవతల సభను ఏర్పాటు చేసెను. ఆ సభలో నిర్ణయమైనదే మనగా కైలాసము, కాశి, మేరువు మొదలగు ఏ ప్రదేశములనున్ననూ, జనులు నిన్ను వెంబడింతురు. ఎక్కడ కూర్చున్ననూ తమరికి విశ్రాంతి దొరకదు. అందుచేత వెదకువారి హృదయములయందున నివాసముండిన యెడల నీవు ఎవరికి చిక్కకుండా వుండవచ్చును. ఈ కారణమున భగవంతుడు మనుజుల హృదయము నందున నిలిచి యుండుటకు నిశ్చయించుకొనెను. ఈ కథవలన తెలిసెడిదేమనగా అంతర్ముఖులై హృదయమునందున గల భగవంతుని దర్శించుటకు ప్రయత్నించువారికే భగవంతుని దర్శనమగుననియును, కాశి, కేదార యిత్యాది క్షేత్రములకు పరుగెత్తెడి వారికి భగవద్దర్శనము కాదనియును గుర్తించవలెను. ఈ వాస్తవిక నేపథ్యమున వీరశైవుడు గుర్తించవలసినదేమనగా కాశి, రామేశ్వరము, శ్రీశైలము మొదలగు క్షేత్రములకు వెడలి కాలమును వృథా చేయుట కంటెను తన నివాసమునందుననే కూర్చొని యిష్టలింగమును పూజించుచూ తద్వారా ప్రాణలింగ భావలింగ రూపములోనున్న శివపరమాత్మను దర్శించుటకు ప్రయత్నించవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 2-08-1992

స్థలం : **భికుబాయి మేనకుదళె**

**మంగళ కార్యాలయము, పూనె**

## విశేష ప్రదీపిక :

'గురు' పదమునకు శ్రీ భగవత్‌పాదుల వారిచ్చిన నిర్వచన విశ్లేషణనీ ఆశీర్వచమున గాంచగలము.

"నిషేకాదికృద్గురుః" అనెడి అమరవాక్యము గురువుకు పితృవు కభేదమును తెలిపెడిదైయున్నది.

గర్భాదానాదులు చేయువాడే గురువని తెలుపబడినది. ఇందులో "ఆది" శబ్దము సీమంతోపనయనములను తెలుపుచున్నదని వావిళ్ళవారి ప్రతి (పుట 440) వలన తెలియుచున్నది. అయితే, "గృణాతి ఉపదిశతి గాయత్ర్యాది కం గురుః" అనెడి దొక పండితోక్తి గాయత్ర్యాదుల నుపదేశించువాడే గురువనియు ప్రాకృతాచారమున గాయత్రి నుపదేశించెడి వాడు కన్న తండ్రియేగాన నీ వివరణయూ పూర్వోక్త భావననే సమర్థించుచున్నది.

వీరశైవ ధర్మమిట్టి భావనల నంగీకరించదు. గురువునకు మహోత్కృష్టమైన స్థానమివ్వబడినది. హరుడే గురుడనియును, గురువే హరుడనెడి భావము సుప్రతిష్టితమై యున్నది. "గురుమాహత్మ్య స్థలము"లోను, గురుకారుణ్య స్థలములోను గురువునకు గల స్థానమెట్టిదో తెలుపబడినది. అట్టి స్థానమును గురువునకెందుకివ్వబడినదో యిచ్చట వివరించనైనది. పరబ్రహ్మతత్వమునకు వేదములలో పవిత్రమనెడి పేరివ్వబడినది. మహాభారతమున వ్యాసుడు పరతత్త్వమును పవిత్రమనెడి పేరుతో పిలిచిరి. ద్రోణ పర్వములోన నీ భావమును గాంచగలము. ఈ తత్త్వముపనిషత్తులలో నిర్గుణ బ్రహ్మముగా గుర్తింపబడినది. ఆగమములు త్రిగుణాతీతమైనట్టి యరూప తత్త్వమును లింగమనెడి పేరుతో పిలిచిరి. "గృణాతి ఉపదిశతి లింగతత్త్వాదికం గురుః" అను యుక్తి వలన గురువనెడి పదముకు సరియైన నిర్వచనము తెలిసికొనగలరు. త్రిలింగములనిచ్చి తత్త్వోపదేశమును చేసెడి గురువు భక్తాంగ స్థలములోని జీవుని యుద్ధరించెడి లింగస్థలములలో నొకటియగు దీక్షాగురుస్థలమునకు సంబంధించిన వాడని గుర్తించగలరు.

*– శివం భూయాత్ –*

## ఆశీర్వచనము - 3 :

## దీక్షాగురుస్థలము :

శ్రీ భగవత్పాదులవారు యింతకు క్రితము 'గురు' పదము యొక్క అర్థమును వివరించి చెప్పిరి. ప్రస్తుతము వీరు ఆచార్యపదము యొక్క అర్థమును వివరించుటకై ఈ క్రింది ఉపదేశమునిచ్చిరి.

శ్లో॥ ఆచినోతిచ శాస్త్రార్థానాచారే స్థాపయత్యపి।
స్వయమాచరతే యస్మాదాచార్యస్తేన చోచ్యతే॥ (సి.శి.15-9)

వీరశైవ శాస్త్రమునందు గల రహస్యార్థములను తానభ్యసించి తన శిష్యులు ఆ శాస్త్రము ప్రకారము ఆచార సంపన్నులుగా వుండునటుల చక్కగా చూసికొనుచూ, తానున్నూ సదాచార సంపన్నుడుగా వుండునట్టి సద్గురువునే ఆచార్యుడని పిలుతురు. ఆచార్య పద విభూషితుడైన సద్గురువు సకల శాస్త్ర సంపన్నుడైయుండును. ఈ శాస్త్ర పరిణితి సద్గురువు యొక్క విశిష్టలక్షణమైయున్నది. శ్రీ మన్నిజగుణ శివయోగారు కరుణ, సత్కళ, శాస్త్ర పరిణత, సుజ్ఞానము మొదలగునవి గలవాడే సేవ్యగురుడని తెలియజెప్పిరి. శాస్త్రజ్ఞుడు అన్న పదమునకు శాస్త్ర పరిణత గలవాడను అర్థము గలదు. ఆచార్య స్థానమునలంకరించెడి సద్గురువు సకల శాస్త్రపారంగతుడై యుండవలెననెడిది నిర్వివాదమైన అంశము. ఈ శాస్త్ర పరిణితిని పొందినవారిని గురించి ఉపనిషత్తులు 'శ్రోత్రీయత్వమ్' అని చెప్పినవి. దీని యర్థమేమనగా ఆచార్యుడనెడివాడు శ్రుతుల యొక్క పరిజ్ఞానమును కలిగి యుండవలెను.

వేదము, ఆగమము, ఉపనిషత్తు, మరియు ఇతిహాస గ్రంథములయందున వీరశైవ సిద్ధాంతము యొక్క అనేక ఆచార విచారములు ప్రతిపాదించబడినవి. సమగ్ర జ్ఞానమును పొందవలెనని వాటిని అధ్యయనము చేయుట తప్పనిసరియగును. జగత్తులో ప్రతి వ్యక్తికిని సకల శాస్త్రముల యొక్క అధ్యయనము సాధ్యముకాదు. అందుచేత, ప్రపంచమునకు మార్గదర్శకము నిచ్చెడి సద్గురువు సకల శాస్త్రములనభ్యసించియుండవలెను. తేనెటీగ ఎన్నో పుష్పముల మీద వ్రాలి మకరందమును గ్రోలి మధు సంచయమును చేయును. ఇద్దానిని గ్రహించి లోకము లబ్దిని పొందుచున్నది. అదే విధిన శ్రీ సద్గురువు చేసెడి శాస్త్రాధ్యయనము వలన లక్షలాది జనులు లాభమును పొందుచున్నారు. శ్రీ సద్గురువు తన మఠమునందున సత్సంగమునేర్పాటుచేసి జన సామాన్యమునకు హితమును చేసెడి శాస్త్ర పరిజ్ఞానము నందజేయుచున్నాడు. ఈ పరంపర కలకాలమునుండి కొనసాగుచు వచ్చుచున్నది. కొన్ని మఠములలో నను నిత్యము సత్సంగమైతే మరికొన్నింటిలో కనీసము నెలకొక పర్యాయమైనను సత్సంగము నేర్పాటు చేయబడుచున్నది. ఈ బోధనాత్మక సమారంభములతో బాటు జనులలో క్రియాచారముల యెడల నాసక్తిని పెంపొందించుటకై యిష్టలింగ పూజాదులను ప్రత్యక్షముగా చేయించి చూపెడి రూఢియును నాటినుండి నేటివరకు ననూచానముగా కొనసాగుచు వచ్చుచున్నది. అందుకే వీరశైవ ధర్మపు పీఠాచార్యులును మరియు వారి శాఖావర్తులైన శివాచార్యులు బహిరంగమునందున వేలాది జనుల మధ్యలో వైభవోపేతమైన యిష్టలింగ పూజా సమారంభముల నేర్పాటు చేయుచున్నారు. అధిక సంఖ్యాకులైన భక్తులకు పూజావిధినితెలియజెప్పెడి యుద్దేశము చేతనే యిట్టి కార్యక్రమములేర్పాటు చేయబడుచున్నవి. ఈ విధిన చేయవలయుననెడిది జగద్గురువులకర్తవ్యమై యున్నది. శివాచార్యులును మరియు మఠమయ్యలును నిట్టి యిష్టలింగ పూజా సమారంభముల నేర్పాటు చేయుట వారి వారి కర్తవ్యమని భావించి ఇష్టలింగ పూజా సంస్కృతిని పెంపొందించవలెను.

వీరశైవ సిద్ధాంతము జ్ఞానము మరియు కర్మల సమన్వయాత్మకమై యున్నది. అందుచే వీరశైవాచార్యులు గాని, గురువర్గమైన మఠమయ్యలుగాని మరియు శిష్యవర్గమైనను గాని కేవలము ధర్మాచరణ పరిజ్ఞానము పెంపొందించికొనినచో సరిపోదు. వారు ఆచారవంతులై యుండవలెను. జ్ఞానముతో బాటు ఆచార సంపదను పెంచికొనిన వాడే శిష్యులకు బోధించెడి హక్కును పొందగల్గును. జ్ఞానమెంత నున్నను నేమి ప్రయోజనము. అది ఆచరణలోకి వచ్చినప్పుడే సుసంపన్నమగును.

ఆచార్యస్థానమున నున్నవాడు జ్ఞానాచారముల సమన్వయ కేంద్రముగా నుండవలెను. ఆవు పాలు నమృత సదృశముగా నుండినను, వాటిని మనుష్యుని కపాలములో పోసియిచ్చిన యెడలనవి నగ్రాహ్యమగుచున్నవి. అదే విధిన ఆచారహీనునిలోని జ్ఞానము ననాదరణకు గురియగును. అందుచేత, శ్రీభగవత్పాదులవారు నాచారమహతిని యీ క్రింది విధిన కొనియాడిరి.

శ్లో॥ ఆచార ఏవ సర్వేషామలంకారాయ కల్ప్యతే।
ఆచార హీనః పురుషో లోకే భవతి నిందితః॥ (సి.శి.16-13)

వీరశైవ సిద్ధాంతము జ్ఞానము మరియు ఆచారముల సమన్వయ రూపమున గలదు. ఆచారమనెడిది యొక సుందరమైన యలంకారము వంటిది. లోకములోన యలంకారములు ప్రీతిప్రదములు కదా! లోకులు వస్త్రా ద్యాదిభూషణముల ద్వారా తమను తామునలంకరించికొనెదరు. అంతేకాదు నిటీవలి కాలమున బాహ్యోపచారముల ద్వారాను, అలంకార సామాగ్రిచేతను శరీరము యొక్క అందమును పెంచెడి సంస్థలు కూడా యేర్పడినవి. ఇట్టి అంగళ్ళ వైపు జనులు హెచ్చు సంఖ్యలో నాకర్షితులగుచున్నారు. స్థూల శరీరమునెంత మేరకు నలంకరించి కొనిన నొకానొక దినమున నయ్యది చెడిపోవుట జరుగును. స్థూల శరీరము యొక్క అందమును పెంచికొనుటకై వెచ్చించెడి కాలములో కొంతభాగమునైనను సూక్ష్మ శరీరము యొక్క సౌందర్యమును పెంపొందించుటకై కేటాయించిన యెడల జీవితము ధన్యము కాగలదు. సూక్ష్మశరీరము యొక్క అందమును పెంచికొనుటలో దగిన శ్రద్ధ వహించక వారి యాసక్తి స్థూలశరీరపు అందమును పెంచికొనుట యందుననే నిలుపుదురు. వారు చేసికొనెడి శృంగారము శవమునకు చేసెడి శృంగారము వంటిదని తెలియలేదు.

సూక్ష్మశరీరమునలంకరించికొనెడి సామగ్రి యెట్టిది యనెడి ప్రశ్న యుదయించవచ్చును. శాస్త్ర విహిత ఆచారణలే సాధనలుగా నుపకరించునని తెలిసికొనవలెను. ఎవ్వరీ ఆచరణలలను శ్రద్ధాసక్తులతో చేయుదురో వారు తమ సూక్ష్మ శరీరమును నలంకరించికొనెడి వారగుచున్నారు. సూక్ష్మ శరీరము యొక్క సౌందర్యమే నిజమైన సౌందర్యమని తెలిసికొనగలరు. స్థూల శరీరమునలంకరించి కొనెడివాడు సూక్ష్మ శరీరమును నిర్లక్ష్యమునకు గురి చేయుచు నశాంతియుతమైన జీవితమును గడుపుచున్నారు. స్థూల శరీరము రోగగ్రస్తమైయున్నప్పుడు వైద్యుని కడకు పరుగులు తీయు జనులను గాంచగలము. సూక్ష్మ శరీరమునకెట్టి రుగ్మత వచ్చినను మిన్నకయుందురు. స్థూల శరీరమునకు విష విషమ జ్వరములుండునటులే, సూక్ష్మ శరీరమునకు కామ క్రోధమోహాది జ్వరములెన్నియో రావచ్చును. స్థూల శరీరమునకు జ్వరము వచ్చినప్పుడు ఫాలమున శీతల జలము యొక్క పట్టి, ఔషధములు మొదలగునవి యుపయోగింతురు. స్థూల శరీరమున కౌషధము లుండునటులే, సూక్ష్మ శరీరమునకును నౌషధములు గలవు. అవి యెట్టివనిన, సత్సంగము, సద్గ్రంథముల యధ్యయనము, శివనామజపము మొదలగు శాస్త్ర విహిత ఆచరణలద్వారా సూక్ష్మ శరీరము యొక్క ఆరోగ్యమును కాపాడికొనుటయే మానవుని ప్రాథమిక కర్తవ్యమై యున్నది. ఈ కారణముననే యాచార్యులవారు నాచరణలకే యధికమైన ప్రాముఖ్యత నిచ్చిరి. ఆచరణలు నాచార్యులకెంత మేరకు ముఖ్యమైనవో, అంతేమేరకు నయ్యవి శిష్యులకును ప్రాముఖ్యత గలవిగా యగుచున్నవి. ఒక వస్త్రమును నేయుటకును నడ్డము మరియు నిలువు దారముల యవశ్యకత యుండునటులే, యొక వ్యక్తి యొక్క జీవనము పరిపూర్ణమగుటకు, జ్ఞానము మరియు ఆచరణల యావశ్యకత గలదు.

పూజ్యపాదులు **“జ్ఞానేనాచరయుక్తేన ప్రసీదతి మహేశ్వరః”,** శివుని యనుగ్రహమునకు పాత్రులు గావలెననిన జ్ఞానము మరియు ఆచరణలకు సమానమైన ప్రాముఖ్యత గలదని యుపదేశించిరి. జ్ఞానాచరణలనెడివి దొంగలకందని సొమ్ము. యముడైనను వీటిని మననుండి దూరము చేయజాలడు. చచ్చిననూ, ఈ ఆభరణములు మనను వీడిపోవు. జ్ఞానపిపాస గల శిష్యుడు తన వద్దకు వచ్చినప్పుడు శ్రీ గురువు మొదట నతనికి యాచారములను నేర్పును. శ్రీ భగవత్పాదులవారు “ఆచినోతిచ శాస్త్రార్థాన్ ఆచారే స్థాపయతి అపి” అని యుపదేశించిరి.

ఆచారమనగా వేదాగమాది శాస్త్రముల యందు విధింపబడిన ధర్మ విశేషము. ఆచారమనెడిది కల్పవృక్షము వంటిది. దీనినుండియే ధర్మార్థ కామ మోక్షములను పొందగలము. ఆచారవంతుడైన వాడు సదా ప్రసన్నచిత్తుడుగను, సాత్వికునిగను, ఆరోగ్య సంపన్నునిగను, ఆయుష్మంతునిగను నగుచున్నాడు. ఆచార విహీనుడు నింతకంటెను విరుద్ధమైన లక్షణములను గల్గియుండును. సదా దుఃఖము ననుభవించెడి వానిగను, రజోగుణి ఆది వ్యాధియుక్తునిగను, మరియు నల్పాయుష్కుడుగను నగుచున్నాడు. ఇట్టివానిని వేదములైనను పవిత్రునిగా చేయజాలవు. “ఆచార హీనం న పునంతి వేదాః” యనెడిది పెద్దలు చెప్పిన మాట. ఆచారమే శ్రేష్ఠమైన ధర్మము. ఇదియే సర్వోత్కృష్టమైన సంపద. ఆచారవంతుడే శ్రీమంతుడు. భౌతిక సంపద పుష్కలముగా గల్గియుండియును, నాచారము లుప్తమైన యెడల వానిని దరిద్రునిగానే పరిగణించవలెను.

వీరశైవ సిద్ధాంతమునందున యీ ఆచారములను అయిదు విధములుగా నంగీకరింపబడినవి. అవి యేమనగా లింగాచార, సదాచార, శివాచార, భృత్యాచార మరియు గణాచారములు ఈ పంచాచారములు వీరశైవులకు పంచ ప్రాణములవలె ప్రియమైనవై యున్నవి. వీరశైవ సాధకునికి అష్టావరణములు దేహముగను, పంచాచారములు ప్రాణములుగను బోధింపబడినవి. ఈ పంచాచారముల స్వరూప స్వభావముల విశ్లేషణ ఎంతో నవశ్యకమైయున్నది. అందుచేత ప్రసంగానుసారముగ నిచ్చట వాటి విశ్లేషణ చేయనైనది.

ఈ ఆచారముల విస్తృతమైన వివరణ చంద్ర జ్ఞానాగమములోని క్రియాసారము నందున గలదు. అద్దాని నాధారముగా గొని యీ విశ్లేషణ చేయనైనది.

**1. లింగాచారము :** పంచాచారములలో నిది మొదటిది. జీవి యనబడెడి అంగమును లింగముగా చేయు నాచారమే లింగాచారము. శరీరము మీద లింగమును ధరించి పూజించుట, మనస్సున ప్రాణ మరియు భావ లింగముల గురించి చింతన చేయుట, ఈ లింగముల యెడల నిరంతర ధ్యాసను నిలిపి ధ్యానము చేయుట యనెడివి లింగాచారము యొక్క స్వరూపమై యున్నది. ఈ విషయమున చంద్రజ్ఞానాగమము నీ క్రింది విధముగా తెలుపుచున్నది.

శ్లో॥ **గురుణా దత్తలింగాద్ వై నాస్తిదైవం మహీతలే।**
**ఇతి భావానుసంధానం లింగాచారః స ఉచ్యతే॥** (చంద్రజ్ఞానా. క్రి. 9-4)

గురుదత్తమైన లింగము కంటెను వేరుగా యితర దైవము లేదనెడి భావమును ననుసంధానము చేసికొనుటయే లింగాచారమని యీ ప్రమాణములోని భావము. సద్గురువు దీక్షా సంస్కారమును చేయునప్పుడు శరీరత్రయమునకు లింగత్రయము ననుసంధానము చేయును. స్థూల శరీరమునకు నిష్టలింగమును, సూక్ష్మ శరీరమునకు ప్రాణలింగమును, కారణ శరీరమునకు భావలింగమును సంధించును. వీరశైవునకీ మూడు లింగములు మాత్రమే నారాధ్యములు. వీటిని మినహాయించి మరి వేటిలోను శ్రద్ధను నెలకొల్పవలదు. ఈ సిద్ధాంతమున అంగుని సతిగను, లింగమును పతిగను భావించుట యుండును. ఏ విధముగా పతివ్రత పతిని దప్ప మరొకనిని కూడదో, నదేవిధిన లింగధారి లింగమును వీడి యన్యదైవముల నర్చించడు. ఈ ఆచారమును కట్టుదిట్టముగా పాలించిన యెడల నిష్ఠ వికసనము నొంది సాధకుని యంతరంగములోని ప్రవృత్తి ప్రబలమగును.

**2. సదాచారము :** పంచాచారములలో సదాచారము రెండవది. సత్ పురుషులు నాచరించెడి యాచారమే సదాచారము. సద్రూపియైన పరశివుని ప్రాప్తికై యాచరించు యాచారమే సదాచారము. ఇంకొక యభిప్రాయము ప్రకారము శివునికిని మరియు శివభక్తులకును ప్రీతిని కూర్చునదే సదాచారము. ఈ విషయము గురించి చంద్రజ్ఞానాగమము నీ క్రింది విధముగా తెలిపినది.

శ్లో॥ **ధర్మార్జితేన ద్రవ్యేణ యత్ సంతర్పణమన్వహమ్।**
**గురులింగ జంగమానాం సదాచార ఇతిస్మృతాః॥** (చ.జ్ఞా.క్రి. 9-6)

ధర్మమార్గముల ద్వారా ధనమును సంగ్రహించి తన ఆరాధ్యులైన గురులింగ జంగములకు ప్రతిదినము అన్న, వస్త్ర ధనాదుల రూపమున సమర్పణలు చేసి వారి యనుగ్రహమును పొందుటయే సదాచారము.

తాను సంపాదించిన ద్రవ్యము తానొక్కడే యనుభవించుట భారతీయ సంస్కృతియందున లేదు. అందుచేతనే "తేనత్యక్తేన భుంజీథాః" యని యీశావాస్యోపనిషత్తు బోధించినది. తాను సంపాదించినది శివునికి సమర్పించి, అతిథి అభ్యాగతులకు నివేదించి భుజించుటయే శిష్టాచారమై యున్నది. దీనికి విరుద్ధముగా ప్రవర్తించెడి వానిని దొంగయని పిలుచుట జరిగినది. పథికులకు, నిరుద్యోగులకు మరియు విద్యార్థులకు అన్నపానాదులు సమర్పించవలెనని ధర్మశాస్త్రము తెలుపుచున్నది. ఇంటియందు వంట కాగానే తినుటకు బదులుగా గోదోహకాలము వరకు నతిథి యభ్యాగతులకై వేచి చూసి భుజించుటయే శాస్త్ర సమ్మతము. ఈ నియమమును పాలించని వాడు దోషభాజనుడగును. ఈ విధముగా శాస్త్రోక్త పద్ధతి ప్రకారము అన్న పానీయములను గురు-లింగ-జంగమాదులకు సమర్పించి వారిని సంతోషపెట్టుటయే వీరశైవుల సదాచారమై యున్నది. ఈ సదాచారము నెనిమిది విధములైన శీలములను గల్గియున్నది. శీలమనగా శివతత్త్వమును తెలిసికొనవలెనెడి తీవ్రమైన కోరిక. ఇద్దానికి ననుగుణములుగా నున్న యెనిమిది విధములగు నాచారములే యష్టశీలములని యందురు. అవి అంకురశీలము, ఉత్పన్నశీలము, ద్విదల శీలము, ప్రవృద్ధ శీలము, సప్రకాండ శీలము, సశాఖాశీలము, సపుష్పశీలము మరియు సఫలశీలము.

**1. అంకుర శీలము :** గురు కరుణచేత త్రివిధ దీక్షలను బడసి తన స్థూల, సూక్ష్మ మరియు కారణ శరీరములను శుద్ధి జేసికొని గురువు యొక్క యుపదేశము మేరకు ప్రతిదినమును నియమ పూర్వకముగా ఇష్టలింగ పూజల నాచరించునదే యంకుర శీలము.

**2. ఉత్పన్న శీలము :** తాను దీక్షా సంస్కారమును పొందిన యటులే తన సతి, పుత్ర పౌత్రాదులకు స్వగోత్రపు గురువు గారిచేత దీక్షా సంస్కారమును చేయించి వారిని తనవలెనే శుద్ధీకరించి దీక్షితులైన వారి జతకు మాత్రమేసహవాసాది వ్యవహారములను చేయునదే యుత్పన్న శీలమగును.

**3. ద్విదల శీలము :** శరీరము మీద నిష్టలింగము, భస్మము మరియు రుద్రాక్షాది వీరశైవ లాంఛనములను తప్పకుండగ నెల్లప్పుడు ధరించెడిదే ద్విదల శీలము.

**4. ప్రవృద్ధ శీలము :** ప్రతిదినము శివుని మహాత్మ్యమును శ్రవణము చేయుట, శ్రవణము చేసిన దానిని మనన నిధి ధ్యానములను చేసి శివభక్తిని మనస్సునందున పెంచికొనునదే ప్రవృద్ధశీలము.

**5. సప్రకాండ శీలము :** వీరశైవ సిద్ధాంతము యొక్క నిత్య కర్మమైన యిష్టలింగ పూజను యే కారణము వలననైనా చేయకుండిన యెడల నన్నపానాదులను స్వీకరించకుండగ నుండునదే సప్రకాండ శీలము.

**6. సశాఖా శీలము :** ఇష్టలింగమున కర్పితము చేయకుండగ నుండెడి భక్ష్య-భోజ్యాది పదార్థములను గ్రహించకుండగనుండుటయే సశాఖాశీలము.

**7. సపుష్ప శీలము :** ఇష్టలింగమునకు అర్పితమైన ప్రసాదమును పరిత్యజించక సంపూర్ణముగా సేవించుటయే సపుష్పశీలము.

**8. సఫల శీలము :** గురు-లింగ-జంగముల యెడ భేదబుద్ధిని వీడి, ఒకే తత్వము యొక్క భిన్న రూపములని యెంచి పూజించుటే సఫల శీలము.

ఈ విధముగా, సదాచారము నెనిమిది విధములుగా నున్నది. పరమేశ్వరుడు సదాచార ప్రియుడైయున్నాడు. సదాచారమును పాటించనివాడు శివుని కృపను పొందజాలడు. సదాచారమును పాలించునదే నిజమైన యీశ్వర పూజయని గ్రహించి ప్రతి వీరశైవుడు సదాచారమును నిష్ఠ చేత పరిపాలించవలెను. ఇది భక్తుల యభీష్టమును పూర్తిచేసెడి కల్పవృక్షమై యున్నది.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 03-08-1992
స్థలం : **భికుబాయి మేనకుదళె**
**మంగళ కార్యాలయము, పూనె**

## విశేష ప్రదీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు 'ఆచార్య' స్థానమున నుండెడి దీక్షాగురు లింగ స్థలిని గురించి తెలుపుచు ఆచార పంచకమునకు సంబంధించిన వివరములను ప్రదానము చేసిరి.

సామాన్యార్థమున ఆచార్య పదమునకు గురు పదమున కభేదము కన్పట్టుచున్నది. **"యః మంత్రోపదేశ మాచరతి సః ఆచార్యః"** దీక్షా సంస్కార సందర్భమున పిండస్థలికి పంచాక్షరీ మహామంత్రమునుపదేశించెడి దీక్షా గురువును ఆచార్యునిగా గుర్తింపవచ్చును. అయితే, **"ఆచారం గ్రాహయతీతి ఆచార్యః"** అనెడి మరొక నిర్వచనము గలదు. ఆచారమును గ్రహింపజేయువాడు ఆచార్యుడనబడుచున్నాడు. ఆగమ ప్రోక్తమైన ఆచారములను గ్రహింపజేయువాడాచార్యుడనెడి దామోదయోగ్యమైన నిర్వచనమని ఆగమవిదులనుచున్నారు. "ఉపనీయతుయః పూర్వం వేదమధ్యాపయేద్విజః సాంగం చ సరహస్యంచ త మాచార్యం విదుద్బుదాః" యనెడిది మనుస్మృతిలోని ప్రమాణము. వేదములలోని రహస్యార్థములను తెలిపెడి వాడాచార్యుడని చెప్పబడినది.

ఒక వ్యక్తి తాను చేసెడి యుపదేశమున కనుగుణమైన ప్రవర్తనను తానే ఆచరించిన యెడల నతడు విశేషమైనట్టి గౌరవ ప్రపత్తులను పొందగలడు. లేనిచో **"ఆచార హీనోభవతి నిందితః"** అనెడి రేణుకోక్తి (సి.శి. 16:3) చిరస్మరణీయమైనదైయున్నది. **"ఆచారవంచకర ఎనగె తోరదిరు"** అనెడి శ్రీ బసవన్న వారి వాక్కులు (వచనము, 762, శ్రీ డా॥ తిప్పే రుద్రస్వామి సంపాదన) గమనార్హములు ఆచార వంచకులను నాకు చూపకుండుడయ్యా" అనెడిది యీ వాక్కుల తాత్పర్యము.

ఆచారములకు సంబంధించిన వివరణ ఆగమములలో నివ్వబడినది. స్మృత్యాదులలోను ఆచారమునకు ననుబంధముగా నుండెడి యంశములు కలవు. అయితే, వీరశైవుల కనువర్తించెడి ఆచారము లెట్టివి యనెడి ప్రశ్న ఉదయించును. నిత్య కర్మల నుదాహరణగా తీసికొనిన యెడల గాయత్ర్యుపాసనను తప్పనిసరిగా చేయవలెననెడి ఆచారము గురించిన సందేహము గల్గును. ఇది ప్రాకృతులకు మాత్రమే వర్తించెడి ఆచారము. అగ్నిముఖార్చనయూ ఇట్టిదే! ఇట్టి సందేహములను నివారించుటకై బోధకుడు శాస్త్రాదుల నధ్యయనము చేయవలెను. ఈ సందర్భమున "ఆచినోతి శాస్త్రార్థాః" అనే ఆచార్యోక్తి (సి.శి. 15-9) గమనించదగినదైయున్నది.

ప్రవృత్తి పథమున పయనించెడి జీవుడిని, నివృత్తి పథము వైపుకు మళ్ళించి యతనిని భక్తునిగా చేసెడి పాత్రను లింగస్థలమగు దీక్షాగురు స్థలములో శివయోగి నిర్వహించుననని గుర్తించవలెను. శివుడే శివయోగి రూపములో వచ్చి అతడే ఆచార్యుడై శివాచారాది పంచాచారముల గురించి దీక్షితునికి బోధించును. తన బోధనలవలన ఆచారహీనుడైన వానిని ఆచార సంపత్తి గలవానిగా చేయును. తానాచరించి చూపి సోదాహరణ పూర్వకముగా బోధన చేసెడి వాడని శ్రీ భగవత్ పాదులవారు స్పష్టము చేసిరి. తాను ఆచారవంతుడై యుండక యితరులను ఆచారవంతులుగా నుండుడని బోధన చేసెడి వానికి నైతిక బలము లుప్తమై యుండుననెడిది సర్వజనులకు విదితమైన విషయమే. జగదాచార్యుడై శ్రీభగవత్పాదుల వారు ఆచార్యస్థానములో నుండెడి వారికి మార్గదర్శకత్వము కల్పించుటకై యీ బోధన చేసెననెడిది గుర్తించదగిన విషయము.

లోకమున నెవ్వరికి తోచినది వారు తమ యిచ్ఛానుసారముగా ఆచరించుచు తాము ఆచారవంతులమని భావించికొని తృప్తిపడటమును గాంచగలము. ఇట్టి ధోరణులను నిరసించుచు శ్రీ బసవన్నవారు ఈ క్రింది సందేశము నిచ్చిరి.

**నోడి మాడువనేమ సల్లవు। సల్లవు।**
**తనువు ద్దేశ, మనవు ద్దేశ వాగి**
**మాడువ నేమ సల్లవు। సల్లవు।**
**గురుపథవ మీరి మాడువనేమ సల్లవు। సల్లవు।**
**కూడల సంగమ దేవా ఇవు నిమ్మని జదొళగె నిల్లవు। నిల్లవు।** (వ.సం.71)

**దీని తెలుగు రూపము :**

చూచి చేసెడి నేమములు చెల్లవు చెల్లవు
తనువుద్దేశము మనముద్దేశముగా
చేసెడి నేమములు చెల్లవు చెల్లవు
గురుపథమును మీరి
చేసెడి నేమములు చెల్లవు చెల్లవు
కూడల సంగమ దేవా!
ఇవి మీ నిజమున నిలువవు నిలువవు

ఆచార్యునిగా దీక్షా గురు స్థలమున నుండెడి హరూపము తెలుపని దేదియును ఆచారము కాజాలదని గ్రహించగలరు.

శ్రీరేణుక భగవత్పాదుల యుపదేశము యొక్క నేపథ్యమున తెలిసికొనవలసినదేమనగా భక్తాంగుడు కాదలచిన పిండస్థలి శివాచార్యులవారినాశ్రయించి భక్తాంగస్థలిగా తానాచరించవలసినట్టి ఆచారముల గురించి తెలిసికొనవలెను.

*- శివం భూయాత్ -*

## ఆశీర్వచనము - 4 :

## దీక్షాగురుస్థలము :

ఇంతకు క్రితమున లింగాచార సదాచారముల గురించి తెలుసుకొంటిమి. ఇప్పుడు శివాచారము గురించి తెలిసికొనెదము.

**3. శివాచారము :** సృష్టి- స్థితి-సంహార,నిగ్రహానుగ్రహములను నిర్వహించెడి శివుడే పరబ్రహ్మ స్వరూపుడు. అతడుగాకుండ వేరే మరెవ్వరును లేరని యతనికి శరణాగతుడుగా నుండుటయే శివాచారము. ఇట్టి భావనచేత శివభక్తి దృఢతరమై సర్వత్రా శివుని గాంచెడి శివదృష్టి సంప్రాప్తమగును. ఇంతటి సర్వశివమయ భావముదయించుటచేత శివాచారి యెవ్వరిని ద్వేషింపజాలడు. ఎవరి గురించియు హీనబుద్ధిని దాల్చజాలడు. భావశుద్ధి లేనివారికి శివాచారమబ్బదు. పదార్థశుద్ధియే భావశుద్ధిని సాధించెడి విధియని తెలుపుటకు చంద్రజ్ఞానాగమము పదహారు ప్రకారములగు పదార్థ శుద్ధులను విధించినది.

ఈ క్రింది శ్లోకమును గనుడి :

> **శ్లో॥ ద్రవ్యక్షేత్రగృహాదీనాం షోడశానాం విశోధనమ్।**
> **శివశాస్త్రోక్తమార్గేణ శివాచార యితిస్మృతః॥** (చ.జ్ఞా.క్రి. 9-32)

వీటిని గూర్చి క్రమముగా తెలిసికొనెదము గాక.

**1. ద్రవ్యశుద్ధి :** శివభక్తుడైన వానినుండియే ఫలమూలాదులను గ్రహించవలెను. ఒకవేళ శివభక్తుని నుండి యివి ప్రాప్తము గాని యెడల మంత్రోచ్ఛారణ పూర్వకముగా వాటి మీద భస్మప్రోక్షణను చేసి వాటిని స్వీకరించునదే ద్రవ్యశుద్ధి యనబడుచున్నది.

**2. క్షేత్రశుద్ధి :** తన పొలము లేదా యింటి యొక్క నాల్గు మూలల యందున నంది మరియు శివలింగములు గల లింగముద్రాంకిత శిలలను స్థాపించి క్షేత్రాదులను శుద్ధి చేయవలెను. నేడీ పద్ధతి విస్తృతమైన ప్రచారమున లేదు. కేవలము మఠ మందిరములలోన యీ పద్ధతులను గాంచగలము. ఈ ఇళ్ళు మరియు క్షేత్రములును శివభక్తులవియని తెలియబరచెడి సామర్థ్యము గల యిట్టి పద్ధతి నేడు లుప్తమైయున్నది. శీఘ్రమే యీ పద్ధతిని పునరుద్ధరించవలసినయావశ్యకత యెంతైనా కలదు.

**3. గృహశుద్ధి :** గృహమును నూతనముగా నిర్మించెడి సందర్భమున శివభక్తులగు పనివాళ్ళచేతనే యింటిని నిర్మించవలెను. ఇటుల సాధ్యము కాని యెడల ముఖద్వారము కడ మహాద్వారము మీద నంది-లింగ- ముద్రాంకితమగు చిత్రములను చెక్కించవలెను.

**4. భాండశుద్ధి :** శివభక్తుని చేత నిర్మింపబడిన శివలింగాంకితములైన భాండములలోనే వంటను చేయవలెను.

**5. తృణశుద్ధి :** తన యింటిలోని ఆవు, ఎద్దు యిత్యాది పశువులకు వేసెడి గడ్డిని శివభక్తుల ద్వారానే తెప్పించుకొనవలెను. ఇటుల సాధ్యము కాని యెడల గడ్డిమీద భస్మమును చిలుకరించి పునీతము చేయవలెను.

**6. కాష్ఠశుద్ధి :** శివాచార సంపన్నుడైన సాధకుడు, తన వంటకై కావలసిన కట్టెలను శివభక్తుల ద్వారానే తెప్పించికొనవలెను. అటుల సాధ్యము కాని యెడల, వేరువారు తెచ్చిన కాష్ఠములపై భస్మమును చల్లి శుద్ధిని చేయవలెను.

**7. వీటికాశుద్ధి :** శివభక్తుడైన వానినుండియే తాంబూలమును తీసికొనవలెను. ఇతరులిచ్చిన యెడల దానిని భస్మపూతము చేయవలెను.

**8. పాకశుద్ధి :** శివదీక్షా సంస్కారమును పొందిన శివభక్తుల ద్వారానే పాకములను చేయించికొనవలెను. అన్నము మీద వేరేవారి దృష్టి పడకుండగ జాగరూకత వహించునదే పాకశుద్ధి.

**9. రసశుద్ధి :** పాలు, పెరుగు, నెయ్యి, వెన్న, మజ్జిగలను రస పదార్థములని యందురు. శివదీక్షను పొందినవాడు ఆవుపాలతో గల్గిన రస పదార్థములనే వాడవలెను. బఱ్ఱె యిత్యాదులనుండి గల్గెడి రస పదార్థములను వాడకూడదు.

రసశుద్ధి వలన రక్తశుద్ధి గల్గును. ఆ పిదప మాంస మజ్జాదులు శుద్ధియగును. అందుచేత రసశుద్ధి గురించి తగు జాగ్రత్త వహించవలెను. శుక్ర శోణితములు శుద్ధమైన యెడల సంతానము కూడ శుద్ధియగును. ఇటీవలి కాలములోని పరిణామముల దృష్ట్యా సంతతి శుద్ధికై రసశుద్ధిని సాధించుట యెంతో అవసరమైయున్నది. వైజ్ఞానిక దృష్టియందునను రసశుద్ధికి తనదగు ప్రాముఖ్యత గలదు. ఈ విషయమున యాధునికులు తమరి యాలోచనలు మార్చికొనవలెను. ప్రాచీన వీరశైవాచార్యులు సూచించిన మార్గమున పయనించవలెను.

**10. భవశుద్ధి :** కామ్య కర్మలను పరిత్యజించి నిష్కామ కర్మలనాచరించునదే యలవరచుకొని, తన యంతః కరణమును పరిశుద్ధము చేసికొని, ఆ శుద్ధాంతఃకరణ ద్వార తత్త్వ జ్ఞానమును ప్రాప్తము చేసికొని పునర్జన్మ రాహిత్య రూపమైన స్థితిని సంపాదించునదే భవశుద్ధియగును. భవమనగా జనన-మరణములని యర్థము. మనుజుడు కామ్యకర్మల యాచరణల యెడల నాసక్తుడైన యెడల నా కర్మ ఫలముననుభవించుటకై యీ సంసారమున యెన్నియో పర్యాయములు జన్మించవలసియుండును. నిష్కామ కర్మవలన అంతఃకరణమును పరిశుద్ధముజేసికొనిన తరుణమున ఆత్మానాత్మ వివేకముదయించి శివభక్తునికి శివజ్ఞానము సంప్రాప్తమగును. ఈ విధముగా శివజ్ఞాన సంపన్నుడైన వానికి పునర్జన్మయుండదు.

**11. భూతశుద్ధి :** భూతములనగా ప్రాణులని యర్థము. శివాచార సంపన్నుడు సర్వభూత దయామయుడగును. ఈ ఆచారము ప్రకారమునే ప్రాణినైనను హింసించకూడదు. ఏ ప్రాణినైనను దూషణకు గురి చేయవలదు. ఈ విధిన ప్రవర్తించిన యెడల భూతశుద్ధి యగును. భూతదయాళుత్వమే భూతశుద్ధి యగుచున్నది.

**12. భావశుద్ధి :** మనస్సులోని కామనలను తొలగించికొని సదా శివభావన యందున కూడికొని యుండునదే భావశుద్ధి యనబడును. అన్ని శుద్ధులును నుండి భావశుద్ధి యుండని యెడల నెట్టి ప్రయోజనము నుండనేరదని గుర్తించి శివాచారి సదాభావశుద్ధిని గల్గి యుండవలెను.

**13. మార్గశుద్ధి :** తాను మార్గమునందు నడచునప్పుడు లేదా వాహనమునెక్కి పయనించునప్పుడు చీమ యిత్యాది సూక్ష్మజీవులకు హాని జరుగకుండగ నెంతయో జాగ్రత్త వహించవలెను.

హింసాభావన వలన అంతఃకరణము మలినమగును. హీనమైన ఆలోచనలు వచ్చును.

ఇట్టి ఆలోచనల వలన పతన దశకు పయనము ప్రారంభమగును. అహింసా ధర్మమును తప్పనిసరిగా పాటించవలెననెడి పూర్వాచార్యులవారి వాక్కులు నవిస్మరణీయములని గ్రహించవలెను.

**14. కాలశుద్ధి :** ఇచ్చట కాలమనగా సమయము ప్రాతఃకాలమునను, సాయంకాలమునను నిశ్శబ్దమూ మరియు మనోరమణీయమైన వాతావరణములో కూర్చొని శివార్చనను యిష్టలింగపూజ రూపమున చేయునదే కాలశుద్ధి యనబడుచున్నది. అందుచేత ప్రతియొక్క వీరశైవుడు ప్రాతఃకాలము మరియు సంధ్యా కాలముల యొక్క ప్రశాంత సమయమున లింగపూజను తప్పనిసరిగా ఆచరించవలెను.

**15. వాక్శుద్ధి :** వాక్ అనగా వాణి. వాణి శుద్ధముగా నుండవలెను అనెడిదే వాక్శుద్ధి. అసత్యము, కఠోర శబ్దములు, అశ్లీలము మరియు డాంబికముల వలన వాణి కలుషితమగును. తద్వారా సమాజమున ఈర్ష్య, ద్వేషము మరియు కలహములు సంభవించును. సదా అశాంతి నెలకొనియుండును. "మాతుబలవ మాణికతంద, మాతనరియదవ జగళ తంద అనెడి కన్నడ నుడి ఖ్యాతిలో గలదు. మాట నేర్చినవాడు మాణిక్యము తెచ్చెను. మాట నరయనివాడు జగడము తెచ్చెననెడిది యీ సామెతలోని భావము. వాక్శుద్ధి లేని యెడల జిహ్వా అపవిత్రమగును. పవిత్రత సాధించుటకై శివనామమును, మరియు గురునామమును వల్లించుట ద్వారా జిహ్వాకు పవిత్రతను సాధించగలము. శ్రీ రుద్రమును పఠించియు జిహ్వాకు పవిత్రతను తెచ్చికొనవచ్చును. సాధ్యాసాధ్యములను దృష్టియందుంచుకొని యేదోనొక మార్గమును అనుసరించవలెను.

**16. జనశుద్ధి :** కూర్చొనునప్పుడు, పరుండినప్పుడు, ప్రయాణము చేయునప్పుడును, సభా సమ్మేళనము నందునను, శివభక్తి సంపన్నుల వెంబడి వ్యవహరించునదే జనశుద్ధియనబడును.

తన ఆచార విచారములకు ప్రతికూలముగ నున్నవారి సహవాసము వలన వారి కుసంస్కారముల ఫలితముగా మనము చేసెడి శివభక్తికి ప్రతికూలమైన వాతావరణమేర్పడును. అందుచేత శివాచారి సహవాసములను చేయునప్పుడు నెంతో జాగరూకతతో నుండవలెను. "సంసర్గజా దోషగుణా భవంతి" అనెడి సుభాషితము ప్రకారము మంచివారితో సహవాసము చేయుట మంచి, చెడువారితో చేయుటచేత చెడు గల్గును.

అందుచేత వీరశైవాచారములను మన్నించని వారి సహవాసము చేయకుండుటయే శ్రేయస్కరమని గ్రహించవలెను. ఇదియే శివాచారములోని రహస్యమని గుర్తించవలెను.

ఈ విధముగా పూర్వోక్తమైన పదహారు విధములగు శుద్ధులను పరిపాలించుటయే శివాచారమని గ్రహించగలరు.

**4. గణాచారము :** పంచాచారములలో నాల్గవది గణాచారము. శివభక్త గణముల చేత నాచరింపబడెడి యాచారమే గణాచారము. శివుని గురించియును, గురువును గురించియును, ధర్మమును గురించియును నెవ్వరైననూ తిరస్కరించి మాట్లాడిన యెడల లేదా నిందించిన యెడల దానిని విని సహించకుండగ యుండి, యా స్థానమును వీడి దూరముగా వెడలి పోవలెను. ఒకవేళ ప్రతిక్రియను చేసెడి సామర్థ్యముండిన యెడల దండోపాయము చేత వానిని ప్రతిఘటించి నిందకునికి సరియైన శిక్షను విధించి దానిని యమలు చేయుటయే గణాచారము. నిందయనెడిది యతి నికృష్టమైన దుర్గుణము నింద చేసెడి వానికి యెట్టి ఫలితము లభించునో యట్టి ఫలితమే నిందను వినెడి వానికిని లభించును. ఈ విధముగా శివనిందను వినెడి వానికిని దోషము ప్రాప్తించుచున్నది. అందుచేత శివభక్తుడు శివనిందను వినకూడదు. ఈ విషయము గురించి చంద్రజ్ఞానాగమము నీ క్రింది విధముగా తెలుపుచున్నది.

**శ్లో॥ శివస్య శివభక్తస్య శివధర్మాధికస్య చ।**
**న శృణోతి చ యో నిందాం స గణాచార ఉచ్యతే॥** (చం.జ్ఞా.క్రి. 9-8)

భక్తి మార్గ క్రియా స్థలమునందునను నీ విషయమున కొంతమేరకు తెలుపబడినది.

ఒకసారి దక్ష ప్రజాపతి శివుని యవమానమునకు గురి చేయుటకై యొక గొప్ప యాగమును నేర్పాటు చేసెను. శివుని జటనుండి యుద్భవించిన వీరభద్రుడు యజ్ఞమును ధ్వంసమును చేసి దక్షుని శిరమును ఛేదించి గొఱ్ఱె తలను తగిలించి దక్షునికి వాని యపరాధమునకు తగిన శిక్షను వేసెను. శ్రీ వీరభద్రస్వామి యాచరణ యొక మహోత్కృష్టమైన గణాచారపు టుదాహరణయై యున్నది.

నిందకుని సంహరించుట యనెడిది విశాల దృక్పథములో నర్థముచేసి కొనవలెను. వాని ప్రాణము తీయుట కంటెను ముఖ్యమైన దొకటి కలదు. అది వాని దుష్టబుద్ధికి సంబంధించిన విషయము. నిందకుని దుష్టత్వమును రూపుమాపి, వానిని సన్మార్గమునకు తీసికొని రావలెను. ఆ విధముగా చేసిన యెడల యతడొక మహావ్యక్తిగా పరివర్తన పొందెడి యవకాశము గలదు. ఇట్టి యుదాహరణలెన్నియో గలవు. శ్రీ వీరభద్రస్వామి దక్షుని సంహరించి గొఱ్ఱెతలను నతికించెను. దీనిని బుద్ధి యొక్క పరివర్తనగా తీసికొనవచ్చును.

ఒకానొక శివభక్తుడు నౌక నౌకలో ప్రయాణము చేయుచుండెను. అదే నౌక యందున కొందరు దుష్టులు కూర్చొని యుండిరి. వారు స్వీయ వినోదార్థమై శివభక్తుని గనికుచేష్టలు చేయుచు, వెక్కిరించుచు, నతనిని అవహేళనకు గురి చేయుచుండిరి. ఆ శివభక్తుడీ యవమానమును మౌనముగా భరించుచుండెను. మనోవేదన ననుభవించుచుండెను. తన్నివారణార్థమై శివధ్యానములో మునిగిపోయెను. శివుడిది గని సహించలేక పోయెను. అతడు నాకాశవాణి ద్వారా యిటుల పలికెను. "ఈ దుష్టులు నీకు చేసెడి కీడును నేను సహింపజాలను. అందుచేత, నీ నౌకను తలక్రిందులుగా చేసి వీరిని సంహరించెదను. నీ యపేక్షమెయ్యదో తెలియజెప్పగలరు. ఓ శివభక్తాగ్రేసరా! నీకిది యామోద యోగ్యమైన యెడ తెలుపుము" అప్పుడా శివభక్తుడు "ఓ దేవదేవా! వీరు తప్పిదము చేసినది నిజమే. గణాచార నియమావళి ననుసరించి వీరిని సంహరించవలసినదే. అదియే కర్తవ్యము" అని అనెను. దుష్టులు భయభ్రాంతులై గడ గడ వణుకుచు "పాహి శ్రీ గురు దేవ మాం పాహి పాహి" యనుచు నొక్కొక్కరు వచ్చి భక్తుని పాదపద్మముల గడ భ్రమరములై యుండిరి. ఇది గనిన శివభక్తుడు, "శివా! మహాదేవా! సంహరణ యనగా నేమో తెలిపెదను.

వినుము. వీరి ప్రాణములు తీయకుండగ వీరి దుర్మార్గమును నాశనముచేసి, వీరిలో మానసిక పరివర్తన తీసికొని రావలెననెడిదే నా భావన" శివుడును సంతసించి "తథాస్తు" అని యనెను. దుష్టులు శిష్టులైరి. వారు శివభక్తునికి శిష్యులై ధన్యులైరి. ఈ యుదాహరణ వలన గ్రహించవలసిన దేమనగా గణాచారమును నహింసామార్గమున చేపట్టవలెను.

ఈ గణాచారము నందున కాయిక, వాచిక మరియు మానసికశుద్ధి కొరకై యరువది నాలుగు ప్రకారములగు శీలాచరణలు ప్రతిపాదింపబడినవి. ఈ విషయమున చంద్రజ్ఞానాగమమున యీ క్రింది విధముగా తెలుపబడినది.

**శ్లో॥ సర్వోత్తమే గణాచారే సద్యః సిద్ధి కరే పరే।**
**శీలాని తు చతుఃషష్ఠిర్వర్తంతే తాని సంశ్రుణు॥** (చంద్ర.జ్ఞా.ఆ.క్రి. 9-52)

ఈ యరువది నాలుగు శీలములెట్టివో తెలిసికొనెదము గావుత.

## సప్త విధములగు వాచిక శీలములు :

(1) సత్యమును పలుకుట (2) ఆ సత్య నుడువులును ప్రియము మరియు హితకరముగనై యుండవలెను. (3) ప్రతిదినము వేదా గమాది శాస్త్రములను పఠించుట (4) శివుని మరియు శివభక్తుల గుణగణములను గానము చేయుట. (5) ఇతర దేవీ దేవతలను గాని వ్యక్తులను గాని స్తుతించకుండగ నుండుట (6) ఎక్కడైననూ ఎప్పుడైననూ ఆత్మస్తుతి చేయకుండగ నుండుట (7) ఎప్పుడైననూ ఎక్కడైననూ యితర దేవీ దేవతలనుగాని, వ్యక్తులను గాని నిందించకుండగ నుండుట.

ఇవియే వాచిక శీలములనబడుచున్నవి. ఈ శీలముల నాచరించుటచే భక్తుని వాణి పవిత్రతను సంతరించికొనును. సత్త్వగుణ సంపద హెచ్చును. వాక్పరుషము సిద్ధించును. శ్రీ బసవన్న వారు చెప్పిన యటుల నబద్ధపు మాటలు వలదు, తనను తా వర్ణించవలదు. ఎదుటి వారిని దుయ్యబట్టవలదు అనెడివి శీలములు. వీటిని నాచరించుటయే వాక్శీలమగును.

## హస్త గతపంచవిధ శీలములు :

(8) గురు లింగ జంగములకు నమస్కరించుట, (9) తన పూజా సామాగ్రులను తన చేతుల మీదుగనే సంగ్రహించుట, (10) హస్తమునందు రుద్రాక్ష మాలికను పట్టుకొని సదా పంచాక్షరి మహామంత్రమును జపించుట, (11) తన హస్తములచే ప్రతిదినము గురులింగ జంగముల నారాధించుట (12) జంగమాదులకు మరియు ధర్మము కొరకు చేతనైనంతవరకు దానములు చేయుట. యివియే హస్తగత పంచవిధ శీలములు. మనుష్యుని వుత్కృష్ట లేదా నికృష్ట భవిష్యత్తుకు వాని చేతులే కారణము. చేతుల చేత శాస్త్ర విహితమైన కర్మలను చేసినచో మనుజుని యొక్క భవిష్యత్తు ఉజ్వలమగును. దీనికి విరుద్ధముగ నిషిద్ధ కర్మలను చేసినచో పాపియై పతనమగుచున్నాడు. శివునిచేత అనుగ్రహింపబడిన హస్తములతో సదా వుత్తమ కార్యములనే చేయవలెను. మన భాగ్యమును వ్రాశెడి భగవంతుడే మన హస్తములు. వేదములయందు, ఆయం మె హస్తో భగవాన్ అని ఉపదేశింపబడినది. హస్తమనెడిది పంచవిధ కర్మేంద్రియములలో ప్రముఖమైనదై యున్నది. కాన ఎల్లప్పుడు ఉత్తమమైన పనులనే చేయవలెననెడి ఉద్దేశ్యముతో వీరశైవ ఆచార్యులు ప్రముఖమైన ఈ గణాచారమునందు గల అరువది నాలుగు శీలముల యందు, అయిదుశీలములను హస్తములకై కేటాయించిరి.

## పాదగత చతుర్ విధ శీలములు :

(13) గురువున్న దగ్గరికి పోవుట, (14) గురువుకు ప్రదక్షిణ చేయుట, (15) పూజకు వలయు పత్ర పుష్పాదులను తెచ్చుటకై తరలి వెళ్ళుట, (16) యిష్ట పూజకొరకు లేదా గురుపాద పూజ కొరకు స్థిరాసనము వేసికొని కూర్చొనుట. యివి నాలుగు శీలములు పాదములకు సంబంధించనవై యుండుటచేత వీటిని పాదగత శీలములని పిలుతురు. ఈ పాదగత శీలములు మనుష్యుని నిషిద్ధ గమనమును నిరోధించును. దీనిని బసవణ్ణవారు అటు ఇటు పోవనటుల పంగువును చేయుమయ్యా తండ్రీ అని శివుని ప్రార్థించి ఈ పాదగత శీలములను పరిపాలించిరని తెలియవచ్చుచున్నది.

మన భారతీయ సాంస్కృతియందున గురువులగు పెద్దల పాదములకు నమస్కరించెడి సంప్రదాయము కలదు. ఎవరి పాదములు శాస్త్ర విహితమైన మార్గమునందున పయనించునో ఆ పాదములే పూజనీయ పాదములనబడును. ఆచారమునకు ప్రతీక పాదమైనందున ప్రతియొక్కరు శీలవంతులై యుండవలెను, అట్టివారి పాదములు పూజనీయములగును. ఒక వన ప్రదేశమునందు ఒక గృహస్థ గురువులవారు భార్యా సమేతుడై నివసించుచుండెను. ఒకనాడు వారిరువురు సహజముగా కూర్చున్నప్పుడు గురువుగారు తన భార్య నుద్దేశించి తన పాదములను చూపించుచు ఇదిగో చూడు! నా పాదములు ఎంత సుందరముగా నున్నవో అని పలికెను. అప్పుడు అతని సతి తక్షణముననే నీ పాదములకంటె నా పాదములే సుందరముగా నున్నవని చెప్పెను. ఈ విధముగ వారిరువురి మధ్య క్రమేణ వాద ప్రతివాదములు పెరిగి వివాదమునకు దారితీసెను. అదే సమయమున కందమూల ఫలాదులను తెచ్చుటకై వెళ్ళిన శిష్యుడు ఆశ్రమమునకు వచ్చెను. గురువుగారు వాని నుద్దేశించి, ఓయీ! ఈ ఇరువురి పాదములలో ఎవరి పాదములు సుందరముగా నున్నవని అడుగగా శిష్యుడు సంకటమునందు చిక్కుకొనెను. అతనికి ఇరువురు సమానముగా పూజనీయులైనందున ఒక నిర్ణయమునకు రాలేక ఆలోచించుచు విస్మయము చెంది నిలుచుండెను. అప్పుడు గురువుగారు ఏమి ఆలోచించుచున్నావు త్వరగా సమాధానము యివ్వుమని ఆదేశించగా శిష్యుడు మాత పాదములే సుందరముగా వున్నవని చెప్పెను. గురుపత్ని సంతోషమునకు హద్దు లేకుండెను. గురువుగారు ఖిన్నుడై యుండగా శిష్యుడు గురువునుద్దేశించి, హే గురువే! తమరి పవిత్రమైన పాదముల ప్రక్కన వుండెడి సౌభాగ్యము పొందినందువలననే శ్రీమాత పాదములకు అందము వచ్చెననెను. గురువు గారు కూడా సంతోషించి అభిమానమును పొందెను. అంతలోనే శిష్యుడు ఓ గురుదేవా శివాగమములలో చెప్పబడిన విధముగ ధర్మము నాచరించుచు, ప్రచారము చేయుచు తిరుగాడుచున్నందుననే తమరి పాదములకు ఈ మహత్తు కలిగెను అని అనెను.

శిష్యుని మాటలు శాస్త్ర సమ్మతములై యున్నవి. ఎవరి పాదములు శాస్త్ర విహిత మార్గమునందున పయనించునో వారి పాదములుగౌరవనీయములై యుండును. ఈ కారణముననే గణాచారమునందున పాదములచేత ఆచరింపదగిన నాలుగు రకములగు శీలముల గురించి చెప్పబడినది.

## త్వక్ సంబంధిత ద్వివిధ శీలములు :

పంచవిధములైన జ్ఞానేంద్రియములయందు త్వగింద్రయము ఒకటై యున్నది. త్వక్ అనగా చర్మమని అర్థము. ఒక్కొక్క ఇంద్రియము ఒక్కొక్క నిర్దిష్టమైన స్థానమునందున యుండినచో త్వగింద్రియము సంపూర్ణముగ శరీరమంతను వ్యాపించియున్నది. అందుకే యిది ప్రబలమైన జ్ఞానేంద్రియము. మృదువు తనము కాఠిణ్యము శీతలము మరియు ఉష్ణము మొదలైన స్పర్శ గుణములను ఎరుగుటకు ఈత్వగింద్రియము సహాయకారిగ నుండును. శాస్త్ర నిషిద్ధమైన స్పర్శ సుఖమును అనుభవించి అధోమార్గమువైపు పయనించెడి జనులే సంసారమునందున అధిక సంఖ్యలో నున్నారు, ప్రకృతి చేత ప్రసాదింపబడిన ఈ యింద్రియములను సదుపయోగము చేసుకొనినప్పుడు మనుజుడు వున్నత స్థాయిని పొందగలడు. అందుచేత గణాచారము నందున మనుజుని వున్నతికి కారణములైన త్వక్‌కు సంబంధించిన రెండు శీలములను ప్రతిపాదించనైనది. అవి ఏమనగా (17) తన దేహము మీద యిష్టలింగమును ధరించి అద్దానివలన కలుగు ఎడతెగని స్పర్శసుఖముననుభవించుట. (18) తన యిష్టలింగము యొక్క స్పర్శ చేత రోమాంచితమైన సుఖమును అనుభవించుట. దేహము మీద ఇష్టలింగమును ధరించిన వారెందరో గలరు. అయితే దాని అస్తిత్వము యొక్క యెరుకను పొందినవారు కొందరే నేను యిష్టలింగ ధారియై యున్నాను అనెడి అర యికను సదా కాలము మనమునందున పెట్టుకొని ఈ యిష్టలింగమును ధరించెడి సౌభాగ్యము కలిగినందులకు నేనెంతో పుణ్యము చేసుకొంటినని భావించి ఆనందించిన యెడల రోమాంచితమైన స్థితి సంప్రాప్తమగును. శ్రీ నిజ గుణ శివయోగి ప్రకారము మన కర స్థలమున పరమేశ్వరుడు ఒదిగివున్నాడని భావించుకొని ఆనందించవలెను. క్షణికమైన స్పర్శ సుఖముననుభవించి పులకితాంగులు అయ్యెడి వారికి పరాత్పరుని యొక్క స్పర్శ వలన ఆనందము కలుగునో కలుగదో చెప్పజాలము. యిట్టి సుఖమును పొందుట యే త్వక్ సంబంధమైన శీలమని తెలిసికొనగలరు.

## చక్షు సంబంధమైన ద్వివిధ శీలములు :

పంచవిధ జ్ఞానేంద్రియముల యందున చక్షురింద్రియము నొకటై యున్నది. ఇది రూప విషయమును గ్రహించెడి యింద్రియము. భోగాసక్తి గల్గిన సాంసారిక జీవులు క్షణికమైన రూపమునకు నమ్ముడు పోయి భోగజీవులై యెన్నో జన్మలను పాడు చేసికొనుచున్నారు. తన జీవితమును నుద్ధరించి కొనుటకొరకు ప్రతియొక్కరును యోగమును నవలంబించవలెను. అనేక విధమైన యోగము లందున శివయోగము సర్వోత్కృష్టమైనది. ఈ శివయోగము నందున (19) ఆనంద పూర్వకమైన రీతిన యవిశ్రాంతముగా నిష్టలింగమును నిరీక్షించుట (20) ఇష్టలింగము నెడతెగకుండగ

నవలోకించునప్పుడు నానంద భాష్పములుద్భవించుట ఈ రెండును చక్షు సంబంధమైన శీలములని తెలిసికొనవలెను.ఇష్టలింగము నవలోకించుట చేతను, నవలోకన ద్వారా నేత్రజల ముద్భవించుట చేత కళ్ళు పరిశుద్ధములగును. వీటిని చక్షు సంబంధమైన శీలములని యందురు.

## జిహ్వా సంబంధమైన శీలములు :

రసమును గ్రహించెడి యింద్రియమే నాలుక. ఇదొక జ్ఞానేంద్రియము. గణాచారియైన వాడు జిహ్వా చాపల్యము లేనివాడై ప్రసాద భోగియై యుండవలెను. (21) ప్రతినిత్యము ప్రసాదాస్వాదన చేయుటవలన మనస్సు సదా ప్రసన్నమై యుండును. ప్రసన్నమైన చిత్తము పరమాత్మని చింతన కనుకూలముగా నుండును. ఈ శీలమువలన మానసిక శుద్ధి మరియు చైత్తిక ప్రసన్నత లభ్యమగుట చేత గణాచారమును పాటించెడివాడు దీనిని తన నిత్యానుష్ఠానము నందున నుంచికొనవలెను.

## ఘ్రాణ సంబంధమైన శీలములు :

గంధగ్రాహకమైన యింద్రియమే ఘ్రాణము. ఇదియును జ్ఞానేంద్రియమే. (22) శివ నిర్మాల్యములైన గంధ పుష్పాదులను వాసన చూసి గంధ ప్రసాదమును స్వీకరించునదే ఘ్రాణ సంబంధమైన శీలము. శివభక్తుడైన వాడు సుగంధ పదార్థముల నాఘ్రాణించుటకు ముందున వాటిని మొదటగా తన యిష్టలింగమునకు సమర్పించినప్పుడు నది ప్రసాదముగా పరిణమించును. కేవల గంధమును పీల్చుట వీరశైవుల యాచారము కాదు. ఆ గంధమును నిష్టలింగమునకు సమర్పించి యద్దానిని గంధ ప్రసాదముగా చేసికొని యాస్వాదించునదే గణాచారపు టాచారమై యున్నది.

## శ్రోత్ర సంబంధమైన శీలములు :

శబ్దమును గ్రహించెడి జ్ఞానేంద్రియమే చెవి. చెవులున్నవి కదా యని దేనినంటే దానిని వినకూడదు (23) గురువు యొక్కయు, శివుని, శివభక్తుల స్తోత్రాదులను నాలించుట. (24) అటులనే గురువులవారి, శివుని మరియు శివభక్తుల నిందను వినకుండుట. ఈ రెండునూ శ్రోత్ర సంబంధమైన శీలములని పిలువబడుచున్నవి. స్తుతిచేసిన వారికి యే ఫలితము లభించునో యట్టి ఫలమే వినిన వారికి లభించుచున్నది. అందుచేత నిందను చేసిన వారికి యంటుకొనెడి దోషము నిందను వినిన వానికిని లభించును. అందుచేత చెవులచేత సత్పురుషుల, శరణుల స్తోత్రములను వినవలెనేగాని నిందను నెప్పటికైనను వినకూడదు. మనమెట్టి శబ్దములను విందుమో నట్టివే మన విచారములగునని గుర్తించవలెను. విచారములు చెడిన యెడల మనము చేసెడి పనులలోను చెడ్డతనము పొడచూపును. మన చెవులద్వారా వినిన వాటివల్లేక్రియాశక్తి యభివ్యక్తమగును. ఈ కారణమున సమాజమునందు మంచివాడనిపించికొని యుత్తమ కార్యమును చేసెడి యభిలాషయుండిన యెడల సదా మంచి మాటలనే వినవలెననెడిదియే యీ శ్రోత్ర సంబంధమైన శీలముల తాత్పర్యము.

## పంచవిధములగు కాయ సంబంధిత శోధనా శీలములు :

అశుద్ధమైన కాయమును శుద్ధము చేసెడి యాచారములే కాయ శోధన పరమైన శీలములు. అవి యేవనగా (25) గురు లింగ జంగములకు నర్పించిన ప్రసాదమును సేవించుట (26) శాస్త్ర నిషిద్ధ విషయములవైపున యింద్రియములను పోకుండగ నిరోధించుట. (27) అస్పృశ్యమైన దాని స్పర్శ గల్గినప్పుడు జలస్నానము లేదా భస్మస్నానమును చేసి శరీరమును శుచిర్భూతము చేసికొనుట. (28) కూర్చొనునప్పుడు, పరుండునప్పుడు, సభలయందున, సమ్మేళనముల యందున మరియు యాత్రలను చేయునప్పుడు భవి సంసర్గము లేనియటుల జాగ్రత్త వహించుట, (29) శరీరము మీద విభూతి, రుద్రాక్ష మరియు నిష్టలింగమును సదా ధరించికొనుట ఈ పంచ విధములగు నాచరణల చేత శరీరము శుద్ధమగుటకును సాధ్యమగును. వీటిని కాయ సంబంధమైన శీలములని పిలుతురు.

మనుష్య శరీరము స్వాభావికముగా నశుద్ధమైయుండును. ఎందుకనగా, దీని యుత్పత్తి స్థానము, దీనికి కారణ భూతమైన దేహము, దీనిలో నుండెడి మాంస మజ్జాదులు, దీనినుండి స్రవించెడి మల మూత్రాదులును అపవిత్రమైనవై యున్నవి. దీనికయ్యెడి అంత్యస్థితియగు మరణము కూడ నమంగళమైయుండును. ఇట్టి స్థితిలో కాయము తనకు తానుగా పవిత్రమగుటెట్టుల యనెడి ప్రశ్న తలయెత్తును. ఈ స్థితిని యెదుర్కొనుటకే శ్రీకరమైన వీరశైవమున కాయశోధన సంబంధమైన శీలములు తెలుపబడినవి.

ప్రసాదసేవనచేత దేహము శుద్ధమైనను దానికి నిషిద్ధ విషయముల సంపర్కమైనప్పుడు నది పునః అశుద్ధతను పొందును. అందుచేత నీకాయ శోధన యందున నిషిద్ధ విషయములచేత నింద్రియములను నిగ్రహించవలెననియును నుపదేశింపబడినది. మన దేహమునందున నుండెడి పంచ జ్ఞానేంద్రియములు మరియు పంచకర్మేంద్రియములును బహిర్ముఖములుగా నుండుటచేత నవి స్వాభావికముగా విషయములవైపున పరుగులు తీయుచుండును. ఈ ఇంద్రియములకు నెయ్యవి గ్రాహ్యము మరియు నెయ్యవి యగ్రాహ్యము ననెడిది శాస్త్రమందున నిర్ణయింపబడినది. అభక్ష్య భక్షణ అపానపేయములకు గణాచారి దూరము కావలసియుండును. ఎన్నో మార్లు నేదో యొక లోకపు తీరువలన మనుష్యుడు దురాచారములవైపు నభిముఖుడగుచున్నాడు. ఒక్కసారి యితడు వ్యసనాధీనుడైన యెడల దాని నుండి ముక్తిని పొందుట సులభసాధ్యమైన విషయము కాదు. ఈ కారణము వలననే యనేక కుటుంబములు నష్టమగుచున్నవి. దేశము యొక్క పరిస్థితియును గంభీరమగుచున్నది. వ్యక్తి యొక్క సంస్కారము గానిది సమాజము యొక్క సంస్కరణ కానేరదు. అందుచేత, వీరశైవ యాచార్యులు వ్యక్తుల సంస్కరణ నిమిత్తమున యీ శీలములను ప్రతిపాదించినారు. పశువు పచ్చగా కనిపించినదంతయూ పచ్చికయని తెలిసికొని తినుటకు సిద్ధమగును. అది దాని నైసర్గిక స్వభావమైయున్నది. అటులనే, మనుజుడు గ్రాహ్య-అగ్రాహ్యములను వివేచన చేయకుండగా విషయములవైపు పరుగులు తీయును. ఈతని విషయలోలత్వము దృష్ట్యా నిషిద్ధ విషయముల కడకు నితని గతి వెడలకుండగ నిరోధించుటకే యిచ్చట యింద్రియ నిగ్రహమనెడి కాయ సంబంధమైన శోధనా శీలములు ప్రతిపాదింపబడినవి. ఈ కారణమున సాధకుడైనవాడు నిషిద్ధ విషయముల వైపున తమ యింద్రియములను వెళ్ళనివ్వక నిగ్రహించికొనవలెను. ఇంద్రియ నిగ్రహము అంత సులభతరమైన విషయము కాదు. అందుకే "బలవానింద్రియ గ్రామో విద్యాంస మపి కర్షతి" యని చెప్పెడి వ్యాససూక్తి సుప్రసిద్ధమైయున్నది.

ఒకసారి వ్యాస మహర్షులవారు తమ యాశ్రమమున నుండెడి శిష్యుల కందరికీ శాస్త్ర బోధను చేయుటలో నిమగ్నుడైనప్పుడు, నింద్రియముల మరియు విషయముల గురించి వివేచన చేయుచు "నింద్రియముల సంఘాతము నత్యంత ప్రబలమైనది. వివేకవంతులును నీ యింద్రియముల ప్రభావమునకు లోనై యొక్కొక్కసారి దారిని తప్పుచుందు"రని బోధించిరి. అప్పుడచ్చట కూర్చుండియుండిన శిష్యులయందున నెంతయో తెలివిగలవాడగు జైమిని "ఓ గురుదేవా! విద్వాంసమపి కర్షతి" యనుట కంటెను "విద్వాంసం నాపకర్షతి" అని యనిన యెడల సూక్తమగును అని యనెను. ఇంద్రియములు వివేకహీనులనే దారి మళ్ళించగలవు. వివేకవంతులనవి యేమీ చేయజాలవనెడిది యతని మనోగత భావమై యుండెను. అప్పుడు శ్రీ గురువుగారు నింద్రియములు ప్రబలమైనవి. ఒక్కొక్కసారి వివేకవంతులు కూడ వాటిచేత క్షోభింపబడుదురని వివరించిననూ జైమిని యొప్పుకొనకుండెను. ఈ విషయము వివాదగ్రస్తమైనదిగా మిగిలెను. కొన్ని దినములు గడచిన పిదప నొకసారి వ్యాసులవారు తాను ముందున చెప్పిన మాటను జైమినికి యనుభవము లోనికి తెచ్చి యతనికి జ్ఞానోదయమును గల్గించవలెనని దలచెను. యుక్తమైన సమయమునకై నిరీక్షించుచుండెను.

ఒకనాడు జైమిని ప్రొద్దుటే లేచి నదీ స్నానార్థమై వెడలెను. నదియొడ్డున సుందరమైన పదహారేళ్ళ పడుచును గాంచెను. నిర్జనమైన వాతావరణము నందున యొంటరిగా కూర్చుండియున్న యా కన్య జైమిని మనస్సును దోచికొనెను. నదియందున స్నానమాడుచు నా కన్య గురించి యాలోచింపజొచ్చెను. ఈమె యెవ్వరైయుండును? ఒక్కరై నదీతీరమునకు వచ్చిన కారణమేమైయుండును? ఈమె యోగక్షేమముల నైనను విచారించవలదా? ఇట్టి విచారములెన్నియో యతని మనమున నుదయించెను. అతడిటు స్నానము చేయుచుండగనే యామె యటు స్నానమును జేయజొచ్చెను. జైమిని తనస్నానమును త్వరత్వరగా ముగించికొని యా కన్యవైపు చూసెను. ఆమెయు స్నానము ముగించికొని, పచ్చి బట్టలు ధరించి, జైమిని వైపు వీపును పెట్టి నిలిచియుండెను. ఆమె సుందరమైన దేహమును గాంచిన జైమిని, ఆశ్రమము వైపున పోజాలక, ఆమె సౌందర్యము చేత నాకర్షితుడై, ఆమె కడకు వచ్చి నిలిచెను. ఆమె దేహమును చూస్తూ, ఆనందము ననుభవించుచు, ఆమెతో నిట్టులనెను. "నీవెవ్వరవు? వంటరిగా నిచ్చటికి వచ్చిన కారణమేమి?" అప్పుడామె "నేనొక యనాథను. ఎవ్వరూ గతిలేనందున యిటుల తిరుగాడుచున్నాను. ఒక మంచి సంగతికాడు దొరకిన యెడల సుఖముగా జీవించవలెననెడిదే నా యాశ" యని యనెను. ఈ మాటలను వినిన జైమిని యామె వైపుకు సంపూర్ణముగా నాకర్షితుడయ్యెను. తానామెను గాంధర్వవిధిన వివాహమాడుటకు సంసిద్ధుడనని తెలియబరచెను. అప్పుడామె "మీరేమో మహర్షులు. మోహ వ్యామోహములకు దూరముగా నుండెడివారు. మీరు నన్ను నిజముగా ప్రేమించుచున్నారనెడి దానికేమి ప్రమాణము? మీరు యదార్థముగా ప్రేమించిన యెడల నన్ను మీరు తమ భుజముల మీద కూర్చుండబెట్టుకొని నూరు అడుగులు వేయవలెను. ఆ విధిన చేసిన యెడల వివాహమునకై నేను నా సమ్మతి తెలియజేతు"ననెను. "కామాతు రాణాం న భయం న లజ్జా" యనెడి లోకోక్తి నెరుగని వాడెవ్వడు. ఆ ఉక్తి ప్రకారము జైమిని లజ్జా విహీనుడై యా కన్యక నెత్తికొని, భుజముల మీద కూర్చుండబెట్టికొని జాగ్రత్తగా నడుగులో నడుగు వేయుచు

ముందునకు నడవజొచ్చెను. తన భుజముల మీద కూర్చుండియున్న యామె యంగము యొక్క స్పర్శచేత గల్గెడి క్షణికానందము వలన వివేకము గోల్పోయిన జైమిని యానందపరవశుడై యడుగులిడుచు సుమారు యాభై యడుగులను వేసెను. అప్పుడు జైమినికి యామె శరీరము భారమైనదిగా దోచజొచ్చెను. తాను మోసెడిది స్త్రీ దేహమేనా? యనెడి యనుమాన ముదయించెను. తలనెత్తి చూసెను. తాను మోసెడి దేహము వ్యాసమహర్షిదని యెరిగి యాశ్చర్యభరితాంతరంగుడయ్యెను. జైమినికి లజ్జ జనించెను. తన గురువుగారిని జాగ్రత్తగా దింపి తల దించికొని నిలిచియుండెను. అప్పుడు వ్యాసులవారు జైమిని నుద్దేశించి "విద్వాంస మపి కర్షతి" యనెడి తన మాటలో సత్యము లేదా యని ప్రశ్నించెను. జైమిని తన తప్పును తెలిసికొనినవాడై గురుపాదములకడ నతమస్తకుడయ్యెను. ఈ విధముగా నింద్రియములెంతో ప్రబలమైనవైనందున నొక్కొక్క పరి విద్వాంసుడైనను దారి తప్పెడి యవకాశముండును. అందుచేత నింద్రియ నిగ్రహమనెడిది యొకరి యధీనములో నుండెడిది కాదనియును, దైవానుగ్రహము లేనిదే యింద్రియ నిగ్రహము సాధ్యము కాదని గ్రహించవలెను. ఈ విషయమును వివరించెడి శ్రీ బసవేశ్వరుల వారి యీ క్రింది వచనమును గనుడి :

**విషయవెంబ హసురనెన్నముందె తందు**
**పసరి సిదిరయ్యా!**
**పశువేన బల్లుదు హసురెందెళెసువుదు**
**విషయ రహితన మాడి కాపాడు**
**కూడల సంగమ దేవా!**

(శ్రీ బసవేశ్వర వచనములు-51)

దీని తెలుగు రూపమును గనుడి :

విషయమనెడి పచ్చిగడ్డిని నా ముందుకు తెచ్చి పరచితివయ్యా!
పశులేమి యెరుగు పచ్చిగడ్డియని యెగబడు విషయ రహితుని చేసి కరుణించి కాపాడు
కూడల సంగమదేవా!

(అనువాదము డా॥ మ.లి.స్వా.)

శ్రీ బసవేశ్వరుల ప్రకారము విషయములకై యెగబ్రాకుట యింద్రియముల సహజగుణము. వాటిని విషయముల వైపుకు పోకుండగ నిరోధించవలెను. తన్నిమిత్తమై మానవ ప్రయత్నముతో బాటుగా దైవానుగ్రహము యొక్క యావశ్యకత కలదు.

ఇంద్రియములు నిషిద్ధ విషయముల వైపుకు పరుగులు తీయకుండగ నిరోధించవలెనని కాయశోధనాశీలము తెలియబరచుచున్నది.

స్పర్శ సంబంధమైన దోషములు సంభవించినప్పుడు వాటిని దూరము చేయుటకు వీరశైవ ధర్మమున జలస్నానము మరియు భస్మస్నానములు విధింపబడినవి. శారీరక శుద్ధి గురించి ధర్మశాస్త్రమునందున వివిధ రకములగు స్నానములు సూచింపబడినవి. ఈ క్రింది శ్లోకమును గనుడి :

**శ్లో॥ మంత్రం భౌమం తథాగ్నేయం వాయువ్యం దివ్యమేవచ ।**
**వారుణం మానసంచైవ సప్తస్నానం ప్రకీర్తితం ॥** (శబ్ద కల్పద్రుమము, పు. 453)

"ఆ పోహిష్ఠా మొదలగు వైదిక మంత్రములను పఠించుచు మస్తకము మీద జల ప్రోక్షణమును చేసుకొనునదే మంత్రస్నానము. గంగా మొదలగు పవిత్రనదుల యందు నుండెడి మట్టిని ఫాలము మీద తిలకరూపమున ధరించుకొనునదియే భౌమస్నానము. దీనికి పార్థివ స్నానమని కూడ పేరు కలదు. శాస్త్రోక్తమైన పద్ధతి ప్రకారము తయారు చేయబడిన భస్మమును శరీరమునిండా లేపనము చేసుకొనునదియే భస్మస్నానము. భస్మస్నానమును అగ్ని స్నానమని కూడా పిలుతురు. అగ్నియందున్న దాహకశక్తి యుండునటులనే సర్వ దోషములను దహించెడి సామర్థ్యము భస్మమునందు యుండుటచేత భస్మస్నానమును అగ్నిస్నానమని పిలుతురు. గోధూళిచేత మిశ్రితమైన వాయువు యొక్క సంస్పర్శనవలన గలిగెడి శుద్ధిని వాయువ్య స్నానముయని యందురు. గోపాద స్పర్శచేత పవిత్రమైన గోధూళి వాయువుతో మిశ్రితమై శరీరమును సోకిన యటుల

శరీరము శుద్ధియగును. ఈ వాయువ్య స్నానము శారీర శుద్ధికి కారణమైయుండును. ప్రాతః కాలము లేదా సాయంకాలము సంధ్యా సమయములందున కురిసెడి వాననీటిలో చేసెడి స్నానమునకు దివ్య స్నానమని పేరుగలదు. నదులయందుగాని లేదా సముద్ర సరోవరములందు గాని మునిగి చేసెడి స్నానము వారుణస్నానము. ఇంకను నిరంతరముగా భగవన్నామస్మరణ చేయునదే మానసస్నానము. ఈ విధముగా యాజ్ఞవల్క్య మహర్షి గారు ధర్మ శాస్త్రమునందున సప్తవిధ స్నానములను ఉపదేశించినారు.

వీరశైవ ఆచార్యులు కాయశోధన కొరకై ఈ గణాచారమునందున భస్మ స్నానమును మరియు వారుణ స్నానమును బోధించిరి. ఈ సప్త విధములైన స్నానములయందు మానస స్నానమే శ్రేష్ఠమయినదని శ్రీ భగవత్పాదులు చెప్పిరని ఇంతకుక్రితమే తెలిసికొంటిమి. ఆ సందర్భమున శ్రీవారు కటాక్షించిన ఉపదేశము ఈ క్రింది విధముగా యుండెను.

**శ్లో॥ భస్మనా విహితం స్నానమిదమాగ్నేయముత్తమమ్**
**స్నానేషు వారుణాద్యేషు ముఖ్యమేతన్మలాపహమ్** (సి.శి. 7-22)

ఈ భస్మస్నానము అంతరంగ బహిరంగములను పరిశుద్ధము చేయుటచేత దీనికి శ్రేష్ఠమైన స్నానమని విశేషణము లభించినది. ఆసన శయనాదుల యందున భవులతో సంపర్కమైనప్పుడు కాయము నశుద్ధమగును. అందుచేత ఈ కాయశోధన యందు భవ సంబంధము వర్జింపబడినది. నిసర్గమునందున ప్రకృతి మానవులను స్త్రీ మరియు పురుషులని విభజించిన యెడల మన ఆచార్యులు లింగభేదమునకు మహత్వమును ఈయక ఆచారమునకు మహత్వమిచ్చి భవి మరియు భక్తి అని విభజన చేసిరి.

శివసంస్కారమును పొందినవారు భక్తులనిపించుకొనగా శివ సంస్కార విహీనులు భవిజనులు అనిపించుకొనెదరు. భక్తుడైనవాడు భవిసంపర్కమును చేసినప్పుడు క్రమముగా ఈతని భావనయు క్రుంగుచూ క్రుంగుచూ పోగా పోగా చివరకు ఒక దినమున భక్తుడు భవి అయ్యెడి అవకాశము గలదు. అందుచేత గణాచారాంతర్గమైన ఈ కాయశోధన శీలమునందున కూర్చునియున్నప్పుడు పరుండియున్నప్పుడు వాహకములయందున ప్రయాణమొనరించునప్పుడు సభాసమావేశములయందు సమావేశమైనప్పుడు భవిజనుల సంపర్కమునుండి దూరముగా నుండవలయు ననెడిదే గ్రహింపవలసిన విషయము. ఇంకను శరీరము సదా శుద్ధిగా పెట్టుకొనుటకై విభూతి రుద్రాక్షధర్మపరమైన లాంఛనములను దేహము మీద ధరించవలెననెడిది ఈ గణాచారమునందు ఉపదేశింపబడినది. ప్రతి యొక్క వీరశైవుడు దీక్షా సంస్కారమును పొంది దేహముమీద సదా ఇష్టలింగమును ధరించుకొనవలయును. "లింగధారీ సదా శుద్ధః" అనెడి ఆచార్యోక్తికి అనుగుణముగా దేహము మీద సదాలింగమును ధరించుకొనుచు యుండిన ఎడల శరీరము యొక్క శుద్ధిని కాపాడుకొనిన వారమగుదుము. ఈ లింగముతోపాటుగా భస్మరుద్రాక్షలను ధరించుకొని తీరవలయును. ఇవియే వీరశైవ ధర్మ లక్షణములుయని తెలుసుకొనవలయును. ఈ ధర్మలాంఛనములు వీరశైవుని స్వేచ్ఛప్రవృత్తిని నియంత్రించును. మదోన్మత్తమైన ఏనుగును మావటి తన అంకుశము చేత మర్దించి మర్దించి ఏనుగును తన ఆధీనమునందు ఎటులనుంచుకొనునో భక్తుడు తన మనస్సు యొక్క విశృంఖల ప్రవృత్తిని నిరోధించుటకు యీ ధార్మిక చిహ్నములు భక్తునికి విశేష సాధనములుగా ఉపయోగపడుచుండును.

ఈ విధముగా ఇంతవరకు బోధింపబడిన కాయశోధనా, పంచశీలములను ప్రతియొక్క వీరశైవుడు పాటించి సుఖులై తరించవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 04-08-1992
స్థలం : **భికుబాయి మేనకుదళె**
**మంగళ కార్యాలయము, పూనె**

## విశేష ప్రదీపిక :

ఈ ఆశీర్వచన మెంతో మహత్త్వ పూర్ణమైనది అని భావించవలెను. ఆచార్య స్థానమున నుండెడి లింగస్థలీయులైన దీక్షా గురువుల సౌకర్యార్థమై శ్రీ జగద్గురువులు డా॥ చంద్రశేఖర శివాచార్యులవారు ఆగమములోని వీరశైవాచారమునకు సంబంధించిన యంశములను క్రోడీకరించి యనుగ్రహించిరి.

ఆచారములకును, ఆగమములకును నవినాభావ సంబంధము గలదని తెలియుచున్నది. ఈ విషయమును తెలిపెడి క్రింది శక్త్యాగమ ప్రమాణము గమనార్హమైనదైయున్నది.

**శ్లో॥ కృతే శృత్యుక్తా ఆచారాస్త్రైతాయాం స్మృతి సంభవాః।**
**ద్వాపరే తు పురాణోక్తాః కలౌ ఆగమ సమ్మతాః॥**

కలియుగమున నాగమ సమ్మతమైన ఆచారములే యనుసరణీయమని తెలుపబడినది. ఆగమమనెడి పదము గత్యర్థమైనదైనది. అందుచేత, "ఆగతమాగమ ముచ్యతే" అనెడి నిర్వచనమివ్వబడినది. "ఆగతం పంచవక్త్రాత్తు గతం చ గిరిజాననే... తస్మాదా గమ ముచ్యతే" అనెడి తంత్ర సముచ్చయము (త్రివేంద్రం సంస్కృతి గ్రంథమాల 151) యొక్క నిర్వచనము గమనార్హమైనదై యున్నది. ఆచారముల గురించిన వివరణ శివుని నుండి వచ్చినదనెడిదే తెలిసికొనవలసిన విషయము. (జ.చ.ని అధ్యయన పీఠము మరియు సంశోధన సంస్థ) "గమ్" అనెడిది గత్యర్థకమైన ధాతువు.

"యే గతనర్థాః ధాతవః తే జ్ఞానార్థాః" అనెడి ఆగమ సౌరభము (జ-చ-ని-అధ్యయన పీఠము మరియు సంశోధన సంస్థ) లోని వివరణ ప్రకారము, ఆగమమనగా జ్ఞాన సంపుటమని తెలియుచున్నది. అందుచేత ఆచారాచరణకు జ్ఞాన సముపార్జనకు దగ్గర సంబంధము గలదని తెలిసికొనగలరు. వీరశైవాచారములన్నింటినీ పంచవిధ వర్గీకరణ క్రిందికి తేవచ్చును.

పంచాచారములలో ప్రథమాచారమని యెన్నబడిన లింగాచారమనగా గురుదత్తమైన యిష్టలింగమును మించిన ఆరాధ్య వస్తువు మరొక్కటి లేదనెడి భావనను గల్గియుండడమే. భక్త స్థలములోని భక్తుడు లింగైక నిష్ఠాపరతంత్రతను పెంచికొనవలసిన యవశ్యకత యెంతో గలదు. ప్రాథమికముగా యిష్టలింగమును ధరించి పూజించి ప్రసాదముబడయవలెననెడి శ్రద్ధ యేర్పడవలెను. అది క్రమక్రమముగా పెరిగి నిష్ఠగా పరిణమించవలెను. ఈ దిశలో భక్తుని పయనింపజేయుటకే దీక్షా స్థలమున 'లింగస్థలి' లింగాచారమునుపదేశించునని గుర్తించగలరు. ఈ విషయమునందున శ్రీబసవేశ్వరుల వారి యీ క్రింది వచనము గమనార్హత గల్గినదైయున్నది.

**వ॥ నిష్ఠయింద లింగవ పూజిసి**
**మత్తొందు పథవ నరియద శరణరు**
**సర్పన హెడెయ మాణిక్యదంతిప్పరు భూషణ రాగి!**
**దర్పణ దొళగణ ప్రతిబింబ దంతే హింగదిప్పరు**
**కూడల సంగమదేవా, నిమ్మ శరణరు** (వచనము సం. 745)

దీని తెలుగు రూపము :

నిష్ఠతో లింగము బూజించి
మరియొక పథము నరయని శరణులు
సర్పము యొక్క ఫణమునకు మాణిక్యము
వలెయుందురు భూషణములుగ
దర్పణములోని ప్రతిబింబమువలె
క్రుంగక యుందురు మీ శరణులు
కూడల సంగమ దేవా

లింగాచారమును పరిపాలించెడి వారెట్టులుందురో యనెడి దానిని కళ్ళకు కట్టినట్లుగా చిత్రించి చూపెడి పాల్కురికి సోముని యీ క్రింది సీస పద్యమును గమనించుడి :

**సీ॥ లింగ సంజాతులు లింగ విఖ్యాతులు**
**లింగసదర్థులు లింగముఖులు**
**లింగాభిమానులు లింగావధానులు**
**లింగవిజ్ఞానులు లింగసఖులు**
**లింగప్రమోదులు లింగ వినోదులు**
**లింగాత్మవాదులు లింగసములు**
**లింగసత్ప్రాణులు లింగధురీణులు**
**లింగనిర్వాణులు లింగసుఖులు**

గీ. లింగయోగ్యులధిక లింగ సౌభాగ్యులు
లింగభక్తిపరులు లింగధరులు
లింగలీయు లాత్మలింగవిధేయులు
లింగతత్త్వరతులు లింగమతులు (అనుభవసారము, ప. 201)

పంచాచారములలో రెండవది సదాచారము. ధర్మబద్ధమైన మార్గములో ద్రవ్యార్జనచేసి, అద్దానిని గురు–లింగ–జంగముల తృప్తికై సంతర్పణాదులలో వ్యయపరచి వారి యనుగ్రహమును పొందుటయే సదాచారమని చెప్పెడి చంద్రజ్ఞానాగమోక్తులు శరణ సంస్కృతిలో ప్రస్తుతమైయుండెడి దాసోహ సిద్ధాంతమునకు సరి పోలిక గల్గియున్నవి. జీవి సంసారియై సంసారమున నానా యాతనలకు గురియగుచు ప్రవృత్తి పథమున పయనించుటకు అతడాచరించెడి కర్మలే కారణభూతమైన యంశములగుననెడిది పిండజ్ఞాన స్థలములోనే తెలుపబడినది. శ్రీ భగవత్పాదుల భక్తమార్గ క్రియాస్థలములోను, సహజదాన స్థలములోను సదాచారమునకు సంబంధించిన యంశముల నెన్నింటినో చర్చించిరి. కర్మ బంధనములనుండి విముక్తిని పొందుట కొరకు సదాచారము దోహదము చేయును. శ్రీ బసవేశ్వరులవారి క్రింది వచన మీ యంశమునే స్పష్టము చేయుచున్నది.

**నాను ఆరంభవ మాడువెనయ్యా**
**గురుపూజెగెందు**
**నాను బెవహారవ మాడువెనయ్యా**
**లింగార్చనగెందు**
**నాను పరసేవెయ మాడవెనయ్యా**
**జంగమ దాసోహక్కెందు**
**నానాతావ కర్మంగళ మాడిదడెయు**
**ఆ కర్మఫలభోగవనీ కొడువె**
**ఎంబుద నాను బల్లెను**
**నీకొట్ట ద్రవ్యవ నిమగల్లదె మత్తొందు**
**క్రియ మడెను**
**నిమ్మ సొమ్మింగె సవెసువెను, నిమ్మాణె**
**కూడల సంగమ దేవా!** (వ.సం. 708)

ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి :

నేను ఆరంభము జేసెదనయ్యా
గురు పూజ కని
నేను బెవహారము జేసెదనయ్యా
లింగార్చనకని
నేను పరసేవ జేసెదనయ్యా
జంగమ దాసోహమునకని
నేనేయే కర్మముల జేసిననూ
ఆ కర్మ ఫలభోగము
నీ విచ్చెడిదని నేనెరుగుదు
నీవిచ్చిన ద్రవ్యమును నీకు కాక
మరొక క్రియను చేయను
నీదు సొమ్ముకు సమయజేతు
నీయాన, కూడల సంగమదేవా

సదాచారములో కాయక భావన మరియు దాసోహ భావన లిమిడియున్నవి. అన్యాయ అధర్మమార్గములలో ధనార్జన చేసి దాసోహమున వెచ్చించుట తగని పనియని గుర్తించగలరు. ఆగమ – బసవోక్తుల మేళవింపును పాల్కురికి సోముని యీ క్రింది పద్యములో గాంచగలము.

కం॥ కాయక్లేశ ముఖంబున
న్యాయంబున బడయవలయు నర్థము సమయా
జేయునది భక్తులకు న
న్యాయవర్జిత చరిత్ర నారయ పుత్రా! (అనుభవసారము ప. 144)

సదాచారాంతర్గతమైనట్టి శీలములు సాధకునికి త్రిలింగోపాసన చేయుటకు వలయు అర్హతలను చేకూర్చుట కుద్దేశింపబడినవనియును శీలముల నాచరించకుండ దాసోహము జేసిన యెడల ఫలితముండదనియును గ్రహించగలరు.

"ద్రవ్యక్షేత్ర గృహాదీనాం విశోధనమ్ శివాచారః" అనెడి ఆగమోక్తి శివాచార స్వభావమును తెలుపుచున్నది. సాధకుడుపయోగించెడి పదార్థములయొక్క శుద్ధిని శివశాస్త్రోక్త విధానము ప్రకారముగా సాధించవలెను. శుద్ధిని చేసెడి ప్రక్రియలను శ్రీ జగద్గురువులవారు వివరముగా తెలియజేసి సాధకులను ధన్యులుగా జేసిరి. మంత్రోచ్చారణ పూర్వకముగా భస్మమును చల్లుటవలన పదార్థముల శుద్ధిని సాధించగలమనెడిది మరువరాని యంశము. అదే విధముగా గృహ క్షేత్రాదుల మీద నందిని ప్రతిష్ఠించెడి సాంప్రదాయమును మరువవలదు. బహిరంగ శుద్ధితో పాటుగ అంతరంగశుద్ధిని సాధించుట చాలా ముఖ్యమైన యంశమని గ్రహించగలరు. అంతరంగ శుద్ధి లేకుండగ శివాచారమును పాటించిన యెడల శివుడు ప్రసన్నుడు కాడు. ఈ విషయమును వివరించి చెప్పెడి క్రింది వచనము గమనార్హమైనదై యున్నది.

వ॥ ఆచార శివాచారవెందరియద కారణ,
షడుదర్శనంగళెలా తమతమగె
శరణెనుత్తిద్దువు
మహత్వద సమయాది శైవంగళెంబువెల్లా
శరణు శరణెత్తిద్దవు

**నమ్మకూడల సంగన శరణరుమాడిద**

**వినియోగ**

**బహిరంగదల్లి వర్తిసువవరిగె ఎల్లియదో?** (శ్రీ బసవేశ్వర వచనము,వ.స. 817)

ఈ వచనపు తెలుగు రూపము :

ఆచారము శివాచారమని యరయని కారణమున
షడుదరుశనములెల్లా తమకు తాము శరణనుచున్నవి
మహత్త్వపు సమయాది శైవములన్నీ శరణు శరణనుచున్నవి
మన కూడల సంగని శరణులు చేసిన వినియోగము
బహిరంగమున వర్తించువారికెక్కడిదో?

శివాచారము నెరుగని శైవులెట్టులుందురనెడి జిజ్ఞాస గలవారు శ్రీ పాల్కురికి సోమనాథుని యీ క్రింది పద్యమును గమనించుడి :

సీ॥ **జగమున గొందరు శైవుల మంచును**
**బల్కుచుందురు మరి పాటిగాను**
**వివరంబుగా సప్తవిధ శైవ భేదంబు**
**లెరుగనేరరు గురుతరముగాను**
**వృత్తి శైవంబగు బత్తివైష్ణవమగు**
**త్రికరణశుద్ధి లేదెందుచూడ**
**గీర్తింపగా శివగీతలు చదువరు**
**తగభగవద్గీత లగణితంబ**
**టంచు బలుకు సుందురు పంచముఖుడు**
**ఘనత మీరిన భగవంతుడనెడు బుద్ధి**
**దోపదేమందు వైష్ణవతుల్యులవని**
**బరశివ ప్రసాదు లెట్లొకో బసవలింగ!** (చతుర్వేదసారము ప. 362)

*– శివం భూయాత్ –*

## ఆశీర్వచనము - 5 :

## దీక్షాగురుస్థలము :

వీరశైవ సిద్ధాంతమందున ప్రతిపాదించబడిన పంచాచారముల విస్తృత వివేచన గురించి తెలుసుకొంటిమి. శివాచార మరియు గణాచారముల అంతర్గతములగు అవాంతర శీలముల గురించి తెలుసుకొంటిమి. గణాచారమునందున వచ్చు మొత్తము అరువై నాలుగు శీలములలో వాక్, పాణి పాద త్వక్, జంగ్వ ఘ్రాణ శ్రోత మొదలగు కాయ సంబంధమైన ఇరువది తొమ్మిది శీలములను తెలుసుకొంటిమి. ఇకముందు మానసిక శుద్ధికి సంబంధించిన ముప్పై అయిదు శీలముల గురించి తెలుసుకొనుటకు ప్రయత్నించెదముగాక.

త్రికరణశుద్ధియందు మనఃశుద్ధియే ప్రముఖపాత్ర వహించుచున్నది. మనస్సే బంధ మోక్షములకు కారణభూతమగుచున్నదని విజ్ఞుల అభిప్రాయము. అట్టి మనస్సు అశుద్ధమైన ఎడల రాగానుబంధములకు లోనై ముక్తి మార్గమునకు అవరోధము కలిగించుచున్నది. అది గమనించిన వీరశైవ ఆచార్యులు గణాచారాంతర గతములు మానసిక శుద్ధిని బడయుటకు ముప్పై అయిదు శీలములను ప్రతిపాదించినారు.

(30) నిషిద్ధ భోగ విషయముల యందున సంకల్ప రాహిత్యమైన బ్రహ్మచర్యము ఒక మానసిక శీలము. సంకల్ప వికల్పములు మనస్సు యొక్క ఆధీనములైయున్నవి. ఉన్న వస్తువు యొక్క విషయము గురించి నడిచెడి మానసిక విచారమునకు సంకల్పమనియును, కాల్పనిక విషయము గురించి నడిచెడు మనో విచారమునకు వికల్పము లనెడి పేర్లు గలవు. మనస్సు నందున ఒక్కసారి సంకల్పాత్మక వృత్తి యుండిన ఎడల మరొకపరి వికల్పాత్మక వృత్తి ఉద్భవించును. కాల్పనిక విషయ చింతన యందున నిమగ్నమైన మనస్సు తనశక్తిని కోల్పోయి బలహీనమగును. యోగశాస్త్రమునందున వికల్ప వృత్తిని నిరోధించవలయునని చెప్పబడినది. ఇంకను మనస్సునందున నడచెడి శబ్ద స్పర్శాది విషయకమైన సంకల్పమైనను విహితమా, నిషిద్ధమా యనెడి దానిని విచారించుట ఎంతో అవసరము. నిషిద్ధ విషయముల సంకల్పమైనను నిషిద్ధమైనదే యగుచున్నది. అందుచేత వీరశైవుడు నిషిద్ధ విషయముల ఉపభోగమే కాదు, దాని విచారము గూడ త్యాగము చేయవలయునని ఉపదేశించి మానసిక బ్రహ్మచర్యము యొక్క విశిష్టతను తెలియజేసినారు.

(31) భక్తియందున కామము వలయును. కానీ విషయ వాసనల యందు గాదు. కామమనగా సామాన్యముగా ఇచ్ఛ యనెడి యర్థము గలదు. వీరశైవునికి సంపూర్ణముగా ఇచ్ఛను నిరోధించుట సాధ్యమగు విషయము గాదు. అందుకే ఆ ఇచ్ఛా మార్గము యొక్క గతిని మరలించెడి ఉపాయమును ఇచట తెలియజేయబడినది. భగవద్భక్తి యందు నాసక్తి ఉండవలయునే గాని శబ్ద స్పర్శాది విషయములయందు ఉండకూడదనియే మానసిక శీలము యొక్క అంతర్భావము. విషయములందుండెడి అనురాగమును "రతి" యని పిలుతురు. భగవంతునివైపు మరలినప్పుడు అద్దానిని భక్తియని పిలుతురు.

(32) "అధర్మమునందున క్రోధముండవలయునే గానీ, వైరివర్గమందున కాదు" క్రోధమనెడిది మనస్సు యొక్క వృత్తియై యున్నది. ఈ క్రోధము వలననే జగత్తునందున శత్రువులు తలయెత్తుచున్నారు. వైరిజనుల ఎడల మరల మరల కోపగించుకొనినడల ఆ వైరము దృఢతరమగును. ఈ రీతిగా వైరి వర్గము మీద గల్గెడి కోపము అనర్థమునకు కారణభూతమగును.

క్రోధమొక జ్వలనాత్మక చిత్త వృత్తియై క్రోధాగ్నియని పిలువబడుచున్నది. అగ్ని ఎచట పుట్టునో ఆ ప్రదేశమును మొదటగా విధ్వంసము చేసి ఆ పిదప ప్రక్కనందున నుండిన దానిని గాల్చును. అదేవిధిన క్రోధము గూడ ఎవరియందున ఉత్పన్నమగునో వారికి యనర్థములు కలిగించి ఆ పిదప ఇతరులకు అనర్థదాయకమగును. ఈ విషయమున శ్రీ బసవేశ్వరులవారి ఈ క్రింది వచనము గమనార్హమైయున్నది.

**వ॥ "తన్న మునివరిగెతా మునియలేకయ్యా**
**తన గాద ఆగేను? అవరిగాదె బేగేను?**
**మనియొళగణకిచ్చు మనియసుట్టల్లదే**
**నెరెమనియె సుడువుదే కూడల సంగమదేవా"**

ఈ వచనము యొక్క తెలుగు రూపము :

**తనను కినిసెడివారిని తా కనియు బెందుకయ్యా**
**తనకైన కానిదేమి, వారికైన చేరయేమి**
**తనువులో కోపము, తన పెద్దరికమునకు చేటు**
**మనసులో కోపము తన ఆర యికకు చేటు**
**ఇంటిలోని చిచ్చు ఇంటిని కాల్చక**
**పొరుగింటిని గాల్చునె? కూడల సంగమదేవా!**

శ్రీ బసవేశ్వరుల వారి యనుభవ వాక్కులు జ్ఞానదాయకమై యున్నవి. ఇటీవలి కాలమున రక్తపోటు, మధుమేహము మొదలగు రోగములకు లోనైన రోగులకు వైద్యులు ఔషధోపచారముతో పాటుగా పథ్యమును చెప్పునప్పుడు పదే పదే అనావశ్యకముగా ఎవరిమీదను కోపపడవలదని సూచింతురు. అందుచేత క్రోధపు పథ్యమును పాలించిన ఎడల మనుజుడు దైహికముగాను, మానసికముగాను స్వాస్థ్యమును బడసి సుఖమయమైన జీవితమును సాగించవచ్చును. ఈ విధముగా మానసిక శీలములు మనుష్యుని సుఖశాంతులకు సాధనములై ఒప్పారుచున్నవి.

(33) **"నధనాదౌ వహేల్లోభం శివస్యారాధనే వహేత్"** శివుని ఆరాధన యందున లోభముండవలయునే కానీ ధనాధుల యందున లోభముండకూడదు. లోభమనగా సామాన్యముగా పిసినిగొట్టు తనమును సూచించును. ఇట్టి పిసినిగొట్టుతనము ధనమునందు గల అమితమైన ఆసక్తి వలన జనించును. అందుచేత లోభమనగా అమితమైన ఆసక్తియని గుర్తించవలెను. వీరశైవుడు శివార్చన ఎడల అమితమైన ఆసక్తిని పెంపొందించుకొని త్రికాలములందున సాధ్యమైనంత మేరకు అధికమైన సమయమును ఇష్టలింగార్చనకై వినియోగించవలయును. కామక్రోధ లోభములు నరకమునకు ద్వారములని ధర్మగ్రంథములు తెలియజేయున్నవి. మనుష్యుని వయస్సు పెరిగినకొలది కామక్రోధముల యొక్క ఉద్వేగము తగ్గు అవకాశము యుండినను లోభపు ఉద్వేగము మాత్రము దినదినమునకు వృద్ధి చెందుచుండును. అందుచేత "వృద్ధోయాతి గృహీత్వా దండమ్ తదపిన ముంచత్యాషా పిండమ్". వృద్ధుడైనను జీవి ఆశాపాశమును త్రెంచుకొనజాలడని ఈ సూక్తిలోని భావము. శ్రీమన్నిజగుణ శివయోగిగారు లోభమునొక గొప్ప దుర్గుణముగా వర్ణించిరి. అసత్యభాషణ, చౌర్యము, పరవంచన, అత్యధిక సంగ్రహణ, పరపీడన, హత్య మరియు ఇటీవలికాలములో రాజకీయరంగమున ఖ్యాతిని గాంచిన వివిధ మోసములు మొదలగునవి లోభము యొక్క విరాడ్రూపములై యున్నవి. ఇవన్నియును వైయక్తికముగాను సామాజికముగాను అపరాధములై సమస్త పాపకార్యములకు జన్మనిచ్చునవై యున్నవిఈ కారణముననే లోభమునకు పాపము యొక్క తండ్రియనియును లోభమును దానగుణమునకు వైరిగా పరిగణించవచ్చును. వీరశైవుడు ధనము ఎడల లోభమును పెంచుకొనక దయ, దానగుణములు పెంపొందించుకొని లోకోపకారిగా ప్రవర్తించుచు శివారాధన ఎడల హెచ్చైన లోభమును పెంపొందించుకొనవలయును.

(34) "మోహం భక్తజనేకుర్యాత్ నకాంతాయాం సుతేషువా" శివభక్తులయందున మోహమును పెంచుకొనవలయును. సతీసుతాదుల ఎడల తగ్గించుకొనవలయును. మోహమనగా అత్యంత ప్రీతితో కూడిన ఆసక్తి ఈ ఆసక్తి. సుతీసుతాదుల ఎడల యుండిన ఎడల మనుజుడు తన వివేకమును కోల్పోయి కర్తవ్య మూఢుడు అగును. అర్జునుడు యుద్ధరంగమందున తనకెదురుగా నిల్చిన అన్నదమ్ముల ఎడలను గురుజనుల ఎడలను మోహపరవశుడై గాండీవమును త్యజించి సంగ్రామమొనరించనని చెప్పినది లోకవిదితమే. అర్జునుని మోహమును దూరముచేసి కర్తవ్యోన్ముఖుని చేయుటకై గీత బోధింపబడినది. అందుచేత స్వజనులు తమ యందుండెడి మోహమును తగ్గించుకొని దానిని శివభక్తుల యందు ప్రసరింపజేయవలయునని తెలియజేయబడినది. శివభక్తుల ఎడల మోహమును పెంచుకొనిన ఎడల సాధకునిలోని శివభక్తి దినదినము వృద్ధిగాంచును. అందుచేత గణాచారియైన వాడు స్వజన మోహమును పరిత్యాగము చేసి సుజనులగు శివభక్తుల యందు మోహమును పెంచుకొనవలయును.

(35) "కరణేశ్వేవ మాత్సర్యంనజనేషు" మాత్సర్యమును తన ఇంద్రియములతో చేయవలయునే కానీ సమానజనులతో చేయకూడదు. మాత్సర్యము మనస్సు యొక్క ఒక దుర్గుణమైయున్నది. ఇతరుల అభ్యుదయమును గాంచినప్పుడు దానిని సహించజాలక మనస్సునందున అసూయా ద్వేషములను పెంపొందించుకొనునదే మాత్సర్యమనబడును. ఇంకొకరి అభ్యుదయము, మరియు అభివృద్ధులు సహించని మనుజుడు తానెప్పటికిని అభివృద్ధి చెందడు. చెట్టు యొక్క మూలమునకు అగ్నియంటిన యెడల దాని శాఖలు, ఆకులు మొదలగునవి నష్టమగునటులనే ఎవరి మనస్సునందున మాత్సర్య భావన యనెడి అగ్గి అంటుకొనునో వారి మనమునందలి ఉత్కృష్ట విచారములు నష్టమై తత్ఫలితముగ వారి ప్రగతిని నశింపజేయును. ఇచట ప్రగతి యనగా, భౌతిక, మరియు ఆధ్యాత్మికము లనియే గ్రహించవలయును. ఈ కారణముననే మాత్సర్య రాహిత్యము ఒక ముఖ్యమైన మానసిక శీలముగా గుర్తింపబడినది.

ఈ మత్సర భావనను వీడుట ఎంతో కష్టమైన పని. ఈ కారణమున మాత్సర్యమును ఇంద్రియముల ఎడల ప్రసరింపజేయవలయునని శివాగమములు చెప్పుచున్నవి.

పంచజ్ఞానేంద్రియములు మరియు పంచ కర్మేంద్రియములు తమ తమ విషయముల ఎడల సదా ఆసక్తిని కలిగి విషయాభిముఖముగా ప్రవర్తించుచుండును. ఇంద్రియముల యొక్క ఈ విషయాసక్తి మనస్సుచేత సహించబడదు. అప్పుడే ఇంద్రియముల మీద మనస్సు దండెత్తి నియంత్రించుటకు కృషిచేయును. ఈ విధముగా మనస్సును విషయ వాంఛలకు విముఖముగా చేసిన ఎడల సాధకుడు ఇంద్రియములను సులభముగా నిరోధించగలడు. ఆధ్యాత్మిక వికాసమును సాధించగలడు. మనస్సు పవిత్రమై విరాజిల్లగలదు. కానీఇది సులభసాధ్యమైన విషయము కాదు. ఎంతో కఠిన పరిశ్రమకోర్చి మనస్సు మీద నియంత్రణను సాధించవలెను. అప్పుడే ఈ శీలపాలన విజయవంతముగా కొనసాగును.

(36) **'మాయాజయే మదోనధర్మేనాపి సంపదీ'** అనగా మాయను గెలుచుటకు మదము లేదా అభిమానము వుండవలయునే కాని మన ధర్మాచరణ లేదా సంపదనందు వుండకూడదు.

మదము మనస్సునందున పుట్టెడి అరిషడ్వర్గములలో ఒకటై యున్నది. ఇది మనుష్యుని అవనతికి కారణమగుచున్నది. ధన, యౌవన, రూప, విద్య, అధికారము మొదలగు విషయముల మీద మనుష్యుడు అభిమానమును దాల్చి మదోన్మత్తుడై వ్యవహరించును. మదము అరిషడ్వర్గముల యందు పరిగణింపబడుటచేత దానిచేత ఎవ్వరికీ సుఖ సంతోషములు లభించవు. అందుచేత శాస్త్రములయందు దీనిని పరిత్యజించవలెనని చెప్పబడినది. ఈ పూర్వమునందున చెప్పబడిన శివాగమపు ఉక్తి యందు ధనము, మరియు ధర్మములమీద అభిమానమును వహించకూడదని వుపదేశించనైనది. ధనము మరియు ధర్మములు క్రమముగా ఐహిక మరియు ఆముష్మిక వ్యవహారములకు మూలమై యున్నవి. ఇహలోకపు సర్వవ్యవహారములకు ధనమే మూలమై యుండుటచేత ధనము యొక్క మహత్వమును ఒక సుభాషితకారుడు ఈ క్రింది విధముగా వివరించిరి.

**శ్లో॥ ధనేన నిష్కులినాః కులినా భవంతి।**
**ధన్వై రాపదం మానవా నిస్తరంతి।**
**ధనేభ్యః పరో బాంధవో నాస్తి లోకే।**
**ధనాన్యర్జయధ్వం ధనాన్యర్జయధ్వమ్॥**

ధనముచేత కులహీనుడు కులజుడుగాను మర్యాదను పొందగలడు. పెద్ద పెద్ద విపత్తులను ధనము యొక్క సహాయముతో ఎదుర్కొని అధిగమించవచ్చును. అటులనే జగత్తులో ధనముకంటే వేరుగా బంధువులు లేరు. ఈ కారణమువలన ధనమును సంపాదించుడి! సంపాదించుడీ!

ధనము ఇహలోకపు సర్వ వ్యవహారములకు మూలకారణమై యుండుటచేత ధనమును సంపాదించవలెననెడిది నిజమే. అయితే సంపాదించిన ధనముమీద మదమును దాల్చిన యెడల ఆ ధనముచేత మంచిని సాధించుటకు బదులుగా అనర్థము సాధించబడును. ధనాభిమానియైన వ్యక్తి ఇతరులమీద అనేక దౌర్జన్యములను చేసి వారికి దుఃఖమును నొసంగుటతో పాటుగా చివరకు ఒక దినమున తానునూ దుఃఖితుడగును. అందుచేత ధనముమీద అభిమానమును వహించకుండా వుండుటయే శ్రేయస్కరము.

ఇదే ప్రకారముగా పరలోకపు వ్యవహారములకు ధర్మము మూలమైయున్నది. మనుష్యుడు ధర్మసూత్రముల ప్రకారము ధర్మాచరణచేసి ధర్మమును నిర్వహించుచున్నాడు. ధర్మము పారలౌకిక సుఖమునకు కారణమై యున్నను ఆ ధర్మము మీద దురభిమానము వహించిన యెడల అది మనుజుని అధఃపతనమునకు కారణమగును. అందుచేతనే తారకాక్ష, కమలాక్ష, వీరవిద్యున్మాలి, హిరణ్య కశ్యప, భస్మాసుర మొదలగు తపస్వీ రాక్షసులు ఇట్టి దురభిమానము వలననే చెడిపోయిరనునది చరిత్రకెక్కిన విషయము. వీరందరు అతి కఠోరమైన తపస్సు నాచరించి తత్ఫలితముగా శక్తులను సంపాదించి తాము సంపాదించిన శక్తి యెడల దురభిమానమును వహించి పరపీడనము చేయుటకు కుద్యుక్తులైరి. ఈ కారణమున పతనమైరి.

ధనము, మరియు ధర్మము సుఖమయమైన జీవనమును సంపాదించుటకు సాధనములై యున్నవి. వాటియెడల దురభిమానమును వహించిన యెడల అవి దుఃఖమయమైన జీవనమును ప్రదానము చేయును. అందుచేత వీటి యెడల దురభిమానమును వహించకుండ నుండవలెను. మదోన్మత్తతను మాయనుగెలుచుట కొరకు వుపయోగించిన యెడల అధ్యాత్మికముగా ఎంతో లబ్ధికలుగును. మాయను గెలిచియే తీరవలెననే దురభిమానమును వహించుట యనెడిదే ఈ శివాగమపు ఉద్దేశము యొక్క సారాంశము. ఈ కారణము వలన వీరశైవుడు ధనము మరియు ధర్మ ముల గురించి అభిమానమును త్యజించి ఇతోధికమైన సుఖమును పొందవలెను. ఈ విధముగా మదరాహిత్యమే మనస్సుకు చెందిన మరియొక శీలమని తెలియుచున్నది.

37. 'గురౌ జంగమే వాగుణాగుణ విమర్శత్యాగః" అనగా గురువు మరియు జంగముల యొక్క గుణాగుణముల విమర్శను చేయకుండుట. ఇది ఒక మానసిక సంబంధమైన శీలమై యున్నది. సామాన్యముగా పరుల దోషములెన్నుట మానవుని సహజస్వభావమై యున్నది. ప్రాయః మనుజుడు అన్యుల యందలి గుణగణములను పరీక్షించకుండ అవగుణములనే వీక్షించుచున్నాడు. ప్రతియొక్క మనుష్యుని యందున గుణాగుణములు కొంచెము హెచ్చుతగ్గులలో వుండియే తీరును. సాధ్యమైనంత మేరకు ఇతరుల యొక్క గుణగణములను పరీక్షించి వాటిని తన జీవనమునందున అలవరచు కొనుటకు ప్రతి యొక్కరు ప్రయత్నించవలెను. అన్యుల అవగుణములకడకు లక్ష్యము వహించిన యెడల క్రమక్రమముగా తానునూ అవగుణిఅయ్యెడి అవకాశము కలదు. గుణగ్రాహి కావలయునే కాని అవగుణగ్రాహి కాకూడదు అనెడిదే ఆగమము యొక్క వుపదేశమై యున్నది. వీరశైవ సిద్ధాంతమునందున గురువు మరియు జంగములు ఆరాధ్యమూర్తులై యున్నారు. అకస్మాత్తుగా వారిలో ఒక అవగుణము కనినను దానిని లక్షించకుండ వారిలోని వేరే సద్గుణములను గుర్తించి వాటినే తన జీవనమునందున అలవరచుకొనుటయే భక్తుని కర్తవ్యమై యున్నది. మన మానసిక పరిశుద్ధతకు అన్యుల సద్గుణములు సాధనములుకాగలవేకాని దుర్గుణములు కాజాలవు. అందుచేత వీరశైవ సాధకుడు గురువు–జంగముల యెడల అమితమైన శ్రద్ధను గలవాడై వారి గుణావగుణములను విమర్శించక కేవలము సద్గుణములు మాత్రము గ్రహించి తన జీవనమును సుగమము చేసుకొనవలెను.

38. ప్రాణినో అహింసాభావనా' అనగా ఏ ప్రాణిని హింసించకుండా అహింసా వ్రతమును పాలించుట హింస కాయిక, వాచిక మరియు మానసికము లనెడి మూడు విధములుగా నుండును. శస్త్రాస్త్రముల చేత ఇతరులను హింసించెడిది కాయిక హింస. అవాచ్య, మరియు పౌరుష శబ్దముల చేత అన్యులకు మనోవ్యధ కలిగించునది వాచిక హింస. తన మనస్సునందున ఇతరుల గురించి చింతించుచు వారి అనిష్టమును కోరునది మానసికహింస. ఈ మూడింటిలో మానసిక హింసనే ప్రధానమైనది. మొదటగా ఇతరుల యెడల అనిష్ట భావన మనస్సునందు వుదయుంచుట అనెడిది ప్రారంభదశగా తీసుకొనవచ్చును. అదియే ముమ్మందు శబ్దరూపమును దాల్చి వాచిక హింసగామారును. చివరకు ఈ రెండి ప్రభావము వలన ఒక దినమున కుస్తీ పట్లు సంభవించును. అది విరాట్ రూపమును దాల్చిన యెడల యితరులను గాయపరచుటయో లేదా ఇతరుల ప్రాణములు తీయుటకో దారి తీయవచ్చును. ఇట్టి విధమైన కాయిక హింసకు మానసిక హింసయే మూలకారణమని తెలియుచున్నది. అందుచేత శీలవంతుడు మనస్సు నుండి యితరుల గురించిన అనిష్టచింతనను పెరికి వేయవలెను. ఇదియే మానసిక అహింసా శీలమగును.

39. 'ప్రాణిదుఃఖ వీక్షాయామ్ దయా' అనగా ప్రాణుల దుఃఖములను చూసి సహించని మనోభావనయే దయ. ఇది మనస్సునకు చెందిన సాత్విక భావన. అందుచేత దీనిని శివాగమములు మానసిక శీలముగా పరిగణించిరి. దశ విధ ధర్మముల యందున 'దయ' యనెడిది ప్రమఖమై యున్నది. ప్రతియొక్క ధర్మపరంపర యందు ప్రాణి యెడల దయకు ప్రాశస్త్యము యివ్వబడినది. అందుకొరకే శ్రీ బసవన్నగారు 'దయలేని ధర్మమదెట్టిదయ్యా?' అని ప్రశ్నించిరి. సకల ధర్మముల యందున దయయే మూలమైనదని చాటి చెప్పిరి. సర్వప్రాణుల యందున ప్రతి యొక్కరు దయా భావమును కలిగి యుండవలెనని ప్రతిపాదించిరి. దయయే శ్రేష్ఠమైన ధర్మాచరణ అయివుండుటచేత దుఃఖితులైన జీవుల దుః ఖమును పరిహరించెడి మనోభావనను ప్రతి ఒక్కరు కల్గియుండవలయుననెడిదే ఈ శీలము యొక్క పరమోద్దేశ్యమై యున్నది.

ఈ దయాగుణమును కలిగిన మన దేశపు అనేక సత్పురుషుల జీవితమునందున అందరూ ఆశ్చర్యపడెడి కొన్ని ఘటనలు కానవచ్చుచున్నవి. ఏకనాథుడు గంగోత్రి నుండి గంగా జలమును తీసుకొని రామేశ్వర జ్యోతిర్లింగమునకు అభిషేకము చేయుటకై పాదయాత్రలు చేయుచున్నపుడు మార్గమధ్యమునందు వేసవి తాపమునకు నోరెండి పరితపించుచున్న ఒక గాడిదను గాంచెను. దయాభావము వుప్పొంగగా అతడా గంగాజలమును ఆ గాడిద నోటిలో పోసి దానికి జీవన దానమును చేసెను. ఈ ఘటన అందరినీఆశ్చర్యమున ముంచెత్తినది. ప్రతి యొక్క ప్రాణియందుననూ పరమాత్ముని అస్తిత్వమును గాంచెడి ఏకనాథుని ఈ మనోభావన ప్రాణిదయకు పరమోత్కృష్ట ఉదాహరణగా నిలుచుచున్నది. పాశ్చాత్య దేశములలో

కూడా అచటి మహానుభావులు భూతదయను ప్రదర్శించిరని తెలిపెడి దృష్టాంతములు లభించుచున్నవి. అమెరికా దేశపు అబ్రహమ్‌లింకన్ పార్లమెంటువైపు పయనించుచుండగా ప్రాణాపాయ స్థితిలో నున్న ఒక పందినిగాంచి దానికి ప్రాణదానము చేసెనని చెప్పుదురు. ఈ విధమైన దయాభావన మానసిక శీలమై యున్నది. నిజగుణ శివయోగుల వారు జీవుల యెడల దయగలిగివుండవలెనని ఉపదేశించిరి. నేడిది మరువరాని విషయము.

40. 'క్రియాయాం వచనే చ ఆర్జవం' అనగా కృతి మరియు మాటల యందున వంచనను తాల్చక యుండుట 'ఆర్జవ'మనగా సరళత సామాన్యముగా ప్రతి ఒక్కరూ సరళ స్వభావియై యుండుట జరుగదు. ఆధ్యాత్మశాస్త్రము అనుభవమునకు రావలెననిన సరళతా స్వభావము అవశ్యమైనదైయున్నది. నడత నుడువు ల మధ్యన సామరస్యముండునదే నడత నుడువుల సరళత యనబడును. మరొక మాటలో చెప్పవలెననిన మాట, చేత ఒకటేయై యుండవలెను. ఈ విధముగా నుండినగాని శివానుగ్రహము సంప్రాప్తముగాదు. సాకార శివుడు అత్యంత సరళస్వభావము కలవాడు. ఈ సందర్భమున చెప్పవలసినదేమనగా నిరాకార నిర్గుణ శివ పరబ్రహ్మకు సరళత, వక్రత యనెడి భావములుండవు. కారణమేమనగా అతడు గుణాతీతుడు. భక్తుడు సరళ కృత్యములు చేసినవాడైన యెడల శివానుగ్రహ ప్రాప్తికి అది కారణము కాగలదు. సరళ జీవనమునకు సరళతరమైన మనస్సు ముఖ్యమైనది. అందుకొరకే ఈ శీలము నందున మానసిక సరళతకు ప్రాముఖ్యతనివ్వబడినది.

41. 'రిపౌ నిజసుతేవాపి వైషమ్యవివర్జనమ్' అనగా శత్రువుల ఎడల పుత్రుల యందు వలెనే విషమతను దాల్చియుఉండకుండుట. మనస్సుయొక్క ఈ సమభావ స్థితి, ఒక శీలమనిపించుకొనుచున్నది. సామాన్యముగా తరతమ భేదములు పాటించుటయనెడిది సగటు మనిషి యొక్క ప్రాథమిక స్వభావమైయున్నది. సమాజము లోని అధిక సంఖ్యాకులు ఇట్టి భావమునే మనమున దాల్చి తన వారికి ఒక విధముగను, పరులకు మరొక విధముగను వివక్షతను చూపుచుందురు. ఈ భేద భావన సకల అనర్థములకు మూలకారణమగుచున్నది. ఈ కారణముననే 'అయం నిజః పరోవేతి గణనా లఘుచేతసామ్' అనెడి సుభాషిత కారుల ఉక్తి కూడా తరతమ భేదమును ఖండించుచున్నది. ఇట్టి సమభావన స్థితిని పొందవలయుననెడిదే ఈ మానసిక శీలము యొక్క లక్ష్యమని గుర్తించవలెను.

42. 'గురూపదేశ్టేషు నిగమాగమ వచనేషు విశ్వాసః' అనగా గురువుచేత ఉపదేశింపబడిన వేదాగమముల వచనముల యందున నమ్మకము గలిగియుండుట. వేదాగమములు మన దేశపు అత్యంత ప్రాచీనమైన వాఙ్మయము శివుని ఉచ్ఛ్వాస, నిశ్వాసలవలన వేదవాఙ్మయము ఉద్భవించినదనియును అతని యొక్క ఉపదేశము చేత శివాగమములు బహిర్గతమైనవనియును చెప్పబడినది. మనుజుని యొక్క కర్తవ్యా కర్తవ్యముల వ్యవహారమునకు ప్రమాణభూతములైనవే ఈ వేదాగమములు.

గీతాచార్యులు 'తస్మాత్ శాస్త్రం ప్రమాణంతే కార్యాకార్య వ్యవస్థితౌ' అని వుపదేశించిరి. ఈ విధముగా మనుజుని శాస్త్రీయ మరియు లౌకిక వ్యవహారములయందు వేదాగమములు ప్రమాణభూతములై యుండుట చేత వాటి యెడల ప్రతి ఒక్కరూ నమ్మకమును గలిగి యుండవలెను. ఇట్టినమ్మికయే ఒక మానసిక శీలమై యున్నది.

సద్గురువు మరియు శాస్త్రములు లోకహితార్థమై ఉపదేశమును చేయును. ఏశాస్త్రమైననూ లేదా ఏ సద్గురువైననూ లోకమును వంచించుటకు ఉపదేశమును చేయుట జరుగదు. పరోపకార స్వభావము గల సద్గురువులకు లోకపుజనులయెడల యెట్టి అపేక్షవుండదు. వారికి లోక కళ్యాణమే ముఖ్యమైన జీవనపు లక్ష్యమై యుండును. అందు చేత గురువు యొక్క ఉపదేశమునందునను శాస్త్రముయొక్క వుపదేశమునందుననూ ప్రతి ఒక్కరూ విశ్వాసము కలిగియుండవలెను. ఎవరి విశ్వాసము ధృఢతరముగా యుండునో వారు ఆ విశ్వాసము మేరకు ఫలమును పొందెడి వారగుదురు. ఈ కారణము వలన గరూపదేశమునందున, శాస్త్రోపదేశమునందున విశ్వాస రాహిత్యమును వహించుట శ్రేయస్కరముకాదని గుర్తించగలరు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 5-08-1992

స్థలం : **భికుబాయి మేనకుదళె**

**మంగళ కార్యాలయము, పూనే**

## విశేష ప్రదీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు గణాచారము గురించియు తత్ సంబంధమైన శీలముల గురించియు తెలియచెప్పిరి.

ధర్మమునకు గ్లాని గల్గినప్పుడూ అధర్మ ధోరణులను కూకటి వేళ్ళతో పెకలించివేసి ధర్మ సంస్థాపన చేయవలసిన యవశ్యకత గలదనెడి విషయములో నేకాభిప్రాయము కలదు. అవతార వాదులు భగవంతుని పై భారమును వేసి అవతారపురుషుని యవతరణకై యెదురు చూచుచుందురు. క్రియాశీలులీ ధోరణిని నిరసింతురు. “ఎవ్వడో వస్తాడని, యేమో చేస్తాడని” భావించక యెవ్వరి కర్తవ్యమును వారు నిర్వహించవలెననెడిదే వీరి వాదనము.

“తనరగ కూడునే విధి వశమ్మని కర్మము గూర్చి పల్కగన్” అనెడి యనుభావుల వాక్కు (అనుభవ సారము, ప॥80) లను పరికించిన యెడల వీరశైవము క్రియా శీల వాదమును సమర్థించుచున్నదని దోచుచున్నది.

క్రియాశీల వాదము యొక్క నేపథ్యమున గణాచారమును పరిశీలించిన యెడల, నియ్యది ధర్మక్షణకై యుద్దేశింపబడినట్టి ఆచారమని తెలియగలదు.

“శివస్య శివభక్తస్య శివధర్మస్య చాపి చ। నిదాంన శృణు” అనెడిది ఆగమాదేశము. ఉచిత మైన రీతిలో తగు చర్యలను చేపట్టి నిందకుల కుతంత్రముల నెదుర్కొని నిందా ధోరణుల నరికట్ట వలెననెడిదే గణాచారమున నిమిడి యున్న భావము.

దుష్టశిక్షణకై దండప్రయోగ మని వార్యమైనదనెడి భావనను వీరశైవమంగీకరించదు. అహింసా మార్గముననే పయనించవలెననెడిది పరంపరానుగతముగా వచ్చెడి భావన. సామదాన భేదోపాయములప్రయోగమే యభిలషణీయమని గ్రహించవలెను. “ప్రాణ విత్తమాన భంగము”ల కాస్కారమేర్పడి నప్పుడు ఆత్మరక్షణ, ధర్మరక్షణ, భక్త రక్షణ మొదలగువాటికై దండోపాయము నుపయోగించవలెననెడిది సూచింపబడినది.

శ్రీ బసవేశ్వరుని వంటి శాంతి వాదులు ఉపద్రవము వాటిల్లినప్పుడు స్థానచలనము ద్వారా శివనిందను వినకుండగ నుండవలెనని తెలిపినట్లుల గోచరించుచున్నది. బిజ్జలుని యభిమానులు శివధర్మమునకు, శివశరణులకు హాని తలపెట్టిన సందర్భములో శ్రీ బసవన్నవారు ఈ ధోరణినే యనుసరించిరి. హింసామార్గము వర్జించి న్యాయబద్ధము, శాసనసమ్మతమైన మార్గము ననుసరించుటయే కర్తవ్యమని తెలియవలెను.

గణాచారము నాచరించెడి సందర్భమున సాధకుని ధర్మాభిమానము మత దురభిమానముగా పరిణమించెడి యవకాశము కలదు. దురభిమానము ద్వేష ధోరణులకు పుట్టినిల్లు. ఇట్టి ధోరణులను నివారించు సాధకుడు నైతిక బలమును సమకూర్చికొనవలెను. గణాచారమున కనుబంధముగా నుండెడి శీలములు నైతిక శక్తిని ప్రదానమును చేసి క్రమశిక్షణా సహిత సత్ ప్రవర్తనను పెంపొందించును.

శివనింద జేసిన వారిలో దక్షుడొకడని పురాణముల వలన తెలియుచున్నది. ఈ కథలో గణాచారమునకు సంబంధించినట్టి రెండు ధోరణులను గాంచగలము. శివనిందను వినలేక తన యసువులను బాసిన సతీదేవి దొక ధోరణికాగా, నిందకులకు, వారి యనుయాయులకును బుద్ధిజెప్పిన వీరభద్రస్వామిది మరొక్క ధోరణి. శ్రీ బసవన్నవారు దక్ష యాగోదంతమును క్రింది విధముగా చిత్రించిరి.

**దక్షయాగవ నడెసలెందు అజముఖ్యరాదసురరెల్లా**
**నెరెదు బంద బాయనోడా**
**బాయ తప్పిసి ఉణబందబాయనోడా!**
**ఉణ్ణదె ఉడదె హెుగేయ**
**కైయలిసత్త అణ్ణగళ కేడనోడా!**
**కూడల సంగమ దేవా!** (వ.సం. 573)

ఈ వచనపు తెలుగు రూపమిది :

**దక్షయాగమును నడిపించవలెనని**
**అజముఖ్యులైన సురులెల్లా**
**కూడివచ్చిన నోటిని చూడుమా!**
**నోటిని తెరిచి తినవచ్చిన**

**దైవపు నోటిని చూడుమా!**
**తినక కట్టక పోగ చేతిలో చచ్చిన**
**అన్నల చేటును చూడుమా**
**కూడల సంగమ దేవా!**

శివకవులందరు వీరభద్రుని గణాచార నిరతి నాదర్శముగా గైకొనినారని తెలియుచున్నది. ఈ విషయమును సూచన ప్రాయముగా తెలిపెడి క్రింది పద్యముగనుడి:

**కII చెనయు శివద్రోహుల యెడ**
**దను ధర్మము లెడల దక్క దయమును శాంత**
**త్వనిరూఢియు శృంగారిలు**
**ననయముభక్తులకు గురుపదాంబుజభృంగా** (అనుభవసారము ప. 129)

**– *శివం భూయాత్* –**

## ఆశీర్వచనము : 6

జిజ్ఞాసువులైన సద్భక్తులకుపయుక్తమయ్యెడి గణాచారాంతర్గములైన యరువది నాలుగు శీలములలో మనస్సుకు సంబంధించిన శీలముల విశ్లేషణ గురించిన వివరణ క్రిందటి యాశీర్వచనమున తెలుపబడెను. గురూపదేశము యెడల శ్రద్ధ వహించి యుండవలెననెడిదొక శీలమని తెలిసికొంటిమి. ఇప్పుడు శివాగమోక్త మానసిక శీలములలో మరి కొన్నింటి గురించి తెలిసికొనెదముగావుత.

(43) "దురంతాయాం, ఆపద్యపిధర్మస్య అవర్జన రూపా ధృతిః" దీని భావమేమనగా నతి కఠినమైన విపత్తు వచ్చినను ధర్మమును విడువక యుండెడి ధైర్యము. ఇట్టి ధైర్యమే మనస్సుకు చెందిన శీలమై యున్నది. ఎట్టి కఠిన పరిస్థితి వచ్చినను మనుష్యుడు తాను పట్టిన ధర్మాచరణను నెప్పటికైనను వీడకూడదు. కొందరు చిన్నచిన్న నెపములు కల్పించికొని పట్టిన నియమమును విడుచుటను చూడగలము. తన వ్రతములను ధైర్యముగా పరిపాలించు వాడేనిజమైన వీరశైవుడు. ఇంతకు క్రితము, మహేశ్వర స్థలమున శ్రీ భగవత్పాదులు సాదకునికి నియమమును వీడననెడి ఛలముండవలెనని యుపదేశించిరి. శ్రీమన్నిరంజనశివయోగులు వారు పరశివుని "పట్టిన నేమము ప్రకారము నడచెడి ఛలమును ప్రదానము చేయుమని" వేడికొనిరి. వీరశైవులకిది అత్యంతాదర్శమైనది.

(44) "అపకారిష్వపి వైరి జనేషు అదూషణ రూపా క్షమా". దీని భావమేమనగా తనకు నపకారము జేసెడి శత్రువులను దూషించకుండ వారి యెడల క్షమాభావమును దాల్చుట. ఇది కూడా నొక విధమైన మానసిక శీలము. క్షమ అనగా సహనశీలత. మనస్సు విశాలమైన కొలది సహన శీలత ప్రవర్ధిల్లు చుండును. విశాలమైన మనస్సుగల వ్యక్తి వసుధైక కుటుంబము అనెడి భావనను దాల్చుకొనును. ఈ భావన యున్నవాడే జగత్తులోని మనుషులందరూ మంగళమయముగాను, సుఖులుగాను వుండవలయుననెడి భావమును గలిగి యుండును. ఇతరుల అపరాధమును మరచి వారిని క్షమించుటయే శ్రేష్ఠమైన మానసిక శీలము అనవచ్చును. ప్రఖ్యాత భక్తి ఉద్యమ కారుడైన కబీరుదాసు తాను యితరులకు చేశిన ఉపకారమును, ఇతరులు తనకు చేసిన అపకారమును మరచుటయే కర్తవ్యమని తెలిపిరి. ఇంతటి క్షమాగుణమును ప్రతి ఒక్కరూ పెంపొందించుకొనుట ఎంతగానో అవసరమై యున్నది.

45. "మానసే భోగాసక్తి చ్యుతిః" మనస్సునందున అణగి యుండెడి విషయపరమైన భోగాసక్తిని విడుచుట. భోగాసక్త రాహిత్యస్థితియే మనస్సుకు సంబంధించిన పవిత్రమైన శీలమగుచున్నది అనేక జన్మజన్మాంతరముల యందున శబ్ద స్పర్శాది విషయపరమైన సుఖోపభోగమును అనుభవించిన మనస్సు, ఆయా విషయములు ఆయా యింద్రియములకు సంబంధము లేకుండావుండినప్పుడు వాటి చింతనను చేయుట దాని స్వభావమైయున్నది. ఇందుచేత మనస్సు యొక్క అధోపతనము వలన మనుష్యుడు దుర్గతి బడయుచుండును. మనస్సునందలి ఆసక్తి చేతనే మనుజుడు మరల మరల విషయములవైపు పయనించి వివేకమును కోల్పోయి అధోమార్గమున వెడలుచున్నాడు. శివాగమములు మనస్సు యొక్క పరిశుద్ధతకై కృషి చేయవలెననియునూ తద్వారా మానవుడు అభ్యుదయమును సాధించవలెననియును ఉపదేశిస్తున్నవి. ఈ దిశలో భోగాసక్తిని విడనాడుటయే కర్తవ్యమై యున్నది.

46. 'క్రియాయాం వచనే వాపి ప్రమాదరాహిత్యమ్' కృతి మరియు మాటల యందున ప్రమాదములేకుండా వుండుట. ప్రమాదమనగా అపరాధమని గ్రహించవలెను. ఎప్పుడైనను దేనినైనను చేయవలయునో దానిని ఆ వేళ యందున చేయకుండా వుండుటయే ప్రమాదము. సోమరియైన మనుష్యుని వలన ఇంతటి ప్రమాదములు మీద మీద సంభవించుచుండును. అందుచేత తన జీవితము యొక్క శత్రువైన సోమరి తనమునుతొలగించుకొని నిత్యనియమములను తప్పని సరిగా దృఢ సంకల్పముతో చేయుటకు నిశ్చయించుకొనవలెను. అప్పుడే ప్రమాద రాహిత్యమైన జీవితము లభ్యమగును.

47. 'శివాదన్యవస్తూనాం ప్రాప్తి సంకల్ప వర్జనరూపోదమః' అనగా నిషిద్ధ వస్తువులను పొందవలయుననెడి సంకల్పమునుత్యాగము చేయుట. శాస్త్రము ప్రకారము శమదమములు షట్‌సంపత్తుల యందున పరిగణింపబడినవి. శమమనగా అంతరీంద్రియ నిగ్రహము. దమమనగా బహిరీంద్రియ నిగ్రహము. ఇవి రెండునూ పరస్పర పూరకములని గ్రహించవలెను. సాధకుడైనవాడు ఈ రెంటినీ సాధించుకొని తన మనస్సునందున శాస్త్ర నిషిద్ధ వస్తువుల యెడల కోరిక లుండని యటుల తన మనస్సు యొక్క పవిత్రతను కాపాడుకొనవలెను. ఇంతటి పవిత్రతయే ఒక మానసిక శీలమగుచున్నది.

48. 'పరద్రవ్య అపరిగ్రహరూపం అస్తేయమ్' అనగా పరుల వస్తువును అపహరించరాదనెడి అస్తేయ భావన. ఇదియును ఒక రకమైన మానసిక శీలమే. మనుజునికి తాను సంపాదించిన ద్రవ్యము యొక్క కొరత యైనపుడు పరద్రవ్యమును అపహరించెడి దుర్బుద్ధి ఉత్పన్నమగును. విలాసవంతమైన జీవితమును గడుపదలచిన వారికి ఎంత ద్రవ్యము దొరకిననూ తక్కువనే అనిపించును. ఆ కొరతను పూర్తి చేయుటకొరకై నానా విధములైన చౌర్యములను చేయుటకు సిద్ధపడును. ఒక్కసారి ఈ దొంగబుద్ధి అలవడిన యెడల దానిని నియంత్రించుట సులభసాధ్యముకాదు. అందుచేత మనుజుడు తన అభిలాషలను నియంత్రించుకొని తనచేత పరద్రవ్యమును అపహరించెడి నేరము ఘటించకుండా హెచ్చరిక వహించవలెను. ఇచ్చటి హెచ్చరికయే మానసిక శీలమగుచున్నది.

49. 'అప్రాప్త వస్తు విషయ వ్యసనాభావరూపా సంతుష్టిః అనగా తనకు దొరికిన వస్తువు నందున వ్యసనములేకుండా, దొరికిన దానితో తృప్తి పడుట. ప్రపంచము నందు అసంఖ్యాకమైన వస్తువులు గలవు. ఇవన్నియును అందరికినీ దొరకవు. దొరకజాలవు. ఈ కారణమున ప్రతివ్యక్తికి ఏదో వస్తువు యొక్క కొరత కనుపడుచుండును. తనకు దొరకని వస్తువును గురించి విచారించుట ప్రారంభించినయెడల మనుజుడు తన సంతుష్టి భావనను కోల్పోవును. అసంతృప్తికి గురియగును. అదిచింతా మగ్నతకు దారి తీయును. చింతచేత దుఃఖము ప్రాప్తమగును. ఈ విధముగా అనావశ్యకమైన దుఃఖమును అనుభవించుటకంటే దొరికిన దానితో తృప్తి పడుటయే మేలు. ఒక సుభాషితకారుని ప్రకారము "మనసిచ పరితుష్టే కోఽర్థవాన్ కో దరిద్రః" అనగా మనస్సునందున సంతోష ప్రవృత్తిని దాల్చిన వాడు బహిరంగము నందున ధనికుడై యున్నను, దరిద్రుడై యున్నను యెట్టి వ్యత్యాసము కనబడదు. ఈ విధముగా సంతుష్ట భావన సర్వోత్కృష్టమైన భావన యగుచున్నది. అందుచేత దీనిని పొందుటయే మానసిక శీలమని గ్రహించవలెను.

50. 'నిత్యం పరమేశ్వర నామరూపయోః స్మరణమ్' అనగా ప్రతి దినము శివుని నామరూపములను స్మరించుట. మనస్సు నందు జరిగెడి శివస్మరణ చేత మనస్సు యొక్క పవిత్రత పెరిగిపోవును. అందుకే ఈ శివస్మరణను మానసిక శీలముగా పరిగణింతురు. సర్వదా ఏదో ఒక వస్తువు గురించి స్మరించుట మనస్సు యొక్క స్వభావము. అయితే నానావిధ వస్తువుల స్మరణచేత మనస్సు అశుద్ధమగును. తద్వారా దుఃఖాఃలు కలుగును. శివుడు శాంతుడు, సుఖరూపుడు, అయివుండుటచేత అతని స్మరణచేత సుఖశాంతులు లభ్యమగును. ఈ కారణముననే శివాగమములు సదా శివస్మరణను మానసిక శీలముగా పరిగణించినవి.

51. 'శంభోర్నామ గుణాదీనాం అనవరతం చింతనమ్' అనగా శివుని నామరూపాదులను సదాచింతించు. ఇదియును ఒక మానసిక శీలమే. అంతఃకరణ చతుష్టయములో చిత్తమొకటై యున్నది. చిత్తమునందున యెల్లపుడు ఏదో ఒక విషయము నిలిచి యుండును. ఆ విధముగా దాల్చుట చిత్తము యొక్క స్వభావమై యున్నది. ఇంతటి చింతనా ప్రవృత్తి కలిగిన చిత్తమునకు పరమాత్ముని నామగుణముల చింతనను అలవరచుట శుభప్రదము కాగలదు. తత్ఫలితముగా చిత్తము పరిశుద్ధమై విరాజిల్లును. అది సాంసారికి విషయముల గురించి చింతించదు. సదా శివచింతన యందు వుండుటకు అనురక్తిని గలిగియుండును. ఒకవేళ చిత్తమునకు సాంసారికి విషయములందు అనురక్తి కలిగిన యెడల అది చేసెడు చింతన చింతయనబడుచున్నది. అదే చింతన ఆధ్యాత్మిక విషయముల గురించి యున్న యెడల నయ్యది తత్త్వచింతన యనబడుచున్నది.

చింత చితి వంటిదే. చితాగ్ని నిర్జీవదేహమును దహించిన యెడల చింత సజీవ దేహమును దహించును. ఈ కారణము వలననే శివాగమములు చింతకు బదులుగా చింతన చేయమని ప్రభోదించుచున్నవి.

52. 'సదా శంభోః పాద సంవాహన భావనమ్' అనగా సదా శివుని పాదసేవను చేసెడి భావనను దాల్చుట. నవ విధ భక్తుల యందునపాదసేవ ఒక భక్తియై యున్నది. శివుడు నిర్గుణ, నిరాకారి యగుటచేత ప్రత్యక్షముగా అతని పాదసేవ జరుపుట సంభవించదు. భావనాత్మకముగా శివుని పాదములను సేవించవలెననెడిదే తెలుసుకొనలసిన విషయము. భావనాత్మకముగా చేయబడిన కార్యములన్నియును ఉత్కృష్టముగా పరిగణింపబడుచున్నవి. అందుచేత తమ మనస్సు యందున లేదా ఇంటియందున శివుడు విశ్రాంతిగైకొనుచున్నాడని భావించుకొని అతని పాద సేవకు వుద్యమించుట భావశుద్ధికి కారణభూతమగుచున్నది. ఇట్టి భావనాత్మక పాద సేవయే మానసికమైన శీలముగా పరిగణింపబడినది.

53. 'శంభోరావాహనాదినా మానసిక మర్చనమ్' అనగా మనోమయ సామాగ్రిచేత మానసికముగా శివుని అర్చించుట. శరీరము, వాణి, మరియు మనస్సులచేత శివార్చనను చేయవలెనని శాస్త్రములు చాటుచున్నవి. వీటియందున మానసికమైన అర్చన సర్వోత్కృష్టమైపది. శరీరము అత్యంత దుర్బలమైన దైనప్పుడు వాణి కుంఠితమైనప్పుడు ఈ రెంటికంటే మానసికార్చన ముఖ్యమైనదగుచున్నది. వృద్ధాప్య దశలో కాయము బలహీనమై, నాలుక దొరలక యుండెడి స్థితిలో మానసికార్చన అనివార్యమగుచున్నది. ఈ కారణము వలననే శివాచార్యులు మానసిక పూజలకు ప్రాశస్త్యమును ప్రతిపాదించిరి. శివ మానసిక పూజ యనెడిది బహుళ ప్రచారములోనున్న యంశము. ఎంతో మంది ఈ విషయమున స్తోత్రములను రచించిరి. అట్టి వారిలో స్మార్తాచార్యుడైన శంకరాచార్యులవారొకరు. త్రికరణముల యందు శారీరక పూజ కంటెను, వాచక పూజ శ్రేష్ఠమైనది. దాని కంటెను మానసిక పూజ ఉత్కృష్టమైనది. ఇది శాస్త్ర సమ్మతమైన విషయము. మనః శుద్ధి శుద్ధులన్నిటికీ మూలమైనదైనందున మానసిక పూజచేత మనస్సు శివమయమగుచున్నది. అందుకే శివాగమములు మానసిక శివార్చనారూపమైన శీలమును ప్రతిపాదించినవి.

54. 'నిత్యం శివస్య పాదాబ్జ యోర్మానసికః ప్రణామః' అనగా శివుని చరణములకు నిత్యము మానసికముగా వందనమాచరించుట. ప్రణామము యొక్క సమర్పణ ఒక ప్రతీకగా నున్నది. మనకంటెను శ్రేష్ఠమైన వారికి నమస్కారమును సమర్పించుట మన సంస్కృతియై యున్నది. ఈ కారణముననే గురువుకు, పెద్దలకు, తల్లిదండ్రులకు నమస్కరించెడి పరంపరానుగత ఆచారము కొనసాగుచూ వచ్చుచున్నది. జగత్తునకు మాతాపితరస్వరూపమైన శివుని పాదారవిందములకు మానసికముగా ప్రణామమును సమర్పించునదే సర్వోత్కృష్టమైన ప్రణామము. ఇంతటి మానసిక ప్రణామము మనస్సుకు చెందిన శీలమని తెలిసికొనవలెను.

55. 'శివస్య మానసికం కైంకర్యమ్' అనగా తనను శివుని కింకరుడని భావించుకొనుట. మానసిక సంబంధమైన దాస్య భావనయే మానసిక శీలమగుచున్నది. కింకర భావనను పెంపొందించుకున్నప్పుడు సంసారము యెడల వుండెడి అభిమానాదులు సహజముగనే దూరమగును. ఇంటి యందలి సేవకుడు ఇంటి యజమానికంటెనధికముగా పనిచేయుచున్నప్పటికినీ అందులో కలుగు లాభ నష్టములకు బాధ్యత వహించనటులనే, సాధకుడు తనను శివునికి దాసుడుగా భావించుకొని సంసారము మీదగల మమతను త్రుంచివేసికొనును. ఈ కారణమున సాంసారికపరమైన సంభవాసంభవములకు చలించక అలిప్తుడైయుండును. ఈ తెరగున మానసిక శివకైంకర్య భావన వీరశైవుని అభివృద్ధికి కారణముగా అగుటచేత ఇది మానసిక శీలమని పరిగణించబడినది.

56. 'శివే సంఖ్య భావనా' అనగా కళ్యాణకారి యైన శివునితో స్నేహభావమును పెంపొందించుకొనుట. దీనిని సఖ్యశీలమని కూడా అందురు. ఇదియును మానసిక శీలమే. జీవితమునందున ఒకజీవి మరొకజీవికి సఖుడుగా వర్తించెడిది గాంచుచున్నాము. వీరిరువురి మధ్యన పరస్పర అనురాగభావన నిలిచియుండును. అయితే ఈ జీవుల సఖ్యత శాశ్వతమైనది కాదు. ఇది స్వార్థము మీద ఆధారపడి యుండిన యెడల ఒకానొక దినమున కలహము తలయెత్తి మిత్రభావము శత్రుభావముగా పరిణమించెడి అవకాశము కలదు. ఇట్టి దృష్టాంతములెన్నియో కానవచ్చుచున్నవి. అయితే శివుడు నిస్వార్థియు, పరమ కళ్యాణ కారియు అయివుండుట చేత అతనితో సఖ్యతాభావనను దాల్చుకొనునదే శ్రేష్ఠమైనదిగా పరిగణించి శివాగమ శాస్త్రము దీనినొక శీలముగా నెంచినది. వాస్తవముగా ఒక జీవి యొక్క పరమ సఖుడు పరమాత్మే. అందు చేత వీరశైవ సాధకుడు శివునితో మానసిక సఖ్యతా భావనను దాల్చి యుండవలయుననెడిదే గ్రహించవలసిన విషయము. కుబేరుడు శివుని యెడల సఖ్యతా భావమును వహించి సేవించుచున్నాడనెడిది పురాణములలో చెప్పబడిన విషయము.

57. 'బంధమోక్షచింతయాః శివసమర్పణ రూపా ఆత్మార్పణా'' అనగా బంధము, మరియు మోక్షముల భారమంతయునుశివునికే సమర్పించుట ఆత్మార్పణ యగును. దీనికి ఆత్మార్పణ శీలమను పేరుగలదు. ఇది ఒక మానసిక శీలమే, తనను బంధముల యందు వుంచడమా? లేదాముక్తుడను

చేయడమా? యనెడిది జీవుడాలోచించెడి విషయము కాదు. వాటి గురించి నీవే ఆలోచించి నీ ఇచ్ఛ ఎటులనో అటులనే చేయమనెడి భావనతో శివునికి శరణాగతుడగుటయే ఆత్మార్పణ శీలము. ఈ శీలమును పాలించెడి వీరశైవుడు చింతనుండి విముక్తుడై యుండును.

58. 'మూలమంత్రస్య సదా మానసికో జపః" అనగా మూల పంచాక్షరీ మహామంత్రమును ఎల్లప్పుడు మానసికముగా జపించుట. పంచాక్షరీ మంత్రము యొక్క మానసిక జపము మానసిక శీలమై యున్నది. 'జపతోనాస్తి పాతకమ్' అని చెప్పబడినది. పంచాక్షరీ మంత్ర జపము చేత సర్వపాతకములు దూరమగును. వీరశైవుడు అత్యంతపరిశుద్ధుడగును. ఈ జపములలో మానసిక జపమే ముఖ్యమైనదని ఇంతకు ముందే తెలిసికొంటిమి. మానసిక జపమును ఎల్లవేళలా చేయవచ్చును. గృహ, క్షేత్ర, వ్యాపార, వాణిజ్య యిత్యాది వ్యవహారములు చేయుచూ మానసిక జపమును చేయుటకు సాధ్యమగును. అందుచేత శివాగమముల యందు మానసిక శుద్ధికి కారణమయ్యెడి పంచాక్షరీ మంత్ర మానసిక జపము మనసుకు సంబంధించిన శీలముగా పరిగణింపబడినది.

59.'శివస్య దివ్యరూపాను సంధాన రూపమ్ ధ్యానమ్' అనగా శివుని దివ్య స్వరూపమును అనుసంధానము చేయునదే ధ్యానమనెడి మానసిక శీలము 'జపకోటి సమంధ్యానమ్' అని చెప్పబడినది. కోట్ల జపము కంటెను ధ్యానమే ఉత్కృష్టమైనది. మనస్సనెడిది ఒక పిశాచము. దానికి ఎప్పుడు ఏదో ఒక పని కావలెను. ఏ పని లేని యెడల అనావశ్యకమైన వ్యర్థ చింతనలో మునిగి తేలుచుండును. సాంసారిక వ్యవహారముల నుండి విడుదల పొందిన పిదప మనస్సుకు విశ్రాంతి నివ్వక దానిని శివధ్యానము నందు వినియోగించవలెను. అప్పుడే వ్యక్తి యొక్క ఆధ్యాత్మిక వికాసము సాధ్యమగును. ఈ కారణముననే శివధ్యానమును శివాగమములు నొక మానసిక శీలముగా గణించినవి.

60. 'తైలధారావత్ అవిచ్ఛిన్నం శివమూర్తేర్మనసి ధారణం' అనగా తైలధారవలె యెడతెగకుండా శివుని మననము చేయునదే ధారణ. ఇదియును మానసిక శీలమే. ఏ శివస్వరూపమును మనస్సు నందున ధ్యానము చేయుచుందుమో ఆ శివస్వరూపము మనస్సు నందున స్థిరపడినప్పుడు అదే ధారణావస్థయగును. ధ్యానము యొక్క పరిపక్వావస్థయే ధారణ. తైలధారను మనము పైనుండి విడిచినపుడు అది మధ్యలో ఎక్కడయినా భిన్నము కాక అఖండముగా క్రిందకు జారును. అటులనే శివధ్యానమును చేయునపుడు చిత్తము నందున ఇతర ఏ చింతననూ రానివ్వక నిరంతరము శివుడినే చిత్తమున ధరించుట ఈ శీలము యొక్క పరమార్థము. దీని వలన మనస్సు శుద్ధమగుటచేత ఇది మానసిక శీలముగా పరిగణించబడినది.

61. 'నివాత దీపవత్ ధ్యానే చేతసః స్థితి రూపాసమాధిః' అనగా గాలిలేని ప్రదేశమున నుండెడి దీపము వలె ధ్యానము నందు మనస్సును సుస్థిరము చేయుటయే సమాధి. ధారణకు పిదప వచ్చెడి స్థితియే సమాధి స్థితి. గాలిలేని చోట జ్యోతి అఖండముగాఊర్ధ్వముఖమై ప్రజ్వరిల్లుచుండును. మనస్సున ఇతర విచారముల తాకిడి తగలకుండా మనోవృత్తిని శివునితో సమరస భావమున నుంచునదే ఈ అవస్థ. దీనిని సమాధి శీలమని కూడా అందురు.

62. 'శివస్యసోహమ్ ధ్యానాను సంధానమ్' అనగా శివుని స్వరూపమును అనుసంధానము చేసికొనుట. ఇదియును ఒక మానసిక శీలమే. శివుడిని తనకంటే భిన్నమని భావించి అనుసంధానము చేయుట కంటె తాను పరమాత్మ స్వరూపముగా అనుసంధానము చేయునదే శ్రేష్ఠమైన విషయము. దీని చేత జీవునికి శివ సాయుజ్యము ప్రాప్తమగును. శివాగమములు దీనిని 'సోహమ్' అనుసంధాన రూపమైన శీలముగా పరిగణించినవి.

63. 'మహేశ్వరస్య అపరిచ్ఛిన్న స్వరూపాను సంధానమ్' అనగా శివుని పరిపూర్ణ స్వరూపమును అనుసంధానము చేసికొనుట. శివుడు సర్వదేశ, సర్వకాల, సర్వ వస్తువుల యందు వుండుటచేత యితడు దేశ, కాల, వస్తు పరిచ్ఛేద రహితుడై యున్నాడు. ఇంతటి అపరిచ్ఛిన్న స్వరూపాను సంధానము చేయునపుడు వీర శైవుడు మనస్సులో ఎల్లపుడూ శివుని అస్తిత్వమును అనుభవించు స్థితిని బడయును. ఇంతటి స్థితి చేత సర్వ విధమైన సంకుచిత భావనలు దూరమై విశాల మనోభావన గలుగును. ఈ రీతిగా విశాలమైనమనోభావ దాల్చుటయే మానసిక శీలమై యున్నది.

64. 'అనంతరూపస్య దేవస్య నిజరూపతో భావనమ్' అనగా అనంతరూపుడైన శివుని నిజరూపము చేత భావించుట. ఇది మనస్సు యొక్క చివరి శీలము. శివుడు అనంత స్వరూపుడు. పృథివ్యాది పంచమహాభూతములు మొదలగునవి శివస్వరూపములే అయివున్నవి. ఈ విధముగా శివుని జగన్మయ రూపముగా తలచుటయే మనస్సు యొక్క సర్వోత్కృష్టమైన స్థితి యగును. అందుకే శాస్త్ర కారులు యత్ర యత్ర మనోయాతి

తత్ర తత్ర బ్రహ్మ దర్శనమ్' అని వుపదేశించి శివమయమైన మనసున్న వారికి సర్వతా శివ దర్శనమగునని తెలియజేసిరి. బసవన్న వారు కూడా 'ఎటఎట చూచిననూ నట నట నీవేదేవా!' అని తమ వచనము నందున స్పష్టపరిచిరి.

ఈ విధముగా గణాచారమునందు ముప్పదియైదు శీలములు ప్రతిపాదించబడినవి.

పంచాచారముల యందున నాల్గవది యగు గణాచారమున వాణికి సంబంధించిన ఏడు శీలములు, పాణికి సంబంధించిన అయిదు శీలములు, పాదముకు చెందిన నాల్గు శీలములు, త్వక్కుకు చెందిన రెండు శీలములు, చక్షువుకు సంబంధించిన రెండు శీలములు, జిహ్వాకు సంబంధించిన ఒక్క శీలము, ఘ్రాణమునకు సంబంధించిన ఒక్క శీలము, శ్రోతముకు సంబంధించిన రెండు శీలములు, కాయశుద్ధికి సంబంధించిన అయిదు శీలములు మనస్సుకు సంబంధించిన ముప్పదియైదు శీలములు, వెరశి అరువాది నాలుగు శీలములు గలవని తెలిసికొంటిమి. ఈ శీలములను నిష్ఠతో పరిపాలించిన యెడలవీరశైవునికి శివదృష్టి ప్రాప్తమై సర్వత్రా శివస్వరూపమే కన్నట్టునని తెలిసికొనగలరు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 6-08-1992

స్థలం : **భికుబాయి మేనకుదళె**

**మంగళ కార్యాలయము, పూనే**

## విశేష ప్రదీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు ఆగమ ప్రోక్తమైన శీలసంపాదన విధి విధానము నెంతో వివరముగాతెలియజేసిరి.

ప్రాచీన కాలమున వీరశైవులెల్లరు చతుష్షష్టి శీల సంపన్నులై యుండిరని తెలియుచున్నది. పండితారాధ్య చరిత్ర అవతారికలో సోమనాథుడు తాను శీలాన్వితుండనని చెప్పికొనినాడు. చతుర్వేద సారములో శీల లక్షణములను వివరించిరి.

చతుష్షష్ఠి శీలములను స్థూలముగా మూడు భాగములుగా విభజించవచ్చును. అవి కాయిక, వాచిక మరియు మానసిక శీలములు. కాయిక శీలములు యిరవై రెండు కాగా, వాచిక శీలములు ఏడుగా చెప్పబడినది. మిగిలిన 35 మానసిక శీలములు.

కాయిక శీలములలో నైదు కాయశోధనకు సంబంధించినవి. ఇష్టలింగధారణ, రుద్రాక్ష ధారణ, భస్మస్నానము, భస్మ ధారణ, త్రిలింగ ప్రసాద సేవన, యింద్రియ నిగ్రహము, భవి విసర్జనల వలన శారీరక శుద్ధిని సాధించవలయునని గుర్తించగలరు.

కర్మేంద్రియములైన పాణిపాదముల పరిశుద్ధిని సాధించుటకై యుద్దేశింపబడిన శీలములు పాణిపాదముల కర్మలకు గురు లింగ-జంగమోపాసనోన్ముఖతను కల్పించెడివిగా నున్నవి. పూజాసామగ్రిని సంగ్రహించుట, గురు జంగముల సన్నిధికేగుట, ఆసన గ్రహణ, జపమాల ధారణ, గురు-లింగ-జంగమార్చనలు ఇత్యాదులీ శీలములలో గాంచగలము.

జ్ఞానేంద్రియముల పవిత్రతను సాధించుటకై కొన్ని శీలము లివ్వబడినవి. అవి: నిరంతరముగా నిష్టలింగమును ధరించుట, లింగస్పర్శానుభవము, లింగ నిరీక్షణ యోగము, నిర్మాల్యములను వాసన చూచుట, త్రిలింగ ప్రసాదము సేవించుట, త్రిలింగముల మరియు శివభక్తుల భజనను వినుట మొదలగునవి.

వాగింద్రియము యొక్క పవిత్రతకై వాక్కుకు శివోపాసనోన్ముఖతను కల్పించుటే వాచిక శీలముల యుద్దేశము. శివస్తుతి, శివ భక్తుల స్తుతి, వేదాగమాదుల యధ్యయనము, సత్యవాక్పరిపాలన, ఆత్మస్తుతి విసర్జన, పరనిందను చేయకుండుట, భవి జనుల మరియు అన్య దైవముల స్తుతిని చేయకుండుట యనెడివే వాక్కుకు సంబంధించిన శీలములు.

మానసిక శీలములు మనస్సు యొక్క చంచలత్వమును నియంత్రించుట కుద్దేశింపబడినవి. విషయ సుఖాభిలాషను త్యజించుట, అరిషడ్వర్గముపై నియంత్రణ, త్రిలింగముల యెడ నమ్మక విశ్వాసములు గల్గియుండుట, అహింసాది సద్గుణములు పెంపొందించికొనుట, త్రిలింగముల ధ్యానము, నవ విధ భక్తి భావములు గల్గియుండుట, స్వానుభవమును శివార్పణము చేయుట మొదలగునవి మానసిక శుద్ధిని సాధించునని తెలుపబడినది.

చతుఃషష్టి శీలములన్నియును షడ్విధభక్తులను పెంపొందించుటకుద్దేశింపబడినవి. శీల సంపాదన వలన ప్రాథమికముగా త్రిలింగముల యెడల శ్రద్ధాభక్తి గల్గును. శీలాన్విత బుద్ధి పటుతరమయ్యెడి స్థితిలో శ్రద్ధాభక్తి నిష్ఠాభక్తిగా పరిణమించును. ఈ రెంటిలోను కాయిక శీలములు ప్రధానమైన భూమికను పోషించును. వాచిక శీలముల వలన అవధానుభవములు సంప్రాప్తమై ఆనంద భక్తికి మార్గము సుగమమగును. మానసిక శీలముల సహాయముతో సాధకుడు సమరస భక్తిని సాధించగల్గును. ఈ కారణముల దృష్ట్యా చతుఃషష్టి శీలములు ప్రత్యేకమైన ప్రాముఖ్యతను సంతరించికొనినవి.

గురు జంగముల మార్గనిర్దేశకత్వములో శీల సంపాదన చేయుట శ్రేయస్కరము కాగలదు. స్వతంత్ర ధోరణి నవలంబించిన వారికి సంప్రాప్తమయ్యెడిది స్వల్పమే యని గ్రహించగలరు.

*- శివం భూయాత్ -*

## ఆశీర్వచనము:7

## దీక్షాగురుస్థలము

ఇంతవరకు గణాచారము గురించియును, వాటిలో నంతర్గతముగా గల అరువది నాలుగు శీలముల గురించియును తెలిసి కొంటిమి. ఆ పిదప ప్రతిపాదింపబడిన యాచారమే భృత్యాచారము. శివుడు నా యజమాని, నేనతని సేవకుడననెడి భృత్య భావమును గల్గియుండుటయే భృత్యాచారము. ఈ విషయమున, చంద్రజ్ఞానాగమము నీ క్రింది విధముగా తెలిపినది.

**శ్లో॥ శివభక్తజనాః సర్వే వరిష్ఠాః పృథివీ తలే।**
**తేషాం భృత్యో2హమితి యద్ భృత్యాచార ఇతిస్మృతః॥** (చంద్ర జ్ఞా.ఆ.క్రి.పా. 9-9)

ఈ జగత్తు నందు శివుడు మరియు శివభక్తులే శ్రేష్ఠులు. నేను వారి సేవకుడననెడి భావనయే భృత్యాచారము. సాధకుడైన శివభక్తుడు, తన యింటికి గురు-జంగములను పిలిపించికొని వారి పూజాదులను సేసి వారి ప్రసాద పళ్ళెరమున పక్వాన్నములను "ఎడ"చేసి, నేను మీ భృత్యుడను, ప్రసాదమును దయచేసి స్వీకరించుడి యని వినతిని చేసి, గురుజంగముల కెదురుగ సాష్టాంగ ప్రణామముల చేసెడి పరంపర యిప్పటికినీ వీరశైవుల యిళ్లలో కలదు. ఇది యొక భృత్యాచార సంకేతము.

భృత్యాచారమాచరించుటచే వీరశైవులలో యహంకార భావన అడుగంటును. అతని యంతఃకరణ పవిత్రమైనదగును. అహంకారము చేత నెందరో పతనమగుటను గాంచగలము. ఇట్టి యహంకారమును నిర్మూలము చేయుటయే భృత్యాచారము యొక్క లక్ష్యము. "ఈశా వాస్యమిదం సర్వమ్' అనెడి యుపనిషద్ వ్యాక్యము ప్రకారము సర్వము, సమస్తమూ నా పరమాత్మయే. అయితే కొందరు ప్రపంచములోని కొన్ని వస్తువులను లేదా కొందరు వ్యక్తులను తన వశములో నుంచుకొని వాటికి లేదా వారికి స్వంత దారుననెడి భావన దాల్చుటను సర్వసామాన్యముగా గాంచుచున్నాము. కొందరు చక్రవర్తులు తమ బాహుబలము చేత రాజ్యము యొక్క సీమను విస్తరించికొని దేశమంతటికిని యేక ఛత్రాధిపతియై "యిదంతయూనాదే, దీనికి నేనొక్కడనే స్వామిని "యనెడి భావనను పొందినా చివరికి నంత్యకాలమున యీ భావన వ్యర్థమైన దని తెలిసికొనిరి. ప్రపంచ విజేతలమని విర్రవీగిన వారును చివరన జ్ఞానోదయమున పొంది, తాము రిక్త హస్తములతో వచ్చితిమి, రిక్త హస్తములతో పోయెదమని గ్రహించిరి. తాము తమ వని భావించిన వన్నియును నన్యాక్రాంత మగునని గ్రహించిరి. "బత్తెలగా వచ్చితివి, బత్తెలగా పోయెదవు; వస్త్రభూషణములు కొంత కాలము వరకే "యనెడి వైరాగ్య మూర్తులమాటలను గ్రహించుము. సంపద యెడల, వ్యక్తుల యెడల వృథా యభిమానమును పెంచికొని బాధపడెడి వారెందరో గలరు. వీరందరు ఆగమోక్త విధిన భృత్యాచార భావము నలవరచుకొన్న యెడల, ధన్యులు కాగలరు.

"నా కడ నుండినదంతయూ నాది కాదు. అంతయు నీశ్వరునిదే. నేను మాత్ర మతని సేవకుడను" అనెడి భావనతో భక్తిని చేసెడి వారికి భగవంతుడు భృత్యుడై సేవించునని తెలియుచున్నది.

సేవాభావము నలవరచుకొనలేని వారెందరో తాము యజమానుల మనెడి భ్రాంతికి లోనై యీ ప్రపంచమునందున పలు సందర్భముల యందున నవమానమునకు గురియగుటను గాంచగలము. ఈ విషయమును విశద పరచెడి కథయొకటి గలదు.

ఒక తపస్వి ఒకానొక శ్రీమంతుని ఇంటి ముందు నిలిచి భవతి భిక్షాందేహి! యని భిక్షకై వేడుకొనెను. శ్రీమంతుడు బహు కోపస్వభావి. అతనికి సాధువులన్ననూ, భిక్షకులన్ననూ అపరిమితమైన కోపము. ఈ బిచ్చగాళ్ళు సోమరులై కేవలము బిచ్చమెత్తియే జీవితము వెళ్లబుచ్చవలెనన్న కోరిక గలవారని అతని భావన. అందులకే ఎవరైనను భిక్షకొరకై వచ్చినచో వారిని అవమాన పరచి పంపెడి వాడు. అయితే యిపుడు ఆయన యింటిముందు నిలిచినది సామాన్య బిచ్చగాడు కాదు. ఒక సిద్ధపురుషుడు. శ్రీమంతుడు అతనిని సామాన్య బిచ్చగాడుగా నెంచి ఓరీ బికారీ! నీవెచట నుండి వచ్చితివి? ఇచట నీకేమియు దొరకదు. వెళ్ళి పొమ్మని కోపావేశముతో నుడివెను. కాని ఆ తపస్వి, నీ వద్ద ఏదో నొకటి తీసికొనియే వెళ్ళెదను. వట్టి చేతులతో కదలనని పట్టుబట్టెను. నీవు నాకు భిక్ష వేయనిచో నీ పుణ్య సంపదను తీసుకొని పోయెదనని హెచ్చరించెను. అందుకు శ్రీమంతుడు కోపోద్రేకముతో తన సేవకులతో తపస్విని తిట్టించి కొట్టించి బయటకు నెట్టివేసెను. అవమాన పడిన తపస్వి తన ఆశ్రమమునకు పోయి ఐహిక సంపదపై అభిమానముతో ధర్మచ్యుతుడైన శ్రీమంతునికి ఏ విధముగా నైననూ బుద్ధి గరపవలెనన్న నిశ్చయముతో తన యోగసామర్థ్యమున శ్రీమంతుని రూపమును ధరించెను. శ్రీమంతుడు మరొక పనిమీద పొరుగూరికి పోయిన సమయమును చూసి అతని యింటిలో ప్రవేశించెను. కుటుంబ సభ్యులను, మరియు సేవకులను పిలిచి ఈ విధముగా హెచ్చరించెను. మన వూరిలో ఒక బహురూపి (వేషగాడు) ప్రవేశించి ఇంటి యజమాని వేషముతో పలు గృహములలో ప్రవేశించి ఇంటిలోని సొత్తునంతయు దొంగిలించుచుండెనట. అతడు మన యింటికి కూడా రావచ్చును. కావున మీరందరూ జాగరూకులై యుండుడని హెచ్చరించెను. తరువాత కొలది గంటలలో శ్రీమంతుడు వూరి నుండి వెనుదిరిగి వచ్చి తన యింటిలో ప్రవేశింపబోయెను. సేవకులు, మరియు కుటుంబ సభ్యులు శ్రీమంతుడు చెప్పినది నమ్మిక మంచివాడివే! మా యజమాని వేషము వేసికొని వచ్చి మమ్ములనే మాయజేతువా! పోయి రమ్మని కటువుగా పలికిరి. ఈ విధముగా అందరిచేత తిరస్కరించబడిన శ్రీమంతుడు మరొక మార్గము లేక న్యాయాలయమునకు వెళ్ళి న్యాయాధీశుని శరణువేడెను. ఇరువురూ ఒకే రూపమున నున్నందున న్యాయాధీశునికి వీరిలో ఎవరు షావుకారో, ఎవరు వేషధారియో? తెలిసికొనుట కష్టమయ్యెను. ఆ పరిస్థితిలో షావుకారు వేషములోనున్న యోగి న్యాయాధీశునితో ఇట్లనెను. అయ్యా! మా యిరువురిలో నిజమైన షావుకారు ఎవరో తెలిసికొనుటకు ఒక వుపాయము చెప్పెదను. మేమిరువురము యింటిలోని వస్తువులు, నగలు మొదలైన వాటి జాబితాను తయారు చేసెదము. ఎవరు వ్రాసిన జాబితా యథాతథముగా నుండునో వారే షావుకారు. అని చెప్పెను. న్యాయాధీశునికి ఇది బహు సబబుగా దోచినది. షావుకారు వేషములోనున్న తపస్వి తన యోగశక్తితో ఇంటిలోని వస్తువుల జాబితాను యదాతథముగా తయారు చేసెను. అసలు షావుకారు తనకు జరిగిన అవమాన భారమును తలచుకొనుచూ తయారు చేసిన జాబితా తప్పుల తడకగా తయారయ్యెను. రెండు జాబితాలను పరిశీలించిన న్యాయాధికారి మారువేషములో నున్న యోగి తయారు చేసిన జాబితానే సరైనదని నిర్ణయించి అతనినే నిజమైన షావుకారుగా గుర్తించెను. షావుకారు తన కుటుంబ సభ్యులు, సేవకులు తనను గుర్తించలేక పోయినందుకు వగచుచూ, ఈ ప్రపంచములో అందరూ స్వార్థపరులే. ఎవరికి ఎవరు? అను భావనకు వచ్చినవాడై చేయునది లేక ఆ శివుడే నాకు దిక్కని యెంచి ఒక పాడుబడ్డ శివాలయములో మూడు దినములు ఆహారము లేక కేవలము నీరు త్రాగి గడిపెను. షావుకారు వేషములోనున్న యోగి తన యోగదృష్టితో షావుకారులో వచ్చిన మార్పును గమనించి అతనికి సంసారముపై రోత పుట్టినదని తెలిసికొనిన వాడై తననిజరూపమున షావుకారుకు దర్శన మిచ్చెను. యోగిని చూచిన షావుకారు సిగ్గుతో తలవంచుకొనెను. యోగి షావుకారుతో ఏమండీ! మీరు యిల్లు, వాకిలి, సంపద మరియు కుటుంబమును వదలి ఈ పాడుబడ్డ దేవాలయములో ఏమిచేయుచుంటిరి? అని యెగతాళిగా నడిగెను. అందులకు షావుకారు యోగివర్యా! సంసారమున అందరూ స్వార్థపరులే. నా వారనుకున్న నా భార్యా బిడ్డలే నన్ను బయటికి గెంటివేసినారు. ఇల్లు సంసారమును గురించిన మాటయే నాతో మాట్లాడవలదు. అని దీనముగా పలికెను. షావుకారుకు వచ్చిన విరక్తి భావమును గమనించిన యోగిపుంగవుడు అతని పరిస్థితికి జాలిపడి అతనిలో వచ్చిన మార్పుకు సంతోషించి షావుకారుతో అయ్యా! నేను భిక్షకై వచ్చినపుడు నీవు ధన మదముతో ధర్మచ్యుతుడవై నన్నవమాన పరచితివి. కావున నీకు తగిన గుణపాఠము నేర్పవలెనన్న ఉద్దేశ్యముతో నేనే నీ వేషములో నీయింట ప్రవేశించి నీ వారితో నిన్ను దూషింపజేసి బయటికి గెంటించితిని. నీలో వచ్చిన ఈ పశ్చాత్తాప భావన నాకు సంతోషమును గలుగజేసినది. నీవు నీ యింటిలో ప్రవేశించి నీ భార్యాబిడ్డలతోనూ, సేవకులతోనూ, తరగని నీసంపదతోనూ హాయిగా కాలము వెళ్లబుచ్చుమని దీవించి అతనిని తన యింటికి కొనిపోయెను. షావుకారు తన తప్పును తెలిసికొని తన సంపదనంతయూ పరమేశ్వరుని ప్రసాదముగా భావించి అతిథిఅభ్యాగతులను సేవించుచూ శేష జీవితమును గడిపెను.

ఈ తెరగున మనకు సంప్రాప్తమైన వస్తువులెల్ల మనవిగావనియును అవి భగవంతునివి అనియును సమస్త జగత్తుకు భగవంతుడే యజమానుడనియును తాను మాత్రము అతని సేవకుడననియునూ ఎవరి మనస్సున వచ్చునో అతడు భృత్యాచారి యని అనిపించుకొనును. భృత్యాచార పాలన చేసెడివాడు ఎల్లపుడూ సుఖుడై యందును. బాధ్యత పెరిగినప్పుడు మనస్సు మీద వత్తిడి తెచ్చి మామూలు మనిషి నిజమైన

సుఖమునకు దూరమగును. యజమాని స్థానములో నున్న వాడు ఆ విధిన దుఃఖితుడై యుండగా సేవక స్థానములో నున్నవాడు యజమాని తనకిచ్చిన పనిని జేసి హాయిగ నిదురించును. యజమానిని అనుకొనెడివాడికి యిట్టి సుఖమయమైన నిద్రరాదు. చింతలచేత మనసులో గందరగోళ భావమేర్పడి అతడు నిద్రకు దూరమయ్యెడు అవకాశము కలదు. ఈ కారణము వలన నిజమైన సుఖమును కోరెడువాడు శివునిపై భారము వేసి శుభాశుభములకు అతడే బాధ్యుడని మనమున దలచి తాను శివుని సేవకుడనను భావమున కార్యములు తలపెట్టి చేయుచుండిన యెడల అతనికి నిజమైన సుఖము ప్రాప్తించును. ఈ విషయమున సంశయమునకు ఆస్కారము లేదు. పూజ్యపాదులు యిచ్చిన ఈ క్రింది ఉపదేశము గమనార్హమైయున్నది.

**శ్లో॥ శివయోగీ శివః సాక్షాదితి కైంకర్యభక్తితః ।**
**పూజయేదాదరేణ్యై యథా లింగం, యథా గురుః** (సి.శి. 9-67)

గురువు మరియు లింగముల యెడల భృత్యభావనను దాల్చిన యటులనే శివయోగులు అనగా జంగమయ్యల యెడల భృత్యభావనను దాల్చవలయునని పై శ్లోకము భావము. వీరశైవుడు తాను గురు, లింగ, జంగములకు సేవకుడనని భావించుకొని గురువుకు తనువును, లింగమునకు మనస్సును, జంగమునకు ధనమును సమర్పించి వాటి మీద తనకు గల అభిమానమును దూరము చేసికొనవలెను. ఈ విధముగా చేసిన యెడల తను, మన, ధనములయెడల మమకారమనెడి భావన వైదొలగును. సంపూర్ణముగా మమత్వమును వదలుటయే వీరభృత్యభావనయనిపించుకొని శివుని యొక్క అనుగ్రహమునకు పాత్రుడు కాగలడు. ఈ విషయమునే చంద్రజ్ఞానాగమము ఈ క్రింది విధముగా తెలియజేసినది.

**శ్లో॥ దేశికాయ తనుం చిత్తం శంభవేచ ధనం తథా।**
**జంగమాయ సమర్ప్యైవం మహోత్సాహ సమన్వితః॥**
**ముక్తి మేవ పరాం కాంక్షమాణం యదవతిష్ఠతే।**
**తన్మతం వీరభృత్యత్వం శివానుగ్రహ సాధనమ్॥** (చ.జ్ఞా.క్రియాపద 9/125-126)

గురులింగ జంగములకు క్రమముగా తను, మన, ధనములను సమర్పించి అత్యంత సంతుష్టచిత్తుడయిన వాడును, కేవలము ముక్తిని మాత్రమే అపేక్షించువాడును అగు భక్తుని వీరభృత్యుడని అందురు. వీరభృత్యుని మీద సహజముగానే శివుని యొక్క అనుగ్రహము ప్రసరింప బడి యుండును.

వీరశైవ సిద్ధాంతమునందున ప్రతిపాదించబడిన ఈ భృత్యాచారము వీరశైవునికి సాధనమై యున్నది. ఇంతకు ముందు వివరించబడిన లింగాచార, సదాచార, శివాచార మరియు గణాచారములను నిష్ఠాపూర్వకముగా పరిపాలన చేయుచున్నపుడు అకస్మాత్తుగా సాధకుని మనస్సున నా అంతటి ఆచారశీలురు కలరా? యనెడి భావన పొడసూపవచ్చును. ఈ భావనలోనే అహంకారమిమిడి వున్నది. అందుకే యిట్టి భావన రావలదని చివరకు భృత్యాచారము ఉపదేశించనైనది. ఈ భృత్యాచారము చేతనే సమాజము నందున సమత, మరియు శాంతులను ప్రతిష్ఠాపన చేయుటకు సాధ్యమగును. అన్యతః అందరూ అభిమానులు, అహంకారులు అయిన యెడల సుందోపసుందన్యాయమున సమాజములోన అశాంతి మరియు వినాశనము తాండవమగును. సర్వత్రా శాంతిని స్థాపించుటకై సమాజములోని సభ్యులెల్లరు భృత్యభావనను దాల్చుటయే శ్రేయస్కరమైన విషయము.

ఇంతవరకు ఉపదేశించబడిన ఈ పంచాచారములను ఎవరు నిష్ఠతో పరిపాలింతురో వారి జీవనము సుఖమయము అగును అనుటలో సందేహములేదు. ఆచార హీనుడైన మనుజుడు తత్వ జిజ్ఞాస కలిగిన వాడైనను సమాజము నందున అగౌరవమునకు పాత్రుడగుచున్నాడు అందుచేత జ్ఞానమునకు ఎంత ప్రాధాన్యత నిత్తుమో అంతే ప్రాముఖ్యతను ఆచారపాలనకు యివ్వవలెను. ఈ విధముగా యింతవరకు వుపదేశించబడిన పంచాచారములను శిష్యులకు బోధించి వారిని ఆచార శీలురుగా మార్చుట ఆచార్యుల యొక్క కర్తవ్యమై యున్నది. వారు ఆచారముల గురించి చెప్పుటయే కాదు. వాటినాచరించి చూపుటలో ఆసక్తిని కనబరచవలెను. తమకు తామే ఉదాహరణముగా నిలిచి శిష్యునికి ఆదర్శప్రాయుడు కావలెను. అప్పుడే ఆచార్య స్థానమున నున్నవాడు ఆచార్యుడుగా తగిన గౌరవము పొందగలడు.

**శ్లో॥ ఆచినోతి చ శాస్త్రార్థానాచారే స్థాపయత్యపి।**
**స్వయమాచరతే యస్మాదాచార్యస్తేన చోచ్యతే॥** (సి.శి. 15-9)

ఆచార్యుల యొక్క లక్షణములను నిరూపిస్తూ ఆచార్యులు ఆచారములను ఆచరించెడు వాడిగా నుండవలెనని భగవత్పాదుల వారు తెలియజెప్పిరి. అందుచేత వీరశైవ పరంపరనందున ఆచార శీలురును సమాజమునకు ఆచారమును నేర్పించెడి గురువులకు అనగా పట్టదేవరలకు మరియు జగద్గురువులకు క్రమముగా శివాచార్య మరియు మహాచార్య యనెడి పేర్లు కలవు. ఈ కారణము వలన వీరశైవులు శివాచార్యులవారు ఉపదేశించిన రీతిన ఆచార శీలురై జీవనమును సుఖమయము చేసికొనవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 7-08-1992

స్థలం : **భికుబాయి మేనకుదళె**

**మంగళ కార్యాలయము, పూనే**

## విశేష ప్రదీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు భృత్యాచారమునకు సంబంధించిన నిగూఢ రహస్యములను బోధించిరి.

వీరశైవమున భృత్యాచారమున కెంతో ప్రాముఖ్యత గలదు. శ్రీ రేణుక భగవత్పాదుల వారు భక్తిమార్గ క్రియాస్థలమున నవవిధ భక్తుల గురించి వివరించిరి. దాస భావముతో త్రిలింగోపాసన చేయవలెనని యుద్భోధించిరి. భక్తదైహిక స్థలమున భర్గునికి భక్తుని కభేదమును ప్రకటించిరి. వీరశైవమున భక్తియే కేంద్రాంశము. ఈ కారణముననే నవవిధభక్తుల ప్రస్తావన యివ్వబడినది.

శ్రీ బసవేశ్వరుల వారు సల్పినట్టి భృత్యాచారము లోక విఖ్యాతినార్జించినది. వీరి స్వానుభవము నుండి బహిర్గతమైన క్రింది వచనము పరికించ దగినది.

**భక్త నెంతెంబెనయ్యా**
**భవియ సంగ బిడ దన్నక్క?**
**మహేశ్వరనెంతెంబెనయ్యా**
**పరర్థపరస్త్రీ పరర్థదాసె బిడదన్నక్క?**
**ప్రసాదియెంతెంబెనయ్యా**
**ఆధివ్యాధి నష్టవాగదన్నక్క**
**ప్రాణిలింగెయెంతెంబెనయ్యా**
**ప్రాణస్వస్థిరవాగదన్నక్క?**
**శరణనెంతెంబెనయ్యా**
**పంచేంద్రియ నాశవాగదన్నక్క**
**ఐక్యనెంతెంబెనయ్యా**
**జననమరణ విరహితవాగదన్నక్క**
**ఇంతప్ప భాషె వ్రతవేషంగళ**
**నా నరియెనయ్యా**
**అఘటిత ఘటిత వర్తమానవ నానరియెనయ్య**
**నిమ్మ శరణర తొత్తు భృత్యాచార మాడువె**
**కూడల సంగమ దేవా!** (వసం. 509)

ఈ వచనపు తెలుగు రూపమును గనుడి:

**భక్తుడెట్లందునయ్యా**
**భవి సంగమును వీడని దనుక?**
**మహేశ్వరుడెట్లందునయ్యా**
**పరస్త్రీ పరర్థముల యాశ వీడని దనుక?**
**ప్రసాది యెట్లందునయ్యా**
**ఆధివ్యాది నష్టము కాని దనక?**
**ప్రాణలింగియెట్లందునయ్యా**
**ప్రాణము స్వస్థిరము కాని దనుక?**
**శరణుడెట్లందునయ్యా**
**పంచేంద్రియములు నాశనము కాని దనుక?**
**ఐక్యుడెట్లందునయ్యా**
**జనన మరణ విరహితము కాని దనుక?**
**ఇట్లయ్యెడి భాషా వ్రత వేషంబుల**
**నే నరయనయ్యా**
**అఘటిత ఘటిత వర్తమానమును నేనెరుగనయ్యా**
**మీదు శరణుల తొత్తు-భృత్యాచారము జేతు**
**కూడల సంగమ దేవా!**

శ్రీ బసవన్న నుడివినట్లు భృత్యా చారమే కీలకమైనది. భవిసాంగత్యరాహిత్యము, పరస్త్రీ, పరధన వ్యామోహరాహిత్యము, ఆధివ్యాధి రాహిత్యము, పంచేంద్రియముల నియంత్రణ, జనన-మరణ రాహిత్యము మొదలగునవెన్ని యున్ననూ భృత్యభావము లోపించిన యెడల సత్ఫలితము లభించదని తెలిసి కొనవలెను. ద్వైతభావాన్వితములగు భక్త, మహేశ ప్రసాది స్థలములలో భృత్యాచారమునకు గల ప్రాముఖ్యత అనన్య సామాన్యమైనదనియు గ్రహించగలరు.

భృత్యాచారమును భక్తిని యభిన్న భావములో పరికించవలెననెడి పాల్కురికి వారి వాక్కులో భృత్యాచారము యొక్క ప్రాముఖ్యత అంతర్నిహితముగా గోచరించుచున్నది. ఈ పద్యమును పరిశీలించుడి;

క. **భృత్యాచారమే భక్తియు**
**భృత్యాచారంబె ముక్తి పెంపును సొంపున్**
**భృత్యాచారము సరియే**
**నిత్యాహంకారఘోరనియమవ్రతముల్** (ప. 171)

నియమవ్రతము లేవియును భృత్యాచారమునకు సరిరావని తెలిపెడి పాల్కురికి వాక్కులు చిరస్మరణీయములై యున్నవి.

ప్రాకృతులు కృచ్ఛ చాంద్రాయనాది వ్రతముల నాచరింతురు. కామితార్థములను కోరెడి వారు వ్రతములను చేయుచుందురు. ప్రాకృతుల వలె శైవేతరవ్రతములైన సత్యనారాయణ వ్రతము, త్రిమూర్తుల వ్రతము, వరలక్ష్మీ వ్రతము మొదలగు వాటిని చేసెడి వారు కొందరైతే, వీటికి ప్రతిగా ప్రచారములో నున్న వరద శంకర వ్రతము, ఉమామహేశ్వర వ్రతము, కేదారేశ్వర వ్రతము, మంగళగౌరీ వ్రతము మొదలగు వాటిని చేసెడివారు మరి కొందరు. ఇట్టి వ్రతములను వీరశైవు లాచరించవలసిన పనిలేదు. వీరశైవము జీవితాంతము వరకు నాచరించవలసిన వీర వ్రతము. భృత్యాచారము వీరవ్రతములో యంతర్భాగమైనందున అనంతకోటి వ్రతములలో వీరవ్రతమునకు సరియయ్యెడి వ్రతమేదియును లేదు.

భృత్యభావమేర్పడుట కెదుటి వ్యక్తి మహిమాన్వితుడనెడి భావమేర్పడ వలసిన యావశ్యకత గలదు. ఆధ్యాత్మిక భావము గలవాని కెదుటి వాడు దైవస్వరూపుడని దోచినప్పుడే వాడు పూజ్యుడుగా గోచరించును. ఈ వాస్తవము నేపథ్యమున “శివభక్తజనాఃసర్వే వరిష్ఠాః పృథ్వీ తలే” యను ఆగమోక్తిని గ్రహించవలెను. భవి జనులు వరిష్ఠులు కాదనెడిది యంతర్నిహితముగా నుండెడి భావము. “శివే భక్తః. శివవన్మాన్యయేవసః

" అనెడి ఆచార్యోక్తి (11:54) ఆగమోక్తిని పోలియున్న దనెడిది గమనార్హమైన విషయము. ఈ బసవోక్తి లోను ఆగమోక్తి యెక్క ఛాయను గాంచగలము.

**నీవు హిరియరెంబిరి, కర్మిగళు, నీవు కేళిరె**
**నిమ్మ వేదశాస్త్రంగళు ఆరను హోగళుత్తిద్దావు**
**"ఓం ద్యావా భూమీ జనయన్ దేవఏకోదేవ"**
**ఎందు శృతి స్మృతిగళు సారుత్తలిద్దావు**
**"వర్ణానాం బ్రాహ్మణో గురుః" ఎంబుదు హుసి**
**"వర్ణానాం గురుః" నమ్మకూడల సంగన శరణురు.** (వచనము 599)

ఈ వచనము యొక్క తెలుగు రూపము :

**మీరు పెద్దల మంటిరి,**
**కర్ములు మీరు, వినుడి**
**మీ వేదశాస్త్రంబు లెవరిని పొగడుచున్నవి**
**"వర్ణానాంబ్రాహ్మణో గురుః" అనెడిది పుసి**
**"వర్ణానాం గురుః" మా కూడల సంగని శరణులు**
**"ఆవ కులవాదదేను? శివలింగవిద్దవనె**
**కులజ" ననెడి బసవోక్తి (వ.సం. 712)**

విషయము విస్పష్టము చేయుచున్నది. "ఏకులమైన నేమి? శివలింగమున్న వాడే కులజు"దనెడిదిబసవోక్తి లోని భావార్థము.
"శివభక్తోవరిష్ఠః" యనెడి చంద్రజ్ఞానాగమోక్తి వేదసమ్మతమైనట్టిదని తెలిపెడి చతుర్వేద సారములోని క్రింది పద్యము చూడదగినదై యున్నది.

**సీ॥ పూని ఋగ్వేదంబు దా "నయంమే భగ**
**వత్తరా" యని వాంఛ బొగడు**
**క్రియగొనగా యజుర్వేదమగ్నేశ్చప**
**రమ శుచి "యనమును ప్రణుతి సేయు**
**తలకొని సామవేదము "తేనసహసావ**
**సే"త్తని యవికలస్థితి నుతించు**
**బంబ యథర్వవేదంబున "సర్వపూ**
**తో భవతి" యని సంస్తుతులు సేయు**
**గాన భక్తుదగ్రగణ్యుదంత్యజుడైన**
**శ్రుతులు నమ్మరేని చూడుడనుచు**
**దగిలినాగమయ్య తనువున నమృతంబు**
**బరప నీకే చెల్లు బసవలింగ!** (ప.82)

ఆగోమోక్తిలోన యిమిడి యున్న తాత్విక రహస్యమును బసవ పురాణములో గాంచగలము. గమనించుడి:

**శ్లో॥ జనువేదచోదిత జాతులు రెండు**
**వినుము ప్రవర్తకంబును నివర్తకము**
**భవకర్మ సంస్కారి భువి ప్రవర్తకుడు**
**శివకర్మ సంస్కారి భువినివర్తకుడు**

**సన్నుత వేదార్థ చరితంబులుండ**
**మొన్నబుట్టినకులముల మాటలేల**
**సప్తుక్తమగు నట్టి జాతులు గావె**
**యష్టాదశంబులు నవియేల చెప్ప**
**మిక్కిలి పదునెనిమిది కులములకు**
**నిక్కమారయ భక్త నిచయంబు కులము** (బసవ పురాణము సప్తమాశ్వాసము)

బసవపురాణములోని భావమును ప్రతిఫలించెడి క్రింది పద్యము గనుడి:

**“వర్ణానాం బ్రాహ్మణో గురుః” ఎంబుదు హుసి**

**సీ॥ లలినెనుబదినాల్గు లక్షయోనులబుట్టి**
**మహిమీద నంత్యజన్మమున జీవు**
**దుదయించు నవియు ముప్పదిరెండు చనియెనే**
**నంతట మరిశూద్రుదై జనించు**
**నెన్నంగ నిరువదేనింట వైశ్యుండగు**
**నష్టాదశమున రాజగునతండు**
**నరపతి తొమ్మిదింటను బ్రాహ్మణుండగు**
**బ్రాహ్మణుడేడింట భక్తుడగును**
**నట్టిభక్తుండు జంగమంబగును మూట...** (చతుర్వేదసారము... 179)

*- శివం భూయాత్ -*

## ఆశీర్వచనము : 8

భృత్యాచారము గురించి క్రిందటి యాశీర్వచనమునందున తెలిసికొని యుంటిమి. ఇతరాచారముల గురించి ముందుననే తెలిసికొంటిమి. పంచాచారములను, వాటి యవాంతరములగు శీలము లన్నింటిని స్వయముగా నాచరించుచు వాటి మహాత్మ్యమును శిష్యులకు తెలియజేసి వారిని యాచార యుక్తులుగా చేసెడి సద్గురువునే “ఆచార్యు”డని యందురు. ఆచార్యునికి దేశికుడను నొక పర్యాయపదము గలదు. ఈ విషయమున శ్రీ భగవత్పాదుల వారు నీ క్రింది విధముగా తెలియజేసిరి.

**శ్లో॥ షడధ్వాతీత యోగేన యతతే యస్తు దేశికః।**
**మాయాబ్ధి తారణోపాయ హేతుర్విశ్వగురుః శివః॥** (సి.శి: 15-10)

షడధ్వాతీతమౌ శివయోగము చేత శివునితో సామరస్య రూపమైన యైక్య స్థితిని బడసిన దేశికుడు మహామాయ యనెడి సంద్రమును దాటించెడి యుపాయముతో దారిని చూపెడి విశ్వగురువై యుండును. “జ్ఞానాన్ముక్తిం దిశతి యః స దేశిక యితి స్మృతః” అనెడి కామికాగమోక్తి ప్రకారము పరశివ బ్రహ్మ స్వరూపమును తెలియజేసెడి సామర్థ్యము చేతనే యాతనిని దేశికుడని పిలుతురు.

శివజీవుల వాస్తవిక భేదము మరియు అభేదముల గురించిన జ్ఞానము లేనందుననే ప్రతి యొక్క జీవి సాంసారిక జీవనమునకులోనగుచున్నాడు. ఈ బంధనముల నుండి విడుదల కావలెననిన యాత్మ జ్ఞాన సంపన్నుడైన దేశికుని యుపదేశము నావశ్యకమై యున్నది. సామాన్యముగా నెవ్వరైనను మిమ్ములను నీ వెవ్వరు? అని ప్రశ్నించిన యెడల ప్రతి యొక్కరు తన పేరు, తల్లిదండ్రుల పేరు, తన యూరిపేరు మొదలగు వాటిని చెప్పి తన పరిచయమును చేసికొనుటను మనము వినుచుందుము. అతడు చేసికొనెడి ఈ పరిచయము స్థూల శరీరమునకు సంబంధించిన పరిచయమే కాని యాతని నిజమైన పరిచయము కాదు. ప్రతి ఒక్కరికి మన నిజమైన ఆత్మ పరిచయము కావలెననిన దేశికుడైన గురువు యొక్క ఉపదేశము అవసరముండును. సద్గురువు శరీరమనగా నేమి? ఇంద్రియములెన్ని? అంతఃకరణ స్వరూపమెట్టిది? వీటికంటెనాత్మ ఏవిధముగా భిన్నమైనది? అనెడి విషయములను తెలియజేయును. ఈ విధముగా దేశికుడు ఉపదేశము నివ్వనిదే ఆత్మ స్వరూపము యొక్క అరయిక కాజాలదు. ఇంతటి మహత్వపూర్ణమైన ఉపదేశము నిచ్చెడి వాడే దేశికుడని గుర్తించవలెను.

ఎంతటి మూఢుడై యుండిననూ, ఎంతటి పాపియై యుండినను అట్టి వారిని తన ఉపదేశము యొక్క ప్రభావము చేత సంస్కరించి సన్మార్గమునకు తెచ్చువాడే సద్గురువు. అతడే దేశికుడు. మన పురాణ ఇతిహాసములలో క్రూరాతిక్రూరమైన వారిని, దుర్మార్గులను సన్మార్గములో పయనింపజేసిన వారి కథలు ఎన్నియో కలవు. వీరందరూ సద్గురువు లని అనదగినవారే.

శాస్త్రకారులు ప్రపంచమును మాయాసముద్రమని పిలిచిరి. ఈ సముద్రమున పడినవాడు యిందు నుండి బయటపడుట జరుగదు. సాంసారిక వాసనలు చుట్టబడుటచేత ఇతడు తన స్వీయ సామర్థ్యముచేత బయట పడుటకు అసమర్థుడై యుండును. అందుచేత అతడు గురువుకు శరణాగతుడు కావలసినదే. తనకు శరణాగతుడైన శిష్యుని మోహ మమకారములను తన వుపదేశము మూలమున దూరముచేసి గురువు అతనిని సంసార సాగరము నుండి వెలికి తీయుచున్నాడు. గురువు యొక్క ఉపదేశముచేత ప్రపంచములోని సమస్త మానవులు అహంకార మమకారములనుండి విముక్తిని పొందుచున్నారు. ఈ విధముగా విశ్వమునే ఉద్ధరించెడి శ్రీ గురువునకు విశ్వగురువు అనెడి ఖ్యాతి వచ్చును.

శ్రీ రేణుక భగవత్పాదుల వారు శ్రీ గురువు యొక్క స్వరూపమును వర్ణించుచు ఈ క్రింది విధముగా ఆదేశము నిచ్చిరి.

**శ్లో॥ అఖండం ఏనచైతన్యం వ్యజ్యతే సర్వ వస్తుషు।**
**ఆత్మయోగ ప్రభావేణ స గురుర్విశ్వ భాసకః॥** (సి.శి. 15-11)

దేశికుని కళ్ళకు కన్పట్టెడి జగత్తులోని సకల వస్తువులు అతని శివ తాదాత్మ్య యోగ ప్రభావము చేత సర్వత్రా అఖండమైనదియును, సచ్చిదానంద స్వరూపమునూ అగు చైతన్యమై దోచుచుండును. ఇంతటి దివ్యదృష్టి సంపన్నుడైన మహాగురువుకు జగత్ప్రకాశకుడను పేరు గలుగుచున్నది.

విశ్వగురు, జగద్గురు శబ్దములు పర్యాయపదములై యున్నవి. గురువును విశ్వగురు, జగద్గురు అనుటకు కారణ మేమనగా జగత్తునందుండెడి భూత లేక భౌతిక పదార్థముల యందు పరమాత్ముడు అను స్యూతుడుగా వుండుచున్నారని యెరిగిన వారుకావున. పూమాల యందున అణిగి యుండెడి దారము ఆ పూవులకెల్ల ఆధారముగా నుండునటులనే పరమాత్ముడు ప్రతి యొక్క వస్తువునకు ఆధారభూతుడై యుండుచున్నాడు. అందుచేతనే పరమాత్ముని సూత్రాత్ముడు అని అందురు. హారములోని ప్రతి యొక్క పూవు నందున దారము అనుస్యూతముగా వుండునటులనే పరమాత్ముడు ప్రతి యొక్క వస్తువు నందున అదృశ్యముగా నుండును. ఈ విధముగా జగత్తులోని లేదా విశ్వములోని ప్రతి వస్తువు నందున అంతర్హితుడైన పరమాత్మను యెరిగెడి సామర్థ్యమున్న గురువును విశ్వగురువు లేదా జగద్గురువు అని పిలుతురు. ఈతడు తన మనస్సులో సర్వమూ తన ఆత్మ స్వరూపముగా అనుభవించుచుండును. సామాన్య జీవులకు యింతటి దివ్యదృష్టి వుండదు. సామాన్యముగా జనులకు వస్తువుల యొక్క ప్రత్యక్ష జ్ఞానముండునే గాని వస్తువుల యొక్క అంతర్విహితమైన పరమాత్మ సాక్షాత్కారము కాజాలదు. ఇంతటి స్థూల దృష్టిగల జీవుల దృష్టిని పరివర్తన జేసి వారికి సర్వత్రా శివదర్శనమును గావించెడి దివ్యదృష్టిని ఈ విశ్వగురువు అయిన వాడు అనుగ్రహించుచున్నాడు. ఈ విధముగా విశ్వములోని జీవులందరికి శివ జ్ఞానమును గల్గించుట చేతనే ఇతడు విశ్వగురువుగా యెంచబడుచున్నాడు.

లింగషట్స్థలాంతర్గతమైన భక్తి స్థలము నందలి మొదటి అవాంతర స్థలమగు దీక్షాగురుస్థలమున గురువు యొక్క అనేక పర్యాయనామములు స్పష్టీకరణను చేసిన యటుల గమనించితిమి. శిష్యుల యజ్ఞానమును దూరము చేసి వారికి సుజ్ఞానమును గలిగించెడి గురువు శిష్యులకు ఆచారములను బోధించి వారిని సదాచారులుగా చేసి తానునూ ఆచారపరుడై ఆచార్యుడనిపించుకొనవలెనని గ్రహించవలెను. శరణాగతులైన వారికి సన్మార్గమును చూపించి వారిజీవితమునుపావనము చేయుటచేత గురువు దేశికుడగుచున్నాడు. జగత్తులోని ప్రతి వస్తువు లేదా వ్యక్తి యందున పరమాత్మ యొక్క అస్తిత్వము ననుభవించి అట్టి అనుభవమును విశ్వములోని జనులకు కలిగించుట చేత గురువు జగద్గురువుగాను విశ్వగురువుగాను పరిగణింపబడుచున్నాడు. ఇట్టి జగద్గురువులకు శరణాగతులై ప్రతి ఒక్కరు తమ జీవనమును పావనము చేసికొందురుగాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 8-08-1992
స్థలం : **భికుబాయి మేనకుదళె**
**మంగళ కార్యాలయము, పూనే**

## విశేష ప్రదీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు దీక్షా గురువు యొక్క దేశిక మరియు విశ్వగురు స్వరూపమును గురించిన వివరముల నిచ్చిరి.

సామాన్యార్థములో మార్గమును చూపే గురువును దేశికుడని యందురు. "యః ముక్తిం దిశతి సః దేశికః" అనెడి కామికాగమోక్తి యీ భావమునే తెలుపుచున్నది. కాని శ్రీ రేణుక భగవత్ పాదుల వారి భావములో...

భిన్నత్వము గోచరించుచున్నది. షడధ్వమును మించిన యోగము చేత నెవ్వడు యత్నించునో అతడు దేశికుడని చెప్పబడినది.

షడధ్వన్యాసమనెడి ప్రక్రియ యొకటి కలదు. లింగధారణ సమయమున నీ ప్రక్రియ చేపట్టబడును. "మంత్రపూతే కలాం శైవం యోజయేత్ విధినా గురుః" అనెడి శ్రీ భగవత్పాదుల వారి ఆదేశము (6-23) లో దేశిక గురువును గురించిన భావమిమిడియున్నది.

లింగధారణ ప్రక్రియలో "లింగసంస్కారమనెడి ప్రక్రియ యొకటి కలదు. జలాధివాస, ధాన్యాధివాసాది సంస్కారముల పిదప షడధ్వన్యాసాదుల ద్వారా శివ కళను లింగములో ప్రవేశింపజేసెడి గురువే దేశికుడనబడునని గుర్తించగలరు. కళ యనెడిది శక్తి యొక్క స్వరూపమేయని తెలియుచున్నది. ఈ యంశమును తెలిపెడి వీరాగమ వాక్కులను గమనించునది.

**శ్లో॥ "లింగస్థలాశ్రయా శక్తిః కలారూపాప్రకీర్తితా"**

శక్తికి కళకు నభేదము చెప్పబడినది. ఇందులోని భావమును గ్రహింతుముగాక.

వాతూల తంత్రము ప్రకారముగా పరబ్రహ్మావాచ్యమైన 'స్థలము' లింగాంగములుగా విడిపోవును. అంగుని ప్రవృత్తి మార్గమున పయనింపజేసెడి 'మాయ'శక్తి యొక్క ప్రతి రూపమే. శక్తి పాతము జరిగిన స్థితిలో శక్తి భక్తిగా మారి అంగునికి శివోన్ముఖతను కల్పించి నివృత్తి మార్గమునకు మరల్చును. శివుడే గురువై లింగధారణ చేయుటకు పూనును. చంద్రకాంతాది శిలలతో నిర్మింపబడిన జడ లింగమునకు చైతన్యస్ఫూర్తి నొసంగుట కొరకు శివకళ లింగోన్ముఖత గల్పించి యద్దానిని లింగములో నిక్షిప్తము చేయును. కళయు శక్తియే యనెడిది స్మరణీయము. ఈ విధముగా చేయు గురువు దేశికుడగునని గ్రహించగలరు.

యావత్ జగత్తులోని మానవులెల్లరను సంసార తాపము నుండి రక్షించెడి వాడే విశ్వగురువు. కులభేదాదుల నరయక సర్వజనులను కాచెడి వాడే విశ్వగురువు. మాయా ప్రభావమును క్షీణింపజేసి పిండులనెడి భవిజనులను అంగులనబడెడి భక్తులుగా తీర్చిదిద్దెడి యుదాత్తమైన పాత్రను విశ్వగురువు పోషించునని తెలియగలరు.

*- శివం భూయాత్ -*

## ఆశీర్వచనము : 1

## శిక్షాగురుస్థలము

లింగస్థలములో మొదటిదగు భక్తస్థలము నందలి దీక్షాగురు స్థలమును గురించి వివరముగా తెలిసికొంటిమి. తదనంతరమున నుండెడిదే శిక్షాగురువు స్థలము.దీక్ష నిచ్చి మనలను సంస్కారవంతులను చేసిన దీక్షా గురువే యెప్పుడు ధార్మిక మరియు దార్శనిక శిక్షణ నిచ్చునో యప్పుడతడు శిక్షాగురువనిపించి కొనును. ఈ విషయమున శ్రీ భగవత్పాదులవారి యుపదేశమీక్రింది విధముగా నున్నది.

**శ్లో॥ దీక్షాగురురసౌ శిక్షాహేతుః శిష్యస్య బోధకః।**
**ప్రశ్నోత్తర ప్రవక్తా చ శిక్షాగురురితీర్యతే॥** (సి.శి. 15-12)

దీక్షా సంస్కారమును చేసిన శ్రీ గురువే శిష్యుని ప్రశ్నలకు నుత్తరములనిచ్చి తన యమోఘమైన యుపదేశము చేత సంశయములను దూరము చేసి శిష్యుని సుశిక్షితుని చేసెడి కారణమున యీతనిని శిక్షాగురువని యందురు. పూజ్యపాదులిచ్చట గురుశిష్యుల సంబంధ బాంధవ్యమును వివరించి చెప్పిరి. ఇరువురి మధ్య నేదోయొక సంబంధముండును. తండ్రి కొడుకు, భర్త-భార్య, అన్న-దమ్ములుగా వారు పిలువబడుచున్నారు. ఇవన్నియును లౌకిక సంబంధములైనందున వీటిని రక్త సంబంధములని యందురు.

ఈ సంబంధములు బంధనకారులగు సంబంధములు. వీటి వలననే మనుజుడు సంసారమునందున కట్టివేయబడి యుంచబడుచున్నాడు. ఈ విషయమును వివరించెడి కథ యొకటి కలదు.

ఒకనాడు నారదుడు శివుని దర్శించడానికి కైలాసమునకేతెంచెను. ఒంటరిగా కూర్చుని యున్న సదా శివునికి ప్రణతులర్పించి, యీ విధముగా విన్నవించెను. సదా శివా! నీ సాన్నిధ్యములో పరివారము భక్తకోటి మున్నగువారెందరో వుండులకు బదులుగా, ఒంటరిగా దర్శనమిచ్చితివి కారణమేమి? భూలోకములో ప్రతి ఒక్కరు, మీ సామరస్యతను కోరుతూ, భక్తి భావముతో భజనలు, ప్రవచనములు, పూజలు, వ్రతములు చేయుచున్నారు. మీసాన్నిధ్యం కావాలని, మీతో సామరస్యము పొందాలని ప్రతి భూలోకవాసి ప్రగాఢమైన ఆకాంక్షిగా నేను గమనించాను. కాని కైలాసములో మాత్రము దానికి భిన్నముగా గోచరించినది. కారణమును సెలవివ్వగలరని నారదుడు సవినయంగా మనవి చేసెను. నీ ఆలోచన సరియైనదిగాదు. సంసార చక్రభ్రమణములో బంధించబడిన ప్రతి మానవుడు, నాసాన్నిధ్యమును, సామరస్యమును కోరుతున్నట్లుగా నటిస్తున్నారే తప్ప, వాస్తవముగా నన్ను చేరడానికి ఉద్యుక్తులయి వచ్చు విషయములో వారు వెనుకంజవేయుచున్నారు. సంసారములోని మోహములను, వీడక తాము గడుపుతున్న జీవితమే పరమావధిగా తలంచెదరు. ఈ విషయమున నారదా! నీకేమైన సందేహములున్నచో, వెంటనే భూలోకమున కేగి, ఒకరు లేదా యిద్దరిని కైలాసమునకు వెంటబెట్టుకొని రావడానికి ప్రయత్నించుము. విషయము నీకు సుబోధకమగునని సెలవిచ్చెను. పరమేశ్వరునినోట, యీ విధమైన విషయమును విన్న నారదుడు, పట్టుదలతో భూలోకమునకు వెళ్లి తన ఆలోచన సరియైనదని రుజువు చేయదలచెను.

భూలోక సంచారియైన నారదుడు గ్రామ గ్రామములలో సంచరిస్తూ ఒకనాడు ఒక గ్రామమునకు చేరెను. ఆ సమయంలో ఆ గ్రామము నందు సత్సంగము నిర్వహించబడుచుండెను. సుమారు వేయి మంది, ఆ సత్సంగములో పాల్గొనుచుండిరి. ప్రవచకులు శివసాన్నిధ్యమును లింగాంగ సామరస్యమును గూర్చి చక్కగా వివరిస్తూ ప్రసంగములు చేయుచుండిరి. ఆ ప్రసంగములు విన్నప్రతిఒక్కరు శివసాన్నిధ్యముకై పరితపించుచున్నట్లుగా కన్పట్టిరి. సత్సంగము ముగిసినది. అందరు సభాస్థలిని వదలి వెళ్ళు పోవుచుండిరి. అదే సమయంలో నారదుడు, సభామంటపు ముఖద్వారమున వేచియుండి, బయటకు వచ్చుచున్న వారినందరిని కైలాసమునకు తీసుకొని వెళ్లడానికి ఆయత్తమయ్యెను. వెంటనే బయటకు వచ్చుచున్న ప్రతి ఒక్కరి దగ్గరకు చేరి, తనను తాను పరిచయము చేసికొని, వారిని కైలాసమునకు భౌతిక కాయముతో తీసుకొని వెళ్లడానికి ఏర్పాటు చేశానని, అందరును రావలసినదిగా ఆహ్వానిస్తూ, వారికీ, కైలాసములో శిసాన్నిధ్యమును కల్పించెదనని చెప్పదొడంగెను. సత్సంగములోపాల్గొనిన ప్రతి ఒక్కరు నారదుడి, ఆహ్వానమును వినియు, విననట్లుగాను, కొందరు తాము కైలాసమునకు రావడాని కిష్టపడడము లేదని, అనేక విధములుగా తప్పించుకొన ప్రయత్నములు చేసి వెళ్ళి పోవుచుండిరి. వారందరి ప్రవర్తనను గాంచిన నారదునకు, విచిత్రమైన చర్యగా గోచరించెను. ఐనను తాను మాత్రము వీరిలో ఒక్కరినైన కైలాసమునకు తీసుకొని పోయి, శివసాన్నిధ్యమునకు చేర్చి, పరమేశ్వరుని ఆలోచన సరియైనది కాదని, నిరూపించదల్చెను. ఈ ప్రయత్నములో చివరకు, నారదునకు ఒక ముదుసలి వ్యక్తి తారసపడెను. వెంటనే నారదుడాతనితో తాను అతనిని బొందితో కైలాసమునకు తీసుకొని వెళ్ళెదనని, అతనిని చేర్చడానికి పుష్పక విమానము సిద్ధముగా నున్నదని, ఈశ్వరసాన్నిధ్యము దొరకుట దుర్లభమని యిట్టి అవకాశము మరెవ్వరికి లభించదని, అతనికి పరి పరి విధముల నారదుడు నచ్చచెప్పి, పుష్పక విమానమున అతనిని కూర్చోబెట్టెను. ముదుసలి వాడు ముందుగా, సంతోషబడి నారదుడు చెప్పినట్లుగా కైలాసమునకేగుటకై నిశ్చయించుకొని, పుష్పక విమానములో కూర్చుండిపోయెను. వెంటనే అతని ఆలోచన క్రమములో మార్పు వచ్చెను. నారదుడిని పిల్చి స్వామి నేను కైలాసమునకు రావడానికి సిద్ధమే కాని, యీ విషయమును నా యింటిలోని వారికి తెలియ చేయవలసిన ధర్మమున్నది. కావున నన్ను నాయింటికి వెళ్ళడానికి అవకాశమివ్వవలసినదిగా కోరెను. ఆ యెనుబది సంవత్సరముల ముసలివాడి కోరికను మన్నించి నారదుడు, అతనిని యింటికి తోడ్కొని వెళ్ళెను. ఈ ముదుసలి యింటిలోనికి పోయి, ఎంతసేపటికిని బయటకు రాడాయె.

నారదుడతనికై వేచి యుండి, వేసారి, అతనిని అతి కష్టము మీద బయటకు రప్పించెను. బయటకు వచ్చిన ముదుసలి నారదుడికిలా విన్నవించెను. "నాకైతే కైలాసమునకు రావలెనని కోరిక కలదు. కాని యవ్వనములో నున్న నా మనువడు పెళ్ళిని చూడాలనే కోరిక ప్రబలముగానున్నది కావున, తాత్కాలికంగా కైలాస ప్రయాణమును వాయిదా వేసుకోదలిచాను. నా మనుమడి పెళ్లి ఈ సంవత్సరములో చేయుటకు ఏర్పాట్లు జరుగుచున్నవి. నేనాతని పెళ్లి అయిన తరువాత మీతో కైలాసమునకు రాగలను. అందుకు గాను ఒక సంవత్సరం వ్యవధి అవసరము కావున మీరు పై సంవత్సరములో వచ్చినచో మీతోబాటు కైలాసమునకు రాగలనని విన్నవించుకొనెను. అతని విన్నపమును మన్నించిన నారదుడు,

అతని కోరిక సమంజసమైనదని భావించి, అతను కోరిన విధముగా, వచ్చుట కంగీకరించెను. కాని నారదుడు కైలాసమునకేగుటకు మాత్రము యిష్టపడలేదు. ఏ ఒక్కరినైనను భూలోకము నుండి కైలాసమునకు తీసుకొని వెళ్ళకుండా పోరాదని నిశ్చయించి, భూలోకములోనే ఆ సంవత్సరమంతయును సంచారము చేయుచూ, గడువుకై వేచి యుండసాగెను. ఆ ముదుసలి యిచ్చిన గడువు ముగియగానే, నారదుడు ఆగ మేఘాలమీద, ఆ ముదుసలి యింటికి చేరెను. వెంటనే, ఆ ముదుసలికి తానొచ్చిన విషయము తెలియజేసెను. ఎంతకాలము వేచియున్నప్పటికి ఆ ముదుసలి వాడు మాత్రము యింటి వెలుపలకు రాడాయె. అనేక విధములుగా నారదుడు ప్రయత్నించిన తర్వాత, విసుగుకొంటూ, ఆ ముదుసలివాడు బయటకు వచ్చి, విషయమేమిటని నారదుడిని ప్రశ్నార్థకముగా ముఖము చిట్లించెను. అప్పుడు నారదుడు ముదుసలి వాడు గత సంవత్సరంలో చేసిన వాగ్దానమును జ్ఞప్తికి తెచ్చి వెంటనే కైలాసమునకు రావలసినదిగా కోరెను. అప్పుడా ముదుసలి వాడు, అయ్యా, నా మనుమడి పెళ్లి వైభవముగా జరిగినది. దాన్ని చూసి నేనెంతో సంతోషము చెందినాను. ఇప్పుడతని భార్య బిడ్డను కనబోవుచున్నది. అనగా నాకు మునిమనుమడో మనుమరాలో పుట్టబోవుచున్నది. నా మనుమడు పెళ్లి అతని సంసారమును చూచి నాకు ఎంతో ఆనందము కల్గినది. యింక నాతని పిల్లలను చూసినచో ఎంత సంతోషమునను భవించెదనో చెప్పనలవికాదు. మనువడికి పుట్టబోయే శిశువును చూసి ఆనందించాలనే ప్రగాఢమైన కోరిక కలదు. కావున ఆ శిశువు జన్మించే వరకు నేను కైలాసమునకు రావడము కుదరదు. ఆ ప్రయాణము మరొక్క సంవత్సరము వాయిదా వేయదలచాను. దయచేసి మీరుమరొక సంవత్సరము ఆగి రావలసినదిగా మనవి. అని నిష్కర్షగ తన నిర్ణయాన్ని తెలియచేసెను. నారదుడంత, తాను చేయగల్గినదేమి లేదని ఒక సంవత్సరము పాటు వేచి యుండడానికి నిశ్చయించుకొని భూలోక సంచారమునకేగెను.

ముదుసలి వాడి మనువడికి సంతానము కల్గింది, ఆ పిల్లవాడితో ఆటపాటలో మునిగిపోయినాడు, ఇచ్చిన గడువు పూర్తయినది. నారదుడు అనుకున్న సమయానికి, ఆ ముదుసపలి వాడింటికి వచ్చి కైలాస ప్రయాణము గూర్చి తెలియచేసినాడు. అప్పుడా ముదుసలి నారదుడితో అయ్యా! ఒక్క మనుమడి ఆట పాటలతో నేనెంతో సంతోషంగా కాలము గడుపుచున్నాను. యింకా కొంత మంది పిల్లలు పుట్టి, వారితో కూడ తృప్తిగా సంతోషంగా కలిసి యుండాలని నాలో కోరిక బలపడింది. కావున ఐదారు సంవత్సరములు గడచిన తర్వాత కైలాస ప్రయాణము గూర్చి ఆలోచించ వచ్చును. అంత వరకు వేచి యుండవలసినదే యని కరాఖండిగా చెప్పి, మరో మాటకు అవకాశమివ్వకుండా యింటిలోకి వెళ్ళ పోయెను. ముఖం చెల్లక పోవుట చేత నారదుడు కొంచెము విచారమునకు లోనై, ఐదారు సంవత్సరములు వేచి యుండుటకు నిశ్చయించుకొని, తిరిగి భూలోక సంచారమునకేగెను.

నారదుడు గడువు దాటిన వెంటనే మరొకసారి, ఆ ముదుసలి యింటికి చేరి, అతనిని పిలువగా, బదులుగా జవాబు లేకుండెను. నారదుడు తన దివ్యదృష్టితో అవలోకించి, ఆ యింటి ముందున్న కుక్క పిల్లలో ఆ ముసలివాడి ఆత్మ యున్నట్లుగా తెలిసి కొనెను. వెంటనే నారదుడు ఆ కుక్క పిల్లతో ఈ విధముగా సంభాషించెను. మానవుడిగా బ్రతికి యున్నప్పుడే నేరుగా కైలాసమునకు బోయే అవకాశము వచ్చినప్పటికీ, వదులుకొంటివి. యిప్పటికైనను కైలాసమునకు పరమేశ్వరుని సాన్నిధ్యమునకు తీసుకొని పోయెదను. కుక్కపిల్లగా వున్నప్పటికి పరమేశ్వరుని సాన్నిధ్యమునకు రమ్మని కోరెను. అందుకు బదులుగా కుక్కపిల్లలో ఉన్న ముదుసలివాడి ఆత్మ, అయ్యా, మనిషిగా వున్నప్పటికంటే ఈ కుక్క రూపములో నున్న నేను యీ యింటిలోని చిన్నా పెద్దల యొక్క ప్రేమ, అభిమానమును మెండుగా పొందుచున్నాను. ఇంతకు మించిన ఆనందము నాకెక్కడ దొరుకగలదు? అందుచేత మరికొన్ని సంవత్సరముల వరకు కైలాసమునకు రాలేనని, తిరిగి రావాల్సినదిగా నారదుడిని కోరెను అందుకు సమమ్మంతించిన నారదుడు వెనుదిరగి వెళ్ళిపోయెను.

కొంత కాలము తర్వాత నారదుడు మరొక సారి, ఆ ముదుసలి వాడి యింటికి వచ్చి, కుక్కపిల్ల ఆచూకిని తెలుసుకోగోరి విచారించెను. అది అప్పటికే చనిపోయినదనే విషయము తెలిసెను. మరి అతని ఆత్మ ఏ జీవిలో నున్నదో తెలుసుకోగోరి నారదుడుతన దివ్యదృష్టినుపయోగించెను. అతని ఆత్మ ఒక కప్పలో యున్నట్లుగా కనుగొనెను. పశువుల శరీరములను కడుగగా పాకిన నీళ్లు ఒక గుంటలో నిండి యుండెను. అందులో కప్ప ఈదులాడు తుండెను. కప్ప దగ్గరికెళ్ళి నారదుడు దానికి పూర్వ జన్మల జ్ఞానమును కల్పించి, నికృష్టమైన కప్ప జీవితమును వీడి కైలాసమునకు రావలసినదిగా కోరెను. అదియునుగాక, మహోత్కృష్టమైన మానవ జీవతములోనే కైలాసమునకు వచ్చియున్న యెడల ఈనాడు ఇట్టి నికృష్ట రూపములో ఉండాల్సిన ఆగత్యముండేది కాదు. మరియు ఈశ్వరసాన్నిధ్యములో శివగణములలో ఒకరికగా వుండిపోయెడివాడివి. ఇప్పటికైనను, గతమును మరచి, కైలాసమునకు రావలసినదిగా కోరెను. దానితో కోపమును బట్టలేని, కప్పరూపములో ముసలివాడి ఆత్మ యిట్లు వచించెను.. నేను నా కుటుంబములోని సభ్యులచేతను, వారిజంతువులచేతను విసర్జించబడిన నీళ్ళలో తిరుగాడుతూ, ఆ నీరు తన శరీరమునకు తాకిన

వెంటనే ఎంతో ఆనందము కలుగుతున్నదని. అట్టి ఆనందమును విడిచిపెట్టి రావడము అవివేకము. పైపెచ్చు మరెప్పుడు కైలాస ప్రయాణము నిమిత్తము నా దగ్గరకు రాకూడదని, యిప్పటికే తాను ఎంతో నష్టపోయినానని, నారదుడి విజ్ఞప్తిని తిరస్కరించెను.

పై వృత్తాంతమునంతయు అవలోకమును చేసికొన్న నారదునకు, పరమేశ్వరుని మాటలలోని పరమార్థము తెలిసి వచ్చినది. సంసారచక్రములో చిక్కిన జీవి, ముక్తిని ప్రసాదించే, అలౌకిక ఆనందాన్నిచ్చే కైలాసవాసుడి సాన్నిధ్యమును కోరయిచ్చగించదని, లింగాంగసామరస్యమును పొందుట, ఐహిక వాంచలున్న వారికి సాధ్యము కాదని తనలో తానే నారదుడు మననము చేసికొనెను. నారదుడు తానొక్కడే రిక్త హస్తములతో పుష్పకవిమానములో కైలాసమునకు వెళ్ళెను. అదిగాంచిన శివుడు ఓయి నారదా! భూలోకము నుండి ఎవ్వరైన భక్తులను తోడ్కొని కైలాసమునకు వచ్చితివా?యని వ్యంగ్యముగా ప్రశ్నించెను. అంతట నారదుడు లజ్జితవదనముతో ఇట్లనెను 'ఓ మహాదేవా! దేవాదిదేవా! సర్వజ్ఞ! మీరు సెలవిచ్చినదే నిజము. భూలోకమందున్న జీవులు సంసార మోహపాశమున ఎంతో బిగుతుగా బంధించబడినారు. వారి బంధనములోని ముడులు, రోజు రోజుకు పెరుగుచున్నవే కాని తగ్గుట లేదు. అందుచేత "క్వశ్చిద్దీరః ప్రత్యాగాత్మనమోక్షత్ వ్యావృత్తచక్షుః అమృతత్వమిచ్ఛన్॥ యనెడి శృత వచనము చెప్పిన యటుల, లక్షకో, కోటికో ఒక వ్యక్తి అంతర్ముఖుడై అమృతత్వ ప్రాప్తికి ప్రయత్నించుచున్నాడు. మిగిలిన వారందరు జనన మరణ చక్రమునందు చిక్కుకొని యున్నారు. భూమండలమునందున పరీక్షించి ప్రతీక్షించి, రిక్త హస్తములతో వచ్చితిని, అని చెప్పి నిరాశాభావమును వ్యక్త పరచెను.

సంసారపు సంబంధములు యీవిధంగా చూడ గట్టిగా యుండును. 'సంయక్ బంధః సంబంధాః యనెడి వ్యుత్పత్తి మేరకు దృఢమైన బంధమే సంబంధము. ఈ సంబంధము నుండి విడుదల నొందవలెననిన గురువు యొక్క సరసన శిష్యరికమును విధిగా చేయవలెను. గురుశిష్య సంబంధమున మనమీ సంసార బంధముల నుండి విముక్తి పొందెడి మార్గమును కనుగొననవచ్చును. అన్ని రకములైన బంధనముల కంటె గురుశిష్య సంబంధం శ్రేష్టతరమైనది. ఇతర సంబంధములలో మోహపూరిత సంబంధము లుండును. రక్తసంబంధము యిందులకు ఉదాహరణ. గురుశిష్యబంధములో, మోహనాశకమైన, భోగ్య బోధక, సంబంధములు మాత్రమే యుండును. గురువు బోధకుడుగాగ శిష్యుడు బోద్యుడగును. ఈవిషయమును స్పష్టపరిచెడి శ్రీ గురువుగారి ఈ క్రింది ఉపదేశమును గనుడి.

**శ్లో॥ బోధకోయం సమాఖ్యాతో బోధ్యమేతదితి స్ఫుటమ్**
**శిష్యే నియుజ్యతే యేన స శిక్షా గురు రుచ్యతే"** (సి.శి : 15-13)

గురువు బోధకుడుగను, శిష్యుడు, బోధితుడుగను పిలువబడుదురు. ఈ విధముగా శిష్యుడిని బోదనలను స్వీకరించెడి వాడిగా నియోజన చేసి అతనికి ఉత్తమమైన ఆధ్యాత్మిక శిక్షణను, ప్రదానముచేసెడి వాడే శిక్షా గురువని పిలువబడుచున్నాడు.

ఒక తల్లి నవ శిశువును పెంచు సందర్భమున కాటుకను పెట్టెడి నెపమున ఆ శిశువు యొక్క మూసిన కళ్ళను తన వేళ్ళచేత మృదువుగా తెరచునటులనే, గురవైన వాడు, అజ్ఞాన వశమున మూయబడిన శిష్యుని యొక్క అంతఃచక్షువును, జ్ఞానమనెడి అంజనమునంటించుటకై తెరచుచున్నాడు. పరమాత్మ తత్త్వము మనందరి మనసులలో అణిగి యుండినను శ్రీ గురువు బోధ లేనిదే అది బహిర్గతము కాదు. అద్దానిని చర్మ చక్షువులచేత చూడజాలము.

**"యతో వాచోని వర్తంతే అప్రాప్యమన సాసహః"**

యనెడి ఉపనిషత్తు వాక్యము ప్రకారము పరమాత్మ తత్వము, బాహ్య మరియు అంతరంగపు అశుద్ధమైన యింద్రియములకు అగోచరమై యుండును. ఇంతటి, అగోచరమైన తత్త్వమును శిష్యునికి తెలియపరచుటకై, గురువు శిష్యుని మనోబుద్ధులను శక్తివంతము చేసి, వాటికి, పరమాత్మ తత్త్వమును గ్రహించెడి యోగ్యతను తెచ్చిపెట్టును. తనకు శరణాగతుడైన శిష్యుడి మీద అతడు నియంత్రణ సాధించగలడు. గురువు యొక్క శాసనము చేత అనుశాసితుడైన వాడు, యోగ్యశిష్యుడగుచున్నాడు. గురువైన వాడు శాసనము మూలకముగా, శిష్యుని పరీక్షించును. అధికార సంపన్నుడై శ్రేష్ఠ శిష్యుడని తెలిసికొనినప్పుడు, శ్రీగురువు తన శిష్యుడిని బోధామృతము చేత సంతృప్తునిగా చేయును. శిష్యత్వ సంపన్నులైన గురువు యొక్క శాసనములను మన్నించెడి యోగ్యులైన శిష్యులు జగత్తునందున చాలా తక్కువగా యుందురు. ఏదో ఒక మిషతో, గురువు యొక్క నియంత్రణను తప్పించుకొను వారెక్కువగా నుందురు.

ఒకానొక వూరిలో ఒక వ్యక్తి, విద్యార్జనకై గురుకులమునకు పోయెను. ఇంటిలో ఏ పనిని చేయనట్టి తత్త్వము గలవాడతను. గురుకులము నందున, గురువుగారు, అతనికి బట్టలనుతికెడు పనిని అప్పగించెను. ఈ విధముగా చేయుచు పోయిన యెడల యిది నా జీవితమునకు ఏమిటికి పనికిరాదు. అందుచేత, యిప్పుడే, ఏదో ఉపాయమును వెదకి, ఈ పని నుండి తప్పించుకొనవలననెడి ఆలోచనాతనికి కల్గెను. అతనికి మెరపులాంటి ఒక ఉపాయము తట్టెను. క్షణముననే నాతడు గురువుగారి దగ్గరకు చేరి "ఓ గురు దేవా, మీరు మాకు పూజ్యులు, మీరుపయోగించెడి ఏ వస్తువుకును, మా పాదస్పర్శ కలుగకూడదు. అది జరిగిన యెడల మాకు పాపము సంప్రాప్తమగును. ఇది యిటులుండగా మీ పాదము మాకుగాని, మా వస్తువులకుగాని తాకిన యెడల మేమును, మా వస్తువులు పునీతములగుదుము. ప్రతి దినము బట్టల నుతికేటపుడు వాటికి నా పాదస్పర్శ కలిగి తద్వారా పాపము వచ్చునని భయము కలుగుచున్నది. ఆ కారణమున యిక ముందు నేను మీ బట్టలుతుకజాలను. ఐతే, మీరే మా బట్టలనుతికిన యెడల మీ పాద స్పర్శ చేతనా బట్టలు పావనములగును. మా జన్మధన్యత బొందునని నుడివెను.

జగత్తులో యిట్టి శిష్యులే అధిక సంఖ్యలో నుందురు. ఇట్టి వారికి గురుకృప లభింపజాలదు. గురువు శాసనము ప్రకారము తనకెంత కష్టనష్టములు కల్గినను, గురుసాన్నిధ్యమును విడువరాదు. ఈ విషయమునే సర్వజ్ఞుడీ విధముగా తెలియచేసెను.

**"ఎత్తాగి తొత్తాగి హిత్తల దమరవాణి**
**మత్తె పాదదాకెరవాగి గురువిన**
**హత్తిరిరు యెంద సర్వజ్ఞ"**

ఈ త్రిపది యొక్క తెలుగు రూపమును కనుడి.

"ఎద్దై, తొత్తై వెనుకన చెట్టై,
మరియు పాదమునకు చెప్పై గురువుకు
దగ్గరగా యుండు ననియె సర్వజ్ఞుడు"

శిష్యుడు ఏదో విధముగా, గురుసాన్నిధ్యము నుండ వలయును. తన్నిమిత్తమై, ఎద్దుగాను, బానిసగాను, పెరటిలోని చెట్టుగాను, గురువుగారి పాదుక గాను అంటిపెట్టుకొని యుండినను శ్రేయస్కరమే అని గ్రహించవలెను. ఎద్దు బరువులను మోయును బానిస సేవాభారము వహించును. పెరటిచెట్లు అనేక విధములుగా ఉపయోగపడును. పాదుకలు, వ్యక్తి భారమును మోయును. వీటి మాదిరిగానే, శిష్యుడు, అధిక ప్రయాస కోర్చి, సద్గురువు కటాక్షమును పొందవలయునని గ్రహించవలయును. ఇట్టివాడు పరిశుద్ధాంతరంగుడై, గురూపదేశము పొందుటకు అర్హతను పొందును. శిష్యునిపై యిట్టి ప్రశాసనమును చేసెడి వాడే, శిక్షాగురువని గ్రహించవలెను.

శ్రీ జగద్గురువు రేణుక భగవత్పాదుల వారు, శిక్షాగురువు ఆచార్యుడుగా పిలువబడుటకై అర్హుడని చెప్పుచూ, ఈ క్రింది ఉపదేశము నిచ్చిరి.

**శ్లో॥ సంసారతిమిరోన్మాథిశరచ్చంద్రమరీచయః।**
**వాచో యస్య ప్రవర్తంతే తమాచార్యం ప్రచక్షతే॥** (సి.శి : 15-14)

శరదృతువు నందలి చంద్రుడు ప్రకాశమానముగా నుండుట వలన చీకటి తొలగిపోయి, శీతల మైన వాతావరణమేర్పడును. అటులనే సంసార రూపమైన చీకటిని తొలగించే సామర్థ్యము, ఎవ్వరి వాక్కున నుండునో ఆతనినే ఆచార్యుడని పిలుతురు. గురువు యొక్క అమృతవాణి శరత్కాలపు చంద్రుని వెన్నెలవలె చల్లగానుండును. సంసార తాపము వలన పరితప్తుడైన వ్యక్తి గురు సాన్నిధ్యమునకొచ్చినపుడు, వారి దర్శనమును పొంది గురువు వచనామృతమును పానము చేసిన శిష్యుని మనస్సు శీతలత ననుభవించును. జగత్తులోని ప్రతి వ్యక్తికి, ఆధ్యాత్మిక, ఆధి, భౌతిక, ఆధిదైవిక, తాపత్రయములెల్లప్పుడును అతనికి సంతాపమును కలుగచేయుచుండును. ఈ తాపత్రయములు, నిశ్శేషముగా దూరము కావలెననిన గురుకృప, మరియు వారి ఉపదేశము పరమావశ్యకమై యుండును. ఈ విధముగా శిష్యుని తాపమును దూరము చేసి, అతనికి శివజీవైక్య జ్ఞానమును శిక్షణా రూపమున నిచ్చు వాడే శిక్షాగురువు. ఈతనికే ఆచార్యుడని గుర్తింపు యుండును. ఇట్టి ఆచార్యుని గురించి శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది విధముగా ఉపదేశమునిచ్చిరి.

**శ్లో॥ దదాతియః పతిజ్ఞానం జగన్మాయా ని వర్తకమ్।**
**అద్వైత వాసనోపాయం తమాచార్య వరం విదుః॥** (సి.శి.15-15)

శ్రీ గురువు శిష్యునకు ప్రతి విషయము గురించి జ్ఞానమునుపదేశించును. వీరశైవ సిద్ధాంత ప్రకారముగా, జీవుని పశువనియును, శివుని, పతియనియును పిలుతురు. ఆణవ, మాయ మరియు కార్మికములనెడి త్రివిధ మలముల చేత ఆవృతమైన జీవికి పశువను పేరు యివ్వబడినది. "పాశబద్ధః పశువుః" యనెడి ఉక్తి ప్రకారము జీవుడు త్రివిధ మలములనెడి పాశముల చేత బంధితుడై యుండుట చే జీవికి పశువనెడి పేరు సార్థకమగుచున్నది.

ఇందువలననే జీవునికి సంసారము నుండి సులభముగా విడుదల లభించుటలేదు. జీవునికి సంసారము నుండి విముక్తి పొందుటకై గురువుని శరణు వేడుట ఆవశ్యకమై యున్నది. గురువు మాయను దూరము చేసి, శిష్యునకు పతితత్త్వమును బోధించును. ఈ పశు-పతిజ్ఞానము వలననే శిష్యుడు పశుభావమును వీడి, మల వాసనల నుండి నివృత్తిని పొందుచున్నాడు. శివ-జీవా భేదభావనను పొందుటకు వలయు శక్తిని పొందును. ఈవిధముగా శిష్యునికింతటి శిక్షణను, ప్రదానము చేసెడి శిక్షా గురువు ఆచార్య పదవాచ్యుడని తెలిసికొనగలరు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 09-08-1992

స్థలం : **భికుబాయి మేనకుదళె**

**మంగళ కార్యాలయము, పూనే**

## విశేష ప్రదీపిక :

సంసారమనెడి వలలో చిక్కిన వాడు సంసారము నుండి విముక్తిని పొందజాలడనెడి సత్యమును శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు చక్కగా వివరించిరి. ప్రగాఢమైన అంధకారమును పోలు సంసార భ్రాంతిని నాశనము చేయు వాడే శిక్షాగురువని తెలియజేసిరి.

'శిక్షా' అనెడిది వేదాంగమని అమరము చెప్పుచున్నది. "శిక్షేత్యాది శ్రుతేరఙ్గమ్ ఇత్యుచ్యతే" అనెడిది అమర సింహుని వాక్కు. అకారాదీనాం వర్ణానాం స్థానప్రయత్న బోధికయా అనయా శిక్ష్యతే వర్ణాదిరితి శిక్షా-శిక్షవిద్యోపాదానే-అనెడిది పండితోక్తి. శిక్షా యనెడిదొక ప్రక్రియగా శిక్షితుని నేర్పరిగా తీర్చిదిద్దెడి లక్ష్యముతో చేపట్టబడెడి కార్యక్రమముగా స్వీకరించవచ్చును. శిక్షణలో బోధన కీలకమైన పాత్రను పోషించును. బోధన ప్రక్రియలో బోధకుడు, బోధ్యము మరియు బోధితుడనెడి త్రికముండును. దీక్షను పొందిన భక్తాంగస్థలములోని సాధకుడు బోధితుడగును. దీక్షానంతరము చేపట్టెడి సాధనా క్రమములో సాధకుడెన్నియో సందేహముల నెదుర్కొనెడి యవకాశము కలదు. సందేహ నివృత్తి గాని యెడల నతడు తిరోగమన మార్గమున పయనించెడి యవకాశము కలదు. సందిగ్ధ స్థితి నుండి రక్షించి భక్తునికి సాధకోన్ముఖత కల్పించుట కొరకు శివుడే లింగస్థలమైన శిక్షాగురువు స్థలమున ప్రవేశించి బోధకుడగుచున్నాడు. బోధక పాత్రను పోషించెడి దశలో దీక్షా గురువే శిక్షాగురువగునని గ్రహించవలెను. బోధకుడైన శిక్షాస్థలి బోధించెడి లింగాంగ సామరస్యమునకు సంబంధించిన విద్య బోధ్యమగుచున్నది.

వీరశైవ ధర్మము యొక్క లక్ష్యము జీవుని శివునిలో నైక్యము చేయుటే. "విశబ్దే నోచ్యతే విద్యా శివ జీవైక్య బోధికా" అనెడిది రేణుకోక్తి (5:16) శివ జీవైక్యబోధికా'' అనెడి దానిని గురించి వివరించుచు "తత్త్వప్రదీపిక" "లింగాంగరూపశివజీవైక్యప్రకాశికావిద్యా'' అని తెలిపినది. (శ్రీ సిద్ధాంత శిఖామణిః శైవ భారతీ శోధ ప్రతిష్ఠానము వారి ప్రచురణ (పే.61) "వేదాన్త వాక్యజా విద్యా" అనెడి ఉపనిషద్ వాదుల మతము. వేదాంతమునకు విద్యకు అభేదము చూపబడినది. ఈ విద్య బ్రహ్మస్వరూపమైనదై యున్నదనెడిదే వీరి వాదన. ఇచ్చట బ్రహ్మమనగా పరబ్రహ్మమని తెలిసికొనగలరు. జీవాత్మ పరమాత్మల మధ్యన గల సంబంధమును వివరించెడిది వేదాంతమని భావింపబడినది. ఈ వేదాంతము నుండి పుట్టిన విద్యయే నిజమైన విద్య. దీనిని మోక్ష విద్యయని అనవచ్చును.

ఉపనిషద్వాదులు విద్యను బ్రహ్మ స్వరూపమనగా ఆగమవిదులు దీనిని శివస్వరూపమనిరి. "విద్యాయాం శివరూపాయాం విశేషాన్ రమణం యతః। తస్మాదేతే మహాభాగా వీరశైవా ఇతిస్మృతాః" యనెడి వీరశైవ శబ్ద నిర్వచనములోన యీ భావమే యిమిడి యున్నది. ఈ కారణముననే శ్రీ భగవత్పాదుల వారు నిట్టి విద్యను పతిజ్ఞానమనెడి పేరుతో గుర్తించిరి.

'పతి' యనెడి పదము సాంకేతిక పరమైనది. పాశుపత సిద్ధాంతమున చెప్పబడిన త్రికమునకు చెందినదని తత్త్వ ప్రకాశిక శ్రీనంజుండారాధ్యుల వారి పరిష్కరణ వలన తెలియుచున్నది. "శైవాగమేషు ముఖ్యం పశుపతి పాశా ఇతి త్రితయం। తత్ర, పతిశ్శివ ఉక్తః పశవోహ్యణవోऽర్థపంచకం పాశాః" అని చెప్పబడినది. ఆగమములలో చెప్పబడిన పశుపతి తత్త్వమును కేవలాద్వైతాచార్యుడైన శంకరాచార్యులు కొంత మేరకు వివరించిరని

తెలియుచున్నది. "పత్యురసా మంజుస్యాత్" అనెడి బ్రహ్మసూత్రమును విమర్శించుచు శ్రీ శంకరాచార్యుల వారు "ఈశ్వరుడు నిమిత్తకారణుడనియును, కార్యకారణ యోగదుఃఖాంతములు పతి, పాశ, పశువులు కలవని తెలిపిరి.

శివజీవులకు భేదము లేదు. కాని ప్రవృత్తి పథమున అవిద్య వలన యేర్పడిన పాశము వలన జీవుడు పశువగుచున్నాడు. త్రిమలములే పాశమనబడును. భక్తాంగునిలోని పశుత్వమును రూపు మాపుటకై గురువు మలచ్ఛేదనము చేయవలెను. తన్నిమిత్తమైన బోధను చేపట్టి తద్వారా జీవునిలోని అవిద్యను తొలగించవలెను. మండు వేసవిలోని నిండు అమావాస్య నాటి రాత్రి యందున గ్రీష్మతాపము-చిక్కటి చీకటి మొదలగు వాటి బాధలకు గురి అయ్యెడి వాని పగిది సంసారములో జీవి బాధపడును. శరత్కాల చంద్రుని కాంతి వంటి శివజ్ఞానము వలన జీవుడుపశమనమును పొందును. భక్తాంగుని కట్టి యవకాశమును కల్పించుటకై శివుడు శిక్షాగురువై శిష్యునికి బోధకుడగును. పతిజ్ఞానమే బోధ్యము. బోధన ఫలితముగా భక్తుని మనస్సు పరివర్తనకు గురి యగును. పరివర్తన పొందిన వాడెట్టులుండునో అని తెలిసికొనుటకు కుతూహల పడుట సహజమే. ఈ స్థితిని పొందిన సాధకులీ క్రింది వచనమును గమనించవలెను.

**స్వామి నీను, శాశ్వత నీను**
**ఎత్తిదె బిరిద జగవెల్లరియలు**
**మహాదేవ మహాదేవ మహాదేవ**
**ఇల్లింద బేరె శబ్దవిల్ల**
**పశుపతి జగక్కేకోదేవ**
**స్వర్గమర్త్య పాతాళ దొళగె**
**ఒబ్బనె దేవ, కూడల సంగమ దేవ।** (బసవేశ్వర వచనము : 526)

ఈ వచనములోని "పశుపతి జగక్కేకోదేవ" యనెడిది కీలకము.

పశుపతి జగమున కొక్కడే దేవుడు"

అట్టి దేవునికి సాధకుడు భృత్యుడని తెలుపబడినది. స్వామి-భృత్య సంబంధము యొక్క నేపథ్యమున భక్తాంగుడు సాధనను కొనసాగించునని తెలిసి కొనగలరు.

*- శివం భూయాత్ -*

## ఆశీర్వచనము : 2

క్రిందటి ఆశీర్వచనము లింగ స్థలాంతర్గతమగు భక్త స్థలమునకు చెందిన శిక్షా గురు స్థలము గూర్చి కొన్ని విషయములను తెలిసికొంటిమి. తత్సంబంధమైన మరికొన్ని విషయముల నిచ్చట తెలిసికొనెదము గాక.

శ్రీ గురువు శిష్యుని శుద్ధిని సాధించుటకై యతనికి సేవా కార్యముల నొసంగును. పూర్వ జన్మ సుకృతము గల వారికి మాత్రమే గురు-పెద్దలను సేవించెడి మహద్భాగ్యము లభ్యమగును. "సేవా ధర్మః పరమ గహనః యోగినామప్యగమ్యః" అనెడి ఉక్తి ప్రకారము మహా మహా యోగులకు కూడా యిట్టి భాగ్యము లభించ జాలదని శాస్త్రము చెప్పుచున్నది. మనుజునిలో సేవా భావన తలెత్తినదనగా నతని యందలి స్వార్థాది సంకుచిత భావములు లుప్తమగుచున్నవని భావించవలెను. మనుజునిలో ఎంతెంత మేరకు స్వార్థము పెరుగునో యంతంత మేరకు నతని స్వస్థతతో బాటుగా సామాజిక స్వాస్థత కూడా దెబ్బతినెడి యవకాశము గలదు. ఈ కారణమున వైయక్తిక మరియు సామాజిక స్వస్థత నిమిత్తము, ప్రతి యొక్కరు సేవా భావనను పెంపొందించికొనవలెను. ఈ విషయమున సేవా భావమే పరమోపయోగకరమైన సాధనమని గుర్తించవలెను.

ప్రాచీన కాలము నందున గురువుగారి ఆశ్రమము నందుననే గురుకులములుండుచుండెను. అందున దాసీపుత్రునికైనను, రాజపుత్రునికైనను ప్రవేశము లభించుచుండెను. అందు జేరినవారందరు గురుసేవ చేయుచునే విద్యాభ్యాసము చేయుచుండిరి. గురుసేవ వలన వచ్చెడి విద్య ఫలకారిగా నుండును. పూర్వకాలమున గురువు దగ్గరికి శిష్యుడు పోవు చుండెను. ఇప్పుడు దీనికి విరుద్ధముగా నున్నది. శిష్యులున్న దగ్గరకే

గురువు పోవుచున్నాడు. పాఠశాలలోనూ, కళాశాలలోను, విద్యార్థుల దగ్గరకు గురువులు నౌకరి పిదప నౌకరు నచ్చటికి వెడలి విద్యాబోధన చేయుచుందురు. ఇందులో నొక వైపరీత్యము కలదు. శిష్యులు కూర్చుండి యుంటే శ్రీ గురువు నిలుచుండి పాఠమును చెప్పుచుండును. ఈ కారణముననే నేటి విద్యార్థులు గురువును గురువుగా గుర్తించక ప్రభుత్వ జీతగాళ్ళుగా లేదా సేవకులుగానో చూచుచున్నారు. అప్పుడు విద్య తానేయెటుల వచ్చును. గురుకులములైనను, కళాశాలలైనను గాని వాటిలోని విద్యార్థులలో గురువుల యెడల శ్రద్ధా భావనలేదా సేవా భావన కలుగనంత వరకు విద్యా బోధన ఫలప్రదము ఎటుల కాగలదు?

"సగురుమే వాభిగచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్" శ్రోత్రియుడును, బ్రహ్మనిష్ఠ గలవాడు నగు గురువును శిష్యుడు నాశ్రయించవలెను. గురువైనవాడు కేవలము బ్రహ్మనిష్ఠ గలవాడై యుండిన చాలదు. అతడు సకల శాస్త్ర పారంగతుడై యుండవలెను. అప్పుడే యతడు శిష్యుని మనస్సున తల యెత్తెడి యనేక సందేహములకు నుత్తరము లిచ్చి వాటిని నివారించగలడు. ఈ విషయమున శ్రీ పూజ్య పాదులు నీ క్రింది విధముగా నుపదేశము నిచ్చిరి.

శ్లో॥ పూర్వ పక్షం సమాదాయ జగద్భేదవికల్పనమ్।
అద్వైత కృత సిద్ధాంతో గురురేష గుణాధికః॥ (సి.శి. 15-16)

జగద్భేద వికల్పములను పూర్వ పక్షముగా గైకొని శివాద్వైత సిద్ధాంతమును బోధించెడి శ్రీ గురువు గుణాధిక్యత గలవాడగుననెడిది యీ యుపదేశములోని భావము.

సామాన్యముగా జగత్తు, దానిలోనుండెడి వైవిధ్యత లేదా భేద భావన లందరికీ గోచరించెడివే. కాని యతి సూక్ష్మమైన రీతిన జగత్తు నిండా నిండియున్న పరశివుని యనుభూతి యెల్లరికినీ కాజాలదు. అందుకే శిష్యుడు గురువు నుద్దేశించి" హే గురుదేవా! కనిపించెడి జగత్తు లేదనియును, కనిపించని శివుడు గలడనియును ననుట యెంత వరకు సమంజసము" ఇటువంటి యనేక ప్రశ్నలను వేసి సమాధానమునొందును.

వీటికి సముచితమైన సమాధానములచే సందేహములను తీర్చవలసిన పాత్రను శ్రీ గురువు పోషించును. సామాన్యముగా ప్రతి యొక్కరు ప్రత్యక్ష ప్రమాణమునకే ప్రాధాన్యత నిత్తురు. దేవుని గురించి యేమి చెప్పినను, దేవుని మీరు చూచితిరా? యని యెల్లరు ప్రశ్నింతురు. ప్రతి యొక్క వస్తువును ప్రత్యక్ష ప్రమాణము ద్వారా నిరూపణ చేయుట సాధ్యమయ్యెడి విషయము కాదు.

జగత్తును చూచెడి మన కళ్లే మనకు ప్రత్యక్షముగా కనిపించవు.

ఎచ్చట ప్రత్యక్ష ప్రమాణము తన సామర్థ్యమును కోల్పోవునో, యచ్చట యనుమాన ప్రమాణమును నాశ్రయించవలసి యుండును. దూరపు పర్వతము నందున నూర్ధ్వముఖముగా లేచెడి పొగను చూసి "పర్వతో అగ్నిమాన్" అనగా పర్వతము నందున నగ్ని గలదు అనెడి జ్ఞానము గలుగును. ఇచ్చట నగ్ని ప్రత్యక్షముగా కన్పట్టుట లేదు. ఎచ్చటెచ్చట అగ్ని యుండునో యచ్చటచ్చట పొగ యుండును. అటులనే యెచ్చటెచ్చట పొగ యుండునో యచ్చటచ్చట అగ్ని యుండును. ఇట్టి సాహచర్య నియమ జ్ఞానము గలవాడు పర్వతము నందున నగ్నిగలదని నిశ్చయాత్మకముగా చెప్పగలడు. ఇటులనే విశాలమైన జగత్తుకూడ బ్రహత్ ప్రమాణపు కార్యమై యుండుటచేత దీనిని నిర్మించిన వ్యక్తియు దీని కంటెను బృహదాకారమున నుండును అనెడి జ్ఞానము గల్గును. ఇదియే అనుమాన జ్ఞానము. ఇంతేకాదు శబ్ద, ఉపమాన, అర్థాపత్తి మొదలగు ప్రమాణముల వలన వ్యక్తిని లేదా వస్తువును తెలిసికొనుటకు సాధ్యమగును.

శిష్యుడైన వాడు జగత్తులో కన్పట్టెడి భేదమే సత్యమైనదని భావించి, సందేహ మనస్కుడై యుండును. భేద భావపు జ్ఞానము నెటుల నివృత్తి యగుననెడి భావము గల్గినప్పుడు, వ్యావహారికముగా భేదము కన్పట్టినను, పారమార్థికముగా నిదియంతయును పరశివుని స్వరూపమే యనియును, "నేహనాస్తి కించన' యనియును, "లింగమధ్యే జగత్సర్వమ"నియును, పరశివునికి వెలుపల యేమియును లేదనియును తెలిపెడి వాడే శ్రీగురువు. భేద భావమును రూపుమాపి, శివాద్వైత జ్ఞానమును కలుగజేయును. ఈ విధముగా పూర్వపక్షమునకు చెందిన సందేహములను దూరము చేసి శివ-జగదభేదభావనను సుప్రతిష్ఠము చేసెడి గురువు గుణాధిక్యత గలవాడగుచున్నాడు. సకల శాస్త్రపారగంతుడై, శ్రుతి పరి జ్ఞానము గలవాడే యిట్టి గుణాధిక్యతను సాధించగలడు.

శిష్యుల మనమున గల్గెడి నానా విధములగు సందేహములను సమూలముగా నాశనము చేసెడి సామర్థ్యము గల్గిన శ్రీ గురువే గురు శిఖామణియని తెలిపెడి శ్రీ భగవత్పాదుల వారి యీ క్రింది యుపదేశమును గనుడి:

శ్లో॥ సందేహవనసందోహసముచ్ఛేద కుఠారికా।
యత్సూక్తి ధారా విమలా స గురూణాం శిఖామణిః ॥ (సి.శి. 15-17)

ఎంతో దట్టమైన యరణ్యమును నొక పదునైన గొడ్డలి చేత ఛేదించినటులనే, సద్గురువు తన శిష్యుని మనస్సులోని సమస్తమైన జటిల సందేహములను తన నిర్మలమైన జ్ఞానము చేత దూరము చేయును. ఇచ్చట జ్ఞానమును పదునైన గొడ్డలితో పోల్చబడినదనియును అజ్ఞానము దట్టమైన యరణ్యముగా భావింపబడినదనియును గుర్తించవలెను.

కాళ్ళకు కుచ్చుకొనిన ముల్లు, కళ్ళలో బడిన నలుసు గురించి యెవ్వరును నశ్రద్ధ వహించ వలదు. ముల్లు తీసి వేయని యెడల అరికాలు చెడిపోయి నడచుటకు కష్టమగును.

సందేహమున్న మనిషికి సరళముగా నడచుటకు కాదు. అతని మనము సవ్యముగా నుండదు. ముల్లుకుచ్చికొనిన పిదప సరళముగా నడువ వలెననిన ముల్లును తత్క్షణముననే తీసి వేయవలెను. అదే విధిన మనస్సు యొక్క సరళత్వమును గోరువారు ప్రసంగానుసారముగా తన మనస్సున తలయెత్తిన సందేహముల నివృత్తిని చేసికొనవలెను. తన్నిమిత్తమై శాస్త్ర పారంగతుడైన సద్గురువును శరణు జొచ్చవలెను. సేవాదులచేత నతనిని సంతృప్తునిగా చేయవలెను. సందేహ నివృత్తిని తద్వారా మానసిక స్వస్థతను, సాధించవలెను. స్వస్థత చెందిన మనస్సుగల వాడు సుఖిగా జీవనమును గడపవచ్చును. అజ్ఞానము దూరమగుటచేత శిష్యునికి మోక్షము లభించును. ఇట్టి గురువును శ్రీ భగవత్పాదుల వారు భవతారకుడను పేరున సంబోధించుచు, నీ క్రింది యుపదేశమునిచ్చిరి.

శ్లో॥ యత్సూక్తిదర్పణాభోగే నిర్మలే దృశ్యతే సదా।
మోక్షశ్రీర్బింబరూపేణ స గురుర్భవ తారకః॥ (సి.శి. 15-18)

ఎవ్వరి యుపదేశమనెడి దర్పణము నందున మోక్షమనెడి సిరి యొక్క బింబము గోచరించునో నతడే భవతారకుడగు గురువగుచున్నాడు. ఇట్టి గురువు గారి సహాయము చేత భవి జనులెందరో భవసాగరమును దాటి మోక్షమును బడయ గల్గుదురు. ఇట్టి జ్ఞాన ప్రకాశము నంద జేసెడి గురువుకు సమానమైన వారుండరని తెలిపెడి శ్రీ భగవత్పాదుల వారు యీ క్రింది యుపదేశమును గనుడి:

శ్లో॥ శిష్యాణాం హృదయాలేఖ్యం ప్రద్యోతయతి యః స్వయం।
జ్ఞాన దీపిక యానేన గురుణా కః సమో భవేత్ (సి.శి. 15-19)

శిష్యుల హృదయములలో చిత్రింపబడిన చిత్రలేఖన మనెడి జీవుని స్వస్వరూపమును జ్ఞాన దీపము ప్రకాశమున చూపగల్గు శ్రీ గురువుతో సమానముగా నట్టి గురువు నుండగలడనెడిది యీ యుపదేశము యొక్క సారాంశము. స్వస్వరూపమును చిత్రపటముతోను, యుపదేశమును దీపముతోను, పోల్చి చెప్పబడినది. ప్రతి యొక్కరి హృదయమున శివుడుండునని యింతకంటెను క్రితమే తెలిసికొని యుంటిమి. ఆ శివుని శివయోగమనెడి సాధనము చేత దర్శించవచ్చును. ఆ శివయోగ రహస్య మును బోధించెడి వాడే శ్రీ గురువని తెలిసికొనవలెను. గురూపదేశము లేని యెడల శివదర్శనము కాజాలదు. వేరెవ్వరును నీ విషయమున సహాయము నివ్వజాలరు. ఈ కారణముననే శ్రీగురువు నసమానుడని తలుపబడుచున్నాడు. ఇట్టి యద్వితీయుడగు శ్రీగురు వెవ్వరికి లభించుననిశ్రీ భగవత్పాదులవారు నీ క్రింది విధముగా ప్రశ్నించిరి.

శ్లో॥ పరమాద్వైతవిజ్ఞానపరమౌషధిదానతః।
సంసారరోగనిర్మాథీ దేశికః కేన లభ్యతే॥ (సి.శి: 15-20)

సంసారమనెడి రోగమును నివారించుటకై శివాద్వైతమనెడి ఔషధము నిచ్చెడి శ్రీ గురువు నెవ్వరికి లభ్యమగు ననెడిది యుపదేశములోని సారాంశము. దీర్ఘరోగములతో బాధపడెడి వారికి సరియైన నివారణోపాయమును చూపెడి వైద్యుడు లభ్యమగుట చాలా కష్టతరమైన విషయము. అదే విధిన భవరోగములతో బాధపడెడి వానికి యుపదేశము నిచ్చెడి గురువు నంత సులభముగా లభించడు.

తన్నిమిత్తమై భగవదనుగ్రహము నెంతయో నవసరమని గ్రహించవలెను. పొందుటకు వలయు కృషిని జేయవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 10-08-1992
స్థలం : **భికుబాయి మేనకుదళె**
**మంగళ కార్యాలయము, పూనే**

## విశేష ప్రదీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు శిక్షాగురువులు పోషించెడి వివిధ పాత్రల గురించి వివరించిరి.

భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతిలో పరంపరానుగతంగా వచ్చే ఆచార సాంప్రదాయముల వలన సాధకుడు అవగాహన సంబంధమైన చిక్కుల నెదుర్కొనెడి యవకాశము కలదు. తలయెత్తెడి సందేహములు పెరిగి పెరిగి పెద్ద కారడవి స్వరూపమును దాల్చవచ్చును. అంతరాంతములోని జ్ఞాన జ్యోతి నార్పివేయ వచ్చును. “కిం కర్తవ్యం” అనెడిది తోచవచ్చును. ఇట్టి స్థితిలో కొట్టి మిట్టాడుచు నుండెడి సాధకుని మనోధైర్యమును మానసిక స్థైర్యమును కల్పించెడి పాత్రను పోషించుటకు శివుడు శిక్షాగురువు స్వరూపమును దాల్చునని గ్రహించ గలరు.

శిక్షా గురువు ప్రశ్నోత్తర పద్ధతిలో శిష్యునికి యిది పూర్వ పక్షమనియు ఇది వీరశైవ పక్షమనియును తెలియజెప్పుచు వేదాగమ పురాణేతిహాసములలో వివిధాంశములను వివరించి చెప్పును.

కపిల, పతంజలి మొదలగు ఋషుల చేత ననేక సిద్ధాంతములు ప్రతిపాదింపబడినవి. వీటి నైదు విధములుగ వర్గీకరించవచ్చును. అవి సాంఖ్యము, యోగము, పాంచరాత్రము, వేదము, పాశుపతము. వైదికములోని జైమినీ కృత సిద్ధాంతమే పూర్వ మీమాంస. ఇది యాగాదులను ప్రతిపాదించెడిదై యున్నది. ఇది అనీశ్వరవాదమని కొందరి మతము. పూర్వపక్షమనగా నిదియే యనియును, నిది విసర్జనీయమనెడి దొక యభిమతము. ఉత్తర పక్షమనగా నుపనిషత్తుల నాధారముగా గొని ప్రతిపాదింపబడిన అద్వైతాది సిద్ధాంతములనిచెప్పబడుచున్నది.

వీరశైవ ధర్మము నందున కేవలాద్వైతాదుల విమర్శను గాంచగలము. కపిల ఋషి యొక్క సాంఖ్య సిద్ధాంతము నాస్తిక వర్గమునకు చెందినది. పాంచరాత్రము వైష్ణవోపాసనను నిర్దేశించుచున్నది. ఇవన్నియును ఆమోదయోగ్యములు కావు. ఈ కారణమున పూర్వ పక్షమిదియని తెలుపుట కష్టతరమైన విషయము.

ఇట్టి స్థితిలో శ్రీ పాల్కురికి వారి యభిప్రాయమే శరణ్యమని దోచుచున్నది. గమనించుడి.

**సీ॥ వేదంబులందును వేదాంతములయందు**
**గర్మంబు నద్వైత గతికి నూకి**
**తర్కశాస్త్రములందు ధర్మశాస్త్రములందు**
**దూష్యంబు జడును దొలగ బెట్టి**
**దివ్యాగమములందు ధీచతుర్భాగంబు**
**లందు నన్య క్రియ లట్టులుంచి**
**యోగి బురాణము లందు నుపపురాణములందు**
**బూర్వపక్షంబులన్ బోవ దుడిచి**
**శ్రుతుల తేట శాస్త్రమతముల నిశ్చయం**
**బాగమముల గుహ్యమా పురాణ**
**వితతి చేవ యనగ వీరమాహేశ్వర**
**పథము విస్తరింతు బసవ లింగ!** (చతుర్వేద సారము, ప. 26)

పాల్కురికి వారి మతము సరియైన దని దోచుచున్నది. శిక్షాగురువు స్థలముననున్న, లింగస్థలి యిట్టి విషయములను గమనించియే బోధక పాత్రను పోషించునని తెలిసికొనగలరు.

*- శివం భూయాత్ -*

## జ్ఞాన గురుస్థలము :
## ఆశీర్వచనము : 1

ఇంతక్రితమున శిక్షాగురుస్థలమునకు సంబంధించిన సమస్త విషయములను తెలిసికొంటిమి. ఇప్పుడు లింగస్థలములలో భక్తస్థలాంతర్గతమున శిక్షా గురువు స్థలమునకు తరువాతి స్థలమైన జ్ఞానగురుస్థలం గురించి తెలిసికొనెదము గాక.

దీక్షాగురువు, శిక్షాగురువు మరియు జ్ఞానగురువు లనెడివారు భిన్నమైన వారనెడి యభిప్రాయము గల్గెడి యవకాశము గలదు. వాస్తవముగా నొకే గురువు దీక్షనిచ్చెడి సమయమున దీక్షాగురువుగాను, శాస్త్రీయ పరిజ్ఞానమును బోధించునప్పుడు శిక్షాగురువు గాను, శివాద్వైత సిద్ధాంతమును బోధించునప్పుడు జ్ఞాన గురువుగాను వెలుగొందునని గ్రహించవలెను. జ్ఞానగురువు యుపదేశించెడి జ్ఞానపరమైన విషయమును నిరూపించెడిదే జ్ఞానగురువు స్థలమని తెలిసికొనగలరు.

మనుష్య జన్మనెత్తిన ప్రతియొక్కరును శివ–జీవుల జ్ఞానమును తెలిసికొనవలసిన యవశ్యకత గలదు. ఇట్టి జ్ఞానములేని వారు పశుతుల్యులని యాధ్యాత్మిక జ్ఞానము గలవారు తెలుపుచున్నారు. తినుట, కూర్చుండుట, పరుండుట మొదలగు వ్యావహారిక విషయములకు చెందిన జ్ఞానము మనుజులకంటెను పశువులకే నధికముగా నుండునని తెలియుచున్నది. ఈ కారణముననే పశువులు ఆరోగ్యవంతములై యుండగా, మనుజుడు వ్యావహారిక జ్ఞానము తగుస్థాయిలో లేనందున రోగపీడితుడగుచున్నాడు.

వ్యావహారిక జ్ఞానముతో బాటుగా, నాధ్యాత్మిక జ్ఞానమును పొందెడి యధికారము మానవునికి గలదు. అందుచేత వీరశైవ ధర్మము యొక్క ఆచార్యులు దీక్షా శిక్షాదుల మూలకముగా నితనిని సంస్కరించి ఆత్మజ్ఞానమును బోధింతురు. ఈ విషయమున శ్రీ అగస్త్యుని యుద్దేశించి శ్రీ భగవత్పాదులవారు నీ క్రింది విధముగా నుపదేశము నిచ్చిరి.

**ఉపదేష్టోపదేశానాం సంశయచ్ఛే కారకః।**
**సమ్యగ్జ్ఞానప్రదః సాక్షాదేష జ్ఞానగురుఃస్మృరీః॥**
(సి.శి. 15-21)

సద్గురువైనవాడు శాస్త్రము యొక్క రహస్యార్థమును వెలికితీసి శిష్యునికి యుపదేశమునిచ్చును. ఉపదేశము నిచ్చుటయేగాదు, శిష్యుని మనస్సున తలయెత్తెడి సమస్త సందేహములను దూరము చేయును. ఇందుచేత శిష్యునికి నిస్సందిగ్ధమైన జ్ఞానము, సంప్రాప్తమగును. ఇంతటి జ్ఞానోపదేశమును చేసెడి గురువే జ్ఞానగురువని పించుకొనును.

వాతులోత్తరాగమము నందున కూడా జ్ఞాన గురువు లక్షణము నీ విధముగనే వివరింపబడినది. ఏ గురువైనను శిష్యునికి నీ యమూల్యమైన ఆత్మజ్ఞానమును నుపదేశించుటకంటెను ముందున నా శిష్యుడు నాజ్ఞానమును పొందుట కర్హుడా కాడా యనెడి దానిని పరీక్షించును. ఈ విషయమును వివరించెడి కథ యొకటి కఠోపనిషత్తులో గలదు.

వాజశ్రవుని కొడుకైన నచికేతుడు యమలోకమునకు పోయినప్పుడు యముని వలన నాత్మ విద్యను పొందవలెననెడి జిజ్ఞాసను వ్యక్తపరచును. ఈ బాలకుడు నాజ్ఞానమును పొందుటకు వలయు అర్హతలు గల్గియున్నాడా? లేడా? అనెడి దానిని తెలిసికొనుటకు యముడు ననేక పరీక్షలకు గురిచేయును. అందులోని భాగముగా ననేక ప్రలోభములను చూపును. అయితే విషయ వ్యామోహములేని నచికేతుడు, వ్యామోహమునకు గురి కాకుండగ నుండి పరీక్షలలో నెగ్గును. తాను నాత్మవిద్య పొందుటకు యోగ్యుడనెడిది సత్యమని ఋజువు చేయును. చివరకు సంతృప్తుడైన యమధర్మరాజు నచికేతునికి నాత్మవిద్యను బోధించును. ఈకథ వలన తెలిసెడిదేమనగా విషయ వాంఛలను వీడినవాడేఆత్మజ్ఞానమును పొందుటకు అర్హుడు. ఇట్టి యర్హత గలవానికి నాత్మవిద్యను బోధించెడి వానిని జ్ఞానగురువుగా గుర్తించవచ్చును.

జ్ఞానగురువు గల్గియుండెడి జ్ఞానము గురించియును, నద్దానిని సంపాదించెడి విధానము గూర్చియును శ్రీ భగవత్పాదులవారు నీ క్రింది విధిన నుపదేశమునునిచ్చిరి.

**నిరస్తవిశ్వసంభేదం నిర్వికారం చిదంబరమ్।**
**సాక్షాత్కరోతి యో యుక్త్యా స జ్ఞానగురు రుచ్యతే॥** (సి.శి. 15-22)

కనిపించెడి విశ్వము భేద భావమును గల్గియుండును. భేదము ప్రపంచ రూపమున నుండగా శివుడు నభేదరూపమున నుండును. అనగా శివుడు నద్వితీయుడై యున్నాడు. జాగ్రదవస్థయందున ననేక విధములుగా దోచెడి యీ విశ్వము సుషుప్తియవస్థ యందున యది యంతయును లేనిదై తనకు తానై యుండెడి యొక ఆనందస్థితియు నందరికీ ప్రాప్తమగుచున్నది. ఇటులనే జ్ఞానియైన వానికి జాగ్రదావస్థ యందుననే నిర్వికారుడును, చిదాకాశ రూపియునైన పరశివుడు ప్రత్యక్షమగును. ఈ సాక్షాత్కారము వలననే వ్యవహారికముగా కనపట్టెడి భేదభావము అణగిపోవును. ఈ విధముగా శివాద్వైతశాస్త్రము మరియు స్వానుభవముల మూలకముగా శివజ్ఞానమును బడయుట సాధ్యమగుచున్నది. ఈ రీతిన దీనిని బడసినవాడే జ్ఞానగురువని తెలిసికొనవలెను. వీరశైవ సిద్ధాంతము ప్రకారముగా పరశివుడే ప్రపంచ రూపమును ధరించికొని యున్నాడు. ఐనను అతడు ఏ బాధను పొందుటలేదు. బంగారపు ఆభరణములు ధరించినపుడు ఆ బంగారమునకెట్టి బాధయుండదు. అటులనే పరమాత్ముడు ద్వైతరూపమైన ప్రపంచమును దాల్చినను మూల స్వరూపమునందున ఎట్టి వికృతియును కలుగదు. "అహి కుండల మరియు సాగరతరంగ న్యాయ" మూలకముగా యిచ్చట ఆ విషయమును ప్రస్తుత పరిచినాడు. అనగా సర్పము వృత్తాకారముగా పరుండియుండినను, మరుక్షణముననే లంబాయమానముగా సంచరించుటను ప్రారంభించును. ఇదే విధముగా వృత్తము లేదా లంబాకారమును దాల్చినను దాని స్వరూపమునందున ఎట్టి మార్పును కానరాదు. ఇటులనే గాలియొక్క తాకిడికి తరంగ తరంగములుగా కన్పట్టెడి సముద్రము గాలి లేనప్పుడు నిస్తరంగమై ఎల్లరి అనుభవమునకు గోచరమగును. ఇచ్చట పామైనను లేదా సముద్ర తరంగమైనను ఏ రూపము దాల్చినను వాటి మూల స్వరూపములో మార్పు రానటులనే, అదే విధముగా పరశివుడు ఏ రూపము దాల్చినను అతనిమూల స్వరూపమున మార్పు గానజాలదు. ఈ విధముగా అనేక యుక్తి ప్రమాణముల ద్వారా శివజీవా భేదమును కల్గించెడి వాడే జ్ఞాన గురువు. ఇట్టి జ్ఞాన గురువు గురించి భగవత్పాదులు మరికొన్ని విషయములను యీ క్రింది విధముగా తెలియచెప్పిరి.

**శ్లో॥ కలంక వాన సౌ చంద్రః క్షయవృద్ధిపరిప్లుతః ।**
**నిష్కలంకస్థితో జ్ఞానచంద్రమా నిర్వికారవాన్**
**పార్శ్వస్థతిమిరం హంతి ప్రదీపో మణినిర్మితః**
**సర్వగామి తమోహంతి బోధదీపో నిరంకుశః ॥** (సి.శి. 15-23-24)

ఈ విధముగా ఉపదేశింపబడిన దీని సారాంశమేమనగా చంద్రునికి మరియు జ్ఞాన చంద్రునికిని అటులనే ప్రదీపమునకును బోధ దీపమునకును, వ్యత్యాసము కలదని ప్రతిపాదించిరి. జగత్తుకు శీతలమైన ప్రకాశమును కల్గించెడి చంద్రుడు, కళంకసహితుడుగాను, క్షయవృద్ధ వికారములను గల్గినవాడుగను వున్నాడు. ఆకాశమునందున పౌర్ణిమ దినమునందు చంద్రుడు అఖండముగా కన్పించినను, ఆతని యొక్క కల్మషములు, స్పష్టముగా కన్పట్టుచుండును. ఇదే ప్రకారముగా చంద్రునికి శుక్ల, కృష్ణ పక్షములలో వృద్ధి, క్షయలు కలుగుచున్నవి. అమావాస్య దినమున సంపూర్ణముగా అదృశ్యమగును. ఐతే, శివాద్వైత జ్ఞాన స్వరూపియైన చంద్రుడు నిష్కళంకుడిగాను, నిర్వికారిగాను నుండును. ఈ జ్ఞాన మెప్పటికిని లుప్తముగాదు. లౌకిక పరమైన జ్ఞానము, లుప్తమయ్యే అవకాశము కలదు. అయితే, ఆత్మజ్ఞానపరమైన దగు యీ ప్రకాశమునకు లోపమనెడిది యుండదు.

పూజ్యపాదులు, జ్ఞానము జ్ఞాన చంద్రునికంటెను విలక్షణమైనదని తెలియపరిచిరి. అదే విధముగా మణినిర్మితమైన దీపముకంటెను, బోధ నిర్మితమైన దీపమే ముఖ్యమైనదని తెలియజేసిరి. మణినిర్మితమైన దీపమైనను, మరే రకమైన దీపమైనను యివి తమ చుట్టు ఆవరించిన చీకటిని మాత్రమే దూరము చేయగలవు. కాని శివాద్వైతమైన బోధా దీపమునకు ఎల్లలుండవు. ఎక్కడ అజ్ఞానముండునో, అక్కడికి వెళ్ళి అద్దానిని రూపుమాపును. ఒక పల్లెలో లగ్నము కొరకు వచ్చిన పెళ్ళివారిని ఆ ఊరి యొక్క పాఠశాలలో వుంచిరి. ఆ పాఠశాల యొక్క మూలలో దీపము యొక్క వ్యవస్థ లేకుండెను. సాయంకాలము కాగానే ప్రతియొక్కరు, చీకటి ఆవరించినది దీపము కావలెనని అడుగజొచ్చిరి. ఆ లగ్నపు యజమాని తన సేవకుడిని పిలిచి ఒక పెట్రోమాక్సు లైటును వెల్గించి, దానిని వాని నెత్తిమీదుంచి, ఈ విధముగా చెప్పెను. "ఏ గదిలో చీకటి యున్నదో, ఆ గదిలో దీనినిపెట్టి రమ్మని పంపెను. సేవకుడదే విధిన, లైటును మోసుకుని పోయి పాఠశాలలోని యొక గదిలోకి ప్రవేశించెను. మరుక్షణముననే

ఆతనికచ్చట చీకటి కన్పించలేదు. ఆ గదినుండి బయటకు వచ్చి మరొక గదిలోకి ప్రవేశించెను. అచ్చట కూడ అతనికి చీకటి కన్పించలేదు. అన్ని గదులలోను, యిదే విధమైన అనుభవమును పొందెను. ఆతడు తన యజమాని దగ్గరకెళ్ళి "ఓ యజమానిగారు! మీ బంధువులున్న పాఠశాలలోని ఏ గదిలోను చీకటి లేనేలేదు. అందులో నుండెడివారు అనవసరముగా లైటు గురించి పరితపించుచున్నారు అని వివరించెను. ఈలోగా, చీకటితో బాధపడుతున్న బంధుజనులు, పరిగెత్తుకొని వచ్చి సేవకుడు చేసిన పిచ్చితనమును యజమానికి వివరించి, తలయొక లైటును తీసుకొనివెళ్ళిరి.

ఇచ్చట దీపము తన చుట్టు గల చీకటిని మాత్రమే తొలగించగలిగినది. ఈ విధిన దీపము యొక్క సంకుచిత స్వభావము తెలియవచ్చుచున్నది. శివాద్వైతబోధ రూపమైన దీపము నిరంకుశముగానుండి, సర్వత్రా వ్యాపించెడి అజ్ఞానరూపమైన అంధకారమును, ఏకకాలముననే నిర్మూలించును. అందుచేత, మణిదీపముకంటెను బోధాదీపముత్కృష్టమైనదిగా తెలిసికొనవలెను.

ఇట్టి నిరంకుశ జ్ఞానమును, ప్రదానము చేసే గురువు యొక్క మహత్త్వమును శ్రీభగవత్పాదుల వారీ విధముగా ఎరుక పరిచిరి.

**సర్వార్థ సాధక జ్ఞాన విశేషాదేశతత్పరః**
**జ్ఞానాచార్యః సమస్తానాం అనుగ్రహకరః శివః।**
**కటాక్ష చంద్రమా యస్య జ్ఞానసాగర వర్ధనః।**
**సంసార తిమిరచ్ఛేది స గురుర్ జ్ఞానపారగః॥** (సి.శి. 15-25-26)

ఈ తెరగున శ్రీ భగవత్పాదులవారు కొనియాడిరి. సద్గురువుచేత ఉపదేశింపబడిన శివాద్వైత జ్ఞానము భోగము మరియు మోక్షములను యిచ్చెడిదై యున్నది. ఈతడు ముముక్షువుల మీదను అనుగ్రహమును కటాక్షించగలడు. సాక్షాత్తు శివస్వరూపమైన యాతని జ్ఞానాచార్యుడని యందురు.

పౌర్ణిమ యొక్క చంద్రోదయమైనప్పుడు సముద్రము యొక్క పోటు అయినట్లుననే గురుకటాక్ష రూపమైన చంద్రోదయమైనప్పుడు శిష్యుని జ్ఞానసముద్రము పైకి అలలవలె ఉబుకును. సంసారమనెడి చీకటిని నిర్మూలమును చేసెడి సద్గురువు జ్ఞానపాఠకుడన్పించుకొనుచున్నాడు. ఇట్టి జ్ఞాన గురువును శ్రీ భగవత్పాదులవారు భాస్కరునితో పోల్చిరి. ఈ క్రింది ఉపదేశమును గనుడి.

**శ్లో॥ బహిస్థిమిర విచ్ఛేత్తా భానురేషః ప్రకీర్తితః।**
**బహిరం తస్తమచ్ఛేది విభుర్దేశిక భాస్కరః॥** (సి.శి. 15-27)

బయటి సూర్యుడు, బహిరంగపు యొక్క చీకటిని దూరము చేయగలడు. సద్గురువనెడి భాస్కరుడు బహిరంగము, మరియు అంతరంగమునందుండెడి అజ్ఞానమనే తమస్సును దూరము చేయును. "నాయం శివః" అనగా యీ ప్రపంచము శివ స్వరూపముకాదు; "నాహం శివః" నేను శివరూపిని కాను యనెడివి బహిరంగ మరియు అంతరంగ అజ్ఞానములు. ఈ రెంటిని దూరము చేయు సామర్థ్యము జ్ఞాన గురువున కుండును. ఈతని ఉపదేశమును ఆలించిన పిదప, బహిరంగమున గల ప్రపంచము శివరూపమనియును తానూను శివస్వరూపుడనియును తెలిసికొనుచున్నాడు.

జ్ఞానగురువు తన కటాక్షముచేత శిష్యునిలో శివత్వ భావనను కల్గించునని శ్రీభగవత్పాదులు యీ క్రింది విధముగా ఉపదేశించిరి.

**శ్లో॥ కటాక్షలేశ మాత్రేణ వినా ధ్యానాదికల్పనమ్।**
**శివత్వం భావయేద్యత్ర స వేదః శాంభవో మతః॥**
**శివవేదకరే జ్ఞానే దత్తే యేన సునిర్మలే।**
**జీవన్ముక్తో భవేచ్ఛిశ్యః స గురుర్ జ్ఞానసాగరః॥** (సి.శి. 15-28-29)

దీని తాత్పర్యమేమనగా ధ్యాన ధారణాది అష్టాంగ యోగముల సాధన యొక్క అవసరము లేకుండ జ్ఞానగురువు తన కటాక్షము మాత్రముచేత శివత్వ భావనను కల్గించుచున్నాడు. గురువుగారిచ్చెడి జ్ఞానము శాంభవ జ్ఞానమని పిలువబడుచున్నది. ఈ జ్ఞానమును తెలిసికొనిన వెంబడే

శిష్యుడు జీవన్ముక్తుడుగుచున్నాడు. ఈ విధముగా తన జ్ఞానోపదేశముచేత శిష్యునికి జీవన్ముక్తిని అనుగ్రహించెజ్ఞానగురువును, జ్ఞాన సాగరమనియును అందురు. సముద్రమునందున అగాధమైన జలముండునటులనే గురువునందునను అపారమైన జ్ఞానసంపదనుండును. ఎవరికెంత కావలయునో అంత గ్రహించవచ్చును. అది యెన్నటికిని తరుగదు. ఈ విధముగా, గురువుగారి జ్ఞానము అక్షయ నిధియై యున్నది. వీరశైవులందరు జ్ఞాన గురువునకు శరణాగతులై యాతని కృపాకటాక్షముచేత దివ్య జ్ఞానమును బడసి, జీవన్ముక్తులు కావలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 11-08-1992
స్థలం : **భికుబాయి మేనకుదళె**
**మంగళ కార్యాలయము, పూనె**

## విశేష ప్రదీపిక :

శిష్యుల యొక్క సందేహములను తీర్చెడి జ్ఞాన ప్రదాత పాత్రను పోషించెడి శిక్షా గురువు జ్ఞాన గురువనబడుచున్నాడని శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు సెలవిచ్చిరి.

ఉపదేష్ట, ఉపదిష్ట, ఉపదేశ్యములనెడివి ఉపదేశ ప్రక్రియలోని యంతర్భాగము. ఉపదేష్ట గురువు కాగా నుపదిష్ట శిష్యుడగుచున్నాడు. ఉపదేశ్యమనెడి దేమిటి, దాని స్వరూప స్వభావము లెట్టులుండవలెను అనెడి ప్రశ్నలు తలయెత్తెడి యవకాశము కలదు. ఉపదేష్ట వుపదేశించెడిది జ్ఞాన మనెడిది నిర్వివాదమైన యంశము. ఆ జ్ఞానము యొక గరిమ గురించి నిర్ణయించెడిది గురువు మాత్రమే. శిష్యుని యొక్క మానసిక ఎదుగుదలను దృష్టిలో నుంచికొని యుపదేశ్యమును నిర్ణయించవలసి యుండును. ఉపదేశ్యపరమైన యంశములో భక్తిజ్ఞాన వైరాగ్యముల పాళ్ళు యెంత మేరకుండవలెననెడిది మరొక ప్రశ్న. ఈ ప్రశ్నల నేపథ్యమున గుర్తించవలసినదేమనగా నుపదేష్ట తన యుపదేశమును నేక కాలములో కాకుండగ చిరకాలము వరకు కొనసాగించును. శిష్యుని సాధన క్రమమున తల యెత్తెడి బాధకముల తొలగించుట కొరకు గురువు తన యుపదేశమును కటాక్షించవలెను. గురువు గారీ పాత్రను పోషించని యెడల శిష్యుడు అజ్ఞానవశమున తప్పుదారిన పట్టెడి యవకాశము కలదు. ఈ విషయమును స్పష్టము చేసెడి శ్రీ బసవేశ్వరుల వారి క్రింది వచనమును గనుడి :

**సుపథ మంత్రోపదేశవ కలితు**
**యుక్తిగెట్టు నడెవిరయ్యా**
**'తత్త్వమసి' యెంబుదనరిదు**
**కత్తలె దొడువిరయ్యా**
**వేద విప్రర విచారిసి నోడలు**
**"ఉపదేశ పరీక్షె నాయకనరక" ఎందుదు**
**కూడల సంగన వచన సూచనె** (శ్రీ బసవేశ్వర వ॥ 91)

ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి :

**సుపథ మంత్రోపదేశమును నేర్చి**
**యుక్తి చెడి నడతురయ్యా!**
**"తత్త్వమసి" అనెడిదెరిగియు**
**చీకటిని దొడిగిరయ్యా!**
**వేదవిప్రుల విచారించి చూచుట**
**ఉపదేశ పరీక్షనాయకనరక మనినది**
**కూడల సంగని వచన సూచన**

సందేహ చిత్తుడెట్టుల ప్రవర్తించునో యనెడి దానిని బసవన్నవారు తెలియజెప్పిరి. పాల్కురికి వారి యనుభవ సారములోను యిట్టి భావనలను చూడగలము. గురూపదేశము యెడల నిరాసక్త వైఖరి నవలంబించిన వారిని సోమనాథుడు నిశితముగా విమర్శించిరి.

ఇట్టి దశలో శివుడు జ్ఞాన గురువై సందేహముల పరిచ్ఛేదనమును చేసి శిష్యుల యొక్క అజ్ఞానాంధకారము దొలగించును. శిష్యుని అంతరంగ బహిరంగములను ప్రకాశమునకు గురి చేయును. కళంకరహితమైన జ్ఞానముచేత శిష్యుల చిత్తములను నిర్మలమైనవిగా మార్చును.

జ్ఞానగురువు ప్రదానము చేసెడి జ్ఞానము సమ్యక్ జ్ఞానమని తెలుపబడినది. సమ్యక్ అనెడి పదము సంపూర్ణమైన అనెడి అర్థమును సూచించును. అందుచేత సమ్యక్ జ్ఞానమనగా సమస్తమైన విషయముల దెలిపెడి జ్ఞానమని యెరుగవలెను. ఇట్టి జ్ఞానము వలన వెలువడెడి ప్రకాశము యొక్క వ్యాప్తికి యెల్లలుండవని గుర్తించగలరు. లోకములోని సమస్త మానవాళిని ఉద్ధరించెడి శక్తి యీ ప్రకాశమున కుండును.

పురుషార్థముల ప్రసక్తి మన సనాతన ధర్మమున గలదు. ధర్మార్థ కామమోక్షములే పురుషార్థములని యనబడుచున్నవి. వీరశైవ విజ్ఞుల ప్రకారము భక్తియే పురుషార్థము. యుక్తి చెడి యితరముల వాంఛించిన వాడు భక్తి పథమునకు చెల్లరనెడిదే వారి యభిమతము. జ్ఞాన గురువుల వారి యుపదేశము వలన భక్తి యనెడి పురుషార్థము లభించును. తద్వార లింగాంగ సామరస్యమునకు మార్గము సుగమమగును.

వేధాదీక్షను పొందినవాడే విధిన శాంభవ జ్ఞానమును పొందునో అదే విధముగా జ్ఞాన గురువులవారి యుపదేశమును పొందినవాడు శ్రీగురువుల అవలోకన వలన సమ్యక్ జ్ఞానమును పొందుచున్నాడు.

*శుభం భూయాత్*

## క్రియా లింగస్థలము :

## ఆశీర్వచనము : 1

క్రిందటి ఆశీర్వచనమునందున జ్ఞాన గురుస్థలమునకు సంబంధించిన సవిస్తార విషయ వివేచనము చేసియుంటిమి. ఇప్పుడు క్రియాలింగ స్థలమును గూర్చి విషయములను తెలిసికొనెదముగాక. జ్ఞాన గురువు వలన ఉపదేశింపబడిన క్రియా ఎచ్చట లయమును పొందియుండునో దానినే క్రియాలింగమని యందురు. ఈ విషయమును తెలియపరిచెడి ఆగమోక్తిని గనుడి :

**శ్లో॥ ఇష్టావాప్తికరం సాక్షాదనిష్ట పరిహారకమ్।**
**ఇష్టమూర్జం స్వభక్తానాం అనుయచ్ఛతిసర్వదా చ**
**ఇష్టలింగమితి ప్రాహ తస్మాదాథర్వణి శ్రుతిః॥**

భక్తుని సకల యిష్టార్థములను పూర్తి చేయగల సామర్థ్యము గలిగి సర్వ అనిష్టములను పరిహారము చేయగలిగెడు లింగమే యిష్టలింగమని అథర్వణ శ్రుతి చెప్పిన దానినే వాతులాగమము సమర్థించినదని యిచ్చట కన్పట్టుచున్నది. ఈ వాతులాగమ వచనమునే ప్రమాణముగా పెట్టుకొని శ్రీ రేణుక భగవత్పాదులవారు క్రియాలింగము యొక్క లక్షణమును ఈ క్రింది విధముగా నెఱుక పఱచిరి.

**శ్లో॥ గురోర్విజ్ఞానయోగేన క్రియా యత్రవిలీయతే।**
**తత్క్రియాలింగమాఖ్యాతం సర్వైరాగమపారగైః॥** (సి.శి. 15-30)

గురువునుండి ప్రాప్తమైన విశేషమైన జ్ఞానము మూలమున క్రియ యనెడిది యెచ్చట విలయమగునో దానిని ఆగమపారంగతులైన వీరశైవాచార్యులు క్రియా లింగమని పిలుతురు. విజ్ఞానమనగా విశేష జ్ఞానమని యర్థము. అది భౌతిక, రసాయన మొదలగు విషయ సంబంధముగా వుండవచ్చును. ఇది ఆధ్యాత్మిక విషయ సంబంధముగా వుండవచ్చును. ఇచ్చట గురువునుండి ప్రాప్తమైన విజ్ఞానము ఆధ్యాత్మిక విషయమునకు సంబంధము గలదని గుర్తించవలెను. ఇష్టలింగము యొక్క స్థూలమైన విషయమును జ్ఞానమని యనిన యెడల దాని సూక్ష్మమైన విషయ పరిజ్ఞానము విశేషజ్ఞానమగును. అంగ షట్స్థలములయందున వచ్చెడి యిష్ట లింగము విషయమైన ఏ పరిజ్ఞానము చెప్పబడినదో దానిని జ్ఞానమని యనిన యెడల లింగ షట్ స్థలముల యందున అదే లింగ విషయమున విశేషజ్ఞానము ప్రతిపాదించుటచేత దీనికి విజ్ఞానమనెడి పేరు యివ్వబడినది. ఈ స్థలము నందున యిష్టలింగ సంబంధమైన సూక్ష్మాతిసూక్ష్మమైన విషయముల విచారములు వివరించబడినవి.

మనము అనేక విధమైన క్రియలను చేయుచుందుము. వీటిలో నిత్యకర్మలు అవశ్యకమైనవి. ప్రతిదినము తప్పనిసరిగా చేసెడి క్రియలనే నిత్యక్రియలందురు. 'నిత్యం యావదాయుః' అనగా ఆయుష్యమున్నంత వరకు చేయబడెడి కర్మమే నిత్యకర్మము. వీరశైవ సిద్ధాంతమునందున శివదీక్షను పొందిన భక్తుడు గురువు యొక్క ఆనతిమేరకు యిష్టలింగరూపమైన నిత్యకర్మను తన ఆయుష్షు వున్నంతవరకు ఆచరించుచున్నాడు. నిత్యకర్మకు విశేషమైన వేరేఫలము వుండదు. అయితే దానిని ఆచరించక యుండిన యెడల దోషము సంప్రాప్తమగును. దానిని ఆచరించుచూ యుండిన యెడల దురితప్రాప్తి జరుగకుండ వుండును. అదియే దాని ఫలముగా భావించవలెను.

వీరశైవుల యిష్టలింగపూజా రూపమైన క్రియయందుననే క్రియలు సమావిష్టమగుచున్నవి. అందుచేత ఈ క్రియయే సర్వశ్రేష్టమైనది. ఇష్టలింగపూజను చేయకుండగా వీరశైవుడు మిగిలిన ఏ క్రియను చేసిననూ అది నిష్ఫలమగును. అన్ని క్రియలను పరిపూర్ణము చేసెడి క్రియయే లింగపూజా క్రియయైన కారణమున అదిలేనిది మిగిలిన క్రియలన్నియును అసంపూర్ణ క్రియలే. ఇష్టలింగము చూచుటకు పరిమాణములో ఎంతో చిన్నదై యుండిననూ దానియొక్క వ్యాప్తి సకల లోకములను ఆవరించుకొనియుండును. ఈ విషయమును బసవన్నవారు ఈ క్రింది విధముగా వివరించిరి.

**జగదగల, ముగిలగల, యగెయగల, నిమ్మగల**
**పాతాళ దిందత్తత్తనిమ్మశ్రీ చరణ,**
**బ్రహ్మాండనిందత్తత్త నిమ్మశ్రీముకుట,**
**అగమ్య, అగోచర, అప్రతిమలింగవే,**
**కూడల సంగమదేవయ్యా, ఎన్నకరస్థళక్కె**
**బందు చుళుకాదిరయ్యా**

పై వచనమునకు తెలుగు సేత ఈ క్రిందనివ్వనైనది

**జగత్తుకగలము మొగులుకగలము మిగులగలము మీయగలము**
**పాతాళముకంటె నటటు మీ శ్రీచరణము**
**బ్రహ్మాండము కంటె నటటు శ్రీమకుటము**
**అప్రమాణ, అగమ్య, అగోచర, అప్రతిమ లింగమా**
**కూడల సంగమదేవయ్యా**
**నా కరస్థలమునకు వచ్చి చులుకైతిరయ్యా**

ఈ విధముగా క్రియలన్నియును ఎచ్చట పరిసమాప్తి యగునో అద్దానినే ఆచార్యులవారు క్రియాలింగమని తెలిపిరి.

పూజ్యపాదులు ఆ క్రియాలింగము యొక్క స్వరూపమును ఈ క్రింది విధముగా తెలియజెప్పిరి.

**శ్లో॥ పరానంద చిదాకారం పరబ్రహ్మైవ కేవలం।**
**లింగం సద్రూపతాపన్నం లక్ష్యతే విశ్వసిద్ధయే॥** (సి.శి. 15-31)

ఈ శ్లోకములోని భావమేమనగా నిత్యానంద స్వరూపుడును, చిద్రూపుడును కేవల స్వరూపుడు అయిన పరబ్రహ్మము ఈ జగత్తునందున భక్తులచేత చేయబడెడి పూజాది క్రియలను సఫలము చేయుటకై సద్రూపమైన ఇష్టలింగ స్వరూపమును దాల్చియుండును.

ఈ జగత్తునందు అన్నింటికంటెను పెద్దదైన పరాత్పర వస్తువు ఉపనిషత్తునందున, బ్రహ్మయని పిలువబడినది. 'బృహద్వాద్ బ్రహ్మ' అనెడి వృత్తి మేరకు ఎయ్యది అన్నిటికంటెను పెద్దదైయుండునో అదియే బ్రహ్మము. ఇది జగత్తు యొక్క లోపల వెలుపల అంతటనూ వ్యాపించికొని యుండును. ప్రతి యొక్కరి హృదయములయందున ఆత్మరూపమై విరాజమానమై యుండును. ప్రతియొక్కరికీ నేను ఎల్లరికంటెనూ పెద్దవాడిని కావలయుననెడి భావనయూ వచ్చును. అయితే పెద్దవారు కావలెననెడి భావన వుండినను ఆ బ్రహ్మతత్త్వమును యెరిగి పెద్దవారు కావలెననెడి

జనులు చాలా తక్కువ. అయితే ఎక్కువ మంది అధికారము, అంతస్తు, సంపత్తు మొదలగు వాటిని సంపాదించి వాటిద్వారా పెద్దవారు కావలెనని అనుకొందురు. లౌకికులైన ఈ ఉపాధులచేత కొంత సమయము వరకు ఎవరైన ఒకరు పెద్దవారుగా తోచిననూ కాలాంతరమునందున ఈ ఉపాధులు లేకుండాపోయినప్పుడు తమను తాము హీనులుగా తెలిసికొనుచున్నారు. ఈ కారణమున పరబ్రహ్మాలింగమును యెరిగి తాను లింగరూపుడు అయినప్పుడు తనకు సమానమైనవారైనను లేదా తనకంటెనె పెద్దవారైననూ ఎవ్వరూ దోచజాలరు.ఒక నది పర్వత శిఖరములనుండి దిగి గుట్టలు, మిట్టలను దాటి అనేక అడ్డంకులను ఉల్లంఘించి చివరకు సముద్రమును చేరి సముద్రమే తానైనప్పుడు తనకంటెను వేరొక్క పెద్ద జలాశయము ఏదైననూ ఆ నదికి దోచదు. జీవాత్ముడు పరమాత్మ పరబ్రహ్మ లింగమును తన ఆత్మరూపముగా తెలిసికొనినప్పుడు యితని స్వరూపము కూడ అందరికంటెను బృహదాకారముగ గోచరించును. ఈ స్థితిని పొందుటయే మనుష్యుని జీవనము యొక్క ముఖ్యలక్ష్యమై యున్నది.

ఈ విధముగా వ్యాపకరూపమును పడయవలెననిన ఆ వ్యాపక స్వరూపము యొక్క సంకేతమును అనుసరించవలెను. వీరశైవ ఆచార్యులు అనుగ్రహించిన ఇష్టలింగము దాని సంకేతరూపముగా నున్నది. వ్యాపకతత్వమును ఉపచారములచేత పూజించుటకు సాధ్యముకాదను కారణమున పరబ్రహ్మ భక్తుల అనుగ్రహించుటకై సద్రూపమైన ఇష్టలింగరూపమును దాల్చినది. అది ఈ స్వరూపమును దాల్చుటకు సద్గురువే మూలకారణము. అనగా దీక్షా సమయమునందున శిష్యుని హస్తపీఠమునందున ఇష్టలింగమును కటాక్షించునప్పుడు పరబ్రహ్మ వ్యాపక స్వరూపము సద్గురువు తెలియజెప్పుచున్నాడు. సర్వాధిష్ఠానమైన లింగరూపమును పూజించిన పిదప వేరొక్క పూజ యేదియును మిగులదు. అందుకే ఇష్టలింగ పూజ యందుననే సర్వకర్మలు విలయమును పొందుచున్నవి. వేరు వేరు కర్మలను చేసినప్పుడు ఏయే ఫలితములు కలుగునో ఆ ఫలములన్నియును ఇష్టలింగ పూజవలన లభించును. అప్పుడు ఇష్టలింగ ధారికి ఇష్టలింగపూజను మినహాయించి వేరొక్క కర్మను చేసెడి అవశ్యకతయే వుండదని తెలిసికొనగలరు.

ఇదే విషయమును పూజ్యపాదులు ఈ క్రింది విధముగా తెలియజెప్పిరి.

**శ్లో॥ లింగమేవ పరం జ్యోతిర్భవతి బ్రహ్మకేవలం**
**తస్మాత్ తత్పూజనాదేవ సర్వకర్మ ఫలోదయః**
**పరిత్యజ్య క్రియాః సర్వా లింగపూజైకతత్పరాః**
**వర్తంతే యోగినః సర్వే తస్మాల్లింగం విశిష్యతే॥** (సి.శి. 15-32-33)

ఈ శ్లోకములోని భావమేమనగా లింగము పరంజ్యోతి స్వరూపమైన బ్రహ్మమే అయియున్నది. అందుచేత దాని పూజవలననే మిగిలిన కర్మముల ఫలములు ప్రాప్తమగును. ఇష్టలింగ పూజ యొక్క మర్మము నెరిగిన సనక సనందాదులు వేరు వేరు కర్మలను త్యజించి ఇష్టలింగపూజ యందుననే తత్పరులైరి. అందుచేత క్రియాలింగమే సర్వోత్కృష్టమైనది.

వేదాగమముల యందున శాస్త్ర విహితమైన యజ్ఞ యాగాదులు బృహత్ ప్రమాణమున గల కర్మలని ప్రతిపాదించబడినవి. కర్మలన్నియును తమతమకు నిశ్చితమైన ఫలములను ఇచ్చెడివైయున్నవి. సర్వకర్మల ఫలమును యిచ్చెడి సామర్థ్యము వీటికిలేవు. వీరశైవ సిద్ధాంతమునందున ఇష్టలింగ పూజారూపమైన క్రియ మిగిలిన కర్మల కంటెను సర్వోత్కృష్టమైయున్నది. అందుచేత యెవరి యందు యిష్టలింగ పూజ గురించిన అనురక్తి యుండునో వారు సర్వకర్మలను చేసిన ఫలమును పొందుచున్నారు. ఇంతటి ఈ క్రియ సామాన్యులకు దొరకదు. అనేక జన్మల సుకృతము పరిపక్వమైన పిదప అతడు ఈ ఇష్టలింగ పూజాధికారమును బడయుచున్నాడు.

**"యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ" ఎందెనిసువలింగవు**
**'అత్య తిష్ఠద్దశాంగులమ్' ఎందె నిసువ లింగవు**
**'శ్రుతి చకితమభిధత్తే' ఎందె నిసువులింగవు**
**'అణోరణీయాన్మహతో మహీయాన్' ఎందె నిసువలింగవు**
**'అయం మే హస్తో భగవాన్ అయం మే భగవత్తరః' ఎందె నిసువలింగవు**

**'ఏకమూర్తిః త్రిధాభిన్నా' ఎందెని సువలింగవు**
**శ్రీగురు లింగ జంగమ రూపాగి,**
**"ఇష్ట ప్రాణస్తథా భావం త్రిథా ఏకం వరాననే'**
**ఎందు దాగి త్రివిధవు ఏకేభవిసి, లింగరూపాగి ఎన్న**
**కరస్థలక్కె బందు కరతళామళకవాగి తోరుత్తిదానె**
**ఆహా ఎన్న పుణ్యవే। ఆహా ఎన్న భాగ్యవే। ఆహా ఎన్న సత్యవే। ఆహా ఎన్న నిత్యవే। శివ శివా మహాదేవ। మహాదేవ। నీనే బల్లె వురిలింగ పెద్దిప్రియ విశ్వేశ్వరా!!**

ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి :

**'యతో వాచో నివర్తంతే అప్రాప్యమనసా సహ' యెంచ బడెడి లింగము**
**'అత్య తిష్ఠద్దశాంగులమ్' అని యెంచబడెడి లింగము**
**'శ్రుతిచకితమభిదత్తే' అని యెంచబడెడి లింగము**
**'అణోరణీయాన్మహతో మహీయాన్' అని యెంచబడెడి లింగము.**
**'అయం మే హస్తోభగవాన్ అయం మే భగవత్తరః' అని యెంచబడెడి లింగము.**
**'ఏకమూర్తిః త్రిధాభిన్నా' అని యెంచబడెడి లింగము**
**శ్రీ గురులింగ జంగమ రూపమై**
**'ఇష్టప్రాణస్తథా భావం త్రిధా ఏకం వరాననే' అనునది కావున**
**త్రివిధము ఏకీభవించి లింగరూపమై నాకరస్థలమునకు వచ్చి-**

కరతలామలకమై దోచుచున్నది. ఆహా! నా పుణ్యమా! ఆహా నా భాగ్యమే! ఆహా నా సత్యమే! ఆహా నా నిత్యమే! శివశివా! మహాదేవా! నీవే యెరుగుదువు. ఉరిలింగ పెద్దిప్రియ విశ్వేశ్వరా!

ఈ వచనమునందున యిష్టలింగపు మహత్తును కొనియాడుచూ అది దొరకవలెననిన పూర్వ జన్మల పుణ్యము (సుకృతము) వలయునని చెప్పబడినది.

అల్లమహాప్రభువుగారు తన యిష్టలింగ ప్రాప్తి మరియు దాని పూజ సర్వోత్కృష్టమైనదని చెప్పిరి. దానికంటె మిగిలినవి లేదా అతీతమైనవి వేరొకటి లేవని తమ వచనమున వివరించిరి. వీరి ఈ క్రింది వచనమును గమనించుడి.

**అమృతసాగరదొళగిద్దు ఆకళ చింతెయేకె?**
**మేరు మందిరదొళగిద్దు జరర తొళెవ చింతెయేకె?**
**శ్రీగురువినొళగిద్దు తత్వద చింతెయేకె?**
**ప్రసాదదొళగిద్దు ముక్తియ చింతెయేకె?**
**కరస్థల దొళగె లింగవిద్ద బళిక మత్తిన్నావ చింతె ఏకె?**
**హేళా గుహేశ్వరా?**

దీనియొక్క తెలుగు రూపమును గనుడి.

**అమృతసాగరములోన యుండి ఆవుల చింత యెందుకు?**
**మేరు మందిరములోన యుండి గని తొలచెడి చింత యెందుకు?**

**శ్రీగురువు సన్నిధిలోనుండి తత్త్వపు చింత యెందులకు?**
**ప్రసాదమెదురుగా నుండ ముక్తి యొక్క చింత యెందుకు?**
**కరస్థలములోన లింగమున్న వెనుక మరి యింకనూ**
**వేరే చింత యెందుకు?**
**చెప్పుమా? గుహేశ్వరా!**

అందుచేత యిష్టలింగ పూజయే సర్వోత్కృష్టమైన కర్మయని గ్రహించవలెను.

సనకాది ఋషులు యజ్ఞ యాగాది కర్మలను విడిచి ఈ యిష్టలింగ పూజారూపమైన క్రియను ఎందుకు అంగీకరించిరి? అనెడి ప్రశ్న ఉదయించవచ్చును. శ్రీ భగవత్పాదులవారి ఈ వుపదేశమును గనుడి.

**యజ్ఞాదయః క్రియాః సర్వా లింగపూజాంశ సమ్మితాః।**
**ఇతి యత్పూజ్యతే సిద్ధైస్తత్క్రియా లింగ ముచ్యతే॥** (సి.శి. 15-34)

ఈ ఉపదేశములోని సారాంశమేమనగా యజ్ఞ యాగాది క్రియలు లింగపూజ దృష్టియందున ఒక్క లవలేశమునకు కూడా సరిరావు. అందుచేత సనకాదులు యజ్ఞ యాగాదులను విడిచి ఈ లింగపూజ యందున ఆసక్తులైరి. ఈ విధముగా సకల క్రియల ఫలితమును యిచ్చెడి ఈ లింగమును క్రియాలింగమని పిలుతురు.

ఈ విధమైన లింగపూజయందు రతియున్నవానికి యజ్ఞ యాగాదుల అవశ్యకత వుండదని చెప్పెడి శ్రీ భగవత్పాదులవారి ఈ ఉపదేశమును గనుడి.

**కిం యజ్ఞైరగ్నిహోత్రాద్యైః కిం తపోభిశ్చదుశ్చరైః।**
**లింగార్చన రతిర్యస్య స సిద్ధః సర్వకర్మసు॥** (సి.శి. 15-35)

దీని తాత్పర్యమేమనగా యిష్టలింగము యొక్క అర్చనయందు ప్రీతిగొన్నవ్యక్తికి అత్యంత కఠినమైన తపస్సును చేయుటగాని లేదా అగ్నిహోత్రాది యజ్ఞములను చేయుటగాని ఆచరించు ఆవశ్యకత లేదు. ఎందుకనగా యిష్టలింగ పూజ యందుననే సకల ఫలములు లభించగా వాటిని ఆచరించెడి ప్రయోజనమేమి? ఈ కారణమువలన యిష్టలింగ పూజనే మనః పూర్వకముగా చేసిన యెడల సకల సిద్ధులు లభించునని భగవత్పాదులవారు తెలిపిరి. బ్రహ్మ, విష్ణువు మొదలైన వారు ఈ యిష్టలింగ పూజవలననే తమ తమ స్థానమును పొందిరని తెలిపెడి శ్రీ భగవత్పాదులవారి ఈ క్రింది ఉపదేశమును గనుడి.

**బ్రహ్మ విష్ణ్వాదయః సర్వే విబుధా లింగమాశ్రితాః।**
**సిద్ధాః స్వ స్వ పదే భాంతి జగత్తంత్రాధికారిణః॥** (సి.శి. 15-36)

ఈ శ్లోకము యొక్క తాత్పర్యమేమనగా జగత్తు యొక్క ఉత్పత్తి మరియు పాలనకు బాధ్యత వహించెడి బ్రహ్మ విష్ణువులు ఈ అధికారమును శివపరమాత్మనుండి పొందిరి. ఇతర దేవతలు కూడా యిట్టి అధికారములను పొందిరి. వీరందరునూ యిష్టలింగ పూజను చేసియే ఈ పదవులను పొందిరని భావించవలెను. ఇదంతయును చూశిన పిదప యిష్టలింగపూజ సర్వోత్కృష్టమైనదని తెలియవచ్చుచున్నది. దేవతలందరూ తమతమ ఉత్తమాంగమునందున అనగా మస్తకము మీద, యిష్టలింగమును ధరించుకొని వుందురనెడిది శాస్త్రము ఆధారముచేత తెలియవచ్చుచున్నది. అంతియేకాదు. ప్రాచీన దేవతా విగ్రహముల మస్తకమునందున యిష్టలింగము వుండుట కానవచ్చుచున్నది. బార్శి నగరములోని విష్ణు దేవాలయములో విష్ణువు మస్తకమునందుననూ, పండరీపురపు విఠలేశ్వరుని మస్తకమునందుననూ, కొల్హాపురపు మహాలక్ష్మీ మస్తకము నందుననూ, తులజాపురపు అంబా భవానీ మస్తకమునందుననూ యిప్పటికినీ యిష్టలింగములు విరాజమానమై యున్నవి. శ్రీమహావిష్ణువు లింగపూజయందు వేయి కమలములను సమర్పించెడి వ్రతమును ప్రారంభించి చివరకు ఒకటి తక్కువ కాగా తన నేత్ర కమలమును సమర్పించి శివానుగ్రహముచేత కమలాక్షుడగుటయే

కాదు చక్రధారి కూడా అయ్యెననెడి కథ ప్రచారమునందు కలదు. ఇదంతయును గాంచిన పిదప యిష్టలింగము శ్రేష్ఠమైనదనియును యజ్ఞ యాగాదులు చేయుటకంటెను లింగ పూజ చేయునదే ఉత్తమమైనదనియును తెలిసికొనవలెను. ఈ విధముగా యిష్టలింగము యొక్క మహతి, లింగపూజ యొక్క మహత్తు ప్రతిపాదించబడినది.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 12-08-1992
స్థలం : **భికుబాయి మేనకుదళె**
**మంగళ కార్యాలయము, పూనె**

## విశేష ప్రదీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు అర్చన గురించి తెలియజేయుచు వీరశైవునకు నిష్టలింగ పూజయే విహితకర్మయని తెలియజేసిరి. ప్రాకృతుల కొరకు పలు విధములగు కర్మలు గలవు. సంధ్యావందన, యజ్ఞ, యాగ జప తపవ్రతాదులిందులో కలవు. ఇవి అసంఖ్యాకములుగా నున్నవి.

వీరశైవులు కర్మజిత్తులనియును, వీరు కర్మలనాచరించవలసిన పని లేదని తెలియుచున్నది. బసవ పురాణములోను, పండితారాధ్య చరిత్రలోను, చతుర్వేద సారములోను యీ విషయము తెలుపబడినది. బహు విధములగు ప్రమాణము లివ్వబడినవి. ఈ పద్యమును గనుడి.

వీరశైవులు లింగాంగ సామరస్యమును, సాధించెడి పథమున పయనించునప్పుడు

గీ॥ **చరులు వితత సర్వసంగ పరిత్యాగ।**
**చరితుల ప్రతిములు స్వచ్ఛులుభయ**
**కర్మ విరహితులు జగత్పావనులు కాల**
**కాలు లభవులు భక్తగణము లనఘ।** (అనుభవసారము ప. 202)

వీరశైవులుభయ కర్మలను చేయవలసిన పనిలేదని తెలియుచున్నది. పూర్వ కర్మలనగా నుపనయనాది ప్రాకృత సంస్కారములు ఉత్తర కర్మలనగా పితృ దేవతారాధన పిండ ప్రదాన మిత్యాదులు. ఈ రెంటిని కలిపి యుభయ కర్మలని యందురు.

అయితే తన సాధనను దృఢతరము చేసికొనుటకై భక్తాంగుడు కొన్ని క్రియలను చేపట్టవలసియుండును. వాటి గురించిన విపులమైన వివరణ భక్తిమార్గ క్రియాస్థలమున నివ్వబడినది. వీటిలోని ముఖ్యమైన వాటిని గుర్తించదలచినవారు శివాగమములలో గాంచగలరు. వీరాగమములోని యీ ప్రమాణము గమనార్హమైనది.

**గురోశ్చ జంగమస్యైవ శివలింగస్య పూజనం।**
**ఏషాం పాదోదకం చైవ భుక్తశేషాన్నమేవచ**
**భక్షయేచ్ఛివ భక్తస్తు ప్రసాదో జన్మశుద్ధిదః**

ఈ క్రియలన్నింటికి మూలాధారమైనదే క్రియాలింగమని గ్రహించగలరు. శ్రీ బసవేశ్వరులవారి వచనములలోను క్రియాలింగము యొక్క వివరణ (వ.సం.877) యివ్వబడినది. ఇష్టలింగమే, క్రియాచరణ సందర్భమున క్రియాలింగమనబడునని గ్రహించగలరు. ఈ యంశమును వివరించెడి క్రింది శ్లోకమును గనుడి.

**త్రిలక్ష్యాన్తర్గతం దేవం కరశాఖాఖ్యపీఠికం।**
**క్రియాధారం గుణోదారం స్వేష్టలింగమహంభజే॥** (సోమనాథుని త్రిలింగాష్టకం)

*శుభం భూయాత్*

# భావ లింగ స్థలము

## ఆశీర్వచనము : 1

క్రిందటి ఆశీర్వచనములో క్రియాలింగమే ముఖ్యమైనదని తెలిసికొనియుంటిమి. క్రియాలింగమనగా యిష్టలింగమనియే గ్రహించితిమి. ఈ స్థలమున లింగ షట్స్థలములకు చెందిన భక్తస్థలములోని భావలింగ స్థలమును గురించి తెలిసికొనుటకు ప్రయత్నింతుము. 'నిష్కలం భావలింగం స్యాద్ భావగ్రాహ్యం పరాత్పరమ్' అనెడి వాతులాగమపు సూక్తి ప్రకారము నిష్కళమును, పరాత్పరమునూ మరియు భావగ్రాహ్యమైన లింగమును భావలింగమని యందురు. సకల క్రియల లయమునకు ఆశ్రయమైన లింగమునకు క్రియాలింగమని పేరుండినటులనే భావములన్నియును చివరకు ఎక్కడ లయమగునో దానిని భావలింగమని యందురు. ఇచ్చట క్రమప్రాప్తమైన ప్రాణలింగమునే భావలింగమని పిలువబడినది. ఈ విషయముననే శ్రీ భగవత్పాదుల వారు ఈ క్రింది విధముగా వుపదేశించిరి.

**క్రియా యథా లయం ప్రాప్తా తథా భావో஽పి లీయతే।**
**యత్ర తద్దేశికైరుక్తం భావలింగమితి స్ఫుటమ్॥** (సి.శి. 15-37)

దీని తాత్పర్యమేమనగా ఇష్టలింగ పూజ అనంతరము క్రియలన్నియును పరిసమాప్తి పొందినటులనే అనగా క్రియలన్నిటికి క్రియాలింగమే ఆధారముగా నుండునటులనే పరమోత్కృష్టమైన భావనకు ఆధారముగా నుండునదే భావలింగము. ఇష్టలింగపు పూజను బాహ్యోపచారములచేత చేయుదుము. అయితే అంతరంగమునందుండెడి భావలింగమునకు అనగా ప్రాణలింగమునకు బాహ్య వస్తువుల ఆవశ్యకతలేదు. అయితే పూజను భావనామయ వస్తువులచేతనే చేయవలసియుండును. ఈ సిద్ధాంత శిఖామణి యొక్క అంగస్థలములోని అంతర్భాగమగు ప్రాణలింగ స్థలమున వచ్చెడి ప్రాణలింగార్చనా స్థలమున ప్రాణలింగమును పూజించెడి భావనామయ సామాగ్రుల విస్తారమైన వర్ణన యివ్వబడినది. ఆ ప్రకారముగా క్షమయే అభిషేక జలము. వివేకమే వస్త్రము. సత్యవాక్పరిపాలననే ఆభరణము. వైరాగ్య భావనయే పుష్పమాల. సమాధిస్థితియే గంధము. నిరహంకార భావనయే అక్షతలు. శ్రద్ధయే ధూపము. మహాజ్ఞానమే దీపము. ప్రాపంచిక భ్రాంతియే నైవేద్యము. మౌనమే ఘంటానాదము. శబ్ద స్పర్శాది విషయముల యెడల ఆశను త్యజించునదే తాంబూలము. విషయముల యెడల భ్రాంతి కలిగివుండక పోవుటయే ప్రదక్షిణము. లింగమునందుననే సమరసత సాధించునదే నమస్కారము. ఈ విధముగా భావనలన్నియును లింగపూజకు సాధనములుగా చెప్పబడినవి. శ్రీపూజ్యపాదులు భావలింగమునకు సంబంధించిన విశ్లేషణను ఈ క్రింది విధముగా సల్పిరి.

**భావేన గృహ్యతే దేవో భగవాన్ పరమః శివః।**
**కిం తేన క్రియతే తస్య నిత్యపూర్ణో హి స స్మృతః॥** (సి.శి. 15-38)

షడ్గుణైశ్వర్య సంపన్నుడైన పరమేశ్వరుడు కేవలము భావన వలన మాత్రమే గ్రాహ్యుడగుచున్నాడు. అతడ నిత్యుడు. పరిపూర్ణుడు. పరాత్పరుడు అయివుండుట చేత బాహ్య క్రియా కలాపములు అతని పూజయందున నిష్ప్రయోజకములగును. సూక్ష్మమైన తత్త్వములను భావనచేత తెలిసికొనవచ్చునే గాని హస్తాదులచేత ముట్టి పూజించుట అయ్యెడిపనికాదు. అందుకే అర్పించెడి జల భస్మాది పదార్థములు భావనాత్మకములే అయి వుండవలెను. ఈ విధముగా భావనలన్నిటికినీ విలయస్థానమైన కారణమున దీనిని భావలింగమని యందురు. ఎవరు అంతఃకరణ శుద్ధి కలిగినవారో, ఎవరి భావన యందున సాంసారిక వ్యామోహము వుండదో వారు మాత్రమే భావలింగమును పూజించుటకు అధికారము కలిగినవారై యుందురు.

పూజ్యపాదులు ఈ భావలింగమును గురించి మరికొంత వివరణను ఈ క్రింది విధముగా నిచ్చిరి.

**అఖండ పరమానంద బోధ రూపః పరః శివః।**
**భక్తానాముపచారేణ భావయోగాత్ ప్రసీదతి॥** (సి.శి.15-39)

శ్రీ భగవత్పాదులవారి ఈ ఆనతిలోని అంతర్భావమేమనగా అపరిచ్ఛిన్నుడును అనగా అఖండుడు, ఆనంద స్వరూపుడు, మరియు జ్ఞానరూపుడు అగు ఆ భావలింగ రూపములోని పరమ శివుడు భక్తులు చేసిన భావనామయ ఉపచారముల పూజవలన ప్రసన్నుడగుచున్నాడు. ఇష్టలింగము

ఏదో ఒక ప్రసంగమునందున ఖండితము కావచ్చును. ఎందుచేతననగా అది లింగము యొక్క స్థూలరూపమగుచున్నది. అయితే చిద్రూపమైన ప్రాణలింగము ఎప్పటికిని ఖండితము కాదు. ఒక వ్యక్తికి గల తన చిద్రూపము యొక్క అరయికయే ప్రాణలింగమని తెలుసుకొనవలెను. మన అందరి ఆత్మ సద్రూపమై యుండినటులనే ప్రాణలింగము చిద్రూపమై యుండును. అనగా స్వయం ప్రకాశరూపమై యుండును. జడపదార్థములను చూడవలెనని ప్రకాశము యొక్క ఆవశ్యకత వుండును. అందుకే సూర్య, చంద్ర, నక్షత్ర, విద్యుత్తు మొదలగు ప్రకాశములు జడ వస్తువులను చూపెట్టెడి యంశములై యున్నవి. అంతరంగములో నుండెడి స్వాప్నిక పదార్థములను ఈ ప్రకాశములు చూపజాలవు. అందుకే స్వప్నావస్థ గురించి ఉపనిషత్తులలో ఈ క్రింది విధముగా చెప్పబడినది.

**న తత్ర సూర్యో భాతి న చంద్రతారకమ్।**
**నేమా విద్యుతో భాంతి కుతోఽ యమగ్నిః॥**

స్వప్న ప్రపంచము యొక్క పదార్థములు సూర్య చంద్ర యిత్యాది వాటి ద్వారా ప్రకాశింపవు. ఎందుచేతననగా ఇవి జాగ్రదవస్థల యందు మాత్రమే ప్రకాశింపగలవు. స్వప్నములోనికి వెళ్ళెడి గతి వీటికుండదు. అట్లయిన స్వాప్నిక పదార్థములు ఏ ప్రకాశము వలన ప్రకాశించగలవు? అన్న ప్రశ్న ఉదయించినప్పుడు 'అత్రాయం పురుషః స్వయం జ్యోతిః' అని ఉపనిషత్తునందున ప్రతిపాదించబడినది. దీనికి భాష్యమును వ్రాయునపుడు శంకరాచార్యులు అత్ర అను పదమునకు 'స్వప్నావస్థమధికృత్య యిదమామ్నాయతే' అని చెప్పిరి. అనగా ప్రతియొక్కరి అంతరంగమునందున ప్రాణలింగము స్వయం ప్రకాశముగానుండి అది స్వాప్నిక పదార్థములనే ప్రకాశింపజేయును. అప్పుడు స్వప్నము నందు, సూర్యచంద్రాదుల ప్రకాశము వుండదు కనుక అచ్చట నొక ప్రకాశము అందరికీ అనుభవగోచరము అయ్యెడిదై యుండుటవలన ఆ ప్రకాశము వేరే ఏదియును కాకుండా తనదే అయివుండును. ఈ విధముగా తన చిద్రూపమైన చింతనయే ప్రాణలింగమైయుండును. ఇట్టిదానిని పూజించుటకై బాహ్య సామాగ్రి యొక్క ఆవశ్యకతలేదు. పూజ్యపాదులు ఈ ప్రాణలింగమే శ్రేష్ఠతరమైనదని ప్రతిపాదించిరి. ఈ క్రింది శ్లోకమును గనుడి.

**మృచ్ఛిలావిహితాల్లింగాద్ భావలింగం విశిష్యతే।**
**నిరస్తసర్వదోషత్వాద్ జ్ఞానమార్గ ప్రవేశనాత్॥** (సి.శి.15-40)

దీని భావమేమనగా శాస్త్రమునందున లింగమును నిర్మించుటకై అనేక పదార్థములు సూచించబడినవి. మన్ను, రాయి, స్ఫటికము మొదలగునవి ఈ కోవకు చెందినవి. మన్ను మరియు పాషాణము మరియు ధాతువులచేత నిర్మింపబడెడి లింగముల యందు ఏదో ఒక దోషము వుండియే తీరును. ఈ లింగములను రూపొందించునపుడు శిల్పి తన సామాగ్రులచేత ఛేదనా భేదనాది క్రియలను చేశి దానికొక ఆకారమును తెచ్చి పెట్టుచున్నాడు. ఇంతటి శివలింగములను మందిరాదులలో ప్రతిష్ఠాపన చేయునప్పుడు అనేక దోషముల నివృత్తికై జలాధివాసము, ధాన్యాదివాసము, అభిషేకాది క్రియలు చేయవలసియుండును. అప్పుడది నిర్దుష్టముగా ప్రాణప్రతిష్ఠకు అనువైనదై యుండును. అయితే అంతరంగమునందలి ప్రాణలింగమునకు ఏ దోషమూ ఉండదు. దీనిని ఆరాధించెడి వారు జ్ఞానమార్గమునందున ప్రవేశమును బడయుచున్నారు. ఈ కారణమువలన బాహ్యలింగముకంటెను అంతర్లింగమే శ్రేష్టమైనదని శ్రీభగవత్పాదులవారు ఆదేశించిరని గ్రహించవలెను.

భావలింగమును పూజించెడివారు భావలింగియనబడునని తెలిపెడి శ్రీ భగవత్పాదులవారి ఈ క్రింది యుపదేశమును గనుడి.

**విహాయ బాహ్యలింగాని చిల్లింగం మనసి స్మరన్।**
**పూజయేద్ భావపుష్పైర్యో భావలింగీతి కథ్యతే॥** (సి.శి.15-41)

బాహ్య లింగమును విడిచి 'తత్ ప్రాణేష్ఠం తర్మనసో లింగమాహుః' అనెడి అధర్వణ శ్రుతి ప్రమాణము ప్రకారము తన హృత్కమలమునందలి ప్రాణలింగమును స్మరించుచు భావనామయమైన పుష్పములచేత ఎవరు ఆ భావలింగమును పూజింతురో వారు భావ లింగి యనబడుదురు.

భావలింగము అనగా ప్రాణలింగము అంతరంగపు లింగమై యుండుటచేత దానిని పూజించెడి సామాగ్రియు అంతరంగమునకు సంబంధించనదై యుండును. ఈ విషయమును వివరించెడి ఒక కథ కలదు.

ఒక మనుష్యునికి ఒక కల వచ్చినది. ఆ కలలో తనను ఒక నాగుపాము కఱచినది. గాబరాపడ్డ ఆ మనిషి కలనుండి మేల్కొని అటూ యిటూ చూచి యింటినుండి పరుగెత్తి వైద్యుని కడకేగెను. వైద్యునితో అయ్యా! నన్ను నాగుబాము కఱచినది. నేను బ్రతికెడి అవకాశము కనబడుటలేదు. కనుక వెంటనే నాకు వైద్యము చేశి నాకు ప్రాణదానము చేయుడియని ప్రార్థించెను. వైద్యుడు ఆ వ్యక్తిని పరీక్షించి అతని శరీరముపై ఎచ్చటను పాముకాటు కనుపించనందున నిన్ను ఆ పాము ఎచ్చట కాటు వేసినది? అని ప్రశ్నించెను. అందులకా వ్యక్తి అయ్యా! నేను నిద్రించునపుడు నాకొక కలవచ్చినది. ఆ కలలో నేనొక ఘోరారణ్యములో తిరుగాడుతూ చూచుకొనక ఆ సర్పముపై కాలిడితిని. అది నన్ను బలముగా కాటువేసినది యని చెప్పెను. ఇది వినిన వైద్యుడు ఆ వ్యక్తితో నీకు కలలో సర్పము కాటు వేసినది కావున ఆ దోషము పోగొట్టుటకు కలలోని వైద్యునకు మాత్రమే సాధ్యమగునని చెప్పి అతనిని సమాధాన పరచి పంపెనట. స్వప్నములోని పాముకాటుకు స్వప్నములోని వైద్యుని ఔషధమే ఉపయుక్తమగునటులనూ, జాగ్రదావస్థలోని వైద్యుని ఔషధము ప్రయోజనహీనమగునటుల, అంతరంగములోని ప్రాణలింగార్చనకు అంతరంగములోని భావమయ పదార్థములు మాత్రమే ఉపయోగపడగలవు. ఈ విధముగా భావమయ పదార్థములతో ఆ ప్రాణలింగమును పూజించువాడు 'భావలింగి' యని పిలువబడునని పూజ్యపాదుల ఆశయమైయున్నది.

ఈ విధముగా ప్రాణలింగపూజను చేశెడి భావలింగిని శివయోగి యనియును పిలుతురని చెప్పుచూ శ్రీ భగవత్పాదులవారు ఈ క్రింది విధముగా ఆనతి నిచ్చిరి.

**మూలాధారేఽథవా చిత్తే భ్రూమధ్యే వా సునిర్మలమ్।**
**దీపాకారం యజన్లింగం భావద్రవ్యైః స యోగవాన్॥** (సి.శి.15-42)

మూలాధారమునందున హృదయ మధ్యమున మరియు భ్రూమధ్యమున అత్యంత నిర్మలమైన దీపాకారపు ప్రాణలింగమును పూర్వోక్త భావ ద్రవ్యములచేత ఎవ్వరు పూజింతురో వారిని శివయోగియని అందురు.

మన శరీరపు మూలాధార చక్రము, హృదయము, మరియు భ్రూమధ్యమునందున ప్రాణలింగము కన్పట్టుచుండును. ఈ మూడుస్థానములలో ఎవరికి ఏ స్థానముల యందున ధ్యానము చేయుటకు అనుకూలమగునో ఆ స్థానమందున జ్యోతిర్లింగమును భావించి భావ ద్రవ్యము చేత పూజించవలెను. మన హస్తపీఠముననుండెడి ఇష్టలింగ ఆకారపు జ్యోతి పైన సూచించిన కేంద్రములందు ప్రజ్వలించుకొనుచుండును. ఆ జ్యోతి యొక్క ధ్యానమును చేయుట అందరికీ సాధ్యము కాదు గనుక ఆ జ్యోతి యాకారములోనుండెడి యిష్టలింగమును ప్రతియొక్కరి వామహస్త పీఠమునందున సద్గురువు అనుగ్రహించుచున్నాడు. ఈ యిష్టలింగ పూజను చేయుచూ చేయుచూ పోగా ఏకాగ్రదృష్టిని అలవరచుకొన్న వాడికి కాలాంతరమునందున పూర్వము చెప్పబడిన కేంద్రస్థానముల యందలి జ్యోతి అనుభవమునకు వచ్చును. అప్పుడు వీరశైవుడు ఆ లింగమును భావ సామాగ్రిచే పూజించి శివయోగియగుచున్నాడు.

ఈ విధముగా భావలింగ పూజాసక్తుడైన వీరశైవుడు తననిష్ఠను ప్రాణలింగమునందున కేంద్రీకరించి యుండుటచేత అతనికి బాహ్యమున నుండెడి యిష్టలింగము పూజకంటెను అంతరంగమున నుండెడి ఆ లింగ పూజయే యెంతో మహత్త్వ పూర్వకముగా నుండునని తెలుసుకొనవలెను. ఈ విషయమును ప్రతిపాదించెడి భగవత్పాదుల వారి యుపదేశము ఈ క్రింది విధముగా నున్నది.

**స్వానుభూతి ప్రమాణేన జ్యోతిర్లింగేన సంయుతః।**
**శిలామృద్దారుసంభూతం న లింగం పూజయత్యసౌ॥** (సి.శి.15-43)

దీని తాత్పర్యమేమనగా శివయోగి యైనవాడు తన స్వానుభూతి కనుగుణముగా చిన్మయమైన ప్రాణలింగముతో 'అహమస్మి' అనగా అది నేనే అయివున్నాను అనెడి అనుభవము ప్రాప్తము కాగా అతనికి బాహ్య పూజాదుల యందున అనురక్తిదోచదు.

ఇంకనూ పూజ్యపాదులు తమ వుపదేశము నిచ్చుచూ బహిరంగపుపూజ మరియు అంతరంగపు పూజల మధ్యలనుండెడి వ్యత్యాసము ఈ క్రింది విధముగా ప్రతిపాదించిరి.

**క్రియారూపా తు యా పూజా సా జ్ఞేయా స్వల్ప సంవిదామ్।**
**ఆంతరా భావపూజా తుశివస్య జ్ఞానినాం మతా॥** (సి.శి.15-44)

ఈ జగత్తునందున జనులందరినీ అజ్ఞులనియునూ, సుజ్ఞులనియునూ రెండు విధములుగా విభజింపవచ్చును. అజ్ఞులకు అంతరంగ దృష్టి యుండదు. అట్టివారిని ప్రాణలింగ పూజను చేయుటకు ఆదేశించినయెడల వారు ఆ విధిని చేయుటకు సమర్థులై యుండరు. అయితే ఆ సామర్థ్యము వచ్చునంతవరకు బాహ్యమైన క్రియాలింగ పూజనే వారికొరకు విధించబడినది. ఇంకనూ బాహ్యలింగ పూజను చేశి అంతరంగమును పరిశుద్ధము చేసికొని హృదయస్థమైన జ్యోతిర్లింగము యొక్క అనుసంధానమును చేశెడి సామర్థ్యమున్న ఉత్తమ అధికారికి ఈ ప్రాణలింగపూజ విధించబడినది. ఈ కారణమున ప్రతియొక్క వీరశైవుడు కేవలము యిష్టలింగ పూజ చేశి సంతృప్తిపడక అంతరంగములోని ప్రాణలింగము వైపు దృష్టిని ప్రసరింపజేయుటకు ప్రయత్నించవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 13-08-1992
స్థలం : **భికుబాయి మేనకుదళె**
**మంగళ కార్యాలయము, పూనె**

## విశేష దీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు భావ లింగమునకు సంబంధించిన సమస్త విషయములను తెలియజేసిరి.

భావమనెడిది మనోవృత్తికి సంబంధించిన యంశము. క్రియాశీలికి భావము క్రియోన్ముఖత గల్గియుండవలెను. క్రియాభావములో సమన్వయము లోపించినపుడు క్రియాచరణ యాంత్రికమైనట్టిదగును. తత్ఫలితముగా క్రియాసాఫల్యత చేకూరదు.

క్రియాలింగములో క్రియలన్నింటిని లయము చేసి క్రియాలింగియైననూ భావశుద్ధిని పొందని సాధకుడు చిత్త చాంచల్యమునకు గురి అయ్యెడి అవకాశము కలదు. క్రియాలింగేతరములైనట్టి స్థావర లింగముల నర్చించాలనెడి భావమును మదిలో దాల్చవచ్చును. ఇట్టి స్థితిలో సాధకుడు తిరోగమనోన్ముఖతను పొందెడి యవకాశము గలదు. బాహ్య లింగముల నర్చించవలెననెడి భావోన్ముఖత హెచ్చిన కొలది క్రియాలింగము యెడల గల శ్రద్ధాభక్తి సన్నగిల్లెడి యవకాశము కలదు.

భక్తస్థలములోని యంగుని శ్రద్ధాభక్తిని పెంపొందించి, యతనిని భావలింగిగా జేయుటకై శివుడే భావలింగముగా అవతరించును.

ఈ సందర్భమున, భావలింగమనగా నేమిటో తెలిసికొనవలెను. ఇది త్రిలింగములలో నొకటైనదిగా నుండెడి భావలింగము కాదని గుర్తించగలరు. దీక్షాగురువు చేత కారణ శరీరమునకు కట్టబడెడి భావలింగమొకటి కలదు. దాని గురించిన ప్రస్తావన లింగైక్య స్థలమున రావలసియున్నది. ఇచ్చట వివరింపబడిన భావలింగమొక యంతర్లింగముల సంచయమని గుర్తించగలరు. లింగధారణాంగ స్థలమున వివరములను గాంచగలము. "మూలాధారేచ హృదయే భ్రూమధ్యే సర్వదేహినాం జ్యోతిర్లింగా సదాభాతి" అనెడి దాచార్యుల వారి యాదేశము

**"ఆధారే కనక ప్రఖ్యం హృదయే విద్రుమ ప్రభమ్।**
**భ్రూమధ్యే స్ఫటిక చ్ఛాయం లింగం యోగీ విభావయేత్"** అనెడిది యుపదేశము
(సి.శి. 6-40)

వాతూల తంత్రము ప్రకారము మూలాధారముననుండెడి దాచార లింగము. హృదయము చరలింగ స్థానము కాగా భ్రూమధ్యము మహాలింగ స్థానమగుచున్నది.

అందుచేత యిచ్చట తెలుపబడిన భావలింగమనెడి యంతర్లింగ సంచయము ఆచార, చర, మహాలింగముల సమీకృత రూపమని గుర్తించగలరు.

ఇష్టలింగార్చన సమయమున శ్రద్ధాభక్తి నాచరించెడి సాధకుడు యిష్టలింగమును నీ త్రిలింగములలో ననుసంధానము చేయవలెననెడిదే గుర్తించవలసిన యంశము. అంతర్లింగాను సంధాన రహితమైన లింగధారణ మరియు అర్చనలాశించిన ఫలముల నివ్వజాలవని గ్రహించవలెను. అజ్ఞానులు బాహ్యలింగార్చనాతత్పరులై మట్టి, రాయి, కలప యిత్యాదులచేత నిర్మితములగు స్థావరలింగముల నర్చింతురనియును, జ్ఞాని తన యిష్టమును సాధనముగా గొని యంతర్లింగాను సంధానమును చేపట్టునని తెలుపబడినది. అందుచేత వీరశైవులు స్థావర లింగముల నర్చించెడి స్థితికి దిగజారవలదని గ్రహించవలెను.

*శుభం భూయాత్*

## జ్ఞాన లింగ స్థలము

## ఆశీర్వచనము : 1

భావలింగ స్థలము గురించి తెలిసికొనిన పిదప జ్ఞాన లింగ స్థలము గురించి తెలిసికొనెడి యవశ్యకత గలదు.

ఇచ్చట వచ్చెడి జ్ఞానలింగమనెడి పదము యొక్క యర్థమును భావ లింగమనియే గ్రహించవలెను. భావలింగమునకు జ్ఞానలింగము, పరాత్పర లింగము, మరియు తృప్తి లింగము లనెడి పేర్లు గలవు. ఇవి దాని పర్యాయనామములని గ్రహించవలెను. ఈ విషయములను తెలిపెడి శ్రుత్యాగమ వాక్కులీ క్రింది విధముగా నున్నవి.

**అచింత్యం చా ప్రమేయంచ వ్యక్తావ్యక్త పరంచయత్।**
**సూక్ష్మాత్ సూక్ష్మతరం జ్ఞానం తన్మే మనః శివసంకల్పమస్తు"** (శ్రుతి)

**పరాత్పరం తు యత్ప్రోక్తం తృప్తిలింగం తదుచ్యతే।**
**భావనాతీత మవ్యక్తం పరం బ్రహ్మ శివాభిదమ్။** (వాతులోత్తరాగమము)

శ్రీ పూజ్యపాదులు జ్ఞానలింగము యొక్క లక్షణము నీ క్రింది విధముగా తెలియజేసిరి.

**తద్భావ జ్ఞాపకజ్ఞానం లయంయత్ర సమశ్నుతే।**
**తద్ జ్ఞానలింగ మాఖ్యాతం శివతత్వార్థ కోవిదైః။** (సి.శి. 15-45)

ఈ యానతి యొక్క తాత్పర్యమేమనగా భావలింగము యొక్క యరయికను గల్గించెడి జ్ఞానమెక్కడ లయమగునో నా లింగమునే శివతత్త్వము నెరిగిన శివయోగులు జ్ఞానలింగమని యందురు. భావనల లయమున కాశ్రయమైనదే విధముగా భావలింగమని పిలువబడుచున్నదో, అదే విధిన జ్ఞానము యొక్క లయమునకు నాశ్రయమైన దానిని జ్ఞానలింగమని యనవచ్చును. ఈ జ్ఞాన లింగము యొక్క స్వరూపమును శ్రీ పూజ్యపాదులవారు నీ క్రింది విధముగా ప్రతిపాదించిరి.

**త్రిమూర్తి భేదనిర్ముక్తం త్రిగుణాతీత వైభవమ్।**
**బ్రహ్మ యద్ బోధ్యతే తత్తు జ్ఞానలింగముదాహృతం။**
**స్థూలే క్రియా సమాపత్తిః సూక్ష్మే భావస్య సంభవః।**
**స్థూల సూక్ష్మపదాతీతే జ్ఞానమేవ పరాత్మని။** (సి.శి. 15-46-47)

ఈ యానతి ప్రకారము నీ జ్ఞానలింగము బ్రహ్మ విష్ణు మరియు రుద్రుల కంటెను భిన్నమైనది. అనగానిది యఖండమై యున్నది. దీనిలోనెట్టి భేదములును నుండవు. అంతేకాదు, సత్వరజస్తమోగుణములనెడి వాటి వైభవములకంటెను నతీతమైన వైభవోన్నతి గల్గినదైయున్నదో, దేనిని ఉపనిషత్తులు బ్రహ్మమని పిలుతురో నట్టిదానిని శివాచార్యులు జ్ఞానలింగమని పిలిచిరి. ఏవిధముగా స్థూలమైన యిష్టలింగములో క్రియలన్నియును లయమగునో, నేవిధముగా భావనలన్నియును భావలింగములో లయమగునో నదేవిధిన జ్ఞానమంతయును జ్ఞానలింగములోన లయమగుచున్నది. సర్వోత్కృష్టమైన భావలింగమే జ్ఞానలింగమని శ్రీ భగవత్పాదులవారు ప్రతిపాదించిరి.

శ్రీ పూజ్యపాదులు నీ జ్ఞానలింగము గురించిన విశ్లేషణను నీ క్రింది విధముగా చేసిరి.

**కల్పితాని హి రూపాణి స్థూలాని పరమాత్మనః।**
**సూక్ష్మాణ్యపి చ తైః కిం వా పరబోధం సమాచరేత్။** (సి.శి. 15-48)

పరబ్రహ్మమునందున కల్పించబడిన యిష్టలింగ మరియు ప్రాణలింగమనెడి భేదము మాయ చేత ప్రాదుర్భవించినదై యున్నది. ఈ విధముగా దీని మర్మము నెరిగిన ముముక్షువులును నీ స్థూల సూక్ష్మములను విడిచి వీటికంటెను నతీతమైన యవస్థలో నుండెడి జ్ఞానలింగపు ఉపాసననే

చేయవలెను. ఈ జ్ఞానలింగమును నుపాసన చేసెడివానిని జ్ఞానలింగి యని యందురని తెలిపెడి శ్రీ భగవత్పాదులవారి యీ క్రింది యుపదేశమును గనుడి.

**పరాత్పరం తు యద్బ్రహ్మ పరమానంద లక్షణమ్।**
**శివాఖ్యం జ్ఞాయతే యేన జ్ఞానలింగేతి కథ్యతే॥** (సి.శి. 15-49)

ఈ జ్ఞానలింగము పరాత్పరమైన పరబ్రహ్మమే యై యున్నది. ఇది పరమానంద స్వరూపమై యున్నది. పరశివుడనెడి యీ తత్త్వమును శివయోగులు జ్ఞానలింగమని పిలుతురు. దీనిని యెవరు స్వాత్మ స్వరూపముగా నెరుగుదురో, వారిని ప్రాణలింగియని పిలువవలెను.

స్థూల సూక్ష్మాదులను త్యజించి కేవలము జ్ఞానలింగమును భజించి తరించవలెనని తెలిపెడి శ్రీ భగవత్ పాదులవారి యీ క్రింది యుపదేశమును గనుడి.

**బాహ్యక్రియాం పరిత్యజ్య చింతామపి చ మానసీమ్।**
**అఖండ జ్ఞానరూపత్వం యో భజేన్ముక్త ఏవసః॥** (సి.శి. 15-50)

ఈ యుపదేశములోని భావమేమనగా బాహ్యక్రియలను పరిత్యజించి యఖండమైన జ్ఞానలింగమును భజించి సాధన పరిపక్వమైన దశలోన జీవన్ముక్తుడగును.

శ్రీ పూజ్యపాదులు సాధకుని క్రమానుగతమైన వికాసమును తెలియపరచుచు నెప్పుడైతే జ్ఞానలింగోపాన యొక్క అధికారియగునో అప్పుడతడు జ్ఞానలింగమునే యర్చించవలెను. ఈ స్థలమును చేరజాలని వారు వారి వారి సాధనల పరిపక్వత ననుసరించి ప్రాణలింగమునో లేదా యిష్టలింగమునో యర్చించవలెను. వీరశైవులు జ్ఞానలింగి యగుటకొరకు కృషి సలుపవలెను. ఆ విధిన జేసి చదువరులు ధన్యులగుదురుగాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 14-08-1992

స్థలం : **భికుబాయి మేనకుదళె**

**మంగళ కార్యాలయము, పూనె**

## విశేష ప్రదీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులు వారు నాగమోక్త తృప్తిలింగమునకును, ఆచార్యోక్త జ్ఞాన లింగమునకభేదము బ్రదర్శించుచు తత్సంబంధమైన రహస్యముల నాశీర్వచన రూపమున ప్రదానము చేసిరి.

అర్చన, చింతనల దగ్గర ఆగిపోయి అవియే సర్వస్వమని యెంచిన స్థితిలో సాధకుని సాధన యసంపూర్ణ మైనదగును. వీటికతీతముగా నుండెడి ప్రక్రియను చేపట్టి తద్వార స్థూల సూక్ష్మ తత్త్వముల కతీతముగాను, త్రిమూర్తులకును త్రిగుణములకతీతముగాను నుండెడి తత్త్వమేదియో యనెడిది తెలిసికొనవలెను. అది తెలియని స్థితిలో నుండెడివాడు "అయ్యగారు" కాజాలడనెడి శ్రీబసవన్నవారి వచనమీ సందర్భమున స్మరణీయము.

**అష్టవిధార్చనె షోడశోపచార వల్లదె।**
**నిమ్మముట్టలరియదవర కండడె,**
**అయ్యనెంతెంబె నవర?**
**ఆవభావదల్లి ఆవ జ్ఞానదల్లి, ఆవముఖదల్లి**
**అరియ దవరదారయ్యా? ఏనెంబె?**
**నిమ్మల్లి సమ్యక్కరాద సత్యశరణర కండు**
**కూడల సంగమదేవా, అవరనయ్య ఎంబెను**

ఈ వచనపు తెలుగు రూపమును గనుడి:

**అష్టవిధార్చన షోడశోపచారమే కాని**
**మిమ్ముల ముట్టనివారిని గనినచో**
**అయ్యయని యెట్టులందు వారిని**
**యెట్టి భావమందు, యెట్టి జ్ఞానమందు**
**యెట్టి ముఖమందు**
**అరయిక వారిదెవరయ్యా? ఏమందు**
**మీయందు సమ్యక్కులైన సత్యశరణులగని**
**కూడల సంగమ దేవా,**
**వారిని అయ్య యందును.**

అశుద్ధ, మిశ్రతత్త్వములను స్థూల సూక్ష్మ తత్త్వములనవచ్చును. త్రిగుణముల కతీతమైన తత్త్వములు శుద్ధతత్త్వ సంచయములోనివి. సృష్టి స్థితిలయలకు బాధ్యత వహించెడి వారు బ్రహ్మ విష్ణు మహేశ్వరులే త్రిమూర్తులని పౌరాణికులందురు. శంభు, మృడు, హరులే త్రిమూర్తులని శైవులందురు. వాస్తవముగా శుద్ధ విద్య, ఈశ్వర, సదాశివతత్త్వములే త్రిమూర్తులు వీరి కతీతముగా నుండెడి తత్త్వమే శక్తి విశిష్టమైన శివతత్త్వము. ఈ తత్త్వమును తెలిపి సాధకుని ధన్యుని చేయుటకే శివుడు లింగస్థలములలో నొకటగు జ్ఞానలింగమై యవతరించును. జ్ఞానలింగము వలన లబ్ధిని పొందిన సాధకుడు జ్ఞానలింగి యగుచున్నాడు.

*శుభం భూయాత్*

# స్వస్థలము

## ఆశీర్వచనము : 1

జ్ఞానలింగ స్థలమున జ్ఞాన లింగోపాసన చేసెడి శివయోగి జీవన్ముక్తిని పొందెడి దిశలో గమనించునని తెలిసికొని యుంటిమి. తదుపరి స్థలమగు స్వయస్థలమున నట్టి సాధకుడెట్టి ప్రగతిని సాధించునో యనెడిది తెలిసికొనెదము. స్వయ స్థలమనగా తన యందే తానుండుట యనెడిదని గ్రహించవలెను. గృహస్థ, వనస్థ మరియు సన్యస్త యనెడి శబ్దములను మన మెరుగుదుము. ఇంటిలో పడతి పిల్లలు మొదలగు వారితో నుండెడివాడే గృహస్థుడు. పరివారాదులను త్యజించి కేవలము ధర్మపత్నిని మాత్రమే తీసికొని వనవాసమునకు వెడలి యచ్చట నివాసమేర్పరచికొనెడి వాడే వనస్థుడు. భార్యను కూడ పరిత్యజించి సన్యాసమును స్వీకరించి యొంటరిగా జీవనమును కొనసాగించుచు బ్రహ్మ-జ్ఞానమును బడయుటకు ప్రయత్నించెడి వాడె సన్యస్తుడు. ఈ స్థితిని దాటిన పిదప వచ్చెడి దశయే స్వస్థావస్థ. స్వస్మిన్ తిష్ఠతి ఇతి స్వస్థః అనెడి వ్యుత్పత్తి ప్రకారము నెవ్వడు తన యందుననే తానానందమును పొందునో యతడు స్వస్థుడనబడును.

ఇద్దరు వ్యక్తులు పరస్పరము కలసికొనిని యప్పుడు మీరు స్వస్థులుగా నున్నారా? అనియో లేదా మీ స్వస్థత యెట్టులున్నది అనియో అడుగుటను గాంచగలము. లౌకికముగా నీ శబ్దము యొక్క అర్థము శరీరము యొక్క ఆరోగ్యమునుద్దేశించి యుండినను ఆధ్యాత్మిక దృష్టిచేత మీరు ఆత్మస్వరూపమునందున స్థిరముగా నున్నారా యనెడి అర్థము నా ప్రశ్నలోన నిమిడియుండును. ప్రాయః మనుజుడు తన యందు తానుండక యన్యాసక్తుడైయుండుచున్నాడు.

సుఖము తనయందుననే యుండినను అనగా తానే సుఖ స్వరూపియై యుండినను దాని యరయిక నెరుగని వాడై యన్యులవలన లేదా అన్య వస్తువుల వలన తనకు సుఖము చిక్కుననెడి భ్రాంతికి గురియై తత్ఫలితముగా సదా అన్యాసక్తుడై కాలమును గడుపుచున్నాడు. ఈ విధముగా సన్యాసక్తుడైన వానిని బద్ధుడనియును, తద్విరుద్ధముగా నుండి స్వస్థుడుగానున్నవాడు ముక్తుడనియును పిలువబడుచున్నాడు.

సామాన్యముగా మనుష్యుని మనోవృత్తి బహిర్ముఖముగా నుండుటయే యెక్కువగా నుండును. దానిని యంతర్ముఖము చేసికొనవలెననిన యెడల నెంతగానో కృషి చేయవలసి యుండును. ఎంతోమంది సర్వకాలముల యందునను, తమకు నవకాశము జిక్కినప్పుడును తీర్థ క్షేత్రముల దర్శనమునకై పోవుచుందురు. ఇది బహిరంగ యాత్ర యనబడుచున్నది. అయితే దీనికంటెను హెచ్చు ఫలకారియగు మరియొక యాత్ర గలదు. అదే అంతరంగయాత్ర. తన మనోవృత్తులను నంతర్ముఖము చేసికొని యాత్మ చింతన యందున లీనమయ్యెడిదే అంతర్గత యాత్ర. ఇదే యిచ్చట స్వయ స్థలముగా పిలువబడినది. స్వయ స్థలుదెవ్వడో యనెడిది తెలిపెడి శ్రీ భగవత్పాదులవారి యీ క్రింది యుపదేశమును గనుడి :

**తద్భావజ్ఞాపకజ్ఞానం యత్ర జ్ఞానే లయం వ్రజేత్।**
**తద్వానేష సమాఖ్యాతః స్వాభిధానో మనీషిభిః॥** (సి.శి. 15-51)

జ్ఞాన లింగ స్థలమున గల్గిన జ్ఞానమయే జ్ఞానమున లయమగునో యట్టి జ్ఞానము గలవాడే స్వస్థలుడనబడుననెడిది యీ శ్లోకములోని భావార్థము. ఇట్టివాని లక్షణములను శ్రీ భగవత్పాదులవారు నీ క్రింది విధముగా నుపదేశించిరి :

**స్వచ్ఛందాచార సంతుష్టో జ్యోతిర్లింగ పరాయణః।**
**ఆత్మస్థ సకలాకారః స్వాభిధో మునిసత్తమః॥**
**నిర్మమో నిరహంకారో నిరస్త క్లేశపంచకః।**
**భిక్షాశీ సమబుద్ధిశ్చ ముక్తప్రాయో మునిర్భవేత్** (సి.శి. 52-53)

స్వయ స్థలములోని శివయోగి తన యంతరంగమున నుండెడి జ్యోతిర్లింగముతో ననుసంధానము చేసికొనుట యందుననే యాసక్తుడైయుండును. ఇతడు సర్వతంత్ర స్వతంత్రుడై యుండుటచేత నితడు తన యిష్టమునకు వచ్చిన రీతిన యాచరించి యందులోనే సంతుష్టిని పొందును. సర్వము తన ఆత్మరూపముగనే తెలిసికొనెడి స్వయస్థలి సర్వమునులకంటెను శ్రేష్ఠుడై యుండును. ఎవ్వరు మౌనమును పాటింతురో వారు మునులని పిలువబడుదురు. మనస్సునందున యే యిచ్ఛయును నుదయము గాకుండగ నుండుటయే నిజమైన మౌనము. కేవలము వాగ్వ్యవహారమును ముగించి అంగచేష్టల వలన లేదా లేఖని మూలకముగా తమ మనోభిప్రాయమును వ్యక్తము చేసెడివారు గలరు. ఇది యాకార మౌనమే కాని, నిజమైన మౌనము కాజాలదు. అయితే పరిపూర్ణ మౌనమును పాటించుటకై యిది సహాయకారిగా నుండుటచేత దీనిని మౌనముగా నెంచుచున్నారు. ఈ స్వయ స్థలములోని శివయోగి యొక్క మనస్సునందున వేరే యే కోరికలు నుండకుండుట చేత నతని సమస్త మనోవృత్తులు నిలిచిపోవును. ఈ కారణముననే యితనిని శ్రీభగవత్పాదులవారు ముని సత్తముడు లేదా మునిశ్రేష్ఠుడని సంబోధించిరి.

ఈతడు నహంకరా మమకార రహితుడై యుండును. అహంకార-మమకారములే జీవిని పునః పునః సంసారములోనికి తీసికొని వచ్చుచున్నవి. ఈ రెండును దూరము గాకుండగ ముక్తి లభ్యము కాజాలదు. నేను మరియు నాది యనెడి శబ్దములను ప్రయోగించకుండగ నీ జగత్తుయొక్క వ్యవహారమును చేయలేము. అట్టి యెడ యీ జీవన్ముక్తుడగు శివయోగి అహంకార మమకారములు లేనివాడై యే విధముగా తాను వ్యవహరించగలడు? అనెడి ప్రశ్న యుదయించక తప్పదు. అయితే నేను-నాది యనెడి శబ్దముల ప్రయోగము చేసియు, వాటి యెడల నలిప్త భావన గల్గియుండెడి కళను శివయోగము తెలియజేయును. అందుచేతనే, యీ స్థలమునకు చెందిన శివయోగి తనను మొదలుకొని సర్వమును శివరూపకముగా చూచుచుండెడి యఖండ భావన నుండినప్పుడు సంకుచితములైన యహంకార-మమకారములు తలయెత్తజాలవు.

ఈ శివయోగి అవిద్యాది పంచక్లేశరహితుడుగా అయియుండును. అవిద్యా, అస్మితా, రాగ, ద్వేషాభినివేశములే పంచక్లేశములు. ఈ యైదును మనుజుని కను దినమును దుఃఖమును కల్గించును. అనిత్య, అశుచి, దుఃఖ అనాత్మల గురించి విపరీతబుద్ధిని గల్గించును. అనిత్యమును నిత్యముగాను, అశుచిని శుచిగాను, దుఃఖమును సుఖముగాను, అనాత్మను ఆత్మగాను తెలియపరచి దుఃఖమును కల్గించును. అందుచేత నివి క్లేశములుగా గుర్తింపబడినవి. ఈ జగత్తులోని వస్తువులన్నియును కాల పరిధిలోనికి వచ్చుటచేత నన్నియును అనిత్యములే అయివుండును. అజ్ఞుడైన జీవి తన శరీరమును మొదలికొని ప్రపంచములోని ప్రతి వస్తువును నిత్యములుగా భావించియే వ్యవహరించుచున్నాడు. ఇదంతయూ అవిద్య యొక్క మహిమయే. దేనిని యీతడు నిత్యమైనదని యెంచునో అది తన యెదురుగా నాశనము కాగా అనంతమైన దుఃఖమును అనుభవించును. ఎవరు దీనిని అనిత్యమని తెలిసికొనుదురో అది నాశనమైనను వారికి దుఃఖము కలుగజాలదు. ఈ విధముగా నజ్ఞులకు అనిత్యమునందున నిత్యబుద్ధియును పుట్టించెడి యవిద్య క్లేశదాయక మగుచున్నది. ఇటులనే అవిద్య అశుచి వస్తువుల యందున శుచి బుద్ధిని పుట్టించును. శరీరము స్వభావితః అశుచిగా నుండును. అయితే అజ్ఞులు దీనిని శుచిగా భావించి దానినుండి ఆనందమును పొందుటకు ప్రయత్నించి చివరకు దుఃఖితులగుచున్నారు.

ప్రతిదినము మనము చేసెడి స్నానము, సుగంధ ద్రవ్య లేపనములు మొదలగునవి శరీరము యొక్క అశుచిత్వమును మరుగుపరుచుటకు చేసెడి ప్రయత్నములనియే భావించవలెను. శరీరము చివరకు తన యశుచి రూపమును దాల్చియే తీరును. స్నానాదులు గాని, మరే సాధనములుగాని

శరీరము యొక్క మౌలిక స్వభావమును మార్చజాలవు. ఎంత ప్రయత్నించిననూ సహజ సిద్ధమైన యశుచిత్వము దూరము కాదు. ఈ వాస్తవమును మరుగుపరచి యశుచియగు కాయమునందున శుచి యను బుద్ధిని కల్పించెడి పాత్రను అవిద్య పోషించును. క్లేశము గల్గుటకు కారణభూతమగుచున్నది.

ఇంకను దుఃఖమునందున సుఖబుద్ధిని కల్గించెడిదియును నవిద్యయే. దీనివలన జీవితమున మరొక రకమైన దుఃఖము గల్గుచున్నది. శబ్ద స్పర్శాది విషయములు మూలతః దుఃఖమును గల్గించెడివై యుండును. అయితే యవిద్య చేత నావృతులైన జీవులు వాటిని సుఖములని భావించి వాటికొరకే మొత్తము జీవితమునే వ్యయపరచుచున్నారు. "ఆపాతరమ్యా విషయాః పర్యంత పరితాపినః" అనెడి వుక్తి ప్రకారము విషయముల చేత క్షణికమైన సుఖము దొరికినను చివరకు మాత్రము దుఃఖమే కైవసమగును. ఈ విధముగా నవిద్య దుఃఖదాయకములగు విషయముల యందున సుఖభ్రాంతిని గల్గించి క్లేశమును నిచ్చుచున్నది.

ఇదే రీతిన యవిద్య యనాత్మ వస్తువుల యందున యాత్మబుద్ధిని గల్గించి జీవుని దుఃఖపెట్టుచున్నది. శరీర మనాత్మయై యున్నను నజ్ఞులైన జీవులు దీని నాత్మయని భావింతురు. అయితే శరీరము, ఆత్మ యొక్క నివాసస్థానముగా నుండియునదియు నాత్మకంటెను భిన్నమైన యనాత్మ పదార్థముగా నున్నది. ఎవరు దీనినాత్మయని యెరుగుచున్నారో వారు నిది నాశనమైన సందర్భమున దుఃఖమును పొందుచున్నారు. నాశమగుట యనెడిది శరీరము యొక్క సహజ స్వభావమని దీనిని గుర్తించలేకపోవుచున్నారు. అయితే జ్ఞానులు శరీరాదులను నూత్మలుగాను, ననిత్యములుగాను భావించుటచేత శరీరము వికారమును పొందినను, చివరకు నాశనమైనను దుఃఖించరు.

ఈ విధముగా నవిద్య యజ్ఞులైన జీవులకు అనిత్యములయందున నిత్యబుద్ధిని, అశుచియందున శుచిబుద్ధిని, దుఃఖముల యందున సుఖబుద్ధిని, అనాత్మల యందున ఆత్మబుద్ధిని కల్గించును. తత్ఫలితముగా దుఃఖమును కల్గించును. ఈ కారణము వలన యవిద్య, క్లేశమని పిలువబడుచున్నది.

అవిద్యవలె యస్మితయు నొక క్లేశమైయున్నది. అభిమానము లేదా అహంభావమే యస్మిత యొక్క సామాన్యమైన యర్థము. "నేను పోవుచున్నాను. నేను చేయుచున్నాను. నేనిచ్చుచున్నాను. అన్నింటికినీ నేనే మూలము" అనెడి శబ్ద వ్యవహారముల యందున నేను నేను అనెడి భావనలో అస్మిత యిమిడియుండును. ఈ అహంకారము మనుజునికి యభిమానిత సుఖమును క్షణకాలము కొరకు నిచ్చినను అది యెక్కువ కాలము నిలువజాలదు. దానికి నొక యా ఘాతము తాకినప్పుడు దుఃఖము సంప్రాప్తమగును. ఈ విధముగా అస్మిత దుఃఖమునకు కారణమగుటచేత నిదియును క్లేశముగా పరిగణింపబడినది.

రాగమనెడిది మరొక క్లేశము. "సుఖానుశయీ రాగః" అనెడి వుక్తి ప్రకారము సుఖము లేదా సుఖ సాధనముల గురించి మనస్సునందున నుత్పన్న మయ్యెడి యిచ్ఛను రాగమని పిలుతురు. సంసారమునందలి రాగము చేతనే జీవుడు భవ చక్రమున తిరుగుచున్నాడు. రాగమునెప్పుడైనను రాగరూపమున నుండక నొక్కొక్కసారి ద్వేష రూపమున బహిర్గతమగును. దీని యర్థమేమనగా నెవరితో మనము రాగాత్మకముగా వ్యవహారమును చేయుచుందుమో వారితోనే ద్వేషముతో ప్రవర్తించెడి సందర్భములు జీవనమున ఘటించుచుండును. రాగము వెనుక ద్వేషము, ద్వేషము వెనుక రాగము వచ్చుచుండునని గ్రహించవలెను. "దుఃఖానుశయీ ద్వేషః" అని చెప్పబడినది. దుఃఖము మరియు దుఃఖమునకు సాధనములగు వాటి గురించి మనస్సు నందున గల్గెడి యనిచ్ఛయే ద్వేషమని గుర్తించవలెను. రాగద్వేషములు దుఃఖమునకు కారణభూతములగుటచేత, నివియును క్లేశములని గ్రహింపబడినవి.

అభినివేశము చివరిదగు క్లేశము అభినివేశమనగా మరణ భయము చేత కంపితుడై తనకెప్పటికినీ మరణము సంభవించకూడదనెడి భావనయే. ఇది యొక ప్రబలమైన యిచ్ఛా రూపముననుండును. ప్రతి యొక్కరికిని మరణభీతి యుండియే యుండును. ఈ జన్మలో మరణము సంభవించనిదే మరణ వేదన యెట్టులుండునో? యనెడిది జీవుని కెట్టుల తెలియుననెడి ప్రశ్న యుదయించవచ్చును. అయితే జీవి యనేక పర్యాయములు పుట్టి యనేక పర్యాయములు చచ్చుననెడిది యందరెరిగిన విషయమే. పూర్వపు జన్మలలో తాను పొందిన వేదన యొక్క స్పృహ జీవికి నుండియుండునని గ్రహించవలెను. ఇది అంతఃకరణమున నిమిడియుండును. దీనివల్లనే చావంటే భయము కలుగుచుండును. దేహమునకు గతించెడి స్వభావముండియున్నను, చావు రావలదనెడి భావన వలన దుఃఖము కలుగకుండగ యెట్టులుండును. అందుచేత, నభినివేశము క్లేశముగా గుర్తింపబడినది.

ఈ పంచక్లేశములును అజ్ఞులను బాధకు గురిచేయుననెడిది నిజమే. కాని స్వయ స్థలమున నుండెడి సాధకునికి యీ పంచ క్లేశములు గలుగవు. అందుచేత నితడు నిరస్త పంచక్లేశుడని శ్రీ భగవత్పాదుల వారిచే యభివర్ణింపబడినాడు. స్వయ స్థలములోని శివయోగి యింటింటికి వెళ్ళి భిక్షను స్వీకరించును. ఇతని బుద్ధియందున నెవ్వరి గురించియు మేలు-కీడు భావనలుండవు. సమబుద్ధి సంపన్నుడై యుండును. జీవన్ముక్తి యొక్క విలక్షణమైన యానందము ననుభవించుచు ముని శ్రేష్ఠుడుగా కాలము గడుపుచుండును.

ఈ స్వయ స్థలమున నుండెడి సాధకుని విలక్షణమైన యవస్థను శ్రీపూజ్యపాదులవారు నీ క్రింది విధముగా నభివర్ణించిరి :

**యదృచ్ఛాలాభసంతుష్టో భస్మనిష్ఠో జితేంద్రియః।**
**సమవృత్తిర్భవేద్ యోగి బిక్షుకే వా నృపేఽ థవా॥**
**పశ్యన్ సర్వాణి భూతాని సంసార స్థాని సర్వశః।**
**స్మయమానః పరానందే లీనాత్మా వర్తతే సుధీః॥**
(సి.శి. 15-54-55)

ఈ స్థలములోని శివయోగి తనకు దొరికిన దానితో సంతృప్తిని పొందును. సంతోషపడును. మనస్సులోని సంతోషమే యొక గొప్ప లాభము. వ్యాపారుల దృష్టికోణములోని లాభమునకు శివయోగుల దృష్టికోణములోని లాభమునకు బహుళమైన వ్యత్యాసముండును. లాభము చిన్న ప్రమాణముదే అయినను లేదా యెక్కువ ప్రమాణములోనుండనీ, అది లాభమే యగును. వ్యాపారులకు నతి యెక్కువ లాభము యొక్క కోరిక యుండుటచేత వారికి గల్గెడి లాభము నల్పప్రమాణములో నుండిన యెడల నయ్యది లాభముగా దోచక హానిగానే కన్పట్టును. ఈ విషయమును విశదీకరించెడి కథ యొకటి కలదు.

ఒక వ్యాపారి వ్యాపారమునకై ముంబై నగరమునకు వెడలెను. అతనితో నతని మిత్రుడు కూడ బయలుదేరి వెడలెను. ఉభయులు నూరికి తిరిగి వచ్చిరి. వ్యాపారి వాడిపోయిన ముఖము గలవాడై ఖిన్న మనస్కుడై యింటిలోనికి ప్రవేశించెను. అప్పుడతని ధర్మపత్ని యతని స్థితిని చూసి యేదో యనర్థమైనదని భావించి భర్త దరికి జేరి "యేమి మీ ముఖమెందుకు వాడినది? యేమైనది? ఏమి సమాచారము? అని పరి పరి విధములుగా ప్రశ్నించెను. అప్పుడా వ్యాపారి నేటి వ్యాపారమునందున ఐదు లక్షల రూపాయల హాని యైనదని యేడ్వ దొడంగెను. పెనిమిటితో పడతి దుఃఖమునందున సహభాగినియై రోదించదొడగినది. భార్యాభర్తలిరువురును రోదించుచున్నారని తెలిసికొనిన వ్యాపారి వెంట ముంబైకి వెడలివచ్చిన యతని స్నేహితుడు వారి యింటికి వచ్చెను. వారిరువురెందుకు విలపించుచున్నారని అడిగెను. ఆ ప్రశ్నకు స్పందించిన వ్యాపారి ధర్మపత్ని తన పతికి వచ్చిన అయిదు లక్షల రూపాయల హాని గురించి చెప్పి మరింత గట్టిగా నేడ్వ జొచ్చెను. అప్పుడతడు "ఇదేమిటి? అయిదు లక్షల లాభము వచ్చినది నేనెరుగుదును. ఈ హాని యొక్క వార్తను తెలిపినదెవరు?" అని వ్యాపారిని అడిగెను. అప్పుడతడు తన మిత్రుని కిట్లనెను: "నిన్న నేను ముంబై కొరకు బయలుదేరునప్పుడు వ్యాపారము నందున పదిలక్షల రూపాయల లాభము వచ్చియే తీరుననెడి నమ్మకముండి యుండెను. అయితే దుర్దశ వలన కేవలము నైదు లక్షల రూపాయల లాభమే లభించినది. నా దృష్టిలో నాకు నయిదు లక్షల రూపాయల నష్టము గల్గినటులే అవునా కాదా? నీవు చెప్పుము?

లోభి మనములో నుండెడి లాభపు విషయ చింతన గురించి తెలిసికొంటిమి కదా! లోభికి నెంత లాభము గల్గినా నయ్యది యతనికి నష్టముగానే దోచును. దీనికంటెను భిన్నముగా శివయోగి దొరికిన దానితో సంతోషపడును. శ్రీమన్నిజగుణ శివయోగుల వారును నిదే విధిన సెలవిచ్చిరని తెలియుచున్నది.

శివయోగి భస్మతత్త్వమునందున నత్యంత నిష్ఠ గలవాడై యుండును. ఇచ్చట భస్మమనగా రెండర్థములలో గ్రహించవలెను. మొదటిది గోమయము వలన చేయబడెడిది. ఇది భౌతిక రూపమున నుండెడి భస్మము. రెండవది "స యేష భస్మ జ్యోతిః" అనెడి జాబాల శ్రుతి ప్రకారము సాక్షాత్ పరమాత్ముడే యనెడిది. శివయోగి యైనవాడు తన మేనిన గోమయముతో చేయబడిన భస్మమును ధరించికొని, జ్యోతి రూపమైన పరమాత్మను తన యాత్మ రూపముగా భావించికొని సదా పరమాత్ముని ధ్యానము చేయుచుండును. ఇదియే యతని భస్మనిష్ఠయని భావించవలెను. స్వయలింగ స్థలములోని భక్తుడు జితేంద్రియుడై యుండును.

"భోగే రోగభయమ్" అనెడి సూక్తి ప్రకారము భోగియైన వానికి రోగభయమనెడిది గల్గును. ఈ రహస్యమునెరిగిన స్వయ స్థలములోని వాడు విషయోపభోగములకు దూరమై యింద్రియములపై విజయమును సాధించును. వాతపిత్తాదులచేత గల్గెడి రోగములతోబాటుగా భవరోగము కూడ నిర్వీర్యమై పోవును. స్వయలింగ స్థలిని బాధకు గురి చేయజాలవు.

స్వయలింగస్థలి సమదృష్టిని గల్గి యుండును. రాజైన వానికిని పేదవానికిని మధ్య గల భేదమతనికి దోచదు. వారిరువురును నతని దృష్టిలోన జీవులే. ఇదే భావముతో నతడు సకల జీవులను దర్శించును. మందస్మితాననుడై పరమానంద రూపమైన శివుని యందున చిత్తమును తల్లీనము చేసికొని యుండును.

స్వయ స్థలీయుని చతుర్విధా చరణల గురించి శ్రీ భగవత్పాదులవారు నీ క్రింది విధిన నుపదేశించిరి:

**ధ్యానం శైవం తథా జ్ఞానం భిక్షా చైకాంతశీలతా।**

**యతేశ్చత్వారి కర్మాణి న పంచమమిహేష్యతే॥** (సి.శి. 15-56)

ఈ వుపదేశము యొక్క తాత్పర్యమేమనగా స్వయ స్థలపు శివయోగి శివుడే సర్వోత్తముడనెడి జ్ఞానమును పొందియుండును. అదే ప్రకారముగా నిరంతరము శివుని ధ్యానమును చేయుచునుండును. స్వీయ శరీర నిర్వహణార్థము భిక్షను వేడుచు నుండును. ఏకాంతస్థానమున తానొక్కడే కూర్చొని యుండును. ఈ శివధ్యాన, శివజ్ఞాన మరియు నేకాంతశీలతను మినహాయించి మరే కర్మనితడు చేయజాలడు. ఇదే స్వయ స్థలియైన శివయోగి లక్షణమని గుర్తించవలెను.

ఇచ్చట శివధ్యాన, శివజ్ఞాన, భిక్షాటనల జతకు నేకాంత వాసము ప్రతిపాదింపబడినదని గుర్తించగలరు.

ఈ జగత్తున సహవాసము వలన మనుజుడు సంస్కరింపవచ్చును లేదా చెడిపోవచ్చును. మంచివారి సహవాసము చేత మంచి గతి సంప్రాప్తముగాగ, దుర్జనుల సాంగత్యమున దుర్గతియు ప్రాప్తమగును. శివధ్యాన- శివోజ్ఞాన సంయుక్తులు కూడ నొక్కొక్కసారి దుర్జనుల సాంగత్యమువలన నాచార హీనులయ్యెడి ఆస్కారము గలదు. ఈ కారణమువలననే కాబోలు శ్రీభగవత్పాదులవారు నిచ్చట నేకాంత వాసమును నొక్కి చెప్పినారు. భిక్షాటన వలన నొక వ్యక్తి యొక్క స్వాభిమానము తనకు తానే యంతరించి పోవును. తత్ఫలితముగా నిరభిమానిగాను, పరిశుద్ధునిగాను పరిణామము నొందిన శివయోగి సదా శివజ్ఞాన శివధ్యానములయందుననే యాసక్తి గల్గియుండును. ఇంతటి యపూర్వమైన జీవన్ముక్తి యొక్క విలక్షణమైన యానందము నట్టి యానందమున యభిలాష గలవారికి దొరకవలెనని యాశింతుముగాక!

ఓం శాంతిః శాంతిః శాంతిః

ది : 15-08-1992

స్థలం : **భికుబాయి మేనకుదళె**

**మంగళ కార్యాలయము, పూనె**

## విశేష ప్రదీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు స్వస్థలమును గురించిన మౌలికాంశముల నెన్నింటినో విశ్లేషించి చూపిరి.

ఇంతవరకు మనము లింగస్థలములైన వివిధ గురు స్థల, లింగ స్థలముల నిగూఢ రహస్యముల నెరింగితిమి. స్వ, చర, పర స్థలములలో జంగమమునకు సంబంధించిన లింగస్థలముల గురించి తెలిసికొందుము.

భక్తిస్థలములోని సాధకుడు నష్టావరణములను వీడుటయో, ఆచార భ్రష్టత్వము బొందుటయో, షట్స్థల జ్ఞాన విహీనుడో యగుట కాస్కారము గలదు. సాంగత్య శుద్ధి విరహితుల కిట్టి ప్రమాదములు సంభవించుట సహజమే. ఇట్టి స్థితిలో స్థావర లింగార్చనాసక్తి, ప్రాకృత గురువుల నాశ్రయించెడి ధోరణి, భస్మ త్రిపుండ్రములను వీడి క్షుద్ర ముద్రలను ధరించుట, రుద్రాక్ష హారము స్థానములో నితరేతరములతో చేసిన మాలను వేసికొనుట, పాదతీర్థములో మాలిన్యమును గాంచుట పంచాక్షరిని వీడి పలు మంత్రముల నాశ్రయించుట, ప్రసాదములోన యెంగిలిని గనుట వంటివి సాధకుని ఆచరణలలోన నంతర్భాగములు కావచ్చును. ఇవన్నియును భక్తి పథమును భగ్నము చేసెడివి. శ్రద్ధాభక్తిని కాలరాచెడి ధోరణులివియని తెలియుచున్నది.

పతనము దిశలో పయనించెడి సాధకుని శిక్షించి రక్షించుటకే శివుడు జంగముడై వేంచేయునని తెలిసికొనగలరు. సామ, భేదాద్యుపాయము నాశ్రయించి జంగముడు భక్తాంగునికి జ్ఞానోదయమును గల్గించును. సాధకుని తల్లిస్థానములో గురువుండగా తండ్రి స్థానములో జంగముడుండునని తెలిసికొనగలరు. ఈ కారణముననే జంగమార్చనకు ప్రాధాన్యత నొసంగబడినది. జంగమార్చన యనెడిది వీరశైవ ధర్మము యొక్క ప్రత్యేక లక్షణము.

వేరే ధర్మములలోన యిట్టి భావనను గాంచలేము. కొందరు జంగముని అతిథితో పోల్చుదురు. ఇట్టి పోలిక సరియైనదికాదు. జంగముడు శివ స్వరూపుడని కొందరనగా, జంగముడు శివుని కంటెను గొప్పవాడని మరికొందరందురు. ఏది యెట్టులుండినను, జంగముని నిర్లక్ష్యమునకు గురిచేసిన సాధకుడు చేసెడి లింగపూజలు సత్ఫలితముల నివ్వవని సోమనాథులవారు సెలవిచ్చిరి. ఈ పద్యమును గనుడి :

క॥ **జంగమ పరాఙ్ముఖుండై**
**లింగార్చన సేయు నతని లీల దలంపన్**
**వెంగలియై శవమునకును**
**శృంగారము చేయునట్లు శివభక్తి నిధీ** (అనుభవసారము, ప. 223)

స్వస్థలములోని జంగముని లక్షణములను సుప్రభేదాగమములో గాంచగలము. గమనించుడి :

**అంగీకృత్య సదాచారం ధృత్వాజంగమ లక్షణమ్।**
**జ్ఞాత్వా సద్ధర్మమఖిలమ్ భూత్వాసుజ్ఞానవాన్ శుచిః**
**త్యక్త్వా దుష్కర్మ నిచయం ముక్తాదౌర్జన్య లక్షణమ్।**
**హిత్వా దుష్టమతింశాస్త్రం శ్రుత్వా సద్వేదశైవకమ్।**
**మఠమేకం సమాశ్రిత్య కృత్వాసల్లింగ పూజనమ్।**
**తత్పుర స్థిత సద్భక్త గృహే భిక్షాటనమ్ముదా॥**
**తద్భిక్షార్జిత ద్రవ్యేషు ఆస్థాంహిత్వా నిరంతరం**
**సావధాన మనా స్సమ్యక్ సత్యజ్ఞాన పరోభవేత్।**
**గతాగతేషు భక్తానాం చరాణమేపచారకమ్।**
**యః కుర్వన్వసతే నిత్యం స ఏవ స్వయ జంగమః॥**

సమగ్రమైన శివజ్ఞానము గలవాడే స్వయ జంగము డనెడిది సారాంశము. ఈ స్వయజంగముని లక్షణములనే ఆచార్యులవారు తాత్త్వికపరముగా వివరించిరి. షట్ త్రింశత్ తత్త్వములలోని శివతత్త్వము యొక్క సత్యమైన పరిజ్ఞానము సంపూర్ణముగా గలవాడే జ్ఞానలింగియనియును, అతడే స్వస్థల జంగముడని తెలిసికొనవలెను.

శ్రీ బాడాల రామయ్యగారు, తమ బసవేశ్వర వచనములు - సమగ్ర సమీక్షలోన యీ స్వస్థలి సాభారి యని సెలవిచ్చిరి. (పే.357) కాని శ్రీ రేణుక భగవత్పాదులవారి యుపదేశములోన యీ భావము స్ఫురించుటలేదు. లోకాచారమునను స్వయజంగముడనగా విరక్తమూర్తియే యనియును, నిరంజన సాంప్రదాయము గలవాడని తెలియుచున్నది.

ధ్యానము, జ్ఞానము, భిక్షావృత్తి, ఏకాంత శీలతలే స్వయ జంగముని ధర్మములనియును, ఇవి తప్ప మరే ధర్మముండెడిది కాదని తెలియుచున్నది.

*శివం భూయాత్*

# చర స్థలము

## ఆశీర్వచనము : 1

స్వయ లింగస్థలమును గురించి గుర్తెరిగిన యనంతరము చరలింగ స్థలము గురించి తెలిసికొనవలసి యున్నది. ఇంతకంటెను ముందున వివరింపబడిన స్వయ స్థలములోని సాధకుడు లోక కళ్యాణార్థమున నెప్పుడైతే నెల్లెడల సంచరించుటను ప్రారంభించునో యప్పుడతడు చరస్థలియని పిలువబడును. "నీరు ప్రవహించుచు నుండవలెను. యోగి తిరుగాడుచు నుండవలెను" అనెడి సూక్తి యొకటి కలదు. ప్రవహించే నీటిలో మాలిన్యముండదు. అది లోకమున యెంతోమందికి నుపయుక్తముగా నుండును. సదా సంచారము నందుండెడి యోగికి యిల్లు ముంగిలి

యనెడి మమకారములుండవు. నిర్మోహియై యందరినీ సమభావముతో చూడగల్గును. అతని బోధామృతము లోకోద్ధారణను చేయగలదు. ఇట్టి చరస్థలి గురించి శ్రుతి యీ క్రింది విధముగా తెలియజేసినది :

**ఆత్మ రతిరాత్మక్రీడ ఆత్మ మిథున ఆత్మానందః స స్వరాడ్భవతి।**
**తస్య సర్వేషు లోకేషు కామచారో భవతి॥** (ఛాంద్యోగోపనిషత్తు)

ఈ విషయమున వాతూలోత్తరాగమము నందున యీ క్రింది విధిన తెలుపబడినది.

**అహం మమత్వ శూన్యాత్మా నిజ బోధైకరూపదృక్।**
**స్వయ మేవ స్వయంభూత్వా చరతీతి చరస్మృతః॥**

ఈ ప్రమాణముల యొక్క తాత్పర్యమేమనగా నీ చరస్థలి తనయందున తాను రమించెడి మానసియై యుండును. ఈతనికితన యానందానుభూతి కొరకు, వేరొకరి యవశ్యకత లేదు. అందుచేతనితనిని ఆత్మరతుడు, ఆత్మ క్రీడాకారుడు, ఆత్మమిథునమునేయువాడు, ఆత్మానందమును పొందెడివాడు మొదలగు విశేషములతో పిలుతురు. అహంకార మమకారములు లేని యితడు నిజబోధ దృష్టి గలవాడై తానే తానైన స్థితియందున సంచరించుచుండును. అందుచేత యితనిని చరస్థలియని పిలుతురు. ఇట్టి యాగమోక్త విషయము గురించి శ్రీ భగవత్పాదులవారు నీ క్రింది విధముగా నుపదేశమునిచ్చిరి :

**స్వరూప జ్ఞాన సంపన్నో ధ్వస్తాహం మమతాకృతిః।**
**స్వయమేవ స్వయంభూత్వా చరతీతి చరాభిదః॥** (సి.శి. 15-57)

ఈ వుపదేశము యొక్క భావమేమనగా చరస్థలములోని శివయోగి స్వస్వరూప జ్ఞాని. అదేవిధిన నతనికి నహంకార మమకార భావన లుండవు. అవిధ్వస్తమైపోవును. ఈతడు తనదేయగు ఆనందపు స్థితిలో సర్వత్ర సంచరించుచుండును. అందుచేత యితడు చరుడని పిలువబడును. ఈ చరస్థలియొక్క ఆచార విచారముల గురించి శ్రీ భగవత్పాదులవారు నీ క్రింది విధిన యుపదేశమునిచ్చిరి.

**కామక్రోధాదినిర్ముక్తః శాంతిదాంతిసమన్వితః।**
**సమబుద్ధ్యా చరేద్యోగీ సర్వత్ర శివబుద్ధిమాన్॥**
**ఇదం ముఖ్యమిదం హీనమితి చింతామకల్పయన్।**
**సర్వత్ర సంచరేద్యోగీ సర్వం బ్రహ్మేతి భావయన్॥**
**న సమ్మానేషు సంప్రీతిం నావమానేషు చవ్యథామ్।**
**కుర్యాణః సంచరేద్యోగీ కూటస్థే స్వాత్మనిస్థితః॥**(సి.శి. 15-58-60)

ఈ వుపదేశములోని భావమేమనగా, చరస్థలపు శివయోగి కామక్రోధాది యరిషడ్వర్గముల ప్రభావము తనకు సోకకుండా నుండే విధిన తగు జాగ్రత్తలు గైకొనును. కామక్రోధాదులు నంతరంగములోని జ్ఞాన రత్నమును నపహరించే దొంగలని గుర్తెరుగును. ధనికుడు నిశ్చింతగా నిదురించినప్పుడు నతని యింటికి దొంగలు వచ్చి యతని యింటియందలి సంపత్తునెల్లా దోచికొనిపోవునటులనే మోహనిద్రలో నిదురించిన వ్యక్తి యొక్క జ్ఞానమనెడి రత్నాన్ని యీ కామాదులనెడి దొంగలు అపహరింతురని తెలిసికొనియుండును. కామాది ప్రవృత్తులు మనమున నుద్భవించినప్పుడు వివేకియు నవివేకి వలె వ్యవహరించును కదా! వివేకరత్నము దొంగిలింపబడుననెడి విషయమును గుర్తెరుగును "బలవాన్ ఇంద్రియ గ్రామో విద్వాంసమపి కర్షతి" యనెడి సూక్తిని గుర్తెరుగును. అందుచేత కామక్రోధాదుల చేత క్షోభింపబడకుండగ శివయోగి సంచరించును.

చరస్థలపు శివయోగి శాంతి-దాంతి సమన్వితుడై యుండును. ఇచ్చట శాంతి యనగా శమమనియును, దాంతియనగా దమమనియును తెలిసికొనవలెను. శమమనగా నంతరింద్రియ నిగ్రహము. దమమనగా బహిరింద్రియ నిగ్రహము. ఈ రెండు నొకదాని కొకటి సహయోగము గలవైయుండును. అంతరింద్రియమైన మనస్సును నిగ్రహించినయప్పుడే బహిరింద్రియములను నిగ్రహించుటకు సాధ్యమగును. అదే విధముగా

బహిరింద్రియముల మీద నిగ్రహమును సాధించినప్పుడే అంతరింద్రియములమీద నిగ్రహము సాధించుటకు సాధ్యమగును. ఈ విధముగా నీ రెండు పరస్పర పూరకములని గుర్తించగలరు. చరస్థలములోని శివయోగి యొక్క అంతరింద్రియమైన మనస్సు సదా జీవ-శివులయందే తల్లీనమై యుండుటచేత విషయముల అపేక్షలు ఆ మనస్సుకు నుండవు. మనస్సునందున వాసన లేని కారణమున బహిరింద్రియములును శబ్ద స్పర్శాదుల వైపు పరుగులెత్తవు. ఈ విధముగా నతడు ఆత్మనిష్ఠుడై యుండుటచేత శాంతి దాంతి సమన్వితుడై యుండును. ఇదే ప్రకారముగా సర్వత్ర శివబుద్ధి యున్న యితనికి నందరు సమానులుగా కన్పట్టుదురు.

సమదృష్టిగల శివయోగికి నిది శ్రేష్ఠము, ఇది కనిష్ఠమనెడి వికల్పములు మనస్సున పుట్టవు. "సర్వం ఖల్విదం బ్రహ్మ" అనెడి యుపనిషద్వాక్కు తెలిపినయటుల సర్వమును శివునిగా భావించెడి యితడు నిదే భావముతో నెల్ల యెడల సంచరించుచుండును.

సర్వత్ర సంచరించెడి శీలముగల చరస్థలపు శివయోగి, మానావమానములను లెక్కించడు. ఎవ్వరైనను సన్మానము చేసిన యెడల నుబ్బి తబ్బిబ్బు కాడు. అవమానము చేసిన యెడల కృంగిపోడు. స్వాత్మస్థితియందుననే కూటస్థుని వలె నిశ్చల స్వభావము గలవాడై తిరుగాడుచుండును.

అందుచేత నతని మనస్సునందున వికారము లేవియును నుండవు. ఇది గమనార్హమైన విషయము.

శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు నీ చరస్థలీయుని యొక్క ఆచార విచారములలోని మరికొన్నింటిని యీ క్రిందివిధముగా తెలియజేసిరి.

**అప్రాకృతైర్గుణైః స్వీయైః సర్వం విస్మాపయన్ జనమ్ ।**
**అద్వైత పరమానందముదితో దేహివచ్చరేత్॥**
**న ప్రపంచే నిజే దేహే న ధర్మే న చ దుష్కృతే।**
**గత వైషమ్య ధీర్ధీరో యతిశ్చరతి దేహివత్॥** (సి.శి. 15-61-62)

శివాద్వైతములోని పరమానందము చేత నానందితుడయ్యెడి వాడగు నా శివయగి తన లోకోత్తరములైన యుత్కృష్ట గుణముల వలన జగత్తులోని జనులందరిని విస్మయమునకు గురిచేసెడి యొక సామాన్య జీవివలె యితడు లోకములోన సంచరించును. విధినిషేధాదుల గురించి విషమబుద్ధి లేకుండగ నుండును. దీనిని చేయవలెను, దీనిని చేయవలదనెడి నిబంధనలకు లోనుగాకుండక నుండును. "వికార హేతేసతి విక్రీయంతే ఏషాంన చేతాంసి తత,ఏవ ధీరాః" అనెడి కాళిదాసోక్తి ప్రకారము మనస్సున వికారముగ చేసెడి విషయము లెదురుగా నున్నను నెవ్వరి మనస్సు వికృతము గాదో వాడే ధీరుడనిపించికొనును అనెడిది శివయోగి యెడల వర్తించును. ధీరుడై దేహియైయుండియు పుణ్యపాపములను పొందజాలడు.

ఈ శివయోగి నిత్య సంతుష్టుడై యుండునని తెలుపుచు, శ్రీ భగవత్పాదుల వారీ క్రింది విధముగా నుపదేశించిరి.

**ప్రాకృతైశ్వర్యసంపత్తి పరాఙ్ముఖమనస్థితిః।**
**చిదానంద నిజాత్మస్థో మోదతే మునిపుంగవః॥** (సి.శి. 15-63)

ఈ వుపదేశములోని సారాంశమేమనగా బ్రహ్మ విష్ణువు మొదలైన దేవతల యైశ్వర్యముచేత పరాఙ్ముఖుడైన మనస్సులోని స్థితియున్నవాడును, చిదానంద స్వరూపమైన తన ఆత్మయందుననే ఆనందించెడివాడును, అయిన ఈ మునిపుంగవుడు సదా సంతుష్టుడై యుండును. ఐహిక పారలౌకిక సుఖముల యెడల నతనికెట్టి కోరికలుండవు. ఈ లోకములోని రాజభోగముల యెడగాని పరలోకములోని బ్రహ్మ విష్ణ్వాదులు ననుభవించెడి సుఖముల యెడలను నతనికెట్టి ఆసక్తియు నుండదు. తన యాత్మలోనే నెలకొనియున్న సచ్చిదానందానుభూతి ననుభవించుచు శివయోగి సదా సంతుష్టుడై యుండునని తెలిసికొనగలరు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

స్వయ స్థలములోని జంగముడే చరపట్టాధికారమును పొంది లోకమున సంచరించుచు తిరుగాడెడి దశలో చరస్థలి యనబడునని శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు తెలియజెప్పిరి. చర జంగమునికి సంబంధించిన విషయము లెన్నింటినో వివరించిరి.

సుప్రభేదాగమమున చరస్థలికిని శివునకును అభేదము చెప్పబడినది గమనించుడి :

**యశ్శంభుస్సర్వలోకానాం ముక్త్యర్థం ధరణీతలే।**
**చరత్వ నరరూపేణ నమస్తస్మై చరాత్మనే॥**

లోకములన్నింటినీ కాపాడుటకై శివుడే చరలింగమై సంచరించునని తెలుపబడినది.

చరస్థలిని పూజించవలెననెడి నియమము కలదు. చరార్చన ఫలమును చంద్రజ్ఞానాగమమీ క్రింది విధముగా వివరించినది :

**సర్వతీర్థాభిషేకాచ్చ సర్వయజ్ఞ విధానతః।**
**సర్వదేవారాధనాచ్చ చరపూజా గరీయసీ॥**

గంగాది తీర్థములలో మునుగుట కంటెను, యజ్ఞయాగాదులను చేయుటకంటెను, హరిహర బ్రహ్మాదులను పూజించుట కంటెను చరపూజ మహోత్కృష్టమైనదని తెలుపబడినది.

చరస్థలి కింతటి గొప్పస్థానము కల్పించుటకు గల కారణమును గుర్తించవలెను.

శివాగమముల ప్రకారము చరస్థలి షట్స్థల జ్ఞాన సంపన్నుడై, స్వేష్ట లింగార్చన తత్పరుడై, భస్మ రుద్రాక్షల ధరించి పంచాక్షరిని జపించుచు భక్త సంరక్షణార్థమై యూరూర తిరుగాడును. దర్శన స్పర్శనలే యతని సాధనములు. దర్శనమును కటాక్షించి పాపక్షయమును, స్పర్శచేత జ్ఞానోదయమును కల్గించును. కుల మత వర్ణ లింగ భేదముల నరయక అందరినీ రక్షించును. జన్మ రాహిత్యమును, దుర్గతి యొక్క నాశనమును, చిరాయువును కటాక్షించును. ఈ కారణముల వలననే చరస్థలి త్రైలోక్య పూజ్యుడగుచున్నాడు. "సమబుద్ధ్యా చరేద్యోగీ సర్వత్ర శివబుద్ధిమాన్" అనెడి జగద్గురూక్తి చరస్థలియొక్క సమత మమతలను సూచించుచున్నది. "సర్వత్ర సంచరేద్యోగీ సర్వం బ్రహ్మేతి భావయన్" యనెడి వివరణ వలన తెలియునదేమనగా చరస్థలి కులజాంత్యజాది భేదముల నరయడనియును, దీనజనులను, పీడిత జనాంగమును పరిరక్షించునని తెలియుచున్నది.

మానావమానములు సామాన్యునకు సంతోష సంతాపములను గల్గించును. కాని చరస్థలి నివి చలింపజాలవని తెలిసికొనగలరు. మహాలింగమున చిత్తమును లయము చేసెడి చరలింగికి మహాలింగ లక్షణములబ్బును. మహాలింగమునకు తృప్తి లింగమనెడి పేరు గలదు. చరస్థలి తృప్తి యనెడి లక్షణమును గైకొని నిత్య తృప్తిని గల్గి చరించును.

చరలింగి చరించుటకు గల కారణమేమనగా చలన స్వభావము గల లోకుల చిత్తములను శివ తత్త్వోన్ముఖ చిత్తములుగా చేయుటే.

*శివం భూయాత్*

## పరస్థలము
## ఆశీర్వచనము - 1 :

లింగ స్థలములలోని భక్త స్థలాంతర్గతమగు చరస్థలములోని శివయోగి గురించి తెలిసికొనియుంటిమి. అతడు నిత్య తృప్తుడై యుండునని గ్రహించితిమి. ఆ పిదప మనము పరస్థలము గురించి తెలిసికొనవలసి యున్నది.

పరస్థలము, భక్తస్థలములోని చివరిదగు స్థలము.

'పర'యనగా శ్రేష్ఠతమమైనదని యర్థము.

"తద్ బ్రహ్మాహమితి జ్ఞాత్వా బ్రహ్మ సంపద్యతే పరమ్" అనెడి యమృత బిందోపనిషత్తు ప్రకారము సర్వశ్రేష్ఠమైన బ్రహ్మస్థితిని బడయునదే పర శబ్దము యొక్క తాత్వికమైన యర్థము.

శివ లేదా బ్రహ్మల సర్వశ్రేష్ఠతను ప్రతిపాదించుటకొరకు పర యనెడి విశేషణమును జోడింతురు. పరబ్రహ్మ పరశివ యనెడి పదముల ప్రయోగమును నీ అర్థముననే గాంచవచ్చును.

ప్రతియొక్క మనుజుని మనస్సునందున సర్వోన్నతమైన స్థానమును పొందవలెననెడి పెద్ద కోరిక యుండియుండుట సహజమే. లౌకిక జీవనము నందున నొక సమయములోన నొక్కడే యట్టి స్థానమును పొందుట కొరకు సమర్థుడగుచున్నాడు. మనదేశమున రాష్ట్రపతి పదవి లౌకిక దృష్టివలన సర్వోత్కృష్టమైనదిగా భావింపబడును. ఆ స్థానమునందున నైదు సంవత్సరముల వరకునొకేనొక్కడు కూర్చుండుట సాధ్యమగును. రాష్ట్రపతిగ నయ్యెడి యర్హత యనేకులలో నుండినను నేక కాలమున వారు రాష్ట్రపతిగా నయ్యెడి యవకాశము నుండదు.

ఆధ్యాత్మిక క్షేత్రమునందున సర్వోన్నతమైన పరశివ స్థానమును నొకే సమయమున లక్షలాది జనులు బడయవచ్చును. అచ్చట పరస్పరమైన యే విరోధ భావము గనబడదు. నేను పరశివ స్వరూపుడనైయున్నాను అనెడి దృఢమైన భావన యెవరి యందున గల్గునో వారు తత్క్షణముననే తత్ స్వరూపులుగా అగుచున్నారు. అందుచేత, క్షణికమైన లౌకికమైన పదవికంటెను శాశ్వతమైన యారుఢ్థలమే సర్వోత్కృష్టమైనదని తెలిసికొనవలెను.

శ్రీ జగద్గురువు రేణుక భగవత్పాదుల వారు నీ పరస్థలియొక్క స్వరూపమును గురించి యీ క్రింది విధముగా నుపదేశించిరి :

**స్వయమేవ స్వయం భూత్వా చరతః స్వస్వరూపతః।**
**పరం నాస్తీతి బోధస్య పరత్వమభిధీయతే॥** (సి.శి. 15-64)

ఈ యుపదేశము యొక్క భావమేమనగా నింతకంటెను పూర్వమున చెప్పబడిన చరస్థలపు శివయోగి తానే తానుగా నయి సర్వత్ర సంచరించుచుండగ నతనికి నంతటను తనకు వెలుపలను అన్యమైనది అగోచరమగును. అటులనే, అతని మనస్సునందున "పరంనాసి" (ఇంకొకరు వేరుగా లేరు) అనెడి యెరుక గల్గుటచేత యతనిని పరస్థలియని యందురు.

ఈ సందర్భమున సర్వజ్ఞుల వారి యీ క్రింది వచనము గమనార్హమైయున్నది.

**తన్నతా నరితవరిగె**
**భిన్నభేదగళిల్ల తన్నవరిల్ల పరరిల్ల త్రిభువన**
**తన్నొళగుంటు సర్వజ్ఞ!**

దీని తెలుగు రూపమిది :

**తనను తా నెరిగిన వానికి**
**భిన్న భేదములు లేవు తనవారు లేరు పరులు లేరు త్రిభువనము**
**తనలోననే యుండును సర్వజ్ఞ॥**

సర్వజ్ఞులవారి ఈ వచనమున పరస్థలి యగు శివయోగి లక్షణములను యథాతథముగా ప్రతిపాదింపబడినది. శరీరేంద్రియ మనోబుద్ధులు ప్రతియొక్క వ్యక్తియందున భిన్న భిన్నముగా నుండినను లోననుండెడి ఆత్మ మాత్రము నొక్కటే అయి వుండును. పూలమాల నుదాహరణగా గైకొనిన యెడల మాలలో రంగురంగుల పూవులు భిన్నభిన్నముగా దోచినను వాటిని యొకే రేఖయందున కూర్చెడిది దానిలోపలి దారమే. పూలమాలలో నొకే యొక దారముండునటులే జగత్తులోని చరాచర వస్తువులన్నిటిలోన పరమాత్ముడు సూత్రమువలె నుండును. అందుకే యతనిని సూత్రాత్మయని అందురు. ఈ ప్రకారముగనే పరస్థలపు శివయోగి తనయందలి తన ఆత్మరూపమును గాంచుటయేకాదు, ఇతరుల యందునను తన ఆత్మనే గాంచుచుండును. అతనికి తనకంటె భిన్నమైనదేదియును దోచదు. ఈ కారణముననే యతడు పరస్థలియని పిలువబడుచున్నాడు.

పరస్థలియొక్క వర్తన గురించి శ్రీ భగవత్ పాదులవారు నీ క్రింది విధిన నుపదేశించిరి :

**స్వతంత్రః సర్వకృత్యేషు స్వం పరత్వేన భావితః।**
**తృణీకుర్వన్ జగజ్జాలం వర్తతే శివయోగిరాట్॥** (సి.శి. 15-65)

ఈ యుపదేశములోని 'స్వం' అనగా తనను "పరత్వేన" అనగా పరబ్రహ్మ స్వరూపముగా అని తెలుసుకొనవలెను. ఈ స్థలములోని శివయోగి తనను తానే పరబ్రహ్మగా భావించికొని సమస్త కార్యముల యందున స్వతంత్రునిగా ప్రవర్తించును. ఇతనిమీద నెవ్వరి శాసనము నడువజాలదు. ఈ చరాచరాత్మకమైన జగత్తునతనికి గడ్డిపుల్లవలె కన్పట్టును. దీని భావమేమనగా జగత్తులోని దేనిమీదనూ నతనికి యాసక్తి యుండదు.

శివయోగియైనవాడు సదాశివునితో సంబంధమును స్థాపించికొనును. ఇష్టలింగధారణ మరియు నిష్ఠలింగ పూజల వలన స్థూలదేహమునకు శివునితో సంబంధమేర్పడును. ఇంకను వాణివలన పంచాక్షర మహామంత్రపు జపము నఖండముగా సాగుటచేత మంత్రార్థ రూపమైన శివునితో వాణియొక్క సంబంధముండియే యుండును. ఇదే ప్రకారముగా తన పరిశుద్ధమైన మనస్సునందున ప్రాణలింగ మరియు భావలింగముల యనుసంధానమును స్థాపించికొనును. ఈ సంబంధమెంత కాలమువరకు కొనసాగునో యంతవరకు సాధకుడు శివయోగి యనబడును. అయితే యీ పరస్థలపు శివయోగి యొక క్షణమైనను నిస్సంబంధియై యుండడు. ఎడతెగని సంబంధము గల్గియుండును. వీరశైవులందరు నెంతో కొంతమేరకు నీ సంబంధము గల్గియుందురనెడిది సత్యమే. అయితే ఎల్లకాలము సంబంధము గల్గియుండుట లేదు. ఈ కారణమున పరస్థలిని శ్రీ భగవత్పాదులవారు యోగి విరాట్ అని సంబోధించిరి. ఆ పిదప నట్టి శివయోగి యే విధముగా సమ్మోదమును పొందునో యనెడి దానిని యీ క్రింది విధముగా నుపదేశించిరి :

**వర్ణాశ్రమ సమాచార మార్గనిష్ఠా పరాఙ్ముఖః।**
**సర్వోత్కృష్టం స్వమాత్మానం పశ్యన్ యోగీ మతు మోదతే॥** (సి.శి. 15-66)

లౌకిక జీవనము నందున యొక వ్యక్తి సంతోషమును పొందవలెననిన యింకొక దానిని లేదా మరొక్కరిని యపేక్షింతురు. వాస్తవముగా చూసిన యెడల తన్నిమిత్తమై వేరే వస్తువుల లేక వ్యక్తుల అవశ్యకత లేనేలేదు. సుఖము లేదా ఆనందము వెలుపల దొరికెడిది కాదు. ప్రతి యొక్కరి ఆత్మ సుఖరూపమున నుండుటచేత యెప్పుడు మనస్సు నేకాగ్రముతో దానిలో నిమగ్నమగునో యప్పుడు నద్దానికి నానందానుభూతి గల్గును. యోగులు తమ యోగ సామర్థ్యముచేత మనస్సును సుస్థిరముగా నిలిపి దానిని ఆత్మచింతనలో లీనముచేసి ఆత్మానందము ననుభవింతురు.

సాంసారిక జీవులకు శబ్ద స్పర్శాది విషయముల సంబంధమైనప్పుడు మనస్సు నొక ప్రశాంత స్థితిని పొందును. అప్పుడు శాంతమైన మనస్సున సుఖరూపమైన ఆత్మయొక్క ప్రతిబింబము పడును. అప్పుడా విషయము వలన ఆనందము గల్గినట్లొక భావము గల్గును. ఆనంద మనెడిది విషయము నందుండక ఆత్మయందుననే యుండును. విషయములు క్షణికమైన సుఖమును లభింపజేసెడి సాధనములు మాత్రమే. అవి సుఖరూపములు కావు. ఒక వ్యక్తి ఒకనిని కొంతకాలము వరకు ప్రేమించి యా పిదప కారణాంతరముల వలన ద్వేషించుటను ప్రారంభించును. ఈ విధముగా విషయములు క్షణిక సుఖమునిచ్చెడి సాధనములనెడిది నిరూపితమగుచున్నది.

ఈ పూర్వోక్తమైన విషయ వస్తువు యొక్క పరిపూర్ణమైన యరయిక యీ పరస్థలపు శివయోగి గల్గియుండుటచేత యితడు అన్యులను చూసి యానంద పడకుండగ తన ఆత్మనే యెల్ల కడల చూచి ఆనందించుచుండును. ఇతని దృష్టియందున బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర యనెడి వర్ణములకు చెందినవారు కాని, బ్రహ్మచర్యాది ఆశ్రమములుగాని దోచవు. శివమయ దృష్టి సంపన్నుడైన యీ శివయోగి అందరిలోను తనను తానే గాంచును. అందుచేత సదా మోదితుడై యుండును.

పరస్థలపు శివయోగి సర్వోత్కృష్టుడని తెలుపుచు శ్రీ భగవత్పాదులవారు నీ క్రింది విధముగా నుపదేశమును ఇచ్చిరి.

**విశ్వాతీతం పరం బ్రహ్మ శివాఖ్యం చిత్స్వరూపకం।**
**తదేవాహమితి జ్ఞానీ సర్వోత్కృష్టః స ఉచ్యతే॥** (సి.శి. 15-67)

ఈ యుపదేశము యొక్క తాత్పర్యమేమనగా గొప్పదానితో సమరసతను పొందినప్పుడు చిన్నవస్తువు కూడ పెద్దదానిగా పరిణమించును, అనెడి సంగతి లోకమందున సర్వానుభవసిద్ధమైన విషయము. గంగోత్రినుండి బయలుదేరిన గంగానదికి మధ్యలోన ననేక చిట్టిపొట్టి నదులు చేరును. ఇవన్నియును గంగానది స్వరూపములై పోయెడిది మనము గాంచుచున్నాము. ఇటులనే యీ ప్రపంచమునందున సర్వోత్కృష్టమైన వాడు శివుడొక్కడే. ఇతనితో శివయోగము మూలమున సామరస్యమును బడసి శివయోగులందరు సర్వోత్కృష్టులే యగుదురు. అందుచేత పరస్థలములోని శివయోగియు విశ్వాతీతమైన చిద్రూపమైన శివ లేదా బ్రహ్మ అనెడి పేరుగల ఆ పరతత్త్వమే నేనైయున్నాననెడి జ్ఞానమును బడసి యుండుటచేత యితడును సర్వోత్కృష్టుడని పిలువబడుననెడిదే పూజ్యులఆశయమైయున్నది. ఇట్టివాడు జీవన్ముక్తుడని చెప్పుచు శ్రీ భగవత్పాదులవారు నీ క్రింది విధముగా నుపదేశమునిచ్చిరి.

**అచలం ధ్రువమాత్మానమనుపశ్యన్నిరంతరమ్।**
**నిరస్తవిశ్వవిభ్రాంతిర్జీవన్ముక్తో భవేన్మునిః॥** (సి.శి. 15-68)

అచలము, నిత్యము అయిన తన ఆత్మ స్వరూపమును నెప్పుడు నఖండితమైనదానిగా పరిభావించి పరశివునితో తనను నన్యముగా ననుభవించెడి యీ ముని యనబడెడి శివయోగి, జగత్తులోని భ్రాంతులన్నిటి నుండియును ముక్తిని గాంచిన వాడైనందున యితనిని జీవన్ముక్తుడని యందురు.

ఇహలోకమునందున దేహధారియై యుండియున్నంతవరకు అందరు తమ తమ ధర్మములను విధి విధానము ప్రకారము నిర్వహించవలెననియును, తన్నిమిత్తమున వివిధ కర్మలను చేయవలెననియును చేయకుండిన యెడల, దేవతలు కుపితులగుదురనెడి యభిప్రాయమొకటి కలదు. విధి నిషేధాతీత వర్తన గల్గి కర్మాచరణను తిరస్కరించెడి శివయోగి యెడల దేవతలెట్టి వైఖరిని యవలంభించెదరనెడి యనుమానమొకటి కలుగవచ్చును. ఈ విషయమును గురించి శ్రీ భగవత్పాదులవారు నీ క్రింది విధముగా నుపదేశమునిచ్చిరి :

**బ్రహ్మాద్యాః కిం ను కుర్వంతి దేవతాః కర్మ మార్గగాః।**
**కర్మాతీత పదస్థస్య స్వయం బ్రహ్మ స్వరూపినః॥** (సి.శి. 15-69)

పరస్థలములోని శివయోగి తానే పరబ్రహ్మ స్వరూపముగా నుండుట చేత యతడు నీ లౌకిక కర్మస్థానము కంటెను అతీతమైన యుత్కృష్టమైన స్థానము నందున యుండుటచే బ్రహ్మాది దేవతలు నితనిని యేమియును చేయుటకు సమర్థత గల్గియుండరు. దీనికి గల కారణమేమనగా యీ దేవతలెల్లరు శివపరబ్రహ్మకు నధీనులై యుందురు కదా! శివయోగి పరబ్రహ్మ స్వరూపియై యుండుటచేతనితడు కర్మాదులను చేయకుండినను దేవీదేవతలితని నేమియును చేయలేరు.

పరస్థలములోని శివయోగియును, జనులందరి అజ్ఞానమును దూరము చేయగల సమర్థత గల్గియుండునని తెలుపుటకై శ్రీ భగవత్పాదులు నీ క్రింది విధిన యుపదేశమునిచ్చిరి.

**స్వేచ్ఛయా సంచరేద్యోగి విముంచన్ దేహమానితామ్।**
**దర్శనైః స్పర్శనైః సర్వానజ్ఞానపి విమోచయేత్॥** (సి.శి. 15-70)

దేహాభిమానమును త్యజించిన శివయోగి యీ జగమున తనకు యిష్టమైన రీతిలోన సంచరించుచు, కొందరిని దర్శనము చేతను, మరికొందరిని స్పర్శచేతను నుద్ధరించి ముక్తిని ప్రదానము చేయును. ఇట్టి అలౌకికమైన సామర్థ్యమును పొందిన శివయోగి మీద మఱ్ఱెవరి శాసనము చెల్లనేరదనెడిది శ్రీ భగవత్పాదుల యభిప్రాయమై యున్నది.

"నిరంజనః పరమం సామ్యముపైతి దివ్యమ్" అనెడి శ్రుతి వచనము చెప్పిన యటుల శివయోగి పరిపూర్ణమైన శివభావన గల్గియుండుటచేత అతడు జీవన్ముక్తుడే అయియున్నాడు. ఈ విషయమును తెలియజెప్పుట కొరకు శ్రీ భగవత్పాదులవారు నీ క్రింది విధముగా నుపదేశము నిచ్చిరి:

**నిత్యే నిర్మలభావనే నిరుపమే నిర్ధూత విశ్వభ్రమే।**
**సత్తానందచిదాత్మకే పరశివే సామ్యం గతః సంయమీ**
**ప్రధ్వస్తాశ్రమ వర్ణ ధర్మనిగలః స్వచ్ఛంద సంచారవాన్**
**దేహీ వాగద్భుత వైభవో విజయతే జీవన్విముక్తః సుదీః॥** (సి.శి. 15-71)

ఈ ఉపదేశపు తాత్పర్యమేమనగా పరశివునితో సామ్యావస్థను పొందినవాడైనందున శివయోగి వర్ణధర్మమును విడిచివేస్వతంత్రుడై, దేహధారియై యుండియు విలక్షణమైన జీవన్ముక్తి యొక్క ఆనందము ననుభవించుచుండును. సర్వోత్కృష్టుడై విరాజిల్లును.

స్వయ చర పరస్థలములనగా నొక్కడే యయిన శివయోగి యొక్క వివిధావస్థలని తెలిసికొనవలెను. వీటిలో పరస్థలము నుత్కృష్టమైనది. ఇతడు నాశ్రమాది బంధములకు కట్టుబడడు. తన కిష్టమైన యెడల నొకే ప్రదేశమున కూర్చుండి యుండవచ్చును. లేదా మనస్సుకు నచ్చిన విధముగా సంచరించవచ్చును. ఇతని దృష్టి స్పర్శాదుల రూపమున నుండెడి యితని కరుణకెవ్వరు పాత్రులగుదురో వారును విలక్షణమైన యానందము ననుభవింతురని తెలిసికొనగలరు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

# విశేష ప్రదీపిక :

పరస్థలియొక్క స్థానము బ్రహ్మ విష్ణ్వాదుల కంటెను అధికమైన మహత్త్వము గలదని శ్రీ జగద్గురు చంద్రశేఖర శివచార్యుల వారు తెలియజేసి మనలను ధన్యులను జేసిరి.

స్వయ, చర మరియు పరస్థలము లన్నియును శివునితో నభేదము గల్గినట్టి స్థానములే. జ్ఞానమున కతీతముగా నుండెడి జ్ఞానోత్తర పదముననుండెడి స్థలములు. వీటిలో పరస్థలియొక్క స్థానము పరబ్రహ్మయొక్క స్థానమని గుర్తించగలరు. సాక్షాత్తుగా శివ పరబ్రహ్మ పరస్థల జంగమ రూపమున తిరుగాడునని తెలిసికొనవలెను. ఇట్టి స్థలమున పరబ్రహ్మను మినహాయిస్తే మరే వస్తువు ఉండదు. ఈ కారణముననే పరస్థలి యెక్కడికి వెడలినా తనకు తానే కనిపించును.

"స్వతంత్రః సర్వకృత్యేషు" అనెడి ఆచార్యోక్తి గమనార్హమైనది. పరస్థలికి సర్వకర్తృత్వము సిద్ధించునని తెలియుచున్నది. స్వతంత్రుడైనందున నతడు జగజ్జాలమును తృణప్రాయముగా చూచును. వర్ణ ధర్మ ఆశ్రమ ధర్మాదులతనిని శాసింపజాలవు. విశ్వభ్రాంతి విరహితుడై తానే పరబ్రహ్మ ననెడి భావమును మనమున దాల్చియుండెడి పరస్థల జంగముడు జీవన్ముక్తిని పొందిన వాడని గ్రహించగలరు. శిఖి కర్పూర న్యాయమున విశ్వభ్రాంతిని, జీవభ్రాంతిని విసర్జించి, నదీ సముద్ర న్యాయమున శివ-జీవ సామరస్యమును పొందిన పరస్థల జంగముడు పరబ్రహ్మగా పరిణామమును పొందునని తెలిసికొనగలరు. సర్వజ్ఞత్వము, సర్వకర్తృత్వము, సర్వభర్తృత్వములు గలవాడై తనను దర్శించిన వారి పాపములను భగ్నము చేసి ముక్తిని ప్రసాదించుచుండును.

ఇట్టి స్థితిలో నుండెడి వాని లక్షణముల నాగమములు క్రింది విధముగా తెలుపుచున్నవి :

"ఇతడు ద్వంద్వమును వీడి ద్వంద్వాతీతుడై యుండును. నిత్య నిరంజనుడై సచ్చిదానందములో మునిగి తేలుచుండును. చతుర్వర్గ ఫలముల నాశించడు. వాటినితరులకు కటాక్షించగల సమర్థత గల్గియుండును".

అయితే భక్తాంగ స్థలములోని సాధకుడు జంగమ భేదమును చేయకూడదు. స్వయ, చర, పర జంగముల యెడల సమమైన భక్తిని ప్రదర్శించవలెను. ఈ విషయమున, శ్రీ బసవేశ్వరులవారి క్రింది వచనము గమనార్హమైనదై యున్నది.

**దూరదింద బంద జంగమవనయ్యగళెందు**
**సారిద్ద జంగమవ పరిచారకరెంబ**
**కేడింగె బెరగాదెనయ్యా**
**సారిదవరు దూరదవరెందు బేరుమాడి కండడె**
**కూడల సంగమ దేవ సింగారదమూగ కొయ్యదె మాణ్బనె?**

ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి :

**దూరమునుండి వచ్చిన జంగమము నయ్యగారని**
**చేరువనున్న జంగముని పరిచారకుడనెడి**
**చేటుకు వెరగైతినయ్యా**
**చేరువవారు దూరపువారని వేరుజేసి గనినచో**
**కూడల సంగమదేవుడు**
**సింగారపు ముక్కును కొయ్యక మానునే?**
(వచనము సం. 414)

స్వయ, చర, పరస్థలములలో నుండెడి లింగస్థలుల యుద్దేశమొక్కటే యని తెలిసికొనగలరు. స్వయ జంగముడు స్థానిక స్థితిగతులను బాగుగా నెరిగిన వాడై చరలింగమునకు విషయ నివేదన జేయును. చరస్థలి స్వరం బ్రహ్మేతి యనెడి భావము గలవాడై పర్యటన చేయుచు భక్తుల పరిరక్షణకు కృషిచేయును. స్వయ జంగముడు భక్తిమార్గ క్రియా పథమును సుగమము చేయుటలో శ్రద్ధను గనబరచగా, చరుడు జ్ఞాన ప్రదాతయై "సర్వం బ్రహ్మేతి" అనెడి భావనకు పుష్టినిచ్చును. సంసార భ్రాంతిని తొలగించును. పరస్థలి భక్తగణమును లింగాంగ సామరస్యమును సాధించెడి దిశలో పయనింపజేయును.

*- శుభం భూయాత్ -*

# షోడశ పరిచ్ఛేదము
# మాహేశ్వర స్థలము
# క్రియాగమ స్థలము
# ఆశీర్వచనము : 1

ఇంతవరకు లింగస్థలములోని భక్తస్థలము గురించి తెలిసికొంటిమి. ఇందులోని చివరి యవాంతర స్థలములోని శివయోగి సర్వతంత్ర స్వతంత్రుడై చరించునని తెలిసికొంటిమి. తదుపరి వచ్చెడి మాహేశ్వరస్థలము గురించి తెలిసికొనవలెను.

శ్రీ రేణుక భగవత్పాదులవారు లోకకళ్యాణము నాశించి యాగస్త్య మహర్షికి లింగస్థలములోని భక్త స్థలమును గురించి యుపదేశించిన పిదప, నా ఋషీశ్వరుడు శ్రీ జగద్గురు రేణుకాచార్యుల కిట్లులనియెను.

**స్థలానాం నవకం ప్రోక్తం భక్తస్థలసమాశ్రయమ్।**
**మాహేశ్వరస్థలే సిద్ధం స్థలభేదం వదస్వ మే॥**
(సి.శి.16-1)

అగస్త్యుల వారి ప్రశ్న యొక్క తాత్పర్యమేమనగా భక్తస్థలమున తొమ్మిది యవాంతరస్థలముల వివరణ నిచ్చితిరి. యికమీదట మహేశ్వర స్థలములోని యవాంతర భేదము గురించి దయచేసి తెలియజేయుడి:

శ్రీ భగవత్పాదులవారు నీ క్రింది విధముగా సెలవిచ్చిరి.

**మాహేశ్వర స్థలే సంతి స్థలాని నవ తాపస।**
**క్రియాగమస్థలం పూర్వం తతోభావాగమస్థలం॥**
**జ్ఞానాగమస్థలం చాథ సకాయస్థల మీరితమ్।**
**తతో కాయ స్థలం ప్రోక్తం పరకాయస్థలం తతః॥**
**ధర్మాచారస్థలం చాథ భావా చారస్థలం తతః॥**
**జ్ఞానాచారస్థలంచేతి క్రమాదేషాంభిదోచ్యతే।** (సి.శి.16-2 నుండి 4 వరకు)

శ్రీ భగవత్పాదులవారి యానతి ప్రకారము నిందులోను తొమ్మిది స్థలములు గలవు. అవి : క్రియాగమ స్థలము, భావాగమ స్థలము, జ్ఞానాగమ స్థలము, సకాయ స్థలము, అకాయ స్థలము, పరకాయ స్థలము, ధర్మాచార స్థలము, భావాచార స్థలము మరియు జ్ఞానాచార స్థలము.

ఈ స్థలముల లక్షణ స్వరూపముల గురించి తెలిసికొనెదము గావుత. వీటిలో క్రియాగమ స్థలమే మొదటిది. ఇచ్చట క్రియయనగా పూజా రూపమైన యాచరణ ఆగమమనగా పూజాక్రియా విధి విధానమును నిర్దేశించెడి శాస్త్రము. పూజా విషయకమైన విధిని ప్రతిపాదించెడి స్థలమే క్రియాగమ స్థలము. ఈ విషయమున, శ్రీ భగవత్పాదుల వారి యుపదేశము నీ క్రింది విధిన యున్నది.

**శివోహి పరమః సాక్షాత్ పూజా తస్య క్రియోచ్యతే।**
**తత్పరా ఆగమా యస్మాత్ తదుక్తోఽయం క్రియాగమః॥** (సి.శి.16-5)

ఈ యుపదేశము యొక్క తాత్పర్యమేమనగా పూర్వోక్త పరస్థలపు శివయోగి సాక్షాత్తుగా శివుడేయని యెరుగవలెను. అతడు చేసెడి యిష్టలింగ పూజాదులు క్రియలని పిలువబడును. ఇంతటి క్రియలు లోకులకు ననుసరణీయములై యుండును. ఈ క్రియల గురించి తెలిపెడి శాస్త్రము యాగమము. ఈ స్థలమునందున క్రియల గురించి ప్రతిపాదింపబడియుండుట చేత నిద్దానిని క్రియాగమ స్థలమని యందురు. ఇందులో జీవన్ముక్తుడైన శివయోగి చేత నాచరింపబడెడి యిష్టలింగ పూజాదుల గురించి తెలుపబడినది.

వీరశైవ సిద్ధాంతము నందున కేవలము జ్ఞానమునకు మాత్రమే ప్రాధాన్యతనివ్వకుండా, యిష్టలింగాది క్రియలకు కూడాప్రాముఖ్యత యివ్వబడినది. ఈ కారణమున జీవన్ముక్తుడైన శివయోగియు, ప్రాణమున్నంతవరకు నిష్టలింగ పూజాది సత్కార్యములను చేయుచుండవలెను. దీనికి గల కారణమేమనగా నీ జగములో నెంతోమంది సామాన్యులు పెద్దవారి యాచరణలను ననుకరించుటకై యత్నింతురు. ఒకవేళ జ్ఞానులు సత్క్రియల యెడల విముఖతను చూపిన యెడల సామాన్యుడును ఆ మార్గము ననుసరించెడి యవకాశము గలదు. అందుచేత జీవన్ముక్తుడైన శివయోగి యిష్టలింగ పూజాదులు చేయుచుండవలెను.

శ్రీ పూజ్యపాదులవారు పూజాక్రియయొక్క మహత్త్వమును నీ క్రింది విధముగా వివరించిరి :

**ప్రకాశతే యథా నాగ్నిరరణ్యాం మంథనం వినా।**
**క్రియాం వినా తథాంతఃస్థో న ప్రకాశో భవేచ్ఛివః॥** (సి.శి.16-6)

ఈ యుపదేశములోని తాత్పర్యమేమనగా అరణి యొక్క మంథనను చేయకుండగ అగ్ని ప్రకటనము కానటులే, శివపూజా క్రియలు చేయకుండా శివుని ప్రాకట్యము కాజాలదు.

అగ్నితత్త్వము వ్యాపకముగా సర్వత్ర విద్యమానమై యుండినను అది ప్రకటనము కావలెననిన రెండు వస్తువుల ఘర్షణ యవశ్యకముగా కావలెను. ఇదే ప్రకారముగా విశ్వమంతయును వ్యాపించియున్న పరశివుడు పూజాక్రియవలననే ప్రకటితుడగును. అందుకే జ్ఞానము వలె క్రియయు ప్రాధాన్యత గలదని గ్రహించవలెను. ఇష్టలింగ పూజా రూపమున గల యీ బాహ్యక్రియ యనెడిది యంతర్లింగాను సంధానమునకు కూడ సహాయకారిగా నుండగలదు. బయటి క్రియ లోపలి యంతరంగమును పరిపక్వముగ చేయును. అంతఃకరణము పరిశుద్ధమైనప్పుడు ప్రాణలింగ భావలింగముల యనుసంధానము సంభవించును. ఈ కారణమున, సాధకుడు నంతర్ముఖ ప్రవృత్తికి బాహ్య లింగార్చన సహాయకారిగా నుండుననెడిదానిని మరువరాదు.

బాహ్యక్రియాచరణ యే రీతిన యుండవలెనో దానిని శ్రీభగవత్పాదుల వారు నీ క్రింది విధముగా తెలియజేసిరి :

**న యథా విధి లోపః స్యాద్యథా దేవః ప్రసీదతి ।**
**యథాగమః ప్రమాణం స్యాత్తథా కర్మ సమాచరేత్॥** (సి.శి. 16-7)

ఎటుల చేసిన యెడల విధి విధానములోన లోపము కలుగదో, యెటుల చేసిన యెడల శివుడు ప్రసన్నుడగునో, యెటుల నాగమ ప్రమాణము కలదో, అటుల పూజాకర్మ నాచరించవలెననెడిది యాచార్యుల వారి యాదేశములోని భావార్థము.

పూజను చేయునప్పుడు యోగ్యమైన రీతిలోనే చేయవలెను. తన మనస్సుకు నచ్చిన విధముగా చేయవలదు. ఒక వంటకము చేయునప్పుడు నేయే పదార్థములు నెప్పుడెప్పుడు వేయవలయునో యా విధిన చేసిననే యది రుచికరమై తినెడి వారికి సంతోషమును చేకూర్చును. విధానముననుసరించకుండగ వంటను చేసిన యెడల, వంటకము చెడిపోవును. ఇదే విధిన, విధానము నతిక్రమించి చేసెడి పూజ ప్రయోజనకారి కాజాలదు. పూజా విధానములలో వివిధ విధానములు గలవని తెలిసికొనవలెను. వైదిక శివ పూజావిధి యనెడిది బహుళ ప్రచారములో నున్నది. దీనికి ప్రత్యామ్నాయముగా సంక్షిప్త విధియును గలదు. ఆగమములలో పంచోపచార, అష్టోపచార, షోడశోపచార, రాజోపచారములు చెప్పబడినవి. సాధకుడు నేదో యొక దానిని యెంపిక చేసుకొనవలెను. మొత్తము మీద తెలిసికొనవలసిన దేమనగా యేదో యొక విధిని యనుసరించవలెను.

ఈ విధి విధానముల జతకు సాధకునికి భక్తి భావన కూడా యుండవలెను. యాంత్రికముగా పూజనాచరించుటవలన శివ కారుణ్యమును పొందజాలము. అయితే, భక్తిభావన యుండిన యెడల యుపచారముల ప్రయోజనమెట్టిది? యనెడి ప్రశ్న యుదయించవచ్చును. ఉపచారములు మన భావనను భగవంతునికి బహుళ సమీపమున నుంచుటకై సహాయకారిగా నుండును. ఈ విధి నతిథి సత్కారముతో పోల్చవచ్చును. ఇంటికి వచ్చిన యతిథిని సంతోష పెట్టుటకై యింటి యోడయుడు పలు విధములుగా అతిథి సత్కారముల చేయును. వీటిని చేయకుండా కేవలము ప్రేమను మాటలలో ప్రదర్శించిన యెడల, యతిథి సంతృప్తిని పొందునే? స్నేహ భావమున లేదా గౌరవభావమున చేసెడి సత్కారములే యతిథికి సంతృప్తిని గల్గించును. శివార్చన కూడ అట్టిదే. శివుని తృప్తిపరచుటకై పలు విధోపచారములను భక్తి భావముతో సమర్పించవలెను. అర్పణానంతరము

లభించెడి నైర్మాల్యమును స్వీకరించవలెను. ఇది యమూల్యమైన దనియును, దీనివలన మనఃప్రసన్నత, ప్రజ్ఞాన లబ్ధి గల్గుననెడిది మరువరాని సత్యము. ఈ కారణమువలన విధి ప్రకారముగా నిష్టలింగ పూజను చేయుట యనెడిది యెంతో అవశ్యమని గుర్తించవలెను.

శాస్త్ర విహిత పూజను చేయుట యనెడిది

**విధిః శివనియోగో౽యం తస్మాద్ విహిత కర్మణి।**
**శివారాధనబుద్ధ్యైవనిరతః స్యాద్ విచక్షణః॥** (సి.శి.16-8)

ఈ యుపదేశము యొక్క తాత్పర్యమేమనగా, పూజా విధానమనెడిది శివునిచేత నిర్దేశింపబడినది. అందుచేతనిది శివాజ్ఞ వంటిది. శివపూజాతత్పరులెల్లరు శివాజ్ఞను పరిపాలించవలెను. శాస్త్రోక్త విధిన శివార్చనను చేయవలెను.

చేయవలసిన దానిని విహిత కర్మ మనగా చేయకూడని దానిని నిషిద్ధ కర్మమని యందురు. ఉదాహరణకొరకై చెప్పవలెననిన యెడల, "మాహింస్యాత్, సర్వాభూతాని, న కలంజం భక్షయేత్; న సురాంపిబేత్; స్వాధ్యాయన్మా ప్రమదః" అనెడివి నిషేధములు. హింసను చేయకూడదు, మాంసమును తినకూడదు, కల్లును త్రాగవలదు, స్వాధ్యాయమును తప్పకూడదు" అనునవే యీ నిషేధములని గుర్తింపగలరు. వీటిని శివాజ్ఞలనియే తెలిసికొనగలరు.

ఈ విషయమున శ్రీమన్నిజ గుణ శివయోగులవారు నీ క్రింది విధముగా చెప్పిరి.

**దురిత కర్మవ నొల్లదిరు । పుణ్యవనె మాడు ।**
**హరనడివిడి । శాంతరొడనాడు ।**
**కరుణ విరలి జీవరొళు । నీతి విద నాగు ।**
**పొరె పొర్దిరనెందు బెససువ ॥**
**నిందిసి నుడియదిరారను । మనస్సిగె బందంతె**
**నడెయదిరిహదళ్ళి । కుందవడెయదిరు।**
**కామాదిగళను జయిసెందు**
**కైవిడిదనుగ్రహిసువ॥**

ఈ బోధ యొక్క తెలుగు రూపమును గనుడి :

**దురిత కర్మము నొల్లకుండుడు**
**పుణ్యమునే చేయుము**
**హరుని యడుగును బట్టు**
**శాంతుల సాంగత్యమున నుండు**
**కరుణ యుండని జీవులలోన**
**నీతి విడుదవగుము**
**ప్రోచి భారమును మోయుమని యానతిచ్చెడి**
**నిందించి మాటాడకని యరచు**
**మనస్సుకు వచ్చిన యటుల నడువ నట్లుంచిచ్చుట**
**కుందు పడనటుల నుంచు**
**కామాదుల జయించమని**
**చేతిని పట్టికొని యనుగ్రహించెడి ॥**

పై ప్రబోధము విధి నిషేధము క్రోడీకరణను గాంచగలము. శ్రీ బసవన్న వారి యీ క్రింది వచన మీ కోవకు చెందినదేయని చెప్పవచ్చును.

**కళ బేడ, కొలబేడ, హుసియ నుడియలు బేడ**
**మునియ బేడ, అన్యరిగె అసహ్యాపడబేడ**
**తన్న బణ్ణిస బేడ, ఇదిర హళియలు బేడ**
**ఇదే అంతరంగశుద్ధి; ఇదే బహిరంగ శుద్ధి**
**ఇదే నమ్మ కూడల సంగమదేవర నొలిసువ పరి.**

ఈ వచనపు తెలుగు రూపమును గనుడి :

**కల్ల వలదు, కూల్చ వలదు, పుచ్చు నుడువుట వలదు**
**కినియ వలదు, అన్యుల కసహ్యాపడవలదు**
**తన్నుతా వర్ణించవలదు, ఎదుటివాని పలుకవలదు**
**ఇదే అంతరంగశుద్ధి; ఇదే బహిరంగ శుద్ధి**
**ఇదే కూడల సంగమ దేవుల నొల్లించెడి పరి.**

బసవన్నవారు విహితా విహితములను చక్కగా క్రోడీకరించి చూపిరి.

ఈ కారణము వలన ప్రతియొక్కరు విహిత కర్మలను చేయుచును, నిషిద్ధములనాచరించకయు నుండవలెను. అప్పుడే యందరి జీవితము సుఖమయము కాగలదు. అనంతమైన దుఃఖమునుండి కాపాడబడవలెననిన యెడ శివుని యాజ్ఞను తప్పనిసరిగా పాటించవలెను. నిష్ఠాబల సంపన్నులై యిష్టలింగ పూజలను సలుపవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు మాహేశ్వర లింగస్థలములను వివరించి క్రియాగమ స్థలమునకు సంబంధించిన మౌలిక విషయముల జ్ఞానమును ప్రదానము చేసిరి.

మాహేశ్వర స్థలమున యంగస్థలి నైష్ఠిక భక్తిని సలుపును. భక్తస్థలములోని శ్రద్ధయనెడి భావన యిచ్చట నిష్ఠగా పరిణమించును. దేహమును వశములోనికి తెచ్చికొనుట భక్తస్థలి లక్ష్యము కాగా, యింద్రియములపై విజయమును సాధించుటే మాహేశ్వరస్థలిలోని నిష్ఠాభక్తి యొక్క లక్ష్యము. ఈ లక్ష్యము ద్వార మాహేశ్వరస్థలి నిర్మలమైన చిత్తము గలవాడగును.

మాహేశ్వర స్థలి తన లక్ష్యములను సాధించు ప్రయత్నమును సుగమము చేయుటకే శివుడు మాహేశ్వరస్థలముల నాశ్రయించి యుండెడి లింగస్థలములుగా ప్రభవించును. ఇట్టి స్థలనవకములోనిదే క్రియాగమ స్థలము. “ఆగమ” అనెడి పదమునకు వచ్చుట యనెడి సామాన్యార్థమొకటి గలదు. విశేష దృష్టిచేత గమనించినచో “ఆగమ” యనగా సంపాదనయని దోచును. క్రియాగమం బనగా క్రియ యొక్క సంపాదనమని భావించవచ్చును.

క్రియ యనెడి పదము సాంకేతిక పరమైనది. స్థూలముగా నీ పదము కర్మయనెడి దానికి పర్యాయ పదముగా వాడిననూ, సూక్ష్మదృష్టితో చూసిన యెడల క్రియయనగా జంగమయ్య గారికి చేసెడి పాదపూజాది సదాచరణలనవచ్చును.

భక్తాంగ స్థలమున క్రియాలింగ మెట్టి పాత్రను పోషించునో మాహేశ్వరాంగ స్థలమున క్రియాగమముయట్టి పాత్రను పోషించును. క్రియా సంపాదన ద్వారా సాధకునికి చిత్తనైర్మల్యమును చేకూర్చుటకే శివుడు క్రియాగమ స్థలముగా నవతరించునని తెలిసికొనగలరు. వాస్తవముగా గమనించిన యెడల క్రియాగమమునకై క్రియాలింగము సాధనముగా పనిచేయునని గ్రహించగలరు. క్రియాలింగము కారణము కాగా క్రియాగమము ఫలితమని తెలిసికొనవలెను.

భక్తాంగ స్థలములో భక్తికి ప్రాధాన్యత యివ్వబడును. మాహేశ్వరాంగ స్థలమున జ్ఞానము ప్రధానమైన భూమికను నిర్వహించును. అయిననూ యీ జ్ఞానము క్రియాగమముతో సమరస భావము పొందినదై యుండునని గ్రహించగలరు. క్రియాగమము లేకుండ సాధకునికి లక్ష్యసిద్ధి గలుగదని తెలిసికొనగలరు.

ఈ స్థలమున పర జంగముని యొక్క పూజయే పరమార్థ సాధనమని తెలుపబడినది. ఈ మౌలికాంశమును విస్మరించి స్థావర లింగాదుల యర్చనలే క్రియలనియును, క్రియాగమమనగా స్థావర లింగార్చనను షట్కాలములలో చేయుటయే యని భావించవలదు. స్థావర లింగార్చన వీరశైవమునకు చెందినట్టిది కాదని తెలిసికొనగలరు. ఇట్టి పూజ ప్రాకృత సాంప్రదాయమని గ్రహించవలెను. క్రియాలింగమును పట్టిన పిదప స్థావర లింగార్చనకై రెపరెపలాడినచో ప్రాప్తించెడి దేమియు నుండదని పెద్దలు చెప్పుచున్నారు.

*- శుభం భూయాత్ -*

# క్రియాగమ స్థలము

## ఆశీర్వచనము - 2 :

క్రిందటి స్థలమున క్రియను విధి విధానము ప్రకారముగా చేయవలెనని తెలిసికొంటిమి. ఆ విధిన యెవ్వరి వలన గ్రహించవలెననెడి ప్రశ్న యుదయించవచ్చును. ఇట్టి సందేహమును తొలగించుట కొరకు, శ్రీ భగవత్పాదులవారీ క్రింది యుపదేశము నిచ్చిరి.

**గురోరాదేశమాసాద్య పూజయేత్ పరమేశ్వరమ్।**
**పూజితే పరమేశానే పూజితాః సర్వదేవతాః॥** (సి.శి.16-9)

ఈ యుపదేశములోని భావార్థమేమనగా గురూపదేశమున కనుగుణముగనే యిష్టలింగమును పూజించవలెను. ఆ విధిన పూజించిన యెడల సకల దేవతలును పూజింపబడిన వారగుదురు.

వీరశైవ ధర్మమున శ్రీ గురువే యిష్టలింగమును దీక్షా సమయమున ప్రదానము చేయును. అందుచేత పూజించెడి విధి విధానమును బోధించెడి యర్హత శ్రీ గురువుకు మాత్రమే గలదు.

ఈ సందర్భమున పూజావిధానమును నిర్దేశించెడి గ్రంథములు చదివి తదనుగుణముగా పూజలు చేయవలెననెడి ఆలోచన గలవారికి తెలియజెప్పునవశ్యకత గలదు. ఈ గ్రంథములు పలు రకములుగా నుండును. గ్రంథకర్త వీరశైవేతరుడై యుండిన యెడల, అతని ధర్మమునకు చెందిన విధినే యిష్టలింగపూజకు ననువర్తనచేయు నవకాశము గలదు. అందుచేత, గురుముఖతాః పూజా విధానము గురించి గుర్తెరుగుటయే శ్రేయస్కరమని గుర్తించవలెను.

లోకమున బహుదేవతారాధన యెంతో విస్తృతముగా నాచరింపబడుచున్నది. లింగైక నిష్ఠాపరతంత్రులై కేవలము యిష్టలింగమును పూజించుటవలన పరిమిత ఫలము లభించునేమో యనెడి సందేహము తలయెత్తవచ్చును. ఇట్టివారికి జ్ఞానోదయమును కల్గించుటకే శ్రీ భగవత్పాదులవారు నీ యుపదేశము నిచ్చిన యటుల దోచుచున్నది. ఏ దేవుడు సకల దేవతలచేత పూజింపబడునో, యతనిని పూజించుట వలన సకల దేవతలను పూజించుటచేత లభించెడి ఫలితము లభించునని తెలియజెప్పబడినది. కామ్యములను ఆశించి పూజించెడివారు, వివిధ చిల్లర దేవుళ్ళ నాశ్రయించక, దేవాదిదేవుడైన శివునినే పూజించుట బహుళ హితకారియని గుర్తించగలరు.

శివపూజ నాచరించెడి వీరశైవునకు శివయోగము నాచరించెడివాడు పొందెడి ఫలము ననాయాసముగా లభించునని శ్రీ భగవత్పాదులవారు తెలియజెప్పిరి. వీరి యీ క్రింది యుపదేశమును గనుడి :

**సదాశివార్చనోపాయసామగ్రీవ్యగ్రమానసః ।**
**శివయోగరతో యోగీ ముచ్యతే నాత్రసంశయః॥** (సి.శి.16-10)

శివపూజా సామాగ్రి యొక్క సేకరణలో నిమగ్నుడయ్యెడి శివయోగి సకల విధములగు బంధములనుండి విముక్తుడై సద్గతిని పొందుననెడిది యీ యుపదేశములోని భావము.

యోగమనగా చిత్తవృత్తిని నిరోధించి మనస్సు శివునిలోన లగ్నము చేయుట ఈ విధిన చేసిన వానికి ముక్తి లభించునని తెలుపబడినది. ఇష్టలింగ పూజా సామాగ్రిని సేకరించెడి సమయము నుండియే సాధకుని మది శివునిలో నిమగ్నమగును. ఇష్టలింగ పూజా విధానములోన వామకర స్థలమున లింగము నిడికొని పూజించెడి సమయములో సాధకుడు తన మనస్సును శివునిలో లీనము చేయును. ఈ విధిన యిష్టలింగారాధనయును, నొక రకమైన యోగమని గుర్తించవలెను. ఇష్టలింగ పూజచేత ముక్తి లభించుననెడిది నిర్వివాదమైన యంశమని తెలిసికొనగలరు.

జ్ఞానము వలననే ముక్తి లభించునని తెలిపెడి "జ్ఞానాద్వే తు కైవల్యం ఋతే జ్ఞానాన్న ముక్తి" వంటి శ్రుతి వాక్యముల దృష్ట్యా, యిష్ట లింగార్చన ముక్తి కొరకెటుల దోహదము చేయుననెడి సంశయము తలయెత్తెడి యవకాశము గలదు. ఇట్టి సంశయములను రూపుమాపుటకొరకు శ్రీ భగవత్పాదుల వారి యీ యుపదేశము నెంతో దోహదము చేయును.

**అంధపంగువదన్యోఽన్య సాపేక్షే జ్ఞాన కర్మణి ।**
**ఫలోత్పత్తౌ విరక్తస్తు తస్మాత్ తద్ద్వయమాచరేత్॥** (సి.శి.16-11)

ఈ యుపదేశము యొక్క తాత్పర్యమేమనగా కుంటి-గ్రుడ్డివాళ్ళ జంటవలె కర్మ-జ్ఞానములు పరస్పరము నాధారితమై యుండుటవలన శివయోగి యీ రెంటికిని సమానమైన ప్రాధాన్యతను నొసంగవలెను. ఇష్టలింగార్చనను విస్మృతికి గురి చేయవలదనెడిది గ్రహించవలసిన విషయము.

వీరశైవ ధర్మమునందున ముక్తికొరకు జ్ఞానకర్మముల రెంటిని కారణభూతమైన యంశములుగా నంగీకరింపబడినది. "శివరహస్యము"న యీ విషయము గురించి యీ క్రింది విధముగా తెలియజెప్పబడినది.

**న క్రియా రహితం జ్ఞానం న జ్ఞాన రహితాక్రియా ।**
**అపశ్యన్నంధకో దగ్ధోఽగచ్ఛన్ పంగుశ్చ దహ్యతే॥**

క్రియా రాహిత్యము గల జ్ఞానమును, జ్ఞానరాహిత్యము గల క్రియయును నిరర్థకము లగును. చూడలేక నంధుడును, వెడలలేని పంగువును దహింపబడుదురు, అనెడిది శివరహస్యములోని శ్లోకము యొక్క తాత్పర్యము. జ్ఞానరహితమైన క్రియ గ్రుడ్డివానివంటిది. క్రియారహితమైన జ్ఞానము కుంటివాని వంటిదని చెప్పబడినది. ఈ శ్లోకము నొక కథను నేపథ్యముగా గొని చెప్పబడినది.

ఒక దట్టమైన యడవియందున నొక గ్రుడ్డివాడును, నొక కుంటివాడును నివాస మేర్పరచుకొని యుండిరి. ఒకరితోనొకరికి సంబంధము లేకుండగ నెవ్వరి పనిని వారు చేసికొనుచుండిరి. ఒక దినమున హఠాత్తుగా నా యడవికి నిప్పంటుకొనెను. అగ్ని భీకరాకారమును దాల్చి యడవిని దహించివేయుచుండెను. అడవిలోని జీవులు ప్రాణభీతితో నటు యిటు పరుగెత్తుచుండెను. కాని గ్రుడ్డివాడు చూపులేని కారణమునను, కుంటివాడు వెడలలేని కారణమున ప్రాణముల మీద ఆశలను వీడి పరితాప మనస్కులై యుండిరి. అట్టి యాపత్కాలమున వారికొక ఆలోచన తట్టెను. పరస్పరము సహకరించికొనిన యెడల నపాయమునుండి తప్పించికొనగలమనెడిది గ్రహించిరి. గ్రుడ్డివాడు కుంటివానిని తన భుజములమీద నెక్కించికొనెను. కుంటివాడు మార్గనిర్దేశకత్వ బాధ్యతను నిర్వహించెను. ఇరువురు పరస్పర సహకారము వలన సురక్షితమైన ప్రాంతమునకు దరలిపోయిరి. పరస్పరము సహకరించికొనని యెడల కాలి బూడిదగా నయ్యెడివారు.

జ్ఞానసిద్ధిని పొందినవానికి కర్మవలన గల్గెడి ప్రయోజనమెట్టిదో శ్రీభగవత్పాదులవారు వివరించిరి. కనుడి :

**జ్ఞానే సిద్ధేఽపి విదుషాం కర్మాపి వినియుజ్యతే ।**
**ఫలాభి సంధి రహితం తస్మాత్ కర్మ న సంత్యజేత్॥** (సి.శి.16-12)

కర్మ-జ్ఞానముల సంయోగము వలననే కర్మ-జ్ఞానముల ఫలము లభించగలదు. "నహ్యేక పక్షో విహగః ప్రయాతి" అనెడి సూక్తి ప్రకారము ఒకే యొక రెక్క గల్గిన పక్షి యెగురజాలదు. సుదూర ప్రాంతములకు వెడలజాలదు. ఇదే విధిన ముక్తి కొరకు కర్మ-జ్ఞానముల సంయోగము యొక్క యవశ్యకత గలదు. అందుచేత పండితుడు జ్ఞాన సిద్ధిని పొందిన వాడైనను విధిగా కర్మను చేయవలెను. ఇచ్చట కర్మయనగా యిష్టలింగ పూజయని గ్రహించవలెను.

ఈ స్థలము యొక్క ముగింపున శ్రీ భగవత్పాదుల వారు నీ క్రింది విధముగా నానతి నిచ్చిరి :

**ఆచార ఏవ సర్వేషామలంకారాయ కల్ప్యతే ।**
**ఆచార హీనః పురుషో లోకే భవతి నిందితః॥**
**జ్ఞానేనాచారయుక్తేన ప్రసీదతి మహేశ్వరః ।**
**తస్మాదాచారవాన్ జ్ఞానీ భవేదాదేహపాతనమ్॥** (సి.శి.16-13&14)

ఈ యానతిలోని భావమేమనగా నందరికిని యాచారమే నిజమైన యాభరణము. ఆచార హీనుడు లోకముచేత నిందింపబడినవాడగును. జ్ఞానాచారములు గలవానిచేత శివుడు ప్రసన్నుడగును. అందుచేత, జ్ఞాని దేహము పతనమయ్యెడి సమయము వరకును ఆచార వంతుడై యుండవలెను.

క్రియా జ్ఞానములు ననివార్యములని తెలిసికొనవలెను. అలంకారములకీ లోకమున యెంతో ప్రాముఖ్యత గలదు. తన శరీరము సుందరముగా కన్పించవలెనని, ప్రతియొక్కరు అలంకార ప్రియులగుచున్నారు. దేవతలలో కొందరు నలంకారప్రియులని నమ్మబడుచున్నది. విష్ణువిట్టివాడనియందురు. "అలంకార ప్రియో విష్ణుః" యనెడి లోకోక్తి యొకటి గలదు.

అలంకారములు సూక్ష్మదేహమును సుందరముగా తీర్చిదిద్దవచ్చునేమో, కాని సూక్ష్మశరీరమునవి యలంకరింపలేవు. శుద్ధమైన నడతయే నిజమైన యాభరణమగును. అనాచారికి ప్రాప్తమయ్యెడిది యగౌరవమే కదా! వీడెంతమేరకు తొడుపులు ధరించినను నిందితుడు కాకుండగ నుండగల్గునే?

శివునికి యాభరణములుండవు. వస్త్రములు కూడ ధరించక దిగంబరుడై తిరుగుచుండునని పౌరాణిక గాథలలో చెప్పబడినది అయినా, అతడు సుందరేశ్వరుడుగా కొలువబడుచున్నాడు. ఒక వ్యక్తికి కావలసినది మంచి గుణము. లోకహితమును కోరెడివాడెవ్వడైనను సుందరాకారుడే. అంతరంగమును సుందరముగా తీర్చిదిద్దుకొనవలెను. తన్నిమిత్తము మంచి యాచార సంపత్తిని పెంపొందించుకొనవలెను. నశ్వరములగు భూషణాదుల సంపాదనకై కాలమును వ్యయము చేయకూడదు. కాల మమూల్యమైనది. అద్దానిని యుత్తమమైన ఆచార విచారములను పెంపొందించుకొనుట కొరకు వెచ్చింపవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు జ్ఞానికైనను కర్మచేయుట యనెడిదనివార్యమని నొక్కిచెప్పిరి.

మాహేశ్వరాంగ స్థలికి లింగైక నిష్ఠా పరతంత్రత యలవడవలెను. అప్పుడే చిత్త నైర్మల్యము సిద్ధించును. వేదములోని కర్మకాండను విమర్శించెడి యుపనిషద్వాదులు యేకేశ్వరోపాసనను నిర్దేశించిరి. కాని పౌరాణికుల ప్రభావము వలన బహుదేవతారాధన ప్రబలిపోయినది. దేవుడొక్కడే యనే భావన స్థానములో దేవుళ్ళనేకులు. వారికి పూజాదుల వలన తృప్తిని చేకూర్చవలెను. లేనిచో వారి కరుణ లభించదనెడి భావాలకు ప్రచారము లభించెను. శంకరాచార్యుని పంచాయత పూజా విధానము వలనను, అతని అనుయాయులైన స్మార్తుల బహుదేవతార్చనాభిలాషవలనను లోకమున మార్పులు వచ్చెను. ఇట్టి స్థితిలో మాహేశ్వరుని లింగైక్యనిష్ఠకు ఆఘాతము గల్గెడి యవకాశము గలదు. అతని బహుదేవతారాధనాసక్తిని త్రుంచుటకై పరస్థలి చేయవలసిన జ్ఞానోపదేశ మెట్టులుండవలెననెడి సమస్యవచ్చును. సామోపాయముననే హితోపదేశమును చేయవలెననెడిది నొక్కి చెప్పు నిమిత్తము "పూజితే పరమేశాని పూజితా స్సర్వ దేవతాః" యనెడి యుపదేశము ప్రదానము చేయబడినది. "పూజయేత్ పరమేశ్వరమ్" అనెడి రేణుకోక్తిని "పూజయేత్ పరస్థలిం" యని గ్రహించవలెను. వీరశైవ పథములో లింగాచారము ప్రకారము పరమేశ్వరుని లింగరూపముననే పూజింపవలెను. మూర్త్యుపాసన నిషేధింపబడినది. అయితే లింగమనగా స్థావర లింగమా? యనెడి ప్రశ్న గలుగవచ్చును. వీరశైవ పరిభాషలో లింగమనగా చరలింగమే యని శివానుభావులు తెలుపుచున్నారు. అనుభవసారములోని యీ క్రింది పద్యము గమనార్హమైనదై యున్నది.

**సీ. ఆరయ లింగద్వయం సమాఖ్యాతమ**
**నంబడి లింగద్వయంబు వెలయు**

నిలజరం చాచరమేనచ యన జంగ
మములింగముననందు మహిత భక్తి
దీక్షమై జరప్రతీతి సువిఖ్యాతమ
నంగ వ్రతస్థుండు జంగమంబు
అట్లచరాః పార్థివాదయో యనపార్థి
వంబు నయి ప్రతిష్ఠితంబు లింగ

గీ. మట్లుగాన శివుని యపరావతారంబు
జంగమంబుగాన జంగమంబు
లింగమనగ వలయు లింగసంగత గాత్ర।
భవలతాలవిత్ర ! పరమపాత్ర ! (ప.179)

సోమనాథుడు ఆగమ ప్రమాణముల జూపి లింగమనగా జంగమంబని తెలియజెప్పెను.

పూజాఫలమును గురించి వివరించుచు, భగవత్పాదులవారు, పూజాసామాగ్రి సేకరించినవారికి ముక్తి లభించుననిరి. పూజచేసిన వానికెట్టి ఫలితముండునో వేరుగా చెప్పవలసిన పనిలేదు. చరలింగమును అర్చించుటకు వీలు పడనివారు చరలింగము నర్చించెడి వారికి పూజాసామాగ్రి సేకరణలో సహకరించుటలో నౌచిత్యము కనబడుచున్నది. అట్టి వారు ముక్తి కర్హులగుచున్నారు.

ఏ స్థాయిలో నున్నవారికైననూ క్రియాగమము తప్పనిసరిగా నుండవలెననెడి యంశమవిస్మరణీయమైనదని గ్రహించవలెను. జ్ఞానియైననూ క్రియాగమమునకై ప్రయత్నము చేయవలెననెడిది గ్రహించవలసిన విషయము.

- శుభం భూయాత్ -

## భావాగమ స్థలము

## ఆశీర్వచనము - 1 :

క్రియాగమ స్థలమున క్రియయొక్కయు, ఆచార సంపత్తి యొక్కయు ప్రాముఖ్యత గురించి తెలిసికొంటిమి. ఆ స్థలమున నుండెడివాని కెట్టి భావములు గల్గునో యనెడి దానిని యీ యాశీర్వచనమున తెలిసికొనగలము.

ఈ విషయము గురించి శ్రీ భగవత్పాదులవారు ప్రదానము చేసిన యీ యుపదేశమును గనుడి :

**భావచిహ్నాని విదుషో యాని సంతి విరాగిణః।**
**తాని భావాగమత్వేన వర్తంతే సర్వదేహినామ్॥** (సి.శి.16-15)

ఈ శ్లోకము యొక్క తాత్పర్యమేమనగా, వైరాగ్యసంపన్నుడును, జ్ఞాన సంపన్నుడును అగువానికి యెట్టి భావములు గల్గునో అట్టివే భావాగమత్వము వలన యితరులకును వర్తించును.

క్రియాగమ స్థలమున, యాచార సంపన్నుడై నిష్కామ క్రియాచరణ చేసెడి శివయోగికి మనస్సునందున గల్గెడి భావములు నందరికీ యనుసరణీయములని గ్రహించవలెను. ఈ శివయోగికి గల్గెడి భావముల గురించెడి స్థలమైనందున యీ స్థలము భావాగమ స్థలమని పిలువబడుచున్నది.

భావాగమమును గురించి, యోగజాగమములోన యీ క్రింది విధముగా తెలుపబడినది :

**శివభావాను సంధానాచ్ఛివో భావే ప్రకాశతే**

శివునితో భావానుసంధానమును చేసికొనిన యెడల సాధకుని భావములోన శివుడు ప్రత్యక్షమగును.

శివయోగి క్రియాగమము వలన యంతరంగమును శివమయము చేసికొని శివుడగును. ఇద్దానిని సమర్థించెడి ప్రమాణము బృహదారణ్యోపనిషత్తున గలదు. “యం యథోఽపాసత్ తదేవ భవతి” యనెడిదే ఆ ప్రమాణము. “ఎవ్వరు నే విధముగా నెవ్వరిని యుపాసన చేతురో వారు నదియే యగుదు” రనెడిది ప్రమాణము యొక్క తాత్పర్యము. శివుడైన వాని భావములును శివమయముగా నుండును కదా! ఈ విషయమును వివరించి చెప్పెడి భగవత్పాదులవారి యీ యుపదేశమును గనుడి :

**శివోఽహమితి భావోఽపిశివతాపత్తి కారణమ్ ।**
**న జ్ఞానమాత్రం నాచారో భావయుక్తః శివోభవేత్॥** (సి.శి.16-16)

కేవలము జ్ఞానమును, కేవల మాచారము శివత్వమును కల్గించదు. శివోహమనెడి భావనయే శివత్వమునకు కారణభూతమైయున్నది.

ఇట్టి భావయుక్తుడు శివుడగును. ఇది భగవత్పాదులవారి యుపదేశము యొక్క తాత్పర్యము.

సంసారము నిస్సారమైనదని యెరిగెడి వారందరును, శివత్వమును పొందుటకొరకు ప్రయత్నింతురు. వీరశైవధర్మము ప్రకారము శ్రీగురువుగారు దీక్షా సమయమున తత్త్వమసి (నీవే అతడు) అనెడి మహా వాక్యమును నుపదేశించును. దీని వివరణ నిచ్చును. ఈ యుపదేశమే మూలాధారముగా గొని సాధకుడు సాధనను చేస్తూ చేస్తూ చివరకు శివోహమ్మనెడి భావన పొందగల్గును.

శివయోగికిది తెలిసిన విషయమేయైనను, శ్రీ భగవత్పాదులవారు మరల చెప్పుటకు గల కారణమేమనగా, క్రియాగమముతో పాటుగా, భావాగమము కూడ ముఖ్యమైనదని తెలియజెప్పుటకే యని తెలిసికొనగలరు.

భావమనెడిది జ్ఞానము కంటెను భిన్నమైనదని చెప్పుట కొరకు శ్రీ భగవత్పాదులవారు నీ యుపదేశము నిచ్చిరి.

**జ్ఞానం వస్తు పరిచ్ఛేదో ధ్యానం తద్భావ కారణమ్ ।**
**తస్మాద్ జ్ఞాతే మహాదేవే ధ్యాన యుక్తో భవేత్ సుధీ॥** (సి.శి.16-17)

జ్ఞానము వస్తువు గురించిన వివరములను తెలియజేయును. అద్దానిని భావమున నిలుపజాలదు. తన్నిమిత్తమై ధీమంతుడు ధ్యానమును నాశ్రయించును. ధ్యానము చేతనే భావమేర్పడగలదని తెలిసికొనవలెను. ఈ విషయమును విడమరిచి చెప్పెడి దృష్టాంతమొకటి గలదు.

ఒక యమూల్యమైనదగు ఉంగరమును నొక వ్యక్తి ముందున నుంచి “ఇదుగో! ఉంగరము నీకెట్టుల కన్పట్టుచున్నదో చెప్పు”మనిన యెడల, నతడు నద్దానిని గైకొని జాగ్రత్తగా పరిశీలించును. అది వజ్రపు టుంగరమని గ్రహించి “యిది యెంతో సుందరముగా నున్నదని” తెలియజెప్పును. మనస్సున యెట్టి భావమును పొందదు. తటస్థవైఖరిని ప్రదర్శించును. ఒకవేళ, యిది నీ కొరకే కొనబడినదని చెప్పిన యెడల, యతని భావములో మార్పు కన్పట్టును. తాదాత్మ్య భావనతో నానంద భరితాంతరంగుడగును. శివుని గురించిన భావాగమము పొందినవాని స్థితియును ఇట్టిదే యని గ్రహించగలరు. శివభావాగమము వలన నొక యనిర్వచనీయమైన సంతృప్తి గల్గును.

“ఆత్మావా అరే దృష్టవ్యః శ్రోతవ్యః మంతవ్యః నిదిధ్యాసితవ్యః” అనెడి యుపనిషద్వాక్యమునందున దర్శనీషేయమునగు ఆత్మను సాక్షాత్కరించికొనవలెననిన శ్రవణ మరియు మనన నిదిధ్యాసలను చేయవలెనని చెప్పబడినది. శ్రవణమువలన ఆత్మజ్ఞానము గల్గును. అయితే కేవలము శుష్క జ్ఞానముచేత ఆనందప్రాప్తి గలుగదు. అందుచేత మననాదులు చెప్పుట జరిగినది. ఎంతవరకు నాత్మాకారపు అఖండవృత్తి యావిర్భవించదో అంతవరకు ఆత్మానందపు అనుభూతి గలుగదు. అందుచేత ఆత్మజ్ఞానము గల్గిన పిదప మనోవృత్తిని తదాకారమును లోగొనుటకై ధ్యానాదుల జేయవలెను. మననాదుల వలన శివేతర భావములు దూరమై శివభావము స్థిరపడును.

శివభావము స్థిరపడవలెననిన యెడల సాంసారిక భావనను వీడవలెను. లేనియెడల శివభావాగమము సంప్రాప్తము కాదు. ఈ విషయమును తెలిపెడి కథయొకటి కలదు.

పాండవులు వనవాసము నందున యుండిన యప్పుడు నేదో యొక కార్య నిమిత్తమున అర్జునుడు హిమాలయములకు పోయియుండెను. అతడు నిర్గమించిన పిదప మూడు నాల్గు దినముల తర్వాత "బృహదాశ్వ" యనెడి యొక మహర్షి పాండవుల కుటీరమునకు విచ్చేసెను. అప్పుడు యుధిష్ఠిరాదులు ఋషిని మర్యాద పూర్వకముగా నాహ్వానించి, యుచితమైన యాసనము మీద కూర్చుండబెట్టిరి. ఫలహారాదులను చేయించిరి. చాలాదూరము నుండి వట్టి కాళ్ళతో ప్రయాణము చేసినందున ఋషి యలసిపోయి యుండెను. ఈ విషయమును తెలిసికొనిన యుధిష్ఠిరుడు ఋషికి పాదసేవ సేయ దొడంగెను. ఇంతలోనే యుధిష్ఠిరుని అశ్రు జల బిందువులు ఋషి పాదముల మీదపడెను. "అతిథి సేవను చేసెడి వానికి నానందము గల్గవలెను కదా? ఇతడు యెందుకు దుఃఖించుచున్నాడు" అని మనస్సున విచారించుకొనిన ఋషి లేచి కూర్చుండి, యుధిష్ఠిరుని వెన్నున తన యరచేతిని పెట్టి ధైర్యమును చెప్పుచు, "ఓయీ! యుధిష్ఠిరా! నీవు జ్ఞానివి కదా! నీవేల దుఃఖించుచున్నా"వని యడిగెను. అప్పుడు పాండవాగ్రజుడు "స్వామీ! నా తమ్ముడు అర్జునుడు హిమాలయములకు కార్యార్థమై వెడలి మూడునాలుగు దినములైనది. యింకను యెందుచేత రాలేదో తెలియుటలేదు. ఏదైనా ఆపద సంభవించియుండునా? అని మనస్సు శంకించుచున్నది. అందుచేత విలపించితిని. క్షమించుడి"యని చెప్పెను.

"ఓయీ! ధర్మజా! సంసారపు స్మరణ మనుష్యునికి యెల్లప్పుడు దుఃఖము గల్గించుచుండును. దుఃఖించుట యనెడిది సంసారపు లక్షణమై యున్నది. మనస్సున సాంసారిక భావనను తెచ్చుకొనిన వానికి తప్పనిసరిగా దుఃఖము గల్గును. ఇకముందున, దుఃఖమునుండి ముక్తిని పొందవలెనినిన యెడల సాంసారిక భావనను తొలగించుకొనవలెను. నీవు సంసారమునందున యుండినను, సంసారము నీ యంతరంగములోకి ప్రవేశింపనీయకూడదు. అప్పుడే నీకు సుఖము కలుగును" అని ఋషి హితమును చెప్పెను. "తన్నిమిత్తమై యేదైన నొక యుపాయమును సెలవివ్వుడి" యని ధర్మజుడడిగెను. బృహదశ్వ ఋషి "శివుని ధ్యానమునకు మించిన యుపాయము లేదు. సదా శివధ్యానము నందున నిమగ్నుడివై యుండుమని" యుపదేశించెను.

శివధ్యానము శివత్త్వమును తెచ్చిపెట్టి అశివమైన సంసారము మనస్సునందున ప్రవేశించకుండ యుండునటుల చేయును. ఈ కారణముచేత శివజ్ఞాన సంపన్నుడైనను శివధ్యానమును చేయుచుండవలెను. శివధ్యానము నీ స్థలము భావముగా గుర్తింపబడినది. ప్రతియొక్కరు శివభావనాయుతులై యుండవలెననెడిదో శ్రీ భగవత్‌పాదులవారి ఆశయమై యున్నది. శివభావనను నేవిధముగా భావించికొనవలెననెడి సందియము గల్గవచ్చును. ఈ విషయమున శ్రీ భగవత్‌పాదులవారు యీ క్రింది విధిన నుపదేశించిరి :

**అంతర్బహిశ్చ సర్వత్ర పరిపూర్ణం మహేశ్వరం ।**
**భావయేత్ పరమానందలబ్ధయే పండితోత్తమః॥** (సి.శి.16-18)

ఈ యుపదేశము యొక్క తాత్పర్యమేమనగా పండితోత్తముడు పరమానంద సంప్రాప్తికై శివుడు లోపల, వెలుపల, అంతటా నిండియున్నాడని భావించికొనవలెను.

పరమానందము పరబ్రహ్మ యొక్క స్వరూపమైయున్నది. దానిని పొందవలెననెడి యభిలాష అందరికీ యుండును. ఐుతే జీవులు అఖండమైన ఆనందమును బడయుటకు సమర్థులైయున్నను విషయముయందున లభ్యమయ్యెడి పరిమితానందమును బడసి తృప్తిని పొందుచున్నారు. విషయపరమైన ఆనందమైనను సదా అందరికీ అందుబాటులో నుండదు. విషయము ఎవ్వరికి యనుకూలముగా నుండి ఆనందమును కలుగజేయునో అది వారికి ప్రియమైనదిగా దోచును. ఇతరులకది యప్రియముగా గన్పట్టును. అయితే శివ పరబ్రహ్మ పరమైన ఆనందము అందరికీ అన్నివేళలలో అన్ని ప్రదేశములలోన నానందము కలుగజేయును. దీనిని పొందుట కొరకు ప్రతియొక్కడు తన సంసారమునుండి వెలువడి జగత్తులో సర్వత్ర నెలకొనియున్న శివప్రమోదమనెడి శివధ్యానములో మునిగి తేలవలెను. పరశివునితో సమరస భావమును పొందినగాని యీ ఆనందము దొరకదని గ్రహించగలరు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు శివభావయుక్తుడు శివుడయ్యెడి యవకాశము గలదని తెలియజెప్పిరి. భావరాహిత్యముతో చేయబడెడి కర్మలు ఫలించవనియును, కేవలము జ్ఞానమువలననే సద్గతి లభించదనియును, జ్ఞానకర్మలకు భావమును జోడించిన గానిజీవుడు శివ జీవసామరస్యమును పొందలేడని యెరుక పరచిరి.

"భావేన గృహ్యతే శివః" యనెడి రేణుకోక్తి (సి.శి.15:38) వలన తెలియునదేమనగా నిత్యతృప్తుడై విరాజిల్లెడి శివుడు కేవల క్రియోపచారములచేత గ్రహింపబడదు. శివుడు భావముచేత గ్రహింపదగినవాడని తెలుపబడినది. భావము చిత్తవృత్తికి సంబంధించినది. భావశుద్ధిలేని వానికి చిత్త చాంచల్యమేర్పడును. మనస్సు వికలమై కల్మష పూరితమైనదగును. బుద్ధి వక్రీకరణకు గురియైపోవును. ఇట్టి స్థితిలో నుండెడి వాని వర్తన యెట్టులుండునో యనెడి దానిని శ్రీ బసవన్నవారి క్రింది వచనము వలన గ్రహించవచ్చును.

**హలవు కొంబింగె హాయలు బేడ**
**బరి కాయక్కె నీడలు బేడ**
**లోగరికెడగొట్టు భ్రమితనాగిర బేడ**
**ఆచారవెంబుదు హావసెగల్లు**
**భావతప్పిద బళిక ఏగైదడాగదు**
**అంజదిరు, అలుకదిరు, పరదైవక్కెరగదిరు**
**కూడల సంగమదేవన కైయలు ఈనువుదెన్నభార** (వచనము 620)

ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి :

**పలు కొమ్మలకు పాయుట వలదు**
**వట్టి కాయమునకు పెట్టుటవలదు**
**లౌకికులెడగొని భ్రమితుడైయుండవలదు**
**ఆచారమనెడిది పాకుడుబండ**
**భావము దప్పిన వెనక**
**ఏమిచేసినా కాదు**
**అంజకుండు, అలుకకుండు**
**పరదైవమునకెరగకుండు**
**కూడల సంగయ్యవారి చేతినవేయుట నాది భారము**

భావాగమము లేనివాని మది పలు మార్గములలో పయనించుననియును, భోగాపేక్ష పెరుగుననియును, భ్రమకు లోనగుననియును, ఆచార భ్రష్టత్వము ప్రాప్తించుననియును తెలియుచున్నది. "భావయుక్తః శివో భవేత్" "భావహీనో భవేద్ భ్రమితః" అనెడివి స్మరణీయములు. భావము గలవాడు శివుడు కాగా భావము లేనివాడు భ్రమితుడై భవమున పడుచున్నాడు.

స్వస్వరూప సందర్శనము చేసిన వాడు జ్ఞానియనియును, ఇట్టివాడు ముక్తుడనియును చెప్పెడివారు గలరు. "ప్రజ్ఞానం బ్రహ్మ" యనెడి వారు గలరు. వీరి మార్గమున చరించెడి వారు అహంకారమునకు గురియై పతనమగుదురు. అందుచేత మాహేశ్వరస్థలి కేవలాద్వైత నిరాసక్తుడుగా నుండవలెనని చెప్పబడినది. ఈ వాస్తవికత నేపథ్యములో శివధ్యానము యొక్క ప్రాముఖ్యతను గుర్తించవలెను. "శివోఽహ"మ్మనెడి శివాద్వైత భావనను నిరంతరము ధ్యానము చేయుచు క్రియాచరణ చేసెడివాడు భావశుద్ధిని పొందునని తెలిసికొనవలెను. భావశుద్ధిగల మాహేశ్వరస్థలి శివుని సంరక్షణలోనికి తీసికొనబడుననెడిది గ్రాహ్యము శ్రీ బసవన్నవారిపై వచన మీ విషయమును విస్పష్టముగా వివరించినది.

## భావాగమ స్థలము

## ఆశీర్వచనము - 2 :

భావము యొక్క అవశ్యకత గురించి తెలిసికొనియుంటిమి. భావమును క్రియతో పోల్చిచూసెడి యవశ్యకత గలదు. ఈ విషయమున శ్రీ భగవత్పాదులవారు తమ యుపదేశమున యీ క్రింది విధముగా యిచ్చిరి:

**అర్థహీనా యథా వాణీ పతిహీనా యథాసతీ ।**
**శ్రుతిహీనా యథా బుద్ధిర్భావహీనా తథా క్రియా ॥** (సి.శి.16–19)

ఈ శ్లోకము యొక్క తాత్పర్యమేమనగా అర్థములేని శబ్దము, పతిలేని సతి, శాస్త్రజ్ఞానములేని బుద్ధి యేవిధముగా నుండునో అదే విధముగా భావనారహితమైన క్రియ యుండును.

ఈ శ్లోకమున యివ్వబడిన యుదాహరణలు నాలోచనను రేకెత్తించెడివని చెప్పవచ్చును. వాగర్థముల కవినాభావ సంబంధము గలదు. కాని అర్థములేని మాటలను మాటలాడుట వ్యర్థమే. ఆ విధిన మాటలనాడెడి వారిని పిచ్చివారి క్రింద జమకట్టెడి ప్రమాదము సంభవించును. అందుచేత బుద్ధిమంతులు అర్థసహితమైన వాక్కులనే ప్రయోగింతురు. రెండవ యుదాహరణ పతిచేత త్యజింపబడిన సతి. సమాజములో నామె గౌరవమును కోల్పోయెడి యవకాశము కలదు. సతీ–పతులు కలిసి కాపురము చేసిన యెడల వారు అర్థవంతమైన జీవితము ననుభవించగలరు. భారతీయ సంస్కృతిలో శ్రుతికి యెంతో ప్రాముఖ్యత గలదు. శ్రుతి సమ్మతముగాని తర్కము నర్థహీనమైనదిగను, అప్రామాణికమైనదిగాను భావించెడి పరంపరానుగతమైన సాంప్రదాయము కొనసాగుచు వచ్చుచున్నది. అదే విధిన భావహీనమైన క్రియ యాంత్రికాచరణగా పరిణమించి యర్థరహిత చర్యగా రూపొందును. నిష్ఫలములగును. ఈ విషయమును శ్రీ బసవేశ్వరులవారు నెంతయో హృద్యముగా చిత్రించిరి. గమనించుడి:

**మాడి మాడి కెట్టరు మనవిల్లదె**
**నీడి నీడి కెట్టరు నిజవిల్లదె**
**మాడువ నీడువ నిజగుణ వుళ్ళాడె**
**కూడికొంబ నమ్మ కూడల సంగమ దేవా॥**

ఈ వచనపు తెలుగు రూపమును గనుడి :

**చేసి చేసి చెడిరి మనము లేనిదే**
**పెట్టి పెట్టి చెడిరి మనము లేనిదే**
**చేసెడి పెట్టెడి నిజగుణముండిన యెడల**
**కూడికొనును మన కూడల సంగమ దేవర**

ఈ వచనమున, శ్రీ బసవన్నవారు దేనిని చేసినను భావపూర్ణముగా చేయవలెనని ప్రతిపాదించిన యటుల కన్పట్టును. మనమేమి చేయుచున్నామనెడిది ముఖ్యము కాదు. మనమే భావముతో చేయుచున్నామనెడిదే ముఖ్యమైనది. ఎంతోమంది దానాదులను చేసియు పాపభాజనులగుచున్నారు. దీనికి గల కారణమేమనగా ఆ సమయమందున వారికి గల్గెడి దుర్భావనలే దుష్ఫలితములనిచ్చుచున్నవి. భావన మంచిగా నుండిన యెడల ముఖమునుండి వెలువడెడి భాషయు మధురముగను, ప్రియకరముగాను నుండును. కొందరు అప్రియమైన అశ్లీలరూపమునగల భాషను ప్రయోగించుటను గాంచగలము. దానికి గల కారణము వారిలో నెలకొని యున్న దుర్భావనల సంచయమే. తనయింటి ముందుకు వచ్చిన భిక్షుకులను నవమానించుచు, పలు విధములగు దుర్భాషలనాడుచు, దుడుకుగా ప్రవర్తించుచు నుండెడివారి చేయబడెడి దానము వలన పుణ్యము రాదు. పాపము సంప్రాప్తమగును. అందుచేత "దానం ప్రియా వాక్ సహిత"మ్మని శాస్త్రకారులు నుపదేశించిరి. ప్రియమైన భాషను ప్రయోగించుచు చేసెడి దానము ప్రియకరమగు ఫలముల నివ్వగలదు. తన్నిమిత్తమై ప్రియభరితమైన భావన కావలెనని గ్రహించగలరు.

భావరాహిత్యము వలన పరశివబ్రహ్మను దర్శింపజాలమని తెలిపెడి శ్రీ భగవత్పాదులవారి యుపదేశమును గనుడి :

**చక్షుర్హీనో యథా రూపం న కించిద్వీక్షితుం క్షమః ।**
**భావహీనస్తథా యోగీ న శివం ద్రష్టుమీశ్వరః॥** (సి.శి.16–20)

కళ్ళులేని వాడే విధిన రూపమును చూచుట కసమర్థుడో, అదే విధిన భావహీనుడైన యోగి శివుని గాంచుటకు సమర్థత గలిగి యుండడు, అనెడిదే యీ శ్లోకములోని సారాంశము.

శ్రీభగవత్పాదుల వారునుపయోగించిన యుపమానము బహు సుందరముగా నున్నది. గుడ్డివాడు తాను స్వతంత్రముగా చూడజాలడు. వేరొకరి చేతిని పట్టికొని వారిని వెంబడించును. భావహీనుడైన శివయోగియు నస్వతంత్రుడై శివుని సాక్షాత్కరించికొనుట కసమర్థుడగును. "భావనా విహితం కర్మపాపానామపి పావన"మ్మని చెప్పబడినది. అందుచేత, భావాగమమునకై ప్రయత్నించుట యెంతో నవసరమని గ్రహించవలెను.

పూజా విషయమున భావమెట్టులుండవలెనో యనెడి దానిని శ్రీ భగవత్పాదులవారు నీ క్రింది విధముగా నుపదేశించిరి.

**భావశుద్ధేన మనసా, పూజయేత్ పరమేష్ఠినమ్ ।**
**భావహీనాం న గృహ్ణాతి పూజాం సుమహతీమపి॥** (సి.శి.16-21)

భావశుద్ధితో నుండెడి మనస్సుచేత పరమేశ్వరుని పూజింపవలెను. భావహీనమైన పూజ యెంత గొప్పదైననూ దానిని పరమేశ్వరుడు గ్రహించడనెడిది యీ యుపదేశములోని సారాంశము.

సామాన్యముగా శివపూజను చేయవలెననిన శుచిర్భూతుడై శివుని పూజించవలెననెడి సామాన్య నియమమొకటి గలదు. మంగళస్నానమును చేసి శుచియైన వస్త్రములను ధరించికొని శుద్ధమగుట బహిరంగశుద్ధియగును. మనస్సును పవిత్రముగా పెట్టికొనుట యంతరంగ శుద్ధియగును. శివపూజకొరకు బహిరంగశుద్ధి యెంత మేరకు నవసరమో, యంతరంగ శుద్ధియును అంతమేరకు అవసరమని గ్రహించవలెను. పరిశుద్ధమైన యంతరంగము గలవారి పూజలను శివుడు సంతోషముతో స్వీకరించును. ఈ విధిన లేని వారెంతటి మహాపూజను చేసినను, శివునకది యంగీకార యోగ్యమై యుండదు. బహిరంగ శుద్ధి, బహిరంగాడంబరములకంటెను అంతరంగ శుద్ధి యెక్కువ ఫలదాయకమేనని గుర్తించగలరు. పూజా సమయమున మనము సమర్పించెడి జల, పుష్ప, ఫల, తాంబూలాదులన్నియు శివుడు మనకిచ్చినవే. అతని పదార్థముల నతనికే సమర్పించుటలో వింతయేమున్నది? వీటి జతకు భావశుద్ధి గల మనస్సును సమర్పించిన యెడల శివుడు సంతృప్తిని పొందును. భక్తుని యనుగ్రహించును. అందుచేత, భావశుద్ధి పరమావశ్యకమైనదనియును, శివపూజ చేసెడి సందర్భమున భావశుద్ధిని సమకూర్చుకొనవలెనని గుర్తించగలరు.

భావశుద్ధి వలన ప్రాప్తమయ్యెడి ఫలితమెట్టిదో యనెడి దానిని శ్రీ భగవత్పాదులవారు భ్రమర కీట న్యాయము నుదహరిస్తూ నిరూపణ చేయుటకై యీ క్రింది విధముగా నుపదేశించిరి.

**నైరంతర్యేణ సంపన్నే భావే ధ్యాతుం శివం ప్రతి ।**
**తద్భావో జాయతే యద్వత్ క్రిమేః కీటస్య చింతనాత్ ॥** (సి.శి.16-22)

క్రిమి భ్రమరము గురించి నిరంతరము చింతన చేయుచు భ్రమరమే యగునటుల జీవుడు నిరంతరము శివుని ధ్యానించి భావ సంపన్నుడై చివరకు శివుడగును, అనెడిది యీ యుపదేశము యొక్క తాత్పర్యము.

చాలామందికి ప్రపంచపు చింతన చింతనయే సర్వస్వమై యుండును. ప్రపంచపు చింత చితాగ్నివలె చింతకుని భస్మీపటలము చేయును. అందుచేత, పరబ్రహ్మమైన శివుని చింతనను నిరంతరము భావయుక్తముగా చేయుచుండవలెను. చింతనకుండెడి ప్రభావమమోఘమైనది. కీటము యొక్క శారీరక నిర్మాణము మార్పుకు గురియై, భ్రమరమై మనుగడ సాగించెడిది చింతన వలననే కదా! శివచింతన చేసెడి శివభావ సంపన్నుడు శివుడై చిత్ప్రకాశయుతుడై చిదానందము ననుభవించునని గుర్తించగలరు.

శివుని నిష్కల బ్రహ్మరూపమును గురించి చింతించుట చాలా కష్టతరమైన కార్యము. ఇది అందరికీ సుసాధ్యము కాదు. ఈ విధిన సాధనను చేయలేనివారికి గల ప్రత్యామ్నాయ మెట్టిది? యనెడిది చింతనీయమైన ప్రశ్న. ఈ విషయమున శ్రీ భగవత్పాదులవారు యీ క్రింది విధముగా నుపదేశము నిచ్చిరి :

**నిష్కలంకం నిరాకారం పరబ్రహ్మ శివాభిదం ।**
**నిర్ధ్యాతుమసమర్థోఽపి తద్విభూతిం విభావయేత్‌॥** (సి.శి.16-23)

నిష్కలంకమైన నిరాకారమైయున్న శివుడనెడి పరబ్రహ్మను చింతన చేయుట కొరకు సమర్థత లేనియెడల యతని విభూతిని మనమున భావించికొని దాని గురించి చింతించవలెననెడిది శ్లోకము యొక్క భావార్థము.

పరశివుని విభూతి యనన్యమైనది. షడ్గుణైశ్వర్య సంపన్నుడై సర్వజ్ఞుడై, సర్వ కర్తృత్వము గల్గిన శివుని లీల లనేకములుగా నున్నవి. వీటి గురించి చింతన చేయుటవలన సిద్ధిని పొందవచ్చునని యాచార్యులవారు నానతి నిచ్చిరి. సాకార రూపమున శివుడనేకమైన లీలలను రచించి జగత్కల్యాణమునకు కారణభూతుడయ్యెనని పురాణములు తెలుపుచున్నవి. ఈ శివమహిమలను సంస్మరించుచు శివభావనను పెంపొందించికొనవలెనని గ్రహించగలరు.

భావమును గురించి యెన్నో విషయములను తెలిసికొంటిమి. భావహీనమైన బృహత్‌ క్రియలు భగ్నమగునని తెలిసికొంటిమి. వీరశైవులు భావాగమ పరిప్రాప్తికై ప్రయత్నము చేసి శివానుగ్రహమును పొందగలరు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు భావము యొక్క లక్షణములను మరియు స్వభావ సంపత్తుల గురించి వివరించిరి.

క్రియాగమ మెంత గొప్పగా నుండినను భావరాహిత్య లక్షణమద్దానికుండిన యెడల శివుడా పూజాదులను పరిగ్రహించదనియును, భావశుద్ధితో క్రియలనాచరించవలెనని తెలిసికొనగలరు. “భావశుద్ధేన మనసా పూజయేత్‌” అనెడి రేణుకాచార్యోక్తి (16 : 21) గ్రహించదగినదైయున్నది. ఈ విషయమునకు స్వానుభవము జోడించి వివరించెడి శ్రీ బసవేశ్వరులవారి ప్రబోధమును యీ వచనమున గనుడి :

**ఆసె రోష హరుషాదిగళెంబ**
**కరణేంద్రియవ ముట్టలీయదె**
**ఆచారవ శివచారవ మాడువె**
**భయభక్తి యింత తోరులె**
**మనదల్లి వంచనే యిల్లదె**
**భావశుద్ధియ పూజెయ మాడువె**
**ఎన్న ప్రాణశక్తి యింద కూడువె**
**కూడల సంగమ దేవర** (వచనము 764)

ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి :

*ఆశ రోష హరుషాదు లనెడి*
*కరణేంద్రియమును ముట్టనీయక*
*ఆచారమును శివాచారమును చేసెద*
*భయభక్తులతో చూపెద*
*మనమందు వంచన లేకుండ*
*భావశుద్ధితో పూజను చేసెద*

*నా ప్రాణశక్తితో కూడెద*
*కూడల సంగమ దేవుని.*

ఆశరోష హర్షములనెడి భావశుద్ధిని చెరచెడి యంశములు కరణేంద్రియములనెడి విషయ సుఖమునకు దారితీసి మనస్సును మలినము చేయును. భయరాహిత్యము భక్తిమార్గమునకు చెల్లదు. స్వామి భృత్య సంబంధముతో కొనసాగెడి నైష్ఠిక భక్తికి భయరాహిత్యమొక గొడ్డలిపెట్టు. అందుచేత వీటిని విడిచినగాని భావశుద్ధి గలుగదని తెలిసికొనగలరు.

భావాగమ సంపన్నుడైనట్టి శివానుభావుడు చేసెడి క్రియ యెట్టులుండునో యనెడి దానిని తెలిపెడి పాల్కురికి సోమనాథులవారి యీ క్రింది పద్యము గమనార్హమైనదైయున్నది.

**చ. హరుమది నిల్పినిల్పి యనయంబును**
**బూజలు సల్పి సల్పి శం**
**కరుమును చూచి తమకంబు దలిర్పగ నేచియేచియీ**
**శ్వరునుతుచేసి చేసి స్వవశస్థితి జ్యేష్టలబాసి పాసి త**
**త్పరవశ భావమంది చనుభక్తుడు లింగము బొందు సమ్మతిన్** (అనుభవసారము ప.169)

"స్వవశస్థితి జ్యేష్టల బాసి బాసి తత్పర భావమంది" యనెడి సోమనాథుని వాక్కులు మరువరానివి. ఇట్టి భావమునే జంగమ పూజలో కనబరచవలెనని గుర్తించగలరు.

మాహేశ్వర స్థలమున నైష్ఠిక భావమునకు ప్రాధాన్యత యుండునని గుర్తించగలరు. అందుచేత, మాహేశ్వర స్థలిలో నైష్ఠికతను పెంచుటకే శివుడు నైష్ఠిక భావాగమము రూపమున సాధకుని హృదయమున ప్రభవించుననెడిది గుర్తించవలసిన విషయము.

*- శుభం భూయాత్ -*

## జ్ఞానాగమ స్థలము

## ఆశీర్వచనము - 1 :

లింగషట్ స్థలాంతర్గతమైన మాహేశ్వర స్థలమునకు చెందిన క్రియాగమ భావాగమ స్థలము గురించి తెలిసికొంటిమి. యిప్పుడు తదుపరి స్థలమైన జ్ఞానాగమ స్థలము గురించి తెలిసికొనవలసియున్నది.

భగవంతుని యనుగ్రహమును పొందుటకై క్రియాభావ జ్ఞానములు సాధనములుగా నుపకరించును. వీటిలో భావమున కొక ప్రత్యేకత గలదు. ఇది క్రియా-జ్ఞానములకు భావమొక యనుసంధానము చేసెడి సాధనమని యెంచవలెను. అంతేకాదు భావన వలన క్రియ-జ్ఞానము స్వరూప స్వభావములు మార్పుకు గురియగును. శ్రీ భగవత్పాదులవారు జ్ఞానాగమము గురించి యీ క్రింది విధముగా నుపదేశించిరి :

**పరస్య జ్ఞాన చిహ్నాని యాని సంతి శరీరిణామ్ ।**
**తాని జ్ఞానాగమత్వేన ప్రవర్తంతే విముక్తయే ॥** (సి.శి.16-24)

భావాగమ స్థలములోని వీరశైవునికి పరమునకు సంబంధించిన జ్ఞానపరమైన చిహ్నము జీవులకు జ్ఞానాగమము వలన ముక్తినిచ్చెడివగుచున్నవనెడిదే యీ యుపదేశములోని తాత్పర్యము.

ఇట్టి జ్ఞాన లక్షణములే యీ స్థలమున చర్చింపబడినవి.

యథేహ కర్మచితో లోకః క్షీయతే ఏకమేవా ముత్ర పుణ్యచితో లోకః క్షీయతే" "జ్ఞాత్వాదేవం మృత్యు పాశాన్ ఛినత్తి" అనెడి శ్రుతి వాక్యముల ప్రకారము కర్మలచేత సంపాదింపబడినదంతయును క్షయించిపోవును. ఈ క్షయము నిహలోకములోన లేదా పరలోకమున జరుగవచ్చును.

జ్ఞానము వలన గల్గెడి లబ్ధివలన జనన-మరణ పాశబంధమును త్రెంచవచ్చును. అందుచేత జ్ఞానము చాల ముఖ్యమైన యత్నమని గ్రహించగలరు. ఈ విషయమును గూర్చి శ్రీ భగవత్‌పాదులవారు నీ క్రింది విధముగా నుపదేశము నిచ్చిరి :

**భావేన కిం ఫలం పుంసాం కర్మణా వా కిమిష్యతే ।**
**భావ కర్మసమాయుక్తం జ్ఞానమేవ విముక్తిదమ్ ॥**
**కేవలం కర్మమాత్రేణ జన్మకోటి శతైరపి।**
**నాత్మానాం జాయతే ముక్తిర్జ్ఞానం ముక్తేర్హి కారణమ్ ॥**
**జ్ఞానహీనం సదాకర్మ పుంసాం సంసారకారణమ్।**
**తదేవ జ్ఞానయోగేన సంసారవినివర్తకమ్ ॥** (సి.శి.16-25-27)

జ్ఞానహీనమైన కర్మమెల్లప్పుడు పురుషుని సంసారబంధమునకు కారణంబగును; జ్ఞానముతో కూడిన కర్మ సంసార నివృత్తికి కారణభూతమగును అని యీ శ్లోకము తెలుపుచున్నది. ఈ రెంటితో బాటుగా భావము కూడ అవసరమని గుర్తించవలెను. మూడు కూడికొని యుండిన యెడ సాధకునికి ముక్తి సులభసాధ్యమగును.

కర్మమార్గము సంసారమునుండి ముక్తిని ప్రసాదించుటకు సమర్థమైనదని శాస్త్రముల యందున చెప్పబడినది. దీనికి గల కారణమేమనగా జనన మరణములకు కర్మమే కారణమగుచున్నది. అయితే కర్మను తప్పనిసరిగా చేయవలెననెడి మరొక సూత్రము కూడ కలదు. జ్ఞాన సముపార్జన చేసికొని అకర్తృత్వ భావనతో కర్మను చేసిన యెడల కర్మబంధముగా పరిణమించదు. ఈ విషయమును దృష్టియందుంచుకొని జ్ఞానమును పొందుటకు ప్రయత్నించవలెను.

కర్మ వలన వచ్చెడి ఫలము నశ్వరమైనదని తెలుపబడినది. భగవత్పాదులవారి యీ యుపదేశమును గనుడి :

**ఫలం క్రియావతాం పుంసాం స్వర్గాద్యం నశ్వరం యతః ।**
**తస్మాత్ స్థాయి ఫలంప్రాప్త్యై జ్ఞానమేవ సమభ్యసేత్ ॥** (సి.శి.16-28)

కేవలము కర్మవలన లభించెడి స్వర్గాది ఫలములు నశాశ్వతమైన వనియును, శాశ్వతమైన ఫలమును పొందుటకై యభ్యాసాదులు చేయవలెనని యీ యుపదేశము తెలుపుచున్నది.

"క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి" యనెడి గీతోక్తి చెప్పిన యటుల కర్మల వలన లభించిన పుణ్యము క్షీణించగనే మనుజులు భూలోకమున ప్రభవించుచున్నారు.

పుట్టినవాడు కర్మలను చేయక తప్పదు. కర్మలను చేయుచు, పుణ్య పాపాదుల నార్జించి మరల తత్ఫలముననుభవించుటకై స్వర్గమునకో లేదా నరకమునకో వెడలి పునః భూలోకమునకు వచ్చును. ఈ జనన-మరణ ప్రక్రియ నిరంతరముగా కొనసాగుచునే యుండును. అయినను జీవికి కర్మఫలము గురించి నిరాసక్తత గల్గుటలేదు. సుఖమయ జీవనప్రాప్తికై కామ్యకర్మలను చేయు వారెందరో గలరు. వీరు చేసెడి కర్మ పశుకర్మయని చెప్పబడినది. పశువులు ఆకుకూరలను తినుటకై ఆకుకూరల అంగడిలోని బుట్టలలో మూతిని పెట్టి తినుటకు యత్నించుటను మనము సర్వత్ర చూడగలము. అంగడి యజమాని దుడ్డు కర్రను గైకొని దాని వీపుమీద నాలుగు పెట్లు పెట్టగానే యది పరుగెత్తిపోవును. కొంచెము సమయము పిదప నది మరల దొంగతిండికై యత్నించును. దెబ్బలు తగిలినా ఫలితము కన్పట్టదు. కర్మియైనవాడు పశుతుల్యుడని చెప్పబడినది.

మానవుని యీ పశుప్రవృత్తికి గల కారణము నతనిలో గల భోగలాలసత్వము. ఇది యెంతమేరకు పొందినా యింకను కావలెననెడిది మానవుని వెన్నంటియే యుండును. ఈ విషయమును వివరించెడి కథయొకటి గలదు.

ఒకానొక రాజసభలో నొకానొక బాలకవి తన కవితను చెప్పి రాజుకు సంతుష్టిని గల్గించెను. రాజునతనికి బహుమానము నేమి యివ్వవలెనో యనెడిది తానే నిర్ణయించకుండగ, ఆ బాలకవికి తన బహుమానమును తానే నిర్ణయించుకొనెడి యవకాశము నివ్వదలచెను. "ఈ బాలకవిని

మన కోశాగారములో నొక గంటమేరకు వొంటరిగా నుండే యేర్పాటు చేయండి. ఆ సమయమున నతడెంత ధనము కైవసము చేసికొనునో అంతయూ అతనికిచ్చి సగౌరవంగా పంపించుడి!" యని తన మంత్రిని ఆదేశించెను. మంత్రి రాజాజ్ఞను అమలు చేసెను. బాలకవిని కోశాగారమునకు తీసికొని వెళ్ళెను. అతనిని లోపలనుండనిచ్చి తాను వెలుపలకు వచ్చి నిల్చెను.

బాలకవి ఆ ధనమును, రత్నాదులను గాంచి ఆశ్చర్యచకితుడయ్యెను. అద్దానిని గైకొని తీసికొని వెళ్ళుటకు నతనివద్ద నేదియును లేకుండెను.

అతడు మంత్రినుద్దేశించి, "నా దగ్గరనేదియును లేదు. ఇంటి దగ్గరనుండి రిక్తహస్తములతో వచ్చితిని. ధనమును గైకొని వెడలుటకొరకు నా కొక పాత్రను దయచేయు"దని విజ్ఞప్తిని చేసెను.

మంత్రిగారొక పెద్ద భాండను తెప్పించి యిచ్చెను. బాలకవి దానిలో ముత్యములను నింపెను. అంతలోనే యతని దృష్టి మాణిక్యముల మీద పడెను. ముత్యములకంటె విలువైన వగు మాణిక్యములను వదలి ముత్యములు నింపికొనుట యవివేకమని యెంచెను. భాండను రిక్తముగా చేసి దానిలో మాణిక్యములను నింపెను. అప్పుడతని దృష్టి వజ్రములపై బడెను. భాండనుండి మాణిక్యములను తీసివేసి వజ్రములను నింపదలచెను. ఈ ప్రక్రియ యీ విధిననే కొనసాగుచుండెను. ఇంతలోనే సమయమాసన్నమయ్యెను. మంత్రి వచ్చి "బాలకా! నీవు సంగ్రహించిన దేమిటో చూపు"మనెను. బాలకుడు రిక్తముగా నున్న భాండనతడు చూపెను. తన యనుభవమును నివేదించెను. మంత్రి విషయము నెరిగి రాజుకు నివేదించెను. ఇరువురును నవ్వికొనిరి. బాలకుని బుద్ధిని గరిపి, లోభబుద్ధిని మానమని యుద్బోధించిరి. అతనికి తగు బహుమానము నిచ్చి పంపించిరి.

ఈ కథ వలన తెలియునదేమనగా ప్రతివ్యక్తి జ్ఞానరత్నము కొరకు ప్రయత్నించవలెను. భౌతిక సంపద అశాశ్వతమైనదని గుర్తించవలెను. అదే విధిన క్రియాగమము కంటెను జ్ఞానాగమమే శ్రేష్ఠమైనదని గుర్తించి జ్ఞానాగమప్రాప్తికి ప్రాధాన్యత నివ్వవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు తమరి ఆశీర్వచనమున జ్ఞానము యొక్క ప్రాముఖ్యతను బహుముఖముగా వివరించిరి.

జీవుడు కర్మబద్ధుడు. కర్మ చేయకుండగ నుండజాలడు. కర్మచేసిన పిదప కర్మఫలంబు ననుభవించవలసి యుండును. జపతప యజ్ఞ హోమ వ్రతాదులన్నియును కర్మలే. పరపీడన యిత్యాదులు దుష్కర్మలనబడుచున్నవి.

కర్మవాదుల ప్రకారము కర్మాచరణ వలన సద్గతి లభించును. కేవలము కర్మ పరతంత్రత గలిగియుండుట వలన నవాంఛనీయ ఫలములుండునని శ్రీ భగవత్పాదుల వాక్కుల వలన తెలియుచున్నది. "కేవలం కర్మ మాత్రేణ జన్మ కోటి శతైరపి నాత్మానం జాయతే ముక్తిః" అనెడి భవత్పాదుల వారి వాక్కులమృత గుళికల వంటివి. శివానుభావుల వాక్కులు ఆచార్యులవారి మతముననుసరించి నటుల తెలియుచున్నది. శ్రీ పాల్కురికి సోమనాథులవారి యీ క్రింది వాక్కులను గమనించుడి :

**క. ఎరుక మది లేకయున్నను**
**నెరుకలు పెక్కైన నెరుక యెరుగకయున్నన్**
**గురి నెరు కెరుగని క్రియయై**
**యెరపుల నెరపినను భక్తియొడగూడు నొకో!**

నైష్ఠిక భక్తికి నెలవైన మహేశ్వరస్థలి యెరుకను గల్గియుండని యెడల యతడు చేసెడి భక్తిమార్గ సత్క్రియలు వ్యర్థమై పోగలవు. భక్తిస్థానములోనికి విషయానురక్తి వచ్చి చేరును. మాహేశ్వరుని వైరాగ్య నిరతిని చెరచును.

అనేకానేకమైన విషయముల నెరిగి జ్ఞానమును పొందగోరుటయును సరియైన పథము కాదని గుర్తించగలరు. "యెరుకలు పెక్కైన" మతి చెడి గతిని మరిచి గురి నెరుగని స్థితి సంప్రాప్తమగును.

భక్తి భావమును పెంపొందించికొని ధ్యానమనెడి సాధనమును గైకొని ముక్తిని పొందవచ్చుననెడి మరియొక వాదము గలదు. ఈ వాదమున జ్ఞానమునకు స్థానము లేదు. ఇదియును ఫలకారి కాదని తెలియుచున్నది. "కేవలం భావేన కిం ఫలం పుంసాం" అనెడి భగవత్‌పాదుల వాక్కులు మరువకూడదు. కేవల జ్ఞానము కూడ ముక్తికి కారణము కాజాలదు. క్రియాగమ, భావాగమ జ్ఞానాగమములను సమపాళ్ళలో పొందినట్టి మాహేశ్వర స్థలి లింగాంగ సామరస్యమును సాధించే దిశలో పయనించగలడు. ఈ విషయమును తెలుపుటకై శివుడు జ్ఞానాగమ రూపమున లింగస్థలమై విచ్చేయునని తెలిసికొనగలరు. ఇట్టి జ్ఞానాగమము పరస్థలియొక్క స్వీయజ్ఞానము రూపమున బహిర్గతమగును.

*– శుభం భూయాత్ –*

## జ్ఞానాగమ స్థలము

## ఆశీర్వచనము - 2 :

క్రిందటి యాశీర్వచనము నందున జ్ఞానాగమ స్థలమునకు చెందిన కొన్ని మౌలిక విషయములను తెలిసికొంటిమి. ఇప్పుడీ ఆశీర్వచనములోన మరికొన్ని యంశముల గురించి తెలిసికొనెదముగాక.

మనుష్యుని జీవనము నందున జ్ఞానము పరమావశ్యకమైనదై యున్నది. లౌకిక జ్ఞానము వలన జగమునందున జీవుడు సుఖమును ననుభవించును. ఆధ్యాత్మిక జ్ఞానము వలన ముక్తి సుసాధ్యమగును. ఈ రెంటికినీ దూరమైనవాడు పశువుతో సమానమైనవాడని నమ్మబడుచున్నది. "జ్ఞానేన హీనః పశుభిః సమానః" అనెడిది ఆర్యోక్తి. జ్ఞానము చేత హీనుడైయుండెడి వాడు పశువులతో సమానుడు అనెడిది యీ సూక్తి యొక్క భావార్థము. చూచుటకు శరీరము మనుజుని వంటిదై యున్నను నతడు జ్ఞాన శూన్యుడుగా నుండుటచేత యతనిని పశువుగానే పరిగణించవలెను. మన భౌతిక జీవనమునందున దైనందిన వ్యవహారమునకై లౌకిక జ్ఞానమెంత మేరకు అవసరమో, అదే విధముగా నాధ్యాత్మిక జీవనము నందున నాత్మ జ్ఞానమున కెంతయో ప్రాముఖ్యత గలదు. ఇట్టి జ్ఞానము నేవిధిన సంపాదించవలెననెడి ప్రశ్న తలయెత్తవచ్చును. దీనికి సమాధానముగా, శ్రీ భగవత్పాదుల వారు నీ క్రింది యుపదేశము నిచ్చిరి.

**శాస్త్రాభ్యాసాదియత్నేన సద్గురోరుపదేశతః ।**
**జ్ఞానమేవ సమభ్యస్యేత్ కిమన్యేన ప్రయోజనమ్ ॥** (సి.శి.16-29)

సద్గురువుల యనుగ్రహము వలన నిగమాగమములైన వీరశైవ శాస్త్రములను ప్రయత్న పూర్వకముగా నభ్యాసము చేసి జ్ఞానమును సంపాదించవలెను. ఇద్దానిని విడిచి వేరుగా నెద్దాని చేసిననూ అంతా ప్రయోజన శూన్యమగుననెడిది శ్రీ భగవత్పాదుల వారి యాశయమై యున్నది.

జ్ఞానము కేవలము కావలెను కావలెనని వాంఛించిన యెడల చిక్కెడి వస్తువు కాదు. తన్నిమిత్తమై సద్గురువులను చేరి శరణు వేడవలెను. వారి యాశీర్వచనము గైకొని శాస్త్రాభ్యాసమును చేయవలెను. శాస్త్రము లనేకములుగా నుండుటచేత వాటి తాత్పర్యమును గ్రహించవలెననిన సద్గురువు యొక్క మార్గదర్శనము కావలెను. లేని యెడల "శబ్దజాలం మహారణ్యం చిత్తభ్రమణ కారణమ్" అనెడి లోకోక్తి ప్రకారము గురువు లేకుండగ తనకుతానే శాస్త్రాభ్యాసమును చేసెడి వ్యక్తి శబ్ద జాలమనెడి మహారణ్యమున చిక్కి చిత్తభ్రమకు లోనై విఫల మనోరథుడగును. ఒక్కొక్క శాస్త్రమును నభ్యాసము చేయుటకు మనకు దొరికెడి ఆయుష్యము చాలదు. అందుచేత, నేదైనను తెలిసికొనవలెనని యెడల శ్రీ గురువుగారి మార్గదర్శకత్వము నవశ్యముగా కావలెను.

ఒకానొక శివాచార్యులవారు నొకపరి కాశీనగర వీధులలో సంచరించునప్పుడు నొక యింటి కిటికి నుండి వ్యాకరణ సూత్రము నభ్యాసము చేసెడి యొక వయోవృద్ధుని కంఠధ్వని వినవచ్చెను. అప్పుడా ఆచార్యుడా శబ్దమును బట్టి పోవుచు నొక యిల్లును గుర్తించి యందులోనికి ప్రవేశించెను. లోపల నొక తొంబది సంవత్సరముల ముదుసలి "డుకృఞ్‌కరణే" యనెడి పాణినీయ సూత్రమును కంఠస్థము చేయుచుండెను. ఆ వయోవృద్ధుని శరీరము కృశించి యుండెను. అతనిని గాంచిన శివాచార్యుడు తన మనస్సున యోచించినదేమనగా, "మృత్యువు యొక్క దౌడలో కూర్చుండిన యితడు శివ నామస్మరణ చేయవలెను కదా! వ్యాకరణమును అభ్యసించుచున్నాడిదియేమి చోద్యము. బాల్యమున చేయవలసిన

వ్యాకరణము యొక్క యధ్యయమును ఇప్పుడు చేయుటవలన గల్గెడి లాభమెట్టిది. అయినా వ్యాకరణమును చదివెడి వయస్సిది కాదు కదా!" ఈ విధముగా యోచించి, వృద్ధునికి హితోపదేశము చేయనెంచెను. "హే యజమాన! నహి నహి రక్షతి దుకృఞకరణే" అని చెప్పెను. "ఓ యింటివాడా! దుకృఞకరణే యనెడి యీ సూత్రము నిన్ను రక్షించజాలదు జాలదు" అనెడిది శివాచార్యులవారి వాక్కులోని భావము.

"శివ భజనను చేయుము. అదియే శ్రీ భద్రరక్ష. దానివలననే నీ జీవితమునకు కళ్యాణము చేకూరగలదని యుపదేశించెను.

ఈ విధముగా నెప్పుడు నేది చేయవలెననెడిది అందరికీ తెలియదు. అందుచేత యోగ్యుడైన సద్గురువు యొక్క మార్గదర్శకత్వమెంతో నవసరము. అది నిరంతరము అందుబాటులో నుండుట చాలా అవసరము. ప్రతిదినము పూజలను చేయునటులే శాస్త్రీయములైన ధర్మ గ్రంథములను స్వాధ్యాయము చేయవలెను.

స్వాధ్యాయమును చేయకుండిన యెడల నదొక ప్రమాదమునకు దారితీయవచ్చును. స్వాధ్యాయమును గురించి ఆలస్యమును చేయకూడదు. ప్రతిదినము స్వాధ్యాయమును చేయుచుండిన యెడల జ్ఞానము సులభసాధ్యమగును. స్వాధ్యాయము వలన మందబుద్ధిగల వాడు సూక్ష్మబుద్ధి గలవానిగా మారగలడు.

శాస్త్రములయందున వేదాంతము మరియు సిద్ధాంతములనెడి రెండు ముఖ్యమైన భాగములు కలవు. వేదములకు చివరన నండెడి నిర్ణయమును వేదాంతమని అందురు. శివాగమముల చివరి నిర్ణయమును సిద్ధాంతమని పిలుతురు. వీటిలోన నెవ్వరికి వేదాంతమునందున నిష్ఠగలదో వారు నద్దానిని అభ్యసించవలెను. ఎవ్వరికి సిద్ధాంతము యెడల శ్రద్ధాసక్తులుండునో వారు శివాగమములను అభ్యసించవలెను. వేదాంతమును చదివి దేనిని తెలిసికొనగలమో, దానిని సిద్ధాంతమును చదివి తెలిసికొనగలము. అయితే, రెండు నొక్కటే అయిన పరావస్తువును వేదాంతులు బ్రహ్మమని పిలుతురో, దానినే సిద్ధాంతులు లింగమని పిలుతురు. వాస్తవికముగా యీ బ్రహ్మ-లింగములనెడి రెండూ ఒకే తత్త్వము యొక్క రెండు పర్యాయ నామములని గుర్తించవలెను.

శాస్త్రాభ్యాసము నందున ప్రయత్నమును చేసిననూ, దాని వాస్తవికమైన అర్థమును తెలిసికొనుటకొరకు గురువు నాశ్రయించవలెను.

ఒక వ్యక్తి తన అభ్యాసము వలన తెలిసికొనజాలని విషయములను గురూపదేశమువలన నెంతో సహజమైన రీతిలోన దెలిసికొనగలడు. హృదగ్రంథిని, శాస్త్రగ్రంథిని విప్పెడి సామర్థ్యము సద్గురువునకుండును. అధ్యయనాసక్తి గలవాని మనస్సున వచ్చెడి సంశయములు గురువుగారి సాన్నిధ్యమున నివృత్తి కాగలవు.

సాధకుడు పొందవలసిన జ్ఞానము యొక్క స్వరూప స్వభావములగురించి శ్రీ భగవత్పాదులవారు నీ క్రింది విధముగా నుపదేశము నిచ్చిరి.

**జ్ఞానం పరశివాద్వైతపరిపాకవినిశ్చయః ।**
**యేన సంసారసంబంధవినివృత్తిర్భవేత్ సతామ్॥**
**శివాత్మకమిదం సర్వం శివాదన్యేన్న విద్యతే ।**
**శివోఽహమితి యా బుద్ధిస్తదేవ జ్ఞానముత్తమమ్ ॥**
(సి.శి.30-31)

ఈ జగత్తున పరశివబ్రహ్మ కంటెను వేరైనది మరేదియును లేదు, అనెడి నిశ్చయమునే జ్ఞానమని యందురు. ఈ జ్ఞానమునుండియే సత్పురుషులు సంసార బంధమునుండి ముక్తులగుదురు. జగమంతా శివస్వరూపమే. వేరే యితరములేదు. నేను కూడ శివుడినే అయియున్నాను. ఈ విధముగా తెలిసికొనుటయే నిజమైన జ్ఞానమని శ్రీభగవత్పాదులవారు నాదేశించిరి.

మనచిత్తమెక్కడుండునో అచ్చటే మనము వాస్తవ్యులమైయుందుము. చిత్తము బజారుమీద నిలిచి యుండిన యెడల మనము బజారులోన నుండిన యటులేయగును. అదేవిధిన, మనము ప్రపంచములో నుండిననూ చిత్తమును శివుని కడ నిలిపిన యెడల మనము శివస్వరూపులమగుదుము.

సాధకుని లక్షణము సంపూర్ణముగా శివుని కడ యుండినప్పుడతని సాంసారిక సంబంధములు గడచిపోవును. శివాద్వైత భావన యేర్పడి ముక్తి లభించును.

ఒక వ్యక్తి సంసారమునుండి యెందుకు దూరము కావలెననెడి ప్రశ్న పుట్టును. సంసారమునందాసక్తి గలవాడు వాంఛించెడి దానందమే కదా! కాని యీ సంసారములోన లభ్యమయ్యెడి ఆనందము క్షణికమైనది. అంతేకాదు, యీ క్షణికానందము వలననంతమైన దుఃఖము లభించును. ఈ స్థితికి విరుద్ధముగా శివుని కడ లభించెడి ఆనందము శాశ్వతమైనది. అఖండమైనది. ఇట్టి ఆనందమును కోరెడి వాడు ప్రయత్నపూర్వకముగా సంసారమునుండి దూరముగా వెడలి శివుని కడకు చేరుటకు యత్నించును.

ఈ ప్రపంచమున విచారణీయమైన యంశములు మూడే మూడు. అవి : జీవుడు, జగత్తు మరియు శివుడు. ఈ మూడు భిన్నముగా గోచరించిననూ, వాస్తవముగా నీ మూడూ ఒక్కటే. శివుడే జీవునిగానూ, జగత్తుగాను రూపొందును. ఈ సత్యమే నిజమైన జ్ఞానము. దీనినెరిగినవాడు ముక్తిని బడయుచున్నాడు. ఇట్టి జ్ఞానమును పొందలేని వాడు శివుని గాంచజాలడని శ్రీ భగవత్పాదులవారీ క్రింది విధముగా సెలవిచ్చిరి.

**అంధో యథా పురస్థాని వస్తూని చ న పశ్యతి ।**
**జ్ఞానహీన స్తథా దేహీ నాత్మస్థం వీక్షతే శివమ్ ॥** (సి.శి.16-32)

అంధుడేవిధముగా తన యెదుట గల వస్తువులను చూడజాలడో, అదే విధిన జ్ఞానశూన్యుడు తనలోని శివుని చూడజాలడనెడిది యీ యుపదేశములోని సారాంశము.

శివుడు, జీవుడు భిన్నులు కారు. అజ్ఞాన వశమున కొందరు భిన్నత్వమును భావించుకొనుచున్నారు. మరికొందరు శివుని వేర్వేరు రూపములలో పూజించుకొనుచు నుందురు. వీరిలో కొందరు తామభిమానించెడి రూపము యెడల దురభిమానమును పెంచికొని శాంతికి భంగమును కల్పించుకొనుచున్నారు. వీరు దేవుడొక్కడే యనియును, అతనికి జీవునికి నభేదము గలదనియును, జగత్తు కూడశివుడేయనియును తెలిసికొనినచో వారి అజ్ఞానము దూరము కాగలదు. దేవునిని వివిధ రూపములలో నర్చించవలసిన పనిలేదనియును, గురుదత్తమైన యిష్టలింగములోను, ప్రాణభావలింగములలో దేవుని దర్శించికొనవలెననెడిది గ్రహించి కొనవలసిన విషయము.

ఆత్మస్థుడై యుండెడి శివుని దర్శించికొనుటవలన గల్గెడి ప్రయోజనమెట్టిదో చాలామందికి తెలియని విషయమై యున్నది. ఈ విషయమున శ్రీ భగవత్పాదులవారి యుపదేశమీక్రింది విధముగా నున్నది.

**శివస్య దర్శనాత్ పుంసాం జన్మరోగనివర్తనమ్ ।**
**శివదర్శనమప్యాహుః సులభం జ్ఞానచక్షుషామ్ ॥** (సి.శి.16-33)

జ్ఞాన చక్షువుల వలన శివదర్శనము సాధ్యమగుననియును, అట్టి దర్శనము వలన భవరోగము నశించుననియును నీ యుపదేశము యొక్క భావార్థము.

జనన-మరణములు చాలా జటిలమైన రోగములు. ఇవి జీవునికి సృష్టియొక్క ఆరంభముననే ప్రాప్తమైనవి. వీటిని నయము చేయుట సుసాధ్యము కాదని చెప్పబడినది. జననమును వెన్నంటి మరణము, చావును వెన్నంటి పుట్టుక సంభవించుచునే యుండును. జనన-మరణ చక్రము నిలువకుండా తిరుగుచు నుండును. శ్రీరేణుక భగవత్పాదులవారు నీ విషయము గురించి యీ క్రింది విధముగా నుపదేశించిరి :

**జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్య చ ।**
**జంతుర్మరణ జన్మాభ్యాం పరిభ్రమతి చక్రవత్ ॥** (సి.శి.5-64)

పుట్టినవానికి చచ్చుట తప్పనిసరి, చచ్చినవానికి పుట్టుక తప్పనిసరి, చక్రమువలె జీవుడు జనన-మరణములలో చిక్కుకొని తిరుగుచున్నాడనెడిది యీ శ్లోకము యొక్క తాత్పర్యము. ఈ రోగములనుండి విముక్తిని పొందగోరువాడు శ్రీ గురువుకు శరణాగతుడు కావలెను. గురుకరుణ వలన శివదర్శనమగును. వెనువెంటనే భవరోగములు మాన్పబడును.

జ్ఞానహీనుని చిత్తము దీపములేని చీకటి గది వంటిదని శ్రీ రేణుకులవారు తెలియచెప్పిరి. ఈ యుపదేశమును గనుడి :

**దీపం వినా యథా గేహే నాంధకారో నివర్తతే ।**
**జ్ఞానం వినా తథా చిత్తే మోహోఽపి న నివర్తతే ॥** (సి.శి.16-34)

దీపము లేనియెడల యేవిధిన గదిలోని చీకటి దూరము కాదో, అదేవిధిన జ్ఞానము లేనియెడల చిత్తములోని చీకటి దూరము కాజాలదు, అనెడిది యీ శ్లోకములోని సారాంశము.

చీకటిని మనుష్యుడు భరించలేడు. దానిని భరించుట యనెడి దతని సహనశక్తి కతీతమైనదై యుండును. సూర్యాస్తమయమైన వెంటనే యింటిలోన దీపమును వెలిగించి వెలుతురును ప్రసరింపజేయును. విద్యుద్దీపములు వెలిగెడి నేడు అవి విద్యుత్ సరఫరా నిలువగానే ఆరిపోవును. అప్పుడు వెంటనే దీపమును వెలిగించి కొనుట సర్వసామాన్యమైన విషయము. ఒక ఆశ్చర్యకరమైన విషయమేమనగా వెలుపలి చీకటి పారద్రోలుటకై వేగిరపాటును ప్రదర్శించెడి సగటు మనిషి తనలోని లోచీకటిని పారద్రోలుటకు ప్రయత్నించడు.

మోహమనెడి చీకటి వలననేభవరోగము గల్గుచున్నది. ఇద్దాని నివృత్తి కావలయుననినచో శివాద్వైతమనెడి దీపము కావలెను. మోహమనెడి చీకటిని తొలగించుటకై వేరే మార్గాంతరము లేదు. ఎంతోకాలమునుండి కొనసాగుచు వచ్చుచున్న మోహము శివజ్ఞానముచేతనే పటాపంచలైపోవును. దీనికి గల కారణమేమనగా జ్ఞానమనెడి వెలుగు చీకటనెడి మోహముల యందు "సహ అవస్థాయి విరోధ" సంబంధముండును. అందుచేత నవి కూడికొని యుండవు. అనాదికాలము నుండి నెలకొనియున్న చీకటి జ్ఞానప్రకాశముచేత నచిరకాలములోననే యే విధిన నాశనమగుననెడి ప్రశ్న కాస్కారమేలేదు. ఈ విషయమును విడదీసి చెప్పెడి శ్రీ బసవన్నవారి యీ క్రింది వచనమును గనుడి :

**కరిఘన, అంకుశ కిరిదెన్న బహుదే? బారదయ్యా**
**గిరిఘన, వజ్ర కిరిదెన్న బహుదే? బారదయ్యా**
**తమంధ ఘన, జ్యోతి కిరిదెన్న బహుదే? బారదయ్యా**
**మరహు ఘన, నిమ్మనెనెవ మన కిరిదెన్న బహుదే?**
**బారదయ్యా, కూడల సంగమ దేవా!**

ఈ వచనము యొక్క తెలుగు రూపమిది :

**కరిఘన మంకుశము చిరుదన వచ్చునే? రాదయ్యా**
**గిరి ఘనము, వజ్రము చిరుదన వచ్చునే?రాదయ్యా**
**తమంధము ఘనము, జ్యోతి చిరుదన వచ్చునే? రాదయ్యా**
**మరపు ఘనము, మిమ్ము తలచు మనము**
**చిరుదన వచ్చునే? రాదయ్యా**
**కూడల సంగమ దేవా!**

ఈ విధముగా జ్ఞానమధికమైన ప్రాముఖ్యతగల యంశమని తెలియవచ్చినది. మీరెల్లరు జ్ఞానసముపార్జనకై కృషి చేయవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య మహాస్వాములవారు శివదర్శనము యొక్క ప్రాముఖ్యతను వివరించుచు, సాధకుడు తన జ్ఞాన చక్షువుల చేత మాత్రమే శివదర్శనమును పొందగలడని తెలియచెప్పిరి.

వస్తునిష్ఠమైన జ్ఞానమే నిజమైన జ్ఞానమనెడి వాదమొకటి కలదు. ఇది భౌతిక వాదుల నాస్తిక తత్వమునకు చెందినది. ఆస్తికులకిది యనంగీకార

యోగ్యమైనదై యున్నది. "జ్ఞానం పరశివాద్వైత పరిపాక వినిశ్చయః" యనెడి రేణుకోక్తియే వీరశైవుల కంగీకార యోగ్యమైన నిర్వచనము. ఈ నిర్వచనము నవగాహన జేసికొనుటకై శ్రీ బసవేశ్వరులవారి క్రింది వచనము దోహదకారిగా నున్నది.

**"వేద స్వయంభు వెంబ వాది కేళెలవో!**
**"ఏకో దేవో రుద్రోన ద్వితీయః"**
**ఎందు నంబువుదు కాణిరణ్ణా!**
**'ఓం ద్యావా భూమీ జనయన్ దేవ**
**"ఏక ఏవ రుద్రో న ద్వితీయః"**
**ఎందునంబువుదు కాణిరణ్ణా!**
**'చకితమభిదత్తే ఎందు శ్రుతి సారుత్తైదావె**
**జగదకర్త కూడల సంగమ దేవనొబ్బనె కాణిరణ్ణా!**
(వచనము సం. 529)

శ్రీ బసవేశ్వరులవారి వచనము యొక్క తెలుగు రూపమును గనుడి :

**"వేదము స్వయంభు" వనెడి వాద వినుమోయీ!**
**"ఏకో దేవోరుద్రో న ద్వితీయః"**
**యని నమ్మునది కానుదన్నా!**
**"ఓం ద్వావాభూమీ జనయన్ దేవ**
**ఏక ఏవ రుద్రోన ద్వితీయః"**
**యని నమ్మునది కానుదన్నా!**
**"చకితమభిదత్తే" అని శ్రుతులు చాటుచున్నవి.**
**జగమునకు కర్త కూడల సంగమ దేవుడొక్కడే కానుదన్నా!**

శ్రీ బసవన్నవారి వచనములోన నుపనిషత్తులలో ప్రతిపాదింపబడిన శివుని సర్వకర్తృత్వ లక్షణము ప్రస్ఫుటముగా గోచరించుచున్నది. ఇట్టి భావము వలన జ్ఞానాగమ సంపాదనము నకితోధికమైన స్ఫూర్తి లభించును. ఇట్టి పరిస్ఫూరిత జ్ఞానాగమంబువలన మాహేశ్వరాంగ స్థలియొక్క నైష్ఠికతకు పరిపుష్టి ప్రాప్తించును.

శివుని సర్వకర్తృత్వ లక్షణమును శివకవులెల్లరు ప్రతిపాదించి ప్రచారములోనికి తెచ్చిరి. తెలుగునాటి శివకవులకు శిరోమణి వంటి వాడైన శ్రీ పాల్కురికి సోమనాథుని యీ క్రింది పద్యము గమనార్హమైనదైయున్నది.

**శ్రుతి కల్పభూజ సంచితబీజ భావన**
**నగ్ని మీళే యననాది వెలయు**
**శ్రుతి సుధాంబుధి మధ్యగతి రత్నభాతిని**
**స్సంగతత్పురుష నంగ వెలయు**
**శ్రుతి హేమగిరి శృంగరుచినంత్యమున సర్వ**
**యన్యత్పరిత్యజ్య యనగ వెలయు**
**శ్రుతి శివక్షేత్ర సంతతశాపస్థితి**
**నెడనెడ ప్రణవమై యిట్లువెలయు**

**వేదజన్మ భూమి వేదాంత వేద్యుండు**
**వేదమయుడు వేదవినుత కీర్తి**
**దివ్యలింగమూర్తి భవ్యతేజఃస్ఫూర్తి**
**భవుడే యాది కర్త బసవలింగ!** (చతుర్వేదసారము, ప. 29)

"శివాత్మక మిదం సర్వం – శివాదన్యన్న విద్యతే" యనెడి రేణుకోక్తులు జగత్తు గురించిన జ్ఞానమును ప్రతిపాదించుచున్నవి. ఈ జ్ఞానము అద్వైతులు ప్రతిపాదించెడి జగన్మిథ్యావాదమునకు వ్యతిరేకముగా నుండెడి భావన జగత్తు సత్యమనెడిది సనాతనమైన వీరశైవ వాదమునకు ప్రతిగా శంకరాచార్యుని జగన్మిథ్యా వాదము ప్రతిపాదింపబడినదని గుర్తించగలరు. వీరశైవ తత్త్వము జగత్తును శివస్వరూపమని ప్రతిపాదించినది. ఈ భావమునకు చెందిన జ్ఞానమును పొందుటకై యీ క్రింది వచనము సహాయకారియై యుండగలదు. గమనించుడి :

**విశ్వాధికో రుద్రన హొగాళువ శ్రుతిగళు**
**విశ్వరూపాయవైనమః**
**పరమరూపనె నమో పరతత్తనేనమో**
**ఆదియారూఢభయ కరనె నమో**
**హరియను హరిసిదనే ఎందు**
**శ్రుతియు సారుత్తిరలు**
**సంహారకారణనె నమో**
**నమ్మ కూడల సంగమ దేవా,**
**మహాద్ మహాద్భ్యోనమః** (వచనము సం.535– శ్రీ బసవేశ్వర వచనములు)

ఈ వచనములోని "విశ్వరూపాయవై నమః" అనెడి బసవోక్తి గమనార్హమైనదై యున్నది.

శివ–జీవ సంబంధ జ్ఞానమే శివ జ్ఞానములోని చివరి యంశము. మాహేశ్వర స్థలములోని సాధకుడు శివోహమనెడి భావన పొందుట సులభమైన విషయము గాదు. కాని ఆచార్యోక్తి ననుసరించి యీ భావన పొందెడి వాడు ధన్యుడని చెప్పవచ్చును.

*– శివం భూయాత్ –*

## సకాయ స్థలము
## ఆశీర్వచనము - 1 :

క్రియాగమ స్థలమునను, భావాగమ స్థలమునను మరియు జ్ఞానాగమ స్థలమునను లింగ షట్ స్థలమైన మాహేశ్వర స్థలాంతర్గత విషయముల నెన్నింటినో తెలిసికొంటిమి. ఇప్పుడునదే క్రమమున సకాయ స్థలము గురించి తెలిసికొనెదము.

మనుష్యుని జన్మము సార్థకత కావలెననిన ఆత్మజ్ఞానమును పెంచికొనవలెనని శాస్త్రములు బోధించుచున్నవి. జ్ఞాన సముపార్జన చేసినవానికి కాయమవసరమా? దీనిని విసర్జించవలెనా? అనెడి ప్రశ్నలు తలయెత్తును. ఈ విషయమును గురించి శ్రీ రేణుక భగవత్పాదులు తమ యుపదేశము నీ క్రింది విధముగా నిచ్చిరి.

**పరస్య యా తనుర్జ్ఞేయాఽ దేహకర్మాభిమానినః ।**
**తయా సకాయో లోకోఽయం తదాత్మత్వనిరూపణాత్ ॥** (సి.శి.16–35)

దేహకర్మాభిమాన రహితముగా పరునిగా నుండెడి శివయోగి యొక్క యే దేహము లోకులచేత గుర్తించబడినదో దానికతడు నాత్మ యగుటచేత నా శివయోగి సకాయుడనబడు నసెడిది యీ శ్లోకములోని భావము. ఇతని కాయము సామాన్యులకు పూజ్యమై యుండును అని శ్రీ భగవత్పాదుల యభిప్రాయమై యున్నది.

దేహాభిమానము లేకుండనుండెడి శివయోగికి కాయపు టవశ్యకత గలదా? అనెడి ప్రశ్న కవకాశము గల్గును. ఈ విషయమున శ్రీ భగవత్పాదులవారు తమ యుపదేశమును నీ క్రింది విధముగ యిచ్చిరి.

**కాయం వినా సమస్తానాం న క్రియా న చ భావనా ।**
**న జ్ఞానం యత్తతో యోగీ కాయవానేవ సంచరేత్ ॥** (సి.శి.16-36)

అందరికీ కాయము కావలెను. కాయము లేనిది క్రియ, భావము, జ్ఞానములుండవు అందుచేత శివయోగి కాయసహితుడై యుండవలెను.

"శరీరమాద్యం ఖలు ధర్మసాధన"మ్మనెడి కాళిదాసోక్తి యొకటి గలదు. దేహము ధర్మమును సాధించుటకొఱకు సాధనము వంటిదని చెప్పబడినది. శరీరమును రక్షించుకొనుచు లౌకికా లౌకిక కార్యములను చేయవలెనని విజ్ఞులు తెలుపుచున్నారు. జ్ఞానప్రాప్తి పొందిన పిదప జ్ఞాన ఫలముగా లభించెడి దానిని యనుభవించి ఆనందప్రాప్తిని పొందుటకై దేహము కావలెను. లభించిన జ్ఞానము చేత యితరుల నుద్ధరించి లోకకళ్యాణమును సాధించుటకై శివయోగి కాయమును గల్గి యుండవలెను. ఈ విషయమును గురించి వ్యాసమహర్షి తమ యుపదేశము నీ క్రింది విధముగా నిచ్చిరి :

**ఆకాశగమనాదీని సర్వజ్ఞాన సమృద్ధయే ।**
**భావంత్యేవ స కాయస్య శివసంసక్త చేతసః ॥** (స్కంద పురాణము)

ఆకాశ గమనాదులను సాధించుట కొరకును, సర్వజ్ఞత్వమును పొందుటకును జీవునికి వలెనే యోగికిని కాయము కావలసియుండుననెడిది యీ శ్లోకము యొక్క తాత్పర్యము. లింగపూజాది సత్క్రియలనాచరించుట కొరకును, ధ్యాన-ధారణాదులు చేయుటకును, శివజ్ఞానమును పొంది శివజ్ఞానములోన నోలలాడుటకును శివయోగికి కాయమెంతో నవసరమని గుర్తించవలెను.

భోగమోక్షాదుల బొందగోరెడి వానికి నవశ్యముగా కాయము కావలెననెడి శ్రీ భగవత్పాదుల వారి యీ క్రింది యుపదేశమును గనుడి :

**శివైక జ్ఞానయుక్తస్య యోగినోఽపి మహాత్మనః ।**
**కాయ యోగేన సిద్ధ్యంతి భోగమోక్షాదయః సదా ॥** (సి.శి.16-37)

శివాద్వైత జ్ఞానయుక్తుడు, శివయోగియు, అగు మహాత్మునికి కాయము లభించుట వలననే భోగమోక్షములు సుసాధ్యములై సిద్ధించును, అనెడిదీ శ్లోకములోని తాత్పర్యము.

శాస్త్రమునందున స్థూల శరీరమును భోగాయతనవని పిలుతురు. అనగా, సుఖదుఃఖముల ననుభవించుటను దేహము నొకమాధ్యమమైయున్నది. ఇది లేనిది సుఖదుఃఖాదుల యనుభవమును పొందలేము. ఇదియేకాదు, శాశ్వతమైన జీవన్ముక్తికి సంబంధించిన విలక్షణమైన ఆనందమును పొందుటకొరకు కాయము నవశ్యకమైయున్నది. జ్ఞానియైనవాడు తన ప్రారబ్ధకర్మ ననుభవించవలెననినచో కాయము లేకుండ నదెట్టుల సుసాధ్యమగును. అందుచేత, జ్ఞానికైననూ కాయము కావలెననెడిది గుర్తించవలసిన విషయము.

కాయము యొక్క యవశ్యకత గురించి చెప్పుట కొరకు శ్రీరేణుక భగవత్పాదుల వారు కొన్ని దృష్టాంతములనిచ్చిరి. కనుడి :

**కాష్ఠం వినా యథా వహ్నిర్జాయతే న ప్రకాశవాన్ ।**
**మూర్తిం వినా తథా యోగీనాత్మతత్త్వ ప్రకాశవాన్ ॥**
**మూర్త్యాత్మనైవ దేవస్య యథా పూజ్యత్వకల్పనా ।**
**తథా దేహాత్మనైవాస్య పూజ్యత్వం పరయోగినః ॥** (సి.శి.16-38,39)

కట్టెలు లేనిదగు అగ్ని ప్రకాశము గలదిగా కాజాలదు. అదే విధముగా శివయోగి యొక్క ఆత్మ ప్రకాశింపవలెననిన యెడలకాయముండవలెను. శివయోగి పూజింపబడవలెనని యెడల నతనికి దేహము కావలసియుండును. విగ్రహము లేనియెడల దేవుడు పూజింపబడడు కదా! ఇది శ్రీ భగవత్పాదులవారి యుపదేశములోని తాత్పర్యము.

అగ్నికి వ్యాపకశక్తి గలదు. కాని అది యింధనము లేనిదే ప్రజ్వలించదు. ప్రకాశవంతము కాజాలదు. అదేవిధిన నిరాకార నిర్గుణ పరబ్రహ్మను పూజించదలచిన వానికది సాధ్యముకాదు. అర్చనకొక మూర్తి కావలెను. శివయోగి తన ఆత్మను ప్రకాశింప జేసికొని లోకము చేత పూజింపబడవలెనినచో నతనికి కాయము కావలసియుండునని గ్రహించవలెను.

నిరాకారుడైన పరశివుడు జగన్నిర్మాణ కార్యక్రమమును చేపట్టుటకై సాకార రూపుడయ్యెనని శ్రీ భగవత్పాదుల వారు తమ యుపదేశమును తెలిపిరి కనుడి :

**నిష్కలో హి మహాదేవః పరిపూర్ణః సదాశివః ।**
**జగత్ సృష్ట్యాది సంసిద్ధ్యై మూర్తిమానేవ భాసతే ॥** (సి.శి.16-40)

నిష్కలుడైన, పరిపూర్ణుడైన, మహాదేవుడు సృష్ట్యాదులను సిద్ధింపజేయుటకై సదాశివ మూర్తి రూపమును దాల్చి విరాజిల్లునెడిది యీ శ్లోకము యొక్క తాత్పర్యము.

నిరాకార నిర్గుణ శివబ్రహ్మ శివంకరమగు రూపమును దాల్చిన యటులనే శివయోగి దేహము గల్గియుండవలెనని గ్రహించవలెను.

జ్ఞానసంపన్నులై యుండెడి బ్రహ్మాదులెల్లరు మూర్త్యాకారము దాల్చి వారి వారి వ్యవహారములను సల్పిరని శ్రీ భగవత్పాదులవారు నుపదేశించిరి.

**బ్రహ్మాద్యా దేవతాః సర్వామునయోఽపి ముముక్షవః ।**
**కాయవంతోహి కుర్వన్తి తపః సర్వార్థ సాధకమ్ ॥** (సి.శి.16-41)

**తపో హి మూలం సర్వాసాం సిద్ధీనాం యజ్జ్రయే ।**
**తపస్తత్కాయమూలం హి తస్మాత్కాయం న సంత్యజేత్॥** (సి.శి.16-42)

బ్రహ్మ విష్ణ్వాది దేవతలును, పురాణములలో ఖ్యాతిని గాంచిన మునులును, ముముక్షువులును సకలార్థ సిద్ధికై కాయమును దాల్చి తపస్సును చేసిరి. ముల్లోకములోననే సిద్ధిని పొందవలెనినచో తపమే కావలెను. అట్టి తపస్సుకు కాయమే మూలమై యున్నది. అందుచేత కాయమును త్యజించవలదని శ్రీ భగవత్పాదుల వారు నుపదేశించిరి.

యోగశాస్త్రము నందున అణిమా, మహిమా, లఘిమా, గరిమా, ప్రాప్తి, ప్రాకామ్య, ఈశత్వ, వశత్వములనెడివి యష్టసిద్ధులని చెప్పబడినది. వీటిలో దేనినైన సాధించదలచినవానికి తపశ్చర్య చేయవలసియుండును. అనగా యీ సిద్ధులకు తపస్సే మూలము. తపస్సుకు తనువే మూలము. అందుచేత తనువును తగురీతిలో పరిరక్షించుకొనుట మనందరి కర్తవ్యమైయున్నది. ఆరోగ్య సూత్రములను పాటించవలెను. దేహము, ఆత్మకంటెను భిన్నమైనదే. కాని ఆత్మ జ్ఞానప్రాప్తికై దేహమెంతో మేరకు నవశ్యకమైయున్నది. ఆత్మజ్ఞానమును పొందిన వ్యక్తి, ఆ జ్ఞానము ద్వార లోక కళ్యాణము సాధించుటకై సకాయుడై యుండవలెనెడిదే యీ స్థలమున నిమిడియున్న రహస్యము. ఈ మర్మము నెరిగి కాయమును సద్వినియోగము చేసికొందురుగాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు కాయము యొక్క ప్రాముఖ్యత గురించి తెలియజెప్పిరి.

మాహేశ్వర స్థలములోని అంగునికి మార్గదర్శకత్వము నొసంగుటకే శివుడు సకాయస్థలియై విచ్చేయుననని తెలియుచున్నది. లింగస్థలమైన పరస్థలములోని చరలింగము క్రియాగమ, భావాగమ మరియు జ్ఞానాగమ విషయములలో సాధకుని సుసంపన్నుని చేయుటకై సకాయ స్థలిగా పరిణామమొందునని తెలుపబడినది.

కాయధారణ విషయములో కొన్ని అభిప్రాయ భేదములు పొడచూపుచున్నవి. జ్ఞానోత్తర దశలో జీవుడు కాయమును విసర్జించి యమృతత్వమును పొందవలెనని తెలిపెడి వాదమొకటి కలదు. సకాయస్థలి లోకోద్ధరణ నిమిత్తము ప్రవర్తించెడి పరమ శివయోగి యనెడిది గ్రహించవలెను. కాయము లేని స్థితిలో నతని క్రియాగమ, భావాగమ, జ్ఞానాగమమాదులు లోకమునుద్ధరించుటలో నిష్ప్రయోజకములగును. "కాయం వినా న క్రియా న భావనా న జ్ఞానం" అనెడి భగవత్పాదులవారి సందేశము గ్రహణీయము. "కాయ యోగేన సిద్ధ్యన్తి మోక్షాదయః" అనెడి ఆచార్యోక్తి గణనీయమైనది. కట్టెలు లేకుండినచో అగ్ని ప్రజ్వలించదు. అదేవిధముగా కాయ రాహిత్యము గలవాడు ఆత్మతత్త్వమును ప్రకాశింపజేయలేడు. ఆత్మ తత్త్వ ప్రకాశమానుడై మాహేశ్వర స్థలికి మార్గమును చూపెడి సకాయునికి కాయముండవలెను.

వీరశైవ వాఙ్మయమున జంగమ కాయము యొక్క విశిష్టత నెంతో గొప్పగా గొనియాడబడినది. ఈ క్రింది ద్విపదులను గమనించుడి :

**జంగమ కాయంబు సత్పరం జ్యోతి**
**జంగమ కాయంబు శాంతత రాసి**
**జంగమ కాయంబు లింగ వాహనము**
**జంగమ కాయంబు లింగంబు శయ్య**
**జంగమ కాయంబు లింగాలయంబు**
**జంగమ మూర్తియ లింగంబు మూర్తి**
**జంగమ వేషంబు లింగవేషంబు**
**పరికింప జంగమ ప్రాణప్రదంబు**
**నరయాప్రాణమట్లనుగాక**
**యాది జంగమ మూర్తియైవచ్చి గురుడు**
**గాదె లింగంబు జంగమమును నయ్యె** (పండితారాధ్య చరిత్ర, దీక్షాప్రకరణము)

జంగమ కాయంబు లింగ కాయంబు అనెడి పాల్కురికి వారి వాక్కులు గమనార్హములై యున్నవి. ''కాయమే కైలాస''మని నుడివిన శ్రీ బసవేశ్వరులవారును లింగ-జంగముల కభేదమును ప్రదర్శించెను.

యిచ్చట గమనించవలసిన విషయమేమనగా నైష్ఠిక భక్తి భావనకును, వీరమాహేశ్వర భక్తి సత్క్రియలకును, శివజ్ఞానైక సిద్ధికిని నెలవైన మాహేశ్వరాంగస్థలి క్రియాగమ, భావాగమ, జ్ఞానాగమముల పెన్నిధియైన సకాయ స్థలములోని జంగమమూర్తి ననుదినమును నర్చించి, పాదతీర్థప్రసాదములను స్వీకరించి ధన్యుడు కావలెను. ప్రాణలింగ పూజ కంటెను జంగమ పూజ శ్రేష్ఠతరమైనదని తెలిపెడి ఆగమమార్గము ననుసరించవలెను. శ్రీ బసవేశ్వర, శ్రీ పండితారాధ్య, సోమనాథాతులు చేసి చూపిన జంగమ భక్తి పథమున పయనించవలెను.

*- శుభం భూయాత్ -*

## ఆశీర్వచనము - 1 :

## అకాయ స్థలము :

క్రిందటి స్థలమున కాయము యొక్క అవశ్యకతను గురించి తెలిసికొంటిమి. సకాయ స్థలము పిదపవచ్చెడి అకాయ స్థలమును గురించి యీ ఆశీర్వచనమున తెలిసికొందుముగాక.

సకాయ స్థలములోని శివయోగి దేహాభిమానమును వీడినచో నకాయుడగునని శ్రీ భగవత్పాదులవారు తెలియజెప్పిరి. ఈ యుపదేశమును గనుడి :

**ఔపచారిక దేహిత్వాజ్జగదాత్మత్వ భావనాత్ ।**
**మాయా సంబంధరాహిత్యాద కాయో హి పరః స్మృతః ॥** (సి.శి. 16-43)

దేహము యెడల నౌపచారిక భావన గల్గియుండుట వలనను, మాయా సంబంధమును వీడి సమస్త జగత్తు స్వస్వరూపముగా భావించుట వలనను శివయోగి, అకాయుడగును అనెడిది యీ శ్లోకములోని భావార్థము.

మనము మన దేహముతో నౌపచారికమైన సంబంధమును గల్గియుండవలెను. ఔపచారిక మనగా నశాశ్వతమైన సంబంధమని యెరుగవలెను. అపరిచిత వ్యక్తులతో మనకు గల సంబంధము నౌపచారికమైనదని గ్రహింపదగును. తాదాత్మ్య భావన యౌపచారిక సంబంధమునకు విరుద్ధమైనది. రక్తసంబంధము గల వారితో మనము గల్గియుండెడి సంబంధము తాదాత్మ్య సంబంధమనీ గ్రహించగలరు. దేహముతో తాదాత్మ్య సంబంధమును పెంచికొనెడివాడు బంధనములను పొందును. క్రమముగా పుత్ర, పౌత్ర, గేహ, క్షేత్రాది సంబంధములు బిగిసిపోయి వ్యక్తి సంసారమనెడి వలలో చిక్కికొనును. అందుచేత దేహముతో నౌపచారిక సంబంధమును మాత్రమే గల్గియుండవలెనని తెలిసికొనగలరు.

శివయోగి జగదాత్మ భావన పెంపొందించికొని దేహాభిమానమును త్యజించును. జగమంతా శివమయమనియును, చరాచరములన్నియును నీశ్వరుని ప్రతిరూపములని భావించును. ఈ విషయమునొక పిల్లవాడి ప్రవర్తనతో నవగాహన చేసికొనవచ్చును. చక్కెరతో చేసిన రంగు రంగుల బొమ్మలను చూసి కొన్నిటియందు యభిమానము పెంచికొనును. యుక్త వయస్సు గలవానికి నన్నియూ చక్కెర బొమ్మలే. తేడా గోచరించదు. శివయోగి ప్రపంచములోని వివిధ వస్తువుల గురించి భేదభావము వహించదు.

తరువాతి యంశము మాయకు సంబంధించినదై యున్నది. మాయనుండి దూరముగా వెడలిన వానికి శరీరమునకు చెందినయే గుణములైనను తమ ప్రభావమును చూపజాలవు. ఆ విధముగా శివయోగి అకాయుడగుచున్నాడు.

మాయను జయించుట చాలా కష్టము. రావణుని వంటి వారెందరో మాయా ప్రభావానికి లోనై చ్యుతిని చుంబించిరి. మట్టిని గరచిరి. ఈ విషయమును వివరించెడి కథలెన్నో గలవు.

శివకారుణ్యమునభిలషించిన రావణ బ్రహ్మ భీకరమైన తపము నాచరించెను. శివుని యాత్మ లింగమును పొందవలెననెడి లక్ష్యమును మనమున దాల్చి యుండెను. కఠోర పరీక్షల కోర్చెను. గరళకంఠుని కరుణకు పాత్రుడయ్యెను. పార్వతీ పతి సతీసమేతముగా ప్రత్యక్షమై "వరము నిచ్చెద, కోరి కొ"మ్మనెను. మాయా ప్రభావమునకు లోనై రావణుడు తన లక్ష్యమును మరిచి శివుని మగువను కోరికొనెను. చివరకు పతనమయ్యెను.

అకాయ స్థితిని పొందిన వారిలో శివశరణులు గలరు. వీరిలోన అక్కమహాదేవి శిఖామణి వంటిది.

కౌశికుడనెడి రాజు మాయా ప్రభావమునకు లోనై పార్వతిదేవి యొక్క సాత్త్వికకళగా భావింపబడెడి అక్క మహాదేవిని ఆమె యిష్టమునకు వ్యతిరేకముగా పరిణయమాడెను. అయినా, నతనిని దరికి చేరనీయక, భక్తిమార్గ సత్క్రియల నాచరించుచు శివునితో తాదాత్మ్యభావనను సంపాదించికొనెను. నిజమెరుగని నిత్యమోహి నిజాంగనను పొందగోరెను. కాముకుని కుత్సిత చేష్టలకు కుపితురాలై అక్కమహాదేవి తన భర్తను, రాజ్య భోగములను, అంతఃపుర వాసములను వీడి, వీరవిరాగిణియై, వివస్త్రయై బయల్వెడలెను. నిర్దేహ స్థితిని పొందిన ఆ తల్లికి వస్త్రముల యావశ్యకత యుండునేని అదే స్థితిలో నామె యల్లమాదులను దర్శించి ధన్యతను బడయుట కొరకు అనుభవమంటపములోనికి ప్రవేశించెను.

ఆమె సాధించిన అకాయస్థితిని జూచిన యల్లమాది శివశరణులు నాశ్చర్య చకితులైరి. సాంసారిక సంబంధములను వీడి వచ్చినందుననే అక్కగారి కా అకాయస్థితి సుసాధ్యమైనదని గ్రహించగలరు.

ఎవరు దేహము మీది మోహమును త్యజింతురో, వారి దృష్టిలో దేహమకాయముగా నున్ననూ అదొక ప్రసాదకాయమగును. ఏదోనొక పదార్థమును సమర్పణ చేసిన యప్పుడు నయ్యది ప్రసాదమని పిలువబడును. అదే విధముగా నెవ్వరైనా తమ శరీరమును శివార్చన, శివభావన, శివజ్ఞానాదుల నిమిత్తము సమర్పణ చేయుదురో వారి శరీరము ప్రసాదకాయమగును. ప్రసాద కాయమున్నవాడును నకాయుడే యగును. ఈ విధముగా శివయోగి యకాయుడైన పిదప నతని జీవితము విలక్షణమైనదగును.

అకాయుడైన వానికి కాయముండి యుండుటచేత, తత్సంబంధమైన వికారముల ప్రభావమతని మీద యుండునా? అని ప్రశ్న తలయెత్తవచ్చును. ఈ విషయమున శ్రీ రేణుక భగవత్పాదులవారు తమ యుపదేశము నీ క్రింది విధముగా ప్రదానము చేసిరి :

**పరస్య దేహయోగేఽపి న దేహాశ్రయ విక్రియా ।**
**శివస్యేవ యతస్తస్మాదవాయోఽయం ప్రకీర్తితః ॥** (సి.శి. 16-44)

ఏ విధముగా సాకారుడగు శివునికి దేహ సంబంధమైన వికారములుండవో, అదే విధిన శివయోగి సకాయుడైయున్ననూ కాయవికారములుండవు, అనెడిది యీ శ్లోకము యొక్క తాత్పర్యము.

దేహము గల్గిన శివయోగికి నా దేహమునకు సంబంధించిన వికారములంటవని గ్రహించగలరు. అందుచేత, సాధకులు దేహాభిమానము వీడవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

స్థానము :

దినాంకము : ఆగష్టు, 1993 **జ్ఞాన మందిరము,**

**జంగమవాడి మఠము, వారణాసి**

## విశేష ప్రదీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య మహాస్వాములవారు తమరి యాశీర్వచనములోన నకాయ స్థలియొక్క మౌలిక లక్షణములను వివరించి చెప్పిరి. దేహాభిమాన రాహిత్యమే కీలకమైన యంశముగా దోచుచున్నది. దేహాభిమాన రాహిత్యమువలన సకాయస్థలి యకాయస్థలిగా గుర్తింపబడునని తెలుపబడినది.

మమత్వభావన బలీయమైనది. ఇందులో దేహాభిమానమునకు సంబంధించిన వికారముల బీజములను గాంచగలము. మాయయే యీ మమత్వభావనకు పుట్టినిల్లు. మాయవలననే జీవుడు దేహియై పంచేంద్రియములద్వారా విషయోపభోగియగును. వ్యష్ట్యహంకార మనెడిది మాయవలన గల్గిన మరొక ప్రవృత్తి సాధనము. వ్యష్ట్యహంకారము కంటెను సమిష్ఠహంకారమే నివృత్తి మార్గమును సూచించెడి యుపకరణము. "సర్వం బ్రహ్మేతి" యనెడి భావాగమమును పొందిన పరస్థలి అకాయుడుగా రూపొందుట కొరకు సమిష్ట్యహం కారభావయుక్తుడై మమత్వమును నిర్మూలించును. దేహాభిమానము సన్నగిల్లును. తన దేహమునకు తనకు గల సంబంధమొక లక్ష్యము చేత నిర్దేశింపబడినదని యెరింగినవాడై అకాయస్థలి కాయక్రియలకు లోను కాకుండా చిదానందములో నోలలాడుచు మహేశ్వరాంగస్థలికి క్రియాగమ భావాగమ జ్ఞానాగమాదుల నొసంగుచు చరించును.

జ్ఞానవహ్నిచేత కర్మబీజములు కాల్చబడిన స్థితిలో నుండెడి దశకంటెను నున్నతమైన దశలో నుండెడి అకాయుడిని మాయ కాడుకు గురిచేయజాలదు. మన్ను, పొన్ను, మగువలను చూపి సంసారము లోనికి నెట్టజాలదు. తత్ఫలితముగా కాయవికారములుగాని, కర్మేంద్రియములుగాని అకాయునిని బాధించవు. జగదాత్మ భావనను బలపరిచి యతని దేహాభిమానమును చెరచును. ఈ విధముగా నకాయుడు మిశ్రతత్త్వముల నధిగమించి శుద్ధతత్త్వములలో నొకడై పోవుచున్నాడు. ఇది మాయకందని స్థితియని గ్రహించగలరు.

*- శివం భూయాత్ -*

## అకాయ స్థలము

## ఆశీర్వచనము - 2 :

శివయోగి దైహి సంబంధమును వీడి, అకాయుడై, కాయ వికారములకు లోనుకాకుండ నుండునని క్రిందటి యాశీర్వచనమున తెలిసికొంటిమి. అతనికి దేహముతో సంబంధమే విధముగా దూరమగుననెడి సంశయమేర్పడుట సహజమే. ఇట్టి సంశయములను నివారణ చేయుటకై శ్రీ భగవత్పాదులీ క్రింది యుపదేశమునిచ్చిరి :

**పరలింగే విలీనస్య పరమానంద చిన్మయే ।**
**కుతో దేహేన సంబంధో దేహివద్భాసనం భ్రమః॥** (సి.శి.16-45)

పరమానందభరితమై చిన్మయమైయుండెడిదగు పరలింగమునందున మనస్సును విలీనము చేసిన శివయోగికి దేహముతో సంబంధమెట్టులుండును? లోకులకు కన్పట్టెడి దేహివంటి లక్షణములు వారి భ్రాంతినుండి పుట్టినవే అనెడిది యీ శ్లోకములోని తాత్పర్యము.

మనస్సుతో మన సంబంధము నెచ్చట యుండునో మనము అచ్చటనే యుండెదము. శివయోగి యొక్క మనోవృత్తి పరలింగమునందున లీనమైయుండుట చేత, నతనికి తన దేహముతో సంబంధముండదు. అందుచేత దేహియైయున్నను దేహముతో సంబంధము గల్గియుండదు. నీటిలో నుండెడి తామరాకును నొక యుదాహరణగా గైకొనవచ్చును. అది నీటితో నిరంతర సంబంధము గల్గియున్నను నీరు దానిని అంటజాలదు. అజ్ఞులు నీ విషయము నెరుగజాలక శివయోగిని దేహియని యెంచుచున్నారు.

మనస్సు యెక్కడ యుండునో మనమక్కడ యుండినామని గ్రహించవలెను. "చిత్తము శివుని మీద, మనస్సు చెప్పులమీద" యనెడి సామెత తెలియని దెవరికి? అందుచేత మనస్సున నిలకడ నిలిపెడి ప్రయత్నము చేసి, దానిని పరలింగమునందున లీనము చేయుటకు ప్రయత్నించవలెను.

ఈ విషయము యొక్క ప్రాముఖ్యత గురించి తెలియజెప్పెడి కథ యొకటి కలదు. ఒకానొక ఊరిలో నిద్దరు స్నేహితులుండిరి. దేశాటన యందాసక్తి గలవారై బయలుదేరి వివిధ ప్రదేశములను సందర్శించుచు కాశీ నగరమును చేరిరి. ఆ దినము శివరాత్రి పర్వదినమైయుండెను. ఈ రాత్రి విశ్వనాథుని ఆలయములో నభిషేకాదులు చేయుచు కాలమును గడుపుదుమని యొకడు ప్రతిపాదించెను. వేరొకని కది యయిష్టమైనదైయుండెను. ఖ్యాతిని గాంచిన కాశీ వేశ్యవాడలోనే విశిష్టమైన రీతిలో క్రీడింపనెంచెను. ఇరువురు వారి వారి యిష్టానుసారముగా కాలమును గడుపుచుండిరి. కాయము కాశీ విశ్వేశ్వరుని సన్నిధిలోనునున్నను, భక్తిని చేసెడివాని మనస్సు వారణాసిలోని వేశ్యల అందచందములగురించి చింతించుచుండెను. వేశ్యవాడలో నున్న వాడు వేదవేద్యుడను విశ్వనాథుని దర్శించలేకపోతినేయని పరితపించజొచ్చెను. మరుసటి దినమున కాశీ వీడి వెడలిపోయిరి. ఆ పిదప వారు భౌతికము చేసిన కర్మఫలితము వారి కంటలేదు. మానసికముగా చేసిన చింతన వలన వేశ్యవాటికలో కాలము గడిపినవానికి పుణ్యము లభించెను. యాంత్రికముగా భక్తిని జేసినవానికి సద్గతి లభించలేదు. మనము చేసెడి పనిలో మనస్సును లగ్నము చేయవలెననెడిదే మనము గ్రహించవలసిన విషయము.

దేహధారియైన శివయోగికి తన స్వీయదేహము వ్యధకు గురిచేయజాలదని శ్రీరేణుక భగవత్పాదులవారు సూచించిరి. ఈ క్రింది యుపదేశమును గనుడి :

**దేహాభిమానహీనస్య శివభావేస్థితాత్మనః ।**
**జగదేతచ్ఛరీరం స్యాద్దేహేనైకేన కా వ్యథా॥** (సి.శి.16-46)

దేహాభిమానహీనుడైన వాడై, శివభావాగమము గల్గినవాడైన వానికి చరాచరమైన జగత్తే తన దేహమనెడి భావము గల్గి తన దేహము వలన యెట్టి బాధ గల్గదనెడిదే యీ యుపదేశము యొక్క సారాంశము.

దేహము నేను కాను, నేను దేహమును కాను, దేహమునాది కాదనెడి భావమును మనమున దాల్చి, శివభావన యందున తల్లీనుడైన శివయోగి యొక్క మమకారములోని సంకుచిత భావము వైదొలగియది యొక విరాడ్రూపమును దాల్చును.

శాస్త్రకారులు, మమకారమునుండి విముక్తిని పొందగోరువారికి రెండు మార్గములను సూచించిరి. మమత్వ భావనను పరిపూర్ణముగా పరిత్యజించెడిది మొదటి మార్గము. సర్వమూ తానే యని మనమున దాల్చునది రెండవ మార్గము. ఎవ్వరి మమత్వము విశ్వవ్యాపితమగునో వారు నీశ్వర స్వరూపులగుదురు. శివునికీ జీవునికీ వుండెడి వ్యత్యాసమిట్టిదే. దేహ ధన సదన క్షేత్రాదులు నావియని మనమున దాల్చినవాడు జీవుడైతే, సర్వమూ దాల్చినవాడు నీశ్వరుడగును. శివయోగి యీ శివభావన గల్గినవాడై శివుడనిపించికొనునని గ్రహించగలరు.

లోకమునందున చాలామంది యింద్రియ జన్యమైన బాధలకు గురియగుచున్నారు. శివయోగి కిట్టివి యుండునా అనెడిసంశయమేర్పడవచ్చును. ఈ విషయమై శ్రీ భగవత్పాదులవారీ క్రింది విధిన యుపదేశమునిచ్చిరి.

**శివజ్ఞానైకనిష్ఠస్య నాహంకారభవభ్రమః ।**
**న చేంద్రియభవం దుఃఖంత్యక్తదేహాభిమానినః ॥** (సి.శి.16-47)

శివజ్ఞానైక నిష్ఠుడై దేహాభిమానమును త్యాగము చేసినవానికి అహంకారమువలన గల్గెడి భ్రమయు, ఇంద్రియముల వలన బాధయును గల్గవు, అనెడిదీ యుపదేశము యొక్క తాత్పర్యము.

జీవుడు నహంకార భావనతో కూడికొననివాడై యింద్రియములతో నే సమయమున వ్యవహరించునో అప్పుడే యతనికి దుఃఖోపభోగము గల్గును. ప్రతియొక్క వ్యవహారమునందున నేనే చేసితిని, నేనే చేసితిని అనెడి భావన గల్గుట సహజమే. ఈ భావననే యహంకారమని యందురు. జీవుడేమి చేసినను నతనికి పరమాత్మ ప్రేరకశక్తియై యుండును. అందుకే "తేన వినా క్షణమపి న చలతి" అని శాస్త్రకారులు ప్రతిపాదించిరి. ఇది యిట్టులుడగా మూఢులైన మానవులు తమ వెనుకకనుండెడి ప్రేరకశక్తిని మరచి మేమే చేసితిమనెడి దురభిమానమును దాల్చుచున్నారు. ఈ దురభిమానమే వారి దుఃఖమునకు కారణమగుచున్నది. అంతయు నీశ్వరుని ప్రేరణ వలన నడచుచుండగా, యిది నేనేచేసితిననెడి యభిమానమును దాల్చుట హాస్యాస్పదమే యగును. ఈ విషయమును విడమరిచి తెలిపెడి కథయొకటి కలదు.

ఒకడు, నొక బరువైన గంటను గుఱ్ఱము మీద నిడి,తాను కూడా దాని మీదనెక్కి ప్రయాణము చేయుచుండెను. కొలది దూరమేగిన పిదప వాడు నా గంటను పైకెత్తి తన తలమీద పెట్టికొనెను. చూపరులకది ఆశ్చర్యమును గొలుపసాగెను. చూచెడివారిలో నొకడు రౌతు నుద్దేశించి "తలమీద గంటనేల పెట్టికొంటి"వని అడిగెను. "గుఱ్ఱమునకు భారము తగ్గించుటకే"యని రౌతు పలికెను. వినినవారు ఫక్కుమని నవ్విరి. తాము సంసారపు భారమును మోయుచున్నామనెడివారు నీ రౌతు వంటివారే. భగవంతుడే భారమును మోయుచున్నాడెడి దానిని వారు గ్రహింపజాలరు.

దేహాభిమానమును వీడి చరించెడి శివయోగికి దేహకర్మలచేత నెట్టి విధమైన బాధవుండదని చెప్పబడినది. శ్రీ భగవత్పాదులవారి యీ క్రింది యుపదేశమును కనుడి :

**న మనుష్యోన దేహోఽహం న యక్షోనైవ రాక్షసః ।**
**శివోఽహమితి యో బుద్ధ్వాత్తస్య కిం దేహకర్మణా ॥** (సి.శి.16-48)

నేను దేహిని కాను, నేను మనుష్యుని కాను, నేను యక్షుడిని గాను, నేను రాక్షసుడినిగాను, నేను శివుడిని అనెడి బుద్ధిగలవానికి దేహకర్మలచేత గల్గెడి ప్రయోజనమెట్టిది? అని యీ శ్లోకములో ప్రశ్నించడమైనది.

దేహాత్మలగురించి విభజిత దృష్టిని పెంపొందించికొని, తాను దేహమును కాననెడి భావము గలవానికి శివోహమనెడి భావము సులభముగా స్థిరపడును. ఆత్మపరమాత్మల యెడలనీభేద దృష్టిగల వానికే యట్టి భావము గల్గును. ఈ విధముగా శ్రీభగవత్పాదులవారు కాయమును ధరించియును నకాయునిగా నుండుటెటుల? యనెడి దానిని బోధించిరి. ఈ బోధ యొక్క రహస్యార్థమును గురుముఖతః తెలిసికొని సకాయుడైన శివయోగి యకాయుడై యే విధిన నుండునో, నదే విధిన బ్రతుకుటకై చదువరులు కృషి చేయగలరు. ఈ విధిన సాధన చేసి యితోధికమైన లబ్ధిని పొందుదురు గాక!

ఓం శాంతిః శాంతిః శాంతిః

దినాంకము : 5 ఆగష్టు 1993
జ్ఞాన మందిరము, జంగమవాడి మఠము, వారణాసి

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య మహాస్వాములవారు చిత్త స్థిరీకరణ కీలకమైనదని చెప్పుచు తద్వారా దేహాభిమానమును త్యజించవచ్చునని సోదాహరణ పూర్వకముగా తెలిపిరి.

మమత్వము వైదొలగిన స్థితిలో దేహమువలన వ్యధాదులుండవని తెలుపబడినది. దేహేంద్రియముల వలననే సుఖదుఃఖములు గల్గుచున్నవి. సుఖము లుప్తమై దుఃఖము హెచ్చినస్థితిలో కామక్రోధాదులు దుఃఖమును ద్విగుణీకృతము చేయును. దేహము నాది కాదనెడి భావాగమము సంప్రాప్తించినప్పుడు దేహమునుండి వ్యథయెట్లులుండును.

అకాయస్థితి యొక్క వివరణను నుపనిషత్తులలో గాంచగలము. "అచ్ఛాయం అశరీర" మ్మనెడి శబ్దములు ప్రయోగింపబడినవి. ముక్తిని కోరెడి వాడశరీరియై యుండవలెనని తెలుపబడినది.

బసవ పురాణములోన నకాయస్థలి యొక్క లక్షణములీ క్రింది విధముగా వర్ణింపబడినవి.

**దాన ప్రతిగ్రహ హీన వర్తనుడు**
**మానావమాన సమాన కీర్తనుడు**
**సమలోష్టకాంచన సమసుఖదుఃఖ**
**సమమిత్ర శాత్రవ సద్భావనుండు**
**సప్తధాదుమదాది సర్వాంగగుణవి**
**లుప్తచిత్తుండు సంసుప్తిదూరుండు**
**కాలసంకల్ప వికల్పమహేంద్ర**
**జాల ప్రపంచ నిర్మూలనశాలి**
**పరమ శివానంద పరవశీ భూతు**
**దురుముక్త కేశయుతోత్త మాంగుండు**
**దివ్యానిమిషసుధా దృష్టి గోచరుడు**
**భవ్యుండు గాంధర్వ పండితోత్తముడు**
**అంతరయాగ నిరంతరయోగ**
**వంతుడనంత వేదాంత వేద్యుండు**
**నిశ్శరీరి శరీరి నిర్నామనామి**
**నిశ్శబ్ది శబ్ది వినిభావి భావి**

(బసవ పురాణము, ద్వి-ఆ.)

శ్రీ రేణుక భగవత్పాదులవారు నిరూపించిన అకాయస్థలి లక్షణములు బసవ పురాణములోని యంశములును నొకే విధముగా దోచుచున్నవి. ప్రభులింగ లీలలోని సిద్ధరామయ్య కథలోను, గోరక్షుని కథలోను ప్రభుదేవునియొక్క అకాయ లక్షణములు మిరింపబడినవి. ప్రభువుపైకి దండెత్తివచ్చినవారు రాళ్ళు రప్పలు, పదునైన ఆయుధములు, కత్తులు మొదలగు వాటిని ప్రయోగించినా అతనికెట్టి వ్యధ కలుగలేదని తెలుపబడినది. "శివభావే స్థితాత్మనః జగదేత చ్ఛరీరం స్యాద్ దేహేనైకేన కా వ్యథా" అనెడి ఆచార్యోక్తులు స్మరణీయములు.

*- శివం భూయాత్ -*

# పరకాయ స్థలము

## ఆశీర్వచనము - 1 :

సకాయ కాయ స్థలముల గురించి తెలిసికొనిన పిదప పరకాయ స్థలము గురించి తెలిసికొనవలసి యున్నది. లింగస్థలమైన మాహేశ్వరస్థలములోని యవాంతర స్థలముగా పరకాయ స్థలమును గుర్తించవలెను.

"పరఃకాయః యస్య సః పరకాయః" అని చెప్పబడినది. ఎవరి కాయము పరబ్రహ్మ స్వరూపముగా నున్నదో యతనిని పరకాయుడని యందురు. ఎవరు పరశివుని తన ఆత్మగా సాక్షాత్కారమును చేసికొనునో యతని కాయము కూడ శివపరబ్రహ్మరూపమే యగును. ఇతరేతరాచార్యులు పరశివబ్రహ్మ గురించి తెలుసుకొనిన వాని ఆత్మ పరశివబ్రహ్మ యగునని తెలిపిరి. వీరశైవాచార్యులు, పరశివబ్రహ్మ గురించి గుర్తెరిగిన శివయోగి ఆత్మతోపాటుగా కాయము కూడ పరశివబ్రహ్మగా పరిణమించునని ప్రతిపాదించిరి. ఇద్దాని గూర్చి శ్రీ రేణుక భగవత్పాదుల వారు నీ క్రింది విధముగా నుపదేశించిరి :

> **వశీకృతత్వాత్ప్రకృతే ర్మామాయా మార్గాతివర్తనాత్ ।**
> **పరకాయోః య మాఖ్యాతః సత్య జ్ఞాన సుఖాత్మకః ॥** (సి.శి.16-49)

ప్రకృతిని తన వశములోనికి తెచ్చికొనిన వాడును, అవిద్య నతిక్రమించి నడిచెడి వాడును, సచ్చిదానందమయుడును, అయియుండుటచేత శివయోగి పరకాయుడనిపించికొనును.

శరీరము స్వభావతః అపవిత్రమైనదని శాస్త్రకారులు చెప్పిరి. అయినా, యే శరీరము నాత్మతో నిరంతర సంబంధము గల్గియుండునో, అతని శరీరము పవిత్రముగా నుండును. ఈ కారణము వలననే శివయోగి శరీరమును పూజించెడి సదాచార సాంప్రదాయము మనదేశమున నెలకొనియున్నది. శివయోగులవారి శరీరము అపవిత్రమై యుండెడివారి కాయములను పవిత్రముగా చేయగలవు. ఇతని పాదధూళి సోకగానే మలిన సహితుడు మలిన రహితుడగును.

శివయోగి యొక్క పాదధూళి శిష్యుని మనస్సు నందలి రజోగుణమును రూపుమాపి యతనిని సాత్వికునిగా మార్చివేయును. శ్రీగురుని ధూళి పాదోదకమును నింటిలోన చల్లికొనెడి పరంపరానుగతమైన పద్ధతి యొకటి రూఢి యందున గలదు. శివయోగి యొక్క పాదధూళి యొక్క మహిమను గురించి శ్రీ భగవత్పాదుల వారు నీ క్రింది విధముగా నుపదేశించిరి.

> **పాదాగ్రరేణవో యత్ర పతంతి శివయోగినామ్ ।**
> **తదేవ సదనం పుణ్యం పావనం గృహమేధినామ్ ॥** (సి.శి.11-42)

శివయోగి యొక్క పాద రేణువులు యే శివభక్తుని యింటిలోన బడునో యతని యిల్లు పరమ పావనమైన యిల్లగును.

పాంచభౌతికమగు స్థూల శరీరము గల్గిన వాడు నకాయుడెట్లగు ననెడి సంశయము కలుగవచ్చును. ఈ విషయమును గురించి శ్రీ రేణుక భగవత్పాదుల వారు తమ యుపదేశము నీ క్రింది విధముగా నిచ్చిరి.

> **పరబ్రహ్మవపుర్యస్యప్రబోధానాందభాసురమ్ ।**
> **ప్రాకృతేన శరీరేణ కిమేతేనాస్య జాయతే ॥** (సి.శి.16-50)

జ్ఞానానంద స్వరూపమై ప్రకాశించెడి పరశివబ్రహ్మము శివయోగికి కాయమై యుండగా నతనికి ప్రాకృత శరీరముతో నేమి ప్రయోజనము? అని యీ శ్లోకమున తెలుపబడినది.

శివయోగుల పాదస్పర్శచేత మార్పుకు గురియై వేదమును చదివిన పామరుల కథలెన్నియో చెప్పబడినవి.

ఎవ్వరి భవబీజము భస్మమై పోవునో యతడు పరకాయుడుగా పిలువబడుదురని తెలిపెడి శ్రీభగవత్పాదులవారి యీ యుపదేశమును గనుడి.

**సమ్యగ్ జ్ఞానాగ్నిసందగ్ధజన్మబీజకళేవరః ।**
**శివతత్త్వావలంబీ యః పరకాయఃసః ఉచ్యతే ॥** (సి.శి.16-51)

పరిపూర్ణమైన శివజ్ఞానముచేత దగ్ధమైన జన్మబీజముగలవాడును, శివతత్త్వము నవలంభించెడి వాడును, అగు శివయోగి పరకాయుడనిపించికొను ననెడిది యీ శ్లోకము యొక్క భావార్థము.

రాగద్వేషములు జన్మకు బీజములు. వీటి వలననే జీవుడు నేలమీద పునః పునః జన్మించుచున్నాడు. ఈ కారణము వలననే శ్రీ నిజగుణ శివయోగిగారు "రాగదిం బేరిన్ను భవ బీజ వుంటే?" అని ప్రశ్నించిరి. "రాగము కంటెను వేరొక భవ బీజముండునా?" అనెడిది వీరి వాక్కుల తెలుగు రూపము.

రాగద్వేషముల కవినాభావ సంబంధముండును. ఈ రెండూ విడదీయరానివి. రాగము వెంబడి ద్వేషముండియే తీరును. ఈ రెండూ లేనివాడే శివయోగి. సామాన్యుడువీని కతీతుడు కాజాలడు. ఏదో నొక వస్తువు లేక వ్యక్తి మీద రాగమునో లేదా ద్వేషము పెంచికొనుట లోకమున నుండెడి నొక సహజమైన విషయము. రాగబంధము మరుజన్మకు కారణభూతమగును. ద్వేషమూ అట్టిదే. వివేకవంతుడే శివజ్ఞానమనెడి యగ్ని చేత యీ రెంటిని కాల్చివేయును. జన్మ రాహిత్యమును పొందును. అంతేకాదు శివతత్త్వమున కనుగుణముగా జీవనమును గడుపవలెను. ఈ విధిన జ్ఞాన క్రియాగమముల చేత సకాయుడు పరకాయుడగునని గ్రహించవలెను. వీరశైవులెల్లరు నీ మార్గమును ననుసరించి ధన్యజీవులు కావలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

దినాంకము : 6, ఆగష్టు
జ్ఞానమందిరము, జంగమవాడి మఠము, వారణాసి

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు పరకాయ స్థలి గురించిన ప్రాథమికాంశములను వివరించిరి. పరబ్రహ్మ కాయమును తన కాయముగా గల్గిన శివయోగి పరకాయ స్థలి యనబడునని తెలియజెప్పిరి.

శుద్ధతత్త్వముగా గుర్తింపబడిన శుద్ధవిద్య భేదజ్ఞానము వలన మాయమై జీవునికి "నాహం ఈశ్వరః" అనెడి భ్రమను గల్గించును. శుద్ధుడైన శివాంశజుడు పురుషుడై యశుద్ధుడగును. ప్రకృతి తత్త్వమువలన మహాదాదితత్త్వములుత్పన్నమగును. ప్రధానమని పిలువబడెడి యీ తత్త్వము త్రిగుణాత్మకమై యింద్రియ లోలత్వమును గల్గించును. ఇంద్రియములపై విజయమును సాధించవలసిన అంగ మాహేశ్వర స్థలి త్రిగుణాతీతుడై మాయను జయించి నిస్సంసారి కావలెను. ఇట్టి సాధనలో నతనికి తోడ్పడుటకై శివుడే లింగ మహేశ్వర స్థలియై పరకాయుడుగా నవతరించునని తెలిసికొనగలరు. తాత్వికస్థితి యిట్టులుండగా, వాస్తవముగా పరస్థలియే ప్రకృతిని వశపరచుకొని, మాయను జయించి సచ్చిదానంద స్వరూపుడై పరకాయుడగునని తెలియుచున్నది. పిడుపర్తి సోమనాథుని ప్రభులింగ లీలలో ప్రభుదేవులవారు మాయను జయించి ప్రకృతిని తన వశములోనికి తెచ్చికొనిన తీరుతెన్నులు వివరింపబడినవి. పరకాయుడే పరబ్రహ్మ స్వరూపమనెడిది గ్రహించవలసిన సత్యము. ఇట్టివారి దర్శనము వలన లోకములు పునీతములై సముద్ధరింపబడును. శ్రీ బసవేశ్వరుల వారిట్టి వారి దర్శనముకై తహతహలాడెడి వాడని తెలియుచున్నది. ఈ క్రింది వచనమును గమనించుడి :

**పరమతత్త్వద నిజ సంయుక్తర**
**ఆను నీనెంబ శబ్దసుఖిగళ తోరా, ఎనగె**
**మహానుభావర తోరా, ఎనగె**
**లింగైక్యర, లింగసుఖిగళ లింగగూడాగిప్పవర**
**లింగాభిమాన గళ తోరా, ఎనగె**
**అహోరాత్రి నిమ్మ శరణు సేవెయల్లిరిసు,**
**కూడల సంగమ దేవా!**

ఈ వచనపు తెలుగు రూపమిది :

**పరమతత్త్వపు నిజ సంయుక్తుల**
**నేను నీవనెడి శబ్దసుఖుల జూపుమా, నాకు**
**మహానుభావుల జూపుమా, నాకు**
**లింగైక్యుల, లింగసుఖుల లింగపు గూడైయుండువారిని**
**లింగాభిమానుల జూపుమా, నాకు**
**అహోరాత్రి మీ శరణుల సేవయందున నుంచుడి**
**కూడల సంగమ దేవా!**

నిరంతరమిట్టి వారి సేవను సలిపిన వారు ధన్యులగుదురనెడి గ్రహించవలసిన విషయము. మాహేశ్వరాంగ స్థలమున సాధన చేసెడి వారీ విషయమును గ్రహింతురు గావుత.

*- శివం భూయాత్ -*

# పరకాయ స్థలము

## ఆశీర్వచనము - 2 :

జ్ఞానాగ్నిచేత దగ్ధమైన జన్మబీజము, శివతత్త్వావలంబన చేత లభించిన విశిష్టత్వము గల్గినవాడు శివయోగియైన యెడల పరకాయుడనబడునని క్రిందటి యాశీర్వచనమున తెలిసికొంటిమి. పరకాయునికి సంబంధించిన మరికొన్ని యంశములను తెలిసికొనెదము గావుత.

పర అనెడి శబ్దమునకు శ్రేష్ఠమైన యనెడి అర్థము గలదు. పరకాయుడనగా శ్రేష్ఠమైన దేహముగల వాడనెడి యర్థము బయల్వెడలును. శ్రేష్ఠమైన శరీరమెవరికి లభ్యమగునో యతడు సకాయియైన శివయోగి యని గ్రహించగలరు. "కల్లు దేవరాదరె కాయ దేవరాగదె?" యని యొక కన్నడ కవిగారు ప్రశ్నించిరి. "రాయి దేవుడైన యెడల కాయము దేవుడు కాజాలదా?" అనెడిది యీ దివ్యమైన వాక్కు యొక్క భవ్యమైన యర్థము.

పరకాయమును ధరించిన శివయోగి యొక్క యింద్రియ వ్యాపారములన్నియును శివునిలోనే లయమగునని తెలియుచున్నది. ఈ విషయమున శ్రీ రేణుక భగవత్పాదులవారి యుపదేశమీ క్రింది విధముగా నున్నది.

**ఇంద్రియాణి మనోవృత్తివాసనాః కర్మసంభవాః ।**
**యత్ర యాంతి లయం తేన సకాయోఽయం పరాత్మనా॥** (సి.శి.16-52)

ఇంద్రియములు మనోవృత్తివలన గల్గెడి వాసనలు, కర్మల వలన గల్గెడి పర్యవసానాదులునే శివపరబ్రహ్మయందు లయమగునో, ఆ శివబ్రహ్మ శివయోగి కాయమై పరకాయుని చేయుచున్నదనెడిది యీ శ్లోకములోని భావము.

ఇంద్రియములు తమ తమ విషయముల యందున ప్రవృత్తులగుటకు మనస్సున యుండెడి వాసనలే మూల కారణములు. జీవుడేయే పదార్థములనుపభోగించునో వాటి సంస్కారములు మనస్సు నందున మిగిలియుండును. ఈ సంస్కారములు బలమువలన పునః పునః ఆయా విషయములను ననుభవించెడి యిచ్ఛ గల్గుచున్నది. ఈ యిచ్ఛ యొక్క యుత్పత్తికి కారణమైన ఆ సంస్కారమే యిచ్చట వాసనయని పిలువబడినది. ఈ వాసన ముఖముననే యింద్రియములు తమ తమ విషయములయందున పదే పదే ప్రవృత్తిని పొందుచున్నవి. పరకాయ సంపన్నుడైన శివయోగి కిది వర్తించదు. అతని ఇంద్రియాదులన్నియును పరశివునిలో లీనమై యుండుటచేత నతని శరీరము పరశివ రూపమై విరాజిల్లుచుండును.

పరకాయ సంపన్నుడైన శివయోగి సకాయుడని తలచుట సరికాదని శ్రీ రేణుక భగవత్పాదులవారు తెలియజెప్పిరి. ఈ క్రింది యుపదేశమును గనుడి.

**పరాహంతామనుప్రాప్య పశ్యేద్విశ్వం చిదాత్మకమ్ ।**
**సదేహోఽతి భ్రమస్తస్య నిశ్చితా హి శివాత్మతా ॥** (సి.శి.16-53)

పరకాయియైన శివయోగి పరా, అహంతానుబడసి మొత్తము విశ్వమును చిన్మయముగా చూచును. అందుకే యతినికి శివాత్మత్వ భావన నిశ్చితముగా గల్గును. అందుచేత నతడు దేహధారిగా నున్నాడనెడిది భ్రమవలన గల్గెడిదని గ్రహించవలెను.

అహంతాయనెడి భావన పరాహంతా అపరాహంతా యనెడి రెండు విధములుగా నుండును. వ్యష్టిసమిష్టుల వలన యీ భేదములేర్పడినవి. సమిష్టి అహంతా భావన పరాహంతా అనబడినది. తద్విరుద్ధమైనది అపరాహంతా భావన. ఇది వ్యష్టి అహంతా భావను సంబంధము గల్గియుండునని గ్రహించగలరు.

ఎవ్వరి అహంభావము కేవలము తన శరీరమును వ్యాపించికొనియుండునో యదియే వారి యపరాహంతా యనబడును. ఇది గలవాడు నజ్ఞాని యనబడును. ఎవ్వరి యహంభావన సంపూర్ణమైన విశ్వమును వ్యాపించికొని యుండునో అట్టివారు జ్ఞానులనబడుదురు. వారే విశ్వ కుటుంబీకులు. వీరి మనస్సుననెట్టి విధమైన భేదభావన యైనను మిగిలియుండదు. ఇంతటి స్థితిని బడసిన పరకాయుడగు శివయోగి యీ జగత్తున అందరికంటెను గొప్పవాడుగా దోచును. ఇతని దృష్టి శివమయమైయుండును. అందుచేత, సర్వమును చిదహంభావన చేత చూస్తూ ఆనంద తుందిలుడగును. ఇతనికి దుఃఖము యొక్క యనుభవము కలుగదు. ఎవ్వరి మనస్సు పరశివుడుండునో వారికి సదా సుఖానుభవమే కలుగును. దీనికి విరుద్ధముగా నెవ్వరి మనస్సున ప్రాపంచిక భావనలు నిండియుండునో వారికి సదా దుఃఖానుభవమే గల్గును. సంసారము దుఃఖమయమై యుండుట చేత వారికి సుఖానుభవము కలుగదు కదా!

ప్రపంచములోని సుఖములు ననేకములు. ఇవి స్వాతిశయముతో కూడికొనియుండును. ఇవి అందరికీ లభ్యముకావు. ఒకటి దొరికినచో మరొకటి యాభావముగా దోచును. ఎంతటి చక్రవర్తికైనను నేదోయొక వస్తువుకు సంబంధించిన కొరత దోచును. ఈ విషయమును వివరించెడి కథ యొకటి గలదు.

ఒక వ్యక్తి హంసతూలికా తల్పము మీద పరుండి యానందించునప్పుడు మృదువైన తల్పము యొక్క మెత్తదనమునుశరీరములోని కొంతభాగము మాత్రమే యనుభవించుచుండెను. ఆ సుఖమును దేహములోని యన్ని భాగములకు నేకకాలములోన అందించవలెననెడి సంకల్పముతో నతడు శయ్యమీద నటు యిటు పొరలుచునుండెను. ఎంతకాలము పొరలాడినా అతనికి తను ఆశించిన ఫలితము చిక్కలేదు. ఒక్కభాగము భోగముననుభవించిన యెడ మూడు భాగములు నట్టి సుఖమునకు దూరమగుచుండెను. లోకములోని సుఖముల తీరు నిట్టిదే. ఒక వ్యక్తి సంసారములోని సుఖములన్నింటి ననుభవించుటకెంత ప్రయత్నించినను సాఫల్యత సిద్ధించదు.

సంసారిక సుఖముల నాశించక పరశివ స్వరూపమును బడసిన శివయోగి పరాహంత భావన గలవాడై సర్వమూ తానే యనెడి భావన పొంది సదా ఆనందములో నుండును. నిరతిశయమైన ఆనందమును పొందెడి శివయోగికి వేరే యే సుఖము గూర్చియు నపేక్ష యుండదు. అచ్చమైన సుఖియై వెలుగొందును. ఈ విషయమును గురించి శ్రీ నిజగుణ శివయోగులవారు నీ క్రింది విధముగా నుడివిరి.

**ಸುಖವೇ! ನಿಜಸುಖವೇ!! ನೀನು ನಿಖಿಳವೆಂದೆನಿ ಸದೆ**
**ಏಕಮುವಾಗಿ ತೋರು ಎನ್ನೊಳು**

ఈ వాక్కుల తెలుగు రూపమిది :

సుఖమా! నిజమైన సుఖమా!!
నీవు నిఖిలమని యనిపించక
ఏకముఖముగా దోచుము నాలోన

శ్రీ నిజగుణులవారు నాత్మ సుఖమును వేడికొనిన తీరు విజ్ఞానదాయకమై విరాజిల్లుచున్నది. ఆత్మసుఖము సంసారమునరయన ననేక విధములుగా తోచుచున్నది. అనేక ముఖములనుండి కన్పట్టును. ఇది సాతిశయ స్వరూపమును దాల్చికొని యెవ్వరికినీ సమాధానము నివ్వజాలదు. అయితే

అది వెలుపలి యనేక రూపములను విడిచి యాత్మ సుఖరూపమైన యొకే యొక రూపమున యొకే యొక ముఖమున దోచినప్పుడు నది నిరతిశయమైనదగును. అద్దానిని పొందినవారు పరిపూర్ణ సుఖము గలవారగుదురు.

పరకాయ స్థలములోని శివయోగి తన కుండెడి పర-హంతా భావనచేత విశ్వమంతటిని చిద్రూపముగా గని దానియందున తన చిత్తమును విలయమొనరించును. తత్ఫలితముగా సదా ఆనందితునిగా నుండును. అందరికి యుండినటులనే యతనికినీ స్థూలదేహముండినా అతని దాని గురించిన యభిమానముండదు. అందుచేతనతడు వికారములచేత విచలితుడు కాడు. దేహధారియై యుండినా యతడు నిర్దేహియే. ఈ విషయమును స్పష్టపరిచెడి శ్రీ భగవత్పాదులవారి యుపదేశమును గనుడి :

**స్వస్వరూపం చిదాకారం జ్యోతిః సాక్షాద్విచింతయన్ ।**
**దేహవానపి నిర్దేహో జీవన్ముక్తో హి సాధకః ॥** (సి.శి.16-54)

ఆత్మ చిద్రూపమైయుండును. ఆ చిద్రూపమైన తన ఆత్మను సాక్షాత్కరించికొని స్వస్వరూపము యొక్క చింతన యందుండెడి సాధకుడు దేహమును ధరించియున్నను నిర్దేహిగా నుండును. ఈ విధముగా నతడు జీవన్ముక్తుడై యుండునని శ్రీ భగవత్పాదులవారి ఆశయమై యున్నది.

జ్యోతి ప్రకాశమానమై యుండునటులె ప్రతియొక్కరి ఆత్మయు చిజ్జ్యోతి రూపముగా నుండును. దీపము వలన వెలుపలి చీకటి నిర్మూలమై పోవునటులే, ఆత్మ జ్యోతి వలన అజ్ఞానమనెడి యంధకారము దూరమగును. అంతటి ఆత్మ స్వరూపమును సాక్షాత్కరించికొనిన సాధకుడు సదా దాని చింతనలోనే మునిగియుండును. అతని మనోవృత్తి బహిర్గామి కాదు. స్థూల శరీరము కడకు పోదు. నిర్దేహివలె ప్రవర్తించును. ఇట్టి స్థితినే జీవన్ముక్తి స్థితియని అందురు. ఇద్దానిని పొందిన వానికి దేహముండినను లేనియటులే యని గ్రహించవలెను. ఈ విషయమును వివరించెడి శ్రీ భగవత్పాదులువారి యుపదేశమును గనుడి :

**దేహ స్తిష్ఠతు వా యాతు యోగినః స్వాత్మబోధినః ।**
**జీవన్ముక్తిర్భవేత్ సద్యశ్చిదానంద ప్రకాశినీ ॥** (సి.శి.16-55)

స్వస్వరూప జ్ఞాన సంపన్నుడైన శివయోగి యొక్క స్థూల శరీరము నెంతో కాలము వరకు నుండవచ్చును. లేదా పోవచ్చును. అయినా అతని సచ్చిదానందమును ప్రకాశింపజేసెడి జీవన్ముక్తి యనెడి యవస్థ తత్ క్షణముననే లభించునని శ్రీ భగవత్పాదులవారు నీ శ్లోకమున తెలియజేసిరి.

పరకాయుడైన శివయోగి స్వాత్మ బోధను బడసిన వెనువెంటనే జీవన్ముక్తిని పొందును. ఈ స్థితిలో నతని శరీరముండినను, లేకుండినను గల్గెడి ప్రయోజనము శూన్యము. లోకమున జ్ఞానులకైనను, నజ్ఞానులకైనను వారి వారి శరీరములు ప్రారబ్ద కర్మయొక్క అధీనములో నుండును. ఆ కర్మ యధికముగా నుండిన యెడల నతని శరీరము చాలాకాలము వరకు నిలిచియుండవచ్చును. లేని యెడల, దేహమల్పకాలములోనే యంతరించి పోవచ్చును. జ్ఞానప్రాప్తిని పొందినవారు యింతకాలము వరకు జీవించవచ్చునని నియమమేదియును నుండదు. యోగసామర్థ్యము వలన కొందరు నెంతో కాలము వరకు జీవించియుందురని తెలిపెడి కథలెన్నియో గలవు. ఈ విధముగా జీవించవలెననెడి నియమమేదియును లేదు. ఈ విషయమున యీ క్రింది అక్క మహాదేవి గారి వచనము జ్ఞాన దాయకమైయున్నది.

**కాయకర్రనె కందిదరేను?**
**కాయమిర్రనె మించిదరేను?**
**అంతరంగ శుద్ధవాద బళిక కాయవేనాదదేనయ్యా**
**చెన్నమల్లికార్జున నొలిద కాయవేనాదడె నిమగేనయ్యా?**

ఈ వచనపు తెలుగు రూపమును గనుడి :

కాయము కర్రెగా కందిన నేమి?
కాయము మిల మిల మెరిసిననేమి?

అంతరంగము శుద్ధమైన వెనుక
కాయమేనైన నేమయ్యా!
చెన్నమల్లికార్జున డొల్లిన
కాయమేమైన మీకేమయ్యా!

జ్ఞానప్రాప్తి పొందిన పిదప కాయము వలన యెట్టి ప్రయోజనముండదని తెలుపబడినది. మనుష్యుని దేహమునకు గల ప్రయోజనమేమనగా నిద్దానివలన జ్ఞానప్రాప్తిని పొందుటయే. అది లభించిన వారికి దేహము గురించిన ఆసక్తి యుండదు. ప్రారబ్ధము ముగిసినంతవరకు నూరకే యుందురు. దేహము యొక్క జీవ లేదా నిర్జీవ స్థితివలన జీవన్ముక్తి బడసినవారికి యెట్టి భేదమును చూపజాలదని గ్రహించగలరు.

సంసారపు పీడ బహు దుర్భరమైనదనెడిది మనమెరిగిన విషయమే. అట్టి పీడ జ్ఞానప్రాప్తి లభించినంతవరకే యుండునని శ్రీ భగవత్పాదుల వారు బోధించిరి. ఈ క్రింది యుపదేశమును గనుడి :

**ఆత్మజ్ఞానావసానం హి సంసార పరిపీడనమ్ ।**
**సూర్యోదయేఽపి కిం లోకస్తిమిరేణోపరుధ్యతే ॥**
(సి.శి.16-56)

సూర్యోదయముతో కారు చీకట్లు కరిగిపోవునటులే, ఆత్మజ్ఞానము లభించగనే సంసార పీడదూరమగునని యీ శ్లోకమున తెలుపబడినది.

అజ్ఞానమే దుఃఖములన్నింటికిని మూలము. అజ్ఞానము వలన భేదభావము పుట్టును. ఈ భేద భావము చేత రాగద్వేషములు గల్గును. వీటివలన ననుకూల ప్రతికూల స్థితిగతులేర్పడి పుణ్యపాపములకు కారణభూతములగుచున్నవి. పుణ్యపాపముల వలననే జనన మరణములు గల్గుచున్నవి. ఈ విధముగా జీవుడు దుఃఖసాగరములో మునిగిపోవుటకు, అజ్ఞానమే కారణభూతమైన యంశమని గ్రహించగలరు. ఆత్మజ్ఞానము చేత యజ్ఞానమును దూరము చేసికొనవలెను. చీకటి సూర్యోదయమున కద్దురాని విధిననే ఆత్మ జ్ఞాన వికాసమైన పిదప దేహము యొక్క పీడలు జీవన్ముక్తిని పొందుటకు నడ్డుకట్టలను వేయజాలవని శ్రీ భగవత్పాదుల వారి యుపదేశమైయున్నది.

పరకాయ స్థలియైన శివయోగికి దేహమనెడిది యవరోధము కాజాలదని తెలిసికొనగలరు. వివరముల నిచ్చెడి యీ క్రింది భగవత్పాదుల వారి యుపదేశమును గనుడి :

**దేహాభిమాన నిర్ముక్తః కలాతీత పదాశ్రయః ।**
**కథం యాతి పరిచ్ఛేదం శరీరేషు మహాబుధః ॥** (సి.శి.16-57)

దేహాభిమానమునుండి ముక్తిని పొందిన వాడై, కలాతీతమైన శివపదమును నాశ్రయించి యుండెడివానికి దేహమున పరిచ్ఛిన్నుడై యుండుట కెట్లు సాధ్యమగునని శ్రీ భగవత్పాదులవారు ప్రశ్నించిరి.

దేహాభిమానమును వీడి, పరకాయ స్థలివలె ఆత్మజ్ఞానమును బడసి ధన్యత సాధించుటకై చదువరులు ప్రయత్నింతురు గాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

దినాంకము : 7, ఆగష్టు 1993

జ్ఞాన మందిరము, జంగమవాడి మఠము, వారణాసి

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య మహాస్వాములవారు పరకాయుని స్వరూప స్వభావములను వివరించిరి.

ఆత్మజ్ఞాన శూన్యుని మాత్రమే సంసారము పీడనకు గురిచేయును. స్వస్వరూప జ్ఞానమును పొందినవాడై "సర్వం బ్రహ్మేతి" యని జగజ్జాలము గురించి యెరిగినవాడై యుండెడి పరకాయునికి స్వకాయ పరకాయమనెడి భేదబుద్ధి యుండదు. "విశ్వంచిదాత్మకం బ్రహ్మ" యని తెలిసికొని యానందించుచుండును. ఇట్టి వాని కాయము యొక్క అస్తిత్వము నామమాత్రమైనదని గ్రహించవలెను. పరబ్రహ్మ కాయమే తన కాయముగా భావించెడి పరకాయుడు పరాత్పరుని స్వరూపమై విరాజిల్లుచుండును.

పరకాయ తత్త్వ విధుల నిశ్చితాభిప్రాయమేమనగా జ్ఞానాగమ సంపన్నుడై, కర్మవాసనలను తొలగించుకొని, దేహేంద్రియ మనోవృత్తుల నధిగమించిన శివయోగి సాక్షాత్తుగా శివుడే, నాదబిందు కలాతీతుడై, త్రైగుణ్య కాలత్రయములకు లోనుగాని వాడై చిన్మయుడై యుండెడి చిదానందమూర్తి యయిన శివునికి శివయోగి కభేదము ప్రతిపాదింపబడినది. శ్రీ బసవేశ్వరులవారి క్రింది వచనము పరిగ్రాహ్యము :

**పూర్వబీజ వాయుప్రాణియల్ల**
**లింగప్రాణియా శరణను**
**ఏకోగ్రాహి భావభేదవిల్లనాగి**
**మనః ప్రవేశియా శరణను**
**నిమ్మపూజిసి తను ధర్మమమరెదు**
**నిమ్మ ప్రతిబింబదంతిప్ప**
**కూడల సంగమదేవా, నిమ్మ శరణను**

ఈ వచనపు తెలుగు రూపమిది :

పూర్వబీజము వాయుప్రాణి కాదు
లింగప్రాణి యా శరణుడు
"ఏకోగ్రాహి" భావభేదము లేదుగాన
మనః ప్రవేశి యా శరణుడు
మిమ్ముల పూజించి తనుధర్మమును మరచి
మీ ప్రతిబింబము వలె నుండెడివాడు
కూడల సంగమదేవా, మీ శరణుడు (వచనము సం.765)

ఈ సందర్భమున, "పరాహంతా మనుప్రాప్య పశ్యద్ విశ్వం చిదాత్మకమ్। నదేహేతిభ్రమ స్తస్య నిశ్చితాహి శివాత్మనా" యనెడి ఆచార్యోక్తి (16 : 53) స్మరణీయము. పరకాయుడు పరబ్రహ్మ స్వరూపియని గ్రహించవలెననెడిదే గుర్తించవలసిన విషయము.

– *శివం భూయాత్* –

## ఆశీర్వచనము - 1 :
## ధర్మాచార స్థలము :

ధర్మమనెడి విషయమున పలు విధములైన యభిప్రాయములు గలవు. ఇంతకు క్రితమున తెలుపబడిన పరకాయుని ఆచరణనే లోకుల చేత ధర్మమని యెంచబడుచున్నది. ఈ విషయమున శ్రీ రేణుక భగవత్పాదులవారు నగస్త్యమునికి చేసిన యుపదేశమిది :

**తస్యైవ పరకాయస్య సమాచారో ఇష్యతే ।**
**సధర్మః సర్వలోకానాముపకారాయ కల్ప్యతే ॥** (సి.శి.16-58)

పరకాయ శివయోగి యొక్క వర్తనయే ధర్మము. అది సర్వజగత్తుకు నుపకారముగా సంభవించుచున్నది. జగత్తులో పెద్దవారి యాచరణను చిన్నవారు ననుసరింతురు. మనము చేసెడి యుపదేశము కంటెను మనము చేపట్టెడి వర్తన హెచ్చు ప్రభావమును చూపును. చిన్న పిల్లలెప్పుడు

వారిపెద్దలను అనుకరించుటను చూడగలము. గురువులకు నమస్కరించవలెనని బోధించిన యెడల చిన్నపిల్లలు స్పందించవచ్చును; లేదా నిర్లక్ష్యము చేయవచ్చును. పెద్దవారు గురువులకు నమస్కరించిన యెడల పిల్లవాడును నమస్కరించును. ఈ విధముగా పెద్దల ఆచరణలు పిన్నలకు మార్గదర్శకములగుచున్నవి. పరకాయ స్థలములోని శివయోగి యొక్క ప్రవర్తనయు నట్టిదే. లోకము దానిని ధర్మముగానెంచి యనుసరించవలెనని శ్రీ భగవత్పాదుల వారు బోధించిరి.

"సత్యం వద, ధర్మం చర" అనెడి యీ వేదవాక్కులలో ధర్మమునాచరించవలెనని చెప్పబడినది. "యతోఽభ్యుదయ నిశ్శ్రేయస సిద్ధిః సః ధర్మః " అని శాస్త్రకారులు వచించిరి. ఏ ఆచరణవలన మనుష్యునికి యైహిక సుఖప్రాప్తియును, చివరన ముక్తియు లభించునో అదియే ధర్మమని చెప్పబడినది.

సంసారమునందున యెల్లరు సుఖముల నాశింతురు. సుఖ సాధనములను సంపాదించుటకై వాంఛింతురు. వాటిని యనుభవించి, యనుభవించి చివరకు ముక్తిని పొందవలెననెడి కోరికను పెంచికొందురు. ధర్మము ననుసరించెడి వారికి భోగమోక్షములు లభించునని చెప్పబడినది.

ధర్మాచరణను చేసెడి యధికారము కేవలము మనుష్యునికి మాత్రమే ప్రాప్తమైనది. మిగిలిన జన్మలు కేవలము భోగపరమైనవే. మనుష్యుడు భోగము చేయుచునే క్రొత్త కర్మలను చేయగల్గును. అందుచేత మానవుని కర్తా మరియు భోక్తాయని యనవచ్చును. ఎనుబది నాలుగు లక్షల జీవరాశిలో హస్తములు గల జీవి మనుష్యుడొక్కడే. మిగిలిన జీవులకు కాళ్ళు మాత్రమే గలవు. కొన్ని జీవులు కాళ్ళను చేతులుగా నుపయోగించుకొనుచున్నవి. అయితే వాటిని చేతులుగా పరిగణించుటకు వీలుపడదు.

హస్తములు గల్గి యున్నందుననే మనుష్యుడు కర్మలను చేయగల్గుచున్నాడు. ఈ కారణమున మనుష్యుడొక్కడే ధర్మాచరణ చేయగల్గిన జీవియని గ్రహించవలెను.

ధర్మమును చేయగల్గియూ, ధర్మాచరణ చేయని మనుష్యుడు పశువుతో సమానమైన వాడని చెప్పబడినది. "ధర్మేణ హీనః పశుభిః సమానః" అని పెద్దలు చెప్పిరి. ధర్మము చేయుటలో హీనుడై చరించెడివాడు పశువులతో సమానమైనవాడనెడిది యీ వాక్కుల సారాంశము.

మనము పరలోకమునకు వెడలునప్పుడు మనను వెన్నంటి వచ్చెడిది ధర్మమొక్కటేయని చెప్పబడినది. ఈ విషయమున నొక సుభాషితకారుడు క్రింది విధముగా వివరించి చెప్పిరి :

**విద్యామిత్రం ప్రవాసేషు భార్యామిత్రంగృహేషుచ ।**
**వ్యాధితసౌషధం మిత్రం ధర్మోమిత్రం మరిష్యతః ॥**

ఈ సుభాషితము యొక్క తాత్పర్యమేమనగా ప్రవాసమును చేయునప్పుడు విద్యయే మిత్రుడగును. ఇళ్ళలోన యింతి, వ్యాధిగ్రస్తునకు నౌషధము మిత్రులు కాగా, చచ్చెడివానికి ధర్మమే మిత్రుడగును. ఈ విషయము లన్నియు ననేక యుదాహరణముల ద్వార స్పష్టముగా వివరింపబడినవి.

ఒక మనిషి ప్రవాసమును చేయునప్పుడు, అతడు గాఢమైన నిద్రలో నుండగా, దొంగలు వస్తువులను, తొడువులను దోచికొని పోవచ్చును. ధనము నష్టము కావచ్చును. కాని యతనిలోని విద్యనెవ్వరును దొంగిలించలేరు. విద్యా సంపన్నుడైన వ్యక్తి ప్రవాసమునందున యేమి పోగొట్టుకొనిననూ వాటిని మరల అర్జించికొనగలడు. విద్య గల్గియుండుటచేత నేదోయొక పనిని చేపట్టి ధనార్జన చేసి వస్తు సంచయము చేకూర్చికొనగలడు. ఈ కారణమువలననే ప్రవాసము నందున గల వానికి విద్యయే మిత్రుడని చెప్పబడినది.

ఏదైనా జటిల సమస్యను మన మెదుర్కొనిన యప్పుడు మన యాప్తులతో మాట్లాడి సమస్యను పరిష్కరించికొనెడి యుపాయము నన్వేషింతుము. ఈ విషయమును గురించి భర్త భార్యతో సంప్రదించవచ్చును. ఒక భార్యకు గల పాత్రలలో మంత్రి పాత్ర యొకటి చెప్పబడినది. తినిపించెడియప్పుడు తల్లిగాను, యింటిపనులలో దాసిగాను, సౌందర్యమునందున లక్ష్మిగాను, శయనము నందున రంభగాను భార్య పాత్రలను పోషించునని తెలుపబడినది. ఈ కారణముననే భార్య భర్తకు నిజమైన మిత్రురాలని తెలిసికొనగలరు.

రోగిష్టియై మంచమును పట్టినవానికి గల మిత్రులెల్లరు పలకరించిపోవుచుందురు. ఈ పలకరింపుల వలన రోగము తగ్గునే? ఔషధమునకే రోగము లొంగును. అందుచేత రోగికి మందుకంటెను మించిన మిత్రుడు లేడు.

"జాతస్య మరణం ధృవ"మ్మనెడి దెరుగని వారెవ్వరు. చావు తప్పదని తెలిసినా తామనుభవించుటకొరకు తరుగని ధన ధాన్య కనక భూమ్యాదులు సమకూర్చుకొనెదరు. మరణోన్ముఖమైన వానికి వీటివలన గల్గెడి ప్రయోజనమేదియును నుండదు. వీటిని తన వెంబడి తీసికొని పరలోకమునకు వెళ్ళలేడు. ఒంటరిగానే వెళ్ళిపోవలసి యుండును. తన జీవనకాలములో తానొనర్చిన ధర్మకార్యముల ఫలమతనికి పరలోకమున హితమును చేకూర్చునని శాస్త్రములు చెప్పుచున్నవి. అందుకే ప్రతియొక్కరు ధర్మాచరణ యెడల ఆసక్తిని పెంచికొనవలెను.

ఈ కాలములో మనము వేరొక దేశమునకు వెళ్ళిన యెడల విదేశములో మన రూపాయలు చెల్లుబాటు కావు. విదేశీ మారక బ్యాంకు ద్వారా నా దేశమునకు చెందిన ద్రవ్యమును పొందవలసియుండును. అదేవిధిన పరలోకమునకు వెడలునప్పుడు పుణ్యమనెడి మారక ద్రవ్యమును పొందవలెను. ధర్మాచరణవలననే పుణ్యము లభించుననెడిది గ్రహించగలరు.

ఈ విషయము నెరుగని లోభి యొకడు, మరణావస్థకు చేరెను. వాడెరిగినది ధనమును కూడబెట్టుటయే. తానుతినక, యితరులకు పెట్టక యితోధికమైన ధనమును కూడబెట్టియుండెను. మరణభయగ్రస్తుడై వాడు వైద్యులను పిలిపించెను. వారు పెదవి విరిచిరి. రెండు లేదా మూడు దినములలో మరణము రావచ్చునని తెలియజెప్పి వెడలిపోయిరి. మరణము తప్పదని యెరిగినవాడై, తాను సముపార్జన చేసిన ధనమునితరుల కివ్వనొల్లక దానిని తన కాయములోనే భద్రపరచుకొననెంచెను. ధనమును బంగారు నాణెములుగా మార్పించెను. అరడజను అరటిపళ్ళను తెప్పించి, వాటిని ముక్కలుగా చేసి, ముక్క ముక్కలో నొక నాణెమును జొప్పించి ఆ ముక్కలను మ్రింగెను. నా ధనము నా వెంబడే వచ్చుచున్నదని సంబరపడెను. మరణించిన వాని కాయమిచ్చటనే యుండుననెడిదనియును, ఆత్మ మాత్రమే పరలోక గమనము చేయుననెడిది వాడెరుండజాలకుండెను. ఇది వాని వెర్రితనమే గాని మరి వేరైనదేదియు గాదని తెలియనిదెవ్వరికి?

ధర్మాచరణ చేయవలెనని తెలిసినా అద్దానిని యే విధముగా చేయవలెనో యనెడిది తెలియక బాధకు గురి యయ్యెడి వారు కలరు. ఇట్టివారినుద్ధరించుటకై శ్రీ భగవత్పాదులవారు తమ యుపదేశమును క్రింది విధముగా నిచ్చిరి :

**అహింసా సత్యమస్తేయం బ్రహ్మచర్యం దయా క్షమా ।**
**దానం పూజా జపో ధ్యానమితి ధర్మస్య సంగ్రహః ॥** (సి.శి.16-59)

ఇతరులను హింసించకుండుట, సత్యమును పలుకుట, దొంగతనమును చేయకుండుట, బ్రహ్మచర్యమును పాటించుట, దానములు చేయుట, శివుని పూజించుట, శివధ్యానములో మునిగియుండుట, పంచాక్షరిని జపించుట, దయాగుణము గల్గియుండుట, ఇతరులను క్షమించెడి దక్షత గల్గియుండుట అనెడివి ధర్మ సంగ్రహమనబడునని శ్రీ భగవత్ పాదులవారి యుపదేశములో చెప్పబడినది.

ఇచ్చట వివరింపబడిన దశవిధ ధర్మమార్గములలో నహింసయే మొదటిది. ఏ జీవికైనను శారీరకముగాగాని, వాక్కువల్లగాని, మానసికముగా గాని దుఃఖమును గల్గించకుండుటయే అహింసయని తెలిసికొనవలెను. మనుష్యుడు స్వార్థపరుడు. పరపీడన వలన పరమ సుఖమును పొందుటకు యత్నించును. ఇట్టి ప్రవృత్తిని నిరోధించుటకే శాస్త్రకారులు "అహింసా పరమో ధర్మః" అని నుడివిరి. అహింసయే ముఖ్యమైన ధర్మమనెడిదీ సూక్తిలోని సూచన.

ప్రతివ్యక్తిలోను రెండు విధములగు శక్తులుండును. అవి : నిర్మాణాత్మక శక్తి, విధ్వంసకశక్తి. వ్యక్తి తన బుద్ధి కుశలతల నుపయోగించి నవ నిర్మాణమును చేయవచ్చును. మనస్సున వికృత భావమును పొంది తాను నిర్మించిన దానిని లేదా యితరులు నిర్మించిన దానిని నాశనము చేయవచ్చును. సామాన్యముగా సామాన్యుని మనస్సునందున రచనాత్మక విచారముల కంటెను విధ్వంసక విచారములే యెక్కువగా దోచుచుండును. ఈ విధ్వంసక శక్తిని తత్సంబంధమైన విచారధారను పూర్తిగా రూపుమాపుటకే "అహింసా ధర్మము" బోధింపబడినది.

హింస యనెడి పదము చంపుట యనెడి యర్థము నందున రూఢిగా గలదు. ఇది అధర్మమని యంగీకరింపబడినది. "మా హింస్యాత్ సర్వాభూతాని" అనెడిది వేదవాక్కు. ఈ జగత్తులోని ప్రాణుల ప్రాణహరణను చేసెడి అధికారము కేవలము రుద్రునికి మాత్రమే కలదు. వేరే యెవ్వరును నీ కార్యమును చేయజాలరు. బ్రహ్మ విష్ణువుల కార్యములైన సృజన మరియు పాలనలను వేరె యెవ్వరైనను చేయవచ్చును. వాటివలన దోషమేదియును గల్గదు. మనుష్యుడి మొదలుకొని 84లక్షల ప్రకారములుగా నున్న జీవులు తమ తమ సంతానమునకు జన్మనిచ్చుచున్నవి. ఇది సృజన కార్యమే కదా! మూలతః యీ కార్యము బ్రహ్మదేవునిదైయున్నను, జీవులా పనిని చేసిన యెడల నెట్టి యపేక్షయు నుండదు. ఇటీవలి

కాలములో సంతాన నియంత్రణకై ప్రభుత్వము బహు విధములైన ప్రయత్నములను చేయుచున్నది. కుటుంబ సంక్షేమ మంత్రిత్వము పెద్దయెత్తున ప్రచార కార్యక్రమములను చేపట్టినది. కుటుంబ నియంత్రణలో నున్న లక్ష్యమేమనగా సంరక్షణ సామర్థ్యము లేనివారు నధికతరమగు సంతానోత్పత్తిని చేయవలదు. లోకములోని జనులు జన్మనిచ్చుటలోన నెట్టి యపరాధముండదు అనెడిది గ్రహించవలసిన విషయము.

మూలతః సంరక్షణ కార్యము విష్ణువుదని చెప్పబడినది అయినా కుటుంబ లాలన, పాలన, లోకపాలన యెవ్వరైనను చేయవచ్చును. ఈ విషయమున కూడ ఆక్షేపణ యుండదు. కాని రుద్రుని కార్యమైన ప్రాణహరణ వేరే యెవ్వరు చేయవలదు. ఈ నియమమును నుల్లంఘించినవాడు శిక్షార్హుడగును. తనవారే అయిన భార్యాపిల్లలను చంపెడి యధికార యెవ్వరికినీ లేదు. అంతేకాదు, ఎవరి ప్రాణమునువారు తీసికొనుటకును అధికారము లేదు. ఆత్మహత్యకు పూనుకొనెడివానిని ప్రభుత్వాంగమైన న్యాయస్థానము శిక్షించును. దండన కఠినముగా నుండును. అందుకే, ప్రాణహరణ నెవ్వరును చేయజాలరు. ప్రాణహరణ చేయవలదని తెలియచెప్పుటకే అహింసా నియమము విధించనైనది.

రుద్రుడు జీవుల ప్రాణహరణ చేయుటకును, ఒక వ్యక్తి సాటి వ్యక్తి యొక్క ప్రాణము తీయుటకును వ్యత్యాసము కలదు. రుద్రుడు, తానే చేసిన సృష్టియొక్క నియమముల ననుసరించి జీవుల ప్రాణహరణ చేయగా, సామాన్యుడు కామక్రోధ లోభమోహాదులకు లోనై దుర్భావముతో ప్రాణహరణ చేయుచున్నాడు.

హింసయనెడిది వివిధ రూపములను దాల్చును. ఈ రూపములకు హింసకు పూనికొనినవాడే కారణములవలన హింసను చేపట్టినాడో యనెడిది ముఖ్యమైన ఆధారమగుచున్నది. ఎవరు స్వతఃగా ప్రాణులను హింసింతురో, వారు హింసకులనెడిది నిజము. అయితే స్వతఃగా తాను హింసను చేయక యితరులచేత చేయించినను, అతడు హింసకుడుగా పరిగణింపబడుదురు. హింసాసక్తిగల వానిని హింసను చేయుటకు ప్రోత్సహించెడివాడు కూడా హింసకుడే. ప్రేరణనిచ్చెడి వాడును నీ కోవకు చెందిన వాడేయగును. చివరగా, హింసకు ననుయోచన నిచ్చెడి వాడును హింసకుడని తెలిసికొనగలరు.

మనుష్యుని యందున హింసా ప్రవృత్తి గల్గుటకు గల కారణమేమి? యనెడిది తెలిసికొనవలసిన యంశము. ఈ విషయము గురించి యోగశాస్త్రము నందున మనోవైజ్ఞానిక విశ్లేషణ చేయనైనది. మనుష్యుని మనస్సునందున యుండెడి లోభ, క్రోధ మోహములే హింసను గల్గించెడి మూలకారణములని తెలియవచ్చినది. వీటిలో లోభము మొదటిదగును. సంపద గురించిన యాశకు లోనై మనిషి తన సాటి మనిషినే కాదు, మూగజీవులను కూడ చంపుచున్నాడు. జంతువుల, పక్షుల, పాముల చర్మాదులను యమ్మకమునకు పెట్టి యపారమైన ధనము ఆర్జించుచున్నాడు.

హింసకు కారణభూతమైన రెండవ యంశము క్రోధము. క్రోధాక్రాంతుడంధుని వలె ప్రవర్తించును. వివేకమును కోల్పోవును. ఇట్టి గుడ్డితనము నందుననే తాను చేసెడి అధర్మము గురించి యెరుగజాలక హింసయందున బ్రవృత్తుడగును.

మోహమువలన హింస ప్రోత్సహింపబడుచున్నది. యజ్ఞ యాగాదులలో చేయబడెడి హింస స్వర్గ సుఖముల గురించిన మోహముతో చేయబడెడి హింసయని తెలిసికొనగలరు.

వాస్తవముగా, మనుష్యుని హింసా ప్రవృత్తికి యడ్డుకట్ట వేయుటకు యజ్ఞములు ప్రతిపాదింపబడినవని గుర్తించగలరు. యథేచ్ఛగా హింసను చేయవలదనియును యజ్ఞయాగాదుల వంటి సందర్భములలో మాత్రమే హింసను చేయవలెననియు వేద మంత్రములుచెప్పుచున్నవని గ్రహించగలరు.

ఈ మూడు ప్రధాన కారణముల నుండియే యనేకానేక కారణముగల్గుచున్న వనెడిది యవిస్మరణీయమైన సత్యము. అందుచేత మీరు లోభాదులకు గురికాకుండగ జీవించుట కొరకు ప్రయత్నించవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

దినాంకము 8, ఆగష్టు 1993

జ్ఞానమందిరము, జంగమవాడి మఠము, వారణాసి

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులవారు ధర్మమనగా నేమి, దాని ప్రాముఖ్యత యెట్టిది. దానిలో మౌలికాంశము లెయ్యవి అనెడి ప్రశ్నలకు సమాధానములనిచ్చిరి. అహింసయే పరమ ధర్మమని నొక్కి చెప్పిరి.

ధర్మమనెడి పదమును నీతికి పర్యాయపదముగా స్వీకరించనైనది. "ధర్మాః పుణ్య యమ న్యాయ స్వభావాచార సోమపాః" అని అమరము చెప్పుచున్నది. (తృ.కాం. నానార్థవర్గము, శ్లో॥ 140). "ధర్మః పుణ్యే యమేన్యాయే స్వభావాచారయోః క్రతౌః ఉపమాయా మహింసాయాం కార్ముకేచ నిగద్యత" అని విశ్వ ప్రకాశము వివరించినది. ధర్మాచారమనగా నైతికాచారమని గ్రహించవచ్చును.

అంగ మాహేశ్వరస్థలి యైంద్రియ చాంచల్యమును నిరోధించి సలిల ముక్తన్యాయమున నైష్ఠిక భక్తినాచరించవలెను. మాయా ప్రభావమునకు లోనైన జీవుడు యింద్రియలోలత్వము వైపు కీడ్చబడుచున్నాడు. ఇట్టివానిని రక్షించుటకే శివుడు లింగమాహేశ్వర స్థలమున ధర్మాచరణ రూపమున నవతరించును. పరకాయుడు వీటినాచరించి అంగమాహేశ్వర స్థలికాదర్శప్రాయుడగుచున్నాడు. మౌలికముగా మాహేశ్వర స్థలికై యుద్దేశింపబడిననూ లోకములోని వారి నెల్లరను నుద్ధరించి రక్షించెడి సామర్థ్యమీ ధర్మాచారస్థలమునకు గలదని గుర్తించగలరు. ధర్మాచారము నాచరించినవానికి శివుడు ప్రసన్నుడై కోరిన కోర్కెలను తీర్చునని తెలుపబడినది. ధర్మాచార సంపన్నుడు వైదికాచార సంపన్నుని కంటెను నుత్తముడని గుర్తింపబడెను. శ్రీ బసవేశ్వరులవారి క్రింది వచనమును గనుడి :

**వేదశాస్త్రదవర హిరియరెన్నె**
**మాయాభ్రాంతి కవిద గీతజ్ఞర హిరియరెన్నె**
**ఇవరు హిరియరుగళే? యాగనట్టు విగసాణరు!**
**ఇవరిందధికవ సాధిసువరేను కిరియరె?**
**ఇంతు విద్యె గుణ జ్ఞాన ధర్మ ఆచార శీలంగళ**
**నమ్మకూడల సంగన శరణరు**
**సాధిసిద సాధనెయనె సాధిసువుడు** (వచనము సం. 611)

ఈ వచనపు తెలుగు రూపమును గనుడి :

**వేదశాస్త్రపు వారిని పెద్దలనను**
**మాయాభ్రాంతి గవియు గీతజ్ఞుల పెద్దలనను**
**ఇట్టివారు పెద్దలే? యాగనట్టువిగ పాణిఘులు**
**వీరికంటెను నధికము సాధించువారేమి పిన్నలే?**
**ఇట్టి విద్యా గుణ జ్ఞాన ధర్మ ఆచార శీలముల**
**మా కూడల సంగని శరణులు**
**సాధించిన సాధననే సాధించునది**

ధర్మతత్పరత యొక్క ప్రాముఖ్యత గురించి చెప్పిన వారిలో శివధర్మ శాస్త్రకోవిదులైన శివానుభావులెందరో గలరు. ఈ క్రింది పద్యమును గనుడి :

**ఉ॥ మంచిగ నిత్య ధర్మనియమవ్రత తత్పరుడై దయాత్ముడై**
**సంచిత పుణ్యుడై గుణవిశారదుడై శివలింగపూజలం**
**దంచిత సత్క్రియా నిరతుడై చరియించిన భక్తుడే మనో**
**వంచకుడైన బ్రాణధనవంచకుడైన సదోచితంబులన్** (అనుభవసారము, ప. 76)

ధర్మాచారమును వ్రతనిష్ఠతో చేయవలయుననెడిదే సోమనాథుని యభిమతమని గ్రహించవలెను.

వీరశైవమున ననేక నైతికాచారణలు ప్రతిపాదింపబడినవి. శివాగమములలో తెలుపబడినట్టి పంచాచారములే యీ నైతికాచారణ సూత్రములకు నాధారభూతమైవని గ్రహించగలరు. అనేకానేకమైనట్టి యాచారముల సంగ్రహరూపమును శ్రీ భగవత్పాదులవారు ప్రబోధించిరని యెరుగవలెను. ఇవి సాధారణ ధర్మముల కోవకు చెందినవనియును, నెవరైనను వీటిని పాటించి లబ్ధిని పొందవచ్చుననియును తెలిసికొనగలరు.

మౌలిక ధర్మాచరణ యొక్క సంగ్రహ స్వరూపమును శ్రీ బసవేశ్వరులవారి క్రింది వచనములోన గాంచగలము.

**కళబేడ కొలబేడ హుసియ నుడియలు బేడ**
**మునియ బేడ అన్యరిగె అసహ్యాబడ బేడ**
**తన్న బణ్ణిస ఇదిర హళియలు బేడ**
**ఇదే అంతరంగశుద్ధి, ఇదే బహిరంగ శుద్ధి**
**ఇదే నమ్మ కూడల సంగమ దేవర నొలిసువ పరి**

ఈ వచనపు తెలుగు రూపమిది :

కొల్లగొట్లవలదు కూల్చి చంపవలదు కల్లమాటవలదు
అలుగ వలదు అన్యుల కసహ్యాపడ వలదు
తనను తాను పొగడవలదు ఎదుటివానిని తెగడవలదు
ఇదే అంతరంగ శుద్ధి ఇదే బహిరంగ శుద్ధి
ఇదే మన కూడల సంగమ దేవర నొల్లజేయు పరి

రేణకోక్తి బసవోక్తులలో సామరూప్యత గలదనెడిది గ్రహించవలసిన విషయము. అహింసా వ్రతమును పాటించనివాడే నిజమైన అంత్యజుడని ప్రకటించిన బసవోక్తి పరికించదగినదైయున్నది.

**కొలువవనె మాదిగ, హొలసు తింబువనె హొలెయ**
**కులవేనో అవందిర కులవేనో?**
**సకల జనాత్మరిగె లేసనె బయసువ**
**నమ్మ కూడల సంగన శరణరు కులజరు** (వ.సం. 590)

దీని తెలుగు రూపమును గనుడి :

కూల్చువాడే మాదిగ, పొలసు తినువాడే వెలివాడు
కులమేమో వారి కులమేమో?
సకల జనాత్ములకు లెస్సనే వలచెడి
మా కూడల సంగని శరణులే కులజులు

*– శివం భూయాత్ –*

## ఆశీర్వచనము - 2 :

## ధర్మాచార స్థలము :

అహింసా విషయమున చర్చించుచు హింసను ప్రేరేపించుటలో లోభాదుల పాత్ర యెట్టిదో తెలిసికొంటిమి. ఈ విషయము శారీరక హింసకు సంబంధించినదని గ్రహించగలరు.

అహింసను పరిపాలించెడి వాడు త్రికరణశుద్ధిగా నహింసను పాటించవలెను. మనసా, వాచా, కర్మణా హింసను చేయకుండగ నుండవలెనని తెలిసికొనగలరు.

మానసికముగా నహింసను పాటించుటయనగా మనస్సులోన యెవ్వరికిని కీడును తలపెట్టకుండగ నుండుట. వాచికహింస యనగా వాక్కువలన యెవ్వరికిని బాధను కల్గించవలదు. పరుషమైన వాక్కును ప్రయోగించవలదు. కాయిక హింసయనెడిది భౌతికముగా ప్రాణులను హింసించుట యనెడి దానికి సంబంధము గల్గి యుండును. వ్యక్తి యే రకమైన హింసనైనను చేయవలదని గుర్తించగలరు.అప్పుడే యహింస పరిపాలింపబడునని తెలిసికొనగలరు.

సామాన్యముగా మనుష్యుడు హింస యందున ప్రవృత్తుడైనప్పుడు "నేనేమి చేయుచున్నాను? దీని పరిణామమేమి కావచ్చును?" అనెడి ప్రశ్నల గురించిన పూర్ణ అవగాహన యుండదు. ఇది గల్గినచో నెంతటి హింసకుడైనను పరివర్తనకు గురియై అహింసా పరిపాలకుడగును. గతములో నిట్టి ఘటనలెన్నియో సంభవించినవి. వాల్మీకి చరిత్ర మనమెరిగినదే. వేటకాడై జీవహింసను విచ్చలవిడిగా చేసెడి వాల్మీకి నారదుని జ్ఞానబోధ వలన పరివర్తన చెంది రామాయణ కర్తగా రూపుదిద్దికొనెను. గౌతమబుద్ధుని జీవన గమనములోన హింసకులెందరో నతనిచేత ప్రభావితులై హింసకు తిలోదకములనిచ్చి యహింసను ఆచరించిరని తెలియజెప్పెడి యుదంతము లెన్నియో గలవు. ప్రతియొక్కరు హింసవలన గల్గెడి పరిణామములను గుర్తెరిగి హింసను వీడి, అహింసా మార్గమున పయనించవలెననెడిది గ్రహించవలసిన విషయము.

సత్య మీ జగత్తు కాధార స్తంభమై విరాజిల్లుచున్నది. సత్యమును గురించి చెప్పబడిన యీ సుభాషితము గమనార్హమైయున్నది.

**సత్యేన ధార్యతే పృథ్వీ సత్యేన తపతే రవిః ।**
**సత్యేన వాయవో వాంతి సర్వం సత్యే ప్రతిష్ఠితమ్ ॥**

సర్వము సత్యము మీద నాధారపడి నిలిచియున్నదనియును, సత్యము వలననే సూర్యుడు వెలుగటయు, భూమి మోయుటయు మరియు వాయువు వీచుటయు జరుగుచున్నదని యీ సుభాషితము చెప్పుచున్నది.

పౌరాణిక కథల ప్రకారము భూమి శేషుని తలమీద నిలిచియున్నది. శేషమనగా మిగిలినదనెడి యర్థమొకటి కలదు. చివరకు మిగిలేది సత్యమే. సత్యమనగా సాక్షాత్తుగా శివుడేయని గ్రహించవలెను. అందుచేత సర్వము సత్యము మీద నాధారపడి యున్నదనెడిది సత్యమే.

అహింసాదులను పాటించియు, సత్యవాక్పరిపాలన చేయనిచో ఫలితముండజాలదని శాస్త్రకారులు తెలిపిరి. సత్యవాక్పరిపాలన చేసిన హరిశ్చంద్రుని కథ మనమెరిగినదే. ఎన్నో కష్టనష్టముల కోర్చి సత్య వాక్పరిపాలన చేసిన హరిశ్చంద్రుడు లోకము చేత నుతింపబడుచున్నాడు.

ఒక యూరిలో నొక తండ్రి కొకే యొక కొడుకుండెను. అతడెల్లప్పుడును నసత్యమునే పలుకుచుండెను. ఇంటిలోని వారెల్లరును నతని గూర్చి విసిగిపోయిరి. ఒకసారి యా ఊరికి సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన బృందము వచ్చెను. తండ్రి తన కొడుకును పిలిచి, పది రూపాయల నతనికిచ్చి, "హరిశ్చంద్ర నాటకమును చూసి బుద్ధి తెచ్చుకొనుము. అసత్యమును పలుకకుండగ నుండు"మని యానతి నిచ్చెను. పిల్లవాడు నాటక ప్రదర్శనా స్థల ప్రవేశము చేయు సమయము కంటెను ముందుగనే నాటకము ప్రారంభింపబడెనని తెలిసికొనగలరు. అప్పుడు హరిశ్చంద్రుడు విశ్వామిత్రుని పరీక్షల వలన రాజ్యమును కోల్పోయి, భార్యాబిడ్డకు దూరమై, అస్పృశ్యుని కమ్ముడుపోయి, వాని పనివానిగా కాటిని కాచెడి దృశ్యము ప్రదర్శింపబడుచుండెను. అప్పుడా కుఱ్ఱవాడు నొక ప్రదేశమున కూర్చొని, తన ప్రక్కవాని నీవిధిన ప్రశ్నించెను. "తాతా! అతడెందుచేత

నీ కష్టముల ననుభవించుచున్నాడు". అప్పుడా ప్రక్కవాడు, "ఇప్పుడే వచ్చినయటులున్నదే? అయితే విను" మనుచు మొదటి నుండి జరిగిన కథను వివరించెను. అప్పుడా బాలుడు "అయ్యో! సత్యమును పలుకుటెందుకు? ఇన్ని కష్టములు తెచ్చికొనుటెందుకు?" అనుచు "నేనీ కష్టముల చూడజాల"నని కళ్ళు మూసికొనెను. అప్పుడది నిదుర సమయమైనందున, వానికి వెనువెంటనే నిదుర వచ్చెను. వానికి మెలకువ వచ్చెడి సమయమునకు నాటక ప్రదర్శన ముగిసియుండెను. బాలుడు బహిర్ముఖుడై బయలుదేరి వేగముగా నడచుచు తన యింటిని చేరికొనెను. లోపలకు ప్రవేశించగానే వాని తండ్రిగారు "ఓయీ కుమారా! నాటక మెట్టులుండె"నని ప్రశ్నించెను. "అప్పా! నేనా నాటకమునకు పోకుండా వుంటే బాగుండేది. ఎవడో హరిశ్చంద్రుడట. సత్యమును పలుకుదుననెడి హఠము పట్టి తాను కష్టపడెను. భార్యను, కొడుకును కష్టపెట్టెను. అతని మూర్ఖపు పట్టుదల వలన కలిగిన పరిణామములను చూచిన పిదప నాకు మనస్తాపము గల్గెను. ఇంకను చూడజాలనైతిని. కళ్ళు మూసికొంటిని. నిద్దురపట్టెను. మెలకువ వచ్చెడి వరకు నాటకము ముగిసియుండెనని బాలుడు బదులు పలికి నిద్రకుపక్రమించెను.

తన కుమారుని యజ్ఞానమును గాంచి తండ్రి యెంతయో తపించిపోయెను. మరుసటి దినమున తన కుమారునికి కథను సమాప్తి వరకు వినిపించెను. సత్య వాక్పరిపాలన వలన శివుడు ప్రత్యక్షమై వరముల నిచ్చుటయు, పోయిన రాజ్యము లభించుటయు, మరణించిన కొడుకు పునర్జీవితుడగుటయు, భార్యను చేరుటయు, విశ్వామిత్రుడు తన తపఃఫలమును ధారబోయుటయు బాగుగా వివరించి చెప్పెను. బాలునిలో మానసిక మార్పును గాంచెను. బాలుడు క్రమక్రమముగా సత్యావాదియై తండ్రిని సఫల మనోరధునిగా చేసెను.

ఈ జగతిన చాలామంది సత్యము యొక్క మర్మమును తెలిసికొనక క్షణికమైన సుఖమునకు బలియై యసత్యము నందున ప్రవృత్తులగుదురు. మన పంచ కర్మేంద్రియములలో వాణి యెంతో ముఖ్యమైనది. నాలుక మంచిదైనచో నాడెల్లా మంచిదనెడి నానుడి ప్రసిద్ధి యందున గలదు. ఈ విషయమును నొక్కి చెప్పెడి యీ క్రింది సుభాషితమును గనుడి :

**జిహ్వాగ్రేవర్తతే లక్ష్మీ జిహ్వాగ్రే మిత్రబాంధవాః ।**
**జిహ్వాగ్రే బంధన ప్రాప్తిః జిహ్వాగ్రే మరణం ధృవమ్ ॥**

ఏదైనను నాలుకచేత సంపాదించవచ్చును. మనము మాటలాడియే ధనము నార్జింతుము. మాటల చేతనే యిష్టమిత్రులనుసంతోషపెట్టవచ్చును. మాటల వలననే బంధువులు సంప్రీతిని పొందుదురు. మరణమైనను మాటల చేత సంప్రాప్తమగును. ఈ విధముగా నాలుకొక గొప్ప సాధనమైయున్నది. సద్వినియోగము వలన యోగక్షేమములు దుర్వినియోగము వలన దుఃఖాదులు లభ్యమగును. శరణులు "వాక్కే జ్యోతిర్లింగ" మనిరి. "వాగేవ జ్యోతిః" అనెడిది యుపనిషద్వాణి. ఇట్టి మహత్వపూర్ణమైన జిహ్వాకు సత్యముతో మాత్రమే సంబంధము గల్గియుండవలెను. అసత్యము యొక్క స్పర్శయైనను తాకనివ్వవలదు. ఈ విధముగా సత్యవాక్పరిపాలన చేసెడి వారికి యిహ పర సుఖములబ్బునని తెలిసికొనగలరు. సత్యమునే పలికి ధన్యతను గాంచుదురు గావుత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

దినాంకము : 9, ఆగష్టు, 1993
జ్ఞానమందిరము, జంగమవాడి మఠము, వారణాసి

## విశేష ప్రదీపిక :

సత్యవాక్పరిపాలన యొక్క ప్రాముఖ్యతను శ్రీ కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు తెలియజెప్పిరి. హరిశ్చంద్ర నాటకోదంతము మరువరాని యుదాహరణయని చెప్పవచ్చును.

సత్యవాక్పరిపాలనకు వీరశైవమున నెంతో ప్రాముఖ్యత గలదు. తత్త్వోపదేశ మనెడిది దీక్షా సంస్కార సందర్భమున శ్రీగురువు ప్రదానము చేసెడి గురుబోధ. ఇట్టి మహత్త్వ పూర్ణమైన దానిలో సత్యపాలనకు ప్రాముఖ్యత యివ్వబడినది. "శౌచేన తనుం సత్యేన వచః శివ సంకల్పేన మనః పరిశోధ్య, ఇతః పరం శివాచార పరతా మవలంబస్వ" అనెడిది తత్త్వోపదేశములోని యంతర్భాగము. స్నానాదుల చేత కాయమును, సత్యము చేత వాక్కును, శివసంకల్పము చేత మనస్సును శుద్ధి చేసికొని, తద్వారా త్రికరణ శుద్ధిని బడసి శివాచారమును ఆచరించవలెననిదే యుపదేశము యొక్క అర్థము. శివాచారము పంచాచారములలో నొకటి. ద్రవ్య క్షేత్ర గృహాదీనాం షోడశానాం విశోధనమ్। శివ శాస్త్రోక్త మార్గేణ శివాచార ఇతి స్మృతః॥ అనెడిది చంద్రజ్ఞానాగమములోని శివవాక్కులు. ఇదే విధముగా సత్య వచఃపాలన గణాచారమున కనుబంధముగా నుండెడి చతుఃషష్టి శీలములలో నొకటని తెలియుచున్నది.

శ్రీ భగవత్పాదులవారు ప్రాణ లింగార్చన స్థలమున "చిల్లిఙ్గం పూజయేద్ భావవస్తుభిః" అనియును, "సత్యమాభరణం ప్రోక్తం" అనియును నుపదేశించిరి. ప్రాణలింగార్చనలో సమర్పింపబడెడి భావవస్తువులలో సత్యమొకటనియును, నద్దానిని ఆభరణముగా సమర్పించవలెననియును తెలుపబడినది.

శ్రీ బసవేశ్వరులవారు సత్యమునకెంతో ప్రాముఖ్యతనిచ్చిరని యీ క్రింది వచనము వలన తెలియుచున్నది.

**దేవలోక మర్త్యలోకవెంబుదు బేరిల్ల కాణిభో!**
**సత్యవ నుడివుదె దేవలోక**
**మిథ్యవ నుడివుదె మర్త్యలోక**
**ఆచారవే స్వర్గ అనాచారవె నరక**
**కూడల సంగమ దేవ నీవే ప్రమాణు** (వచనము సం. 239)

ఈ వచనపు తెలుగు రూపమిది :

దేవలోక మర్త్యలోకములనెడివి వేరు కావు
సత్యమును నుడువుటే దేవలోకము
మిధ్యను నుడువుటే మర్త్యలోకము
ఆచారమే స్వర్గ మనాచారమే నరకము
కూడల సంగమ దేవా! నీవే ప్రమాణము

– *శివం భూయాత్* –

## ఆశీర్వచనము - 3 :

## ధర్మాచార స్థలము :

సత్యము వలన సర్వము సంప్రాప్తమగునని తెలిసికొనియుంటిమి. ఇట్టి సత్యము యొక్క శోధన గురించి తెలిసికొనవలసియున్నది. ఈ విషయమున యుపనిషత్తులు, "హిరణ్మయేన పాత్రేన సత్యస్యాపి- హితంముఖమ్" అని యుపదేశించినవి. శివుడు "సువర్ణపు పాత్రలో సత్యమును పెట్టి దానిపై బంగారపు మూకుడును పెట్టె"ననెడిది యీ వాక్కు యొక్క భావము. శోధకుడు మూకుడును తీసి సత్యమును కనుగొనవలెను.

సత్యశోధన నిమిత్తమున వచ్చిన మనుష్యుడు సత్యమును కనుగొనకుండా పాత్ర గురించి సమ్మోహితుడగు చున్నాడు. ఇచ్చట బంగారపుపాత్ర యనగా మానవుని స్థూల శరీరమే. జన్మను దాల్చిన ప్రతియొక్క వ్యక్తి దేహములోని సత్యము నెరుగకుండగ దేహము యొక్క లాలన-పాలన సుఖ-సంతోషముల గురించియే అధిక శ్రద్ధను కనబరచుచున్నాడు. సుఖ-సంతోషములన్వేషణలో తన ఆయుః పరిమాణమును వ్యయపరచి యసత్యమును గాంచి మరణించుచున్నాడు. కర్మబంధములకు చిక్కికొని జనన-మరణ చక్ర భ్రమణ ప్రక్రియలో పడిపోయి పతనమగుచున్నాడు.

సత్యము యొక్క ప్రాప్తి సులభముగా లభించదు. దానికొరకు పగలు-రాత్రి పరిశ్రమించుచు ప్రయత్నించవలెను. "నాయమాత్మా బలహీనేన లభ్యః" అనెడిది యుపనిషద్వాక్యము. ఈ ఆత్మ బలహీనుని చేత పొందజాలనిదనెడిదే వుపనిషద్వాణి యొక్క యర్థము. ఇచ్చట బలమనగా శారీరక పరమైన బలము కాదు. మానసిక బలమని గ్రహించవలెను. చంచలమైన మనస్సు గలవానికి సత్యము లభించదు. మనస్సును స్థిరముగా నిలిపి, దృఢ సంకల్పముతో ప్రయత్నించవలెను. సత్యస్వరూపుడైన శివుడు గోచరించును. ఈ కారణము వలననే శ్రీ రేణుక భగవత్పాదులవారు సత్య వాక్పరిపాలనను నొక ముఖ్యమైన ధార్మికాంశమని సెలవిచ్చిరి.

దశవిధ ధర్మములలో నస్తేయమ్మనెడిది తరువాతి యంశము. "పరస్వాప హరణం స్తేయం" అని చెప్పబడినదిఇతరుల వస్తువుల నపహరించుట స్తేయ మనబడును. తద్విరుద్ధమైనది అస్తేయం. దొంగతనము వలనగాని, బలాత్కారము వలనగాని యితరుల వస్తువులను గ్రహించకుండుటయే

అస్తేయమని గ్రహించగలరు. ఈశ్వరగీత యీ విషయము ధృవపరచుచున్నది. "తేన త్యక్తేన భుంజీథాః మా గృధః కస్య స్విద్ధనమ్" అనెడిది యీశావాస్యోపనిషద్వచనము ప్రకారము సంపత్తును దానము చేయవచ్చునే కాని, యపహరించవలదు.

చౌర్యమనెడిది మనుష్యుని ధైర్యమును, భయ రాహిత్యమును నష్టపరచును. దొంగతనము చేయునప్పుడు నెంత ధైర్యశాలియైనను చిన్న శబ్దమునకైనను బెదిరిపోవును. పట్టుబడతాననెడి భయముతో పారిపోవును. దొంగతనముతో సంపాదించినదంతయు నధర్మ సంపాదనయే. అసత్యమును పలికి, యితరులను వంచించి ధనము నేవేవో వామమార్గముల ద్వారా సంపాదించవచ్చును. ఇచ్చట తెలిసికొనవలసిన విషయమేమనగా ప్రతియొక్క మనుష్యుడు సుఖ–శాంతులను పొందుటకే ధనార్జన చేయును. పరులను పీడించి వారి దగ్గరి ద్రవ్యమును హరించి, తానా ధనము చేత సుఖపడెదననెడిది సాధ్యమయ్యెడి విషయము కాదు. ఈ కారణమువలననే జగత్తులోని ధనికులెల్లరు సుఖులుగా లేరు. ధనము సుఖమునకు సాధనమైయున్నను, అది ధర్మమార్గమున వచ్చినప్పుడే సుఖమునివ్వగలదు. లేనియెడల సుఖప్రాప్తియు నలభ్యమగును. దుఃఖము కలుగును. ఇట్టి ధనము వలనగల్గెడి ప్రయోజనమెట్టిది?

లోకమున ధనమునకు లక్ష్మీయనెడి పర్యాయనామము కలదు. లబ్ది పొందిన వాడెరుగవలసిన దేమనగా లక్ష్మి యనెడిది మూడు విధములుగా నుండును. అవి : అలక్ష్మి, లక్ష్మి, మహాలక్ష్మి. కేవలమధర్మ మార్గము నందున సంపాదించిన ధనమును అలక్ష్మి యనియును, ధర్మాధర్మమార్గముల యందు సంపాదించిన ధనము లక్ష్మియనియును, ధర్మమార్గమున వచ్చిన ధనము మహాలక్ష్మియనియును తెలుపబడినది. వీటిలో మహాలక్ష్మియే సర్వోత్కృష్టమైనదని గ్రహించగలరు.

ఒక వ్యక్తి ధనమును నేయే మార్గములలో గడించునో ఆయా మార్గముల ద్వారనయ్యది వ్యయమై పోవునని గ్రహించగలరు. అన్యాయమైన మార్గమున సంపాదింపబడిన 'అలక్ష్మి' దుర్వ్యవహారముల కొరకు వ్యయమగును. శ్రీ బసవేశ్వరుల వారి యీ క్రింది వచన మీ విషయమును స్పష్టపరచుచున్నది.

**పాపియ ధన ప్రాయశ్చిత్త క్కల్లదె**
**సత్పాత్రక్కె సల్లదయ్యా!**
**నాయహాలు నాయి కున్నిక్కల్లదె**
**పంచామృతక్కె సల్లదయ్యా!**
**నమ్మ కూడల సంగన శరణరి గలదె**
**మాడువ అర్థ వ్యర్థ కండయ్యా!**

ఈ వచనపు తెలుగు రూపమిది :

పాపి ధనము ప్రాయశ్చిత్తము కొరకే కాని
సత్‌పాత్రతకై చెల్లదయ్యా!
కుక్కపాలు కుక్కపిల్ల కొరకే కాని
పంచామృతముకై చెల్లవయ్యా!
మాదు కూడల సంగని శరణుల కొరకు కాక
చేసెడి అర్థము వ్యర్థము కనుడయ్యా!

పాపముచేసి, ధనమార్జించి పుణ్య సంపాదించుట కొరకు నద్దానిని వ్యవపరచెడి వారికీ వచనము కనువిప్పును గల్గించును. ధర్మమార్గమున సంపాదించిన ధనమే దాసోహ కార్యక్రమము చేయుట కుపయుక్తమై యుండుననెడిది గ్రహించవలసిన విషయము.

అధర్మము వలన నర్జించిన ధనము ననంతకాలము వరకు నుండదని తెలిపెడి యీ క్రింది సుభాషితము గమనార్హమై యున్నది.

**అన్యాయోపార్జితం ద్రవ్యం దశవర్షాణి తిష్ఠతి ।**
**ప్రాప్తేత్వేకాదశేయ వర్షే సమూలం వినశ్యతి ॥**

అన్యాయార్జితమైన ధనమొక పది సంవత్సరములలోనే నశించునని యీ శ్లోకము తెలుపుచున్నది. అందుచేత దుఃఖదాయకమౌ అలక్ష్మిని వరించకుండా మహాలక్ష్మిని పొందుటకు కృషిచేయుట మంచిదని గ్రహించగలరు.

ఒక ఊరిలో నొక ముదుసలి క్రొత్త బఱ్ఱెను కొని తెచ్చి పాలనమ్మెడి పనిని ప్రారంభించెను. పట్టణమునకు వెడలి పాలనమ్ముచుండెను. మార్గమధ్యములో వచ్చెడి వాగులోని నీరును గొని పాలలో సగము వరకు కలిపికొని పోవుచుండెను. ఈ విధముగా నామె నెలవరకు పాలను అమ్మెను. గ్రాహకులనుండి ధనమును గైకొని యింటికి వస్తూ విశ్రాంతికై యొక చెట్టు నీడలో పరుండెను. ఆ చెట్టు వాగు చెంత నుండుటచేత శీతల వాతావరణమేర్పడి యుండెను. ఆమెకు నిద్దుర పట్టెను. ధనము నుంచికొనిన కడవ ఆమె చెంతనే యుండెను. ఆ చెట్టు మీదొక కోతి కూర్చొనియుండెను. అది నాణెములు గల కడవను తీసికొని వెడలి చెట్టు నెక్కి కూర్చొనియుండెను. ఒక నాణెమును తీసి వాగులో వేసెను. "గుళుమ్" అను శబ్దమొచ్చెను. కోతి కెంతో సంతసమాయెను. ఇంకొక నాణెమును చెట్టు క్రింది బండ మీద వేసెను. "ఘణ్" అనే శబ్దమొచ్చెను. కోతికా శబ్దము కూడ యింపుగా నుండెను. ఒకటటు నొకటిటు విసురుచు కోతి నాణెములన్నింటిని విసిరెను. రిక్తమౌ బిందెను నేలకేసి విసిరెను. ఆ శబ్దమునకు ముదుసలిది లేచి చూచెను. కోతి బెదరి పారిపోయెను. ముదుసలిది జరిగిన విషయమును గ్రహించెను. బండమీది నాణెముల నేరికొని లెక్కించగా నవి పాల విలువకు సరిపోయియుండెను. "నీళ్ళ ధనము నీళ్ళకే చెందిన"దని తెలిసికొనెను. అప్పటినుండి బుద్ధిని తెచ్చికొని న్యాయమైన రీతి పాలనమ్ముచు సుఖమయమైన జీవితము గడిపెను.

వ్యాపారులు దీపావళియందున మహాలక్ష్మి, మహా సరస్వతులను పూజించెడి ఆచరణ రూఢియందునగలదు. ఈ సందర్భమున వ్యాపారులు శుభము, లాభము అనెడి భావనలను మనమున దాల్చవలసియుండును. వారు తమ తమ పుస్తకములలో స్వస్తికమును వ్రాసి, అద్దాని యెడ మన శుభమనియును, కుడియందున లాభమేనియును వ్రాతురు. అదే విధిన గోడల మీదను, కూర్చుండెడి గద్దెలుంచెడి ప్రదేశమునగల గోడలకు శుభము-లాభము అని వ్రాయుదురు. మొట్టమొదటి కొలమానము చేయునప్పుడు శుభము అని ప్రారంభించవలసి యుండును. కాని ఆచరణలో లాభమని పలికి కొలమానము చేయును. తద్వారా యతడు శుభమునకు దూరమై లాభమునే పొందును. ఇచ్చట లాభమనగా లక్ష్మీ మరియు అలక్ష్మియని గ్రహించగలరు. తదనుగుణమైన ఫలమును పొందుచున్నాడు. శుభమని ప్రారంభించిన యెడల మహాలక్ష్మి సంప్రాప్తమగును.

మనుష్యుని మనస్సునందున యెప్పుడు లోభము ప్రబలముగా నుండునో, అప్పుడు మనస్సున చౌర్యగుణముత్పన్నమగును. చౌర్యమనగా నితరుల సొమ్మును తస్కరించుటనెడి సామాన్యార్థమున వాడబడుచున్నది. ఇతరులకిచ్చిన సొమ్మును మరల పొందవలెనని కోరికొనినను నయ్యది చౌర్యమగును. రామాయణములోని యొక యుదంత మీ యంశమును సుస్పష్టము చేయుచున్నది.

రావణుని చంపి, లంకను గెలిచిన యనంతరము రామ-లక్ష్మణులు, వానరసేన, అయోధ్యకు వెడలుటకై లంకనుండి బయలుదేరిరి. సముద్ర తీరమున స్వల్పమగు విశ్రాంతిని పొందుటకై కూర్చొనియుండిరి. అప్పుడు వానరులు తమలో తాము విచార విమర్శలు చేసికొనుచుండిరి. అప్పుడొక వానరుడు "మనము లంకమీద విజయమును సాధించి మరలిపోవుచున్నాము. అయితే రిక్త హస్తములతో నయోధ్య కేగుట యంత సమంజసమైన పనికాదు. ఇచ్చటి నుండి యొక్క విలువైన వస్తువును తీసికొని పోవలెను. అది విజయ సంకేతము కాగలదు. లంకా విజయము యొక్క స్మరణ కలకాలము వరకు నుండగల"దనెను. అచ్చటి వానరులకీ మాట నచ్చెను. వారు హనుమంతుని చూపుచు "నితడు లంకా నగరములోని యెల్ల ప్రదేశములలో సంచరించినాడు. అచ్చటి వస్తువుల గురించి యితనికి బాగుగా తెలియును. విలువైన వస్తువేదో యితడే నిర్ణయించవలె"ననిరి. అమూల్యమైన వస్తువేదో నిర్ణయించెడి బాధ్యత హనుమంతుని కప్పగించబడెను. అతడు రావణుని సింహాసనము కంటెను విలువైన దేదియును నుండదనెను. అందరూ అద్దానిని తేవలెనని యనిరి. రామలక్ష్మణులు చర్చలో పాల్గొనలేదు. మౌనము వహించి యుండిరి. వారి మౌనము నామోదముగా గైకొని హనుమంతుడు లంకానగరము గురించి బయలుదేరి వెడలెను. మార్గమధ్యమున నతడు జాంబవంతుని గాంచెను. అతనిని దర్శించి విషయమును నివేదించెను. "ఈ విషయమున మీరు రాముని యాదేశమును పొందితిరా?" యని జాంబవంతుడు హనుమంతుని ప్రశ్నించెను. రాముడభ్యంతరము తెలుపక, మౌనముగా నున్నాడనియును, వారద్దానిని యామోదముగాగైకొంటిమని హనుమంతుడు తెలిపిన వాడయ్యెను. జాంబవంతుడిది యుచితమైన పని కాదనియును, రాముని స్పష్టమైన ఆదేశమును పొందవలెననియును హెచ్చరించెను. అప్పుడిరువురును రాముని కడ కేతెంచిరి. హనుమంతుడు జాంబవంతుని మనోగతాభిప్రాయమును రామునికి నివేదించెను. రాముడు వెనువెంటనే జాంబవంతుని యుద్దేశించి "రావణుని సింహాసనమును తేనిమ్ము. దానికి గల యభ్యంతరమెట్టిది? దాని వలన గల్గెడి యనర్థమెయ్యది?" యని ప్రశ్నించెను. అప్పుడా సమయమున జాంబవంతుడు వినయమును ప్రదర్శించుచు ముకుళిత హస్తుడై, రామునితో "ఓ రామా! మీరు యుద్ధము

కంటెను ముందుగనే లంకా రాజ్యమును విభీషణునికి ప్రదానము చేసి, పట్టాభిషిక్తుని చేసితిరి కదా! అందుచేత రావణుని సింహాసము మీద తమరికి యధికారముండదు. నీకు నధికారము లేని వస్తువును నీవు తీసికొనవలదు. ఒకవేళ నీ విధిన చేయించిన యెడల నయ్యది చౌర్యమగును. ఆలోచించుడి" యని అనెను. జాంబవంతుని హితోపదేశము వలన రామునికి జ్ఞానోదయము కలిగెను. వచ్చెడి యనర్థమును నివారించినందులకతడు జాంబవంతునికి తన కృతజ్ఞతలను తెలియజేసిన వాడయ్యెను.

"ధర్మస్య తత్త్వం విహితం గుహాయామ్" అనెడి యొక సూక్తి ప్రకారము ధర్మసూక్ష్మము లతి సూక్ష్మతత్త్వములై యుండును. ఇతరులకిచ్చి మరల గ్రహించెడి వాడెట్టి ఫలితము చవి చూచుననెడిది తెలిపెడి యీ క్రింది శ్లోకము గమనార్హమైనదై యున్నది.

**స్వదత్తాం పరదత్తాం వాయో హరేత్ పృథ్వీమిమామ్ ।**
**షష్టివర్ష సహస్రాణి విష్టాయాం జాయతే క్రిమిః ॥**

ఈ శ్లోకములోని భావమేమనగా తానిచ్చినది కాని, పరులిచ్చినదైనను కాని, అట్టి భూమ్యాది స్థిర చరాస్తులను నెవ్వరైతే అపహరింతురో వారు అరువది వేల సంవత్సరముల వరకు మలములోని పురుగులై జన్మించుచు మరణించుచు కాలమును గడుపుదురు. ధర్మసూక్ష్మముల నెరిగి జీవనమును కొనసాగించెడి వాడు సుఖియైయుండును. ప్రతియొక్క వ్యక్తి తానేదైనను చేయునప్పుడు తాను చేసెడిది సరియైనదా? కాదా? యనెడి ఆత్మ పరిశీలన చేసికొనవలెను. తన వలన యే విధమైన చౌర్య కార్యమైనను కాకుండా జాగ్రత్త పడవలెను. అప్పుడే యస్తేయ వ్రతమును పాటించుటకు సుసాధ్యమగును. అస్తేయ వ్రతమును పాటించెడి వారి కాయ మతి పవిత్రమైనదైయుండును. వారి మనస్సు నెల్లప్పుడును నిర్మలముగా నుండును. వారు నిర్భీతులై చరించగలరు.

అస్తేయ వ్రతపాలన కొరకు వయస్సుతో ప్రమేయముండదు. బాల్యమునుండియే వ్రతపాలనను ప్రారంభించవలెను. తరుణావస్థకు వచ్చిన పిదప వ్రతపాలన చేయుట ప్రారంభించవచ్చుననుట కవకాశము లేదు. బాల్యమునుండియే అస్తేయ ధర్మపాలన పాటించవలెనని గ్రహించగలరు. చదువరులు తమ పిల్లల కస్తేయ వ్రతము నుపదేశించి వారి కుజ్వలమైన భవిష్యత్తును కల్పింతురు గావుత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

దినాంకము : 10, ఆగష్టు, 1993

జ్ఞాన మందిరము, జంగమవాడి మఠము, వారణాసి.

## విశేష ప్రదీపిక :

శ్రీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు చౌర్యము గురించి చెప్పుచు నయ్యది భక్తి పథమునకు చెల్లదని హితబోధ చేసిరి.

లౌకిక జగత్తులో ధనమునకెంతో ప్రాముఖ్యత కలదు. అద్దానిని వివరించెడి యీ క్రింది శ్లోకమును గనుడి :

**ధనేన నిష్కులినాః కులినా భవన్తి ।**
**ధనైరాపదం మానవా నిస్తరన్తి।**
**ధనేభ్యః పరో బాంధవో నాస్తి లోకే ।**
**ధానాన్యర్జయధ్వం ధనాన్యిర్జయధ్వమ్ ॥**

"ధన మూలం మిదం జగత్" అనెడి భావనను నీ శ్లోకములోన గాంచగలము. సాంసారికమైన యవసరములు ధనార్జనను నిర్దేశించుచున్నవి. ఏదో యొక మార్గమున ధనము నర్జించుటే పురుష లక్షణమై పోయినది. అన్యాయ మార్గముల నెంచికొనెడి వారు చౌర్యము నొక పథముగా నెంపిక చేసికొందురు. విశేషమైన ధనార్జన చేసి సుఖమయమైన జీవనము ననుభవించుటే వీరి లక్ష్యమని తెలియుచున్నది.

చౌర్యమనెడిది నిషిద్ధ కర్మలలో నొకటి. చౌర్యము చేసినవాడు ధనముతో బాటుగా పాపమునర్జించునని తెలుపబడినది. వీరు తమ పాపభారమును

తగ్గించికొనుటకు తీర్థయాత్రలకు పయనించుట, దానధర్మములు చేయుట, దేవాలయ నిర్మాణము మొదలగునవి చేపట్టుచున్నారు. అయితే శివధర్మ శాస్త్రమిట్టి చర్యల గర్హించినది. పాపి ధనము సత్పాత్రతకొరకు యోగ్యమైనది కాదని తెలుపబడినది.

ఈ విధముగా భావించుటకు గల కారణమేమిటో తెలిసికొనుట యెంతో అవసరము.

ప్రతియొక్క వీరశైవుడు పంచాచారములలోన నిర్దేశింపబడిన మార్గమున ధర్మాచరణ సలుపవలెను. సదాచారము పంచాచారములలో నొకటి. చంద్రజ్ఞానాగమము సదాచారము గురించి యీ క్రింది విధముగా తెలుపుచున్నది.

**ధర్మార్జితేన ద్రవ్యేణ తృప్తిశ్చ కురుతే సదా ।**
**గురు జంగమ లింగానాం సదాచారః ప్రకీర్తితః ॥** (క్రి.పా. 9-6)

ధనమును ధర్మ సమ్మతమైన మార్గమున అర్జించి దాసోహమున వెచ్చింపవలెననెడిదే యిందులోని అంతరార్థము. "కూడల సంగన శరణరిగల్లదె – మాడువ అర్థ వ్యర్థ కండయ్యా" అనెడి బసవోక్తిలోను నీ భావమే యిమిడియున్నదని తెలిసికొనవలెను. సదాచారమున కనుబంధముగా నష్టవిధ శీలములు చెప్పబడినవి. వీటిలోన నుద్యోగ శీలమొకటియని శ్రీవీరశైవ సిద్ధాంత శిరోమణి తెలుపుచున్నది. దీని ప్రకారము వీరశైవుడేదో ఒక ధర్మ సమ్మతమైనట్టి ఉద్యోగమును చేపట్టి ధనార్జన చేయవలెను. "ఉద్యోగం పురుష లక్షణ"మనెడి భావన వీరశైవ ధర్మము వారే ప్రచారములోనికి తెచ్చిన భావన అని గ్రహించగలరు. ఉద్యోగమనగా నేదో ఒక ఆర్థిక వ్యాసాంగమనియును, వ్యవసాయ వాణిజ్యాదులిందులోని భావములని గ్రహించగలరు. ఈ భావము "కాయక" ధర్మముగా పరిణమించి శరణ యుగములో విశేషమైన ప్రచారమును నొందినది. కాయకమే కైలాసమనెడి భావన విశ్వవ్యాప్తమైన భావనగా రూపొందినది. ఆధునిక యుగములో నయ్యది పనిచేయుటే పూజచేయుట అనెడి భావము యొక్క రూపమును సంతరించికొనినది.

పరుల సొమ్ము మీద యాశ పెంచికొనుటే చౌర్యమునకు బీజప్రాయమగుచున్నది. ఇట్టి ఆశ నరక భాజనమని తెలిపెడి క్రింది వచనమును గనుడి :

**అసమాక్షలింగక్కె అన్యదైవ సరియెంబవ బాయల్లి**
**మసెద కురగల నిక్కదె మాణ్బనె?**
**... ... ... ... ... ... ... ... ...**
**పరధనగళుపిదవర హిడిఖండవ కొయ్యనె**
**ఎలె కూడల సంగన దేవ ... ...** (వ.సం. 565)

పరధనమును కోరెడి వానిని సంగమ దేవుడు పట్టికొని ఖండ ఖండలుగా కోయునని చెప్పబడినది.

*– శుభం భూయాత్ –*

## ఆశీర్వచనము - 4 :

## ధర్మాచార స్థలము :

ధర్మము యొక్క అంగములలో సత్యాస్తేయములతో పాటుగా బ్రహ్మచర్యమునకు నెంతో ప్రాముఖ్యత గలదు.

యోగసూత్రపు భాష్యము ప్రకారముగా గుప్తేంద్రియము యొక్క సంయమనమును బ్రహ్మచర్యమని యందురు. కేవలము గుప్తేంద్రియము యొక్క సంయమనము బ్రహ్మచర్యము కాజాలదు. దానితోపాటుగా మైథున విషయకమైన చింతన, భాషణాదుల మీద కూడా సంయమనమును పాటించిన యెడల నయ్యది పరిపూర్ణమైన బ్రహ్మచర్యము కాగలదు. ఈ విషయమునందున ఈశ్వర గీత యీ క్రింది విధముగా నుపదేశించినది.

**కర్మణా మనసా వాచా సర్వావస్థాసు సర్వదా ।**
**సర్వత్ర మైథున త్యాగం బ్రహ్మచర్యం ప్రచక్షతే ॥** (ఈశ్వరగీతా -11-18)

త్రికరణశుద్ధితో మైథునమును పరిత్యజించుటయే బ్రహ్మచర్యమని తెలుపబడినది. ఈ క్రింది శ్లోకము నీ విషయమునే సమర్థించుచున్నది.

**స్మరణం కీర్తనం కేలిః ప్రేక్షణం గుహ్యభాషణమ్ ।**
**సంకల్పో ధ్యవసాయశ్చ క్రియానిర్వృతి రేవచ ।**
**ఏతన్మైథునమష్టాంగం ప్రవదంతి మనీషిణః ।**
**విపరీతం బ్రహ్మచర్యమేత దేవాష్ట లక్షణమ్ ॥**

ఈ శ్లోకములో బ్రహ్మచర్యమునకు విరుద్ధమైన యంశములు తెలుపబడినవి. ఈ లక్షణము గల ప్రవర్తనకు దూరముగా నుండుటయే బ్రహ్మచర్యమనబడును.

నాయకీ-నాయకుల మధ్యన నుండెడి పరస్పర స్మరణ, పరస్పర ప్రశంస, కూడికొని ఆడుట, దొంగచూపులు చూచుట, దొంగతనముగా మాట్లాడుట, మనస్సున మైథునము కొరకు సంకల్పము చేసికొనుట, అట్టి మైథునము వెంటనే సంభవించవలెననెడి కోరిక మరియు చివరన మైథునక్రియ యనెడివి మైథునమునకు సంబంధించిన యష్టాంగములని తెలుపబడినది. బ్రహ్మచర్యమును పాటించెడివాడు వీటిని విస్మరించి త్యజించవలెనని గుర్తెరుగగలరు.

బ్రహ్మచర్య వ్రతమును పాలించుటచేత మేధాశక్తి వికసమును చెందును. దాని వలన బ్రహ్మజ్ఞానమును సంపాదించుట సుసాధ్యమగును. ఈ విధముగా బ్రహ్మచర్యము బ్రహ్మ విద్యను పొందుటకై మూలసాధన మగునని గ్రహించగలరు. బ్రహ్మచర్య వ్రతమును చేబూనగానే వివేక వైరాగ్యము విరాజిల్లును. ఈ విషయమును విశదము చేసెడి కథ యొకటి బృహదారణ్యకోపనిషత్తులో గలదు.

ఒకానొక సమయమునందున ప్రజాపతియైన బ్రహ్మకడకు దేవాసురులు మరియు మానవులు వెడలిరి. "అధీః మే భగవన్" అని విన్నవించికొనిరి. "ఓ బ్రహ్మదేవా! మా కొక యుపదేశము నివ్వుడి" అనెడిది వారి విన్నపములోని భావము. అప్పుడా విరించి, వారి నుద్దేశించి "ద-ద-ద" అని యుపదేశించిన వాడయ్యెను.

దేవతలు వివరణను కోరిరి. విరించి దేవతలతో నిట్లనెను. "ఓ దేవతలారా! మీరు పానప్రియులై, యమృతమును సేవించుచు, దేవాంగనల పొందులో తేలియాడుచు, విహారాదులలో కాలమును గడుపుచుందురు. మీరీ విధిన చరించిన యెడల మీకు బ్రహ్మ జ్ఞానము సిద్ధించదు. ఇంద్రియములను నియంత్రించికొనుడి. అందుకే ద' యని యుపదేశించితిని. "ద" యనగా దమనమని యెరుగుడి".

దానవులు దయాగుణమును మానవులు దానగుణమును పెంపొందించికొనవలెనని బ్రహ్మదేవుడుపదేశించెను.

విధాత చెప్పిన విధిన దేవరాజగు యింద్రుడు నలుబడి యెనిమిది సంవత్సరముల వరకు బ్రహ్మచర్య వ్రతమును పాటించి బ్రహ్మజ్ఞాని యయ్యెనని ఛాందోగ్యోపనిషత్తులో తెలుపబడినది. ఇచ్చట గ్రహించవలసిన దేమనగా, బ్రహ్మజ్ఞాన సముపార్జనకై బ్రహ్మచర్యము దోహదము చేయును.

వర్ణధర్మము ప్రకారము, మూడు భాగముల వరకు బ్రహ్మచర్యమునకే ప్రముఖ స్థానమివ్వబడినది. గృహస్థుడైనను సంతానము పొందుటకు మాత్రమే కామాసక్తుడు కావాలనియును, ఆ పిదప బ్రహ్మచర్యమును పాటించవలెనని తెలుపబడినది.

నేటికాలములో వివిధ పద్ధతుల ద్వారా కొంతమేరకు బ్రహ్మచర్యము పాటింపజేయబడుచున్నది. పెళ్ళైన కొత్తలో నాశాఢ మాసము సంసార గమనములో దుష్టతిథులు, తల్లిగారింటి వెడలెడి విధానము మొదలగునవన్నియును బ్రహ్మచర్య వ్రతపాలనను దృష్టియందున నుంచికొని రూపొందింపబడిన సాంప్రదాయములని తెలిసికొనగలరు. బ్రహ్మచర్యమువలన ఆరోగ్య పరిరక్షణ చేయబడుచున్నదనేది యెరుగవలసిన విషయము.

బ్రహ్మచర్యము పిదప గణనకు వచ్చెడి ధర్మమే దయ. సకల ప్రాణుల గురించి యుండెడి కారుణ్య భావమును దయయని అందురు. ఎవ్వరి హృదయసీమ దయతో నిండియుండునో వారు నెవ్వరికైనను, యే కాలమునందైనను హానిని తలపెట్టజాలరు. దుఃఖమును కల్గించరు. అంతేకాదు, దుఃఖితులైన వారిని చూసి, వారి యెడల కనికర భావమును వహించి, తన శక్త్యానుసారముగా వారికి తగిన విధిన సహాయమును చేయుదురు. ఈ విధముగా దయాగుణము గలవారి యందున సహానుభూతి మరియు సమానానుభూతియు నుండును. దుఃఖితుడైన వ్యక్తి గురించి తటస్థ భావమును దాల్చి వారికి సహాయమును చేయుట సహానుభూతి కాగా, ఎదుటివారి దుఃఖమును తన దుఃఖముగా భావించికొని, బాధకు గురియై

దుఃఖితునికి సహాయమును చేయుట సమానానుభూతి యగును. దయలోని యీ రెండు భావములలో సమానానుభూతి యెంతో నుత్కృష్టమైనదని గుర్తించవలెను. ఇంతటి దయాగుణము వలన జగత్తులోని జీవులను తనవలె చూచే దివ్యదృష్టి ప్రాప్తించును. ఈ దృష్టి వలన సర్వమును తన రూపముగా భావించికొనెడి యోగ్యత లభించును. అందుచేత దయ, ఆత్మజ్ఞానమును పొందుటకు సహాయకారిగా నుండును. దయయొక్క ప్రాముఖ్యతను గుర్తెరిగిన, శ్రీభగవత్పాదులవారు దీనినొక ధర్మముగా గ్రహించిరి. దయలోని మర్మము నెరిగిన శ్రీ బసవేశ్వరులవారు నీ క్రింది విధముగా నుపదేశించిరి.

**దయ విల్లద ధర్మవదేవుదయ్యా!**
**దయవే బేకు సకలప్రాణిగళల్లియూ**
**దయవే ధర్మద మూలవయ్యా!**
**కూడల సంగయ్య నంతల్ల దొల్లనయ్యా!**

ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి :

***దయలేని ధర్మమదెట్టి దయ్యా!***
***దయయే వలయు సకల ప్రాణులయందున***
***దయయే ధర్మమునకు మూలమయ్యా!***
***కూడల సంగయ్య యటుల కానిదొల్లదయ్యా!***

శ్రీ బసవన్నవారు దయయే ధర్మమునకు మూలమని నొక్కి చెప్పిరి. అందుచేత సకల జనులు దయాభావమును వహించి జీవించవలెను.

క్షమయనెడిది ధర్మము యొక్క మరొక అంగము. మనిషిలోని సహనశక్తిని క్షమ యని అందురు. అపరాధము చేసినవానిని క్షమించెడి గుణమే క్షమయగును. దండన విధించెడి శక్తిగల్గినను క్షమించి విడిచివేయుట యనెడిది క్షమయొక్క విశేషాంశముని గ్రహించగలరు. క్షమాగుణమును పాలించుట యొక తపస్సని చెప్పబడినది. క్షమగల్గినవాడే మహనీయుడని కూడ తెలుపబడినది. ఈ కారణమువలననే శ్రీ భగవత్పాదులవారు క్షమను పాటించవలెనని బోధించిరి.

దానమనెడిది మరొక ధార్మికాంశము. "స్వత్వ నివృత్తి పూర్వక ధనాది సమర్పణం దానమ్" అని చెప్పబడినది. నాది యనెడి భావనను లుప్తము చేసి ధనాదులను సుపాత్రత గలవారికి ప్రదానము చేయుటే దానమని గ్రహించగలరు. "తేన భుంజీథాః" యని ఈశావాస్య ఉపనిషత్తులోన నుపదేశింపబడినది. మనము నిత్యముపయోగించెడి వస్త్రాదులన్నింటిని భగవదర్పణ గావించి ప్రసాద భావము వాటిని యనుభోగించవలెనని తెలుపబడినది. ఇతరులకు నివేదించిన పిదప అన్నాదుల ననుభవించెడి సాంప్రదాయమొకటి యున్నది. అదియును క్రమక్రమముగా లుప్తమగుచున్నది. నానాటికి పెరుగుచున్న స్వార్థచింతన వలన దానగుణమడుగంటుచున్నది.

దానమును చేయుటవలన హృదయ వైశాల్యము పెరిగిపోవును. కాలక్రమమున దాని విశ్వైక కుటుంబ భావనను దాల్చును. దానము చేయుట ధర్మమే కాదు. అదొక కర్తవ్యమనెడి భావన గల్గును.

మనము సంపాదించిన దానిలో కొంత భాగమును దానాదులకు వినియోగించిన యెడల రాష్ట్రీయ జాతీయ వికాసము త్వరితగతిన గాగలవు.

మన మనుభవించెడిది మనది కాదు. భగవంతుడు మనకిచ్చినదది. మనము స్వార్థమును త్యజించి యితరులకు దానము చేయుట యెంతో యవసరము. తులసీదాసు వంటి భక్తుద్యమ నేత ప్రకారము దానమే ధర్మమునకు మూలము. లోభి కంటెను పరమపాపి యుండడనియు, దానికంటెను మించిన పుణ్యాత్ముడు నుండజాలడనియును చెప్పబడినది.

దానము చేసినచో ధనము నష్టమగుననెడి భావము గల వారెందరో గలరు. సర్వజ్ఞ కవి ప్రకారము దానము చేసినది మనకు మరో రూపములో వచ్చి చేరును. అందుచేత దానము చేసెడివాడు ధన నష్టమగుచున్నదని చింతించవలసిన పనిలేదు. ఈ విషయమును వివరముగా తెలియజెప్పెడి కథ యొక్కటి గలదు.

ప్రాచీన కాలమున నొకడు గొప్ప యజన కార్యక్రమమును చేపట్టి దేవదానవుల కాహ్వానము నిచ్చెను. వారందరును విచ్చేసిరి. భోజన సమయమున దేవతలను మొట్టమొదటి పంక్తిలో భుజింపజేయనెంచెను. దానవులభ్యంతరమును తెలిపిరి. ఆక్షేపణ చేసిరి. దానవులకు భోజనము పెట్టిన పిదప దేవతలకు తిండి పెట్టవలెననిరి. ఆతిథ్యమిచ్చిన వాడొక తెలివిపరుడై యుండెను. దానవులకు తగురీతిలో బుద్ధిని గరపనెంచెను. వారు చెప్పిన ప్రకారమే భోజనముల కేర్పాటు చేసి, రెండు నిబంధములను విధించెను. అవి : అరగంటలో వారు భోజనమును ముగించవలెను. చేతి మణికట్టుకు వెదురు కర్రను కట్టికొనవలెను. ఈ నిబంధనలను పాలించుచు భోజనము చేయవలెననియును, లేని యెడల దేవతల కావకాశమివ్వవలెనని యనెను. దానవులు వల్లెయనిరి. నేలమీద భోజనమునకై కూర్చుండిరి. విస్తరిలో భోజనము వడ్డింపబడెను. షడ్రసోపేతమైన పదార్థములు నివేదింపబడెను. దానవులు తినలేకపోయిరి. అరచేతిని వంచుట వీలుకాలేనందున వారు నిస్సహాయులై యుణిరి. నిర్ణీత సమయము వరకు యత్నించి, విఫల మనోరథులై వెడలిపోయిరి. దేవతలకును ఆ నిబంధనలే విధింపబడెను. దానవుల అనుభవమునుండి గుణపాఠమును పొందిన దేవతలు నొకరి కింకొకరు తినిపించజొచ్చిరి. మణికట్టును వంచెడి పనిలేకుండగనే భోజన కార్యక్రమము ముగిసెను.

ఈ విధముగా దానము చేసెడి వారు విషయగ్రహణను జేసి, యుదారమైన బుద్ధితో దాన ధర్మములను చేయవలెను. తద్వార ధర్మపాలన చేసిన వారై ధన్యతను బడయగలరు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురు చంద్రశేఖర శివచార్యులవారు బ్రహ్మచర్యము దయ మరియు దానముల గురించి ప్రబోధను ప్రదానము చేసిరి.

బ్రహ్మచర్య వ్రతాచరణ గురించి విభిన్నమైన యభిప్రాయములు గలవు. అయితే, వీరశైవుడతి వర్ణాశ్రమియైన కారణమున నతడు గృహస్థ ధర్మమును తప్పనిసరిగా స్వీకరించవలెననెడి నియమములేదు. శివశరణులలో చెన్న బసవన్న యిత్యాదులు వివాహమును చేసికొనలేదు. వైవాహిక బంధముతో నొకటైన భార్యభర్తలు "నుత బ్రహ్మ చర్యమును పాటించుటలోన నౌచిత్యము గలదని చెప్పవచ్చును. వివాహమును చేసికొననివారు, విధురులు, వైధవ్యము ననుభవించెడివారు, నిరాభార వీరశైవులు నైష్ఠిక బ్రహ్మచర్యమును విధిగా పాటించవలెను.

బ్రహ్మ అనగా వేదమనెడి అర్థము గలదు. వేదమనగా జ్ఞానము. బ్రహ్మం చరన్తీతి బ్రహ్మచారి అని చెప్పవచ్చును. జ్ఞానమార్గమున చరించెడిదే బ్రహ్మచర్యమని గ్రహించవచ్చును. ఈ అర్థమునేపథ్యముగా గొనినచో నందరూ బ్రహ్మచర్యమును పాటించవలెనని తెలిసికొనగలరు. మాహేశ్వరుని చిత్త చాంచల్యము లేకుండా ఉండుటకే శివుడే ధర్మాచార నియమమైన బ్రహ్మచర్య వ్రతముగా నవతరించునని గ్రహించగలరు.

మాహేశ్వరుడు వీరవ్రతి. జగత్తులోని చరాచరములు శివుడనియే తలచును. సర్వజీవ దయాపరుడై యుండును. భూతదయ చేత భూతనాథుని మెప్పించవచ్చని తలచును. ఈ విషయమున క్రింది బసవ వాక్కులు పరిగ్రాహ్యములు. "తన్న మనదల్లి" యత్ర జీవః తత్ర శివః" యెందు, సర్వజీవపారి యాదడె కూడల సంగమదేవను కైలాసదిందబందు ఎత్తికొళ్ళదిప్పనె". దయాగుణములోను శివుడున్నాడని తెలిసికొనవలెను.

"కేవలే సహజే దానే నిష్ణాతః అనియును భక్తో మాహేశ్వరః స్మృతః" అనియును భగవత్పాదులవారు అంగ మాహేశ్వర స్థలి గురించి నుడివిరి. (సి.శి. 10:2) దానత్రయములోన నుత్తమమైనదని పరిగణింపబడిన సహజదానమును చేసెడి తత్పరత గల భక్తుడు మాహేశ్వర స్థలియగునని తెలుపబడినది. అట్టి దానగుణము మాహేశ్వర స్థలములోని లింగాంగులకు సహజమైన గుణమగుచున్నది. త్యాగనిరతి లేనివాడు చిత్తైకాగ్రత యనెడి దానిని సాధించజాలడనియును, చిత్తైకాగ్రత సాధించుటే నైష్ఠిక భక్తి యొక్క లక్ష్యమనియును గుర్తించుడి.

## ఆశీర్వచనము - 5 :

## ధర్మాచార స్థలము :

ధర్మము యొక్క అందమైన దానము గురించి క్రిందటి ఆశీర్వచనమున తెలిసికొంటిమి. దానిని గురించిన మరికొన్ని అంశముల నీ ఆశీర్వాదమున తెలిసికొనెదము గావుత.

దానము భూషణము వంటిదని తెలిపెడి యీ క్రింది శ్లోకము గమనార్హమైనదై యున్నది.

**హస్తస్య భూషణం దానం సత్యం కంఠస్య భూషణమ్।**
**శ్రోత్రస్య భూషణం శాస్త్రం భూషణైః కీం ప్రయోజనం॥**

చేతికి దానం, కంఠమునకు సత్యం, చెవికి శాస్త్రము భూషణములనియును, యితర భూషణముల యవశ్యకత లేదనియును చెప్పబడినది.

దానమును చేయని మనుష్యుడు తన హస్తములను సువర్ణాభరణములతో నలంకరించి కొనిననూ, అతని చేతులకు సమాజము నందున యెట్టి మర్యాదయు నుండదు. అతని యందున నుండెడి కార్పణ్య గుణము వలన నతడు తిరస్కారమునకు పాత్రుడగుచున్నాడు. అతనిని పురస్కరించెడి వారెవ్వరును వుండరు. చెవి నిండా ఆభరణములను అలంకరించికొని, ఒక్క శాస్త్ర వచనమునైనను వినకుండిన యెడల నా చెవి నిరలంకృతమైనదిగా భావించవలెను. చెవికి యుండెడి యాభరణముల శాశ్వతమైనవి. మరణము పిదప నయ్యవి పరుల పాలగును. వినిన మంచి మాటలట్టివి కావు. శాశ్వతమైన గుణమును ప్రదానము చేయును.

కంఠము చుట్టూ అలంకారము చేసికొని, నానా విధములైన యాభరణములను ధరించియు సత్యమును నుడువకుండిన యెడల వ్యక్తి వామనుడగును. ఆభరణాదులుండినా లేకుండినా వ్యక్తి సత్యవాక్ పరిపాలన చేసిన యెడల నతడు నుత్తమోత్తముడై సమున్నత స్థానమునలంకరించును.

"దానమేకం కలౌయుగే" అని యుపదేశింప బడినది. దానమొక్కటే యీ కలియుగమున చేయవలసిన ధర్మమని యీ యుపదేశమున చెప్పబడినది. అందుచేత ఎవ్వరి కెంత శక్యమో అంత మేరకు దానమును చేయవలెను. అంత యింత యనెడి కట్టుబాట్లు పాటించవలసిన యవశ్యకత లేదు ఎవ్వరెంత యిచ్చినా అయ్యది దానమే యగును.

ఈ యుగమున దాతృత్వ గుణము గల వారు చాలా వరకు పరిమితముగానే యుందురు. ఈ క్రింది సుభాషితమును గమనించుడి : "శతేషు జాయతే శూరః సహస్రేషుచపండితః। వక్తా శత సహస్రేషు దాతా భవతి వానవా॥" నూటికొక్క శూరుడు, వెయ్యింటికొక పండితుడు, పదివేల జనులలో నొక్క వక్త లభించ వచ్చును. కాని దానగుణము గల వాడు లభించుట దుర్లభమైన యంశము. పరుల సొమ్మును స్వంతము చేసికొను కోరిక గలవారే యధిక సంఖ్యలో నుందురు. తనది యితరుల కిచ్చెడి ఉదారత్వము గల వారుతక్కువగనే యుందురు. కొందరికి వస్తువుల నిచ్చుట వారి చేతకాని పని. మరి కొందరు "యిచ్చుట"యనెడి పదమే యరుచ్యమై యుండును.

ఒక వూరిలో నొకపిసినారివాడు సాయంకాల సమయమున దారిని బట్టికొనిపోవునపుడు కాలుజారి ఒక లోతైన గుంతలోనికి పడెను ప్రాణభయముతో వణికి పోయెను గొంతెత్తి రక్షించండి! రక్షించండి! యని మొరపెట్టుకొనజొచ్చెను. అచ్చటికి జనులెల్లరు చేరిరి. వారిలోనొకరిద్దరు వంగి తమ చేతులను చాచి "నీ చేతిని యివ్వుము" అని అనిరి. వారెంత యత్నించిననూ వాడు తన చేతిని చాచి వారిచేతి కందించలేదు మీదు మిక్కిలి రోదించుచూ "మీదుకెత్తుడి" "మీదుకెత్తుడి" యని అరవ దొడుగెను. వానిని రక్షించుట యెటుల యనెడి ప్రశ్న గుమిగూడిన జనులను వేధించ ప్రారంభించెను. అంతలోనే యొక వ్యక్తి వచ్చెను. అతను గుంతలోన బడిన వానికి చిరపరిచితుడై యుండెను, అతడు జనులందరిని ప్రక్కలకు వెడలమని చెప్పెను. గుంతలోని కొక నాణెమును విసిరెను. లోభి యేడ్పును తగ్గించి నాణెమును గైకొని సంతసమొందజొచ్చెను. ఆ సమయమున యతనికి పరిచితుడైన వ్యక్తి గుంతలోనికి వంగి చేతిని చాచి "అందికొను" మనెను. కృపణుడు వెంటనే స్పందించెను. ఇతరుల సహాయముతో వానిని పైకి లాగెను. అక్కడి వారెల్లరు నాశ్చర్యము నొందిరి. కొత్త వ్యక్తిని వివరములడిగిరి. అప్పుడతడు గుంతలో పడిన వాని వివరములనిచ్చెను. వాడొక పరమలోభియనియును, "ఇవ్వు" అనెడి మాట అతనికి గిట్టదనియు, "తీసికో" అంటే సంబర పడునని చెప్పెను.

తాను చేయి చాచి తీసికొను మనగానే దానిని గట్టిగా పట్టుకొనెనని తెలిపెను. ఈ విధిన లోభి యొక్క మనోగత భావనలు తెలియ జేయబడెను. ఇట్టి భావన గల్గిన వారు దానమును చేయనేర్తురే?

దానములు మూడు రకములుగా నుండుననియును, అవి సోపాధిక, నిరుపాధిక మరియు సహజ దానములనియును నింత క్రితమే తెలుపబడెను. ప్రతిఫలము నపేక్షించి చేసెడిడి సోపాధికదానము కాగా, తద్విరుద్ధమైనదే నిరుపాధిక దానము. ఇచ్చెడిది, తీసికొనెడి వాడు శివ సంబంధముగలవని యెంచి, శివునిది శివుని కిచ్చితిననెడి భావముతో చేసెడి దానము సహజ దానమగును. ఇదియే నుత్తమోత్తమైనదని గుర్తించగలరు.

పూజయనెడిది ధర్మమునకు గల మరొక అంగము. అనేకవిధములగు ఉపచార సామగ్రితో దైవమును మనఃపూర్వకముగా ఆరాధించెడి క్రియను పూజయని యందురు. పూజను రెండు విధములుగా విభజింప వచ్చును. మొదటిది బహిరంగ పూజ. రెండవది యంతరంగ పూజ. మూర్తి పూజ బహిరంగపూజ యగును. ఇష్టలింగ పూజయు నొక విధమైన మూర్తి పూజయే.

చంచలమైన మనస్సును నిలుకడకు తెచ్చుటయే బాహ్య పూజయొక్క పరమార్థము. ఇష్టలింగపూజను చేయుచు మనస్సును స్థిరీకరించవలెను. తదనంతరము, నుపచారములతో నిమిత్తము లేకుండగ నిష్టలింగముపై దృష్టిని నిలిపి దృష్టి యోగము ద్వారా అంతరంగ పూజను సలుపవలెను. రెండును అనివార్యములే. బాహ్యపూజకు పరిమిత సమయమును కాని అంతరంగ పూజకు విశేష సమయమును వ్యయము చేసిన యెడల నుత్తమమైన ఫలితములు లభించగలవని గ్రహించగలరు.

పూజానంతరము వచ్చెడి ధర్మాచరణమే జపము. "తజ్జపః తదర్థ భావనమ్" అనెడి యోగ శాస్త్రోక్తి ప్రకారము భగవంతుని నామము యొక్క అర్థాను సంధానమే జపము. జపములోన భగవాన్నమము యొక్క నిరంతర స్మరణ జరుగుచుండును. ఇదియు వొక నామాభ్యాసమని యనబడుచున్నది. జపమును చేయగా చేయగా చివరన భగవంతునితో సామరస్య స్థితి యేర్పడును. నిరంతర జపము వలన వినూత్న శక్తులు సంప్రాప్తమగునని తెలుపబడినది. జపము వలన జపము చేసెడి వారికి నిర్మలత్వము సిద్ధించును. సమస్త దోషములు తొలగిపోవును. "జపతోనాస్తి పాతకమ్" అని చెప్పబడినది. అందుచేత ప్రతి యొక్కరు వ్యక్తిగతముగా కాని, సామూహికముగా కాని జపమును చేయుచుండవలెను. జపమాచరించు ఆచరణను జపయజ్ఞమని యందురు. అన్ని యజ్ఞముల కంటెను ఇదియే శ్రేష్ఠమైనదని చెప్పబడినది. జాతి, వర్ణ, లింగ, ధనిక, పేద వివక్షతలతో ప్రమేయము లేకుండా నెవ్వరైనను జపయజ్ఞమును చేసి సత్ఫలితములను పొందవచ్చును.పదార్థనష్టముకు గాని జీవ హింసకుగాని ఆస్కారము లేని యీ జప యజ్ఞమును చేసి ధన్యతను పొందవలెను.

జపము త్రివిధములుగా నుండుననియును, మానసిక జపమే యుత్తమమైనదనియును అంగషట్ స్థలములలోన యింతకంటెను క్రితమున తెలుపబడినది. మీరెల్లరు నుపాంశు, వాచిక జప పద్ధతులను వీడి మానసిక జపము వైపు మొగ్గును చూపవలెను. ప్రారంభములో నియ్యది సుసాధ్యము కాదు. మిగిలిన పద్ధతులతో సాధనను ప్రారంభించి సాధన పరిపక్వతను పొందిన దశలో మానసిక జపమును చేయుట మంచిది.

ధ్యానమనెడిది మరొక ధర్మాంగము. దేవుని గురించిన నిరంతర చింతనయే ధ్యానమని తెలుపబడినది. ధ్యానము వలన దుఃఖములన్నియును తొలగిపోవునని తెలిసికొనగలరు. "తత్ర ప్రత్యయైకతా నతా ధ్యానమ్" అని యోగ శాస్త్రము తెలుపుచున్నది. భగవంతుని చింతన చేయు సమయములో మీరే యితర చింతనను తీసుకొని రావలదని యీ సూత్రము చెప్పుచున్నది. చిత్తైకాగ్రత ముఖ్యమైన దని గుర్తించగలరు. ధ్యానమ ఖండముగా నుండవలెననెడిది గ్రహించవలసిన విషయము. "ధ్యానం స్యాత్ షష్ఠి నాడికమ్" అని స్కంద పురాణములో చెప్పబడినది. 24 గంటల కాలము వరకును చిత్తైకాగ్రతతో చింతన చేయవలెనని యీ సూచన వలన తెలియుచున్నది.

ఇంత వరకు చెప్పబడిన ధర్మాచరణులనెవ్వడు నిష్ఠతో చేయుదురో వారే ధార్మికులని గ్రహించవలెను. శ్రీ రేణుక భగవత్పాదులు చెప్పిన యటుల ధర్మము నాచరించి ధన్యతను బడయుదురు గావుత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

# విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యుల వారు పూజ, జప ధ్యానముల గురించిన వివరణను నాశీర్వచన రూపమున కటాక్షించిరి.

పూజాజపధ్యానములు వీరశైవమున కాయువు పట్టు వంటివి. ఈ మూడింటి కవినాభావ సంబంధము గలదు. వీటి ప్రాముఖ్యత దృష్ట్యా, ఆగమ విదులు శివపూజకు వీరశైవమున కభేదమును ప్రకటించిరి. వీరి భావనకు వీరాగమమే యాధారమని చెప్పవచ్చును. వీరాగమము వీరశైవమున కిచ్చిన నిర్వచనమును గమనించుడి :

**యో హస్త పీఠే నిజలింగమిష్టం**
**విన్యస్య తల్లీన మన ప్రచారః।**
**బాహ్యక్రియా సఙ్కుల నిస్పృహాత్మా**
**సమ్పూజయత్యఙ్గ స వీరశైవః॥**

కరపీఠమున యిష్టలింగము నిడికొని, ఆ లింగమున మనస్సును లీనము చేసి, చిత్తైకాగ్రతతో శివపూజను చేసెడి వాడే వీరశైవుడని చెప్పబడినది. "ఉపచారైః బహువిధైర్లింగం సంహాసనే యజేత్" అనియును, మంత్రయంత్ర క్రియా ముద్రా న్యాసావాహకాదిభిః యజెల్లింగం" అనెడి నియమములు వీర శైవునకు వర్తించవని గ్రహించగలరు. ఇష్టలింగమును కరపీఠమున పెట్టికొని మనస్సును దానిలో లయము చేసి, పంచాక్షరిని జపించుచు శివయోగము నాచరించుటయే శివపూజ యని తెలుపబడినది. శ్రీ జగద్గురువుల వారీ విషయమునొక్కి చెప్పిరనెడిది మరువరాని విషయము. మహాన్యాస రుద్రాభిషేకాదులు శుద్ధశైవలక్షణములనియును, వీరశైవులకు నంతర్లింగార్చనయే విహితమైనదని తెలిసికొనగలరు. ఆసక్తిగలవారు పూజా విధిలో రుద్ర నమకచమకములు నుపయోగించవచ్చును.

**"యస్తు లింగార్చనం త్యక్త్వా దేవమన్యత్ర పూజయేత్-రత్నం విహాయ మూఢాత్మా యథా రౌల్య మపేక్షయేత్"** అనెడి శివగీతోక్తి లింగపూజను విధిగా చేయవలెనని నిర్దేశించుచున్నది.

**"గచ్ఛం స్తిష్ఠం శ్చరవ్యాపి శయానోవా న్యకర్మణి।**

**పాతకేనాపి యుక్తోవా ధ్యానాదేవ విముచ్యతే"** అనెడి శివగీతోక్తియును, శివ ధ్యానతో భూత్వా శివలింగాంగ సంయుతః శివేతర పరిత్యాగీ, ధ్యానయోగీస ఉచ్యతే" అనెడి విబుధోక్తియును శివధ్యానము యొక్క అవశ్యకతను తెలుపుచున్నది.

శివపూజ, సదాచారమున కనుబంధముగా నుండెడి యుత్తమ శీలమునకు సంబంధించినది. వీరశైవుడు విధిగా గురు లింగ జంగములని పూజించవలెనని తెలుపబడినది. సదాచారములోని ప్రసన్న శీలము జప-ధ్యానములను నిర్దేశించుచున్నది. ఈ కారణముననే భగవత్పాదుల వారు పూజా జప ధ్యానములను ధర్మసంగ్రహములో చేర్చెను. శ్రీ భగవత్పాదుల వారి యుపదేశము చేత ప్రభావితుడైన యొక వీరశైవ కవి పూజా జప ధ్యానముల యాచరణను నిర్దేశించుచూ ఈ క్రింది పద్యము చెప్పెను.

**శ్రేయము గూర్చు మంత్రమగు శ్రీశివ మంత్ర జపంబు సల్పుచున్**
**చేయనె యిష్టలింగమున చిత్తము నిల్పి శుభార్చనంబులన్**
**స్వీయమనంబులో శివుని చిన్మయు శ్రీకరు సత్యరూపమున్**
**సోయగమొప్పగా నిలిపి చూపుము భక్తిని మార్గదర్శకా!**

(మార్గం పెద్దవీరప్ప, కవి)

*- శివం భూయాత్ -*

## ఆశీర్వచనము - 6 :

## ధర్మాచార స్థలము :

లింగస్థలమైన మహేశ్వర స్థలాంతర్గతమైన ధర్మాచార స్థలమునందున ధర్మమనగా నేమిటి? అద్దాని యాగమ లెట్టివి యనెడిది తెలిసికొంటిమి. ఈ విషయమున శ్రీ భగవత్పాదుల వారు నగస్త్య మహర్షి కి యుపదేశము నిచ్చుచు, ధర్మాచరణ వలన గల్గెడి ఫలమును గురించి యీ క్రింది విధముగా నుపదేశించిరి.

**శివేన విహితో యస్మా దాగమైర్ధర్మసంగ్రహః।**
**తస్మాత్తమాచరన్ విద్వాన్ తత్ప్రసాదాయ కల్ప్యతే॥** (సి. శి. (16-60)

ఈ ధర్మసంగ్రహము శివుని చేత, శివాగమములో విధించబడి నందున యే విద్వాంసుడు వీటినాచరించునో యతడు తదాచరణవలన శివకారుణ్యమునకు పాత్రుడగుచున్నాడనెడిది యీ యుపదేశములోని భావము.

ఈ సందర్భమున శివాగమముల గురించి తెలిసికొనవలెను. వేదముల పేరు షేయములని చెప్పబడినది. శివాగమము కూడ నట్టివే. శివుని శ్వాస నుండి వేదములును, ముఖము నుండి శివాగమములు బహిర్గతములయ్యెనని తెలియుచున్నది. శివాగమములలోన చెప్పబడిన యీ ధర్మములు శివుని యాజ్ఞలని గ్రహించవలెను. అహింసాదులను పాటించుట వలన శివాజ్ఞను పరిపాలించిన వారమౌదుము. తత్ఫలితముగా శివానుగ్రహము సిద్ధించును అందుచేత ప్రతి యొక్కరు ధర్మాచరణ చేసి శివానుగ్రహమును పొందవలెను. తద్వారా లింగాంగ సామరస్యమును సాధించు దిశలో పయనించగల్గుదురు.

ధర్మాచరణ చెయ్యని వాడు పశుతుల్యుడని చెప్పబడుచున్నాడు. అధర్మాచరణ గురించి యెంత మేరకు ప్రవృత్తులగుదురో అంతమేరకు ధర్మాచరణములోన ప్రవృత్తులగుట లేదు. "ధర్మంచర" యనెడి యుపదేశమును పాలించెడి వారు చాల తక్కువ సంఖ్యలో నుందురు. ఇట్టి సగటు మనిషి స్వభావమును గురించి యొక సుభాషితకారుడీ క్రింది విధిన సెలవిచ్చెను.

**ఆశ్చర్యమేతద్ మనుష్యలోకే**
**అమృతం పరిత్యజ్య విషం పిబన్తి।**
**ధర్మంప్రసంగాదపింనాచరంతి**
**పాపం ప్రయత్నేన సమాచరంతి॥**

అమృతమును వీడి విషమును త్రాగుచు, అప్రయత్నముగా నైనా ధర్మము నాచరించక, ప్రయత్నపూర్వకముగా పాపమును చేసెడి మనుజుల మనోప్రవృత్తియు నాశ్చర్య కరముగా నున్నదనెడిది యీ సుభాషితములోని భావము.

వీరశైవుడు ధర్మాచరణ నే విధిన చేయవలయునో, అనెడి దానిని శ్రీ రేణుక భగవత్పాదుల వారీ క్రింది విధిన సెలవిచ్చిరి.

**అధర్మం నస్పృశేత్ కించిద్ విహితం ధర్మమాచరేత్।**
**తం చ కామవినిర్ముక్తం తమపి జ్ఞానపూర్వకమ్॥** (సి.శి.16-61)

అధర్మమును ముట్ట కూడదనియు, పూర్వోక్త దశ విధ ధర్మములను ప్రతి ఫలాపేక్ష రహితముగను, జ్ఞాన సహితముగను నాచరించవలెననెడిది యీ యుపదేశము లోని సారాంశము.

అధర్మాచరణ నిమిత్తమై ప్రేరణలు బహువిధములుగా నుండును. కించి న్మాత్రలో నధర్మాచరణ చేయుటలో దోష మందదనెడి భావనము రావచ్చును. వత్తిడి యెంత మేరకు నుండిననూ అధర్మాచరణ చింతనను చేయకుండా నుండెడి వాడే ధన్యుడు. ధర్మము నాచరించెడి వారిలో నొక్క బలహీనతను గాంచగలము. ప్రతిఫలాపేక్ష వారిని ప్రలోభచిత్తులుగా మార్చివేయును. నిరాసక్తతయే కర్తవ్యమైయున్నదని గ్రహించగలరు. చాలా మందికి వారు ధర్మము నెందుకు చేయుచున్నారో యనెడిది తెలియదు. యాంత్రికముగా ధర్మాచరణను, చేయుచుందురు. ఇది

యభిలషణీయముగాదు. ధర్మాచరణ గురించిన సకల విధమైన పరిజ్ఞానమును సంపాదించికొని ధర్మాచరణ చేయవలెను. ఈ విషయములన్నింటిని విస్పష్టముగా తెలిపెడి కథ యొకటి పంచతంత్రములో గలదు.

ఒకానొక రాజొక కోతిని పెంచెను. అతడా కోతి నమితముగా ప్రేమించ జొచ్చెను. దాని ఆహార విషయములలో నిర్బంధము లుండవలదని సేవకుల కాదేశములు జారీచేయబడెను.దాని కిష్టమైన ఆహార పదార్థములను, దాని కిష్టమైన విధిని సేవకులు తినిపించుచుండిరి. అది రాజు మీద మమకారము పెంచుకొనెను. రాజును వీడి యొక్క క్షణమైనను నుండజాలకుండెను. భోజన సమయములో నైనన, నిద్రా సమయములోనైనను రాజు దానిని తన వెంట నుంచుకొని ఆయా పనులు చేయుచుండెను.

ఒకనాటి మధ్యాహ్న సమయమున భుక్తాయాసమును తీర్చికొనుటకై తన శయ్యా గృహమున నిదురించుచుండెను. కోతి యతని ప్రక్కన కూర్చుండి యతనికి నిద్రా భంగము గలుగకుండుటకై తగు జాగ్రత్తలను తీసికొనుచుండెను. అంతలోన ఒక ఈగ వచ్చి రాజు మీసము మీద కూర్చుండెను. కోతి యద్దానిని గమనించి చేతితో అదిలించి పారద్రోలెను. ఈగ మరల వచ్చి యదే స్థలమున కూర్చుండెను. కోతి మరల దానిని పారద్రోలెను. ఎన్ని మార్లు పారద్రోలినా ఈగ వచ్చి అదే స్థానమున కూర్చుండెను. కోతి ఎన్ని మార్లు దానిని పారద్రోలినా యీగ మరల మరల వచ్చుచునే యుండెను. ఈగ చేష్టల వలన రాజుకు నిద్రా భంగమగుట తథ్యమని యెంచిన కోతికి పట్టరాని కోపము వచ్చెను. కోతి కోపావేశము నాపుకొనలేక పోయెను. ఈగను చంపి యపద్రవమును నివారించ దలచెను. శయ్యా గృహమునగల పదునైన కత్తిని కైననిడికొని, చేతినెత్తి తన బలమంతయు నుపయోగించి ఖడ్గ ప్రహారము చేసెను. ఈగ చావలేదు. అది తప్పించికొని పారిపోయెను. కాని ఈగ కూర్చుండియున్న రాజుగారి మోము రెండు వ్రక్కలై పోయెను. విల విల నాడుచు నతడు ప్రాణములను వదిలెను. పర్యవసానము నాలోచించకుండగ చేసెడి ధర్మాచరణలు నీకథలోని కోతి చేపట్టిన చేష్టవంటిది. విబుధులిది గ్రహించి ధర్మాచరణము వలన వైపరీత్యములు సంభవించకుండా నుండుట కొరకు తగు జాగ్రత్త వహించవలెను. జ్ఞాన హీనుల కిట్టి చర్యను చేబూనుటయనెడిది దుస్సాధ్యమైన విషయమని గ్రహించగలరు.

ధర్మాచరణ చేసెడి వాని కెట్టి జ్ఞాన సంపద గల్గియుండవలెనో యనెడి దానిని శ్రీ రేణుక భగవత్పాదుల వారీ క్రింది విధముగా తెలియజెప్పిరి.

**ఆత్మవత్ సర్వభూతాని సంపశ్యేద్ యోగవిత్తమః**
**జగదేకాత్మతాభావాన్నిగ్రహాదివిరోధతః॥** (సి.శి. 16-62)

శివయోగీశ్వరుడు శివయోగజ్ఞాన సంపన్నుడై జగదేకాత్మతా భావ సంయుతుడై సకల జీవరాశిని తనవంటివారేనని భావించికొని నిగ్రహానుగ్రహ భావముల కతీతుడై పక్షపాతమును వీడి జగమున ప్రవర్తించుచుండుననెడిదే యీ యుపదేశములోని భావము.

ఎవ్వరికి సర్వాత్మరూపమైన జ్ఞానమును పొందిన వాడు మమకార భావమునకు నవకాశమివ్వడు. ఈ విషయమును వివరించుట కొరకు శ్రీ రేణుక భగవత్పాదుల వారీ క్రింది విధిన నుపదేశించిరి.

**ఏక ఏవ శివః సాక్షాజ్జగదేతదితి స్ఫుటమ్॥**
**పశ్యతః కిం న జాయేత మమకారో హివిభ్రమః॥** (సి.శి. 16-63)

శివుడే ఈ జగత్తు రూపములో నున్నాడనెడి స్పష్టమైన దృక్పథము గల వానికి మమకార భావన యెట్టులనూ గల్గదని యీ యుపదేశమున తెలుపబడినది.

"ఏకమేవాద్వితీయం బ్రహ్మ "యనెడి శ్రుతి వాక్యముల నవగతము చేసికొని జగత్తు, శివుడు,జీవుడు మొదలగునవన్నియును శివుడే యనెడి భావము గల్గిన వానికి యహంకార మమకారము లుండవని గ్రహించగలరు. శివయోగికిట్టి భావములేయుండునని తెలిసికొనగలరు.

ఎట్టి వానికైనను ధర్మాచరణ మనివార్యమైనదని శ్రీ రేణుక భగవత్పాదుల వారు నుపదేశించిరి. ఈ క్రింది శ్లోకమును గనుడి :

**ధర్మ ఏవ సమస్తానాం యతః సంసిద్ధి కారణమ్।**
**నిఃస్పృహోఽపి మహాయోగీ ధర్మమార్గంచ నత్యజేత్॥** (సి.శి. 16-64)

ధర్మమందరికిని సకల సిద్ధులను గల్గుగజేయు సమర్థత గల్గియున్నది. అందుచే విరక్తులును, మహాయోగీశ్వరులునుఅగు యతులు, అనగా శివయోగులు, ధర్మమార్గమును పరిత్యజించవలదనెడిది యీ యుపదేశములోని భావము.

మనుష్యుని సర్వతోముఖమైన యభివృద్ధి కొరకు ధర్మమే సాధనమైయున్నది. ధర్మ మిహపర సుఖములను గలుగజేయును. ఇహమున భోగ భాగ్యములు, పరమున ముక్తి ధర్మాచరణ వలన సుసాధ్యములగుచున్నవి. ఈ కారణము వలననే ధర్మమునకు, చతుర్విధ పురుషార్థములలో మొదటగా చెప్పబడినదైనది. ధర్మమువలననే కామార్థములును, చివరన మోక్షము సంప్రాప్తమగును. ఈ కారణము వలనే యెంతటి యోగీశ్వరుడైనా ధర్మాచరణను త్యజించవలదు.

జ్ఞానామృతము నాస్వాదించిన శివయోగికి ధర్మాచరణ మనావశ్యకమని తలచవలదని శ్రీభగవత్పాదుల వారు తమ యీ క్రింది యుపదేశములో నుపదేశించిరి.

**జ్ఞానామృతేన తృప్తోఽపి యోగీ ధర్మంనసంత్యజేత్।**
**ఆచారం మహతాం దృష్ట్వా ప్రవర్తంతే హి లౌకికాః॥** (సి.శి. 16-65)

శివజ్ఞానమనెడి యమృతమును సేవించి తృప్తిని పొందిన వాడైనను శివయోగి ధర్మమును త్యజించవలదు లౌకికులు గొప్పవారి ననుసరింతురు కదా! అందుచేత లోక హితార్థమై శివయోగి ధర్మము నాచరించ వలెననెడిది యీ యుపదేశములోని భావము.

శివజ్ఞానమనెడిది జీవనపు చివరి లక్ష్యమై యున్నది. ఇద్దానిని పొందినవాడు మరేదియును వాంఛించెడి యావశ్యకత లేదు. కాని, లోకులకు మార్గదర్శిగా నుండుటకై శివయోగి ధర్మాచరణను చేయవలసిన యావశ్యకత గలదు. బియిడి పరీక్ష పాసైన యొక్క వ్యక్తి ప్రాథమిక పాఠశాల యందున నుపాధ్యాయుడుగా నియుక్తుడయ్యెను. అతడు చిన్న పిల్లలకు అక్షరాభ్యాసము చేయించునప్పుడు, వారి సౌకర్యార్థమై తాను కూడా 'అ', "ఆ"లను వ్రాయును, చదువును. స్వతఃగా తన కవశ్యకత లేకుండినను పిల్లల హితమునభిలషించిన వాడైనందున తాను అక్షరములను వ్రాసి, చదివి పిల్లలకు మార్గదర్శకుడగుచున్నాడు. శివయోగియు ఆ కోవకు చెందిన వాడే. పరుల హితమును కోరి తాను ధర్మమునాచరించుచుండును.

పరమశివుని ప్రసాదమును పొందవలసిన వాడు తప్పని సరిగా ధర్మాచరణను చేయవలెనని శ్రీ రేణుక భగవత్పాదులు తమ యుపదేశములోన క్రింది విధముగా తెలియజెప్పిరి.

**సదాచార ప్రియః శంభుః సదాచారేణ పూజ్యతే।**
**సదాచారం వినాతస్య ప్రసాదో నైవ జాయతే॥** (సి.శి. 16-66)

సదాచారమే శివునికి ప్రీతిని గల్గించును. అతడు సదాచారము చేత పూజింపదగినవాడు; సదాచారము లేకుండిన యెడల యతని ప్రసాదము లభించదనెడిది యీ యుపదేశములోని భావము.

వీరశైవ ధర్మములో పంచాచారముల కెంతో ప్రాముఖ్యత గలదు. ధర్మపురుషునికి పంచాచారములు ప్రాణతుల్యములని చెప్పబడినది. ప్రాణము ముఖ్యమైనదని చెప్పబడినది. ప్రాణములేని కాయము కళావిహీనమై శవమై పడియుండును. ఆచారమును పాటించని వాడును ఇట్టి వాడేయని గ్రహించగలరు. పంచాచారములలో సదాచారమొకటి. సదాచారమును పాటించెడి వాడు అహింసాది ధర్మములను తప్పనిసరిగా పాటించవలసి యుండును.

అహింసావాది ధర్మములను పాటించెడి యవశ్యకతను నొక్కి చెప్పెడి యీ క్రింది సుభాషితము గమనార్హమైనదై విరాజిల్లుచున్నది.

**నిశాయాందీపకశ్చంద్రః ప్రభాతే దీపకో రవిః త్రైలోక్య దీపకోధర్మః సుపుత్రః కులదీపకః॥**

కులదీపకుడైన పుత్రుని బడయుటకై తపన చెందని వారుందురే? కాని ముల్లోకములను ప్రకాశమునకు గురి చేసెడి ధర్మము నాచరించ వలెనని కోరెడి వారు కొందరే. రాత్రిని వెలుగులతో నింపెడి చంద్రుని, పగటిని ప్రకాశమానము చేసెడి ప్రభాకరుని ప్రాముఖ్యతను గుర్తించినను, ముల్లోకములను వెలుగులతో నింపెడిధర్మము యొక్క ప్రాముఖ్యత గుర్తించని వారి సంఖ్య యధికముగా నుండును.

ధర్మాచారస్థలమున నుపదేశింపబడిన దశ విధ ధర్మములను ముఖ్యమైనవని యెంచి వాటిని పాటించి సుఖమయమైనజీవితమును గడుపుదురు గాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

ధర్మాచార సంగ్రహము నెల్లరూ ఆచరించవలెనని శ్రీ కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు ప్రబోధించిరి.

శ్రీ భగవత్పాదుల వారు ప్రతిపాదించిన ధర్మసంగ్రహము వేదాగమోపనిషత్తులలోని ప్రమాణములకను గుణముగా నున్నదనెడిది నిర్వివాదమైన యంశము. అయితే జ్ఞానోత్తర దశలో నుండెడి వారికిని, యోగీశ్వరులకును నియ్యది యనుసరణీయమా యనెడిదొక ముఖ్యమైన ప్రశ్నే యని భావించవచ్చును. వీరు వీటిని పాటించెడి యవశ్యకత లేదనెడి వాదములుగలవు. అదే విధముగా, లింగమహేశ్వర స్థలి పాటించదగిన యీ నైతికాచరణల వలన లింగమహేశ్వర స్థలములో నుండెడి శివయోగులకు గల్గెడి ప్రయోజన మెట్టి దనెడి ప్రశ్న తలయెత్తును.

మానవుడు చిత్తనైర్మల్యము లేనివాడై, చిత్తచాంచల్యము గలవాడై విషయోపభోగ తత్పరుడగుచున్నాడు. హింసాది దుర్గుణములను పెంచి పోషించి దురాచారి యగుచున్నాడు.

లింగమహేశ్వరుడు దుర్వ్యసని, దురాచారియై పతనమయ్యెడి యవకాశము కలదు. సాంగత్య దోషము వలన నిట్టి పరిణామము గల్గును. ఈ స్థితి నుండి మహేశ్వర స్థలిని రక్షించెడి బాధ్యతను స్వీకరించెడి క్రమములో శివుడు లింగ స్థలియై లింగమహేశ్వర స్థలమున ధర్మాచార స్థలముగా పొడచూపును. పరస్థలియై ధర్మసంగ్రహములోని నైతిక సూత్రముల నాచరణలో పెట్టును. ఆచరించెడి వారికి ప్రసన్నుడగును. ఈ విధముగా చేయుట వలన సదాచారము విశ్వవ్యాప్త విశిష్టాచార స్వరూపము దాల్చును. అద్దానిని ఆచరించెడి వారు ధన్యులగుదురు. ఆచరించని వారు దౌర్భాగ్యులగుదురని సీతాపహరణోదంతము తెలియజెప్పుచున్నది. దురాచారిని రక్షించుట కొరకు శివుడైనను వెనుకంజ వేయుననెడిది రావణ సంహారోదంత మభివ్యక్తముచేయుచున్నది. ఈ విషయమును మన యెరుక లోనికి తెచ్చెడి శ్రీ బసవేశ్వరుల వారు ఈ క్రింది వచనము గమనార్హమైనది.

**సదాచార సద్భక్తి యిల్లదవర నొల్లనయ్యా!**
**అపరాధనే దండ**
**నిచ్చ నిచ్చ ప్రాయశ్చిత్తర నొల్ల**
**కూడల సంగమదేవ, భూభారకర,** (వ.సు. 650)

ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి:

**సదాచారము సద్భక్తి లేని వారి నొల్లనయ్యా**
**అపరాధనా దండము**
**నిత్య నిత్య ప్రాయశ్చిత్తుల నొల్ల**
**కూడల సంగమ దేవ, భూభారకుల**

సదాచారమున కనుబంధముగా కొన్ని నియమములు విధింపబడినవని తెలియుచున్నది. నియమముల నెట్టి వారైననూ పాటించవలెననెడి పాల్కురికి సోముని క్రింది పద్యమును గనుడి :

**ఎట్టి వ్రతస్థుండైనను**
**నెట్టి మహాభక్తుడైన నెన్నగబడు దా**
**బట్టిన నియమంబులు తుద**
**ముట్టినచో బీరువోకమున్నె మహాత్మా!** (అనుభవసారము, ప. 74)

అహింసాస్తేయాది నియమములు నెట్టి మహాభక్తులైననూ పాటించవలెననెడిదే గ్రహించవలసిన విషయము. ఈ సందర్భమున "జ్ఞానామృతేన తప్తోపి యోగీ ధర్మంన సంత్యజేత్" అనెడి రేణుకోక్తి (సి.శి.16:65) స్మరణీయమని గ్రహించగలరు. యోగియైనా మహాజ్ఞానియైనా ధర్మసంగ్రహమును త్యజించవలదనెడిదే రేణుకోక్తి లోని భావము.

*– శివం భూయాత్ –*

# భావాచార స్థలము

## ఆశీర్వచనము - 1 :

ధర్మాచార స్థలమును గురించి తెలిసికొనిన పిదప భావాచార స్థలము గురించి తెలిసికొన వలసిన యావశ్యకత గలదు.

శ్రీ అగస్త్య మహర్షికి భావమనగా నేమిటి; యనెడి దానిని శ్రీ భగవత్పాదుల వారు క్రింది విధముగా నుపదేశించిరి:

**భావయేవాస్యసర్వేషాం భావాచారః ప్రకీర్తితః।**
**భావో మానస చేష్టాత్మా పరిపూర్ణః శివాశ్రయః॥** (సి.శి. 16-67)

ఈ ధర్మాచార సంపన్నుడైన శివయోగి యొక్క భావమే యితరులకై భావాచార మగుచున్నదనియు, భావమనగా పరిపూర్ణముగా శివుని ఆశ్రయించి యుండెడి శివయోగి యొక్క మానసిక చేష్ట అనియు, గ్రహించవలెననెడిదే యీ యుపదేశములోని సారాంశము.

ఎవ్వరేపనిని చేయదలచినను మనస్సు యొక్క సహాయము కావలెను. క్రియను చేయునప్పుడు మనస్సు యొక్క సంపూర్ణమైన సహకారముండిన యెడల నా క్రియ యోగముగను లేదా కర్మ యోగముగా కీర్తింపబడును. కర్మయోగమనగా మనఃపూర్వకముగా చేసెడి కర్మయని గ్రహించగలరు. కర్మలను చేసెడి వారికి కొరత యుండదు. కర్మను పూర్వకముగా చేసెడి వారి సంఖ్య తక్కువగానే వుండును. శ్రీ భగవత్పాదుల వారు క్రియలను మనఃపూర్వకముగా చేయవలెనని నొక్కి చెప్పుటకే భావాచార స్థలము గురించి యుపదేశము నిచ్చిరి.

ఉండ్రాళ్లు వండునప్పుడు బెల్లమును వేయవలెను. అది లేనిచో చక్కెర వంటి యితర పదార్థములను కలుపవలెను. లేని యెడల మాధుర్యము లోపించును. తినెడి వ్యక్తికి అట్టి యుండ్రాళ్లు తృప్తిని యివ్వజాలవు. అటులనే భావపూర్వకముగా చేయబడెడి క్రియలు భగవంతునికి ప్రీతికరములు కావని గ్రహించగలరు.

భావనా విహితమైన ధర్మము పరమ పవిత్ర మైనదని తెలిపెడి యీ భగవత్పాదుల వారి యుపదేశమును గనుడి :

**భావనా విహితం కర్మ పావనాదపి పావనమ్।**
**తస్మాద్ భావనయా యుక్తం పరధర్మం సమాచరేత్॥** (సి.శి. 16-68)

భావనా సహితమై శివపూజాదులు పవిత్రమైన వాటికంటెను పవిత్రమైన వైనందున భావ యుక్తముగా ధర్మాచరణను చేయవలెను. అనెడిది యీ యుపదేశములోని సారాంశము.

భావశుద్ధి మనః శుద్ధులు నవినాభావ సంబంధము గల్గిన యంశములుగా గుర్తించవలెననెడిది శ్రీ భగవత్పాదుల వారి యాశయమైయున్నది. యీ క్రింది యుపదేశమును గనుడి.

**భావేన హి మనఃశుద్ధిర్భావసుపిద్ధిశ్చ కర్మణా।**
**ఇతి సంచింత్య మనసా యోగీ భావం న సంత్యజేత్॥** (సి.శి. 16-69)

భావము చేతనే మనః శుద్ధి సంప్రాప్తమగుననియును, అట్టి భావము శివపూజాదుల వలనశుద్ధమైనదగునని యోచించికొని శివయోగి భావమును త్యజించకుండ నుండవలెననెడిదే యీ శ్లోకములోని సారాంశము.

శాస్త్రములు ధర్మకార్యములను చేయుటకై ఆజ్ఞ నిచ్చుచున్నది. ఆజ్ఞ పాలించునప్పుడు ఆ వ్యక్తి శ్రద్ధా భావసమన్వితుడై యుండిన యెడల, ధర్మ కార్యము హెచ్చు ఫలకారిగా కాగలదు. మనస్సును పెట్టకుండగ, యాంత్రికముగా చేయబడెడి కార్యములు నిరర్థకములగును.

భావన యనగా మనస్సున దాల్చుట యని తెలిసికొని యుంటిమి. మనస్సున భగవంతుని దాల్చికొనిన యెడల మనస్సు పవిత్రమైనదగును. మనస్సు నందున విషయములను దాల్చిన యెడల నయ్యవి మనస్సును అపవిత్రము చేయును. ఆకాశము నుండి పడిన నీరు ఏ వర్ణపు భూమితో

సంపర్కమును పొందునో ఆ రకపు వర్ణమును దాల్చును. ఎరుపు నేల మీద పడిన నీరు ఎర్రగాను, నల్లరేగడి మీద పడిన నీరు నలుపు వర్ణమును దాల్చుటను మన మెరుగుదుము. మనస్సులోని భావము వాన నీటి వంటి దని గ్రహించగలరు. ఈ కారణము వలన, మనస్సు నెల్లప్పుడు పవిత్రమైన భావములతో నింపియుంచవలెను.

శివ భావము చేత చేయబడెడి కర్మాచరణ వలన కర్మబంధము లేర్పడవని శ్రీ భగవత్పాదుల వారు తెలియజేసిరి. వీరి యుపదేశమును గనుడి.

**శివభావనయా సర్వం నిత్యనైమిత్తికాదికమ్।**
**కుర్వన్నపి మహాయోగీ గుణదోషైర్న బాధ్యతే।** (సి.శి. 16-70)

శివభావముతో చేయబడెడి నిత్యనైమిత్తి కాది కర్మల నాచరించుట వలన గల్గెడి గుణదోషముల చేత శివయోగి బాధింపబడడనెడిది యీ శ్లోకములోని సారాంశము.

కర్మాచరణ తప్పనిసరియని శాస్త్రములు నిర్దేశించుచున్నవి. కామ్య కర్మలను తప్పనిసరిగా చేయవలెననెడి సూత్రము లేదు. నిషిద్ధ కర్మలను చేయకూడదనెడి నియమము గలదు. కర్మాచరణము వలన బంధములేర్పడి పునర్జన్మాదులు కలుగుచున్నవని తెలుపబడినది. శివయోగికి యెట్టి ప్రతి బంధకము లుండవు. లోక హితార్థమై, శివభావముతో కర్మలను చేయుట చేత కర్మ ఫలము నుండి విముక్తిని పొందును. శివుడే కర్తయనియు, చేసెడి కర్మ శివప్రేరణ వలన జరుపబడెడిదనెడి భావమును వహించెడి శివయోగికి కర్మాచరణ ప్రతిబంధకము కాజాలదని గ్రహించగలరు.

శివయోగి చేసెడి నిత్యకర్మ, ప్రాకృతులు చేసెడి నిత్య కర్మకంటెను భిన్నమైనదై యుండునని తెలుపుచు శ్రీ భగవత్పాదుల వారు సంధ్యా వందనమును నొక యుదాహరణగా గైకొని యీ క్రింది యుపదేశమునిచ్చిరి.

**అంతః ప్రకాశమానస్య సంవిత్ సూర్యస్య సంతతమ్।**
**భావేన యదుపస్థానం తత్ సంధ్యావందనం విదుః॥** (సి.శి. 16-71)

హృదయాంతర్గతము నందున గల చిదాకాశమున వెలిగెడి చిత్ సూర్యుడై శివయోగికి వందన స్థానమై యుండుననెడిది యీ యుపదేశములోని సారాంశము.

ప్రాయః సంధ్యావందనము మూడు విధములుగా నున్నది అవి : ప్రాతః సంధ్యావందనము, మధ్యాహ్న సంధ్యావందనము, సాయంకాల సంధ్యావందనము. అరుణోదయ, మధ్యందిన మరియు సూర్యాస్తమయ సమయముల యందున చేసెడివే సంధ్యా వదనములు. ఇవి బాహ్యాకరమైన సంధ్యా వందనములు. శ్రీ పూజ్య పాదులంతరంగపు సంధ్యావందనము గురించి తెలియజేసిరి.

బ్రాహ్మణాదులు సూర్యుని యుపాసన చేయుదురు. సంధ్యావందనమనగా వారికి సూర్యోపాసనయే. వీరశైవ ధర్మీయులు సంధ్యా సమయమున యిష్టలింగార్చనను గావింతురు. త్రికాలేష్టలింగ సమర్చనమే వీరశైవులకు విహితమైన సంధ్యా వందనమనిగ్రహించగలరు. శివయోగి యిష్టలింగార్చన చేసిన పిదప హృదయకమలమున గల చిత్ సూర్యుని యుపాసన చేయుదురు. చిత్ సూర్యుడనగా శివజ్ఞాన మనెడి శివప్రకాశమును శివయోగులు త్రికాల సంధ్యా సమయమున నుపాసన చేయుదురని తెలిసికొనవలయును.

నిరంతరము శివధ్యానములో నుండుటయే శ్రేష్ఠతమమైన ధర్మము. కొన్ని సందర్భములలో నియ్యది యసాధ్యము కావచ్చును. అందుకే త్రికాల సంధ్యావందనము చేసెడి ఆచారమును పాటించవలెనని నిర్దేశింపబడినది.

మానవుని ప్రాణమెంతో ముఖ్యమైనది. శ్వాస క్రియ జరిగినంత మేరకే ప్రాణము నిలుచును. దినమునకు 21,600 (ఇరువది యొక్క వేల ఆరువందల) మార్లు శ్వాసపీల్చి వదులుచున్నది. దీనికాటంకమేర్పడకూడదు. జాగరూకులమై యున్నప్పుడు మనము తగు జాగ్రత్తలను గైకొందుము. నిద్రా సమయమున నయ్యది సాధ్యము కాదు. అందుచేత నద్దానిని శివుని బాధ్యతగా భావించికొని పరుండెదము. అతని దయ వలన ప్రాణము నిలిచి యున్నందున కృతజ్ఞతా పూర్వకముగా ప్రాతః సంధ్యావందనము చేయవలెనని గ్రహించగలరు. శరీర పోషణకు భోజన మవసరము. అందుచేత భోజన మమృత ప్రాయమై శరీర పోషణాదుల చేయవలెననినచో శివ కారుణ్యమవశ్యముగా కావలెను. ఈ కారణముననే మిగిలిన సంధ్యావందనములను చేయవలెను.

కొందరు సంధ్యావందనమును సంకుచితార్థములో తీసికొని యద్దానిని యాచరణీయము కాదని నుడువుదురు. విశాల దృక్పథముతో చూసిన యెడల త్రికాల సంధ్య యనగా త్రికాలములలో శివపూజను చేయుటయే గాని, గాయత్ర్యాదుల యుపాసన కాదనియును తెలియవచ్చును. గాయత్రిని చేయుట విహితము కాదనెడిది సత్యమే. ఆ ఉపాసన సాధనమున యిష్టలింగోపాసన చేయుట విహితమే యని తెలిసికొనగలరు.

శ్రీ రేణుక భగవత్పాదుల వారు నుపదేశించిన సంధ్యావందన మెంతో విశిష్టమైనదై యున్నది. బాహ్యమున నున్న సూర్యునికి నుదయాస్తమయంబులు గలవు. అందుకే కాల నిర్ణయము చేయబడినది. హృదయాకాశమున ఉదయించిన జ్ఞాన సూర్యునకస్తమయముండునే? ఉదయించిన క్షణము నుండియే అద్దానితో ననుసంధానమును చేసి కొనుటయే శ్రీ భగవత్పాదుల వారి యుపదేశములోని కేంద్రాంశము. శివోహమనెడి భావన గల్గిన క్షణమే జ్ఞాన సూర్యోదయమైనదని గ్రహించగలరు. ఇట్టిజ్ఞాన ప్రకాశము చేత హృదయము నిర్మలమై భావము పరిశుద్ధమగును. ఈ సాధన వలన గల్గెడి ఫలము ప్రాకృతాచారమున విధింపబడిన సంధ్యావందనము వలన గల్గెడిఫలము కంటెను నుత్కృష్టమైనదై యుండునని గ్రహించగలరు.

లోకాచారమున ప్రచారములో నున్న హోమమనెడి నిత్యకర్మయెడల శివయోగి యొక్క వైఖరి యే విధముగా నుండుననెడి దానిని తెలుపుటకై శ్రీ భగవత్పాదుల వారు తమయుపదేశము నీ క్రింది విధముగా సెలవిచ్చిరి.

**ఆత్మజ్యోతిషి సర్వేషాం విషయాణాం సమర్పణమ్।**
**అంతర్ముఖేన భావేన హోమకర్మేతి గీయతే॥** (సి.శి. 16-72)

ఆత్మజ్యోతి యనెడి చిదాగ్నిలో విషయము లన్నింటిని సమర్పణ చేయుచు అంతర్ముఖియై యుండుటయే శివయోగి చేసెడి హోమమని యీ యుపదేశమున తెలుపబడినది.

యజ్ఞ యాగాదుల గురించి విభిన్నమైన యభిప్రాయములు కలవు. పదార్థనష్టము అనెడి కారణమును చూపెడి వారు హోమాది కర్మలను తిరస్కరింతురు. యజ్ఞము వలన వర్షము కురిసి లోక సంక్షేమము చేకూరుననెడి వారును గలరు. యజ్ఞములు చేయునప్పుడు అన్న దానాదులు నిర్వహించుట చేత నయ్యది లోకోపకారి యనెడి వారును గలరు.

యజ్ఞము త్యాగమునకు చిహ్నమనియును, యజ్ఞమున, సమర్పించెడి పదార్థములు సమిష్టి సంక్షేమము చేకూర్చుననెడి వారును గలరు.

వీరశైవమున అగ్నిముఖార్చన విహితము కాదు. పదార్థ సంచయమును జంగమయ్యలకు దాసోహభావమున సమర్పించవలెననితెలుపబడినది. భక్త కోటికి దాసోహము చేసిన యెడల కోటి యజ్ఞములు చేసిన ఫలము లభించునని తెలుపబడినది.

ఏదియేదైనను అంతర్ముఖియై ఆత్మజ్యోతిలోని చిదగ్ని విషయ వికారములు సమర్పించెడి వాని హోమ క్రియకు మించిన హోమక్రియ మరొక్కటియుండదని గ్రహించగలరు. శివయోగి యనుసరించెడి యీ భావయుక్త ధర్మాచరణమే యనుసరణీయమని గ్రహించగలరు.

ప్రతి యొక్కరు తమ ఆత్మజ్యోతిని వెలిగించికొని, అద్దానిలోని చిదగ్నిలో తమతమ విషయ సమిధలను వ్రేల్చి, శివప్రీతి కరణమైన ధ్యాన జప యజ్ఞములను నిర్వహించుటలో శ్రేయస్సు గలదు. ఆ రహస్యమును గ్రహించి తమ తమ జీవితములను ధన్యతమము చేసి కొందురు గావుత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు భావపూర్ణమైన కర్మాచరణము యొక్క ప్రాముఖ్యతను వివరించిరి.

"భావోమానసచేష్టః" అనెడి ఆచార్యోక్తి (సి.శి.16:67) ప్రకారము భావమనెడిది మానసిక వ్యాపారమని తెలియుచున్నది. ఇయ్యది పరిపూర్ణముగా శివాశ్రితమైనదైయుండినచో దీనిని శివభావమన వచ్చును. "భావనా రహితం కర్మ పావనాదపి నిష్ఫలమ్" అనెడిది విజ్ఞుల విశిష్టాభిప్రాయము. ఇద్దానిని గుర్తించిన వారెందరో గలరు. ధర్మాచారమును భావాచార రహితముగా చేసెడి వారు గర్హనీయులని శ్రీ బసవన్న వారి వచనము వలన తెలియుచున్నది.

**నూరనో నూరకేళిదడేను?**
**ఆసె హరియదు రోష బిడదు.**
**మజ్జన కెరెదు ఫలలేను?**
**మాతినంతె మన విల్లద జాతి డొంబర నోడి**
**నగువ నమ్మ కూడల సంగమదేవ.** (వచనము సం. 651)

దీని తెలుగు రూపమును గనుడి :

**నూటిని చదివి నూటిని వినిన నేమి?**
**ఆశ పరియదు, రోషము విడదు**
**మజ్జనము కెక్కించిన ఫలమేమి?**
**మాట వంటి మనము లేని దొమ్మరుల జూచి**
**నవ్వు మా కూడల సంగమ దేవుడు.**

ఇష్టలింగమును పూజించెడి విధి విధానములో జలాభిషేకమనెడిదొక అంతర్భాగము. మనస్సును లింగములో లీనము చేయకుండగ జేసెడి యభిషేకము వలన ఫలముండదని బసవన్న వారు నుడివిరి. భావాచార రహితమైన శివాచారము వలన ఫలముండదనెడిదే గ్రహించవలసిన విషయము.

భావము శివమయము కావలెను. పూజాక్రియ శివుని కొరకే యనియును, పూజా క్రియయూ శివుడే యనియును తాను కూడా శివుడినే యనెడి మనో వృత్తిని పెంచికొని ఆచరించెడి ధర్మాచారము సత్ఫలితములనిచ్చును. నిస్సంగత్వము సిద్ధించును. తద్వారా నిర్మల తత్త్వమును దర్శించవచ్చును. **"ఆత్మనామఖిలం వస్తు శివమానన్ద చిన్మియమ్ ఏక భావేన సతతం సమ్యశ్యన్నేవ పశ్యతి"** అనెడి ఆచార్యోపదేశమమృత తుల్యమైనది. శివుడనెడి నిర్మలతత్వమును వీక్షించుటకు, శివుడు జగత్తు జీవులకు ఏకత్వమును దర్శించవలెననెడిదే గ్రహించవలసిన విషయము. నిర్మలమైన శివతత్త్వమును వీక్షించిన వాడు జీవన్ముక్తిని సాధించునని యుపనిషద్వాజులు చెప్పిరి. అయితే యిట్టి అభేద భావనతో ధర్మాచారము నాచరించుట యనెడిది సులభసాధ్యమైనట్టిది కాదు. శివజ్ఞాన మనెడి సంవిత్ సూర్యునికి వందన మాచరించి, జ్ఞానమనెడి ఆత్మాగ్నిలో విషయముల దగ్ధము చేసి, తాను చేసెడి నిత్యనైమిత్తికాదులన్నియును శివప్రీతి కొరకై చేసెడివని నమ్మినచో లక్ష్యసిద్ధి గల్గును. చేసెడి కార్యము యొక్క స్వభావము గురించిన చింతన శివునిలోనే లీనము చేయవలెను. కార్యాకార్యముల చింతను శివునికే వదిలివేయవలెను. ఈ విషయము బసవపురాణములోన యీ క్రింది విధముగా తెలుపబడినది.

**అణిమాది సిద్ధులు నాతని బంట్లు**
**గణుతింపవింత లింగ సదర్థుదయ్యు**
**బట్టిన నియమంబు బాయక కన్న**
**పెట్టినర్థమె కాని ముట్టదు సేత**
**"నిదిగు మార్గము భక్తియె యనవలదు**
**ఇదియె సన్మార్గ మెట్టులంటేని"**
**తానీశ్వరార్థమన్తలఘునజేసి**
**ధర" నధర్మో ధర్మతాంవ్రజేత్తనగ**
**హరుని వాక్యముగాన యట్టిద పథము.** **(బ.పు. పంచామాశ్వాసము)**

*– శివం భూయాత్ –*

## ఆశీర్వచనము - 2 :

## భావాచార స్థలము :

భావాచార స్థలము గురించి క్రిందటి యాశీర్వచనము తెలిసికొంటిమి. నిత్య నైమిత్తకములను చేయవలెననియును వాటి నాచరించుట వలన దోషముండదని తెలిసికొంటిమి. కర్మ ఫలము నుండి విముక్తిని పొందుటకై యెట్టి మనోభావమును గల్గియుండవలెననెడి విషయమును గురించి శ్రీ భగవత్పాదుల వారు తమ యుపదేశము నిచ్చిరి. గమనించుడి.

**భావయేత్ సర్వకర్మాణి నిత్యనైమిత్తికాని చ।**
**శివప్రీతి కరాణ్యేవ సఙ్గరాహిత్య సిద్ధయే॥** (సి.శి. 16-73)

సంసార బంధముల నుండి నివృత్తిని పొందుటకై నిత్యనైమిత్తికాదులను చేయునప్పుడు నియ్యవి శివప్రీతి కొరకు చేయబడుచున్నవని భావించి కొనవలెననెడిదే యీ శ్లోకములోని సారాంశము.

**"గహనా కర్మణాగతిః"** అని చెప్పబడినది.

కర్మయొక్క గతి రహస్యముగా నుండు ననెడిది దీని అర్థము. కర్మసూత్రము చేత బంధితుడైన వాని గతియును నెల్లప్పుడు దుర్భేద్యముగా నుండును. ఏమి కానున్నదో అనెడి దెవ్వరును తెలిసికొనలేరు. కర్మాచరణ వలన గల్గెడి బంధముల నుండి విముక్తిని పొందుట అత్యంత దుర్లభమైన విషయము. తన్నిమిత్తమై కర్మలను చేసెడి వాడు శివభావ పరిపుష్టిని పెంచికొనవలెను. చేసెడి కర్మ శివప్రీతి నిమిత్తము చేయబడుచున్నదనియును, కర్మాచరణ ఫలము శివునికే చెందుగాక యనియును మనమున దాల్చి కర్మల నాచరించవలెను. ఈ యంశమును వీరశైవులు గుర్తించవలెను.

నిస్సంగత్వమెటుల సిద్ధించుననెడి సందేహము గల్గెడి యవకాశము కలదు. శ్రీ రేణుక భగవత్పాదుల వారీ విషయము గురించి యీ క్రింది విధిన యుపదేశము నిచ్చిరి.

**శివే నివేశ్య సకలం కార్యాకార్యం వివేకతః।**
**వర్తతే యో మహాభాగః స సంగరహితో భవేత్॥** (సి.శి. 16-74)

వివేకవంతుడు తాను చేసెడి కర్మలో నిమిడి యున్న కార్యాకార్య స్వభావమును, తత్ఫలమును శివునికి సమర్పణ చేయుట. ఆ విధిన చేయుటవలన నిస్సంగత్యము ప్రాప్తించునని యీ శ్లోకము తెలియజేయుచున్నది.

జగత్తులో నివసించుచు, కర్మకార్యముల నాచరించుచు, సంసార బంధములకు కట్టుబడకుండక యుండుట యనెడి దందరికి సుసాధ్యముగా నుండెడి యంశము కాదు. నెయ్యి, నూనె యిత్యాదులను తిని, జిడ్డు తగల కుండగ యుండుట యెట్లు సాధ్యము కాదో కర్మలను చేయుచు వాటి ఫలమునకు దూరముగా నుండలేము. కర్మఫలమంటియే యుండును. ఇట్టి స్థితి నుండి బయట పడి పరమందున సౌఖ్యమును పొందెడి యుపాదీము నుపదేశించిన శ్రీ రేణుక భగవత్పాదులు నందరికీ వంద్యులే.

"అహం కర్తా" యనెడి భావనయే కీలకమైన యంశము. "నేను కర్త ననెడి భావన మనమున రాకూడదనెడిదే కీలకమైన యంశము. శివకర్తృత్వ భావనతో కర్మల నాచరించి, ఫలమును శివున కర్పించి కర్మి యలిప్తుడై యుండవచ్చును.

నోటిలోని నాలుక ప్రతి దినము నూనె యిత్యాదులతో సంపర్కము గల్గినా, జిడ్డు దాని మీద నిలువ జాలదు. ఇదే విధముగా కర్మఫలమును శివునికర్పించెడి శివయోగిని కర్మబంధములు కట్టివేయజాలవని గ్రహించవలెను.

భావాచార సంపన్నుడైన శివయోగి యనుదినము దర్శించెడిదేమిటి? యనెడి భావన గురించిన ప్రశ్న తలయెత్తవచ్చును. ఇతని వలె సమస్తమును దర్శించవలెననిన యెడల చూచెడి వాడి వైఖరి యెట్టులుండ వలెననెడిది మరొక ప్రశ్న. ఈ విషయము శ్రీ రేణుక భగవత్పాదులవారు తమ యుపదేశమునీ క్రింది విధముగా నిచ్చిరి.

**ఆత్మానమఖిలం వస్తు శివమానంద చిన్మయమ్।**
**ఏక భావేన సతతం సంపశ్యన్నేవ పశ్యతి॥** (సి.శి. 16-76)

శివ–జీవ–జగత్తులలో భేదమును దర్శించెడి వాడే వాస్తవముగా దర్శించెడి వాడనునదే యీ యుపదేశములోని సారాంశము.

లోకమున సామాన్యులు శివ–జీవులలోనూ శివ–జగత్తులలోను, భేదమును దర్శింతురు. ఇట్టి వారు శివదర్శనమును పొందజాలరు. శివదర్శనాసక్తి గల్గిన వారు నీ మూడింటి లోపల యేకత్వమును దర్శించవలెను. శివలీలా వైభవ విలాస వైచిత్రిలో నియ్యవి వేరు వేరుగాకనప్పట్టినను వాస్తవముగా శివుడే జీవుడు. శివుడిగను జగత్తు గాను పరిణామమును పొందెను.

ఈ విధముగా భావించికొని శివభావమును వృద్ధి జేసికొనిన వానికి సర్వత్ర శివ దర్శనము ప్రాప్తమగునని గ్రహించగలరు. ఈ విధముగా దార్శనికుడైన వాడు ధన్యుడగుచున్నాడు. ప్రతి వ్యక్తి శివయోగి వలె శివదర్శనమును పొందుటకై ప్రయత్నించ వలెను. అట్టి శక్తి మీకెల్లరకు లభించుగావుత!

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపక :

శ్రీ కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులవారు కర్మలను చేసియు నద్దాని ఫలము నంటకుండగ నుండగల్గుటెట్టు లనెడి దానిని యుపదేశించిరి. కర్మయోగమునకు సంబంధించిన నిగూఢమైన రహస్యము లెన్నియో తెలుపబడినవి.

కర్మఫల మంటకుండగ నుండుటకై కర్మఫల సన్యాసమును చేయవలెనని చెప్పబడినది. క్రియాఫల సన్యాసోపి భక్తి విశేషాత్మకం" అని సాయణుల వారు ప్రతిపాదించిరి. (సర్వధర్మ సంగ్రహము) "కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన" యనెడి గీత లోని వ్యాసోక్తిలోను నిట్టి భావమే గలదు. ఈశావ్యాపనిషత్తే యిట్టి భావములకు ప్రేరణ కల్పించుచున్నదని తెలియుచున్నది. అయితే కర్మఫలమును సన్యసించుట సులభ సాధ్యమైనట్టి యంశము కాదు. నిష్కామ కర్మ యోగమున నాచరణాత్మకమైన భాధకములు గలరు. అనాసక్తితో చేసెడి కర్మ పురోగమనమును నొందదు. వీటన్నిటి కంటెను రేణుక భగవత్పాదుల వారు చూపిన మార్గము సుగమమైనదని దోచుచున్నది.

ఈ విషయమున శ్రీబసవేశ్వరుల వారు తమ విశిష్టమైనట్టి యనుభవమును నీ క్రింది విధముగా తెలిపిరి.

**కళహోదడె కన్నదుళియ హిడివె**
**బందివిడిదడె నిమ్మింద ముందెనడవె**
**మన భీతి మన శంక గొండెనాదడె**
**నిమ్మాణె, నిమ్మ పురాతన రాణె**
**ఆళ్దర నడే సదాచారవెన్న దిర్దడె**
**కట్టాళు శిష్టతనక్కె హోహకష్టనోడా**
**కూడల సంగమ దేవా!** (వ.సం. 697)

దీని తెలుగు రూపమిది.

**కొల్లకైపోయినచో కన్నపుటులిని పట్టెద**
**బంది నిడినచో నీ కంటె ముందే నడచెద**
**మనస్సుభీతిని మనస్సు శంకను గొనినచో**
**మీ యాన; మీ పురాతనుల యాన**
**ఏలిక నడువు సదాచార మనకుండినచో**
**కట్టేలితు శిష్టతనము పోవునది**
**కష్టము చూడుమా**

శ్రీ బసవన్న వారు నీ వచనమున భృత్యాచారాచరణలోని భావాచారము యొక్క పోకడను తెలియజెప్పిరి.

*– శివం భూయాత్ –*

## ఆశీర్వచనము - 1 :

## జ్ఞానాచార స్థలము :

ఇంత వరకు మహేశ్వర లింగ స్థలాంతర్గతములై విరాజిల్లెడి వివిధ స్థలముల గురించి తెలుపనైనది. ఈ స్థలములోన చివరన యుండెడి జ్ఞానాచార స్థలము గురించి తెలిసికొనవలసి యున్నది.

ధర్మచార భావాచారములు మనుష్యుని యాధ్యాత్మిక జీవితమున కెంత మేరకు అవసరమో, అంతే మేరకు జ్ఞానాచారము నవశ్యమై యున్నది. జ్ఞానాచార స్థలమనగా నేమిటో యనెడి దిచ్చుట నిర్వచింపబడినది.

**అస్య జ్ఞానసమాచారో యోగినః సర్వదేహినామ్।**
**జ్ఞానాచారో యదుక్తో 2యం జ్ఞానాచారః స కథ్యతే॥** (సి.శి. 16-76)

జ్ఞానాచార మనగా భావాచార సంపన్నుడైన శివయోగి యొక్క జ్ఞాన సమాచారమే జ్ఞానాచారము లోకులందరికీ అనుసరణీయమై యున్నది. ఇది యీ యుపదేశము యొక్క తాత్పర్యము.

"సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" అనెడి శ్రుతి వాక్యము చెప్పిన యటుల శివపరబ్రహ్మము సద్రూపముగను, చిద్రూపముగను మరియు నానంద రూపముగను నుండును. అద్దానిని పొందవలెనినచో దానిని గురించిన జ్ఞానమును తెలిసికొనవలెను. ఇంతటి జ్ఞాన మందరికీ యవసరమై యున్నది. జ్ఞాన లక్షణమును నీ క్రింది విధముగా శ్రీమద్రేణుకాచార్యులు నిర్వచించిరి.

**శివాద్వైత పరం జ్ఞానం జ్ఞానమిత్యుచ్యతే బుధైః।**
**సిద్ధేన వాప్యసిద్ధేన ఫలం జ్ఞానాంతరేణ కిమ్ ॥** (సి.శి. 16-77)

శివాద్వైతపరమైన జ్ఞానమే జ్ఞానమని బుధజనులు చెప్పియున్నారనియును. తదితర జ్ఞానము సిద్ధించినను, సిద్ధింపకుండినను ప్రయోజనము ముండదనెడిదే యీ యుపదేశము యొక్క సారాంశము.

శివాద్వైత జ్ఞానమెంతో నిర్మలమైనది. అది తేజోమయమై ప్రకాశించెడిది. అందుచేత నా జ్ఞానము వలన సర్వోత్కృష్ట మోక్షము ప్రాప్తమగును. ఈ జ్ఞానము కంటెను భిన్నమైన దగు జ్ఞానమెట్టిదైనను నిష్ప్రయోజకమై యుండును. దానికి లౌకికముతో సంబంధము గల్గియుండును. ఇట్టి సంబంధము రాగద్వేషములకు కారణ భూతమైన దగుచున్నది. రాగ ద్వేషాదుల చేత కలుషితమయ్యెడిదగు లౌకిక జ్ఞానము వలన సంసారిక బంధములు గల్గుచున్నవి.

ప్రతి యొక్క వ్యక్తి వద్ద యేదో నొక జ్ఞాన ముండియే తీరును. అయితే యే జ్ఞానము వలన కూడు, గుడ్డ లభించుచున్నవో ఆ జ్ఞానము నిజమైన జ్ఞానము కాజాలదు. ఏ జ్ఞానము వలన జీవాత్మ సంసారపు పాశము నుండి విముక్తి గల్గుచున్నదో ఆ జ్ఞానమే నిజమైన జ్ఞానమని తెలుపబడినది. శివాద్వైత జ్ఞానమే అట్టి నిజమైన జ్ఞానము. మిగిలిన శాస్త్రములైన గణితము, భౌతిక విజ్ఞానము, భాషా పరిజ్ఞాన మిత్యాదులేవియును శివాద్వైతమునకు సాటిగా రాజాలవు. ఈ విషయమును విపులీకరించెడి కథ యొకటి కలదు.

ఒకానొక సమయము నందున సకల శాస్త్ర పారంగతుడైన యొక పండితుడు పాదయాత్రను చేయుచు నొక నదీ తీరమునకు వచ్చెను. వాన కాలపు సమయమది. నది పూర్తిగా నిండి పారుచుండెను. అందుచేత నదిని దాటుటకై నావికుని దగ్గరకు వెడలి తన యభీష్టమును తెలియపరచెను. నావికుడు పండితుని యభ్యర్థనను విని సానుకూలముగా స్పందించెను. పండితుని పడవలో కూర్చుండబెట్టికొని నదిని దాటుటకై బయలు దేరెను. నౌకాప్రయాణసమయమున పండితుడు నావికుని యుద్దేశించి నీవు వ్యాకరణ శాస్త్రమును చదివితివా?" అని ప్రశ్నించెను. అప్పుడు వారిరువురికి మధ్యన సంభాషణ యీ క్రింది విధముగా కొనసాగెను.

నావికుడు : పండితుడా! నేను దానిని చదువ లేదు.

పండితుడు : సాహిత్యమైనను, చదివితివా।

నావికుడు : లేదండీ!

పండితుడు : దర్శన శాస్త్రమునైనను చదివితివా?

నావికుడు : స్వామీ! నేనేదియును చదువలేదు.

పండితుడు : అట్లైన నీ సగము జీవితము వ్యర్థమైనది కదా!

ఈ విధముగా వారు మాటలలో నుండగనే బలమైన గాలి వీచసాగెను. గాలి తాకిడికి పడవ వూగిసలాడజొచ్చెను. ఆవలి గట్టుకు వెడలుట యసంభవమని గ్రహించిన పడవ వాడు" ఓ పండితుడా నీకు యీదుట వచ్చునే" అని అడిగెను. వాడు భయముతో వణుకుచు గద్గద కంఠముతో "రాదని" తెలిపెను. "అయితే యిప్పుడు నీ పూర్ణ జీవితము వ్యర్థమగుచున్న"దని తెలిపి పడవ నుండి దుమికి, యీదుచు వడ్డునకు వచ్చి చేరెను. సకల శాస్త్ర పారంగతుడైన పండితుడు విలపించుచుండెను. అంతలోనే పడవలోనికి నీరు వచ్చెను. పడవ మునిగి పోయెను. పండితుడు జల సమాధిని పొందెను. ఈ విధముగా నదిని దాటెడి విద్య నెరుగని కారణమున పండితుడు ప్రాణములు కోల్పోయెను.

సంసారము నది వంటిదే. దానిని దాటెడి విజ్ఞానమును పొందని వాడు సంసారములో చిక్కికొని బాధలకు గురియగు చుండును.

లౌకిక జ్ఞానమును పొందిన వారి మధ్య పోటీ భావన యేర్పడును. "నేను ముందు" "నేను ముందను"చు పరుగులు దీసెడి వారు గలరు. ఇది కలహానికి కారణమగుచున్నది. ఈర్ష్యా ద్వేషములు తలయెత్తి, వాతావరణమును కలుషితము చేయును. కోపతాపముల వలన హింసా కాండ చెలరేగెడి యవకాశము గలదు. శివాద్వైత జ్ఞానమును పొందిన వారి మధ్యపోటీ భావన కవకాశమే లేదు. ద్వేష భావన రానే రాదు.

శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారీ విధమున జ్ఞానస్వరూపమును గురించి తెలిపిన పిదప తదాచారము గురించి యీ క్రింది విధముగా తెలియజేసిరి.

**పరిపూర్ణం మహాజ్ఞానం పరతత్త్వ ప్రకాశకమ్।**
**అవలంబ్య ప్రవృత్తో యో జ్ఞానాచారః స ఉచ్యతే॥** (సి.శి. 16-77)

పరతత్వమును ప్రకాశింప చేసెడిదియును, పరిచ్ఛిన్నము కాకుండగ సంపూర్ణముగ నుండెడిదియును, ఎంతో గొప్పదైనదియును అగు శివాద్వైత జ్ఞానము నూతగా గొని చేయబడెడి ఆచారము, జ్ఞానాచార మనబడుచున్నదనెడిదే యీ యుపదేశము యొక్క తాత్పర్యము.

పూర్వోక్తమైన జ్ఞానాచారముననుసరించి ప్రవర్తించెడి వాని గురించి శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారు తమ యుపదేశమునీ క్రింది విధముగా నిచ్చిరి :

**నిర్వికల్పే పరే ధామ్ని నిష్కలే శివనామని।**
**జ్ఞానేన యోజయేత్ సర్వం జ్ఞానాచారి ప్రకీర్తితః॥** (సి.శి. 16-78)

అవయవ రహితమై భేదరహితమై యుండెడి శివయనెడి నామధేయముగల్గిన పరబ్రహ్మ ధామము నందున ఈజ్జాలము నెల్లను ననుసంధానము చేసి యభేద భావముతో ననుభావమును నెవ్వడు పొందుచున్నాడో వాడు జ్ఞానాచారియని కీర్తింపబడుచున్నాడనెడిదే యీ యుపదేశము యొక్క తాత్పర్యము.

వీరశైవ సిద్ధాంతము నందున ప్రపంచమును మొదలుకొని శివ పరమాత్మ వరకు గల పదార్థములను తత్త్వములనియందురు. పృథ్విని మొదలుకొని శివునివరకు ముప్పది యారు తత్త్వములు ప్రతి పాదింపబడినవి. వీటి యందున శివతత్త్వమే సర్వోత్కృష్టమైనదై యున్నది. అది పరిపూర్ణమైన దై యుండును. అవన్నియు దేశ కాల మరియు వస్తువుల చేత పరిచ్ఛిన్నములై యుండును. ఒక ప్రదేశములో నుండి మరొక స్థలమున యుండకుండినయెడనయ్యది దేశపరిచ్ఛిన్న మనబడును. ఒక కాలమున యుండి మరొక కాలమున యుండకుండినచో దానిని కాల పరిచ్ఛిన్నమని యందురు. ఘటము పటము కాదు, పటము ఘటము కాదు, అనెడి వస్తువుల యొక్క యన్యోన్యా భావ భావన వస్తు పరిచ్ఛేదమని యనిపించికొనును. ఎయ్యదిపరిచ్ఛిన్నమైనదో అది యసంపూర్ణమైనదగును. తద్విరుద్ధమైనది యపరిచ్ఛిన్నమైనది. దీనిని సంపూర్ణమైనదని యందురు.ఇట్టి పరిపూర్ణమైన పరమాత్మ జ్ఞానము నవలంబించి ప్రవృత్తమగుటయే జ్ఞానాచార మనబడుచున్నది.

సర్వము పరమాత్మ స్వరూపమై యుండినను, మనకు ప్రతి యొక్క వస్తువు భిన్న భిన్నముగా తోచును కదా? అట్టి యెడ నేకత్వమును దర్శించుట యెట్టుల యనెడి ప్రశ్న తలయెత్తును. తోచెడి ప్రతి వస్తువులోను సచ్చిదానంద రూపుడగు శివపరమాత్మగలడని మననము చేయుచు పోయిన యెడల సర్వము శివరూపమనెడి భావన గల్గును. ఈ విధముగా శివభావమును తన యనుభవము లోనికి తెచ్చి కొనెడి వానిని జ్ఞానాచారి యని యందురు.

జ్ఞానాచారికి కర్మకార్పణ్యముండునా? అనెడి ప్రశ్న తలయెత్తవచ్చును. అద్దాని నిమిత్తమున శ్రీ రేణుకాచార్యులవారు నగస్త్యునికి యీ క్రింది విధముగా నుపదేశించిరి.

**జ్ఞానం ముక్తి ప్రదం ప్రాప్య గురు దృష్టి ప్రసాదతః।**
**కః కుర్యాత్ కర్మకార్పణ్యే వాంఛాం సంసారవర్ధనే॥** (సి.శి. 16-81)

మోక్షప్రదమైనదియును, గురుకారుణ్య వశమున లభ్యమైనదియును, అగు శివజ్ఞానమును పొంది, సంసార ప్రవర్ధనమునకు కారణభూతమైన కర్మాచరణమనెడి ప్రలోభమునందున తగిలికొని యుండుట కెవ్వడు సంసిద్ధుడగునెడిదే యీ యుపదేశములోని సారాంశము.

ఇట్టిస్థితిలో సంసారము పెరిగి పెద్దగా అగుటకు వలయు అంకురము జనించదని శ్రీ భగవత్పాదులవారీ క్రింది విధముగాఆనతి నిచ్చిరి:

**కర్మ జ్ఞానాగ్నినా దగ్ధం న ప్రరోహేత్ కథఞ్చన।**
**యదాహు సంసృతేర్మూలం ప్రవాహానుగతం బుధాః ॥** (సి.శి. 16-82)

ఏ కర్మ బుద్ధిమంతులు సంసారమునకు మూల కారణమని యందురో, ఏ కర్మ పరంపరానుగతముగా ప్రవాహరూపమున వచ్చుచున్నదో అది జ్ఞానాగ్ని చేత దగ్ధము చేయబడుటచేత, సంసారమునకు కురము కాజాలదనెడిదే యీ యుపదేశము యొక్క సారాంశము.

జ్ఞానమును సంపాదించి కొనుటకు తన పరిశ్రమ మరియు పరికరము లెంతమేరకు అవసరమో అంతే మేరకు గురువుగారి కరుణయు నవశ్యముగా కావలెను. గురుకృప లేని పక్షమున నెంత పరిశ్రమించినను ప్రయోజన ముండజాలదు. అభ్యాసము, శ్రమ నిరర్థకమగును. అందుచేత జ్ఞానాచారము పెంపొందుటకు శ్రీ గురువుగారి కరుణ యవశ్యముగా కావలెనని గుర్తించవలెను.

జ్ఞానాచారిని సంచిత కర్మ మేమియును చేయజాలదు. అదే విధిననూతన కర్మముకూడ కర్మబంధము నేర్పడజేయజాలదు. ఈ విధముగా జ్ఞానాచారియగు శివయోగి పునర్జన్మ నుండి ముక్తుడగుచున్నాడు.

అయితే, కర్మబంధము నెవ్వరికి చుట్టి కొనుననెడి ప్రశ్నను పరిశీలించ వలసి యున్నది. శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారీ విషయమును గురించి యీ క్రింది విధముగా నుపదేశించిరి.

**జ్ఞానేన హీనః పురుషః కర్మణా బధ్యతే సదా।**
**జ్ఞానినః కర్మసంకల్పా భవన్తి కిల నిష్ఫలాః॥** (సి.శి.16-83)

జ్ఞానహీనుని యెల్లప్పుడు కర్మలు బంధములను కల్గించును, అనియును, జ్ఞాని యొక్క కర్మ సంకల్పము నిష్ఫలమగుననియును తెలుపుటయే యీ యుపదేశము యొక్క సంకల్పమై యున్నది.

అజ్ఞానులే కర్మబంధములో చిక్కికొని యుందురు. జ్ఞానులటుల బంధింపబడరు. "యధా పుష్కర పలాశ ఆపో న శిష్యంతే..." అనెడిది శ్రుతి వాక్యము. సరోవరములోని నీరు నేవిధిన తామరాకు నంట జాలదో, అదే విధిన జ్ఞానాచారిని పాపాదులు నంటజాలవని గ్రహించగలరు. అజ్ఞాని కట్టి యవకాశము లేదు.

శ్రీ రేణుకా చార్య భగవత్పాదుల వారు జ్ఞానాచార స్థలమును సుసంపన్నము చేయుచు చివరన యీ క్రింది యుపదేశము నిచ్చిరి.

**శుద్ధా చారే శుద్ధ భావో వివేకీ జ్యోతిః పశ్యన్ సర్వతశ్చైవమేకమ్।**
**జ్ఞానధ్వస్తపాకృతాత్మప్రపంచో జీవన్ముక్త శ్చేష్టతే దివ్య యోగీ॥** (సి.శి. 16-84)

నిర్మల జ్ఞానాచారము నందున నిర్మల భావయుక్తుడైన వివేకి యగు శివయోగి సర్వత్ర శివజ్యోతిని దర్శించుచు, దాని నితరుల చేత దర్శింప

జేయుచు ప్రాకృత ప్రపంచమును ధ్వంసము చేయుచు జీవన్ముక్తుడై తిరుగాడుచున్ననను, అతడు సామాన్య జనులవలె వ్యవహరించుచుండుననెడిదే యీ యుపదేశము యొక్క సారాంశము.

శుద్ధాచార, శుద్ధ భావన మరియు శుద్ధ జ్ఞానుల సమన్వయ స్వరూప మిచ్చట యుపదేశించబడినది. శాస్త్రవిహిత కర్మల నాచరించుటయే శుద్ధాచారము. తదాచరణయందు నహంభావ రాహిత్యమును సాధించుట శుద్ధభావమగును. శరీరేంద్రియమనోమయ ప్రపంచమున కతీతముగా నుండెడి ఆత్మ గురించి తెలిసికొనుటయే వివేకము. వీటన్నింటిని పొందిన జ్ఞానాచార స్థలములోని శివయోగి యెల్ల కడల నాత్మ జ్యోతిని దర్శించును. తన ప్రాక్తన ప్రకృతికి సంబంధము గల యంశములను నాశనము చేయును. జీవన్ముక్తుడగును. కానియితరుల కతడు సామాన్యునిగనే దోచును.

దీనితో లింగస్థలమే మహేశ్వర స్థలములోని వివిధావాంతర స్థలముల గురించిన వివరణ సుసంపన్నమైనది. మీరందరు నీ స్థలముల యందున బోధించిన విషయములను గ్రహించి తదనుగుణముగా ప్రవర్తించుటకు ప్రయత్నింతురు గాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువుల వారు జ్ఞానాచార విశిష్టతను గురించి తెలియపరచిరి. సంసారమనెడి సముద్రమును తరించుటకై శివజ్ఞానముపకరించునని తెలిపిరి. శ్రీ జగద్గురువుల వారొసంగినట్టి దృష్టాంతము మరువరానిదని చెప్పవచ్చును.

శివజ్ఞానము కంటెను భిన్నమైన జ్ఞానమేదైననూ దాని వలన సాధకునికి లభించెడి ఫలము శూన్యమని తెలయు "జ్ఞానాన్తరేణ కిమ్ ఫలం?" అనెడి శ్రీ రేణుకాచార్యుల వారి ప్రశ్న రూపమున నున్నట్టి యుపదేశము గమనార్హమైనదై యున్నది. వస్తు,కాలాదులకు చెందిన జ్ఞానము వలన కర్మలపంటత్వ హెచ్చునని తెలుపబడినది. ఈ విషయమునశ్రీ బసవేశ్వరుల వారి క్రింది వచనము చూడదగినదని చెప్పవచ్చును.

**శ్వానజ్ఞాన గజజ్ఞాన కుక్కుట జ్ఞానవెంబ జ్ఞానత్రయంగళేనాదువు?**
**కూడల సంగమ దేవా నిమ్మనరియద జ్ఞానలెల్లా అజ్ఞాన** (వ.సం.798)
దీని తెలుగు రూపమిది :
***శ్వాన జ్ఞాన, గజ జ్ఞాన, కుక్కుట జ్ఞానములనెడి***
***జ్ఞాన త్రయమేమైనది కూడల సంగమ దేవా,***
***మిమ్ములనెరుగని జ్ఞానమజ్ఞానము***

భూత, భవిష్యద్వర్తమానములకు సంకేతముగా, నిలిచెడి శ్వాన, గజ, కుక్కుట జ్ఞానముల వలన జీవి ముక్తిని బడయ జాలడనెడిది గ్రహించ వలసిన యంశము.

శివ నిష్ఠితమైన జ్ఞానమే నిజమైన జ్ఞానమని తెలుపబడినది. ఇచ్చట శివుడనగా శివజీవ జగత్తనెడి త్రికమని గ్రహించవలెను. శివునెరుగని ఆత్మజ్ఞాన మసంపూర్ణమైన దగును. అదే విధముగా జగత్తును గురించిన తత్త్వము పూర్ణ జ్ఞానము కాదు. శివజీవ జగత్తుల మధ్య నభేధముండుట చేత, శివ జ్ఞానమనగా శివాద్వైత జ్ఞానమనియును, అది పరిపూర్ణమైనదని గ్రహించవలెను. ఇది ముక్తి దాయకమైనదనెడిది నిర్వివాదాంశమని శివాద్వైతులు నమ్ముదురు. ఇచ్చట శివాద్వైతమనగా శంకరాచార్యుని కేవలాద్వైతము యొక్క మరొక రూపమన తలప వలదు. లింగాంగ సామరస్యమును బోధించెడి జ్ఞానమే శివాద్వైత జ్ఞానమని గుర్తించగలరు.

అంగ మహేశ్వర స్థలములోని సాధకుడు నైష్ఠిక భక్తితో, ఆధ్యాత్మిక పుష్టిని పొందుటకై ప్రయత్నించు చుండును. ఇట్టి వానికి శివజీవాభేద పరిజ్ఞానమెంతో అవసరము. పురోగమనార్థమై అంగ మహేశ్వర స్థలి జ్ఞానాచార సంపన్నుడు కావలెను. జ్ఞాన హీనత వలన యతని సాధన నిష్ఫలమైన దగును. అందుచేత శివుడు లింగమహేశ్వరస్థలమున జ్ఞానాచార స్థలముగా నవతరించును. "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" యనెడి శ్రుతి వాక్యము లిచ్చట స్మరణీయములు. శివుడు పరస్థలియై జ్ఞాన సమాచారము వలన లోకోద్ధారకుడగును. కృపాదృష్టి మార్గమున జ్ఞాన ప్రదానమును జేయును. ధర్మాచార భావాచార జ్ఞానాచారముల సాకార స్వరూపమై వీటి సమగ్రమైన ఆచరణ వలన శివదర్శనము గల్గునని బోధించును. సాధకుడు సర్వత్ర శివుని జ్యోతి రూపమున దర్శించుటకై దోహదము చేయును.

*– శివం భూయాత్ –*

# సప్తదశ పరిచ్ఛేదము

## ప్రసాది స్థలము

## ఆశీర్వచనము - 1 :

## కాయానుగ్రహ స్థలము :

లింగషట్ స్థలములలోని దగు మహేశ్వర స్థలము నందలి సమస్త స్థలములకు సంబంధించిన విషయ సంచయమును గురించి తెలిసికొనిన పిదప శ్రీ ఆగస్త్యుల వారు శ్రీ రేణుకాచార్య భగవత్పాదులవారి నుద్దేశించి యీ క్రింది విధముగా విన్నవించికొనిరి.

**స్థలాని తాని చోక్తాని యాని మహేశ్వరస్థలే।**
**వదస్వ స్థలభేదం మే ప్రసాదిస్థలసంశ్రితమ్॥** (సి.శి. 17-1)

ఏవైతే మహేశ్వర స్థలమునగలవో అట్టి స్థలముల గురించి తెలిపితిరి; యిప్పుడు ప్రసాది స్థలమున గల వివిధ స్థలముల గురించి తెలుపుదని విజ్ఞాపన చేసెననెడిదే యీ శ్లోకము యొక్క తాత్పర్యము.

శ్రీ రేణుకాచార్యుల వారు, అగస్త్యునికి యీ క్రింది విధముగా నుపదేశము నిచ్చిరి;

**స్థల భేదా నవ ప్రోక్తాః ప్రసాదిస్థలసంశ్రితాః।**
**కాయానుగ్రహణం పూర్వమింద్రియానుగ్రహంస్తతః॥**
**ప్రాణానుగ్రహణం పశ్చాత్ తతః కాయార్పితం మతమ్।**
**కారణార్పిత మాఖ్యాతం తతో భావార్పితం మతమ్॥**

**శిష్యస్థలం తతః ప్రోక్తం శుశ్రూషుస్థలమేవచ।**
**తతః సేవ్యస్థలం చైషాం క్రమశః శృణు లక్షణమ్॥** (సి.శి. 17-2-4)

ఈ స్థలమున తొమ్మిది స్థలములు గలవనియును, అవి : కాయానుగ్రహ స్థలము, ఇంద్రియానుగ్రహ స్థలము, ప్రాణానుగ్రహ స్థలము, కాయార్పిత స్థలము, కరణార్పిత స్థలము, భావార్పిత స్థలము, శిష్య స్థలము, శుశ్రూష స్థలము మరియు సేవ్య స్థలములనియును, వాటి వీటి వివరణ క్రమముగా నిచ్చెదను వినుమనియును శ్రీ రేణుకల వారు తెలిపిరనెడిదే యీ యుపదేశము యొక్క తాత్పర్యము.

జ్ఞానాచారవంతుడగు శివయోగి తన శరీరము యొక్క దర్శనము వలన లోకము ననుగ్రహించుటయే కాయానుగ్రహ స్థలమని శ్రీ రేణుకుల వారు ప్రతిపాదించిరి. ఈ క్రింది యుపదేశమును గనుడి.

**అనుగృహ్ణాతి యల్లోకాన్ స్వకాయం దర్శయన్నసౌ॥**
**తస్మాదేశ మమాఖ్యాతః కాయానుగ్రహనామకః॥** (సి.శి. 17-5)

జ్ఞానాచార సంపన్నుడగు శివయోగి
యెప్పుడైతే తన శరీరము యొక్క
దర్శనము నిచ్చి లోకముల ననుగ్రహించునో
అప్పుడతడు ఆ లోకముల ననుగ్రహించు
చున్నాడనియును, అందుచేత

యీ స్థలము కాయనుగ్రహ స్థలమని పిలువబడినదనియు
శ్రీ రేణుకులు సెలవిచ్చిరనెడిదే యీ యుపదేశము యొక్క సారాంశము.

అది యెట్టులో యని తెలుపుటకై శ్రీ రేణుకాచార్యుల వారొక దృష్టాంతమునిచ్చిరి. ఈ క్రింది శ్లోకమును గమనించుడిః

**యథా శివోஉను గృహ్ణాతి మూర్తి మావిశ్యదేహినః**
**తథా యోగీ శరీరస్థః సర్వానుగ్రహకో భవేత్။** (సి.శి.17-6)

శివుడే విధముగా చంద్రశేఖరాది మూర్తి స్వరూపమును దాల్చి దేహధారుల ననుగ్రహించుచున్నాడో, అదే ప్రకారము శివయోగీ శరీరస్థుడై యందరిని కాయ దర్శనము వలన యనుగ్రహించెడి వాడగుచున్నాడనెడిదే యీ యుపదేశము యొక్క తాత్పర్యము.

కాయనుగ్రహ స్థలము నందుండెడి శివయోగి దేహియై యున్నను నిస్సంగియై తిరుగాడుననిశ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారు సెలవిచ్చిరి. ఈ శ్లోకమును గనుడి:

**శివః శరీరయోగేஉపి యథా సంగవివర్జితః။**
**తథా యోగీ శరీరస్థోః నిస్సంగో వర్తతే సదా။** (సి.శి.17-7)

శివుడే విధముగా శరీరస్థుడైనను నిశ్శరీరియై యుండునో అదే విధముగా శివయోగి శరీరముతో సంగత్యమును గల్గియుండడనెడిది యీ శ్లోకము యొక్క తాత్పర్యము.

తన శరీరముఖాంతరమున జనుల ననుగ్రహించెడి శివయోగి కాయానుగ్రహ స్థలి యనబడును. శివుని సృష్టి, స్థిత్యాది పంచ కృత్యములలో ననుగ్రహమొకటి. దీనిని శక్తి యనియును అందురు. అనుగ్రహమనగా, ఇచ్చుట, దయతో పాలించుట, ఆశీర్వదించుట యని గ్రహించవలెను. ఎవ్వరి యందున యిచ్చెడి సామర్థ్యము గలదో వారు ఇవ్వగలరు. ఇతరుల కది సుసాధ్యమైన విషయము కాదు ఇచ్చెడి వాడు తన దగ్గర లేని దానిని యే విధముగా ఇవ్వగలడు.

ఈ స్థలమున నుండెడి శివయోగి శివునితో నిరంతరమైన సంబంధము గల్గియుండుటచేత శివుని యనుగ్రహ శక్తి శివయోగి ద్వారా ప్రసరించి లోకుల ననుగ్రహించుచున్నది. మన యింటిలోని టివి దూరదర్శన్ కేంద్రముతో సంబంధమును స్థాపించి కొని దృశ్య శ్రవణ కార్యక్రమముల నందించుచున్నదో అదే విధిన శివయోగి శివధ్యానాదుల ద్వారా శివునితో సంబంధమును నెలకొల్పుకొని శివానుగ్రహమును నమ్మిన వారికి సంతోషాదులను ప్రదానము చేయుచున్నాడు.

శివునితో సంబంధము నేర్పరచికొన వలెనినచో నెట్టులుండవలెనో అనెడిది తెలిసికొనుట యెంతోను అవశ్యమై యున్నది."శుచిః సమగ్రీవశిరః శరీరః" అని కైవల్యోపనిషత్తు తెలుపుచున్నది శుచిర్భూతుడై సుఖానస్థుడై నిటారుగా కూర్చుండి సకలేంద్రియములను నియంత్రించుకొని యుండవలెనని గ్రహించవలెను.

శివయోగాభ్యాసమునకు మొదలుగా కావలసినది ఆసన సిద్ధి. ఒకే ఆసనము మీద ననేక గంటల వరకు స్వల్పమైన విసుగు లేకుండగ కూర్చుండెడి యోగ్యత వచ్చిన పిదప ఆసన సిద్ధి పొందిన స్థితి లభ్యమగును. ఈ స్థితిలోన సాధకుడు కదలక మెదలక కూర్చుండుట నభ్యసించుకొనవలెను. ఎంత వరకు ఆసన సిద్ధి స్థిరము కాదో అంత వరకు మనస్సు స్థిరముగా నిలువ జాలదు. ఒక పాత్రలోన నీటిని నింపి, ఆ పాత్రను స్వల్పముగా కదిలించిన ఎడల, ఆ పాత్రలోని నీరు అల్లాడి పోవును. నీటి కదలిక వలన పాత్రకూడా కదులును. శరీరమనెడి పాత్రలోన మనస్సనెడి నీరు కలదు. శరీరము కదలినచో మనస్సు కూడా కదలునని గ్రహించవలెను. మనస్సును స్థిరముగా శివుని మీద నిలుపవలెనినచో ఆసన సిద్ధి యెంతో అవసరము. శరీరము యొక్క ఒక కదలిక మనస్సునేక కంపనలకు గురిచేయునని గ్రహించవలెను. యోగశాస్త్రము నందు సుఖకరమగు సుస్థిరమైన ఆసనము యొక్క అవశ్యకత గురించి తెలుపబడినది. ఆసనస్థుయ్యెడి వాడు స్వస్థుడై యుండవలెను. ఆరోగ్య హీనునికి యోగాభ్యాసము విహితము కాదు. శరీరము యొక్క యే భాగమైనను ఋగ్మతకు గురియైన యెడల మనసు అద్దానిని గురించి

చింతించుచుండును. అట్టి స్థితి శివధ్యానమున కంతరాయమును కల్గించును. ఈ విధముగా యోగాభ్యాసమునకై స్వస్థత, ఆసనసిద్ధి అవశ్యమని గుర్తించవలెను.

సాధకుడు శుచిర్భూతుడై యుండవలెననెడిది మరొక నియమము కేవలము ఆసన శుద్ధి యుండినచో చాలదు. పర్వతాదులు స్థిరముగా నున్నను అవి యోగులు కాజాలవు కదా! అయితే, శుద్ధి యనగా త్రికరణ శుద్ధి యని గ్రహించవలెను. దైహిక శుద్ధి గురించి ఆహార శుద్ధిని పాటించవలెను. అన్నశుద్ధి లేని యెడల దేహము శుచిర్భూతము కాజాలదు. వాణి శుచిర్భూతముగా నుండవలెననినచో సదా మంగళమయమైన వాక్కులనే పలుకుచుండవలెను. అమంగళమైన వాక్కుల వలన శ్రోతల మనస్సుకు క్షోభ గల్గును. పరిసరములు కలుషితమగును. ఈ కారణమున శివయోగి కర్కషమైన వాక్కులను ప్రయోగించడు.

ఇతరుల గురించి మంచి చింతన గల్గియుండుటయే మానసిక శుద్ధి. మిగిలినవి యుండి, యిది లేని యెడ సాధన నిరర్థకమగును. మానసిక శుద్ధి గల వాడు, ఇతరుల గురించి చెడును ఆలోచించవలదు. మనస్సున యనిష్ట చింతనకాస్కారము నివ్వకూడదు. ఈ విధముగా త్రికరణ శుద్ధిని సాధించిన శివయోగి శివునితో సంబంధమునేర్పరచికొనుటకై వలయు యింద్రియ నిగ్రహము సాధించి కొనును. నిరంతరము శివ ధ్యానములోన మునిగియుండును.

వివిధ రూపములలో వెలుగొందుచు భక్తుల కోరికలను నెరవేర్చెడి శివునివలె శివయోగి తనను నమ్మిన వారికి కొంగు బంగారమై కోరికలు తీర్చునని శ్రీ రేణుకాచార్యుల వారు నొక్కిచెప్పిరి.

కాయానుగ్రహ స్థలములోని శివయోగివలె ననుగ్రహశక్తి సంపాదించికొని లోక కల్యాణమును సాధించెడి దిశలోన మీరు పయనింతురుగాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

తన స్వీయ దర్శన భ్యాగమును కటాక్షించి తద్వారా జన సామాన్యమునకు ముక్తిని యిచ్చెడి మహోదాత్తమైన పాత్రను పోషించెడి వాడే కాయానుగ్రహస్థలియని శ్రీ కాశీ జ్ఞానసింహాసనాధీశ్వరులవారు నుపదేశించిరి.

లింగ ప్రసాద స్థలి స్వీయావధాన భక్తితో శివుని భజించి, శివ ప్రసన్నత బడయనెంచును. అయితే సాధకుని యంతరంగ చతుష్టయమతనికి యవరోధములను కల్పించెడి యవకాశము కలదు. మర్కటము రీతిన చరించెడి మనస్సు వలన చిత్త భ్రమణ, బుద్ధిమాంద్యము మరియు నహంకారోద్వర్తనము ప్రభవించవచ్చును. సాధకునీ స్థితి నుండి కాపాడుటకై శివుడు కాయానుగ్రహ స్థలమనెడి లింగప్రసాద స్థలియై దర్శన మిచ్చునని తెలియుచున్నది. లింగభక్త స్థలములోని పరజంగముడే లింగమహేశ్వర స్థలమున పరస్థలిగా పరిణామము నొంది యీ స్థలమున కాయానుగ్రహస్థలి యగుననెడిది వాస్తవముగా జరిగెడి పరిణామమని తెలియుచున్నది.

"నిష్కలోపి మహాదేవః మూర్తి మానేన భాసతే" యనెడి జగద్గురోక్తి. (16:38) నిచ్చట స్మరించవలెను. "శివోను గృహాతి మూర్తమావిశ్వదేహినః " అనెడిది యీ స్థలములోని భగవత్పాదుల వారి యుపదేశము. శివునివలె శివయోగియు లోకముల ననుగ్రహించునని తెలిసికొనవలెను. ధర్మాచార భావాచార జ్ఞానాచారముల నాచరించెడి శివయోగి సుస్థిరమైన శివ భావన గల్గియుండి శివుడై శివుని వలె యనుగ్రహ సామర్థ్యము గల్గియుండునని తెలిసి కొనవలెను. నిరుపాధియై నిరంజన స్వరూపుడై తిరుగాడెడి శివయోగి యొక్క కాయము కైలాసము వంటిదని దలపబడుచున్నది. ఈ విషయమును తెలిపెడి శ్రీ బసవన్న వారి క్రింది వచనముగనుడి:

**దేవలోక మర్త్యలోక వెంబుదు బేరే మత్తుంటె,**
**ఈ లోకదొళిగెమత్తె అనంతలోక!**
**శివలోక శివాచారవయ్యా!**
**శివభక్తినిద్ధరావే దేవలోక**
**భక్తనంగళలె వారణాసి, కాయలెకైలాస**
**ఇదుసత్య, కూడల సంగమదేవా!** (వ.సం. 139)

ఈ వచనపు తెలుగు రూపమిది :

**దేవలోక మర్త్యలోకములనెడివి**
**వేరుగా మరిగలవే?**
**ఈ లోకములోనే మరో అనంతలోకము!**
**శివలోకము శివాచారమయ్యా!**
**శివభక్తుడున్న దావే దేవలోకము**
**భక్తుని యంగణమేవారణాసి,**
**కాయమే కైలాసము**
**ఇది సత్యము కూడల సంగమ దేవా!**

ఇట్టి మహిమాన్విత జంగముని స్థావరలింగముతో పోల్చి చూపెడి యొక శివానుభవస్థలి పద్యమును గనుడి :

**మ॥ అరుదాస్థావర లింగమూర్తిలిల దారాదానదానస్థితిన్**
**నరులంతమ్ముభజించువారలను బుణ్యప్రాప్తులంజేయుట**
**ల్లురుదే జంగమలింగమూర్తులిల దారాదానదానక్రియే**
**తరులై మర్త్యులు దమ్ముజూడగనుమాత్రమ్ముక్తి బొందింపగన్** (అనుభవ సారము, ప 205)

*- శివం భూయాత్ -*

## ఆశీర్వచనము - 2 :

## కాయానుగ్రహ స్థలము :

ప్రసాద లింగస్థలాంతర్గతమైన కాయానుగ్రహ స్థలము గురించి క్రిందటి ఆశీర్వచనమునందు తెలిసికొంటిమి.

శివయోగము చేతను, శివజ్ఞానము చేత తప్తుడైన శివయోగి, శివైశ్వర్య సంపన్నుడై జనసామాన్యము యొక్క హితముకై పాటు పడునని శ్రీ రేణుకాచార్యులవారు సెలవునిచ్చిరి. సకలేంద్రియములను నిగ్రహించుకొనిన వాడైనందున శివయోగి అనుగ్రహ శక్తి గలవాడగుచున్నాడని గ్రహించగలరు.

మన కర్మేంద్రియములు మరియు జ్ఞానేంద్రియములు తమ తమ విషయ వ్యవహారముల యందు నాసక్తిని గల్గియున్నప్పుడు మనుష్యుని దైహిక మరియు మానసిక శక్తి నష్టమగును. ఒక మోటారు వాహనము పయనించునప్పుడు నయ్యది యింధనాదులను వ్యయమొనర్చును. అదేవిధిన యింద్రియములు విషయాసక్తిలో మునిగి తేలిన పిదప నొక వ్యక్తి శక్తి హీనుడగుచున్నాడు. అలసట చెందిన వ్యక్తి విశ్రాంతిని కోరుకొనును. గాఢమైన నిద్రలోనికి జారిపోవును. అప్పుడు ఇంద్రియములు విషయాసక్తిని విరమించి కొని విశ్రమణ స్థితిలో నుండును.

నిదురలో నున్నప్పుడు శక్తి సంచయ క్రియ కొనసాగును. నిదుర నుండి లేచిన పిదప వ్యక్తి శక్తి వంతుడగుచున్నాడు. ఇచ్చట తెలిసికొనవలసిన విషయమేమనగా యింద్రియములు తమ విషయాసక్తి వీడకుండిన యెడల యనుగ్రహశక్తి సిద్ధించదు. శివయోగి శివయోగమనెడి ప్రక్రియ ద్వారా యింద్రియములను నిరోధించి అనుగ్రహశక్తిని పొందుచున్నాడు. దీని ద్వారా లోకముల నుద్ధరించుచున్నాడు.

విశ్వాధిపతియైన శివుడు పంచకృత్యములను చేయును. అవి. సృష్టి, స్థితి, లయ, తిరోధాన, అనుగ్రహములు. వీటిని పంచశక్తులని యందురు. ఈ పంచశక్తులనే పురాణములు పంచముఖములని, నుడివినవి. అవి: సద్యోజాత, వామ అఘోర, తత్పురుష మరియు ఈశాన ముఖములు. శివుడు తన పంచశక్తుల సహాయము చేత జగత్తు యొక్క సంచాలనను చేయుచున్నాడు. కాయానుగ్రహ స్థలము నందలి శివయోగికీ పంచశక్తులు నల్పప్రమాణములో నుండును. అతడీ శక్తులను సమయానుకూలముగా వినియోగించి లోకుల కుపకారమును చేయుచుండును.

సామాన్యముగా సహవాసము వలన సహవాసదోషము సంక్రమించెడి యవకాశముండును. శివయోగి దేహముతో సాంగత్యము గల్గియుండినను దేహమునకు సంబంధించిన గుణదోషముల నుండి నిస్సంగియై యుండును. వివిధ మూర్తిరూపములను పొందెడి శివుడు ఆ రూపములకు

సంబంధించిన గుణాదులతనిని అంటవు. భక్తుడు తననే రూపమున భావించి కొలుచునో తానా రూపమును ధరించి శివుడనుగ్రహించుననెడిది మనమెరిగిన విషయమే. భక్త కన్నప్పను స్థావర లింగము రూపములో ననుగ్రహించెనని తెలుపబడినది. అయితే శివలింగములోని జడత్వమతనిని యంటికొని యుండునని యన లేము. "స్వపర జ్ఞప్తిశూన్యత్వము" శిలయందున్నను నయ్యది శివునికి సంక్రమించదని తెలిసికొనగలరు. ఈ గుణమే శివయోగిలో నుండునని తెలిసికొనగలరు. దేహ గుణముల నుండి యతడు నలిప్తుడై యుండునని గ్రహించగలరు. ఈ విషయమును మరింత స్పష్టము చేసెడి యీ గీతావాక్కును గమనించుడి.

**నైనం ఛిందన్తి శస్త్రాణి నైనం దహతి పావకః ।**
**నచైనం క్లేదయన్త్యాపో నశోషయతిమారుతః ॥**

అస్త్ర శస్త్రాదులును, అగ్న్యాది భూతములును శరీరమునకు వికారములను గల్గించుట మన యనుభవములోని విషయమే. కాయానుగ్రహ స్థలములోని శివయోగి కిట్టి వికారములు గల్గవు. అతడు దేహము గురించిన మమకారాహంకారాదులను విడిచి నిర్లిప్తుడై యుండును.

కాయానుగ్రహ స్థలములోని శివయోగి శివుడగునని శ్రీ రేణుకాచార్యుల వారు వుపదేశించిరి. ఈ శ్లోకమును గనుడిః

**శివభావనయా యుక్తః స్థిరయా నిర్వికల్పయా।**
**శివో భవతి నిర్ధూత మాయావేశ పరిప్లవః॥** (సి.శి. 17-8)

శివయోగి భేదరాహిత్యము వలనను ధృఢతరమైన శివోహమ్మనెడి భావన గల్గియుండుట చేతను, మాయా ప్రభావమునకు లోను కాకుండగ తగు జాగరూకత వహించుట చేతనుశివుడగుననెడిదే యీ శ్లోకాంతర్గతమైన సారాంశము.

శివయోగి తాను శివుడగుటకై సదా శివభావనలో మునిగియుండును. శివోహమ్మనెడి భావమును దాల్చెడి శివయోగి భేదబుద్ధిని వీడి చరించెడి వాడగుచున్నాడు. ఇట్టి భావనా బలము చేత స్థిరమైన చిత్తముగల వాడగును. ఈ విధముగా సాధన చేసెడి శివయోగికి శివేతరమైన ఆలోచన లేవియును రావు.

మాయా విశిష్టుడైన వ్యక్తి భూతమావహించిన వ్యక్తి వంటి వాడని గుర్తించవలెను. దయ్యము పట్టిన వానిని దయ్యము పరిపరి విధములుగా ప్రయాసకు గురి చేయును. మాయకూడ వ్యక్తిని దుఃఖాదులను గల్గించును. క్షణికమైన దుఃఖము నిచ్చుటే మాయ యొక్క లక్షణమై యున్నది. సచ్చిదానందమును కోరెడివాడు మాయ వలన గల్గెడి సుఖదుఃఖముల నభిలషించదు. వీటికి దూరముగా నుండుటకై యత్నించును. దూరీకృతమైన మాయాప్రభావము వలన శివయోగి శివుడగుచున్నాడు. సామాన్యులిట్టి స్థితిని సాధించలేరు. మాయ యెంత బలవత్తరమైనదో అనెడి దానిని తెలిపెడి యీ కథను గమనించుడి.

ఒక వూరిలో నొక భక్తుడు దైవ దర్శనాభిలాష గలవాడై దేవుని గుడికి బయలుదేరెను. స్వల్పము మేరకు దారిలో పయనించిన పిదప తాను వట్టి చేతులతో వెడలు చున్నాడనెడి ఆలోచన స్ఫురించెను. రిక్త హస్తేన మత్రజేత్" అనెడి సూక్తి జ్ఞాపకమునకు వచ్చెను. ఏదైనను తీసి కొని వెడల వలెననెడి సంకల్పము గల్గెను. అతని దృష్టి దారి ప్రక్కననే యున్న పత్తిపొలమువైపు ప్రసరించెను. దేవుని దీపమునకై వత్తినైనను తీసికొని వెడల వలెననితలచి పొలము లోనికి ప్రవేశించెను. పత్తిని సంగ్రహించజొచ్చెను. ఇంతలోకి అతని కింకొక ఆలోచన వచ్చెను. కేవలము పత్తి వలన దీపమును వెలిగించలేము; అందుచేత నూనె కూడ కావలెను కదా! ఎక్కువ ప్రయాణములో పత్తిని గ్రహించికొని పోయి, దానిని విపణి వీధిలోన నమ్మి నూనెను తీసికొని వెడల దలచెను. తన ఆలోచన నమలులోనికి తెచ్చెను. రెండు మూడు డబ్బాల నూనె లభించెను. అతడెంతగానో సంతోషము నొందెను. మరల యతడు ఆలోచించ దొడగెను. దీపమున కింత నూనె యెందులకు? అనెడి ప్రశ్న నెదుర్కొనెను. దానిని అమ్ముటకై నూనె వ్యాపారమును ప్రారంభించెను. పని వత్తిడికి లోనై దేవుని చింతననే త్యజించిన వాడయ్యెను. దైవ దర్శనము కొరకు వెడలి చివరకు దైవమునే మరిచి పోయెడి స్థితిని కల్పించిన దెవ్వరో కాదు. అది మాయయే. మాయాప్రభావానికి లోనయ్యెడి వాడు లౌకికుడగుచున్నాడు.

తల్లి గర్భమునందున యుండినప్పుడు గర్భస్థ యాతన ననుభవించెడి శిశువు గర్భవాసము నుండి ముక్తుడై ముక్తిని పొందుటకై పరశివుని ప్రార్థించుచుండును. గర్భము నుండి బహిర్గతమైన పిదప నను క్షణము భగవంతుని స్మరించెదనని సంకల్పించెడి శిశువు ప్రసవమైన పిదప మాయకు వశుడై భగవంతుని యునికిని మరచి సంసారములో పడి తల్లడిల్లుచుండును.

శివయోగి మాయకు వశమై యుండడని గ్రహించవలెను. వీరశైవులు సాధనను పటుతరముగా చేసికొని శివభావ సంపన్నులై తద్వారా మాయప్రభావము నుండి విముక్తిని పొంది యిహపర సుఖముల ననుభవింతురుగావుత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య మహాస్వాములవారు శివుని యొక్క సాంగత్య రాహిత్యము గురించి పలు విధములుగా వివరించి చెప్పిరి.

శివుడేవిధముగా నుపాధినుండి నిస్సంగడై యుండునో, అదేవిధిన శివయోగి కాయా గుణముల సాంగత్య విహీనుడై యుండునని తెలుపబడినది. ఈశ్వరుని నిస్సంగత్యమును నిరూపించెడి బసవపురాణములోని క్రింది ద్విపదలగనుడి.

**నూవులలోపలి నూనియయట్ల**
**భావింప గాష్ఠంబు పావకునట్లు**
**తానేత్రములలోని తద్రూపయట్ల**
**పూనిపాషణములోని నినుయట్ల**
**యలవలబాల లోపలనెయియట్ల**
**జలకుంభములోని చంద్రునియట్ల**

(బ.పు.,షష్ఠాశ్వాసము)

వీటిలో నుండెడి శివుడు వీటిగుణముల కతీతుడైయుండుననెడిది యూహింప దగిన యంశము. శివయోగికిని యతని కాయమునకును గల సంబంధము నిట్టిదే.

జలకుంభములలో నుండెడి చంద్రునికిని,జలకుంభములలోని నీటికిని సంబంధముడినట్లు, కన్నులకు దోచినా భౌతికముగా రెంటికి మద్య దూరము గణనీయముగా గలదు. జీవిగా శివయోగికిని, అతని శరీరమునకును గల సంబంధమిట్టిదే.

తాత్వికముగా గమనించిన యెడల మాయా ప్రభావము వలననే జీవుడు తాను శివుడననెడిది మరిచిపోయి, తానోక దేహిననెడి భ్రమవిశిష్ట భావమును పొందుచున్నాడు. అయితే అకాయస్థలములో తెలిపిన యటుల మాయా సంబంధరాహిత్యము వలన శివయోగి కాయగుణములనుండి అలిప్తుడగును. నిర్వికల్ప స్థితినిపొందును. దేహముతో తనకు గల సంబంధమౌపచారిక స్వభావము గలదని యెరిగిన వాడై నిర్లిప్త భావమునాచరించును. “విశ్వం బ్రహ్మేతిభావయన్ సంచరతి శివయోగి” అనియును “పరబ్రహ్మ శివమహం ఇతిభావయన్ సంచరతి శివయోగి” అనియును వీరశైవ విదుల వలన తెలియుచున్నది. ఇట్టిభావన గల వానికి కాయ వికారము లుండవని తెలియుచున్నది.ఈవిషయమును తెలిపే క్రింది శ్రీబసవేశ్వరుల వారి వచనము గమనార్హమైనది.

**లింగ వికారిగె అంగవికారలెంబుదిల్ల**
**జంగమ వికారిగె ధనవికారలెంబుదిల్ల**
**ప్రసాద వికారిగె మనోవికారలెంబుదిల్ల**
**ఇంతీత్రి విధగుణవ నరియదాతను**
**అచ్చ లింగైక్యను కాణా,**
**కూడల సంగమ దేవా!**

దీని తెలుగు రూపమిది :

**లింగ వికారికి అంగ వికారమనెడిది లేదు.**
**జంగమవికారికి ధనవికారమనెడిది లేదు.**
**ప్రసాదవికారికి మనోవికారమనెడిది లేదు.**
**ఇటులీ త్రివిధగుణ ముల నరియని వాడు**
**అచ్చ లింగైక్యుడు గనుమా,**
**కూడల సంగమ దేవా!** (వ.సం.795)

ఆకలి, దప్పిక, కామ వాంఛ మొదలగునవి కాయవికారములనియును మన్ను, పొన్నుల మీది మమకారమే ధన వికారమనియును, క్రోధ, మోహ, లోభాదులే మనోవికారములని గ్రహించగలరు. ఇంద్రియ జన్యమైన సుఖదుఃఖముల కతీతుడై యుండవలెననెడిదే గ్రహించవలసిన విషయము. ఇట్టివాడే కాయానుగ్రహస్థలియని గ్రహించవలెను.

*- శివం భూయాత్ -*

## ఆశీర్వచనము - 3 :

## కాయానుగ్రహ స్థలము :

మాయ గురించిన విషయములను క్రిందటి ఆశీర్వచనమున తెలిసికొంటిరి. మాయా ప్రభావానికి లోనైన వాడు సంసారముఖుడగునే కాని యీశ్వరాభిముఖుడు కాజాలడు. వివేకోదయమైన పిదప వ్యక్తి యీశ్వరోన్ముఖతను పొందును. ఈశ్వరాభిముఖుడై పయనించెడి వాడనుభవించెడి ఆనందములోని చిన్న భాగమునైనా సంసారికుడు పొందజాలడు.

శివయోగి మాయాలేశమునకు లోనుకాకుండగ యెట్టులుండ గలడనెడి సందేహము గల్గవచ్చును. అట్టి సందేహమును తొలగించుటకై శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారీ క్రింది విధిన నుపదేశించిరి.

**చిత్తవృత్తిషు లీనాసు శివే చిత్సుఖసాగరే।**
**అవిద్యాకల్పితం వస్తు నాన్యత్ పశ్యతి సంయమీ** (సి.శి.17-9)

సచ్చిదానందములకు సముద్రము వంటి శివునితో చిత్తవృత్తిని లీనము చేసికొనిన శివయోగి, అవిద్య చేత కల్పితమైన వస్తువులను చూడడు అనెడిది యీ యుపదేశము యొక్క సారము.

పంచేంద్రియముల వ్యవహారమును నియంత్రించుటయే సంయమన మనబడుచున్నది. ఇట్టి సంయమమును బడసిన శివయోగితన మనోవృత్తుల నన్నింటిని చిద్రూపుడు, ఆనంద స్వరూపుడగు శివుని యందున విలీనము చేయుటచే నతనికి బాహ్య ప్రపంచమెట్టిదైనను నతనికి యనుభవ గోచరము కాదు.

శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారు శివుని చిత్సుఖాసాగరమని తెలియజెప్పిరి. దీని భావమేమనగా శివుడు చైతన్యపు సాగరముగాను సుఖపు సాగరముగాను ఉన్నాడు. చిత్ అనగా ప్రకాశము లేదా జ్ఞానము అనెడి భావమని గ్రహించగలరు. అందుచేత శివుడు జ్ఞాన సాగరుడుగా ఉన్నాడని తెలిసికొనగలరు. అతనిని సర్వజ్ఞుడని అందురు. సకల విద్యల కతడు అధిష్ఠాన దేవుడై వెలుగొందుచున్నాడు. నిగమాగమములు అతని నుండియే వెలువడినవి. పంచ ముఖముల నుండి యాగమములను, శ్వాస నుండి వేదములు వెలువడినవని చెప్పుదురు. అటులనే యతడు అఖండానంద మూర్తియై యున్నాడు.

శివునితో యనుబంధము లేర్పరచి కొనిన యెడల జ్ఞానానందములు లభ్యమగును. పూజా ధ్యానాదుల వలన శివునికి-జీవునికి గల యనుబంధము దృఢతరమగునని తెలిసికొనగలరు.

గురుదత్తమైన యిష్టలింగము, పంచాక్షరీ జపము, మొదలగునవి శివునితో ననుబంధము నేర్పరచి కొనుటకై వలయుసాధనములని గుర్తించవలెను. ఏ స్థాయిలో నున్న వాడైనను త్రిలింగార్చన, పంచాక్షరీ జపము లింగ-రుద్రాక్షల ధారణ, భస్మధారణ యిత్యాదులను వదల వలదని గుర్తించగలరు.

ఒకానొక కాలమున నొక చక్రవర్తి యొక శివయోగి దగ్గరకు వచ్చి, పాదములకు నమస్కరించి యొక ప్రశ్న నడిగెను. "స్వామీ! మీ కేవిధమైన సంపత్తుగాని హోదా గాని లేవు కదా? అధికారాదులు లేకుండినను అఖండమైన ఆనందముతో విరాజిల్లుచున్నారు. నేనొక వైభవోపేతమైన చక్రవర్తిని. అడ్డంకులు లేని యధికారము నా వశమున గలదు. అయినా, మీకుగల ప్రసన్నత నా యధీనము లేదు. ఈ వైపరీత్యమునకు గల కారణమేమిటో సెలవివ్వుడి"

అప్పుడా శివయోగి చిరునవ్వును చిందించుచు "ఓ సార్వభౌమా! నీ చిత్తవృత్తి దేనియందు తగులుకొని యున్నదో అది జడము మరియు దుఃఖదాయకమైనదై యున్నది.అందుచేత, నీకు దుఃఖము ప్రాప్తమగుచున్నది. నా మనోవృత్తి సచ్చిదానంద స్వరూపుడగు శివునితో లీనమై యుండును. అందుచేత నేను సదా ప్రసన్నత గల్గియుందు" నని బదులు పలికిన వాడయ్యెను.

సంసారములో నుండెడి వారు తమ దుఃఖమును తగ్గించి కొని శివోన్ముఖత సాధించవలెననిన యెడల యేమి చేయవలెననెడి ప్రశ్న పొడసూపవచ్చును. ఈ విషయమున నొక శివదాసుడు నీ క్రింది విధముగా సెలవిచ్చెను.

**"వినుడో యీ సంసారమున గల వైదురత్నాలు**
**శివ భజన, సత్సంగ దయా దర్మోపకారాలు**

ఈ పంచరత్నముల సవివరమైన వివరణను అంగస్థలములలో వివరించి యుండుటచేత నిచ్చట ఆ వివరణ యనావశ్యమగును. శివ భజన, సద్భక్తుల సాంగత్యము, ధర్మాచారణ, దయాగుణము పరోపకార వర్తనములనెడివి ప్రతి యొక్కరు పాలించి ఆధ్యాత్మికౌన్నత్యము సాధించవలెనని గుర్తించగలరు. షడ్విధభక్తుల నలవరచికొని స్వేష్టలింగ, ప్రాణలింగ భావలింగముల నర్చించుచు, గురు-జంగమ లింగములను పూజించుట శివభజన యగును. శివభక్తు సాంగత్యము, సదా సదాశివుని గురించిన గోష్టిలో పాల్గొనుటయే సత్సంగము. దుర్జన సాంగత్యము వలన గల్గెడి పరిణామములు తెలియని వారెవ్వరు. ధర్మమనగా షట్ స్థలమని గుర్తెరుగ వలెను. దయయే ధర్మమునకు మూలమనెడి భావమును వహించి సకల జీవుల యెడల కరుణా భావమును ప్రదర్శించవలెను. "పరోపకారార్థమిదం శరీరం" అనెడి నమ్మకమును పెంచికొని, దుఃఖితులై బాధలకు గురియై పరితపించెడి వారికి చేతనైనంత మేరకు సహాయమును చేయవలెను.

ఈ విధముగా పంచరత్నములను తన వశము నందున యుంచికొనిన వారు సంసారములో నుండియును సత్సంబంధితమైన దుఃఖములకు గురి కాకుండా జీవించగలరు.

శివయోగి తన చిత్తమును శివునిలో లీనమొనర్చినవాడైనందున, అతనికి వేరే యంశములు కనిపించవని శ్రీ భగవత్పాదులవారు తెలిపియుండిరి. అద్దానిని ఇంకను వివరణాత్మకముగా తెలుపుటకై యీ క్రింది విధిన నుపదేశమునిచ్చిరి.

**నేదం రజతమిత్యుక్తే యథాశుక్తిః ప్రకాశతే॥**
**నేదం జగదితి జ్ఞాతే శివతత్త్వం ప్రకాశతే॥** (సి.శి.17-10)

ఇది వెండి కాదు అనుట చేత నేవిధముగా ముత్యపు చిప్పప్రకాశము లోనికి వచ్చుచున్నదో, అదే విధిన ఇది జగత్తుకాదు అనుటచేత శివతత్త్వము ప్రకాశమానమగుచున్నదనెడిదే యీ యుపదేశము యొక్క సారాంశము.

శ్రీ భగవత్పాదుల వారు మరొక దృష్టాంతము నీ క్రింది విధముగానిచ్చిరి.

**యథా స్వప్నకృతం వస్తు ప్రబోధేనైవ శామ్యతి।**
**తథా శివస్య విజ్ఞానే సంసారం నైవ పశ్యతి॥** (సి.శి.17-11

ఏ విధముగా నొక వ్యక్తి తాను స్వప్నావస్థయందు చేసిన దానిని మేల్గొనిన పిదప గాంచలేడో, అదే విధముగా అజ్ఞానావస్థలో తాను గాంచిన సంసారమును శివజ్ఞానవిశిష్టుడై వెనుకనద్దానిని చూడడు.ఎటు చూసినా అతనికి శివదర్శనమే గల్గుననెడిది గమనించదగిన విషయము.

శివ జ్ఞానలోపమే సంసారభ్రాంతి పెంపొందుటకు కారణభూతాంశమని తెలిపెడి శ్రీ రేణుకాచార్యుల వారి యుపదేశమును గనుడి.

**అజ్ఞానమేవ సర్వేషాం సంసారభ్రమకారణమ్।**
**తన్నివృత్తౌ కథం భూయః సంసార భ్రమ దర్శనమ్॥** (సి.గ. 17-12)

సంసారమనెడి భ్రమకులోనై బాధపడుటకు గల కారణము శివజ్ఞానములుప్తమగుటే. ఆ శివజ్ఞానము ప్రాప్తించిన పిదప సంసారభ్రమ యెటులగల్గునని యీ శ్లోకము వివరించు చున్నది.

అజ్ఞానమును నిదురతో పోల్చిచెప్పుట యెంతో విజ్ఞానదాయకమైనదిగా నున్నది. ఈ విషయమున నొక కథ గలదు.

ఒక ఊరిలో నొక వ్యాపారి వేరే యూరికి ప్రయాణమై పోవుటకు సంసిద్ధుడయ్యెను. రాత్రివేళ పరుండునప్పుడు తనను తెల్లవారుఝామున లేపమని భార్యకు చెప్పెను. ఆమె లేపెడి సమయమున అతనొక స్వప్నమును గాంచెను. అందులో నతడొక దోపిడి కేసులోన యిరికికొని పోలీసు వారి చేతికి చిక్కినట్లుగా అనుభవమును పొందెను. భార్య లేపిన వెంటనే పోలీసులెచ్చట నున్నారని ప్రశ్నించెను. అప్పుడామే ఏదో పీడకలను గాంచినారాయేమి? అని ప్రశ్నించెను. అజ్ఞాని సంసారము నిజమని తలచెను. జ్ఞానము గల్గిన సర్వం శివమయమ్మని గుర్తించును.

ఈ స్థలము గురించిన బోధనను సుసంపన్నము చేయుట కొరకు కాయానుగ్రహ స్థలములోని శివయోగి జీవన్ముక్తుడని యానతినిచ్చిరి. కనుడి :

**గలితాహంకృతి గ్రంథిః క్రీడాకల్పితవిగ్రహః।**
**జీవన్ముక్తశ్చరేద్ యోగీ దేహివన్నిరుపాధికః॥** (సి.శి.17-9)

నివృత్తి గల్గిన పరిచ్ఛిన్నమైన శరీరాద్యహంకారవంతుడును, స్వేచ్ఛ చేత పరికల్పితమైన కాయము గల వాడును జీవన్ముక్తుడు నైన శివయోగి లోకుల నుద్ధరించుట కొరకు దేహధారి వలె సంచరించు ననెడిది యీ శ్లోకము లోని సారాంశము.

అహంకారమును వీడి చరించెడి కాయ స్థలములోని శివయోగికి సంసార మంతయు క్రీడారంగము వలె దోచును. సంసారములోని బంధములన్నియు క్రీడాంతర్గతముగా నేర్పరచికొనెడి యనుబంధముల వలె యుండును. బాలబాలికలు తాము ఆడికొనెడి సందర్భమున భార్యా, భర్త, తల్లి-దండ్రి, తల్లి-పిల్లలు ఇత్యాది-పాత్రలను పోషించుచు ఆటల నాడి కొందురు. అట్టి క్రీడలలో నుండెడి భార్యా భర్తల సంబంధమునకును నిజ జీవితములోని భార్యా భర్తల సంబంధాలకు తేడా ఉండును కదా! శివయోగి యొక్క సంసారపరమైన బంధము చిన్న పిల్లలు తమ ఆట పాటలలోన యేర్పరచి కొనెడి సంబంధముల వంటివని గుర్తించగలరు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## ఆశీర్వచనము - 1 :

## ఇంద్రియానుగ్రహ స్థలము :

ధర్మాభిమానులైన సద్భక్తులగు మీరింత వరకు ప్రసాదిలింగి స్థలాంతర్గతమే కాయానుగ్రహ స్థలము గురించి తెలిసికొంటిమి. కాయానుగ్రహ స్థలములోని శివయోగి తన కాయము యొక్క దర్శనము వలన లోకముల ననుగ్రహించునని తెలిసికొంటిమి. ఈ శివయోగి యొక్క యింద్రియముల గురించి తెలిపెడి స్థలమే యింద్రియానుగ్రహ స్థలము. ఈ విషయమున శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారి యుపదేశమును గనుడి :

**దర్శనాత్ పరకాయస్య కరణానాం వివేకతః ।**
**ఇంద్రియానుగ్రహః ప్రోక్తః సర్వేషాం తత్త్వవేదిభిః ॥** (సి.శి. 17-14)

కాయానుగ్రహ స్థలములోని శివయోగి స్వీయ దర్శనము వలనను, వివేకయుక్తమై విరాజిల్లెడి కరణ వ్యాపారము వలనను ప్రాకృతాదులను అనుగ్రహించు చుండెడి స్థితిలో నతడు ఇంద్రియానుగ్రహ స్థలియని యనబడును. అతని కార్యక్షేత్రము ఇంద్రియానుగ్రహ స్థలమగును. ఇదియే యీ యుపదేశములోని సారాంశము.

ఇంద్రియానుగ్రహమెట్లు సుసాధ్యమగునో అనెడి విషయమును శ్రీ రేణుకాచార్యుల వారీ క్రింది విధముగా వుపదేశించిరి.

**ఇంద్రియాణాం సమస్తానాం స్వార్థేషు సతిసఙ్గమే ।**
**రాగో వా జాయతే ద్వేషస్తౌ యోగీ పరివర్జయేత్ ॥** (సి.శి. 17-15)

లోకమునందున అందరి శ్రోత్రాది యింద్రియములు స్వీయ వివరముల యందున సంబంధము కల్గియుండును. తత్ఫలితముగా నవి రాగ ద్వేషముల గురించి యున్ముఖత్వము పెంచికొనును. ఇంద్రియానుగ్రహ స్థలము నందలి శివయోగి అట్టివాడు కాదని యీ యుపదేశములోన తెలుపబడినది.

ఈ స్థలమునందలి శివయోగి ఆచార విచారములు శ్రేష్ఠములైయుండును. అతడు తన ఆచార విచారములచేత నన్యులను తన ప్రభావమునకు గురిచేయును. తత్ఫలితముగా సామాన్యులు కూడ వుత్తమ వర్తన గలవారగుచున్నారు. శివయోగి యొక్క ఉపదేశములతోబాటుగా నతని ప్రవర్తన గూడ ప్రేరణ గల్గించెడిదిగా నుండును. ఇతడు తన యింద్రియములను సంయమనము గురి చేయుచు వర్తించుటచేత, అతడొక ఆదర్శ పురుషుడగుచున్నాడు. ఈ విధముగా యింద్రియానుగ్రహస్థలి లోక కళ్యాణమును సాధించుచున్నాడు.

ఇంద్రియములను తమ స్వంత వ్యవహారములలో వినియోగించెడి సామాన్యుడు, కామక్రోధములకు, రాగ-ద్వేషములకు గురియగుచున్నాడు. వీరి రాగ-ద్వేషములవలననెన్నో విపత్తులు సంభవించుచున్నవి. శివయోగి దూరీకృతమైన రాగద్వేషములు గల్గియుండుటచేత నతని యింద్రియ వ్యాపారముల వలన యెట్టి యుపద్రవము సంభవించదని గ్రహించగలరు.

పాము పండ్లను పీకివేసిన పిదప నది అప్రమాదకరమైనదిగా అగును. బాలురైనను దానితో క్రీడించవచ్చును. రాగద్వేషములను త్యజించిన పిదప యింద్రియములు కోరలు పీకిన పామువలె నిరపాయకరములగుచున్నవి.

ఈ విషయమును అక్క మహాదేవి యెంతో హృద్యముగా వివరించినది.

**హావిన హల్ల కళెదు హావనాడిస బల్లరె**
**హావిన సంగలే లేసు కండయ్యా!**
**కాయవికారవ కళెదు కాయదల్లిర్దరె**
**కాయద సంగవే లేసు కండయ్యా!**
**తాయి రక్కసి యాదంతె కాయవికారపు**
**చెన్న మల్లికార్జునయ్య, నీనొలిదవరు**
**కాయ గొండిద్దరెన్న బేడ**

ఈ వచనపు తెలుగు రూపమును గనుడి :

**పాముని పళ్లను గడతేర్చి పామునాడించ గలరేని**
**పాముది సంగమే లెస్స కనుడయ్యా**
**కాయ వికారము గడతేర్చి కాయమందుండినచో**
**కాయపు సంగమేలెస్స కనుడయ్యా!**
**తల్లి రక్కసి యైనయటుల కాయవికారము**
**చెన్న మల్లికార్జునయ్య!**
**నీవు వలచినవారు కాయము గొనియున్న వారన వలదు**

కాయ వికార సహితమైన దేహము రాక్షసియగు తల్లివంటిది. రక్కసికి దయా దాక్షిణ్యములుండునే? తన బిడ్డనైనను పొట్టన పెట్టికొనగల కర్కషత్వము రక్కసి యందుండును కదా! తల్లి రాక్షసత్వమును విడిచినచో తన బిడ్డల కొరకు పరిశ్రమించి వారి సంక్షేమమును చేకూర్చెడి మాతృమూర్తి కాగలదు. రాగద్వేషములనెడి పాము కోరలవంటివి. వాటిని పీకివేసి పాముతో క్రీడించెడి వానికెట్టి భయమును గల్గదు. అదే విధిన రాగద్వేషములను వీడినచో కాయ వికారము గడచిపోవును. కాయమందున్న జీవికి నిరపాయస్థితి చేరును. శివయోగి యిట్టి నిరపాయ స్థితిలో నుండెడి వాడని గ్రహించవలెను. అతడు దేహము గల్గియున్నను దేహియనబడడని తెలిసికొనవలెను. ఆ విధిన యనెడివారు పొరపాటును చేసిన వారగుదురు.

ఇంద్రియానుగ్రహ స్థలము నందలి శివయోగి యొక్క యింద్రియములు పరుషములగునని తెలుపబడినది. పరుషము యొక్క స్పర్శచేత లోహము సువర్ణమగుచున్నది. అటులే శివయోగి యొక్క యింద్రియముల కరణము వలన లోకములు పునీతములగుచున్నవని గ్రహింపదగును. నేత్ర, వాక్, హస్త, పాదాదులచేత శివయోగి లోకముల ననుగ్రహించుచున్నాడని తెలిసికొనవలెను.

ఇంద్రియానుగ్రహ స్థలము నందలి శివయోగి యొక్క యింద్రియ వ్యాపారము లోకోత్తరమై యుండుటవలన లోకముల ననుగ్రహించగల్గుచున్నాడని శ్రీరేణుక భగవత్పాదుల వారుపదేశించిరి. ఈ క్రింది శ్లోకమును గనుడి :

**ఇంద్రియాణాం బహిర్వృత్తిః ప్రపంచస్య ప్రకాశినీ ।**
**అంతః శివే సమావేశో నిష్ప్రపంచస్య కారణమ్ ॥**
(సి.శి. 17-16)

ఇంద్రియముల బాహ్య ప్రవృత్తి వలన సంసారములోని సుఖదుఃఖములకు కారణమగును. అంతర్వృత్తి వలన శివునితో సాంగత్యమేర్పడును. శివయోగి అంతః ప్రవృత్తి గల్గిన యింద్రియములను గల్గియుండును.

మన మనస్సు యింద్రియముల మూలకముగా యెప్పుడు బహిర్ముఖమగునో అప్పుడీ జగత్తు దోచును. అయితే మనము గాఢనిద్రలోను యుండినప్పుడు, మన మనోవృత్తి యంతర్ముఖియై ఆత్మలోన లయమై యుండుట చేత బాహ్య ప్రపంచము గోచరించదు. "చిత్తే చలతి సంసారః " అనెడి లోకోక్తి గలదు. సంసారమనెడిది మన చిత్తము నందున కల్గించుచుండును. బహిర్ముఖియైన యెడల సంసారము, అంతర్ముఖియైన యెడల నిష్ప్రపంచ స్థితి యనుభవములోనికి వచ్చును. జాగ్రదావస్థయందున యింద్రియములు స్పర్శాది యనుభవములను పొందును. వాస్తవముగా చూచిన యెడల సృష్టికర్త మానవులను పుట్టించునప్పుడు వారి యింద్రియములను బహిర్ముఖములుగా నుండెడి విధముగా పుట్టించెను. అట్టి యెడ యింద్రియములను అంతర్ముఖముగా నెందుకొరక చేసికొనవలెననెడి ప్రశ్న ఉదయించును. ఇంద్రియముల వలన క్షణికమైన సుఖమే ప్రాప్తమగును. ఇంద్రియములను అంతర్ముఖముగా చేసిన యెడల శివ సాక్షాత్కారము సుసాధ్యమగును. శివసాక్షాత్కారమైన పిదప యావత్ జగత్తు శివమయమై కన్పట్టును.

ప్రపంచమంతయు శబ్ద స్పర్శాది విషయములతో నిండియున్నది. విషయములనెడివి విషయముల కంటెను శక్తివంతమైనవి. బహిర్ముఖముతో యింద్రియములను విషయములు శక్తిహీనములయ్యెడి విధముగా తమ ప్రభావమునకు గురిచేయును. చివరకు యింద్రియములు బలరహితములై

విషయ గ్రహణ సామర్థ్యమును కోల్పోవు దశకు చేరికొనును. ఈ కారణమున నే యుపనిషత్తులు యింద్రియములను గ్రహములనియును, విషయములను అతిగ్రహములనియును గుర్తించినవి. యభిలాష యమితముగా నుండును.

మనలో రూపము ననుభవించెడి కళ్ళు రూపానుభవమును గల్గించును. వయస్సుతోబాటు చూపు తగ్గుచుండును. చూచెడి సామర్థ్యమును పెంచికొనుటకై పలు విధములైన ప్రయత్నములు చేయుచు చేయుచు చివరకు చూపును కోల్పోయెడి దుస్థితిని తేబడుదుము. రూపమనెడిది విషయము కన్ను అనెడి యింద్రియమును కబళించి వేసినదనెడిది గ్రహింపదగిన యంశము.

మనస్సుకు విషయాభిలాష మెండుగా నుండును. దినదినమది పెరుగునే కాని తరగదు. ఇంద్రియ బలహీనత వలన మనస్సు బాధకు గురియగును. అసంతృప్తికి గురియగును. ఈ కారణముననే చాలామంది అసంతృప్తితో విలపిస్తూ విలపిస్తూ విను వీధికి వెడలెదరు. ఏడ్చుచు చచ్చేవారు కోట్లాది సంఖ్యలో నుందురు. నవ్వుచూ అసువులను బాసెడివారు కొందరు మాత్రమే. ఏడ్చుచు చచ్చేవారికి మరుజన్మ తప్పునే?

ఈ విధముగ స్రక్–చందన–వనితాది విషయ రూపమైన ప్రపంచము అందరిని ఏడ్పించుచుండును. ఇంతటి దుఃఖకరమైన ప్రపంచమునందున, నగుచు నగిపించెడి మహాత్ములు– శరణులు నొకరిద్దరు మాత్రమే వుందురు. ఏడ్పులో దుఃఖాతిరేక సంకేతమండినచో, నగుటలో నానందాతిరేకపు సౌంజ్ఞ నిబిడీకృతమై యుండును.

ఈ ప్రపంచమునొక విఫణి వీధితో పోల్చవచ్చును. చిన్న పెద్ద అంగడులెన్నో అమ్మకపు ప్రక్రియను చేపట్టుచున్నవి. అసంఖ్యాకమైన జనము పదార్థ సంచయమును కొనుచున్నారు. పదార్థములన్నియును దుఃఖదాయకములే. అయితే, సుఖమనెడి పలుచని లేపనము పదార్థములపైన పూయబడుచున్నది. అద్దానిని గాంచిన అజ్ఞానులు పదార్థములు సుఖప్రదములని భావించుచున్నారు.

ప్రతియొక్కరి ఆత్మ సుఖరూపమై యున్నది. కాని యితరములన్నియును దుఃఖరూపములే. తనలోనే గల సుఖరూపమైయున్న ఆత్మను మరచి యితర వ్యక్తులు లేదా వస్తువులు సుఖదాయకములని భావించికొని సగటు మనిషి దుఃఖమునే వరించుచున్నాడు. ప్రతియొక్కడు వేరొకని సుఖము నివ్వమని కోరుచున్నాడు. ఇద్దరిలోను దుఃఖము వుండుటచేత సుఖము వారికి చిక్కుటలేదు.

ఈ విధముగా బహిర్ముఖమైన యింద్రియముల వలన సుఖము గల్గునని భావించుటలో భ్రమ మాత్రమే గలదు. ఈ స్థితిలో సుఖము లభించుట కలలోని మాట యగుచున్నది. అయినా మనిషి భ్రమను వీడలేని స్థితిలో నున్నాడు. ఎదుటివాడు సుఖపడుచున్నాడని భావించును. కలిసినప్పుడు బాగున్నారా? అని ప్రశ్నించుచున్నాడు.

లోకమున బహిర్ముఖియై యుండెడివానికి దుఃఖము తప్పదనెడి విషయమును తెలిపెడి కథయొకటి కలదు.

ఒక భక్తుడు సంసారపు దుఃఖము వలన విసిగిపోయి శివుని వద్దకు వచ్చి "ఓ మహాదేవా! ఇన్ని వర్షములవరకు ప్రపంచమున యుండి, దుఃఖము ననుభవించుచు విసిగిపోయితిని. ఈ దుఃఖమును దూరము చేయు"మని విజ్ఞాపనను చేసెను. పరి పరి విధములుగా వేడికొనెను. అప్పుడు శివుడు భక్తునుద్దేశించి "నీవు వసించెడి యీ జగత్తు దుఃఖమయమైనదే. ఇందులో సుఖము కంటెను దుఃఖము అధికముగా నుండును. దుఃఖ భరితమైన ప్రపంచమున వసించుచు, దుఃఖమునుండి దూరమగుట యే విధముగా సాధ్యమగును? నీ కిష్టమైన యెడల నీ దుఃఖమునితరులకిచ్చి వారి దుఃఖమును నీవు స్వీకరించుము. తన్నిమిత్తమై వలయు యేర్పాట్లు చేసెద"నని అనెను.

శివుని మాటలను వినిన భక్తుని కెంతో నూరట గల్గెను. "అటులనే కానిమ్ము" అని అనెను. తన బరువైన దుఃఖము నితరులకిచ్చి, తేలికగా నుండెడి దుఃఖమును గ్రహింపనెంచెను.

ఈ విధిన శివునికి విజ్ఞాపన చేసిన వారి సంఖ్య గణనీయముగా నుండెను. వీరందరిని కైలాసమునకు రమ్మని ఆనతినిచ్చును. "మీ మీ దుఃఖములను మూటలుగా కట్టికొని భుజమున వేసికొని, నిర్ణయించిన సమయము వరకు రం"డని శివుడనెను. వారు శివుడాదేశించిన విధముగా కైలాసమును చేరిరి. శివుడు వీరిని నొక పెద్ద మంటపమునందున సమావేశపరచెను. "మీ మీ దుఃఖముల మూటలను గూటమునకు వేయుడి" యని శివుడాదేశించెను. వారు తమ దుఃఖపు మూటలను మంటపము గోడయందు గల గూటముల వేసి వ్రేలాడగట్టిరి. ఆ పిదప శివుడు "మీకు నచ్చిన మూటను గైకొను"డనెను. ప్రతి యొక్కనికి తమ తమ దుఃఖపు మూటలు చిన్నవని తెలిసెను. మారు మాటాడకుండా నెవ్వరి మూటలను

వారు గైకొని తమ తమ దారులలో వెడలిపోయిరి. ఈ సందడిలో శివుడున్న విషయమును గమనించలేకపోయిరి. అతని న లక్ష్యమునకు గురిచేసిరి.

అయితే, శివయోగికి యంతర్ముఖోన్ముఖత గల్గియుండుటచేత నతడు సుఖదుఃఖములకు లోనుకాడు. సర్వత్ర నతనికిశివదర్శనమే కల్గుచుండును. అది యెట్టులగునో అనెడిది తెలుపుటకై శ్రీ భగవత్పాదులవారీ క్రింది యుపదేశమునిచ్చిరి.

**క్షణమంతః శివం పశ్యన్ కేవలేనైవ చేతసా ।**
**బాహ్యార్థానామనుభవం క్షణం కుర్వన్ దృగాదిభిః ॥**
**సర్వేంద్రియ నిరూఢోఽపి సర్వేంద్రియ విహీనవాన్ ।**
**శివాహితమనా యోగీ శివం పశ్యతి నాపరమ్ ॥** (సి.శి. 17-17-18)

అంతర్ముఖుడై కేవల చేతస్కుడై చిత్తమును శివునిపై నిలిపి కొంచెము సమయము వరకు శివుని చూచుచు, క్షణకాలము వరకు బాహ్యేంద్రియముల చేత విషయానుభవమును పొందుచు శివయోగి బాహ్య ప్రపంచమునను శివునినే దర్శించుచుండును.

ఈ విధముగా శివయోగి యీ స్థలమున యింద్రియ సహితుడైయుండినను యింద్రియ రహితునివలె ప్రవర్తించుచుండును. అంతర్ముఖియై శివుని సందర్శించుచు, అదే సమయమున బహిరంగములోని కరణములవలన లోకుల ననుగ్రహించుచున్నారు. వీరశైవులీ దశకు చేరుటకై యత్నింతురు గావుత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యులవారు శివయోగి యింద్రియానుగ్రహస్థలి యెట్టులగునో యనెడి దానిని వివరముగా తెలియజెప్పిరి.

ఇంద్రియముల వలన గల్గెడి ప్రభావమెంతో బలవత్తరమైనదై యుండును. "శరీరమ్ రథమేవచ", "ఇంద్రియాణి హయాన్యాహుః" అనెడి కఠోపనిషద్వాక్కుల ప్రకారము కాయమనెడి రథమునకు నింద్రియములే గుర్రములు. బుద్ధి రథసారథి కాగా, మనస్సు కళ్ళెములగుచున్నవి. విషయము లనెడి పథమున రథము పయనించునని చెప్పబడినది. "ఇంద్రియైరేవ జాయన్తే పాపాని" అనెడి దొక విబుధోక్తి. పాపకర్మియైన జీవి పతనమై పోవును. సంసారమనెడి వలలో చిక్కి విలవిల లాడును. ఆకలి దప్పులతో నలమటించును. జన్మ జరామరణాదులకు లోనౌను. ఇట్టివానికి నివృత్తి మార్గము గోచరించదని తెలియుచున్నది. ఈ విషయమును విశదపరచెడి శ్రీ బసవేశ్వరులవారి క్రింది వచనము గమనించదగినదైయున్నది.

**ఆసె, ఆమిష తామసహుసి విషయ**
**కుటిల కుహక క్రోధ క్షుద్ర మిథ్యె**
**ఇవనెన్న నాలిగెయ మేలిందత్త తెగెదు కళెయయ్యా!**
**అదే కెందదె నిమ్మత్తలెన్న బరలీయవు**
**ఇదు కారణ యివెల్లవ కళెదు**
**ఎన్న పంచైవర భక్తిదమాడు**
**కూడల సంగమ దేవా!** (వ.సం. 46)

దీని తెలుగు రూపమును గనుడి :

**ఆశ ఆమిష తామస పుసి విషయ**
**కుటిల కుహక క్రోధ క్షుద్ర మిథ్య**

**వీటినినా నాలుకమీద నుండి యటు**
**తీసి కదుపుమయ్యా**
**అదెందు కనినచో మీవైపు నన్ను రానీయవు**
**ఈ కారణమున వీటినెల్ల కడపి**
**నా పంచయ్యల భక్తుల జేయు**
**కూడల సంగమ దేవా!**

పంచయ్యలనగా పంచేంద్రియములనియును, భక్తులను చేయుమనగా వాటిని శివోన్ముఖములుగా చేయవలెనని గ్రహించవలెను. ఇంద్రియములు బహిర్వృత్తి ప్రపంచము గల్గించును. సంసార లంపటమున పడవేయును. "అంతః శివే సమావేశో నిష్ప్రపంచస్య కారణమ్" అనెడి రేణకోక్తి (సి.శి. 17-16) స్మరణీయము. శివోన్ముఖతవలన యింద్రియములు పునీతములై నిష్ప్రపంచ స్థితి యేర్పడుటకు కారణభూతాంశము లగుననెడిది గ్రహించవలసిన విషయము. అంగ ప్రసాది స్థలములోని సాధకుని యింద్రియములకు శివోన్ముఖత గల్గించుటకే శివుడు ఇంద్రియానుగ్రహస్థలిగా నవతరించుననెడిది తాత్త్విక విషయము. తన యింద్రియ వ్యాపారములకు, శివోన్ముఖత కల్పించి తద్వార సాధకుల కొక ప్రేరణను కల్పించుటే యింద్రియానుగ్రహ స్థలియొక్క లక్ష్యమని గ్రహించవలెను.

శివయోగి క్షణకాలము వరకు నంతర్వృత్తిని గల్గి శివుని వీక్షించును. మరుక్షణముననే బహిర్వృత్తిని గల్గి భక్తుల వీక్షించును. అతని మనస్సు శివ విశిష్టత గల్గియుండుటచేత బహిర్వృత్తిలోను నతని యింద్రియములన్నియును శివయోగముననుండును. అతనికి సర్వత్ర, శివదర్శనమే ప్రాప్తించును.

పర జంగముడే యింద్రియానుగ్రహ స్థలి యగుననియుననియును, అతని నడతలోను, నిదురలోను శివార్చన శివార్పణ ప్రసాదానుభవములు గల్గునని తెలిసికొనగలరు. మెలకువ, నిదుర యనెడి తేడాలతని కుండవని గ్రహించగలరు. అతడు నుడివినది శివతత్త్వమగును. అతని నిదురించినచో శివయోగ ముద్రలో నున్నాడని తెలిసికొనవలెనని విజ్ఞుల యభిప్రాయము.

ఇట్టి పరస్థలి పాదస్పర్శవలన పాపి పావనుడై పరమ పదమును పొందునని తెలుపబడినది. ఈ విషయమును తెలిపే యీ వచనమును గనుడి :

**బ్రహ్మంగె వాక్పరుష విష్ణువుంగె నయన పరుష రుద్రంగె హస్త పరుషే**
**నమ్మ కూడల సంగన శరణంగె పాదవెపరుష**

(వ.సం. 875)

పాదమనెడి కర్మేంద్రియము, స్పర్శవేది ఇనుమును బంగారము చేసే విధిన, భవిని విముక్తిని పొందినవానిగా చేయునని చెప్పబడినది. శివయోగి యొక్క పాదములను దర్శించి, స్పృశించిన వారు ధన్యులగుదురనెడిది గ్రహించవలసిన విషయము.

- శివం భూయాత్ -

## ఆశీర్వచనము 2

## ఇంద్రియానుగ్రహ స్థలము :

ఇంద్రియానుగ్రహస్థలము నందలి శివయోగి యంతర్ముఖియై శివునితో సంబంధము గల్గియుండునని తెలిసికొంటిమి.

ఇంద్రియానుగ్రహ స్థలమునందలి శివయోగి దైహిక ధర్మములవలన పీడితుడై బాధకు గురికాడని తెలుపుచు శ్రీ రేణుకాచార్యులవారీ క్రింది యుపదేశమునిచ్చిరి :

**న జరా మరణం నాస్తిన పిపాసా నచక్షుధా ।**
**శివాహితేంద్రియ స్యాస్య నిర్మనస్య మహాత్మనః ॥** (సి.శి. 17-19)

శివ నివేశితమౌ దేహేంద్రియ వ్యాపారములు గలవాడును, దేహాభిమానమును త్యజించిన వాడును, అగు శివయోగికి జరా-మరణ ఆకలి దప్పులుండవనెడిది యీ యుపదేశము యొక్క సారాంశము.

జగత్తులోని జనులందరికి జరా-మరణ, ఆకలి-దప్పి, సుఖదుఃఖములనెడివి యుండుట సహజసిద్ధమైన విషయమే. వీటిని షడూర్ములని యందురు. వీటిలో నాకలి-దప్పులు ప్రాణములై యున్నవి. జనన-మరణము దేహపు ధర్మములు కాగా సుఖదుఃఖములు మనస్సుకు చెందిన ధర్మములని గ్రహించవలెను.

ఆత్మజ్ఞాన విహీనులు వీటిని యాత్మ యొక్క లక్షణములని భావించికొని "నాకు ఆకలైనది", నాకు దాహమైనది, నేను సుఖినైతిని, నేను దుఃఖినైతిని, నేను ముదుసలినైతిని, నేను మరణించెదననుచు మాటలాడుటను గాంచగలము.

శాస్త్రకారుల ప్రకారము శరీరము షడ్భావ వికారములను లోనగుచున్నది. అవి యేమనగా అసి, జాయతే, వివర్ధతే, విపరిమణతే, అపక్షీయతే, వినశ్యతే. మాతృగర్భముననున్న శిశువు "అస్తి" దశలో నుండును. ప్రసవానంతరము జాయతేయను వికారము గల్గును. మాతా-పితరుల పోషణలో నన్న పానాదుల చేత పెరిగి పెద్దగగుటను "వివర్ధతే" యనెడి భావ వికారమందురు. పెరుగుదల పరిపూర్ణమైన యప్పుడు విపరిణమతే యనెడి వికారము గల్గును. ఒక వ్యక్తి రోగాదులచే పీడింపబడెడి స్థితిలో నతడు "అపక్షీయతే" యనెడి వికారమునకు లోనగును. చివరగా వినశ్యతి యనెడి వికారము వలన కాయము నష్టమై పంచభూతములలో లయమగును. ఈ కాయము బహువిధములైనవికారములకు లోనగుచున్నది. వీటిలో జనన-మరణములు గలవు.

జనన-మరణములు దేహపు ధర్మములని యెరుగనివాడు, ఇవి ఆత్మ లక్షణములని యెంచి బాధకు గురియగుచున్నాడు. శివయోగి దేహాభిమానములేనివాడై యుండుటచే నతనికి జనన-మరణములుండుననడి భావన స్ఫురించదు. కాయము నొక యుపాధిగా గైకొనెడి శివయోగి కాయము పొందెడి "జాయతే" "వినశ్యతే" అనెడి వికారములు సంభవించుట సహజమని యెంచి నిర్లిప్తుడైయుండును.

ఇక ఆకలి-దప్పుల గురించి చెప్పవలెననిన, నియ్యవి ప్రాణపు లక్షణములు లేదా ధర్మములై యున్నవి. ప్రాణమును నిలుపుకొనుటకై ప్రతి జీవి ఆహార పానీయాదులను గ్రహించుచున్నాడు. ఇవి సక్రమముగా లభించనప్పుడు దేహము ప్రాణమును వీడెడి దశకు చేరికొను ప్రాణభీతి గల పామరుడు ఆకలి దప్పులు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసికొనును. సకాలములో ఆహారాదులను స్వీకరించును. దేహాభిమాన-విహీనుడైన శివయోగికి ప్రాణము గురించి లెక్కపెట్టడు. ప్రాణభీతి లుప్తమైన దశలో ఆకలి-దప్పులుండవు కదా!

సుఖదుఃఖములు మనస్సుయొక్క ధర్మములు. ప్రతివ్యక్తి సుఖమును పెంచికొని దుఃఖమును నిర్మూలము చేయుటకై కోరికొనును. మనస్సు కోరెడి కోరికను తీర్చికొనుటకు యింద్రియములు విషయోపభోగము వైపు పరుగులు తీయును. శివయోగి యొక్క మనస్సు శివునిలో లగ్నమై యుండుటచేత యతని యింద్రియములు బహిర్ముఖ ప్రవృత్తికి గురికావు. విషయోపభోగముల యెడల నాసక్తిని చూపడు. అందుచే, అతనికి సుఖదుఃఖముల చింత వుండదు.

సామాన్యునికి సర్వత్ర షడూర్ముల చింత యుండునని తెలియుచున్నది. ఈ విషయమును ప్రవ్యక్తము చేసెడి కల్లయ్య గారి వచనమును కనుడి :

**హగలు హసివెగె కుదిదు, ఇరుళు నిద్రెగె కుదిదు**
**ఉళిదాద హొత్తెల్ల అశన-వ్యసనక్కె కుదిదు**
**అయ్యా! నిమ్మ నరియద పాపినానయ్యా!**
**అయ్యా నిమ్మ నరియద కర్మి నానయ్యా!**
**మహాలింగ కల్లేశ్వరా!**
**అగస నీరడిసి సత్త తెరనాయిత్తెన్న ముక్తి**

దీని తెలుగు రూపమిది :

*పగలు ఆకలికై కుదిసె, రాత్రి నిద్రకై కుదిసె,*
*మిగిలిన పొద్దంత అశన-వ్యసనములకై కుదిసె*

*అయ్యా! మిమ్ముల లెరుగని పాపినేనయ్యా!*
*అయ్యా! మిమ్ములెరుగని కర్మినేనయ్యా*
*మహాలింగ కల్లేశ్వరా!*
*చాకలి దప్పిగొని చచ్చిన తెరగయ్యెనా ముక్తి*

శివయోగి సామాన్యునికి భిన్నముగా నుండును. పగలు రాత్రి శివసాన్నిధ్యమున చిదానందము ననుభవించును. అశన–వ్యసనములతని కనావశ్యములు. శివునెరుగలేని యజ్ఞాని వలె పరితపించడు. శివుని తానెరిగి, ఆ శివునిలోనే లీనమై, చిద్విభూతియై, శివకారుణ్యమును తన స్వీయేంద్రియ–కరణముల ద్వార లోకమున కందించెడి కరుణామయుడు.

శివయోగులు నన్నపానీయాదులను స్వీకరించుటను గమనించగలము. అయినను సామాన్యునివలె ఆకలైనదని తిండిని, దప్పిగొంటినని పానీయమును గైకొనడు. ఆకలి–దప్పులు ప్రాణధర్మములనియును, తద్ధర్మాచరణ నిమిత్తమే ఆహారాదులను స్వీకరించును.

శివయోగికి ప్రాణాభిమానము వుండదు. దేహప్రాణాభిమానములు లేనివాడై చరించుచుండును. సామాన్యుని స్థితి యిట్టులుండదు. అతనికి మెండైన అధికారము నిండుగా నుండును. ఉదాహరణకై చెప్పవలెననిన తానొక యింటిని కట్టికొని యిది నాది యనెడి యభిమానమును వహించి విచ్చలవిడితనము నలవరచికొని ప్రతాప వైభవమును ప్రదర్శించును. త్రైలోక్య సంపద యుద్భవించుటకు కారణభూతుడైన శివుడు మౌనముగా నున్నాడు. తన బీజము వలన వృక్షములకు జన్మనిచ్చెడి చెట్లు మాట్లాడక మౌనముగా నున్నవి. అహంకారియైనమనిషి వృధాలాపములను వ్యక్తీకరించుచున్నాడు. అభిమాన–మమకారములు లేనివాడే మోక్షమును పొందగలడనెడిది శాస్త్రోక్తి. ఇద్దానిని గమనించి ప్రవర్తించెడి వారి సంఖ్య తక్కువే! వీరశైవులు మౌనము యొక్క ప్రాముఖ్యత గురించి తెలిసికొని మౌనముగా నుండుటకై ప్రయత్నించవలెను.

ఇంద్రియముల అంతర్ముఖీకరణను సాధించదలచినవాడు మనో వ్యాపారములకు శివోన్ముఖత కల్పించవలెనని శ్రీ రేణుకాచార్య భగవత్పాదులవారు వుపదేశించిరి. ఈ వుపదేశమును గనుడి :

**మనో యత్ర ప్రవర్తేత తత్ర సర్వేంద్రియా స్థితిః ।**
**శివే మనసి సంలీనే క్వ చేంద్రియవిచారణా ॥** (సి.శి. 17–20)

ఎక్కడ మనస్సు నిలిచియుండునో అచ్చట సర్వేంద్రియములు నిలిచియుండుననియు, మనస్సును శివునిలో లీనమొనర్చిన యెడల యింద్రియ వ్యాపారములుండవనెడిదే యీ యుపదేశములోని సారాంశము.

మన దేహములోన పంచజ్ఞానేంద్రియములును, పంచ కర్మేంద్రియములను గలవు. ఇవన్నియును మనస్సు యొక్క అధినేతృత్వములో కార్యాచరణను చేయును. మనమేదైనా నొక వ్యవహారమును చేపట్టగోరినప్పుడు తన్నిమిత్తమై మనస్సు యొక్క సహకారమును కోరవలసియుండును. అందుచేతనే శాస్త్రకారులు "ఇంద్రియాణాం మనోనాథః" యని సెలవిచ్చిరి. సర్వేంద్రియముల సర్వాధికారి మనస్సే యనెడిది యీ శాస్త్రోక్తి యొక్క సారాంశము.

ఇంద్రియముల వ్యవహారములో మనస్సు కీలకమైన పాత్రను పోషించును. మనస్సు ప్రమేయము లేకుండ చెవి శబ్దమును, చర్మము స్పర్శను, నేత్రము రూపమును, నాలుక రసాస్వాదనను, ముక్కు వాసన పీల్చుటను తమ తమ అనుభవములోనికి తేజాలవు. ఇంద్రియములకు స్వతంత్రించి వ్యవహారమును సలిపెడి అవకాశమే వుండదు.

శబ్ద స్పర్శాది విషయముల గురించి వాస్తవికముగా విచారమును చేసినచో తెలిసెడిదేమనగా నివి చెవి యిత్యాదులకు కావలసినవికావు. విషయములు మనస్సుకే కావలెను. మనస్సే యింద్రియముల మూలమున విషయముల ననుభవించును. సుఖాభిలాష గలదై సుఖానుభవ సంప్రాప్తికై యింద్రియములను సాధనములుగా గొని మనస్సు తన వ్యవహారమును చేపట్టుచుండును.

మనస్సు యొక్క కీలక స్థానము దృష్ట్యా, శ్రీ రేణుకాచార్య భగవత్పాదులవారు మనస్సును శివునిలో లీనము చేయుటలోన నౌచిత్యము గలదనియును తద్వార యింద్రియముల బహిరున్ముఖతను నిరోధించవచ్చునని హితబోధను చేసిరి. ఈ విషయము విస్పష్టము చేసెడి అక్కగారి యీ యనుభవోక్తిని గనుడి :

**లోకపు చేష్టకు రవి బీజమైనటుల**
**కరణముల చేష్టకు మనమే బీజము**
**నాకున్నదొక మనసు**
**ఆ మనస్సును మీయందున**
**నొడబరచిన పిదప నాకు భవము గల్గునే**
**చెన్న మల్లికార్జునా!**

నిద్రావస్థలో యుండెడి స్థితిలో సామాన్యుడు అంతర్ముఖియై యుండును. అట్టి స్థితిలోన యింద్రియముల వ్యవహారము క్రియాశీలకముగా నుండదు. శివయోగి తన యోగ సామర్థ్యము వలన యీ స్థితిని జాగ్రదావస్థలోనే పొందును. శివునిలో లీనమైయుండెడి శివయోగి యొక్క మనస్సు విషయోప భోగమునకై ఆస్కారమును కల్పించదని గుర్తించగలరు.

ఇంద్రియానుగ్రహ స్థలమునందలి శివయోగి బాహ్య ప్రపంచమున దేనిని చూడగల్గును అనెడి ప్రశ్న కలుగవచ్చును. ఈ విషయమున శ్రీ రేణుక భగవత్పాదులవారి యుపదేశ మీ క్రింది విధముగా నున్నది.

**యద్యత్ పశ్యన్ దృషా యోగీ మనసా చింతయత్యపి ।**
**తత్తత్ సర్వం శివాకారం సంవిద్రూపం ప్రకాశతే ॥** (సి.శి. 17-21)

శివయోగి యే యే వస్తువులను కళ్లతో వీక్షించునో, మనస్సు చేత యేయే విషయములను చింతించునో, అవన్నియు శివరూపముననే దేదీప్యమానముగా ప్రకాశించుచుండుననెడిదే యీ యుపదేశము యొక్క తాత్పర్యము.

మన మనస్సు శివమయమైన పిదప మనము దేనిని చూసినను నది శివాకృతిలో దోచును. కళ్ళకు ఎరుపు కళ్ళద్దాలను పెట్టికొనిన వానికి లోకమంతయూ ఎరుపుగా దోచిన యటులే, మనస్సనెడి నయనములకు శివుడనెడి అద్దములను ధరించిన యెడల లోకము శివమయముగా దోచకుండగ నుండగల్గునే?

సృష్టి మార్చెడి సామర్థ్యము మానవునకుండదు. కాని తన స్వీయదృష్టిని పరివర్తనకు గురిచేసిన యెడల సృష్టిని మనకెట్టుల వలయునో అట్టుల గాంచగలము. శాస్త్రకారులు దీనిని దృష్టి-సృష్టివాదమని యందురు. ఈ విధిన దృష్టిని పరివర్తన చేసికొనినచో నొక వ్యక్తి తన యింద్రియ వ్యవహారములలో శివుని రూపమును గాంచగలడు. శివయోగి యిట్టివాడే. యితని బహిరంగ-అంతరంగ వ్యవహారములలోశివుడే కన్పట్టుచుండును.

శివదృష్టిని బడసిన శివయోగి యొక్క యోగ సాధన యెట్టులుండుననెడి కుతూహల పూర్వకమైన ప్రశ్న తలయెత్తవచ్చును. ఈ విషయమును గురించి శ్రీ భగవత్పాదులవారి యుపదేశమీ క్రింది విధముగా నున్నది.

**కరణైః సహితం ప్రాణం మనస్యాధ్యాయ సంయమీ ।**
**యోజయేత్ స శివః సాక్షాద్ యత్ర నాస్తి జగద్భ్రమః ॥** (సి.శి. 17-22)

కరణములలో సహా ప్రాణమును మనస్సునందున సంస్థాపన చేసి యద్దానిని యే శివయోగి శివునితో ననుసంధానము చేసికొనునో అచ్చట "జగత్" అనెడి భ్రమకు నాస్కారము లేదనెడిది యీ వుపదేశము యొక్క సారము.

ఒక వ్యక్తి యొక్క యింద్రియ వ్యవహారములకే విధముగా మనస్సు కారణమగునో అదే విధముగా ప్రాణము కూడ కారణభూతమైన యంశమగుచున్నది. వేదాంత శాస్త్రమునందున ప్రతిపాదింపబడిన పంచీకరణ ప్రక్రియానుసారముగా అపంచీకృత పంచమహాభూతముల సమిష్టి రజోగుణము వలన ప్రాణముత్పన్నమగును. దీని సత్వగుణము వలన అంతఃకరణములు జనించుననెడిది గుర్తుంచుకొనవలసిన విషయము. అంతఃకరణము జ్ఞానమునకు సాధన భూతమైనదగును. ప్రాణమేమో సకల క్రియలకును ప్రధానాధారమైయన్నది. దేహమున ప్రాణము లేనియెడల యింద్రియముల వ్యవహారము కొనసాగదు. ప్రాణము యొక్క ప్రాముఖ్యతను దెలియజెప్పెడి కథ యొకటి కలదు.

ఒకసారి యింద్రియములు, మనస్సు మరియు ప్రాణముల మధ్య కలహము ప్రారంభమయ్యెను.

"నేను గొప్ప-నేను గొప్ప" యనుచు వాదులాట చేయనారంభించిరి. కలహము పెరిగి పెరిగి పెద్దదయ్యెను. అవి తమలోని తగవును తీర్చికొనుటకై బ్రహ్మదేవుని సన్నిధికి వెడలినవి. బ్రహ్మగారు వాద ప్రతివాదముల నెంతో ఆసక్తితో వినెను. తన తీర్పును ప్రకటించుచు మీలో నెయ్యది దేహమునుండి నిర్గమించినప్పుడు దైహిక వ్యాపారములు నిలిచిపోవునో అది శ్రేష్ఠతమమైన"దని చెప్పెను. ఇంద్రియములు మనసు యిత్యాదులు బహిర్గమనము చేసినను దేహము యొక్క అస్తిత్వమునకెట్టి ప్రమాదము వాటిల్లలేదు. ప్రాణముండుటచేత దైహిక వ్యవహారములు కొనసాగుచునే యుండెను. వ్యవహారములు కొనసాగుచునేయుండెను. ఇంద్రియాదులు అంతర్గతమైన పిదప ప్రాణము బయటికి వెడలగా కాయము శవమై జడపదార్థముగా మారెను. ఈ కథవలన తెలిసెడిదేమనగా ప్రాణము శ్రేష్ఠతమమైనది. సకలేంద్రియ వ్యవహారముల కిది కారణభూతమైనదని తెలిసికొనగలరు. ఇట్టి ప్రాణమును మనస్సులోను, మనస్సును శివునిలోను లయమొనర్చెడి శివయోగి ధన్యుడగుచున్నాడు. ఈ స్థితిలో జగత్తు-శివుడు-జీవుడు భిన్నమైనవనెడి భ్రమ దూరమగును. ఎటు చూసినను శివరూపమే కన్పట్టుచుండును. మాయా ప్రపంచమును నమ్మిన వానికిట్టి శివదర్శనము లభించదు. శివాద్వైత జ్ఞాన సంపన్నుడు మాత్రమే జగత్తులోని ప్రతియంశములోను శివుని దర్శించగలడు.

శివాద్వైత జ్ఞానమును పొందెడి విధి విధానమే శివయోగమని యందురు. ఇద్దానినే శ్రీ భగవత్పాదులవారిచ్చట యుపదేశించిరి.

సంసారమనెడి యింద్రియముల బహిరున్ముఖత వలన గల్గుచున్నవి. సంసారమునుండి దూరమగుటకై బహిరున్ముఖతను నిరోధించవలెను. తన్నిమిత్తమై మనోనిగ్రహము కావలెను. తన్నిమిత్తమై శమ-దమముల సహకార మవశ్యముగావలెను. ఈ విధముగా మనోనిగ్రహము మన యింద్రియముల నిగ్రహము పరస్పర పూరకములని గుర్తించగలరు.

కేవలము బహిరింద్రియోన్ముఖతను నియంత్రించినందువలన లక్ష్యము నెరవేరదు. మనస్సును కూడ నియంత్రణలోనికి తేవలసిన యవశ్యకత కలదు. మనోనిగ్రహ నిమిత్తమున ప్రాణము యొక నిగ్రహము ప్రతిపాదింపబడినది. మనస్సు యొక్క గతి, ప్రాణము యొక్క గతిని యనుసరించి యుండునని గ్రహించవలెను. అందుచేత, ప్రాణము నిరోధింపబడినప్పుడు మనస్సు నిరుద్ధమైనదగును. ఈ కారణముననే యోగశాస్త్రమునందున ప్రాణాయామము వొక శాస్త్రవిహిత ప్రక్రియగా నిర్దేశింపబడినది. మనస్సును అదుపులోనుంచికొనుట కొరకు ప్రాణాయామమును చేయవలెనని యోగపుంగవులుద్ఘాటించుచున్నారు.

లోకాచారము ప్రకారము జప తపాదులు ప్రారంభించు సమయమున ప్రాణాయామము చేయవలెననెడి నియమమొకటిగలదు. గురుముఖమున ప్రాణాయామ పద్ధతిని గురించి తెలిసికొని ప్రాణాయామమును చేయవలెననెడిది సూచింపబడినది. ప్రాణాయామము వలన ప్రాణము మీద నియంత్రణను సాధించి తద్వార మనస్సు మీద పట్టును చేపట్టవలెనని తెలుపబడినది. వాయువువలె చంచలముగా నుండెడి మనస్సును నియంత్రించుటకై వాయువును నిరోధించి ప్రాణము మీద అదుపును సాధించవలెనని తెలుపబడినది. వాయువును నిరోధించెడివాడు మనస్సునతి సులభముగా నియంత్రించగలడనెడిది తెలుపబడినది. ఈ విధముగా ప్రాణాయామము మనోనిగ్రహసాధన మగుచున్నది.

ఇంద్రియములను మనస్సును నియంత్రించెడివాడు వాటిననుగ్రహించిన వాడగుచున్నాడు. తుంటరియై తిరుగాడెడి తనయునిపై వాని తల్లిదండ్రులు చేపట్టెడి నియంత్రణ వానిని యున్నతస్థితికి తీసికొని వెడలుటకే కదా! ఇది యనుగ్రహము కాదా! శివయోగి తన యింద్రియాదులను నియంత్రించుట కూడా యిట్టిదేయని గ్రహించగలరు. మనస్సు నియంత్రణలోనికి తెచ్చికొని, జపము చేసి యద్దానిని శుద్ధీకరణ చేసి, ఆ పిదప మనస్సును శివుని కర్పించెడి శివయోగికి సర్వత్ర శివదర్శనమగుచుండునని గుర్తించగలరు.

మంత్ర జపమువలన బహుముఖములగు ఫలితములు లభించునని తెలిసికొనగలరు. మంత్ర జపమువలన మనస్సుతోపాటుగా సర్వాంగములు పరిశుద్ధమగునని తెలుపబడినది. మనిషి తన జీవితమును పరమ పావనముగా తీర్చిదిద్దికొనుటకై మంత్ర జపమెంతో మేరకు సహకరించునని గుర్తించగలరు.

లోకాచారమున జన్మకుండలిని వ్రాసెడి ఆచారమొకటి గలదు. జ్యోతిష్య శాస్త్రజ్ఞులు జన్మకుండలిని రూపొందింతురు. జన్మకుండలి యందున తను, ధన, సహజ, మాతృ, విద్యా, రిపు, జాయా, మృత్యు, భాగ్య, పితృ, లాభ మరియు వ్యయ మనెడి ద్వాదశ భావములుండును. ఈ భావములయందుండెడి గ్రహములవలన శుభాశుభ ఫలితములు లభించునని చెప్పబడినది. అశుభ ఫలితములను నివారించుటకై యొక్కొక్క

భావమున కొక్కొక్క కోటి చొప్పున పండ్రెండు కోట్ల పంచాక్షరీ జపమును చేసిన యెడల శుభఫలితములుండునని తెలియుచున్నది. మంత్రజపము వలన శివానుగ్రహము లభించునని గ్రహించగలరు.

శ్రీరేణుకాచార్య భగవత్పాదులవారు యింద్రియానుగ్రహ స్థలము గురించిన యుపదేశమును సమాపనము చేయుచు యీక్రింది యుపదేశము నిచ్చిరి :

**సర్వేంద్రియ ప్రవృత్తయా చ బహిరన్తః శివం యజన్ ।**
**స్వచ్ఛందచారీ సర్వత్ర సుఖీ భవతి సంయమీ ॥** (సి.శి. 17-23)

శివయోగి యంతర్బాహ్యేంద్రియ ప్రవర్తన చేత స్వేష్టప్రాణ భావలింగ రూపములలో గల శివుని పూజించుచు స్వచ్ఛందముగా నంతటను తిరుగుచు సుఖియైయుండుననెడిది యీ యుపదేశము యొక్క తాత్పర్యము.

ఇంద్రియానుగ్రహస్థలములోని శివయోగి స్వేచ్ఛ విహారమును సలుపుచు స్వేచ్ఛానుసారముగా శివానందానుభూతిలో మునిగితేలుచుండును. ఇతడనుభవించెడి సుఖమునకు భోగియనుభవించెడి సుఖమునకును భేదము కలదు. యోగి పొందెడి సుఖములోని లవలేశమైనను భోగియనుభవించజాలడనెడిది నిగూఢమైన అర్థము. శ్రీ భగవత్పాదులవారు నిరూపించిన యీ నిగూఢ రహస్యమునెరిగి శివయోగి యెడల యవధాన భక్తిని పెంపొందించికొనవలెను. శివయోగి యొక్క దర్శనాదులను పొంది సేవించి తరించవలెను. ఈ విధిన చేయుచు ధన్యులగుదురు గావుత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యులవారు తమ యాశీర్వచనమున శివాహిత మనస్సువలన గల్గెడి సత్ఫలితములను వివరించిరి. శివాహిత మనస్సుయొక్క ప్రాముఖ్యతను శ్రీ బసవేశ్వరులవారు క్రింది విధముగా వివరించిరి.

**కొంబిన మేలణ మర్కటదంతే లంఘిసువుదెన్నమనవు**
**నిందల్లి నిల లీయ దెన్నమనవు!**
**హోలిదల్లి హొందలఅయదైన్న మనవు**
**కూడల సంగమ దేవా!**
**నిమ్మచరణ కమలదల్లి భ్రమరనాగిరిసు, నిమ్మ ధర్మ!** (వ.సం. 32)

దీని తెలుగు రూపమును గనుడి :

కొమ్మన మీదట మర్కటము వలె
లంఘించునది నా మనము
నిలిచిన కడ నిలువ నీయదు నా మనము
పొందిన కడ పొంద నీయదు నా మనము
కూడల సంగమ దేవా!
మీ చరణ కమలముల యందున
భ్రమరముగా నుంచు, మీ ధర్మము

శివాహిత మనస్సు గలవానికి చిత్తవృత్తి స్వవశమగును. చిత్తవృత్తి నిరోధము యోగమని పతంజలి యనగా, చిత్తం స్థిరం భవేద్యస్య స ప్రసాదీ భవత్యసౌ" అని సూక్ష్మాగమమున చెప్పబడినది. పతంజలి సదాశివ వాక్కుల మధ్యన నభేదము గలదని తెలిసికొనగలరు.

అంగప్రసాది స్థలి తన స్థిరముగా చేసికొనుటకే శివాహిత మనస్సనెడి భావన ప్రతిపాదించబడినదనియును, లింగ ప్రసాది స్థలియైన ఇంద్రియానుగ్రహస్థలి అద్దానిని సోదాహరణముగా చూపించెడి పాత్రను పోషించునని గ్రహించవలెను.

శివాహిత మనస్సు అనెడి ప్రక్రియ యొక్క ప్రభావము కాయ, యింద్రియ, మనః ప్రాణాదులపైని యెట్టులుండుననెడిది గ్రహించదగిన విషయము. జనన జరా మరణములు కాయ వికారములని గ్రహించగలరు. శ్రీ కాశీ జగద్గురువులవారీ యంశమును షడ్భావ వికారముల రూపమున వివరించి చెప్పిరి. కర్మవశుడైన జీవి జనన-జరా-మరణములకు గురియగుచున్నాడు. అహంకారము వలననే కర్మలంపటత్వము ప్రాప్తించును.

అహంకారము వలన మమకారము గల్గి తద్వార రాగ-ద్వేషములుద్భవించుచున్నవి. రాగ-ద్వేషములకు వశుడైన జీవి స్వార్థ ప్రయోజనములు సాధించుటకై విహితావిహిత కర్మల జేసి తత్ఫలితమునననుభవించుటకై జన్మల నెత్తుచున్నాడు. జ్ఞానాచార సంపన్నుడైన యింద్రియానుగ్రహస్థలి కిట్టి బాధ గల్గదు. జ్ఞానాగ్ని దగ్ధ కర్మ బంధములు గలవాడై జనన-మరణముల చక్రబంధములకు లోనుకాడు. శివాహిత మనస్వియైన జ్ఞానికే యిట్టి ఫలము లభించునని తెలిసికొనగలరు.

విషయ భోగలాలసత్వమే యింద్రియ వికారముగా పరిగణింపబడుచున్నది. భోగలాలస సప్త వ్యసనములకు లోనై నిషిద్ధ కర్మాచరణ దురంధరుడై సంసారమనెడి వలలో చిక్కి బాధలకు గురియగును. వేటయనెడి వ్యసనము వలన రాముడు, జూదమనెడి వ్యసనమునకు లోనై పాండవులు పలు విధములుగా కష్టపడిరని యితిహాసములు చెప్పుచున్నవి.

ఆకలిదప్పులు ప్రాణ వికారములని చెప్పబడినవి. వీటిని తీర్చికొనుటకై సంసారి న్యాయాన్యాయ మార్గముల ద్వార ద్రవ్యము నార్జించును. మాయకు వశుడై వివశుడగును. కామక్రోధాది మనో వికారములు సంసారియొక్క బాధలను ద్విగుణీకృతము చేయుచున్నవి. ఇట్టిస్థితిలో శివాహిత మనస్సనెడి ప్రక్రియ మహోపకారము చేయుచున్నది.

శివసాన్నిధ్యమున నుండెడి మనస్సు "అనిల కాష్ఠ న్యాయము"న నైర్మల్యమును పొందుచున్నది. తద్వారా నిర్మలమైన శివజ్ఞానము గల్గును. నిర్మల జ్ఞాని భావాగమ భావాచార సంపదలను పొంది "శివత్వ" ప్రాప్తి కర్హుడగును. తన్నిమిత్తమై శివోహమనెడి భావము మనమున నిలుపుకొనును. ఇట్టి మహోన్నత స్థితిలో నుండెడివాని కాయేంద్రియాదుల క్రియలెట్టులుండుననెడి ప్రశ్న గల్గవచ్చును. ఈ దిశలోన నవగాహనను పెంచికొనుటకై చెన్నమల్లు సీసములోని యీ క్రింది సీసమును పరికించుడి :

**సీ.** **కాయంబు నింద్రియోత్కరమును నర్పించి**
**సంధిల్లు కాయప్రసాదియేని**
**ప్రాణంబు సత్క్రియా పదమును నర్పించి**
**సాధించు ప్రాణ ప్రసాది యేని**
**శబ్దంబు తచ్ఛబ్ద సౌఖ్యంబు నర్పించి**
**శబ్దించు వచన ప్రసాది యేని**
**గమనంబు గమనసంగతియును నర్పించి**
**చన నేర్చుగమన ప్రసాదియేని**

**తే.** **తలపులను జేష్టలను నర్పితంబు జేసి**
**సంచరించు వ్యాపార ప్రసాదియేని**
**అట్టి సంపూర్ణ మహాప్రసాద ......**
**సన్నిహితులను జేర్పు మీ చెన్నమల్లు** (వ.సం. 19)

శివాహిత మనస్సు వలన శివదర్శనము లభించుననెడి రేణుకోక్తి స్మరణీయము. "యద్యత్ పశ్యన్ దృశా యోగీ మనసా చిన్తయత్యపి తత్తత్ సర్వం శివం ప్రకాశతే" యనెడి దివ్యవాక్కుల ప్రతిఫలన యేమో యని దోచెడి విధిన నుండెడి యీ పద్యము చూడదగినదైయున్నది.

సీ. కనువిచ్చు కనుదృష్టి గనుమూయ గనుగవ
వెలుగుచు లింగంబు వేళ్లు బార
దలచు తలంపున నిలుచు సుఖంబున
నెక్కొన లింగంబు పిక్కటిల్ల
సోకుడు తనువున సొగగయు ప్రాణంబున
బసిగొని లింగంబు ప్రజ్వరిల్ల
బలుకుడు పలుకుల బలుక నీ ముఖమున
బరిగొని లింగంబు భరితముగను

ఆ. దగిలి మిగిలి క్రియల దానయై లింగంబు
నిమ్ముకొను నిరంతరమట్టు
లుల్ల సిల్లు లింగయోగానుభవులను
జేర్పవయ్య నన్ను జెన్న మల్లు (ప. 23)

ఇట్టివాడు పొందెడి సుఖమనుపమానమైనదని తెలిపెడి చతుర్వేద సారోక్తిని గమనించుడి :

సీ. ఆత్మ జాగ్రదవస్థయై స్థూల భూసచ్చై
తన్యమగుచు విఖ్యాతినుండు
నాత్మకంఠమున స్వప్నావస్థయై సూక్ష్మ
భూతచైతన్య విస్ఫూర్తి నుండు
నాత్మ సర్వావయాన్విత మగుచుదు
ర్యావస్థమై యట్లయణగి యుండు
నాత్మ సుప్తావస్థ నటనాభి తలమున
జైతన్య శూన్య విశ్రాంతి నుండు

జను నవస్థాంతర నిమిత్త జనిత కర్మ
ములు తదారంభ దేహ సంభోగ వేళ
నర్పితము జేసి పొందు సుఖాతిశయము
నెసగుచుండు బ్రసాదాత్మ బసవలింగ (చతుర్వేదసారము, ప. 251)

"సర్వేంద్రియ ప్రవృత్తా శివం యజన్ సర్వత్ర స్వేచ్ఛాచారీ (భూత్వా) సుఖీభవతి సంయమీ" అనెడి రేణుకోక్తి (సి.శి. 17:23) యు నీ భావమునే సూచించుచున్నది.

– శివం భూయాత్ –

## ఆశీర్వచనము - 1 :

## ప్రాణానుగ్రహ స్థలము :

లింగస్థలమైన ప్రసాది స్థలములోని యింద్రియానుగ్రహ స్థలము గురించి తెలిసికొంటిరి. ఇప్పుడు ప్రాణానుగ్రహ స్థలము గురించి తెలిసికొనవలసియున్నది.

మనస్సును సదా ప్రసన్నముగా పెట్టుకొనుటే ప్రసాది స్థలములోని సాధకుని లక్ష్యమని యెరుంగవలెను. అంగ స్థలముల యందున శివభక్తుడు మనస్సు యొక్క ప్రసన్నతకై శివార్పితమైన వాటిని స్వీకరించగా, లింగస్థలము నందలి సాధకుడు మనః ప్రసన్నతను సాధించుటకై మనస్సును నియంత్రించి సాధన చేయును. కాయేంద్రియములను నియంత్రించిన పిదపనే మనస్సుయొక్క నియంత్రణ చేయవలసియుండును. తన్నిమిత్తమై ప్రాణానుగ్రహపరమైన విచారణను చేయవలెను.

ప్రాణము మీద నియంత్రణను చేపట్టదలచిన యెడల మొట్టమొదలున కాయము మీద పట్టును సంపాదించికొనవలెను. శరీరమొక సుస్థిరమైన ఆసనము మీద హెచ్చుకాలము వరకు కూర్చుండగల్గినచో ప్రాణేంద్రియములమీద నియంత్రణను చేపట్టవచ్చును. ఈ కారణమువలననే యోగశాస్త్రము ప్రాణాయామము కంటెను ముందున ఆసనములను ప్రతిపాదించినది.

దేహము మన కనుకూలముగా నుండని యెడల చేసెడి సాధన వృథా అయ్యెడి యవకాశము గలదు.

ఒక వ్యక్తి యాధ్యాత్మిక ప్రగతిని సాధించవలెననిన నతనికి గురువు కృప మరియు దైవకృప కావలసియుండును. అదే విధిన యతనికి శరీరము యొక్క కృప మరియు మనస్సు యొక్క కృప కావలసియుండును. శరీరపు కృప మరియు మనస్సు యొక్క కృప యనగా కాయము మరియు మనస్సు సాధకునకు ననుకూలముగా వుండవలెను.

వేదాంత శాస్త్రము నందు నీశ్వరకృప, గురుకృప, వేదకృప, మరియు అంతఃకరణ కృపయనెడి నాలుగు కృపలు ప్రతిపాదింపబడినవి. ఈ నాల్గింటి కృప యుండిన యెడల సాధన బాధారహితముగా కొనసాగునని చెప్పబడినది. వీరశైవాచార్యుల ప్రకారము, యీ నాల్గుకృపలతోబాటుగా కాయపుకృప, యింద్రియముల కృప మరియు ప్రాణము యొక్క కృప కావలసియుండును.

ఒక వ్యక్తి తన ఆధ్యాత్మిక సాధనలో కదలక మెదలక నొకే యొక ఆసనమున కూర్చుండెడి సమర్థత గలవాడై యుండవలెను. అందుకొరకై యతనికి దేహము యొక్క అనుగ్రహము కావలెను. కాయము తన పని తాను చేయవలెననిన యింద్రియములు సరిగా పనిచేయవలసి యుండును. కాయమనగా యింద్రియముల సమూహమే కదా! ఈ కారణమున వ్యక్తికి యింద్రియముల యనుగ్రహము కావలెను. చివరన చిత్తైకాగ్రత సాధించనివానికి యాధ్యాత్మిక ప్రగతి సుగమము కాజాలదు. పరిపరివిధములుగా పయనించెడి మనస్సును బిగపట్టి భగవంతుని దిశలో పయినంపజేయవలెను. ఆ విధిన మనస్సును మలచెడి శక్తి ప్రాణమునకు గలదని తెలుపబడినది. వాయువును నిరోధించి తద్వారా మనస్సుయొక్క చలన ప్రవృత్తిని ప్రభావితము చేయవచ్చునని యోగశాస్త్ర నిపుణులు తెలియజెప్పిరి. ఈ విధముగా ఆధ్యాత్మిక సాధనచేసెడి వానికి ప్రాణానుగ్రహము కీలకాంశమని గుర్తింపబడినది.

శివభగవానుడు జీవునికి వంద సంవత్సరముల ఆయువును కటాక్షించినాడు. ఇందులో నరువది వత్సరములు సాంసారిక జీవితము కొరకు కాగా మిగిలినది మనస్సు నిర్మలముగా చేసికొనుటకై యుద్దేశించినదని గ్రహించగలరు. మనస్సును శుద్ధీకరణ చేసికొనుటకింత సమయమవసరమా? యని యాశ్చర్యమునకు గురికావలసిన యవశ్యకత లేదు. ఈ కాలములో కూడ నయ్యది శుద్ధమగుట కష్టసాధ్యమే. ఎంతోమంతి వృద్ధులు చచ్చిపోయెడి సమయము వరకు రాగ-ద్వేషమయమగు సంసారములో మునిగి తేలుచుందురు.

దేహి యొక్క ఆశ యెంతో బలీయమైనది. దేహమునకు ముప్పు వచ్చినా ఆశకు ముప్పు రాజాలదు. అది నిత్యనూతనముగావిరాజిల్లుచుండును. ఇట్టి స్థితిని గనిన యాచార్యులొకరు నీ క్రింది విధముగా నుడివిరి :

**అంగం గ్వలితం పలితం ముండమ్ ।**
**దశన విహీనం జాతం తుండమ్ ॥**
**వృద్ధోయాతి గృహిత్వా దండమ్ ।**
**తదపిన ముంచత్యాశా పిండం ॥**

ఎయ్యది జీర్ణమైనా, ఆశ అజీర్ణమైన స్థితిలోన యుండుననెడిది యెంతో హృద్యముగా చెప్పబడినది. మనస్సే ఆశకు నిలయమైనందున, మనస్సు జీర్ణావస్థకు చేరదని గ్రహించవలెను. ఇట్టి స్థితి వాంఛనీయము కాదు. కఠోరమైన సాధనను చేసి మనస్సును సంస్కరించికొనుట యెంతో అవసరము. శివయోగివలె మనస్సు యొక్క శుద్ధీకరణను సాధించి యద్దానిని శివునికి అంకితము చేయవలెను. ఆ విధిన చేయుట సుసాధ్యమైన విషయము కాదు. ఉదాహరణకై చెప్పవలెననిన, వేకువనలేచి విహితయోగము నభ్యసించి సాధన చేసెడివారు మనస్సును సంస్కరించికొనుటకు ప్రయత్నించెడివారు. వీరి సంఖ్య తక్కువగానే యుండును. గాఢమైన నిద్రలో రాత్రిని పూర్తిగా గడిపి, పగలు పలు కార్యములలో నిమగ్నులై యుండెడివారు అధికసంఖ్యలో నుందురు. వీరి మనస్సు నిర్మలమగుట చాలా కష్టము.

కష్టతరమైన యీ కార్యమును సాధించుటకై ప్రాణముపై నియంత్రణ చేపట్టవలెనని తెలిసికొనగలరు. ఇది ప్రాణానుగ్రహ స్థలమున నెరవేరునని గ్రహించగలరు.

శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారు ప్రాణానుగ్రహ స్థలము గురించి యీ క్రింది విధముగా వుపదేశించిరి :

**శివస్య పరకాయస్య యత్ తాత్పర్యావలోకనమ్ ।**
**తత్ ప్రాణానుగ్రహః ప్రోక్తః సర్వేషాంతత్త్వదర్శిభిః ॥** (సి.శి. 17-24)

మంగళ స్వరూపుడును, పరబ్రహ్మ కాయము గలవాడును అగు యింద్రియానుగ్రహ స్థలమునందలి శివయోగియొక్కతాత్పర్యావలోకనమేదైతో కలదో అయ్యది అందరికి ప్రాణానుగ్రహ స్థలమగునని తత్త్వదార్శనికులచేత చెప్పబడినదనెడి యీ యుపదేశము యొక్క తాత్పర్యము.

తన హృదయ గుహయందున నుండెడి ఘనమైన జ్ఞానరూపమగు చిజ్జ్యోతినెరిగి వాయు నిరోధయోగము చేత నిత్యాత్మ భావను బడసి నిష్ప్రపంచ రూపమైన శివలింగము నందు కలిసిన శివయోగి యొక్క మనస్సు మరియు ప్రాణములు నిశ్చలస్థితిలోన నుండును. ఈ విధముగా సుస్థిరము చేయబడిన అంతఃకరణముగల శివయోగి తన దివ్యదృష్టి సాధకులమీద పడినప్పుడు వారి మనస్సు మరియు ప్రాణములు సుస్థిరములగును. సాధకుల మనః ప్రాణములను సుస్థిరమగునటుల నియంత్రణ చేయువిధిన యనుగ్రహించెడి శివయోగులవారి స్థలమే ప్రాణానుగ్రహస్థలమని గ్రహించవలెను.

యోగమార్గముద్వార నాత్మ పరమాత్మలీ ఐక్యతను సాధించుట యందున ప్రాణముపై నియంత్రణను సాధించుట యనెడిది యొక మహత్త్వ పూర్ణమైన యంశమైయున్నది. ప్రాణమనగా వాయువొకటే అయియున్నను, అద్దాని స్థానము మరియు కార్యములను బట్టి వివిధములగు పేర్లు యివ్వబడినవి.

యోగశాస్త్రము ప్రాణమునైదు విధములుగా విభజించినది. ఆ పిదప యీ అయిదింటిని పదునాల్గు విధములుగా విభజించినది.ఇది దినమునకు

ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన వాయువులనెడివి పంచవిధ ప్రాణములనబడుచున్నవి. "హృది ప్రాణః" అని చెప్పబడినది. హృదయమునందున యుండెడిది ప్రాణవాయువు. 21, 600 మార్లు శ్వాసోచ్ఛ్వాస క్రియను చేయునని తెలుపబడినది. ఈ క్రియ ప్రతిజీవి యొక్క జీవనపుటాధారము. ఇది నిలిచిన వెంటనే కాయము శవమగును. "గుదేఽపానః" అనెడి నుడి ప్రకారము గుదస్థానమున నుండెడి వాయువు రెండవ కోవకు చెందినది. మల-మూత్ర విసర్జన కిది సహాయకారిగానుండును. ఇది తన స్థానమున నిలిచి సమర్థవంతముగా పనిచేసిన యెడల మల-మూత్ర విసర్జనల కెట్టి ఆటంకముగాని, ఆలస్యముగాని సంభవించదు. ఇది దుర్బలమైన యెడల మలబద్ధకము యిత్యాదులు గల్గి తద్వార వ్యక్తి యొక్క ఆరోగ్య వ్యవస్థ దెబ్బతినును. ఇది తన స్థానమును వీడి యూర్ధ్వగామియైన యెడల యుదరకోశ వ్యాధులు సంక్రమించును. ఇట్టి గమన తీవ్రత పెరిగిన యెడల హృదయము మరియు మెదడు రోగగ్రస్తమయ్యెడి స్థితి యేర్పడును.

"వ్యాన స్సర్వ శరీరగః" అని చెప్పబడినది. వ్యక్తి నర–నాడులలో నిది నిండికొని యుండునని తెలియుచున్నది. దీని బలము వలననే అవయవములు చలించుచుండును. బాల్య–తరుణావస్థలలో నిది యెంతో బలీయముగా నుండుటచేత యీ అవస్థలోని వారి అంగముల కదలిక చాలా హెచ్చుస్థాయిలో నుండును. ఈ వాయువు వికారమును పొందినచో అర్ధాంగ వాయురోగము, హృద్రోగము, రక్తపోటు యిత్యాది భయానకమైన రోగములు సంప్రాప్తమగును. వ్యాయామ ప్రాణాయామాదులవలన యీ వాయువు యొక్క స్థితిని సక్రమముగా నుంచికొనవచ్చును.

ఉపాదాన వాయువు నాలుగవ వాయువు. "ఉదాన కంఠ దేశస్థః" అనెడి వాక్కు ననుసరించి చూచిన యెడల నియ్యది కంఠమున నుండునని తెలియుచున్నది. త్రేన్పులు, ఎక్కిళ్ళు మొదలగునవి యీ వాయువువల్లనే గల్గును. ఉదరములోని మాలిన్యమును దూరముచేయుటకిది సహకరించును. చివరిదగు వాయువే సమాన వాయువు. "సమానః నాభి దేశస్థః" అనెడి దాని ప్రకారము నాభిస్థానమున సమాన వాయువుండునని తెలియుచున్నది. ఇది అన్నరసమును ప్రతియొక్క యింద్రియమునకు పంచుచుండును. ఈ విధముగా నీ యైదు వాయువులు ముఖ్యమైనవని తెలిసికొనగలరు. ఇవేకాక నాగ, కూర్మ, కృకర, దేవదత్త మరియు ధనంజయ యనెడి వుపవాయువులును గలవు. నాగవాయువు రోమనాళమున నుండి వాయు సంచారమునకు సహకరించును. కూర్మ వాయువు వుదరము మరియు లలాట స్థానముల యందున యుండి కనురెప్పల కదలిక కొరకు సహాయకారిగా నుండును. కృకర వాయువు నాసికాస్థానమున నుండి తుమ్ము ఇత్యాది క్రియలకు సహాయకారిగా నుండును. దేవదత్తము గుహ్యస్థానమున నుండును. నుడి యిత్యాదులకు సహాయపడును. ధనంజయ వాయువు బ్రహ్మరంధ్రమున నుండును. రెండు చెవులను మూసికొనినచో వినపడెడి ఘోష యీ వాయువువలన యేర్పడినదే.

పూర్వోక్త దశ వాయువులతో పాటుగా వైరంభ, ముఖ్య, ప్రభంజన మరియు నంతర్యామి యనెడి నాలుగు సూక్ష్మవాయువులు గలవు. వైరంభము మనస్సున నిలిచి యద్దానికి ప్రేరణ నిచ్చును. ముఖ్య యనెడిది బుద్ధియందుండి దానిని పుష్టిని ప్రదానము చేయును. ప్రభంజనము చిత్తమున నిలిచి దానికి ప్రేరణ నిచ్చును. అంతర్యామి యహంకారమునకు ప్రచోదనమును చేయును.

స్థూలముగా చెప్పవలెననిన యెడల పంచ ప్రాణములు జ్ఞానేంద్రియములను, అయిదు వుప ప్రాణములు కర్మేంద్రియములను, మిగిలిన నాలుగు అంతఃకరణమును ప్రభావమునకు గురిచేయునని గుర్తించవచ్చును.

ఈ పదునాలుగు వాయువులను నిరోధించిన యెడల సర్వేంద్రియములపైనను, అంతఃకరణ చతుష్టయము పైనను పట్టును సాధించుటకు వీలగును.

ప్రాణానుగ్రహ స్థలమునందలి శివయోగి ప్రాణాయామాంతర్గతములౌ పూరక కుంభక రేచకాదుల ద్వారా ప్రాణవాయువు బంధించి తన హృదయ కమలమున సుస్థిరము చేసికొనును. తన హృద్గీత పరంజ్యోతిని ప్రకాశమానము చేసికొనును. ఆ జ్యోతిలోననే అతని ప్రాణవాయువు లయమగును. అప్పుడా శివయోగి దివ్య ప్రభాపటల సమన్వితుడై వెలుగొందును. ఈ తెరగున శివయోగ సమాధిలో నిమగ్నమైన పిదప లోకానుగ్రహమునకై యితరులను తన దివ్యదృష్టిచేత యనుగ్రహించి వారి ప్రాణానుగ్రహమునకు కారణభూతుడగుచున్నాడు. ఈ కారణముననే యితడు ప్రాణానుగ్రహస్థలి యనబడును.

శివయోగి విశ్వమును శివమయముగా చూచును. దీనినే తాత్పర్య దృష్టి యని అందురు. తాత్పర్యమేమనగా సారాంశము. ఇచ్చట శివయోగి కది శివయోగము యొక్క సారమగును. యావత్ ప్రపంచమును శివరూపమున గాంచుటే శివయోగము యొక్క తాత్పర్యము. హెచ్చుతగ్గులు గాంచజాలని శివయోగి అందరినీ సమదృష్టిచేత వీక్షించును. ఈ వీక్షణములోన రాగద్వేషములుండవు.

శివయోగి యీ స్థితిని అంతర్యానము వలన పొందుచున్నాము. చాలామంది బహిర్యానము చేయుచుందురు. బహిర్ప్రయాణమువలన సంసార బంధములు బిగిసిపోవును. అంతర్యానమువలన సంసార బంధములు సడలివీగిపోవును.

అంతర్యానము చేయనేర్చిన వానికి అంతరంగములోని జ్యోతిర్లింగ దర్శనము లభించును. మూలాధారాది స్థానములలో జ్యోతిర్లింగములుండుననియును, వాటిని దర్శించుటకై ప్రాణాయామాభ్యాసమును తప్పనిసరిగా చేయవలెనని గుర్తించగలరు.

జ్యోతిర్లింగ దర్శనమును పొందుటకై మనః ప్రాణముల కలయిక అవశ్యమైయున్నది. మనస్సు బాహ్య ప్రపంచములోన తిరుగాడుటకై ప్రాణము యొక్క సహాయమును పొందును. అదేవిధిన యద్దాని యంతర్ముఖోన్ముఖతకు కూడ ప్రాణము యొక్క సహాయమవసరమని గ్రహించగలరు.

ప్రాణానుగ్రహ స్థలమునందలి శివయోగియొక్క తాత్పర్యావలోకన మెట్టిదో యనెడి దానిని శ్రీరేణుకాచార్య భగవత్పాదులవారీ క్రింది విధముగా వివరించిరి :

**ప్రాణోయస్య లయం యాతి శివే పరమకారణే ।**
**కుతస్తస్యేంద్రియస్ఫూర్తిః కుతః సంసార దర్శనమ్ ॥** (సి.శి. 17-25)

ఎవ్వని ప్రాణములు పరమకారణుడగు శివుని యందున లీనమగునో అవ్వానికి యింద్రియములు స్ఫురించవు. సాంసారిక నిర్మితి కన్పట్టదనెడిదే యీ యుపదేశములోని సారము.

ఇంద్రియముల స్ఫూర్తి నిమిత్తమ యే వ్యక్తికైనను మనస్సు యొక్క సహకారమవసరము. అట్టి మనస్సు ప్రాణము మీద నాధారపడియుండును.

ప్రాణమును పరమ కారణుడగు పరమేశ్వరునిలో లీనము చేసిన పిదప నైంద్రియ వ్యాపారాదులు తమంత తామేయుపశమనమును పొందును. అవియును శివోన్ముఖతన నొంది యంతర్ముఖత్వమును సాధించుటకై కృషి సల్పును. శివసాక్షాత్కారమును పొందు దిశలో తమవంతు సహకారము నందించును. ఇట్టి ప్రయత్నములో సఫలీకృతుడై శివానందము ననుభవించెడి శివయోగి లోకమున పరమాదర్శ పురుషుడని గ్రహించగలరు.

శివయోగి యొక్క ప్రాణములు శివుని యందున యెట్టుల లయమగుననెడి దానిని శ్రీ అగస్త్యునికి శ్రీ రేణుకాచార్యుల వారీ ఖిన యుపదేశించిరి.

**కరణేషు నివృత్తేషు స్వార్థసంగాత్ ప్రయత్నతః ।**
**తైః సమం ప్రాణమారోప్య స్వాన్తే శాంతమతిః స్వయమ్ ॥** (సి.శి. 17-26)

ప్రాణాయామాంతర్గతమగు కుంభక ప్రక్రియవలన శివుని యందున ప్రాణ వాయువును లయము చేసి, కరణములనువిషయోప భోగమునుండి దూరము చేసికొని, ప్రవృత్తి స్థితినుండి నివృత్తి స్థితికి చేరికొని, ప్రయత్న పూర్వకముగా ప్రాణములను మనస్సునందున నారోపణము చేసి శివయోగి శాంత మనస్కుడై విరాజిల్లుననెడిది యీ యుపదేశములోని తాత్పర్యము.

సామాన్యముగా నింద్రియములు విషయోపభోగము వైపు పరుగులు తీయుచుండును. ఇది చిరకాలము నుండియు కొనసాగెడి స్థితి. విషయోపభోగములు లేనియెడల యింద్రియములకు సమాధానముండదు. ఈ స్థితివలన చేటు సంభవించి యింద్రియముల అస్తిత్వమునకే ముప్పు వాటిల్లుననెడి విషయము నింద్రియము లెరుగజాలవు. అదేవిధిన వ్యక్తులు నిట్టి యజ్ఞాన దశలోనే కొట్టుమిట్టాడుచు, తత్ఫలితముగా స్వేంద్రియములు విషయోపభోగము చేత నిర్వీర్యములై శైథిల్యమును పొంది గ్రహణశక్తి కోల్పోవుటను తెలిసికొనజాలక బహువిధములగు బాధలకు గురియగుచున్నారు. ఈ విషయమును గమనించిన అనుభావులు "భోగా న భుక్తా వయమేవ భుక్తా" అని హెచ్చరించిరి. వ్యక్తి తన యింద్రియముల ద్వార విషయములననుభవించుటకై పూనుకొనగా, విషయభోగము వ్యక్తిని భుజించుచున్న వనెడిది యీ యనుభవోక్తిలోని సారాంశము. ఈ వైచిత్రి నెరిగిన శివయోగి నిగ్రహ శక్తిచే విషయవాసనలనుండి దూరమగును. ప్రాణముమీద నియంత్రణను సాధించును. ఈ రెంటి వలన మనస్సు వశమై వర్తించుచుండును. మనస్సును నిగ్రహించికొనిన వానికి సాంసారిక వ్యవహారములన్నియును నిలిచిపోయిన వగును. ఈ స్థితిని బడసిన శివయోగి సుఖశాంతులతో ప్రశాంత మనస్కుడై విరాజిల్లుచుండునని గుర్తించగలరు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులవారు చతుర్దశ వాయువుల గురించియును, వాటి విద్యుక్త ధర్మముల గురించియు, వాటి ద్వార శివయోగి సాధించెడి తాత్పర్యవలోకనము గురించియును నెన్నియో వివరములు తెలియజెప్పుచు నాశీర్వచనము నొసంగిరి.

తాత్పర్యవ లోకనమనెడి భావమొక విశిష్టమైన భావము. యోగ పరంపర ననుసరించెడి వారు దీనిని యోగాంగమనెడి గుర్తింపబడిన ప్రాణాయామముతో జోడింతురు. ప్రాణాయామములోని యంతర్భాగమైన కుంభక ప్రక్రియ యొక్క ప్రక్రియాంత పరిణామముగా స్వీకరింతురు. ఈ సందర్భమున, ప్రసాది స్థలమునకు యౌగిక తాత్పర్యము నొసంగినట్టి శ్రీపతి పండితుల వారి క్రింది వాక్కులు గమనార్హమైనవి.

"కుండలిన్యా సుషుమ్నా మార్గేణ చక్రషట్కం భిత్వా బ్రహ్మరంధ్రదేశే శివయోగాభ్యాస వశాత్ శివశక్తి సంయోగ లక్షణః తృతీయే ప్రసాది స్థలే ప్రపంచితః"

కుండలినీ శక్తిచేత సుషుమ్నా నాడి మార్గమున షట్ చక్రములను భేదించి బ్రహ్మరంధ్రము నందున యోగాభ్యాసము చేయగా శివశక్తుల సంయోగమగుననియును తత్ఫలితము చైతన్యము ప్రపంచితమై పరివ్యాప్తమగుననెడిది శ్రీపతి పండితులవారి వాక్కులు. చైతన్య శక్తి విస్తరణయే తాత్పర్యావలోకమని ప్రతిపాదించెడి వాదమొకటి కలదు.

తాత్పర్యావలోకనమును యోగేతర మార్గమున సాధించవలెనని ప్రతిపాదించెడి వాదమొకటి కలదు. ఈ వాదమున కద్దము పట్టెడి చతుర్వేద సారమీ క్రింది ప్రశ్నలను వేసినది :

**లింగావధాన కల్పితమనోరతిగాక**
**ధ్యాన మార్గము శివుగాననగునె**
**ప్రాణలింగైక్య సంబంధ సంగతిగాక**
**వాయుధారణ ముక్త్యుపాయమగునె** (చతుర్వేద సారము, ప. 177)

ఈ వాదము ప్రకారము దశ ప్రాణార్పణ వలననే లింగ సందర్శన ప్రాప్తమగును. లింగదర్శనమునకును తాత్పర్యావలోకమున కభేదము గలదని తెలిసికొనవలెను. ఈ విషయమును క్రింది సీసము వలన గ్రహింపవచ్చును.

**సీ॥ ఏదెస జూచిన నా దెస లింగంబు**
**దృక్కుల వెంబడి దేజరిల్లు**
**నెక్కడ జూచిన నక్కడ లింగంబు**
**మునుగుచు నిలుచుచు మూర్తిగొనక**
**యెచ్చోట జూచినచ్చోట లింగంబు**
**మనమున జిట్టాడుచును పెనంగు**
**నెమ్మెయి పొందిన నమ్మెయి లింగంబు**
**దనువునందుదొట్టు కొనుచుదనరు**

తే॥ దివిరి పలుకుల లింగంబు తీగసాగ
దొడలి పలుకుల లింగంబు ముడిబడంగ
నతిశయిల్లెడి పరమ లింగానుభవుల
జేర్చి రక్షింపవే నన్ను జెన్నమల్లు (చెన్నమల్లు సీసము, 29)

"శివయోగినాం కించిచ్ఛివా దన్యన్నదృశ్యతే" అనెడి రేణుకోక్తి (సి.శి. 17:27) "ప్రాణోయస్యలయం యాతి శివే... కుతః సంసార దర్శనమ్" అనెడి రేణుకోక్తి (17:25) నేపథ్యమున నీ పద్యమును పఠించిన యెడల విషయము విశదమగును. "శివాహిత ప్రాణ" మనెడి ప్రక్రియ ద్వార సాధన చేయవలెనెడిదే గ్రహించవలసిన విషయము.

తాత్పర్యవలోకన నిమిత్తమున సాధనముగా నుపయోగపడుటకై చతుర్వేదసారము తెలిపెడి లింగార్పణ పద్ధతి గమనింపదగినదని చెప్పవచ్చును.

**సీ॥ షటస్థలాంతైరవింశత్ సహస్రస్వరా**
**ర్పణము ప్రాణక్రియార్పణము వలన**

**శ్వాసనిశ్వాసాంగ పోషణార్పణ మపా**
**నవ్యాన మరుదర్పణంబు వలన**
**దను జేష్ట ధాతువర్ధనముఖార్పణముదా**
**నసమాన పవనార్పణంబువలన**
**నిష్ఠీవనోన్మేష నిమిషార్పణంబులు**
**నాగకూర్మసమర్పణంబు వలన**

**క్షుత్ పిపాసాది పరిశిష్టగుణసమర్ప**
**ణము కృకర దేవదత్త దనంజయార్ప**
**ణముల నగు దశప్రాణార్పణముల నతని**
**కెసగు లింగార్పణమునన బసవలింగ**
**(చతుర్వేదసారము, ప. 259)**

ప్రసాది స్థలములోని అంగుడు మణిపూరక చక్రమున ప్రత్యక్షమయ్యెడి శివలింగమునకు దశప్రాణములను సమర్పించవలెననెడి నియమమొకటి గలదు. శివానుభవ సూత్రమున నీయంశము గురించిన చర్చను గాంచగలము. లింగార్పణ నానంతరము నంగప్రసాది పొందెడి ప్రసాదానుభవము వలన తాత్పర్యవలోకనము సంప్రాప్తమగునని గుర్తించగలరు.

లింగ ప్రసాదమున గల్గెడి మరొక పరిణామమేమనగా నంగ ప్రసాది యొక్క నైజగుణములో మార్పు వచ్చును. వాయుప్రాణిగా నుండెడి జీవి లింగప్రాణియగునని గ్రహించగలరు. ఈ సందర్భమున శ్రీ బసవేశ్వరుల వారి క్రింది వాక్కులు చూడదగినవని గ్రహించుడి :

**పూర్వబీజ వాయు ప్రాణియల్ల**
**లింగ ప్రాణియా శరణను**
**... ... ... ...**
**కూడల సంగమ దేవా, నిమ్మశరణను** (వ.సం. 765)

ఈ వాక్కుల తెలుగు రూపమిది :

పూర్వబీజము వాయుప్రాణి కాదు
లింగప్రాణి మీ శరణుడు
... ... ... ...
కూడల సంగమదేవా, మీ శరణుడు

*– శివం భూయాత్ –*

## ఆశీర్వచనము - 2 :

## ప్రాణానుగ్రహ స్థలము :

లింగస్థలమైన ప్రసాది స్థలమున గల ప్రాణానుగ్రహ స్థలము గురించిన కొన్ని ప్రాథమిక అంశములను తెలిసికొంటిరి.

ప్రాణమును మనస్సునందున లయము చేసికొని, ఆ మనస్సును శివునిలో లగ్నము చేసిన యెడల శివసాక్షాత్కార మగునని తెలిసికొంటిరి. శాంత చేతస్కుడైన శివయోగి అలౌకిక సుఖ–సంతోషముల ననుభవించుచుండునని తెలుపబడినది. ఈ స్థితి యేర్పడెడి పరిణామమును గురించి శ్రీ రేణుకాచార్యులవారు తెలియజెప్పిరి. ఈ యుపదేశమును గమనించుడి :

**శాంతత్వాత్ ప్రాణవృత్తీనాం మనః శామ్యతి వృత్తిభిః ।**
**తచ్ఛాన్తౌ యోగినాం కిఇఁచ్ఛివాదన్యన్న దృశ్యతే ॥** (సి.శి. 17-27)

ప్రాణవృత్తులైన రేచక పూరకముల శాంతతవలన మనోవృత్తులు శాంతమగుననియును, తత్ఫలితముగా శివయోగికి శివునికంటెను భిన్నమైన దేదియును కన్పించదు, అనెడిది యుపదేశములోని సారాంశము.

యోగశాస్త్రమునందున ప్రాణనిరోధము నిమిత్తమున పూరక-కుంభక-రేచకములు ప్రతిపాదింపబడినవి. మనము ప్రతిదినము చేసెడి యూర్పు ప్రక్రియను శ్వాసోచ్ఛ్వాసయని యందురు. శ్వాసయనగా గాలిని ముక్కుద్వార పీల్చుట. ఉచ్ఛ్వాస యనగా గాలిని విడుచుట. ఈ ప్రక్రియ పుట్టినప్పటినుండి చచ్చేటివరకు నఖండముగా కొనసాగుచుండును. ఇది సహజసిద్ధమైన ప్రక్రియ. అందుచేత తన్నిమిత్తమై యెట్టి ప్రయత్నమును చేయునవశ్యకత లేదు. అయితే యీ ప్రక్రియ యోగశాస్త్రోక్త పద్ధతిలో కొనసాగిన యెడల నయ్యది ప్రాణాయామమనిపించికొనును. గాలిని పీల్చికొనుటను పూరకమని అందురు. గాలిని పట్టి పెట్టెడి క్రియయే కుంభకము. రేచకమనగా గాలిని వదలుట. కుంభకము రెండు విధములుగ నుండును. అవి అంతర్బహిర్ కుంభకములు. లోపలి గాలి నుంచికొని చేసెడి కుంభకమునంతర్కుంభమందురు. రేచక-పూరకముల మధ్యన కొంత తడవును చేసిన నయ్యది బహిర్ కుంభకమగును.

ప్రాణాయామ పద్ధతిని గురుముఖతః నేర్చికొని యభ్యాసము చేసిన యెడల సత్ ఫలితము లభించును. మనస్సు నియంత్రణలోనికి వచ్చుట, దీర్ఘాయువు లభించుట మొదలగునవి ప్రాప్తమగునని చెప్పబడుచున్నవి. శాస్త్రవిధిని యతిక్రమించి తన యిష్టానికనుగుణముగా ప్రాణాయామమాచరించిన యెడల సాధకునికి దుష్ఫలితములు లభించునని తెలిసికొనగలరు.

విహిత విధానము ననుసరించి ప్రాణాయామమును చేసి దీర్ఘాయుష్మంతులై తిరుగాడెడి యోగులెందరో కలరు. ప్రాణానుగ్రహస్థలము నందలి శివయోగి ప్రాణాయామమును చేసి నాచరించి, ప్రాణమును శాంతమొనర్చికొనును. అదే విధిన మనస్సు యొక్క వృత్తులు నిలిచిపోయి, అదియును శాంతస్థితికి చేరును.

యోగశాస్త్రమునందున మనస్సు యొక్క అయిదు వృత్తులు ప్రతిపాదింపబడినవి. అవి : ప్రమాణ, విపర్య, వికల్ప, నిద్రా మరియు స్మృతులు. వీటిని మరల క్లిష్ట మరియు అక్లిష్ట యనెడి రెండు విధములుగా విభజించుట జరిగినది. క్లిష్టములు క్లేశదాయకములు కాగా అక్లిష్టములు తద్విరుద్ధమైనవి.

ప్రమాణాత్మకమైన జ్ఞానమును కల్గించునది ప్రమాణవృత్తియనబడును. శబ్ద, స్పర్శాది ప్రమాణజ్ఞానమునకు కారణభూతమగునప్పుడు క్లిష్ట ప్రమాణవృత్తి యగును. లౌకిక దృష్టితో చూసిన యెడల శబ్ద-స్పర్శాదులు కొంత ఆనందమును గల్గించినా వాస్తవముగా నవి దుఃఖదాయకములే యని గ్రహించవలెను. ఆత్మజ్ఞానమునకు సంబంధించిన మనోవృత్తి యక్లిష్టమైనదగుచున్నది.

ఒక విధముగా నుండెడి వస్తువు మరొక విధముగా దోచెడి విధముగా చేయునదే విపర్యవృత్తి. తాడు సర్పముగా దోచుట క్లిష్ట విపర్యవృత్తికై యుదాహరణ. లింగములో శివత్త్వమును గాంచుట యక్లిష్ట విపర్య వృత్తి యగును. శిలామయ మూర్తియందు దైవత్వమును భావించుట ఒక విపర్యవృత్తియే అయినను ఈ భావనచేత ఒక విలక్షణమైన ఆనందము ప్రాప్తమగుటవలన దీనిని అక్లిష్ట విపర్యవృత్తియని అనవచ్చును.

మనస్సుకు సంబంధించిన మూడవ వృత్తియే వికల్పము. లేని వస్తువు గురించి మనస్సునందు గలిగెడి వృత్తియే వికల్పాత్మకమైనది. దీనిని మనోరాజ్యమనియును అనవచ్చును. ఇది క్లిష్ట వికల్పవృత్తి యగుచున్నది. తన మనస్సునందున లోక కళ్యాణ భావనలను నింపుకొని దానికనుకూలముగా తన మనస్సునదున తాను వ్యాపారమును చేసి ధనమును గడించి తద్వారా మఠము, విద్యాలయము, ఆరోగ్యకేంద్రము మొదలగునవి నిర్మాణము చేయుటను గురించి పెంపొందించుకొనెడి మనోకల్పన అక్లిష్ట మనోవృత్తియగుచున్నది.

నాల్గవ వృత్తి నిద్రావృత్తి. ఈ వృత్తిలో నిద్రయనగా స్వప్నావస్థ అని అర్థము. మనకు పడెడి స్వప్నములు కొన్ని క్లేశదాయకములగుచున్నవి. మరికొన్ని క్లేశరహితములు అగుచున్నవి. స్వప్నమునందున భూత ప్రేతాదులను చూపుట, అనిష్ట సంఘటనలను అనుభవించుట మొదలగునవి క్లిష్ట నిద్రావృత్తులూ స్వప్నమునందున గురు-లింగ-జంగముల యొక్క దర్శనము ఖ్యాతిగాంచిన ప్రదేశములను సందర్శించుట, ఆధ్యాత్మిక కేంద్రములకు తరలివెళ్ళుట, గురు-జంగముల పాదపూజలు చేయుట మొదలగు స్వప్నములు అనిష్ట నిద్రా ప్రవృత్తికి ఉదాహరణలు.

చివరిదగు మనోవృత్తిని స్మృతియని అందురు. సంస్కార జన్యమైన జ్ఞానమును స్మృతియని అనవచ్చును. మనము ప్రత్యక్షముగా అనుభవించిన ప్రతియొక్క ఘటన మన మనస్సుమీద తమ సంస్కారము కలిగించును. ఈ సంస్కారము మనస్సునందున సంగ్రహితమై యుండును. ఈ సంస్కారములే మరలా కాలాంతరమునందున సుద్బోదను గొని స్మృతికి కారణభూతమగుచున్నది. ఈ స్మృతి జ్ఞానము కూడా క్లిష్టా కిష్టములని రెండు విధములు. అనుకూలమైన వ్యక్తి యొక్క సంస్మరణ సుఖదాయకమైయుండును. అందుచేతనది అక్లిష్ట స్మృతియగుచున్నది. తద్విరుద్ధమైనదగు ప్రతికూల వ్యక్తి యొక్క స్మరణ అక్లిష్ట స్మృతియగుచున్నది. ఇంకను లౌకికమైన వ్యక్తి ఒక పరి అనుకూలమైన వాడుగాను మరొకపరి ప్రతికూలమైనవాడుగాను కావచ్చును. అందుచేత దీనిలో అయ్యెడి ఒక వ్యక్తి యొక్క స్మరణ సుఖదాయకముగా తోచినప్పటికీ కాలాంతరమున అది దుఃఖదాయకము కావచ్చును. అందుచేత లౌకిక వ్యక్తి యొక్క స్మృతులన్నియును క్లిష్టతరమైన స్మృతులని భావించవలెను. భగవంతునికి సంబంధించిన స్మరణ అక్లిష్ట స్మృతి యొక్క ఉదాహరణయగును.

మనయందు యుండెడి మనస్సు పూర్వోక్త విధిన పంచవృత్తులలో నిమగ్నమైయుండును. ప్రాణానుగ్రహ స్థలములోని శివయోగి ఎపుడైతే తన ప్రాణమును నిరోధించి దాని బలముచేత మనస్సును కూడా నిరోధనము చేసి పైన వివరించిన మనోవృత్తుల ఉపసంహారమునకు కారణభూతుడగును. ఈ మనోవృత్తులు నిలిచిపోయిన వెంటనే సాధకుని మనస్సు శాంతముగా అగునని గుర్తించగలరు. ఇట్టి ప్రశాంతమైన మనస్సు గలవానికి జగత్తులోని ప్రతి వస్తువులోను నిరాకార నిరంజన మూర్తియగు పరశివుని దర్శనము లభించును. ఈ విధమైన అనుభవమును పొందుటకై మీరందరు కృషి చేయుదురుగాక

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్య మహాస్వాముల వారు ప్రాణము యొక్క అవశ్యకతను వివరించి చెప్పి మనోవృత్తుల వైవిధ్యత గురించి తెలియజేసిరి. ప్రాణాంగముల శాంతత్వమును సాధించు నవశ్యకత గలదనెడి భగవత్పాదుల వారి మతమునకు వివరణ నిచ్చిరి.

తాత్పర్యావలోకనము గురించి క్రిందటి ఆశీర్వచనమున తెలిసికొంటిమి. ఇది ప్రశాంతత లోపించిన వారి కలభ్యమగునని చెప్పబడినది. "శాన్తః శమితే"యని అమర సింహుడనగా, శామ్యతే శమితశాంతశ్చశము ఉపశమనే యని పండితులనిరి. రాగాదుల యుపశమనమే శాంతమనబడుచున్నది. అయితే ప్రాణాంగముల యుపశమనము వలననే తాత్పర్యావలోకనము సాధ్యమగునని తెలుపబడినది. పూరక, కుంభక, రేచకములనెడి ప్రాణవృత్తుల శాంతత వలన లక్ష్యసిద్ధి గల్గునని తెలుపబడినది. బహిఃకుంభక అంతఃకుంభక ప్రక్రియల వలన ప్రాణవృత్తులు శాంతించునని తెలుపబడినది. అయితే సామాన్యులకీ మార్గము సుసాధ్యమైనది కాదు. లింగస్థలియైన శివయోగులకే యియ్యది సాధ్యమగును.

సాధకులు ప్రప్రథమంగా శివాహిత ప్రాణ ప్రక్రియను చేపట్టవలెను. ఇద్దానిని శ్రీ భగవత్పాదులవారీ క్రింది విధముగా వివరించిరి.

**కరణైః సంహితం ప్రాణం మనస్యాధ్యాయ సంయమీ ।**
**యోజయేత్ స శివః సాక్షాద్ యత్ర నాస్తి జగద్ భ్రమః ॥** (సి.శి. 17-22)

ఇంద్రియ వృత్తులను, ప్రాణవృత్తులను మనస్సులో నిలిపి ఆ మనస్సును శివునిలో లీనము చేయవలెననెడిదే గ్రహించవలసిన విషయము. దీనిని సాధించిన పిదప వాయునిరోధనాదులను చేపట్టవలెను.

చతుర్వేద సారమున (ప. 255) ప్రత్యామ్నాయ పథము చెప్పబడినది. "ప్రాణాంగములు ప్రసాదములు గాగ మానసేంద్రియములు నంద మగ్నములుగ నెసగు సుఖము నల్పులకు నెద్ది" యనెడి బసవలింగ శతకములోని వాక్కులు (ప. 255) విషయమును సంక్షిప్తముగా వివరించుచున్నవి.

– *శివం భూయాత్* –

## ఆశీర్వచనము - 3 :

## ప్రాణానుగ్రహ స్థలము :

లింగస్థలమైన ప్రసాది స్థలములోని అవాంతర స్థలమైన ప్రాణానుగ్రహస్థలము గురించి ఎన్నో విషయములను తెలిసికొంటిమి. ఈ ఆశీర్వచనమున ఈ స్థలమునకు సంబంధించిన మరికొన్ని కీలకాంశములను తెలిసికొనెదరుగాక.

ప్రాణమే దేహధారణమునకు కారణమనియును, ఆ ప్రాణమునకు శివుడే ఆధారమనియును శ్రీరేణుక భగవత్పాదులవారు ఉపదేశించిరి.

**ప్రాణ ఏవ మనుష్యాణాం దేహధారణ కారణమ్ ।**
**తదాధారః శివః ప్రోక్తః సర్వకారణ కారణమ్ ॥** (సి.శి. 17-28)

ఈ ఉపదేశము యొక్క తాత్పర్యమేమనగా మనుష్యులందరు దేహమును ధరించుకొనుటకై ఆయా దేహములందలి ప్రాణమే కారణమగుచున్నది. అట్టి ప్రాణమునకు సర్వకారణ కారణుడైన శివుడే ఆధారభూతుడైయున్నాడు.

జగత్తులోని ప్రాణులెల్లరు బ్రతికియుండుటకు ప్రాణమే కారణమగుచున్నది. ప్రాణము ప్రవేశించగానే జన్మ సంభవించును. అది నిర్గమించగానె మరణము సంభవించును. లౌకిక వ్యవహారమునందున తల్లి గర్భమునుండి శిశువు బయటికి రాగానే శిశువు జన్మించునని చెప్పుచున్నారు. స్థూలదృష్టితో చూచిన ఎడల ఇది సరియైనదే అనిపించును. కాని సూక్ష్మదృష్టితో ఆలోచించిన యెడల తల్లి గర్భమందున శిశువు యొక్క శరీరములోని అవయవములన్నియును రూపును గొని సృష్టిని బడసిన పిదప ఏడవ నెలలో పిండములో ప్రాణము ప్రవేశించుచున్నది. అప్పుడే ఆ దేహమునందున చేతనాశక్తి ఉదయించును. ఈ విధముగా గర్భావస్థలోని శిశువు శరీరమునందున ఎప్పుడు ప్రాణము ప్రవేశించునో అప్పుడే ఆ శిశువు జన్మించినదని భావించవలెను. ఇది వైజ్ఞానికము మరియు శాస్త్రసమ్మతమైన విచారము. శాస్త్రకారులనేకులు అనేక ప్రదేశములయందు పిండోత్పత్తి గురించి వ్రాసిరని తెలియుచున్నది. కర్ణాటకమునందు అత్యంత ప్రఖ్యాతిగాంచిన శ్రీ మన్నిజగుణ శివయోగి వారి 'పరమానుభవ బోధె' యందలి మొదటి సంధియందు మరియు 'పరమార్థ గీతె' యందలి నాల్గవ గతియందు పిండోత్పత్తి విచారమును బహు విస్తారముగా వివరించిరి. వారి విచారము ప్రకారము మనము సేవించెడి ఆహారము ఉదరమునందు యుండెడి జఠరాగ్ని యందు పాకమును గొనుచు ఏడేడు దినములకు క్రొత్త క్రొత్త రూపమును దాల్చుచు కొనసాగుచుండును. అవి సప్త ధాతువులని పిలువబడుచున్నవి. మనమిప్పుడు సేవించిన అన్నజలాధులు ఏడు దినములవరకు పక్వముగా అయి రసరూపమును దాల్చును. ఆ రసము మరియొక ఏడు దినములవరకు పరిపక్వత గొనిన పిదప అది రుధిరమగుచున్నది. ఆ రుధిరము మరియొక ఏడు దినములవరకు పక్వమై మాంసరూపమును దాల్చుచున్నది. ఆ మాంసము మరియొక ఏడుదినముల వరకు పరిపక్వతను గొని మేధస్సు అగుచున్నది. ఆ మేధస్సు ఏడు దినముల పిదప ఎముకగాను, ఆ అస్థి మరియొక ఏడు దినములకు మజ్జగాను రూపొందును. ఆ మజ్జయే మరియొక ఏడుదినములకు రేతస్సు రూపమును దాల్చును. ఈరీతిగా మనము సేవించిన అన్నము, క్రమక్రమముగా పాకముగొని రసము, రక్తము, మాంసము, మేధస్సు, అస్థి, మజ్జ మరియు రేతస్సుల రూపములను దాల్చునని తెలిసికొనగలరు. ఇప్పుడు సేవించిన ఆహారము సుమారు నలుబది తొమ్మిది (49) దినములకు తండ్రిలో రేతస్సుగాను, తల్లి శరీరములో శోణితము (రజస్సు)గాను అగుచున్నది. ఈ రెండు ఆ ఇరువురి రతియోగము నందున ఒక్కటై మాతృగర్భములో నెలకొనియుండును. మున్ముందు రేతోరుధిరములు కూడిన మొదటి దినమునుండి మావి (గర్భపిండము) అయి, ముందు ఐదవ దినమునకు బుద్బుధాకృతి అయి (బుడగాకృతి) ముందు పది దినములకు కందాకృతియై (గడ్డ ఆకారమమయై), మరియొక పదునైదు దినములకు దండాకృతిగా రూపమునొందును. మున్ముందు ఒక మాసము తర్వాత దండాకృతియందు శిరస్సు తయారగును. రెండవనెల బాహువులు వెలువడును. మూడవ నెలలో ఉదరము, నాల్గవ నెలలో పాదాది సర్వాంగములు పొడచూపును. ఐదవనెలలో రోమములు పుట్టును. ఏడవ నెలలో పిండములో ప్రాణము ప్రవేశించును. ఎనిమిదివ నెలలో గర్భస్థ శిశువునకు జన్మ జన్మాంతరముల జ్ఞానము ఉదయించును. తొమ్మిదినెలలు నిండిన పిదప ప్రసవమగును. ఇది ఒక ప్రకృతిసిద్ధమైన శిశువు యొక్క జన్మక్రమము.

ఇచ్చట తెలిసికొనవలసిన విషయమేమనగా యేడవ నెలలోనే గర్భస్థ శిశువులో ప్రాణము ప్రవేశించుచున్నది. ఏడవ నెలలో సీమంతాది కార్యక్రమములు చేసెడి సాంప్రదాయము గలదు. తల్లికి చేసెడి సంస్కారములన్నియును శిశువు యొక్క పుష్టిని వెంచుట కొరకేయని గ్రహించగలరు.

ఈ ఉత్సవములో గర్భవతికి రకరకములగు తిండి వస్తువులను తినిపింతురనెడిది అందరెరిగిన విషయమే. వీరశైవాచార సాంప్రదాయము ప్రకారము గర్భాష్టకమున లింగధారణ చేయవలసియుండును. ప్రసవము కంటెను ముందునను, ప్రాణము ప్రవేశించిన పిదపను లింగధారణ జరుపవలెననెడిది గ్రహించగలరు. శిశువు సర్వతోముఖమైన రక్షణను కల్పించుటయే లింగధారణ సంస్కారము యొక్క లక్ష్యమని గుర్తించగలరు.

ఈ పిండోత్పత్తి ప్రక్రియ గురించి యుపనిషత్తులలో వివరణ గలదు. ఛాందగ్యోపనిషత్తులోని సప్తాగ్ని ప్రకరణమునందున దీనిని గాంచగలము. "సప్తమ్యామాహుతా వాపః పురుష వచసోభవంతి" అని చెప్పబడినది. ఈ ఉపనిషత్తులో వివరించిన దాని ప్రకారము స్త్రీ యోని యనెడి అగ్ని కుండమునందున పురుష వీర్యమనెడి అజ్యమును హోమము చేయగా నయ్యది మావి యిత్యాది రూపములను దాల్చి చివరకు శిశువై జన్మించుచున్నది.

ఉపనిషత్తులలోన చెప్పబడిన దానికిని, శివయోగులు చెప్పిన దానికిని, ప్రాచీనాయుర్వేద వైద్య శిఖామణులు చెప్పినదానికిని, నేటి వైజ్ఞానికయుగమునందున చెప్పబడుచున్నదానికిని పోలికలు గలవని గుర్తించగలరు. శిశువు ప్రాణము పోసికొనెడి స్థితి యెంతో ముఖ్యమైన దనెడిదే మౌలికమైన సూత్రము. విగత ప్రాణియైన శిశువు విసర్జింపబడుననెడిది తెలిసికొనవలసిన విషయము. కాయము పుట్టి పెరుగుటలో ప్రాణమునకున్న ప్రాముఖ్యత దేనికియును లేదనెడిది సర్వజన విదితమే.

శిశువులో ప్రాణము ప్రవేశించగానే దాని కాయము చేతనాశక్తి యుదయించునని తెలిసికొనగలరు. శిశువు యొక్క కుదిలికలను మాతృమూర్తిగా కాబోయెడి గర్భవతి గమనించునని తెలియనిదెవ్వరికి. మాతృ గర్భములో నున్నప్పుడే శిశువు యొక్క యింద్రియములకు గ్రహణశక్తి గల్గునని చెప్పబడినది. వేదవ్యాసులవారు తమ భారతేతిహాసమునందున నభిమన్యుని కథలోన యీ విషయమును వివరించిరి. అభిమన్యుడు పద్మవ్యూహమునకు సంబంధించిన కొన్ని వివరములను తాను మాతృ గర్భములోన యుండినప్పుడే నేర్చికొని యుండెనని వ్యాసోక్త భారతములో చెప్పబడినది.

ప్రాణమున కుండెడి ప్రాముఖ్యత దృష్ట్యా శ్రీ రేణుక భగవత్పాదులవారు "ప్రాణ ఏవ మనుష్యాణాం దేహధారణ కారణమ్" అని యుపదేశించిరని గ్రహించగలరు.

ప్రాణము గురించిన మరింత వివరణ నిచ్చుటకై శ్రీ భగవత్పాదులవారు తమ యుపదేశమునీ క్రింది విధముగా నిచ్చిరి.

**నిరాధారః శివః సాక్షాత్ ప్రాణస్తేన ప్రతిష్ఠితః ।**
**తధారా తనుర్జ్ఞేయా జీవో యేనైవ చేష్టతే ॥** (సి.శి. 17-29)

ఈ వుపదేశము యొక్క సారాంశమేమనగా విశ్వమునకాధారభూతుడై తాను మాత్రమాధార రహితుడై యుండెడి శివుడు జీవునిలో ప్రాణమును ప్రతిష్ఠించుచున్నాడు. ఈ ప్రాణమే కాయమున కాధారమగుచున్నది. ప్రాణమువలననే ప్రాణియందు చేతన యుద్భవించుచున్నది.

లోకాచారము ప్రకారము దేవాలయ నిర్మాణమైన పిదప, దేవతామూర్తులను ప్రతిష్ఠించెడి సందర్భములో విగ్రహములకు ప్రాణప్రతిష్ఠ చేయుట యగుచున్నది. ప్రాణప్రతిష్ఠను జరుపకుండగ విగ్రహమును ప్రతిష్ఠించినచో దానికి పూజార్హత లభించదు. ఇదేవిధిన జీవియొక్క కాయమునకు శివుడు ప్రాణప్రతిష్ఠను కల్పించుచున్నాడు. ఈ ఆధారము వలన శరీరము చైతన్యమును సంతరించుకొనుచున్నది.

"మూర్ధానాం భిత్వా ప్రావిశత్" అనెడిది యుపనిషద్వాక్యము. దీని ప్రకారము శివుడు శిశువు యొక్క మస్తకమును భేదించి ప్రాణమును ప్రవేశపెట్టునని తెలియుచున్నది. ఆ పిదప శివుడు జీవునిలో నిలిచియుండునని తెలుపబడినది. శిశువు యొక్క మస్తకమున నొక రంధ్రముండుననియును, రంధ్రము మీద పలుచని చర్మపు పటలముండునని మనమెరుగుదుము. మృదువైన యీ భాగమును గట్టి పరచుటకై నూనెను మాడుకు పెట్టెడి సాంప్రదాయము కొనసాగుచున్నది. ఈ మెత్తని ప్రదేశమునే బ్రహ్మ రంధ్రమని యందురు. కొంతకాలము పిదప నీ రంధ్రము మూసికొనిపోవును.

చచ్చేటప్పుడు ప్రాణము బ్రహ్మరంధ్రమునుండి నిర్గమించజాలని స్థితి యేర్పడుచున్నది. కళ్ళు, ముక్కు మొదలగు వాటిలోని యేదోయొక రంధ్రమునుండి ప్రాణము నిర్గమించును. పరిణితి చెందిన యోగ పుంగవులు తమ ప్రాణములను విలక్షణమైన రీతిలో విడుతురు. యోగసాధన వలన ప్రాణము బ్రహ్మరంధ్రమును భేదించుకొని బహిర్గతమగునని తెలియుచున్నది. బ్రహ్మరంధ్రమనెడిది దశమ ద్వారముగా గుర్తించబడినది.

సామాన్యుని ప్రాణము నవ ద్వారములలోని యేదో ఒక మార్గమున వెడలిపోవుచుండును. దశమ ద్వారము యోగి పుంగవుల కొరకు ప్రత్యేకించబడినదని గుర్తించగలరు. ఈ విధముగా నిదొక విశిష్టమైన ద్వారమనెడి గుర్తింపు పొందినది.

మానవ దేహమొక విశాలమైన పురము వంటిది. శాస్త్రజ్ఞులు దీనిని పురమని యందురు. ఈపురమున నివసించెడి వాడగు జీవుని తీరు పురుషుడని అందురు. "పురి శేతే ఇతి పురుషః" అనెడిది పురుష శబ్దము యొక్క వ్యుత్పత్తి. ఇందులోన యెనిమిది ముఖ్యకేంద్రములు గలవు. ఈ కేంద్రములు చక్రములనెడి పేరున పిలువబడుచున్నవి. ఈ చక్రములేవనగా ఆధార, స్వాధిష్ఠాన, మణిపూరక, అనాహత, విశుద్ధి, ఆజ్ఞా, బ్రహ్మ రంధ్ర మరియు పశ్చిమ శిఖా చక్రములు ముందున చెప్పిన యటుల తొమ్మిది ద్వారములుండును. ఇవి కన్ను, ముక్కు, చెవులు మొదలగునవి.

వేదాంత శాస్త్రమునందున దశేంద్రియములు మరియు నాల్గు అంతఃకరణములు ముఖ్యమైనవిగా యెంచబడినవి. వీటికొక్కొక్క దానికొక అధిష్ఠాన దైవముండునని తెలుపబడినది. వీరశైవాచార్యులు ఆచారాది స్థానములలో ఆచారాది షల్లింగములుండునని ప్రతిపాదించిరి. ఈ విధముగా దేహమొక దివ్యమైన పట్టణమని తెలుపబడినది. కొందరు దేహమును దేవాలయముతో పోల్చి చెప్పిరి.

"అష్టచక్రా నవద్వారా దేవానం పురయోధ్య" అని చెప్పబడినది.

దేహము దేవునికి ఆవాస స్థానమని చాలామందికి తెలియదు. అందుచేత యిద్దాని పవిత్రత గురించి వీరు ఆలోచించుట లేదు. మన యింటిలోని దేవుని గదిని యే విధిన పరిశుభ్రముగానుంచి కొనెదమో అదే విధిన మన దేహమును పవిత్రముగా పెట్టికొనవలెననెడి దానిని గ్రహించగలరు. దేవుని బడయుటకై దేవుని వలన నివ్వబడిన ప్రసాదమే దేహమని గ్రహించవలెను. "కూడల సంగమ దేవుని వలపించుటకై వచ్చిన ప్రసాద కాయమును చెరచకూడదని" శ్రీ బసవన్నవారు నుద్భోదించిరి. ఎవ్వరు దేహమును నెంతమేరకు పరిశుభ్రముగా నుంచికొందురో వారు నంతమేరకు నాధ్యాత్మికమైన ప్రగతిని సాధించగలరనెడి మౌలిక సూత్రమును జ్ఞాపకముంచికొనవలెను.

దేహమునకు ప్రాణమును ప్రసాదించిన దేవుడు దేహమునందే నివసించి దేహము యొక్క చైతన్యమునకు కారణమైన ప్రాణమునకు తగు ప్రేరణ నిచ్చుచున్నాడు. ప్రాణము నిర్గమించిన క్షణముననే చైతన్యము లుప్తమగుచున్నది. ఈ విషయమును వివరించెడి రోచకదాయకమైన కథయొకటి గలదు.

ప్రాచీన కాలముననొక రాజు రాజ్యము నేలుచుండెను. అతని కతని పట్టపుటేనుగు మీద నమితమైన యనురాగముండెను. అతడెక్కడికి వెళ్ళినా నయ్యది అచ్చటికి వచ్చుచుండెడిది. దానికి సకల విధములగు సపర్యలు చేయబడెడివి. ఈ విధిన కొనసాగుచుండగా రాజు ప్రవాసములోనున్న సమయమున యేనుగు యొక్క ఆరోగ్యము చెడిపోయెను. ఊరి ప్రముఖులను పిలిపించికొని యేనుగును తగువిధముగా చూసికొనవలెననియు, వైద్యాది సౌకర్యములు కల్పించవలెననియును, వలయు ధనము రాజకోశమునుండి పంపించబడుననియును దీని యొక్క ఆరోగ్య విషయమును ఎప్పటికప్పుడు తెలియజేయవలెననియు నాదేశించెను. ఎవ్వరైతే మరణవార్తను తెచ్చెదరో వారికి మరణదండన విధించబడునని చాటింపు వేయించెను. ప్రజలు నేనుగును భయభక్తులతో పూజించవలెనని రాజుగారీ జాగ్రత్తలను తీసికొనెను. ఎంతో అయిష్టముతో రాజు రాజధానికి తరలి వెడలెను.

ఇచ్చట ఊరి ప్రముఖులు చాలావరకు కష్టనష్టముల కోర్చి యేనుగును సేవించిరి. అయినా దాని ఆరోగ్యము కుదుటపడలేదు. కొన్ని నెలలకది ప్రాణములను వీడెను. ఈ వార్తను రాజుగారి కెరిగించుట కెవ్వరును సంసిద్ధులు కాకుండిరి. మరణ దండన విషయము వారిని భయభ్రాంతులకు గురిచేసెను. ఊరి ప్రముఖులెల్లరు సమావిష్టులై మార్గాంతరముల నన్వేషించిరి. వారికి యేమియును దోచకుండెను. ఇంతలో నొక శివయోగి వారికి తన దర్శనము నిచ్చెను. వారందరా శివయోగుల వారికి పాదపూజాదులను చేసి, ప్రసాదమును బడసిరి. వారు స్వామి వారికి విషయమును నివేదించి తగిన యుపాయమును తెలుపుడని కోరిరి. శివయోగులవారు కొంత సమయము వరకు నాలోచనలో మునిగిపోయెను. ఆ పిదప వారి నుద్దేశించి "రాజు గారికి వర్తమానము నిచ్చెడివాడు మరణమనెడి పదమును ప్రయోగించకుండగ నేనుగు చావు గురించి రాజుకు తెలుపవలెనని చెప్పినవాడయ్యెను. ఆ పిదప ఆ యూరి వారు వీడ్కోలు పలుకగా శివయోగులవారు తమ మార్గమున తాము వెడలిపోయిరి. గ్రామస్థులొక చతురుడగు వాని నెంపిక చేసికొని, వాని ద్వార రాజుకు వర్తమానమును పంపించెడి యేర్పాట్లు చేసిరి.

మాటకారియగు వార్తవహుడు రాజును సందర్శించెను. రాజుగారు వెంటనే యేనుగు కుశలవార్త నడిగెను. అప్పుడు మరణవార్తను మోసికొనివచ్చిన వార్తావహుడు రాజుతో నిట్లనెను :

"ఓ రాజా! మీ పట్టపుటేనుగు కుశలముగానే యున్నది. హాయిగా పరుండియున్నది. కాని అది కళ్ళు తెరుచుటలేదు. తిండిని తినుటను మానివేసినది. కాళ్ళు, తోక, చెవులు ఇత్యాదులను కదిలించుటలేదు. ఏలినవారే మాకు తేల్చిచెప్పవలెను. మేమేమి చేయవలెనో తెలియుటలేదు. అది జీవించియున్నదో లేదో తెలిసికొని తెలియజెప్పెడి యేర్పాట్లు చేయగలరు".

వార్తా వాహకుని మాటలలోని యంతరార్థమును గ్రహించిన రాజు విషాదగ్రస్తుడయ్యెను. చేయునదేమియును లేదని నిర్ణయించికొని, వార్తావహుని సురక్షితముగా పంపించెను. ఊరివారు ముప్పు వాటిల్లనందుకు సంతసించిరి. శివయోగులవారికి తమ ధన్యవాదములు తెలియజేసిరి. చతురుడగు వార్తావహుని యభినందించిరి. ఏనుగు కాయమునకు ఖనన సంస్కారమును చేసిరి.

కాయము యొక్క చైతన్యమునకు ప్రాణమే కారణమని తేలినది. అయితే, ప్రాణములను శివునిలో లయమొనర్చిన శివయోగి కాయము చైతన్య సహితముగా నెట్టులుండగలదనెడి సందేహమేర్పడవచ్చును. అద్దాని నివారణను చేసెడి శ్రీ రేణుకాచార్యులవారి యీ క్రింది యుపదేశమును గనుడి :

**శివే ప్రాణో విలీనోఽపి యోగినో యోగమార్గతః ।**
**స్వశక్తి వాసనాయోగాద్ ధారయత్యేవ విగ్రహమ్ ॥** (సి.శి. 17-30)

శివయోగులు, కుంభకాది క్రియల ద్వార ప్రాణమును శివునిలో లీనము చేసినను స్వశక్తి యొక్క సంస్కారబలము చేత శరీరమును ధరించి తిరుగాడుచుందురనెడిదే యీ యుపదేశము యొక్క సారాంశము.

ప్రాణము దేహమును వీడి వెడలెడి సందర్భములో, నిర్జీవితుడైనవాని కాయమును కుక్కలు-నక్కలు, క్రిమి-కీటకములు నష్టమునకు గురిచేయును. అయితే యోగి యొక్క ప్రాణము కాయమును వీడుటలేదు. కారణమేమనగా, ఆ ప్రాణము కాయములోనే నెలకొనియుండిన శివునిలోనే నిలిచియుండును. కుంభకము వలన గాలి ఆడకుండినను దేహములో జీవ ప్రక్రియలు యథావిధిన కొనసాగునని గ్రహించగలరు.

శివయోగి పొందెడి నిశ్చలస్థితి గురించి శ్రీరేణుకాచార్య భగవత్పాదులవారీ క్రింది విధముగా నుపదేశించిరి :

**స చాభ్యాసవశాద్ భూయఃసర్వతత్త్వాతివర్తిని**
**నిష్కలంకేనిరాకారే నిరస్తాశేషవిక్లవే॥**
**చిద్విలాసపరిస్ఫూర్తి పరిపూర్ణసుఖాహ్వయే ।**
**శివేవిలీనః సర్వాత్మా యోగీ చలతి న క్వచిత్॥** (సి.శి. 17-31, 32)

ఈ వుపదేశము యొక్క తాత్పర్యమేమనగా జీవన వ్యవహారమునకు నాధారభూతమైన ప్రాణవాయువు ముప్పదియారు తత్త్వముల కంటెను నతీతముగా నుండెడిదియును, జరా-మరణాది దోషములచే నంటబడనిదియును, నిరాకారమైనదియును, బంధన రాహిత్యము గలదియును, జ్ఞానాధిక్యత గలదియును పరిపూర్ణమైన పరమానందము గలదియు, అద్వితీయమైనదియును అగు శివతత్త్వములో విలీనమైపోవుటచేత శివయోగి నిశ్చలమైన స్థితిలోనుండును.

ఈ వుపదేశమున శివతత్త్వము యొక్క లక్షణములు తెలుపబడినవి. భూమి మొదలుకొని శివుని వరకు గల తత్త్వములన్నింటికంటెను శివతత్త్వము గొప్పదైయున్నది. ఇది భావ వికారముల కతీతమైన దగుటచేత జనన-మరణాది దోషములు దీనినంటవు. సకల విధములగు ఆకారములకు నాధారభూతమైయున్నను నిద్దానికి యెట్టి విధమైన ఆకారముండదు. ఇది అఖండముగా విరాజిల్లును గాన పరిపూర్ణమైనది. చిదానంద స్వరూపమే యీ తత్త్వమున ప్రాణమున విలీనము చేసికొనిన శివయోగికి సాధారణ జీవి కుండెడి చలనాచలనాది బాధలుండవు. ఇతడు నిశ్చలుడుగా వుండునని గ్రహించగలరు.

ఈ స్థలమును ముగింపు చేయుచు శ్రీ రేణుక భగవత్పాదులవారీ యుపదేశము నిచ్చిరి :

**ప్రధ్వస్తవాసనాసంగాత్ప్రాణవృత్తింపరిక్షయాత్ ।**
**శివైకీభూతసర్వాత్మా స్థాణవద్భాతి సంయమీ ॥** (సి.శి. 17-31)

విషయ వాసనలను ధ్వంసం చేయుటవలనను, ప్రాణవృత్తిని పరిక్షయమొనర్చి నందువలనను, మనఃప్రాణాదులు శివునితో నేకీకృతమైనందువలనను శివయోగి స్థాణువువలె విరాజిల్లుచుండుననెడిది యీ వుపదేశము యొక్క సారాంశము.

ప్రాణాయామమున పరిణితి పొందిన శివయోగి, ప్రాకృతము మరియు వైకృతము నగు ప్రాణవాయువు యొక్క గతిని నిరోధించి యద్దానికి కుంభకము ద్వార శివునిలో లయమొనర్చును. తత్ఫలితముగా నతని మనోవృత్తులు నిలిచిపోవును. మనో నిగ్రహరూపమైన సాధన వలన

యతని విషయ వాసనలు విలయమగును. ఈ విధముగా సంయమియై, శివునియందున సమరస భావము నొందును. స్థాణువై నిశ్చలస్థితికి చేరును. ఇతని స్థితిని యెండి మోడైన చెట్టుతో పోల్చవచ్చును. సజీవమైయుండి ఆకులు, పువ్వులు, ఫలములు ఇత్యాదులతో నుండెడి వృక్షము గాలి తాకిడికి కదలునే కాని మోడు కదలునే? ప్రాణానుగ్రహస్థలములోని శివయోగి నిశ్చలుడై గంభీరుడై తనను దర్శించిన వారి ననుగ్రహించుచుండునని తెలిసికొనగలరు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులవారు పిండోత్పత్తి క్రమము నెంతో వివరముగా బోధించిరి. ప్రాణాగమ విధిని వివరించిరి.

"కాయం వినా సమస్తానాం న క్రియా న చ భావనా" అనెడి ఆది జగద్గురూక్తి (సి.శి.16:36) కాయము యొక్క అవశ్యకతను తెలుపుచున్నది. "కాయ యోగేన సిద్ధ్యన్తి భోగమోక్షాదయః" అనియును చెప్పబడినది. (సి.శి.16:37) అట్టి దేహమునకు ప్రాణము చైతన్యదాయకమగుచున్నది. "ప్రాణాధారా తనుర్జ్ఞేయా" అనియును, జీవశ్చేష్టతే అనియును చెప్పబడినది.

"ప్రాణః శివేన ప్రతిష్ఠితః" అనెడిది ఆచార్యోక్తి (సి.శి.17:27) గమనించదగినది. ఈ విషయమున మన అవగాహనను పెంచెడి సమర్థత గల్గిన క్రింది చతుర్వేదసారోక్తులు చూడదగినవని తెలిసికొనుడి :

**అదిదైవ మాచార్యుదధ్యాత్మమైనట్టి**
**యదిభూతమగు పరమాత్మ లింగ**
**మా పరమాత్మ జీవాత్మసంగతి కుపా**
**దానంబు ప్రాణమాధారమనగ**
**నా ప్రాణమును సంగమంబగు సత్ప్రాణ**
**మాత్మ ప్రాణనిరూఢియట్టి త్రిపుటి**
**యందు సద్గురుని వాక్యార్థంబు నమ్మి మా**
**యామల వ్యతిరిక్త మగుచు నాత్మ**
**ప్రాణలింగాంగమథన సంబంధ లీల**
**దనర ప్రాణాంగములు ప్రసాదములుగాగ**
**మానసేంద్రియములు నందమగ్నములుగ**
**నెసగు సుఖమల్పులకు నెద్ది బసవలింగ!** (చతుర్వేదసారము,ప. 254)

అనుగ్రహ స్థలత్రయములోని స్థలములకు పరస్పరమైన సంబంధము గలదనెడిది గుర్తించవలెను. అనుగ్రహమనెడి భావనలో నుభయ దిగ్గమన ప్రక్రియ యంతర్లీనముగా నుండునని గ్రహించవలెను. మొదటి ప్రక్రియలో శివాహిత మానసేంద్రియ ప్రాణ ప్రక్రియ ద్వార పరస్థలిగా మారిన పరజంగముడనుగ్రహితుడగును. తదనంతర ప్రక్రియలోన నా జంగముడు లోకుల ననుగ్రహించును. ఏ విధిన శివుడొక కాయమును గొని లోకము ననుగ్రహించునో అదేవిధిన పరజంగముడు పరకాయుడి గాను పరస్థలిగాను పరిణామము నొంది దేహేంద్రియ ప్రాణాదుల వలన లోకముల ననుగ్రహించును.

వాస్తవముగా చూసిన యెడల పరకాయునికి యైక్యస్థలముననే ముక్తి లభించును. అట్టివానికి కాయముతో పనిలేదు. కాని లోకోద్ధారణకై అతడు కాయమును పొందును. అదెందుకనగా "మూర్తివినా యోగీ నాత్మతత్త్వ ప్రకాశవాన్ (భవతి)" అనెడి యనుభవోక్తి యతనిని సకాయుడుగా చేయుచున్నది. యోగీ శరీరస్థః సర్వానుగ్రహణ భవేత్" అనెడి ఆచార్యోక్తి (17:5) కనుగుణముగా లోకముల నుద్ధరించుటకై సకాయుడుగా సంచరించును. ఇంద్రియ వృత్తుల వలన లోకుల నుద్ధరించుటకై ప్రాణముగలవాడగుచున్నాడు. యత్న పూర్వకముగా శివయోగి కాయమును ధరించునని తెలిసికొనగలరు. స్వాభావికముగా అంతర్లింగాను సంధానియై స్థాణువువలె నుండి యున్నను లోకములను గాంచుటకై సచేతనుడై తాత్పర్యవలోకనమును ప్రసరింపజేయు లోకుల పాపములను వ్రక్కలుగా చేయుచున్నాడని తెలియుచున్నది. లోకులకు సంసారమనెడి సముద్రమును దాటుట కొరకు వలయు నుపాయముల నొసంగు ననెడిది గ్రహించవలసిన విషయము.

## ఆశీర్వచనము - 1 :

## కాయార్పిత స్థలము :

లింగషట్ స్థలాంతర్గతమగు ప్రసాది స్థలములోని ప్రాణానుగ్రహ స్థలము గురించి తెలిసికొంటిరి. ఆ పిదప వచ్చెడి స్థలమే కాయార్పిత స్థలము. శ్రీ రేణుకాచార్య భగవత్ పాదులవారు అగస్త్యునికీ విషయము గురించి యీ క్రింది విధముగా నుపదేశించిరి.

**శివస్య పరరూపస్య సర్వానుగ్రహిణోర్చనే ।**
**త్యాగో దేహాభిమానస్య కాయార్పితము దాహృతమ్ ॥** (సి.శి. 17-34)

సర్వానుగ్రహ కారణుడును, శివ పరబ్రహ్మ స్వరూపుడును, అగు శివయోగి శివపూజా సందర్భమున దేహాభిమానమును త్యాగము చేయుటే పరమార్థముగా గల్గిన ప్రాణానుగ్రహస్థలములోని శివయోగి కాయార్పిత స్థలియగుచున్నాడనెడిదే యీ యుపదేశములోని సారాంశము.

కాయమును కాని కాయాభిమానమును కాని సమర్పించుటలో గల యుద్దేశమేమిటనెడి సందేహము గల్గుట సహజమే. ఈ జగములోని వారిలో నధికులు యితరుల సొమ్మును తామనుభవించుచుండుటలో నాసక్తి గల్గియుందురు. ఇట్టి ధోరణి దుఃఖదాయకమైన దనెడి దానిని వీరు గ్రహించెడి స్థితిలో లేరు. శాస్త్రకారులు జ్ఞానోదయము గల్గించుట కొరకు ప్రయత్నించుచున్నారు. "ఈశావాస్య మిద సర్వ"మ్మని ఈశావాస్యోపనిషత్తు తెలియజెప్పినది. విశ్వమంతయు నీశ్వరునిదే అనెడిదే యీ యుపనిషద్వాక్యములోని సారము. కాని లోకమున యీ సత్యమును గ్రహించెడి వారు కొందరు. నాది అనెడి మమకారము వలన మధనపడెడి వారే అధికసంఖ్యలో నుందురు. మనది అని మన మభిమానమును గొనెడి యీ దేహము పూర్ణముగా మనదేనా? యనెడిదొక సందేహము కలదు. వాస్తవికముగా చూసిన యెడల యిది మనది కాకుండగ మన తల్లిదండ్రుల రేతో-రుధిరముల చేత నేర్పడినదైయున్నది. తల్లిదండ్రుల శరీరములును వారివి కావు. అవి వారి తల్లిదండ్రులకు చెందినవై యుండును. ఈ విధముగా పరిశీలించుచుపోయిన యెడల శివశక్తులే యావత్ జగత్తుకు తల్లిదండ్రులని తెలియగలదు. ఈ విషయమును శ్రీ కాళిదాస మహాకవి తమ రఘువంశ మహాకావ్యపు మంగళాచరణలో నీ క్రింది విధముగా తెలియజెప్పిరి.

**వాగర్థ వివసంపృక్తై వాగర్థ ప్రతిపత్తయే ।**
**జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ ॥**

**త్వమేవ మాతాఛ పితాత్వమేవ"** యనెడి సంస్కృత శ్లోకమీ విషయమునే తెలియజేసినది. శివశరణులను తమ వచనములలోన యిదే విషయమును నుటంకించిరి. శ్రీ బసవన్నవారి యీ క్రింది వచనమును గనుడి :

**తందెనీను తాయినీను**
**బంధు నీను బళగ నీను**
**నీనల్లదె మత్తారు ఇల్లవయ్యా**
**కూడల సంగమ దేవా!**

ఈ వచనపు తెలుగు రూపమిది :

**తండ్రి వీవు తల్లి వీవు**
**బంధువీవు బళగ వీవు**
**నీవు కానిది మరేదీ లేదయ్యా**
**కూడల సంగమదేవా!**

మన శరీరము శివుని దైనందున దానిని లేదా దానిమీద మనకు గల యభిమానమును శివునికి సమర్పించగా నా క్రియ కాయార్పితమగుచున్నది.

శివయోగి తన కాయమును శివుని కర్పించుటచేత కాయము అంతరించిపోవుననే ఆలోచన పెట్టికొనవలదు. దీనినొక యుదాహరణ ద్వార తెలుపవచ్చును. పసిబాలునికి తల్లి తినిపించెడి సందర్భములోన ఆ పసివాడు తన చేతికి యివ్వబడిన దానిని తల్లి నోటికందించును. తల్లి దానిని తినదు. మరల పిల్లవానికే తినిపించును. కాని పిల్లవాని యీ చర్యవలన తల్లికెంతో ఆనందము సంప్రాప్తమగును. పిల్లవాని నక్కున చేర్చికొని ముద్దాడి ప్రేమను కురిపించును. ఇదే విధిన కాయార్పితము చేసిన వానియెడల శివునికి యెంతో కారుణ్యము జనించును. శివకారుణ్య ప్రభావము వలన జీవికి ఆధ్యాత్మిక లబ్ధి లభించుచున్నది.

కాయార్పిత స్థలమునందలి శివయోగి శివుడై వెలుగొందునని శ్రీ రేణుకాచార్య భగవత్పాదులవారు నగస్త్యముని కీ క్రింది విధముగా నుపదేశించిరి :

**యదా యోగీ నిజం దేహం శివాయ వినివేదయేత్ ।**
**తదా భవతి తద్రూపం శివరూపం నసంశయః ॥** (సి.శి. 17-35)

ఎప్పుడైతే శివయోగి దేహాభిమానమును త్యాగము చేయునో అప్పుడే యతడు శివరూపము గలవాడగుచున్నాడనెడిదే యీ యుపదేశపు సారము. ఈ విషయమున సంశయమున కాస్కారము లేదని శ్రీ భగవత్పాదుల వారు ప్రకటించిరి.

మనకు సంప్రాప్తమైన దేహము పాంచభౌతికమైనది. దేహము నాశ్రయించి యుండెడి జీవాత్మ వెలుపలికి వెడలిన పిదప నీ దేహమును పంచభూతములకే సమర్పించబడుచున్నది. ఇది సహజమైన విషయమే. ఏదైనా వస్తువు భిన్నమైన యప్పుడు ఆ వస్తువు దేనివలన తయారు చేయబడునో అందులోనే కలిసిపోవును. కుండ పగిలిపోయిన యెడల నయ్యది పృథ్విలో కలిసిపోవును కదా! మట్టి చేత నే విధిన మట్టి కుండ యగునో అదేవిధిన పంచభూతములవలన కాయము రూపొందుచున్నది. పంచభూతములు శివుని యంగములని భావించెడి యష్టమూర్తి వాదన యనెడి దొకటి గలదు. సూర్యచంద్రాత్మలు మరియు పంచభూతములు శివుని వ్యక్తమైన శరీరము యొక్క భాగములని తెలుపబడినది. అయితే భూమ్యాది శివుని పర్యంతము గల ముప్పది యారు తత్త్వములు శివునివే యనియును పంచ భూతములందులోని భాగములని గ్రహించగలరు. ఈ ప్రపంచములోని ప్రతి వస్తువులోనూ శివుడున్నాడు. శ్రీ భగవత్పాదుల వారింతకు క్రితమే యీ విషయమును సుస్పష్టపరిచిరి. ఈ విషయమీ క్రింది యుపదేశములో గాంచగలము.

**పత్రశాఖాదిరూపేణ యథా తిష్ఠతి పాదపః ।**
**తథా భూమ్యాది రూపేణ శివఏకో విరాజతే ॥** (సి.శి. 10-70)

వేర్లు, కాండము, కొమ్మలు, ఆకులు, పువ్వులు, ఫలములు మొదలగు రూపములలో వృక్షము కన్పించును. అదేవిధిన శివుడు భూమ్యాదుల రూపములలో గన్పట్టును. ఇదే యీ యుపదేశము యొక్క సారము.

మనము కాయమును శివునికి సమర్పించు విధియందున మనకు చెందిన దానిని శివునికిచ్చుట యనెడిది అగుటలేదు. శివునిదే శివునికి సమర్పించిన యట్లులగుచున్నది. ఇట్టి ఆలోచన గల్గిన యెడల నొక వ్యక్తి సహజముగనే నిరభిమానికాగలడు.

మనము వస్తువులను త్యజించుటలో సౌలభ్యము దోచినను, నాది యనెడి యభిమానమును త్యాగము చేయుట సులభతరమైన విషయము కాదు. ఈ విషయమును తెలిపెడి దృష్టాంతమొకటి గలదు.

ఒక వ్యక్తి కొక నగరమున సన్మానము జరుపబడుచుండెను. అతనికి పరిచితుడైన వాడొకడు ఆ వ్యక్తికి నొక విలువైన శాలువాను కప్పెను. కొంతకాలము పిదప సన్మానితుడు దారిన వెడలుచుండెను. అతనిని గాంచిన సన్మాన ప్రదాత తన స్నేహితునితో నిట్లులనెను. ఆ వెడలెడి వ్యక్తి చాలా గొప్ప వాడు. కొంతకాలము క్రితమే అతనికి పెద్ద సన్మానము జరుపబడెను. అతని మెడమీది శాలువా నాదే. నేనే దానిని కప్పితిని ఈ విధముగా తెలుపుట వలన సన్మానము చేసిన ఫలము లభించదు కదా! ఈ విధమైన అభిమానమును వదలుకొనుట యెంతోసు అవసరమైయున్నది.

మనము చేసిన దానము లేదా సన్మానము గురించిన స్మృతిని మనము విస్మరించని యెడల, నయ్యది మన ఆధ్యాత్మిక ప్రగతికి గొప్ప ప్రతిబంధకము కాగలదు. అంతేకాదు, మనము "నేను చేసితిని", "నాది యిది" అనెడివి మనమున దాల్చిన యెడల మన మనస్సు మనకు

సంకెళ్ళు వేసి సంసారములోనికి పడద్రోయును. ఇది యొకానొక అవిస్మరణీయమగు సత్యమని గ్రహించగలరు. ఈ సత్యమును నిరూపణ చేసెడి కథనమొకటి కలదు.

కాశీ క్షేత్రములోని కొందరు గంజాయి మత్తు కలవాటు పడినవారు రాత్రిపూట నౌకా ప్రయాణమును చేయదలచిరి. మత్తులో నిండియున్న స్థితిలోనే గంగా తటమునకు వెడలి, నది యొడ్డున గల నౌక నెక్కి కూర్చుండిరి. తెడ్లను తీసికొని పడవను నడపజొచ్చిరి. రాత్రి ముగిసిన వరకు శ్రమపడిరి. ఈ లోపున వారి మత్తు దిగిపోయెను. అటు యిటు చూడగా వారు కాశీలోనే వున్నారని గ్రహించిరి. గంజాయి మత్తువలన వారు తెలివిని కోల్పోయి నౌకను గూటమునకు కట్టియుంచెడి తాడును వారు విప్పనందున వారి శ్రమ వృథా అయిపోయెను.

అయితే "నాది" యనెడి భావన లేకుండా లౌకిక వ్యవహారములను చేయగలమా అనెడి ప్రశ్న పొడచూపును. నాటకములోని పాత్రధారి విలపించెడి నటనను చేసి చూపినను వాస్తవముగా అతడు దుఃఖగ్రస్తుడు కాడు. అంతరంగమున నేనీ పాత్రను చక్కగా పోషించి జనము యొక్క మెప్పు పొందుచున్నాననెడి భావన గల్గవచ్చును. అది సంతోషదాయకమైనదగును కదా! ఇదే విధిన సంసారములోని వ్యవహారములలో నిర్లిప్తతను సాధించవచ్చును. అభిమానమును వీడవచ్చును.

కాయార్పణము చేసిన శివయోగి శివుడగుననెడి దెట్టుల యనెడిది మరియొక్క సందేహము. భజించెడి భక్తుడు తన స్వీయ సాధనా బలముచేత భగవంతుడు కావచ్చును. కావలెను. సాధన లక్ష్యమిట్టిదై యుండవలెను. దేవుని ఆరాధించుచు భక్తునిగా నిలిచిపోయెడి స్థితి వాంఛనీయముకాదు. శాక్తేయ, వైష్ణవాది మతముల ననుసరించెడివారు చాలామేరకు అనుయాయులుగానే మిగిలిపోవుచున్నారు. ఆయా మతములు నుద్భోదించెడి పరమాత్మ స్వరూపునిగా ఆయా ఆచారమునకు చెందిన భక్తుడేదిగిన యెడల మత సామరస్యమునకెట్టి విఘాతము వాటిల్లదు. అనుయాయులుగా మిగిలిపోతే మత ఘర్షణలు ననివార్యములగును.

శివుడగుట యనగా శివునివలె సమభావమును గల్గియుండుటయని గ్రహించగలరు. తర-తమ-చిన్న, పెద్ద యిత్యాది భేదములు లేనివాడు శివుడే యగుటలో ఆశ్చర్యమేమున్నది? ఈ ధర్మ సూక్ష్మమును గ్రహించి ప్రతి వీరశైవుడు నిరభిమానియై కాయము మీది మమకారమును విడిచివేయవలెను.

ఈ విషయ సుఖములనుండి దూరమై పోవుటవలన లభించెడి యనిర్వచనీయమైన సుఖమును శివయోగి తాననుభవించుకుండ నద్దానిని శివునికే అర్పించవలెనని శ్రీ రేణుకులవారు నగస్త్యునకుపదేశించెను. ఈ క్రింది శ్లోకమును గనుడి :

**ఇంద్రియప్రీతిహేతూని విషయాసఙ్గజాని చ ।**
**సుఖాని సుఖచిద్రూపే శివయోగీ నివేదయేత్ ॥** (సి.శి. 17-36)

ఈ శ్లోకము యొక్క తాత్పర్యమేమనగా శివయోగి ఇంద్రియములకు సంతోషము కల్గించెడి సుఖమును మరియు విషయముల నిస్సంగత్వము వలన లభించెడి సుఖమును చిద్రూపుడైన శివునకే అంకితము చేయవలెను.

ఇంద్రియముల సంఘాతమే కాయమగును. అందుచేత కాయార్పణమనగా నింద్రియ జన్యమైన సుఖము యొక్క అర్పణంమే ప్రతిపాదించబడినది. సామాన్యునికి నింద్రియ జన్యమైన సుఖమే నిజమైన సుఖము. శివయోగికిది రుచించదు. అతడు తన యింద్రియము వలన గల్గెడి సుఖమును తనలోని ఆచారాది లింగములకు నివేదించి వాటి ప్రసాదమును నెంతో ప్రీతితో స్వీకరించును. అదే విధముగా శివయోగి ప్రసాదానుభవ సుఖమును కూడ శివునికే నివేదించును.

పూర్వోక్త సుఖములనే విధిన చేయవలెననెడి దానిని శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారు తమ యుపదేశములో నీ క్రింది విధముగా వివరించిరి :

**దర్శనాత్ స్పర్శనాద్ భుక్తేః శ్రవనాద్ ఘ్రాణనాదపి ।**
**విషయేభ్యోయదుత్పన్నం శివేతత్సుఖమర్పయేత్ ॥** (సి.శి. 17-37)

చూపు, తాకుట, తినుట, వినుట, వాసన చూచుట యిత్యాదులవలన లభించెడి విషయ సుఖమును శివుని యందు నర్పించవలెననెడిదే యీ శ్లోకము యొక్క తాత్పర్యము.

ఈ స్థలము గురించిన తమ యుపదేశమును సమాప్తము చేయుచు శ్రీ రేణుక భగవత్పాదులవారీ క్రింది యుపదేశము నిచ్చిరి :

**దేహద్వారేణ యద్యత్ స్యాత్ సుఖం ప్రాసఙ్గమాత్మనః ।**
**తత్తన్నివేదయన్ శంభోర్యోగీ భవతి నిర్మలః ॥** (సి.శి. 17-38)

దేహ సంబంధమైన విషయేంద్రియములచేత యే యే సుఖమేయే సందర్భములో వచ్చునో ఆ సుఖమును నాయా సందర్భముల యందు శివుని కర్పణము చేసి శివయోగి నిర్మలుడై ప్రకాశించుననెడిదే యీ ఆచార్యోక్తి లోని భావార్థము. దేహము మాధ్యమమని తెలుపబడినది.

విషయ సుఖముల ననుభవించుటకై ప్రారబ్ద కర్మానుసారముగా జీవి విషయముల ననుభవించును. తత్ఫలితముగా మలినుడగుచున్నాడు. మలినము వలన మాయా ప్రభావానికి లోనై సంసారములో సుఖదుఃఖముల ననుభవించుచుండును. శివయోగి యిట్టివాడుకాదు విషయోపభోగమును శివుని కర్పించును. శుద్ధీకరణ చేసెడి శక్తి గల్గిన శివతత్త్వము ప్రభావము వలన శివునివలె శివయోగి నిర్మలుడై విరాజిల్లుచుండును. మీరెల్లరు నాచార్యులవారు చూపిన మార్గమున పయనించి నిర్మలులై ప్రకాశింతురు గావుత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యులవారు కాయార్పిత స్థలము గురించిన విశేషాంశములను వివరించిరి. దేహాభిమానమును త్యాగము చేయుటే కాయార్పిత స్థలములో సాధకుని ముఖ్యలక్ష్యమై యుండునని తెలిపిరి.

శివభక్తి పథమున దేహాభిమాన త్యాగమున కెంతో ప్రాముఖ్యత గలదు. ఈ విషయము గురించి సూక్ష్మాగమ మీ క్రింది విధముగా వివరించినది:

**అథైషాం లక్షణం వక్ష్యే శ్రుణుష్వ సమాహితాః ।**
**త్యక్తాభిమానౌ దేహాదౌ భక్త ఇత్యుచ్యతే బుధైః ॥** (అష్టమ పటలము)

"స్వేచ్ఛయా సంచరేత్ యోగీ విముఞ్చన్ దేహమానితమ్" అనెడి రేణుకోక్తి (సి.శి.15:70) యీ విషయమునే తెలుపుచున్నది. పర జంగముడు దేహాభిమానమును వీడి చరించుననెడిది దీనిలోని భావము.

"మనః ప్రసన్నత"ను పొందుటే అంగ ప్రసాది యొక్క ప్రధాన లక్ష్యమని తెలియుచున్నది. అర్పితమును గొనుట వలన నీ లక్ష్యము సిద్ధించునని తెలియుచున్నది. అర్చన, అర్పణ, అనుభవములు సాధకుని యొక్క మౌలికమైన సాధనములని తెలియుచున్నది. అర్చనలోని యంతర్భాగమైన నివేదన వలన అర్పితము లభ్యమగుననెడి విషయము నిర్వివాదమైన విషయమే. అర్పితమనెడి దాని లక్షణములను గుర్తించుట యనెడిది సులభ సాధ్యమైన విషయము. ఇష్టలింగమునకు చేసెడి సమర్పణమువలన లభించెడిది యర్పితము కాజాలదనెడి శ్రీ బసవేశ్వరుల వాక్కులు గమనార్హమైనవి. గమనించుడి :

**అర్పిత అర్పిత వెందెనుత్తిహిరి**
**గురువింగె కొడువుదు అర్పితవె?**
**సవిసవిదు కొడబేకల్లదె?**
**అర్పిత అర్పిత వెందెనుత్తిహిరి**
**లింగక్కె కొడువుదు అర్పితవె**
**సవిసవిదు కొడబేకల్లదె?**

**అర్పిత అర్పిత వెందెనుత్త హిరెల్లరు**
**అర్పిత ముఖవనరియగునోడా!**
**జంగమక్కె నీడి జంగమ ప్రసాదవ కొండడె**
**నినగర్పిత కాణా!**
**కూడల సంగమ దేవా!** (వ.సం. 776)

ఈ వచనపు తెలుగు రూపమును గనుడి :

**అర్పిత మర్పితమని యనుచుంటిరి**
**గురువుకు పెట్టిన దర్పితమే?**
**చవిని చవిగొని యివ్వవలెను కదా**
**అర్పిత మర్పితమని యనుచుంటిరి**
**లింగముకు పెట్టిన దర్పితమే?**
**చవిని చవిగొని యివ్వవలెను కదా!**
**అర్పిత మర్పితమని యనుచుందురు**
**అర్పితము యొక్క ముఖము నెరుగరు చూడుమా!**
**జంగమునకు వడ్డించి జంగమ ప్రసాదము**
**గొనినచో నర్పితము గనుమా!**
**కూడల సంగమ దేవా!**

జంగము డిచ్చిన ప్రసాదమును తన యిష్ట లింగమున కర్పించి యద్దానిని యనుభోగము చేసెడి పద్ధతిని బసవన్న వారు పాటించెడి వారని డోహర కక్కయ్య యనెడి శివశరణుని చరిత్ర వలన తెలియుచున్నది.

అయితే జంగమ ప్రసాదము యెడల భక్తి కుదురుట చాలా కష్టము. నమ్మిన వారికది ప్రసాదముకాగా నమ్మని వారికది యెంగిలి యనిపించును. సాధకుడపనమ్మకమునకు గురియై ఆగమ పథమును తప్పిన వాడయ్యెడి యవకాశము కలదు. అవధానభక్తిని సలిపెడి భక్తుని రక్షించుటకే శివుడు కాయార్పితమనెడి భావనగా నుదయించును. ఇద్దాని నాచరించి చూపుటకై పరకాయ స్థలియగునని గ్రహించవచ్చును.

పంచతన్మాత్రల వలన పుట్టెడి సుఖములను "శివే అర్పయేత్" అనెడిది ఆచార్యోపదేశము (సి.శి.17:38) యొక్క ఛాయను నీ క్రింది పద్యములో గాంచగలము.

**నీ నేత్ర లింగసన్నిహితమై నేత్రంబు**
**లర్పించు రూపలతాంతములను**
**నీశ్రోత్రలింగ సన్నిహితమై శ్రోత్రంబు**
**లర్పించు శబ్దంలతాంతములను**
**నీ ఘ్రాణ సన్నిహితమై ఘ్రాణంబు**
**లర్పించు గంధలతాంతములను**
**నీయంగ సన్నిహితమై త్వక్కుదా**
**నర్పించు స్పర్శలతాంతములను**

నీదు జిహ్వాయు లింగ సన్నిహితమగుచు
భజన సేయుచు సత్ప్రాజ పత్ర పుష్ప
మట్లదాల్చును నిర్మాల్యమా ప్రసాది
భక్తినయనేంద్రియంబుల బసవలింగ(చతుర్వేదసారము, ప. 269)

– శివం భూయాత్ –

## ఆశీర్వచనము - 1 :

## కరణార్పణ స్థలము :

ముముక్షువులైన మీరు క్రిందటి ఆశీర్వచనము నందున కాయార్పిత స్థలము గురించి తెలిసికొంటిరి. ప్రసన్నతను మరియు నిర్మలత్వమును సాధించుటకై సాధకుడు కాయమును పరమేశ్వరునికి సమర్పణను చేయవలెనని తెలిసికొంటిరి. కాయార్పణ స్థలములోని శివయోగి, తన సాధన పరిపూర్ణమైన పిదప కరణార్పణ స్థలమును ప్రవేశించును. అద్దాని గురించి యీ స్థలమున తెలిసికొందురు.

శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారీ స్థలము గురించి శ్రీ అగస్త్య ముని క్రింది విధముగా తెలియజెప్పిరి:

**ఆసఙ్ఞనం సమస్తానం కరణానాం పరాత్పరే ।**
**శివేయత్ తదిదం ప్రోక్తం కరణార్పితమాగమే ॥** (సి.శి. 17–39)

ఉపదేశాంతర్గమగు భావన యేమనగా పరాత్పరుడగు శివుని యందున నెవ్వడు తన యొక్క అంతఃకరణ బాహ్యకరణములను సంయోజనము చేయునో అతడు కరణార్పితుడనబడునని శివాగమములో చెప్పబడినది.

శరీర మింద్రియముల సంఘాతమని యింతకు క్రితమే తెలిసికొంటిరి. ఇంద్రియములు బలీయములైయున్నవి. ఎంతటివానినైనను తమవైపుకు నీడ్చికొని పోగలవు. అందువలననే "బలవానింద్రియ గ్రామో విద్వాంస మపికర్షతి" యని ప్రతిపాదింపబడినది. ఇట్టి శక్తివంతములైన యింద్రియములను తమ తమ వశమున నుంచికొనకుండిన యెడల సాధకులు తప్పుదారిని పట్టెడి యవకాశము గలదని గ్రహించగలరు. ఈ విషయమున మార్గమును సూచించెడి సూత్రమొకటి యుపనిషత్తులలో చెప్పబడినది. గమనించుడి :

**యస్తు విజ్ఞానవాన్ భవతి యుక్తేన మనసా సదా ।**
**తస్యేంద్రియాణి వస్యాని సదశ్వ ఇవ సారథేః ॥** (కఠోపనిషత్తు)

విజ్ఞాన సహితుడైనవాడు తన మనస్సు చేత నింద్రియములను తన వశము నందుంచికొనును. అప్పుడవి మంచి సారథి వశమున గల అశ్వములవలె ప్రవర్తించుచుండును.

ఇచ్చట యింద్రియములను బలీయమైన అశ్వములతో పోల్చుట సంభవించినది. నాటి రథములను నడిపించినది అశ్వముల శక్తియే కదా. నేటి యంత్రములను గుర్తించునప్పుడు వాటికి గల అశ్వ–శక్తి (71–9)ని పరిశీలించుచున్నారు. దుష్ట ప్రవృత్తి గల అశ్వములు సారథి వశమున నుండవు. రథమును తమ యిష్టానుసారముగా లాగికొని వెడలి యగాథములో పడవేయును. రథుడు శక్తిహీనుడై పోవును.

నైపుణ్యము గల సారథి కళ్ళెముల వలన నియంత్రణను సాధించును. లక్ష్యమును సాధించుటలో రథునికి సహాయకారిగా నుండగలడు. హరి సారథ్యమున పాండునందనుడు విజయుడు కాగా శల్య సారథ్యమున కర్ణుడు పతనమయ్యెనని మహాభారతము తెలిపినది. జీవియే రథుడు. బుద్ధియే సారథి. మనస్సే కళ్ళెములని గుర్తించగలరు. మనస్సును తన వశమును నుంచి కొనినవాడు తన యింద్రియములను తన వశమున నుంచికొనినవాడగుచున్నాడు. మనస్సు–బుద్ధి అంతఃకరణములని గుర్తించగలరు.

బుద్ధిమంతులెందరో మతిభ్రమకు లోనై యింద్రియ లోలత్వము పెంచికొనుట మనమెరిగిన విషయమే. వీరిలో కొందరికి జ్ఞానాతిశయము గల్గుచున్నది. సన్మార్గానువర్తులగుచున్నారు. ఈ కోవకు చెందినవాడే "గంగాలహరి"ని రచించిన జగన్నాథ పండితుడనెడి పండితోక్తి కలదు.

జగన్నాథ పండితుడు కాశీలో పేరెన్నికగనిన పండితుడై యుండెను. ఉద్దండ పండితోత్తములెందరో అతనిని గౌరవించుచుండిరి. అతని పాండిత్య విశిష్టత కెనలేని గౌరవముండెడిది. ఇతడు బుద్ధిహీనుడై యొక యవనకాంతను వరించెను. ఆమె పేరు లవంగి. ఆమె సాంగత్యమువలన నతడు భ్రష్టుడయ్యెననెడి యపకీర్తిని గాంచెను. పండిత లోకము చేత బహిష్కృతుడయ్యెను. కాలాంతరమున జ్ఞానాతిశయోదయ సంప్రాప్తి వలన పునీతుడై ధర్మానువర్తియై, అస్ఖలితమైన కీర్తిని మరల సంపాదించికొనెననెడి గాథ పండిత లోకమున ప్రచలితమైయున్నది.

కొందరు తమ బుద్ధిని నొక మహా పురుషునికి వశవర్తినిగా చేసి తాము నిశ్చింతతో నుందురు. మహాపురుషుడు చూపిన మార్గములో పయనించుచు విషయోపభోగ విషయములో నధర్మము సంభవించకుండగ జాగ్రత్తను వహింతురు. ఇట్టివారు ధన్యజీవులై లబ్ధ ప్రతిష్ఠులగుచున్నారు. భారతములోని యర్జునుని పాత్ర అట్టిదే. వైవాహిక సంస్కారములోను మనమీ సూత్రమును గాంచగలము. వధువు తల్లిదండ్రులు నెంతో మందిని సాక్షీభూతులుగా చేసికొని కన్యను వరునికి, ప్రదానము చేయుచున్నాడు. ఆమె రక్షణభారమును వరుడు, అతని కుటుంబసభ్యులు స్వీకరించవలసి యుండునని తెలియజెప్పును. వరునిచేత ప్రతిజ్ఞ చేసెడి సాంప్రదాయము గలదు. లోకాచారమున కొందరు అగ్నిని సాక్షిగా గైకొని వివాహమును జరిపింతురు. ఇది మంచి పద్ధతే. అగ్ని పంచభూతములలో నొకటి. కాని యావత్ పంచభూతములకు నధినేతగా నిలిచెడివాడు శివుడు. గురు-లింగ-జంగములు నీ భూలోకమున శివుని ప్రతిరూపము గురు-లింగ-జంగముల సాక్షిగావివాహమును జరిపించుట యనెడిది యుత్తమోత్తమమైనది. పంచాచార్యుల సన్నిధిన వివాహమును చేయించుటకంటెను నుత్తమమైన పద్ధతి మరొకటిలేదు. ఈ కారణము వలననే పంచ కలశముల స్థాపన, పూజా ఇత్యాదులను వివాహమంటపములో జరిపించవలెనని గ్రహించగలరు. దీక్షా సంస్కారములో శిష్యుని రక్షణ బాధ్యతను గురువు స్వీకరించుచున్నాడు. శివుడు -పతియై సాధకునికి సర్వ విధములగు రక్షణలను నేర్పాటు చేయుచున్నారు. ఈ బహు విధములగు దృష్టాంతముల వలన కరణార్పణము యొక్క ప్రాముఖ్యత తెలియవచ్చుచున్నది. ఈ కారణముననే శ్రీరేణుక భగవత్పాదులవారు కరణములను శివునికర్పించవలెనని ప్రబోధించిరి.

**యద్యత్ కరణమాలంబ్య భుఙ్క్తే విషయజం సుఖమ్ ।**
**తత్తచ్ఛివే సమర్ప్యైష కరణార్పక ఉచ్యతే ॥** (సి.శి. 17-40)

ఉపదేశమునందలి భావమేమనగా కాయార్పిత స్థలియగు శివయోగి యేయే యింద్రియములవలన విషయ సుఖమును పొందునో ఆయా యింద్రియములను శివునికి సమర్పించిన వాడై కరణార్పిత స్థలియగుచున్నాడు.

ఈ స్థలములోని సాధకుడు తన యింద్రియములను, యింద్రియములు చేసెడి పనిని, ఆ పని వలన లభించెడి విషయ సుఖమును శివునికి సమర్పించి తాను అలిప్తుడై యుండునని గ్రహించగలరు.

కరణార్పిత స్థలములోని శివయోగి తన యంతఃకరణమును నియంత్రించి కొనవలెనని శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారుపదేశించిరి. ఈ క్రింది యుపదేశమును గనుడి :

**అహంకారమదోద్రిక్తమంతః కరణవారణమ్ ।**
**బధ్నీయాద్ యః శివాలానే స ధీరః సర్వసిద్ధిమాన్ ॥** (సి.శి. 17-41)

అహంకారమనెడి మదము చేత నున్మత్తమైన యంతఃకరణమనడి మదగజమును శివుడనెడి స్తంభమునకు బలమైగొలుసులతో బంధించివేయునో అతడే సర్వసిద్ధులను ప్రాప్తించికొనిన ధీరుడనెడిది యుపదేశములోని సారాంశము.

బాహ్య కరణములకంటెను అంతఃకరణమే మిక్కిలి శక్తి గల్గియుండెడిదని చెప్పబడినది. మనోబుద్ధ్యహంకార చిత్తములే యంతః కరణములనబడుచున్నవి. బాహ్య కరణములను తమ యధీనములో నుంచికొని వాటి క్రియాశీలతకు నీ యంతఃకరణమేకారణభూతమగుచున్నది. అందుచేత విషయ సుఖములో పడి పతనము కాకుండా తన జీవనము సాగించి కొనదలచిన వాడు తన యంతఃకరణమీదపట్టును సాధించవలెను.

అది అంతసులభసాధ్యమై యంశము కాదని తెలిసికొనగలరు. ఈ కారణముననే శ్రీ భగవత్పాదులవారు నంతఃకరణమును గజముతో పోల్చిరి. సాధారణ గజమును స్థంభమునకు గట్టుట చాలా కష్టము. అట్టి మదమెక్కిన గజమును బంధించుటెంత కష్టతరమో మన మూహించజాలము. అహంకార మమకారముల వలన గల్గెడి మదము అంతఃకరణమును కలుషితము చేయును.

"అహం-మమేతి నైసరికోయం లోక వ్యవహారః" యని యద్వైతాచార్యుడు నుడివెను. ఈ రెంటిని విడిచి జీవించుట అంత సులభమైన కార్యము కాదని చెప్పబడినది. వీటిచేత పీడితుడైన వానిని మదగజము కాళ్ళక్రింత పడి నలిగిపోయిన వానితో పోల్చవచ్చును.

అహంకార-మమకారములలోన అహంకారముదే పైచేయిగా నుండును. అహంకారము మమకారానికి ఆధారభూతమైన యంశము. అహంకారమును నాశనము చేసికొనిన వానికి మమకారము వలన బాధ కలుగదు. అహంకారము బహిర్గతమై పోయిన యెడల, మమకారము తనకు తానే అదృశ్యమగునని గ్రహించగలరు. అయితే అహంకారము చేసెడి చేటును మానవుడు గుర్తించలేని స్థితిలోన నున్నాడు.

శివుడు జీవుడగుటకు గల కారణ మహంకారమే. జీవుడు లింగాంగ సామరస్యమును సాధించి, తద్వార శివుడగుటకు గల అడ్డుగోడయు నహంకారమే చెరుకుగడకు తేనె పూసిన యెడల చెరుకులోని తియ్యదనము తేనెలోని మాధుర్యము కలిసి పోగలవా? చెరుకుగడ మీది బెరదు రెంటిని విడదీసెడిదగును కదా!

భక్తి సంపన్నుడైయుండెడి వానిలోన నహంకార ముండదు. తాను సాధించిన భౌతిక లేదా ఆధ్యాత్మిక ప్రగతికి నతడు శివుడే కారణభూతుడని తలచుచుండును. మనదేశ సంస్కృతిలో నుద్బోదింపబడిన గురుభక్తి, పెద్దల యెడ గౌరవము, మాతాపితరుల భక్తి, దైవభక్తి మొదలగునవి అహంకారము యొక్క సాంద్రతను తగ్గించుటకే యుద్దేశింపబడినవని తెలిసికొనగలరు. తాను కట్టిన భవనమునకు తనపేరు నిడక గురుకృప, శివకృప, జంగమకృప, తల్లి కృప, తండ్రి కృప యనెడి పేర్లు పెట్టుటను మనము గమనించిన యెడల ఈ విషయము సుబోధకమగును. ఇట్టి భావము గలవారే యే రంగములో నైనను ప్రగతిని సాధించగలరు. భగవంతుని మీద భారమును వేసి చేసెడి పనులు సఫలమగునని తెలిపెడి వారెందరో గలరు. తమ సఫలతకుగాని లేదా విఫలతకు గాని భగవంతుడే కారణభూతుడనెడి భావన గలవాడు మనోదౌర్బల్యమునకు దూరమై మానసిక వత్తిడిలేనివాడగును. అర్చనాదులచేత శివకృపను సంపాదింతుననెడి నమ్మకమతనిని ఆశాజీవిగా చేయును. ఒకసారి విఫలమైనను మరు ప్రయత్నములో విజయుడు కావచ్చును. మనమేది చేసినను దానికి శివుని కృపయే కారణమనెడి మనోభావనను పెంపొందించికొనెడి నైపుణ్యమును సంపాదించికొని జీవితమును నిరహంకార భరితమగు నిర్మల జీవితముగా తీర్చిదిద్దికొనవలెను.

ఇట్టి సుసంపన్నమైన మరియు నాదర్శప్రాయమైన జీవితమును గడిపిన శ్రీ బసవన్నగారి యీ వచనము నెంతో జ్ఞానదాయకముగా నున్నది:

**మాడిదెనెంబుదు మనదల్లి హొళెదరె**
**ఏడిసి కాడిత్తు శివన డంగర!**
**మాడిదెనెన్నదిరా లింగక్కె**
**మాడిదెనెన్నదిరా జంగమక్కె**
**మాడిదెనెంబుదు మనదల్లిల్ల దిద్దరె**
**బేడిద్ద నీవ కూడల సంగమ దేవా!**

ఈ వచనపు తెలుగు రూపమును గనుడి :

**చేసితి ననెడిది మనమునందు పొడమినచో**
**కీడించి కాద్పరచె శివుని దండోర!**
**చేసితిననకురా లింగమునకు**
**చేసితిననకురా జంగమునికి**

**చేసితిననెడిది మనమునందు లేనిచో**
**వేడిన దిచ్చును, కూడల సంగమదేవా!**

భక్తిని చేసెడి భక్తునికి యహంకారాభిమానాదులుండవలదని యీ వచనము తెలుపుచున్నది.

అంతఃకరణములలో మనస్సు యెంతో శక్తివంతమైనదని తెలుపబడినది. మిగిలిన కరణములు మనస్సునకు వశమైయుండును. అందుచేత మనస్సును నియంత్రించినచో సంసార లంపటత్వము తొలగదని తెలిసికొనగలరు. ఈ విషయమును కేంద్రాంశముగా గైకొని చేయబడిన శ్రీరేణుక భగవత్పాదులవారి యీ క్రింది యుపదేశమును గనుడి :

**ఇంద్రియాణాం సమస్తానాం మనః ప్రథమముచ్యతే ।**
**వశీకృతే శివే తస్మిన్ కిమన్యైస్తద్వశానుగైః ॥** (సి.శి. 17-42)

సమస్తమైన యింద్రియములలో మనస్సు ప్రథమ స్థానమున నుండుననియును, మనస్సును శివుని వశము చేసినచో మనస్సుననుసరించెడి మిగిలిన యింద్రియములన్నియును శివుని యధీనమున నుండుననెడిదే దీని తాత్పర్యము.

మనస్సు చంచల ప్రవృత్తిని గల్గియుండును. అటు ఇటు ఊగిసలాడెడి మనస్సును నిలిపి యొక లక్ష్యమువైపు మరల్చుట చాలకష్టము. నియంత్రించని మనస్సు నిశ్చయముగా చేటును గల్గచేయును. చేటును నివారించవలెననినచో భగవంతుని శరణుజొచ్చుట తక్షణ కర్తవ్యమగును. శివుని సన్నిధిన మనస్సును నిల్పిన యెడల నయ్యది బంధితమైన మదగజము వలె శాంతము నొందును. మనస్సును శాంతింపజేయుట కొరకు శివధ్యానమును మినహాయించిన యెడల వేరైన మార్గాంతరముండదు. ఈ విషయమును గ్రహించి వీరశైవులెల్లరు తమ తమ మనస్సులను శివధ్యానమున కంకితము చేయవలెను. కరణార్పణ స్థలము యొక్క కీలకాంశమిదియే యని గుర్తించగలరు.

ఇంద్రియములను వశీకరణ చేసికొనిన యెడల సంసార సాగరమున మునుగుట యనుడి దానిని శ్రీరేణుకాచార్యులవారు శ్రీ అగస్త్యుల వారి కుపదేశించిరి. ఈ వుపదేశమును గనుడి :

**ఇంద్రియాణాం వశీకారో నివృత్తిరితి గీయతే ।**
**లక్షీకృతే శివే తేషాం కుతః సంసారగాహనమ్ ॥** (సి.శి. 17-43)

సర్వేంద్రియములను వశీకరణ చేసికొనెడి దానిని నివృత్తియని యందురనియును, నివృత్తిని సాధించి యింద్రియములను శివుని కంకితము చేసినవానికి సంసార భయముండదనియును నీ యుపదేశము యొక్క తాత్పర్యమని గ్రహించగలరు.

ఈలోకము ప్రవృత్తి మరియు నివృత్తి యనెడి రెండు మార్గములు గలవు. సంసారములో పడిపోయి కర్మరత్వము నొంది కర్మములవలన సుఖ-దుఃఖముల ననుభవించెడి పథము ప్రవృత్తి పథమనిపించికొనును. దీనికి విరుద్ధమైనదే నివృత్తి మార్గము. ప్రవృత్తిలో జీవుడు తన యింద్రియములకు వశుడై విషయోపభోగాసక్తితో చరించుచు చివరకు విషయములచేత తినబడును. తత్ఫలితముగాసంసారములో మునిగిపోవును. అంతులేని మితిమీరిన దుఃఖము ననుభవించుచుండును. లోకుల నీ విధిన కష్టపెట్టుటకిచ్ఛలేనివాడై వారినుద్ధరించుటకై శ్రీరేణుకాచార్యులవారు నివృత్తి మార్గమునుపదేశించిరని గ్రహించగలరు.

నివృత్తి మార్గమువలన ముక్తి లభించునని తెలుపబడినది. పునర్జన్మ వుండదని గ్రహించగలరు. సంసారములో పునః జన్మించుటలోన విరక్తిని పెంపొందికొనినవారు నివృత్తి మార్గమును నెంపిక చేసికొందురు.

శ్రీరేణుక భగవత్పాదులవారు నుద్బోధించిన యటుల నంతఃకరణమును శివాధీనము చేసి నివృత్తి మార్గమున పయనించుచు మీ ఆధ్యాత్మిక సాధనను కొనసాగింతురు గావుత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యులవారు కరణముల యొక్కయు, వాటివలన గల్గెడి విషయానుభవము యొక్కయు, అంతఃకరణ చతుష్టయము యొక్కయు శివార్పణ ప్రక్రియ గురించి తెలియజేసిరి. జ్ఞాన పీఠాధీశ్వరుని జ్ఞానప్రదమైనట్టి యీ ఆశీర్వచనము వలన సాధకుల కుపశాంతి లభించగలదని చెప్పవచ్చును.

షట్త్రింశత్ తత్త్వములలోని ప్రకృతి నుండి మహత్తు పుట్టెను. ఆ పిదప మనస్సు, తదనంతరము బుద్ధి చిత్తములు పుట్టెను. వీటి జననమైన పిదప పంచభూతములేర్పడి, తద్వార పంచభూతాత్మకమైన దేహము, దేహములో దశేంద్రియములు గల్గెను. అంతరంగ చతుష్టయముతో నిచ్ఛాశక్తికిని, కర్మేంద్రియములకు క్రియాశక్తితోను సంబంధముండును. జ్ఞానేంద్రియములు జ్ఞానశక్తికి సంబంధించినవని చెప్పవచ్చును. ఇచ్ఛాదిశక్తిత్రయమునకు ననుబంధముగా నుండెడి కార్యముల నాచరించెడి వైనందున వీటిని కరణములనవచ్చును. వీటి కారణముననే జీవుడు ప్రవృత్తి మార్గమున పయనించుచు కాయ వికార, యింద్రియ వికార, మనో వికారాదులకు లోనై బాధలకు గురియగుచున్నాడు.

ముముక్షువులు ప్రవృత్తి మార్గము నుండి నిర్గమించి నివృత్తి మార్గమున పయనింపనెంతురు. వీరి మార్గగమనము నిరోధించెడి అడ్డంకులే పంచతన్మాత్రల ప్రభవించెడి విషయోపభోగములు భోగాసక్తిని పెంపొందించుటలో నంతరంగ చతుష్టయము కీలకమైన పాత్రను పోషించును. చతురంగములలో మనస్సే ప్రధానమైనదని తెలియుచున్నది. "ఇంద్రియాణాం మనోనాథః" అనెడిది శ్రుతి వాక్యమని తెలిసికొనుడి. అది నిర్వహించెడి కరణమెట్టిదో యనెడి దానిని కారణ పురుషుడైన శ్రీ బసవేశ్వరులవారి క్రింది వచనము వలన గ్రహించవచ్చును.

**అందణవ నేరిద సొణగ నంతె**
**కండడె బిడదు తన్నమున్నిని స్వభావవను**
**సుడు! సుడు! మనవిదు విషయక్కె హరివుదు**
**మృడ! నిమ్మననుదిన నెనెయ లీయదు**
**ఎన్నొడయ కూడల సంగమదేవా!**
**నిమ్మ చరణవ నెనెవంతె కరుణిసు**
**సెరగొడ్డి బేడువె నిమ్మ ధర్మ** (వచనము సం.34)

దీని తెలుగు రూపమిది :

**అందలము నెక్కిన శునకము వలె**
**కనినచో వీడదు తన ముందటి**
**స్వభావమును**
**కాల్చు! కాల్చు! మనమిది విషయమునకై**
**పరువులిడు**
**మృడ! మిమ్ములనుదినము దలపనివ్వదు**
**నా ఒడయుడ! కూడల సంగమదేవా!**
**మీ చరణము దలచునటుల కరణించు**
**చెరగు నొడ్డివేడుదు మీదు ధర్మము**

కఠోపనిషత్తులోన నింద్రియములనెడి గుర్రము మనస్సనెడి కళ్ళెములచేత నియంత్రింపబడుచు విషయములనెడి బాటలోన కాయమనెడి రథమును లాగుచున్నవని తెలుపబడినది. మనస్సనెడి కళ్ళెములను శివుని స్వీయరూపమైన జంగముని వశము చేసిన యెడల జీవుడనెడి ప్రయాణికుడు నివృత్తిపథమున పయనించి లింగాంగ సామరస్యమును సాధించగలడు.

అయితే యీ సందర్భమున జీవుడొక ప్రబలమైన యవరోధము చేత నిరోధింపబడెడి యవకాశము కలదు. అదియే అహంకారము. అహంకారము యొక్క విశేషశక్తిని నిరూపించుటకే శ్రీభగవత్పాదులవారద్దానిని గజముతో పోల్చిరి. సాధారణమైన యేనుగును నియంత్రించుటెంత కష్టమో తెలియనిదెవ్వరికి? మదమెక్కిన యేనుగును నియంత్రించుట దుస్సాధ్యమైన విషయమైనటులే, అహంకారమును నదుపులో పెట్టుటయూ దుస్సాధ్యమే.

అహంకారము వలన ననేక జన్మలు లభించుననెడిది మరువరాని విషయము. శివాగమములలో ప్రతిపాదింపబడినట్టిదియునూ, బసవేశ్వరాదులచేత నాచరింపబడినట్టిదియును నయిన భృత్యాచారమొక్కటే అహంకారమును నియంత్రించెడి సాధనమని గ్రహించవలెను. "సోహంఎందెనిసయ్య "దాసోహం" ఎందెనియ్యా" అనెడి బసవోక్తులు (వ.సం.473) సదాస్మరణీయములు.

శివహితమనెడి భావన గురించి యింతకంటెను ముందుననే తెలిసికొని యుంటిమి. "శివాహిత మనస్సు" అనెడిదే మనస్సు అనెడి యేనుగును బంధించెడి మార్గము. "తలపులను జేష్టలను నర్పితంబు జేసి సంచరించెడి వ్యాపార ప్రసాదిగా మారగల్గినయెడల కరణార్పిత మనెడి సుసాధ్యమగునని చెన్నమల్లు సీసములు తెలుపుచున్నవి. (ప.సం.19) "తలపించు మనస్సును తలచుటయు దలంచు తలపులు మరి సముద్గత సుఖము"ను నర్పితము చేయుటయే ప్రసాదిస్థలి కర్తవ్యమని చతుర్వేదసారము తెలుపుచున్నది. (ప.సం. 263).

కరణార్పణ విధిని వివరముగా తెలియజెప్పిన క్రింది పద్యము హృద్యముగా నున్నది. గమనించుడి :

**అజిన శిరోజ శల్యస్నాయు ముఖకర**
**ణార్పణ బుద్ధి సమర్పణమున**
**లాలస్రమూత్రశుక్ల స్వేదమజ్జాము**
**ఖార్పణము మనస్సమర్పణమున**
**క్షుత్పిపాసాఖ్యసుషుప్తి సంయోగము**
**ఖార్పణ తేజస్సమర్పణమున**
**గలితనాసాశ్వాసగమనాగమననిరో**
**ధార్పణ వాయు సమర్పణమున**

**గామముఖ్యమోహాది సంకలిత భయస**
**మర్పణమ్ము నాకాశసమర్పణమున**
**నట్టి భూతానార్పణంబు నాత్మార్పణమున**
**నెసగు మీ ప్రసాదంబులు బసవలింగ** (చతుర్వేదసారము, ప.261)

– *శివం భూయాత్* –

## ఆశీర్వచనము - 2 :

## కరణార్పిత స్థలము :

ధర్మమునభిమానించెడి మీరింతమేరకు లింగస్థలమైన ప్రసాదములోని కాయార్పిత స్థలమునకు చెందిన పలు విషయములను క్రిందటి ఆశీర్వచనము నందున తెలిసికొంటిరి. తత్సంబంధమైన మరికొన్ని యంశముల నీ స్థలమున తెలిసికొందురు. శ్రీ రేణుక భగవత్పాదులవారి యీ యుపదేశమును గనుడి :

**సంసార విషకాంతారసముచ్ఛేదకుఠారికా ।**
**ఉపశాంతిర్భవేత్ పుంసామింద్రియాణాం వశీకృతౌ ॥** (సి.శి. 17-44)

సంసారమనెడి విష వృక్షములతో కూడిన యడవిని నరకుటకుపయుక్తమగు కొడవలి వంటి యింద్రియముల వశీకృతి వలన మనిషిలో నిరపేక్ష భావన గల్గుననెడిదే యుపదేశము యొక్క సారాంశము.

సంసార మనెడిది కారడవి వంటిది ఇందులోని చెట్లు విషభరితములై యుండును. ఈ చెట్ల పండ్లను తినిన వారికి మరణము తథ్యము. ఇచ్చట ఫలములనగా విషయ సుఖములు మరణమనగా మరుజన్మ.ఒక వ్యక్తికి జనన మరణములెన్ని మార్ల సంభవించినవోయన మూహింపజాలము. ఈ అంశమును తెలుపుటకై శ్రీమన్నిజగుణ శివయోగువల వారు క్రింది విధిన నుడివిరి :

**ధరయనెల్లవనుసణ్ణిసి దూళిమాడ**
**లా పరమణుగళనితనితు**
**దేహవన్ను ధరిసుతొందొందు**
**జీవర బసురొళు బందు మరళి**
**నీ నత్త తిరుగదంతె రచిసిదె**

దీని తెలుగు రూపమును గనుడి :

ధరనంతయును సన్నగాచేసి ధూళిచూయి
నా పరమాణువులెన్నో అన్ని
దేహములను ధరించుచొక్కొక్క
జీవి కడుపులో వచ్చి మరల
నీవటటు తిరుగునటుల రచించె

భూమిని పగలగొట్టి ముక్కలు ముక్కలుగా చేసి, ఆ పిదప ముక్కలను ధూళిగా నలగగొట్టినచో యెన్ని పరమాణువు గల్గునో అన్నిమార్లు జీవుడు జన్మించి-మరణించుచున్నాడు. ఎన్నియో జీవుల గర్భములలో జన్మించుచున్నాడు. ఇదియే శివయోగులవారు వివరించిన సత్యము. ఇట్టి జనన మరణములనుండి విముక్తిని పొందవలెననినచో విషయసుఖము వేటివలన లభించునో వాటిని నాశనము చేయవలెను. ప్రకృతిలో చరాచరాదులను ధ్వంసము చేయుట సుసాధ్యమగు విషయము కాదు. నైతికముగా గమనించిన యెడల ప్రకృతిని నష్టమునకు గురి చేసెడి అధికారము మానవునికి లేదు. ప్రకృతిని సృష్టించినవానికే దానిని ధ్వంసము చేసెడి అధికారముండునని విజ్ఞులు తెలుపుచున్నారు. జీవుడు కర్తృవుకాదు. ఇతడు భోక్తృవు మాత్రమే. కర్తయైన పరమేశ్వరునికే ప్రకృతిని నాశనము చేసెడి అధికారము కలదు. భోక్తృవైన జీవుని తాననుభవించిని వాటిని తన వెంట తీసికొని పరలోకమునకు వెళ్ళెడి అధికారము కూడాలేదు. ఇల్లు-ముంగిలి, పొలము-పుత్ర, ధనము-ధాన్యము, బంధువు-బళగము మొదలగు వాటిని వీడి మరణించక తప్పదు. ఈ విషయము వివరించెడి కథ యొకటి గలదు.

ఒక ఊరిలోనొక లొకం పోకడ తెలియని వ్యక్తి జీవనమును కొనసాగించుచుండెను. అతనికి నగరమును వీక్షించవలెననెడి కోరిక గల్గెను. కొంత ధనము చేకూర్చికొని నగరానికై ప్రయాణమయ్యెను. నగరమును చేరి నయనానందకరములై దృశ్యములనెంతో కుతూహలములో గాంచెను. తిరిగి తిరిగి అలసిపోయెను. ఆకొని యలమటించెను. వెంటనే అతనికొక ఆలోచన తట్టెను. హోటల్‌కు వెడలి, యేదైనను తిని, కొంతసేపు విశ్రమించవలెనని నిశ్చయించికొనెను. చేరువననే యున్నట్టి యొక హోటలులోనికి ప్రవేశించెను. హోటలులోనికి వెడలుట, యతనికి పరిచయములోలేని విషయమై యుండుటచేత నంతయు వింతగా దోచుచుండెను. ఒక టేబుల్‌వద్ద కూర్చొనెను. వడ్డించెడి వాడు వచ్చి యేమి కావలెనని యడిగెను. ఇతడు నేమేమి గలవో తెలిపి వాటి వెలను తెలియజేయుమనెను. పనివాడు తిండి పదార్థముకు ప్లేటుకింత ధరయనియును, కాఫీ ధరను కప్పుకింతయని చెప్పెను. ఊరివాడు "మరి నీళ్ళ గ్లాసుకెంత వెల"యని యనెను. పనివాడు నవ్వుతూ, "ఉచిత"మనెను. ఊరివాడు ఉప్పిడిపిండి, ఊతప్ప, ఇడ్లీ-కారప్పొడి మొదలగునవి తెప్పించికొనెను. టేబిలంతయు ప్లేట్లతోనే నిండిపోయి యుండెను తెప్పించికొనిన పదార్థములను తృప్తితో తిని కాఫీని తెప్పించికొని త్రాగినట్టి ఆ గ్రాహకుడు సంతుష్టిని పొందెను. వెనువెంటనే చేతిసంచిని తెరచి ఖాళీప్లేట్లని, గ్లాసులను, కప్పు-సాసర్‌ను వేసికొని కౌంటర్ వద్దకు వచ్చెను. డబ్బును చెల్లించి నిలుచుండెను. ఇంతలోనే హోటల్ పనివారు గ్రాహకుడు ప్లేట్లు యిత్యాదులను దొంగిలించికొనిపోవుచున్నాడని గోలను చేసిరి. హోటల్ యజమాని గ్రాహకుని నిలదీసి యడిగెను. అప్పుడతడు, "వీటన్నింటికి వెల చెల్లించితిన కదా! దొంగతనమెట్టులగునని గద్దించి పలికెను". గ్రాహకుడమాయకుడని గ్రహించినవారై హోటల్ వాడిట్టులనెను. "ఇవి గ్రాహకుల సౌకర్యార్థమై యున్నవి. నీవలె ఎంతో మంది వచ్చి పోవుచుందురు. వారందరికీ వీటి యవసరమున్నది. నీవు చెల్లించిన మూల్యము తిండి పదార్థములకూ సుమా" అని నచ్చచెప్పిరి. గ్రాహకుడు నిజము నెరిగినవాడై ప్లేట్లు ఇత్యాదుల నిచ్చివేసి తన దారిన తాను వెడలెను. ఈ లోకమున పుట్టెడి వాడు గ్రాహకుని వంటివాడే. హోటలు మరియు దాని సామాగ్రి ప్రకృతివంటివని గ్రహించగలరు.

విషయములింత ప్రమాదభరితమైన వనెడిది మనిషి తెలిసికొనలేకపోవుచున్నాడు. మొదటగా లభ్యమయ్యెడి క్షణికమైన ఆనందము యొక్క నేపథ్యమున ననంతమైన జన్మజ దుఃఖము గలదనెడిది లోకమునగల లౌకికులకు తెలియుటలేదు. సంసారమున విసిగి వేసరియైనవారు తాత్కాలిక శాంతికై నదీ తీరమునకో, అడవిలోనికో వెడలుటను చూడగలము. అది శాశ్వతమైన శాంతికి మార్గము కాజాలదు. ఇంద్రియములను నిగ్రహించి శివోన్ముఖము చేసికొనినవానికే నిజమైన శాశ్వతమైన శాంతి లభించునని శ్రీరేణుక భగవత్పాదులవారి యుద్బోధ.

భ్రమర, మీను, గజ, పతంగ మృగాదులు నొక్కక్క విషయసుఖమును కోరి, దాని ననుభవించుటకై ప్రాణత్యాగమును చేయుచున్నవి. మరి విషయములన్నిటిచేత పీడింపబడెడి వాని గురించి యేమి చెప్పగలము.

విషయ సుఖమువలన గలుగబోవు దుఃఖమును గుర్తించలేమని గ్రహించగలరు. శ్రీమన్నిజగుణ శివయోగి ప్రకారము విషయ సుఖము రుచికరమైయుండెడి విషభరిత భోజనము వంటిది. అనుభోగము చేసినవానికి ఆపద తప్పదు.

ఈ వాస్తవముల దృష్ట్యా శ్రీభగవత్పాదులవారు చెప్పినయటుల యింద్రియములను నిగ్రహించుటే సరియైన మార్గమని దోచుచున్నది.

శాస్త్రములయందున నింద్రియ నిగ్రహమునకై శమ-దమములు ప్రబోధింపబడినవి. దమము చేత బహిరింద్రియములను, శమముచేత అంతరింద్రియములను, శమముచేత అంతఃకరణమును నిగ్రహించికొనవలెనని తెలుపబడినది. ఈ రెంటిని సాధించెడి వారివలెనే శివయోగి యింద్రియములను నిగ్రహించి యలౌకికమైన ఆనందము ననుభవించును.

నిరపేక్షతవలన కర్మబంధము లెట్టుల వీగిపోవుననెడి సందేహము గలుగవచ్చును. ఈ విషయమున శ్రీరేణుక భగవత్పాదులవారీ క్రింది విధిన తమ యుపదేశమునిచ్చిరి :

**ఇంద్రియైరేవ జాయంతే పాపాని సుకృతాని చ ।**
**తేషాం సమర్పణాదీశే కుతః కర్మనిబంధనమ్ ॥** (సి.శి. 17-45)

ఉపదేశాన్తర్గతమగు భావన యేమనగా యింద్రియములవలననే పాప-పుణ్యములుద్భవించును. ఇంద్రియ-కరణార్పణ వలన కర్మబంధములు తెగిపోవును. పుట్టిన ప్రతివ్యక్తి కర్మలను తప్పనిసరిగా చేయవలెను. దేహధర్మము నిమిత్తమో లేదా మరే విధమైన యితర కారణములను మానవుడు చేయుచున్నాడు. కర్మలను చేయునని మరికొందరి యభిమతము. శాస్త్రము విహితా విహిత కర్మలను తెలియజేయుచున్నది. శాస్త్రమనగా శివుని నుండి వెలువడిన వేదాగమములని గ్రహించగలరు. విహిత కర్మలనగా నిత్యనైమిత్తికములు. నిషేధితము లవిహితములు. విహితమును చేయకుండినను అవిహితమును చేసినను దోషము సంప్రాప్తమగునని శాస్త్రము చెప్పుచున్నది. దోషమే పాపమనబడును. దైవ ప్రీతికరములగు క్రియలు పుణ్యములగుచున్నవి. ఇవన్నియూ యింద్రియముల మూలమున చేయబడుచున్నవి. "కర్మానుగోగచ్ఛతి జీవ ఏకః" అనెడి పండితోక్తి ప్రకారము వ్యక్తి చేసెడి పుణ్యపాపములే జనన-మరణములకు కారణమగును. వీటినుండి తమను తాము రక్షించుకొనుటకెవ్వరికినీ సాధ్యము కాదు. కాని శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారు చూపిన మార్గమున పయనించెడి వారికి యిది సుసాధ్యమే. కరణార్పణము జేయుట వలన జీవుడు నలిపుడగుచున్నాడు. ఇంద్రియములను, అంతఃకరణమును శివునికి సమర్పించిన పిదప దేహికి కర్మలంపటత్వముండదని తెలిసికొనగలరు.

శివునికి అర్పించిన విషయ సుఖము పెరిగి పెద్దదై ప్రవృత్తికి కారణమగునేమో యనెడి సందేహము కలుగకుండుటకై శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారీ క్రింది యుపదేశమునిచ్చిరి :

**ప్రకాశమానే చిద్వహ్నౌ బహిరంతర్జగన్మయే ।**
**సమర్ప్య విషయాన్ సర్వాన్ ముక్తవజ్జాయతే జనః ॥** (సి.శి. 17-46)

బహిరంతరములయందున జగత్తు గలవాడు, ప్రకాశమానుడు చిదగ్నివంటి వాడునైన శివునియందున విషయములు సమర్పించుటచేనవి భస్మీపటలమగుననియును, జీవునికి నట్టి సమర్పణవలన కర్మ విశేషమై జీవన్ముక్తి లభించుచున్నదనెడిది యుపదేశములోని సారాంశము.

అగ్నికి దహన గుణముండును. అగ్నిలో వేయబడిన వేవియును నష్టము కాకుండ నుండవు. చిదగ్నియు నిట్టిదే. విశ్వమున యెల్లెడల నిండియున్న శివుడు చిదగ్నిగా భక్తులను రక్షించుటకై వారి పుణ్య-పాపములను భస్మము చేయును. తన యింద్రియములను శివునికి సమర్పించుటతో శివయోగి కార్యము ముగిసిపోవును. భస్మముగా చేసెడి క్రియ శివుడు చేపట్టును. అయితే చేసెడి సమర్పణను మమత్వ భావమును వీడి చేయవలెను. యజమానుడు యజ్ఞములో నజ్యమును పోయుచు మమత్వమును వీడి స్వాహా కారములను చేయును. శివయోగియు నా విధిననే తన కరణములను శివునికి సమర్పించును. జీవన్ముక్తిని పొందుచున్నాడు.

మమత్వము వీడకుండ చేసెడి సమర్పణల వలన ఫలితములుండజాలవు. నాది యనెడి యభిమానమే మానవుని యాధ్యాత్మిక ప్రగతికి నవరోధమై నిలుచుచున్నవి.

ఇంటిని వీడి మఠమునకు వెడలి మఠమయ్య లేదా శివాచార్యుడు చేసెడి యుపదేశమును వినెడి వారు తమ యిళ్ళకు చెందిన తలపులను వీడకుండిన యెడల వారు వారి వారి యిళ్ళలోనే యుండినట్లగును. ధర్మోపదేశము వినుట వలన గల్గెడి ఫలము లభించదు. కొందరు ఇంటిలో నుండియును, మమత్వమును వీడి పురోగమనమును సాధించగలరు. ఆధ్యాత్మికముగా వారు సుసంపన్నులగుదురు.

కరణార్పణము చేసెడి శివయోగి సంసారము యొక్క చేటు కలుగదని తెలిపెడి శ్రీ భగవత్పాదులవారి యీ యుపదేశమును గనుడి :

**చిత్తద్రవ్యం సమాదాయ జగజ్జాతం మహాహవిః ।**
**చిద్వహ్నౌ జుహ్వతామన్తః కుతః సంసారవిప్లవః ॥** (సి.శి. 17-47)

జగత్తులోని చరా-చరములనెడి హవిస్సును, చిత్తమనెడి హోమద్రవ్యమును చిదగ్ని యనెడి హోమకుండమున వ్రేల్చిన వానికి సంసారోపద్రముండనెడిదే యుపదేశము యొక్క తాత్పర్యము.

ఈ విధిన యజనమును చేయువాడు తన్మయుడగునని తెలిపెడి యుపదేశమును గనుడి :

**ఆత్మజ్యోతిషి చిద్రూపే ప్రాణవాయుర్నిబోధితే ।**
**జుహ్వాన్ సమస్త విషయాన్ తన్మయో భవతి ధృవమ్ ॥** (సి.శి. 17-48)

ప్రాణవాయువు చేత ప్రకాశింపబడెడిదియును చిద్రూపమై యుండెడిదియును అగు ఆత్మజ్యోతిలో సమస్త విషయములను నర్పణచేసి శివయోగి తన్మయుడగును అనెడిది యీ శ్లోకములోని భావము.

కరణార్పణను శివపూజాంగముగా భావించెడి శివయోగికి ముక్తి లభించునని తెలిపెడి యీ యుపదేశమును గనుడి :

**ఇంద్రియాణి సమస్తాని శరీరం భోగసాధనమ్ ।**
**శివపూజాఙ్గభావేన భావయన్ ముక్తిమాప్నుయాత్ ॥** (సి.శి. 17-49)

భోగ సాధనమైన శరీరము మరియు దాని యింద్రియములను శివపూజాంగములుగా భావించికొని వాటినుండి పుట్టెడి విషయ సుఖమును శివుని కర్పించుటచేత ముక్తి ప్రాప్తించుననెడిదే శ్రీరేణుక భగవత్పాదులవారి యుద్బోధలోని సారాంశము.

ఈ జగత్తు శబ్ద-స్పర్శాది పంచతన్మాత్రుల రూపములో నుండును. ప్రతి జీవి వీటిని యనుభవించాలనెడి యభిలాషకు లోనై దుర్భరమైన దుఃఖముననుభవించుచున్నాడు. ఈ దుఃఖమున కంతు అనెడిది లేదని గ్రహించగలరు. ఎంతమేరకు విషయానుభవాభిలాష మనస్సున యుండునో అంతమేరకు దుఃఖానుభవము గల్గును. ఈ యభిలాష తొలగిపోవునంత వరకు శాంతి యనెడిది దుర్లభమగును. ఈ కారణముననే శ్రీ భగవత్పాదులవారు కరణార్పణము గురించి యుద్బోధించిరి. కరణార్పణము చేసెడి శివయోగి యనంతమైన శాంతి ననుభవించుచున్నాడు.

ఇంద్రియ విషయ లాలసత్వమున కొక బలమైన కారణము గలదు. లౌకికుల దృక్పథములోన యింద్రియములు విషయ సుఖమును పొందుట కొరకు కల్పింపబడిన కరణములు. ఈ వైఖరిలో మార్పు రానంతవరకు వ్యక్తి విషయ సుఖమునకు దూరముగా వెడలజాలడు. మానవుని

వైఖరిలో మార్పును తెచ్చుటకే శ్రీభగవత్పాదులవారు కరణములను శివపూజలోని యంతర్భాగములుగా భావించవలెననిరి. అట్టి స్థితిలో విషయ సుఖము నివేదనీయమైన యంశమగును. అప్పుడు జీవి నిస్సంగియై ప్రసన్నతను సాధించుచున్నాడు. ప్రసన్నత గల శివయోగి జీవన్ముక్తిని పొందిన వాని వంటి వాడని గ్రహించగలరు.

జీవనమును గడుపుటలో లౌకిక మరియు పారమార్థిక విషయములను సమపాళ్ళలో మేళన చేసినవాడే చతురుడనిపించికొనును. ఇట్టివాడే నిజమైన జాణయని శ్రీమన్నిరంజన శివయోగులవారు ప్రకటించిరి. ఈ లోకమున సంసారిగా జీవనమును గడుపుచు సంసారమును జయించి సదాశివుని కటాక్షమును పొందిన వారెందరో గలరు. వీరిలోన కొందరు ఋషులు కాగా మరికొందరు సామాన్యులు. శివశరణుల చరిత్రలను గమనించిన యెడల యీ విషయము విదితమగును. వీరు ధన్యజీవులనబడుచున్నారు. ఇట్టి భక్తుల చరితల నేపథ్యములో "మద్భక్తాః మమాధికాః" యనెడి ఆగమోక్తులను నవగతము చేసికొనవలెను. శివుని మెప్పును పొందిన శివభక్తులకంటె నధికులెవ్వరు? ఈ ప్రశ్న యొక్క నేపథ్యములోన యీ క్రింది కథనమును గమనించవలెను.

భోగభాగ్యములకెల్ల భూమాతయే కారణభూతమైనదనెడి భావన గల్గిన జనులెల్లరు భూమాతను స్తుతింపజొచ్చిరి. అన్నాదులనిచ్చి పోషిస్తూ సంపదల నొసంగుచు లోకములను కాపాడెడి భూదేవి వరత్వమును పలు విధములుగా కొనియాడిరి. భక్తుల పొగడ్తలను గమనించిన యామె నిగర్వియై "ఓ జనులారా! నాకంటెను నా భారమును మోసెడి ఆదిశేషుడే గొప్పవాడు. ఇది తెలిసికొనదగిన యంశ"మని యుద్బోధించెను. మరుక్షణము నుండి వీరు ఆదిశేషుని కీర్తింపజొచ్చిరి. కీర్తన ప్రియత్వమునకు తిలోదకముల నిచ్చినట్టి యాదిశేషుడు భక్తుల కిట్లులనెను. "ఓ సద్భక్తులారా! మీ స్తుతివలన సంప్రీతుడనైతిని. కాని, యదార్థమేమనగా నన్ను తన చిటికెనవేలుకు నుంగరముగా తొడిగికొనిన పార్వతీమాతయే మహామాన్వితురాలు. ఇదినిజము. తెలిసికొనుడి".

శేషుని హితబోధ వలన విజ్ఞతను పెంచికొనిన భక్తజనులు భవానిని భజింపజొచ్చిరి. శాక్తేయులై శక్తివంచన లేకడగ శక్త్యుపాసన చేయదొడంగిరి. శక్తి విశిష్టుడైన శివుడే గొప్పవాడని యెరుగలేని వెర్రిజనులను గాంచిన వేల్పులకు వేల్పగు దేవదేవుని పట్టపురాణి తన భక్తుల నుద్దేశించి "ఓ భక్తులారా! నేను శివుని యర్ధాంగిని. నన్ను తన మేనున ధరించి శివుడే నాకంటెను గొప్పవాడు. సత్యమిట్టులుండగా, మీరతనిని మరచిపోవుట భావ్యము కా"దనెను.

మహాదేవి యొసంగిన మహోపదేశమును విని ధన్యులైన దేవీభక్తులు దేవదేవుని నుతింపజొచ్చిరి. భక్త సులభుడగు భవుడు వారి సంస్తుతి వలన ప్రసన్నుడై వారి యెదుట ప్రత్యక్షమయ్యెను. వారితో నిట్టులనెను.

"ఓ శివభక్తులారా! మీ శివస్తుతి వలన సంతుష్టిని పొందితిని. మీ ప్రేమకు పాత్రుడనైనందుకెంతో సంతసించితిని. కాని నేను మీరు భావించిన యటుల గొప్పవానిని కాను. మీరు ప్రేమించెడి వస్తువు లెన్నో గలవు. ఇల్లు, పొలము, ధనము, కీర్తి మొదలగునవెన్నియో మీచేత ప్రేమింపబడుచున్నవి. వీటన్నింటికినీ మీ మనస్సులోనే స్థానము గలదు. వీటితోపాటుగా నాకును నొక మూలలో స్థానము లభించినది. ఈ కారణమున నాకంటెను మీరే యధికులు".

భగవంతుని కంటెను భక్తుడే గొప్పవాడనే అభిప్రాయమును పెద్దలు వెలిబుచ్చిరి. ప్రేమించబడెడి వానికంటెను ప్రేమించెడి వాడే గొప్పవాడనెడి భావన వలననే భక్తుని యాధిక్యత వ్యక్తమగుచున్నది. భక్తుడే గొప్పవాడని తెలిపెడి శ్రీ బసవేశ్వరులవారి యీ క్రింది వచనమును గనుడి :

**సముద్ర ఘనవెంబెనె?ధరెయమేలడగిత్తు**
**ధరెయ ఘనవెంబెనె?**
**నాగేంద్రన ఫణామణియ మేలడగిత్తు**
**నాగేంద్ర ఘనవెంబెనె?**
**పార్వతియ కిరుకుణికెయముద్రికెయాయిత్తు**
**అంతహ పార్వతి ఘనవెంబెనె?**
**పరమేశ్వరన అర్ధాంగియాదళు**

**అంతహ పరమేశ్వరన ఘనవెంబెనె?**
**నమ్మకూడల సంగన శరణరమనద కొనెయ**
**మొనెయ మేలడగిదను!**

ఈ వచనపు తెలుగు రూపమును గనుడి :

*సముద్రమును ఘనమందునా?*
*ధర మీదడగినది*
*ధరను ఘనమందునా?*
*నాగేంద్రుని ఫణామణి మీదడగినది*
*నాగేంద్రుని ఘనమందునా?*
*పార్వతి చిన్నవ్రేలుకు ముద్రికయైనది*
*అంతటి పార్వతి ఘనమందునా?*
*పరమేశ్వరుని కర్ధాంగి యైనది*
*అంతటి పరమేశ్వరుని ఘనమందునా?*
*మన కూడల సంగని శరణుల*
*మనములోని కొసమొన మీదడినాడు*

ఎవ్వరైతే తమ మదియందున శివుని ప్రతిష్ఠించికొనునో అతని సర్వ వ్యవహారములు శివార్పితములగుచున్నవి. అభిమానాదులు శివార్పితము చేయకుండిన యెడల నష్టమైపోవు. శ్రీ రేణుకాచార్య భగవత్పాదులవారు బోధించిన యటుల కరణాదులను శివునికర్పించి ముక్తి కాముకులగుటకై మీరు ప్రయత్నించెదరు గాక!

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యులవారు శివవశీకృతేంద్రియములు గలవానికి గల్గెడి సత్ఫలితముల గురించి వివరించిరి. విషయములకు మూలకారణమైన పంచతన్మాత్రులను, వాటివలన వచ్చెడి సుఖమును చిదగ్నిలో కాల్చి బుగ్గి చేయవలెనని ప్రబోధించిరి.

"చిత్తద్రవ్యం సమాదాయ జగజ్జాతం చిద్వహ్నౌ జుహ్వతామ్" అనెడి ఆచార్యోక్తి (సి.శి. 17:47) చిత్తమును నిర్మలము చేసికొనవలసిన ఆవశ్యకత గురించి తెలియజెప్పిరి.

చిత్తమనెడిది అంతఃకరణములలో నొకటి. దానిని శుద్ధి చేయవలసిన అవశ్యకత గలదని పెద్దలనుచున్నారు. "చిత్తశుద్ధిలేని శివపూజలవి యేల, భాండశుద్ధిలేని పాకమేల" అనెడి యోగి వేమన వేసిన ప్రశ్న చిత్తమును నిరోధించవలెననియును, చిత్తవృత్తి వలననే సకలారిష్టములు సంప్రాప్తించుననని తెలియుచున్నది. పతంజలి "చిత్తవృత్తిని నిరోధించమని యుద్బోధించిరి. ఆగమములు చిత్తమును శివార్పితమైన దానిగా చేసికొనవలెనని తెలిపినవి. మనస్సులోని సంకల్ప వికల్పముల వలన చిత్తము కాలుష్యమునకు గురియగుచున్నది. విహితా విహితేచ్ఛలకు నిలయమగుచున్నది. భక్తులు విమలచిత్తులై యుండవలెననెడిది శివాచారము యొక్క నియమము. ఇట్టి ముఖ్యమైన నియమమును పాటించని జీవనగతి యెట్టులుండునో యనెడి దానిని తెలిపెడి యీ క్రింది పద్యము గమనార్హమైనది.

**చేయరు చేయనీయరిల చేసెడి వారినితూల నాడుచున్**
**చేయువిధంబుకున్ నుడికి చింతన రీతికి లేదుపొంతన;**

**స్వీయమనంబులోని తమ యిచ్ఛలె వీరికి ముఖ్యలక్ష్యముల్**
**చేయవె వీరలన్ విమల చిత్తులుగా శివ! మార్గదర్శకా!** (మార్గం పెద వీరప్పకవి అముద్రితము)

చిత్తములోని సునిశ్చితముగా నుండెడి యచల స్వభావముగల కోరికల నన్నింటిని బుద్ధిశక్తి చేత రగిల్చబడిన చిదగ్నిలో భస్మీపటలము చేసినవారే విమలచిత్తులు కాగలరనియును, అట్టివారే వశీకృత కరణేంద్రియములై తమచిత్తమును శివునికి నివేదించి సంసారమనెడి కాన్తారమునుండి నిర్గమించగలరనెడిది గ్రహించవలసిన విషయము.

సంసారమనెడిది యశుద్ధతత్త్వములకు సంబంధించినది. స్థూల శరీరియై విషయ భోగముల యెడ యనురక్తి గల వానికిది బాధాకరమైనదగును. భక్తాంగస్థలిగా దేహాభిమానమును పరిత్యజించి, అంగమాహేశ్వర స్థలము దశేంద్రియములను వశపరచుకొని, అంగ ప్రసాది స్థలమున ప్రసాదకాయుడై లింగేంద్రియ సంపన్నుడై విరాజిల్లెడి సాధకునిని సంసారమేమియును చేయజాలదు. అయితే, సాధానాను క్రమగతిని కొనసాగించి ముమ్ముందు లింగాంగ సామరస్యమును సాధించుటకు మాత్రమే కాయధారియై యుండెడి అంగప్రసాది స్థితిగతులు అనుకూలముగా లేని ప్రాపంచిక సందర్భము నేపథ్యములో శీలపాలన చేయలేని స్థితిలో నుండవచ్చును. ఇట్టి అసాధారణమైన స్థితిలోనతడు నిస్సహాయుడై యవిహిత కర్మలనాచరించవచ్చును. అట్టిస్థితిలో సంప్రాప్తమయ్యెడి సుఖ–దుఃఖముల వలన గల్గెడి పుణ్యపాపములు కర్మబంధములై ప్రసాదిని పతనము దిశమలో గమనింపజేయవచ్చును. ఆ స్థితిని నివారించి సాధకునికి నుత్తమస్థితిని సమకూర్చుటే పరస్థల జంగముని ప్రాథమిక కర్తవ్యమగును.

"శివ వశీకృత కరణములనెడి" భావన పరస్థల జంగముని కర్తవ్య నిర్వహణ దోహదము చేసెడిదిగా భావింపబడినది. ఇద్దానిని సాధించుటకై వశీకృతేంద్రియలను సాధనముగా తీసికొనవలెనని గ్రహించగలరు. వశీకృతేంద్రియములనెడి భావన బోధించుటతో బాటుగా పరజంగముడద్దానిని ఆచరించి చూపి ఆదర్శప్రాయుడగునని గ్రహించగలరు.

వశీకృతేంద్రియ ప్రక్రియ వలన బహుముఖమైన ప్రయోజనములను సాధించవచ్చునని తెలుపబడినది. ప్రసాది వాంఛించునదేమనగా అవధాని భక్తి ద్వారా ప్రసాది స్థలమున సాధనను ఫలప్రదముగా జేసికొనుటే. అంగ ప్రసాదాంగి కారాధ్యమూర్తియును, మణిపూరక చక్రమున నుండెడి శివలింగము నర్చించి యద్దాని ప్రసన్నతను బడయుటయే ప్రధానమైన లక్ష్యమని గ్రహించగలరు. శివలింగ ప్రసాదము వలన హృదయ ప్రసన్నత బొందగోరెడి ప్రసాది యింద్రియముల యెడ నకారాత్మకమైన మనోవృత్తిని చేపట్టవలదనియును, అయ్యవి సాధనను పరిపూర్ణముగా సుసంపన్నము చేయుటకు సాధనములుగా స్వీకరించవలెనని గ్రహించగలరు.

సకారాత్మకమైన ధోరణిని సాధించుటకొరకు శ్రీ భగవత్పాదులవారు నింద్రియాదులను శివపూజాంగములుగా స్వీకరించవలెనని యుద్బోధించిరి. ఈ విధముగా భావించుటలో మరియొక్క ప్రయోజనమిమిడి యున్నది. అది యేమనగా ద్వేష భావ నిర్మూలన ఇంద్రియములను శత్రువులగా భావించెడి ధోరణిని విడనాడి యనురాగ బుద్ధినలవరచుట యనెడిది సుసాధ్యమగును. ఈ విధముగా కరణార్పిత స్థలమున చేయబడెడి సాధన యనేకానేకమైన వాంఛనీయమైన సత్పరిణామములకు దోహదము చేయుచున్నది.

*– శివం భూయాత్ –*

## ఆశీర్వచనము - 1 :
## భావార్పిత స్థలము :

జిజ్ఞాస గల్గిన భక్తులార! మీరింత మేరకు లింగషట్ స్థలములోని యవాంతర భేదమైన కరణార్పిత స్థలము గురించి తెలిసికొంటిరి. తదుపరి స్థలమైన భావార్పిత స్థలము గురించి యీ ఆశీర్వచనమున తెలిసికొందురుగాక!

ఆధ్యాత్మిక సాధనలో నర్పణకు నితోధికమైన ప్రాముఖ్యత గలదు. కాయకరణాదులను సమర్పించిన వాడు సుసంపన్నమైన యిహపర సౌఖ్యములని చవి చూడగలడని తెలుపబడినది. అయితే భావార్పిత మీరెంటికంటెను ముఖ్యమైనదని గ్రహించగలరు. ఇచ్చట భావమనగా

“తలపు” అని గుర్తించబడినది. తలచెడిది భౌతిక విషయమైతే వ్యక్తి విషయ మౌను. స్వార్థము గురించి తలచెడివాడు స్వార్థిగాను, లోభిగాను రూపొందును. పరోపకారభావన కలవాడు సర్వలోకహితకరుడగును. అందుచేత భావనమునకెంతో ప్రాధాన్యత గలదని గుర్తించవలెను. ఇట్టి మహత్వపూర్ణమైన భావమును శివార్పణము చేయుటలో నౌచిత్యము గలదు. ఈ విషయమును గురించి శ్రీ రేణుకాభగవత్పాదులవారీ క్రింది విధిన యుపదేశించిరి :

**శివే నిశ్చలభావేన భావానాం యత్సమర్పణమ్ ।**
**భావార్పితమిదం ప్రోక్తం శివసద్భావవేదిభిః ॥**(సి.శి. 17-50)

దీని తాత్పర్యమేమనగా శివునియందున సుస్థిరమైన భావముతో భావములను సమర్పించుటను యెద్దాని చేత చేయబడునో అద్దానిని శివసద్భావ విదులు భావార్పిత స్థలమని యందురు.

మనమేదైనను చేయునప్పుడేదో వొక భావమును మనము దాల్చుచుందుము. వినుట, చూచుట, చేయుట యనెడివి యెటులచేయుచున్నామనెడి దానికంటెను యే భావముతో చేయుచున్నామనెడిది ప్రాముఖ్యతను సంచరించుకొనునని తెలిసికొనగలరు. అంకిత భావము చేసెడి పనులు సత్ఫలితములనిచ్చును. భావమొక కడన, భౌతిక కాయమొక దిక్కున యుండిన యెడల దురితములు గల్గెడి యవకాశము గలదు. ఉపదేశాదులు వినెడి సందర్భమున నిశ్చలమైన భావముతో వినవలెనని గ్రహించగలరు.

మన భావమొక కోమలమైన తీగవంటిది. అది పైకి ప్రాకవలెననిన దానికొకటి యాధారముగా నుండవలెను. సామాన్యుడు తన భావమునకు విషయము నాధారముగా నిలుపును. తత్ఫలితముగా నతడు నెల్లప్పుడు విషయముల గురించి చింతించుచుండును. తన్నిమిత్తమై కార్యములు చేపట్టును. పలు విధములగు కర్మలను చేసి వాటిలో చిక్కికొనిపోవును. పతనమై బహుజన్మల నెత్తి బాధలకు గురియగుచున్నాడు. ఇట్టి బాధలకు లోను కాకుండ నుండవలెననిన భావమును సంసారమునకర్పితము చేయవలదు. శివుని కర్పణ చేయవలెననెడి ఆచార్యులవారి యుద్బోధను పాటించవలెను. ఈ విషయమును గురించి యోగజాగమము తెలిపిన విషయమీ క్రింది విధముగా నున్నది.

**తస్మాత్ ప్రపంచ సంబంధ భావం హిత్వా శివాత్మకమ్ ।**
**భావమాశ్రిత్య యత్నేన కుర్యాద్ వ్యాపృతిమీశ్వరే ॥**

ప్రపంచమునకు సంబంధించిన భావమును తగ్గించివేసి, భావమును ప్రయత్న పూర్వకముగా శివునికి సమర్పించి శివాత్మకుడుగా కావలెననెడిది యీ ఆగమోక్తిలోని భావము.

భావమునకు సంబంధించిన తాత్త్విక వివరణను శ్రీ భగవత్పాదులవారీ క్రింది విధముగా నిచ్చిరి :

**చిత్తస్థసకలార్థానాం మననం యత్తు మానసే ।**
**తదర్పణం శివే సాక్షాన్మానసో భావ ఉచ్యతే ॥**(సి.శి. 17-51)

ఏ మనోభావము వలన చిత్తములో నెలకొనియున్న సకలార్థముల యొక్క మననము శివునియందున సమర్పింపబడునో ఆ మనోభావమును భావార్పిత మనోవృత్తియని అందురనెడిదే యిద్దాని సారాంశము.

మన మనస్సునందున పదార్థముల యనుభవరూపమైన చింతన యెల్లప్పుడు కొనసాగుచుండును. ఇదియొక మనో వికారమని తెలిసికొనగలరు. ఇట్టి మనోవికారము భావమని చెప్పబడుచున్నది. “వికారో మనసో భావః” అనెడివి యమరములోని వాక్కులు. భావమనబడెడి మనోవికారమును శివునికి సమర్పించవలెనని శ్రీరేణుకాచార్య భగవత్పాదులవారు నుద్బోధించిరి.

సామాన్యముగా మనస్సునందున సాంసారిక పదార్థముల చింతన పుట్టుచునే యుండును. మనస్సుకు చింతన చేసెడి క్రియను కొత్తగా నేర్పించవలసిన పనిలేదు. అయితే చింతనా విషయమునందున పరివర్తనను తెచ్చుటకొరకు ప్రయత్నించవలెను. సదా సంసారపు చింతనలో

నుండెడి మనస్సుకు భగవంతుని గురించి చింతించెడి విధిని అభ్యాసము చేయించవలెను. క్రమక్రమముగా సంసారపు చింతన తగ్గించుకొని పరమాత్ముని చింతనను హెచ్చించుకొనెడి ధోరణి నలవరచుకొనవలెను. ఇది యెంతో కష్టసాధ్యమైన యంశము. సంసారముతో గల సంబంధము నిన్న మొన్నటిది కాదు. యుగయుగాలుగా కొనసాగుచు వచ్చుచున్నది. సాంసారిక సంబంధము జీవుని యసంఖ్యాకమైన జన్మలలో సంతరించికొనిన యనుభవమువలన బంధము శక్తివంతమైయున్నది. క్రితపు జన్మలలోని సంస్కారముల వలన ప్రభావితుడైన జీవి, సంసారపు చింతన కడకు తేలుడుచున్నాడు.

చిరకాలమునుండి కొనసాగుచు వచ్చుచున్న అభ్యాసమును మనస్సు అంత సులభముగా వీడదు. అద్దానికై సతతము ప్రయత్నించవలసియుండును. ఒక వ్యక్తి బస్సు కండక్టర్‌గా ముప్పది -ముప్పదిఐదు సంవత్సరములవరకు పనిచేసి పదవీ విరమణ చేసెను. పదవీ విరమణను పొందిన పిదప నొక నెల గడిచెను. అతడొక బ్యాంకుకు వెడలి డబ్బును డ్రా చేయుటకై చెక్కును కౌంటరులో నిచ్చి టోకెన్‌ను గైకొనెను. డబ్బును వితరణ చేసెడి దశలో క్యాషియర్ చెక్కు వెనుకన మరొక సంతకమును చేయమని కోరెను. అప్పుడా కండక్టర్ సంతకము చేయుటకై కలమును గైకొనెనే గాని సంతకము చేయకుండ నిలుచుండెను. నాలుగైదు నిమిషములు గడిచెను. సంతకము చేయలేదు. క్యాషియర్ "వేగిరముగా సంతకమును చేయు"మనెను. అప్పుడా కండక్టర్ క్యాషియర్‌ను "వెలుపలికి రమ్మ"ని వినతిని చేసెను. క్యాషియర్ బయటికి వచ్చి కండక్టర్ భుజమును పట్టికొని కుదిపి "యేమైనది నీ"కనెను. అతడు వెంటనే సంతకమును చేసెను. క్యాషియర్ "ఎందుకింత మేర కాలస్యము చేసితి"వనెను. "అయ్యా! కాయము నల్లాడుచుండగా సంతకము చేయుటయనెడిది నా కలవాటు. మీరు నన్ను కుదిపి నా కుపకారమును చేసితి"రనెను.

ముప్పది సంవత్సరములనుండి అభ్యాసమైన దానిని వీడజాలని స్థితిలో జన్మజన్మాంతరములనుండి వచ్చెడి సంస్కారముల నెట్టుల వీడగలము. బలమైన ప్రయత్నమును చేయవలెను. శ్రీ రేణుకాచార్య భగవత్పాదులవారు చెప్పిన యటుల చిత్తములోని విషయ చింతనలన్నింటిని శివుని కర్పణ చేయవలెను.

సగము మేరకనుభోగమునకు వచ్చిన విషయముల నెట్లు సమర్పించగలమనెడి సందేహము గలుగవచ్చును. దేవుని కెంగిలి నెట్టుల సమర్పించవలెననెడి భావము పొడచూపవచ్చును. ఈ విధము చింతించవలదు. భక్త కన్నప్ప తన యెంగిలిని శివుని కర్పించలేదా! రామాయణములోని శబరి కథ మనమెరిగినదే. శుద్ధి-అశుద్ధి యనెడి తలపును మదిలోనికి తేనివ్వవలదు. భక్తి సమన్విత భావములో చిత్తగతార్థములను మనసార సమర్పించవలెను. పదార్థముల లేదా భావముల శుద్ధికంటెను సమర్పించెడి వాని త్రికరణశుద్ధికే యెక్కువ ప్రాముఖ్యత గలదని గ్రహించగలరు.

సాధకునికి భావమే ముఖ్యాతిముఖ్యమైన యంశమని తెలిపెడి శ్రీభగవత్పాదుల వారి నుడువులివి :

**భావ యేవ హి జంతునాం కారణం బంధమోక్షయోః ।**
**భావశుద్ధౌ భవేన్ముక్తిర్విపరీతే తు సంసృతిః ॥** (సి.శి. 17-52)

దీని తాత్పర్యమేమనగా భావమే జీవుల బంధమోక్షములను గలుగజేసెడి యంశము. భావశుద్ధి గలవాడు ముక్తిని పొందును. అది లేనివాడు సంసృతిని పొందును.

"నేను శివుడనని తెలిసికొనుటయే భావశుద్ధియని శ్రీ భగవత్పాదులవారు తెలియజెప్పిరి. ఈ ఉపదేశమును గనుడి :

**భావస్య శుద్ధరాఖ్యాతా శివోహమితి యోజనా ।**
**విపరీత సమాయోగే కుతో దుఃఖనివర్తనమ్ ॥**
(సి.శి. 17-53)

దీని తాత్పర్యమేమనగా "నేను శివు"డననెడి తలపు వలననే భావశుద్ధి చేకూరును. దీనికంటెను భిన్నమైనట్టి తలపు వలన సంసారపు దుః ఖము నివృత్తి కాజాలదు.

ఈ ప్రపంచములోని యే వస్తువైనను శివునికంటెను భిన్నమైనది కాదు. వస్తువులెల్ల శివుని వలన యుద్భవించినదే కదా! పూజాదికముల జేయునప్పుడు మనమతని పదార్థములనే యతని కర్పించుచున్నాము. ఇందుచేత మనలో గమనార్హమైన పరివర్తన వచ్చెడి యవకాశము లేదు. మనలో నుండెడి భావమును సమర్పించినప్పుడు మన యొక్క అభ్యుదయము సుసాధ్యమగును.

ఈ కారణమువలననే "భావన" బంధ మోక్షములకు కారణభూతమగుచున్నది. ఎప్పుడైతే భావము శివార్పితమగునో అప్పుడు జీవన్ముక్తికి మార్గము సుగమమగును. ఎంతమేరకీ భావన గలుగదో అంతవరకు బంధమునుండి విముక్తి లభించగలదని తెలిసికొనగలరు.

భావము ద్రవ పదార్థము వంటిది. దీనికొక నిర్దుష్టమైన రూపముండదు. ఇది దేని నాలంబనగా చేసికొని నిలుచునో అట్టి రూపమునే దాల్చును. గుండ్రని పాత్రలోని ద్రవము గుండ్రముగాను, చతురస్రాకారము గల పాత్రలోని ద్రవము చతురస్రాకారమును దాల్చుట లేదా? అదే విధిన యపరిశుద్ధమైనట్టి యాలంబనను నాధారముగా గొనిన భావమపరిశుద్ధముగా అగును. శివుని నాలంబనగా గొనిన భావము శుద్ధ స్వరూపమును దాల్చును. ఈ కారణమువలననే శ్రీరేణుకాచార్యుల వారు "శివోహ" మనెడి భావము వలన భావము శుద్ధమగునని తెలిపిరి. శివోహమనెడి భావము వలన వ్యక్తిలోని సంకుచిత భావములు తొలగిపోవును. అతని మనస్సు వ్యాపక రూపమును దాల్చును. సాధకుడు యీ స్థితివలన నతడు సమున్నతుడగును. ఈ భావములేనివారు గొప్పవారు కాజాలరు. ఇల్లు గట్టిగాని, పదవిని పొందిగాని, ధనమును గూర్చికొనిగాని గొప్పవారు కాజాలరని తెలిసికొనగలరు.

సాధకుడు తన తను మన ధనముల నెంతెంత ప్రమాణములో నుంచికొనవలెననెడి యంశములో ననుభావులు కొన్ని సూచనలు చేసిరి. తనువును మధ్యమముగాను, ధనమును కనిష్ఠముగాను, మనస్సు హెచ్చుగాను నుండవలెనని తెలుపబడినది. దేహము మధ్యమముగా నున్నవాడు నేపనినైనను చురుకుగా చేయగలడు. ధనాధిక్యత గలవాడు సదా వ్యవహారములలో నిమగ్నుడైయుండును. ఆత్మచింతనను మరచిపోవును. అందుచేత ధనము తక్కువగా నుండవలెనని తెలుపబడినది. మనస్సు గొప్పదైనదై యుండవలెనని తెలుపబడిన కారణమేమనగా నాత్మచింతనలోన మనస్సున కధికమైన ప్రాముఖ్యత గలదు. మనస్సు గొప్పదిగా కావలెనినిన నద్దానిని నిలిపెడి యాధారము పెద్దదైనదై యుండవలెను. భగవంతుని కంటెను పెద్దదైన ఆధారముండునే? అందుచేత, మనస్సును శివార్పితము చేయవలెను. "యోవైభూమా తత్సుఖమ్" అనెడి యుపనిషద్వాణి తెలిపినటుల మిగుల గొప్పనైన వాడు భగవంతుడని నమ్మవలెను. అప్పుడే మనస్సు గొప్పదిగా కాగలదు. గొప్ప మనస్సుగలవాడు మహాత్ముడనబడుచున్నాడు. వీరి కామనలు తమ స్వార్థము గురించి కేంద్రీకృతమై యుండవు. వారు కోరెడిది సమిష్టి కళ్యాణమే. ఈ విషయమును తెలిపెడిదగు నీ ఋషి విరచితమగు భగవత్ ప్రార్థనను గనుడి :

**సర్వేపి సుఖినస్సంతు సర్వేసంతు నిరామయాః ।**
**సర్వేభద్రాణి పశ్యంతు మాకశ్చిద్దుఃఖభాగ్భవేత్ ॥**

దీని భావమేమనగా నందరును సుఖులై యుందురుగాక, అందరు నిరోగులై యుందురుగాక, అందరు మంగళమునే గాంచుదురుగాక, వీరిలో నెవ్వరికైనను దుఃఖము కలుగకుండుగాక. ఇట్టి యుదాత్తమైన భావనలు చిన్న మనస్సు గలవారికి కలుగవు కదా! అయితే ప్రతియొక్కరు స్వార్థమును త్యజించినవారై సమిష్టి కళ్యాణము వాంఛించెడి వారుగా కావలెను. తన్నిమిత్తమై శ్రీ రేణుక భగవత్పాదులవారు చూపిన మార్గమున పయనించవలెను. భావార్పణ చేసెడి వ్యక్తులుగా కావలెను. భావార్పణవలన మనస్సు పరిశుద్ధమైనదై విరాజిల్లును. దుఃఖము దూరమగును.

ఈ చరాచరమైనట్టి యీ జగత్తు నే భావములో వీక్షింపవలెనో అనెడి దానిని తెలిపెడి శ్రీ రేణుక భగవత్పాదుల వారి యుపదేశమును గనుడి:

**భోక్తా భోజ్యం భోజయితా సర్వమేతచ్చరాచరమ్ ।**
**భావయన్ శివరూపేణ శివోభవతి వస్తుతః ॥** (సి.శి. 17-54)

జీవుడు, భోగయోగ్యమైన వస్తు సంచయము, భోగము నిచ్చెడి శివుడు చరాచరమైన జగత్తులు శివుని రూపమే యని భావించెడివాడు శివుడగుచున్నాడు అనెడిది యుపదేశాన్తర్గమౌ భావము.

కర్మానుసారముగా విచ్చేసి, ప్రపంచమున నొక దేహము దాల్చికొని, సుఖ-దుఃఖముల ననుభవించెడివాడే భోక్తయనబడుచున్నాడు.

అతని యుపభోగార్థమై శివునిచేత నిర్మితమైనట్టిదియును, శబ్ద-స్పర్శాదులచే కూడికొనియున్నదియును అగు ప్రపంచమే భోగ్యమనబడును. భోజయితా అనగా జీవునికి ప్రేరణనిచ్చి జీవునిచేత నుపభోగమును చేయించెడి శివుడు. శివుని ప్రేరణ లేకుండిన యెడల ప్రపంచములోని వ్యవహారములేవియును కొనసాగజాలవని గ్రహించదగును. అందుకే, "తేన వినా తృణమపి న చలతి" యని విజ్ఞులు వెలిబుచ్చిరి. ప్రేరణ నిచ్చెడివాడు మనకు గోచరించకుండినా సర్వ వ్యవహారములను నడిపెడి వాడతడే. ప్రతియొక్కరి దేహముననుండెడివాడును, జీవుడై యీ లోకమునకు వచ్చి దేహమును ధరించికొనిన వాడును, అతడే.

జగత్తుయును అతడే. వివేకదృష్టిచేత వీక్షించిన వారికీ విషయములు సుస్పష్టమగును. ఈ రహస్యము నెరుగలేని వెర్రిజనులు నేను నేను, నాది, నాది యునెడి భావములను దాల్చి దుఃఖముననుభవించుచున్నారు. ఈ దుఃఖమునుండి ముక్తిని పొందవలెనవిచో మన భావములోనే మార్పు రావలెను. భావనలో మార్పును సాధించికొనినవానికి బ్రహ్మాండమంతయును శివరూపముననే గోచరించును. ఈ భావము దృఢమైన పిదప సర్వము శివరూపమే యనెడి భావన గల్గును.

పాలలో నీటిని పోసినప్పుడు పాలు తన గుణమును నీటికిచ్చి సామరస్యము సాధించును. రెంటికి యభేదభావన గల్గును. స్వభావతః భిన్నమైనవగు పాలు-నీరు సమరసమైన యటులే శివ-జీవులును భావార్పణవలన సామరస్యమున పొందునని గుర్తించగలరు. వాస్తవికముగా శివుడు-జీవుడు భిన్నులు కారు. శివుడే జీవుడు. సంకుచిత భావములు గల జీవుడు శివుడు కాలేడు. గురుకారుణ్యమబ్బిన యెడల తాను శివుడననెడిది గుర్తించి శివునితో సామరస్యమును సాధించుటకై కృషి సలుపును. భోక్తా, భోగ్య, భోగయితాయనెడి భేదభావము నిర్గమించిన పిదప యిట్టి సామరస్యము సిద్ధించునని తెలిసికొనగలరు.

శివుని విశ్వాతీతునిగా భావించెడి శివయోగి సంసారముచేత బంధింపబడడని శ్రీరేణుకాచార్యులవారు బోధించిరి. వీరి యుపదేశమును గనుడి :

**మిథ్యేతి భావయన్ విశ్వం విశ్వాతీతం శివం స్మరన్ ।**
**సత్తానందచిదాకారం కథం బద్ధుమిహార్హతి ॥** (సి.శి. 17-55)

ఉపదేశములోని భావమేమనగా నెవ్వడైతే విశ్వమును మిథ్యగాను, శివుని విశ్వాతీతునిగను భావించికొని సచ్చిదానంత స్వరూపుడగు శివుని స్మరించునో అతడు సంసార బంధముల కతీతుడగును.

శివుడు విశ్వరూపుడే కాదు విశ్వాతీతుడును అయి యున్నాడు. "అత్యత్తిష్ఠ దశాంగుల"మ్మనెడి శ్రుతి యీ యంశమును సమర్థించుచున్నది. పంచభూతాత్మకమైన యీ ప్రపంచమును మీరి యుండునని గ్రహించగలరు. అవిద్యా ప్రభావము వలన యీ విధిన యాలోచించని వారికి సంసార బంధములనుండి విముక్తి లభింపజాలదు.

'మిథ్యా' అనెడి దాని విషయములో నెరుగవలసినదేమనగా విశ్వమనెడిది హుళుక్కియని యర్థము చేసికొనవలదు. విశ్వము సత్యమే శివుడు సత్యమే. విశ్వము యెడల జీవికి గల మమకారమనెడిదే మిథ్యయని గ్రహించవలెను. విశ్వమందలి భూమ్యాదులలో కొంతభాగమును గుర్తించి యిది "నాది" యని జీవుడు భావించుచున్నాడు. ఈ మమత్వము వలననే శివుడు, జీవుడు, ప్రకృతి వేరువేరుగా నుండెడివాని తలచును. ఈ భేదదృష్టియే దుఃఖములకు గల కారణభూతాంశమని గ్రహించగలరు. జీవుడు శివోహమనెడి భావన పెంపొందించికొనిన యెడల యిట్టి దుఃఖమువలన విముక్తిని పొందవచ్చును. జీవుడు శివుడయ్యెడి దిశలో పయనించగలడు.

తానేది చేసినను నయ్యది శివభక్తిని సలుపుటే యనెడి భావము గల్గినవానికి కర్మబంధము చుట్టికొనదని శ్రీభగవత్పాదులవారు నుద్బోధించిరి. గమనించుడి :

**సర్వం కర్మార్చనం శంభోర్వచనం తస్య కీర్తనమ్ ।**
**ఇతి భావయతో నిత్యం కథం స్యాత్ కర్మబంధనమ్ ॥** (సి.శి. 17-56)

చేసెడి పని శివార్చనమనియు, ఆడెడి మాట శివకీర్తనమని నిత్యము భావించెడి వానికి శివభక్తునికి కర్మబంధములంటవేడిదే యుపదేశాన్తర్గముగా నున్న భావన.

విశ్వములోని మమత్వభావన మిథ్యయని గుర్తెరిగినవాడు నిష్క్రియుడుగా కాకూడదు. మరో మాటలో చెప్పవలెననిన జ్ఞానమువలన వ్యక్తి సోమరిపోతుగా కాకూడదు. జ్ఞానము వలన వ్యక్తులు కార్యకౌశల్యము గలవారుగా కావలెను. ఏ కార్యమునైతే ఆత్మజ్ఞాని చేయునో ఆ కార్యమును అజ్ఞాని అంత నియమబద్ధముగా చేయజాలడు. ఇద్దరిచేత చేయబడిన కార్యములలోన బాహ్యాపరమైన యంతరము దోచకపోవచ్చును. కాని కార్యాంతర్గతాంశములలో చాలావరకు తేడాను గమనించగలము.

అజ్ఞుడు కార్యాచరణను తన నిమిత్తమై చేసికొనగా శివజ్ఞాని తానేది చేసినా నయ్యది శివుని కొరకే యనెడి భావమును మనమున దాల్చి కార్యము నాచరించును. తత్ఫలితముగా కర్మబంధములు శివజ్ఞానిని కట్టివేయజాలనివగుచున్నవి. చేసెడి పనులన్నియును శివపూజలోని యంశములేయని భావించెడి వానిని బంధించెడిశక్తి కర్మ బంధముల కుండజాలవని తెలిసికొనగలరు. శ్రీశంకరాచార్యులవారును తమ శివస్తుతిలోన తాను చేసెడి వన్నియును శివార్చనలోని యంతర్భాగములేయని వెలిబుచ్చెను. గమనించుడి :

**ఆత్మాత్వాం గిరిజామతిః సహచరాః**
**ప్రాణాః శరీరం గృహమ్।**
**పూజాతే విషయోప భోగరచనా నిద్రాసమాధి స్థితిః**
**సంచార పదయోః ప్రదక్షిణ విధిః స్తోత్రాణి సర్వాగిరో**
**యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం**
**శంభో తవారాధనమ్ ॥**

శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారు, భావార్పిత స్థలమున తమ యుపదేశమునకు ముగింపు పలుకుచు ఈ స్థలములోని శివయోగి జీవన్ముక్తిని పొందునని సెలవిచ్చిరి. గమనించుడి :

**సర్వేంద్రియగతం సౌఖ్యం దుఃఖం వా కర్మసంభవమ్ ।**
**శివార్థం భావయన్ యోగీ జీవన్ముక్తో భవిష్యతి ॥** (సి.శి. 17-57)

శ్రోత్రాది సర్వేంద్రియ గతమే సుఖమును, పాపకర్మలవలన గల్గెడి దుఃఖమును శివార్థమేయని భావించుచు శివయోగి జీవన్ముక్తిని పొందుననెడిదే యుపదేశము యొక్క సారము.

ఈ సంసారము సుఖ-దుఃఖముల రూపము గలదైయున్నది. ప్రతిజీవి వీటిననుభవించుచున్నాడు. జ్ఞానులైనను వీటినుండితప్పించికొనజాలరు. ప్రారబ్దకర్మ చేత వివశులై వీరు సుఖ-దుఃఖములకు లోనగుచున్నారు. "అనుకూల వేదనీయం సుఖం ప్రతికూల వేదనీయం దుఃఖం" అనెడి శాస్త్రకారుల వాక్కుల ప్రకారము మనస్సు యొక్క సానుకూల ప్రతికూల యనుభూతులే సుఖ-దుఃఖములనబడుచున్నవి. విషయానుభవమువలన సుఖానుభూతి యగుననెడి యభిప్రాయము కలదు. అయితే శబ్ద-స్పర్శాదులు సుఖమునిచ్చెడివైనను అవి మనస్సు కనుకూలముగా దోచని యెడల సుఖము లభించదు. శబ్దమును ఉదాహరణగా తీసికొనవచ్చును. కొందరికి శాస్త్రీయ సంగీతము సుఖమునిచ్చిన యెడల మరొకరికది తలనొప్పిని కల్గించవచ్చును.

వాస్తవముగా చూసిన యెడల సుఖ-దుఃఖముల యెడల మనకు గల యభిమానమువలననే దుఃఖము గల్గుచున్నది. మరో మాటలో చెప్పవలెననిన కర్మబంధములు బంధించి దుఃఖమునకు గురిచేయుచున్నవి. సాంసారిక విషయముల యెడల నిరభిమానముగల్గి యున్నవాడికి దుఃఖము కలుగదు.

ఈ రహస్యమును గుర్తించలేక లోకము బాధలకు లోనగుచున్నది. లోకోద్ధరణ నిమిత్తమున శ్రీరేణుక భగవత్పాదులవారు భావార్పణ విధమును బోధించిరి. సుఖ–దుఃఖములను శివునికి నివేదించి, వాటిని శివ ప్రసాదములుగా భావించికొని యనుభవించుట వలన జీవన్ముక్తి లభించుననుడి యాచార్యోక్తిని తలదాల్చినవారు ధన్యులగుదురు. శివయోగి యీ విధిననే ధన్యతను పొందుచున్నాడు. మీరందరు ఆ మార్గమున పయనించుటకై కృషి చేయుదురు గావుత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులవారు భావార్పిత మనెడి భావనను విపులముగా వివరించి చెప్పిరి.

అర్పిత స్థలత్రయము లోన చివరిదగు నీ స్థలమున నర్పితము చేసెడి వాడవలంభించవలసిన మానసిక వైఖరి గురించి వివరింపబడినదని దలచవచ్చును.

కర్తృవు, క్రియ మరియు ఫలప్రాప్తి యనెడివి పరస్పర ప్రభావమునకు గురియయెడివని తెలియుచున్నది. చేత ఫలించినప్పుడు చేసినవాని మనమున నహంకార బీజమంకురించెడి యవకాశము గలదు. బసవ పురాణములోని పంచమాశ్వాసమున గల కథలన్నియును నీ విషయమునే తెలుపుచున్నది. భక్తిభావమున చేసెడి సత్క్రియలన్నియును నిరహంకార మనోవృత్తితో చేయవలెనని బసవ పురాణముద్బోధించుచున్నది. శ్రీ బసవేశ్వరులవారి క్రింది వచన మీ బోధనే చేయుచున్నది. గమనించుడి :

**మాట కూట ఫలప్రాప్తి**
**ఎంబ మాతు కేళలాగదు, శివశివా!**
**నిమ్మభక్తరిగె మాడిదె నెన్నెదిరెందు**
**శ్రీగురులింగవుకృపెయ మాడిదకారణ**
**అల్లిమాడువరూ మాడిసికొంబవరూనీవె**
**కూడల సంగమ దేవా!** (వ.సం. 507)

దీని తెలుగు రూపమిది :

**చేయుట కూడుట ఫలప్రాప్తి**
**యనెడి మాటలు వినను రాదు, శివశివా!**
**మీ భక్తులకు చేసితినన్నదన కుందుమని**
**శ్రీగురు లింగము కృపచేసిన కారణమున**
**అచ్చట చేసినవారూ**
**చేయించి కొనెడివారూ నీవే,**
**కూడల సంగమ దేవా!**

"భోక్తా, భోజ్యం, ప్రేరయితా సర్వం శివరూపేణ భావయ" అని వీరశైవ విబుధులు బోధించుచున్నారు. వీరి బోధన శ్రీబసవేశ్వరులవారి యుద్బోధకును, శ్రీ భగవత్పాదులవారీ స్థలమున చేసిన యుద్బోధకును ననుగుణ్యత గల్గియున్నదని తెలియుచున్నది.

ఈ భావముతో కాయేంద్రియ కరణాదులను శివార్పితము చేసిన యెడల మనోబుద్ధహంకార చిత్తములన్నియును శివార్పితములైనవై సాధకుని నిస్సంగునిగా చేయుచున్నవి.

చేసితిననెడి భావన భేదభావము వలన పుట్టుచున్నది. అవిద్యవలన భేదభావ ముత్పన్నమగుచున్నది. అది పెరిగి పెద్దదై వటవృక్ష స్వరూపము దాల్చినచో భావమాలిన్యము ప్రాప్తించును.

చేతవలన గల్గెడి ఫలప్రాప్తి యొక్క మననము వలన కర్మబంధములు బిగిసికొని పోవును. మరికొన్ని ఈప్సితార్థములు చిత్తమున జేరును. మనోవికారములు పొడసూపును. కామక్రోధాదులు విజృంభించి స్వైరవిహారమును సలుపును. చేయబడిన కరణార్పణ నిష్ఫలమైనదై చెడిపోవును.

"చేసెడి వానిని నేను కాను, చేయించికొనిన వాడు జంగముడు కాడు. చేసినది క్రియ కాదు. క్రియకు దోహదకారిగా నున్న జగత్తు భౌతికమైనది కాదు". ఈ రీతిన చింతన చేయుచు చేయబడెడి చేష్టలవలన ప్రసాది తన సాధనను పరిపూర్ణము చేసికొనగలదు.

సాధకుడు తానే పనిని చేయుచున్నను నయ్యది శివపూజయని తలచుచు, చేసెడి పనులన్నియును శివప్రీతికరమైనవని తలచవలెను. చేసెడి తనకును, చేయించుకొనెడి శివునికినీ అభేదము గలదని భావించికొనుటకై "శివోహం" అనెడి భావనను సాధనముగా గైకొనవలెననెడిది ప్రబోధింపబడినది. అయితే, జగన్మిధ్యాభావమును మనమున దాల్చి, కేవలాద్వైతుల వలె ప్రజ్ఞానమే బ్రహ్మమనెడి బుద్ధిని పెంపొందించికొని చిత్తమున 'శివోహం' 'శివోహం' అని దలచినచో సాధన సత్ఫలితము నివ్వదు. ఇట్టి భావనల వలన భావశుద్ధి చేకూరదు. శక్తివిశిష్టాద్వైత సిద్ధాంతానుసారముగా షట్త్రింషత్ తత్త్వములను గుర్తెరిగి, శివుడే జీవుడై తిరుగాడుచున్నాడనియును శివునికి జీవునికీ భేదము గలదనెడి దెరిగి కరణాదుల నర్పితము చేయవలెననెడిది గ్రహించవలసిన విషయము. ఈ మార్గమున సాధన చేయలేనివాడు ద్వైత భావాన్వితుడైపోవును. అతని భావన వలన సాధనలో పురోగమనము లోపించెడి యవకాశము గలదు.

పరస్థల జంగముడు భావార్పిత గుణ సంపద యొక్క ప్రాముఖ్యతను తెలిపి లోకములను పునీతము చేయును. లింగప్రసాది స్థలిగా భావార్పిత స్థలములోని కీలకాంశములన్నింటిని తాను ఆచరణలో నిడికొని అంగప్రసాది స్థలికి మార్గదర్శకుడగును. ఈ పరస్థలియొక్క లక్షణములీ క్రింది పద్యము వివరింపబడినట్టుల యుండునని తెలియుచున్నది.

**సంకీర్ణ లౌకికాచార వర్జితుడెని**
**విధినశేధక్రియా వివశుడెట్లు**
**విధినిషేధ క్రియా విరహిత వర్తులే**
**నుభయ కర్మఫల ప్రయుక్తులెట్లు**
**లుభయకర్మఫలోత్తరోద్యుక్తు లేని**
**స్తన్య పాన క్రియాసక్తులెట్లు**
**అట్లు గాన**
**లౌకికాచారదూరుల**
**బరమభక్తిరతుల బాత్రాయుతులలను**
**నతుల తత్త్వ, యుతుల నట్టిమహాత్ముల**
**చేర్పవయ్య నన్ను చెన్నమల్లు** (చెన్నమల్లు సీసములు, 17)

"అతులిత తత్త్వ యుతుల" యనెడిది కీలకాంశము. శక్తివిశిష్టాద్వైతమే యతులిత తత్త్వమని గ్రహించవలెను. లౌకికాచారాదుల కనుకూలమైన మనోవృత్తులను ప్రయత్న పూర్వకముగా తగ్గించికొని క్రమక్రమముగా శివ-జీవాభేద భావమును పెంపొందించుకొని, కాయేంద్రియ కరణాదులను శివార్పితమైనవిగా జేసికొని శివలింగమును భావద్రవ్యములో పూజించెడి, నడతనే పూజగాను, నుడువులను శివస్తుతులుగాను కన్పట్టజేసెడి మహాఘనుడుగా పరజంగముడు గోచరించునని గ్రహించగలరు.

*- శివం భూయాత్ -*

## ఆశీర్వచనము - 1 :
## శిష్య స్థలము :

లింగస్థలములో నొకటగు ప్రసాది స్థలమునందలి భావార్పిత స్థలమున శివయోగి జీవన్ముక్తిని సాధించునని తెలిసికొంటిరి. ఏ వ్యక్తి యీ శివయోగి చేత శాసనీయుడై ధన్యుడగునో అతని గురించి తెలిపెడి స్థలమే శిష్య స్థలము.

మన సంస్కృతిలో దైవపూజ కెంత ప్రాముఖ్యత గలతో అంతకంటెను అధికమైన ప్రాముఖ్యత గురుపూజ కివ్వబడినది. భక్తిశ్రద్ధలతో గురువును సేవించెడివాడే శిష్యుడనెడిది లోకమెరిగిన విషయమే. గురువు పాదములమీద మనస్సును లగ్నము చేయలేని వారి జీవితము వ్యర్థమని తెలిపెడి శ్రీ శంకరాచార్యులవారి యీ కృతిని గనుడి :

**శరీరం సురూపం తథా వా కలత్రమ్ ।**
**ధనం మేరుతుల్యం యశశ్చారు చిత్తమ్ ॥**
**గురోంఘ్రిపద్మే మనశ్చేన్న లగ్నం ।**
**తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్ ॥**

అందమైన మేను, సౌందర్యవతియగు ధర్మపత్ని, మేరునగము వంటి ధనము, గొప్పకీర్తి గల్గివాడైనను గురుపాదముల మీద మనస్సును లగ్నము చేయలేని స్థితిలో నుండిన యెడల వాని జీవితము నిస్సారమైన దగునని యీ గురుస్తుతిన తెలుపబడినది.

శిష్య అనెడి పదము యొక్క సాంకేతికపరమైన యర్థమును తెలుపుటకై శ్రీ భగవత్పాదులవారు తమ యుపదేశము నీ క్రింది విధిన యిచ్చిరి.

**శాసనీయో భవేద్యస్తు పరకాయేన సర్వదా ।**
**తత్ప్రసాదాత్తు మోక్షార్థీ స శిష్య ఇతి కీర్తితః ॥** (సి.శి. 17-58)

ఎవ్వాడు భావార్పితస్థలియైన శివయోగి చేత శాసనీయుడై యతని కరుణకు పాత్రుడగునో అట్టి మోక్షార్థి శిష్యుడనబడుననెడిదే యీ యానతిలోని సారాంశము.

మనుష్యుని జీవితములో గురుకృపకు మహత్త్వపూర్ణమైన స్థానము గలదు. ఇది లభ్యము కావలెననిన, శిష్యుడు ఆప్త, అంగ, స్థాన మరియు సద్భావములనే సేవల వలన గురువును ప్రసన్నుని చేసికొనవలెను. ఎప్పుడైతే మోక్షమును పొందవలెననెడి ప్రగాఢమైన వాంఛ మనస్సునందున నుదయించునో అప్పుడు గురుకరుణ లభించినదని భావించవలెను. పుట్టిన ప్రతివ్యక్తికి అర్థకామము కోరదగినదై యున్నవి. ధర్మ మోక్షముల యపేక్ష గలవారి సంఖ్య పరిమితముగనే యుండును. పురుషార్థములలో ధర్మమే మౌలికమైనది. ధర్మమువలననే మిగిలిన పురుషార్థములు సార్థకతను చేకూర్చగలవు. గురువును సేవించుటయే శిష్యుని ధర్మము. నిష్కామియై యచంచలమైన భక్తి విశ్వాసములతో గురుని సేవించెడి శిష్యునికి మోక్షాపేక్ష తనకు తానే యుత్పన్నమగును. ఇతరేతరములగు అపేక్షలు నిండుగా గల్గియున్నవానికి మోక్షాపేక్ష కలుగదని గ్రహించగలరు. కోరికలన్నింటిని నెట్టివేసి, గురుసేవ నంకితభావముతో చేసెడి యుత్తమ శిష్యునికి మాత్రమే మోక్షాపేక్ష కలుగును.

ముముక్షువునకు మోక్షాపేక్ష మిక్కుటముగా నుండవలెను. దుర్బలమైన యపేక్ష గలవానికి సత్ఫలితము దుర్లభమగును. ఈ విషయమును విడదీసి చెప్పెడి యుదంతమొకటి గలదు.

స్వామి వివేకానందున కొక వ్యక్తి యెదురుగా వచ్చి, నమస్కరించి "స్వామీ! మీకు దేవుని దర్శనమైనదా" అని అడిగెను. వివేకానందుడు "అయిన"దనెను. "అట్టి యెడ నాకు దేవుని చూపించగలరా?" అని ప్రశ్నించెను. "మంచిది, చూపించెదను. నీవు నీ వెనువెంట రమ్ము. నదీతీరము వరకు వెడలి, మంగళస్నానమాచరించెదము గాక అక్కడే నీ కోరిక నెరవేరగల"దని వివేకానందుడు పలికెను. ఆ వ్యక్తి "వల్లె" యని వివేకానందుని యనుసరించెను. నదిలోకి దిగి స్నానమును చేయుచున్నప్పుడు నా వ్యక్తి నీటిలోనికి మునుగుచు, తేలుచునుండెను. వాడు

మునిగినప్పుడు వివేకానందుడు వాని తలను అదిమిపట్టెను. వాడు గిజగిజలాడెను. అరనిమిషము గడిచెను. వాడు తన శక్తి మేరకు ప్రయత్నించినా మీదికి లేవకుండెను. వివేకానందుని శక్తిముందు వాని శక్తి నిర్వీర్యమై, వీగిపోయెను. ఆ పిదప నా వ్యక్తికి విడుదల లభించెను. వాడు కోపములో "ఏమిది? దేవుని చూపించెదనని చెప్పి మీరీ విధముగా చేయుటలో నౌచిత్యము లేద"నెను. అప్పుడు వివేకానందుడు 'అయ్యా! దేవుని చూపించుటకే నేనా విధిన చేసితిని. నీటిలో మునిగి యున్నప్పుడు మీకు నూపిరి చింతేగాని దైవ చింత లేకుండెను కదా!" అని అనెను. అప్పుడు అతడు నిజము నెరిగినవాడయ్యెను. "నీవు నీటిలో గాలికై తపన పడినప్పుడు, యిల్లు, పొలము, భార్య, పిల్లలు మొదలగు వాటి చింతలు లేకుండెను కదా. ఊపిరి పీల్చికొనవలెననెడి యేకైక చింతన యుండెను కదా! భగవంతుని చూడవలెననెడి కోరిక అదేవిధిన గల్గినప్పుడు దేవుడు తనకు తానే వచ్చి నీ యెదుట నిలుచును. నీవతనిని చూడగల"వని స్వామి వివేకానందుడు బోధించినవాడయ్యెను. ఆగంతకుడు తన కృతజ్ఞతలను వ్యక్తము చేసి తన పథమున తాను బయలుదేరి వెడలెను. ప్రగాఢమైన మోక్షాపేక్షలేని వారికి గురు కారుణ్య మలభ్యమైన దగునని గుర్తించగలరు.

దేవాలయములకు వెడలి, పూజాదులను ముగించికొని, కోరికలను కోరుచుండెడి సాంప్రదాయము కలదు. ఈ కోరికలు భోగముతో ననుబంధము గల్గినవైయుండుటనెడిది వేరుగా చెప్పవలసిన పనిలేదు. కొన్ని సందర్భాలలో కోరికలు నెరవేరుటయు, మొక్కులు తీర్చుకొనుటకై ఆ దేవాలయమును మరల సందర్శించుటయు చూడగలము. అయితే, యిట్టి సాంసారికమగు కోరికల కంతునుండదు. తృప్తిలేని వ్యక్తి యెన్ని కోరికలు నెరవేరినా ఇంకనూ కోరుచునే యుండును. ఈ ధోరణి వ్యక్తిని సాంసారిక బంధములకు గురిచేయునే కాని, అతడు అద్దానిని తరించుటకు నుపకరించదు. మోక్షాపేక్షయే తరుణోపాయమని గ్రహించగలరు.

సాధకుడు భోగాపేక్షను తగ్గించికొనవలెను. దేవాలయములకు వెడలి కోరికలను కోరెడి ధోరణికి స్వస్తి చెప్పవలెను. సద్గురువు నాశ్రయించి సేవించుచుండవలెను. కాని గురుసాన్నిధ్యమున గురుసేవ జేయుట సులభమైన పనికాదు. దేవుని పూజించుటలో గల సౌలభ్యము నిచ్చట గాంచజాలము. దైవపూజనే విధిన చేసినను దేవతా విగ్రహము మౌనముగానే యుండును. ఏదైనను లోపమైనను పట్టించుకొనెడివారుండరు. దేవునికి నివేదన చేసినప్పుడు "నాకిది వడ్డించు" మని యడిగెడి దేవుడుండునే. పలికెడి దేవుడే గురువు. పలుకని దేవుని పట్టికొని ప్రాకులాడుటలో నౌచిత్యముండునే.

తనను సేవించెడి వానిని గని గురువు మౌనమును వహించదు. సేవకుని లేదా సేవించెడి వాని సర్వతోముఖమే యభ్యున్నతి గురించి తపించెడి గురువు సంస్కరణాభిలాష గలిగియుండును. ఆదేశములను ప్రదానము చేయుచు తననాశ్రయించిన వానినిబోధికముగా సంస్కరించును. ఈ కారణముననే గుర్వాజ్ఞను పాలించెడివాడే శిష్యుడని చెప్పబడినది. ఆనతిని మీరి చరించెడి వాడు శిష్యుడు కాజాలడని గ్రహించవలెను. శివగీత, రేణుకగీత, భగవద్గీత యిత్యాదుల జూచిన యెడల గురువు యొక్క సంస్కరణభిలాష యొక్క స్వరూప స్వభావములను గుర్తించగలము. "శిష్యస్తే హంశాధి మాం తాం ప్రపన్నమ్" అనెడి భావముతో నాశ్రితుడు శ్రీగురుని సేవించుటను గాంచగలము.

శ్రీరేణుక భగవత్పాదులవారు శిష్యుని లక్షణముల నీ క్రింది విధముగా నుపదేశించిరి :

**భావో యస్య స్థిరో నిత్యం మనోవాక్కాయకర్మభిః ।**
**గురౌ నిజే గుణోదారే స శిష్య ఇతి గీయతే ॥** (సి.శి. 17-59)

ఎవ్వరి యొక్క భావము గుణోదారుడునుగా నుండెడి నిజగురువు యందున త్రికరణశుద్ధితో దృఢముగా నిలుచునో వాడు శిష్యుడనబడుననెడిది యుపదేశములోని భావము.

శిష్యుడైనవాడు జ్ఞానవైరాగ్యైశ్వర్య సంపన్నుడైన గురువు ఎడల భక్తిని పెంచికొని సేవించవలెను. శివ పూజాదులవలన తన దేహమును, గురుస్తుతి వలన జిహ్వను, నిరంతర గురురూపమును చింతన చేయుట చేత మనస్సును శ్రీగురువున కర్పించవలెను.

గుణోదారుడుగాని శ్రీగురువునెన్ని విధములుగా సేవించినను ప్రయోజనముండదు. అందుచేత, సాధకుడు వేషధారులను చూసి మోసపోకూడదు. బుద్ధి కుశలతలను జూపి నిజగురుని గుర్తించవలెను. ఈ విషయముననొక కథ కలదు.

జగన్మాత శ్రీరాముని పరీక్షించ నెంచి సీతారూపము దాల్చి రాముని ముందున నడవజొచ్చెనట. రాముడామెను గుర్తించి ప్రణమిల్లి "ఓ జగన్మాతా! నన్ను పరీక్షింపనెంచితివా? నీ దయవలన గల్గిన బుద్ధి చేత నైజము నెరిగితిని. ఎప్పుడైనను సీత నన్ననుసరించునేగాని నా కంటెను ముందున నడువదు. మీరు దీనినెరుగరని తలచుటలేదు. ఎరిగియూ యెరుగనట్టులున్నారనియును తెలుసు" నన్నాశీర్వదించి నన్ను ధన్యుని చేయుమమ్మా!" అని వేడికొని జగన్మాత నా విధిననే జేసి రామునికి సంతసమును గల్గించి యంతర్ధానమయ్యెను.

ఈ విషయమున యింకొక కథయును గలదు. ఒకడు సద్గురుని వేషమును వేసికొని చెరువు కడకు వెళ్ళెను. చాకలివాని రాయి మీద కూర్చొని స్నానము చేయజొచ్చెను. చాకలి వచ్చి అతనిని ప్రక్కకు వెడలి స్నానమును చేయుమనెను. వేషధారి వినలేదు. వాగ్వివాదముతో ప్రారంభించబడిన జగడము దెబ్బలాటకు దారితీసెను. బలముగల చాకలి వేషధారిని క్రిందబడవేసి గుండెలమీద యెక్కికూర్చుండి ముష్టిఘాతములను కురిపించెను. వేషధారి తన ఇష్టదైవమును రక్షింపుమనెను. అప్పుడా క్షణము ఆకాశవాణి "మీరిద్దరు కలహప్రియులే అయినందున మీలోన యెవ్వరిని రక్షించవలెనో తెలియుటలేద"నెను.

గురు వేషధారి సిగ్గుపడి పశ్చాత్తాపము నొందెను. ఈ విధముగా సంపాదించబడిన జ్ఞానము వలన తెలిసెడిదేమనగా గుణోదారుడైన గురుని సేవించినవాడు శిష్యుడనబడడు. మీరెల్లరీ విషయమును గుర్తింతురు గాక!

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువుల వారు శిష్యస్థలము యొక్క విశిష్టతను తెలియజేసిరి. లింగప్రసాది స్థలియైన పరకాయుని సేవించెడి శిష్యుడైనను పరశివస్వరూపుడై అంగ ప్రసాదికి పూజనీయుడగుననెడిదీ స్థలమున చెప్పబడిన మౌళికాంశము.

భావమున గురుని నిల్పికొని మోక్షాపేక్షని గల్గియుండి నిరంతరము పరకాయునిచే శిక్షింపబడెడి వాడే లింగ ప్రసాది స్థలములోని శిష్యస్థలి యగునని చెప్పబడినది. ఇట్టి శిష్యస్థలి యొక్క లక్షణములను వివరించెడి క్రింది పద్యమును గమనించుడి :

**క॥ గురుభావోద్భవ హృదయే**
**శ్వర ప్రసాద సంజాత ప్రసాద సంభ్రమామథన**
**స్ఫురితానంత సముద్భవ**
**పరవశమానస మహానుభావుడు భక్తిన్** (అనుభవసారము, 22)

కేవలము గురు భక్తి విశిష్టతవలననే శిష్యుడు మహానుభావుడై విరాజిల్లునని గ్రహించవలెను. శిష్యుని భక్తి భావము యొక్క స్వరూపమును తెలిపెడి యీ క్రింది పద్యమును గనుడి :

**ఉ॥ భావము నందుసద్గురుని పావన రూపము వెల్గుచుండగన్**
**దైవము వేరుగా నొకడు తథ్యముగానిటలేడటంచుసత్**
**సేవలు సల్పిశ్రీ గురుని చిన్మయు శుద్ధకటాక్షవీక్షణా**
**స్వాదిత కారణంబునన్ శిష్యుడు పొందడె ముక్తి పెన్నిధిన్** (మార్గం పెదవీరప్ప కవి)

*– శివం భూయాత్ –*

## ఆశీర్వచనము - 2 :

## శిష్య స్థలము :

సద్భక్తులింతవరకు శిష్యస్థలములో శిష్యుని లక్షణము గురించి తెలిసికొంటిరి. లింగస్థలములలో నొకటగు ప్రసాది స్థలము నందలి శిష్యస్థలము నందలి సాధకుడు త్రికరణశుద్ధితో గురుసేవను చేసిన యెడల శిష్యుడనిపించికొనునని తెలిసికొంటిరి. అట్టి శిష్యుని కుండవలసిన గుణగుణము లెట్టులుండవలెననెడి జిజ్ఞాస గల్గుట సహజమే. శ్రీభగవత్పాదులవారీ విషయమున క్రింది విధముగా సెలవిచ్చిరి.

**శాంతో దాంతస్తపశ్శీలః సత్యవాక్ సమదరనః ।**
**గురౌ శివే సమానస్థః స శిష్యాణామిహోత్తమనుః ॥** (సి.శి. 17-55)

యుపదేశములోని సారాంశమేమనగా శిష్యుడు శాంతుడు, దాంతుడు, తపశ్శీలుడు, సత్యవ్రతుడు, సమదర్శనమును చేయువాడు, గురువు- శివుడు సమానులనెడివాడు నుత్తమ శిష్యుడనిపించికొనును.

గురుశాసనమునకు బద్ధులై మోక్షాపేక్షగల్గి గురువును సేవించెడి వారెల్లరును శిష్యులే. వీరిలో కొందరు నుత్తమ శిష్యులనిపించికొని ఖ్యాతిని గడింతురు. ఇతరులు తమ శక్తిమేరకు గురువును సేవించి, తమ సేవకు తగిన ఫలితమును గడింతురు. శిష్యులుత్తములై తమకు, తమరి గురువునకును కీర్తి తేవలెనినన వారెట్టులుండువలెననెడిది విభిన్న విధములుగా తెలుపబడినది. వీటన్నింటిలోన శ్రీ భగవత్పాదులవారు సూచించిన గుణములు నుత్తములై యున్నవని గ్రహించగలరు. వీటినలవరచుకొనినవాడు నుత్తమ శిష్యుడై విరాజిల్లగలడు.

శమమనెడిది శాంతిని చేకూర్చెడి సాధనము. చంచలమైన మనస్సు వలన అశాంతి యుత్పన్నమగును. అశాంత మనస్కుని యాధ్యాత్మిక చింతన సరియైన విధిన నుండదు. సాధనలో శాంతికి నితోధికమైన ప్రాముఖ్యత గలదు. అంతరింద్రియములను నియంత్రణకు గురి చేయుటయే శమమని తెలిసికొనగలరు. ఇదంత సులభసాధ్యమైనది కాదు. గురుబోధవలన చిత్త చాంచల్యము నివారింపబడును. క్రమ క్రమముగా శాంతి లభించును. అయితే, శిష్యుడు తన మనస్సును నిలుకడగా నుంచవలెను. ఎంతమేరకు నిలుకడను సాధిస్తే, అంతమేరకు గురుబోధామృతము లభించగలదు. ఒక పాత్రను నొకడు చేతిలో పట్టికొని బిక్షను వేడుచున్న సందర్భమును నుదాహరణగా గైకొనవచ్చును. యాచకుని చెయ్యి విపరీతముగా కదలుచున్న యెడల దాతలు వేసెడి పదార్థములలోని యధిక భాగము నేలపాలగును. ఇదే విధిన మనస్సును నిలకడగా నుంచికొనలేని వాని గతి యుండునని గ్రహించగలరు. ప్రశాంత మనస్కుడు గురుబోధవలన గరిష్ఠమైన ఫలితమును పొందగలడని తెలిసికొనగలరు.

శాంతిని పొందదలచినవానికి శమమెంత మేరకు ముఖ్యమైనదో దమము కూడ అంతేమేరకు ముఖ్యమైనది. శమము అంతరింద్రియములను నిలుకడగా నుంచిన యెడల, దమము బహిరింద్రియముల చాంచల్యమును మాన్పును. దేహమనెడి దానినొక పాత్రతో పోల్చిన యెడల, అంతరంగాదులను నీళ్ళతో పోల్చవచ్చును. నీళ్ళతో నింపబడిన పాత్ర నిరంతరము చలించుచున్న యెడల నీరు నేలపాలగును. దేహమును స్థిరముగా నుంచికొనని యెడల అంతరంగములోని శాంతి యందర్థానమగును. యోగశాస్త్రమునందున నంతరంగమును సుస్థిరముగా నిలుపుటకై ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధులను ప్రతిపాదించినది. బహిరింద్రియములను స్థిరీకరించుటకొరకు యమ నియమాసనములను ప్రతిపాదించినది. అహింసా, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహములనెడి పంచయమములని తెలుపబడినది. శౌచము, సంతోషము, తపస్సు, స్వాధ్యాయము మరియు నీశ్వర ప్రణిధానములు పంచనియమములని చెప్పబడినది. పద్మాసన, సుఖాసనాదులు నాసనములుగా గుర్తింపబడినది. దేహమును స్థిరముగా నుంచికొనుటకు నాసనము లుపయుక్తములగును. యమ-నియమములవలన బహిరింద్రియములు విశుద్ధములైనవగును. యమనియమాసనాదుల నాచరించెడి వారికి చిత్తైకాగ్రత సిద్ధించునని తెలుపబడినది. చిత్తైకాగ్రత వలన సుస్థిరమైన శాంతి చేకూరును.

లింగాంగ సామరస్య సిద్ధియే వీరశైవము యొక్క లక్ష్యమైయున్నది. ఈ లక్ష్యసాధనలో శమ-దమములు సాధకునికెంతో మేరకు సహకారము నందించును. ఈ కారణముననే శ్రీరేణుకాచార్య భగవత్పాదులవారు శిష్యుడు శాంతి దాంతులు గలవాడై యుండవలెనని యుద్బోధించిరి.

శిష్యుడు తపశ్శీలత గల్గియుండవలెనని తెలుపబడినది. మౌలికముగా తపస్సనగా సహనశీలత. ఆకలి-దప్పులనెడి ద్వంద్వములను, ఆకార మౌనకాష్ఠ మౌనాదులను పాటించుట, తపస్సు అనవచ్చును. సాంకేతికముగా కృచ్ఛ్ర చంద్రాయణాది వ్రతములు తపస్సుగానే పరిగణింపబడుచున్నవి.

అయితే యివి యోగశాస్త్రమునందున ప్రతిపాదింపబడినవైనను, ఈ సందర్భమున తపశ్శీలత యనగా సహనశక్తిగల్గియుండుటయని గ్రహించవలెను. ఈ సహనశీలత గురుసేవకు సంబంధించినదని తెలిసికొనగలరు.

తపస్సు త్రివిధములనియును, కాయిక మానసిక, వాచికములే త్రివిధ తపస్సులని తెలుపబడినది. దేహము వలన గురుసేవలో తపించుటయే కాయిక తపస్సు, గురుస్తుతిలో జిహ్వను తపింపజేయుటే వాచిక తపస్సు గురుపాద యుగళమును హృదిన ధరించి దివారాత్రములు నా పాదారవిందములపై మానసికముగా భృంగమువలె వ్రాలియుండుటే మానసిక తపస్సు.

గురుసేవలో తపశ్శీలము గల్గియుండుట యెంతో కష్టముతో కూడికొనియుండును. చాలామందికిది దుర్భరమని దోచును. కాని దృఢమైన సంకల్పము గల్గినవాడు అభ్యాస బలముచేత నిద్దానిని సాధించవచ్చును.

“సత్యమేవ జయతే” అనెడిది జాతీయ ధ్యేయమైయున్నది. ప్రతి పౌరుడు సత్యమును పలుకవలెనని తెలుపబడినది. అయితే అసత్యము నలవాటుగా పలికెడివారి సంఖ్య పెరుగుచున్నది. ఈ ధోరణి నాపని యెడల మన సంస్కృతికి కళంక మేర్పడును.

శిష్యునికి సత్యవాక్ పరిపాలన యెంతో నవశ్యకమైనది. అసత్యము లాడెడివాడు గురుసేవను చేయుట కనర్హుడని గుర్తించగలరు.

సమదృష్టి లేనివారికి భేదభావము లుద్భవించును. తరతమ భేదముల వలన వ్యక్తులు నిబ్బందికి లోనై బాధపడుటను గాంచగలము. అత్త–మామ, అత్త–కోడలు, అన్న–తమ్ముడు మొదలగు వారిని సమభావముతో చూడలేని వారు నభిమానాహంకారాదులకు బలియై పలు కష్టములకు లోనగుటను మనము గాంచుచున్నాము. భేదభావము విసర్జనీయమని యెరుగవలెను. భేదభావమును వీడలేనివాడు నుత్తమ శిష్యుడుగా రూపొందజాలడు.

గురువుకు శివునికి నభేదమును పాటించెడి శిష్యుడే ధన్యజీవి. అతడు శివుడే గురువనియును, గురువే శివుడనియును భావించును. తద్విరుద్ధమైన భావము గలవాడు భవసాగరమును దాటలేడు. మీరందరు శ్రీభగవత్పాదులవారు ప్రతిపాదించిన గుణముల నలవరచికొని ధన్యులగుదురుగాక!

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీకాశీ పీఠాధిపతులు చంద్రశేఖర శివాచార్యులవారు లింగప్రసాది స్థలముననుండెడి శిష్యస్థలియొక్క లక్షణములను వివరించి చెప్పిరి.

సాక్షాత్ పరమేశ్వరుడేయైన పరకాయుడెవ్వరిని శిష్యునిగా గ్రహించినో యతడు సామాన్యుడు కాజాలడు. సకల సద్గుణ సంపన్నుడై యుండవలెను. శాంతమూర్తియై, సత్యవాక్ పరిపాలనా దక్షుడై, భేదభావ రాహిత్య సద్భావమునుండి సముత్పన్నమయ్యెడి సమతాభావ సంపన్నుడై శివలింగ గురులింగముల నొకటిగానే భావించెడి నమ్మకము గలవాడై యుండెడివాడే పరకాయుని యనుగ్రహమును పొంది యతని శిష్యునిగా కాగల్గును. ఇవన్నియును ధర్మాచారస్థలమున వివరింపబడిన గుణగణములే. సమతాభావన భావాగమ స్థలమున వివరింపబడినది. “సర్వం బ్రహ్మేతి” యనెడి భావముతో చరించెడివారికి సమతాభావము సహజముగానే అబ్బును.

గురు–శివాభేద భావమును గురించి చెప్పవలెనన్నచో “నేకమూర్తి త్రయో భేదః గురులింగత్తు జంగమః” అనెడి వాక్కుననుసరించెడి మనోవృత్తిగల వీరశైవులెవ్వరైనను గురు–శివులలో భేదమునరయరు.

తపస్సు గురించి తెలిసికొనవలసి యున్నది. కఠోరమైన నియమములకు లోనై కృచ్ఛ్రచాంద్రాయణాది వ్రతములను చేయుటయే తపస్సని యమరము చెప్పుచున్నది. అయితే యిది ప్రాకృతులు పాటించవలసిన ధర్మమేయని యనవచ్చును. తపస్సులోని కీలకమైన యంశమేమనగా దేహేంద్రియ కరణాదులను తపమునకు గురించేయుచు యిష్టదైవమును ప్రార్థించుటే. తపస్యే యిష్టార్థసిద్ధికై తపస్సు చేయును. ఇష్టార్థ సిద్ధిని ప్రదానము చేసెడి యిష్టలింగము ననునిత్యము మూడుమార్లు అర్చించి శివానుగ్రహమును ప్రసాదరూపమున గొనెడి వీరశైవునకు తపస్సు చేయవలసిన పనిలేదని తెలిసికొనగలరు. అయితే దేహేంద్రియకరణాదులను గురుసేవ కంకితము చేసి లింగాంగ సామరస్య సాధనకు కృషి చేయవలసిన పని కర్తవ్యమని గ్రహించగలరు. శిష్యుడిట్టి ఆచరణను చేయకుండిన యెడల నతడు పరకాయుని చేత నంగీకరింపబడునే?

*– శివం భూయాత్ –*

## ఆశీర్వచనము - 3 :

## శిష్య స్థలము :

శ్రీగురువు శాసనమునకు బద్ధుడైన ముముక్షువు గురువును త్రికరణశుద్ధితో సేవించుచున్న యెడల శిష్యుడనబడుననియును, శమ దమాది సద్గుణ సంపత్తిగల్గిన శిష్యుడు నుత్తమ శిష్యుడనియును శిష్యస్థలమునకు చెందిన క్రిందటి యాశీర్వచనముల వలన తెలిసికొంటిరి. ఉత్తమ శిష్యుడు గురువు శివుల మధ్యన భేదమును ప్రదర్శించుననియు తెలిసికొంటిరి. ఈ విషయమును నింకను స్పష్టము చేయుటకై శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారు శ్రీఅగస్త్య మహర్షికి క్రింది విధముగా నుపదేశమును ప్రదానము చేసిరి.

**గురుమేవ శివం పశ్యేచ్ఛివమేవ గురుం తథా ।**
**నైతయోరన్తరం కించిద్విజానీయాద్విచక్షణః ॥** (సి.శి. 17-56)

దీని భావమేమనగా విచక్షణగల శిష్యుడు గురువును శివునిగాను, శివుని గురువుగాను వీక్షించవలెను. వీరిరువురి మధ్యనంతరము లేదని భావించికొనవలెను.

మాయాశక్తి ప్రభావము వలన శివుడెవ్వరికిని, దృగ్గోచరుడు కాడు. అయితే గురువుగానున్న శివుడు మాయాపటలావృతుడు కాడు. అందుచేత, ప్రసన్న గురువే ప్రత్యక్ష దైవమని భావింపబడుచున్నాడు. అయితే గురువే దైవమనెడి భావనయునంత సులభముగా లభ్యము కాదు. గురువుమీద నెనలేని ప్రేమను పెంచికొనవలెను. మనము దేనిని అధికముగా ప్రేమించుదుమో అయ్యదియే దైవముగా దోచును.

లోభికి ధనము, భోగికి విషయ సుఖము వలన వచ్చెడి ఆనందము, సత్పుత్రునికి తల్లి-దండ్రులు, సతికి పతి దైవముగా దోచునుగదా. వీరందరు తాము పెంచికొనిన ప్రేమవలన యిట్టి భావమును పొందుచున్నారు.

గురువును త్రిమూర్తుల స్వరూపముగా భావించవలెనని చెప్పుచుందురు. గురువే పరబ్రహ్మయని తెలిపెడి గురుస్తుతులును గలవు.

శైవ సాంప్రదాయములో భవుడు, మృడుడు, మరియు హరుడు సృష్టి స్థితి లయలకు కారణభూతులని చెప్పబడినది. గురువు నీ ముప్వురి స్వరూపుడని గుర్తించవలెను. సమయోచిత సంస్కారమువలన సద్విచార స్రవంతిని సృష్టించెడి వాడైనందున గురువు సృష్టికర్తయగు భవునితో పోల్చబడినాడు. శిష్యుని శాసనమునకు గురిచేసి యతనివలన దురితములు చేయబడకుండగ చూసేవాడు గురువు. శిష్యుడు పాపకర్మి కాకుండగ గురువు తగు జాగ్రత్తలను తీసికొని తద్వారా పాలకపాత్రను పోషించును. అందుచేత పాలక స్థానములో నుండెడి మృడమూర్తితో గురుమూర్తి పోల్చబడుచున్నాడు. హరుడు సంహారకర్త. శిష్యుని మనస్సులోని దుర్భావములను రూపుమాపెడి గురువు హరుడని గ్రహించగలరు. లింగాంగ సామరస్యమును సాధించెడి దిశలో శిష్యుని నడిపించే గురువు పరబ్రహ్మగా నుతింపబడినాడు.

అజ్ఞానాంధకారమున నున్నవాడే సత్యమును గ్రహించెడి యవకాశము తక్కువగా నుండును. ఇట్టి మూఢులు శివుని రూపియైన గురువును సాధారణ మానవునిగా భావింతురు. శ్రీగురువు గారు ప్రసాదించిన యుపదేశమనెడి కాటుకను ధరించిన యుత్తమ శిష్యునికి గురుపాదములే యారాధ్యమూర్తులు. శ్రీ గురువులవారి దివ్యవాక్కులే మంత్రరాజములు. గురుకృపయే ముక్తిపథ సోపానములు. ఇట్టి భావనలు గల్గి సాధనచేసి ధన్యత బొందినవారి చరితములు చిరస్మరణీయములు. ఉరిలింగ పెద్ది యొక్క యుదంతమీ కోవకు చెందినది. ఇది యొక యదార్థగాథ.

నాందేడ్ జిల్లాలోని కంద్‌హార యనెడి యొక వూరిలోన ఉరిలింగ దేవర యనెడి వీరశైవాచార్యుండెను. ఇతడు దీనుల నుద్ధరించుటకొరకు దివారాత్రములు పరిశ్రమించుచుండెను. లింగదీక్షనిచ్చి తత్త్వోపదేశమును చేయుచుండెను.

ఒకనాటి రాత్రిపూట నురిలింగ దేవులవారి లింగదీక్షా ప్రదాన కార్యములో నిమగ్నుడై యుండెను. అప్పుడొక దొంగ యింటిలోనికి ప్రవేశించెను. దొంగతనము చేయుటకై వచ్చినవాడు, వచ్చిన పనిని మరచి దీక్షా సంస్కారమును గమనించజొచ్చెను. కార్యక్రమము నుదయము వరకు కొనసాగెను. దొంగయు తెలవారినంత వరకు కూర్చుండియే యుండెను. గురువుగా లింగమును ప్రదానమున చేయుచు"దీనిని మీరు నిరంతరము ధరించుడి. పూజించుడి. ఇది మీకు నిష్టార్థ సిద్ధిని గలుగజేయు"నని చెప్పిన యుపదేశమును వినిన దొంగ తను చేసెడి పనిని వదలి లింగము కట్టికొనవలెనని దలచెను. లింగమే యిష్టార్థసిద్ధిని కలుగజేసిన యెడల తాను దొంగతనమును చేయవలసిన పనిలేదని తలచెను.

దొంగ పేరు పెద్దియని వుండెను. అతడు గురువుకు తన పరిచయమును తెలిపి లింగదీక్ష నివ్వమని విజ్ఞప్తిని చేసెను.

శ్రీగురువతనికి దీక్షనిచ్చుటకై యిచ్ఛలేని వాడైయుండెను. “రేపు రమ్మ”నెను. అతడు గురువు చెప్పిన వేళకు వచ్చి నిలిచెను. గురువుగారతనికి లింగదీక్షనివ్వరైరి “నేడు రేపనుచు కాలము గడుపుచుండెను.

ఒకనాడు ఉరిలింగ దేవుల వారొక పొలములో విహరించుచుండెను. దాని నానుకొని యొక చిన్న నది ప్రవహించుచుండెను నదికి ఆవలిగట్టున నున్న పెద్ది, గురువును గాంచి, “స్వామీ దీక్ష?” అని వేడెను. ఈ వేడుకొనుటొక పెద్ద కూత రూపములో నుండెను. పెద్ద యరుపులను వినిన గురువు కోపోద్రిక్తుడయ్యెను. “ఘేదగడజా” అనుచు నొక రాయిని తీసికొని వానివైపు విసిరెను. పెద్దిని పారద్రోలుటే గురువుగారి యుద్దేశ్యమైయుండెను.

పెద్ది శ్రీగురువు విసిరిన రాయిని యెంతో జాగ్రత్తగా తన హస్తగతము చేసికొనెను. అద్దాని నతడు శ్రీ గురువుగారు తనకిచ్చిన లింగమని భావించికొనెను. దానిని దేహమున ధరించికొని యను నిత్యము నర్చనల నిచ్చుచుండెను. చూపరులతనికి పిచ్చెక్కినదని దలచిరి. “ఘే! దగడ జా” అనెడి దానిని మంత్రముగా గ్రహించియనుక్షణము నద్దానిని జపించ దొడగెను. పెద్ది యొక్క పొరుగుననున్న వారతనికి ముదిరినదని యూహించికొనిరి. కాలక్రమమున పెద్దికి సిద్ధి గల్గెను. సిద్ధ పురుషుడయ్యెను.

ఒక వత్సరము నా ప్రాంతమున యనావృష్టి గల్గెను. జనులు నీటికై యల్లాడుచుండిరి. ఆ వూరి నేలెడి రాజు చెరువును తవ్వించుట కుపక్రమించెను. గ్రామస్థులెల్లరు నా పనిలో నిమగ్నులైరి. త్రవ్వుచున్న వారికొక పెద్దబండ అడ్డముగా వచ్చెను. ఎంత ప్రయత్నించినా ఫలితము లేకుండెను. ఊరివారు నురిలింగ దేవర దగ్గరకు వచ్చి మార్గాంతరమును సూచించుడని వేడికొనిరి. ఉరిలింగయ్యగారు నూరకే యుండెను. అతనికేమియును దోచకుండెను.

ఈ వార్త పెద్దిని చేరెను. పెద్ది వెనువెంటనే బయలుదేరి వచ్చి శ్రీగురువుకు నమస్కరించి నిలిచెను. అతని మెడలో శ్రీగురువు విసిరిన రాయి వ్రేలాడుచుండెను. శ్రీగురువది గమనించెను. గ్రామస్థుల గోడును వినిన పెద్ది శ్రీగురువు పాదముల కడ సాష్టాంగముగా పడి “స్వామీ! శరణార్థి! తమ రనుమతినిచ్చిన యెడల మీ శిష్యుడు నా బండను కదిలించగల”డనెను. అక్కడి వారు ఫక్కున నవ్విరి. “ఇంత గొప్ప మహిమ గల యురిలింగ గురుదేవులవారికి సాధ్యము కానిది, యితడే విధిన చేయగల”దని గుసగుసలాడజొచ్చిరి. గురువు శిష్యుని శక్తిని పరీక్షింపనెంచినవాడై “అటులే కాని” మ్మని యానతినిచ్చెను.

పెద్ది, గురువుకు మరొకసారి సాష్టాంగపడి, ఆశీర్వాదమును బడసి చెరువు కడ కేగెను. ఊరివారందరతని ననుసరించిరి. బండకడకేగి, ఆ బండపై గురువు చేతనవైపునకు విసరబడినదియు, పెద్దిచేత లింగమని భావింపబడెడిదియు అగు రాతిని పెట్టెను. తాను, తాను కొంచెము దూరమునకు చని మంత్రముగా భావించిన గురువాక్కులను జపింపజొచ్చెను. మరుక్షణముననే పెద్దబండపై కెగిరి దూరమున పడెను. పెద్దిపెట్టిన రాయి పెద్దిని చేరెను. బండ వైదొలగిన ప్రదేశము నుండి అమృతధారవంటి నీటి వూట బయల్వెడలెను. అచిరకాలముననే చెరువు నిండిపోయెను. జనుల హర్షమునకు హద్దులు లేకుండెను. రాజుగారు వచ్చి పెద్ది పాదములపైబడి కృతజ్ఞతలను తెలిపికొనెను. ఉరులింగ దేవర గారు నమితముగా సంతసించిరి. శిష్యుని సానురాగముతో దగ్గరకు దీసికొని తన హర్షమును ప్రకటించెను. అతనికి తత్త్వోపదేశమును చేసెను. పెద్దియు నురిలింగ పెద్దిగా గొప్ప శివశరణుడై, వచనములనెన్నింటినో రచించెను. భక్తలోకము ధన్యతను బడసెను. పెద్దియొక్క కీర్తి దిగంతముల వరకు వ్యాప్తిని చెందెను.

ఉరులింగ పెద్దిగారి యుదంతము వలన తెలిసెడిదేమనగా దేవునికి గురువునకును, నభేదమును పాటించినవాడు గొప్పసాధకుడై కృతార్థసిద్ధిని బడసి లోకఖ్యాతికి పాత్రుడగును.

**శివాచారే శివధ్యానే శివజ్ఞానే చ నిర్మలే ।**
**గురోరాదేశమాత్రేణ పరాం నిష్ఠామవాప్నుయాత్ ॥** (సి.శి. 17-57)

పూర్వోక్తమైన విధిలో గుణములను గల్గిన శిష్యుడు శివాచార, శివధ్యాన, శివజ్ఞాన విషయముల యందున, గురువుగారి యాదేశమువలన, భక్తి, శ్రద్ధ, మరియు నిష్ఠల నలవరచుకొనుననెడిదే యుపదేశములోని సారాంశము.

లింగాంగ సామరస్య సిద్ధికై గురువు నాశ్రయించి శిష్యుడు నాచారవంతుడై శివధ్యానాసక్తుడై, శివజ్ఞాన నిధిగా రూపొందవలెను. శివాగమములు పంచాచారముల గురించి తెలుపుచున్నవి. అవి : లింగాచారము, సదాచారము, శివాచారము, గణాచారము మరియు భృత్యాచారము, మనస్సును

శివాధీనము చేయుటయే శివధ్యానము. శివ–జీవా భేద భావనను గుర్తించుటయే శివజ్ఞానము. పంచాచారములలో శివాచారమున కెంతో ప్రాముఖ్యత గలదు. శివాచారము వలన శివజ్ఞానమభివృద్ధిని గాంచునని తెలుపబడినది. చంద్ర జ్ఞానాగమము శివాచారమును గురించి యీ క్రింది విధిన తెలియజేయుచున్నది.

**శివ ఏవ పరంబ్రహ్మ పంచకృత్య పరాయణః ।**
**న తతోఽన్యాగతిరితి శివాచారోహి కీర్తితః ॥**

దీనిలోని భావ భావమేమనగా సృష్టి, స్థితి, లయ, తిరోధానానుగ్రహముల నాచరించెడి శివుడే పరబ్రహ్మ. శివభక్తుని కతనిని కొలుచుటయే మౌళిక కర్తవ్యమై యున్నది. శివాచార నిరతి గలవాడు శివధ్యానము నందు నిమగ్నుడు కావలెను. ఉపాసన పెరిగినకొని కొలది సాధకుడు శివజ్ఞాన సంపత్తిని పెంచికొనవలెను. ఇవన్నియును శ్రీగురువు వారి యాదేశమువలన మాత్రమే పొందవలెనని గుర్తించగలరు. అయితే శిష్యునికి గురూపదేశము యెడల విశ్వాసముండవలెను.

శిష్యుడెల్లప్పుడు శ్రీగురువులవారి కటాక్షము యొక్క మహత్తును గుర్తించి తన సాధనను కొనసాగించవలెను. ఈ విషయమున శ్రీ భగవత్పాదులవారీ క్రింది యుపదేశమునిచ్చిరి.

**బ్రహ్మాండ బుద్బుదోద్భూతం మాయాసింధుం మహత్తరం ।**
**గురోః కవలయత్యాశు కటాక్షవడవానలః ॥** (సి.శి. 17–63)

ఉపదేశములోని భావమేమనగా బ్రహ్మాండమనెడి బుడగనుండి యుద్భవించిన మాయయనెడి మహత్తరమైన సముద్రమును గురుకటాక్షమనెడి బడబానలము క్షణకాలముననే కబళించివేయును.

**గురోః కటాక్షవేధేన శివో భవతి మానవః ।**
**రసవేధాద్ యథా లోహోహేమతాం ప్రతిపద్యతే ॥** (సి.శి. 17–64)

రసవేధముచేత నినుము బంగారమైన యటుల గురుకటాక్షవేధ వలన మానవుడు మహాదేవుడగుచున్నాడనెడిదే యిందులోని భావము.

ఆధ్యాత్మిక దృక్పథము ప్రకారముగా చూసిన యెడల సంసారము దుర్గమమైనది. అందుచేత వేదాంతులిద్దానిని సంద్రముతో పోల్చిరి. అయితే సంద్రములో జనించెడి నీర్చిచ్చు సముద్రముల నెండింపజేయగలదని చెప్పబడినది. సంసారమనెడి మహాసముద్రమును నెండింపజేసి శిష్యుని యాధ్యాత్మిక మార్గమును సుగమము చేసెడి శక్తి గురుకరుణలో గలదని సర్వత్ర నంగీకరించనైనది.

కష్టములను దూరము చేయుటతో బాటుగా నభ్యున్నతిని సాధించెడి దిశలో పాత్రను పోషించెడి శ్రీగురువు వలన నుపదేశమును పొంది సాధన చేసెడి వాడు గురువుగారి కరుణా కటాక్షవిశేషము చేత మహాదేవుడగుచున్నాడు. రససిద్ధుని రసవిద్య ద్వారా రూపొందింపబడిన రసయోగ ప్రక్రియ వలన లోహము సువర్ణమగునని తెలుపబడినది. అదే విధిన శ్రీగురువు కరుణ వలన సామాన్య మానవుడు శివుడగుచున్నాడు. గురుకటాక్షములోని మహిమ యమోఘమైనదని గుర్తించవలెను. ఈ విషయము గురించి యొక కథ కలదు.

ఒక దొంగ దొంగతనమును చేయుటకై యొక్క దినమున, యర్ధరాత్రి సమయమున రాజమందిరము లోనికి ప్రవేశించెను.రాజోద్యోగులెల్లరును పరుండియుండిరి. రాజు మరియు రాణియు నిదురించకుండిరి. వారు వారి కుమార్తె వివాహ విషయమున మాటలాడుకొనుచుండిరి. వారిని గాంచిన దొంగ భయముతో వణికిపోయెను. కర్తవ్యము నెరుగని వాడై గమకమును కోల్పోయి యొక ప్రదేశమున మూలకు నొదిగి కూర్చుండి రాణి–రాజుల భాషణను వినుచుండెను. రాజుగారా సమయముతో నిట్టులనియె. “రాణీ! మన కూతురు వరప్రభావము వలన పుట్టినదనేది నీకు తెలిసిన విషయమే. సాత్విక స్వభావము గల్గిన యీమె బాల్యము నుండియును నాధ్యాత్మిక చింతన గల్గియున్నది. ఈమెకు రాజకుమారుని వరించవలెనెడి కోరికలేదు. అందుచేత నామెనొక యుత్తమమైన యోగికిచ్చి పెళ్ళి చేయుటయే కర్తవ్యమైయున్నది”.

రాణి రాజునుద్దేశించి “ప్రభూ! మన కుమార్తెకు తగిన యోగి యెట్టులుండవలెను? అతడెచ్చట నివసించి యున్నాడు” అని అడిగెను. అప్పుడా రాజు “మన రాజ్యములోనొక యోగీశ్వరుడున్నాడు. అతని ఆశ్రమములో ననేకులతని శిష్యులుగా నున్నారు. గురువుగారి యనుమతి మేరకు, వారిలో నొకరిని యెంపిక చేసికొనినచో కార్యము నెరవేరగల”దనెను.

వివాహమైన పిదప రాజ్యభారము నల్లుని కప్పగించి తాను యోగీశ్వరుని సేవించుచు కాలము గడిపెదనని రాజు, రాణికి మనోగతమైన వాంఛను తెలియజేసెను. రాణియు నా విధినే గురువును సేవింతునని తెలియజేసెను.

చాటుననుండి మాటలను వినిన చోరుని కొక ఆలోచన తట్టెను. దొంగతనమును చేయుచు నిందనీయమైన బ్రతుకును బ్రతుకుట కంటె రాజై రాజ్యమేలుచు రాజభోగముల ననుభవించుటే లెస్సైన పనియని నిర్ణయించికొనెను. రాజుగారి కూతురు నెట్టులైనను వివాహమాడవలెననెడి వాంఛ బలపడెను. ఇంతలోనే రాజు రాణి నుద్దేశించి "సరే, రేపు ప్రొద్దుననే వెడలి యోగిపుంగవుని సహాయమును కోరుదుము గావుత" అని అనెను.

ఆలస్యము చేసినచో నవకాశము నదృశ్యమగునని యెంచిన చోరుడు, చౌర్యమును చేసెడి సంకల్పమునుప సంహరించికొని, రాజసౌధమును వీడి, యోగీశ్వరుని ఆశ్రమమును నప్పటికప్పుడే చేరుటకు బయలుదేరెను. ఆశ్రమమును చేరిన పిదప నొక ప్రదేశము నెంపిక చేసికొని, యితర శిష్యుల కుటీరమును పోలెడి కుటీరమును నిర్మించికొని యందులో పరుండెను. అతనికి నిద్దుర పట్టకుండెను. రాజెప్పుడు వచ్చునో యని యెదురుతెన్నులు చూచుచుండెను. తాన వరుడై, రాజకుమార్తెను పరిణయమాడి రాజభోగములలో తేలియాడుచున్నట్లుగా భావించికొని తనదైనట్టి యూహా జగత్తులోన విహరింపజొచ్చెను. ఈ విధముగా సూర్యోదయము వరకు కాలమును గడిపెను. తెల్లవారగనే కాలకృత్యాదులను తీర్చికొని విహితమగు వేషధారణ గల్గినవాడై యితర శిష్యులవలె తాను సుఖాసనమున కూర్చుండి ధ్యానమును చేయుట కొఱకు పూనుకొనెను. వంచకుడైనట్టి వీనికి ధ్యానమును చేయుట సాధ్యమగునే? ఇతర శిష్యులు శివధ్యానములో మైమరచియుండగా నీ వేషధారి తన నటనా కౌశలమునకు మెరుగులు దిద్దికొనుచుండెను. రావలసిన ఘడియ రానే వచ్చెను. రాజు, రాణి, రాజకుమార్తె యోగి రాజేంద్రుని దర్శనమును కోరి విచ్చేసిరి. నేరుగా వెడలి గురువు గారి కుటీరమును చేరి, ప్రవేశించుట కనుమతిని కోరిరి. రాజకుటుంబమునకు నుచితమౌ ఆహ్వాన సత్కారాదులు చేయబడెను. రాజు, అతని కుటుంబ సభ్యులు గురువుగారి పాదముల కెరగి యాశీర్వచనములను గ్రహించిరి. తదుపరి రాజును కరుణాదృష్టితో వీక్షించుచు శ్రీగురువు కుశలము నడిగెను. వచ్చిన పని గురించి నివేదించమని కోరెను. రాజు వినమ్ర భావ విశిష్టుడై తన మనోగత వాంఛను వెలిబుచ్చెను. యోగి వల్లభుడు భూవల్లభుని కోరికను విని "యియ్యది నెరవేరుట కష్ట"మని అనెను. ఇచ్చటనున్న వారందరును జ్ఞాన వైరాగ్య సంపన్నులైన ముముక్షు భావాన్వితులు. రాజవైభోగము గురించి వీరికంత ఆసక్తి యుండెడి యవకాశము శూన్యము. స్వర్గోపభోగములైనను వీరికి నలక్ష్యములే. అయినా, మిమ్ములను నిరుత్సాహమునకు గురిచేయుటలో నౌచిత్యము లేదు. మీ ప్రయత్నమును మీరు చేయుడు. శిష్యులు కుటీరములలో నున్నారు. శివధ్యానములో మునిగియున్నారు. వారిని సందర్శించి మీ కోరికను నివేదించుడి. ఎవ్వరైనా అంగీకరించిన యెడల నా ఆశీర్వచనములు మీకివ్వబడు"ననెను. రాజుగారు శ్రీగురువుగారు చెప్పినట్టుల చేసెను. కాని కృతార్థసిద్ధిని పొందలేదు. ఎవ్వరైనవ రాజకుమారిని పరిణయమాడుటకు సంసిద్ధతను ప్రకటించలేదు. విసిగిపోయిన వసుధేశ్వరుడు నిరాశా నిస్పృహలకు లోనయ్యెను. చివరి ప్రయత్నముగా బూటకపు యోగిని కలిసెను. వాడు మోసగాడని తెలియని రాజు వాని సన్నిధిన చేరెను. వాడు తాను యోగములో నుండియున్నట్లు నటించుచుండెను. రాజుగారి రాకను గమనించనట్టు కళ్ళు మూసికొని కూర్చొనియుండెను. రాజుగారు మౌనముగా నిలిచియుండెను. ఎంతోసేపటికి యతడు కళ్ళను తెరిచి కార్యమేమిటని ప్రశ్నించెను. రాజుగారు విషయమును నివేదించెను. మొదటగా కాదని, పిదప బ్రతిమిలాడించికొని వల్లెయనెను. రాజుగారు సంతోషించిరి. పరుగు పరుగున వెడలి గురువుగారికి విషయమును నివేదించెను. గురువుగారి కాశ్చర్యమయ్యెను. కుటీరము యొక్క వివరములనడిగెను. వీడెవ్వడో తెలియుటలేదని మనమున దలచి, అతనిని రప్పించుటకొరకు నాదేశముల నిచ్చెను. గురువులవారి యాదేశము గురించి యెరిగిన కపట శిష్యుడు దిక్కుతోచని స్థితిలో పడెను. తన కాపట్యము బహిర్గతమయ్యెడి స్థితి వచ్చినదేమోయని వ్యధచెందజొచ్చెను. ప్రత్యామ్నాయములేని వాడై మొండిధైర్యముతో ముందుకు నడిచెను. గురువు సన్నిధినిచేసి సాష్టాంగ దండప్రణామముల నాచరించి ముకుళిత హస్తుడై నిలిచియుండెను. అతడు తదేక దీక్షతో శ్రీ గురువుల వారి సాత్త్విక తేజమును వీక్షింపజొచ్చెను. ఇట్టి వీక్షణలో నతడు ననూహ్యమైన యనుభావమును ననుభవించెను. ఈ అనుభవమతనిలోని దుర్గుణములను రూపుమాపెను. కల్మషములేని కలువవంటి యంతరంగము గల వాడయ్యెను.

శ్రీగురువుగారు తమరి నూతన శిష్యుని తన సమీపమునకు రప్పించికొనెను. తన ముందున కూర్చుండబెట్టికొని తలమీద తన కరము నుంచి దయాపూర్ణ దృష్టితో వీక్షించెను. ఆ పిదప "బిడ్డా! రాజుగారి కుమార్తె పాణిగ్రహణమును చేయుటకై సంసిద్ధుడవై యున్నావా?" అని అడిగెను.

"ఓ గురుదేవా! ఏమి వైపరీత్యము. మీ శిష్యుడా విధిన చేయునే? రాజు నెరుగ. రాజ్యము నెరుగ. రాజకుమారి గురించియును నేనెరుగను. నాకెట్టి కోరికలును లేవు. మీ పాదముల కడ పడి యుండి మీ పాద పద్మములను సేవించెడి మహద్భాగ్యమును నేను వదులుకొనలేను" అని శిష్యుడు విన్నవించుకొనెను.

శ్రీగురువు శిష్యుని కనుమతినిచ్చి సాధన చేసికొమ్మని చెప్పి పంపెను. రాజుగారికిని, రాకుమార్తెకును సముచితమైన సలహాను ప్రదానము చేసెను. ఉత్తమ గుణములు గల రాకుమారుని కిచ్చి వివాహము చేయుమని రాజుగారి కానతినిచ్చెను. రాజు, గురువుగారి నుండి సెలవును తీసికొని తన యంతఃపురమునకు వెడలిన వాడయ్యెను.

ఈ కథ వలన తెలిసెడిదేమనగా శిష్యునికి కావలసినది గురుకటాక్షము మాత్రమే. గురు కటాక్షమహిమ చేత శివత్వమును పొందుటకై యత్నించుటయే శిష్యుని కర్తవ్యమని గుర్తించగలరు.

గురువుగారి మహత్తునెరిగిన శిష్యుడు శ్రీ గురువులవారి యాజ్ఞనుల్లంఘించవలదని తెలుపబడినది గమనించుడి.

**న లంఘయేద్ గురోరాజ్ఞాః జ్ఞానమేవ ప్రకాశయన్ ।**
**శివాసక్తేన మనసా సర్వసిద్ధిమవాప్నుయాత్ ॥** (సి.శి. 17-58)

ఉపదేశములోని సారాంశమేమనగా నుత్తమ శిష్యుడు గురువుగారి యాజ్ఞను నుల్లంఘించకూడదు. శివజ్ఞానము ప్రకాశించుచుండగా మిక్కుటమైన యాసక్తితో శివధ్యానమును చేయుచు సిద్ధులన్నింటిని పొందవలెను.

గురూపదేశములో నిక్షిప్తమైయుండెడి రహస్యమెట్టిదో సూచింపబడినది. గమనించుడి :

**శివాదన్య జగన్మిథ్యా శివః సంవిత్స్వరూపకః ।**
**శివస్త్వమితి నిర్దిష్టో గురుణా ముక్తఏవ సః ॥** (సి.శి. 17-66)

"శివేతరమైనదే జగత్తు" అనెడి భావము మిథ్య అనియును, జగత్తు శివ స్వరూపమైయున్న దనెడిది సత్యమనియును, శివుని సంవిత్స్వరూపము వలన నీవును శివుడివే యని శ్రీగురువుచేత నుపదేశింపబడిన శిష్యుడు ముక్తుడగుననెడిదే తాత్పర్యము.

శ్రీగురువు వలన శిష్యునికి సుఖ-శాంతులతోబాటుగా జీవన్ముక్తి లభించునని తెలియజేయుచు శ్రీరేణుకాచార్య భగవత్పాదులవారు శిష్యస్థలమునకు ముగింపు బలికిరి. గమనించుడి :

**గురోర్లబ్ధ్వా మహాజ్ఞానం సంసారామయ భేషజమ్ ।**
**మోదతే యః సుఖీ శాంతః స జీవన్ముక్త ఏవ హి ॥** (సి.శి. 17-59)

శిష్యుడు శ్రీ గురువు వలన సంసారమనెడి రోగమును నిర్మూలము చేయగల శివజ్ఞానమనెడి దివ్యౌషధమును పొంది శివానందములో నోలలాడుచు, రాగద్వేషరహితమౌ సుస్థిరమైన శాంతిననుభవించుచు జీవన్ముక్తుడగుననెడిదే యుపదేశాంతర్గతమగు సారాంశము.

సద్గురువు యొక్క ఆజ్ఞకు బద్ధుడై, శ్రీ గురువు సేవలో ధన్యుడై, సాధన జేసెడి శిష్యునికి సకల కళ్యాణములు చేకూరును. అందుచేత సంసారభ్రాంతిని వీడి, శివైక్యాసక్తిని పెంపొందించుకొని, సద్గురువుగారి ఆజ్ఞకనుగుణముగా ప్రవర్తించి శిష్యుడు గురుకారుణ్యమునకు పాత్రుడు కావలెను.

సకల సిద్ధులలోన ముక్తియే సర్వోత్కృష్టమైనది. శిష్యుడద్దానినే వాంఛించవలెను. దుస్సాధ్యమై యుండెడి ముక్తి గురు కరుణవలన సుసాధ్యమగును. శ్రీ గురువు యొక్క కరుణ గురూపదేశము రూపమున నుండును. జగము శివ స్వరూపమనియు, సాధకుడును శివుడే యనియును గురూపదేశమున చెప్పబడును. అద్దాని నాలించి, శ్రీ గురువు పాదముల నాశ్రయించి సాధన చేసెడి శిష్యుడచిరకాలములోనే జీవన్ముక్తిని పొందగలడు. మీరెల్లరు శ్రీగురువుల వారి పృథుకరుణకు పాత్రులై మీ మీ జీవితములను సుసంపన్నము చేసికొనెదరు గావుత!

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జ్ఞాన సింహాసనాధీశ్వరులు శిష్యస్థలి పొందెడి భాగ్యములలో శివజ్ఞానము ముఖ్యమైనదని తెలిపిరి. శివాచార విభవము, శివభావ సమాగమన సౌభాగ్యములు శిష్యునికి లభించుననియు తద్వార అతడు జీవన్ముక్తుడగుననియును తెలుపబడినది.

శిష్యస్థలములోని సాధకునికి లభించెడి ఫలత్రయము గురించి యిచ్చట వివరింపబడినది. ఆదేశము, అవలోకనము మరియు ఉపదేశములే శిష్య స్థలములోని సాధకుడు పొందెడి అమూల్యమైన ఫలములు.

ఆదేశముచేత శిష్యునకు శివాచార, శివజ్ఞాన శివభావముల యెడల భక్తి సమన్వితమైన నిష్ఠ, జ్ఞాన విశిష్టమై శ్రద్ధ గలుగునని తెలియుచున్నది. సాధారణముగా నివి శివసంకల్పము వలన కల్గుచున్నవి. శక్తి పాతమును పొంది యెంతో శ్రమించిన గాని శివాచారాదులు లభించవు. అయితే శిష్యస్థలికివి గురుని యానతి వలననే గల్గుచున్నవి.

అయితే పై త్రివిధ సంపత్తి గల్గినంత మాత్రాన సిద్ధి లభ్యమగుననుటకు సాధ్యము కాకపోవచ్చును. ఈ విషయమును వివరించెడి శ్రీ బసవేశ్వరులవారి క్రింది వచనము గనుడి :

**ముత్తునీరలి హుట్టి మత్తె నీరప్పుదె?**
**గురు కారుణ్యవ పడెద భక్తను**
**హిందణ పూర్వాశ్రయవ బెరసిదడె**
**గురుద్రోహ, లింగద్రోహ జంగమ ద్రోహ**
**ఆచార ద్రోహ ప్రసాద ద్రోహ**
**ఇంతీ పంచమహాపాతకంగళు**
**భక్తంగల్లదె భవిగెల్లియదొ?**
**గురువిదు, లింగవిదు, జంగమవిదు**
**ఆచారవిదు ప్రసాదవిదెందరియదిద్దడె**
**కుంభిపాతక నాయకనరక**
**కూడల సంగమదేవా!** (వ.సం. 767)

దీని తెలుగు రూపమిది :

*ముత్యము నీరున పుట్టి మరల నీరగునే?*
*గురుకారుణ్యము బడసిన భక్తుడు*
*వెనుకటి పూర్వాశ్రయమున గలసినచో*
*గురుద్రోహము లింగద్రోహము జంగమద్రోహము*
*ఆచార ద్రోహము ప్రసాద ద్రోహము*
*ఇటుల నీ పంచమహాపాతకములు*
*భక్తునికేగాని భవికెక్కడిదో?*
*గురువితడు లింగమిది జంగమమితడు*
*ఆచారమిది ప్రసాదమిదియని యెరుగనిచో*
*కుంభీపాతక నాయక నరకము – కూడల సంగమ దేవా!*

ఈ వచనము యొక్క నేపథ్యమున యెరుగవలసినదేమనగా శిష్యస్థలికి గురుని యానతిని నుల్లంఘించవలదని తెలియజెప్పెడి యవశ్యకత గలదు. ఈ కారణము నేపథ్యమున "న లంఘయేద్ గురోరాజ్ఞాం" అనెడి ఆచార్యాదేశము (సి.శి. 17:6) గమనించినచో విషయము సుస్పష్టమగును.

గురుని యాజ్ఞ యనుల్లంఘనీయమనెడి దొక ఆగమ నియమమని తెలిసికొనుడి. గురువాజ్ఞను నుల్లంఘించవలదని తెలిపెడి యీ పద్యము గమనార్హమైనదై యున్నది.

**గురుమంత్రాధః కృతియును**
**గురునాజ్ఞోల్లంఘనంబు గురువిముఖతయున్**
**గురురంధ్రాన్వేషణమును**
**గురుపాతక మంద్రుబుధులు గురుభక్తినిధీ!** (అనుభవసారము 45)

ఇట్టి స్థితినుండి శిష్యస్థలములోని సాధకుని రక్షించెడిదే "గురోరవలోకన" మనెడిది. మహాసముద్ర సదృశమైన మాయవలననే శిష్యుడు బాధకు గురియగుచున్నాడు. అందులో మునిగితేలుచున్నాడు. తల్లిప్రేమ, పడతి వలపు, పిల్లల యనురాగము మొదలగునవి మాయచేత కల్పింపబడి సాధకుని సంసార సముద్రమును దాటనివ్వకుండ నిరోధించును. మన్నుపొన్నులను జూపి మాయ సాధకుని సమత్వ దృష్టిని ధ్వంసము చేయుచున్నది. రాగ-ద్వేషముల గల్గించును. ఇవియు కర్మబంధములే. మాయచేత పోషింపబడెడివే. గురోరవలోకనము బడబానలమువలె శక్తివంతమైనది. మాయయనెడి సముద్రమును సమూలముగా నెండించెడిది. సాధకుని మాయాప్రభావము వలన రక్షించెడిది. గురోరవలోకనము యొక్క దాహకశక్తిని ప్రదర్శించెడి యీ క్రింది పద్యము గమనించదగినది.

**క. దుర్మల దుష్టపురాకృత**
**కర్మేంధన నిచయ దాహకౌశలనిచితం**
**తర్మహిత జ్ఞానానలు**
**నిర్మల గురుమూర్తి గొలుతు నిరపమ భక్తిన్** (అనుభవసారము, పద్యము 40)

గురుద్రోహ, లింగద్రోహ, జంగమద్రోహ, ఆచారద్రోహ ప్రసాద ద్రోహములనెడి పంచమహాపాపములు చేసి కుంభీపాత నాయక నరకమునకు గురికాకుండగ నుండే విధముగా గురోరవలోకనము శిష్యునికి రక్షణను ప్రదానము చేయుననెడిదే గ్రహించవలసిన విషయము.

శిష్యస్థలములో నుండెడి సాధకుడు పొందెడి మహాద్భాగ్యములలో గురూపదేశము నొకటని గ్రహించగలరు.

భవరోగమును నిర్మూలించెడి విషయములో "మంత్రవైద్యము" (బసవేశ్వర వచనము 653)గా పనిచేసి శిష్యునికి రక్షణనిచ్చి యతనిని శివునిగా నెదిగెడి విధముగా తీర్చిదిద్దెడి సామర్థ్యము గురూపదేశమునకు గలదనెడిది వీరశైవ విదుల నిశ్చితాభిప్రాయమని యెరుగవలెను.

గురూపదేశము వలన "శివాదన్య జగన్మిథ్యా" యని యెరిగిన శిష్యస్థలి జగన్మిథ్యావాదము నంగీకరించెడి యద్వైతివలె వర్తించదు. జగత్తు సత్యమైనదనియును, నిత్యుడైన శివునికి జగత్తుకునభేదము గలదని గుర్తించి తిరుగాడును. సర్వత్ర శివదర్శనమనెడి మహానుభవమును పొందును. జగత్తును ద్వేషించెడి లోక కంటకుని కంటెను భిన్నముగా ప్రవర్తించును. శివ-జీవ, శివ-జగత్తులనెడి వాటి మధ్య గల భేదము కల్పితమని యెంచి రాగ-ద్వేషముల కతీతుడగును. శివుడు నిరాకార నిరంజనుడైనట్టి చిత్ స్వరూపమని తెలిపెడి గురూపదేశము వలన కరణార్పిత స్థలి యగును. తత్ఫలితముగా కర్మ ఫలమునుండి యలిప్తతతను పొంది, దగ్ధజన్మ బీజుడై కాయవికారములను జయించిన కాయచిత్తగుచున్నాడు. "శివఃత్వమ్" అనెడి శివధర్మమునకు చెందిన మహావాక్యము నుపదిష్టమైనవాడై లింగాంగ సామరస్యోన్ముఖత బొంది సాధన చేసి సమరస భక్తివలన శివజీవ సామరస్యమును సాధించును. సదాశివాది తత్త్వముల కతీతముగా నుండెడి పరశివ తత్త్వము లీనుడై శివుడగుచున్నాడు. గురూపదేశవేధేన శివోభవతి మానః యనెడి ఆచార్యోక్తిని మరువరాదు. రసవేధ యోగమున లోహము సువర్ణముగా మారిపోవు విధముననే గురోరవలోకన, గురోరాదేశ, గురూపదేశము లనెడి వాటివలన జీవుడు శివుడగుననెడిదే గ్రహించవలసిన విషయమని శిష్యస్థలమునందున భగవత్పాదుల వారిచ్చినట్టి యుపదేశము వలన తెలియుచున్నది.

*- శివం భూయత్ -*

## ఆశీర్వచనము - 1 :

## శుశ్రూషు(వు) స్థలము :

జిజ్ఞాసువులై సద్భక్తులింతవరకు శిష్యస్థలము గురించి, కూలంకషముగా నెరింగితిరి. లింగస్థలములలోని ప్రసాది స్థలాంతర్గతమౌ శిష్యస్థలమున సాధన పరిపూర్ణమైన సాధకుడు, శుశ్రూషువు స్థలమున ప్రవేశించును. ఇద్దాని గురించి యీ ఆశీర్వచనమున తెలిసికొందుముగావుత.

శుశ్రూషు వనెడి పదమునకు వినెడివాడు అనెడి అర్థము గలదు. ఇచ్చట నమితాసక్తితో శ్రీ గురువులవారి యుపదేశమును వినెడి శిష్యుడే శుశ్రూషువనబడునని గుర్తించగలరు. ఈ విషయమున శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారు శ్రీ అగస్త్యమునికీ క్రింది విధిన యుపదేశమునిచ్చెను.

**బోధ్యమానః స గురుణా పరకాయేన సర్వదా ।**
**తచ్ఛుశ్రూషారతః శిష్యః శుశ్రూషురితి కీర్త్యతే ॥**
(సి.శి. 17-68)

ఇద్దాని తాత్పర్యమేమనగా పరకాయుడైన గురుదేవుని చేత బోధింపదగిన శిష్యుడు నొకవేళ శ్రీగురువు గారి యుపదేశమును వినుటయందున నవధానమును, ఆసక్తిని, ఇచ్ఛను, కనబరచిన యెడల నతడు శుశ్రూషువని పిలువబడును.

ఆత్మోన్నతి శ్రవణము వలన సిద్ధించును. స్వస్వరూప విజ్ఞాన విహీనుడైన జీవుడు గురూపదేశమును విని, ఆత్మజ్ఞాన ప్రాప్తిని పొంది, ముక్తిని సాధించుచున్నాడు. అందుకే, ఆత్మజ్ఞాన సముపార్జన కొరకు శ్రవణమే ముఖ్యమైనదని యెంచబడినది. "ఆత్మావాఅరే దృష్టవ్యః శ్రోతవ్యః మంతవ్యః నిదిధ్యాసితవ్యః" అనెడి యుపనిషద్వాణి యీ విషయమును సమర్థించుచున్నది. శ్రోత్రం శ్రోతేనైవన కుండలేన" అని యొక సుభాషితకారుడు నుడివి యుండెను. చెవికి బంగారు ఆభరణములు ధరించికొని అలంకరించికొనుట కంటెను వినుటయనెడి యాభూషణముతో నద్దానిని యలంకరించి కొనుటలోన నౌచిత్యము కలదు. బంగారు ఆభరణము లశాశ్వతమైనవి. ద్రవ్యము యొక్క లేమి యుండినప్పుడు బంగారపు కుండలము కంసాలి కొట్టుకో లేదా సంతలోని యంగడికి చేరును. కష్టపడి దానిని జాగ్రత్తగా కాపాడికొనెను, వ్యక్తి మరణానంతరమది బంధువుల పాలగును. అందుచేత శ్రవణమున కధికమైన ప్రాముఖ్యత నివ్వవలెనని సూచింపబడినది. శ్రవణ భక్తినాచరించచుండవలెను. సద్గ్రంథముల నితరులు చదువుచుండగా వినుటయును, పెద్దలు ప్రదానము చేసే ప్రవచనాదులను వినుటయును గురూపదేశము నాలించుటయును శ్రవణ భక్తిని సలుపుటలో సాధనములై సాధకునకుపకరించునని గుర్తించగలరు. జీవితము సార్థకమగును. వినెడి దెప్పటికైనను మనకు నుపకరించగలదు. చచ్చిన పిదప నిది మనను వెన్నంటి యుండగలదు.

నేటి వైజ్ఞానిక జగత్తులో దృశ్య శ్రవణములను సుసాధ్యము చేసెడి సాధనములెన్నియో లభ్యమగుచున్నవి. మారుమూల గ్రామములోని యొక మారుమూల స్థలమునగల యింటిలోని మారుమూల గదిలో కూర్చుండియుండి విశ్వములోని పలు ప్రాంతములలో సంభవించెడి వింతలను, విశేషాలను సులభముగా తెలిసికొనవచ్చును. విని, చూచి వింతైన యనుభూతిని పొందవచ్చును. కాని యిట్టి వినికిడి దుఃఖప్రదమైనదగునని గుర్తించగలరు. ఆత్మజ్ఞానమును వినుటవలననే నిజమైన సుఖము లభించునని తెలిసికొనగలరు. సాధారణ జ్ఞానము సంసార బంధములను పెంచెడి గుణము గల్గినదై యుండును. అది ఆత్మదర్శనమును సాధించి పెట్టజాలదు. తన్నిమిత్తమై శ్రీగురువు నాశ్రయించి, శ్రవణేంద్రియమును గురూపదేశ శ్రవణార్థమై యంకితము చేయవలెను. గురువాక్యములను జాగ్రత్తగా వినుటయే శిష్యుని కర్తవ్యమని యెంచవలెను. "మంత్రమూలం గురోర్వాక్య"మని చెప్పబడినది. ఈ సత్యమును విస్మరణకు గురిచేయుట మూర్ఖత్వమే యగును. వినిన దానిని యెప్పటికప్పుడు మననము చేసికొనుట ద్వారా జ్ఞాపకములోనుంచికొనవలెను. ఒక చెవి చేత విని మరొక చెవివలన విడిచెడి ధోరణి మంచిది కాదని గుర్తించగలరు. ఈ విధిన మరచెడి వారాధిక్యతలో నుండినా శుశ్రూషువు వారి ననుసరించవలదు.

ఒక రాజ దర్బారు నందున నొక మూర్తి కారుడు మూడు నిత్తడి మూర్తులను తీసికొనివచ్చెను. మూడును నొకే విధముగా కన్పట్టుచుండెను. మూర్తి కారుడు వాటిని రాజు సన్నిధిన యుంచి "ఓ రాజా! యీ మూర్తులొకే విధిన కన్పట్టినను, వీటిలో నొకదాని కింకొకటి పోలిలేదు. మీ యాస్థానములో విద్వాంసుల వలన వెలను నిర్ణయింపన్ జేయుడి. తగిన మూల్యమున చెల్లించి, మూర్తులను గైకొని, నన్ను ధన్యుని చేయుడి"

అని వినతిని చేసెను. రాజుగారు దర్బారులోని విద్వాంసుల కాదేశములనిచ్చి మూల్య నిర్ణయమును చేయుడనెను. అదివారి శక్తికి మించిన పనియై యుండెను. వారు తమరి యవశ్యకత గురించి విన్నవించికొనిరి. రాజుగారి కేమి చేయవలెనో తెలియకుండెను. ఇంతలోనే యొకడు రాజు నుద్దేశించి "రాజా! యేలినవారు నాకొక మూడు దినముల గడువునిచ్చిన యెడల మీ ఆజ్ఞను నే నమలు చేయగల"ననెను. రాజుగారతని యభ్యర్థన నంగీకరించెను. మూర్తికారునికి వసతి సౌకర్యములు కల్పింపుడని, రాజోద్యోగులకు నానతి నిచ్చెను. తదనుగుణముగనే యేర్పాట్లు చేయబడెను.

మూర్తుల మూల్యకరణ గురించిన విషయమున సభికులు నెంతయో కుతూహలమును ప్రదర్శించిరి. వారీ విషయమున తమలో తాము చర్చించికొనుచుండిరి. రాజధాని నగరములో నెక్కడ చూసినా అక్కడ నీ విషయమును చర్చించెడివారు కనబడుచుండిరి. ఈ విధముగా గడువుకాలమున ప్రజలు తమరి యాసక్తిని ప్రదర్శించిరి. రాజుగారిచ్చిన గడువు కాలము ముగిసిన పిదప నా విద్వాంసుడు సభలోనికి ప్రవేశించెను. రాజుగారు నాతృతతో గమనించుచుండెను. సభలో జనులు క్రిక్కిరిసియుండిరి. అందరి దృష్టి మూర్తులపైన కేంద్రీకృతమై యుండెను. నిశ్శబ్దము పూర్ణస్థాయిలో నుండెను.

విద్వాంసుడు మొదటగా నొకమూర్తిని గైకొని, దాని మూల్యము ఐదు లక్షలని తెలిపెను. రెండవ దానిని తీసికొని దీని వెల యాభైవేలనెను. చివరిదాని మూల్యము కేవలమొక వరహా మాత్రమేయని తేల్చిచెప్పెను.

రాజుగారు "మూల్యములలో గల తేడాకు గల కారణమేమి" టని ప్రశ్నించెను. అప్పుడా విద్వాంసుడు రాజుకిట్టులనియెను.

"ఓ రాజా! మూర్తికారుడెంతో తెలివిపరుడు. మూర్తుల మూలమున లోకమున కొక సందేశము నివ్వదలచినాడు. ఆ సందేశమెట్టిదో తెలుపుటకు ముందుగా నేనొకటి మీముందు ప్రదర్శించెద"ననెను. ఒక దారమును గైకొని మొదటి దాని చెవి రంధ్రములో వేసెను. ఆ దారము వెలుపలికి రాకుండా లోపలే యుండెను. రెండవ మూర్తి చెవిలో వేయగా నది దాని నోటిలోనుండి బయటికి వచ్చెను. మూడవ మూర్తి చెవిలో వేసిన దారము మరుక్షణముననే మరొక చెవినుండి వెలుపలికి వచ్చెను.

ప్రదర్శన ముగిసిన పిదపన విద్వాంసుడు రాజు కిట్టులనెను. రాజా! విననది యవగతము చేసికొని తద్వారా లబ్ధిని పొందెడి వాడే యుత్తముడని తెలుపుటకు మొదటి మూర్తి చేయబడినది. రెండవ, మూడవ ప్రతిమలు మధ్యమ మరియు అధమస్థాయికి చెందిన శ్రోతలకు సంకేతముగా నిలుచును.

విద్వాంసుని తెలివి తేటలకు గాంచి, రాజు మరియు రాజసభ మెచ్చుకొనిరి. రాజుగారు విద్వాంసుని యుచితమైన రీతిలో సన్మానించెను.

శిష్యుడు శుశ్రువుగా అగుటకు నంకితభావము గల్గిన శ్రోతగా రూపొందవలెనని గ్రహించగలరు.

గురూపదేశము వలన శుశ్రూషువెరుగ గోరెడి విషయములెట్టి కోవరు చెంది యుండవలెననెడి ప్రశ్న స్ఫురించెడి యవకాశము గలదు. శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారీ విషయమును గురించి యీ క్రింది విధముగా తెలిపిరి :

**కిం సత్యం కిం న వా సత్యం క ఆత్మా కః పరః శివః ।**
**ఇతి శ్రవణ సంసక్తో గురోః శిష్యో విశిష్యతే ॥** (సి.శి. 17-69)

దీని భావమేమనగా సత్యమెయ్యది? అసత్యమేది? ఆత్మయెట్టిది? పరశివుడెవ్వడు? అనెడి ప్రశ్నలకు గురూపదేశమువలన సమాధానమును గోరెడి శుశ్రూషువు సామాన్య శిష్యుల కంటెను భిన్నుడై యుండును.

శుశ్రూషువు సామాన్యశిష్యుని కంటెను శ్రేష్ఠుడైయుండునని తెలియుచున్నది. శ్రీరేణుకాచార్య భగవత్పాదులవారీ క్రింది యుపదేశమును గనుడి :

**శ్రుత్వా శ్రుత్వా గురోర్వాక్యం శివసాక్షాత్ క్రియావహమ్ ।**
**ఉపశామ్యతి యః స్వాంతే స ముక్తిపదమాప్నుయాత్ ॥** (సి.శి. 17-61)

ఉపదేశములోని సారాంశమేమనగా శివసాక్షాత్కారమును గల్గించెడి శ్రీ గురువుల వారి వాక్కులను వినుచు వినుచు శుశ్రువులలో నెవ్వడు చిత్తమున శాంతిని యనుభవించునో అతడు ముక్తి పదమును పొందగలడు.

గురువులవారి సమీపమున ననేక విధములగు స్థితిగతులలో ననేకమైన శిష్యులుండెదరు. వీరిలో కొందరు కేవలము గురుసేవను చేయుటలోనే యాసక్తిని చూపగా కొందరు శ్రవణాసక్తి గలవారై గురుసేవను చేయుచునే గురూపదేశము యెడల సావధాన చిత్తులై యుందురు. మొదటి కోవకు చెందిన వారి కంటెను రెండవ రకమునకు చెందిన వారుత్తములనెడిది శ్రీ గురువుగారి యభిప్రాయమైయున్నది.

మనమనేక స్థానములలో ననేక విధములైన మాటలను వినుచున్నాము. అయితే వీటి సత్యాసత్యముల విషయమును గురించిగాని, ఆత్మానాత్మ సంబంధము గురించిగాని తెలిసికొనవలెననెడి జిజ్ఞాస చాలామంది కుండదు. ప్రపంచము నందున పరమేశ్వరుడు సత్యాసత్యములను, ఆత్మానాత్మలను విడదీసి చూసెడిదంత సులభతరము కాకుండగ చేసినాడు. "సత్యానృతే మిథునీకృత్య" మ్మనెడి వాక్య మీ విషయమునే ధృవపరచుచున్నది. ప్రపంచము గురించి వివరిస్తూ శ్రీ శంకరాచార్యులవారీ వాక్కులను నుడివిరి. అయితే, వివేకవంతులు మాత్రమీ రెంటిని విడదీసి చూడగలరు. త్రికాలాబాధితాంశమును సత్యమనియును, అనునిత్యము పరివర్తనకు గురియయ్యెడి దసత్యమనియును చెప్పబడినది. ఆత్మయును నిదే విధముగా అనాత్మ విషయములనుండి విడదీసి చూడదగినదై యున్నది. వివేకవిహీనులకు ననాత్మను నాత్మనుండి విడదీసి చూచుటను సాధ్యము కాదు.

చరాచర జగత్తులోని యంశములు షడ్భావ వికారములకు లోనై నిరంతరము మార్పుకు గురియగుచుండును. జీవి ధరించెడి దేహము నట్టిదే. జీర్ణదశకు చేరినపిదప నయ్యది విస్మరింపబడును. విసర్జింపబడును. పంచభూతములలో కలిసిపోవును. ఇట్టి మార్పుకు గురికానివి లేవని భావింపవలదు. జీవుడు – శివుడు నష్టమున పొందవని గురించవలెను. వేదాంతవాదులు, తమ గ్రంథములలో ఆత్మ నశించదని వ్రాసిరి. ఈ భావమునకు గీత విస్తృతమైన ప్రచారము నిచ్చెను.

ఆత్మ–అనాత్మ వివేకమంత సులభముగా ప్రాప్తించదు. గురూపదేశము నొక్క పరి వినినంత మాత్రమున యేమియును లభ్యముగాదు. నేను దేవునికంటెను భిన్నుడను, నాకు దేవుని దయ కావలెను, దైవకృప వలన సుఖసంతోషములననుభవింతుననెడి భావ పరంపర గల్గిన యీ లోకమున జీవాత్మ–పరమాత్మల యేకత్వమును గురించిన నమ్మకమును పెంచికొనుట యెంతో కష్టము. ఈ కష్టతరమైనదాని నభ్యసించవలెనినచో జ్ఞాన సముపార్జనలో విసుగుకు స్థానముండకూడదు. మాటిమాటికి వినవలెను. మనకిష్టమైన పదార్థమును మాటిమాటికి ఆసక్తితో తిననిగాని తృప్తి గలుగదు. ఆత్మజ్ఞానము గురించియు, విసుగుకు ఆస్కారమివ్వకుండగ గురూపదేశమును మాటిమాటికి శ్రవణమును చేయవలెను. జ్ఞానమవగతమైన పిదప శాంతి చేకూరును. శుశ్రూషువు నిట్టి స్థితికి చేరి ధన్యుడగును. మీరును శుశ్రూషువు లక్షణముల నవరచికొని జీవితమును సుసంపన్నము చేసికొందురుగాక!

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్య మహాస్వాములవారు విశేష జీవుని విశిష్ట లక్షణముల గురించి తెలిపిరి. వినికిడి యందున నాసక్తి గల్గియుండుటే కేంద్రాంశమని తెలియజేసిరి.

శుశ్రూషువనగా సేవించెడి వాడని గ్రహింపబడుచున్నది. "వరివస్యాతు శుశ్రూషా పరిచర్యాప్యుపాసనా" అనెడిది అమరసింహుని వాక్కు. (అమరకోశము, ద్వి.కా॥ బ్రహ్మవర్గం) గురువును సేవించెడివాడు గురుశుశ్రూషువనబడుచున్నాడు. అయితే "శ్రవణ సంసక్తో గురో విశిష్యతే" యనెడి భగవత్పాదుల వారి వివరణ (సి.శి.17:69). శుశ్రుషువు సేవకని కంటెను భిన్నుడని తెలుపుచున్నది. "శ్రవణతత్పరః శిష్యః శుశ్రూషుః శిష్యో విశిష్యతే, కేవల సేవాసక్త శిష్యాపేక్షయా విశిష్యత" అనెడి మరితొంటదార్యుల వాక్కులు విషయమును వివరించెడివై యున్నవి. "శ్రోతుమిచ్ఛా శుశ్రూషా, శుశ్రవణే" యనెడి లింగనసూరి వివరణ గమనార్హమైనది. శుశ్రూషువనగా శ్రవణాశక్తి గల్గిన శిష్యుడని ఆంధ్రమహాభారతమున చెప్పబడినది. ఈ వచనమును గమనించుడి :

**వ. నీవు ధర్మసూక్ష్మత్వదర్శి నేను శుశ్రూషకుండ**
**నన్ను శాసిరాపు మనవుడు ప్రీతుడై**
**యతని కిట్లనియె** (భారతము, శాంతి 5–325)

"పరకాయేన శాసనీయః శిష్యః" అనెడి వీరశైవాచార విదుల వాక్కులు స్మరణీయములు.

శ్రవసంసక్త చేష్ట శుశ్రూషువును సేవాసక్త శిష్యునినుండి విడజేసి చూపుచున్నదని గ్రహించగలరు.

శ్రవణాసక్తి గల్గిన భక్తుడెట్టులుండునో యనెడిదానిని సోమనాథుడీ విధముగా తెలియజేసెను.

**మం. కడువేడ్కన్ శివభక్తగోష్ఠివినుచో గంపించుచున్ మగ్నుడై**
**యొడలెల్లం జెవులై ప్రసన్నముఖుడై**
**యుద్యత్ ప్రమోదాత్ముడూ**
**యడరంగా భ్రమదాశ్రుధారలోని నేత్రా**
**పాంగ సంమైజాత**
**తొడరన్ ముత్పులకాంగుడయి**
**భక్తుండున్న గాకొప్పునే?** (అనుభవసారము,ప. 84)

శుశ్రూవు యొక్క శ్రవణాసక్తియు నీ విధముగా నుండుననెడిదే గ్రహించవలసిన విషయము. వినిన దానినే మరల మరల వినగోరును. ఇది శుశ్రూవుయొక్క విశిష్టమైన లక్షణము. దీనికిగల కారణమును వివరించెడి క్రింది పద్యము చదువదగినదైయున్నది :

*చ. ఎరిగి యెరింగి నన్నడుగ నేమిటి కప్పు*
*డెరింగి యింతకున్*
*మరచుటగల్గెనే నదివినం బని లేదటగా యున్నరూ*
*పెరగియు నేన చెప్పవిన నిష్టము గల్గుట చాలలెస్సయ*
*తెరగెరిగించెదన్ వినుము తెల్లముగా మొదలింట నుండియున్*

గురువుగారి యుపదేశమును నాలించు యందున శుశ్రూషువమితమైన యాసక్తిని ప్రదర్శించుననెడిదే గుర్తించవలసిన యంశము.
శ్రవణము యొక్క ప్రాముఖ్యత దృష్ట్యా శ్రుతి శ్రవణేంద్రియము యొక్క భద్రత గురించి యీ క్రింది విధముగా తెలిపినది :

**భద్రఙ్కర్ణేభి శ్శృణుయామ దేవాః ।**
**భద్రమ్పశ్యే మాక్షభిర్యజత్రాః స్థిరైరఙ్గై స్తుష్టువాగ్ం సస్తనూభిః ॥** (దశశాంతులు మొదటి మంత్రము)

శ్రేష్ఠమైన శ్రవణ శక్తిని గల్గియుండుటకై మానవుడు కలకాలమునుండి ప్రయత్నించుచున్నాడని తెలియుచున్నది.

శుశ్రూషువు వినగోరెడి విషయ సంచయమెట్టిది? యనెడి ప్రశ్న యెంతో ముఖ్యమైనది. చిరకాలమునుండియు కొన్ని విషయము మానవుని యశాంతికి కారణమగుచున్నవి. అవి యెట్టివనిన యెడల నయ్యవి సదసద్వివేక లోపము, ఆత్మానాత్మ విజ్ఞానలోపము, శివ-జీవ భేదబుద్ధి యని చెప్పవచ్చును. సదసద్వివేక శూన్యత జగన్మిథ్యా వాదమునకు దారితీసి సాధకుని నాస్తికునిగానో ప్రచ్ఛన్న నాస్తికుడని యెంచబడెడి యద్వైతిగానో చేయును. ఆత్మానాత్మ విచక్షణ లేనివారు నవిద్యచేత బాధితులైనవారై సంసార భ్రాంతిని పెంచికొని పతనమవుదురు. శివ-జీవ భేదభావము వలన అహంకార-మమకారములు పెరుగును. తత్ఫలితముగా రాగద్వేషములు కల్గును. అందుచేత శుశ్రూషువు సత్యమెయ్యది, ఆత్మయెట్టిది? పరమాత్మ యెవ్వడనే విషయముల నెరుంగ నెంచును. ఎరిగిన యెరుక వలన నుపశాంతిని పొందగోరును.

*- శివం భూయాత్ -*

## ఆశీర్వచనము - 2 :

## శుశ్రూషువు స్థలము :

ధర్మాభిమానులైన మీరింత కంటెను ముందు శుశ్రూషువు స్థలమునకు చెందిన ప్రాథమికాంశములను తెలిసికొంటిరి. ప్రయత్న పూర్వకముగా గురూపదేశము నాలించి తద్వార యితోధికమైన ఆధ్యాత్మిక లబ్దిని పొందెడివాడే శుశ్రూషువని తెలిసికొంటిరి.

వినుటలోన ఆత్మోన్నతి సుసాధ్యమగునని తెలిసినా చాలామందికి చెప్పుటలోనే ఆసక్తి గల్గుచున్నది. "మొదట నేను చెప్పేది వినుమని నుడివి, యెదుటివాడి నోరును మూయించుటలో చూపెడి నైపుణ్యమును వినుట నలవరచుకొనుట విషయము పెంపొందించికొనుటలేదు.

వినెడివారును, నిషిద్ధ విషయముల గురించి వినుట యందున నెక్కువ ప్రీతిని ప్రదర్శించుచున్నారు. నీరు పల్లమునకు ప్రవహించుననెడిది సత్యము. అదేవిధిన వినెడివాని మనోభీష్టము నిషిద్ధ విషయములవైపే మొగ్గును చూపును. ఈ స్థితిని చక్కబెట్టుటకై సాధకుడ ప్రయత్న పూర్వకముగా వినుటను నలవరచుకొనవలెను. అధోముఖమున పయనించెడి పయోరాశిని యంత్ర సాధనము చేత నూర్ధ్వగామినిగా చేసెడి రీతిలోనే సాధకుడు స్వప్రయత్నము చేత నుత్తమ శుశ్రూషువుగా పరిణామము బొందవలెను. ఈ విధిన యత్నించని యెడల నాధ్యాత్మిక విద్య సంప్రాప్తము కాదని గుర్తించగలరు.

వినికిడి విద్యాభ్యాసమున కెంతో ముఖ్యమైనది. విద్యలన్నింటిలో నతి ముఖ్యమైనదని గీతాదులచే పరిగణింపబడిన ఆధ్యాత్మిక విద్యనభ్యసించెడి వారు శుశ్రూషువులైయుండవలెనని వేరుగా చెప్పుటనవసరము. అయితే వినికిడి విలువను తెలిసికొనెడి యిచ్ఛలేని వారెల్లరు నాధ్యాత్మిక విద్య యొక్క ప్రాముఖ్యత నెరుగనివారై యున్నారని గుర్తించవలెను. ఈ సందర్భమున నాధ్యాత్మిక విద్య గురించియు, దాని ప్రాముఖ్యత గురించియు తెలిసికొనుట యెంతో ముఖ్యమైన విషయమగును. ఈ విషయము విశదపరచెడి యుదంతమొకటి కలదు.

ఒకానొక సమయమున నొక శివాచార్యుల వారు నొక సుశిక్షితుడైన వ్యక్తిని "మీరేమి చేయుచున్నా"రని అడిగెను. అతడు "నేనొక విద్యాలయమున ప్రాధ్యాపకుడనై యున్నా"ననెను. "ఇక ముందేమి చేయుదు"రని వారడుగగా "పెళ్ళి చేసుకొనెద"నని యతడు నుత్తరము నిచ్చెను. శివాచార్యులవారు "పిదప నేమి చేయుదు"రని అడిగెను. అతడు "సంసారినై పిల్లలను గని పెంచి పోషించెద"ననెను. "ఆ పిదపనేమి చేయుదు"రని యడుగగా పిల్లలను సుశిక్షితులుగా చేసి తనయంత వారిని చేతుననెను. శివాచార్యులు "ఇంకేమి చేయుదు"వని యడిగెను. విసిగిన స్థితిలోన నా ఆధ్యాపకుడు "చచ్చిపోయెద"ననెను. "చచ్చిన పిదప నేమి చేయుదు"వని శివాచార్యులవారడుగగా నతడు "నాకు తెలియదనెను. అప్పుడా శివాచార్యులవారు "మీరు నేర్చినది భుక్తి సంపాదనకొరకు తగినదైనను, ముక్తిని సంపాదించెడి యుక్తిని తెలుపజాలదు. అందుచేత, మీరు నాధ్యాత్మిక విద్య గురించి తెలిసికొనుటకై సద్గురువు నాశ్రయించు"దని హిత వాక్యములను పలికిన వాడయ్యెను.

గురూపదేశమును శ్రవణమును చేసిన గాని ముక్తిపథము గోచరించదని శ్రీ రేణుకాచార్య భగవత్పాదులవారు సెలవిచ్చిరి. ఉపదేశమును గనుడి :

**న బుద్ధ్యతి గురోర్వాక్యం వినా శిష్యస్య మానసమ్ ।**
**తేజో వినా సహస్రాంశోః కథం స్ఫురతిపఙ్కజమ్ ॥**
(సి.శి. 17-62)

దీని తాత్పర్యమేమనగా సూర్యకిరణములు లేకుండగ కమలమే విధముగా వికసించదో అదే విధిన గురూపదేశము లేకుండగ శిష్యుని మనస్సు వికసించదు.

శ్రీరేణుక భగవత్పాదులవారీ విషయము గురించి మరొక దృష్టాంతమునిచ్చిరి.

**సూర్యస్యోదయమాత్రేణ సూర్యకాన్తః ప్రకాశతే ।**
**గురోరావలోకమాత్రేణ శిష్యో బోధేనబాసతే ॥** (సి.శి. 17-63)

సూర్యోదయము చేత సూర్యకాంత పుష్పము వికసించును. అదేవిధిన గురువుగారి యాలోకనము వలన శిష్యుని బుద్ధి ప్రకాశించుచున్నది. ఇదియే శ్రీగురువుగారి యుపదేశములోని సారాంశము.

ఆధ్యాత్మిక విద్య యనెడిది సూర్య ప్రకాశము వంటిదని గుర్తించవలెను. సూర్యప్రకాశము లుప్తమైన యెడల కమలము, సూర్యకాంతి పుష్పములు అందవిహీనములగును. శ్రీగురువుగారి యుపదేశమును వినని శిష్యుడును నీరెంటివలె నిస్తేజుడగును. తేజోవిహీనునికి తత్త్వబోధ యెటుల సిద్ధించును? అందుచేత, సాధకుడు గురూపదేశమును శ్రద్ధతో వినెడిది యవసరమని గుర్తించవలెను.

గురూపదేశమును వినెడి సమయమున శిష్యుడే విధిన యుండవలెననెడిది చెప్పబడినది. గమనించుడి:

**అద్వైతపరమానందప్రబోధైకప్రకాశకమ్ ।**
**ఉపాయం శ్రుణుయాచ్ఛిష్యః సద్గురుం ప్రాప్య సాంజలిః ॥** (సి.శి. 17-64)

దీని తాత్పర్యమేమనగా తత్త్వబోధనెరుగ గోరెడి శిష్యుడు, గురువుగారి సమీపమునకు వచ్చి నిలుచుండి, ముకుళితహస్తుడై గురూపదేశమును వినవలెను.

శుశ్రూషువు శ్రీగురువు నుద్దేశించియే విధముగా విజ్ఞాపనను చేయవలెననెడి దానిని శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారీ క్రింది విధముగా వివరించిరి :

**కిం తత్త్వం పరమం జ్ఞేయం కేన సర్వే ప్రతిష్ఠితాః ।**
**కస్య సాక్షాత్ క్రియా ముక్తిః కథయేతి సమాసతః ॥** (సి.శి. 17-65)

దీని తాత్పర్యమేమనగా "నెరుగవలసిన పరమతత్త్వమేది? దేనిచేత జగత్తు ప్రతిష్ఠితమైయున్నది? దేనిని సాక్షాత్కరించికొనుట చేత ముక్తి లభించును. ఈ విషయములను సంగ్రహముగా తెలియజేయుడి :

ఆ పిదప గల్గెడి పరిణామమెట్టిదో యీ క్రింది విధముగా తెలుపబడినది.

**ఇతి ప్రశ్నే కృతేపూర్వం శిష్యేణ నియతాత్మనా ।**
**బ్రూయాత్ తత్త్వం గురుస్తస్మై యేన స్యాత్ సంసృతేర్లయః ॥** (సి.శి. 17-66)

ఈ విధిన శిష్యుడు విజ్ఞాపనను చేసిన పిదప శ్రీగురువు శిష్యునికి సంసారమును లయింపజేసెడి తత్త్వమును బోధించవలెననెడిదే దీని తాత్పర్యము.

"తద్విజ్ఞానార్థం, స గురుమేవాధిగచ్ఛేత్ సమిత్పాణిః, శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్" అనెడి ముండక శ్రుతి వాక్యము ప్రకారముగా ఆత్మజ్ఞానమును తెలిసికొనగోరెడి శిష్యుడు గురువును సమీపించి చేతులను జోడించికొని వినయ పూర్వకముగా మూడురకముల ప్రశ్నల నడుగవలెను. అవి యేమనగా జగత్తునందున తెలిసికొనుటకు యోగ్యమైన పరమతత్త్వమేది? ఈ ప్రపంచమునకు నాధారభూతముగా నున్నదేది? దేని సాక్షాత్కారము వలన ముక్తి ప్రాప్తించును. ఈ ప్రశ్నలకు సమాధానముగా శ్రీగురువు సంసారమును లయము చేసెడి తత్త్వోపదేశమును కరుణతో ప్రసాదించును. ఈ విధముగా ప్రశ్నలను వేసెడి జిజ్ఞాసువులకే తత్త్వోపదేశమును చేయవలెననెడిది తత్త్వజ్ఞుల యభిప్రాయమై యున్నది. శ్రీమన్నిజగుణ శివయోగులవారి మాటలలో చెప్పవలెనన్న "పరిపక్వ హృదయవల్లద మందమతిగళిగె బోధిపెవెంబ భ్రమ యాకోమనుజా!" హృదయము పరిపక్వదశ చేరని దశలో నున్న మందమతులకు బోధింతుననెడి భ్రమ యెందులకు మనుజా!" అనెడిదే శ్రీశివయోగులవారి వాక్కులలోని సారము. సత్పాత్రతలేని వారికిని, సచ్ఛిష్యులు కాని వారికిని తత్త్వోపదేశమును చేయవలదనెడిదే గ్రహించవలసిన సత్యము.

ఏదైనా సంబరము సందర్భముగా ననేక విషయముల గురించి ప్రవచన ప్రక్రియ నడిపెడి సందర్భమున శ్రోతలందరు నొకే కోవకు చెందిన వారై యుండరు. కొందరికి కొందరి మాటలు రుచించిన యెడల మరికొందరికి యింకా కొందరి మాటలు రుచ్యములగును. మరికొందరు ననాసక్త హృదయులై యితరులతో ముచ్చటించుటయందున మునిగిపోవుదురు. వీరందరికంటెను భిన్నముగా నుండెడి వారైన కొందరు నిద్రలోనికి జారికొని విశ్రాంతిని పొందుదురు. ఇట్టివారిలో నెవ్వరు తత్త్వోపదేశ ప్రదానమున కర్హులో ననెడిది తెలియని విషయము కాదు. ఆసక్తిలేనివారికి తత్త్వోపదేశము చేయుటవలన లాభముండదు. ప్రయత్నము వ్యర్థమైనదగును. అందుచేత శిష్యుడు శుశ్రూషువుగా నెదుగటకై వలయు అర్హతలను పెంపొందించుకొనవలెను.

ఈ ప్రపంచమునందలి ప్రతియొక్క మనుష్యుని యొక్క మనస్సులోన నేదో యొక విధమైనట్టి యజ్ఞానముండును. అజ్ఞానము లన్నింటికిని మూలకారణమై యుండెడిదే మూలాజ్ఞానము. ఆయా వస్తువుల తెలివిడి యైనప్పుడు నా యా వస్తునిష్ఠ యజ్ఞానము దూరమగునే గాని మూలాజ్ఞానము

దూరము కాదు. మూలాజ్ఞానమును దూరము చేసికొనలేని వ్యక్తి యీ లోకమునందున నెంతటి జ్ఞాని యనిపించికొనినను నాధ్యాత్మిక క్షేత్రము నందతడు ఖచ్చితముగా నజ్ఞానియే. పరతత్త్వము నెరుగని వారెల్లరు నజ్ఞానులేయని తెలిసికొనవలెను.

శ్రీమన్నిజగుణ శివయోగులవారు తెలిపిన యటుల తన చిద్రూపమును మరచి పంచ భూతాత్మకమైన దేహమే తాననెడి వాడును, తన నిర్మల స్వరూపమును మరచి సూతకాదుల లోన సుడిగొనువాడును, జాగ్రత, స్వప్న సుషుప్తుల నెరిగుచు వాటికి సాక్షిగా నుండెడి చిద్రూపమును మరచి నామ–రూపాదులను మోహించెడి వాడును నజ్ఞానులే.

వివేక, వైరాగ్యాది షట్క సంపత్తిని, ముముక్షుతాది సాధన చతుష్టయమును చేకూర్చికొని, గురువు సన్నిధిని చేరి శుశ్రూషులై తన యజ్ఞానమును దూరము చేసికొనుటయే శిష్యుని కర్తవ్యమై యున్నదని గ్రహించగలరు.

శుశ్రూషువడిగిన ప్రశ్నలకు శ్రీగురువు వలన నెట్టి ప్రత్యుత్తరమొచ్చునో యనెడి విషయమున శ్రీరేణుకాచార్య భగవత్పాదులవారీ క్రింది విధముగా నుపదేశము నిచ్చిరి :

**శివ యేవ పరం తత్త్వం చిదానందసదాకృతిః ।**
**స యథార్థస్తదన్యస్య జగతో నాస్తి నిత్యతా ॥** (సి.శి. 17–69)

దీని తాత్పర్యమేమనగా సచ్చిదానంద స్వరూపుడైన శివుడొక్కడే పరతత్త్వము శివతత్త్వమే యదార్థమైనది. దీనికంటెను భిన్నమైనది. నిత్యమైనది కాదు.

పరబ్రహ్మతత్త్వము గురించి భిన్నమైన యభిప్రాయములు కలవు. వీరశైవ సిద్ధాంతము ప్రకారము శివుడే పరతత్త్వము. ముప్పది యారు తత్త్వములకును మూలతత్త్వమనదగినదే శివతత్త్వము. శివతత్త్వమే సత్యము అది చిద్రూపముగా నుండును. ఆనందమయమైనది శివతత్త్వమే. ఆ విధముగా శివతత్త్వమే సచ్చిదానంద రూపమై యున్నదని గ్రహించవలెను. శివతత్త్వము కంటెను భిన్నమైనదని చెప్పబడెడి విష్ణ్వాది తత్త్వములు పరతత్త్వము కాజాలవని తెలిసికొనగలరు. ఈ విధముగా శివతత్త్వమును గురించి తెలిసికొనిన శుశ్రూషువు శివతత్త్వము యెడల యవగాహనను పెంచికొని శివ–జీవ సామరస్యమును సాధించెడి ప్రయత్నమును యత్నమును చేయవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యులవారు నాధ్యాత్మిక విద్య యొక్క ప్రాముఖ్యతను తెలిపిరి. శుశ్రూషులెరుగవలసిన విషయముల గురించి తెలియజెప్పిరి.

పరకాయ జంగముని సేవించెడి వాడు "మోక్షార్థి"యని భగవత్ పాదులవారి యుపదేశము (సి.శి. 17–58) వలన తెలియుచున్నది. ముముక్షువైనవాడు తప్పనిసరిగా గురుకరుణను పొందవలసియుండునని "గురుకారుణ్య స్థలమున" తెలుపబడినది. ఈ విషయమును సంక్షిప్తముగా తెలిపెడి యీ క్రింది పద్యము గమనార్హమైనదైయున్నది :

**ఉ. అంగమ దృశ్య దృశ్యముల కాశ్రయుదయ్యును గానరాని**
**సన్మంగళ లింగమూర్తి నసమాన జగత్త్రయ చక్రవర్తి**
**నుత్తుంగ విశాలకీర్తి నవధూతవినమ్రజనార్తినాత్మలో**
**సాంగము గాగ సద్గురు కృపాధృత గాకెరుగంగవచ్చునే?** (అనుభవసారము, ప. 152)

ఇచ్చట గుర్తించవలసిన విషయమేమనగా గురువును నాశ్రయించకుండగ ముక్తిని పొందుట యసంభవము. అయితే, గురువును నాశ్రయించిన మాత్రము చేత ముక్తి గలుగునని యనలేము. శుశ్రూషువు గురూపదేశమును పొందుట యెంతోనునవసరమని శ్రీ భగవత్పాదులవారు స్పష్టముగా తెలిపిరి. "విజ్ఞానార్థం సగురుమేవాభిగచ్ఛేత్ సమిత్ పాణిః" అనెడి ముండకోపనిషత్తు (1/12) యీ యంశమునే తెలుపుచున్నది. ఉపనిషత్తులోని భావన కొక రూపమునిచ్చిన క్రింది పద్యమును గమనించుడి :

**చ. గురునుపదేశమున్ వినుట గొప్పవరంబని యెంచివచ్చి స**
**ద్గురునికి మొక్కియానతిని దూకొని కొండొక చోటనిల్పి యా**
**గురునకు ప్రశ్నవేయుచుని గూఢరహస్యవితానమున్ మహా**
**వరముగ బొందుశిష్యుడిల వాసిన పొందడె ముక్తి సంపదన్**
(మార్గం పెద్ద వీరప్ప కవి–అముద్రితము)

శిష్యుడడిగెడి ప్రశ్నలెట్టులుండునో యనెడిది యీ క్రింది విధిన జూపబడినది.

**గీ. ఎరుగవలసిన ఘనతత్త్వమేది భువిన?**
**దేనిచేత నీ జగమెల్ల తిరము కొనెను?**
**ఎవ్వడగుపడు ముక్తిని యివ్వగలడు?**
**గురవే! చెప్పవే! దయచేసి కోర్కెదీర!** (మార్గం పెద్ద వీరప్ప కవి – అముద్రితము)

ఈ ప్రశ్నలన్నియును భగవత్పాదులవారి యుపదేశములోని ప్రశ్నల కనుగుణ్యత గల్గియున్నవని తెలిసికొనగలరు.

ఈ ప్రశ్నలన్నియును నతని యవగాహనను పెంచి యతని యాధ్యాత్మికౌన్నత్యమునకు దోహదము చేసెడి సాధనములే గాని శుశ్రూవును పృచ్ఛకునిగా మార్చెడివిగావని తెలిసికొనవలెను.

ఆదికాలము నుండియును శిష్యులీ ప్రశ్నలను తమ తమ గురువుల నుద్దేశించి ప్రయోగించు చున్ననూ యీ ప్రశ్నలు ప్రశ్నలుగానే మిగిలిపోవుచున్నవనెడి వాదనయు గలదు.

అయితే, గ్రహించవలసిన విషయమేమనగా వేదోపనిదాదులలో వెతికి వీటికి తగిన సమాధానములను పొందవచ్చుననెడిది అసాధ్యమైన పనియని యెరుగవలెను. శ్రీ శివధర్మశాస్త్రమని యెంచబడిన సిద్ధాంత శిఖామణిలో నివ్వబడినట్టినట్టి లక్షణములతో భూషితుడైన గురువువలన సమాధానములను పొంది ధన్యత బడయవచ్చుననెడిదే తెలిసికొనవలసిన విషయము.

*– శివం భూయాత్ –*

## ఆశీర్వచనము - 3 :

## శుశ్రూషువు స్థలము :

జిజ్ఞాసువులైన సద్భక్తులు క్రిందటి ఆశీర్వచనము నందున శుశ్రూషువు స్థలమునకు చెందిన యంశములను తెలిశొంటిరి. మిగిలిన యంశముల గురించి యీ స్థలమున తెలుపబడును.

శుశ్రూషులెరుగవలసిన తాత్త్విక అంశముల గురించి తెలుపుచు శ్రీ భగవత్పాదులవారు నీ క్రింది విధముగా సెలవిచ్చిరి.

**అయథార్థ ప్రపంచోఽయం ప్రతితిష్ఠతి శంకరే ।**
**సదాత్మని యథాశుక్తౌ రజతత్వం వ్యవస్థితం ॥**(సి.శి. 17–77)

దీని తాత్పర్యమేమనగా యదార్థమైన యీ ప్రపంచము సద్రూపుడైన శివుని యందున ముత్యపు చిప్పలోని రజతత్త్వమువలె ప్రతిష్ఠింపబడినది.

ప్రపంచములోని నామరూపములు పరివర్తన శీలములై యుండుటచేత అవి యనిత్యములని పిలువబడుచున్నవి. అయితే, సావృత మూలమున నన్నియును నొకేరీతిన గోచరించుచున్నవి. పరివర్తన శీలముగల వస్తువులయందున పరివర్తన కన్పట్టుటలేదు. నదిలోని నీటిని యుదాహరణగా గైకొనవచ్చును. నదిలోని నీరు క్షణ క్షణానికిని పరివర్తనకు గురియగుచున్నది. భ్రమవలన నీరొకే విధమైన దానివలె గోచరించుచున్నది. నాటినుండి నేటివరకు క్షణక్షణమునకు మార్పును చవిచూసెడి ప్రపంచములోని జీవుడు కనుగొనలేని స్థితిలో నున్నాడు.

నిరంతరము పరివర్తన చెందెడి యీ ప్రపంచములోని వస్తువులు సంచలనశీలత గలిగియున్నవి. అయితే, యీ ప్రపంచము దేనిమీద నాధారపడి యుండునో అది పరివర్తనకు గురికాదు. అది శివతత్త్వమేయని తెలిసికొనగలరు.

ఒక రథమునందలి రెండు చక్రములు తిరుగుచుండగ నయ్యది పయనించుననెడిది మనమెరిగినదే. తిరిగెడి చక్రములు తిరుగని యిరుసును నాధారముగా గొని తిరుగుచుండును. అదే విధముగా తిరుగని జగత్తుకేదో వొకటి యాధారముగా నుండవలెను కదా! అయ్యది తిరుగకుండగ నుండవలెను.

ఒకడొక పుస్తకము నున్నతాసనమునపై యుంచినప్పుడు, ఆసనము నా పుస్తకమునకై ఆధారమగుచున్నది. అట్టి ఆసనమునకు నాధారమయ్యేది యనెడి ప్రశ్న తలయెత్తగా భూమియే యనెడి ప్రత్యుత్తరము వచ్చును.

మనమందరము నివసించెడి యీ భూమికి నాధారమెట్టిదో యనెడి దెరుగు విషయమున నాసక్తి గలవారెవ్వరు. తిని తిరుగాడుటకే సమయము జిక్కని వారెందరో గలరు. అహంకార–మమకారాదులచే తిరుగాడు వారును గలరు. వీరికి వీరి వీరి పనులే ముఖ్యమైనవై యున్నవి. భూమికి నాధారభూతమైన తత్త్వము గురించి తెలిసికొనెడి యాసక్తిగాని, తన్నిమిత్తమై వలయు సమయముగాని లుప్తవే దశలో నున్నవారేమి తెలిసికొనగలరు.

సాధారణముగా దేనికెయ్యది యాధారమనెడి ప్రశ్న యెదురైనప్పుడు నొక వస్తువు దేనినుండి యుద్భవించునో అదియే దానికాధారమని తేలును. అట్టి యెడ, జలమే భూమికాధార భూతమైనదైయున్నది. జలమునకగ్ని, అగ్నికి వాయువు, వాయువునకాకాశము నుత్పత్తి స్థానములైయున్నవి. వీటన్నింటికి మాయయే యుద్భవస్థానము. అట్టి మాయ శివుని వలన గల్గుచున్నది. ఈ కారణమువలన భూమ్యాదులకు శివుడే ఆధారభూతుడైన వాడని తెలియుచున్నది.

ముత్యపు చిప్పలో మిలమిలా మెరయుచు వెండిని పోలియుండెడి దానికి ముత్యపు చిప్పయే ఆధారభూతమై యుండునటులే ప్రపంచమునకు శివుడే ఆధారభూతుడగును.

ఈ స్థలమునకు చెందిన తాత్వికాంశములలో చివరిదగు దాని గురించి శ్రీ భగవత్పాదులవారీ క్రింది విధముగా నుపదేశించిరి :

**శివోఽహమితి భావేన శివే సాక్షాత్కృతే స్థిరమ్ ।**
**ముక్తో భవతి సంసారమోహగ్రంథేర్విభేదతః ॥** (సి.శి. 17–68)

దీని తాత్పర్యమేమనగా శివుని నేనే యనెడి దృఢమైన భావమును పెంచికొనుటవలన జీవుడు సంసార మోహగ్రంథినుండి విముక్తిని పొందుచున్నాడు.

ఎవ్వరిని సాక్షాత్కరించికొనిన యెడల ముక్తి లభ్యమగుననెడి ప్రశ్నకు ప్రత్యుత్తరముగా నీ యుపదేశమివ్వబడినది. ముక్తికి శివుని సాక్షాత్కారమే మూలమైనదై యున్నది. అయితే యీ శివుని తన ఆత్మ స్వరూపముగా సాక్షాత్కరించికొనవలెనని సూచింపబడినవి. ఈ కారణముననే సాధకుడు శివోహమనెడి భావనను దృఢతరము చేసికొనవలెను. తన స్వరూపము గురించి వచ్చిన యజ్ఞానము వలన గల్గిన సంసారము, స్వస్వరూప జ్ఞానము వలన నివృత్తియగునని తెలిసికొనగలరు. తాను శివుడననెడి జ్ఞానము కలుగగనే శరీరాదుల యెడల సాధకునకు గల మోహాదులు విసర్జింపబడుచున్నవి. హృదయ గ్రంథి వీడి వెడలిపోవును. హృదయ గ్రంథి యొక్క విమోచనమే ముక్తియనబడుచున్నది.

“మమేతి బద్ధ్యతే జంతుః” “న మమేతి విముచ్యతే” అనెడివి యుపదిష్ట వాక్యములు. నాది అనెడి భావమే బంధనములను గల్గించగా, నాది కాదేదియు ననెడి భావము బంధ విమోచనమును గల్గించును. ఇదియే యీ వాక్కులలోని సారాంశము.

సాధకుని కెప్పుడైతే “యీ శరీరాదులేవియును నావి కావనే దృఢమైన భావము సుప్రతిష్ఠితమగునో అప్పుడతడు ముక్తిని పొందునని గుర్తించగలరు. ఈ విధముగా సాధకుడు నిస్సంగ భావ సంయుక్తుడై, శివోహమనెడి భావన పెంచికొనకుండిన యెడల మోక్షమలభ్యమగునని తెలిసికొనగలరు.

ముక్తిని వాంఛించెడి వాడే విధముగా ప్రవర్తించవలెనో యనెడి దానిని ఆదేశరూపములోనివ్వబడుచున్నది. గమనించుడి :

**శివం భావయ చాత్మానం శివాదన్యం న చిన్తయ ।**
**ఏవం స్థిరే శివాద్వైతే జీవన్ముక్తో భవిష్యసి ॥** (సి.శి. 17-69)

"ఓయీ! శిష్యా! నీ వెల్లప్పుడును నీవు శివుడవని భావించికొనుము; శివేతరమైన దాని గురించి ఆలోచించవలదు; శివాద్వైత భావము నందే యుండుము; జీవన్ముక్తుడవుగా నగుదువు" అనెడి గురువుగారి ఆదేశములోని భావము.

ఇక యీ స్థలమునకు ముగింపు రూపమున యీ క్రింది యుపదేశమివ్వబడినది.

**ఏవం ప్రచోదితః శిష్యో గురుణా గుణశాలినా ।**
**శివమేవ జగత్ పశ్యన్ జీవన్ముక్తోఽ భిజాయతే ॥** (సి.శి. 17-70)

దీని భావమేమనగా గుణవంతుడైన గురువు వలన యుపదేశలబ్ధిని పొందిన శిష్యుడు సంసారమును శివస్వరూపముగా చూస్తూ జీవన్ముక్తుడగును.

గురువు శుశ్రూషువునకు శిష్యుని ఆత్మయే పరమాత్మయని తెలియజేయుచున్నాడు. ఈ విధముగా చింతిస్తూ వుండవలెనని ఆదేశించిన పిదప నా శిష్యుడు గురువుగారి ఆజ్ఞను పాలిస్తూ వేరైనదేదియును చింతించకుండగ నుండును. క్రమక్రమముగా విశ్వమంతా శివుడే యనెడి భావమును పొందును. శివాద్వైత భావన ననుభవించుచు జీవన్ముక్తిని పొందుచున్నాడు.

జిజ్ఞాసువులీ స్థలములోని రహస్యములను గుర్తెరిగి ధన్యులగుదురు గాక!

ఓం శాంతిః! శాంతిః! శాంతిః!

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువుల వారు శుశ్రూషువు స్థలమునకు ముగింపుగా నీ ఆశీర్వచనమును కటాక్షించిరి. గురూపదేశ మహిమ వలన శుశ్రూషు జీవన్ముక్తుడగునని తెలియజెప్పిరి.

ముముక్షులై గురూపదేశము వలన ముక్తిని పొందవలెననెడి కోరికతో శుశ్రూవడిగిన ప్రశ్నలకు సమాధానముగా శ్రీగురువు నొసంగిన యుపదేశము వలన లోకములు ధన్యత పొందగలవని తెలియుచున్నది. సమాధానములను గమనించుడి :

ఎ. శివ ఏవ పరం తత్త్వం
బి. శంకరే ప్రపంచోఽయంప్రతిష్ఠతి
సి. శివే సాక్షాత్కృతే ముక్తో భవతి

శివుడే యెరుగ దగిన వాడని తెలుపబడినది. ఈ విషయమును వివరించి చెప్పెడి క్రింది పద్యము గనుడి :

**గీ. ఎరుగ వలసిన తత్త్వంబు శివుని నెలవు**
**నిలుపు నతడొక్కడే జగమునెల్ల, గనవె!**
**గనని నాతని రూపంబు గలుగు ముక్తి**
**భక్తితో శివుని గొలిచి ముక్తి గొనుము** (మార్గం పెద్ద వీరప్ప - అముద్రితము)

భారతదేశములోని విభిన్నమైన దర్శనములలో పరతత్త్వమును గురించి పరిపరివిధములుగా తెలుపబడినది. షడ్దర్శనముల నాధారము గాగొని పలు రకములు నుద్భవించినవి. ఈ మతముల యొక్క విస్తృతిని తెలిపెడి క్రింది గద్యము గమనార్హమైనది.

**"అనర్గళ జ్ఞాన దుర్గాంతర్గత**
**మార్గభ్రష్ట నికృష్టనానాయోని**
**పరి పీడిత జన్మ జరామరణ**
**వైదిక వైష్ణవ జైన బౌద్ధ**
**చార్వాక మాయావాది దుష్టమృగ**
**విసరవిశసన వినోద వివిధ లుబ్ధ**
**కాయమాన విక్రమోద్దండ-**
**శివసమయ పరిపాలన ప్రచండ...**
**... ... ... దేవ బసవా!** (సోమనాథుని పంచప్రకార గద్య)

శివ సమయ పరిపాలకులు శివునినే బ్రహ్మమని యెంచుదురు. ఈ విషయమును తెలిపెడి క్రింది స్తుతిని గనుడి:

**బ్రహ్మేతి వ్యపదేశస్య విషయం యం ప్రచక్షతే ।**
**వేదాన్తినో జగన్మూలం తం నమామి పరం శివమ్ ॥** (శివయోగి శివాచార్యుడు)

శివబ్రహ్మ యొక్క చిత్స్వరూపమును వర్ణించి చెప్పెడి క్రింది శ్లోకమును గనుడి :

**ఏక ఏవ శివః సాక్షాచ్చిదానన్దమయో విభుః ।**
**నిర్వికల్పో నిరాకారో నిర్గుణో నిష్ప్రపంచకః ॥** (సి.శి. 5:32-34)

శివుడే జగదాధార మూర్తియని తెలిపెడి యీ ద్విపదలను చూడండి :

**సొంపార నప్పరంజ్యోతి రూపమున**
**బెంపొందుచున్న గాంభీర్య రక్షించు**
**సకలంబు గుక్షిలో సంధిల్లుచుండ**
**సకలంములోనున్న సగుణ రక్షించు**
**ఆదికనాదివై యఖిల లోకముల**
**కాధారమైయున్న యభవరక్షించు**
**పావనంబుగమేన బ్రహ్మాండకోట్లు**
**భావింప భరియించు భవ్య రక్షించు**
**... ...** (సోమనాథస్తవము)

ఇట్టి యనుపమానమైన శివతత్త్వమును భజించి శుశ్రూషువు లింగాంగ సామరస్యమును సాధించవలెననెడిది విహితమని గ్రహించగలరు.

*- శివం భూయాత్ -*

## ఆశీర్వచనము - 1 :

## సేవ్య స్థలము :

ముముక్షువు లింతవరకు ప్రసాది స్థలాంతర్గతమైనవియును, లింగ స్థలములని పరిగణింపబడెడివి యగు వివిధ స్థలముల గురించి తెలిసికొంటిరి. ఈ ఆశీర్వచనమున చివరి స్థలమని తెలుపబడినట్టి సేవ్య స్థలము గురించి తెలిసికొందుము గావుత!

"సేవితుం యోగ్యః సేవ్యః" అనెడి వ్యుత్పత్తి ప్రకారము సేవించుటకు యోగ్యుడైన జీవన్ముక్తుడే సేవ్యుడనబడును.

సేవ్యుడనే పదము వివిధ రీతులలోన నిర్వచింపబడినది. యోగజాగమమున యీ క్రింది విధముగ తెలుపబడినది.

**దృష్టిః స్థిరా యస్య వినైవదృశ్యమ్ ।**
**వాయుః స్థిరో యస్య వినా ప్రయత్నమ్ ॥**
**చిత్తం స్థిరం యస్య వినావలంబమ్ ।**
**స ఏవ యోగి స గురుః ససేవ్యః ॥**

దీని తాత్పర్యమేమనగా దృశ్యము లేకుండినను నెవ్వరి దృష్టి స్థిరముగా నుండునో, కుంభకాది ప్రయత్నములు లేకుండగనే యెవ్వరి వాయువు స్థిరముగా నుండునో, ఆకారాది యాధారములు లేకుండగనే యెవ్వరి చిత్తము స్థిరముగా నిలుచునో, అతడే గురువనియును, యోగియనియును మరియు సేవ్యుడనియును పిలువబడును.

ఈ విషయము గురించి శ్రీ రేణుక భగవత్పాదులవారు నీ క్రింది విధముగా సెలవునిచ్చిరి.

**గురువాక్యామృతాస్వాదాత్ప్రాప్తబోధమహాఫలః ।**
**శుశ్రూషురేవ సర్వేషాం సేవ్యత్వాత్ సేవ్య ఉచ్యతే ॥**
**గురూపదిష్టే విజ్ఞానే చేతసి స్థిరతాం గతే ।**
**సాక్షాత్కృతశివః శిష్యో, గురువత్ పూజ్యతే సదా ॥** (సి.శి. 17-81-72)

దీని తాత్పర్యమేమనగా గురూపదేశమనెడి యమృతము నాస్వాదనము చేసి తత్ఫలితముగా శివాద్వైత రూపమైన మహాఫలమును పొందిన శుశ్రూషువు స్థలమునందలి సాధకుడు జీవన్ముక్తుడై జనులందరిచేత పూజింపబడెడి యోగ్యత గల్గినవాడై సేవ్యుడని పిలిపించికొనును.

జగత్తులోని జనులు పశు, పాషాణ, పాదప, నది, సూర్య, చంద్రాదులను ప్రసంగాను సారముగా పూజించుచుందురు. ఆయా వ్యక్తుల లేదా వస్తువుల గుణ గణములే పూజనీయతకు కారణమగుచున్నవి. ఈ కారణముననే "గుణాః పూజాస్థానం గుణిషు న చ లింగం న చ వయః" అనెడిది సుభాషితమైనది. గోవు మొదలగు వస్తువులలోని, బిల్వాది వృక్షాదులలోని సముత్కృష్టమైన త్యాగగుణమువలననే నయ్యవి యారాధ్యములైనవి. ఇదే విధముగా శుశ్రూషువు, గురుబోధామృత సేవనము వలన పొందిన విశిష్ట గుణముచేత పూజ్యుడగుచున్నాడు.

మనము జీవితము నందున పొందవలసిన యనేక ఫలములలోన జ్ఞానమనెడి ఫలము శ్రేష్ఠమైనదైయున్నది. ఈ కారణముననే జ్ఞానఫలము మహాఫలమని పిలువబడుచున్నది. ఈ ఫలమునకు నాశనముండదు. అందుచే మహాఫలమనెడి పేరు జ్ఞానమునకు సార్థక నామధేయమై యున్నది. ఈ మహాఫలమందరికినీ దొరికెడిది కాదు. శ్రీ గురువులవారి యుపదేశామృతమును నాస్వాదించిన వారికి మాత్రమే యియ్యది లభ్యమగును. సామాన్యముగా నమృతము స్వర్గములోను, చంద్రకిరణములలోను, సముద్రగర్భమునను, నాగలోకములోను నుండునని చెప్పుదురు. వాస్తవముగా వీటిలోన నమృతముండదని తెలిసికొనగలరు. కవులు వధువుల యధరామృతము గురించి ముచ్చటించుదురు. అదియును వాస్తవమైన యమృతంబు కాజాలదు. ఇదియొక కవికల్పనయని గ్రహించవలెను.

సముద్రమునందున నమృతముండినచో దానిలోని నీరు క్షారముగా నుండునే? వధువు యొక్క అధరామృతమును గ్రోలిన ఏదేని విగత ప్రాణికాకుండగ నుండగలదే? చంద్రునిలోన నమృతముండెడిది నిజమైతే యతనికి క్షయరోగమెట్టుల వచ్చెను? నాగలోకములోన నమృతము గలదేని నాగులు విషము గలవెందుకగును? లోతుగా నాలోచించిన యెడల గురూపదేశములోనే యమృతముండునని తెలియవచ్చును. ఈ విషయమున శ్రీ నిజ గుణ శివయోగులవారు "శ్రీ గురువచన దిందధిక సుధెయుంటె?" అని సెలవిచ్చిరి. శ్రీ గురువులవారి వచనము కంటెను గుణాధిక్యత గల్గిన యమృత మింకేదియును లేదనెడిది శివయోగులవారి వాక్కుల కర్థము. ఇంతటి మహత్తు గ్గల మహాఫలమును సేవించినందుననే శుశ్రూషువు జీవన్ముక్తుడై సేవ్యుడగుచున్నాడని గ్రహించగలరు.

శ్రీగురువు జ్ఞాన ప్రదాతయని తెలుపబడినది. 'గురు'పదములోని 'గు' అజ్ఞానమును సూచిస్తే, 'రు' అజ్ఞానమును దూరము చేయు జ్ఞానమును సూచించును. శ్రీగురువు మహాజ్ఞాని యనబడుచున్నాడు. లోకపూజ్యుడైనాడు. తన వుపదేశము ద్వారా శ్రీగురువు శిష్యుని తనంత వానిగా తీర్చిదిద్దుచున్నాడు. కారణముననే శుశ్రూషువు సేవ్యుడై విరాజిల్లుచున్నాడని గ్రహించగలరు.

శిష్యుడైన శుశ్రూషువు గురువువలె యెందుకు పూజ్యుడగుననెడి ప్రశ్న గలుగవచ్చును. ఈ విషయమున శ్రీ రేణుకాచార్య భగవత్పాదులవారు తమ యుపదేశము నీ క్రింది విధముగా సెలవిచ్చిరి.

**జ్ఞానాదాధిక్య సంపత్తిర్గురోర్యస్మాదుపస్థితా ।**
**తస్మాజ్జ్ఞానాగమాచ్ఛిశ్యో గురువత్ పూజ్యతాం వ్రజేత్ ॥** (సి.శి. 17-73)

శ్రీగురువు వలన జ్ఞానము వచ్చి శిష్యునిలో సుస్థిరముగా నిలుచుటచేత శిష్యుడు పూజనీయుడగుచున్నాడనెడిదే యీయుపదేశములోని సారాంశము.

శుశ్రూషువు శివుని వలె పూజ్యుడగునని శ్రీ భగవత్పాదులవారు సెలవిచ్చిరి. వీరి యీ క్రింది యుపదేశమును గనుడి :

**శివోఽహమితి భావస్య నైరంతర్యాద్ విశేషతః ।**
**శివభావే సముత్పన్నే శివవత్ పూజ్య ఏవ సః ॥** (సి.శి. 17-74)

దీని భావమేమనగా శివోహమనెడి భావన శిష్యునిలో స్థిరపడి యుండుట చేత నతడు శివభావ పరిపుష్టిని పొందిన కారణమున, శివునివలె పూజనీయుడగుచున్నాడు.

జ్ఞానము పవిత్రమైనదై పూజనీయమగుచున్నది. జ్ఞానప్రాప్తిని పొందిన కారణమున, సామాన్య వ్యక్తి గురువై పూజనీయుడగుచున్నాడు. గురువుల వారి గురుత్వమునకు జ్ఞానమే కారణభూతమైన యంశమని గుర్తించగలరు. దీనివలననే గురువు సామాన్య వ్యక్తుల కంటెను విలక్షణమైన గుణము గలవాడై పూజ్యుడగును. గురువు వలన జ్ఞానమును పొందిన శుశ్రూషువు, గురువువలెనే పూజనీయుడగుటకును జ్ఞానమే కారణాంశమగుచున్నదని తెలిసికొనగలరు.

శ్రీగురువు తన శిష్యునికి "తత్త్వమసి" యనెడి మహావాక్యమును బోధించినప్పుడు ఆ వుపదేశము నాస్వాదన చేసిన శుశ్రూషువా భావమును మనస్సునందున నింపికొని "నేను శివుడ"ననెడి భావము ననుభవించుచుండును. క్రమక్రమముగా, భ్రమర కీట న్యాయమున శుశ్రూషువు శివుడై పూజనీయుడగును. శివచింతన, శివధ్యానముల ఫలితముగా నిట్టి పరిణామము ప్రాప్తిమగునని గుర్తించవలెను.

విషయాసక్త

ఈ స్థలము గురించిన విషయపరమైన యుపదేశమునకు ముగింపునిచ్చుచు శ్రీరేణుకాచార్య భగవత్పాదులవారీ క్రింది విధముగా నానతి నిచ్చిరి.

**విషయాసక్త చిత్తోఽపి విషయాసంగ వర్జితః।**
**శివభావయుతోయోగీ సేవ్యః శివ ఇవాపరః॥**
**ముక్తః సంశయపాశతః**
**స్థిరమనా బోధే చ ముక్తి ప్రదే॥**
**మోహం దేహభృతాం దృశా**
**విఘటయన్ మూలం మహాసంసృతేః।**
**సత్తానందచిదాత్మకే నిరుపమే**
**శైవే పరస్మిన్ పదే।**
**లీనాత్మా క్షీయత ప్రపంచ విభవో**
**యోగి జనైః సేవ్యతే॥**

(సి.శి. 17-78)

సేవ్యుడైన శుశ్రూషువు విషయముల యెడల నాసక్తి గల్గియున్న వాడైనను విషయాసక్త విరహితుడనిపించికొనును. శివభావ సహితుడై యపర శివుడై పూజనీయుడగును. సంశయ రూపమున నుండెడి పాశము చేత ముక్తుడై ముక్తిప్రదమైన జ్ఞాన విషయమున దృఢమైన మతి గలవాడై, దృష్టి చేతనే దేహధారులను పునీతము చేయు శక్తి గలవారై, సచ్చిదానంద రూపియై సంసారము యొక్క విస్తారమును నష్టము చేసెడి వాడై అందరికిని పూజ్యుడగుచున్నాడు. ఇదియే యీ గురూపదేశములోని భావము.

ప్రపంచములోని జ్ఞానులందరు నొకే విధముగా నుండరు. కొందరత్యంత విరక్తులై యుండగా, కొందరు గృహస్థులై యుందురు. వీరి బాహ్య జీవనశైలియు విభిన్నముగా నుండును. అయితే వీరందరిలోను గల జ్ఞానములో భేదముండదు. కృష్ణో భోగీ శుకస్త్యాగీ నృపౌ జనక రాఘవౌ" అనెడి వాక్యము విషయమును స్పష్టీకరించుచున్నది. కృష్ణుడు భోగి, శుకుడు త్యాగి, జనకుడు మరియు రాముడు రాజులుగా నుండినా వారు జ్ఞానులై వెలిగొందిరి. వీరిలోని భోగులు భోగములననుభవించినా శివభావ మనస్కులై విషయ భోగస్మృతుల యెడల నిస్సంగత్వమును పెంచికొని మహాపురుషులైరి.

ఇదే విధిన శుశ్రూషువు సంసారియై కౌటుంబిక జీవనము ననుభవించినా సేవ్యుడే యగుచున్నాడని గ్రహించగలరు.

శివోహమనుడి భావనతో కూడిన శుశ్రూషువుకు తాను శివుడనో కానో యనెడి సందేహముండదు. ముక్తిప్రదమైన జ్ఞానము చిత్తమున స్థిరముగా నుండుటచేత యతని దైహిక చర్యలవలన లోకులు ధన్యులగుదురు. దృష్టిపాతమును పొందినవారు మోహమునుండి విముక్తులగుదురు. వాక్కులచేత శ్రోతలను ముక్తిపథగాములుగా చేయుదురు. ఈ విధముగా సంసారము యొక్క విస్తృతిని నియంత్రించెడి శక్తి గలవారై యుందురు. అందుచేత ముముక్షువులెల్లరు గురువును పూజించిన యటులే, సేవ్యుడని భావింపబడెడి శుశ్రూషువును సేవించి ధన్యతను బడయుదురుగాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యులవారు శిష్యుడు శుశ్రూషులై, శుశ్రూషువు సేవ్యుడై గురువువలె పూజనీయుడై ప్రకాశించెడి విధి విధానమును నెరింగించి మనలను ధన్యులుగా జేసిరి.

పరతత్త్వము గురించి తెలిసికొనవలెననెడి జిజ్ఞాస గల్గిన వారసంఖ్యాకులుగా నుండవచ్చును. అయితే అద్దాని నెరుగుట సులభ సాధ్యమైన క్రియ కాదు. ఈ విషయమును తెలిపెడి శ్రీ బసవేశ్వరుల వారి వచనమును గనుడి :

**ముత్తు ఉదక లాగదు ఉదక ముత్తిన లాగదు ।**
**తత్త్వ ఘటిసిద సుముహూర్తదల్లల్లదె**
**చిత్త వేద్యవాగదు సద్గురువిన కరుణక్కల్లదె**
**కర్తు కూడల సంగమ దేవర బలవిన దయద**
**చిత్త విడిదంగల్లదె, శివతత్త్వ సాహిత్య వాగదు** (వచనము సం. 806)

ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి :

**ముత్తె ముదకము కాదు**
**ఉదకము ముత్తెము కాదు**
**తత్త్వము ఘటించిన**
**సుముహూర్తమునందుననే కాని**
**చిత్తము వేద్యము కాదు**
**సద్గురుని కరుణచే గాని**
**కర్తువు కూడల సంగమదేవుని**
**వలపుల దయచేగాని**
**శివతత్త్వము సాహిత్యము కాదు**

ఈ వచనము ప్రకారము సేవకు లెల్లరు సేవ్యులు కాజాలరు. అయితే "గురోరవలోక మాత్రేణ శిష్యో బోధేన భాసతే" అనెడి భగవత్పాదుల వారి యుపదేశము (సి.శి.17:72) గురుకరుణ వలన యిది సుసాధ్యమని తెలుపుచున్నది. అద్దానిని పొందుటకే శిష్యుడు సేవకుడగుచున్నాడు. శివకరుణ లేనిది శివతత్త్వమబ్బదనియు జెప్పబడినది. హరరూపమే గురురూపమై యుండుటచేత, వారు కరుణకును గురుకరుణకును నభేదము గలదని గుర్తించగలరు. ఈ కారణమువలన గురుకరుణ లేనివారికి శివతత్త్వమ వేద్యమైన దగును. శుశ్రూషు లక్షణాన్వితుడగు ముముక్షువే గురుకరుణను పొంది పరతత్త్వము నెరుగగలడు. అట్టివాడు లోక పూజ్యుడను, పరతత్త్వమును నెరిగినవారి చూచుటకై శ్రీ బసవేశ్వరులవారు చూపిన కుతూహలమును నీ క్రింది వచనమున గాంచగలము :

**పరమ తత్త్వద నిజ సంయుక్తర**
**ఆను నీనెంబ శబ్ద సుఖి గళ తోరు ఎనగె**
**మహానుభావర తోరు ఎనగె**
**లింగైక్యర లింగసుఖిగళ**
**లింగ గుడాగిప్పర**
**లింగాభిమాన గళతోరు ఎనగె**
**అహోరాత్రి నిమ్మశరణర**
**సేవెయల్లిరిసు,**
**కూడల సంగమ దేవా!** (వ.సం. 880)

"తోరు ఎనగె" యనగా చూపు నాకు అని అర్థము.

ఈ విధముగా జ్ఞానాగమమును పొంది శివ-జీవాభేద భావమనెడి సంపదను సంపాదించి, లింగైక్యుడనై శివునితో నభేదమును సాధింతుననెడి లక్ష్యము గలిగిన వాడు పూజ్యుడు కాకుండునే?

*- శివం భూయాత్ -*

# అష్టాదశ పరిచ్ఛేదము

## ప్రాణలింగ స్థలము :

## ఆశీర్వచనము - 1 :

సదాచార సంపన్నులైన ముముక్షువులు క్రితపు ఆశీర్వచనమునందున ప్రసాది స్థలమున ముగింపుకు సంబంధించిన విషయముల గురించి తెలిసికొనిరి. ఇకముందు ప్రాణలింగ స్థలమును గురించి తెలిసికొందురు గావుత.

ముని పుంగవుడైనట్టి యగస్త్యుడు ముకుళిత హస్తుడై వినయ భావముట్టిపడుచుండగా శ్రీ రేణుకాచార్య భగవత్పాదులతో నిట్టులనెను.

**శ్లో॥ ప్రసాది స్థల సంబంధాః స్థలభేదాః ప్రకీర్తితాః ।**
**ప్రాణలింజ్ఞ స్థలారూఢాన్ స్థలభేదాన్ వదస్య మే ॥** (సి.శి. 18-1)

ప్రసాది స్థలములోని యవాంతర భేదములన్ని చెప్పబడినవి. ఇప్పుడు ప్రాణలింగి స్థలము గురించి తెలుప శ్రీ అగస్త్యముని అభ్యర్థనకు ప్రసన్నుడై శ్రీరేణుకాచార్య భగవత్పాదులవారు తమ యుపదేశము నీ విధముగా కొనసాగించిరి.

**శ్లో॥ స్థలానాం నవకం ప్రోక్తం ప్రాణలింగిస్థలాశ్రితం ।**
**ఆదావాత్మస్థలం ప్రోక్తమన్తరాత్మస్థలం తతః ॥**
**పరమాత్మస్థలం పజ్ఞ్యన్నిర్దేహాగమ సంజ్ఞకమ్ ।**
**నిర్భావాగమ సంజ్ఞం చ తతో నష్టాగమస్థలమ్ ॥**
**ఆదిప్రసాదనామాథ తతోప్యంత్య ప్రసాదకమ్ ।**
**సేవ్య ప్రసాదకం చాథ శ్రుణు తేషాం చ లక్షణమ్ ॥** (సి.శి. 18-2,3,4)

ప్రాణలింగి స్థలమునందున తొమ్మిది యవాంతర స్థలములు గలవు. అవి : ఆత్మస్థలము, అంతరాత్మ స్థలము, పరమాత్మ స్థలము, నిర్దేహాగమ స్థలము, నిర్భావాగమ స్థలము, నష్టాగమ స్థలము, ఆది ప్రసాది స్థలము, అన్త్య ప్రసాది స్థలము మరియు సేవ్య ప్రసాది స్థలములు. వీటి లక్షణములను చెప్పెదను వినుము.

**శ్లో॥ జీవ భావం పరిత్యజ్య యదా తత్త్వం విభావ్యతే ।**
**గురోశ్చ బోధయోగేన తదాత్మాయం ప్రకీర్తితః ॥** (సి.శి. 18-5)

గురువులవారి యుపదేశానుసారము చేత శిష్యుడు జీవభావమును వదిలి యెప్పుడు పరతత్త్వము గురించి తెలిసికొనునో, అప్పుడతడు ఆత్మయని పిలువబడును.

ఆత్మభావము వలన గల్గెడి స్థితిని ప్రతిపాదించెడి స్థలమే ఆత్మస్థలము.

ఆత్మ స్వరూపము గురించి ఛాందోగ్యోపనిషత్తు నందున యీ విధముగా తెలుపబడినది.

**శ్లో॥ "ఏష ఆత్మా అపహతపాప్మా విజరో**
**విమృత్యుర్విశోకోఽ విజిగిత్సోఽ పిపాసః**
**సత్యకామః సత్యసంకల్పః"**

ఆత్మకు పాపము, ముదిమి, శోకము, హింస, తృష్ణాదులుండవు. అందుచేత, నయ్యది సత్యకామము, సత్య సంకల్పము నయినదై యుండును. పుణ్యపాపములు నంతఃకరణపు ధర్మములై యుండుటచేత, నయ్యవి ఆత్మనంటజాలవు. జరా–మరణములు దేహమునకుచెందిన ధర్మములగుటచేత నయ్యవి ఆత్మకు సంబంధించినవి కావు. ఆత్మకు ఆకలి దప్పులుండవు. ఆత్మను హింసకు గురి చేయజాలము. ఈ విధముగా ఆత్మకు ప్రాణాంతఃకరణదేహాదుల గుణములుండవని తెలుపబడినది. ఇంతటి ఆత్మలక్షణముల నెరిగినవాడై జీవ లక్షణములను విడిచినవాడే ఆత్మస్థలియని పిలువబడును.

ఆత్మస్థలమున నుండెడి సాధకునికి ఆకలిదప్పులు, శోక–మోహములు, పుణ్య–పాపములుండవని చెప్పజాలము. సాధారణ జీవికుండెడి ఆకలి–దప్పి యిత్యాదులు నాత్మస్థలికిని గల్గును. కాని యివి ప్రాణాదుల ధర్మములని యెరిగినవాడై, యతడు వాటియెడల నభిమాన రాహిత్యమును గల్గియుండును. ఆ విధముగా నతడు వాటి బంధముల నుండి ముక్తిని పొందుచున్నాడు.

శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారు తమరి యుపదేశమునందున నాత్మ యొక్క స్వరూపము నీ విధిన వివరించిరి:

**శ్లో॥ వాలాగ్రశతభాగేన సదృశో హృదయస్థితః ।**
**అనశ్నన్ కర్మఫలం సర్వమాత్మా స్ఫురతి దీపవత్ ॥** (సి.శి. 18–6)

హృదయము నందున తలవెంట్రుక కొన యొక్క శతభాగమంత పరిమాణములోనుండి, కర్మఫలము ననుభవించుచు, ప్రకాశమానముగా నుండును.

భారతీయ ధార్మిక దార్శనికులు, ఆత్మ గురించియు, దాని స్వరూపమును గురించియు నెంతో చింతనను చేసిరి. ఆత్మ యొక్క పరిమాణమును గూర్చి విభిన్న సిద్ధాంతములు ప్రతిపాదింపబడినవి.

అణువు, మధ్యమ మరియు విభువనెడివి మూడు ప్రధానమైన సిద్ధాంతములు. న్యాయము, వైశేషికము, సాంఖ్యము, యోగము, పూర్వ మీమాంస మరియు వేదాంతములనెడి దర్శనములు తమ తమ సిద్ధాంతములలో నాత్మను విభువుగానే భావించినవి. అయితే ఆత్మల సంఖ్యను గురించి వీరిలోన నేకాభిప్రాయము లోపించినది. అద్వైతులు విభువైనట్టి యాత్మ యేకాకియై అనేకమైనట్టి యాత్మలుండునని అందురు. ఇతరులీ విషయము నంగీకరించలేరు. ఆత్మలనేకములనెడిది తప్పుడు వాదన.

ఎన్ని కాయములు గలవో అన్ని ఆత్మలుండునని వీరు ప్రతిపాదించిరి.

జైనుల సిద్ధాంతము ప్రకారము ఆత్మయొక్క పరిమాణము మధ్యమముగా నుండును. సంఖ్యా విషయమున వీరు తమ వాదములో నేకాత్మ ప్రతిపాదనను తిరస్కరించిరి. ఆత్మలనేకములనియు వీరు వాదింతురు. వీరశైవ సిద్ధాంతములో నాత్మను నణువు పరిమాణము గలదానిగా గుర్తించనైనది. సంఖ్యా విషయమున ననేకాత్మలనెడి భావన వీరికి గలదు.

ఈ వివిధ వాదములను పరిశీలించిగా వీటిలో నెయ్యది సరియైనది యనెడి సందేహము గల్గుట సహజమే. ఈ విషయము గురించి విచారించుట యెంతో అవసరము.

శరీరము కంటెను భిన్నముగా నుండెడి యాత్మయు ననేక యుగములనుండి యెనుబది నాలుగు లక్షల జీవులకు సంబంధించిన దేహములు ధరించుచు, వీడుచుచు వచ్చుచున్నది. అందుచేత శరీరము కంటెనే నాత్మయే నిత్యమైనదని గుర్తించవలెను. ఇదొక సహజమైన విచారధారగా దోచుచున్నది. ఈ విధముగా నిత్యముగా నుండెడి యాత్మ "అణువు లేదా విభువు" ప్రమాణమున నుండవలెను. కారణమేమనగా నీ రెండును నాశనము లేనివై యుండును. దార్శనికులలో నధికులు నీ రెంటిలోన నేదియో నొకదానిని సత్యమైనదని యెంచిరి. ఆత్మ యొక్క నిత్యపు దృష్టిచేత నీ రెండును సూక్ష్మమైనవిగా దోచినా, వ్యవహారపు దృష్టితో చూసిన నివి సూక్ష్మమైనవి కావని జైనులు వాదింతురు. పరిమాణము విషయమున వీరు మధ్యమ వాదమును ప్రతిపాదించిరి. వారి విచార ధార ప్రకారముగా, జీవాత్మకు లభ్యమయ్యెడి గాత్రములు వివిధ పరిమాణములలోన నుండును. 84 లక్షల శరీరములలో క్రిమి–కీటకాదుల కాయములతి సూక్ష్మమైనవై యుండును. ఏనుగు, తిమింగలాదుల గాత్రము లతి పెద్దవిగా నుండును. ఇట్టి స్థితిలోన దేహములన్నింటిలో నుండి వ్యవహరించెడి ఆత్మ అణువు ప్రమాణముగా నుండెడిదని

యొప్పినచో అణువు ప్రమాణమున నుండెడి గాత్రములలోన నది నిండికొని యుండుట సంభవించినా, ఏనుగు, తిమింగలాదుల కది వర్తించదు. స్థూలదేహమునకది సూక్ష్మమైనదై యొక మూలన నుండెడి యాత్మ, సర్వావయవ వ్యవహారముల యెడల యభిజ్ఞమై యుండజాలదు. అందుచేత, అణువు వాదన యనంగీకార యోగ్యమైయున్నది. ఆత్మ విభువాకారమున నుండినచో నయ్యది సూక్ష్మ శరీరములలో నెట్టుల ప్రవేశించి వ్యవహారములను నిర్వహించగలదు. ఈ కారణములచేత ఆత్మ యొక్క పరిమాణము మధ్యమమైనదనెడి వాదనయే సూక్తమైనదని జైనులు భావింతురు. ఈ విధముగా వాదించుటవలన నాత్మ యొక్క నిత్యత్వ భావన కెట్టి యాఘాతము గల్గదని వారందురు.

ఆత్మను విభువుగా స్వీకరించిన సిద్ధాంతములలో సంఖ్యాది విషయములలోన భేదాభిప్రాయములు గలవు. ముఖ్యముగా అనంతత్వము మరియు చిద్రూపము గురించి యభిప్రాయ భేదములు గలవు. న్యాయ, వైశేషిక, పూర్వ మీమాంస మరియు సాంఖ్య సిద్ధాంతములకు చెందినవారు విభుత్వ, అనుతత్వ విషయములలో విభేదించకుండినను, చిద్రూపత్వము గురించిన భేదాభిప్రాయములను గల్గియున్నారు.

సాంఖ్యలాత్మను చిద్రూపముగా నొప్పికొనిరి. కాని, న్యాయ వైశేషికులాత్మను జడముగా గ్రహించిరి. దానికి మనస్సుతోసంయోగము గల్గినప్పుడే నయ్యది జ్ఞానము గలదిగా యగునని తెలిపిరి. "జ్ఞానాధికరణ మాత్మా"యని వీరు ప్రతిపాదించిరి. జ్ఞానోత్పత్తికి యాత్మయనెడి దధికరణమనునది దీనియొక్క భావార్థము. అధికరణమును నాధారముగా గ్రహించవలెను. ఆత్మతో మనస్సుకు సంయోగమైనప్పుడు జ్ఞానము, సుఖము, దుఃఖము, ఇచ్ఛా, ద్వేషము, ప్రయత్నము, ధర్మము, అధర్మము, సంస్కారములనెడి తొమ్మిది విశేషగుణములాత్మకు కలుగుచున్నవని వీరు వాదింతురు. న్యాయ వైశేషికుల యీ యభిమతము ప్రకారముగా నాత్మ సగుణమైనదగుచున్నది. అయితే సాంఖ్యులిందుకు విరుద్ధముగా నాత్మ యొక్క నిర్గుణత్వమును ప్రతిపాదించిరి.

ఆత్మయందున స్వాభావికమైన చిద్రూపము నొప్పక రెండు రాళ్ళ ఘర్షణ చేత నిప్పు పుట్టెడి విధమున జడములైనట్టి యాత్మ-మనస్సుల సంయోగము వలన జ్ఞానాది గుణములుత్పన్నమగుననెడి న్యాయ-వైశేషికుల యీ వాదమొక విధమైన భౌతిక వాదమేయగును. ఇంతేకాదు, ఆత్మ విభువుగా నుండుట చేతను, మనస్సు అనెడి దణువుగా నుండుటచేతను నీ రెండును నిరవయములుగా నుండును. ఇది యిట్టులుండగా, నీ రెండింటి సంయోగము నశక్యమైనదిగా దోచుచున్నది. ఒకవేళ వాటి సంయోగమెటులో యటుల సంభవించినా విభువైన ఆత్మలో నణువైన మనస్సు యొక్క సంయోగముండుట చేత, నాత్మయందున నెల్లప్పుడు జ్ఞానాదిగుణములుత్పన్నమగుట యవశ్యమైనదగును. ఇంతేకాదు మనస్సు యింద్రియాదులచేత సంయోగమగుటచేత వాటిలోన జ్ఞానముత్పన్నము కావలెను. అట్టియెడ నణువైన మనస్సు నొకే సమయమున నాత్మ-మనస్సులతో సంయోగమును సాధించగలదనెడి సందేహము గల్గును. దీనికి ప్రత్యుత్తరముగా న్యాయ వైశేషికులు ఇట్టి సంయోగమునందున యీశ్వర శక్తి యొక్క ప్రమేయము గలదని యందురు. సంయోగ విధియందున యీశ్వరశక్తిని నియామకముగా గ్రహింతురు. ఈ విషయములను పర్యాలోచన చేసినప్పుడు దోచెడిదేమనగా, ఆత్మ-మనస్సుల సంయోగము చేత నాత్మయందున చైతన్యము గల్గునని నిరూపించుట కంటెను నాత్మ స్వతఃగా చిద్రూపమై యుండుననుటయే యధిక సూక్తమైనదని తెలియవచ్చుచున్నది. ఈ విషయమున న్యాయ-వైశేషికుల కంటెను సాంఖ్యుల మతము కొంతమేరకు సూక్తమైనదిగా దోచుచున్నది. వీరు తమ సిద్ధాంతములో నాత్మను చిద్రూపమైన దానిగా గ్రహించిరి. అయితే యీ ఆత్మకు జ్ఞానాదిగుణము లేవియును నుండవు. ఇది నిర్గుణమైనదై యుండి, శుద్ధమైన స్ఫటికమువలె స్వచ్ఛముగా నుండును.

సాంఖ్య సిద్ధాంతము ప్రకారము, ఇచ్ఛాజ్ఞానములు నంతఃకరణము యొక్క ధర్మములై యున్నవి. ఎరుపు వర్ణపు పువ్వుల సంపర్కము వలన స్ఫటిక మరుణ వర్ణముగా దోచునటులే, యంతఃకరణముల సన్నిధిలో నాత్మయందున జ్ఞానాది గుణములు ప్రతీతమౌనని సాంఖ్యులు ప్రతిపాదించిరి.

మీమాంసకులు, ఆత్మను న్యాయాయికుల వలె కేవలము జడముగాను, సాంఖ్యుల వలె కేవలము చిద్రూపముగాను నంగీకరించక దానిని ఖద్యోతమువలె నుండునదిగా భావింతురు. ఖద్యోతమనగా మిణుగురు పురుగు.

న్యాయ, వైశేషిక, సాంఖ్య, పూర్వమీమాంసలకు చెందినట్టి యాచార్యులాత్మను విభువుగా నొప్పికొని, సంఖ్యా విషయమున నయ్యది యనంతమైనదని యనిరి. విభురూపములైనట్టి యాత్మలు నొకే రూపమున నుండుటచేత, వాటియందున పరస్పరము భేదమును చేయుట యెట్టుల యనెడి విషయమున వీరు నిరుత్తరులై యుండిరి. ఈ విషయమున వీరింతకంటె నధికముగా చింతించలేదని తెలియదగును.

విభువైనట్టి యాత్మలు నెల్లప్రదేశముల యందున సమానముగా నుండుటచేత, మనస్సు, లింగము, శరీరము, తనదేయైన సంబంధము నెట్టుల స్థాపించికొనగలదు? ఒక్కటే యైనట్టి యాత్మ విభిన్నమైన శరీరములలోన నే విధముగా సుఖ-దుఃఖముల ననుభవించగలదు? ఈ

ప్రశ్నలకు వారు చెప్పెడి సమాధానమేమనగా, సంబంధములు రెండు విధముగా నుండును. అవి : సామాన్య మరియు విశేష సంబంధములు. వేరే వేరే శరీరములు వేరే వేరే ఆత్మలతో సామాన్యమైన సంబంధము గల్గియున్నను, తనదే యగునట్టి యాత్మయందున, విశేషమైన సంబంధమును గల్గియుండును. ఈ విశేష సంబంధముచేతనే ఆత్మలు సుఖదుఃఖముల ననుభవించుచున్నవని తెలుపబడినది. ఇట్టి వీరి యభిమత మంత సూక్తమైనది కాదు. విభువైనట్టి యాత్మ తనకు సంబంధించినట్టి శరీరముతో మనస్సు మొదలైన వాటిచేత సుఖ-దుఃఖాదుల ననుభవించినను తన శరీరమును వేరుగా జేసి వేరే ప్రదేశమునందున గల యాత్మకు సుఖదుఃఖముల గురించినట్టి యరయిక పురఃధని యొప్పికొనవలసియుండును. అట్టి యెడ, శరీరముకంటెను దూరముగా నుండెడిదగు ఆత్మ వుండినా లేనట్టుగానే అగుచున్నది. అందుచేత, ననేకాత్మల నొప్పికొని వాటి విభత్వము నంగీకరించుట నిరర్థకమైనదగుచున్నది.

ఆత్మను విభువుగా నొప్పిన యెడల నయ్యది యెల్లప్పుడు నెల్లకడల యందు నుండి యుండుటచేత మృతదేహముల నుండి యాత్మల యుత్క్రాంతి, గతి-అగతులు సంభవింపజాలవు. ఒకవేళ యుత్క్రాంతిని యొప్పకుండినచో నుత్క్రాంతిని ప్రతిపాదించెడి శృతి స్మృతి వాక్యములు నిరర్థకములగును.

అద్వైతులాత్మను విభువని ప్రతిపాదించి, దాని యేకత్వమును ప్రతిపాదింతురు. ఒక్కటే అయినట్టి యాత్మ శరీరాది యుపాధుల మూలకముగా ననేక విధములుగా దోచుచున్నది. వీరికిది తోచుట ఔపాధికమైనది గావున వారు నౌపాధిక భేదమును వ్యవస్థీకరించుచున్నారు. వీరు చెప్పెడి భేదము నైపంచారికమైన దైనందున, విభువైనట్టి యాత్మలోనభేదముండును. ఆత్మను విభువని చెప్పుట చేత నింతకంటెను క్రితము చెప్పబడిన యుత్క్రాంతి, గతి మొదలగు వాటి వ్యవహారము సంభవించకనుండెడి దోషము వచ్చి చేరును. ఈ కారణముచేత, ఆత్మ యొక్క విభుత్వ విచారమంత సమంజసమైనదిగా దోచుటలేదు.

వీరశైవ సిద్ధాంతము నందున నాత్మను "ఏషోఽణురాత్మా చేతసా వేదితవ్యః" "అంగుష్ఠ మాత్రః పురుషో న్తరాత్మా యనెడి యుండక, కఠోపనిషదాదులలో నుడువబడినట్టి వాక్కులు చెప్పిన యటుల నాత్మను నణువు ప్రమాణము గలదానిగా స్వీకరించనైనది. ఈ విషయమున శ్వేతాశ్వతరోపనిషత్తులో నీ క్రింది విధముగా తెలుపబడినది.

**శ్లో॥ వాలాగ్రశత భాగేన శతధా కల్పితేనతు ।**
**భాగ ఆత్మా స విజ్ఞేయః సచానంత్యాయ కల్ప్యతే ॥**

ఈ ఉపనిషత్తులోన నాత్మయొక్క అణుత్వము మరియు ననేకత్వము ప్రతిపాదింపబడినది.

ఇంతకంటెను క్రితమే తెలిపిన యటుల శ్రీరేణుకాచార్య భగవత్పాదులవారు, ఆత్మయొక్క అణుత్వమును ప్రతిపాదించిరి.

ఆత్మ నణువుగా వొప్పిన యెడల, అయ్యది శరీరములోని యేదో నొక భాగమున నుండిన పిదప, ఆపాద మస్తక పర్యంతముగా నయ్యెడి శరీరపు వ్యవహారములన్నింటి యొక్క యెరుక దానికెట్టులగును? ఈ ప్రశ్నను పరిహరించుటకే పూజ్యులు దీపము యొక్క వుపమానము నిచ్చిరి. చిన్నదగు దీపము గృహములోని యన్ని భాగములను ప్రకాశమానము చేయును. అదేవిధముగా హృద్గతమగు ఆత్మ, అణు ప్రమాణములో నుండినా అనంతమైన ప్రకాశమును వెదజల్లును. ఆపాద మస్తక పర్యంతమును ప్రకాశవంతముగా చేయును. ఈ కారణమున నయ్యది యింద్రియములన్నింటియొక్క వ్యవహారములను గమనించగల స్థితిలోన నుండును. ఆత్మను నణువుగా స్వీకరించుటచేత, ఆత్మ యొక్క నిత్యత్వము సిద్ధమగుచున్నది.

ఈ విధముగా, అణు పరిమాణము గల నిత్యమైన ఆత్మ, తాను చేసిన కర్మల ఫలమును సుఖ-దుఃఖముల రూపమున ననుభవించునని శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారు తెలియజేసిరి.

సకల జీవరాశిలో నుండెడి యీ ఆత్మకు మల సంబంధముండునని శ్రీ రేణుకాచార్య భగవత్పాదులవారు సెలవిచ్చిరి. గమనించుడి :

**శ్లో॥ ఆత్మాపి సర్వభూతానామన్తః కరణమాశ్రితః ।**
**అణుభూతో మలాసంగాదాదికర్మనియంత్రితః ॥** (సి.శి. 18-7)

ఆత్మ అంతఃకరణము నాశ్రయించికొని పూర్వకర్మచేత నియంత్రింపబడుచు, మల సంబంధము గల్గియుండి సుఖ-దుఃఖముల ననుభవించుచుండును.

మూలతః ఆత్మతత్త్వము వ్యాపకమైనదై, సర్వమునకు కారణభూతమై యుండును. దాని నుండియే సకల భూతములుత్పన్నమగుచున్నవి. ఈ విషయమై శ్రుతి యీ క్రింది విధముగా తెలుపుచున్నది.

శ్లో॥ తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశ
స్సంభూతః ఆకాశాద్వాయుః వాయో
రగ్నిః అగ్నేరాపః అద్భ్యః పృథివీ
పృథివ్యాదోషధయ ఓషధిభ్యోఽన్నం అన్నాత్ప్రజాః

ఈ విధముగా ఆత్మనుండియే పంచమహాభూతములుత్పన్నమైనవని తెలుపబడినది. పంచభూతాదుల యుత్పత్తికి కారణభూతమైన ఆత్మ యెంత పెద్దగా వుండవలెనో వూహించవచ్చును. అయితే, యిట్టి ఆత్మ అనాది మల సంబంధము చేత నణువు రూపమునొందునని తెలిసికొనగలరు.

వీరశైవ సిద్ధాంతము ప్రకారము, ఆత్మకు మలత్రయములే జీవత్త్వమును తెచ్చిపెట్టుచున్నవి. మూడింటిలో మొదటిదగు ఆణవ మలమాత్మనావరించుటచేత నాత్మకు నణుత్వము సిద్ధించుచున్నది. తత్ఫలితముగా, ఆత్మయు తన వ్యాపక స్వరూపమును మరచి, తానత్యంత సంకుచితమైన దానిగా తెలిసికొనుచున్నది. మాయా మల మావరించుట చేత, ఆత్మకు భేదభావ ముత్పన్నమగుచున్నది. భేదీ జ్ఞానము చేత, నేను నాది యనెడి మోహమావిర్భవించుచున్నది. ఈ పరిణామముల పిదప, జీవుడు శుభాశుభ కర్మలను చేయుటకు పూనుకొనును. కర్మాచారణము వలన సంక్రమించిన సుకృత-దుష్కృతములును, వాటి వాసనలను కార్మిక మలముగా పిలువబడుచున్నది.

ఈ మలత్రయముగా, సంకుచితమైన శక్తిత్రయమని గుర్తించవలెను. పరశివుని యిచ్ఛాశక్తియే, సంకుచితమై యాణవ మలమగుచున్నది. దీనివలన జీవుడు పీడింపబడుటచేత, నతడు తన విభుత్వమును మరచిపోయి, "అపూర్ణోఽస్మి" అనెడి భావమును పొంది తదనుగుణముగా వ్యవహరించుచున్నాడు. ఈ విషయము గురించి క్షేమరాజాచార్యులవారు "అపూర్ణమ్మన్యతా రూపమాణము మలమ్" అని సెలవిచ్చిరి. ఈ విధముగా వీరు ఆణవమలము యొక్క లక్షణమును తెలిపిరి.

పరశివుని జ్ఞానశక్తి సంకుచితమై మాయా మల రూపమును దాల్చుచున్నది. దీని ప్రభావము వలన జీవుడు తాను పరశివుని కంటెను భిన్నమైన వానిగాను, శరీరాదులే తాననియును, సతీ-సుతాదులే తనవనియును వ్యవహరించుచున్నాడు. "భిన్న వేద్య ప్రథారూపం మాయియం మలమ్" అని చెప్పిన క్షేమరాజాచార్యులవారు, మాయా మలము యొక్క లక్షణమును తెలిపినవారైరి.

పరశివుని క్రియాశక్తి సంకుచితమై, కార్మిక మల స్వరూపమును దాల్చుచున్నది. దీనివలన జీవుడు కర్మలను చేయువాడై, వాటి ఫలములననుభవించుచు, జనన-మరణాదులకు లోనగుచు నీ సంసారమున పరిభ్రమించుచున్నాడు. క్షేమరాజాచార్యుల వారు కార్మిక మల లక్షణమును ప్రతిపాదించుచు "శుభాశుభానుష్ఠానమయం కార్మ మల" మ్మని సెలవిచ్చిరి.

ఈ విధముగా మలావృతుకుడైనట్టి యాత్మ జీవుడనియును, ఆత్మయే పరమతత్త్వమని యెరుంగవలెను. "జీవత్వం దుఃఖ సర్వస్వం తదిదం మలకల్పిత" మ్మనెడి రేణుకులవారి వాక్కుల నీ నేపథ్యమున గ్రహించవలెను. శ్రీ వారిచ్చట జీవత్వము యొక్క లక్షణమును తెలిపిన వారైరి. వీరశైవ ధర్మమునందున ప్రతిపాదించబడిన పరమ రహస్యమేమనగా పరమతత్త్వము లేదా ఆత్మయనెడి దొక్కటే అయి యుండును. సచ్చిదానంద రూపమున నుండెడిదగు నియ్యది సర్వ వ్యాపకత్వమును గలిగియుండును. ఈ తత్త్వము యొక్క శక్తి యపరిమితమైనది. పరమతత్త్వము యొక్క లీలావస్థలో దానిశక్తి యిచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తులుగ విభజితమై ప్రకటితమగును. ఈ శక్తులు సంకోచమును చెంది మలములై పరమతత్త్వమును పరిమితస్థితిలో నుండెడి జీవునిగా మార్చివేయుచున్నవి. ఈ విధముగా, జీవుడు పరమతత్త్వము యొక్క యంశయగుచున్నది. ఇద్దానిని ఘటాకాశముతో పోల్చవచ్చును. అఖండమైన ఆకాశము వేలాది సంఖ్యలలో నుండెడి జలభరిత ఘటములలో కన్పట్టును. దాని పరిమితి ఘటముచేత పరిమితము చేయబడి యుండును. ఘటము భగ్నమైనప్పుడు ఘటాకాశమఖండాకాశములో నొక యంతర్భాగమగును. జీవుని విషయములో, గురుకారుణ్యము వలన లబ్ధమయ్యెడి మలచ్ఛేదనము వలన జీవుడు శివుడగుచున్నాడు. సంకోచితమై యుండెడి శక్తులన్నియు వికాసమొందుచున్నవి.

ఈ ఆత్మ దేహాభిమానము గల్గిన దెట్టులగునో అనెడి సందేహమును దీర్చుటకై శ్రీ రేణుకాచార్యులవారీ విధముగా నుపదేశించిరి :

**శ్లో॥ జపాయోగాద్యథా రాగః స్ఫటికస్య మణేర్భవేత్ ।**
**తథాఽహఙ్కార సంబంధాత్మనో దేహమానితా ॥** (సి.శి. 18-8)

ఏ విధముగా జపాకుసుమ సంయోగముచే స్ఫటికమెరుపు రంగును పొందునో, అదే విధముగా నహంకార సంబంధముచేత ఆత్మ దేహాభిమాని యగుచున్నదనెడిదే యుపదేశములోని సారాంశము.

స్ఫటికమెంతో పరిశుద్ధమైనదై యుండును. దీనిలో రంగులేవియును నుండవు. ఎరుపు వన్నెగల వస్తువు సాంగత్యమును పొందగానే అది యెరుపు వన్నెతో ప్రకాశించును. కొందరు భ్రమకు లోనై దీనిని లోహితమణి యనెడి యవకాశము గలదు. పరిశుద్ధమైనట్టి యాత్మ స్ఫటికము వంటిదే. అహంకారము వలన నియ్యది జీవభావమును పొంది దేహాభిమానియగుచున్నది. ఈ సత్యమును మీరెల్లరు గ్రహించి దేహాభిమానమును త్యజించుట కొరకు ప్రయత్నింతురు గావుత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీకాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యులవారు నీ యాశీర్వచనము నందున నాత్మ జ్ఞానమును ప్రదానము చేసిరి. శ్రీవారు కటాక్షించిన విభు అణువులనెడి వాటి విశ్లేషణ యెంతో జ్ఞానదాయకమై యొప్పుచున్నది.

విభువుగా నుండెడిది శివుడే. పరతత్త్వము నెరింగిన సేవ్యస్థలి యీ విషయము నెరిగినవాడై యుండును. అయితే ఆత్మస్థలమున కెదిగిన పిదప నీ విషయమతని నెప్పటికప్పుడు స్ఫురించుచుండును. శివుని విభుతత్త్వము గురించి బసవ పురాణం యీ క్రింది విధముగా తెలుపుచున్నది.

ఆత్మయు పరమాత్మ యనరాదు, వినుడు ఆత్మదా పంచభూతాత్మకంబయ్యు, నాత్మదా పంచేంద్రియాత్మకంబయ్యు, నాత్మదా దేహ గుణాత్మకంబయ్యు నుండు గావున, నాత్మయును గాడు శివుడు. ఖండిత సూక్ష్మ వికస్వర లీల సకలము గపట నాటక సూత్రములను బ్రకటించు చైతన్య భావంబు శివుడు అందు "నణీరణీయా"నన జొచ్చి సందులేకున్నట్టి శంభుండు శివుడు.

(బసవ పురాణం, షష్ఠాశ్వాసము)

శివుని విభుత్వమును సవివరముగా తెలిపెడి యీ పద్యమును చూడుడి :

**సీ॥శ్రుతి॥ "విశ్వతశ్చక్షురుత విశ్వతోముఖో**
**విశ్వతోబాహు" నా విమల కీర్తి**
**యలర "నణోరణీయాన్మహతో మహీయా"**
**నన విశ్వతోవ్యాప్త మూర్తి**
**యొనర దా నభిరతి "నోన్నమో నమ"యన**
**నతులిత మహిమ మహత్ప్రపూర్తి**
**మహిమ దీపింప "సోమః పవతేజని**
**తామతీ నా" మన ధన్య కీర్తి**
**ఆ॥ శివుడె యంచు సకల శిష్టులు పలుకంగ**
**మ్రోయునట్టి వేదములు దొడంగి**
**చదవి చదివి కూళలదియెట్లకో శివ**
**భక్తిహీనులైరి బసవలింగ!** (చతుర్వేదసారము, ప. 35)

విభురూపమును “విశ్వతో వ్యాప్తమూర్తి” యని యభివర్ణించినట్టి చతుర్వేదసారము విభు భావము యొక్క విస్తృతిని తెలుపుచున్నది. విభువు యొక్క విశ్వతోవ్యాప్త రూపము నెంతో రమ్యముగా చిత్రించి చూపుచున్న శ్రీ బసవేశ్వరుల వారి యీ వచనము గమనార్హమైనదై యున్నది.

**ఎత్తెత్త నోడిదడత్తత్త నీనె దేవా,**
**సకల విస్తారద రూహు నీనె దేవా,**
**విశ్వతశ్చక్షు నీనె దేవా**
**విశ్వతోముఖ నీనె దేవా**
**విశ్వతో బాహు నీనె దేవా,**
**విశ్వతఃపాద నీనె దేవా,**
**కూడల సంగమ దేవా!** (వచనము సం. 532)

ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి :

ఎటెటు చూసిననటుల నీవే దేవా!
సకల విస్తారపు రూపు నీవే దేవా!
విశ్వతశ్చక్షు నీవే దేవా
విశ్వతోముఖ నీవే దేవా
విశ్వతో బాహు నీవే దేవా
విశ్వతో పాద నీవే దేవా
కూడల సంగమ దేవా!

అంగ ప్రాణలింగ స్థలములోని సాధన అనుభవమునకు ననుబంధము గల్గియుండును. సచ్చిదానంద మూర్తియైన శివుని గూడికొని యతని ననుభవించుటే సాధకునికి కర్తవ్యమైయుండెననెడిది గ్రహించవలసిన విషయము. అంగ ప్రసాది స్థలమున స్వీయ సాధనాబల ప్రభావము వలన ప్రసాదకాయులై ప్రభలను విస్తరించెడి సాధకుడీ స్థలమున “లింగ సత్ప్రాణి”గా పరిణమించనెంచును. శివానుభవ సంపాదనకు మార్గదర్శక సాధనమని యెంచదగిన “యనుభవసారము” లింగసత్ప్రాణి యొక్క లక్షణములను నీ క్రింది విధముగా వివరించినది.

**సీ॥ లింగసంజాతులు లింగ విఖ్యాతులు**
**లింగ సదర్థులు లింగముఖులు**
**లింగాభిమానులు లింగావధానులు**
**లింగవిజ్ఞానులు లింగసఖులు**
**లింగ ప్రమోదులు లింగవినోదులు**
**లింగాత్మవాదులు లింగసములు**
**లింగసత్ప్రాణులు లింగధురీణులు**
**లింగనిర్వాణులు లింగసుఖులు**

**లింగయోగ్యులధిక లింగ సౌభాగ్యులు**
**లింగభక్తిపరులు లింగ ధరులు**
**లింగలీయు తాత్మలింగ విధేయులు**
**లింగతత్త్వరతులు లింగమతులు** (అనుభవసారము, ప. 201)

ఈ స్థితిని సాధించుటకై సాధకుడు "సప్రాణలింగ లింగ ప్రాణమథన విలీనాంతరము ప్రాణలింగి లీల" యనెడి లీలలో క్రీడించుచుండును. (అనుభవసారము, ప. 238) ఇట్టి లీలలోన రమించెడి వానికి జీవభావముండదు. హితకారి జీవభావమును త్యజించుటయనెడిది ప్రాణలింగి యొక్క మౌళిక లక్షణమని తెలిపెడి యీ రగడను గమనించుడి:

**జీవద్విముక్తో భవిష్యతి శ్రుతితతివ**
**చో విశేషార్థక ప్రాణలింగీశ్వరం** (సోమనాథుని షట్‌స్థలద రగడ)

త్యజంచవలసిన జీవ లక్షణము లెట్టివో యనెడి సందేహమును నివృత్తి చేసికొనవలెనని యెడల జీవత్వ శివత్వముల యొక్క తులనాత్మక పరిశీలన చేయవలసియుండును. అట్టి ప్రయత్నమునకు దోహదకారిగా నుండెడి బసవ పురాణములోని యీ క్రింది ద్విపదుల గనుడి :

**జీవుడు శివుడని భావింతురేని**
**జీవుడు మలినుడు శివుడు నిర్మలుడు**
**జీవుడు దుష్కర్మి శివుడు నిష్కర్మి**
**జీవుడు సకళుడు శివుడు నిష్కళుడు**
**జీవుడు పశుమూర్తి శివుడు పశుపతి**
**జీవుడు ముక్తుండు శివుడు ముక్తుండు**
**జీవుడు పభవుండు శివుడు భవుండు**
**జీవుడనిత్యుండు శివుడు నిత్యుండు**
**జీవుడశుద్ధుండు శివుడు శుద్ధుండు**
**జీవుడు మృత దుఃఖి శివుడమృతుండు**
**జీవుడు సంసారి శివుడసంసారి**
**జీవుడు సందేహి శివుడసందేహి** (బసవ పురాణము.ష–ఆ.)

జీవ లక్షణములను వదలించుకొనుట యనెడిదంత సులభసాధ్యమైన కార్యము కాదు. మిశ్రతత్త్వములలో నొకటైదియును, శివ–జీవ భేద భావ పరికల్పన ప్రక్రియలో ప్రధానమైన భూమికను పోషించెడిదియును, శివత్వము గల్గిన వానిని పురుషునిగాను, నా పురుషుని సంసారిగాను పరిణమించెడి స్థితికి దిగజార్చెడిదియును నయినట్టి అవిద్యా ప్రభావమునకు లోనుకాకుండా ప్రయత్నమును కొనసాగించిన యెడల కార్యసిద్ధి గల్గెడి యవకాశము గలదు. అంగప్రాణలింగి యొక్క ప్రయత్నమునకు చేయూతనిచ్చి యతని యత్నమును సఫలీకృత ప్రయత్నముగా చేయుటకై శివుడు లింగ ప్రాణలింగియై ఆత్మగా హృదయస్థుడై, చిత్ ప్రకాశ వితరణశీలియై, నిత్య చైతన్య పరిస్ఫూర్తి ప్రదాతయై సాధకుని వెన్నంటి యుండునని శివసిద్ధాంతజ్ఞుల నిశ్చితాభిప్రాయము. శివుడే లింగ స్థలియై యాత్మస్థలియై అంగ ప్రాణలింగ స్థలికి మార్గదర్శకుడగుచున్నాడు. శిష్య స్థలమున గురుసేవా పరాయణుడై, శుశ్రూష స్థలమున పరతత్త్వ విజ్ఞాన సముపార్జన సౌశీల్య లక్షణ సమన్వితుడై అంగ ప్రాణలింగికి పథ నిర్దేశన ప్రక్రియలో తానే యొక యుదాహరణయై నిలుచుచున్నాడు. అంగ ప్రాణలింగి గురుసేవను సలిపి, గురుకారుణ్యమును పొంది, శుశ్రూష నిమగ్నుడై గురూపదేశ శ్రవణాసక్తుడై, పరతత్త్వము యొక్క విలక్షణ లక్షణములను గుర్తెరిగి ఆత్మానాత్మ వివేక సంపన్నుడై నిస్సందేహ సమన్వితమైనట్టి చిత్తము గలవాడై జీవత్వ లక్షణములను వీడవలెను.

*శుభం భూయాత్*

## ఆశీర్వచనము - 2 :

## ఆత్మ స్థలము :

ముముక్షువులింతవరకు లింగ స్థలమునగల ప్రాణలింగస్థలము నందలి యాత్మ స్థలము గురించి తెలిసికొనుచుండిరి. శుద్ధ స్ఫటికము వంటిదైనట్టి పరతత్త్వము, అహంకార సంయోగము వలన దేహము యెడల నభిమానము వహించునని క్రిందటి ఆశీర్వచనమున తెలుపబడినది. అయితే పూర్వోక్తమైన గుణములతో విరాజిల్లెడి యాత్మకు దేహముతో నేవిధిన సంబంధము గల్గును ననెడి సందేమము కలుగును. ఈ విషయము గురించి శ్రీ రేణుకాచార్యులవారీ క్రింది విధముగా నుపదేశించిరి :

అశరీరోఽపి సర్వత్ర వ్యాపకోఽపి నిరఞ్జనః ।
ఆత్మా మాయాశరీరస్థః పరిభ్రమతి సంసృతౌ ॥ (సి.శి. 18-9)

శరీరము లేకుండగనున్నదై, సర్వవ్యాపకత్వము, నిరంజనత్వము గల్గినట్టి యాత్మ, మాయచేత కల్పితమైన శరీరమును ధరించి యీ సంసారము నందున పరిభ్రమించుచున్నది.

మాయావశముతో దేహియై యీ లోకమున తిరుగాడెడి యాత్మ వాస్తవముగా నశరీరియై యుండును మరోవిధముగా చెప్పవలెననిన ఆత్మకు సదా శరీరముతో సంబంధముండదు. ఏదోనొక ప్రాక్తన కర్మవలన ఈ యాత్మ శరీరమును పొందుచున్నాడు. ఈ సంబంధమును నైమిత్తిక సంబంధమని పిలువవచ్చును. నిమిత్తము లేనియెడల శరీరము లుప్తమైనదగును. ఈ కారణమున నాత్మను నశరీరియని యందురు.

ఆత్మకు వ్యాపకత్వము గలదు. మనకు కనిపించెడి పంచమహాభూతముల యందున నాకాశమునకీ గుణము గలదు అయితే, ఆత్మ ఆకాశమునకు జన్మస్థానమై యుండుటచేత, ఆత్మయొక్క వ్యాపకత్వము గుణాత్మకమైనదైయుండును. ఈ విధముగా ఆత్మ ప్రపంచములో నన్నిటికంటెను పెద్దదైయున్నది. తత్ఫలితముగా ప్రతియొక్కరి మనస్సులోను, తాము పెద్దవారై యుండాలనెడి వాంఛ వ్యక్తమగుచుండును. కాని యీ కోరిక సులభముగా తీరదు. ఎంత పైకెదిగినా, యేదో యొక లోపము కన్పట్టును. ఆత్మగురించి యెరిగినవానికి యీ కోరిక యుండదు. ఆత్మతత్త్వము నెరిగినవాడు సామాన్యునివలె నసంతృప్తుడై తిరుగాడడు. అందుచేత, ముముక్షువు నాత్మ తత్త్వము నెరుగుటకై యత్నించవలెను. వాస్తవముగా, ఆత్మతత్త్వము నెరిగిన వానికంటెను గొప్పవాడెవ్వడును లేడు. ఈ విషయమును తెలిపెడి కథ యొకటి కలదు.

ఒకసారి జానుశృతి మహారాజు తన ధర్మపత్ని సమేతుడై యంతఃపురపు మేడమీదిపై భాగమున సాయంకాలపు వినోదమునందున నిమగ్నుడై యుండెను. అప్పుడాకాశము నందున రెండు హంసలు నెగురుచు నటువైపు వచ్చుచుండెను. సమీపమునకు వచ్చిన పిదప వాటిలోని ఆడపక్షి మగదాని నుద్దేశించి "చూడు మతడే జానుశృతి మహారాజు అతడు గొప్ప పుణ్యశాలి"యని తెలిపెను. అప్పుడా మగపక్షి "నీవు చెప్పెడిదేమిటి? ఇతనికంటెను గొప్పవాడొకడు కలడు. అతని పేరు రైక్వుడు. అతడీదేశములోనే గలడు. అతడు మహా పుణ్యశాలి. అతనికి నితనికిని మధ్యగల యంతర మావగింజకును మహాంబుధికిని మధ్యగల యంతరము వంటిదనెడి ప్రత్యుక్తిని యిచ్చెను. ఇంతలోనే పక్షులు మేడపై భాగమును దాటి ముందుకు వెడలిపోయెను.

జానుశృతి పక్షుల భాషనెరిగిన వాడైనందున, పక్షుల సంభాషణను విని కలవరపాటును పొందెను. "ఈ రైక్వుడెవ్వడు? అతడు తనకంటెను పుణ్యశాలిగా నెట్టులయ్యెను? అతనివలె తానును మహా పుణ్యశాలి యగుట కేమి చేయవలెను?" అనెడి ప్రశ్నలతనిని వేధించుచుండెను. ఈ విధిన నాలోచించుచు నా రాత్రిని గడిపెను.

మరుసటి దినము ప్రాతః సమయమున రైక్వుని వెదకి తెచ్చుటకై రాజభటులను నన్ని వైపులకు పంపించెను. రాజభటులు నన్ని దిశలలోను వెదుకుచుండగ రైక్వుడొక చిన్నదగు గ్రామములో నున్నాడనెడి విషయము తెలియవచ్చెను. వారాగ్రామమునకు వెడలి రైక్వుని కనిపెట్టిరి. అతడొక శకటము క్రింద దుమ్ము ధూళి నిండిన ప్రదేశమున పరుండి యుండెను. "ఇట్టివానిని పిలుచుకొని వచ్చుటకు రాజుగారు తమనెందుకు పురమాయించెనో యని భటులు యచ్చెరువు నొందిరి. వారు రైక్వును సమీపించి రాజాజ్ఞను వినిపించి తమను వెంబడించి రమ్మని నివేదించికొనిరి. వలయు రథతురగాదుల నేర్పాటు చేయుదుమనిరి. రైక్వుడు వారి విన్నపము నాలించి, ఒకకంట వీక్షించి, "నేనే రాజు వద్దకేనను రాజాలను. రాజుల వలన నాకెట్టి ప్రయోజనము నుండదు. మీరాజు కూడ నట్టివాడే. మీ రాజు నా వలన నేమైన ప్రయోజనము నాశించి యుండినచో నతడే యిక్కడకు రావచ్చును" అని బదులు పలికి కన్నులు మూసికొని తనదగు నానంద జగత్తులో విహరించ దొడంగెను.

రాజభటులు వెనుదిరిగి వెడలివచ్చిరి. రాజధానిని చేరి రాజు సన్నిధిన జరిగిన విషయము గురించిన సమాచారమును, రైక్వునియభిప్రాయమును నివేదించిరి. విషయము నెరిగి రాజు నివ్వెరపడుతూ తేరుకొని కర్తవ్యమును గురించి యోచించెను. రైక్వుని గురించి పూర్తిగా తెలిసికొనవలెననెడి జిజ్ఞాస అధికమగుట చేత, తానే వెడలి విషయమును గ్రహించుట మేలని యెంచిన వాడయ్యెను. తక్షణమే మారు వేషమును దాల్చికొని రైక్వుడుండు గ్రామమునకు పోయి రైక్వుని చూడగా పక్షి చెప్పినది నిజమేయని రాజు గ్రహించెను. అతని ముఖములోని తేజస్సును గాంచి యతని వ్యక్తిత్వము గొప్పదని తెలిసికొనెను. అతని వ్యక్తిత్వముతో పోల్చినచో తన వ్యక్తిత్వ మత్యల్పమని గుర్తించెను. రైక్వుని ముందు మోకరిల్లి పక్షి నుడివిన దాని నేకరువు పెట్టి, "మీరు గడించిన పుణ్యమెయ్యది? అద్దానిని మీరెట్టుల సంపాదించితిరి? దయచేసి తెలియజెప్పుడీ"యని

వేడికొనెను. అప్పుడా రైక్వుడు రాజును వీక్షించి, "ఓయీ రాజా! దేహాత్మ బుద్ధిజం పాపం నతద్గోపథ కోటిభిః। ఆత్మాహం బుద్ధిజం పుణ్యం న భూతో న భవిష్యతి॥" యనెడి సూక్తిననుసరించి "నేనాత్మను" అని తెలిసికొనుటవలన గల్గెడి పుణ్యమునకు సాటివచ్చెడి పుణ్యమేదియును లేదు. ఇద్దానికి విరుద్ధముగా, దేహమునే నేనని యెరిగిన వానికి కోటి గోవులను చంపుటచే వచ్చు పాపము కంటెను అధికమైన పాపము లభించునని తెలిసికొనుము. అన్నసత్రాదులు కట్టించి, సత్కర్మల నాచరించి పుణ్యమును గడించితివి. కాని యిది, ఆత్మజ్ఞానమును పొందినవాడు పొందెడి పుణ్యమునకు సరిరాదు" అని తెలిపెను.

రాజతనికి సాష్టాంగపడి, "స్వామీ! నన్ను తమరి శిష్యునిగా గ్రహించుడి. మీ పాదసేవను చేసి తరించెదను. నాకాత్మ జ్ఞానమును బోధించి ధన్యుని చేయు"డని ప్రాధేయపడెను. రైక్వుడు రాజుగారి యభ్యర్థనను మన్నించి యతని కాత్మ తత్త్వము నుపదేశించెను. రాజాత్మ జ్ఞానమును పొందిన వాడై ధన్యుడయ్యెను.

సర్వ వ్యాపకమై యుండెడి యాత్మ నిరంజన స్వరూపమై యుండును. ఇచ్చట నిరంజనమనగా, దోషాదులు లేకుండగ నుండుట ఈ విధముగా నుండెడి యాత్మ , మాయ చేత నిర్మితమై యుండెడి శరీరము నందున వసించుచు నీ సంసారము నందున పరిభ్రమించుచుండును.

మాయ యనెడిది శివ పరమాత్మయందునుండెడి అమోఘమైన శక్తి. దీనిచేతనే శివుడు పంచకృత్యములను నిర్వహించును. సృష్టి నిర్మాణమునందున శివునికి సహాయమును చేసిన యీ శక్తి స్వరూపియైన మాయ, శివస్వరూపమునే మూసివేసి దాని నెవ్వరును నెరుగని యటుల చేయును. తాను శివుని ప్రకాశము చేత ప్రకాశించుచున్నను తనను ప్రకాశింపజేసెడి శివుని మబ్బులు సూర్యుడిని మూసి యుంచిన యటుల, మూసి యుంచును. ఈ కారణము వలననే జీవులు మాయ యొక్క యీ ప్రపంచమునందున, పరిభ్రమించుచున్నారు. తాము శివ స్వరూపుల మనెడి ఆత్మ జ్ఞానము లేనివారై అజ్ఞానాంధకారములో తిరుగాడుచున్నారు.

ఒకసారి లంకాధిపతియైన రావణబ్రహ్మ ఆత్మలింగము యొక్క ప్రాప్తికొరకు కఠోరమైన తపస్సును చేసెను. అతని తపస్సుకు శివుడు ప్రసన్నుడయ్యెను. ప్రత్యక్షముగా నెదుట నిలిచి "వరం బ్రూహి" యని అనెను. నీ కేమి కావలెనో కోరుకొమ్మనెడిది శివవాక్కుల కర్థము. రావణుడు రభస సమేతుడై ప్రసన్నుడై నిలిచియున్న పశుపతికి ప్రణమిల్లి శివుని యాత్మ లింగము వేడుటకు నుద్యుక్తుడు కాగానే, మాయ అతనిని వ్యామోహమునకు గురిచేసెను. అతడు, ఆత్మలింగమును గురించి మరచినవాడై, పార్వతీదేవి కావలెననెను. రావణుని యీ ప్రవర్తన వలన మన కందరకును నవ్వువచ్చును. నేటి కాలములోను దేవుని ప్రతిమ ముందున నిలిచి ధన కనకాదులను వేడెడివారు రావణుని వంటివారే. ధన కనకాదులను మాయచేత సృష్టించబడినవే కదా! ఈ కారణమున భక్తిగల్గిన వారును మాయా రూపమున నున్న కనకాదులను కోరికొని ముక్తికి దూరమగుచున్నారు. భగవంతుడు కావలెనని కోరెడి వారు కొందరే కదా! ఎంత వరకు మాయిక వస్తువులైన ధనకనకాదుల కోరిక దూరము కాదో అంతవరకు ఆత్మజ్ఞానము ప్రాప్తము కాదని గ్రహించగలరు. "కశ్చిత్ధీరః ప్రత్యాగాత్మా సమైక్షత్" అనెడి యుపనిషద్వాక్కులీ విషయమునే ధృవపరచుచున్నవి. ఆత్మజ్ఞాన జిజ్ఞాస గల్గిన వారు నల్పసంఖ్యాకులనెడిదే యీ వాక్కులలోని భావార్థము. "సావిర కొబ్బ సత్య లక్ష కొబ్బ భక్తి, కోటి కొబ్బ శరణను" అనెడి శరణుల వాక్కులును నీ విషయమునే ధృవీకరించుచున్నవి. "వేయింటి కొక్క సత్యసంధుడు, లక్షకొక్క భక్తుడు, కోటికొక్క శరణు" డనెడిది వీరి వాక్కుల యొక్క సారాంశము.

ఆత్మత్వ ప్రాప్తి గురించి శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారు తమరి యుపదేశము నీ క్రింది విధముగా ప్రదానము చేసిరి.

**ఆత్మస్వరూపవిజ్ఞానం దేహేంద్రియవిభాగతః।**
**అఖణ్డబ్రహ్మరూపేణ తదాత్మప్రాప్తిరుచ్యతే॥** (సి.శి. 18-10)

ఎప్పుడైతే దేహము మరియు నింద్రియములయొక్క విభాగము చేత నఖండమైన బ్రహ్మయొక్క రూపము నందున ఆత్మస్వరూపము యొక్క జ్ఞానము ద్యోతకమగునో అప్పుడు ఆత్మత్వ ప్రాప్తి గల్గుననెడిది యీ శ్లోకము యొక్క తాత్పర్యము.

వాస్తవికముగా నాత్మ గురించిన జ్ఞానము లుప్తమై యుండుట చేత ప్రపంచములోని జనులలోని చాలమంది శరీరాదులనేఆత్మగా నెరుగుచున్నారు. వీరిలో కొందరు కాయము నాత్మగా తలచినచో మరి కొందరు తమ యింద్రియములనే ఆత్మగా భావించికొనుచున్నారు. ఇదేవిధిన, ప్రాణ, మనోబుద్ధ్యాదులును కొందరిచేత ఆత్మలుగా తెలిసికొనబడుచున్నవి. వాస్తవికముగా వీటన్నిటికంటెను ఆత్మ భిన్నమైనదై యుండును.

శరీరాదులన్నియును ననాత్మలే అయియున్నవి. ఈ విధముగా దేహేంద్రియాదులను ఆత్మనుండి వేరు పరిచి, ఆత్మ వీటి కంటె భిన్నమైనదని యెరుగువాడు ఆత్మజ్ఞానియనబడుచున్నాడు. ఆత్మజ్ఞానమును పొందుటయే ఆత్మప్రాప్తియని తెలిసికొనగలరు.

ప్రాప్తి యనగా లేనిది లభించుట యునెడిది సామాన్యమైన భావము. తనలో నున్న దానిని మరచి చరించేవారు, మరపును వీడి యద్దాని గూర్చి యెరిగినచో నయ్యది ప్రాప్తియగుననెడిది విశేషార్థము. ఆత్మప్రాప్తి యనెడి భావమును, యీ విశేషార్థము యొక నేపథ్యమున నవగతము చేసికొనవలెను. ఇద్దానిని చేతిలో తాళము చెవ్విని పెట్టికొని తాళము చెవ్విపోయినదని వెతికెడి మతిమరపు వాని ప్రవర్తనతో పోల్చి చూచిన యెడల విషయము విస్పష్టమగును. తాళము చెవి తన చేతిలోనే గలదని యెరుగనంతవరకు నతడు అప్రాప్తిని యనుభవించినటులే యగును. తన చేతిలోనే గలదని యెరిగిన వెంటనే ప్రాప్తియనెడి భావము కన్పట్టును.

శరీరాదుల నేల ఆత్మయని భావించవలదు? వీటి గూర్చిన జ్ఞానము నెందులకు నాత్మ జ్ఞానమని పిలువకూడదు? దోచని ఆత్మను గురించిన యన్వేషణ యెందులకు? దోచెడి శరీరాదులను విస్మరించుట యెందుకు? అనెడి ప్రశ్నలు తలయెత్తవచ్చును. భౌతిక వాదులిట్టి ప్రశ్నల యెడల నాసక్తిని ప్రదర్శించవచ్చును. శ్రీ రేణుకాచార్య భగవత్ పాదుల వారి యుపదేశములోన నొక రహస్య మిమిడియున్నది. "తరతి శోక మాత్మవిత్" అనెడిది శ్రుతివాక్యము. ఆత్మనెరిగినవాడు శోక–మోహముల నుండి ముక్తుడగు ననెడిదే దీనిలోని భావము. దేని యెరుక వలన శోక మోహములు దూరమగుచున్నవో దానినే ఆత్మ జ్ఞానమని యెంచవలెను. లోకము నందున దేహేంద్రియమనోబుద్ధ్యాదుల నాత్మగా తలిగినవాడు శోక మోహములలో మునిగిపోవుచున్నాడనెడి దానిని మరువజాలని సత్యము.

మనకెవ్వరైనను పరిచితులు కలిసినప్పుడు పరస్పర యోగక్షేమముల నడుగునప్పుడు, యిరువురికిని ఆత్మీయత యుండిన యెడల, కన్నులు చెమ్మగిల్లును. మనలోన పొదిగి యుంచబడిన దుఃఖావేశము, మన ఆత్మీయులు మనకెదురైనప్పుడు, కంటిలోన నీళ్ళను తెప్పించును. దైనందిన వ్యవహారములలో నిట్టి సంఘటనల నెన్నింటినో గాంచగలము. అందుచేత, ప్రతియొక్కరును శోక–మోహములలో మునిగి తేలుచుందురని చెప్పవచ్చును. ఇవి అనాత్మ జ్ఞానము వలన సంప్రాప్తమగును. అందుచేత దేహాదుల యెడల నభిమానమును దాల్చిన యెడల దుఃఖము తప్పదు. ఆత్మప్రాప్తి వలననే శోక మోహములు దూరమగును.

సుషుప్తావస్థ యందున మనము కొంత కాలమువరకు కాయాది యనాత్మ తత్త్వములను మరచిపోయి యుందుము. ఈ అవస్థయందున ప్రతి వ్యక్తియును నాత్మానందము ననుభవించును. ఈ విధముగా దేహాదుల మరపువలన సుఖము, వీటి యెరుక వలనదుఃఖము సంప్రాప్తమగునని తెలియవచ్చుచున్నది. అందుచేత వీటి యెడల 'నేను', 'నాది' యనెడి భావమును వహించక, యఖండమైనట్టిదగు ఆత్మతత్త్వము నెరిగి, ఈ ఆత్మలాభప్రాప్తిని పొందవలెను. జగత్తునందున నాత్మ లాభము కంటెను శ్రేష్ఠమైనట్టి లాభము మరొక్కటేదియు నుండదు. ఈ కారణముననే శాస్త్రములు "ఆత్మ లాభాత్ పరం లాభో న విద్యతే" అని నుడివినవి. మీలో ప్రతియొక్కరు నాత్మతత్త్వము నెరిగినవారై యాత్మలాభ ప్రాప్తిని పొందుదురు గావుత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీకాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యులవారు ఆత్మజ్ఞాన సంపత్తి యొక్క విశిష్టత గురించి సోదాహరణాశీర్వచనమును ప్రదానము చేసిరి.

జగదాత్మయైన పరశివుని జగద్విస్తృతీ విభవము సుప్రతిష్ఠితమైన విషయమే. ఈ విషయమున సందేహమున కాస్కారములేదు. అపరిచ్ఛిన్నమై విశ్వ వ్యాపితమై యుండెడి యిట్టి ఆత్మ దేహినాశ్రయించి దేహాంతర్గతుడై హృద్గత విభవుడై యుండెడి దాసక్తిని గల్గించెడి విషయమే.

అంగ ప్రాణలింగి జీవ భావమును పరిత్యజించి లింగప్రాణిగా పరిణమించుటకు యత్నించునని తెలిసికొంటిమి. లింగప్రాణి క్రమానుగతాభివృద్ధిని సక్రమ పద్ధతిలో సాధించికొని లింగాత్మగా పరిణామమును పొందునని తెలియుచున్నది. ఈ కృషిలోన నతడు సఫలీకృత మనోరథుడైన యెడల నతడు లింగాత్మ ప్రాప్తిని పొందినవాడగునని గ్రహించగలరు. ఇట్టి ఆత్మప్రాప్తి యనెడి భావన, ఉపనిద్బ్రహ్మవాదుల ఆత్మ జ్ఞానప్రాప్తి భావన కంటెను భిన్నమైనదని తెలిసికొనగలరు.

లింగాత్మ ప్రాప్తి యనెడిది అంగ లింగోద్భవస్థల పరిజ్ఞానములోని యంతర్భాగమని లింగోద్భవవిదుల విశిష్టాభిప్రాయమని తెలియుచున్నది. ఇట్టి పరిజ్ఞానమునకు పరికల్పనోపకల్పనలను చేసెడి విద్యను "షట్ స్థలద రగడ" అంగస్థలం జీవలింగం శివేతి విద్యగా గుర్తించినది.

లింగాత్మప్రాప్తిని పొందినవాడు సర్వాంగ లింగియై విరాజిల్లునని తెలియుచున్నది. ఈ విషయమును సూచనప్రాయముగా తెలియజేసెడి శ్రీ బసవేశ్వరులవారి క్రింది వచనము గమనించదగినదై యున్నది. గమనించుడి :

**భూత ఒలిదు ఆత్మన సోంకిద బళిక**
**భూతద గుణ వల్లదె ఆత్మనగుణవుంటె**
**గురుకారుణ్యవాగి హస్తమస్తక సంయోగ నాద బళిక**
**గురు లింగ జంగమలె గతియాగిర్దె**
**కూడల సంగమ దేవా!** (వచనము. సం. 826)

ఈ వచనపు తెలుగు రూపమును గనుడి :

భూతము వలచి ఆత్మను సోకిన పిదప
భూతపు గుణమే కాని ఆత్మయొక్క గుణముందునే
గురుకారుణ్యముగా హస్తమస్తక సంయోగమైన పిదప
గురు-లింగ జంగమమే గతిగా నుండెను
కూడల సంగమ దేవా!

ఉపనిషద్ బ్రహ్మవాదులు ప్రతిపాదించెడి "ఆత్మ" గుణములు నిర్గమించి, లింగ తత్త్వవిదులు ప్రతిపాదించెడి లింగమనెడి పరతత్త్వము యొక్క గుణములు సాధకుని ఆత్మను నావహించుననియును తత్ఫలితముగా లింగాత్మప్రాప్తి సంప్రాప్తమగునని గ్రహించగలరు. అయితే శక్తి విశిష్టాద్వైత సిద్ధాంతమున కనుగుణముగా ప్రతిపాదింపబడిన లింగాత్మభావనకును, పౌరాణికులు ప్రతిపాదించెడి ఆత్మ లింగ భావనకు సామరూప్యత లేదని తెలిసికొనవలెను. పురాణములలో ప్రతిపాదింపబడిన ఆత్మలింగ భావనకు తాత్త్విక ప్రాతిపదిక లేదనెడిదే గ్రహించవలసిన విషయము. ఈ సందర్భము రావణ బ్రహ్మ సాధించిన ఆత్మలింగ ప్రాప్తి కథనము స్మర్యమని గ్రహించగలరు.

లింగాత్మత్వ ప్రాప్తికై సేవ్యస్థలి యెట్టి లక్షణములు గల్గియుండవలెనో యనెడి దానిని తెలిపెడి క్రింది రగడను గమనించుడి :

**దేవోహమింద్రియాణ్యపి వికల్పసం**
**దోహ సంహారక ప్రాణలింగేశ్వరం**
**సోహం శివోహం శివోహమితినిత్యం స**
**మాహితోత్సారక ప్రాణలింగీశ్వరం**
**మంగళ మనోహస్త సమ్యగ్రధరమహా**
**లింగ స్వరూపక ప్రాణలింగీశ్వరం**
**భృంగ చంపక పదాత్మజ్ఞాన పారవ**
**శ్యాంగతా లేపక ప్రాణలింగీశ్వరం** (షట్ స్థలద రగడ)

ఈ రగడలో వివరింపబడినట్టి లక్షణముల విలక్షణ స్వభావము యొక్క నేపథ్యములో శ్రీ భగవత్ పాదులవారి "ఆత్మ స్వరూప విజ్ఞానం దేహేంద్రియ విభాగతః" అనెడి యుపదేశమును నవగాహన చేసికొనుటకు ప్రయత్నించవలెనెడిదే గ్రహించవలసిన విషయము.

– శివం భూయాత్ –

## ఆశీర్వచనము - 3 :

## ఆత్మ స్థలము :

ఆత్మలాభమును మించిన లాభము మరొక్కటి లేదని క్రిందటి యాశీర్వచనమందున నెరింగితిరి. ఆత్మజ్ఞాన ప్రాప్తియే యాత్మ లాభమనియును తెలిసికొంటిరి. లింగస్థలమైన ప్రాణలింగ స్థలమునకు చెందినట్టి యాత్మ స్థలమును గురించిన శేషాంశములను నీ యాశీర్వచనము నందున తెలిసికొనెదరు గాక.

నిర్దేహియైనట్టి యాత్మ, కర్మఫల భుక్తి నిమిత్తముననే దేహియగుచున్నదని శ్రీ రేణుకాచార్యులవారు శ్రీ అగస్త్యునకుపదేశించిరి. వీరి క్రింది యుపదేశమును గనుడి :

**న చాస్తి దేహసంబంధో నిర్దేహస్య స్వభావతః ।**
**అజ్ఞానకర్మయోగేన దేహీ భవతి భుక్తయే ॥** (సి.శి. 18-11)

ఉపదేశములోని భావమేమనగా స్వభావసిద్ధముగా దేహముండకుండినను, ఆత్మ స్వీయా జ్ఞానకర్మ ఫలభోగమును పొందుటకై దేహమును ధరించుచున్నది.

ఆత్మకొక నామధేయముండదని తెలుపబడినది. భగవత్పాదుల వారి యుపదేశమును గాంచుడి :

**నాసౌ దేవో న గంధర్వో న యక్షో నైవ రాక్షసః ।**
**న మనుష్యో న తిర్యక్చ న చ స్థావర విగ్రహః ॥** (సి.శి. 18-12)

దీని తాత్పర్యమేమనగా మూలతః ఆత్మ, దేవ మనుష్యాదులలో నేదియును కాదు.

వాస్తవముగా నశరీరియై యుండెడి ఆత్మ, దేహమును ధరించుట యనెడి విషయమున నొక రహస్యము కలదు. ఈ సృష్టి యనెడిది శివుని యొక్క లీలా వినోదమని చెప్పబడినది. శివుడు తానొక్కడే యొంటరిగా నుండి యుండి విశ్వ లీలా రూపమును దాల్చి యీ ప్రపంచము యొక్క వ్యవహారమును చేయుచున్నాడు. "సవై నైవ రేమే। తస్మాదేకాకీ న రమతే। స ద్వితీయమైచ్ఛత్। స ఏతావానాస । తత్సృష్ట్వా తదేవాను ప్రవిశత్ । తదను ప్రవిశ్య సచ్చ త్యచ్చా భవత్।" అనెడి శ్రుతి వాక్కులలో శివపరమాత్మ యొక్క లీల వర్ణింపబడినది. దీని తాత్పర్యమేమనగా నిర్గుణుడును, నిరాకారుడును అగు శివుడు నెంతో కాలమువరకు నొంటరిగా నుండెను. ఈ విధిన నుండగా నతనికి విసువు కల్గెను. తనతోపాటుగా మరొక్కరు నుండవలెననెడి కోరిక గల్గెను. అతడే అనేక రూపములను దాల్చెను. అతడే జీవునిగా మారెను. ఈ విధముగా చరాచర జగత్తులోని ప్రతి యంశములోను శివాంశ ప్రవేశించియున్నది. జీవుడై స్వకర్మానుసారముగా కర్మఫలముల ననుభవించెడి వాడు శివుడే యనియును, స్వీయలీలలో నంతర్భాగముగా నిట్టి స్థితిని రచించికొనెడి వాడును శివుడే యనియును గుర్తించగలరు.

ఈ సందర్భమున శివుని ప్రవర్తననొక చక్రవర్తి వర్తనతో పోల్చి చూడవచ్చును. చక్రవర్తి ప్రతిదినము తన వైభవోపేతమైన వ్యవహారమును చేసి చేసి వేసరిల్లి సామాన్యమైనట్టి యాట సామాగ్రిని గొని చిన్నపిల్లలతో నాడికొనుట గురించి వినుచుందుము. ఇదేవిధిన నఖండుడును, పరిపూర్ణుడును, అయి యుండెడి పరమాత్మ ఖండితమైనట్టిదియును, విషయజన్యమైనదియును అయిన సుఖములనుండి ఖండితమైన రసాస్వాదన జేసెడి యపేక్ష గలవాడై తన స్వాతంత్ర్యశక్తి చేత పరికల్పింపబడినట్టి అణవాది మలత్రయము యొక్క సంబంధమును పొంది దేహమును ధరించికొని దేహియని పిలువబడుచున్నాడు.

ఈ లోకములోన నెల్లప్పుడు మధుర రసమును ననుభవించెడి వ్యక్తికి నయ్యది వేసరించగా కారము, పులుపు, లవణము మొదలగు రుచుల ననుభవించెడి యిచ్ఛ గల్గియుండునటులే యఖండానందములోన నుండెడి శివునికి ఖండితమై యుండెడిదియును, విషయజన్యమై యుండెడిదియును, అయినట్టి యానందమును పొందవలెననెడి యిచ్ఛ గల్గినప్పుడు శివలీల కాస్కార మేర్పడును. శివుడే యనేక రూపములను దాల్చి, అనేక దేహములను ధరించి, పరస్పరము భిన్నమైన వాడని యనిపించికొనెడిది శివలీలలోని యంతర్భాగముగా గ్రహించవలెను. ఈ కారణముననే

శివుడు నటరాజు, నటసార్వభౌముడని పిలువబడుచున్నాడు. ఈ విధముగా జగమంతా శివుని యొక్క లీల యగుచున్నది. "లోకవత్తు లీలా కైవల్య" మ్మనెడి బాదరాయణుని బ్రహ్మసూత్రములోన నీ విషయమే ప్రతిపాదింపబడినదని గ్రహించగలరు.

అల్పాయాసము చేత సిద్ధమయ్యెడిదై కర్తృవు యొక్క విశేష ప్రయోజనమును చేకూర్చజాలనట్టి క్రియయే లీల యనబడును. ఇంతటి సువిశాలమైనట్టి సృష్టిని రచించుటకై శివుడెట్టి పరిశ్రమకైనను లోనుకాలేదు. కేవలమాతని యిచ్ఛవలననే యీ సృష్టి నిర్మింపబడినది. సృష్టి రచన వలన శివునికి లభ్యమయ్యెడి ప్రయోజనమేదియును లేదు. అందుచేత, యీ జగత్తు యొక్క రచన యనెడిదొక శివలీల కాకుండగ మరేమిటి? రేణుకాగస్త్య సంవాదమును గ్రంథస్థము చేయుచు శ్రీ శివయోగి శివాచార్యులవారు వ్రాసిన మంగళా చరణ శ్లోకము గమనార్హమై యున్నది. గమనించుడి :

**స్వేచ్ఛావిగ్రహయుక్తాయస్వేచ్ఛావర్తన వర్తినే ।**
**స్వేచ్ఛాకృతత్రిలోకాయ నమఃస్సాంబాయ శంభవే ॥** (సి.శి. 1-6)

స్వేచ్ఛా విగ్రహయుక్తుడును, స్వేచ్ఛగా వర్తించెడి వాడును, తన స్వేచ్ఛ చేత ముల్లోకములను కల్పించిన వాడును, అంబతో కూడికొనియున్నవాడును, అయిన శంభువు కొరకు నమస్కారమనెడిదీ శ్లోకము యొక్క తాత్పర్యము.

సృష్టిని శివలీలయని భావించినప్పుడు, ఆప్తకామత్వమునకు భంగము వాటిల్లదు. అదేవిధిన నతని యున్మత్త ప్రసంగమును నుండజాలదు.

ఎవ్వరైననొక వ్యక్తి యేదో నొక కార్యములో ప్రవృత్తుడు కావలెనిననచో నందలి ప్రయోజనము చెప్పవలసియుండును.'' ప్రయోజన మనుద్దిశ్యమందోఽపిన ప్రవర్తతే" అనెడి మాట ప్రకారముగా నెట్టి వాడైనను ప్రయోజన శూన్యతగల కార్యమునందున ప్రవృత్తుడు కాడు. ఈ వాదము ప్రకారముగా పరిశీలించి చూచినచో శివుడేదో నొక ప్రయోజనము నాశించియే సృష్ట్యాది పంచకృత్యములను చేయుచున్నాడని భావించవలసియుండును. అయితే, శివుడు నిత్యతృప్తుడని శ్రుతులు చెప్పుచున్నవి కదా! శ్రుతి వాక్యములు నిరర్థకములా? అనెడి సందేహములు గల్గును. శ్రుతివాక్కుల కనుగుణముగా యోచించిన యెడల, శివుడు ప్రయోజనము నపేక్షించకయే యీ పంచకృత్యములను చేయుచున్నాడని ప్రతిపాదించవలెను. ఈ వాదన తర్కమునకు నిలువదు. పిచ్చివాడైనను ప్రయోజనములేని యెడల పని కుద్యమించడనెడిది సత్యము. వీరశైవ ధర్మము ప్రతిపాదించిన వాదములోన యిట్టి సందిగ్ధతకు స్థానములేదు. శివుడు నిత్యతృప్తుడైనందున ప్రయోజనము నాశింపడు.

లీలా రచన యనెడిది స్వీయ క్రీడాసక్తిని నెరవేర్చికొనుటకేయని గ్రహించవలెను. ఈ విధముగా చూసిన యెడల పై రెండు వాదములు పరస్పర విరుద్ధములైనవి కావనియును, నివి పరస్పర పూరకములనియును తెలియవచ్చును.

తన కర్మానుసారముగా సంచరించెడి యీ జీవుడు పుణ్య పాపముల తారతమ్యము కారణమున నొక పరి దేవునిగానూ, మొరొకపరి రాక్షసునిగానూ, యింకొక పరి మనుజునిగాను జన్మించుచున్నాడు. పాపము హెచ్చినచో హీనమైన యోనులయందున జన్మించుచున్నాడు. ఇతనికి లభించెడి దేహము ప్రాక్తన పుణ్య-పాపములవలన లభించుననెడిది మరువరాని సత్యము. ఈ విషయమును, శ్రీ నిజగుణ శివయోగులవారెంతో రమ్యముగా తెలియజెప్పిరి. గమనించుడి :

**పాపానుగుణదింద గిడ-మర-క్రిమిగళ**
**రూపాగి కీట - పతంగాది యాగి**
**ఆ పక్షి కులవాగి మృగజాతి యాగియే**
**లాపశు రూపాగి బహుబాధగేళి**

శ్రీ మన్నిరంజన శివయోగులవారి వాక్కుల యొక్క తెలుగు రూపమియ్యది :

**పాపానుగుణముచే పొద-మ్రాను-క్రిముల**
**రూపమై కీట-పతంగాదులు గానై**

**ఆ పక్షికులమై మృగజాతియై మేలు**
**నా పశువు రూపమై బహుబాధతో నెదిగి ॥**

శివయోగులవారి వాక్కు ప్రకారముగా నాత్మ ధరించెడి వివిధ దేహములు పుణ్య పాపములవలననే వచ్చుచున్నది. శ్రీరేణుకాచార్యులవారు, దేవ దానవాదులలో నుండెడి యాత్మ యొక్కటేయని ప్రతిపాదించినవారైరి.

ఆత్మ యొక్క స్వభావమెట్టిది యనెడి దానిని తెలుపుట కొరకు శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారీ క్రింది యుపదేశము నిచ్చిరి.

**నానాకర్మ విపాకాచ్చ నానాయోని సమాశ్రితాః ।**
**నానాయోగ సమాపన్నా నానాబుద్ధివి చేష్టితాః ॥**
**నానామార్గ సమారూఢా నానాసఙ్కల్ప కారిణః ।**
**అస్వతంత్రాశ్చ కించిజ్ఞాః కిఞ్చిత్ కర్తృత్వహేతవః ।**
**లీలాభాజనతాం ప్రాప్తాః శివస్య పరమాత్మనః ॥**
(సి.శి. 18–13 మరియు 14)

ఉపదేశము యొక్క తాత్పర్యమేమనగా నీ జగత్తునందలి జీవులు పరిపక్వమైనట్టి తమ ప్రాక్తన కర్మల చేత నానా యోనుల నాశ్రయించి, స్వర్గాది నానా భోగముల గురించి చింతించుచు; అనేకమైన బుద్ధులుగల్గి జైన వైష్ణవాది ధర్మములయందున ప్రవిష్ఠులై నానా సంకల్ప సహితులై, అస్వతంత్రులై, కించిత్ జ్ఞానము గలవారై, పరిమిత కర్తృత్వము గలవారై జీవులు శివుని లీలా వైభవమునకు సామగ్రులై మెలగుచున్నారు.

ప్రపంచమునందు నసంఖ్యాకములైన జీవులున్నారు. జీవుల కర్మలును ననంతములై యున్నవి. తమతమ కర్మల వైపరీత్యమువలననే జీవులనంతములైన యోనులలో జన్మల నెత్తుచున్నారు. ఈ యోనుల వైవిధ్యత గురించి శ్రీ వేదవ్యాస మహర్షి స్కంద మహాపురాణములోన నీ క్రింది విధముగా వ్రాసిరి :

**దేవాః షోడశ లక్షాణి నవ లక్షాణి మానుషాః ।**
**దశభిర్దశభిస్తద్వ జ్జలజా విహగా మృగాః ॥**
**సరీసృవాస్తు లక్షాణి ఏకాదశ చరేతరాః ।**
**అష్టౌ చ దశలక్షాణి సప్త జన్మాన్యమూనివై ॥** (స్కంద మహాపురాణము)

వ్యాస వాక్కులలోని భావమేమనగా దేవ, మనుష్య, జలచర, విహగ, మృగ, సర్ప, స్థావరము లనెడివి ముఖ్యమైన జన్మలు. ఇదియే జీవుల సప్తవిధ వర్గీకరణ. ఒక్కొక్క వర్గములో దేహముల సంఖ్య భిన్నభిన్నముగా నుండును. దేవజన్మలో పదహారు లక్షల ప్రకారములగు దేహములు గలవు. మనుష్య విషయము నందున నీ సంఖ్య తొమ్మిది లక్షలు. జలచర, ఖచర, వనచర తదితర మృగముల దేహములొక్కొక్క దానియందున పదిలక్షల ప్రకారములగు దేహములు గలవు. సర్పములలో పన్నెండు లక్షల ప్రకారములగు దేహములుండగా స్థావరముల విషయములోన నీ సంఖ్య పదునెనిమిది లక్షలు. ఈ విధముగా వెరసి యెనుబది నాలుగు లక్షల ప్రకారములగు దేహములు గలవు.

జీవులకీ దేహములు కర్మానుసారముగా లభించుచున్నవని యింతకంటెను క్రితమే తెలిసికొంటిరి. జీవుల సంకల్పములును విభిన్నములుగా నుండును. తదనుగుణముగానే వాటి ధర్మాదులుండును. కొందరు జైనులైతే మరికొందరు వైష్ణవులై యుందురు. ఈ జీవులన్నియును నస్వతంత్రత గల్గియుండును. జ్ఞాన విషయములో నల్పత్వము, శక్తియందున పరిమితత్త్వము, జీవుల లక్షణములై యుండును. ఇంతటి వైవిధ్యత గల్గినట్టి యనేక జీవులను కూడికొని, శివుడు తన యనంతలీలల నాచరించుచున్నాడు.

కర్మల నాచరించెడి జీవులకు ప్రేరణ నిచ్చెడి దెవ్వరనెడి ప్రశ్న యెదురగును. ఇద్దాని నేపథ్యమున శ్రీ రేణుకాచార్యులవారీ యుపదేశము నిచ్చిరి.

**చోదితాః పరమేశేన స్వస్వకర్మానురూపతః ।**
**స్వర్గ వా నరకం వాపి ప్రాణినో యాన్తి కర్మిణః ॥** (సి.శి. 18-15)

ఉపదేశములోని భావార్థమేమనగా నీ కర్మల నాచరించెడి జీవులు పరమేశ్వరుని చేత వారి వారి కర్మల కనుగుణముగా ప్రేరితులై స్వర్గమునకో లేదా నరకమునకో వెడలుచున్నారు.

జీవులు స్వర్గములోగాని నరకములోగాని స్థిరముగా నుందురా? యనెడి ప్రశ్న యొక్క నేపథ్యమున శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల యీ క్రింది యుపదేశమును గమనించవలెను.

**పునః కర్మావశేషేణ జాయన్తే గర్భకోటరాత్ ।**
**జాతా మృతాః పునర్జాతాః పునర్మరణ భాజినః ॥**
**భ్రమన్తి ఘోరసంసారే విశ్రాంతి కథయా వినా ॥** (సి.శి. 18-16)

దీని భావమేమనగా భోగము వలన అవశిష్టమైన కర్మయొక్క కారణమున నీ జీవులు గర్భము వలన జన్మించుచున్నారు. మరల మరణించి, తిరిగి జన్మించి యీ విధముగా నెడతెరిపి లేకుండగ నీ సంసారమున పరిభ్రమించుచున్నారు.

ఇట్టి పరిభ్రమణము శాశ్వతమైనదా? అనెడి ప్రశ్నకు సమాధానముగా నీ క్రింది యుపదేశము గ్రాహ్యమైనదైయున్నది :

**జీవత్వం దుఃఖసర్వస్వం తదిదం మలకల్పితమ్ ।**
**నిరస్యతే గుర్బోధాత్జ్ఞానశక్తిః ప్రకాశతే ॥** (సి.శి. 18-17)

దీని భావమేమనగా దుఃఖ సర్వస్వమైన జీవత్వమనెడిది మలము చేత కల్పింపబడినది. గురూపదిష్టమగు జ్ఞానముచేత జీవత్వము దూరీకరింపబడును.

జీవులు చేసెడి పుణ్య-పాపములనెడి కర్మలే ఆయా జీవులకు నరక-స్వర్గాది ఫలముల నిచ్చుటకు గారణములైనను నా కర్మలు స్వతఃగా నీ కర్మలు జడరూపమున నుండుటచేత వాటిని ప్రేరణకు గురిచేయుటకై యీశ్వరుని యవశ్యకత గలదు. ఈశ్వర ప్రేరణ లేనిచో నీ కర్మలేమియును చేయజాలవు.

భారతీయ దర్శనములయందున కొందరు దార్శనికులు శివుని యొక్క అస్తిత్వము నొప్పిన యెడల మరికొందరు పరమేశ్వరుని యస్తిత్వము నొప్పరు. మన మనుభవించెడి సుఖ-దుఃఖములకు మనము చేసెడి కర్మలే కారణ భూతములై యుండుటచేత కర్మఫల భోగ విషయమునందున నీశ్వరుని ప్రమేయముండదని వాదించెడివారు గలరు. ఈ విధముగా నాలోచన చేసెడి పూర్వ మీమాంస వాదులు కర్మనే దేవుడని యందురు. "కర్మేతి మీమాంసకాః" యనెడి నుడి ప్రసిద్ధమైనదై యున్నది. సాంఖ్యులు కూడ యీశ్వరుని పాత్ర గురించి యనంగీకార భావమును వహించిరి. ప్రకృతి-పురుషుల వ్యతిరిక్తముగా వేరొక యీశ్వరుని కల్పించెడి యవశ్యకత లేదు. యోగశాస్త్రాచార్యులు యోగాభ్యాసమును చేసెడి సాధకునికి యనుగ్రహమును ప్రదానము చేయుటకై సామాన్య పురుషుని కంటెను విలక్షణమైన వాడై క్లేశ కర్మ విపాకాశయములతో సంబంధములేని యొక విశేష పురుషుడొకడు కలడు. అతడే యీశ్వరుడని వీరందురు. నాస్తికులు నీశ్వరుని యస్తిత్వమునే యంగీకరించరు. బౌద్ధ జైన చార్వాకులీ కోవకు చెందినవారే.

ఆస్తిక దర్శనములైన న్యాయ, వైశేషిక, యోగ, అద్వైత వేదాంత మరియు వీరశైవ దర్శనముల యందున యీశ్వరుని యస్తిత్వము గుర్తింపబడినది. జగత్తులో సృష్టి-ప్రళయాదులను నిర్వహించుటకు, ప్రాణుల కర్మలను నియంత్రించుటకు వేదాగమ ప్రమాణములను సిద్ధము చేయుటకు నీశ్వరుని యవశ్యకత గలదనిరి.

అనేక వైచిత్ర్యములతో కూడినట్టి యీ సృష్టిని రచించుటకు నీ ప్రపంచములోని యే జీవికైనను సాధ్యము కాదు. అందుకే, యీశ్వరుడు జీవుల కంటెను భిన్నుడై విశిష్ట లక్షణములు గలవాడై, సరజ్ఞత్వ, సర్వకర్తృత్వాది శక్తులు గలవాడై యుండునని ప్రతిపాదింపబడినది. జీవుల కర్మలను లెక్కించి, వాటికనుగుణమైన ఫలముల నిచ్చుటకు నీశ్వరుని కే సాధ్యమగును. సాధారణ జీవికిది సుసాధ్యమైన విషయము కాదు.

శ్రీ రేణుకాచార్యులవారు కర్మ నియంత్రణ నిమిత్తము భగవంతుని యవశ్యకత గలదని ప్రతిపాదించిరి. ఏయే జీవులు నేయే కర్మలను చేసిరనెడి దానిని గుర్తించి, ఆయా జీవులకు నాయా కర్మఫలములను ప్రదానము చేసెడి పాత్ర నీశ్వరుడు పోషించునని చెప్పినవాడయ్యెను. ఒక అంగడి యజమాని గ్రాహకుడిచ్చెడి ధనమున కనుగుణముగనే సరుకుల నిచ్చును. ఇదే విధిననీశుడు పుణ్యకర్మలను చేసినవారికి స్వరాది సుఖములను, పాపకర్ములకు నరకాది దుఃఖములనిచ్చుచున్నాడని గ్రహించగలరు. ఈ అంశమును ప్రస్ఫుటముగా తెలిపెడి శ్రీ బసవన్న వారి యీ వచనము గమనార్హమైనదైయున్నది :

**ధరణియ మేలొందు**
**హిరిదప్ప అంగడియ నిక్కి**
**హరద కుళ్ళిర్ద నమ్మ మహాదేవ శెట్టి**
**ఒమ్మనవాదరె నుడివను**
**ఇమ్మన వాదరె నుడియను**
**అర్థకాణేయ సోల**
**అర్థ కాణేయ గెల్ల**
**జాణనో దవ్వ నమ్మ కూడల సంగమ దేవా**

దీని తెలుగు రూపమిది :

ధరణి మేలున నొక్క
పెద్దదగు అంగడి బెట్టి
పరదుడు కూర్చుండెను
ఒమ్మిన యెడల నుడువును
ఇన్మడియైన నుడువడు
అర్థకాని నోడదు
అర్థకానిని గెలువడు
జాణ చూడమ్మమన కూడల సంగమ దేవుడు

జీవులు నీశ్వరుని చేత నియంత్రింపబడిన కర్మమున కధీనులై యొక జన్మనుండి మరొక్క జన్మకు, నొక లోకమునుండి మరొక లోకమునకు సంచరించుచుందురనెడి స్పష్టీకరించనైనది. ఇట్టి భ్రమరక జీవులకు విశ్రమమనెడి దుండదు. భ్రమణమునకు కారణము కర్మావశేషమే స్వర్గములోన సుఖమును, నరకములోన దుఃఖము ననుభవించి, కర్మావశేషముననుభోగము చేయుట కొరకు జీవుడనేక యోనుల నాశ్రయించుచున్నాడు. జనన-మరణ చక్రములో పడి పరిభ్రమించెడి జీవుని విధి, నిరంతరముగా కొనసాగినను, నయ్యది శాశ్వతమైనది కాదని తెలిసికొనవలెను. దీనినుండి విడుదలను కోరెడివారు తక్షణమే శ్రీ గురువు నాశ్రయించవలెను. దీక్షను కటాక్షించవలసినదని వేడికొనవలెను. గురువును సేవించి ప్రసన్నుని చేసికొనవలెను. శక్తిపాత స్థితి గలదని గురువు భావించిన యెడల, దీక్షను బడయవలెను. దీక్షవలన మలచ్ఛేదనమును చేయించికొనవలెను. లింగాంగ సామరస్యమును సాధించుటకు కృషి సలుపవలెను. యత్నములో సఫలీకృతుడై నిలువవలెను. అప్పుడు జనన-మరణ చక్ర బంధమునుండి విడుదల లభించును. మీరందరు నీ దిశలో కృషి చేయుదురుగాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యులవారు శివుడే విధిన జీవుడై లోకమున పరిభ్రమించుచున్నాడో యనెడి దానిని వివరించి చెప్పిరి. "శివలీలా వినోద" మనెడి భావనకు శ్రీవారిచ్చిన తాత్త్విక విశ్లేషణ స్మరణీయమైనదై యున్నది.

ఆత్మప్రాప్తిని పొందిన సేవ్యుడు సామాన్య మానవుల కంటెను భిన్నుడని తెలుపు నుద్దేశముతో శ్రీ రేణుక భగవత్పాదులవారు మలసహితుడై సంసారములో పడి మలమల మాడిపోయెడి భవిజనుల జీవత్వ లక్షణములను వివరించిరని తెలియుచున్నది. ఇట్టి భవి వినిర్ధూతాంగ మాలిన్య రహితుడనియును, అహంకార ప్రపూరిత చిత్తుడనియును, ప్రారబ్ధ కర్మబంధములకు లోనై సంసారియై సంసారములోని సుఖ దుఃఖములు పొందుచుండుననియును తెలుపబడినది. ఇట్టి జీవత్వ లక్షణాన్వితుడు మరణించి సంచితాది కర్మల ఫలితముగా స్వర్గమునకో లేదా నరకమునకో వెడలుచున్నాడని తెలుపబడినది. పుణ్యావశేషము లుప్తము కాగా భూలోకమునకు విచ్చేసి యేదో యొక్క దేహము ధరించి కర్మ ఫలభోక్తయగునని తెలుపబడినది.

జీవత్వము కంటెను భిన్నమైన లక్షణములు గలిగినది దైవత్వమనబడును. ఈ యంశమున విలక్షణమైన శైలిలో ప్రతిపాదించెడి చతుర్వేద సారములోని క్రింది పద్యమును గమనించుడి :

**శివుడు నిస్సంసారి జీవుండు సంసారి**
**తజ్జీవునకు శివత్వంబు గలదె**
**శివుడు నిర్మలదేహి జీవుండు మలదేహి**
**తజ్జీవునకు శివత్వంబు గలదె**
**శివుడు దానిష్కర్మి జీవుండు దుష్కర్మి**
**తజ్జీవునకు శివత్వంబు గలదె**
**శివుడు దానిత్యుండు జీవుండనిత్యుండు**
**తజ్జీవునకు శివత్వంబు గలదే**

**యరసి చూడ పర్వత పరమాణుమాత్ర**
**తరమునకు సంబరంబును ధరణికైన**
**యంతరంబులు గలుగు జీవాత్మకెట్లు**
**పొసగు పరమాత్మ యోగంబు బసవలింగ** (చ.సా., ప. 178)

సోమనాథుడు చెప్పిన పర్వత పరమాణువుల అంతరమనెడి యుపమానము గమనించదగినదై యున్నది. జీవత్వము దైవత్వమునకు మధ్యన గల యంతరము యొక్క స్వభావము చర్చనీయాంశమని తెలియుచున్నది.

ద్వైత దర్శనముల ప్రకారము జీవాత్మ పరమాత్మలకు మధ్యన గల యంతరము పరిపూర్ణమైనది. అణువు-బ్రహ్మాండములకు మధ్య గల యంతరము వంటిదే భేదమని చెప్పవచ్చును. వీరిరువురి మధ్యగల అసమత్వము శాశ్వత ప్రాతిపదికమీద నుండునదై యుండును. అద్వైత దర్శనము ప్రకారము రెంటికి భిన్నత్వము లేనేలేదు. అజ్ఞానమనెడి దానిని తొలగించినచో జీవత్వము దైవత్వమగును. వీరి వాదన ప్రకారము దైవత్వము గల సాధకుడు అజ్ఞానవశమున తాను జీవత్వములో కూడికొనియున్నానని భ్రమపడును. జ్ఞాన సముపార్జన చేసి స్వస్వరూప సందర్శన చేసిన స్థితిలోన నీ భ్రమ తొలగిపోవును. ఈ రెంటిలోన నేది వాస్తవమునకు సన్నిహితముగా నుండెడి వాదమనెడిది తెలియుటలేదు.

శక్తి విశిష్టాద్వైత సిద్ధాంతము ప్రతిపాదించిన షట్స్థల సిద్ధాంతమును పరిశీలించినచో జీవునికి శివునికి మధ్యల గల అంతరము సాపేక్షమైనదే కాని సంపూర్ణమైనది కాదని తెలియుచున్నది.

ఈ సందర్భమున "గురోః కటాక్ష వేధేన శివోభవతి మానవః" యనెడి శ్రీభగవత్పాదులవారి యుపదేశము (సి.శి.17: 64) స్మర్యము. మానవుడు గురు కటాక్షము వలన భక్తుడై క్రమక్రమముగా గమనించి శివత్వోపగతిని సాధించవచ్చునని శివధర్మ శాస్త్రము తెలుపుచున్నది.

శివత్వోపగతి సాధనా క్రమానుగత పథానుక్రమములోన ననేక దశలుండునని తెలుపబడినది. భక్తాది యైక్య స్థల పర్యంతము గల పథములోని ప్రాణలింగాంతర్గత స్థలములలోని లింగస్థలమైనట్టి ఆత్మస్థలము అట్టి దశలలోన నొకానొక దశయని గ్రహించవలెను.

ఆత్మస్థలమును ఆత్మప్రాప్తిని పొందిన సాధకుడు తాను శిష్య, శుశ్రూష, మరియు సేవ్య స్థలములలో పొందినట్టి యనుభవము వలన నాధ్యాత్మిక లబ్ధిని పొందిన విషయమును నింతకంటెను ముందుననే గ్రహించితిమి. ఈ యనుభవమనెడి రసవేధ ప్రభావమున జీవత్వమనెడి లోహము శివత్వమనెడి సువర్ణముగా మారుననెడిది గ్రహించవలసిన విషయము. ఈ అంశమును నేపథ్యముగా గొని "గురోర్బోధాజ్జీవత్వం నిరస్యతే" అనెడి శివాద్వైత భావనను నవగాహన చేసికొనవలెను. జీవత్వము మలము చేత కల్పించబడినదనెడి శ్రీభగవత్పాదులవారి యుపదేశము దృష్ట్యా తెలిసెడిదేమనగా గురూపదేశ ప్రభావము చేతను, గురువొసంగెడి దీక్షాది సంస్కారములవలనను, సాధకుని సాధనా పరిణామ ఫలితముగాను మలకల్పితమైన జీవత్వము వైదొలగి శివత్వము ప్రవేశించుట కవకాశము కల్పించునని తెలియుచున్నది. ఆత్మప్రాప్తి వలన ప్రాప్తించెడి శివత్వము సాపేక్షమైనదేగాని సంపూర్ణమైనది కాదని గ్రహించగలరు. సాధన కొనసాగగా కొనసాగగా లింగ లింగైక్య స్థలమున లింగత్వ ప్రాప్తి సంపూర్ణస్థాయిలో లభ్యమగుననెడిది తెలిసికొనవలసిన విషయము.

– శివం భూయాత్ –

## ఆశీర్వచనము-1 :
## అంతరాత్మ స్థలము :

ధర్మాసక్తి గల్గిన సాధకులింత కంటెను క్రితపు టాశీర్వచనము నందున లింగ ప్రాణలింగ స్థలమునకు చెందినదగునట్టి యంతరాత్మ స్థలము గురించిన ముగింపుకు సంబంధించిన యంశములను తెలిసికొంటిరి. లింగ ప్రాణలింగ స్థలమునందున నాత్మ స్థలము మొదటిది కాగా, నంతరాత్మ స్థలము ద్వితీయస్థలమై యున్నది. ఇద్దాని గురించి యీ ఆశీర్వచనమున తెలిసికొనబోవుచున్నారు.

శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారీ అంతరాత్మ స్థలమునకు చెందిన ప్రారంభోపదేశమును నీ క్రింది విధముగా ప్రదానము చేసిరి.

**యదా నిరస్తం జీవత్వం భవేద్ గుర్వనుబోధతః ।**
**తదన్తరాత్మ భావోఽపి నిరస్తస్య భవేద్ ధ్రువమ్ ॥** (సి.శి. 18-18)

దీని భావమేమనగా గురూపదేశము వలన యెప్పుడైతే సాధకుని జీవభావము నిరస్తమగునో అప్పుడు నా నిరస్త జీవత్వ భావము గల సాధకునికి నంతరాత్మ భావము నిశ్చిత రూపమున గల్గును.

శ్రీ రేణుకాచార్యులవారు, అగస్త్యునికి నంతరాత్మ స్వరూపము గురించి యీ విధముగా వివరించిరి :

**దేహస్థితోఽప్యయం జీవో దేహసఙ్గవివర్జితః ।**
**బోధాత్ పరాత్మాభావిత్వాదన్తరాత్మేతి కీర్తితః ॥**(సి.శి. 18-19)

దీని తాత్పర్యమేమనగా, దేహములో నుండియున్నను నద్దాని సాంగత్యము లేనివాడై పరమాత్మ భావయుక్తుడై యుండెడి జీవి యంతరాత్మయనబడుచున్నాడు.

అంతరాత్మ యనెడి నామధేయ మెట్టుల సంప్రాప్తించినదో యనెడి దానిని శ్రీ భగవత్ పాదులవారీ క్రింది విధముగా తెలియజేసిరి.

**ఆత్మాన్తరాల వర్తిత్వాజ్జీవాత్మపరమాత్మనోః ।**
**యోగాదుభయ ధర్మాణామన్తరాత్మేతి కీర్తితః ॥** (సి.శి. 18-21)

దీని భావమేమనగా, జీవాత్మ పరమాత్మల మధ్యలో నుండెడి కారణమునను, యీ రెంటియొక్క ధర్మములను గల్గియుండటము చేత నియ్యది యంతరాత్మయని పిలువబడుచున్నది.

ఇంతకుముందున చెప్పిన యటుల ఆత్మ శుద్ధముగాను, నిరంజనముగాను నుండును. జీవభావముచేత తిరుగాడుచుండును. గురూపదిష్ట బోధవలనను, తదితర సంస్కారముల వలనను జీవభావము లుప్తమైపోవును. ఆత్మ భావమేర్పడును. ప్రారబ్ధ కర్మముగియునంతవరకును నాత్మదేహముననే యుండి కర్మఫలము ననుభవించవలసియుండును. అయితే యసంగభావముండుటచే దేహములోనుండినను, దానితో సంగములేని యటుల వర్తించుచుండును.

ఈతని స్థితి జీవాత్మ-పరమాత్మలకు మధ్యలోన నుండెడి స్థితి. అందుచేత, నీ రెంటియొక్క యనుభవములను పొందచుండును. భోజనాదులను చేయుచు జీవుని వలెను, ఆత్మ జ్ఞానమును పొంది పరమాత్మవలె నుండును. ఈ విధముగా రెంటి ధర్మములను గల్గియుండుటచేత నంతరాత్మ యనెడి సార్థకత నమాధేయమును గల్గియున్నాడు.

అంతరాత్మాను ప్రస్ఫుటముగా వివరించుటకై క్రింది విధముగా నానతి నిచ్చిరి :

**అహంకారస్య సంబంధాన్మనుష్యత్వాద్వి విభ్రమః ।**
**న స్వభావ ఇతి జ్ఞానాదన్తరాత్మేతి కథ్యతే ॥** (సి.శి. 18-22)

అహంకారముతో సంబంధముండెడి కారణమున జీవునికి మనుష్యత్వాదుల భ్రమ గలుగుచున్నది. మనుష్యత్వము స్వభావసిద్ధమైనది కాదనెడి జ్ఞానము కలుగుటచేత సాధకుడు నంతరాత్మ యనెడి పేరున పిలువబడుచున్నాడనెడిదే యీ శ్లోకములోని భావము.

ఈ అంశమును వివరించుటకై నొక దృష్టాంతములనివ్వనైనది. గమనించుడి :

**యథా పద్మపలాశస్య న సంగో వారిణా భవేత్ ।**
**తథా దేహజుషోఽప్యస్య న శరీరేణ సంగతిః ॥** (సి.శి. 18-23)

**నీడస్థితో యథాపక్షీ నీడాద్భిన్నః ప్రదృశ్యతే ।**
**దేహస్థితస్తథాత్మాఽయం దేహాదన్యః ప్రకాశ్యతే ॥** (సి.శి. 18-24)

వీటి తాత్పర్యమేమనగా నీటిలోనే యుండుచు తామరాకు నీటికంటెను భిన్నముగా నుండునటులను గూడులోనే యుండుచు గూడు కంటెను భిన్నముగా నుండెడి పక్షి యటుల దేహములోనే యుండుచునే ఆత్మ దేహము కంటెను భిన్నమైనదై యుండుచున్నది.

ఆత్మ యనెడి దహంకారముతో సంబంధమును పొందిన పిదప నయ్యది అహంకార మరియు మమ యనెడి భావనలకు జన్మస్థానమగును. తత్ఫలితముగా ఆత్మ దేహాదుల మీద యభిమానమును పెంపొందించికొనును. స్వాభావికముగా నాత్మ మనుష్య, దేవ, దానవ, యక్ష, రాక్షసాదులలోన నేదియును కాదు. ఆయా జన్మల నెత్తినప్పుడు గల్గెడి భ్రాంతి వలన దేహాభిమానముద్భవించుచున్నది. జీవుడు నిది యంతయు భ్రమయని యెరింగెడి జ్ఞానమును పొందినప్పుడతడు నంతరాత్మగా పిలువబడును. ఈ సందర్భముగా నీటిలో నుండుచునే నీరు నంటని కమలము యొక్క దృష్టాంతము తెలిపెడి యటుల జ్ఞాని యైన దేహి దేహ సాంగత్యమును వీడి చరించుచుండును.

ఇచ్చట యెరుగవలసిన విషయమేమనగా, అంతరాత్మ స్థలములోని సాధకుడు తాను దేహము కంటెను భిన్నమై యున్న వాడినని భావించికొనును. దేహమునకు గల్గెడి సుఖ-దుఃఖముల యెడల నలిప్తుడై యుండును. ఈ విషయమున కొందరు జనక మహారాజు కథ నుదహరింతురు. మహాజ్ఞాని యైన జనకుడు, తన రాజ్యమునకు సంబంధించిన విషయముల యెడల ననాసక్తి ప్రదర్శించెడి వాడని చెప్పబడుచున్నది. ఈ విషయము సుస్పష్టముగా తెలుపుటకే శ్రీ భగవత్ పాదులవారు రెండు దృష్టాంతముల నిచ్చిరి.

దేహమునకు నాత్మతో గల సంబంధము గురించి శ్రీ రేణుకాచార్య భగవత్ పాదులవారీ విధిన నుపదేశించిరి.

**ఆచ్ఛాద్యతే యథా చంద్రో మేఘైరాసఙ్గవర్జితైః ।**
**తథాఽత్మా దేహ సంగాతై రసంగపరివేష్టితః ॥** (సి.శి. 18-25)

ఉపదేశము యొక్క సారాంశమేమనగా చంద్రునితో సాంగత్యము లేకుండగనే యే విధముగా మేఘములు చంద్రుని కప్పివేయునో, అదే విధిన దేహము నాత్మతో నసంగత్వము కలిగియున్నను నాత్మను కప్పివేయుచున్నది.

దేహాత్మల యసంగత్వమును గురించి తెలుపబడిన దృష్టాంతములన్నింటికంటెను చంద్ర-మేఘముల దృష్టాంతమెంతో మేలైనదిగా దోచుచున్నది. గూడులో నుండెడి పక్షి గూడుతో కొంతమేరకైనను సంబంధము గల్గి యుండును. తామరాకుయును నట్టిదే. చంద్రునికి - మేఘమునకు గల సంబంధమెట్టిది కాదు. చంద్రుడు మేఘముల కంటెను నెంతో యెత్తు మీద తిరుగాడుచుండును. వీటి మధ్య గల అంతరము ననూహ్యమైనదై యున్నది. కాని చూపరులకు మేఘములా చంద్రుని పూర్తిగా కప్పివేసిన యట్టుల కన్పట్టును. దేహ-ఆత్మల మధ్యగల అంతరము చాలా యెక్కువగా నుండును. అయినను, దేహ మాత్మను కప్పివేసిన యటుల గోచరించుచుండును.

దేహములోనుండెడి ఆత్మ శివ- సాక్షాత్కారము నెట్టుల చేసికొనుననెడి విషయములో శ్రీరేణుకాచార్యు భగవత్పాదులువారు తమరి యుపదేశము నీ క్రింది విధముగా జేసిరి.

**నిర్మమో నిరహఙ్కారో నిరస్తోపాధివిక్లవః ।**
**దేహస్థోఽపి సదాహ్యాత్మా శివం పశ్యతి యోగతః ॥** (సి.శి. 18-25)

ఉపదేశము యొక్క తాత్పర్యమేమనగా, మమకారాహంకార రాహిత్యమును, దేహేంద్రియాద్యుపాదుల నిస్సంగత్వమును, బాధాదుల రాహిత్యము వలన లక్షితమైయున్న ఆత్మ, శివయోగము వలన శివసాక్షాత్కారమును పొందును.

శివసాక్షాత్కారమును గనుచు నాత్మయే విధిన ప్రకాశించుననెడి దానిని గురించి వివరించుటకొరకు శ్రీ భగవత్పాదులవారు నీ విధిన యుపదేశించిరి :

**భోక్తృ భోజ్యపరిత్యాగాత్ ప్రేరకస్య ప్రసాదతః ।**
**భోక్తృతాభావగలితః స్ఫురత్యాత్మా స్వభావతః ॥** (సి.శి. 18-26)

దీని తాత్పర్యమేమనగా భోక్తా మరియు భోజ్య భావనల పరిత్యాగము చేతను, శివుని ప్రసాదము లభించుట చేతను, ఆత్మ తన స్వభావమున కనుగుణముగా ప్రకాశించును.

ఈ స్థలమునకు సంబంధించిన ముగింపు వుపదేశముగా, శ్రీ భగవత్పాదులవారీ క్రింది విధముగా సెలవిచ్చిరి :

**సర్వేషాం ప్రేరకత్వేన శంభురన్తః స్థితః సదా ।**
**తత్పరిజ్ఞాన యోగేన యోగీనందతి ముక్తవత్ ॥** (సి.శి. 18-27)

శివుడందరిలోను ప్రేరకునిగా నుండి యున్నాడనెడి పరిపూర్ణ జ్ఞానమును గల్గియుండుటచేత శివయోగి ముక్తునివలె నానందము యొక్క యనుభవమును పొందును.

జీవునిలోన నుండెడి యహంకార, మమకార, భోక్తృ భావనల వలన నతడు సంసారియగుచున్నాడు. దేహ సాంగత్యమును పొందుచున్నాడు. ఇవి హుళక్కి అయిన యెడల దేహములోనున్నను, అట్టివాని యెడల నభిమానము లేనివాడి జీవుడు నిస్సంగియగును. ఈ స్థితిలో నంతరాత్మ యనబడెడి శివయోగి ముక్తునివలె సచ్చిదానందము ననుభవించునని యెరుంగవలెను. మీరెల్లరీ యానందమును పొందుటకై వలయు కృషిని చేపట్టుదురు గావుత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులవారు జీవాత్మ అంతరాత్మల సాపేక్ష సంబంధము గురించి వివరించిరి. జీవత్వోద్వాసనయే అంతరాత్మగా పరిణామమును పొందుటకు కారణభూతమైనట్టి ప్రధానాంశమని వివరించి చెప్పిరి.

ఆత్మ, జీవాత్మ, అంతరాత్మ యనెడి పదములకు విభిన్నమైన అర్థములు నివ్వబడినవి. కొందరు వీటిని పర్యాయ పదములుగా భావించగా మరికొందరు తమ తమ వ్యాఖ్యలలో భిన్నత్వాన్ని చూపిరి. అద్వైతులకు నివి పరమాత్మ యొక్క పర్యాయ పదములే. కొన్ని నిఘంటువులు నంతరాత్మకు పరమాత్మ యనెడి అర్థము నిచ్చినవి. వీటిననుసరించెడి వారు జీవాత్మయన ఆత్మయనియును, అంతరాత్మ యన పరమాత్మ యని సెలవిచ్చిరి. ఈ తికమక నేపథ్యమున చెప్పబడినదని దోచెడి యీ క్రింది పద్యమును గనుడి :

**గీ॥ ఆత్మ అంతరాత్మయు పరమాత్మలనెడి**
**వాటి వివరంబు తెలుపకే బ్రహ్మావాది**
**ఘనత మీరెడి సిద్ధాంత గమ్యమెరుగ**
**సకల యత్నంబు చేసెగా వికల విధిన** (మార్గం పెద్దవీరప్ప – అముద్రితము)

జీవాత్మ, అంతరాత్మలనెడివి భిన్నమైనవని తెలియజేసెడి శ్రీ బసవేశ్వరులవారి వచనమును గనుడి :

**జీవాత్మ అంతరాత్మన్త సుద్దియ**
**బెసగొంబడె హాళిహె కేళిభో**
**హుసియ సంకెల యాగిద్దల్లి కాదు కొండిద్దనొబ్బ**
**కథెకనసమాడి హేళుత్తిద్ద నొబ్బ**
**పరాపరక్కె హోగి పరమన సుద్దియ**
**కొండు బరుత్తిప్ప**
**అవరిబ్బరనూ కెడెమెట్టి హోహాగ**
**లోక నిర్బుద్ధి కొండిత్తు కూడల సంగమ దేవా** (వచ.సం. 926)

దీని తెలుగు రూపమిది :

*జీవాత్మ అంతరాత్మల సుద్దిని వెసనగొనినచో చెప్పెదవినుడో*
*హుళక్కి సంకెలగా నున్నకద కాచికొని యుండెనొకడు*
*కథను కలగా జేసి చెప్పుచున్నాడొకడు*

*పరాపరమునకు పోయి పరముని సుద్దిని*
*గొనివచ్చు చుండెడి*
*వారిద్దరినీ చెడమెట్టిపోవునప్పుడు*
*లోకము నిర్బుద్ధి గొనియున్నది*
*కూడల సంగమ దేవా!*

ఐక్య స్థలమును నధిరోహించెడి క్రమములోన నీ జీవాత్మ అంతరాత్మ దశలు వచ్చుననెడిదే గ్రహించవలసిన విషయము. మిథ్యను దాటలేని స్థితి యాత్మది కాగా, అంతిమ సత్యమును నెరుగజాలని స్థితి అంతరాత్మదని తెలుపబడినది.

"ఆత్మాన్తరాలవర్తిత్వాత్... ఉభయ ధర్మాణామన్తరాత్మేతి" యనెడి భగవత్పాదుల వాక్కులు (సి.శి. 18:11) స్మరణీయములు.

ఆత్మప్రాప్తిని పొందిన సేవ్యుడు జీవత్వ లక్షణములను నిరాకరించుచు దైవత్వ లక్షణములనలవరచికొనెడి స్థితికెదిగిన యప్పుడు నతడు నంతరాత్మ స్థలి యనబడుననెడిది గుర్తించవలసిన విషయము. ఇతడు తన సాధనను ఫలప్రదము చేసికొని క్రమానుగతమైన ప్రగతి పథమున పయనించుచు పరమాత్మ స్థలిగా నెదుగుననెడిది మున్ముందు తెలిసికొనగలరు.

– శివం భూయాత్ –

## ఆశీర్వచనము-1 :

## పరమాత్మ స్థలము :

జిజ్ఞాసగల సాధకులింతవరకు వివిధ స్థలముల గురించి తెలిసికొని చివరగా నంతరాత్మ స్థలము గురించి తెలిసికొంటిరి. అద్దాని తదుపరి స్థలమే పరమాత్మ స్థలము. ఈ స్థలమును గురించి వివరించుచు, శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారీ క్రింది విధముగా నానతిని యిచ్చిరి.

**నిర్ధూతే తత్త్వబోధేన మలే సంసార కారణే ।**
**సామరస్యాత్ పరాతస్థాత్ః పరమాత్మాయ ముచ్యతే ॥** (సి.శి. 18–29)

దీని తాత్పర్యమేమనగా, అంతరాత్మ స్థలములోని సాధకుడు గురువు వలన తత్త్వబోధను పొంది, మల సంబంధమును దూరీకరించుకొని, పరమాత్మ యందెప్పుడు సామరస్యస్థితిని పొందునో అప్పుడతడు పరమాత్మయని అనబడును.

కైవల్యోపనిషత్తునందున పరమాత్మ స్వరూపము గురించి యీ క్రింది విధముగా నివ్వబడినది.

**ఏవం విదిత్వా పరమాత్మరూపం గుహా శయం నిష్కల మద్వితీయమ్ ।**
**సమస్త సాక్షిం సదసద్విహీనం ప్రయాతి శుద్ధం పరమాత్మ రూపమ్ ॥**

శ్రుతివాక్కులలోని తాత్పర్యమేమనగా, హృదయ గుహయందున నుండెడిదియును, దోషరహితమైనదియును, అందరికీ సాక్షీభూతమైనదియును, సదసద్విహీనమైనదియును, పరిశుద్ధమైనదియును, అయిన పరమాత్మ స్వరూపమును తెలిసికొనినవాడు పరమాత్మ స్వరూపమే యగుచున్నాడు.

పూర్వోక్తమైనట్టి యంతరాత్మ స్థలమునకు చెందినట్టి శివయోగి పరమాత్మ స్వరూపమును తెలిసికొని, తానును బరమాత్మ యగునని తెలిసికొనగలరు. తాను తెలిసికొనిన పరమాత్మ స్వరూపము గురించి నిరంతరముగా చింతించుటచేత భ్రమర కీట న్యాయమున నీ పరిణామము సంభవించుచున్నది. పరమాత్మ యనగా పరమోత్కృష్టమైనట్టి యాత్మ తత్త్వమని యెరుగవలెను. ఇదియే శివుని స్వరూపము. మూలతః పరమాత్మ స్వరూపమైన జీవాత్మ, త్రిమలముల ప్రభావమునకు లోనై జీవుడగు ననెడిది మనమెరిగిన విషయమే. దీక్షా సంస్కారాదుల వలనను, గురూపదిష్ట తత్త్వ వివేచన వలనను, నిరంతర సాధన వలనను క్రమక్రమముగా నంతరాత్మ స్థలము వరకెదిగిన శివయోగి పరమాత్మ తత్త్వము నెరిగినవాడై తన మూల స్వరూపమును పొందుచున్నాడు.

పరమాత్మ యనెడి వాడెవ్వడనెడి దానిని శ్రీ రేణుకాచార్యులవారు శ్రీ అగస్త్య మునీంద్రునకీ విధముగా వివరించి చెప్పిరి :

**సర్వేషామాత్మ భేదానాముత్కృష్టత్వాత్ స్వతేజసా ।**
**పరమాత్మా శివః ప్రోక్తః సర్వగోఽపి ప్రకాశవాన్ ॥** (సి.శి. 18–29)

తన తేజము యొక్క కారణమున, సర్వ వ్యాపియును, ప్రకాశమానుడును, అయిన శివుడు సమస్తములైన యాత్మలయందు నుత్కృష్టుడై యుండుటచేత బరమాత్మ యనబడుచున్నాడనెడిదే దీని సారము.

పరమాత్మ యొక్క లక్షణమును మరొక విధముగా చెప్పెడిదైనట్టి యుపదేశమిది కనుడి :

**బ్రహ్మాణ్డబుద్బుదస్తోమా యస్య మాయామహోదధౌ ।**
**ఉన్మజ్జన్తి నిమజ్జన్తి పరమాత్మా స ఉచ్యతే ॥** (సి.శి. 18–30)

దీని తాత్పర్యమేమనగా నెవ్వరి మాయా రూప సముద్రమునందున బ్రహ్మాండములనెడి నీటిబుడగల సమూహములు మునిగి తేలుచుండునో అతడే పరమాత్మయనబడుచున్నాడు.

పరమాత్మ యొక్క స్వరూపమును దృష్టాంతపూర్వకముగా చెప్పబడినది. గమనించుడి :

**యస్మిన్ జ్యోతిర్గణాః సర్వే స్ఫులింగా ఇవపావకాత్ ।**
**ఉత్పత్య విలయం యాన్తి తద్రూపం పరమాత్మనః ॥** (సి.శి. 18–31)

దీని తాత్పర్యమేమనగా నే ప్రకారముగా నగ్ని నుండి విస్ఫులింగములు పుట్టి లేచి లయమగునో అదేవిధముగా సమస్త జ్యోతిర్గణములు దేనినుండి యుద్భవించి, వెలిగి, లీనమగునో అదియే పరమాత్మ తత్త్వము.

శ్రీ భగవత్ పాదులవారీ విషయము నింకొక ప్రకారముగా తెలియజెప్పిరి.

**యస్మిన్ సమస్త వస్తోనికల్లోలా ఇవ వారిధౌ ।**
**సంభూయ లయమాయాన్తి తద్రూపం పరమాత్మనః ॥**
(సి.శి. 18–33)

ఉపదేశములోని భావమేమనగా, నేవిధిన సముద్రములోనుండి పుట్టెడి యలలు సముద్రములో లయమగునో అదేవిధిన యేతత్త్వమునుండి సమస్త వస్తువులు పుట్టి మరియు దేనిలో లీనమగునో అదియే పరమాత్మతత్త్వము.

ఈ జగత్తునందున జీవాత్మ లొకానొక శరీరము నాశ్రయించి విభిన్నమైన వ్యవహారములను చేయుచుండును. ఈ ఆత్మలన్నింటికంటెను తేజస్వియైనట్టిదియును, నుత్కృష్టమైనట్టిదియును, అయినట్టిదే పరమాత్మయనబడుచున్నది. జీవుల దేహాదులొకే రీతిన కన్పట్టినను నొక్కొక్క ఆత్మలో నొక్కొక్క వైశిష్టత గోచరించుచుండును. ఒకే జాతికి చెందిన జీవులలోను తారతమ్యముల గాంచవచ్చును. ఒక్కడు జ్ఞాన విశిష్టుడై, శీలవంతుడై, తపస్సంపన్నుడై యుండగా, నింకొకడు సోమరియై, యజ్ఞానియై నికృష్టుడై యుండును. వ్యక్తులలోగల వైవిధ్యతకుగల కారణమేమనగా, ఆయా ఆత్మలు పరమాత్మనుండి పొందెడి తేజస్సుతో గల తేడాలు తారతమ్యములకు దోహదము చేయును. పరమాత్మ యొక్క గుణగణముల నలవరచికొనిన సామాన్యమైన జీవాత్మ పరమాత్మగా గుర్తింపును పొందును.

పరమాత్మ స్థలమునకు చెందిన కీలకాంశముల ప్రతిబింబమును భగవద్గీతలోని విభూతి యోగమునందున గాంచగలము. దాన దేహాదులలోను, వస్తువుల ప్రతియొక్క వర్గములోను నుత్కృష్టమైనవేవో సూచింపబడినవి. అందులో, పరమాత్మ యొక్క విశేషాంశముందునని తెలుపబడినది. ఉదాత్తగుణ సంచయము, గల్గిన జీవి లేదా వస్తువు పరమాత్మయని తెలుపబడినది.

విశేషగుణములలో దానగుణము ముఖ్యమైనదని యెరుగవలెను. సామాన్యముగ దేహి తీసుకొనుటలోనే అధికమైనట్టి యాసక్తిని ప్రదర్శించును. ఇచ్చెడి వానిలో పరమాత్మ గుణములు హెచ్చుగా నుండునని గుర్తించవలెను.

శ్రీ భగవత్పాదుల వారు తమరి దృష్టాంత పూర్వకమైన వివరణ వలన వివరించినదేమనగా చరాచర జగత్తు యొక్క సృష్టి స్థితి లయలకు కారణభూతుడైన వాడే భగవంతుడని తెలియజేసిరి.

పరమాత్మ స్థలమునకు చెందినట్టి యుపదేశమునకు ముగింపు నిచ్చుచు శ్రీ భగవత్పాదులవారీ విధముగా నుపదేశించిరి :

**నిరస్త మల సంబంధమ్ నిశ్శేష జగదాత్మకమ్ ।**
**సర్వతత్త్వోపరి ప్రోక్తం స్వరూపం పరమాత్మనః**
**యథావ్యాప్య జగత్సర్వం స్వభాసాభాతిభాస్కరః ।**
**తథా స్వశక్తిభిర్వ్యాప్య పరమాత్మా ప్రకాశతే ॥**
**విశ్వతోభాసమానోఽపి విశ్వమాయా విలక్షణః ।**
**పరమాత్మా స్వయంజ్యోతీరూపో జీవాత్మనాం భవేత్ ॥** (సి.శి. 18-34 నుండి 35 వరకు)

పై యుపదేశముల తాత్పర్యమేమనగా నివారితమైనట్టి సమస్త మలములు గల్గి, జగత్తుకు నాత్మయై, మిగిలిన తత్త్వములకంటె నతీతముగా నుండెడివాడే పరమాత్మ. సూర్యుడు తన వెలుతురును ప్రసరింపజేయుచు ప్రకాశించునటులే, పరమాత్మ స్వయం ప్రకాశుడై, జగత్తును ప్రకాశమానము చేయుచు తానను విశ్వోత్పత్తికి కారణభూతుడైనట్టి పరమాత్మ విశ్వమంతటా వ్యాప్తిని గొని యున్నాడు. ఇతనియందున నుండెడి వివిధ విలక్షణమైన శక్తులు పంచమహా భూతములయందున వ్యాప్తినిగొనియున్నవి. తన ప్రకాశముచేత విశ్వమంతటా వ్యాప్తిని గొని యున్నట్టి సూర్యునివలె తన శక్తులచేత శివ పరమాత్మ విశ్వములోని చరాచరముల యందున వ్యాప్తిని గొని యున్నాడు. శివుని తిరోధానశక్తి భూమిని, పాలనా శక్తి జలమును, సృష్టిశక్తి అగ్నిని, సంహారశక్తి వాయువును, విభుత్వ శక్తి ఆకాశమును కప్పివేసి వాటిలోనికి ప్రవేశించి నిలిచియున్నవి. అయినా, ప్రపంచములోని భావ వికారము లతని యంటవు. షడ్భావ వికారముల నుండి యలిప్తుడై యుండునని గ్రహించగలరు. పరమేశ్వరుడైన పరమాత్మ యొక్క వాస్తవిక స్వరూప మిట్టిదని యెరిగెడి శివయోగియును పరమాత్మయగుచున్నాడని తెలిసికొనగలరు. మీరంతరాత్మ స్థితి వరకు నెదిగి, ఆ స్థలమున సాధనచేసి యనుభవమును గడించి పరమాత్మగా పరిణామమును పొందుటకై శ్రీరేణుకాచార్య భగవత్పాదులవారు చూపిన మార్గమున పయనించుచు కృతార్థులగుదురు గావుత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువుల వారు పరమాత్మ స్థలమున సాధన చేసెడి సాధకుని లక్షణముల గురించి వివరించి చెప్పిరి.

ఉపనిషద్దాదుల ప్రకారము పరమాత్మ పదము సర్వోత్కృష్టమైన స్థానమని తెలియుచున్నది. ఆత్మలన్నిటి కంటెను శ్రేష్ఠతమమైన దానిని పరమాత్మ స్థలమని చెప్పబడినది. "శుద్ధం పరమాత్మ రూపం" అనియును నిష్కల మద్వితీయం పరమాత్మ రూప" మనియును కైవల్యోపనిషత్తు తెలుపుచున్నది. ఈ భావము ననుసరించెడి శుద్ధశైవులు "శివః పరమాత్మా" యని పలుకుచు శివుడే పరమాత్మయని ప్రతిపాదింతురు.

లింగతత్త్వైకవిదులు లింగస్థలము పరమాత్మస్థలము కంటెను భిన్నమైనదని తలతురు. శ్రీ బసవన్నవారును నీ పథముననే పయనించిరని తెలిపెడి యీ క్రింది వచనమును గనుడి :

**శుద్ధాత్మ పరమాత్మ రిబ్బరూ**
**ఒందు రత్నక్కె హెణగాటవనాడిహరు**
**అవర హెణగాటవ నోడి ఆ రత్నవ**
**సెళెదు కొండడె**
**కూడల సంగమ దేవంగారోగణె యాయిత్తు**

దీని తెలుగు రూపమును గనుడి :

**శుద్ధాత్మ పరమాత్మ లిరువురూ**
**ఒక రత్నము కొరకు పెనగులాటనాడిరి**
**వారి పెనగులాటను జూసి**
**ఆ రత్నమును గుంజికొనినచో**
**కూడల సంగమ దేవున కారోగణమైనది.**

ప్రాణలింగ స్థలాంతర్గతమైనట్టి స్థలములలోని లింగస్థలములకు చెందిన స్థలమే పరమాత్మ స్థలమని తెలియుచున్నది. ఆత్మస్థలి తన సాధనలో పరిపూర్ణతను సాధించి అంతరాత్మను, అంతరాత్మస్థలి జీవత్త భావనను పరిత్యజించి త్రిమలావృత దేహమును త్యాగమొనరించి పరాత్మలో తన భావమును నిలిపి నిరంతరమైన పరాత్మ చింతనలో మునిగితేలుచు భ్రమర కీటన్యాయమున పరమాత్మగా పరిణామమును నొందునని తెలిసికొనగలరు.

"శుభం భూయాత్"

## ఆశీర్వచనము - 1 :

## నిర్దేహాగమ స్థలము :

వీరశైవ సద్ధర్మ సాధకులు శ్రీ రేణుకాగస్త్య సంవాదములోని లింగ షట్ స్థలమగునట్టి ప్రాణలింగ స్థలములోని అవాంతర భేదముల యందలిదైనట్టి పరమాత్మ స్థలము గురించి తెలిసికొనిరి. తదుపరి స్థలమైనట్టి నిర్దేహాగమ స్థలము గురించి ప్రస్తుతాశీర్వచనము నందున బోధ జరుగగలదు. సావధాన చిత్తులై తెలిసికొనగలరు.

ఈ స్థలపు నామధేయము సూచించిన యటుల నీ స్థలమున కెంతో ప్రాముఖ్యత గలదు. ఈ జగత్తునందున జన్మను దాల్చిన ప్రతియొక్క జీవికి త్రివిధ దేహములతో సంబంధముండును. ఆ దేహము లేవనగా, స్థూల, సూక్ష్మ, మరియు కారణ శరీరములు. వీటన్నిటి యెడల జీవుడు నభిమానమును ప్రాప్తి చేసికొనియుండును. జీవుని యభిమానమే జీవునికి దుఃఖమును గల్గించుచున్నదనెడిది బుధజన విధితమైన విషయము. ఎంతవరకీ దేహత్రయము గురించిన యభిమానము దూరము కాదో అంతవరకును జీవుడు దుఃఖము ననుభవించుచునే యుండును. జీవునకు స్థూల శరీరమునుండి విడుదల లభించుటను మరణమని పిలుతురు. ఈ మరణము జీవికెన్నోసార్లు లభ్యమగుచున్నది. జీవుని యిష్టాయిష్టములతో ప్రమేయముండదనెడిది మనమెరిగిన యంశమే. ఒక స్థూల శరీరమును త్యజించగనే, జీవునికి మరొక స్థూల శరీరము యొక్క ప్రాప్తి లభించుచున్నది.

ఈ విధమైన విడుదల స్వీకరణలనెడివి యెన్నియో యగములనుండి సంభవించుచు వచ్చుచున్నవి. ఏవిధముగా దేహి జీర్ణమైనట్టి వస్త్రమును విడిచివేసి, నూతన వస్త్రమును ధరించునో, అదే విధిన జీవియొక స్థూల శరీరమును వీడి మరొక స్థూల శరీరమును ధరించుచున్నాడు. అయితే సూక్ష్మ మరియు కారణ శరీరము లిట్టివి కావు. సృష్టి యొక్క ఆరంభదశలో నే శరీరము లివ్వబడినవో నయ్యవి ప్రళయము వరకు నిలిచియుండును. పునఃసృష్టి సమయమున జీవి వీటిని ధరించును. ముక్తి లభించునంతవరకీ ప్రక్రియ కొనసాగుచుండును. జన్మించిన ప్రతి జన్మలోను నొక జీవి చేసిన శుభాశుభ కర్మల వాసనా సంచయము సూక్ష్మ మరియు కారణ శరీరములలో సంగ్రహింపబడి యుండును. స్థూల శరీరమును నగ్ని దహించును. "దహ్యతే ఇతి దేహః" అని చెప్పబడినది. దహించిపోవునదైనందున దీనికి దేహమనెడి పేరు వచ్చినదని తెలుపబడినది. అయితే సూక్ష్మ మరియు కారణ కాయములను పావకుడు పాడు చేయజాలడు. వీటి వాసనలు జ్ఞానాగ్నిచేత దహింపబడుట వాస్తవమే. జ్ఞానప్రాప్తిచేత ముక్తి లభించును. ఈ శరీరద్వయము లుప్తమైపోవును.

భౌతికాగ్నియందున స్థూలశరీరము, (పాంచభౌతికమైన దేహము) నచిరకాలములోనే భస్మమగును. అయితే, జ్ఞానముప్రాప్తించగానే జ్ఞానియొక్క జీవనము పరిసమాప్తి కావలెను కదా? అయితే, యీ విషయమున శాస్త్రకారులు తెలిపిన దేమనగా, జ్ఞానము చేత నాగామి కర్మ మరియు సంచితకర్మ దగ్ధమైపోయినా ప్రారబ్ధ కర్మ మాత్రము మిగిలియే యుండును. "నా భుక్తం క్షీయతేకర్మ కల్పకోటి శతైరపి" అని చెప్పబడినది. ఈ ప్రమాణము ప్రకారముగా, చూచిన యెడల, ప్రారబ్ధ కర్మను తప్పనిసరిగా ననుభవింపవలెను. ఎప్పుడైతే ప్రారబ్ధకర్మ పూర్తిగా నుపభోగమైపోవునో అప్పుడు శరీరత్రయము లుప్తమైపోవును.

ఈ విధముగ, జ్ఞానాంతరమునందున ప్రారబ్ధ కర్మననుభవించెడి జ్ఞానియొక్క స్థితి యే విధముగా నుండుననెడి దానిని ప్రతిపాదించెడి స్థలమే నిర్దేహాగమ స్థలము. "నిర్గతః దేహభావః యస్మాత్ సః నిర్దేహః" అనెడిది నిర్దేహము యొక్క వ్యుత్పత్తి. ఏ జ్ఞాని మనస్సు వలన దేహభావము సంపూర్ణముగా నిశ్శేషమగునో, అతడే నిర్దేహియనబడుననెడిది దీని భావార్థము. సామాన్యముగా, గమన మరియు నిర్గమన యనెడి రెండు శబ్దముల యర్థమొకటేయని భావింపబడుచున్నను, 'నిర్' యుక్తమైన శబ్దమగు నిర్గమన యనెడి దాని అర్థము బహుళ విశేషమైనదై యున్నది. గమనమనగా పోవుట కాగా, నిర్గమనమనగా తిరిగి వచ్చెడి ప్రమేయము లేకుండగ పోవుటయని తెలిసికొనగలరు. అటులనే నిర్దేహుడనగా, దేహాభిమానమును చెరచికొనిన వాడని గ్రహించవలెను. వెడలిపోయిన యభిమానము తిరిగి రాకుండా వుండునని తెలిసికొనవలెను. ఈ విషయమున, శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారు శ్రీ అగస్త్య మహర్షి కొరకు నీ క్రింది విధముగా నుపదేశమును ప్రదానము చేసిరి :

**దేహినోఽపి పరాత్మత్వభావినోనిరహఙ్కృతేః ।**
**నిరస్తదేహధర్మస్య నిర్దేహాగమ ఉచ్యతే ॥** (సి.శి. 18-37)

దీని తాత్పర్యమేమనగా, దేహియై యుండినను, పరమాత్మత్వభావన గల్గినవాడై, అహంకారము లేనివాడై, దేహధర్మములను నిరాకరించినట్టి శివయోగిని నిర్దేహాగమ స్థలస్థుడని అందురు.

నిర్దేహాగమ స్థలమునందున ప్రవేశించిన శివయోగికి దేహము యెడల ప్రేమ భావముండదని శ్రీ రేణుకాచార్యులవారు శ్రీ అగస్త్యునకు తెలియజెప్పిరి. ఉపదేశమును గమనించుడి :

**గలితే మమతాహన్తే సంసారభ్రమ కారణే ।**
**పరాహన్తాం ప్రవిష్టస్య కుతో దేహః కుతో రతిః ॥** (సి.శి. 18-38)

దీని భావమేమనగా సంసార భ్రమకం కారణభూతమైనట్టి మమకారాహంకారములు నష్టమగుటచేత పరాహన్తాలోన ప్రవేశించిన శివయోగికి తన శరీరము యెడల మమకార భావముగాని, దాని గురించిన ప్రేమభావము గాని యుండదు.

ఈ స్థలములోని శివయోగి తన దేహము గురించి యేల చింతించడో అనెడి దానిని శ్రీ భగవత్పాదుల వారగస్త్యునికీ విధిన తెలియజెప్పిరి.

**కేవలే నిష్ప్రపంచౌఘే గంభీరే చిన్మహోదధౌ ।**
**నిమగ్నమానసో యోగీ కథం దేహం విచిన్తయేత్ ॥** (సి.శి. 18-39)

దీని భావమేమనగా, నివృత్తమైన సమస్త చరాచర ప్రపంచ సమూహము గలవాడును, అగాధమగు చిత్సముద్రములోన నిమగ్నమైన చిత్తము గలవాడును, అయినట్టి శివయోగి దేహము గురించి యే ప్రకారముగా చింతించగలడు? అనగా చింతించలేడనెడిది భావము.

పూర్వమున చెప్పబడిన శివయోగి తన భావనను పరమాత్మ స్వరూపముతో సమరసముగా జేసికొనియుండును. మన మోక్షభావన యెక్కడుండునో, అక్కడ మన యొక్క అస్తిత్వముండును. ఇదియే నొప్పికొనవలసిన విషయమే. ఇద్దాని కారణమేమనగా, మనస్సే సమస్త వ్యవహారములను చేయుటకు ప్రోత్సహించెడి మూలాంశమై యున్నది. ఒక వ్యక్తి తన వూరిలోని తన యింటిలో కూర్చుండి మనస్సును గురుచరణముల పైన లగ్నము చేసికొని యుండినచో, అతడు భౌతికముగా సుదూరముగా నున్నట్టుల దోచినను, వాస్తవముగా నతడు గురుచరణ సన్నిధిలోనుండిన వాడగుచున్నాడు. భౌతికపరమైనట్టి యస్తిత్వము కంటెను, మానసికమైనట్టి యస్తిత్వమునకే ప్రాముఖ్యత గలదని గుర్తించవలెను. దీనికి గల కారణమే మనగా మానసికాస్తిత్వము లుప్తమైనప్పుడు, వ్యక్తి తన భౌతికాస్తిత్వమును విస్మరించిన వాడుగా మారుచున్నాడు. మానసికముగా సుదూరమున నుండెడి గురువుగారి సాన్నిధ్యమున నుండిన వాని కాక్షణములో తన యిల్లు, ముంగిలి, పిల్ల-జల్ల, పాడి-పంట మొదలగునవి దోచనే తోచవు. మానసిక జగత్తునుండి బహిర్గతుడై భౌతిక జగత్తుకు వచ్చిన వ్యక్తి తాను పొందిన యనుభూతి గురించి యబ్బురపడును. ఇతరులకును నాశ్చర్యమున గల్గించును.

ఇంతటి ఘటనలు ప్రతియొక్కరికి ననునిత్య మెన్నోసార్లు ననుభవములోనికి వచ్చును.

పరమాత్మ యందున సమరసమైనట్టి మనస్సు గల్గినట్టి శివయోగి తాను దేహమునందున నుండి యున్నను దేహమును దాని ధర్మములను మరిచి పరమాత్మలో నిలిచియుండును. ఇట్టి కోవకు చెందిని శివయోగిని నిర్దేహుడని పిలుతురు. ఈ స్థలమాతని స్థితిని వివరించుటకే యుద్దేశింపబడినదని గ్రహించగలరు.

అక్కమహాదేవి చరిత్ర యీ విషయమును విడదీసి చెప్పెడిదైయున్నది. పరశివమూర్తితో సమరసమై యున్న కారణమున భోగ-భాగ్యముల నెల్లను తిరస్కరించి, రాచ మర్యాదలన్నింటిని కాలరాచి, రాచనగరును వీడి, వివస్త్రయై బయలుదేరి వెడలినట్టి యుదంతమనెడిది యీ నిర్దేహస్థితికి నద్దమును పట్టెడిదని చెప్పవచ్చును. జైన సాంప్రదాయములలోను దిగంబర సాంప్రదాయము గలదనియును, అదియును నొక నిర్దేహాగమ స్థలము వంటిదేననియును గ్రహించగలరు. జాతి-మత-సాంప్రదాయములతో ప్రమేయము లేకుండా నెవ్వరు పరమాత్ముని యందున తాదాత్మ్యస్థితిని పొందుదురో వారు నిర్దేహస్థితిని చేరుదురని తెలిసికొనవలెను.

ఎప్పుడైతే దేహభావము నష్టమగునో, అప్పుడు నీలోకములోని సంబంధములు తెగిపోవును. జ్ఞాని యిట్టి స్థితిని పొందగా, లౌకికుడు చచ్చెడి సమయము వరకును దేహ సంబంధములను గల్గియుండును.

ఇంతకంటెను క్రితమున చెప్పిన యటుల, దేహభావము నష్టమై లౌకిక సంబంధములు పటాపంచలైపోయిన కారణముననే పరమ సాధ్వి అక్కమహాదేవి మహాదేవునిలో లీనమవుటకు వలయు కృషిని చేపట్టి కృతకృత్యురాలయ్యెను.

ఏదోనొక పనిమీద నిల్లు ముంగిలిని వదలి వెళ్ళెడి ప్రసంగము వచ్చినప్పుడు వ్యక్తి యొక్క మనస్సు నందుననేక విధములైన భావనలు పొడచూపుచుండును. నేను వెళ్ళెడి స్థానమునందున నుండుటకై సరియైన వ్యవస్థ చిక్కునో? చిక్కదో? భోజనాది వ్యవహారములు తన కనుకూలముగ నుండునో? వుండవో? మొదలగు ప్రశ్నలు వేధించుచుండును. ఇట్టి ప్రశ్నలెదురున వచ్చినచో ఆ వ్యక్తి యిల్లు విడిచి వెడలుటకై వలయు పూర్ణమైన యేర్పాట్లు చేసికొనలేదని భావించికొనవలెను. విరాగచిత్తులైన వారి భావన లిట్టులుండవు. ఈ విషయమును విస్పష్టముగా తెలియజేసే అక్కగారి వచనమును గనుడి :

**హసివాదొడె భిక్షాన్నగళుంటు**
**తృషె యాదొడె కెరె, హళ్ళ, బావిగళుంటు**
**శయనక్కె హాళు దేగులగళుంట**
**చెన్న మల్లికార్జునయ్య ! ఆత్మ సంగాతక్కె నీనెనగుంటు**

అక్కగారి దివ్య వాక్కుల తెలుగు రూపమును గనుడి :

**ఆకొనినచో భిక్షాన్నముండును**
**తృషయైనచో చెరువు, పల్లము,బావులుండును**
**శయనము కొరకు పాడు దేవళముండును**
**చెన్న మల్లికార్జునయ్య!**
**ఆత్మసంగాతము కొరకు నీవు నాకుందువు!**

అక్కగారి మానసిక స్థితినీ వచనమెత్తిచూపుచున్నది. ఇంతటి విరక్తి ప్రధానమైన మనోబలముండిన గాని యాధ్యాత్మిక ప్రగతి సుసంపన్నము కాదు. ఈ కారణముననే శ్రీమన్నిజ గుణ శివయోగియు "నూటక్కె విషయక్కె మరుగు తిప్పొ తంగె కూటవప్పుదే ఘనపదదొళు" "కూడు కొరకు, విషయమునకై మరుగు తిప్పనికి కూటమబ్బునే ఘనపదములో" అనెడిది శివయోగుల వారి చిన్మయ భావము యొక్క భావార్థము. నిర్దేహస్థితిని పొందుటకై సాధకుడు నెట్టి సంసిద్ధత గల్గియుండవలెనో అనెడి దానిని శ్రీనిజగుణుల వారెంతో సంక్షిప్తముగా సూచించిరి. పరమాత్ముని ప్రాప్తి కొరకే మానవదేహము లభ్యమై యున్నదని తెలిసికొనవలెను. దేహముచేత పరమాత్ముని బడసెడి కృషిని చేపట్టజేయవలెను. దేహపు శుశ్రూషలో కాలమును వృధా చేయవలదు. దేహధర్మముల యెడల నిరాసక్తిని పెంపొందించి కొనవలెననెడిది యవిస్మరణీయమైన వాస్తవము.

జీవుడు సంసారమునందున పడి తిరుగాడుటకు నతని యందలి యహంకార మమకారములే కారణభూతమైన యంశములని గ్రహించగలరు. సంకుచితము లైనట్టి యహంకార మమకారములను త్రోసిపుచ్చి మనస్సును "పరాహంత" యందున ప్రవేశపెట్టినచో దేహరతి శూన్యమైనదగును. దేహరతి యనగా దేహము గురించిన ప్రేమయని తెలిసికొనవలెను. వ్యష్టియైన యహంకారము దేహరతికి కారణమైతే, సమిష్టి యహంకారమాత్మ రతికి కారణమగుచున్నది. అజ్ఞులు దేహరతి యెడల ననురక్తిని పెంచికొనెదరు. అయితే, శివయోగి కాత్మరతియే ప్రీతిపాత్రమైన దగును. "పూర్ణాహంత" రూపమును పొందిన శివయోగికి వ్యష్టిపరమైన దేహరతి యెడల యనురక్తి యెన్నటికైనను లుగదని గ్రహించవలెను. "పూర్ణాహంత" యనగా "సంపూర్ణమైన జగదాదులన్నియును నేనే" అనెడి భావనయని గ్రహించవలెను.

శరీరములోనుండియు శరీరపు భావన లేకుండగ నుండుట యెట్టుల? ఇంటిలో నుండియు మన యింటిని మరువవచ్చునే? శరీరములో నుండియును శరీరము గురించి మరచిపోవుట యెంతమేరకు ఎంతమేరకు సాధ్యమయ్యెడి విషయము? ఇట్టి ప్రశ్నలు నెదురగుట సహజమే. ఈ విధమైన సందేహముల నివృత్తిని సుసాధ్యము చేయుటకే శ్రీ రేణుకాచార్య భగవత్పాదులవారు మనస్సు యొక్క నిమగ్నావస్థ గురించి తెలియజెప్పిరి. మనస్సునకు చతుర్విధావస్థ లుండునని తెలియుచున్నది. అవి యేవనగా నాసక్తి, అనురక్తి, మగ్నత మరియు నిమగ్నతలు.

చిన్నపిల్లలకు నుండెడిదైనట్టి పటుతరమగు ప్రేమవంటిదే ఆసక్తి. పిల్లల కాటలంటే యెంతో నిష్టము. తిండి, త్రాగుడు మొదలగునవి విస్మరణకు గురియగును. తల్లి-దండ్రులు బెదిరించియో, బుజ్జగించియో వారిచేత తినిపించుటను చూడగలము. యువకుడొక యువతిని ప్రేమించుటలో ననురక్తి యిమిడి యున్నది. ఈ అనురక్తి కారణమున నతడు నిరంతర మా యువతి గురించియే చింతించుచుండును. యువతిలోన నీ అనురక్తి యుండినచో పరస్పరానురక్తి పరిఢవిల్లును. అది వివాహ బంధమునకు దారితీయవచ్చును. పరిణమైన పిదప భార్యాభర్తలుగా మారిన వీరిలో నుండెడి యనురక్తి మరణావస్థ వరకును కొనసాగును. అందుచేత ననురక్తియు నాసక్తికంటెను గహనమైనదని యెంచవచ్చును.

వృద్ధావస్థలో నుండెడి వ్యక్తి మరణించినట్టి తన భార్య లేదా భర్త గురించి నిరంతరము చింతించుచుండుటను గమనించుచుందుము. ఇద్దానిని మగ్నావస్థతో పోల్చవచ్చును. ఈ మానసిక మగ్నత తనను వీడిపోయిన వ్యక్తి లేదా వస్తువు గురించి యుండవచ్చును. వీటన్నిటినీ మించిన యవస్థను నిమగ్నావస్థయని అందురు. నీటిలో పూర్తిగా మునిగిపోయి, భూతలమును చేరిన వస్తువు నిమగ్నతకు దృష్టాంతముగా నిలుచును. కొలదిగా మునిగినది మగ్నతలో నుండెడిదనియును, పూర్తిగా మునిగెడిది నిమగ్నతలో నుండెడిదని తెలిసికొనగలరు. పరమాత్మ గురించి నిరంతరము చింతన చేసెడివానిని నిమగ్నతావస్థలో నుండెడి వాడని గ్రహించవలెను. అయితే, పరమాత్మ చింతనలో నిమగ్నమై యుండెడివారి సంఖ్య పరిమితముగా నుండునని యెంచబడుచున్నది. ఈ విషయము గురించి, స్మార్తమతాచార్యుడైన శ్రీ శంకరాచార్యులవారీ క్రింది విధిన నుడివిరి :

**బాలస్తావత్ క్రీడాసక్తః తరుణస్తావత్ తరుణీరక్తః ।**
**వృద్ధస్తావత్ చింతామగ్నః పరే బ్రహ్మణి కోఽపి న లగ్నః ॥**

లగ్నావస్థలో నుండెడివానికి దేహధర్మము యొక్క చింతన లుప్తమగును. ఈ విషయమును వివరించి చెప్పెడి కథ యొకటి కలదు. ఈ దశకు చేరిన మహాభక్తుడొకడు మహారాష్ట్రలో జీవించియుండెను. కుమ్మరి వృత్తిని స్వీకరించి జీవితమును వెళ్ళబుచ్చెడివాడు. ఒకనాడు కుండలు చేయుటకై వలయు మట్టిని తెచ్చి దానిని మెత్తగా చేయుటకై తొక్కుచుండెను. మట్టిని తొక్కినప్పుడును పరమాత్మ చింతన వీడలేదట. తనకు తెలియకుండగనే మట్టిని తొక్కుచుండెను. అప్పుడతని పిల్లవాడు నాడికొనుచు నటకు వచ్చెను. పరమాత్మలో నిమగ్నమైన భక్తుడిద్దానిని గమనించలేదు. మట్టితో నాడికొనెడి పిల్లవానిని తొక్కివేసెను. తానాపిల్ల వాని నా విధిన తొక్కుచున్నాననెడి ధ్యాస యతనికి లుప్తమైయుండెను.

నిర్దేహాగమ స్థలములో నుండెడి మానసిక స్థితియును నిమగ్నావస్థలో నుండునని గుర్తించవలెను. ఈ కారణముననే అతనికి దేహధర్మము యొక్క స్పృహ యుండదని తెలిసికొనగలరు.

నిర్దేహాగమ స్థలమునందలి శివయోగి కామక్రోధాది దేహ వికారాదులనుండి విముక్తిని పొంది యుండునని శ్రీరేణుకాచార్యభగవత్పాదులవారు శ్రీ అగస్త్య మహర్షి కుపదేశించిరి. గమనించుడి :

**అపరిచ్ఛేద్యమాత్మానం చిదంబరమితి స్మరన్ ।**
**దేహయోగోఽపి దేహస్థైర్వికారైర్న విలిప్యతే ॥** (సి.శి. 18-40)

దీని తాత్పర్యమేమనగా, తాను శివుడనియును, చిదాకాశస్వరూపి ననియును తలచెడివాడగు శివయోగి శరీరముతో సంబంధమును గల్గియుండినను దేహములో నుండెడి వికారముల నుండి విడువబడినవాడై యుండును.

ఈ స్థలములోని శివయోగికి మోహప్రాప్తి కలుగదని శ్రీ రేణుకాచార్య భగవత్పాదులవారు శ్రీ అగస్త్యునకు తెలియజెప్పిరి. ఉపదేశమును పరిశీలించండి :

**అఖణ్డ సంవిదాకారమద్వితీయం సుఖాత్మకమ్ ।**
**పరమాకాశమాత్మానం మన్వానః కుత్ర ముహ్యతి ॥** (సి.శి. 18-41)

దీని తాత్పర్యమేమనగా, తాను నఖండమైనట్టియును, చిదాకారమున నున్నట్టియును, నద్వితీయమైనదియును సుఖ స్వరూపమగు పరమాకాశముగా భావించికొని సదా మననము చేసికొనెడి వానికి మోహావేశము ప్రాప్తించదని గ్రహించవలెను.

నిర్దేహాగ స్థలములోని శివయోగి యొక వస్తువులో కన్పట్టెడి భేదమును వస్తువు యొక్క యుపాధికి సంబంధించినదైయుండునని తెలిసికొనునని శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారు శ్రీ అగస్త్యునకు తెలియజేసిరి. ఉపదేశమును గనుడి :

**ఉపాధివిహితా భేదా దృశ్యన్తే చైకవస్తుని ।**
**ఇతి యస్య మతిః సోఽయం కథం దేహ మితో భవేత్ ॥** (సి.శి. 18-42)

ఉపదేశము యొక్క తాత్పర్యమేమనగా, నొకే వస్తువులోన కనిపించెడి భేదములా వస్తువు యొక్క యుపాధికి చెందినదని గుర్తెరిగెడి వాడు దేహమునకే యే విధిన సీమితుడై యుండును?

శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారు నగస్త్యునకు భేదబుద్ధి కలుగుటకు గల కారణము నీ క్రింది విధముగా వివరించిరి :

**భేదబుద్ధిః సమస్తానాం పరిచ్ఛేదస్య కారణమ్ ।**
**అభేదబుద్ధౌ జాతాయాం**
**పరిచ్ఛేదస్య కా కథా ॥** (సి.శి. 18-43)

ఉపదేశము యొక్క తాత్పర్యమేమనగా, భేదబుద్ధియే సమస్త పరిచ్ఛేదములకును కారణభూతమైనటిట యంశమగుచున్నది. ఈ భేదబుద్ధి పరిసమాప్తమైనట్టి దశలో సమస్త పరిచ్ఛేదము పరిసమాప్తమగును.

ఆకాశ మపరిచ్ఛిన్నమైనదైయుండి యలిప్తముగా నుండును. అదేవిధిన నాత్మ యపరిచ్ఛిన్నమైనదగును. అలిప్తత యనెడిది దాని మరొక లక్షణము.

ఇట్టి ఆత్మను పరాకాశములోని యొక భాగముగా చూసెడి శివయోగికి వస్తువు నొకే విధిన కన్పట్టును. ఈ భావనచే యతనికి దేహబంధము నుండి విముక్తి లభించుచున్నది. ఇట్టి జ్ఞానికి దేశకాలమాన పరమైన భేదము లేవియును దోచవనెడిది గ్రహించవలసిన విషయము.

నిర్దేహాగమ స్థలమును పరిసమాపనం చేయుటకొరకు శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారీ క్రింది యుపదేశము నిచ్చిరి :

**శివోఽహమితి యస్యాస్తి భావనా సర్వగామినీ ।**
**తస్యా దేహేన సమ్బన్ధః కథం స్యాదమితాత్మనః ॥** (సి.శి. 18–44)

దీని తాత్పర్యమేమనగా సర్వ వ్యాపిత మైనట్టిదియును, "నేనే శివుడ"ననెడిదియును, అయిన భావన గల వాడెవ్వడో వానికి పరిమితాత్మ దృక్పథము గల వానికుండెడి దైహిక సంబంధముండదు.

నిర్దేహాగమ స్థలముననుండెడి సాధకునికి శివాద్వైత భావనయే ముఖ్యమైన యంశమని గుర్తించవలెను. చరాచర జగత్తు పరిచ్ఛిన్నమైన దానివలె దోచినను, నయ్యది శివుని కంటెను భిన్నమైనది కాదని విజ్ఞులెరుగుదురు. తాను శివుడనని భావించికొనెడి వానికి కూడ యీ స్థితి వర్తించును. అతడు నపరిచ్ఛిన్నుడే కదా! ఈ కారణముచేత నిర్దేహాగమ స్థలుడు దేహధర్మముల గురించి పట్టించికొనకుండగ తిరుగాడుచుండును. శివత్వమును పొందినవాడై యందరి చేతను వంద్యుడగుచున్నాడు. సద్భక్తులిట్టి శివయోగికి ప్రణమిల్లి ధన్యతను పొందుదురుగాక. సాధకులతని స్థితికి నెదుగుట కొరకు కృషిని సలుపుదురు గావుత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులవారు సాధకుని యొక్క నిర్దేహిస్థితి గురించిన సమగ్రమైనట్టి యాశీర్వచనములను ప్రదానము చేసి మనలను ధన్యులను జేసిరి.

దేహియనెడి వానికి దేహధర్మములుండును. జనన–జరా–మరణములే దేహధర్మములని చెప్పబడినవి. సదాదేహి జీవించుటకై యత్నించుచుండును. జరామరణములకు లోనుగాకుండా వుండవలెనని శతవిధములుగా ప్రయత్నించుచుండును. పుట్టినవాడు గిట్టక తప్పదనెడి దానిని మరచి చరించుచుండును.

ప్రారబ్ధ కర్మననుభవించుటకొరకు దేహమొక సాధనమని యెరింగిన వాడై కర్తృత్వభావనను వీడి కర్మలను చేయుచు, తత్ఫలమును గురు–లింగ–జంగములను సమర్పించి, ప్రసాదమును బడసి, యద్దానిని భోక్తృత్వ భావనాహీనుడై యనుభవించుచు, వ్యష్ట్యహంకారమునకు తిలోదకముల నిచ్చి సమిష్ట్యహంకార భావనా సంయుక్తుడై శివ–జీవాభేద బుద్ధి గల్గినవాడై సాధనచేసెడి పరమాత్మస్థలి నిర్దేహాగమ స్థలి యనబడుచున్నాడు. ఈ సందర్భమున లింగనాథుని దగు క్రింది పద్యము తిలకించదగినదైయున్నది.

**గీ॥ దేహము తనదనే మతి దెగగొట్టి**
**దేహ ధర్మంబులనువీడి సోహమనుచు**
**పరమ తత్త్వము నందున భావముంచి**
**దేహి తానగు నిర్దేహి తిరముగాను** (మార్గం పెద్ద వీరప్ప – అముద్రితము)

తమరి స్వానుభవమును నేపథ్యముగా గొని శ్రీ బసవేశ్వరులవారు చెప్పిన క్రింది వచనము నిర్దేహి యొక్క కీలక లక్షణములను తెలుపుచున్నది.

**తను నిమ్మదెంద బళిక ఎనగెబేరె తనువిల్ల**
**మన నిమ్మదెంద బళిక ఎనగె బేరెమనవిల్ల**
**ధన నిమ్మదెంద బళిక ఎనగె బేరె ధనవిల్ల**
**ఇంతీ త్రివిధపు నిమ్మదెంద బళిక**
**ఎనగె బేరె విచారవుంటె**
**కూడల సంగమ దేవా!** (వచ. సంఖ్య 828)

దీనియొక్క తెలుగు రూపమును గనుడి :

తనువు మీదనిన పిదప
నాకు వేరే తనువు లేదు
మనము మీదనిన పిదప
నాకు వేరే మనము లేదు
ధనము మీదనిన పిదప
నాకు వేరే ధనములేదు
ఇటులీ త్రివిధము మీదని యెరిగిన
పిదప నాకు వేరే విచార ముండునే
కూడల సంగమ దేవా!

విచారమనెడి మనస్సుకు సంబంధించిన యంశము. దీనినొక మనోవృత్తిగా దీసికొనవచ్చును. దేహికి దేహధర్మము గురించిన విచారములే తిరుగాడుచుండుననెడిది సర్వజన విదితమైన విషయమే. అయితే నిర్దేహి నిరస్తదేహ ధర్మములు గలవాడై యుండును. జనన-మరణ చక్రబంధము నుండి విడుదలను పొందినవాడై నిష్ప్రపంచుడై తిరుగాడెడి నిర్దేహి జ్ఞానసముద్రములో మునకలు వేయుచుండును. ఇట్టివానికి మనస్సునందున మరో విచారమెట్టుల వచ్చును? ఈ సందర్భమున శ్రీ భగవత్పాదులవారి "చిన్మహోదధే నిమగ్న మనసో యోగీ కథం దేహం మిచింత యేత్" అనెడి ప్రశ్న (సి.శి.18:38) స్మరణీయము.

నిర్దేహియనగా భౌతిక దేహమును వీడిన వాడని భావించవలదు. భౌతిక దేహము లుప్తమైన దశలో నాధ్యాత్మిక సాధన కావకాశముండదు కదా! దేహము యొక్క అవశ్యకత గురించి శ్రీభగవత్పాదులవారు సకాయ స్థలముననే తెలియజెప్పిరి. అయితే భౌతిక దేహముండినను, దానియెడల ప్రీతిలేకుండ నిర్లిప్తుడై యుండెడివాడే నిర్దేహి యనెడిది గ్రహించవలసిన విషయము.

దేహము గురించి సాధకునికి గల మమకారమును త్యజించుట యెట్టుల యనెడి దొక ముఖ్యమైన ప్రశ్న. ఈ ప్రశ్నకు నుత్తరంబును బొందగోరెడివాడు మమకారమునకు కారణమెయ్యది యనెడి దానిని గుర్తించవలెను. ఈ సందర్భమున శ్రీ భగవత్పాదులవారు తెలిపిన "భ్రమ" యనెడిది గమనించదగినదై యున్నది. భ్రమ వలననే మమకారముత్పన్నమగుచున్నదనెడిది శ్రీ భగవత్పాదులవారి ప్రతిపాదన. ఈ భ్రమకు మూలకారణమైన కృత్రిమాహంకారము వైదొలగిననాడు దేహము మీది మమకారము నశించిపోవును. అవిద్య తొలగనంతమేరకు కృత్రిమాహంకారము నిలిచి యుండును. జ్ఞానోత్తర దశలో నుండెడి సాధకుని నవిద్య పీడించజాలదు. చిన్మహోదధిలో స్నానక్రియనాచరించెడి నిర్దేహి చెంత కవిద్య రాజాలదనెడిది గ్రహించవలసిన విషయము. జ్ఞానోత్తర దశలోని వాడు శివుడపరిచ్ఛిన్నుడై చిదాకాశము రీతిన నిస్సీముడై యుండుననియును, తానే ఆ శివుడనియును భావించెడి స్థితిలో నుండును. ఇద్దానిని అకృత్రిమాహంకారమని యనవచ్చును. ఈ అహంకారము నూర్ధ్వమాకు సంబంధించినది. తాత్త్విక దృష్టితో చూసిన యెడల యిట్టి స్థితి శరణస్థలమున సంప్రాప్తమగును. అయితే అంగ శరణ స్థలమున కతీతముగా నుండెడి లింగ ప్రాణలింగి కిట్టి యనుభవము గల్గునని తెలియుచున్నది.

అకృత్రిమాహంకారము వలన సాధకునిలోని సంకుతి భావములు వైదొలగుననియును, భేదబుద్ధి నశించుననియును గుర్తించగలరు. భేదబుద్ధి వలననే దేహము గురించిన మమకారము గల్గుచున్నదనెడి యభిప్రాయము గలదు. అభేద బుద్ధిగల మానవుడు "నాది" యనెడి సంకుచిత భావమునకు లోనుగాడని గ్రహించగలరు.

"శుభం భూయాత్"

## ఆశీర్వచనము - 1 :

## నిర్భావాగమ స్థలము :

సద్భక్తులింతవరకు నిర్దేహాది స్థలముల గురించి తెలిసికొనిరి. లింగషట్ స్థలములలోని ప్రాణలింగ స్థలముయందున తరువాతయి స్థలమే నిర్భావాగమ స్థలము.

నిర్భావాగమ స్థలము గురించి శ్రీ రేణుకాచార్య భగవత్పాదులవారు, శ్రీ అగస్త్య మహర్షికి నీ క్రింది విధముగా నుపదేశించిరి.

**వ్యతిరేకాత్ స్వరూపస్య భావాన్తరనిరాకృతేః ।**
**భావో వికారనిర్ముక్తో నిర్భావాగమ ఉచ్యతే ॥** (సి.శి. 18-45)

దీని తాత్పర్యమేమనగా, నిర్దేహ స్వరూపమునకు వ్యతిరేకమైన భావనలను నిరాకరణ చేయుటవలన యే వికార రహితమైన భావము సంప్రాప్తమగునో, అద్దానిని నిర్భావాగమమని యందురు.

భావన యనెడిది మనస్సు యొక్క ఒక వృత్తి. "భావో మానసచేష్టాత్మా పరిపూర్ణః శివాత్మకః" యనెడి యాచార్యోక్తి ప్రకారముగా సంపూర్ణముగా శివమయముగా నుండెడి మనోవృత్తిని భావమని యందురు. మనందరికి పరమాత్ముడు లౌకిక మరియు నాధ్యాత్మిక వ్యవహారముల కొనసాగింపుకై శరీరమును, దానిలో పాణి, మనస్సు ఇత్యాదులను ప్రసాదించినాడు. మనము మన స్థూల శరీరముచేత భగవంతుని రూపమును ముట్టి పూజించవచ్చును. అయితే భగవంతునియొక్క దివ్యమైన సర్వజ్ఞత, నిత్యతృప్తత, అనాది బోధత మరియు అలుప్త శక్తిమత్వతలనెడి గుణములను పాణిచేత స్పర్శింపజాలము. వాణి నుపయోగించి, స్తుతించి, స్పృశించవలెను. పరమాత్ముని సచ్చిదానంద స్వరూపమును స్పృష్టించుట కొరకు మనస్సు నివ్వబడినది. ఈ విధముగా, భగవంతుని ముట్టి, స్తుతించి, మననము చేయుటకే త్రికరణము లివ్వబడినవని గ్రహించగలరు.

పరమాత్ముని ఆ సచ్చిదానంద స్వరూపమును గూర్చి మొదట శ్రవణ మూలకముగా తెలిసికొని మనముచేత అన్యాకారవృత్తిని నిరోధించి, నిధి ధ్యాసమూలక మనోవృత్తిని సదా ఆత్మరూపముగా నుండుటకై సాధ్యమగును. ఇచ్చట నిర్భావమనగా నిధిధ్యాసయని తెలిసికొనవలెను. భావన యందు నత్యాతిరిక్తమైన వేరగు వికారము లేవియును రానియటులను, కేవలము నాత్మ స్వరూపమునందున నెలగొనెడిదయినదగు మనోవృత్తిని నిర్భావస్థితియని యందురని శ్రీభగవత్పాదుల వారానతిని యిచ్చిరి. ఈ కారణముచేత నిధి ధ్యాస మరియు నిర్భావముల మధ్య నభేదము గలదని గుర్తించగలరు.

నిర్భావము యొక్క లక్షణమెట్టిది యనెడి ప్రశ్న యొక్క నేపథ్యములో శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారి యీ దివ్యోపదేశము వీక్ష్యము :

**అహం బ్రహ్మేతి భావస్య వస్తుద్వయసమాశ్రయః ।**
**ఏకీభూతస్య చిద్వ్యోమ్ని తదభావో వినిశ్చితః ॥** (సి.శి. 18-46)

దీని తాత్పర్యమేమనగా "నేను బ్రహ్మనై యున్నాను" అనెడి దానికి రెండంశములు గలవు. అవి : నేను మరియు బ్రహ్మము. చిదాకాశములో నీ రెండును సమరసమైన పిదప నీ రెంటి యొక్క ఆ భావము నిశ్చితముగా కాగలదు.

నిర్భావాగమ స్థలములో నుండెడి శివయోగికి జాతి వాసనాది బంధములుండవని శ్రీరేణుకాచార్య భగవత్పాదులవారు నగస్త్యునకుపదేశించిరి. ఉపదేశమును గనుడి.

**ఏకభావేనిరూఢస్య నిష్కలంకే చిదమ్బరే ।**
**క్వ జాతివాసనాయోగః క్వ దేహిత్వం పరిభ్రమః ॥** (సి.శి. 18-47)

దీని భావమేమనగా, చిదంబరము నందున తాదాత్మభావనను పొందిన శివయోగికి జాతి వాసనలు, దేహిత్వ భావన, సంసారములో పరిభ్రమణ లుండవు.

నిర్భావస్థితి యలవడకుండా నుండెడి వారు నెంత గొప్పవారైనను నింతనీయులగుదురనెడి విషయమును తెలిపెడి దృష్టాంతమొకటి కలదు.

ఒకానొక సమయమునందున జనక మహారాజు గారి రాజసభకు నష్టావక్ర మహర్షి దయచేసిరి. అతడొక యుత్కృష్టమైన జ్ఞానసంపద గల్గినవాడై యుండెను. మహర్షి విచ్చేసిన వార్తనెరిగినట్టి మహారాజు మహర్షికి యెదురేగి పాదాభివందన మాచరించి స్వాగత వచనములను పలికెను. ఋష్యులవారు తృప్తిని పొందిరి. రాజర్షి మహర్షితో సహా రాజసభలో ప్రవేశించెను. అష్టావక్రుని కాయమును గాంచిన సభికులెల్లరు గొల్లు గొల్లున నవ్వదొడంగిరి. రాజుగారు కలుగజేసికొనుటచేత పరిస్థితి చక్కబడెను. అందరు మౌనమును వరించిరి. నిశ్శబ్ద స్థితికి భంగము కల్గెడి విధిన ఋషులవారు పకపక నవ్వదొడంగిరి. రాజుగారతని వర్తనను గాంచి యవాక్కుడయ్యెను. వినయమును వీడనివాడై నియతితో నిట్టులడిగెను. "స్వామీ! తమరు నవ్వుటకు గల కారణమేమి? దయచేసి తెలియజేయుడి".

"ఓ రాజా! మహాజ్ఞానియైన జనక మహారాజు సభలోని వారెల్లరు జ్ఞానులని తలచితిని. కాని యిచ్చటి స్థితే తద్విరుద్ధముగా నున్నది. నీ సభలో గల వారెల్లరు చర్మకారులు కదా! అందుకే నాకు నవ్వు వచ్చినది" అని ఋషిగారు బదులు పలికిరి.

శ్రీజనక మహారాజు మహర్షినుండి యుపదేశమును పొంది ధన్యతను గాంచెననెడిది ప్రఖ్యాతిన గలదు. ఇచ్చట గ్రహించవలసిన విషయమేమనగా, రాజర్షి సభలోని వారు బ్రహ్మజ్ఞానులుండి యుండవచ్చును. కాని నిర్భావాగమ స్థితిన నున్నవారు లేకుండిరనెడిది సుస్పష్టమైన విషయము. నిర్భావాగమము యొక్క ప్రాప్తిని పొందిన జ్ఞానులందరి కంటెను నిర్భావాగమ స్థలియగు శివయోగి గొప్పవాడని గుర్తించగలరు.

ఈ స్థలమునందలి శివయోగి భావింపదగిన వస్తులెయ్యది? అనెడి నేపథ్యములో శ్రీ భగవత్పాదులవారి యీ యుపదేశము గమనార్హమైనదై యున్నది.

**శూన్యే చిదమ్బరే స్థానే దూరే వాఙ్మానసాధ్వనః ।**
**విలీనాత్మా మహాయోగీ కేన కిం వాఽపి భావయేత్ ॥** (సి.శి. 18-48)

ఉపదేశము యొక్క తాత్పర్యమేమనగా వర్ణాకారాదులు లేని శూన్యమైనదియును, చిదాకాశమున నుండునదియును, వాక్కునకును మరియు మనస్సు కందని సుదూర స్థానమును అయిన దానిలో లీనమైనట్టి యాత్మ గల్గిన శివయోగి యే ప్రకారముగా నే వస్తువును భావించవలెను? ఏ ప్రకారమైనను, ఏ వస్తువైనను భావనా యోగ్యము కాదని గ్రహించవలెను.

నిర్భావాగమ స్థలములో సాధన చేసెడి శివయోగికి సమదృష్టియుండునని శ్రీ రేణుకాచార్యులవారు, అగస్త్యునకుపదేశించిరి :

**అవిశుద్ధే విశుద్ధే వా స్థలే దీప్తిర్యథా రవేః ।**
**పతత్యేవం సదాఽద్వైతీ సర్వత్ర సమవృత్తిమాన్ ॥** (సి.శి. 18-49)

దీని తాత్పర్యమేమనగా, సూర్యుని ప్రకాశము శుద్ధాశుద్ధ ప్రదేశముల యందు నేవిధముగా ప్రసరించునో అదే విధముగా శివాద్వైతియైన శివయోగి సర్వత్ర సమదృష్టిని గలిగి సంచరించుచుండును.

నిర్భావాగమ స్థలములోని శివయోగి యెటుల చరించుననెడి విషయమున శ్రీరేణుకాచార్య గురువరేణ్యుల వారు మునిశార్దూలుడైన యగస్త్యునకీ విధిన నుపదేశించిరి :

**నబిభేతి జరామృత్యోర్న క్షుధాయా వశం వ్రజేత్ ।**
**పరిపూర్ణనిజానంద సమాస్వాదాన్ మహాసుఖీ ॥** (సి.శి. 18-50)

దీని తాత్పర్యమేమనగా ముదుసలి తనము గురించిగాని, చావు గూర్చి గాని భయపడక, ఆకలిదప్పులకు వశుడై ప్రవర్తించక, పరిపూర్ణమైన నిజానందము ననుభవించెడి యీ స్థలమునందలి శివయోగి మహాసుఖుడై సంచరించుచుండును.

ఆత్మతత్త్వము వాక్కుకును, మనస్సుకును చిక్కని విధిన నుండును. "యతో వాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహ" అనెడి శ్రుతి యిద్దానిని

సమర్థించుచున్నది. ఇంతటి యగోచరమైన స్థితిలో లీనమై యుండెడి శివయోగికి శుద్ధాశుద్ధముల చింతన యుండెడి యవకాశముండదనెడిది సత్యమే. ఈ కారణముననే యతడు సమతా భావ సమన్వితుడై సమవీక్షణాదులతో లోకములోని శుద్ధాశుద్ధులను పునీతులను చేయుచున్నాడు. సామాన్యముగా, పరిపూర్ణమైన జ్ఞానము గలవారు సమతాదృష్టి గల్గియుందురని చెప్పబడినది. సమతాదృష్టి లోపించియున్న యెడల నొక వ్యక్తి జ్ఞానియనిపించికొనజాలడు. ఈ విషయము తెలియజెప్పెడి యుదంతమొకటి కలదు.

కాశీక్షేత్రమునందున నివసించుచుండెడి సమయములోన శ్రీ శంకరాచార్యుడు నాత్మ జ్ఞానియై యుండెను. అయినా, అతనిలోన నిర్భావస్థితి సమకూరకుండెను. దీని నెరిగినట్టి కాశీపురాధి నాథుడైన శ్రీ విశ్వేశ్వరుడు, శంకరాచార్యునకు నిర్భావస్థితిని ప్రదానము చేయనెంచెను. చాండాల వేషధారియై యొక యిరుకైన సందులోన శంకరాచార్యునకు నెదురై వచ్చుచుండెను. శ్రీశంకరాచార్యుడేమో గంగలో మునిగి, మడి వస్త్రమును ధరించి, పవిత్రమైన జలమును కమండలమునందున నింపికొని కాశీ విశ్వనాథుని కభిషేకము చేయుటకై వెడలుచుండెను. తన కెదురుగా వచ్చెడి చాండాల వేషధారియైన విశ్వేశ్వరుని గాంచిన శంకరాచార్యుడు “జరుగు వెనక్కు జరుగు” అని అనెను. ఈ మాటలనతడు గట్టిగాను, గద్దించినట్లుగాను పలికెను. చాండాలుడు జంకలేదు. వెనుకకు తగ్గలేదు. అదే విధిన నిలిచి “దేనిని జరుపమంటివి? దేహమునా? ఆత్మనా? దేహమైతే నన్నమయమైనదే కదా! నీదియును అట్టిదే. దానిని జరుపుటలో ప్రయోజనమెక్కడిది. ఆత్మయైతే సర్వ వ్యాపితమైనది. ఆత్మను జరుపుట వలన ప్రయోజనముండదు” అని బదులు పలికెను. శంకరాచార్యునికి జ్ఞానోదయమయ్యెను. విశ్వేశ్వరుని పాదములపై బడి శరణు వేడెను. విశ్వేశ్వరుడాతనిని యనుగ్రహించిన వాడయ్యెను. అప్పటినుండి యతడు శుద్ధాశుద్ధాది భేదభావములను విడిచి సంచరించెను. కాలకాలుని స్వరూపియైన పిదప శివయోగికి మరణ భయముండునే? అదేవిధిన నతడు ఆకలిదప్పుల కతీతుడై నిలుచునని తెలిసికొనగలరు.

మీరెల్లరు నట్టి శివయోగి కారణ్యమునకు పాత్రులై ధన్యతను పొందుదురుగాక!

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్య మహాస్వాములవారు నిర్దేహాగమ స్థలము గురించి యెంతో వివరముగా తెలియజెప్పిరి.

నిర్భావమనెడి పదము భావహీనతను సూచించుచున్నది. అయితే శ్రీ భగవత్‌పాదుల వారీ పదమునకు నొక విశిష్టమైనట్టి అర్థమును ప్రదానము జేసిరి. ఏకీభూత భావములను సూచించుటకై నిర్భావాగమ పదమునుపయోగించిరి. ఇట్టి యేకీభూత ప్రక్రియ కవరోధముగా నుండెడి యంశములను భావ వికారములని గుర్తించిరి. నిర్భావాగమమునకు నకారాత్మకార్థమును తెలుపుచు “భావో వికార నిర్ముక్తో నిర్భావాగమ ఉచ్యతే” యని యుపదేశించిరి.

భావవికారములు భేదభావము వలననే జనించును. శ్రీవారు నుదహరించిన శంకరాచార్య-చండాల సంవాదములో నద్వైత మత స్థాపకులుగా గుర్తింపబడిన శంకరాచార్యులు ద్వైత భావమును మనమున దాల్చి వర్ణవివక్షతను చూపిరి. ఇట్టి చర్యకు భావ వికారమే కారణభూతమైన యంశమని తెలిసికొనగలరు. భక్తిశ్రద్ధ నైష్ఠికత సావధానానుభవ సంజనితానుభావయుతుడైన అంగప్రాణలింగస్థలి యిట్టి భావ వికారములకు లోనయ్యెడి యవకాశములు మృగ్యమని తెలియుచున్నది. ఏదెట్లులుండినను సాధకుడు జాగరూకుడై భావ వికారములకు లోనుకాకుండా ఉండవలెననెడిది గ్రహించవలసిన విషయము. అట్టి ప్రవర్తన యొక్క సాకార దర్శనమును సాధకున కొసంగెడి క్రింది వచనమును గనుడి:

**ఆకళ కళ్ళరు కొండొయ్దరెన్నదిరిం భోనిమ్మధర్మ**
**బొబ్బెదదిరిం భో, నిమ్మ ధర్మ**
**ఆరడదిరింభో, నిమ్మ ధర్మ!**
**అల్లి ఉంబడె సంగ, ఇల్లి ఉంబడె సంగ!**
**కూడల సంగమ దేవ, ఏకోభావ!** (శ్రీ బసవేశ్వర వచ.సం. 829)

ఈ వచనపు తెలుగు రూపమును గనుడి :

**ఆవులను దొంగలు గొని తోలికొనిపోయి**
**రనకుండుడో, మీ ధర్మము!**
**బొబ్బిడక నుండుడో, మీ ధర్మము!**
**ఆరడించకుండుడో, మీ ధర్మము!**
**అచట తినినా సంగడే!**
**ఇచట తినినా సంగడే!**
**కూడల సంగమ దేవుడు, ఏకోభావి!**

నిర్భావాగమము యొక్క నైజ ప్రకృతిని శ్రీ బసవేశ్వరులవారి యనుభవములోన గాంచవచ్చును. బసవేశ్వరులవారి యనుభవ భక్తిలో నిర్భావాగమస్థితికి నద్దము పట్టెడి క్రింది రగడను గమనించుడి :

**లింగ చిహ్నేలు మోచి**
**దొంగలుండగ జూచి**
**కొంగులను బొదిగొన్న**
**వంగకాయలు మున్న**
**లింగములుగా దెల్పు**
**జంగమేచ్ఛలు సల్పు**
**భవరోగ హరునకై**
**శివరూప ధరునకై**
**(అతులిత పుణ్యుడైన బసవయ్యకునై ప్రణమిల్లు చిత్తమా!**

(తెలుగు బసవోదాహరణము, చతుర్థీ విభక్తి, ఉత్కళిక)

"అహం బ్రహ్మోఽస్మి"లోని ద్వంద్వ భావమును గాంచి, "అహం"ను ద్రుంచి, పరమాత్ముడై వెలుగొందెడి నిర్భావాగమ స్థలికి ఆకలిదప్పుల చింతన, చావు బ్రతుకుల యారాటముండదని నిశ్చయపూర్వకముగా చెప్పవచ్చునని లింగాద్వైతుల నిశ్చితాభిప్రాయమని శివాద్వైతులు నుడివిరి.

"శుభం భూయాత్"

## ఆశీర్వచనము - 1 :

## నష్టాగమ స్థలము :

లింగస్థలములలోనిదైన ప్రాణలింగ స్థలమునకు చెందిన నిర్భావాగమ స్థలములోని శివయోగి మహాసుఖియై యుండునని యిదటి ఆశీర్వచనమున తెలియజేయబడినది. అట్టి శివయోగి త్రిపుటరహితమైన జ్ఞానమును పొందిన స్థితిలో నిష్టాగమ స్థలమును ప్రవేశించును. ఈ స్థలమును గురించి శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారీ విధిన నుపదేశించిరి :

**భేదశూన్యే మహాబోధే జ్ఞాత్రాదిత్రయహీనకః ।**
**జ్ఞానస్య నష్టభావేన నష్టాగమ ఇహోచ్యతే ॥** (సి.శి. 18-51)

దీని తాత్పర్యమేమనగా, భేదశూన్యమై యుండెడిదియును, మహోత్కృష్టమైనదియును, జ్ఞాతృజ్ఞేయాదులతో విభజీకృతము కానిదియును, అయిన జ్ఞానము నొందిన శివయోగి నష్టాగమ స్థలమున నుండెడి వాడగుచున్నాడు.

శివయోగికి త్రిపుటీమయ ప్రపంచ శూన్యత్వమేవిధముగా సంప్రాప్తమగుననెడి దానిని శ్రీ భగవత్పాదులవారీ క్రింది విధముగా వివరించిరి:

**అద్వైతవాసనావిష్ట చేతసాం పరయోగినాం ।**
**పశ్యతామన్తరాత్మానం జ్ఞాతృత్వం కథమన్యథా ॥** (సి.శి. 18-52)

ఉపదేశము యొక్క తాత్పర్యమేమనగా, అద్వైత వాసనా విశిష్టమైన చిత్తము గలవాడైన శివయోగికి నన్యమైనట్టి జ్ఞాతృత్వముండదు.

నష్టాగమ స్థలములోని శివయోగి కెయ్యది ప్రకాశమానమగునో అనెడి దానిని శ్రీ భగవత్పాదులవారీ క్రింది విధముగా తెలిపిరి :

**అకర్తాఽహ మవేత్తాఽహమదేహోఽహం నిరఞ్జనః ।**
**ఇతి చిన్తయతః సాక్షాత్ సంవిదేవ ప్రకాశతే ॥**
(సి.శి. 18-53)

ఉపదేశము యొక్క భావార్థమేమనగా, నేను కర్తనుగాను, నేనెరిగినవాడను గాను, నేను దేహినిగాను, నేను నిరంజనుని అని చింతన చేసెడి శివయోగికి సంవిత్తు యొక్క ప్రకాశమే గల్గుచున్నది.

ప్రారంభికావస్థయందున లౌకిక జ్ఞానమైనను కాని, యలౌకిక జ్ఞానమైనను కాని దానిలో ద్రిపుటముల వ్యవహారముండును. జ్ఞాతృ, జ్ఞాన మరియు జ్ఞేయములనే త్రిపుటములని యందురు. వీటినే ప్రమాతృ, ప్రమాణ మరియు ప్రమేయములనియును పిలుతురు. జ్ఞాతృ అనగా తెలిసికొనెడి వ్యక్తి. జ్ఞేయమనగా నా వ్యక్తి దేని గురించి తెలిసికొనగోరునో అయ్యదిజ్ఞానము తెలివిడిని సూచించును.

"నేను సిద్ధాంత శిఖామణి గురించి తెలిసికొనగోరుచున్నాను" అనెడి వాక్యము నేను "జ్ఞాతృవగును.సిద్ధాంత శిఖామణి జ్ఞేయము కాగా అందులోని విషయ సంచయము జ్ఞానమగును. ప్రతియొక్క జ్ఞానములో నిట్టి విభజన గాంచగలము. అయితే, నష్టాగమస్థలికుండెడి మహాబోధలోన యిట్టి విభజన యుండదు. బోధయఖండముగా నుండునని గ్రహించగలరు.

జాగ్రదావస్థ యందున త్రిపుట వ్యవహారమును చేసిన వ్యక్తి విసిగిపోయి సుషుప్తావస్థను పొందినప్పుడు త్రిపుట వ్యవహారమాస్థితిలో నుండజాలక నిలిచిపోవును! ఈ స్థితిలో నాత్మయు నానందస్థితిలోన నుండును. జ్ఞానముండియున్నను, నయ్యద విచ్ఛిన్నముగా నుండును. లేచిన పిదప నీ స్థితి నిలిచియుండదు. ఇట్టి వ్యక్తి "సుఖేన సుప్తోహంన కించిదవేదిషం" అనెడి భావనలో నుండును. "నేను సుఖముగా నిదురించితిని. నాకేమియును తెలియ"దనెడిదే యీ భావములోని యర్థము. అంతఃకరణ వృత్తి విలయమైపోవుటచేత నిట్టి భావము గల్గుచున్నదని గ్రహించగలరు. ఈ వ్యక్తి యనుభవము నెరుగుట కష్టమైనదగును. సుషుప్తిలోనున్న వాడేమియును చెప్పలేడు. మెలకువ అయిన పిదప కొంత మేరకు మాత్రమే చెప్పగలడు.

వ్యవహారమునందున త్రిపుటి జ్ఞానమెట్టులగుననెడి దానిని తెలిసికొనుట యావశ్యకమైయున్నది. అందుచేత, నద్దాని గురించి కొంతమేరకు చర్చింతుముగాక. ఒక వ్యక్తి "అహం ఘటం పశ్యామి" యని అనిన యెడల, ఈ వాక్యములో నేను లేదా అహం అనేడి జ్ఞాతృవుగా గుర్తింపబడును. నేను కుండను చూచుచున్నాననెడిది వాక్యము యొక్క భావార్థమని గ్రహించగలరు. కుండ తెలిసికొనదగినదైనందున యిద్దానిని జ్ఞేయమని అందురు. ఇక మనస్సు యొక్క వృత్తి కళ్ళద్వారా బహిర్గతమై ఘటాకారమును దాల్చినప్పుడు నయ్యది జ్ఞానమనబడును. ఇచ్చట త్రిపుటముల మూలకముగా నొక జ్ఞానము యొక్క ప్రాదుర్భావమగునప్పుడు మూడు చైతన్యముల యభేద ముత్పన్నమగును. ప్రమాతృచేతన, ప్రమాణ చేతన మరియు ప్రమేయ చేతనలే చేతనత్రయమని తెలిసికొనవలెను.

జీవునికి నధిష్ఠానమైన చైతన్యమును ప్రమాతృ చైతన్యమని యందురు. మనోవృత్తికి నధిష్ఠానమైన దానిని ప్రమాణచైతన్యమని యందురు. విషయమునకు నధిష్ఠానమైన చైతన్యమును ప్రమేయ చైతన్యమని యందురు. ప్రమాతృ చైతన్యము ప్రమాణ చైతన్యము ముఖాంతరముగా ప్రమేయ చైతన్యము యొక్క ఆకారము నెప్పుడు తాల్చునో అప్పుడొక విషయము యొక్క సరియైన తెలివిడి యగుచున్నది. జీవునికి మరియు విషయమునకు మధ్య యేర్పడెడి సంబంధమునకు మనో వృత్తి కారణభూతమైన యంశమగుచున్నది. ఇద్దాని యనుపస్థితిలో జీవునికి విషయ పరిజ్ఞానము కలుగదు. బావిలోని నీరు కాలువ ద్వారా పారి తోటలోని చెట్లకు కట్టిన మడులకు చేరి యొక ఆకారమునుదాల్చుటను గాంచగలము. మనస్సు నింద్రియముఖాంతరముగా పారి విషయ స్వరూపమును దాల్చుటయు నీ విధిననే సిద్ధించునని గుర్తించగలరు.

మన యింద్రియములలోని నేత్రము మరియు శ్రోత్రము మనోవృత్తిని బహిర్గతము చేసి వెలుపలికి ప్రవరహింపజేసెడి సాధనములై యున్నవి. మనస్సు వీటివలన రూపము మరియు శబ్దములకు చెందిన జ్ఞానమును పొందుచున్నది. ఇతర యింద్రియములైన ఘ్రాణరసన చర్మముల మూలకముగా మనస్సు వెలుపలికి వెడలుటలేదు. ఆయా విషయములు నీ యింద్రియములకు తాకినప్పుడు, వాటికి సంబంధించిన జ్ఞానము మనస్సుకు కలుగుచున్నది. మిఠాయి కొట్టులోని మిఠాయిని కొనుక్కుని నాలుకకు స్పృశింపజేసినగా, దాని రుచి గురించిన జ్ఞానము మనస్సు యొక్క అనుభవములోనికి రాదు.

మనస్సు, ఆత్మజ్ఞానమును పొందగోరినచో మనోవృత్తికి బహిర్ముఖమై బయటికి వెడలెడి పనియుండదు. అంతర్ముఖియై "అహం బ్రహ్మాస్మి" అనెడి భావమువైపు పయనించును. ప్రమాతృ, ప్రమేయముల యభేదముండుట చేత, ప్రమాణము కూడా దాని రూపమేయై యుండును. ఈ విధముగా త్రిపుటముల యాభావస్థితి ఏర్పడును. నష్టాగమ స్థలములోని శివయోగికి త్రిపుటములుగా విభజితమై యుండనిట్టి యఖండమైన జ్ఞానము సంప్రాప్తమగును. ఈ స్థితిలోనున్న యితనికి నకర్తృత్వ భావన లుదయించి తనదేయగునొక స్థితిలోన నుండును. అప్పుడతనిలో నఖండితమే సంవిత్తు మాత్రమే మిగిలియుండును. సంవిత్తనగా నఖండమైన జ్ఞానమని తెలిసికొనుడు.

నిర్దేహ స్థలములో నుండెడి శివయోగి కెరుగవలసినదేమియు నుండదని శ్రీ భగవత్పాదులవారనతినిచ్చిరి. కనుడి:

**నిరస్తభేదజల్పస్య నిరీహస్య ప్రశామ్యతః ।**
**స్వే మహిమ్ని విలీనస్య కిమన్యత్జ్ఞేయముచ్యతే ॥** (సి.శి. 18-54)

దీని యొక్క భావమేమనగా, నిరాకృతమైన ద్వైతవాక్యము గలవాడును, ప్రశాంతములై యున్న రాగద్వేషములు గలవాడును స్వవిమర్శలో లీనమైన వాడును, విరక్తుడైన వాడునైన శివయోగి కెరుగవలసిన దేముండును? ఉండదు అని అర్థము.

ఈ విషయమును మరింత స్పష్టముగా తెలుపుటకై శ్రీ భగవత్పాదులవారీ క్రింది యుపదేశమును చేసిరి :

**ఏకీభూతే నిజాకారే సంవిదా నిష్ప్రపఞ్చయా ।**
**కేన కిం వేదనీయం తద్వేత్తా కః పరిభాష్యతే ॥** (సి.శి. 18-55)

ఉపదేశము యొక్క భావమేమనగా, సంవిత్తుచేతను, నిష్ప్రపంచత్వము చేతను నిజమైన పరమాత్మ రూపమే తన ఆత్మలో లీనమై దానితో సమరసమున నున్నవానికి వేరే జ్ఞాన మేదియును తెలిసికొనదగినది కాదు.

నష్టాగమస్థలములోన తమ యుపదేశము పరిసమాపనము చేయుచు, శ్రీభగవత్పాదుల వారీ క్రింది యుపదేశము నిచ్చిరి :

**మహాసత్తా మహాసంవిద్ విశ్వరూపా ప్రకాశతే ।**
**తద్వినా నాస్తి వస్త్వేకం భేదబుద్ధిం విముంచతః ॥** (సి.శి. 18-56)

ఉపదేశము యొక్క తాత్పర్యమేమనగా, మహాసత్తుగాను, మహాసంచిత్తుగాను, విశ్వరూపముగాను ప్రకాశించెడి బ్రహ్మమును మినహాయించినచో నష్టాగమ స్థలములోని శివయోగికి కన్పట్టెడి వస్తువేదియును నుండదు. అతడు బ్రహ్మమును మాత్రమే యనుభవములోనికి తెచ్చికొనుననెడిది భావము. తానే ఆ బ్రహ్మమని భావించికొనును.

ఈ జగత్తు నందున నజ్ఞులకు పంచ విధములగు భేదములు సదా దోచును. జీవ-యీశ్వరుల భేదము, జీవ-జడముల భేదము, జడ-జడముల భేదము, జడ-యీశ్వరుల భేదము, జడ-జీవుల భేదములే పంచవిధములైన భేదములు. శివజ్ఞాన ప్రాప్తిని పొందిన వానికి భేదములు కన్పట్టవు. సర్వమూ శివుడే అనెడి భావపరిపుష్టిని పొందిన నష్టాగమ స్థలియగు శివయోగి "విజుగీషు" రూపమైన జల్పకథ యందున నాసక్తి గలవాడైన వానివలె యుండడు. కథయనగా వాగ్ వ్యవహారమని గుర్తించగలరు. ఇట్టి వ్యవహారములు మూడు విధములుగా నుండుననియును, జల్పకథ వాటిలో నొకటి యనియును, వాదకథ, వితండ కథలనెడివి మిగిలినవనియును గుర్తించగలరు. తత్త్వ జిజ్ఞాస కొరకు చేయబడెడి చర్చాత్మక వ్యవహారమును వాదకథ యని యందురు. ఎదుటి వాని నోడించి తాను గెలుచుటకై చేసెడి వాగ్ వ్యవహారమును జల్పకథయని

అందురు. తన మతము గురించి యెదుటివాని నొప్పింపజాలక, పిడివాదము చేత పరపక్షమును ఖండించుటకు చేసెడిది వితండవాదమనబడును. భేదబుద్ధి గలవానికే జల్పకథాదులు నుపయుక్తముగా నుండునని గుర్తింపబడినది.

భేద, జల్పనములనుండి ముక్తిని పొందిన నష్టాగమస్థలికి రాగ-ద్వేషములుండవు. అందుచేత నతడు ప్రశాంత మూర్తియై రాజిల్లును. ఈ విధముగా నుండెడి శివయోగి యెల్లప్పుడు తన మహిమలో తాను లీనమైయుండును. ఏతత్ కారణమువలన నతనికి జ్ఞేయాదుల ప్రసక్తి యుండదని గ్రహించగలరు. అఖండమైన బ్రహ్మ స్వరూపముగా రూపొందిన నష్టాగమ స్థలములోని శివయోగి మనస్సుశివమయమై యుండుటచేత నతనికి వేరే వస్తువేదియును దోచదు. ఈ విధముగా నితడు సకల విధములగు భేదములకును దూరమై యుండెడి శివయోగి శివపరబ్రహ్మ స్వరూపమని యెంచవలెను. అతనికి మాన్యతనిచ్చి మనసారా సేవించి ధన్యతను పొందుదురు గావుత!

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు శ్రీ చంద్రశేఖర శివాచార్యులవారు జ్ఞానాగమమునకు కీలకమని యెంచబడిన త్రిపుటముల నష్టమే నష్టాగమని వివరించి చెప్పిరి.

ఆగమమనగా వచ్చుట యని చెప్పబడుచున్నది. సంపాదన యనెడి అర్థములోను నీ పదము ప్రయోగింపబడుచున్నది. నష్టాగమమనగా నష్టమును పొందుట యని గ్రహించవచ్చును. ఈ అర్థము యొక్క నేపథ్యములోన శ్రీ బసవేశ్వరుల వారి యీ క్రింది వచనము గమనార్హమైనది.

**జ్ఞానద గమనద సహజద ఉదయదల్లి ఏనెందరియెను**
**లింగద బెళకు బళకొండుదాగి**
**ఏనెందరియెను**
**కూడల సంగమ దేవన ధ్యాన దింద నానెందరియెను** (వచ.సంఖ్య 850)

ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి :

జ్ఞానగమన సహజోదయమందున నేమియునెరుగను
లింగపు వెలుగు లోగొనునప్పుడు నేమియు నెరుగను
కూడల సంగమ దేవుని ధ్యానము వలన నేనేమియు నెరుగను

జ్ఞానము యొక్క పోక సందర్భమునందున చెప్పబడిన యీ వచనము నష్టాగమ భావనను తెలుపుచున్నదని గ్రహించవచ్చును.

నిర్భావాగమ స్థలి ద్వంద్వమును వీడి యేకీభూతమైన భావనను పొంది సచ్చిదానంద నిర్గుణ నిరంజన నిజస్థితిలో నుండియున్నప్పుడు శివ-జీవ భేదభావము యొక్క అస్తిత్వము నష్టమగును. నదీ సముద్ర న్యాయమున జీవునియొక్క చైతన్యము శివుని యొక్క చైతన్యములోన లీనమైపోవును. తత్ఫలితముగా సాధకుడెరుగవలసిన దేదియును మిగిలియుండదు. సముద్రములో కలిసిన పిదప నది తన అస్తిత్వమును కోల్పోవును. అస్తిత్వముతో బాటుగా తాను గడించిన సర్వస్వమును కోల్పోవును. జీవుని స్థితియును నిట్టిదే. తానే శివుడై యుండెడి స్థితిలో జ్ఞాతృ జ్ఞేయ జ్ఞానములు నష్టమగుననెడిదే గ్రహించవలసిన విషయము.

సాధకుడు నిర్దేహాగమ, నిర్భావాగమ స్థితులలో గడించిన యనుభవము ఫలము రూపమున నష్టాగమ స్థలములోన ననుభవము లభించునని తెలిసికొనవలెను. నష్టాగమ స్థలము యొక్క కీలకాంశము గల్గినట్టి క్రింది పద్యము గమనించదగినదై యున్నది.

**తే.గీ. ఎరుక యెరుగువా దెరున దెరుగు విధము**
**లుండి యున్నను గల్గును లోకమందు**

**నెందు నీమూడు నష్టమై నెలవు వీడు**
**నదియె నష్టాగమ స్థలంబౌను వినుడు** (మార్గం పెద్దవీరప్ప, అముద్రితము)

లోకమున శివ–జీవాభేద జ్ఞానమే సర్వోత్కృష్టమైన జ్ఞానము. అది యెరిగిన వారికి యెరుగవలసిన దేదియును నుండదు. శివత్వము నెరుగి శివత్వముతో సమరసభావమును పెంపొందించుకొనుటకై ప్రయత్నించెడి ప్రాణలింగస్థలికి శివత్వము ననుభవించుటే పరమావధియై యుండును. అనుభవమును గరిష్ఠీకరణ చేసెడి సత్ క్రియలో నంతరంగమును నిమగ్నము చేసెడి యిట్టివానికి వేరు వేరు చింతనలు రావని గ్రహించగలరు.

"శుభం భూయాత్"

## ఆశీర్వచనము - 1 :

## ఆది ప్రసాది స్థలము :

నష్టాగమ స్థలానంతరము వచ్చెడి లింగ ప్రాణలింగాంతర్గతమే స్థలమే ఆది ప్రసాది స్థలము. ఈ ప్రసాద సంబంధితమైన స్థలమును గురించి శ్రీరేణుకాచార్య భగవత్పాదులవారీ విధముగా నానతి నిచ్చిరి :

**సర్వాధిష్ఠాతృకః శంభురాదిస్తస్య ప్రసాదతః ।**
**ఆది ప్రసాదీత్యుక్తోఽయం నిర్వికారపదే స్థితః ॥** (సి.శి. 18–57)

దీని తాత్పర్యమేమనగా, సర్వము నధిష్ఠించి యున్నవాడును, శంభువుగా నుతింపబడెడి శివుడే ఆద్యుడు. అట్టి ఆద్యుని ప్రసాదము వలన నిర్వికారమైన స్థితిలో ప్రతిష్ఠితుడై యున్న నష్టాగమస్థలి, ఆది ప్రసాదిగా గుర్తింపును పొందును.

ఈ స్థలమునందలి శివయోగి యొక్క మహత్తును శ్రీ భగవత్పాదులవారీ విధిన ప్రతిపాదించిరి :

**అనేక జన్మశుద్ధస్య నిరహఙ్కారభావినః ।**
**అప్రపంచ స్వాదిదేవః ప్రసీదతి విముక్తయే ॥** (సి.శి. 18–58)

దీని తాత్పర్యమేమనగా, ననేక జన్మలలో శుద్ధిని బడసిన వాడును, నిరహంకారుడై యున్నవాడును, ప్రపంచము నుండి దూరముగా వెడలిన వాడును, అయిన నష్టాగమ స్థలమునందలి శివయోగికి ముక్తినిచ్చుటకై మహాదేవుడు ప్రసన్నుడగును.

ఈ జగత్తునకాది పురుషుడు శివుడేయని తెలిసికొనగలరు. అతడే సర్వమునకు మూలమై యున్నాడు. ఈ విషయమును వివరించెడి శ్రుతి ప్రమాణమిది:

**యో బ్రహ్మాణం విదధాతి పూర్వం**
**యోవై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై।**
**తం మహాదేవ మాత్మ బుద్ధి ప్రకాశం**
**ముముక్షుర్వై శరణ మహిం ప్రపద్యే ॥** (శ్వేతాశ్వంతర శ్రుతి 6/18)

శ్రుతి వాక్కుల తాత్పర్యమేమనగా, సృష్టి యొక్క ఆరంభదశలోన శివుడే హిరణ్య గర్భుడైన బ్రహ్మను సృష్టించెను. అతనికి వేదముల జ్ఞానమును ప్రదానము చేసెను. జీవులన్నింటికిని గల బుద్ధిని ప్రకాశమానము చేసెడి దేవతలకే దేవుడైన మహాదేవునికి ముములైన నేను శరణాగతుడనగుచున్నాను.

ఉపనిషత్తు యొక్క యీ ప్రతిపాదన చేత తెలిసెడిదేమనగా సృష్టికర్తయని భావింపబడెడి బ్రహ్మను కూడ సృష్టించినది శివుడే. శివుని వలననే బ్రహ్మ వేద పరిజ్ఞానమును పొందెను. ఇట్టి శివుడు జగము చేత నాది దేవుడని పిలువబడుచున్నాడు. ముముక్షువుకీ యాది దేవుని కరుణ యెంతో

వరకు కావలెను. శివానుగ్రహమును పొందుటకు పెద్ద ప్రయత్నమును చేపట్టెడి యవశ్యకత యుండదు. అనన్య భావముతో శరణాగతుడైన వానికి శివకారుణ్యము సులభముగా లభించునని యెరుంగగలరు. శరణు వేడెడి భక్తునికి నంతఃకరణ శుద్ధి, నిరహంకార భావన, మరియు ద్వైత భావరాహిత్యముండవలెనని శ్రీ భగవత్పాదులవారు ప్రతిపాదించిరి. అత్యంత పరిశుద్ధుడై వెలిగెడి పరమాత్మ, పరిశుద్ధతలేని వానికి శివానుగ్రహము సిద్ధించదని గ్రహించగలరు.

జీవుల శుద్ధాశుద్ధతకు వారిలోని అంతఃకరణమే మూలమైనదై యుండును. అంతఃకరణము శుద్ధిగా నుండిన యెడల జీవుడును శుద్ధుడనిపించికొనును. అంతఃకరణ శుద్ధిని సాధించదలచినవాడు పుణ్యప్రదమైన శుభకార్యములను నిష్కామబుద్ధితో జేయవలెను. అయితే, స్వార్థబుద్ధి గల్గియున్నచో నయ్యది యీర్ష్యా ద్వేషములకు దారితీయును. తద్వారా నంతఃకరణ మశుద్ధమై మలిన నీచమైనదగును. ఈ కారణముననే వేదాంత వాదులు "కర్మణ్యేవాధికారః" అనియును, "ఫలేషు న కదాచన" అనియును తెలుపుదురు. కర్మలు చేయుటలోన నాసక్తిని, కర్మఫలాపేక్షలో నిరాసక్తిని ప్రదర్శించెడి వాడే విశుద్ధమైనట్టి అంతఃకరణము గలవాడగును. ఇట్టివానికి యహంకారము గాని, ప్రాపంచిక బుద్ధిగాని గలుగదు. నష్టాగమ స్థలములోని శివయోగి యీ లక్షణములను పెంపొందించికొని, శివానుగ్రహమును బడసి, ఆది ప్రసాది యగునని గ్రహించవలెను.

ఆది ప్రసాదస్థలములోని శివయోగికీ ప్రపంచములోని జగజ్జాలము దృశ్యాదృశ్యముగా గోచరించునని శ్రీ భగవత్పాదులవారు తెలిపిరి. ఉపదేశమును గనుడి :

**శివప్రసాద సంపత్త్యా శివభావముపేయుషి ।**
**శివాదన్య జగజ్జాలం దృశ్యతే న చ దృశ్యతే ॥** (సి.శి. 18-59)

దీని భావమేమనగా శివప్రసాదము వలన శివభావమును పొందెడి శివయోగికీ ప్రపంచములోని జగజ్జాలము కనిపించనువచ్చును, కనిపించకుండగ నుండవచ్చును.

**శంభో శివ ప్రసాదేన సంసారచ్ఛేద కారిణా ।**
**మోహగ్రన్థిం వినిర్భిద్య ముక్తిం యాన్తి వివేకినః ॥** (సి.శి. 18-60)

దీని తాత్పర్యమేమనగా నిత్యానిత్య వివేక సహితుడైన ఆది ప్రసాదియొక్క మోహగ్రంథి శివప్రసాదము చేత ఛేదింపబడును. తత్ఫలితముగా ముక్తిని పొందును.

ముక్తిని పొందుట కొరకు శివప్రసాదము బొందుట యవశ్యకమైనదై యున్నదని తెలిపెడిదైనట్టి యుపదేశమును కనుడి :

**వినా ప్రసాదమీశస్య సంసారో న నివర్తతే ।**
**వినా సూర్యోదయం లోకే కుతః స్యాత్ తమసో లయః ॥** (సి.శి. 18-61)

దీని తాత్పర్యమేమనగా సూర్యోదయము కాకుండ నంధకారమే విధముగా దూరముకాదో, అదే విధముగా శివప్రసాదము ప్రాప్తించని యెడల ముక్తి లభించదు.

శ్రీరేణుకాచార్య భగవత్పాదులవారు శివ ప్రసాద మహిమ వర్ణించుచు నద్దానిని సంపత్తియని అనిరి. ఈ సంపత్తి భౌతిక సంపత్తి కంటెను విలక్షణమై యున్నది. ఇది శాశ్వతమైనది. జీవాత్మ నియ్యది సంసారము వలన విముక్తుని చేయును.

జీవుని మోహగ్రంథియే యతనిని కట్టివేసి సంసారములో పడవేయును. మోహగ్రంథిని హృదయ గ్రంథియనియు పిలుతురు. మోహగ్రంథియనగా, నేను నాది యనెడి భావనయే. అనాది కాలమునుండి కొనసాగుచు వచ్చెడిదియును, విడిచి వేయుటకు సాధ్యము కానిదియును, అయి యున్నది. శివప్రసాదము చేత దీనిని ఛేదించవచ్చును. శివానుగ్రహము గల్గిన వెంటనే జీవునికి 'శివోహం' అనెడి భావన గల్గునుతత్ క్షణమే మోహగ్రంథినుండి జీవునికి విముక్తి లభించుచున్నది. సూర్యకాంతి మరియు నంధకారముల మధ్యనే విధముగా నివర్తక-నివర్త్య సంబంధముండునో అట్టి సంబంధమే శివప్రసాదము మరియు మోహ గ్రంథుల మధ్య నుండునని గుర్తించగలరు. శివప్రసాదము వలన ముక్తి గల్గునని తెలిసికొనవలయుననెడిదే యెరుగ వలసిన విషయము.

స్వప్రయత్నము ద్వారా ముక్తిని పొందెదననియును, శివకారుణ్యము యొక్క అవశ్యకత లేదనియును భావించిన యెడల, అట్టి భావము నిరర్థకమైనదగును. ఈ విషయము లోన శ్వేతాశ్వతరోపనిషత్తు నందలో యీ క్రింది వాక్కులు గమనార్హములైనవై యున్నవి.

**యదా చర్మవదాకాశం వేష్టయిష్యన్తిమానవాః ।**
**తదా శివమవిజ్ఞాయ దుఃఖస్యాంతో భవిష్యతి ॥**

దీని తాత్పర్యమేమనగా నెట్లైతే చర్మము మానవ కాయమును కప్పిన యటుల, నాకాశమును నేదో వొక దానితో కప్పివేయుట యనెడి దసాధ్యమైన విషయము. అటులనే, శివకరుణను పొందనిచో, ముక్తిని పొందుట దుస్సాధ్యము.

ఆది ప్రసాది స్థలము గుర్తించిన తమరి యుపదేశమునకు ముగింపుగా శ్రీరేణుకాచార్య భగవత్పాదులవారీ యుపదేశము నిచ్చిరి :

**సర్వానుగ్రాహకః శంభుః కేవలం కృపయా ప్రభుః ।**
**మోచయేత్స కలాన్ జంతూని న కించిదిహ కారణమ్ ॥** (సి.శి. 18-18-62)

దీని తాత్పర్యమేమనగా అందరినీ అనుగ్రహించెడివాడును, శంభువనెడి నామధేయము గల్గినవాడును, అయిన శివుడు తన కృపచేత సకల జీవులను ముక్తులను చేయవలెనే కాని, యిట్టి దానికి జీవుడు కారణము కాజాలడు.

లోకమునందున నేదో వొక విధి విధానమును చేయునప్పుడు నియమావళిని రూపొందింతురు. నియమములు రెండు రకములుగా నుండును. అవి : సామాన్య నియమములు మరియు విశేష నియమములు. మానవులు మరియు నితర జీవులు తమ తమ కర్మ ఫలముల ననుభవించుటకొరకు చేయబడిన నియమములను సామాన్య నియమములను సామాన్య నియమములని యనవచ్చును. అపరాధము చేసిన వానిని నిర్బంధించి న్యాయస్థానములోన విచారణ జరిపించిన పిదప శిక్షను విధించి దానిని యమలు చేయుట మొదలగు వాటిని నిర్దేశించెడి నియమాలను సాధారణ నియమములనవచ్చును. సామాన్యమైన నియమావళి ననుసరించిన న్యాయాధీశుడు మరణశిక్షను విధించుటను గాంచుచున్నాము. ఈ శిక్షను తగ్గించుటకు లేదా మార్చుటకు లేదా శిక్షనుండి మినహాయించుటకు వలయు విధి విధానమును నిర్దేశించెడి నియమాలను విశేష నియమములని యనవచ్చును. రాష్ట్రపతి కీ అధికారమివ్వబడినది.

భగవంతుడైన శివుడు నెట్టి దోషులైనను క్షమించి వారికి ముక్తిని కటాక్షించెడి స్థితిలో నుండునని గ్రహించవలెను. ఇట్టి విశేషాధికారము గల శివ పరమాత్మ వలన కరుణను పొందినవాడు ముక్తిని పొందునని చెప్పబడినది. ఆది ప్రసాది కిట్టి కైవల్యము సిద్ధించునని తెలిసికొనగలరు. భక్తులెల్లరు శివకరుణకు పాత్రులగుటకై కృషిని చేయుదురుగాక

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యులవారు ఆది ప్రసాది గురించి తెలుపుచు ఆది ఆరూఢుడైన శివుని వలన ప్రసాదమును గొనెడివాడే ఆది ప్రసాదియని తెలియజెప్పిరి.

ప్రసాద గ్రహణమనెడి భావన అంగ స్థలములలోని యనివార్యమైన యంశమనెడిది నిర్వివాదమైన యంశము. అయితే, లింగ ప్రాణలింగి స్థలమున ప్రసాద గ్రహణ కెట్టి స్థానము గలదనెడిదే తెలిసికొనవలసిన విషయము. ఈ విషయమును నవగాహన చేసికొనుట కొరకు శ్రీ బసవేశ్వరులవారి క్రింది వచనము కొంతమేర కుపకరించగలదని చెప్పవచ్చును.

**లోహ పరుషవ ముట్టువల్లదె, పరుషపరుషవముట్టువుదె అయ్యా**
**అంగ విడదంగె ప్రసాదవల్లదె**
**అంగ విడదంగె ప్రసాద వెల్లియదో?**
**"అణోరణీయాన్ మహతోమహీయాన్"**
**హిరిదింగె హిరిదు కిరిదింగె కిరిదు**
**వాఙ్మనక్కగోచర సంగమ దేవా!**
**స్వరూప ప్రసాద నిరూపు లింగైక్య** (వచ.సంఖ్య 838)

దీని తెలుగు రూపమును గనుడి :

**లోహము పరుషమును ముట్టుటయే కాని**
**పరుషము పరుషమును ముట్టుటే అయ్యా!**
**అంగము పట్టిన వానికి ప్రసాదము కాని**
**లింగము పట్టినవాని ప్రసాదమెక్కడిదో**
**అణోరణీయాన్ మహతో మహీయాన్!**
**పెద్దదానికి పెద్దది, చిన్నదానికి చిన్నది**
**వాఙ్మనస్సులకగోచరమౌ కూడల సంగమ దేవా**
**స్వరూపు ప్రసాదము, నిరూపు లింగైక్యము**

యెట్టివానికైననూ ప్రసాదము కావలెననెడిది గుర్తించవలసిన విషయము. అయితే, ప్రాణలింగస్థలములోని లింగస్థలి పొందెడి ప్రసాదము అంటప్రాణలింగి స్థలి పొందె ప్రసాదము కంటెను భిన్నమైనదై యుండునని తెలియుచున్నది. అంగస్థలియొక్క ప్రసాదములు శుద్ధ సిద్ధ ప్రసిద్ధ ప్రసాదముల రూపముననుండుననెడిది విదిత విషయమే. లింగ ప్రాణలింగ స్థలి పొందెడి ప్రసాదము శివదర్శనమే యని తెలుపబడినది.

ఆది ప్రసాది స్థలమున సాధకుడు కనెడి శివదర్శన మెట్టిదో తెలిసికొనవలసి యున్నది. సృష్టి కార్యమును చేపట్టు సందర్భము కంటెను ముందున శివుడే రూపమున నుండెనో ఆ రూపమే ఈ విషయమును తెలిపెడి శ్రీ బసవన్న వారి యనుభవ వాణి గనదగినదైయున్నది.

**జలకూర్మనాగమేదిని సప్తసాగర**
**అజాండకాండ హరివిరించి గళు**
**నిమ్మ ఉదరద కొనెయ ప్రాణిగళయ్యా!**
**కూడల సంగన మహామనెయల్లి**
**అస్తిగ్రాహక నెన్న గణేశ్వర**
**ఇచ్ఛామాత్ర దింద జగజుగవయ్యా!** (వ.సంఖ్య 533)

దీని తెలుగు రూపమును గనుడి :

*జలకూర్మ నాగమేదిని సప్తసాగర*
*అజాండకాండ హరివిరించులు*
*మీ దుదరము యొక్క కొనలోని ప్రాణులయ్యా*
*కూడల సంగని మహామనికి యందున*
*నస్తి గ్రాహకుడనెడి గణేశ్వరుని*

*యిచ్ఛామాత్రము చేత*
*జగము యుగమయ్యా !*

శివయోగి శివాచార్యులవారు దర్శించిన శివుని యాది యీ క్రింది విధిన గలదని తెలియుచున్నది.

**యస్మోర్మిబుద్బుదాభాసః షట్త్రింషత్ తత్త్వ సంచయః ।**
**నిర్మలం శివనామానం తం వందే చిన్మహోదధిమ్ ।** (సి.శి. 1:3)

"శుభం భూయాత్"

## ఆశీర్వచనము - 1 :

## అంత్య ప్రసాది స్థలము :

ఆది ప్రసాది స్థలమున నాది దేవుని ప్రసాదము లేనిదే ముక్తి లభించదని తెలిసికొంటిరి. ఆది ప్రసాది స్థలమున సాధనను ఫలప్రదముగా ముగించికొనిన శివయోగి యంత్య ప్రసాది స్థలమున ప్రవేశించును. లింగ స్థలములలోనిదైన ప్రాణలింగ స్థలములోని మరొక అవాంతర స్థలమే అంత్య ప్రసాది స్థలము.

లయ యొక్క విషయమున ననుభవమును గడించినట్టి వాడైన ఆది ప్రసాది, అంత్య ప్రసాదిగా పిలువబడును. శ్రీరేణుకాచార్యులవారీ విషయమును నగస్త్యునకు నీ విధముగా వివరించిరి.

**లయః సర్వ పదార్థా నామన్త్య ఇత్యుచ్యతే బుధైః ।**
**ప్రసాదోஉనుభవస్తస్య తద్వానంత్యప్రసాదవాన్ ॥** (సి.శి. 18-63)

ఉపదేశము యొక్క తాత్పర్యమేమనగా సమస్త పదార్థముల యొక్క లయమే యంత్యమని బుధజనులచేత చెప్పబడినది. మరియు అట్టి దాని ప్రసాదము యొక్క దివ్యానుభవమును పొందినట్టి వాడే అంత్య ప్రసాదియనబడుచున్నాడు.

సర్వ పదార్థముల లయమే విధిన జరుగునో అనెడి దానిని వివరించే యుపదేశము యిది :

**దేవతిర్యఙ్మనుష్యాది వ్యవహారవికల్పనా ।**
**మాయాకృతా పరే తత్త్వ తల్లయే తత్క్షయో భవేత్ ॥** (సి.శి. 18-64)

దీని భావార్థమేమనగా మాయచేత విరచితమైన దేవతిర్యఙ్మనుష్యాది వ్యవహారముల కల్పన తత్త్వమునందున లయమగును. తత్ఫలితముగా మాయయు క్షయమైపోవును.

మాయ యే విధముగా క్షయమై పోవునో అనెడిదీ క్రింది విధముగా తెలుపబడినది.

**సాక్షాత్కృతే పరేతత్త్వే సచ్చిదానందలక్షణే ।**
**క్వ పదార్థపరిజ్ఞానం కుతో జ్ఞాతృత్వ సంభవః ॥** (సి.శి. 18-65)

దీని తాత్పర్యమేమనగా, అంత్య ప్రసాదికి సాక్షాత్కారమయ్యెడిదియును, పరమానంద లక్షణ సమన్వితమైనదియును, అయిన పరతత్త్వము నందున పరిజ్ఞాన మరియు పరిజ్ఞాతృత్వ భావనలు సంభవించవు.

ఈ విషయము విశదీకరించుటకొరకు శ్రీ భగవత్పాదుల వారొక దృష్టాంతము నిచ్చిరి. గమనించుడి:

**సుషుప్తస్య యథా వస్తు న కఞ్చిదపి భాసతే ।**
**తథా ముక్తస్య జీవస్య న కిఞ్చిద్వస్తు దృశ్యతే ॥** (సి.శి. 18-66)

గాఢ సుషుప్తిలో నున్నవానికి నే వస్తువును ద్యోతము కాదో అదే విధిన జీవన్ముక్త దశలో నుండెడి అంత్య ప్రసాదీజీవనములోని వస్తువులేవియును కన్పట్టవు.

ఈ జగత్తున కాద్యంతములును శివుడే. సృష్టికి పూర్వముననను, ప్రళయమునకు పిదపను నుండెడి వాడును శివుడే. శివుని ప్రసాదము బడసినవాడు ప్రసాదియనియును, ఆదిలోని శివతత్త్వము యొక్క ప్రసాదమును పొందినవాడు ఆది ప్రసాదియనియును, అంతిమ తత్త్వము యొక్క ప్రసాదమును పొందినవాడు నంత్య ప్రసాదియనియు నెరుంగవలెను. అంత్య ప్రసాది మాయచేత పీడింపబడడు. మాయాకల్పిత జగత్తులోని వస్తు సంచయమతనికి గోచరించదు. ఈ దశ జీవన్ముక్త దశకు చెందినదని గుర్తించగలరు.

అంత్య ప్రసాది యొక్క లక్షణమెట్టులుండునో అనెడి దానిని శ్రీ భగవత్పాదులీ క్రింది విధముగా తెలియజేసిరి :

**యథాఽకాశమవిచ్ఛిన్నం నిర్వికారం స్వరూపతః ।**
**తథా ముక్తస్య జీవస్య స్వరూపమవశిష్యతే ॥** (సి.శి. 18-67)

ఉపదేశములోని భావార్థమేమనగా నే విధముగా ఆకాశ మవిచ్ఛిన్నము గాను, వికార రహితముగా నుండునో అదే విధముగా జీవన్ముక్తుని జీవితములోను, జీవములోను స్వస్వరూపమని యెంచబడెడి శివత్వము మాత్రమే మిగిలి యుండి యతడు నివిచ్ఛిన్నుని గాను, ప్రకాశవంతునిగా నుండును.

జీవన్ముక్తుడెరుగ వలసినది గాని, చేయవలసినది గాని యుండదని చెప్పబడినది. ఉపదేశమును గనుడి :

**న కించిదపి ముక్తస్య దృశ్యం కర్తవ్యమేవవా ।**
**సుఖస్ఫూర్తి స్వరూపేణ నిశ్చలా స్థితిరుచ్యతే ॥** (సి.శి. 18-68)

దీని తాత్పర్యమేమనగా, జీవన్ముక్తుడు చూడవలసినది గాని, చేయవలసినది గాని కించిత్తైనను నుండదు. నిశ్చల స్థితిలోనుండి, సుఖ స్ఫూర్తి స్వరూపము చేత నతడు ప్రకాశించుచుండును.

పంచభూతములలో నతి సూక్ష్మముగా నుండునదే ఆకాశము. స్వరూపతః యిది సూక్ష్మముగా నుండును. ఇంతక్రితమే చెప్పిన యటుల నాత్మయనెడి దాకాశమునకుత్పత్తి స్థానమై యున్నది. అట్టి యెడ, ఆత్మయు నఖండితముగా నుండును కదా అందుచేతనే, ఆత్మజ్ఞానమును బడసిన శివయోగి యఖండమైన జ్ఞాన స్వరూపముచేత ప్రకాశించుచుండును. తనదేయగు సచ్చిదానంద స్వరూపమున విరాజిల్లెడి శివయోగికి చూడదగినది గాని, చేయదగినదిగాని యుండెడి యవకాశమే వుండదు.

ఈ స్థలము గురించినట్టి యుపదేశ ప్రదానమును ముగింపు చేయుచు శ్రీరేణుకాచార్య భగవత్పాదులవారీ క్రింది యుపదేశము నిచ్చిరి :

**శివాద్వైతపరిజ్ఞానశిథిలశేషవస్తునః ।**
**కేవలం సంవిదుల్లాసదర్శినః కేనకో భవేత్ ॥** (సి.శి. 18-69)

ఉపదేశములోని భావమేమనగా శివాద్వైత జ్ఞానముచేత శిథిలము చేయబడి ప్రాపంచిక వస్తు పరిజ్ఞానము గలవాడును, కేవలము సంవినుల్లాసమును మాత్రము దర్శించెడి వాడును అయిన అంత్య ప్రసాదియైన శివయోగి జ్ఞానేంద్రియముల చేతగాని, కర్మేంద్రియముల చేతగాని యతనికెట్టి ప్రయోజనమును చేకూర్చజాలవు. అనగా వాటివలన ప్రయోజనముండదు.

శివప్రసాద మహిమ చేత నంత్య ప్రసాది జీవన్ముక్తుడగుచున్నాడని గ్రహించగలరు. అట్టి అంత్య ప్రసాదులను సేవించి ధన్యులగుదురుగాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులవారు "అంత్య" మనెడి పదమును గురించి సాంకేతిక పరమైన వివరణనిచ్చి అంత్య ప్రసాది గురించి వివరముగా తెలియజేసిరి.

ఇంతవరకెన్నియో ప్రళయములు సంభవించినవి. పౌరాణికుల కథనము ప్రకారముగా బ్రహ్మ విష్ణువులు నెన్నియో మార్లు ప్రళయమున లయమై రూపు చెడి నేలగూలిరి. నేల బ్రద్దలై దుమ్ముగా మారి గాలిలో కలిసిపోయెను. జల ప్రళయము వచ్చి జగమంతయు నీరు నిండెను. ఈ విధముగా సర్వమూ లయించిన వేళ మిగిలెడిదెవ్వరనెడి ప్రశ్న వచ్చి నిలుచును. నిలిచెడి వాడు ప్రళయమును చేసెడి వాడే కదా! అట్టి యెడ యతనిని గాంచుట కుండెడి వారెవ్వరనెడి మరో ప్రశ్న రాగా వారే లింగానుభవ సంపన్నులైన లింగప్రాణలింగమనెడి స్థలమున సాధన చేసెడి వారనెడి సమాధానమా ప్రశ్నను లయమొనర్చును. ఇట్టి దర్శనమును మహాప్రసాదముగా స్వీకరించెడి వాడైన లింగప్రాణలింగి యంత్యలింగిగా గుర్తింపును పొందునని తెలిసికొనగలరు.

ఈ స్థలమున సాధకుడు పొందెడి ప్రసాదానుభవమెట్టులుండునో యనెడి దాని నెరుగ గోరు సద్భక్త శిఖామణులీ వచనము గనుడి :

**ఆదిత్య సోమరు ఆగిహోగుత్త – ఇద్దహరు**
**బ్రహ్మ ప్రళయకోగాద**
**హరియ సింహాసనవడగిత్తు**
**అతోనాస్తి ఇతోనాస్తి**
**రోమజ రెంబవరు సిట్టి గుట్టి తరుమర**
**నడియల్లిద్దరు**
**మార్కండేయ మహాముని స్వేచ్ఛామరణి**
**యెనిసి కొండల్లదే**
**లింగద నిజవ నరియను**
**ఇదు కారణ కూడల సంగమ దేవా!**
**నీవు మాడిద బయలు భక్షిసిత్తు హిరియరను** (శ్రీ బసవేశ్వర వచ. సం. 857)

ఈ వచనములోని "అతోనాస్తి ఇతోనాస్తి" యనెడిది యర్థము చేసుకొనవలసిన కీలకాంశమని యెరుగగలరు. శ్రీ బసవేశ్వరుల వారి వచనము యొక్క తెలుగు రూపము గనుడి :

**ఆదిత్య సోములు నయిపోవుచు నున్నారు**
**బ్రహ్మ ప్రళయమునకు లోనయ్యె**
**హరిది సింహాసన మడిగినది**
**అతోనాస్తి ఇతోనాస్తి**
**రోమజులనెడి వారు చిట్లి గుట్ట చెట్టు**
**పుట్టల నడుమనున్నారు**
**మార్కండేయ మహాముని స్వేచ్ఛామరణి**
**యనిపించికొనెనేగాని లింగపు**
**మర్మము నెరుగడు**
**ఇది కారణము కూడల సంగమ దేవా**

**మీరు చేసిన బయలు**
**భక్షించిన దనంతమైన పెద్దలు**

"అతోనాస్తి ఇతో నాస్తి" యనెడి భావనను విడదీసి వివరించెడి యీ పద్యమును గనుడి :

**అచ్చట లేదు యేమియును నందరు పొందిరి**
**యంత్యకాలమున్**
**అచ్చట లేదు సూర్యుదును నా హరిబ్రహ్మలు**
**లేరు చూడగన్**
**ఎచ్చట చూసినా బయలు; నంత్యనిలీలయె;**
**ప్రాణలింగితా**
**నిచ్చటి నుండిగాంచును మహేశుమహంతుని**
**సుప్రసాదియై** (మార్గం పెద్ద వీరప్ప, అముద్రితము)

"శుభం భూయాత్"

## ఆశీర్వచనము - 1 :

## సేవ్య ప్రసాది స్థలము :

సద్భక్తులాద్యంత ప్రసాది స్థలములలో ప్రసాదమెంతో మహిమోపేత మైనదనియు ముముక్షువాద్యంత ప్రసాది స్థలములలో ననుభవమును గడించి ముక్తులగుదురనియును తెలిసికొనుట జరిగినది. లింగషట్ స్థలములలో నంత్య స్థలమైన సేవ్య ప్రసాది స్థలము గురించి తెలిసికొనవలసియున్నది.

సేవ్య ప్రసాది యనెడి దానిని సామాన్యమైన ధోరణిలో నర్థము చేసికొనుటకు యత్నించిన యెడల వైపరీత్యములు సంభవించును. ఈ పద ద్వయమున కొక విశిష్టార్థము గలదని గ్రహించగలరు. శబ్ద విశ్లేషణను చేసిన యెడల నొక గంభీరమైన అర్థము గలదని బోధపడును. "సేవితుం యోగ్యః గురుః తస్య ప్రసాదేతి సేవ్య ప్రసాదః తద్వాన్ సేవ్య ప్రసాదిం" అనెడి వ్యుత్పత్తి వలన లభ్యమయ్యెడి అర్థమేమనగా సేవింపదగినవాడు గురువు; అతని ప్రసాదమును పొందినవాడు సేవ్య ప్రసాది యనబడును. ఈ విషయమున శ్రీ రేణుకాచార్య భగవత్పాదులవారీ క్రింది విధముగా నుపదేశించిరి :

**సేవ్యో గురుః సమస్తానాం శివ ఏవ న సంశయః ।**
**ప్రసాదోఽస్య పరానంద ప్రకాశః పరికీర్త్యతే ॥** (సి.శి. 18-70)

ఉపదేశము యొక్క తాత్పర్యమేమనగా గురువందరికిని సేవ్యుడైయున్నాడు. అతని ప్రసాదమునే పరానంద ప్రకాశమని యందురు.

సేవ్యుడైన గురువును, అతని ప్రసాదమునొకే భావముతో చూసెడి వాడే సేవ్య ప్రసాదియనబడునని శ్రీ భగవత్పాదులవారు నుపదేశించిరి కనుడి :

**సేవ్యోగురుః స్మృతో హ్యస్య ప్రసాదోఽనుభవో మతః ।**
**తదేకావేశరూపేణ తద్వాన్ సేవ్య ప్రసాదవాన్ ॥** (సి.శి. 18-71)

దీని తాత్పర్యమేమనగా, సేవ్యుడైన గురువు యొక్క అనుభవమే యతని ప్రసాదమగును. ఇది గురూపదేశముగా ప్రదానము చేయబడును. గురువులోను గురూపదేశములోను నభేదమును చూపి ప్రదానము చేయబడిన ప్రసాదమునకు పాత్రుడైన వాడే సేవ్య ప్రసాది యనబడును. మరో మాటలో చెప్పవలెననినచో సేవ్యుడైన గురుని ప్రసాదమును పొందినవాడే సేవ్య ప్రసాది.

**గురుదేవః పరం తత్వం పరతత్త్వం గురుః స్మృతః ।**
**తదేకత్వానుభావేన న కించితవశిష్యతే ॥** (సి.శి. 18-72)

దీని తాత్పర్యమేమనగా గురువుకు పరతత్త్వమున కభేదము గలదు. ఈ తత్త్వము నెరిగిన పిదప మిగిలి యుండెడి దేమియు నుండదు.

ఈ జగత్తునందున సేవించదగిన వాడు గురువే. "సేవేత పరమాచార్యం శిష్యోభక్తిభయాన్వితః" యని శ్రీ రేణుకాచార్య భగవత్పాదులవారు నుపదేశించిరి. సద్గురువును ప్రసన్నుని చేసుకొని యుపదేశమును బడయుటకై మార్గాంతరములనేకములు గలవు. దక్షిణను భూరి ప్రమాణములో నొసంగుట, గురువెరుగని విద్యను గురువుకు తెలియజేయుట ముఖ్యమైన మార్గములని యెంచబడినది. వీటికంటెను గురువును సేవించి ప్రసన్నుని చేసికొనుట యనెడిది శ్రేష్ఠతమమైనది తెలియజెప్పబడినది. అందుచేత, ముముక్షువు గురువును మూడు సంవత్సరములో లేదా ఆరునెలలో లేదా నొక వత్సరము వరకో సేవించుటలో నౌచిత్యము గలదు. కాల పరిమితితో ప్రమేయము లేకుండగ,శ్రీ గురువు మెచ్చినంతవరకు సేవించుట వలన సత్ఫలితములు లభ్యమగునని తెలిసికొనగలరు. గురుసేవ యొక్క ప్రాముఖ్యత నెరిగించెడి కథ యొకటి రఘువంశ కావ్యములో గలదు.

"వరతంతు" అనెడి పేరుతో పిలువబడెడి గురువు వలన "కౌత్స" యని పిలువబడెడి శిష్యుడు విద్యనభ్యసించుచుండెను. పద్నాలుగు సంవత్సరములవరకు పరిశ్రమించి పద్నాలుగు విద్యలను నేర్చినవాడయ్యెను. గురుకులమునుండి నిర్గమించెడి యిచ్ఛగలవాడైన కౌత్సుడు గురువు సన్నిధిన నిలిచి "నేను మీ సన్నిధిన సుదీర్ఘమైన కాలము వరకు నిలిచి యెన్నియో విద్యలను గడించితిని. తమరికి గురుదక్షిణను సమర్పణ చేయవలెననెడి వాంఛ జనించినది. తమరు చెప్పిన మొత్తమును చెల్లించదలచితిని. మీకెంత గురుదక్షిణ వలయునో సెలవివ్వ"డనెను.

శ్రీ గురువు చిరునవ్వును నవ్వి "హే కౌత్స!" "నీవు నా సంతృప్తి మేరకు సేవించి కృతార్థుడవైతివి. నాకింకే దక్షిణ వలదు. నీవు చేసిన సేవయే నీవు నాకిచ్చిన గురుదక్షిణ యని భావించికొంటిని. నీవా విషయము గురించి యెక్కువగా నాలోచించవలసిన పనిలేదు. సంతోషముతో వెడలు"మనెను.

గురువుగారి మాటలు కౌత్సుని ప్రశాంతునిగా చేయుటలో విఫలమైనవయ్యెను. గురువుగారికి దక్షిణ యివ్వవలెననెడి ప్రగాఢమైన వాంఛ గల్గిన కౌత్సుడు గురువునీ విషయము గురించి పదే పదే అడుగుచు నతనిని యిబ్బందికి గురిచేసెను. క్రుద్ధుడైన గురువు కౌత్సుని గాంచి గంభీరవదన సమేతుడై "ఓయీ కౌత్సా! నీవు గురుకులమున నుండిన కాలము పద్నాలుగు వత్సరములు నేర్చిన విద్యల సంఖ్యయు పద్నాలుగే. అందుచేత, నీవు నాకు దక్షిణ నివ్వదలచినచో నాకు పద్నాలుగు కోట్ల సువర్ణ వరహాలను సమర్పించికొను"మనెను.

గురువుగారి యాదేశములోని యంతరార్థము నెరుగవలసియున్నది. శిష్యుడేది ప్రదానము చేసినను, సంతోషముతో తీసికొనెడి గురువు, దక్షిణ గురించిన నిర్ణయమును శిష్యునికే వదలివేయును. శిష్యుడు తన శక్తిమేరకు సమర్పణలను చేయవలెను.కాని దక్షిణ యెంత యివ్వవలెననెడి దానిని గురువు నడుగుట యనెడిది శిష్టాచారమునకు విరుద్ధమైన ధోరణి. శిష్యునికి గుణపాఠమును నేర్పుటకే పరతంతు వెక్కువ మొత్తములో దక్షిణను కోరెను. శిష్యుని వివశుని చేసి, దక్షిణ తత్త్వము గురించి బోధించుటయే పరతంతు కోరికలోని యంతరార్థమని గ్రహించవలెను.

గురువుగారి ఆదేశము ప్రకారము గురుదక్షిణ నిత్తునని ప్రకటించి కౌత్సుడు ధనార్జన నిమిత్తమున బయలుదేరుటకు నుద్యమించుచు శ్రీగురువు వారి ఆశీర్వచనము నభిలషించి తన అభ్యర్థనను నివేదించెను. తానడిగిన ధనము నర్జించుట శిష్యుని కసాధ్యమైన విషయమనెడి దెరిగినను శ్రీగురువు శిష్యుని నిరుత్సాహమునకు గురిచేయుట కిష్టబడనివాడై లాంఛన ప్రాయముగా నాశీర్వదించెను. శిష్యుడు సంతోషభరితాంతరంగుడై ధనార్జనకొరకు బయలుదేరి వెడలెను.

కౌత్సుడు రఘుమహారాజు దగ్గరకు వెడలెననియును, అతని దగ్గర యింత ద్రవ్యము లేకుండుటచే కుబేరుని మీదికి దండెత్తుటకై సన్నాహాలు చేసెననియు, రఘుమహారాజుకు జంకి కుబేరుడు కనకవృష్టిని కురిపించగా రాజుగారి ధనాగారము నిండెననియు, దానిని కౌత్సునికి ప్రదానము చేయగా నతడు దానిని తన గురువుకు సమర్పించెడిననెడి యలౌకిక గాథ తెలియజెప్పినది. ఇచ్చట తెలిసికోవలసిదేమనగా గురువుకు ప్రియమును కూర్చెడిది శిష్యుని సేవ మాత్రమే!

లోకమున నాల్గు విధములగు సేవలను గాంచగలము. అవి : ఆప్త, అంగ, స్థాన మరియు సద్భావసేవలు. ఆప్త సేవలో బంధుప్రీతిని, అంగసేవలో దేహాభిమానమును, స్థానసేవలో లోభాసక్తులను గాంచగలము. సద్భావసేవ వీటన్నిటి కంటెను భిన్నమైనదైయున్నది. స్వార్థాదులకు స్థానము నివ్వకుండగ, కేవలము శ్రేష్ఠమైన భావముతో చేసెడిదే సద్భావసేవ. బంధుప్రీతితో బాంధవులను సేవించినటులను, స్వాంగమును జాగ్రత్తగా సేవించి దేహారోగ్యాదులను కాపాడికొనెడి విధమునను, యిల్లు పొలము లిత్యాదులను రక్షించి వృద్ధిలోని తెచ్చినయటులను, సద్భావ పరిపుష్టి సమన్వితమైన విధి విధానము చేతను గురువును సేవించి యతని ప్రసాదమును పొందవలెనని గ్రహించగలరు.

సేవ్య ప్రసాది గురువునకును పరతత్త్వమునకును మధ్య భేదమును గాంచడు. అతనికి శ్రీ గురువే పరతత్త్వము. గురూపదేశమే సేవ్య ప్రసాదము. అద్దానిని పొంది యతడు జీవన్ముక్తిని సాధించునని తెలిసికొనగలరు.

పరమానందము ననుభవించెడి సేవ్య ప్రసాదికి నాత్మేతరమైన విషయములలోన నభిలాష యుండదని శ్రీభగవత్పాదులవారు నుపదేశించిరి : కాంచుడి :

**అపరిచ్ఛేద్యమాత్మస్థమవాఙ్మనస గోచరమ్ ।**
**ఆనందం పశ్యతాం పుంసాం స్థిరన్యత్ర కాభవేత్ ॥** (సి.శి. 18-73)

ఉపదేశము యొక్క భావమేమనగా పరిచ్ఛేదము కానిదియును, వాఙ్మయమనస్సుల కందనిదియును, పరమానంద కారకమైనదైన తత్త్వమును వీక్షించెడి సేవ్య ప్రసాదికి యితర విషయముల యెడల నాసక్తి జనించదు.

జ్ఞానామృతము నాస్వాదించెడి సేవ్య ప్రసాదికి భోజ్యములైన వేవియు నితరము లుండవని శ్రీ భగవత్పాదులవారు వివరియిరి. ఉపదేశమియ్యది, కనుడి :

**జ్ఞానామృతేన తృప్తస్య కిమన్యైర్భోజ్య వస్తుభిః ।**
**జ్ఞానాదేవ పరానందం ప్రకాశయతి సచ్ఛివ ॥** (సి.శి. 18-74)

సేవ్య ప్రసాది జ్ఞానామృతమును గ్రహించి సంతృప్తిని బడసినవాడై నందున మరే యితర వస్తువులతనికి భోజనీయములుగా గోచరించవు. కేవలము శివజ్ఞానము వలననే పరానందము ప్రవ్యక్తమై ప్రకాశమానమగును.

ఈ విషయమును విశదీకరించు నిమిత్తమున శ్రీ భగవత్పాదులవారు నీ క్రింది యుపదేశము నిచ్చిరి:

**ముక్తిరేవ పరాతృప్తిః సచ్చిదానంద లక్షణా ।**
**నిత్యతృప్తస్య ముక్తస్య కిమన్యైర్భోగసాధనైః ॥** (సి.శి. 18-75)

దీని భావమేమనగా పరాతృప్తియే ముక్తి, యిద్దానికి సచ్చిదానంద లక్షణముండును. దీనిని పొందిన సేవ్య ప్రసాది నిత్య తృప్తుడనబడును. ఇతనికి వేరే భోగసాధనముల చేత నిట్టి ప్రయోజనము చేకూరదు.

ఈ స్థలమునందలి శివయోగి చేయదగిన కర్మలుండవని శ్రీ భగవత్పాదులవారుపదేశించిరి. ఉపదేశమును గనుడి :

**న బాహ్యం కర్మ తస్యాస్తి న చాన్తర్నైవ కుత్రచిత్ ।**
**శివైక్య జ్ఞానరూఢస్య దేహభ్రాన్తిం విముఞ్చతః ॥** (సి.శి. 18-76)

దీని భావమేమనగా శివైక్య జ్ఞానము బొందినవాడును, దేహభ్రాంతిని వీడిన వాడును, అయిన శివయోగికి కర్తవ్యములగు బాహ్యాన్తర కర్మలేవియు నుండవు.

సర్వోత్కృష్టమైన మహాలింగముతో సామరస్యమును పొందిన సేవ్య ప్రసాది యొక్క మనస్సు అజపగాయత్రి రూపమైన "సోహం" మంత్రపు మంత్ర యోగాభ్యాసము నందునగాని, షట్కర్మ మరియు బంధత్రయ రూపమైన హఠయోగము నందునగాని, యోగములలో శ్రేష్ఠమైనదని యెంచబడిన రాజయోగము నందునగాని, అనాహత బ్రహ్మజ్ఞాన రూపమైన లయయోగము నందునగాని యాసక్తితో నిలువదు. ఈ విషయమును తెలియజేయుచు నీ స్థలమున తమ యుపదేశము సమాపన చేయుచు, శ్రీ రేణుకాచార్య భగవత్పాదులవారు తమ యుపదేశము నీ విధముగా ప్రదానము చేసిరి :

**న కర్మ బన్ధేన తపో విశేషే**
**నమన్త్ర యోగాభ్యసనే తథైవ ।**
**ధ్యానేన బోధే చ తథాఽఽత్మతత్త్వే**
**మన ప్రవృత్తిః పరియోగ భాజామ్॥** (సి.శి. 18-78)

దీని తాత్పర్యమేమనగా సేవ్య ప్రసాది యొక్క మనోవృత్తి కర్మబంధము, తపోవిశేషము, మంత్రయోగము, ధ్యానము, బోధ యిత్యాదుల వైపు వెడలదు. కేవల మాత్మతత్త్వముననే నిలిచియుండును.

ఆసక్తి గల్గిన సాధకులెల్లరు సేవ్య ప్రసాదిస్థితికి చేరుటకు కృషి చేయుదురుగాక

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యులవారు సేవ్యుడైన గురుని సేవించి తరించవలెనని తెలిపిరి.

సేవ్యుడనెడి వాడి గురించి నేకాభిప్రాయము లోపించిన స్థితిలోన నెవ్వరికి తోచిన అర్థమును వారిచ్చుచున్నారు. ఈ క్రింది శ్లోకమును గమనించుడి:

**అధికం రాజపురుషస్సేత్య స్సర్వమహాన్యతః ।**
**వృక్షమూలము పాశ్రిత్య జపతోదేవపూజకాత్ ॥**

రాజపురుషుడే సేవ్యుడనెడిది యీ శ్లోకములోని భావము. ఈ భావమును ఖండించెడి యీ పద్యమును గాంచుడి:

**సేవ్యుడు నెవ్వడయ్య? భువినేలెడి వారలు సేవ్యులౌదురే?**
**భవ్యులు భాగ్యమంతులిల భాసురలీలన సేవ్యులౌదురే?**
**సేవ్యులు కారు వీరులును;**
**సేవ్యుడు శ్రీగురు దేవుడొక్కడే!**
**సేవ్యుని రూపుదైవమున వీక్షణ చేసెడి లింగియె సుప్రసాదియౌ!**

(మార్గం పెద్దవీరప్ప, అముద్రితము)

శ్రీ భగవత్పాదులవారి భావముల కద్దము పట్టుచున్న యీ పద్యములోని "సేవ్యుని రూపుదైవమున" గాంచుట యనెడి దానిని గమనించవలెను. భక్త స్థలములోని భక్తుడు గురువులోన శివుని గాంచగా ప్రాణలింగ స్థలములోని సాధకుడు దైవములోన గురుని దర్శించుననెడిది గ్రహించవలసినట్టి విషయము. ఈ విషయమును స్పష్టము చేసెడి క్రింది వచనమును గనుడి :

**గురువినల్లి సదాచార; లింగదల్లి అనుదినవేళె**
**జంగమ దల్లను భావ, సమయాచార**
**లింగదల్లి అనుదినవేళె**
**ఈ ఉభయాచారదింద తిళిదతిళివు**
**లింగదల్లి అనుదిన వేళె**
**బేరెతోరలిల్ల**
**లింగజంగమదల్లి లీయవాద సమయాచార**
**ఇదు కారణ, కూడల సంగమదేవా,**
**లింగదల్లి అనుదినవేళె** (శ్రీ బసవేశ్వర వచనము, 819)

ఏ స్థాయిలోనున్న వాడికైనను గురుకారుణ్య మవశ్యమని చెప్పబడినది.

ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి :

*గురునియందు సదాచారము*
*లింగము నందున ననుదినము వేళ*
*జంగముని యందనుభావము సమయాచారము*
*లింగమునందున ననుదినము వేళ*
*ఈ ఉభయాచారములవలన తెలిసిన*
*తెలివిడి*
*లింగమునందున ననుదినము వేళ*
*వేరె దోచలేదు*
*లింగజంగమునందున*
*లీయమైన సమయాచారము*
*ఇది కారణము, కూడల సంగమ దేవా,*
*లింగము నందున ననుదినము వేళ*

ప్రాణలింగి శివయోగ బలమున శివుని ఆద్యంత స్వరూపములను గాంచి ఆది ప్రసాదిగాను నంత్య ప్రసాదిగాను వెలుగునొందినా యతడనివార్యముగా గురుని దర్శనమును ఘనమైన ప్రసాదముగా గొని సేవ్య ప్రసాది కావలసియుండుననెడిది గ్రహించవలసిన విషయము. గురు సందర్శనామృతాస్వాదన చేసి పరితృప్తుడై పరిపూర్ణమైన సచ్చిదానందమున తేలియాడెడి సేవ్య ప్రసాది కోరెడి దింకేమియును నుండదని గ్రహించవలెను.

"శుభం భూయాత్"

# ఏకోనవింశతితమ పరిచ్ఛేదము శరణ స్థలము

## ఆశీర్వచనము - 1 :

## దీక్షాపాదోదక స్థలము :

లింగషట్ స్థలములో ప్రాణలింగమునకు పిదప వచ్చెడిదే శరణస్థలము. ప్రాణలింగ స్థలములోని యవాంతర స్థలముల గురించి సవివరముగా తెలిసికొంటిరి. తదుపరి శరణ స్థలములోని యవాంతర స్థలముల గురించి తెలిసికొనుట యెంతో అవశ్యకమైన విషయము. ఈ కారణము వలననే శ్రీ అగస్త్య మహర్షి శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారి నుద్దేశించి యీ విధముగా నభ్యర్థించెను.

**స్థలభేదాః సమాఖ్యాతాః ప్రాణలింగస్థలాశ్రయాః ।**
**కథయ స్థలభేదం మే శరణస్థల సంశ్రితమ్ ॥** (సి.శి. 19-1)

శ్రీ అగస్త్యుని ప్రార్థన యొక్క సారాంశమేమనగా ప్రాణలింగ స్థలము నాశ్రయించి యున్న అవాంతర స్థలముల గురించి వివరించిరి. దయచేసి, శరణ స్థలములోని యవాంతర భేదముల గురించి చెప్పవలెనని ప్రార్థించుచున్నాను.

శ్రీరేణుకాచార్యుల వారీ క్రింది విధముగా నుత్తరము నిచ్చిరి :

**శరణస్థలమాశ్రిత్య స్థలద్వాదశకం మయా ।**
**ఉచ్యతే నామ సర్వేషాం స్థలానాం శ్రుణు తాపస ॥** (సి.శి. 19-2)

దీని భావమేమనగా, నో తాపసోత్తామా! యీ స్థలము నాశ్రయించికొని పన్నెండు స్థలములు గలవు. వాటి పేర్లను చెప్పెదను సావధానచిత్తుడవై వినుము.

ఈ స్థలముల వివరములను శ్రీ భగవత్పాదుల వారీ క్రింది విధముగా నుడివిరి :

**దీక్షాపాదోదకం పూర్వం శిక్షాపాదోదకం తతః ।**
**జ్ఞానపాదోదకం చాథ క్రియానిష్పత్తికం తతః ॥**
**భావనిష్పత్తికం చాథ జ్ఞాననిష్పత్తికం తతః ।**
**పిండాకాశ స్థలం చాథ బింద్వాకాశస్యస్థలం తతః ॥**
**మహాకాశ స్థలం చాథ క్రియాయాశ్చ ప్రకాశనమ్ ।**
**భావ ప్రకాశనం పశ్చాత్ తతో జ్ఞాన ప్రకాశనమ్ ॥**
**స్వరూపం పృథగేతేషాం కథయామి యథాక్రమమ్ ॥** (సి.శి. 19-3-5)

ఉపదేశములో నివ్వబడిన యవాంతర స్థలములేమనగా దీక్షాపాదోదక స్థలము, శిక్షాపాదోదక స్థలము, జ్ఞాన పాదోదక స్థలము, క్రియానిష్పత్తి స్థలము, భావ నిష్పత్తి స్థలము, జ్ఞాన నిష్పత్తి స్థలము, పిండాకాశ స్థలము, బింద్వాకాశ స్థలము, మహాకాశ స్థలము, క్రియా ప్రకాశస్థలము, జ్ఞాన ప్రకాశస్థలము మరియు భావ ప్రకాశస్థలము.

శ్రీ భగవత్పాదుల వారు దీక్షా పాదోదక స్థలము నీవిధిన నిర్వచించిరి :

**దీక్ష యోఽపగతద్వైతం యజ్ఞానం గురుశిష్యయోః ।**
**ఆనందస్త్వైక్యమేతేన దీక్షాపాదోదకం స్మృతమ్ ॥** (సి.శి. 19-6)

దీని తాత్పర్యమేమనగా దీక్ష చేత గురుశిష్యుల యందలి ద్వైత భావన దూరమై యే జ్ఞానమేర్పడి గురుశిష్యుల నిజానంద స్థితిని యేకం చేసి వారిద్దరి భేదము రూపుమాపునో ఆ జ్ఞానము వలన గల్గిన ఫలితము దీక్షా పాదోదక స్థలమనబడును.

గురు-శిష్యుల యభేద భావమును ప్రతిపాదించెడి ప్రమాణములెన్నో గలవు. "ఆచార్యః పూర్వరూపం అన్తేవాస్యుత్తర రూపం విద్యా సంధిః" అనెడిది శ్రుతి ప్రమాణము. అస్మాత్ ప్రవితతాద్ బన్ధాత్ పరసంస్థానిరోధకాత్। దీక్షైనం మోచయేత్ పూర్వం శైవం ధామనయత్యపి అనెడిది స్వాయంభువ వచనము. వంతెన చేత దూరముగా నుండెడి రెండు గట్లు కలుపబడిన యటుల విద్య గురుశిష్యుల నేకము చేయుచున్నది. ఆత్మ జ్ఞానము బోధింపబడినందున గురు-శిష్యుల మధ్యన నంతరము సమసిపోవునని గ్రహించగలరు. ఇద్దరూ సమస్థితికి చేరికొందురని గ్రహించవలెను.

పాదోదక మనెడి శబ్దములోనే గురు-శిష్యుల సామరస్య పూర్వకమైనట్టి ఐక్యత గలదని తెలిపెడి శ్రీ భగవత్ పాదులవారి యీ వుపదేశమును గనుడి :

**అథవా పాదశబ్దేన గురురేవ నిగద్యతే ।**
**శిష్యశ్చోదక శబ్దేన తయోరైక్యం తు దీక్షయా ॥** (సి.శి. 19-7)

దీని భావార్థమేమనగా, పాదశబ్దము గురువును, ఉదక శబ్దము శిష్యుని, దీక్షా అనెడిది యిద్దరిని యేకం చేసెడి ప్రక్రియను సూచించును.

క్రియాపాదోదకమును సిద్ధము చేయునప్పుడు పాదమునకు నుదకమును సమర్పించుట జరుగును. ఉదకమెట్టుల పాదమునకు సమర్పితమగునో శిష్యుడును గురువునకు సమర్పితుడు కావలసియుండును. గురుపాదమునకు సమర్పితమైన జలమునకు మహత్త్వం సంప్రాప్తమగుచున్నది. అదే విధముగా సమర్పితుడైన శిష్యునికిని గురువుగారి మహిమ లభించును. క్రమక్రమముగా సాధన పరిపక్వ దశకు చేరిన స్థితియందు గురు-శిష్యులు సమానమైన మహత్తుగల వారగుదురని గ్రహించగలరు. దీక్షనిచ్చి గురువు, శిష్యుని తనతో సమానమైన వానిగా రూపొందించును. ఈ కారణముననే శ్రీభగవత్పాదులవారు గురుశిష్యులకు పాద ఉదకముల పోలిక గలదని వివరించి చెప్పిరి.

శ్రీజగద్గురు రేణుక భగవత్పాదుల వారు పాదమనెడి శబ్దమునకు గురువని తెలుపుటయందు నతి రహస్యమైన తాత్త్వికార్థము నిమిడియున్నది. సామాన్యముగా కాలును పాదమని పిలుచుచుందురు. పాదము మానవుని కొక కర్మేంద్రియమైయున్నది. శరీరమును మోసుకొనిపోయెడి కార్యమునిది చేయుచున్నది. "పద్యతే గమ్యతే ఇతి పాదః" అనెడి వ్యుత్పత్తి చెప్పబడినది. చూచెడి వారికి పాదములు చివరి యంగముగా కన్పట్టును. మస్తకము ప్రథమావయవమైనందున ముఖ్యమైనదని చెప్పబడినది. అయితే శుష్క జ్ఞానము గలవారి మస్తకముల కంటెను నాచారశీలుల పాదములెంతో మహత్తుతో కూడికొనియుండును. పెద్దవారి పాదములపై మస్తకమునుంచి నమస్కారము చేయుటలోన యీ ధర్మసూక్ష్మమే యిమిడియున్నది. దీనివలన తెలిసికొనెడిదేమనగా మనము గడించెడి జ్ఞానముకంటెను మన మాచరించెడి క్రియయే మనకు మాన్యత నిచ్చును. మనమేమి యెరిగితిమి యనెడిదాని కంటెను మనమేమి చేసితిమనెడి దానికే ప్రాముఖ్యత గలదని గుర్తించవలెను. "నుడివిన యట్టుల నుడువు-యిదే జన్మలోన కడ" అనెడి నానుడి యవిస్మరణీయమైనది.

మహాత్ములెల్లరును నాచరణకే ప్రాముఖ్యత నిచ్చి తమరి యుపదేశముల నిచ్చిరి. "లాంఛనమునకు తగినట్లుగా ఆచారము లేనివారిని బసవన్నవారు తిరస్కృతికి గురిచేసిరి. ఆచారము యొక్క గరిమను బసవాది శివశరణులెల్లరును గుర్తించిరి.

జగత్తులోని జనులందరికిని మార్గదర్శకుడైన సద్గురువు ధర్మము నాచరించుటలో నాచార సంపన్నుడై యుండునని తెలుపుటకే శ్రీ భగవత్పాదులవారు పాద శబ్దమును గురువనెడి అర్థమును నన్వయించిరి. మన మస్తకమందున నుండెడి జ్ఞానమెవ్వరికిని గోచరించదు. మన నడత నందరు గాంచుచుందురు. బాల బాలికలు తమ పెద్దలననుసరించి నడుచునటులే, లోకులు జ్ఞానుల నడకలను చూసి ప్రభావితులై వారి ననుకరించుచు ప్రవర్తించుచుందురు. పెద్దలు గురువుగారి సన్నిధికో, లేదా జంగమయ్య గారి సన్నిధికో వెడలినప్పుడు, తమ పిల్లలను తీసికొని వెడలుటను గాంచగలము. పెద్దలు తాము నమస్కరించకుండ, తమ పిల్లల నుద్దేశించి నమస్కారము చేయుమని పలికిన యెడల నయ్యది పిల్లలకు నవగతము కాకపోవచ్చును. పెద్దలు పాదాభివందనము నాచరించినచో, పిల్లలద్దానిని చూచి, పెద్దలననుసరింతురు. అందుచేత గురువు స్థానమున నున్నవారు, ఆచారము గురించిన యుపదేశముల నిచ్చుటతో బాటుగా, తమ తమ ఆచరణల ద్వారా జనులను ప్రభావమునకు గురి చేయవలెను. వారి నాచారవంతులుగా తీర్చిదిద్దవలెను. ఆత్మ జ్ఞాన సముపార్జన వలన నాత్మోద్ధారణ సుసాధ్యమగును. లోకోద్ధారమును చేయుటకై నియ్యది దోహదపడకపోవచ్చును. తన్నిమిత్తమై సద్గురు వాచార సంపన్నుడై విరాజిల్లవలెను.

జ్ఞానాందముల సమైక్యరూపమే పాదోదకమనగా యని శ్రీభగవత్‌పాదులవారు తెలియజెప్పిరి. ఉపదేశమును గనుడి :

**పరమానంద ఏవోక్తః పాదశబ్దేన నిర్మలః ।**
**జ్ఞానం చోదకశబ్దేన తయారైక్యం తు దీక్షయా ॥** (సి.శి. 19-8)

దీని భావార్థమేమనగా, పాదమనగా నానందము. ఉదకశబ్దము జ్ఞానమును సూచించును. ఈ రెంటి యొక్క సమైక్యత దీక్షచేత సిద్ధించును.

ప్రతియొక్కరి ఆత్మ పరమాత్మ స్వరూపమై యుండును. అందుచేత నయ్యది పరమానంద స్వరూపముగా నుండునగ్రహించగలరు. అజ్ఞానావృతులై యుండుట చేత నీ విషయము నెరుగజాలనివారు శబ్ద స్పర్శాదుల వలన వైషయిక సుఖమును పొందుటలో నిమగ్నులైయున్నారు. దీక్షచేత నజ్ఞానావృతము చ్ఛేదింపబడును. తత్ఫలితముగా దీక్షితులానంద స్వరూపుడనని యెరిగి ఆత్మానందము ననుభవించును.

భూమియందున పాతిపెట్టబడిన నిధి మీద కూర్చొని దాని గురించి తెలియని స్థితిలో, బిక్షుక వృత్తితో జీవన యానమును చేసెడివాని స్థితివంటిదే సంసారము లోని జీవుల స్థితి. ఆత్మయనెడి దతి సమీపమున నుండినను దాని గురించి యెరుగలేకున్నాడు. ఆత్మ నెరిగిన వాని కమితానంద ప్రాప్తి గలుగుననుటలో సందియము లేదు. ఎరుగనివారికి దుఃఖము గల్గును. గురువునాశ్రయించిన వానికి తరుణోపాయము లభించును. గురువు ప్రసన్నుడై దీక్షను కటాక్షించినచో నజ్ఞానము యొక్క నివృత్తియును, ఆత్మ జ్ఞానము యొక్క ప్రాప్తియు సుసాధ్యమగును. ఆనంద స్వరూపుడైన గురువు జ్ఞానైక స్వరూపుడగు శిష్యుని సామరస్యమైన పిదప నిరువురును నానందమయులై సమస్థితికి చేరుదురని గుర్తించగలరు.

దీక్షా పాదోదక స్థలమునందలి శివయోగి కభేద దృష్టి యుండునని శ్రీ భగవత్‌పాదుల వారు వివరించిరి. ఉపదేశమును గనుడి :

**పరసంవిత్ ప్రకాశాత్మా పరమానందభావనామ్ ।**
**అధిగమ్య మహాయోగీ న భేదం క్వాపి పశ్యతి ॥** (సి.శి. 19-9)

దీని తాత్పర్యమేమనగా, పరాసంవిత్ ప్రకాశ రూపుడై పరమానంద భావములో నుండువాడై యెచ్చటనైనా భేదమునరయడు "ఆనందం బ్రహ్మణో విద్వాన్ న బిభేతి కతుశ్చన" అనెడి బ్రహ్మోపనిషత్తు వాక్కుల ప్రకారముగా స్వస్వరూప జ్ఞాన సంపన్నుడైన శివయోగికి సర్వమూ తన ఆత్మ స్వరూపముగానే దోచును. రాగద్వేషాత్మకమైన దృష్టియతని కుండదు. ఈ కారణముననే, భయపెట్టుటగాని భయమునకు గురియగుటగాని సంభవించదు.

"వలయు, వలదు" అనెడివి సామాన్యుని కుండెడి భావనలు. ఇవి మనస్సును పీడనకు గురిచేయును. ఈ స్థలమునకు చెందిన శివయోగి భావన లిట్టులుండవు. ఈ క్రింది విధముగా నుండునని శ్రీ భగవత్‌పాదుల వారు బోధించిరి :

**దేశకాలద్యవచ్ఛేదవిహీనం నిత్యనిర్మలమ్ ।**
**ఆనందం ప్రాప్య బోధేన నాన్యత్ కాంక్షతి సంయమీ ॥** (సి.శి. 19-10)

దీని భావమేమనగా, దేశకాల భేదములతో సంబంధము లేకుండనుండెడి నిర్మలమైన బ్రహ్మానందముననుభవించే శివయోగికి వేరే ఆకాంక్షలుండవు. వలయు, వలదనెడి చింతలుండవు.

దేశకాల వస్తువుల చేత పరిచ్ఛేదమైయుండు సుఖదుఃఖములు ఆయా వ్యక్తుల కాయాదేశకాల వస్తుస్థితులలో సుఖమునో దుఃఖమునో గల్గించును. అందుచేత నొక స్థితిలో నొకడు సుఖమును చవిచూచినచో మరొకడు దుఃఖమునకు గురియగుచున్నాడు. ఆత్మకు సంబంధించిన ఆనందము నిర్మలమైనదిగాను, అవిచ్ఛిన్నమైనదిగాను విరాజిల్లుచుండును. సర్వకాల, సర్వదేశ సర్వావస్థలయందున శివయోగి ఆత్మానంద పరిస్ఫూర్తివలన గల్గెడి సముల్లాసమున నుండునని తెలిసికొనగలరు. దేశకాలాకారాదులతనికి ప్రతిబంధకములు పరిణమించజాలవని గ్రహించగలరు.

ఈ స్థలమున నుపదేశము సమీపనము చేయుచు శ్రీ భగవత్‌పాదులవారీ క్రింది విధముగా నుపదేశించిరి:

**జ్ఞానామృతమపి స్వచ్ఛం గురుకారుణ్య సంభవం ।**
**ఆస్వాద్యరమతే యోగీ సంసారామయ వర్జితః ॥** (సి.శి. 19-11)

దీని తాత్పర్యమేమనగా, గురుకారుణ్యము వలన గల్గినట్టియును, నిర్మలమైనదియును, అయినట్టి శివజ్ఞానామృతము నాస్వాదించి శివయోగి భవరోగమును విసర్జించిన వాడై స్వస్వరూపమైన శివత్వములో క్రీడించుచుండును.

అమృతము స్వర్గములో లభించుననియును, పుణ్యమునార్జించిన వారికది లభ్యమని తెలుపబడినది. అయితే పుణ్యము క్షీణించగనే ఆ అమృతమలభ్యమగును. జీవి జనన-మరణములకు లోనగును. గురుకరుణ వలన సంప్రాప్తమైన జ్ఞానామృతము వలన శివత్వము సిద్ధించును. సంసారమనెడి రోగము దూరమగును. దీక్షా పాదోదక స్థితి చిదానందమునునుభవించుచుండును. మీరందరు దీక్షాపాదోదకస్థలములోని శివయోగి వలె సాధనచేసి, కృతార్థసిద్ధిని పొందుదురుగాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యులవారు దీక్షా విషయమునను, పాదోదకము గురించిన యంశముల నెన్నింటినో తెలియజేసిరి. పాదశబ్దము నాచారనిరతిని గురించి తెలుపుచున్నదని తెలిపిరి.

సేవ్య ప్రసాది శివునిలో గురునిగాంచుచు నానందములో తేలియాడుననెడి విషయమును నింతకంటెను ముందుననే తెలిసికొంటిమి. సేవ్యుని దర్శనమునే సేవ్య ప్రసాది ప్రసాదముగా గైకొనుననియును తెలిసికొంటిమి.

తనను వీక్షించెడి సేవ్య ప్రసాదిని శివుడు కృపా ప్రపూర్ణమైన దృష్టితో వీక్షించును. ఇట్టి వీక్షణ సాంకేతికముగా దీక్షగా పరిణమించును. ఏకాభేదాత్మికా సాక్షాదన్యా మంతాత్మికా మతా క్రియాత్మికాపరా" యనే కారణాగమ వాక్కుల ప్రకారముగా నియ్యది వేధా దీక్షయని యనబడుచున్నది.

శివావలోకన వలన గల్గెడి అద్వైత భావము, "దీక్షయోపగతా ద్వైత"మనెడి భగవత్పాదుల వారి యుపదేశములోని భావమునొకే యంశమును తెలుపుచున్నది. అదియే శివ-జీవాభేద భావన.

పిండజ్ఞానికిచ్చెడి యుపదేశములో దీక్షాగురువులు దీక్షితునుద్దేశించి "తత్త్వమసి" అనెడి మహావాక్యములోని తత్త్వము గురించి తెలుపును.

ఇందులోను శివ-జీవాభేదభావమే యుండును. భవిభక్తుడై, ప్రాణలింగి స్థలమున సాధనచేసి సేవ్య ప్రసాదియై యుండెడిస్థితిలో శివుని రూపమున నుండె గురుడు నెంతో సంతోషించును. గురువును గాంచిన శిష్యుడును సంతోషించును. ఇద్దరు పొందెడి ఆనందములోను, ఇద్దరిలోను నుండెడి జ్ఞానములోను నభేదమును గాంచగలము. చిత్స్వరూపుడైన శివుడు, గురువై శిష్యుని పురోగమనము వలన నానందము బొందును. శివాంశయైన జీవి సాధకుడై చిదర్జనాపరుడై శరణ స్థలమున నానంభక్తినాచరించి ఆనందమయాంతరంగుడగును. శివునికి తాను సన్నిహితుడనైయున్నాడనెడి జ్ఞానమే శరణుని ఆనందమునకు కారణమగుచున్నది. చిత్ మరియు ఆనందము నేకము కాగా సేవ్యుడు సేవ్య ప్రసాదియును చిదానందమూర్తి స్వరూపమును దాల్చుదురు. వీరిరువురును నైక్యతను సాధించుటకు చేసెడి ప్రయత్నమే శరణ స్థలమున నానందభక్తిగును, నైక్య స్థలమున సమరస భక్తిగను నుండును.

ఆనంద భక్తాచరణలోని యంతర్భాగమే పాదోదక సంసేవనా ప్రక్రియ.

పాదోదకమనెడి దష్టావరణములలో నొకటి. ప్రతి వీరశైవుడును త్రిలింగముల పాదోదకముల ననివార్యముగా స్వీకరించివలసియుండును. అరిషడ్వర్గ, అష్టమద, అహంకారాది భౌతిక, మానసిక కాయిక వికారములు సాధకుని బాధించకుండా నుండుటకై వలయు రక్షణ నేర్పరెడి రక్షణ కవచములలో పాదోదకమొకటి.

భేద-భావముతో చేసెడి సాధనకు ప్రతీకగా నిలిచెడి స్థలములైన భక్తి మహేశప్రసాది స్థలములలో పాదోదకము భౌతిక రూపమున నుండగా, అభేద భావనకు, నద్వైత సాధనకును, ప్రాతినిధ్యము వహించెడి యితర స్థలములలో నయ్యది భౌతికరూపమును వీడి భావ స్వరూపమును దాల్చునని తెలియుచున్నది. పాదోదకమనగా చిదానందమని చెప్పబడినది. అంతేకాదు, చిదానంద లక్షణ సమన్వితులైన శివ-జీవుల యైక్యతకు పాదోదకము ప్రతిరూపముగా నిలుచుచున్నది.

దీక్షా పాదోదక స్థలియైన సాధకుడు గురురూపమున నుండెడి శివునితో సమైక్యతను సాధించి "నిశ్చింతత్వ" మనెడి ఆగమ భావము గల్గినవాడై చిదానందము ననుభవించుచుండునని తెలిసికొనగలరు. ఇట్టి స్థితిని విశిష్టాద్వైతులు ప్రతిపాదించెడి మోక్షస్థితిని పోలియుండును. విశిష్టాద్వైతి కిదియే పరమ లక్ష్యము. కాగా శక్తి విశిష్టాద్వైతియైన దీక్షా పాదోదక స్థలికేది లింగాంగ సామరస్యమును సాధించే క్రమములోన నొక స్థితి.

*- శివం భూయాత్ -*

## ఆశీర్వచనము - 1 :

## శిక్షాపాదోదక స్థలము :

సద్భక్తులింత కంటెను ముందున దీక్షాపాదోదక స్థలములో శ్రీరేణుక భగవత్పాదులవారు శ్రీఅగస్త్యముని కిచ్చిన గురూపదేశమునకు సంబంధించిన యంశములను తెలిసికొంటిరి. శ్రీగురువుల వారిచ్చిన దీక్షా సంస్కారాదుల వలన శిష్యుడు పొందెడి సమున్నతమైనట్టి యనుభవము గురించి తెలిసికొంటిరి. శిక్షాది సంస్కారములచేత శ్రీగురువు శిష్యునిలో తీసికొని వచ్చెడి మార్పుల గురించిన వివేచన విషయమని గ్రహించగలరు. ఈ స్థలమున శ్రీ భగవత్పాదుల వారి ప్రారంభోపదేశ మీ క్రింది విధముగానున్నది :

**గురుశిష్యమయం జ్ఞానం శిక్షా యోగిన మీర్యతే ।**
**తయోః సమరసత్వం హి శిక్షాపాదోదకం స్మృతమ్ ॥** (సి.శి. 19-12)

దీని తాత్పర్యమేమనగా, గురుశిష్యుల జ్ఞానములోన సమత్వము గలదనెడి భావన వలన గల్గెడి ప్రేరణ వలనను, గురూపదేశమనెడి శిక్షవలనను గల్గెడి గురుశిష్యుల సమరసత్వ స్థితినే శిక్షాపాదోదక స్థలమని పిలుతురు.

శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారీ స్థలమున జ్ఞానమునకు "గురుశిష్య మయం" అనెడి విశేషమును జోడించిరి. ఇచటి మయట్ ప్రత్యయము నిరువురి సామరస్య స్థితిని తెలియజేయుచున్నది.

మయట్ ప్రత్యయము వికారార్థము నందున ప్రయోగింపబడుచున్నది. "మృణ్మయః ఘటః" అనెడి దానిలో ఘటము మన్నుయొక్క వికారమని చెప్పబడుచున్నది. అయితే, "గురుశిష్య మయం జ్ఞానం" అనెడి దానిలో మయట్ ప్రత్యయము నుభయుల స్వస్వరూపమును బోధించునదై యున్నది. గురుశిష్యుల తెలివిడి సమానముగా నుండుటచేత వారిరువురి స్వస్వరూపమునందున యెట్టి విధమైన భేదమైన నుండజాలదు. శిక్షణ మూలకముగా గురుశిష్యుల సమాన సామరస్యస్థితిని ప్రతిపాదించెడి స్థలమే శిక్షాపాదోదక స్థలము.

స్వస్వరూప జ్ఞానామృత మెవ్వరి వలన దేనిచేత నెవ్వరికి ప్రాప్తమగుననెడి ప్రశ్నలుదయించుట సహజమే. శ్రీభగవత్పాదుల వారి యీ వుపదేశమీ ప్రశ్నలకు సమాధానము నిచ్చెడిదైయున్నది :

**మథితాచ్ఛాస్త్రజలధేర్యుక్తిమన్థానవైభవాత్ ।**
**గురుణా లభ్యతే బోధసుధా సుమనసాం గణైః ॥** (సి.శి. 19-13)

దీని భావమేమనగా, తర్కరూపమైన మంథన దండముచేత గురువు ద్వారా మథితమైన నిగమాగమ శాస్త్రరూపమైన సముద్రమందున వెడలిన శివాద్వైత రూపమైన బోధసుధ సంప్రాప్తమగును.

మంథనమును చేయనిచో నంతః సత్వమును పొందజాలము. గురువుగారి సన్నిధిన శాస్త్రాధ్యయనమును చేయుటవలన శాస్త్రముల తాత్పర్యము శిష్యునికి గోచరించును. ఉపక్రమోపసంహారాది శ్రుత్యంగముల మూలకముగా సకల శాస్త్రములను ఆద్యోపాంతముగా నధ్యయనము చేయుటచేత గ్రంథముల రహస్యార్థము తెలియవచ్చును. ఈ కారణముననే శిష్యుడు గురువు నాశ్రయించి శాస్త్రాధ్యయనమును చేయవలెను.

సాగర మపారముగా నుండియున్నటులే శాస్త్రము లపారముగా నున్నవి. అనంతమైన శాస్త్రము లన్నింటినీ అధ్యయనము చేయుటయనెడి దసాధ్యమైన విషయము. అయితే, తమ తమ ధర్మదర్శనముల నధ్యయనము చేయుటయనెడిది ప్రతియొక్కరి కర్తవ్యమైయున్నది. వీరశైవ సిద్ధాంతమునకు కామికాది వాతులాంతములైన 28 శివాగమములు మూలాధారములై యున్నవి. ఇంతేకాదు, వీటి నాధారముగా గొని రూపొందించబడిన ధర్మగ్రంథము లెన్నియో గలవు. వీటిలో సిద్ధాంత శిఖామణెంతో ముఖ్యమైనదై యున్నది. వందల కొలది సంస్కృత గ్రంథములు గలవు. ఈ గ్రంథములన్నింటినీ అభ్యాసము చేసి యుక్తియనెడి మంథనము చేత వాటిని చిలికి వాటి రహస్యార్థమును తెలిసికొనవలెను. పెరుగును చిలికి వెన్నను తీయుట కొరకు కోల మరియు త్రాడు వలయును కదా. అదేవిధిన శాస్త్రాధ్యయన ప్రక్రియకు గురుశిష్యుల పరస్పర

సహకారమెంతో అవసరము. గురువు మొదట శాస్త్రమునకు సంబంధించిన మౌలికాంశములను పరిచయము చేయును. గ్రంథాధ్యయన యుక్తి ప్రయుక్తులను తెలియజేయును. అధ్యయన క్రమమునందున తలయెత్తెడి తాత్త్విక ప్రశ్నలకు తగిన సమాధానము నొసంగును. శాస్త్ర చర్చలో పాల్గొని శిష్యుని యాలోచనా ధోరణిని సక్రమ మార్గమున పయనింపజేయును. ఇట్టి శిక్షా క్రమమున లభ్యమయ్యెడి జ్ఞానామృతమును గురుశిష్యులాస్వాదింతురు. ఈ విషయమునకు సంబంధించిన స్థలమే శిక్షాపాదోదక స్థలమని యెరుగవలెను.

ఈ స్థలమునందలి శివయోగి స్వస్వరూప స్థితియందున నెటుల స్థిరుడగుననెడి దానిని భగవత్పాదుల వారీ క్రింది విధముగా వివరించిరి :

**జ్ఞానచన్ద్రసముద్భూతాం పరమానన్దచన్ద్రికామ్ ।**
**పశ్యన్తి పరమాకాశే ముక్తిరాత్రౌ మహాధియః ॥** (సి.శి. 19-14)

దీని తాత్పర్యమేమనగా, మహాధీశాలియైన శిక్షాపాదోదక స్థలమునందలి శివయోగి ముక్తియనెడి రాత్రియందున పరమమనెడి యాకాశమునందు, జ్ఞానమనెడి చంద్రుని నుండి వెలువడెడి పరమానందమనెడి వెన్నెలను వీక్షించుచు నానందానుభూతిలో తేలియాడుచుండును. బాహ్య పరికల్పనలకు దూరమై అంతర్ముఖియై తనదే యైనట్టి ఆనందముననుభవించుచుండుననెడిది తెలిసికొనవలసిన విషయము.

శ్రీభగవత్ పాదుల వారిచ్చిన వెన్నెల యనెడి యుపమాన మందరికిని అనుభవ గోచరమైన విషయమే. నిండు పున్నమనాడు పండు వెన్నెలను పరికించుచు నొక వ్యక్తి పొందెడి యానందానుభూతిని గురించి చెప్పుటకు వీలుగాదు. అది కేవలమనుభవవేద్యమైనట్టి విషయమే. అయితే, నేటి నవనాగరికత కారణమున, యిట్టి ఆనందానుభూతిని పొందెడి వారి సంఖ్య నానాటికి తగ్గుముఖము పట్టుచున్నది. పట్టణవాసులైతే కృత్రిమకాంతి కలవాడు పడినారు. చంద్రుడుగాను, వెన్నెలగాని వారి నానందమును గురిచేసెడి స్థితిలో లేవు. నిండు పున్నమను గుర్తించెడి వాడెవ్వడు. క్యాలండరు కాలమానమును చెప్పుచుండగా, జీవనగతిని పదిలముగా పయనింపజేసెడి చింతలో నుండెడి సగటు పట్టణవాసికి వెన్నెల చింత యుండునే? గ్రామవాసులు మాత్రమే వెన్నెలలో చల్లదనము ననుభవించెడి స్థితిలో నున్నారు. అయితే, అంతరంగములోని చిదాకాశమునందలి జ్ఞానచంద్రుని ఆనందామృత వృష్టినాస్వాదించెడి దెందరికి సాధ్యమగును. శిక్షాపాదోదక స్థలమునందలి శివయోగి యిట్టి యమూల్యమైన దివ్యానుభవమును పొందునని గుర్తించవలెను.

పరమానన్ద చంద్రికను చూసి తరించబడిన సంసారము గలవాడైన శిక్షాస్థలము నందలి శివయోగి చూడవలసిన యితరములేవియునుండవని శ్రీభగవత్పాదుల వారు సెలవిచ్చిరి. ఉపదేశమును గనుడి :

**దృష్టే తస్మిన్ పరమానందే దేశకాలాదివర్జితే ।**
**దృష్టవ్యం విద్యతే నాన్యచ్ఛ్రోతవ్యం జ్ఞేయమేవవా ॥** (సి.శి. 19-15)

ఉపదేశములోని భావార్థమేమనగా చిదాకాశమున విరాజిల్లెడి చంద్రుని చంద్రికను వీక్షించి జీవన్ముక్తి స్థితిని బడసిన శిక్షాపాదోదక స్థలియే శివయోగికి చూడదగిన, వినదగిన, తెలిసికొనదగినవేవియునుండవు. అన్య వస్తువులను వీక్షించుటలోగాని, అన్య విషయముల గురించి విని తెలిసికొనుటలో గాని యతని కాసక్తి యుండదనెడిదే కీలకమైనట్టి యంశము.

ఎంతవరకు నాత్మజ్ఞానము ప్రాప్తము కాదో అంతవరకు దేశకాలాదుల పరిచ్ఛేదముతో కూడికొనియున్న వేరే వేరే వస్తువులను వీక్షించవలెననెడి యాసక్తి యుండుట సహజమే. "ఆత్మా వా అరే దృష్టవ్యః" అనెడి శ్రుతి వచనములోని బోధ సామాన్యుల కవగతము కాదు. "చూడదగినది ఆత్మ మాత్రమే" అనెడిదీ శ్రుతివాక్యములోని భావము. తత్ఫలితముగా సామాన్యుడు దర్శనాసక్తి శ్రవణాసక్తి పెంపొందించికొని అటు యిటు పరుగులుగొనిచుండును. "ఏక విజ్ఞానేన సర్వ విజ్ఞాన" మ్మనెడిది శ్రుతివాక్కు. ఆత్మజ్ఞానమును పొందినవాడు నిత్యతృప్తుడై యుండుననియును, నతనిలో వేరే యితర ఆకాంక్షలుండవని తెలిసికొనగలరు.

జగత్తులోని వస్తువులు మనకు తాత్కాలికమైన సుఖమును కలుగజేయును. అవి మనకు దూరమైపోయినప్పుడు దుఃఖము ప్రాప్తించును. ఆత్మజ్ఞానము శాశ్వతమైన సుఖమును ప్రదానము చేయును. అది మనలను వీడి వెడలదు. ఆత్మజ్ఞానము వలన గల్గిన సుఖము అమితానందమును కల్గించుటచే వేరే యే వస్తువు వలనను ఆనందము కలుగదు. ఈ కారణముననే శిక్షా పాదోదక స్థలమునందలి శివయోగి యన్య వస్తువులను

వీక్షించదు. వాని గురించి వినదు. తెలిసికొనదు. ఆత్మానందములో తల్లీనమైయుండుటచే నన్యముల గురించి ఆలోచించదు. ఈ యంశమును స్పష్టీకరించుటకై శ్రీ భగవత్పాదుల వారొక యుదాహరణనిచ్చిరి. గమనించుడి :

**ఆత్మానందేన తృప్తస్య కా స్పృహా విషయే సుఖే ।**
**గఙ్గాజలేన తృప్తస్య కూపతోయే కుతో రతిః ॥** (సి.శి. 19-16)

దీని తాత్పర్యమేమనగా నే విధముగా గంగాజలము చేత తృప్తి పొందిన వానికి బావిలోని జలము తృప్తినివ్వజాలవో, అదే విధముగా నాత్మానందములో సంతృప్తిని పొందిన శిక్షా పాదోదక స్థలములోని శివయోగికి విషయ జన్య సుఖములు తృప్తిని చేకూర్చజాలవు.

"పరాంచిఖాని వ్యతృణత్ స్వయంభూః" అనెడి శ్రుతివాక్కుల ప్రకారముగా, సృష్టికర్త యీ జగత్తును సృష్టించెడి ప్రక్రియయందున జీవులనెల్లరు యింద్రియములను బహిర్ముఖములుగానే యుండునటుల చేసిరి. ఈ కారణము వలననే జీవులు విషయముల వలననే సుఖప్రాప్తి యగునని భావించికొని శబ్ద స్పర్శాది విషయముల ననుభవించుట కొరకు పరుగెత్తుచున్నారు. విషయములనుభవించుట వలన క్షణికమైన సుఖము మాత్రమే లభించును. పరమ సుఖము లభ్యము కాదు. అంతేకాదు, విషయముల వాసన విషయోపభోగము వలన శాంతము కాదు. మరల మరల నుద్దీపననొందు చుండును. ఈ యంశమును తెలియజెప్పెడి శ్లోకమిది. కనుడి :

**న జాతుః కామః కామానాముపభోగేన శామ్యతి ।**
**హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే ॥**

దీని తాత్పర్యమేమనగా హోమకుండములోని యగ్నిని శాంతపరచుట కొరకు సమిధలను, నెయ్యిని వేసినచో ఫలితముండదు. అగ్ని ప్రజ్వరిల్లునేగాని నియంత్రింపబడదు. విషయముల ననుభవించుటవలన విషయముల ననుభవించాలనెడి కోరిక పెరుగునేగాని తరగదు. బహిర్ముఖము గల యింద్రియములు గల్గిన సామాన్యుని స్థితి యిట్టిది కాగా, అంతర్ముఖియైన శిక్షాస్థలములోని శివయోగి పయనించదు. ఆత్మానందమే యతనికి తృప్తిని ప్రసాదించును. గంగాజలము చేత పునీతుడైనవాడు చిరుబావిలోని నీటికై కోరుకొనడు కదా!

విషయాసక్తికి జ్ఞానప్రాప్తికిని పరస్పర సంబంధము గలదని పెద్దలు చెప్పుదురు. ఈ ప్రాతిపదికనాధారముగా గొని జగత్తులోని వ్యక్తులను నాలుగు విధములుగా వర్గీకరించవచ్చునని తెలుపబడినది. పామరులు, విషయిలు, జిజ్ఞాసువులు మరియు జ్ఞానులనెడి వారే నాలుగు రకములైన వ్యక్తులు. అజ్ఞానవశమున, విషయభోగములలోనే సుఖము గలదని భావించి సదా విషయసుఖములలో నిమగ్నుడై యుండెడివాడు పామరుడని తెలుపబడినది. తనదైనట్టి యాత్మ స్వతఃగా నానంద స్వరూపియని తెలిసినా, తెలియని వానివలె శబ్ద స్పర్శాది విషయ సుఖములలో మునిగి తేలెడివాడు. విషయ సుఖము వలన లభించెడి యానంద మశాశ్వతమైనదని యెరిగినవాడై, యాత్మ స్వరూపము నెరుగుటకై మహోత్కృష్టమైన కోరిక గలవాడు జిజ్ఞాసువు. గురూపదేశము వలన దృఢతరమైన జ్ఞానమును సముపార్జన చేసినవాడే జ్ఞాని. ఇతనిని ముక్తుడనియునందురు. జ్ఞానికంటెను శ్రేష్ఠతముడు స్థలమున నుండెడి శివయోగి యని గ్రహించవలెను.

పరానందము ననుభవించెడి శిక్షాపాదోదక స్థలమునందలి శివయోగి యొక్క తృప్తి కవధులుండవని తెలిపెడి యీ క్రింది యుపదేశము గమనార్హమైనదై యున్నది.

**యస్మిన్నప్రాప్తకల్లోలే సుఖసిన్ధౌ నిమజ్జతి ।**
**సామరస్యాన్మహాయోగీ తస్య సీమా కుతో భవేత్ ॥** (సి.శి. 19-17)

దీని తాత్పర్యమేమనగా కల్లోలరహితమైన సుఖసముద్రములో నిమజ్జనమై యుండెడి శివయోగికి సామరస్య పూర్వకమైనట్టి ఆనందమేదైతే కలదో దానికి నవధులనెడివుండవు.

భౌతిక వస్తువులకు సీమలుండును. ఇల్లు, పొలము, తోట, చెరువు మొదలగు వాటి కెల్లలుండునుకదా! వీటివలన లభించెడి సుఖసంతోషములకు కూడ సీమలుండవు. ఆత్మ కవధులుండవు. ఆత్మ జ్ఞాని పొందెడి నిజానందమునకును సీమలుండవని గ్రహించవలెను. నిజానందము ననుభవించెడి శివయోగి ఆనందము వికారరహితమైనది. రాగ ద్వేషాది వికారముల కాస్కారముండదని తెలిసికొనగలరు.

నిస్సీమానందానుభూతిలో నోలలాడెడి శిక్షాపాదోదక స్థలమునందలి శివయోగికి భేదభావము స్ఫురించునా? అనెడి సరేహాము కలుగవచ్చును. అట్టిదుండదని తెలిపెడి యుపదేశమిది కనుడి :

**గురు ప్రసాద చంద్రేణ నిష్కలంకేన చారుణా ।**
**యన్ మనః కుముదం నిత్యబోధితం తస్య కో భ్రమః ॥** (సి.శి. 19-18)

దీని భావమేమనగా నిష్కలంకమైనదియును, సౌందర్యమైనదియును, అయిన చంద్రుని వంటి గురుప్రసాదము చేత నెవ్వరి హృత్కమలము నిరంతరముగా వికసనమొందుచుండునో అట్టివారికి భేద భావపరమైన భ్రమయుండదు.

భేదభ్రాంతి యెంతో బలీయమైనది. ఇది జీవుని సంసారమున బంధించి వేయుచున్నది. జ్ఞాన ప్రకాశ ప్రసరణ జరిగిన వెంటనే భేదభ్రాంతి తొలగిపోవును. జీవ-శివులలో భేదము దోచదు. అభేద దృష్టి యేర్పడును. హృత్కమల వికాసము వలననే యిది సంభవమగును. తన్నిమిత్తమై గురూపదేశమెంతో అవశ్యమని గుర్తించవలెను. గురూపదేశరూపమున నుండెడి గురుకృపను వెన్నెలతో పోల్చిన యెడల ఆ వెన్నెల వలన వికసన మొందెడి కలువలతో హృత్ కమలమును పోల్చవచ్చును. ఈ విధముగా పరిపూర్ణమైన జ్ఞానము నొందిన శిక్షా పాదోదక స్థలియును భేదభ్రాంతిని వదలి శివాద్వైత జ్ఞానజన్యమైనట్టి యానందాను భూతిలో మునిగి యుండునని గ్రహించగలరు. సాధన పరిపక్వమైన దశలో నితడే జ్ఞాన పాదోదక స్థలమున ప్రవేశించునని తెలిసికొనగలరు. మీరెల్లరు శిక్షా పాదోదక స్థలములోని శివయోగి వలన స్ఫూర్తిని గొని మీ జీవితములను ధన్యమైనవిగా చేసికొనెదరుగాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యులవారు శిక్షాపాదోదకమనగా నేమిటి యనెడి దానిని వివరించి చెప్పిరి.

సాధనా క్రమములో శిక్షణకెంతో ప్రాముఖ్యత గలదనెడి విషయము జగద్విదితమైన విషయమే. శ్రీవారు నీ విషయముల నన్నింటి శిక్షాగురుస్థలమున వివరించి యుండిరి. శిక్షాగురుస్థలమొక లింగభక్త స్థలమనెడిది స్మరణీయము.

పూర్వోక్త స్థలమైన దీక్షాపాదోదక స్థలమున సాధకుడు పొందిన జ్ఞానమెట్టిదో మననము చేసికొనవలసియున్నది. మొదటగా వచ్చెడిదద్వైత జ్ఞానమే. శివ-జీవుల కభేదము తెల్పెడి యీ జ్ఞానము గురుశిష్యులిరువురిలోను నిండికొనియుండుననెడిది గ్రహించవలసిన విషయం. దీనినే శ్రీ భగవత్పాదులవారు "గురుశిష్య మయం జ్ఞానం" అని సూచించిరి. అయితే యీ జ్ఞానము దీక్షాయోపగతమైన జ్ఞానమని తెలుపబడినది. త్రివిధల దీక్షలవలన లభించిన జ్ఞానమే దీక్షాయోపగతమైన జ్ఞానము. గురూపదేశములోని 'తత్త్వమసి' అనెడి మహావాక్యముల వలన తాను శివుడనని గుర్తెరిగిన శివుడు భావాగమ స్థలమున "శివోహం" అనెడి భావమును పెంపొందించికొని అద్దాని నిరంతర మననము ద్వారా జ్ఞానాగమ సిద్ధిని పొందును.

దీక్షాయోపగతమైన జ్ఞానముతోబాటుగా శిష్యుడు పొందెడి జ్ఞానమ మరొక్కటి గలదు. అది శిక్షాయోపగతమైన జ్ఞానము. ఇదెట్టుల లభ్యమగునో యనెడి దానిని శ్రీ వారు శిక్షాగమ స్థలమున వివరించి చెప్పిరి. దీక్షా గురువే శిక్షాగురువై శిక్షణ నిచ్చుననెడిది తెలుపబడినది. సాధనాక్రమములో సాధకుడు స్వాధ్యాయనపరుడై శిక్షణ ద్వారా పొందిన జ్ఞానమునకు బలమును చేకూర్చికొని శాస్త్రాధ్యయన జన్య జ్ఞానమును గరిష్ఠమయమైన జ్ఞానమైయుండును. ఈ ఉభయ జ్ఞానముల కలయిక వలన గల్గినట్టి యానందానుభూతితో తేలియాడెడివాడే శిక్షా పాదోదక స్థలియని గుర్తించవలెను. ఉభయజ్ఞానముల కలయిక వలన శివాద్వైత భావము మరియు శివాద్వైత జ్ఞానము బలపడుననియును, తత్ఫలితముగా గురు-శిష్యుల సామరస్య భావనకు వినూత్నమైన పుష్టి లభించుననెడిది గుర్తించవలసిన విషయము.

ఈ స్థలమున శివయోగి పొందెడి యానందమునకు పరిధి యనెడిది యుండదు. ఈ ఆనందానుభూతి వలన గల్గెడి తృప్తి యెట్టిదనగా శివయోగి మరే యితర సుఖములును రుచించవు.

ఈ స్థాయిని పొందిన సాధకునికి శిక్షణతో పనియుండదు. అధ్యయనావశ్యకతయు నుండదు.

## ఆశీర్వచనము - 1 :

## జ్ఞాన పాదోదక స్థలము :

శ్రీ లింగషట్ స్థలముల గురించి సద్భక్తులు తెలిసికొనుచున్నారు. క్రితపు టాశీర్వచనమునందు శిక్షాపాదోదక స్థలము గురించి వివరించనైనది. ఈ స్థలమునందలి శివయోగి ప్రవేశించెడి తదుపరి స్థలమే జ్ఞాన పాదోదక స్థలము.

శివజ్ఞాన వితరణశీలియైన విశ్వగురువు శ్రీరేణుకాచార్య భగవత్పాదులవారు, శ్రీ అగస్త్యమునికీ స్థలము గురించి యీ విధముగా వివరించిరి.

**తదైక్యసంపదానంద జ్ఞానం జ్ఞానగురుర్మతః ।**
**తత్సామరస్యం శిష్యస్య జ్ఞానపాదోదకం విదుః ॥** (సి.శి. 19-19)

దీని భావమేమనగా పరాత్పరుని ఆనంద స్వరూపము యొక్క అపరోక్ష జ్ఞానము గలవాడే జ్ఞాన గురువు. ఇట్టి గురువు మరియు అతని శిష్యుని జ్ఞానములు సామరస్యమై యుండెడి స్థితినే జ్ఞాన పాదోదక స్థలమని యందురని గ్రహించగలరు.

వస్తుతః గురువొక్కడే యై యున్నను, అతని విభిన్నమైన వ్యవహారముల మూలకముగా నతనికి వేరే వేరే సంజ్ఞలు సంప్రాప్తమగుచున్నవి. దీక్షనిచ్చుటచేత దీక్షా గురువనియును, శిక్ష లేదా వుపదేశము నిచ్చుటచేత శిక్షాగురువనియును, తాననుభవించెడి జ్ఞానానుభవమును శిష్యులకు ప్రదానము చేయుటచేత జ్ఞాన గురువనియును బిలువబడుచున్నాడు. గురువునందున నెలకొనియున్న జ్ఞానము గురుపద వాచ్యమైయున్నది. అందుచేత నరయికనే గురువుని చెప్పుటను వినుచుందుము. ఆకార ప్రకారముల మూలకముగా గురువువలె వ్యవహరించుట మాత్రమున నొక వ్యక్తి వాస్తవముగా గురువుగా కాజాలడు. ఎవ్వరి హృదయమునందున ప్రజ్వరిల్లెడి జ్ఞానము స్థిరముగా నిలిచియుండునో అతడే గురుపదమునకు యోగ్యుడైనవాడని తెలిసికొనగలరు. శిష్యుల హృదయకుహరములో నెలకొనియుండెడి అజ్ఞానాంధకారమును తరిమివేసి, సుస్థిరమైన విజ్ఞాన ప్రకాశమును నెలయజేయు వాడే గురువని చెప్పబడుచున్నాడు. ఈ క్రింది శ్లోకము గమనార్హమైనదై యున్నది.

**అజ్ఞాన తిమిరాన్ధస్య జ్ఞానాంజనశలాకయా ।**
**చక్షురున్మీలితం యేన తస్మైశ్రీ గురవే నమః ॥**

దీని తాత్పర్యమేమనగా అజ్ఞానము వలన కన్నులు మూయబడి తద్వారా అంధత్వము ప్రాప్తించినవానికి జ్ఞానమనెడి కాటుక కర్రతో కళ్ళను తెరిపించెడి వాడెవ్వడో అట్టివాడైన శ్రీ గురువు కొరకు నమస్కారము.

పసిపాపలు కళ్ళుమూతలు పడినస్థితిలో బాధకు గురియగుటను గాంచగలము. శిష్యుని స్థితియు నిట్టిదే. అజ్ఞానవశమున భ్రమగల్గి భేదభ్రాంతి చేకూరును. తల్లి పాపకళ్ళను తెరిచి కాటుకనంటించి వెలుగును ప్రసాదించును. అదే విధిన గురువుగారు శిష్యుని కళ్ళను తెరిపించును. జ్ఞానబోధయే కాటుకకర్రగా నుపయోగింపబడును. అజ్ఞాన తిమిరము దొలగి సుజ్ఞానాగమనమైన దశలో శిష్యుడు ధన్యతను నొందును. ఇట్టి ధన్యతను ప్రదానము చేసెడి జ్ఞాననిధి లేనివారు గురుపదము నకు అనర్హులగుదురు. వేషధారణాదుల వలన గురుత్వము సంప్రాప్తము కాజాలదనెడిది గ్రహించవలసిన విషయము. జ్ఞాన పాదోదక స్థలమునందలి శివయోగి గురూపదేశము వలన లభ్యమైన జ్ఞానముచేత ధన్యతను బడసినవాడని తెలిసికొనగలరు.

ఆహారం, నిద్ర, మైథునమనెడి వ్యవహారములందరికిని సమానముగానే కనిపించుచుండును. జ్ఞానమూలకముగా మనుష్యుడు భిన్నముగా గోచరించును. ఆత్మ జ్ఞాన సంపన్నుడైతే యెంతో విలక్షణముగా నుండును. అతడు గురువు స్థానమున నుండి, తన శిష్యునికి జ్ఞానోపదేశమును చేసి, తనతో సమానమైన స్థాయికి కొనివచ్చును. గురుశిష్యుల మధ్య జ్ఞానమూలకముగా సమానస్థితి యేర్పచుననెడిదీ స్థలములోని కీలకాంశమని గ్రహించగలరు.

పూర్వోక్తమైన సామరస్యస్థితిని బడసిన శివయోగి యనుభవించెడి విలక్షణమైనట్టి యానందావస్థను వివరించుటకొరకు శ్రీ భగవత్పాదులవారనేకోదాహరణల నీ క్రింది విధముగా నిచ్చిరి :

**అవిద్యారాహునిర్ముక్తో జ్ఞానచంద్రః సునిర్మలః ।**
**ప్రకాశతే పరాకాశే పరానన్ద మహోద్యుతిః ॥**

**అజ్ఞానమేఘనిర్ముక్తః పూర్ణజ్ఞానసుధాకరః ।**
**ఆనన్దజలధేర్వృద్ధిమనుపశ్యన్ విభాసతే ॥**

**జ్ఞానచన్ద్రోదయే జాతే ధ్వస్తమోహతమోభరాః ।**
**పశ్యన్తి పరమాం కాష్ఠాం యోగినః సుఖ రూపిణీమ్ ॥** (సి.శి. 19 : 20–22)

ఉపదేశము యొక్క తాత్పర్యమేమనగా గ్రహణానంతరము రాహువుచేత ముక్తుడైన చంద్రుడు నత్యంత నిర్మలునిగను, ప్రకాశమానునిగను అయి వినీలాకాశమున వెలుగులు జిమ్ముచుండుటవలన అందరికి ఆనందము చేకూర్చబడుచున్నది. ఇదే విధముగా జ్ఞాన పాదోదక స్థలమునందలి శివయోగి యొక్క జ్ఞానమనెడి చంద్రుడు అవిద్య యనెడి రాహువునుండి విడువబడినదై నిర్మలమైన స్వరూపమును దాల్చి పరాకాశము నందున పరమానంద రూపమున ప్రకాశించుచుండును. ఈ శివయోగి నిరావరణమైనట్టి జ్ఞానానందము ననుభవించుచుండునని గ్రహించవలెను. ఈ ఆనంద పరాకాష్ఠ గురించి మరొక విధముగా చెప్పబడినది. మేఘావృతమై యుండెడి పున్నమి చంద్రుని వలన సముద్రముప్పొంగజాలదు. మేఘములనావృతమైన పిదప చంద్రుడు దేదీప్యమానముగా ప్రకాశించును. అట్టి పూర్ణచంద్రుని వలన సముద్రము వృద్ధిని గాంచగలదు. అదే విధముగా మేఘమువంటి అవిద్యచేత కప్పబడిన జ్ఞానచంద్రుని వలన శివయోగి కాత్మానందము చేకూరజాలదు. అవిద్య వైదొలగి జ్ఞానచంద్రుడు ప్రకాశించిన యెడల శివయోగి కాత్మానందము చేకూరును. జ్ఞాన పాదోదక స్థలమునందలి శివయోగి యిట్టి ఆనందానుభూతి ననుభవించుచుండునని గ్రహించవలెను. ఇతడీ ఆనందముననుభవించుచు దానిలో తల్లీనుడై యుండును. ఈ స్థితిలోనతనికి నాత్మ సాక్షాత్కారము యొక్క పూర్ణత్వము సిద్ధించును. ఈ విధముగా నుండెడి జ్ఞాన పాదోదక స్థలము నందలి శివయోగికి హాని శోకాదులుండవు. ఉపనిషత్తుకు చెందిన యీ క్రింది శాంతి మంత్ర మీ విషయమును విస్పష్టము చేసెడిదైయున్నది.

**ఓం పూర్ణమదః పూర్ణమిదం**
**పూర్ణాత్ పూర్ణముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావ శిష్యతే**

దీని భావమేమనగా పూర్ణమెప్పటికైనను పూర్ణావస్థను నొందజాలదు. సామాన్యముగా గణితశాస్త్రము ప్రకారముగా నొక అంకె యందు నింకొక అంకెను కూడినప్పుడు ఆ సంఖ్య హెచ్చుగా మారును. తీసివేత, గుణింతము, భాగహారముల వలన సంఖ్యలో మార్పు వచ్చుటను గమనించగలము. పూర్ణుడైన పరమాత్మ యందున యేమి చేసినను మార్పు గలుగదు. ఇచ్చట సున్నను నుదాహరణగా గైకొనవచ్చును. సున్నయందు నింకొక సున్నను కలిపినా, తీసివేసినా, గుణింతము చేసినా, భాగహారము చేసినా మార్పు కనిపించదు. సున్న మాత్రమే మిగిలియుండును. అదే విధముగా, ఆత్మజ్ఞానము పరిపూర్ణమైనదైయుండును. ఈ కారణముననే శ్రీ భగవత్పాదుల వారు పూర్ణచంద్రుని నుదహరించిరి. అయితే, చంద్రుడు పౌర్ణిమనాడు మాత్రమే పూర్ణుడుగా నుండును. ఆ పిదప తగ్గుచు నుండును. అమావాస్య పిదప హెచ్చుచుండును. ఇట్టి హెచ్చుట తగ్గుట లనెడివి జ్ఞానచంద్రుని కుండవు. సదా పూర్ణునిగనే యుండును. తత్ఫలితముగా జ్ఞాన పాదోదక స్థలమునందలి శివయోగి యొక్క ఆనందసాగరమెల్లప్పుడును వృద్ధి యందుననే నిలిచుండును. ఈ స్థితిలోనున్న శివయోగికి మోహాదులుండవని గ్రహించవలెను. చంద్రుని వెన్నెల చేత చీకటి పారద్రోలబడునటులే జ్ఞానచంద్రుని ప్రకాశము వలన మోహాదులు రూపుమాపబడునని తెలిసికొనవలెను.

సూర్యోదయమైన పిదప జనులందరు తమ తమ వ్యవహారములలో నిమగ్నులైయుండగా శివయోగినరస్త వ్యవహారియైయుండునని తెలుపబడినది. ఈ క్రింద నివ్వబడినట్టి యుపదేశమును గనుడి :

**మాయారజన్యా విరమే బోధసూర్యే ప్రకాశితే ।**
**నిరస్త సర్వవ్యాపారశ్చిత్రం స్వపితి సంయమీ ॥** (సి.శి. 19–23)

మాయ యనెడి తమస్సు దూరమైన స్థితియందున, బోధసూర్య ప్రకాశము దేదీప్యమానముగా నుండగా, శివయోగ సంయమి సర్వ వ్యవహారములను తిరస్కరించినవాడై పరమానందానుభవములో నిదురించుచుండును.

శివయోగి పగటిపూట నిదురించుటలో నాశ్చర్యము కన్పట్టవచ్చును. మాయామోహితుడైన వానికే జాగ్రుతవ్యవస్థలో సర్వమూ వాస్తవమని దోచును. అందుచేత నతడు వ్యవహారములలో నిమగ్నుడగును. మాయామోహమునకు గురికాని వానికి వ్యవహారములన్నియూ మిథ్యగా కన్పట్టును. ఈ కారణముననే యతడు చింతను వీడి చిదానందానుభూతి ననుభవించుచు సుషుప్తియందున నుండును. ఉపనిషదార్థులును, వేదాంతవాదులును నిట్టి భావమునే వెలిబుచ్చిరి. గీతాదులలో ప్రమాణములు గలవు. సామాన్యులు నిదురించెడి స్థితిలో యోగి జాగృదావస్థలో నుండుననియును, సామాన్యులు మేల్కొనునప్పుడు యోగి నిదురించుననియును చెప్పబడినది.

ఒకానొక కాలములో నొక యోగాశ్వరుడొక రాజుగారి కడకు బిక్షకై యేగెను. రాజుగారు యోగిని సగౌరవముగా నాహ్వానించి, సముచితోన్నతాసనమే మీద కూర్చుండబెట్టి పాదపూజాది సత్కారములను చేసెను. ఆ పిదప "ఓ యోగీశ్వరా! మీరు గొప్ప త్యాగగుణము గలవారు. ఈ సంసారపు టాశ, ఆమిషములను దొలగించి కొనినవారు. మీ అంతటి గొప్ప త్యాగమూర్తుల నెక్కడైననూ గాంచజాలము. మీ దర్శన భాగ్యము లభించుటచేత మేము ధన్యులమైతిమని యోగీశ్వరుని నుతించెను.

రాజుగారి వాక్కుల నాలించిన యోగి రాజునీ విధిన కుశలము గురించి ప్రశ్నించెను. "ఓయీ మహారాజా! నిత్య ప్రతినిత్యపు రాజ్యభార నిర్వహణా వ్యవహారముల యందున శివుని ధ్యానార్చనాదులను గొంత మేరకైనను చేయుచున్నారా? లేదా?" అప్పుడా రాజు "ఓ యోగి వృషభా! ఈ సాంసారిక వ్యవహారములయందున రాత్రింబవళ్ళు పరితపించెడి మాకు నీశ్వరుని ధ్యాన పూజాదుల నాచరించుట కొరకొక క్షణమైనను లభించుటలేదు. మేము మా దైనందిన వ్యవహారములయందున నిమగ్నులమైయుండుటచేత నీశ్వరార్చనాదుల నీశ్వరునికే వదిలి వేసితి" మనెను.

రాజుగారు మాట్లాడిన పిదప యోగి పుంగవులిట్లు చమత్కరించిరి. "ఓయీ రాజా! మీ మాటలను వినిన పిదప నాకొక్కటవగతమైనది. అదేమనగా, నీవంటి త్యాగధనులీ లోకమున నుండజాలరు. ఈ విషయమున నీవు కాకంటే నధికుడవు".

యోగి మాటలను వినిన రాజుకు సంభ్రమాశ్చర్యములు కల్గెను. "ఇదేమి స్వామీ! యీ విధముగా మాట్లాడుచున్నారు. మీకంటెను నేనెటుల గొప్పవాడిని?" అని ప్రశ్నించెను. యోగీశ్వరుడు చిరునవ్వును చిలికించుచు "ఓయీ మహారాజా! అదెట్లులో చెప్పెదను వినుము. గొప్ప వస్తువులను లేదా విషయములను విడిచినవారు గొప్ప త్యాగధనులు కాగా చిరు సరుకులను వదలిన వారు చిన్నవారు కదా! సాంసారిక వ్యవహారములకంటెను భగవంతుడు గొప్పవాడే కదా! నేను సాంసారిక వ్యవహారములను మాత్రమే త్యాగము చేసితిని. నీవు భగవంతుని వదలి వేసితివి. అందుచేత మీ త్యాగమే గొప్ప"దని వ్యంగ్యముగా తెలిపెను. రాజుగారు సిగ్గుతో తలను వంచికొనిరి. తన తప్పును తాను తెలిసికొనిరి.

లౌకికులు రాజువలె పారమార్థిక వ్యవహారములను వదలి లౌకిక వ్యవహారముల నిర్వహణలో నిమగ్నుడైయుండును. జ్ఞాన పాదోదక స్థలి, తద్విరుద్ధముగా వ్యవహరించును. లౌకిక వ్యవహారములయందున నిర్లిప్తుడై యుండును. పారమార్థిక వ్యవహారములను చేపట్టి వాటిలో పూర్ణమగ్నత నొందును. మరో మాటలో చెప్పవలెననిన యితడు లౌకికము గురించి యుదాసీనవైఖరి నవలంభించుచుండును.

అనాద్య విద్య విచ్ఛిన్నమై పోయెడి దశలో నుండెడి శివయోగియొక్క లక్షణము గురించి శ్రీ భగవత్పాదుల వారీ క్రిందివిధముగా నుపదేశించిరి:

**అనాద్యవిద్యా విచ్ఛిత్తివేలాయాం పరయోగినః ।**
**ప్రకాశతే పరానందః ప్రపంచేన వినాకృతః ॥**
**నిత్యానన్దే నిజాకారే విమలే పరతేజసి ।**
**విలీన చేతసాం పుంసాం కుతో విశ్వవికల్పనా ॥** (సి.శి. 19 :24-25)

ఉపదేశపు తాత్పర్యమేమనగా అనాదిదైన యవిద్య యెప్పుడైతే నివృత్తి యగునో అప్పుడీ శివయోగికి నుపాధిరూపమైన ప్రపంచముడగిపోయి నిరుపాధికమైనట్టి యానందానుభూతి గల్గును. ఈ ఆనందము నిర్విషయకమైనట్టి నిర్మలమైన పరిశుద్ధానందమని తెలిసికొనగలరు. నిత్యము, ఆనందరూపము నయిన స్వీయ స్వరూపము నందున విలీనమైనట్టి శివయోగికి సాంసారిక కల్పనలుండవు.

ఈ స్థలమునందలి శివయోగి యనుభవించెడి యానందము నిరుపమానమైనదని తెలుపబడినది. ఈ క్రింది యుపదేశమును గనుడి :

**కుతో బ్రహ్మా కుతో విష్ణుః కుతో రుద్రః కుతో రవిః ।**
**సాక్షాత్కృత పరానన్దజ్యోతిషః సామ్యకల్పనా ॥**
**అపరోక్షపరానన్ద విరీనస్య మహాత్మనః ।**
**బ్రహ్మవిష్ణాదయో దేవా విశేషాః సుఖబిన్దవః ॥**
**యన్మాత్ర సహితంలోకే వాఞ్ఛన్తి విషయం నరాః ॥** (సి.శి. 19 : 26-28)
**తదప్రమేయ మానందం పరం కొ న వాంచలి**

ఈ శ్లోకముల తాత్పర్యమేమనగా జ్ఞాన పాదోదక సంపన్నుడైన శివయోగికి బ్రహ్మవిష్ణ్వాదులు సమానులు కారు. ఇద్దానికి గల కారణమేమనగా "ఆస్యై వానందస్యాన్యాని భూతాని మాత్రా ఉపజీవన్తి" అనెడి వచనము ప్రకారముగా నల్పములై యుండును. మరో విధముగా చెప్పవలెననిన బ్రహ్మ విష్ణ్వాదుల పదవుల స్థితి కంటెను స్వస్వరూపస్థితి యాధిక్యత గల్గినదైయుండును. ఆత్మ స్వరూపమైనట్టి యపరోక్షానందము ననుభవించెడి శివయోగికి బ్రహ్మాదులుననుభవించెడి సుఖమల్పమైనదై కన్పట్టును. ఒక నీటి బిందువుకు సమానమైనదిగా దోచును. అఖండమైనట్టిదియును, అపరిమితమైనట్టిదియును అయిన ఆత్మానందముతో పరిమితమైనట్టి ఖండితమైనట్టి విషయ జన్యమైనట్టి సుఖము సరి సమానము కాజాలవు. లోకులనుభవించెడి సుఖమత్యంత అల్పమైనదని గ్రహించవలెను. జగత్తులోని ప్రతిజీవియును తమ తమ సుఖములనపేక్షించుచుండును. తనకు దొరకెడి సుఖము నెన్నటికైనను చేజారిపోకూడదనెడి యభిలాష ప్రతియొక్కరికిని యుండును. శబ్ద స్పర్శాదులు ప్రాప్తమైనప్పుడు సుఖముననుభవించును. విషయాదులతనిని వీడి చనినప్పుడు చింతాక్రాంత మనస్కుడై దుఃఖానుభూతిని పొందును. అంతేకాదు, అతడే విషయముచేత సుఖినైతిననుభావము యొక్క ప్రాప్తిని పొందునో అదే విషయమతని దుఃఖమునకు కారణభూతమైనట్టి యంశము కాగలదు. వీటన్నింటిని పరిశీలించిన పిదప తెలిసెడిదేమనగా సుఖము విషయ సంచయమందున నుండదు. ఎప్పుడైతే యింద్రియము మరియు విషయముల సంయోగమేర్పడునో అప్పుడు మనస్సు సుస్థిరమైన దగును. దానియందున సుఖరూపమైనట్టి ప్రతిబింబము పడినప్పుడు జీవికి సుఖానుభూతి కలుగుచున్నది. అయితే, అజ్ఞునికిది యవగతము కాదు. ఇది విషయజన్యమైన సుఖమేయని భావించి, ఆ భ్రాంతి వివేక సంపన్నులీ విషయము నెరిగిన వారై విషయాభిముఖులగుట కంటెను ఆత్మాభిముఖులగుటయే మంచిదనెడి భావమును పొందుదురు. ఆత్మానందము ననుభవించుటకు యనుభవింతురు. "విశ్వం పరమాత్మనః సుఖేనానుమోదతే" యని చెప్పబడినది. శివయోగి శివాచార్యులవారు చేసిన శివస్తుతి యందున నిట్టి భావమును గాంచగలము. ఆత్మానందమే పరమాత్మ రూపము కదా! జ్ఞాన పాదోదక స్థలములోని శివయోగి సదా ఆత్మానందమును మాత్రమే యనుభవించునని యెరుగవలెను. మీరందరీ శివయోగి వైఖరి వలన స్ఫూర్తిని పొందుదురుగాక. ఆత్మానందము ననుభవించుటకై ప్రయత్నింతురు గావుత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జ్ఞాన సింహాసనాధీశ్వరులైనట్టి జగద్గురువులు చంద్రశేఖర శివచార్యుల వారు కటాక్షించిన జ్ఞాన పాదోదకము గురించిన ఆశీర్వచనము ఆనందదాయకమైయున్నది.

ఆనందభక్తికి నిలయమైన శరణ స్థలమున సాధకుడు సతి-పతి న్యాయమున సాన్నిహిత్యమును కోరుకొనును.

శిక్షాపాదోదక సంపన్నుడైనట్టి సాధకుడు సంపాదించిన జ్ఞాన మనంతమైనదై యుండును. ప్రాథమిక దశలోన యీ జ్ఞానము జ్ఞానగురువు చేత ప్రదానము చేయబడును. శివ-జీవ-జగత్తుల యభేదమే యిట్టి జ్ఞానము యొక్క కేంద్రాంశమైయుండును. భక్తాది స్థలములలో సాధకుడు శ్రద్ధాది భక్తాచరణల వలనను, స్వానుభవాంచిత సన్మార్గముల వలనను, గురు-లింగ-జంగమ-సద్భావాన్విత సద్భక్తుల సాంగత్యమువలనను నెంతో జ్ఞానలబ్ధిని పొందును. భూమ్యాది సదాశివతత్త్వముల నధిగమించి శక్తి తత్త్వములో ప్రకాశించెడి దశయే శరణస్థలము. శరణునికి భూషణమైయుండెడి భక్తియు శక్తియే.

భక్తి శక్తియై తన యదార్థస్థితిని చేరిన దశలో శివునితో నవినాభావ సంబంధముగల శక్తి వలెనే సాధకుడు శివునితో నవినాభావ సంబంధము గల్గియుండుటకు కృషి చేయును. చిత్స్వరూపియైన శివునిలో చేరి అపరోక్షానుభూతి ద్వారా నానందము నాస్వాదించెడి దశలో శివునిలోని జ్ఞాన ప్రకాశము సాధకుని భక్తి చైతన్యము నేకీకృతమైపోవును. ఇట్టి స్థితిలో శిక్షా పాదోదక స్థలి జ్ఞాన పాదోదక స్థలిగా రూపొందును. శివునికి అర్ధాంగియై శివునిలోని చిదానందము ననుభవించుచుండును.

శరణ స్థలము శుద్ధతత్త్వమైన శక్తి తత్త్వమునకు ననుబంధముగా నుండెడిది కాగా బ్రహ్మ విష్ణ్వాదులు మిశ్రతత్త్వములకు చెందినవారు. అందుచేత శరణుడీ స్థలముల కతీతముగా నుండెడి వాడని గ్రహించవలెను. ఈ కారణముననే శ్రీ భగవత్పాదులవారు "కుతో బ్రహ్మ కుతో విష్ణు కుతో రుద్రః " అని ప్రశ్నించిరి. రవి పంచభూత తత్త్వములకు చెందిన వాడైనందున యశుద్ధ తత్త్వమునకు చెందిన వాడగును. చంద్రాగ్నులును నట్టివారే. ఈ వాస్తవము నేపథ్యమున అష్టమూర్తి వాదన నిరసనను పరిశీలింపవలెను. శరణున్న స్థితిలో శివుని మినహాయిస్తే మరెవ్వరూ వుండరనెడిది గ్రహించవలసిన విషయము.

శరణుడు జగద్వ్యాపారములను మరచిచరించుననెడిది గుర్తించవలసిన విషయము.

**తెరన నరివుదు అపూర్వ**
**అరెదు మరెవుదు అపూర్వ**
**కూడె శరణెంబుదు అపూర్వ**
**కూడల సంగమదేవన**
**భక్తి జవ్వన దంతె** (శ్రీ బసవేశ్వర వచనము. 866)

దీని తెలుగు రూపమును గనుడి :

తెరవు నరయుట యపూర్వము
ఎరిగి మరచుట యపూర్వము
కూడా శరణనుట యపూర్వము
కూడల సంగమదేవుని భక్తి
అభిమాని యొక్క యవ్వనము వంటిది

తెరవు నరయుట యనెడిది జ్ఞాన పాదోదక స్థలి పొందిన జ్ఞానము గురించి తెలుపగా, ఎరిగి మరచుట యనెడిది ప్రాపంచిక విషయముల మరపును సూచించుచున్నది. ఈ మరపు వల్లనే శరణుడు లోక విరుద్ధమైన రీతిలో నిద్రాదుల ననుభవించునని తెలిసికొనగలరు.

సతీ-పతులు యవ్వనదశలో పొందెడి యానంద మపూర్వమైనదైయుండును. జ్ఞాన పాదోదక స్థలి జ్ఞానోపగతమైన యద్వైతానుభూతి, అపరోక్ష జ్ఞానానుభవస్ఫూర్తి యిత్యాదుల వలన గల్గెడి యానందము అపూర్వమైనదనీ గ్రహించవలెను.

శివ శరణుడు నీ స్థలమున లోకాచారము ననుసరించడనెడి శ్రీ భగవత్పాదుల భావన గమనార్హమైయున్నది. ఈ భావనకొక రూపమునిచ్చిన యీ పద్యమును గమనించుడి :

**లోకము నందు బుట్టియును లోకవిరుద్ధుల నంత జీవన**
**వ్యాకుల చిత్తులయ్యునధనార్థుల నారతధర్మ సత్క్రియా**
**నీక సమేతులయ్యు ఫలనిష్క్రియు లంగవిధేయులయ్యుదూ**
**రీకృత దుర్మదేంద్రియ చరిత్రులు జాణలు భక్తులల్భురే?** (అనుభవసారము, 204)

జ్ఞాన పాదోదక స్థలమునందలి శివయోగులు లోకవిరుద్ధ చరిత్ర సనాధులనెడిది గుర్తించవలసిన విషయము. లోకము నిదురించెడి తరుణమున నిదురించుటను మాని లోకము మేల్కొనిన యప్పుడు తాను నిదురించుదానిని లోకవిరుద్ధ చర్యగా తీసికొనవచ్చును. అయితే కాయేంద్రియమనో వికారముల వీడి చరించెడి జ్ఞాన పాదోదక స్థలికి నిద్రాస్థితియుండునా? అందుచేత, మనము తెలిసికొనవలసిన దేమనగా నతడు కనులు మూసికొని ధ్యానయోగము ద్వారా శివుని సన్నిధిన యతని సాంగత్య సంగమ సుఖముననుభవించుస్థితిలో నతడు లోకులకు నిద్రలో నున్నవానివలె గోచరించుననెడిదే స్వీకరించవలసిన విషయము.

"శుభం భూయాత్"

## ఆశీర్వచనము - 1 :

## క్రియా నిష్పత్తి స్థలము :

త్రిమూర్తులనుభవించెడి యానందము కంటెనధికమైనట్టి యానందమును ననుభవించెడివాడు జ్ఞానపాదోదక స్థలమునందలి శివయోగియని క్రిందటి యాశీర్వచనమునందున చెప్పబడిన యంశము స్మరణీయము. ఈ శివయోగి జ్ఞాన పాదోదక స్థలమునందున తన సాధనను సంపన్నము చేసికొనిన పిదప లింగషట్ స్థలములలో నొక్కటైనదియును, అయిన శరణ స్థలము యొక్క అవాంత భేదమైనట్టి క్రియా నిష్పత్తి స్థలమున ప్రవేశించును. క్రియా నిష్పత్తి యనగా క్రియల యొక్క పరిపూర్ణత లేదా పరిపక్వతయని గ్రహించవలెను.

శ్రీ రేణుకాచార్య భగవత్పాదులవారీ స్థలము గురించి యీ క్రింది విధముగా నుపదేశము నిచ్చిరి :

**పరకాయే క్రియాపత్తిః కల్పితైవ ప్రకాశతే ।**
**రజ్జౌ భుజఙ్గవద్ యస్మాత్ క్రియా నిష్పత్తి మానయమ్ ॥** (సి.శి. 19-29)

దీని తాత్పర్యమేమనగా జ్ఞాన పాదోదక సంపన్నుడైన శివయోగి శాస్త్ర విహితమైన కర్మలను చేసినను వాటి ఫలమతనిని బంధింపజాలవు. చూచుటకవి కర్మవలె దోచినా, అవి ఫలము నిచ్చుటలో లుప్తమైనసమర్థతల గలవిగా అగుచున్నవి. ఏ విధముగా పగ్గము సర్పముగా తోచినను, సర్పమువంటి ఫలము నివ్వజాలదో, శివయోగి చేసిన కర్మవలన క్రియాఫలము లభించదు. కర్మల కల్పితమైనదగుచున్నది. "అస్తేదగ్ధపట న్యాయాత్ క్రియామాత్రం హి న క్రియా" అనెడి వీరాగమ వచనమీ విషయము స్పష్టము చేయుచున్నది. దగ్ధమైన పటలము చూచెడి వారికి మడతపెట్టబడిన వస్త్రమువలె దోచినా, కట్టుకొనుటకు పనికిరాదు. శివయోగి చేసెడి కర్మ దగ్ధ పటలము వలె యోగిని సంసారమున బంధించి పడద్రోయుటలో నసమర్థమైనదై యుండునని గ్రహించగలరు.

ఈ స్థలములోని జ్ఞాన సంపన్నుడైన శివయోగి, కర్మల నాచరించిననూ అతనికి పునర్జన్మ యనెడి దుండదని శ్రీ భగవత్పాదుల వారుపదేశించిరి. ఉపదేశమును గనుడి :

**జ్ఞానినామ్ యాని కర్మాణి తాని నో జన్మహేతవః ।**
**అగ్నిదగ్ధాని బీజాని యథా నాఙ్కురకారణమ్ ॥** (సి.శి. 19-30)

దీని తాత్పర్యమేమనగా నేవిధముగా కాల్చబడిన బీజములు నంకురములకు గారణము కాజాలవో అదేవిధముగా జ్ఞానియైన శివయోగివంటి వారి కర్మలు జన్మకొరకు హేతువులు కాజాలవు.

జీవి తానే చేసిన శుభాశుభ కర్మల కారణమున భూతలమున జన్మించుచున్న విషయము సర్వజన విదితమే. ప్రారబ్ద కర్మ నవశ్యముగా ననుభవించవలసి యుండును. ఈ కర్మననుభవించే క్రమములో సంచితాగామి కర్మల నాచరించుట సంభవించును. నియ్యవి పునర్జన్మను కల్గించుచున్నవి. "పునరపి జననం - పునరపి మరణం" అనెడి సూక్తి యీ విధముగా వాస్తవరూపమును దాల్చుచున్నది. కోట్లాది జీవుల స్థితి యిట్టిది కాగా నసామాన్యుడై శరణుని స్థితి దీనికంటెను భిన్నముగా నుండునని గ్రహించవలెను. ఈ కారణముననే "వేయికొక్క సత్యసంధుడు, లక్షకొక్క భక్తుడు కోటికొక్క జీవన్ముక్తుడైన శరణు"డనెడి శివశరణుల వాక్కులు విఖ్యాతి సంతరించికొనినవి. జ్ఞానాగ్ని చేత దగ్ధము చేయబడిన శివయోగి చేసిన కర్మలు పునర్జన్మను కల్గింపజాలవు. ఈ విషయము విశదీకరించుటకై దగ్ధబీజము లుదహరింపబడినవి. వీటి భూమియందున నాటినచో నయ్యవి మొలకలుగా కాజావలనెడిదందరికిని తెలిసిన విషయమే.

జ్ఞానియైనట్టి క్రియానిష్పత్తి స్థలము నందలి శివయోగి చేత చేయబడిన కర్మలు ప్రయోజన శూన్యములైపోవునని చెప్పబడినది. ఉపదేశమిది:

**కర్మణా కిం కృతేనాపి జ్ఞానినో నిరహంకృతేః ।**
**విక్రియా ప్రతిబింబస్థా కిం కరోతి హిమద్యుతేః ॥** (సి.శి. 19-31)

దీని తాత్పర్యమేమనగా చంద్రుని ప్రతిబింబమునకు గల్గెడి వికారాదులు చంద్రబింబములో దోచవు. అదే విధముగా మూలాహంకార రహితుడైన శివయోగి చేసెడి కర్మలతనికి యెట్టి ఫలమునైన నివ్వజాలవు.

జలదర్పణాది యుపాధుల యందున చంద్రుని ప్రతిబింబమును స్పష్టముగా చూడవచ్చును. ప్రతిబింబమునకు కారణభూతమైనట్టి యుపాధిలో నేవైన వికారాదులు గల్గినప్పుడు చంద్రబింబమా వికారాదుల చేత వైకల్యమును పొందవచ్చును. కాని, యుపాధిలో గల్గెడి వికారములు చంద్రునికి వికారములను గల్గింపజాలునే? మూలాహంకార శూన్యుడైన శివయోగికి కర్మలవలన బంధము లేర్పడజాలవు. "అహం కరోమి" యనెడి కర్తృత్వాభిమానము గల్గినప్పుడే కర్మము బంధనకారి కాగలదు. కర్తృత్వాభిమానము లుప్తమైనస్థితిలో శివయోగి చేసెడి కర్మలు బంధన కారణములు కాజాలక నిర్వీర్య నిర్లిప్త లక్షణములను సంతరించికొనును. "అహంకార విమూఢాత్మా కర్తాహమితి మన్యతే" యనెడి వ్యాసోక్తి ప్రకారముగా నహంకారము చేత మోహితుడైనట్టి యంతఃకరణము కలుషితమగును. తాను కర్తననెడి భావమును పొందెడి యితడు కర్మల చేత బంధితుడై జనన మరణములకు లోనగును. ప్రకృతి యొక్క ధర్మమున కనుగుణముగా కర్మలిట్టి విధిన ప్రవర్తించును. అహంకారికీ విషయము గురించిన పరిజ్ఞానముండదు. అందుచేత, నంతఃకరణము యొక్క ధర్మములైనట్టి "అహంకర్త – అహం భోక్తా" యని పలుకుచు, కర్మబంధములలో చిక్కికొని ఒడలుచున్నారు. ఆత్మజ్ఞానియైన శివయోగి అహంకారమునకు దూరముగా నుండి, ప్రకృతి వలన నయ్యెడి వ్యవహారములన్నింటికిని తాను సాక్షీభూతుడనని భావించికొనును. ఈ కారణముననే యితని మీద కర్మఫలము యొక్క ప్రభావముండజాలదు. ఇద్దాని తెలియజెప్పుటకే యుపాధిలోని వికారముల వలన తన బింబమునకు దోషము లబ్బినను, తాను మాత్రము వాటి నుండి నిర్లిప్తుడై దేదీప్యమానముగా ప్రకాశించెడి పూర్ణచంద్రుని గురించిన దృష్టాంతము నిచ్చిరి.

జ్ఞానికిని, అతడాచరించెడి క్రియలకు గల సంబంధము కల్పితమైనదని తెలుపుచు, శ్రీ భగవత్పాదుల వారీ విధిన నుపదేశించిరి :

**చంద్రస్య మేఘసంబంధాద్ యథా గమనకల్పనా ।**
**తథా దేహస్య సంబంధాదారోప్యా క్రియాత్మనః ॥** (సి.శి. 19-32)

దీని తాత్పర్యమేమనగా, చంద్రునికిని మేఘములకు సంబంధమైనప్పుడు, చంద్రుడు కదలుచున్నట్లు దోచును. వాస్తవముగా మేఘములే అటు ఇటు తిరుగాడుచుండును. అదే విధముగా జ్ఞానికిని, అతని కర్మలకు గల సంబంధము కల్పితమే. కర్మల వలన జ్ఞానికి యెట్టి సంబంధము కలుగదు. సంబంధము గలదని దోచెడి భావన కల్పితమైనదని గుర్తించగలరు.

నిశ్చలమైన వస్తువు యొక్క సాన్నిధ్యము నందున చలాయమానమైన వస్తువు వచ్చినప్పుడు నిశ్చలమైన వస్తువు చలాయమానమైనదిగా కనిపించును. రైలు వేగముగా పయనించునప్పుడు, రైలులో కూర్చుని యున్నవానికి చెట్లు–పుట్టలు వ్యతిరేకమైన దిశవైపు పరువెత్తునట్లు దోచుట సర్వ సాధారణమైన విషయమే. ఒక వ్యక్తి నిలిచియున్న రైలుబండిలో కూర్చుండియున్నప్పుడు ప్రక్కనే యుండియున్న పట్టాలమీద మరొకరైలు వేగముగా పయనించుచున్నప్పుడు నిలిచియున్నది కదలిపోవుచున్నదా యనెడి భ్రాంతి కల్గును. ఇచ్చట గ్రహించవలసిన విషయమేమనగా శివయోగి క్రియలు చేయుచున్నటుల దోచినను అవి చలనశీలత గల్గిన కాయము యొక్క వికారముగా కన్పట్టినను, వాస్తవముగా నతని ఆత్మ నిశ్చలమైనదిగాను, నిర్వికారమైనదిగాను కన్పట్టును. ఇద్దాని సర్వజన విదితము చేయుటకే శ్రీ భగవత్పాదులవారు నిశ్చలమైన చంద్రుని నుదహరించిరని తెలిసికొనవలెను. ఈ విషయమును విశదీకరించుటకై శ్రీ భగవత్పాదులవారు మరొక యుదాహరణ నొసంగిరి. గమనించుడి:

**జ్ఞానీ కర్మనిరూఢోఽపి లిప్యతే న క్రియాఫలైః ।**
**ఘృతాదినా యథా జిహ్వా భోక్త్రీ చాపి న లిప్యతే ॥** (సి.శి. 19-32)

దీని తాత్పర్యమేమనగా నే విధముగా నొక వ్యక్తి ఘృతము సేవించినగా నయ్యది యతని నాలుక నంటికొని యుండదో, అదే విధముగా జ్ఞాని కర్మనిరూఢుడైనను కర్మఫలములతని నంటికొని యుండజాలవు. కర్మఫలమునుండి విముక్తుడై విరాజిల్లునని గ్రహించగలరు.

వైరాగ్య భావములు గలవారీ యంశమును నొక్కి చెప్పుటను గాంచగలము. జగత్తున జీవించెడి వాడు సంసారమునుండియులిప్తుడై యుండవలెనని చెప్పబడినది. "మెక్కి యుపవాసి – బలిసి బ్రహ్మచారి" యనెడి లోకోక్తులిట్టివే. జ్ఞానుల నుద్దేశించి చెప్పబడినవే. "బ్రతికి బ్రహ్మచారి" యనెడి లోకోక్తియు గలదు. "జగ్మే యూ రహో జైసి రసనా ముఖమాహీ" యనెడి హిందీ కవి యుద్బోధ యీ విషయమునే సూచించుచున్నది. ఈ

విషయమింకను వివరముగా తెలిపెడి కథ యొక్కటి కలదు.

ఒకానొక సమయముననొక సాధ్వి దూర్వాస మహర్షికి భోజనమిడుటకై పక్వాన్నములను గైకొని బయలుదేరి వెడలెను ఋషి నదికి నావలివొడ్డున నుండెను. నదియు నుప్పొంగి ప్రవహించుచుండెను. ఆమె చింతాక్రాంతురాలై నిలిచియుండెను. కాలయాపన వలన ఋషికి కష్టము కల్గునేమో యని బాధపడుచుండెను. అప్పుడే అక్కడికి శ్రీకృష్ణుడు వచ్చెను. ఆమె తన సమస్యను కృష్ణునికి నివేదించి తరుణోపాయమునడిగెను. అప్పుడతడు "ఓ సాధ్వీమణీ! నదీతీరమున నిలిచి శ్రీకృష్ణుడు బ్రతికి బ్రహ్మచారి"యని గట్టిగా పలుకుము. నది నీకు దారి వదలెననెను. ఆమెకీ మాట నమ్మశక్యము కాలేదు. ఎనమండుగురు భార్యలు, వేలాది గోపికలు గల్గిన యితడు బ్రహ్మచారి యెట్లగునని యాలోచించదొడంగెను. ఆమె మానసికస్థితిని కనిపెట్టిన శ్రీకృష్ణుడు "సందేహించకుమమ్మా! నీ కోరిక తీరును పొమ్ము!"యని సెలవిచ్చిరి. ఆమె యతని సలహా నాచరణలో పెట్టెను. ఆశ్చర్యకరముగా నదీ మధ్యమునుండి దారి యేర్పడెను. ఆమె సునాయాసముగా నదిని దాటెను. దూర్వాసులవారికి యుచితరీతిన భోజనాది సత్కారములను చేసి, నమస్కరించి సెలవును గైకొనెను. నదీ తీరమునకు రాగానే నది యెప్పటివలె యుప్పొంగి ప్రవహించుచుండెను. కృష్ణుడు చెప్పిన వాక్కులు నుడివెను. దారి యేర్పడలేదు. ఆమెకేమియును దోచకుండెను. ఋషివద్ద జరిగిన విషయములగురించి వివరముగా తెలిపెను. "మాహేశ్వరుల సత్కరించెడి మహాసాధ్వీ చింతింపవలదు. నదీ తీరమునకు వెడలి "దూర్వాసులవారు తినియు నుపవాసి"యని గట్టిగా అనుమనెను. ఇదేమి చోద్యము. ఇప్పుడే భుజించియు తానుపవాసిననుచున్నాడని యతివ యచ్చెరువొందెను. అయినా ఋషి చెప్పినది చేసి సఫలమనోరథురాలయ్యెను. నదిని దాటి వచ్చెను.

ఇచ్చట గ్రహించవలసిన దేమనగా నలిప భావనతో భోగించెడి జ్ఞాని భోగించినా భోగముచేత కళంకితుడు కాడు. పున్నమి నెలవలె నెలయుచుండును.

**నిరస్తోపాధి సంబంధే జీవే యాయాక్రియాస్థితిః ।**
**సాసా ప్రతీతిమాత్రేణ నిష్ఫలా చాత్రలీయతే ॥** (సి.శి. 19-34)

దీని భావమేమనగా శివయోగి వీడబడిన యుపాధి సంబంధము గలవాడైనందున నతడు చేసెడి క్రియలు నిష్ఫలములైపోవును. ఇచ్చట యుపాధియనగా శరీరేంద్రియాదులని భావించవలెను. అహంకార-మమకారములు లుప్తమైనందుననే నిరస్త్యుపాధి సంబంధము గల్గునని తెలిసికొనగలరు. జలతత్త్వము వలన నాలుకకు జిడ్డు అంటుటలేదు. అదే విధము లుప్తమైన యహంకార మమకారములు గల స్థితివలన కర్మలు జ్ఞానినంటుట లేదు.

అయితే జ్ఞానికి కర్మఫలమంటదని చెప్పబడుచున్నది. అతనికి కర్మలుండవని యెందుకు చెప్పబడుట లేదనెడి సందేహము కలుగవచ్చును. ఇట్టిస్థితిలో నీ క్రింది యుపదేశము దర్శనీయమైనది.

**గచ్ఛన్ తిష్ఠన్ స్వపను వాపి న నిష్కర్మాస్తి కకన్ ।**
**స్వభావో దేహినాం కర్మ జ్ఞానినాం తత్తు నిష్ఫలమ్ ॥** (సి.శి. 19-35)

దీని తాత్పర్యమేమనగా మనము నివసించెడి భూమిని కర్మభూమి యని పిలుతురు. ఇచ్చట వసించెడి వారందరు కర్మను చేయవలసి యుండును. పోవుట, వచ్చుట, నిలుచుట, పరుండుట వంటి వ్యవహారములన్నియును కర్మలే. అందుచేత "కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిక్షేత్ శతం సమాః" (ఈసావాస్యోపనిషత్తు) అనెడి వాక్కుల వలన కర్మచేయుట అనివార్యమని తెలియుచున్నది. దేహమున్నంత వరకు కర్మను చేయవలయును. ఏమియు చేయకుండా కూర్చుండుటయును కర్మయే. అయితే సామాన్యుడీ కర్మలనే చేసి వాటిచేత బంధితుడగును. అహంకార-మమకార రాహిత్యము గల్గిన శివయోగియు కర్మలను చేసి యతనికా కర్మలంటవని గ్రహించవలెను.

ఈ స్థలము గురించిన చివరి యుపదేశమీ క్రింద నివ్వనైనది :

**పరిపూర్ణ మహానన్ద భావినః శుద్ధ చేతసః ।**
**న భవేత్ కర్మకార్పణ్యం నానాభోగఫలప్రదమ్ ॥** (సి.శి. 19-36)

దీనిలోని భావమేమనగా, పరిపూర్ణమైనట్టిదియును, మహానందమయమైనట్టిదియునై భావముగల్గి, పరిశుద్ధ చేతస్కుడై తిరుగాడెడి శివయోగికి నానా విధములైన భోగములకు కారణభూతమైనట్టి కర్మలవలన పీడన యుండదు.

శివయోగి విహితావిహిత కర్మలనుగాని, నిషిద్ధానిషిద్ధ కర్మలను గాని సల్పినను నతని పుణ్యముగాని పాపముగాని ప్రాప్తించదు. అహంకార-మమకారములు లేని పరిశుద్ధమైన చిత్తము గలవాడగుటచేత నీ పరిణామము సంభవించుచున్నది. ఈ విధముగా క్రియానిష్పత్తి స్థలి కర్మయోగి యగుచున్నాడు. "యోగః కర్మ సుకౌశలం" అని చెప్పబడినది. శివయోగి వలె కర్మనాచరించియు కర్మఫలమును త్యజించెడిదొక నైపుణ్యముతో కూడిన కళ. సామాన్యులకీ కళ దుర్లభమే. యోగులకును, జ్ఞానులకు నీ నైపుణ్యము సుసాధ్యమైయుండును. శ్రీరేణుక భగవత్పాదుల వారీ స్థలమున కర్మల స్వభావమును, కర్మల చేసెడి పద్ధతుల నుద్బోధించిరి. మీరీ బోధ వలన యితోధికమైన లబ్ధిని పొంది కర్మయోగ మార్గము పయనింతురు గావుత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులవారు నీ స్థలము గురించి తెలుపుచు క్రియా నిష్పత్తి స్థలములోని సాధకుడు భవమును జయించిన వాడగునని తెలిపిరి.

భవమనెడిది కర్మలవలన గలుగుచున్నది. జీవుడు కర్మలను చేయకుండగ నుండజాలడు. కర్మనిష్పత్తి గల్గి, దానిచేత పుణ్యపాపములలో నేదో యొకటి ప్రాప్తించునని కర్మవాదుల వలన తెలియుచున్నది. ఇచ్చట నిష్పత్తి యనెడిది ఫలించుట యనెడి అర్థములోన నుపయోగింపబడినది.

వీరశైవ పరిభాషలోన నిష్పత్తి యనెడి దానినొక విశిష్టమైన అర్థములోన ప్రయోగింపబడుచున్నదని గ్రహించగలరు. ఈ విషయమును వివరించెడి క్రింది వచనమును గనుడి :

**భక్తియెంబ పృథ్వియమేలె**
**గురువెంబ బీజవంకురిసి,**
**లింగవెంబ ఎలెయాయిత్తు**
**లింగవెంబ ఎలెయమేలె**
**విచారవెంబ హూవాయిత్తు**
**ఆచారవెంబ కాయాయిత్తు**
**నిష్పత్తి ఎంబ హణ్ణాయిత్తు**
**నిష్పత్తి ఎంబ హణ్ణు తొట్టు బిట్టు**
**కళచి బీళువల్లి**
**కూడల సంగమ దేవ తనగె బేకెందు**
**ఎత్తికొండ** (శ్రీ బసవేశ్వర వచ.525)

ఈ వచనపు తెలుగు రూపమును గనుడి :

**భక్తి యనెడి పృథ్విమీద**
**గురువనెడి బీజమంకురించి**
**లింగమనెడి యాకైనది**
**లింగమనెడి యాకు మీద**
**విచారమనెడి పూవైనది**

**ఆచారమనెడి కాయైనది**
**నిష్పత్తి యనెడి పండైనది**
**నిష్పత్తి యనెడి పండు తొడిమె**
**వీడి కడచి పడనచ్చుట**
**కూడల సంగమ దేవుడు**
**తనకు వలయునని యెత్తికొనియెను**

నిష్పత్తియనగా జీవత్వమును వీడి శివత్వమును పొందెడి క్రమములోని యొకానొక దశలోన నుండెడి వాడని తెలియుచున్నది. క్రియానిష్పత్తి యనగా భక్తి సత్క్రియల నాచరించి తత్ఫలితముగా భవమును గెలిచినవాని స్థితిగతియని తెలియుచున్నది. ఈ భావమును స్ఫురింపజేసెడి చతుర్వేద సారములోని క్రింది పద్యమును గనుడి :

**లింగసాన్నిధ్యంబు లింగాంకి తంబేని**
**స్వామిభృత్య త్వంబు చర్యయేమి**
**సతత పుణ్యోద్యుక్తి సముచిత క్రియయేని**
**యింద్రియ స్పర్శంబ యిష్టమేని**
**అవధాన సవిధాన మభ్యరితంబేని**
**విషయ స్వతంత్రత విషయమేని**
**కలిత ప్రసాదభోగమ్మనుశ్రుతమేని**
**నినుజొచ్చి యనికియమనికియేని**

**నట్టి పూజకునకు గడు దిట్టమైన**
**ఫలము గల్గును దప్పక సలలితముగ**
**గాధ సెందక తాభవాంబోధి విడిచి**
**పరమ సుకృతంబు జెందదె బసవలింగ** (చ.సా.ప. 279)

"నిను జొచ్చియునికియ మనికి యేని" అనెడి పద్యభాగము శరణార్థియై శివుని శరణుజొచ్చి శివుని యంగమునే తన నెలవుగా జేసికొని శివసాన్నిధ్యమున చిదానందముననుభవించెడి శరణస్థలి యొక్క క్రియానిష్పత్తి స్థలపు నెలవును సూచించుచున్నదని గ్రహించగలరు.

క్రియానిష్పత్తి స్థలములో నుండెడి సాధకునికి యిక ముందున క్రియల నాచరించెడి యవశ్యకత లేదని తెలుపబడినది. ఈ స్థితియొక్క నేపథ్యములోన నొక సాధకుని యొక్క మనోవృత్తి యెట్టులుండునో యనెడి తెలిసికొనగోరువారు క్రింది వచనమును చూడగలరు.

**శుద్ధవాయిత్తెంబెనె?**
**సుయిధాని నానల్ల**
**అనువాయిత్తెంబెనె? అవధాని నానల్ల**
**సుయిధాన అవధాన అర్పితవ నానరియె**
**ఇద్ద పరియలి నీడిదడె,**
**బంద పరియలికైకో**
**కూడల సంగమ దేవా!** (శ్రీ బసవేశ్వర వచ.886)

ఈ వచనములోని "ఇద్ద పరియలి నీడిదడె, బంద పరియలి కైకో" యనెడిది గమనించవలసిన విషయము. అదే విధముగా సుయిధాని నానల్ల, అవధాని నానల్ల" అనెడి వాక్కులును పరిశీలనార్హములు.

ఈ వచనపు తెలుగు రూపము గనుడి :

*శుద్ధమైనదని యందునే?*
*సుయిధాని నేగాను*
*అనువైనదని యందునే?*
*అవధాని నేగాను*
*సుయిధాన యవధాన యర్పితంబుల నేనెరుగ*
*ఉన్న పరియందున పెట్టినచో*
*వచ్చిన పరియందున గైకో!*
*కూడల సంగమ దేవా!*

చతుర్వేద సారములోని పూర్వోక్త పద్యములో చెప్పబడిన దాని ప్రకారముగా సాధకుడు సువిధానియై యవధానియై యెంతో కాలము వరకు సాధనచేసి శరణ స్థలమును చేరును. శరణ స్థలియైన పిదప యతడు సువిధాని యవధాని కానక్కరలేదనెడిది బసవేశ్వరులవారి వచనము వలన తెలియుచున్నది. దీనికి గల కారణమేమనగా సువిధానిగను, అవధానిగను క్రియలు చేసినా చేయకుండినను శరణునకు సిద్ధించెడి ప్రయోజనము శూన్యము. అందుచేత శరణుడు నందరివలె ప్రయత్నపూర్వకముగా క్రియల నాచరించడు. వాస్తవముగా చూసిన యెడల యతడు క్రియల నాచరించడు. కాని మేఘములచేత కప్పబడిన చంద్రుడు మేఘములనుండి కదలినట్లు కన్పించినటులే నిష్క్రియా స్థితిలో నున్న శరణుడు క్రియల నాచరించుచున్నట్లు దోచును. ఇది చూసెడివారిలో గల చూపులోని లోపమువలన గల్గిన భ్రాంతివలన పుట్టిన భావనయని తెలియజెప్పిన శ్రీ భగవత్పాదులవారి వాక్కులు స్మరణీయములు.

– శుభం భూయాత్ –

## ఆశీర్వచనము - 1 :
## భావ నిష్పత్తి స్థలము :

సద్ధర్మ ప్రేమికులింతవరకు లింగ స్థలమైన శరణ స్థలములోని జ్ఞానియైన శివయోగికి సంబంధము గల్గిన క్రియానిష్పత్తి గురించి తెలిసికొనిరి. శివయోగి కర్మలను చేసినా వాటి ఫలములనుండి యలిప్తుడై యుండునని తెలిసికొనిరి. ఈ శివయోగి పొందెడి తదుపరి యనుభవము గురించి తెలిపెడిదే భావనిష్పత్తి స్థలము. భావమనెడిదొక మానసిక స్థితి. "భావో మానస చేష్టాత్మా పరిపూర్ణః శివాత్మకః" అనెడిది ప్రకటితమైనట్టి ఆచార్యోక్తి. ఈ భావనయు లుప్తమై యుండెడి స్థితిని గురించి యీ స్థలమున తెలుపబడినది. ఈ విషయమున శ్రీ జగద్గురువుల వారీ క్రింది విధముగా నుపదేశించిరి :

**భావః ప్రతీయమానోఽపి పరకాయే తు కల్పితః ।**
**శుక్తౌ రజతవదుయస్మాద్భావనిష్పత్తి మానయమ్ ॥** (సి.శి. 19-37)

ముత్యపు చిప్పయందున వెండి యొక్క ప్రతీతియైనను నయ్యది కల్పితమైన భావన యైనటులే పరకాయునిలో ప్రతీతమైయుండెడి భావనలన్నియును కల్పితము తెలిసికొనెడి శివయోగి భావ నిష్పత్తి స్థలి యగుచున్నాడు. జ్ఞానియైన వానికి భావము యొక్క సంబంధమే యుండదనిన వెనుక సచ్చిదానంద రూపుడైన శివుని విషయమున భావమును నిలుపుకొనవలెనా? లేదా? అనెడి ప్రశ్న, పుట్టుట సహజమే. ఈ విషయమై శ్రీ భగవత్పాదులవారీ క్రింది విధముగా నుపదేశించిరి :

**భావేనీ నాస్తి సంబంధః కేవల జ్ఞానయోగినః ।**
**తథాపి భావం కుర్వీర్తి శివే సంసారమోచకే ॥** (సి.శి. 19-38)

దీని తాత్పర్యమేమనగా జ్ఞానయోగికి భావముతో సంబంధముండవలసిన పనిలేదు. అయినా అతడు సంసారమోచనను చేసెడి శివునికి సంబంధించిన భావమును పెంపొందించికొనవలెను.

“మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః” అనెడి ప్రఖ్యాతోక్తి ప్రకారముగా జీవుని బంధమోక్షములకు నతని మనోవృత్తియే కారణమగుచున్నది. అది నిర్విషయముగా పరశివుని స్వరూపమును దాల్చినప్పుడు నయ్యది ముక్తికి కారణమగుచున్నది. మనోవృత్తి లత వంటిది. ఆలంబన నాధారముగా గొని సంచరించుట దాని ధర్మమైయున్నది. విషయలంబన నొసంగినచో జీవి విషయియగును. శివాలంబన నుండినచో ముక్తి లభించును. జ్ఞానికి ప్రారబ్ధ కర్మావశేషమున్నంత మేరకు జీవించవలెను. మనోవృత్తి కాలంబన నిచ్చుటలో నతడు విఫలుడైనచో మనోవృత్తి విషయములవైపు పరుగెత్తును. అందుకే జ్ఞానియైనవాడు మనోవృత్తికి శివభావనను ప్రదానము చేయును. ప్రారబ్ధకర్మ ముగిసిన పిదప ముక్తుడగును. అతడు దీనికి విరుద్ధముగా సంచరించినచో విషయియై యపఖ్యాతిని పొందును. లోక కళ్యాణమును సాధించుట యందున విఫలుడగును. అందుచేత జ్ఞాని శివభావమును పెంపొందించికొనవలెను.

పరిపూర్ణమైన జ్ఞానము గల్గినవానికి జ్ఞానముచేత గల్గెడి ప్రయోజనమెట్టిది యనెడి సందేహము యొక్క నేపథ్యములో శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారీ యుపదేశము నిచ్చిరి :

**పరిపూర్ణ ప్రబోధోఽపి భావం శంభౌ న వర్జయేత్ ।**
**భావో హి నిహితస్తస్మిన్ భవసాగర తారకః ॥** (సి.శి. 19-39)

దీని తాత్పర్యమేమనగా పరిపూర్ణమైనట్టి యపరోక్ష జ్ఞానమును పొందిన వాడైనను భావమును శంభువునుండి మళ్ళించకూడదు. భవసాగరమునకు నౌకగా భావింపబడెడి శివునిలో భావము నిక్షిప్తము చేయనిచో సంసారమును దాటజాలము. జ్ఞానికైనను భావమును పెంపొందించికొనుట యనివార్యమైన విషయమగుచున్నది. ఈ విధిన చేయని జ్ఞాని విషయలంపటుడుగా నయ్యెడి ప్రమాదమేర్పడును. అయ్యది లోకమున కహితమైనదిగా పరిణమించవచ్చును.

శివభావన యొక్క నిత్యా నిత్యత్వముల గురించి శ్రీ భగవత్పాదులవారీ క్రింది విధముగా సెలవిచ్చిరి:

**నివర్త్య జన్మజం దుఃఖం భావః శైవో నివర్తతే ।**
**యథా కాష్ఠాదికం దగ్ధ్వా స్వయం శామ్యతి పావకః ॥** (సి.శి. 19-40)

దీని తాత్పర్యమేమనగా కట్టెలను కాల్చిన పిదప నే విధము నిప్పు తనంతట తానే యే విధముగా నారిపోవునో, శివయోగి పెంపొందించుకొనిన శివభావనయు జన్మజమైన దుఃఖమును మాపిన పిదప నడగిపోవును. అది యనిత్యమైనదని తెలిసికొనవలెను.

ఈ సంసారమునందున జన్మను దాల్చి వచ్చిన వెనుకన జీవుడనేకమైనట్టి దుఃఖముల ననుభవించుచున్నాడు. దుఃఖములన్నింటిలోను మొదటిది జన్మకు సంబంధించిన దుఃఖము. దీనినుండియే మిగిలిన దుఃఖములు గల్గునని చెప్పబడుచున్నది. ఈ విషయమును తెలిపెడి క్రింది ప్రబోధోక్తిని గుర్తించుడి:

**జన్మదుఃఖం జరాదుఃఖం జాయాదుఃఖం పునః పునః ।**
**సంసార సాగరం దుఃఖం తస్మాత్ జాగ్రత జాగ్రత ॥**

ఈ జన్మజరా జాయాదుఃఖములన్నింటినీ అంతమొందించెడి యుపాయము లేవియును లేవు. అయితే కొన్నింటివలన తాత్కాలికోపశమనము చేకూరెడి యవకాశము లేకపోలేదు. “నౌ సుసార్ కా ఏక్ లోహార్ కా” అనెడి హిందీ మాట ప్రకారముగా నిట్టి యుపాయములన్నియును

శివయోగి పెంపొందించికొనెడి శివభావనకు సరిరాజాలవు. శివభావన వలన జన్మాది దుఃఖములన్నియు సమూలముగా నంతమొందించబడుచున్నవి. ఆ పిదప శివభావనయును లుప్తమగునని గ్రహించగలరు.

జనన మరణాత్మకమైన భవరోగమును దూరముగా చేసికొనిన పిదప శివయోగికి శివభావన వలన మరేదైనా యితర ప్రయోజనములుండవా? అనెడి సందేహమునకు సమాధానముగా శ్రీ భగవత్పాదుల వారీ క్రింది యుపదేశము నిచ్చిరి :

**ప్రకాశతే శివానందే తద్భావైః కిం ప్రయోజనమ్ ।**
**సిద్ధే సాధ్యే చిరేణాఽపి సాధనైః కిం ప్రయోజనమ్ ॥** (సి.శి. 19-41)

దీని భావార్థమేమనగా, నే విధముగా కార్యసాధన నిమిత్తము నుపయోగింపబడెడి సాధనము, సాధ్యము సాధితమైన పిదపనే విధముగా పనికిరాని వస్తువుగా మారునో, అదే విధముగా సంసార దుఃఖమును దూరము చేసికొనుటకై సంపాదించికొనబడిన శివభావన సంసారము దూరమైన వెనుక ప్రయోజన శూన్యమైనదిగా పరిణమించును. ఈ సందర్భమున రైలుబండి టికెట్టును నుదహరించవచ్చును. ప్రయాణము ముగిసిన వెనుకన టికెట్టు వలన కలిగెడి ప్రయోజనమెట్టిది? ఇది సర్వజన విదితమైన విషయమే. శివభావన టికెట్టు వంటిదని తెలిసికొనవలెను.

భావము లయమైన పిదప శివయోగి యెట్టుల భాసించునో అనెడి దానిని శ్రీభగవత్పాదుల వారీ క్రింది విధముగా తెలియజేసిరి :

**ఏకీకృతే శివేభావే జ్ఞానేన సహ సంయమీ ।**
**విస్మితాత్మసమావేశః శివభావే విభాసతే ॥** (సి.శి. 19-42)

దీని భావార్థమేమనగా, భావము జ్ఞానముతో సహా శివునిలో లయమైన పిదప నిట్టి సమావేశమును గాంచి శివయోగి విస్మితుడై శివోహమనెడి భావనలో ప్రకాశించుచుండును.

భావ జ్ఞానముల ప్రాముఖ్యతను తెలుపుచు, శ్రీ భగవత్పాదుల వారీ స్థలము గురించిన యుపదేశమునకు ముగింపు బలికిరి :

**న భావేన వినా జ్ఞానం న భావో జ్ఞానమన్తరా ।**
**మోక్షాయ కారణం ప్రోక్తం తస్మాదుభయ మాశ్రయేత్ ॥** (సి.శి. 19-43)

ఉపదేశము యొక్క తాత్పర్యమేమనగా, భావము లేనిది జ్ఞానముండదు. జ్ఞానము లేనిది భావముండదు. ఈ రెండూ పరస్పర పూరకములు. శివోహమనెడి భావముత్పన్నమగుటకు శివజ్ఞానమవశ్యముగా కావలెను. గురూపదిష్ట జ్ఞానమును పొందినవానికి భావములేని యెడల జ్ఞాన పురోగమనము సంభవించదు. అందుచేత యీ రెండూ ముముక్షువు కవశ్యమైనవని యెరిగి యీ రెంటిని పొందుటకు సాధకులు ప్రయత్నించెదరు గావుత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువుల వారు భావనిష్పత్తి గురించి తెలుపుచు శరణస్థలికైనను భావము విసర్జనీయము కాదని తెలియజెప్పిరి. భావము యొక్క నిర్గమనము సహజముగానే సిద్ధించునని తెలిపిరి.

క్రియానిష్పత్తి స్థలమున క్రియలు నిష్పన్నము కాగా భావనిష్పత్తి స్థలమున భావము నిష్పన్నమైనదగును. జీవత్వము నిర్గమించి శివత్వము సమీపించిన స్థితిలో భావాగమన మనావశ్యకతయే ననెడిది తాత్విక భావన. శివత్వము పొందుటకే జీవుడు "శివోహ" మనెడి భావము పెంపొందించికొనుచు భ్రమర కీటన్యాయమున శివత్వము పొందెడి దిశలో సాధన చేయును. ఇచ్చట జీవత్వ నిర్గమనమే లక్ష్యమైయుండును. కీటము కీటముగా నుండెడి స్థితిలో నుండెడి భ్రమర భావన, అది భ్రమరమైన తరువాత యిట్టి భావము యొక్క అవశ్యకత యుండదని తెలిసికొనగలరు.

ఈ విషయమును మన యవగాహనలోనికి తెచ్చుటలోన నుపకరణముగా నుండెడి యీ వచనమును గనుడి :

**ఆయత్త వెంబుదు భంగ**
**స్వాయత్త వెంబుద భంగ**
**ఆయత్తవనరియె స్వాయత్తవనరియె**
**భావదల్లి వ్రతగెట్టుదాగి**
**ఆ భావదల్లి జీవసంహారి**
**కూడల సంగమదేవ**
**సర్వనివాస యాగి** (శ్రీ బసవేశ్వర వచ.సం. 945)

ఈ వచనము యొక్క తెలుగు రూపము గనుడి :

**ఆయత్త మనునది భంగము**
**స్వాయత్త మనునది భంగము**
**ఆయత్తము నరయః స్వాయత్తము నరయ**
**భావమున వ్రతము చెడినది గాన**
**ఆ భావము నందున జీవసంహారి**
**కూడల సంగమ దేవుడు సర్వనివాసి గాన**

ఆయత్త మనమనగా గురువు వలన పొందినది. స్వాయత్తమనగా స్వానుభవము వలన సంపాదించినది. ఇచ్చట ఆయత్తమనెడిది "జీవ–శివ–జగత్తు"లలో నుండెడి అభేద భావన. స్వాయత్త మనెడిది "తాను శివుడనే" యనెడి భావము. ఈ రెండూ జీవుడు శివుడుగా పరిణమించుట కుపకరించెడి యుపకరణములే భావనిష్పత్తి స్థలమున జీవత్వము నశించగా సాధనముల నావశ్యకములైపోవును. జీవత్వము సంహరించెడి శివుని చెంతన నిశ్చింతతో నుండెడి సాధకునికి వేరుగా నితర సాధనములేల. సాధకునిలోన శివుడు, శివునిలోన సాధకుడు స్థిరమైన నివాసము లేర్పరచికొనిన దశలో భావముతో పనియుండదు.

అయితే సాధకుడు భావాన్ని త్యజించకుండా నుండవలెననెడిది గుర్తుంచికొనవలెను. భావము తనకు నిర్గమించి పోయే విధముగా సాధనజేయవలెననెడిదే గ్రాహ్య విషయము.

"శుభం భూయాత్"

## ఆశీర్వచనము - 1 :
## జ్ఞాన నిష్పత్తి స్థలము :

సద్ధర్మ ప్రేమికులు లింగ షట్ స్థలములలో నొకటగు శరణస్థలమునకు చెందిన భావనిష్పత్తి స్థలము గురించి తెలిసికొంటిరి. భావము వలన లభ్యము కావలసిన ఫలము లభించిన పిదప భావము తన ప్రయోజనమును కోల్పోవుననియు, నా పిదప నా భావము లయమగుననియు దెలుపబడినది. ఆ స్థితిలో నుండెడి శివయోగి భావనిష్పత్తి స్థలమును తన సాధనను ఫలప్రదము చేసికొని జ్ఞాననిష్పత్తి స్థలమున ప్రవేశించును. ఇచ్చట జ్ఞానమివ్వవలసిన ఫలితమునిచ్చి తన ప్రయోజకత్వమును గోల్పోవును. జ్ఞానము లుప్తమైపోయెడి దశనే జ్ఞాననిష్పత్తి దశయని యందురు.

శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారు నగస్త్యుని యుద్దేశించి జ్ఞాననిష్పత్తి స్థల విషయమున నీ క్రింది విధముగా సెలవిచ్చిరి :

**జ్ఞానస్య వ్యవహారే ఽపి జ్ఞేయాభావాత్ స్వభావతః ।**
**స్వప్నవత్జ్ఞాననిష్పత్యా జ్ఞాననిష్పన్న ఇత్యసౌ ॥** (సి.శి. 44)

దీని తాత్పర్యమేమనగా జ్ఞానముకైనను నాలంబన కావలెను. ఆలంబన రహితముగా వృత్తిజ్ఞానముండజాలదు. అందుచేత జ్ఞేయమే జ్ఞానము యొక్క యాధారమగును. జ్ఞేయమనగా నెరుగవలసిన వస్తువు. జాగ్రదవస్థ యందున మనుష్యుడు తన యెదురున నున్న వస్తువుల గురించిన జ్ఞానమును పొందుచున్నాడు. అదే విధముగా నతడు స్వప్నావస్థలోను తన యెదుటి వస్తువుల గురించిన జ్ఞానమును చేసికొనును. మెలకువ వచ్చిన పిదప నా జ్ఞానము నిష్ప్రయోజకమై పోవుచున్నది. అందుచేత నా జ్ఞానము లయించిపోవును.

ఒక తిరిపదు ప్రతిదినము నిండ్లయందున తిరిగి తెచ్చికొని తనపొట్టను పోషించికొనెడివాడు. అతనికి తాను రాజుగా కావలెననెడి ప్రబలమైన కోరిక యుండెను. పగటిపూట నిలిచియున్నప్పుడు, కూర్చుండియున్నప్పుడు, నటు యిటు తిరుగాడునప్పుడు నెల్లప్పుడు నతడు రాజదర్బారు, సింహాసనము, ఏనుగు, ఒంటె మొదలగు వాటి గురించి విచారము జేయుచుండెను. దినదినమతని విచారములు ప్రబలమైపోవుచుండెను. ఒకదినమతడు నొక పల్లెలోని ధర్మశాల యందున నిదురించు చుండెను. అప్పుడతడొక కలను గాంచెను. కలలో నతడు గాంచినదేమనగా నా దేశపు రాజుగారకస్మాత్తుగా మడిసిపోయెను. అతని వంశమునందున నతనికి నుత్తరాధికారులుగా నెవ్వరును లేకుండిరి. మంత్రి మరియు నితర ప్రముఖులు నిర్ణయించిన దేమనగా నొక యేనుగు తొండమున కొక పూలమాల నందించి నద్దానిని దేశములో నటు యిటు త్రిప్పవలెను. ఏనుగెవ్వరి మెడలో పూలమాలను వేసినచో నతడు రాజుగా నెంపిక చేయబడిన యట్లు భావించికొని రాజ్యమునతని కప్పగించవలెను. వారీ నిర్ణయము నమలుజేసిరి. ఏనుగొక రాజవీధిలోన సంచరించుచుండగా యీ బిచ్చగాడు దానికి యెదురుగా వచ్చెను. ఏనుగు వీని మెడలో పూలమాలను వేసెను. ప్రజలతని భాగ్యమును గొనియాడుచు తగిన విధిన వస్త్రాదులతో నలంకరించి, యేనుగు మీదొక అంబారిని పెట్టి, దానిలో నతనిని కూర్చుండబెట్టి జయజయధ్వనులు చేయుచు రాజదర్బారుకు తీసికొని వెడలిరి. పట్టాభిషేకము జరుపబడెను. నగారా యిత్యాదులు మ్రోగింపబడెను. జయఘోష మిన్నును ముట్టెను. ఇట్టి కల కొనసాగుచుండగనే బిక్షకుడు పరుండియున్న ధర్మశాల సమీపమునకొక పెళ్ళివారి యూరేగింపు వచ్చెను. మంగళ వాద్యముల ధ్వనికి బిచ్చగానికి మెలకువ రాగా నచ్చట రాజదర్బారుగాని, ప్రజలుగాని, రాజసింహాసనముగాని లేకుండెను. తాను గాంచిన వైభోగము కలలో నని యెరింగిన బిక్షుకుడు నిరాశకు గురియై మౌనమును వరించిన వాడయ్యెను.

ఇచ్చట స్వప్నములోని జ్ఞానమునకు నాలంబనగా నుండి యున్నట్టి స్వాప్నిక పదార్థములు స్వప్నము భగ్నము కాగానే లుప్తమైపోవును. ఇదే విధిన శివయోగి యొక్క మనస్సు విలీనము కాగానే వ్యావహారిక త్రిపుట జ్ఞానము లుప్తమైపోవును. ఈ విధముగా నంతర్ముఖత చేత బాహ్య వ్యవహార జ్ఞానము నిష్ప్రయోజనకారియై లోపించినదగును. ఈ విషయము నింకను స్వయం బోధకముగా చేయుటకై శ్రీ భగవత్పాదులవారీ యుపదేశము నిచ్చిరి :

**స్వప్నజాతం యథాజ్ఞానం సహ స్వార్థైర్నివర్తతే ।**
**తథాత్మని ప్రకాశేతు జ్ఞానం జ్ఞేయం నివర్తతే ॥** (సి.శి. 19-45)

దీని తాత్పర్యమేమనగా స్వప్నావస్థ నుండి మెలకువవయైన పిదప స్వాప్నిక వస్తు సంచయము మరియు తత్సంబంధమైన జ్ఞానము నివృత్తమగును. అదే విధముగా నాత్మ స్వరూపము యొక్క యరయిక కాగానే జాగ్రదవస్థలో కనిపించెడి పదార్థములు, వాటి గురించిన జ్ఞానము నేకకాలముననే నివృత్తమగును. అనగా, నాత్మ నిష్ఠుడైన శివయోగికి పదార్థములు పదార్థములుగా దోచకుండగ నా పరమాత్మ స్వరూపముగా దోచునని తెలిసికొనగలరు. సర్వమూ పరమాత్మ స్వరూపముగా దోచినప్పుడు వేరొక వస్తువుగాని, దాని జ్ఞానముగాని సంభవించెడి ప్రశ్న రాదు. ఈ విధముగా నాత్మ వ్యతిరిక్తమైన జ్ఞాన-జ్ఞేయములనెడి రెంటిని యీ స్థలమున శ్రీ భగవత్పాదుల వారు ప్రతిపాదించిరి.

స్వస్వరూప జ్ఞానము కలుగగానే వ్యావహారికమైన జ్ఞేయ పదార్థములు నెందుకు లుప్తమగుననెడి ప్రశ్న యుద్భవించగా తన్నివారణార్థము శ్రీ భగవత్పాదుల వారీ యుపదేశము నిచ్చిరి :

**పరిపూర్ణేమహానన్దే పరమాకాశలక్షణే ।**
**శివే విలీనచిత్తస్య కుతో జ్ఞేయాన్తరే కథా ॥** (సి.శి. 19-46)

దీని తాత్పర్యమేమనగా పరిపూర్ణము, మహానంద స్వరూపము మరియు పరమాకాశ లక్షణమైన పరశివుని యందున చిత్తవృత్తి విలీనమైన వారికి మరొక పదార్థమది యేవిధముగా దృష్టికి గోచరమగుచున్నది. శివాద్వైత జ్ఞాన సంపన్నుడైన శివయోగికూడ ప్రారబ్ధ కర్మక్షయ మగునంతవరకు శరీరధారిగా నీ ప్రపంచమునందున నందరివలె తానూ మనుగడను కొనసాగించును. అప్పటివరకు నందరికీ కనిపించెడి ప్రపంచమతని కెట్లుల కనిపించదు? పదార్థములున్నంత మాత్రము నయ్యవి యెల్లరకును కనిపించవలెనను నియమేదియును లేదు. వస్తువు యొక్క యస్తిత్వమ నెడిది లోపికకు కారణము కాజాలదు. ఒక వ్యక్తి దానిని లక్ష్యము చేయునప్పుడే ఆ వస్తువు తోచును. జగత్తునెవ్వడు లక్ష్యము చేయునో వానికే అది గోచరించును. కళ్ళు మూసికొని కూర్చుండియున్న వానికి జగత్తు కనిపించదు కదా! ఈ విషయము గురించి సాంఖ్యకారికకారుడగు యీశ్వర కృష్ణగారు చెప్పినది గమనించదగినదై యున్నది.

**అతిదూరాత్ సామీప్యాదింద్రియ ఘాతాన్మనోఽ నవస్థానాత్ ।**
**సాక్షాత్ వ్యవధానా దభిభవాత్ సమానాభిహారాచ్చ ॥** (సాంఖ్యకారికా - 7)

వస్తువు కనబడకుండ నుండుటకు గల కారణములీ శ్లోకములో వివరింపబడినవి. సుదూరమున నున్న వస్తువు కనిపించదు. ఎంతో ఎత్తున యెగిరెడి పక్షి మనకు కనిపించదు కదా! అతి సమీపమున గలిదియును కనిపించదు. కళ్ళకు పెట్టబడిన కాటుక కళ్ళకు కనిపించునే? ఇంద్రియములలో దోషము నుండినను వస్తువు యొక్క పరిజ్ఞాన మలవడదు. చెవిటికి శంఖనాదము వినిపించదు కదా. సమీపమున నున్నను లక్ష్యము బడని వస్తువు కనిపించదు.దుష్యంతునిలో దత్త చిత్తయై యుండిన శకుంతలకు తన యెదురున గల దూర్వాసముని కనిపించలేదట. దృశ్య వస్తువు పరమాణు వలె సూక్ష్మముగా నున్నను కనిపించదు. ఒక వస్తువు మరొక దానిని కప్పివేసినచో కప్పి వేయబడినది కనిపించదు. గోడ వెనుకన గలది కనిపించునే? ఒక వస్తువు మరొక దానిని తిరస్కరించే స్థితిలో నున్న యెడల తిరస్కృత మైనది కనిపించదు. సూర్య కాంతి చేత తిరస్కృతమైనట్టి నక్షత్రముల కాంతి కనిపించదు కదా. ఒక పెద్ద వస్తువులో కలిసిపోయిన చిన్న వస్తువు కనిపించదు. నీళ్ళు నిండుగా నున్న బకెట్‌లో మరికొన్ని నీళ్లు పోసినచో పోయబడిన నీళ్ళు కనిపించవు. సమానముగా నుండెడి రెండు వస్తువులు సామరస్యమును పొందినచో నవి కనిపించే టప్పుడు భేదము తోచదు. ఇవన్నియును కనిపించకుండా వస్తువుండినచో కారణభూతమైన యంశములగుచున్నవి. వస్తువు కనిపించుటకు గల కారణముల నూహించి కొనవచ్చును. ఇచ్చట గ్రహించవలసిన దేమనగా శివునిలో చిత్తము లీనమై యుండినచో వస్తువు లేవియును కంటికి కనిపించవు. ఇచ్చట శివయోగికి వస్తువు గురించి గల యనవధానమే జ్ఞేయము కనిపించకుండ వుండుటకై కారణమని గ్రహింపదగును.

జ్ఞాన నిష్పత్తిని పొందిన శివయోగిలో మిగిలి యుండెడి జ్ఞానమెట్టిది యనెడి సందేహము కలుగవచ్చును. ఈ సందేహమును దూరీకరించుటకై శ్రీ భగవత్పాదుల వారీ యుపదేశమును ప్రదానము చేసిరి.

**అఖండానన్దసంవిత్తి స్వరూపం బ్రహ్మ కేవలమ్।**
**మిథ్యా తదన్యదిత్యేషా స్థితిర్జ్ఞానమిహోచ్యతే॥** (సి.శి.19-47)

దీని తాత్పర్యమేమనగా పరశివ బ్రహ్మము కేవలము, అఖండము ఆనంద స్వరూపము మరియు జ్ఞాన స్వరూపమై యున్నది.దాని కంటెను వ్యతిరిక్తమైన దంతయు మిథ్యయని శివయోగి తెలిసికొనినవాడై యుండును. అతనిలో నాత్మజ్ఞానము మాత్రమే మిగిలి యుండును. దీనిని మినహాయిస్తే అతనిలో నుండెడి జ్ఞానము శూన్యమని భావించవచ్చును.

వీరశైవ సిద్ధాంతము నందున పరశివ బ్రహ్మము సత్యమే జగత్తూ సత్యమే. ప్రపంచము మిథ్యకాదు. అది శివస్వరూపమని భావింపబడినది. పరమాత్మ జ్ఞానమునకు వ్యతిరిక్తమైన జ్ఞానము నుండదని చెప్పబడినది.ఒక వేళ యెవ్వరైననూ ఆ విధముగా భావించిన యెడల నట్టి భేదభావము మిథ్యయని గ్రహించవలెను. ఈ విషయమును విస్పష్టముగా జెప్పుటకై శ్రీ భగవత్పాదుల వారీ క్రింది యుపదేశము నిచ్చిరి.

**సత్తాత్మనాఽనువృత్తం యద్ ఘటాదిషు పరం హి తత్।**
**వ్యావర్తమానా మిథ్యేతి స్థితిర్జ్ఞానమిహోచ్యతే॥** (సి.శి.19-48)

ఉపదేశము యొక్క తాత్పర్యమేమనగా ఘట, పట, మఠాదులలో సత్ అనెడి వస్తువొకటే యను స్యూతముగా నుండును. "సదేవ సౌమ్యేద మగ్ర ఆసిత్" అనెడి శ్రుతి వచనము ప్రకారముగా నన్నింటిలోను సత్ రూపమున నుండెడి సద్రూపమైన వస్తువే పరవస్తువు. ఇదియే పరమాత్మ. ఇది పరబ్రహ్మ మనబడుటకు గల కారణమే మనగా నిది యన్నింటిలోను సమానముగా నుండును. అయితే దీనికంటెను భిన్నముగా దోచెడి ఘటపటాదులు పరస్పరముగా భిన్నములుగా నుండును. అయితే తోచెడి భిన్నత్వము మిథ్యయనియు వస్తువుల నామరూపాదులు భిన్నమైనవని గ్రహించ వలెను. అన్నింటిలో ననుస్యూతముగా నుండెడి బ్రహ్మము సత్యముగా నున్నది. ఈ విధమైన జ్ఞానము శివయోగికి గల్గును. ఇది స్థిరమైన జ్ఞానము. దీని కంటెను భిన్నమైన జ్ఞానము ప్రయోజనము శూన్యమైనదని యెరిగిన వాడైన శివయోగి మిథ్యాభ్రాంతికి లోనుగాడు.

పరశివ బ్రహ్మము సత్, చిత్ మరియు ఆనంద స్వరూపముగా నున్నది. దీని సచ్చిదానంద స్వరూపములు మనకు ప్రాప్తమయ్యెడి జాగ్రత్, స్వప్న, సుషుప్తుల యందున ప్రతి యొక్కరికిని యనుభవ గోచరమగుచుండును. జాగ్రదవస్థ యందున నేనున్నాను, అతడున్నాడు, వారున్నారు, అది యున్నది మొదలగునవి వ్యవహరించునప్పుడు భగవంతుని సద్రూపము సర్వజనుల యనుభవమునకు వచ్చుచున్నది. మనము పరుండి యున్నప్పుడు తోచెడి స్వప్నము నెవ్వరి ప్రకాశమునందున ప్రకాశమానముగా దోచుననెడిది విచారించగా నా యవస్థ యందున సూర్య చంద్రాదులేవియును వెలుగునివ్వలేవని తేలును. అయితే నొక జ్యోతి యొక్క యనుభవమందరికినీ అగును. ఇది పరశివుని చిజ్జ్యోతి యని యెరుగవలెను. గాఢ నిద్రలో నానందానుభూతి యగును. ఇది శబ్దస్పర్శాదుల వలన లభించెడి విషయ సుఖము వంటిది కాదు. ఇది నిరతిశయమైనట్టి యాత్మానందమని యెరుగవలెను.

ఈ విధముగా బరమాత్ముని "సత్" "చిత్" ఆనందము"ల యనుభవ మందరికి నగుచున్ననూ అజ్ఞుల కిద్దాని వివేకముండదు. అయితే యీ స్థలములోని శివయోగి యీ జ్ఞానమును పొందినవాడై నామరూపాత్మకమైనట్టి బాహ్య వ్యావహారిక జ్ఞానమును నిర్లక్ష్యముచేయునని తెలిసికొనగలరు.

ఈ విషయమున శివయోగి యొక్క జ్ఞానము గురించి స్పష్టపరచుచు శ్రీ భగవత్ పాదుల వారీ యుపదేశము నిచ్చిరి:

**అకారణమకార్యం యదశేషోపాధివర్జితమ్।**
**తద్బ్రహ్మ తదహం చేతి నిష్ఠా జ్ఞానముదీర్యతే॥** (సి.శి.19-49)

దీని తాత్పర్యమేమనగా బరబ్రహ్మము కారణమూ కాదు, కార్యమూ కాదు. అది యుపాధులన్నింటి నుండియు ముక్తమైనదైయుండును. అనగా అది నిరుపాధిక రూపమైయుండును. అట్టి బ్రహ్మమును నేనేయై యున్నాను. చరాచర ప్రపంచము కూడ బ్రహ్మమే. ఈ విధముగా దృఢమైనట్టి నిశ్చయము సర్వశ్రేష్ఠమైన జ్ఞానమై యున్నది. ఇచ్చట ప్రయోగింపబడినట్టి నిష్ఠాశబ్దమత్యంతమహత్వపూర్ణమైనదైయున్నది. "నిశ్చయేనతి ష్ఠతేతి నిష్ఠా" యనెడి వ్యుత్పత్తి ప్రకారముగా నిది దృఢమైన జ్ఞానమని తెలియుచున్నది. స్వాతి చినుకొకటి సముద్రము నందున పడి యుప్పగుచున్నది. అదేవడగల్లుగానయి భూమిమీద పడవచ్చును. ఉప్పుగా మారిన సముద్రపు నీరు మరొక్క తరి నీరై నీటితో కలిసి పోవచ్చును. ఒకానొక స్వాతిచినుకు ముత్యపు చిప్పలో పడి ముత్యము గావచ్చును. ముత్యముగా మారిన స్వాతిచినుకు నా పిదప నీరుగాకాజాలదు.దీని అస్తిత్వము వంటిదే శివయోగి యొక్క జ్ఞానము. అదెప్పటి కైనను తన స్వరూపమును బదలాయించి కొనదు. అందుచేత నీ శివయోగి సర్వమునూ శివరూపముగానే యనుభవించుచుండును.

శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారు జ్ఞాన నిష్పత్తి స్థలము గురించిన యుపదేశమును పరి సమాప్తి చేయుచు నీ విధముగా నానతి నిచ్చిరిః

**జ్ఞాతాప్యహం జ్ఞేయమిదమితి వ్యవహృతిః కుతః**
**అభేద బ్రహ్మస్వారస్యే నిరస్తాఖిల వస్తుని॥** (సి.శి.19-50)

దీని తాత్పర్యమేమనగా **"నేహ నానాఽస్తి కించన"** అనెడి శ్రుతి వచనము ప్రకారముగా సమస్త ప్రాపంచిక భేదశూన్యమైనట్టి యద్వితీయమైన పరబ్రహ్మతో సామరస్య స్థితిని పొందిన శివయోగికి నేనెరిగెడి వాడిని, యిదియెరుగ వలసినది యనెడి భేద భావము మిగిలి యుండదు. పరశివుని స్వరూపమును దాల్చిన యితని జ్ఞానమఖండమైనదిగా నుండుట చేత నిచ్చటి త్రిపుట వ్యవహారము సంభవించదు.

వ్యావహారిక త్రిపుటి జ్ఞాన నివృత్తిని, అఖండమైనట్టి యాత్మ జ్ఞాన ప్రాప్తిని పొందుటకు వలయు విషయ పరిజ్ఞానమును ప్రదానము చేసినట్టి యీస్థలపు టుపదేశము వలన విశేషమైన లబ్ధిని పొంది కృతార్థులు కావలెనని ఆశించుచు నీ యాశీర్వచనమునకు ముగింపు పలుకనైనది.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు చంద్ర శేఖర శివాచార్యుల వారు జ్ఞానము నిష్పన్నమైన స్థితిలో నుండెడి యాధ్యాత్మిక స్థితి గురించి వివరించిరి. జ్ఞేయమనెడిది లేని స్థితి యందున జ్ఞాననిష్పత్తి సంభవించుననది తెలియజెప్పిరి.

క్రియా నిష్పత్తిని పొంది భావనిష్పత్తిని శివోఽహం యనుభవించిన శివయోగికి జ్ఞాన నిష్పత్తియు సహజముగానే సిద్ధించును. భావ నిష్పత్తి స్థలమున అనెడిది భగ్నమై పోవును. సర్వమూ శివమయమని భావించిన పిదప నచ్చట "అహం"కు స్థానముండదు. జీవత్వమున్న స్థితిలోనే "అహం" అనే భావన కాస్కారముండును. ఇట్టి స్థితిలోన నెరుగ వలసిన దేమియును నుండదు. తానై శివుడైయున్న వానికి శివుని గురించిన యెరుక వలన గల్గెడి ప్రయోజనము శూన్యము. తనను తానెరిగి శరణుడై శివుని నెలవున శివుని నొక భాగమై పోయిన స్థితిలో తన గురించి యెరుగ వలసిన దేముండును. జగమే శివుడు, శివుడే జగమని యెరిగిన వారికి జగములో నెరుగ వలసినదేమియునుండవు. జీవత్వమున్న కడ యెరుక వీలయునే జీవత్వమును వీడి శివత్వము పొందిన వానికి యెరుక యేల? శివుని సర్వజ్ఞత్వము జ్ఞాన నిష్పత్తి స్థలి లక్షణమైన వెనుక యెరుగవలసిన దేమి?

సాధనా సమయమున భక్తాది స్థలముల లోన సాధకుడు గడించినట్టి జ్ఞానమును స్వాయత్తమని యందురు. ఆయత్తమును నాధారముగా గొని సాధకుడు పొందెడి వస్తునిష్ఠిత, జీవ నిష్ఠిత, ప్రపంచ నిష్ఠిత మరియు శివ నిష్ఠిత జ్ఞానమే స్వాయత్తమని యెరుగవలెను. గురు దత్తమైన దీక్షా శిక్షా, జ్ఞానాదులు ఆయత్తములనబడునని గుర్తించగలరు.

శరణ స్థలికి యీ రెండును ప్రాపంచిక సంబంధముగల జ్ఞానముగా కన్పట్టును. మానవుడు తన స్వాప్నిక స్థితిలో తాను గడించిన స్వాప్నిక జ్ఞానము స్వప్నోత్తర దశలో నిష్ప్రయోజన కారకమని యెరుగును. అదే విధిన శరణుడు ఆయత్త స్వాయత్తముల ననావశ్యకములని భావించును. తత్ఫలితముగా ఆయత్త స్వాయత్తములు నష్టమైపోవును. శివత్వము వాటి స్థానము నాక్రమించికొనును.

శివుని జ్ఞాన స్వరూపునిగా భావించవలెనని చెప్పబడినది. "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" యనెడి శ్రుతి వాక్కుల నెరుగని వారెవ్వరు. అనిల-కాష్ఠ న్యాయమున, శివ సన్నిధిన చిదానందముననుభవించెడి శరణుడు చిత్ స్వరూపియై వెలుగొందును. అతని పలుకులలో శివజ్ఞాన ముట్టిపడుచుండును. అతని చేత చూడబడిన, తాక బడిన వారెల్లరు శివజ్ఞానులగుచున్నారు. శరణుని చేత సత్క్రియగాను, శరణుని నడత శివాచారముగాను కన్పట్టును. ఈ విధముగా శరణుడు శివుని వలె జ్ఞాన ప్రదాతయై జ్ఞేయుడగు చున్నాడు. అతని కిజ్ఞేయమనెడి దుండదు. ఈ విషయమును విశదీకరించెడి యీ క్రింది పద్యము గనుడి:

**ఎరుగవలసిన దెరిగియూ యెరుక చేత**
**గురువు చూపిన మార్గాన గుర్తునెరిగి**
**హరుని యక్కున నున్నట్టి శరణ విభుని**
**కెరుగ వలసిన దేముండు? యెరుక యేల?** (మార్గం పెద్ద వీరప్ప, అముద్రితము)

"శుభం భూయాత్"

## ఆశీర్వచనము - 1 :

## పిండాకాశ స్థలము :

ఆధ్యాత్మిక జ్ఞాన పిపాస గల్గినట్టి సద్భక్తులింతవరకు జ్ఞాననిష్పత్తి స్థలము గురించిన విషయములను క్రితపు టాశీర్వచనము వలన తెలిసికొనిరి.

లింగషట్ స్థలాంతరతమగు శరణ స్థలములోని పిండాకాశ స్థలము గురించి తెలిసికొనవలసి యున్నది. పిండాకాశ స్థలమున ప్రవేశించెడి శివయోగి పిండాకాశము బ్రహ్మాండాకాశములొకటేయని భావించి, తదనుగుణముగా నాత్మ పరమాత్మ లొకటేయని యెరుగును. ఈ విషయమును గురించి శ్రీ జగుద్గురురేణుకా చార్య భగవత్ పాదుల వారు నగస్త్యునకీ విధముగా నుపదేశమునిచ్చిరి.

**యథా పిండస్థ ఆకాశస్తథాఽ త్మా పూర్ణ ఉచ్యతే।**
**ఏతదర్థవివేకో యః పిండాకాశస్థలం విదుః॥** (సి.శి.19-51)

దీని తాత్పర్యమేమనగా నేవిధముగా పిండము లేదా శరీరములో నుండెడి యాకాశము పూర్ణమైనదని చెప్పబడుచున్నదో నదే విధముగా పిండములో నుండెడి యాత్మయు పూర్ణమైనదని చెప్పబడుచున్నదనెడి విశిష్ట జ్ఞానమెవ్వరికి యుండునో అట్టి వానిని పిండాకాశ స్థలియని యందురు.

"ఏక ఏవ హి భూతాత్మభూతే భూతే వ్యవస్థితః" అనెడి యమృత బిందోపనిషత్తు వాక్యము చెప్పిన యటుల నొక్కడే యైన పరమాత్ముడు సర్వత్ర వ్యాపించి యున్నాడు. ఒకే యొక మహాకాశము ఘట మఠాదులలో ఖండితమై యుండినట్లు దోచుచున్నను వాస్తవముగా నయ్యదియొక్కటే యనెడిది సత్యము. దేహస్థుడైనట్టి యాత్మయు నట్టిదే. ప్రతి యొక్క పిండములో నుండెడి యాత్మయును నొకేటయనియును, యఖండమైనదనియును యెరుగవలెను. జ్ఞాన నిష్పత్తి స్థలములోని శివయోగి కిట్టి జ్ఞానము కలుగగా నతడు పిండాకాశుడగుచున్నాడు.

ఈ విషయము నింకను స్పష్టపరచుట కొరకు పూజ్యపాదులు నగస్త్య మహర్షి నుద్దేశించి యీ క్రింది యుపదేశమునిచ్చిరి.

**ఘటోపాధిర్యథాఽ కాశః పరిపూర్ణః స్వరూపతః।**
**తథా పిణ్డస్థితో హ్యాత్మా పరిపూర్ణః ప్రకాశతే॥** (సి.శి.19-52)

దీని తాత్పర్యమేమనగా నే ప్రకారముగా ఘటరూపమైన యుపాధిలోని యాకాశమేవిధముగా పరిపూర్ణమై యుండునో అదే విధముగా బిండ స్థమైనట్టి యాత్మ పరిపూర్ణమైనదై ప్రకాశించుచుండును.

పాంచ భౌతిక ప్రపంచము నందున నాకాశము మాత్రమే యాత్మతో పోల్చుటకు తగినదై యున్నది. అది యాత్మవలె వ్యాపకత్వము మరియు సూక్ష్మత్వమును గలిగి యున్నది.

**అంతః స్థితం పరాకాశం శివమద్వైతలక్షణమ్।**
**భావయేద్ యః సుమనసా పిండాకాశః స ఉచ్యతే॥**
**శివాగారమిదం ప్రోక్తం శరీరం బోధదీపితమ్।**
**షట్త్రింతత్త్వఘటితం సుమనః పద్మపీఠకమ్॥**
**పరాకశ స్వరూపోహి ప్రకాశః పరమేశ్వరః।**
**హృదాకాశ గుహాలీనో దృశ్యతేఽ న్తః శరీరిణాం॥** (సి.శి.19-53-55)

దీని తాత్పర్యమేమనగా నేవిధముగా నద్వితీయమైనట్టి చిదాకాశ స్వరూపుడైన వాడే శివుడనెడి యఖండమైన విధముగా దృఢమైనట్టి మనస్సు చేత భావించుటే పిండాకాశము.

**"ఏక ఏవ రుద్రో నద్వితీయాయతస్థే"**

**"శివ ఏకో ధ్యేయః శివంకరః"** మొదలగు శ్రుతి వచనముల యందున శివుడొక్కడే అయి యున్నాడని చెప్పబడినది. అతనికి సరి సమానమైన వారు వేరుగా నెవ్వరును లేరు. అందుకే, అతనిని ఆత్మస్వరూపముగా భావించికొని ధ్యానించవలెననియుపదేశింపబడినదని గ్రహించగలరు. ఈ విధముగా శ్రుత్యాగమములు శివపరమాత్ముని యఖండత్వము ప్రతిపాదించబడినది. వస్తువు స్థితియునట్టులే గలదు. అయితే సాధకుడెంతవరకు

నా విధముగా ధ్యానాసక్తుడు కాడో అంతవరకు నతనికి దీని యవగాహన గలుగదు. ఈ కారణముననే శ్రీ భగవత్‌పాదుల వారు "సుమనసా భావయేత్" అని ప్రబోధించిరి. మనస్సులోని వికృతత్వమును దూరము చేసికొని సాత్విక భావమును పెంచికొనవలెను.

అప్పుడు గాని యది సుమనస్సు కాజాలదు. సుమనస్సు గల్గిన పిదప పిండ బ్రహ్మాండములలోన శివుడొక్కడే గలడని భావించికొని దాని విలక్షణమైనట్టి యానందము ననుభవించగలడు.

ఈ జగత్తు నందలి యెనుబది నాల్గు లక్షల ప్రకారముగా నుండెడి జీవరాశుల యందున మనుష్య జన్మ శ్రేష్ఠమైనదని యెంచబడినది. ఇంతే కాదు పూర్వమున తెలిపిన విధముగా నే మానవుని దేహము నందున శివధ్యానాదులు నడుచుచున్నవో ఆ దేహము సాక్షాత్తుగా శివమందిరమని పూజ్య పాదుల వారు సెలవిచ్చిరి.

"దేహః శివాలయః సాక్షాత్ తత్రాస్తే పరమః శివః" అనెడి వాతులోత్తరాగమపు వచనము చెప్పినయటుల మానవుని దేహము శివాలయమై యున్నది. ఈ శివాగారము శివాది భూమ్యాంతము వరకును గల ముప్పది యారు తత్త్వములనెడి స్తంభముల చేత నిర్మింపబడినది. ఇట్టి శివాలయము నందున సుమనస్సనెడిదే పద్మ పీఠము. ఇచ్చట జ్ఞానమే దీపముగా నుండును. పరాకాశ స్వరూపుడైన పరమేశ్వరుడు హృదయాకాశమనెడి గుహ యందున నడగి కూర్చుండి యున్నాడు. గురూపదేశమూలకముగానా గుహ యందున నెవ్వరుబోధ దీపమును ప్రజ్వలింతురో వారి కతడును భవ గోచరమగ ౹చున్నాడని పూజ్యపాదులు తెలియజేసిరి.

వెలుపల దేవాలయములను నిర్మించి దేవతా విగ్రహములను ప్రతిష్ఠాపన చేసెడి క్రియను మనము బహుళ ప్రదేశములలో చూస్తూ ఉన్నాము. ఈ వ్యవహారములయందున మనుష్యులు దేవాలయమును నిర్మింతురు.

మానవ దేహ ధారియగు సద్గురువుల వారు నానతి నివ్వగా నొక శిల్పి సులక్షణమైనట్టి మూర్తిని మలచి ఇచ్చుచున్నాడు. శ్రీ గురువద్దానికి సంస్కారమును జేసి మంత్ర సామర్థ్యము చేత చేయబడెడి యభిషేకాది క్రియల మూలకముగా విగ్రహము నందున నుండెడి శిలాత్వమును దూరము చేసి, శివకలాసంయోజనమును జేసి, శివలింగాదుల యందున ప్రాణప్రతిష్ఠను జేసిన పిదప మూర్తిని మందిరముల యందున స్థాపింతురు.

భక్తులైన వారు దేవాలయముల కడకు పోయి భక్తితో భజించి తమ మనోకామనను పూర్తి చేసుకొనుచున్నారు. ఈ వెలుపలి దేవాలయములు మానవ నిర్మితములు. దేహమనెడి దేవళము దీని కంటెను విలక్షణమైనదై యుండును. దేహమనెడిది దైవ నిర్మితమైన దేవళము. అందుచేత దీనినిదివ్యమైనట్టి దేవాలయమని పిలువవలెను. ఈ దివ్య దేవళమున శివుడెవ్వరి చేతనూ ప్రతిష్ఠాపన చేయబడిన వాడు కాడు. "తత్ సృష్ట్వా తదేవాను ప్రావిశత్" అనెడి శ్రుతి వచనాను సారముగా శివుడు స్వతఃగా తానే దేవాలయమును నిర్మించి దానిలో తన చేత తానే ప్రతిష్ఠితుడై యున్నాడు. అందుకే వీరశైవ సిద్ధాంతమునందున దేహమనెడి దేవుని మందిరము నందలి శివుని వీక్షించ వలెననియును వెలుపలి దేవాలయముల కంటెను దేహమనెడి దేవాలయమే గొప్పదని చెప్పబడినది.

ఈ విషయమున బసవన్న గారు చెప్పినట్టి యీ వచనము గమనార్హమైనదై యున్నది.

**ఉళ్ళవరు శివాలయ మాడువరు**
**నానేన మాడువె బడవనయ్యా**
**ఎన్న కాలేకంభ, దేహవె దేగుల**
**శిరవె హొన్న కలశవయ్యా**
**కూడల సంగమ దేవా! కేళయ్యా**
**స్థావరక్కెళి వుంటు, జంగమక్కళివిల్ల**

**దీని తెలుగు రూపమిది :**

**ఉన్నవారు శివాలయము జేతురు**
**నేను దేనిని చేసెద? బడుగునయ్యా**

**నా కాలే కంభము దేహమే దేవళము**
**శిరమే పొన్ను కలశమయ్యా!**
**కూడలసంగమ దేవా! వినుమయ్యా**
**స్థావరమునకు చెడుగలుగును**
**జంగమునికి చేటు లేదు.**

ఈ వచనము ప్రకారము, దేహమే శ్రేష్ఠమైన దేవాలయము.

ప్రతి యొక్కరి హృదయాకాశమనెడి గుహమందున పరమాత్మ నివసించి యున్నను మన దేహము నందలి యింద్రియము లన్నియును బహిర్ముఖముగా నుండుట చేత మనము లోపలికి చూడక దానిని మరచి వెలుపలకు తిరుగుచున్నాము. "కశ్చిద్ధీరః ప్రత్యగాత్మానమైక్షత్ వ్యావృత్త చక్షుః అమృతత్వమిచ్ఛన్" అనెడి శ్రుతి ప్రమాణము ప్రకారముగా మనోవికారములకు లోను గాకుండగ నుండెడి యెవ్వరో నొక్క ధైర్యశాలితన యింద్రియముల నన్నింటిని యంతర్ముఖముగా జేసికొని యంతస్థుడైన పరమాత్మ స్వరూపము ననుభవించుచున్నాడుమనోవృత్తి యంతర్ముఖముగా నుండెడి వాని జతకు నా హృదయాకాశమున గురువు యొక్క బోధ రూపమైన దీపము ప్రజ్వలించుట వలన నతనికి హృదయ గుహయందలి పరాత్పర వస్తువు గోచరించును.

జగత్తు నందున మనికిపట్టునుగాని మందిరమును గాని నిర్మించునప్పుడు వలయు వస్తువులొకే విధముగా నుండును. రాళ్ళు, మట్టి, కట్టెలు, ఇటుకలు, ఇనుము, సిమెంటు, సున్నములనెడివే యీ వస్తు సామాగ్రి. అయితే నిర్మితమైనట్టి భవనము నందునదేవుని యొక్క నిత్య నివాసముండెడి స్థానమునకు మందిరమనియు, సంసారులు వసించెడి భవనమునకు మనికిపట్టు లేదా గృహమనియును పేర్లిడబడుచున్నవి. మందిరము గురించి యుండెడి శ్రద్ధా భావనయిల్లు యెడల నుండజాలదు. ఎన్నియో సందర్భముల యందున భక్తులైన వారు మందిరములో దేవుని విగ్రహము యొక్క దర్శనమును పొందుట యసాధ్యమైనప్పుడు మందిరము యొక్క శిఖరమును దర్శించి తమను తాము ధన్యులైన వారిగా భావించి కొనుచున్నారు.

మందిరము యొక్క పరిక్రమమును చేసి మందిరపు వెలుపలి వలయమునకే నమస్కారమును జేసెడిభక్తులును గలరు. ధనికులు కట్టించినట్టి మనికి పట్టులు మందిరము కంటెను భవ్యములు, ఆకర్షణీయములు, బహుమూల్యము గల వస్తువుల చేత గూడియున్నవై యుండును. అయినా దానిని నమస్కరించుటగాని, పరిక్రమము చేయుటయుగాని కన్పట్టదు. దీనికి గల కారణమేమనగా మందిరముల యందున భగవంతుడు నివసించునని భావింపబడుచున్నది. ఇటులనే జగత్తున నుండెడి మనుష్యుల శరీరములు సమాన తత్త్వముల చేత నిర్మాణమై యున్ననూ, యెవ్వరి శరీరము నందున భగవంతుని సాక్షాత్కారము గల్గి యున్నదో అంతటి శివయోగుల శరీరములు దేవాలయములుగా బిలువబడుచున్నవి. అవి లోకమునందున పూజ్యమూ అయి యుండును. అందుచేతనే పిండాకాశ స్థలపు శివయోగి యొక్క శరీరమును మందిరముతో పోల్చుట నిచ్చట గానవచ్చును.

గర్భగుడి యందున నుండెడి దేవతా విగ్రహము మనకు కనిపించవలెనన్నచో నచ్చట నొక దీపము యొక్క ఆవశ్యకత యుండును. అందుకే ప్రాచీన కాలము నుండియూ గర్భగుడుల యందున నెయ్యి లేదా నూనెల నందాదీపమును కాయుచు నుండెడి దానిని గాంచుచున్నాము. అటులనే ముప్పది యారు తత్త్వముల చేత నిర్మింపబడిన మన శరీరమనెడి దాని గర్భగుడి యందున, అనగా హృదయ కుహరమునందున పద్మపీఠము మీద పరమాత్ముని నివాసము గలదు. గర్భ గుడి యందున దీపము లేప్పుడు నిచ్చటి విగ్రహము కనిపించని యటుల హృదయ మందిరము నందున బోధా దీపము లేకుండుట చేత నందరి హృదయస్థుడైన శివునియనుభవించ వీలుపడదు. అద్దాని యోగ్యతా సంపన్నులైన శివయోగులు జ్ఞాన జ్యోతి మూలకముగా నా పరమాత్ముని సాక్షాత్కారమును బడసిన వారై యుందురు. ఇచ్చట శివయోగి యొక్క స్థూలశరీరమే మందిరము. అతని పరిశుద్ధమైన మనస్సే పద్మపీఠము, అతని హృదయము నందున ఉదయించిన జ్ఞాన జ్యోతియే యచ్చట యుండెడి నందా దీపమని తెలిసకొనవలయును.

తన దేహము నందున శివుని గాంచెడి శివయోగి యొక్క దేహమును శ్రీజగద్గురు భగవత్పాదుల వారు మందిరము తోపోల్చగా, భగవద్గీతలో నిద్దానికి క్షేత్రమనెడి పేరు నివ్వనైనది. ఏ స్థలము నందున దేవుని నివాసముండునో దానినే క్షేత్రమనియందురు. మన దేశమున తీర్థాటన కెంతో

ప్రాముఖ్యత యివ్వబడినది. మనుష్యుడు తన భోగభూమియైన మనికిపట్టును విడిచి పెట్టి యోగభూములైన క్షేత్రములకు దర్శనార్థమై వచ్చి, ఆయా క్షేత్రములయందున నివాసము చేసిన పిదప, ఆయా క్షేత్రముల యొక్క ప్రభావము మూలకముగా నతని యంతఃకరణము పరిశుద్ధమగు చున్నది. ఇటుల పరిశుద్ధని గొనిన యంతః కరణము నందుననే చివరకొక దినమున బరమాత్ముని యనుభూతి యగుచున్నది. ఈ స్థితి యెప్పుడు ప్రాప్తమగునో అప్పుడే దేహము క్షేత్రమువలె పూజ్యమని యెన్నబడును. మరల మరల క్షేత్రదర్శనమును జేసికొనుట వలన గల్గెడి ప్రయోజనమేమనగా చివరికొక దినమున తన దేహమునే క్షేత్రముగా పరివర్తన చేసుకొనునని గ్రహించగలరు.

వీరశైవ సిద్ధాంతము నందున స్థూలదేహము మీద యిష్టలింగమును ధరించెడి పద్ధతి యనాది కాలము నుండియూ వచ్చుచున్నది. ఈ ధర్మము యొక్క సంస్థాపనాచార్యులైన జగద్గురువులు పంచాచార్యులు దేహము మీద లింగమును ధరించెడి యీ తత్త్వమును నుపదేశించి వెలుపలి దేవాలయము కంటెను దేవాలయముగామార్చికొనబడిన దేహమే యుత్తమమైనదని యుద్భోధించి రనెడిది కన్పట్టుచున్నది. బాహ్యములోని యీ యిష్టలింగము మూలకముగానే సాధకుడైనవాడు శివయోగ మార్గముననుసరించి తన యంతరంగములోని ప్రాణ లింగ భావలింగముల యనుసంధానము చేయుటను ప్రారంభించును.ఇటుల నీ శివయోగి యొక్క శివయోగ సాధన బలపడి చివరన "శివోహం" అనెడి భావన దృఢపడును. ఈ 'శివోఽహం' అనెడి దానిని వీరశైవాచార్యులు భావలింగమని పిలిచిరి. దీనినే మహాలింగమని పిలిచెడి పద్ధతియును గలదు. ఇటుల శివయోగి యైనవాడు తన హృదయము నందున చిదాకాశ రూపమైన మహాలింగము యొక్క యనుసంధానమును చేయుచు, తన హృదయము నందలి చిదాకాశ రూపమైనట్టి మహా లింగము యొక్క యనుసంధానమును చేయుచు తన యొక్క యాత్మనే పరమాత్మ రూపముగా దెలిసికొనిన పిదప నతనికి పిండాకాశుడను సంబోధన లభ్యమగును.

శివయోగి యొక్క కాయమును శివ పురముతో పోల్చెడి ప్రయత్నమును నీ యుపదేశములోన గాంచగలము.

**ఏతచ్ఛివ పురం ప్రోక్తం సప్తధాతుసమావృతమ్।**
**అత్ర, హృత్పంకజం వేశ్మ సూక్ష్మాంబరమనోహరమ్॥**
**తత్ర సన్నిహితంసాక్షాత్ సచ్చిదానందలక్షణమ్।**
**నిత్యసిద్ధః ప్రకాశాత్మా జలస్థాకాశ వచ్ఛివః॥** (సి.శి.19-56)

ఈ యుపదేశము యొక్క సారాంశ మేమనగా సప్తధాతువుల చేత సమావృతమైన యీ శరీరము శివపురమని పిలువబడినది. ఇందులోని దైనట్టిదియును, సూక్ష్మాకాశముతో కూడికొని యున్నట్టి దియు నయిన హృదయ కమలము నందున శివపురముయొక్క యంతఃపురముండును. అది శివుని స్థానమై యున్నది. దీనితో సాక్షాత్తు సచ్చిదానంద స్వరూపుడును, నిత్య సిద్ధుడును, ప్రకాశమానుడు నయిన శివుడు జలములో విరాజమానమై యుండెడి యాకాశము భాతి ప్రకాశించుచుండును.

ఇచ్చట గ్రహించ వలసిన విషయమొకటి గలదు. బ్రహ్మాండములోను పిండాండములోను ఆకాశము గలదు. ఈ రెండును భిన్నమైనవి కావు. అభేదము గలదని గుర్తించవలెను. అదే విధిన బహిరాకాశములో నుండెడి వాడగు శివునికిని, పిండాకాశములోని శివునికినిభేదములేదు.

శివుడొక్కడే యిరు ప్రదేశములలో కన్పట్టును.అదెట్టులనగా విశాలమైన జలరాశిలో కనిపించెడి యాకాశమునకును, నుపరితలమున నుండెడి యాకాశమునకును బేదముండదు కదా. బహిరంగములోని శివుడే యంత రంగమున నుండునని గ్రహించగలరు.

అపరిచ్ఛిన్నుడైన శివుడు పరిచ్ఛిన్నమై యుండెడి హృత్కమలము నందున యెట్టుల నుండగలడనెడి ప్రశ్నను దృష్టి యందిడికొని శ్రీ భగవత్ పాదుల వారి యుపదేశము నిచ్చిరి.

**అంతరాకాశ బింభస్థమశేషోపాధివర్జితమ్।**
**ఘటాకాశ మివాచ్ఛిన్నం భావయేచ్ఛిన్మయం శివం॥** (సి.శి.19-57)

దీని తాత్పర్యమేమనగా హృదయాకాశబింబము నందున సుస్థితిన యుండెడి వాడును, సమస్తోపాధుల నుండియు రాహిత్యమును పొందినవాడును, చిన్మయుడైన శివుడు ఘటాకాశము వలె పరిచ్ఛిన్నుడై యుండునని భావించికొనవలెను.

పిండాకాశ స్థలమున నుండెడి శివయోగి శ్రీ రేణుక భగవత్పాదులవారి యాదేశానుసారముగా దేహమునే కైలాసముగా భావించి కొనవలెను. కైవల్య ప్రదుడు కైలాసమున నుండి యున్నటులే తన హృదిలోను గలడని భావించి కొనవలెను. అంతర్ముఖుడై హృత్కమలమనెడి యంతః పురమున విరాజిల్లెడి శివుని దర్శించి శివునితో సామరస్యమును పెంపొందించి కొనవలెను. సాధకులీ విషయమును గ్రహించి పిండాకాశ స్థలుని నుండి ప్రేరణను పొంది యాధ్యాత్మిక ప్రగతిని సాధించవలెనని యాశీర్వదించనైనది.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేష ప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యులవారు నాత్మ పరమాత్మల కభేదము గలదని తెలియజెప్పిరి. ఇది తెలిసికొనిన వాడే పిండాకాశ స్థలియని తేల్చి చెప్పిరి.

పిండాకాశమనెడి పదము తాత్త్విక భావమునకు సంబంధించిన యంశము. పిండమనగా కాయము. "ఏతత్ శివపురం ప్రోక్తం సప్తధాతు సమావృతం" యనెడి భగవత్పాదుల వారి వాక్కుల (సి.శి. 19:56) ప్రకారము సప్తధాతువులతో కూడియున్న శరీరమే పిండమనబడుచున్నది. శివ–జీవాభేద బోధచేత దీపితమైన దేహము శివాలయమగునని తెలుపబడినది. (సి.శి.19 : 54). దేహమే దేవాలయమనెడి యుపనిద్బ్రహ్మ వాదుల వాక్కులను, దేహవేదేగుళ మనెడి బసవేశ్వరుల వాక్కులును స్మరణీయములు.

ప్రతికాయములోను నొక యాకాశముండునని భావింపబడుచున్నది. ఛాందోద్యోగోపనిషత్తు దీనికి అభ్యంతరాకాశమనెడి పేరిడినది. కొందరు దీనిని అంతరాకాశమని పిలుతురు. మరికొందరు దీనిని చిదాకాశమనియును పిలుతురు. శ్రీ భగవత్పాదుల వారు నీ యాకాశమును పిండాకాశమనెడి పేరుతో పిలిచిరి.

శివునిలోను నొక ఆకాశముండుననియును, దానిని పరాకాశమని యందురనియును తెలియుచున్నది. ఇది అపరిచ్ఛిన్నమైనదై అపరిమిత స్వభావము గలదైయుండునని తెలుపబడుచున్నది. ఛాంద్యోపనిషత్తు నిద్దానిని బ్రహ్మకాశమని పిలువగా శ్రీ భగవత్పాదుల వారు దీనిని పరాకాశమనెడి పేరుతో గుర్తించిరి.

సామాన్యునికి యీ రెంటిలోను భేదము కన్పట్టును. దేహోపాధియందున నుండెడి పిండాకాశము పరిమితమైనదిగాను పరిచ్ఛిన్నమైనదిగాను దోచును. ఇట్టి దృక్పథము భేదదృష్టిని ప్రతిపాదించెడి ద్వైతమున కనుగుణముగా నుండియున్నది. శక్తి విశిష్టాద్వైత సిద్ధాంతమీ వాదన నంగీకరించదు. అభేద దృష్టిని ప్రతిపాదించెడి యీ వాదము ప్రకారము భేదబుద్ధి యనెడిదొక భ్రమ. మాయయే యీ భ్రమకు జన్మభూమి. మాయ మిశ్రితత్త్వముల కనుబంధముగా నుండెడి అవిద్య వలన గల్గును. అవిద్య శుద్ధ విద్యల నధిగమించి, క్రియాశక్తి విశిష్టమైన యీశ్వరతత్త్వమును దాటి, యిచ్ఛాశక్తికి నెలవైన సదాశివతత్త్వము నతిక్రమించి శివుని సన్నిధిన శక్తిస్థానమున నుండెడి శరణునకు భేదబుద్ధి జనించునే?

ఈ స్థలమున సాధన చేసెడి వాడు పరాకాశము మరియు పిండాకాశముల మధ్యన భేదమును గాంచడు. అభేదమును దర్శించును. పంచభూతములలో నొక్కటైన యాకాశము జలకుల కుంభములలో నేవిధిన పరిచ్ఛిన్నమైన దానివలె గోచరించునో అదేవిధముగా పరాకాశము దేహియందు పిండాకాశమై గోచరించును. ఘటము భగ్నమైన పిదప ఘటాకాశము ఆకాశములో లీనమైన యటులే కాయము నిర్గమించగా పిండాకాశమనెడిది పరాకాశములో లీనమేననెడిది యీ స్థలియొక్క యెరుకలో నుండెడి యంశము. అందుకే యితడు పిండాకాశస్థలిగా గుర్తింపబడినాడని గ్రహించగలరు. పిండాకాశ పరాకాశములో నభేదమును గాంచెడి వాడే పిండాకాశ స్థలియని తెలిసికొనగలరు. ఇట్టి వాని కాయమే కైలాసమని చెప్పబడినది. శ్రీ బసవేశ్వరుల వారి క్రింది వచనమును గనుడి :

**శరణ నిద్ర గైదడె జప కాణిరొ**
**శరణనెద్దు కుళితడె శివరాత్రి కాణిరొ**
**శరణ నడెదడె పావన కాణిరొ**
**శరణ నుడిదడె శివతత్త్వ కాణిరొ**
**కూడల సంగన శరణన**
**కాయవె కైలాస కాణిరొ** (శ్రీ బసవేశ్వర వచ.872)

ఈ వచనపు తెలుగు రూపమిది :

**శరణుడు నిద్రజేసినచో జపము గాంచుడో**
**శరణుడు లేచి కూర్చుండిన శివరాత్రి గాంచుడో**
**శరణుడు నడిచినదే పావనము గాంచుడో**
**శరణుడు నుడివినదే శివతత్త్వము గాంచుడో**
**కూడల సంగని శరణుని**
**కాయమే కైలాసము గాంచుడో**

"ఏతత్ శివపురం ప్రోక్తం" అనెడి శ్రీ భగవత్పాదుల వారి వాక్కులను గురించి వ్యాఖ్యానించుచు, "సప్త ధాతుభిః పూర్యత ఇత్యేతచ్ఛరీరమేవ శివపురం పత్తనమిత్యర్థః" అని నుడివిని మరితొండదార్యులవారి నుడువులు స్మరణీయములు. ఇట్టి శివాగారములో శరణుడు గాంచెడి శివదర్శనము గురించి తెలిపెడి క్రింది వచనమును గనుడి :

**బెళగి నొళగణ బెళగు మహాబెళగు ।**
**శివశివా, పరమాశ్రవె తానాగి,**
**శతపత్ర కమళ కర్ణికా మధ్యదల్లి**
**స్వతః సిద్ధనాగిప్ప నమ్మకూడల సంగమదేవ** (శ్రీ బసవేశ్వర వచ. 816)

దీని తెలుగు రూపమిది :

**వెలుగులో వెలుగు మహా వెలుగు।**
**శివశివా! పరమాశ్రయమే తానై**
**శతపత్రికమల కర్ణికా మధ్యమందున**
**స్వతః సిద్ధుడుగా నుండును**
**మాదు కూడల సంగమ దేవుడ**

"శుభం భూయాత్"

## ఆశీర్వచనము - 1 :

## బింద్వాకాశ స్థలము :

ఆగమ శాస్త్రమునందున నాదము, బిందువు మరియు కళ యనెడి శబ్దములు నుపయోగింపబడినవి. నాదమనగా శివుడనియును, బిందువనగా శక్తియనియును కళయనగా జగత్తనియును తెలుపబడినది. అయితే కొన్ని యాగమములలో బిందువనగా శివుడని చెప్పబడినది. కిరణాగమమునందలి యీ ప్రమాణము గమనించదగినదైయున్నది.

**సదాశివాది తత్త్వానాం కారణం వ్యాపకః పరః ।**
**బిందురూపః శివో ధ్యేయో బింద్వాకాశ ఇతీర్యతే ॥**

బిందువనగా శివుడని భావించుటలోనే యౌచిత్యము గలదని గ్రహించగలరు. పరశివుడు ప్రతియొక్కరి శరీరమునందున నాత్మరూపముగా నెలయుచున్నాడు. బిందురూపమున నుండెడి యాత్మయు నాకాశమువలె సర్వత్ర వ్యాపించియున్నది. ఈ విషయము నెరిగిన పిండాకాశ స్థలుడు బిందాకాశ స్థలుడనిపించికొనును. ఇట్టి యంశములను శ్రీ రేణుక భగవత్పాదులవారు లింగస్థలములలో నొకటియగు శరణ స్థలములోని బింద్వాకాశస్థలమును నుపదేశించిరి.

శ్రీ భగవత్పాదుల వారు శ్రీ యగస్త్యఋషి నుద్దేశించికొని యీ విధముగా నుపదేశించిరి :

**యథాஉకాஉశో విభుర్జ్ఞేయః సర్వప్రాణ్యుపరి స్థితః ।**
**తథాత్మేత్యుపమానార్థం బింద్వాకాశస్థలం విదుః ॥** (సి.శి. 19-59)

ఈ యుపదేశపు భావార్థమేమనగా సమస్త ప్రాణుల యుపరితలముననుండెడి యాకాశమెటులైతే వ్యాపకమైనదని యెరుగబడుచున్నదో అటులనే యాత్మయును వ్యాపకమైనదని తెలిపెడి భావమును విద్యాంసులు బింద్వాకాశ స్థలమని యందురు. పరమాత్మకు నుపమానము నిచ్చుటకై సూక్ష్మముగా, సర్వత్ర వ్యాపకము నయినట్టి యొకేయొక భూతమేదనగా నాకాశమే. అందుచేత నిచ్చట నాకాశపు టుదాహరణ యివ్వనైనది.

ఈ స్థలపు విషయమును పూజ్యపాదులు విశ్లేషించుచు వాయువు యొక్క యుపమానము నిచ్చిరి. ఉపదేశము గనుడి :

**యథైకో వాయురాఖ్యాతః సర్వప్రాణిగతో విభుః ।**
**తథాఽఽత్మా వ్యాపకః సాక్షాత్ సర్వప్రాణిగతః స్వయమ్ ॥** (సి.శి. 19-60)

దీని తాత్పర్యమేమనగా నే ప్రకారముగా వాయువొక్కటే సమస్త ప్రాణులయందున నుండునో అదే విధముగా వ్యాపకత్వము గల్గినట్టి యాత్మ సర్వజీవగతత్వముతో విరాజిల్లుచుండును.

ఆకాశము ప్రాణులలోపల వెలుపల వ్యాపించియున్న యటులే వాయువు ప్రాణుల లోపల వెలుపల వ్యాపించియున్నది. నాదము మరియు ఆకాశము సూక్ష్మముగా నుండుటచేత నెక్కుడు జనుల యనుభవమున కగోచరములైయున్నవి. వాయువు వీటికంటెను స్వల్పముగా స్థూలమైనదైయుండుటచేత నందరికినీ యనుభవ గోచరమైనదైయున్నది. అందుచేత ప్రతిపాద్య వస్తువు సర్వానుభవ సిద్ధమైన యుపమేయము మూలకముగా తెలియజేయుటకొరకు వాయువు యొక్క యుదాహరణ నివ్వనైనది. పృథ్వి, అగ్ని మరియు జలతత్త్వముల కంటెను వాయుతత్త్వము సూక్ష్మమైనదిగాను, వ్యాపకమైనదిగాను నయియున్నది. అయితే ఆకాశము కంటెను పరిచ్ఛిన్నమైనదై యున్నది. వాయుతత్త్వ మెల్లప్రాణుల యందున ప్రాణవాయువు రూపమున నివసించి యున్నది. ఆయా జీవుల జీవనమునకు నాధారమై యున్నది. వాయువు దేహమునుండి నిర్గమించగా, దేహము మృతదేహమగును. మూలతః వాయువొక్కటే యైనను కార్యము మరియు కార్యస్థానముల భేదముల మూలకముగా ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన మరియు సమానములనెడివిగా విభజితమై యున్నది. ఈ అయిదు విభాగములే కాదు, నాగ, కూర్మ, కృకర, దేవదత్త మరియు ధనంజయము లనెడి యుపప్రాణవాయువులు సహ ప్రతియొక్కరి దేహముల యందున నున్నవి. వాయువువలె నాత్మయు జీవులందరిలోను గలదు. వారి జీవనమున కాధారభూతమైనదై యున్నది. కాని యీ విషయమందరికినీ వేద్యముగాదు. అందరి కనుభవగోచరము కావలెననెడి యుద్దేశముతో నిట వాయువు యొక్క యుదాహరణ యివ్వనైనది.

వాయువు యొక్క వ్యాపకత్వము గురించి కఠోపనిషత్తు క్రింది విధముగా దెలిపినది :

**వాయుర్యథైకో భువనం ప్రవిష్టో**
**రూపం రూపం ప్రతిరూపో బభూవ**
**ఏకస్తథా సర్వభూతాన్తరాత్మా రూపం**
**రూపం ప్రతిరూపో బహిశ్చ ॥**

దీని భావమేమనగా నే విధముగా వాయువు తానొక్కటేయైనను భువనము నందున వివిధ రూపములను దాల్చియున్నదో అదే విధముగా పరమాత్మ వివిధములగు జీవులయంతరంగముల యందున వసించియున్నాడు.

శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారు నాత్మను అగ్నితో పోల్చి క్రింది విధముగా నుపదేశించిరి :

**యథా వహ్నిరమేయాత్మా సర్వత్రైకోపి భాసతే ।**
**తథా శంభుః సమస్తాత్మా పరిచ్ఛేదవివర్జితః ॥** (సి.శి. 19-61)

దీని భావమేమనగా నెటులైతే పరిమితిలేని యగ్ని తానొక్కటే అయ్యియూ ఎల్లెడల ప్రకాశించుచున్నదో అదే విధిన తానొక్కటే అయినట్టి యాత్మ జీవులందరి యంతరంగములలో పరిచ్ఛేదము లేనివాడై విరాజిల్లుచున్నాడు.

అగ్నియొక్క రూపములనేకములని తెలుపబడినది. వీటిలో దివ్యాగ్ని, వడబాగ్ని, జఠరాగ్ని, కాలాగ్ని యనెడివి గలవు. దివ్యాగ్ని యాకసమునందున మెరుపు రూపమున నుండును. ఒకవేళ నయ్యది భూమి మీద పడినచో అట్టి ప్రదేశమున నుండెడివారు దగ్ధమగుదురు. అందుకే వ్యక్తులు నురుములను వినిన వెంటనే పిడుగుపడునేమో యనెడి భయమునకు గురియై గడగడలాడెదరు. పరువులు పెట్టి సురక్షితమైన ప్రాంతమునకు వెడలెడి వారును గలరు. వడబాగ్ని సంద్రములో దాగియుండును. అది సముద్రములోని నీటినంతయును నింకిపోవునటుల చేయగలదు. జఠరాగ్ని జీవుల యుదరముననుండును. తినిన పదార్థములను పచనము చేయును. మృత దేహములను దహించుట కుపయోగపడుదానిని కాలాగ్నియని యందురు.

వాయువువలె అగ్నియును నెల్లకడల వ్యాపించియున్నది. అప్రకటిత రూపములో నుండుటచేత నయ్యది కంటికి కనిపించదు. ప్రకటితము కానంతవరకు అగ్నివలన ప్రమాదముండదు. ఈ సందర్భమున నగ్గిపుల్ల నుదహరించవచ్చును. ప్రకటితమైన అగ్ని మన కంటికి కనిపించును. వాయువు కంటెను నియ్యది స్థూలమైనదని గ్రహించగలరు. అగ్నివలె ఆత్మకు వ్యాపకశక్తిగలదనెడిది గ్రహణీయమైనట్టి విషయము.

శ్రీ భగవత్పాదులవారు జీవాత్మ పరమాత్మల సంబంధము నెరిగించుట కొరకు బింద్రుప్రతిబింబముల నుదహరించిరి. గమనించుడి :

**సర్వేషాం దేహినామన్తశ్చిత్ తతోఽయం ప్రకాశతే ।**
**తస్మిన్ ప్రతిఫలత్యాత్మశివో దర్పణవద్ విభుః ॥** (సి.శి. 19-62)

దీని భావమేమనగా ప్రతియొక్క జీవియొక్క అంతరంగమున జిత్తమనెడి యతి నిర్మలమైన జలముండును. ఆ జలమునందున విభుడైన పరమాత్మ దర్పణములోని బింబమువలె ప్రతిఫలించును.

ఒకే యొక వస్తువు దాని సమీపమున గల యనేకమైన దర్పణములలో ప్రతిబింబరూపమున దోచుచుండును. పరమాత్మయు తానొక్కడే యైననూ అందరి చిత్తములయందున నుండునని గ్రహించవలెను. జీవుల చిత్తములు దర్పణములవంటివని తెలిసికొనవలెను. నిర్మలమైన జలము దర్పణమువలె పనిచేయును. ఉపనిషత్తులలోను జలమును దర్పణమునకు ప్రతిగా సూచింపబడినట్లు దోచును. ఛాందోగ్య ఉపనిషత్తులోని యొక్క కథలో ప్రజాపతి యింద్రుని నుద్దేశించి మాట్లాడుచు నింద్రుడు తన రూపమును రంజణలో నింపబడిన నీరులో చూసికొనవలెనని చెప్పెను.

ప్రతియొక్కరి హృదయ కమలమునందున శివుడు బంధింపబడియున్నను నతడు పరిమితిలేనివాడై సర్వవ్యాపకుడై యున్నాడనెడి దానిని తెల్పుటకై శ్రీ భగవత్పాదులవారు క్రింది యుపదేశము నిచ్చిరి :

**ఏకో వశీకృతః సంవిత్ప్రకాశాత్మా పరాత్పరః ।**
**సర్వప్రాణిగతో భాతి తథాపి విభురుచ్యతే ॥** (సి.శి. 19-63)

దీని తాత్పర్యమేమనగా విశ్వమును మించి నిలిచుండెడి పరాశక్తి కంటెను నధికుడై యుండువాడును, పరాత్పరుడును, ఒక్కడే అయియుండెడి వాడును అయిన శివుడు నెల్ల ప్రాణుల హృదయముల యందున వశీకృతుడుగా నున్నను పరిచ్ఛిన్నుడు కాకుండ వ్యాపకుడై యున్నాడు. హారములోని మణులలో ననుస్యూతమైన సూత్రమువలె పరమాత్ముడందరిలో ననుస్యూతుడై యున్నాడు. అందుచేత నతని విభత్వమునకు నెట్టి యవరోధమేర్పడదు. శివుడు విభుడనెడి విషయము గ్రహణీయమైనదని గుర్తించగలరు.

శ్రీ భగవత్పాదులవారు తమ యుపదేశమునందలి చివరి యంశమును సూచిస్తూ క్రింది యుపదేశము నిచ్చిరి :

**ఏక ఏవ యథా సూర్యస్తేజసా భాతి సర్వగః ।**
**తథాత్మాశక్తిభేదేన శివః సర్వగతో భవేత్ ॥**
(సి.శి. 19-64)

దీని తాత్పర్యమేమనగా నొక్కడే యయిన సూర్యుడు అన్ని కాలములకు కారణభూతుడై సర్వత్ర ప్రకాశమానముగా గోచరించుచున్నయటుల శివుడు తన శక్తిభేదముల చేత విశ్వమంతటిని వ్యాపించిగొనియున్నాడు.

బిందురూపమున నుండెడి పరశివుడు సర్వవ్యాపకుడని తెలుపుటకే శ్రీ భగవత్పాదులవారు బహు విధములగుదూహరణలనిచ్చిరి. ఆకాశవాయు వగ్నిజలాలు మరియు సూర్యుడు నందరికిని ననునిత్యము ననుభవములోనికి వచ్చెడివే. వీటి నుదహరించుటలోని యుద్దేశమేమనగా విషయమును సులభగ్రాహ్యముగా నుండునటుల చేయుటే. మీరందరు నీ విషయమును గ్రహించి, మీలోనే శివుడున్నాడనెడి దానిని తెలిసికొని శివానందము ననుభవింతురు గావుత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులవారు శివుని విభుత్వము గురించియును, సర్వగతత్వమును గురించియు దెలియజెప్పిరి.

తాత్త్విక వాఙ్మయమున బిందువనెడి పదమునకు నొక ప్రత్యేకత గలదు. నాద, బిందు, కళలనెడివి మర్మగర్భితమైన పదములు. శాక్తేయులు బిందువు శక్తి స్వరూపమని యందురు. అయితే శైవులు బిందువనగా శివుడని భావింతురు. ఈ రెండు వాదములును కొంతమేరకు వాస్తవములైననూ పూర్ణ సత్యములు కావని తెలిపెడి వారును గలరు. వీరు చెప్పెడి దానిలో వీరశైవతత్త్వమిమిడియున్నది. అది యెట్టులో తెలిసికొందుము గావుత.

పరశివుడు నిర్గుణుడు. త్రిగుణముల కతీతుడు. వాఙ్మనంబుల కగోచరుడు. ఈ శివపర బ్రహ్మకు వేదములలోన "పవిత్ర"మనెడి పేరిడబడినది. ఈ విషయమును తెలిపెడి ఆంధ్ర మహాభారతములోని యీ ప్రమాణమును గనుడి.

**ఆదికి నాది లోకములకన్నిటికిం ప్రభుదవ్యయుండువే**
**దాది పవిత్ర వాచక సహస్ర పరిస్ఫుట వాక్యరూపుడం**
**హోదళన ప్రకారక శుభోదయ కారణ దివ్యనాము డం**
**భాదయితుండు దృఙ్మహితఫాలుడు లోలుడు భక్తియుక్తికిన్**

ద్రోణపర్వములోన నయిదవ ఆశ్వాసములో చెప్పబడిన యీ శివపరబ్రహ్మ తత్త్వమున కధికమైన ప్రచారము లభించలేదు. భగవద్గీత యొక్క ప్రాచుర్యము వలననే యిట్టి లోపమునకు గల కారణమని భావింపబడుచున్నది.

జగత్సృష్టి క్రమమును వివరించెడి క్రమములో శివపరబ్రహ్మలో వచ్చిన పరిణామాత్మకమైన మార్పుల గురించి వివరించుచు ప్రత్యభిజ్ఞాశైవము నాద, బిందువు మరియు కళల గురించి తెలుపును. శ్రీ చెన్న బసవేశ్వరుడు తమరి వచనములోన నీ యంశముల గురించి యీ క్రింది విధముగా తెలిపిరి :

**ఆది అనాది ఆత్మవివేకముల**
**అనుభావ సంబంధమెటులుండునని**
**ఆదియే దేహము, అనాదియే ఆత్మ**
**ఈ ఆది అనాదులపైన నున్నదే పరమ ప్రణవము**
**ఆ పరమ ప్రణవము యొక్క పరమ ప్రకాశమే చిచ్ఛక్తి**
**ఆ చిచ్ఛక్తి సువర్ణ ప్రభపైయున్న**
**పరమనాదమే సునాద బ్రహ్మము**
**ఆ సునాదపైనున్న సూక్ష్మలింగమే**
**నాదబిందుకళాతీతమైన జ్యోతిర్మయి లింగము**
**... ... ... ... ... ... ...**
**అజ్ఞానిని మెచ్చడు కూడల సంగమ దేవుడు**

(వ.సంఖ్య 5 శ్రీ రేకళిగె మఠం వీరయ్యాగారి యనువాదము)

చెన్న బసవేశ్వరుల భావములను గ్రహించిన శివానుభావుడొకడు రచించిన యీ క్రింది పద్యమును గమనించుడి:

**సీ॥ అచ్యుత బ్రహ్మామరాగోచరుండయ్యు**
**వరశుద్ధభక్తైక వత్సలుండు**
**నన్నాదబిందుకళాతీతుడయ్యునా**
**శ్రితశిష్యవర్గ సంతతి కుటుంబి**
**స్థిరసత్పరవ్యోమ సింహాసనుండయ్యు**
**సాధకాత్మాంభోజ షట్పదుండు**
**పరమాణుతరమహత్తర మూర్తియయ్యు స**
**ల్లింగ జంగమ ప్రాణలీయ మూర్తి**

**ఆ. యనగ వినగ నాది కాదియై సన్మతి**
**నెగడ బొగడ మహిమ దగిలి మిగిలి**
**యున్న యసదృశ ప్రసన్నైక** (అనుభవసారము, ప. 39)

"పరమాణుతర మహత్తర మూర్తి" యనెడి వాక్కులు శివుని యొక్క బిందు-విభవు రూపముల గురించి తెలుపుచున్నవని గ్రహించగలరు. ఇంచుమించుగా నిట్టి భావములనే యీ క్రింది శ్లోకములో గాంచగలము.

**నాదాంతరమ్ మహారావం వేదాంతం తత్త్వరాజితమ్ ।**
**చిన్నాదం చిత్కళాబిందుం భావలింగంమహంభజే ॥**
(భావలింగాష్టకము, శ్లో.సం.5, సోమనాథకవి ప్రణీతము)

శివపరబ్రహ్మ మొదట నిశ్చల నిరంజన మూర్తియై నిర్గుణుడై యద్వితీయుడై యుండెను. ఇతనిలో సృష్టిరచన చేయవలెననెడి తలంపు గల్గగనే యొక కదలిక సంభవించెను. అతనిలోని కదలిక యొక్క పరిణామ ఫలముగా నాదము పుట్టెనని తెలుపబడినది. శివుడు నాదము రూపములో వ్యక్తమయ్యెనని యెరుంగవలెను. నాదబ్రహ్మనుండి బిందువేర్పడెను. అదియే సోమనాథుడు తెలిపిన పరమాణుతర రూపము. ఈ సూక్ష్మలింగము నుండియే సకలుడగు శివుని రూపమేర్పడెను. "ఇది మహతో మహీయాన్" అని నుతింపబడిన రూపము. ఇదియే విభురూపము. బిందురూపములోని శివునికిని, విభురూపములోని శివునికిని తనలోని బింద్వాకాశములోనుండి తన చిత్తములో ప్రతిఫలించెడి శివునికిని యభేదము గలదని భావించేవాడే బింద్వాకాశ స్థలీయుడని గ్రహించవలెను.

"శుభం భూయాత్"

## ఆశీర్వచనము - 1 :

## మహాకాశ స్థలము :

లింగషట్ స్థలములలో నొక్కటిగా నుండెడి శరణస్థలమునకు చెందిన బింద్వాకాశము గురించి క్రిందటి యాశీర్వచనమున సవిస్తారముగా తెలియజెప్పనైనది. తదుపరి స్థలముగా తెలుపబడిన మహాకాశ స్థలము గురించి యీ యాశీర్వచనమున వివరింపబడును.

పిండాకాశమున నాత్మయుండుననెడి దానిని యింతకంటెను క్రితమే తెలుపబడినది. బ్రహ్మాండములో మహాకాశములో పరమాత్మ వ్యాపకరూపములో నుండునని చెప్పబడినది. పరమాత్మ యీ జగత్తులో బిందువు రూపములోను సింధువు రూపములోను నుండునందురు. బిందువు సూక్ష్మరూపము కాగా సింధువు మహాస్థూలమైనదగు వ్యాపక రూపమగుచున్నది. అందుకే శ్రుతి "అణోరణీయాన్ మహతో మహీయాన్" అని శివుని స్తుతించినది. అణువుకంటెను సూక్ష్మముగాను, మహనీయమగుదాని కంటెను మహనీయమగురూపమున నుండియున్నవాడు

పరమాత్మయని యీ శృతి వాక్కులోని భావమని గ్రహించగలరు. జీవాత్మ పరమాత్మలకు నభేదము గలదని తెలిసికొనినట్టి బింద్వాకాశ స్థలములోని శివయోగి మహాకాశ స్థలుడనబడునని తెలుపబడినది.

క్రింది యుపదేశమును గమనించుడి :

**పిణ్డాణ్డస్థం యథాకాశం న భిన్నం తద్వదాత్మనః ।**
**అభిన్నః పరమాత్మేతి మహాకాశ స్థలం విదుః ॥** (సి.శి. 19-65)

దీని భావమేమనగా పిండములోను అండములోను నుండియున్న యాకాశమెట్టుల నొకటే యగుచున్నదో అదే విధముగా నాత్మ మరియు పరమాత్మ మధ్య భేదములేదని యే స్థలమున తెలిసికొనబడుచున్నదో ఆ స్థలము మహాకాశస్థలమనబడును.

పిండకాశమనెడి దేహిలో నుండెడి చిదాకాశమని యింతకంటెను క్రితముననే తెలుపబడినది. అండమనగా బ్రహ్మాండమని గుర్తించవలెను. బ్రహ్మాండమందున యఖండమైనట్టి సువిశాలమైన యాకాశము గలదు. సామాన్యులకీ రెండును భిన్నమైనవని దోచును. ఉపాధులు భిన్నముగా నుండుటచేత నుపహితములలో భిన్నత్వముండునని వీరు భావింతురు. ఈ భావన నిరాధారమైనదని తెలుపుటయే భగవత్పాదుల వారి యుపదేశము యొక్క లక్ష్యమని గుర్తించవలెను. వీటిలోన భిన్నత్వము లేదనియును, వీటిలో నుండెడి ఆత్మ పరమాత్మలకు భేదము లేదని తెలుపుట శ్రీ భగవత్పాదుల వారి ఆశయమైయున్నది. ఈ విషయమును సోదాహరణముగా వివరించుటకొరకు క్రింది యుపదేశము శ్రీ భగవత్పాదుల వారిచే కటాక్షింపబడినది:

**యథా న భిన్నమాకాశం ఘటేషు చ మఠేషుచ ।**
**తథాండేషు చ పిండేషు స్థితోప్యాత్మా న భిద్యతే ॥** (సి.శి. 19-66)

దీని తాత్పర్యమేమనగా ఘట మఠాదులలో భిన్నమై దోచెడి యాకాశము వాస్తవముగా నభిన్నమైనది. అదే విధముగా అండపిండములలో నుండెడి యాత్మయును భిన్నమైనది కాదు.

సామాన్యదృష్టితో చూసినచో ఘటము మరియు మఠము భిన్నముగా నుండెడి యుపాధులు. వాటిలో నుండెడి ఆకాశములో భిన్నత్వము లేదనెడిది సర్వజన విదితమైన విషయమే. ఇదే విధముగా ఆత్మ-పరమాత్మలొక్కటే యని గ్రహించవలెనని శ్రీ భగవత్పాదులవారు బోధించిరి.

పరమాత్ముని నెవ్వరు వ్యాపకునిగా భావించరో వారికి దుర్గతి ప్రాప్తించునని చెప్పబడినది. దేవీ కాలోత్తరమనెడి గ్రంథమున నీ విధముగా జెప్పబడినది :

**వ్యోమాకారం మహాసూక్ష్మం వ్యాపకం యోన భావయేత్ ।**
**సంసారీ స భవేల్లోకే బీజకోశక్రిమిర్యథా ॥**

దీని తాత్పర్యమేమనగా నెవ్వడు పరమాత్మను వ్యోమాకారునిగను, మహా సూక్ష్మరూపముననున్న వానిగను, వ్యాపకునిగను భావించడో వాడు ధాన్యపు గాదెలలో పుట్టుచు చచ్చుచున్న క్రిములవలె జనన-మరణముల నొందుచు నీ సంసారమునందున పరితపించుచుండును.

రైతులు వారి వారి నిత్యోపయోగార్థమై లేదా బీజములుగా నుపయోగించికొనుట కొరకు ధాన్యమును నిలువచేయును. తగిన జాగ్రత్తలు తీసికొనని పక్షమున వాటిలో పురుగులు పుట్టెడి యవకాశము గలదు. ఈ పురుగులు స్వల్పకాలముననే మరణము నొందును. అజ్ఞానులిట్టి హీనమైన యోనులలో బుట్టి బాధలకు గురియగుచు కొన్నాళ్ళు బ్రతికి మరణింతురనెడిది యెరుగవలసిన విషయము. ఈ చావు-పుట్టుకలు నిరంతరముగా కొనసాగుచుండునని గ్రహించగలరు. ఇట్టి స్థితి కలుగకుండగ నుండవలెనననిచో ప్రతియొక్కరు నాత్మజ్ఞాన సంపన్నులుగా గావలెనని తత్త్వవేత్తలు నుపదేశించుచు వచ్చుచున్నారు.

మహాకాశము భూతాకాశము కాదనియును, పరబ్రహ్మమైన మహాలింగమనియును దెలియచెప్పుటకై శ్రీ భగవత్పాదులవారు క్రింది యుపదేశమునిచ్చిరి :

అనిర్దేశ్యమనౌపమ్యమవాఙ్మానస గోచరమ్ ।
సర్వతోముఖ సంపన్నం సత్తానందం చిదాత్మకం ॥
కాలాతీతం కలాతీతం క్రమయోగాదివర్జితమ్ ।
స్వానుభూతి ప్రమాణస్థం జ్యోతిషాముదయ స్థలమ్ ॥
శివాఖ్యం పరమం బ్రహ్మ పరమాకాశ లక్షణమ్ ।
లింగమిత్యుచ్యతే సద్భిర్యద్వినా న జగత్స్థితిః ॥ (సి.శి. 19 : 67-69)

దీని తాత్పర్యమేమనగా నర్దేశ్యము నతులనీయమును, వాక్కుకు మనస్సుకు నందని వాడును, సర్వతోముఖుడును సచ్చిదానంద స్వరూపుడును, కాలాతీతుడును, నష్టత్రింశత్ కళల కతీతుడు, నుత్పత్త్యాది క్రమముల లేనివాడును, స్వానుభూతియే ప్రమాణముగా గలవాడును, సూర్యచంద్ర నక్షత్రాదుల యుత్పత్తికి మూలకారణుడును, పరమాకాశ స్వరూపుడు నయిన శివయనెడి పేరుగల పరబ్రహ్మ సత్పురుషులచేత లింగమని పిలువబడుచున్నాడు. లింగము లేనిచో జగత్తు యొక్క స్థితి నిలిచి యుండజాలదు.

మహాలింగమునకు ఘన లింగమనెడి మరొక పేరు గలదు. శ్రీ భగవత్పాదులవారు నీ మహాలింగము ననేకముత్తి విశేషణముల మూలకముగా నభివర్ణన జేసిరి. వీటిని క్రమముగా విశ్లేషింతుము గాక. అనిర్దేశ్యమ్మనెడిది మొదటిది విశేషణము. దేనినైనను వ్రేలుపెట్టి చూపించజాలమో అది యనిర్దేశ్యమైనదై యుండును. జగత్తులోని ప్రతివస్తువు గూర్చి నిర్దేశనము సంభవించుచున్నది. వస్తువును చేతిచే ముట్టి లేదా వ్రేలు చేత చూపి నిర్దేశనలు చేయబడుచున్నవి. అతిసూక్ష్మముగాను, యంతఃస్థితముగాను ఉండెడి మహాలింగమును నిర్దేశించుట సాధ్యముకాని విషయము. అందుచేత మహాలింగము ననిర్దేశ్యమైనదని చెప్పబడినది. "లక్షణ ప్రమాణాం వస్తుసిద్ధిః" అనెడి ప్రమాణము ప్రకారముగా నొక వస్తువును తెలిసికొనవలెనన్నచో మొదట నద్దాని లక్షణము గురించి యాలోచించవలెను. అనంతరము దానిని తెలిపెడి ప్రమాణముల గురించి యాలోచించవలెను. శాస్త్రములందున వస్తువుకు స్వరూప లక్షణము మరియు తటస్థ లక్షణముండునని చెప్పబడినది. ప్రమాణముల గురించి తెలుపుచు ప్రత్యక్ష, అనుమాన, శబ్ద, ఉపమాన, అర్థాపత్తి మరియు అనుపలబ్ధి యనెడి ఆరు విధములైన ప్రమాణములు ప్రతిపాదింపబడినవి. ఈ ప్రమాణముల మూలకముగనే మనము దేనినైననూ తెలిసికొనుటకు సాధ్యమగును.

ప్రమాణములయందున మొదటిదైన ప్రత్యక్ష ప్రమాణమన్నింటికంటెను ప్రబలమైనదైయున్నది. ఎవ్వరైన నేదైన నొక వస్తువు లేదా ప్రక్రియ గురించి వర్ణించుచున్నప్పుడు "నీవు దానిని గంటిరా?" అనెడి ప్రశ్న ప్రప్రథమముగా నడిగెడి రూఢి లోకమునందు గలదు. ప్రత్యక్ష ప్రమాణములనుపయోగమును సామాన్యముగా నెల్లరూ చేయుదురు. "చక్షుర్వై సత్యం" అనెడి సర్వత్ర యంగీకరింపబడిన సూత్రము. చూసినదెల్లయూ సత్యమే అనెడిది దీని యర్థము. పంచేంద్రియ మూలకముగ మనమీజగత్తును చూస్తూ అనుభవించుచుందుము. ఈ జ్ఞానేంద్రియములు ప్రత్యక్ష ప్రమాణము యొక్క సాధనములైయున్నవి. వీటిచేత మనము శబ్ద స్పర్శ రూప రస గంధములనెడి పంచ విషయముల ననుభవించుటకు సాధ్యమగుచున్నది. అయితే పరమాత్మను ప్రత్యక్షము చేసికొనుట కొరకీ పంచేంద్రియములు సాధనములుగా కాజాలవు. "అశబ్ద మస్పర్శ మరూప మవ్యయం తథా రసం నిత్యమగంధ వచ్చ" అనెడి శ్రుతి ప్రమాణమీ యంశమును బలపరచుచున్నది. అందుచేత నతడు పంచేంద్రియములచేత నిర్దేశ్యుడనబడుచున్నాడు.

ప్రమాణములలోన రెండవ ప్రమాణ మనుమాన ప్రమాణము. ఇదియూ ప్రత్యక్షముననుసరించి పోవునట్టిదే. "యత్ర యత్ర ధూమః తత్ర తత్ర వహ్నిః" అనెడి దానియందున దూరమున కనిపించెడి పొగను ప్రత్యక్షముగా గని యా పొగకు కారణమైనట్టి యగ్ని యొక్క యనుమానమును చేయబడుచున్నది. దానివలెనే తోచెడి జగత్తును గని దీనికి కర్తృలైనవాడు పరమాత్ముడని యనుమానమును చేయుటకు రాదా? అని యనినప్పుడు పరమాత్మ యనిర్దేశ్యుడెట్టులగుననెడి ప్రశ్నయు నుద్భవించవచ్చును. అయితే యెచ్చటెచ్చట పొగయున్నదో అచ్చటచ్చట యగ్ని యున్నదనెడిది సాహచర్యము. ఇంతటి సాహచర్యమును మనము వంట యిల్లు యిత్యాదులలో గాంచగలము. ఇంతటి సాహచర్య నియమము యొక్క జ్ఞానమున్నవాడే యగ్నిని జూసి పొగ గలదని చెప్పగలడు. ఈ జగత్తొక కార్యమైయున్నది. పరమాత్మ యిద్దానికి కర్తృలైయున్నాడు. కర్తను చూడకుండిననూ కార్యమును చూసి కర్తృవు ననుమానించవచ్చునని సమాధానము చెప్పుటకు సాధ్యము కాదు. ఎందుచేతననగా నీ జగత్తు నీశ్వరుడు చేసినప్పుడు చూసిన వాడెవ్వడూ లేడు. అందుచేత నిచ్చట సాహచర్యనియమమే సంభవించదు. అట్టి యెడ, అనుమాన ప్రమాణమెట్లు నిర్దేశకమై యుండగలదు. ఈ విధముగా ననుమాన ప్రమాణము చేత మహాలింగము ననిర్దేశ్యమైయగుచున్నది.

ఉపమాన ప్రమాణము చేతనైనను మహాలింగమును తెలిసికొనలేము. ఈ ప్రమాణమునందున నుపమేయమునకు సమానమైనట్టి పోలికగల యుపమాన యొక్కటైన నుండవలెను. అప్పుడే యీ ప్రమాణము కవకాశముండును. అయితే మహాలింగమునకు సమానమైనట్టి మరియొక మహాలింగముండదు. అందుచేత నీ ప్రమాణము మహాలింగమును దెలియజేయుటకు సమర్థమైనదికాదు. ఈ కారణము**నే** మహాలింగ "మనౌపమ్య" మని సంబోధింపబడినది. ఈ ప్రకారముగానే శబ్ద ప్రమాణము కూడ యచ్చట తన వ్యవహారమును జేయజాలదు. దీనికి పరమాత్ముని వర్ణించెడి సామర్థ్యముండదు. దీని ప్రయత్నము పరమాత్మ కాని దానిని పరమాత్మ కాదని యనుటలోనే క్షీణమైపోవుచున్నది. అందుకే వేదములన్నియును నేతి యని మౌనమును దాల్చినవి.

ఇటులనే మహాలింగము మనస్సు కగోచరమైనదయి యున్నది. ఈ విషయమును స్పష్టముగా వివరించెడి శ్రీ దేవరదాసి మార్యుల వచనము గమనార్హమైనదైయున్నది. వీరు మహాలింగమును బయలని సంబోధించుచు, నద్దానిని యెట్టి ప్రమాణము చేతనైనను నిర్దేశింపజాలమనిరి.

**ఆడ బారద బయలు నోడబారద బయలు**
**నుడియ బారద బయలు హిడియ బారద బయలు**
**ఈ ఒడలిల్లద బయలొళగె అడగిప్ప భేదవ**
**ఈ లోకద జడరెత్తబల్లరై రామనాథ !**

ఈ వచనపు తెలుగు రూపమిది :

**ఆడరానిది బయలు చూడరానిది బయలు**
**నుడువ రానిది బయలు పిడియ రానిది బయలు**
**ఈ ఒడలు లేని బయలులోన**
**అడగి యుండు భేదము**
**ఈ లోకపు జడులెట్టుల నెర్గుదురో రామనాథ !**

అయితే యీ మహాలింగము నెవ్వరూ ఎరుగజాలరా? అనెడి ప్రశ్న యుదయించును. ఎట్టి వారికైననూ సాధ్యము కాదనుటకు వీలుపడదు. సూక్ష్మమతి గలవారికి మహాలింగము సర్వతోముఖము గల రూపముతో కన్పట్టుననెడిది శ్రీ భగవత్పాదులవారి యభిప్రాయమని తెలుపబడినది. శ్రీ బసవన్నగారు శివుని సర్వతోముఖునిగా చూసెనని తెలియజెప్పెడి శ్రీ బసవన్నవారి వచనమొకటి గలదు. వచనమును గమనించుడి:

**ఎత్తెత్త నోడిదడత్తత్త నీనె దేవా,**
**సకల విస్తారద రూహునీనె దేవా,**
**"విశ్వతశ్చక్షు" నీనె దేవా**
**"విశ్వతోముఖ" నీనె దేవా,**
**"విశ్వతోబాహు" నీనె దేవా**
**"విశ్వతః పాద" నీనె దేవా,**
**కూడల సంగమ దేవా**

వచనపు తెలుగు రూపమిది :

**ఎచ్చటెచ్చట చూచినచో అచ్చటచ్చట నీవె దేవా**
**సకల విస్తారపు రూపు నీవె దేవా,**
**"విశ్వతశ్చక్షు" నీవె దేవా,**

"విశ్వతోముఖ" వీవె దేవా,
"విశ్వతోబాహు" వీవె దేవా
"విశ్వతః పాద" వీవె దేవా
కూడల సంగమ దేవా

మహాలింగమగోచరమైనది కాదని యీ వచనము వలన తెలియుచున్నది. సూక్ష్మబుద్ధి లేనివారు ప్రయత్నమును చేయగా చేయగా తమ లక్ష్యమును సాధింపగలరనెడిది లోకమెరిగిన విషయమే. అక్షరజ్ఞానము లేని యబోధ బాలకుడు క్రమముగా నక్షరభ్యాసమును చేయుచు ముందు ముందు శబ్ద జ్ఞాన వాక్య జ్ఞానములను సమకూర్చికొని కాలాంతరమున గొప్ప సాహితీవేత్తగా నయ్యెడి దానిని లోకముగాంచగలము. అభ్యాసములోన నపారమైన శక్తి యడగియున్నది. అభ్యాసమును చేసిన యెడల ఎవ్వరికైనను పరమాత్మ నెరిగెడి యోగ్యతను పొందగలరు.

దేవుని విగ్రహమునకు ముందున నత్తిన జ్యోతి సర్వతోముఖముగా వెలుగుచుండును. అచ్చట యంటించబడిన జ్యోతి యేదో వొక వైపు సమ్ముఖమైనదని చెప్పజాలము. తన ప్రకాశమనెడి ముఖముచేత యది సర్వదిక్కులను స్పర్శించుచుండును. దానివలెనే పరమాత్ముడు సర్వతోముఖుడై యున్నాడు. ఏదో ఒక దిక్కున నున్నాడనెడిది సత్యదూరమైన విషయమని చెప్పబడుచున్నది.

శ్రీ భగవత్పాదులవారు పరమాత్ముడు చిదానంద స్వరూపుడనియు, సదాకృతిన నున్నవాడని చెప్పిరి. దీని భావమేవనగా పరమాత్మ సచ్చిదానంద స్వరూపుడైయున్నాడు. సచ్చిదానంద లక్షణుడైయున్న శివుడు కాలాతీతుడని చెప్పబడినాడు. దీని యర్థమేమనగా పరమాత్మకు కాల పరిచ్ఛేద మనెడి దుండదు. భూత, వర్తమాన, భవిష్యత్తులనెడి కాలములలో పరాత్పర వస్తువు సమానముగానే యుండును. అందరిమీద తమ ప్రభావమును ప్రదర్శించెడి కాలము పరాత్పరుని మీద నియంత్రణను సాధించజాలదు. ఈ కారణముననే మహాలింగము కాలాతీతమైనదని చెప్పబడినది.

కాలమనగా సమయము లేదా వేళయని చెప్పుదురు. ఇంకొక అర్థములో కాలమనగా మృత్యువు. యక్ష ప్రశ్నయొక్క సందర్భము నందున యుధిష్ఠిరుడు యక్షుడడిగిన "కా వార్తా" అనెడి ప్రశ్నకు నుత్తరమునిచ్చుచు "భూతాని కాలః పచతీతి వార్తా" అని చెప్పెను. వార్తయేమిటి? అనెడిది ప్రశ్న కాగా భూతములు, కాలము వండుచున్నవి. ఇదియే వార్త అనెడి ఉత్తరమై యున్నది. ఉత్తరములోని భావమేమనగా మహామోహమనెడి కడాయియందున జగత్తిలోని జీవులను వేసి, సూర్యుడనెడి యగ్నిని ముట్టించి, పగలు రాత్రి యనెడి కట్టెలను పెట్టి, ప్రాణులనెడి పదార్థములనటు యిటు త్రిప్పుటకై ఋతుమాసములనెడి గరిట నుపయోగించుచు కాలుడనెడి వంటవాడు వంటను చేయుచున్నాడు. ఈ యుత్తరము వలన తెలిసెడిదేమనగా జగత్తులోని ప్రతిజీవి కాలము యొక్క వశములోనున్నది. అయితే మహాలింగమట్టిది కాదు. కాలమునకే కాలమై తిరుగాడెడి మహాకాలమని గ్రహించవలెను.

కాలుడందరినీ దండించుచున్నాడు. కాలుని దండించే వాడు శివుడనెడిది మార్కండేయుని కథవలన విదితమగుచున్నది.

"కాలోజగద్భక్షః" అనెడి నుడి యొకటి గలదు. కాలము జగత్తులోన జీవులను తన యిచ్ఛ ప్రకారముగా భక్షించును. అందుకే యెవ్వరెప్పుడు చచ్చిపోదురో అనెడిది తెలియకున్నది. "మృత్యుర్యస్యోప సేచనం" అనెడి వాక్యము ప్రకారము మృత్యువు పరమాత్మకు ఊరగాయవంటిది. అద్దాని నాకి లేకుండా చేసెడివాడు పరమాత్ముడని గుర్తించవలెను.

కాలాధీనములైన వస్తువులు ప్రాగభావ, ప్రధ్వంసాభావ, అన్యోన్యాభావ, అత్యంతాభావములనెడి చతుర్విధాభావములకు లోనైయుండును. అయితే పరమాత్ముడు కాలాతీతుడై యుండుటచేత యెట్టి యాభావమునకైనను లోనుగాడు. అందుచేత పరమాత్ముడు కాలాతీతుడనబడును.

పరమాత్ముడు కళాతీతుడనియును చెప్పబడినది. ఆగమశాస్త్రము నందున కళ యొక్క సంఖ్య గురించి వివిధత కన్పట్టుచున్నది. వీటి సంఖ్య అయిదు, పంద్రెండు, పదునారు, ఇరువది నాలుగు, ముప్పది రెండు మరియు అరువది నాలుగని ప్రతిపాదింపబడినది. వాతూల శుద్ధాఖ్య తంత్ర మీ సంఖ్యను ముప్పది రెండుగా నిర్ణయించినది. పంచముఖుని సద్యోజాతముఖ మెనిమిది కళలతోను, వామదేవ ముఖము పదుమూడు కళలతోను, అఘోరముఖమెనిమిది కళలతోను, తత్పురుష ముఖము నాల్గు కళలతోను, ఈశాన ముఖమైదు కళలతోను కూడియుండునని చెప్పబడినది. (పటలము 7 :18-19) సదాశివతత్త్వము కంటెను మహాలింగతత్త్వము సూక్ష్మమైనదగుటచేత, యీ కళల కంటెనయ్యది అతీతమైనదని గుర్తించబడినది. ఈ కారణముననే మహాలింగము కళాతీతమైనదని చెప్పబడినది.

మహాలింగమునకు క్రమయోగాదులుండవని చెప్పబడినది. అనగా నుత్పత్తి స్థితిలయలకతీతముగా నుండును. అనాదియును, సనాతనమూ అయిన మహాలింగమున కుత్పత్తి యుండదు. ఇతర స్థితులును సంభవించజాలవు.

సూర్యుడు, నక్షత్రములు స్వయం ప్రకాశములని యందురు. తాత్త్వికముగా జూసిన యెడల నివి స్వయం ప్రకాశములు కావు. స్వయం ప్రకాశముగల్గిన మహాలింగము వలన ప్రకాశముబొంది నయ్యవి ప్రకాశించుచున్నవనెడిది శ్రీ భగవత్‌పాదులవారి యుపదేశములోని భావము. అందుకే మహాలింగము జ్యోతిషాముదయ స్థలమని చెప్పబడినది.

ఇచ్చట చెప్పబడిన మహాలింగ మింద్రియములకును, మనస్సుకును నగోచరమైనదని ప్రతిపాదించుటచే దీని జ్ఞానమెట్టుల గల్గుననెడి ప్రశ్న యెదురగును. దానికి నుత్తర రూపముగా "స్వానుభూతైక ప్రమాణస్థం" అనెడిది చెప్పబడినది.

మహాలింగము స్వానుభూతికి గమ్యమైయున్నది. ఎచ్చట "నేతి నేతి" అనెడిదిగానయి ప్రమాణములు నిలిచిపోవునో అచ్చట సాధకుని స్వానుభూతి సహాయకముగా నుండును. ఈ కారణముననే పరబ్రహ్మ యనుభవ గమ్యుడని చెప్పబడుచున్నాడు. ఈవిధముగా ననుభవ గోచరమయ్యెడి పరబ్రహ్మ తత్త్వమును శివుడు, లింగము, పరాకాశము మొదలగు పేర్లచేత పిలుతురు.

చరాచర ప్రపంచము యొక్క సృష్టి స్థితిలయలకు కారణంబైయున్నదియును, యీ జగత్తు కాధారముగా నున్నదియును అయిన మహాలింగము మీద యీ జగత్తు యొక్క అస్తిత్వ మాధారపడియున్నదని గ్రహించగలరు. కంటికి కనబడకుండా భూగర్భమున నుండెడి వ్రేళ్ళమీద వృక్షము యొక్క స్థితి ఆధారబడి యున్నటులే అదృశ్యముగా నుండెడి మహాలింగము మీద చరాచర జగత్తు యొక్క సుస్థితి యాధారపడియున్నదనెడి దిచ్చట గ్రహించదగిన యంశము. దీనిని నిరాకరించకుండగా నామోదించుటలో నౌచిత్యముండును.

శ్రీ జగద్గురు రేణుకాచార్యులవారు పూర్వోక్తమైన లింగతత్త్వము గురించి పునః క్రింది విధముగా నుపదేశించిరి :

**పరమాకాశమవ్యక్తం ప్రబోధానన్ద లక్షణం ।**
**లిఙ్గం జ్యోతిర్మయం ప్రాహుర్లీయన్తే యత్ర యోగినః ॥**
**సంవిదేవ పరా కాష్ఠా పరమానన్దరూపిణీ ।**
**తామాహుః పరమాకాశం మునయో ముక్త సంశయాః ॥** (సి.శి. 19 : 70-71)

ఇంతకు క్రితమున చెప్పబడిన మహాలింగము మహాకాశస్వరూపమైయుండి సచ్చిదానన్ద స్వరూప లక్షణముతో కూడికొనియుండెడిదై యున్నది. దీనినే జ్యోతిర్లింగమని పిలుతురు. శివయోగసిద్ధిని బడసిన యోగులీ లింగమునందున లీనమగుదురు. అనగా సమరసభావమును గల్గియుందురు. ఈ కారణముననే యీ తత్త్వము లింగమని పిలువబడుచున్నవి.

జ్యోతిర్లింగ మనెడి పదమును వినినపుడు ప్రతియొక్కరికీ పండ్రెండు జ్యోతిర్లింగములయొక్క నెనవు ప్రాయః వచ్చుచుండును. భారత దేశములోని వారికి జ్యోతిర్లింగముల చూడవలెననెడి యభిలాష నిరంతరముగా నిలిచియుండును. అందుకే యవకాశము చిక్కినప్పుడు కాశీకేదార శ్రీశైలాది జ్యోతిర్లింగముల దర్శనము కొరకు లక్షలాది జనులు తరలి వెడలుచుందురు. కాని మనలోననే యుండియున్నట్టి జ్యోతిర్లింగమును దర్శించాలనెడి కోరిక గలవారతి తక్కువ సంఖ్యలోనుందురు. లక్షకొక్కరో, కోటికొక్కరో అట్టి కోరికను గల్గియుందురు. ప్రతియొక్కరు, అతివేగముగా తాముండియున్న నెలవుననే జ్యోతిర్లింగము యొక్క దర్శనమును బడయవలెననెడి యుద్దేశముచేత నా పరవస్తువు ప్రతియొక్కరి హృదయమున జ్యోతిర్లింగమై విరాజిల్లుచున్నాడు. బహిరంగములోన నున్నవని భావింపబడెడి జ్యోతిర్లింగములను దర్శించిననూ అంతరరథములోని జ్యోతిర్లింగమును దర్శించకుండగుండినచో యాత్ర ఫలప్రదము కాజాలదు. అందుచేత శివయోగులు బాహ్య జ్యోతిర్లింగముల దర్శించెడి లక్ష్యముగల యాత్ర యొక్క గొడవకు పోకుండగ తమయందున నుండెడి జ్యోతిర్లింగము యొక్క యనుభవమును బడసి, యచ్చటనే చిత్తమును లయము జేసి, చివర కచ్చటనే సమరసతను బడయుదురు. ఇయ్యది శివాద్వైత భావనయొక్క పరాకాష్ఠ స్థితి. ఇది పరమానంద స్వరూపమైనదై యుండును. ఈ స్థితినే సంశయరహితులైనట్టి వశిష్ఠాది ఋషులు పరాకాశస్థితియని వర్ణించిరి. మహాకాశ, మహాలింగములనెడి పదములు భిన్నమైనవిగా దోచినప్పటికినీ తత్త్వతః వాటి కభేదము గలదని గుర్తించవలెను.

శ్రీ జగద్గురు రేణుకాచార్యులవారు జగత్తుకు పరమాత్మతతో నుండెడి సంబంధమును సాగర తరంగ న్యాయమున వివరించిరి. ఈ యుపదేశమును గనుడి :

**తరఙ్గాది యథా సిన్ధోః స్వరూపాన్నాతిరిచ్యతే ।**
**తథా శివాచ్చిదాకాశీ పరాద్ విశ్వమేతన్నభిద్యతే ॥** (సి.శి. 19 : 72)

దీని తాత్పర్యమేమనగా సముద్రమునందున పెద్దపెద్ద తరంగములుండును. సముద్ర తరంగములెంతో సుందరముగా నుండుననెడి శబ్ద ప్రయోగము లెన్నియో గలవు. సముద్రమునకు తరంగమునకు మధ్యలో షష్ఠీ విభక్తిని ప్రయోగింపబడుచుండుటచేత సముద్రము వేరు తరంగము వేరని తెలుపబడుచున్నది. అయితే వాస్తవముగా విచారించినచో యీ రెండు భిన్నమైనవికావు. వాయువు యొక్క తాకిడి వలన సముద్రపు నీరె తరంగ రూపమును దాల్చును. వాయువు లేని స్థితి సముద్రము నిస్తరంగ స్థితిలో నుండును. అటులనే పరమాత్మయందుననే జగత్తుద్భవించును. ఈ కారణము పరమాత్మునికి జగత్తుకు భేదము సంభవించదు.

శ్రీ భగవత్పాదులవారీ విషయమునే మరొక విధముగా దెలియజెప్పిరి. ఉపదేశమును గమనించుడి:

**యథా పుష్పపలాశాది వృక్షరూపాన్న భిద్యతే ।**
**తథా శివాత్ పరాకాశాజ్జగతో నాస్తిభిన్నతా ॥** (సి.శి. 19 : 73)

ఒక వృక్షము నందున మూలము, వ్రేళ్ళు, కొమ్మలు, ఆకులు, పువ్వులు, కాయలు మొదలుగునవుండును. వీటితో కూడికొని యున్నదే చెట్టు. వీటిని కొట్టివేసి వేరు వేరుగా చేసినచో చెట్టు లుప్తమగును. అటులే పంచ భూతాత్మకమైన చరాచర జగత్త పరమేశ్వరునికంటెను భిన్నమైనదికాదు.

మహాకాశ స్థల సంపన్నుడైన శివయోగి తన దృష్టిని శివమయముగా జేసికొనుటచేత నతనికి సర్వత్ర శివుడే భాసమగుచుండును. "యథా దృష్టిః తథా సృష్టిః" అనెడి సూక్తి జగద్విదితమైనదే. మన దృష్టి యెట్టులుండునో సృష్టియు నట్టులే గోచరించుననెడిది దీని యర్థము. శివమయ దృష్టి సంపన్నుడైన శివయోగి సర్వమును శివరూపముగానే యనుభవించుచుండుననెడిది యెరుగవలసిన యంశము.

చిదాకాశ స్వరూపుడైన పరమాత్ముడు నిరర్ధవయవుడై యుండుటచేత నతనియందున నీ భువన బ్రహ్మాండములెట్టుల కన్పట్టుననెడి సందేహము యొక్క నేపథ్యమున శ్రీ భగవత్పాదులవారు క్రింది యుపదేశము నిచ్చిరి :

**యథా జ్యోతింషి భాసన్తే భూతాకాశే పృథక్ పృథక్ ।**
**తథా భాన్తి పరాకాశే బ్రహ్మాణ్డాని విశేషతః ॥** (సి.శి. 19 : 74)

ఆకాశమునందున నసంఖ్యాతములైన నక్షత్రములు వేరు వేరుగా దోచుట సర్వానుభవమైన విషయమే. భూతాకాశము స్వతఃగా నిరవయవమైనదిగా నున్నను దానియందున నక్షత్రాదులు నుండుటకై యెట్టి తొందరయు నుండదు. అటులనే పరాకాశ స్వరూపుడును, అవయవ రహితుడు నయిన పరమాత్మయందున చతుర్దశ భువనము లుండుటకై యెట్టి యభ్యంతరము లేదా అడ్డంకి యుండజాలదు.

శ్రీ భగవత్పాదులవారు మహాకాశ స్థలమునకు సంబంధించినట్టి యుపదేశమును సమాప్తము చేయుచు క్రింది యుపదేశము నిచ్చిరి :

**నిరస్తోపాధి సంబంధంనిర్మలం సంవిదాత్మకం ।**
**పరాకాశం జగచ్చిత్రవిలాసాలమ్బభిత్తికమ్ ॥** (సి.శి. 19 : 75)

దీని తాత్పర్యమేమనగా నిచ్చటవరకు వర్ణింపబడిన మహాకాశమనెడి చిదాకాశమనేక యుపాధుల యందుండియున్నను నుపాధులతో దానికెట్టి సంబంధముండదు. సంబంధముల గురించి చెప్పవలెనననిచో సంబంధములు ద్రవ్య, గుణ, జాతుల యందు సంభవించుచున్నవి. ద్రవ్య-ద్రవ్యముల యందున సంయోగ సంబంధము, ద్రవ్య-గుణముల యందున, జాతి-జాతిమంతుల యందున, క్రియా-క్రియావంతుల యందున గుణము-గుణముల యందున సమవాయ సంబంధముండును. అయితే వీరశైవ ధర్మము ప్రకారము పరమ తత్త్వము ద్రవ్య-గుణ-జాతి

రూపమైనది కానందువలన దీనికి సంబంధములు సంభవించజాలవు. ఈ విధముగా సంబంధములేకుండగనుండుటచేత నిది నిర్మలము మరియు జ్ఞాన స్వరూపమైనదై యున్నది. అంతటి పరాకాశ రూపమైన పరశివ బ్రహ్మము జగత్తనెడి చిత్రము యొక్క విలాసమునకు నాలంబనమైనట్టి గోడగా నుండును. చిత్రకారుడు చిత్రమును వేయవలెనెనినచో దానికాధారరూపమైన గోడను ఆశ్రయించునటులే, జగత్తనెడి చిత్రమును రచించెడి వానికొక గోడవంటి యాధారము నాశ్రయించవలెను కదా. ఈ గోడ వంటి ఆధారముగా పరమాత్మనే యుండునని గ్రహించగలరు. లోకమున చిత్రకారునికి సాధన సంపత్తి కావలెను. రంగులు కావలెను. పరమాత్ముని జగద్రచనావ్యాసంగమున సామగ్రియొక్క అవశ్యకత యుండదు. పరతత్త్వమే గోడ, రంగులు, కుంచె, చిత్రకారుడు, చిత్రములుగా నుండును. అందుచేత వీటియందున నుండెడి పరస్పర సంబంధముల విచారమే రాదు.

ఈ విధముగా శ్రీ జగద్గురు రేణుక భగవత్పాదుల వారు మహాలింగ స్థలమున నందరి హృదయములయందున నుండెడి మహాలింగము బాహ్య ప్రమాణముల కగోచరమైనదైనను స్వానుభూతి వలన తెలిసికొనవచ్చునని తెలిపి, ఆ మహాలింగమే మహాకాశమనియును, అది జ్యోతిర్మయమైనదై యుండునని తెలిపిరి. జగదాధార మూర్తియైన మహాకాశస్థలము యొక్క తత్త్వము నెరిగిన వారై సాధకులు తమ జీవితమును పావనము చేసికొందురు గాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జ్ఞాన సింహాసనాధీశ్వరులు జగద్గురువులు చంద్రశేఖర శివాచార్య మహాస్వాములవారు మహాకాశ స్థలము గురించి వివరించుచు మహాలింగ తత్త్వమును విశ్లేషించి చెప్పిరి. మహాలింగమే మహాకాశమని తెలిపిరి.

బింద్వాకాశము శివుని సూక్ష్మతరమైన తత్త్వమునకు ప్రాతిపదికగా నిలువగా మహాకాశము శివుని బృహత్తత్త్వమునకు ప్రాతినిధ్యము వహించునని తెలియుచున్నది. ఇయ్యది నాదబిందు కళాతీమైన తత్త్వమని శివానుభావులు అనుభవసారమున (పద్య.39) వివరింపబడినది. శాక్తేయులు మహాకాశమును మహాశక్తి యొక్క స్వరూపమని యెంచగా, శైవులు నీ తత్త్వమును నాదబ్రహ్మ ప్రకటితమైన స్థలమని యెంచుదురు. అయితే వీరశైవ తత్త్వములో శివశక్తుల విభాజ్యులని చెప్పబడినది. అందుచేత మహాకాశములోను శివుడవ్యక్తి రూపమున శక్తి విశిష్టుడై యుండునని గ్రహించవలెను. దీని యర్థమేమనగా మహాకాశమునకును, శివునకును నభేదము గలదు. ఈ యంశము శ్రీ భగవత్పాదులవారిచే ప్రత్యేకముగా నుటంకించబడినదనెడిది మరువజాలని విషయము.

మహాకాశము భావలింగ స్థలమునకు చెందిన తత్త్వమని తెలిపెడి యీ శ్లోకమును పరికించుడి :

**వీరభద్రం మహారుద్రం మంగళం జంగమాద్భుతమ్ ।**
**లోకాలోక మహాకాశం**
**భావలింగమహం భజే ॥** (భావలింగాష్టకము)

ఇదే విధముగా నీ తత్త్వమునకును, నాదతత్త్వమునకును గల సంబంధమిట చూపబడినది. గమనించుడి:

**నాదాంతరం మహారావం వైదాన్తం తత్తరాజితమ్ ।**
**చిన్నాదం చిత్కళాబిందుం భావలింగామహం భజే ॥** (భావలింగాష్టకమ్)

భావలింగమనెడిది త్రిలింగములలోన నొకటనియును, నియ్యది జీవుని కారణ శరీరమున నుండుననియును గ్రహించగలరు. దీక్షాగురు స్థలమున నీ విషయముల వివరణను గాంచగలము.

మగ్గెయ మాయిదేవుని యనుభవసూత్రము ప్రకారము మహాలింగమనెడిది భావలింగములోని యవాంతర స్థలము. భావలింగము నందున ప్రసాదలింగము మహాలింగములుండునని చెప్పబడినది. ఈ రెంటిలోన నెయ్యది మహాకాశ స్థలమున విశేషమై యుండునడెడిది తెలిసికొనుట యెంతోను నవసరము. ఈ విషయమును వివరించెడి యీ శ్లోకమును గనుడి :

**అచరాన్తం మహాలింగం సోమం తత్త్వకళాన్వితమ్ ।**
**చిత్రార్థం చిత్రరూపంచ భావలింగమహంభజే ॥** (భావలింగాష్టకమ్)

ఈ సందర్భమున మహాకాశమునకును మహాలింగమునకును నభేదమును ప్రతిపాదించిన శ్రీ భగవత్పాదులవారి భావన స్మరణీయము. ఇదే విధముగా పరాకాశమునకును మహాకాశమునకును నభేదమును ప్రకటించిన శ్రీ భగవత్పాదులవారి భావములను ప్రతిఫలించే శివానుభావి వాక్కులను గమనించుడి :

**స్థిరసత్పర వ్యోమ సింహాసనుండయ్యునా**
**శ్రితశిష్యవర్గ సంతతి కుటుంబి** (అనుభవసారము, ప. 39)

పరవ్యోమమనెడి పరాకాశమును సింహాసనముతో పోల్చి, దానినధిరోహించెడివాడు శివుడని చెప్పబడినది. పరాకాశమును పరాశక్తిగా భావించెడివారును గలరు. అట్టి యెడ నా పరాశక్తి విశిష్టుడైన పరశివుడే పరవ్యోమ సింహాసనుండని తెలుపబడినది. ఈ స్థలమున శివుడు జ్యోతిర్మయుడై యుండునని శ్రీ భగవత్పాదులు చెప్పిరి. శ్రీ చెన్నబసవేశ్వరుల వారు శివ పరబ్రహ్మను జ్యోతిర్లింగముతో పోల్చిరని యింతకు క్రితమే తెలిసికొంటిమి.

ఈ మహాకాశము జీవునిలోను నుండుననెడిదే గుర్తించవలసిన విషయము. ఏ విధముగా బ్రహ్మాండములోను పిండాండములోను భూతాకాశము కలదో అదే విధముగా జీవుని యంతరరంగ బహిరంగములలో మహాకాశముండునని చెప్పబడినది. అపరిచ్ఛిన్నమైన మహాకాశము పరిచ్ఛిన్నమై జీవుల యంతరంగమున నెట్టుల యుండుననెడి ప్రశ్నకు ప్రత్యుత్తరముగా ఘటాకాశ నిజాకాశముల మధ్యన గల యభేదము చూపబడినది. ఈ విషయము బసవ పురాణములోన నీ క్రింది విధముగా వివరింపబడినది.

**అందు "నణోరణీయా" నన జొచ్చి**
**సందు లేకున్నట్టి శంభుండు శివుడు**
**నువ్వుల లోపలి నూనె యట్లు**
**భావింపకాష్టంబు పావకునట్లు**
**యలవడ బాలలోపల నేయి యట్ల**
**జలకుంభములలోని చంద్రుని యట్ల**
**వెలుగు నద్దంబు లోపలి నీడయట్ల**
**తలపబూసలలోని దారంబునట్ల**
**ఘటపటాదులలోని గగనంబు నట** (బసవ పురాణము, షష్ఠాశ్వాసము)

"ఘట పటాదులలోని గగనంబు" యనెడి భావన గమనార్హమైనదని గ్రహించగలరు. మహాకాశమునే విధముగా జీవులలో నుండునో యనెడి దాని నియ్యది వివరించుచున్నది.

గగన తలమున నక్షత్రములే విధముగా నసంఖ్యాకములై యుండియున్నవో అదేవిధముగా మహాకాశములోన యసంఖ్యాకములైన బ్రహ్మాండములుండునని చెప్పబడినది. వీటిలో మనముండెడి దొకటి యని తెలిసికొనగలరు. జగత్తులో నివి యన్నియును నంతర్భాగములే.

ఈ జగత్తు షట్త్రింషత్తత్త్వాత్మకమైనదని చెప్పబడినది. పృథివ్యాది శివతత్త్వము వరకు గల తత్త్వములను షట్త్రింషత్ తత్త్వములని యందురని యింతకు క్రితమే తెలిసికొంటిమి. ఈ తత్త్వములతో పరశివబ్రహ్మకు సంబంధమెట్టిదనెడి ప్రశ్న యుదయించును. ఈ విషయమున కొంతమేరకు వివరణనిచ్చెడి యీ క్రింది శ్లోకమును గనుడి :

**యస్యోర్మిబుద్బుదాభాసః షట్త్రింశత్తత్త్వ సంచయః ।**
**నిర్మలం శివనామానం తం వందే చిన్మహోదధిమ్ ॥** (సి.శి. 1 : 3)

పరశివుడనెడి చిన్మహాసముద్రములోన యీ షట్త్రింషత్ తత్త్వములు నీటి బుడగల వలెయుండును. యథావాక్కుల అన్నమయ్య గారు తమ సర్వేశ్వరశతకములోన నీ భావమును క్రింది విధముగా నభివ్యక్తీకరించిరి :

**జలజాత ప్రభవాండ బుద్బుదముల**
**శ్రాంతంబునుంబుట్టు చుం**
**గలయం గ్రాగుచు నుండు నీ పృథుల**
**లింగస్థారగర్భాబ్ధిలో**
**పల దద్బుద్బుద గర్భవాసులు హరిబ్రహ్మాది దేవాళియుం**
**గలదేవారికి నీ మహత్త్వమెరుగంగా శక్తి? సర్వేశ్వరా!** (పద్యము-7, సర్వేశ్వర శతకము)

ఈ పద్యములోని "లింగగర్భ"మనెడి భావన కీలకమైనది. ఈ భావము యొక్క వివరణ నిచ్చెడిదిగా దోచుచున్నట్టి క్రింది పద్యమును పరిశీలించునది:

**పొంగారు సమ్మతి లింగమధ్యేజగత్**
**సర్వం బనంగ శాస్త్రంబులందు**
**అలరి "లింగాంకితం" బయ్యు "జగద్భరి**
**తం"మన నారుషేయంబు లందు**
**స్థితి "బ్రళయాంతవ్రజేద్దీపితేనలం**
**గ" మ్మనంగ విమలాగమము దలప**
**నరిది శ్రీకొన్నెల నా "లింగ ముచ్యతే**
**యనునట్లు శివరహస్యంబులందు**

**బరగు లింగమూర్తి భావవశ్యుండగు**
**కలిమి మెరసి బందికాండ్ర జేసి**
**వంగకాయలట్లు లింగముల్గా జూచు**
**ప్రతిభ మీకెయొప్పు బసవలింగ** (చతుర్వేదసారము, ప. 32)

ఈ జగత్తంతయును మహాకాశములో నుండెడి జ్యోతిర్లింగముయొక్క గర్భములో నుండెడిదనెడిది తెలిసికొనవలసిన విషయము. ఈ కారణమున జగత్తు కంటెను నితరమైనదనెడి భావన సరియైనది కాదని గుర్తించగలరు. "లింగమధ్యే జగత్ సర్వం లింగ బాహ్యం పరం నాస్తి" యనెడి ఆగమోక్తులు స్మరణీయములు. అదే విధముగా బ్రహ్మసత్యం-జగన్మిథ్యా" యని తెలిపెడి శంకరాచార్యులవారి యుద్ఘోధ వర్ణనీయములని గుర్తించగలరు. "శివస్సత్యం-జగత్సత్యం" అనెడి వీరశైవాచార్యుల వాక్కులు నామోదయోగ్యములని తెలిసికొనగలరు. సత్య స్వరూపియైన శివునికిని, జగత్తును నభేదముగలదని తెలిసికొనుడి.

పరానంద స్వరూపమైయున్నందుననే మహాకాశము పరాకాశముగా పిలువబడుచున్నది. ఆనందభక్తిని నెరపెడి శరణ స్థలీయుడు నీ స్థలమునకు సన్నిహితముగా నుండి చిదానందము ననుభవించుటకు కృషిచేయును. శరణ స్థలీయునికి మహాకాశస్థలముతో గల సంబంధమును వివరించెడి క్రింది రగడను గమనించుడి :

**పరమాకాశ శరీరం శరణం**
**పరతత్త్వకాకారం శరణం**
**స్వవినోదాత్తృత పిండం శరణం**
**శివసుఖరత్నకరండం శరణం** (సోమనాథుని షట్స్థల రగడ - కన్నడం)

దీనియొక్క తెలుగు రూపమును గనుడి :

**పరమాకాశ శరీరుడు శరణుడు**
**పరతత్త్వము కాకారము శరణుడు**
**స్వవినోదాత్మృత పిండుడు శరణుడు**
**శివసుఖ రత్నకరండము శరణుడు**

ఈ రగడలో శివునికి శరణునికిని యేకరూపత చూపబడినది. శివుడే విధముగా స్వలీలా విలాసరచనా వైచిత్రి నిమిత్తమై సకాయుడై సృష్టి స్థితి లయ తిరోధానానుగ్రహముల నాచరించునో, అదే విధముగా శరణుడు స్వీయ లీలా వినోదము కొరకే శరీరధారియై ప్రవర్తించుచుండును.

మహాకాశమును తనలోనే గాంచుచు, జ్యోతిర్లింగ రూపములోనుండెడి శివుని సన్నిధిన నుండుటకై అంతర్గామియై, చిదానందముననుభవించేవాడే మహాకాశస్థలియని యెరుంగుడి.

*"శుభం భూయాత్"*

## ఆశీర్వచనము - 1 :

## క్రియా ప్రకాశ స్థలము :

మహాకాశ స్థలము గురించి యెరిగిన పిదప తదుపరిన వచ్చెడి క్రియా ప్రకాశ స్థలము గురించి తెలిసికొనవలసియున్నది. ఈ విషయమున శ్రీజగద్గురు రేణుకాచార్య భగవత్పాదులవారు శ్రీ అగస్త్యమునికి యీ క్రింది విధిన నుపదేశము నిచ్చిరి :

**శివస్య పరిపూర్ణస్య చిదాకాశ స్వరూపిణః ।**
**ఆత్మత్వేనానుసన్ధానాత్ క్రియాద్యోతనవాన్ యమీ ॥** (సి.శి. 19 : 76)

దీని తాత్పర్యమేమనగా శివుడు సర్వత్ర పరిపూర్ణుడై యున్నాడు. అతడు చిదాకాశము రూపములో నుండును. అట్టిశివుడే తన ఆత్మగానున్నాడు. ఈ విధముగా నిరంతరము తలచెడి మహాకాశస్థలములోని శివయోగి క్రియా ప్రకాశస్థలుడగుచున్నాడు. ఇట్టి చింతన మినహాయిస్తే వేరేయే క్రియయు నుండని స్థితియని గ్రహించగలరు.

మహాకాశ స్థలములోని సాధకుడు పరశివబ్రహ్మను నాకాశము వలె వ్యాపకుడనియును, ఆ వ్యాపకుడైన శివుడే తన యాత్మయనియును గుర్తెరుగుచున్నాడు. ఈ విధముగా తెలిసికొనుట యనెడిదింత మహత్త్వపూర్ణమైన యంశము కాదు. అయితేఆ స్థితియందున నిలిచి యానందము ననుభవించవలసియుండును. అట్టి ఆనందము దొరకవలెననినచో ఆత్మాను సంధానమనెడి క్రియ కావలసియుండును. శివయోగి యెంతవరకు నాత్మాను సంధానములో నిమగ్నమై యుండునో అంతవరకు నానందము ననుభవించుచుండును. ఈ ఆనందానుభూతియే జీవన్ముక్తియని గ్రహించవలెను.

జన్మనెత్తిన ప్రతియొక్కనికిని ఆనందము కావలెను. నీరు లేనిదే చేపలు బ్రతుకజాలవు. అటులే ఆనందము లేని యెడల జీవులు బ్రతుకజాలవు. ఆనందమే జీవనపు పురుషార్థమై యున్నది. సంస్కారహీనులైన జీవులు నాత్మానుసంధానము వలన నానందమును పొందుట కసమర్థులై యుండుటచేత నద్దానిని శబ్ద స్పర్శాది విషయములలోన వెదుకుదురు. విషయముల వలన గల్గెడి ఆనందము శాశ్వతమైనది కాదు. వ్యక్తుల లేదా వస్తువుల సాంగత్యము దూరము కాగానే దుఃఖము ప్రాప్తమగును. ఆత్మానుసంధానము వలన లభించెడి ఆనందము శాశ్వతమైనది. శివయోగులు దీనిని మాత్రమే కోరికొందురు. శివయోగి సయమియై యుండుటచేత నతడు విషయభోగములకు దూరముగా నుండుననిగ్రహించగలరు. ఈ సందర్భమున తెలిసికొనవలసినదేమనగా యమి యనెడివాడు శివయోగ సంపన్నుడై యుండును. "క్రియా వంతః శ్రోత్రియా బ్రహ్మనిష్ఠాః" అనెడి ముండకోపనిషత్తు వాక్కుననుసరించి శివయోగి శివధ్యాన రూపమైన క్రియయందున నాసక్తి గల్గియుండును.

శ్రీ భగవత్పాదులవారు, విషయమునింకను స్పష్టము చేయుటకొరకు క్రింది విధముగా నుపదేశించిరి:

**నిష్కలంక చిదానన్దగగనోపమరూపిణః ।**
**శివస్య పరిపూర్ణస్య వృత్తిశ్చైతన్యరూపిణీ ॥** (సి.శి. 19 : 77)

దీని తాత్పర్యమేమనగా "కళంక రహితుడును పరిపూర్ణుడును, అయిన పరశివుడే నేనయియున్నాను" అని చింతన చేసెడి శివయోగుల చిత్తము శివునివలె జ్ఞానరూపమే అయియుండును. చిద్రూపము యొక్క చింతన చేయుచు చేయుచు చివరకది చిద్రూపమే యగుచున్నది.

యోగశాస్త్రమునందున చిత్తవృత్తి నిరోధమున కెక్కువ ప్రాముఖ్యత గలదు.

అయితే వీరశైవుల శివాద్వైత సిద్ధాంతము నందున వృత్తిని నిరోధించెడి ప్రసక్తిలేదు. దానిని ధ్యాన మూలకముగా చిద్రూపముగా జేసికొనెడి ప్రక్రియను నుపదేశించనైనది. శివయోగమనెడిదొక సహజమైనట్టి మార్గము. "దృష్టిం బ్రహ్మమయీం కృత్వా పశ్యేత్ బ్రహ్మమయం జగత్" అను ఉక్తికనుసారముగా దృష్టిని అనగా మనస్సుయొక్క వృత్తిని బ్రహ్మమయముగా జేసికొనినప్పుడు జగత్తంతయును బ్రహ్మమయముగా దోచుట ప్రారంభమగును. మన మనస్సుల యందున నేముండునో అదియే వెలుపలన కనిపించును. మనస్సునందున ప్రపంచముండిన వారికి బాహ్యమున మనస్సే కనిపించును. మనస్సున నిండుగా శివుడుండినచో వెలుపలి ప్రపంచము శివమయముగా కన్పట్టును. శివుని చిద్రూపముగా భావించినచో బాహ్యమున చిద్రూపమే కనిపించును. పతంజలి మార్గము కంటెను వీరశైవ మార్గమే శ్రేష్ఠమైనదైయున్నది. చిత్తవృత్తిని నిరోధించి విశిష్టస్థానమున పరమాత్ముని లక్షించుట కంటెను సహజమైన స్థితిలో నుండి సర్వత్ర శివుని యనుభవించుటయే యుత్తమమైన మార్గమని గ్రహించగలరు.

చిత్తమే విధిన శక్తివంతమై శివభావమును పొందునో అనెడి దానిని శ్రీ భగవత్పాదుల వారు క్రింది విధముగా నుపదేశించిరి :

**నిష్కలఙ్కే నిరాకారే నిత్యే పరమ తేజసి ।**
**విలీన చిత్తవృత్తస్య తథా శక్తిః క్రియోచ్యతే ॥** (సి.శి. 19 : 78)

దీని తాత్పర్యమేమనగా నిష్కలంకుడును, నిరాకారుడును, నిత్యుడును, పరమతేజో మూర్తియు నయిన శివుని యందున శివయోగియొక్క చిత్తము అనుసంధానమును పొందగా నతని చిత్తవృత్తి పరశివుని తేజోస్వరూపమును దాల్చును. ఒక యినుపముక్క అగ్నియందున వేసినప్పుడది అగ్నితో సంపర్కమును పొంది అగ్నిగుణమును పొందును. ముట్టిన దానిని కాల్చెడి శక్తి దానికి వచ్చును. స్వతఃగా దానికి కాల్చెడి శక్తి లేకున్ననూ అగ్ని సంపర్కము వలన దానికా శక్తి సంక్రమించుననెడిది లోకమెరిగిన విషయమే. శివయోగి చిత్తమీ విధిననే చిద్రూపమును దాల్చును. చిత్తము యొక్క యీ యనుసంధానశక్తిని క్రియాశక్తియని పిలుతురు. ఇది పరశివుని వలె తేజోరూపమున నుండును.

ఈ స్థలము నందలి శివయోగి శివుని వలె ప్రకాశించునని తెలియుచున్నది. ఈ విషయమును తెలిపెడి శ్రీ పూజ్యపాదుల వారి క్రింది యుపదేశమును గనుడి :

**సర్వజ్ఞః సర్తకర్తా చ సర్వగః పరమేశ్వరః ।**
**తదైక్య చిన్తయా యోగీ తాదృశాత్మా ప్రకాశతే ॥** (సి.శి. 19 : 79)

దీని భావమేమనగా సర్వజ్ఞుడును, పంచకృత్య సంపన్నుడని శ్రుతులచేత పొగడబడిన శివుడు తానేనని భావించికొని శివునియందున సామరస్యమును పొందిన శివయోగి శివునివలె సర్వజ్ఞత్వాది గుణ సంపన్నుడగుచున్నాడు.

మనమెవ్వరియందున సామరస్య భావనను పొందుదుమో వారి గుణదోషములు మనల నాక్రమించును. అందుచేతనే నొక సుభాషితకారుడు "సంసర్గజా దోష గుణాః భవన్తి" అని తెలిపెను. దోషులతో సాంగత్యమును చేసినప్పుడు దోషములను, సుగుణవతులతో సాంగత్యము జేసినప్పుడు సుగుణములను పొందుట సహజమైన యంశమగుచున్నది. అందుచేత శివయోగి సర్వజ్ఞత్వాదుల బొందుననుటలో సందేహమున కాస్కారముండదని గ్రహించగలరు.

ఈ లోకమునందున శివయోగికిని, సామాన్య మనుష్యునికిని మధ్యన గల యంతరమును గాంచినచో శివయోగికి గల ప్రత్యేకత మనకు కన్పట్టును. శివునియందున నణిమాది అష్టైశ్వర్యములు సహజముగానే యుండును. అతనితో నిరంతరమైనట్టి సంబంధము నేర్పరచికొనినట్టి శివయోగి యందున నియ్యవి దిగివచ్చును. ఆకాశ గమనము, పరకాయ ప్రవేశము, బహుదూర దర్శనము, దూరశ్రవణము మొదలగు సామర్థ్యములను శివయోగియందున చూడగలము. ఇవి యలౌకికమైనవని చెప్పబడుచున్నవి. అందుచేత సర్వ సామాన్య వ్యక్తియందున నివి యుండవు. శివయోగి శివునితో నేర్పరచికొనిన సంబంధమువలననే శివయోగి కిట్టి శక్తులు లభించుచున్నవి.

లౌకిక వ్యవహారములలోన నున్నతాధికారియైన వాని సచివునికి యధికారికి లభించెడి మర్యాద కొంచెమించుమించుగా తన అధికారితో సమానమైనట్టి మర్యాదలు లభించుచున్నవి. ఇది సాన్నిహిత్య ఫలితమే కదా! ఎక్కువ కాలముండెడి సాన్నిహిత్యము వలన హెచ్చు మర్యాద లభించుననెడిది గుర్తుంచుకొనవలసిన విషయము. శివయోగి తాదాత్మ్య భావన పెంచికొనిన కొలది, అతని శక్తులు మరింతగా పెరుగును. అయితే సామాన్యుల కిట్టి సామర్థ్యము లభించదు. వచ్చెడి విద్యుత్తు ఒకే విధముగా నున్నను జీరో బల్బు కాంతి హీనముగాను, నూరు క్యాండిల్స్‌ది హెచ్చు కాంతితోను వెల్గుటను మనము గాంచగలము.

మనదేశపు ప్రాచీన ఋషులు, మహర్షులు కొన్ని శాస్త్రముల యొక్క ఆవిష్కరణను చేసిరి. వీరు శివధ్యానమున ఆసక్తులైన వారై శివుని నుండి పారివచ్చిన జ్ఞానమునే గ్రంథరూపమున వ్రాసిరనవచ్చును. ఇప్పుడెవ్వరైననొక గ్రంథమును వ్రాయవలెననినచో అనేకగ్రంథముల సహాయోగమును పొందవలసియుండును. సంశోధకులైతే తమ శోధన ప్రబంధము చివరన తామే గ్రంథములనుండి సహకారమును బడసిరో ఆయా గ్రంథముల వివరము లివ్వవలసియుండును. పూర్వకాలమున గ్రంథముల ఆవిష్కారమే కానప్పుడు గ్రంథముల సంప్రదించులెట్టులౌను? మంత్ర ద్రష్టతా ఋషీశ్వరులు కేవలము పరమేశ్వరుని ధ్యానించి యతని నుండియే విషయమును బడసిరని చెప్పవచ్చును. పరమాత్ముని ధ్యానించుటవలన పరమాత్ముని గుణము లబ్బుననెడిదీ విధిన తేటతెల్లమగుచున్నది. లింగ పురాణములో చెప్పిన యటుల భ్రమర కీటన్యాయము ప్రకారము పరమాత్మ ధ్యానములో నిమగ్నమై యుండెడివారు క్రమక్రమముగా పరమాత్ములై పరమాత్ముని సర్వజ్ఞత్వాది లక్షణమును పొందుదురనుటలో సందియము లేదు.

ఈ లోకము నందున శివయోగియైన వాడు నింద్రియ వ్యవహారములయందు నిమగ్నులై యున్నట్లు గాంచుదుము. ఇట్టివారు తాము శివులుగా నెట్టులౌదురనెడి ప్రశ్న పుట్టును. ఈ నేపథ్యమున శ్రీ భగవత్‌పాదులవారు క్రింది యుపదేశము నిచ్చిరి :

**సర్వేంద్రియాణాం వ్యాపారే విద్యమానేపి సంయమీ ।**
**ప్రత్యున్ముఖేన మనసా శివం పశ్యన్ ప్రమోదతే ॥** (సి.శి. 19 : 80)

దీని తాత్పర్యమేమనగా శివయోగికి అందరికుండెడి యింద్రియ వ్యవహారములుండును. ఇచ్చుట, పుచ్చుకొనుట, పోవుట,వచ్చుట, మాట్లాడుట మొదలగునవి చేయుట యవశ్యకమైనదై యున్నది. అయితే వీటిని చేయుచు వీటికంటెను వ్యతిరేక ముఖమున నుండెడి మనస్సు ద్వారా పరమాత్ముని వీక్షించి ఆనందము ననుభవించుచుండును. అయితే యింద్రియ వ్యవహారముల నిమిత్తము మనస్సుయొక్క యుపస్థితి వలయుగదా? అనెడి సందేహమేర్పడును. సాధన ద్వారా మనస్సును పరమాత్మలో లీనము చేసి దైనందిన వ్యవహారములలో నిమగ్నమై యుండుట దుస్సాధ్యమైన విషయముకాదని తెలియుచున్నది. ఈ విషయమును వివరించెడి కథయొకటి కలదు.

వ్యాసుని తనయుడైన శుకుడు తన తండ్రిగారి యానతి ప్రకారముగా జనక మహారాజు కడకేడి తత్త్వోపదేశమును బడయదలచెను. రాజాస్థానమునకు వెళ్ళగా నచ్చట నతనికి భోగభాగ్యముల యందు తేలియాడెడి జనక మహారాజు కన్పట్టెను. భోగలాలసి తన కెట్టుల తత్త్వోపదేశము చేయగలడనెడి సందేహము గల్గెను. అది గ్రహించిన జనకునికి కర్తవ్యము బోధపడెను. శుకుని కుచితరీతిన భోజనాది సత్కారముల నేర్పాటు చేయుటకొరకు రాజోద్యోగుల కాదేశముల నిచ్చెను. శుకుడు భోజనాదులు ముగించికొని రాజు కడకు వచ్చెను. "మహానుభావా! తృప్తితో భుజించినారా? పొట్ట నిండినదా? మీకిష్టమైన పదార్థములే వడ్డింపబడినవా?" అనెడి ప్రశ్నలను జనకుడడిగెను. శుక్రుడు "రాజా! పొట్ట నిండినది. కాని నేనేమి తింటినో నేనెరుగను. కారణమేమనగా నేను కూర్చుండియున్న యాసనముపై భాగమున నొక కత్తి వ్రేలాడుచుండెను. కత్తికి కట్టినట్టి దారము సన్నగా నుండెను. అదెప్పుడు తెగి కత్తి మీదపడునో అనెడి భయము వలన నా దృష్టి దాని మీదనే నిలిచియుండెను అని నివేదించెను. "ఓ శుకుడా! నీ మనస్సు కత్తిమీద లగ్నమై యున్నను, నీ తిండి కొనసాగినది కదా! అదే విధిన నేను ఐంద్రియ వ్యవహారములలో మునిగియున్నను నా మది పరమాత్మలోనే లగ్నమైయుండును. తద్వారా జ్ఞానప్రాప్తిని పొందుదు"నని జనకుడు శుకునికి తెలియజెప్పెను. శుకుడు తన తప్పును తెలిసికొనెను. జనకుని వలన తత్త్వోపదేశమును పొంది కృతార్థుడయ్యెను.

ప్రియబోధ ప్రమోదములు మనోవృత్తులనబడుచున్నవి. వలసిన వస్తువును గనినప్పుడు ప్రియవృత్తిని, ఆ వస్తువధీనము లోనికి వచ్చినప్పుడు మోదవృత్తిని, దానిననుభవించెడి యప్పుడు ప్రమోదవృత్తి ననుభవములోనికి వచ్చును. అటులనే సాధకుడు పరమాత్మ గలడని గుర్తించినప్పుడు ప్రియవృత్తిని, తన హృదిలో గలడని యెరింగినప్పుడు మోదవృత్తిని, పరమాత్మునిలో మనస్సును లీనమొనర్చినప్పుడు ప్రమోదవృత్తి ననుభవించును.

శివయోగి యింద్రియ లోలత్వము లోనున్నను, మనస్సునట లగ్నము చేయకుండా పరమాత్మునియందున లీనము జేసి ప్రమోదమును పొందునని గుర్తించవలెను.

శివయోగి యనుభవించెడి పరమాత్ముని రూపమెట్లులుండునో అనెడి దానిని శ్రీ భగవత్పాదులవారీ క్రింది విధముగా తెలిపిరి :

**కూటస్థమచలం ప్రాజ్ఞం గుణాతీతం గుణోత్తరమ్ ।**
**శివతత్త్వం స్వరూపేణ పశ్యన్ యోగీ ప్రమోదతే ॥** (సి.శి. 19 : 81)

శివుడు కూటస్థుడై యుండును అనగా వికార రహితుడై సాక్షి స్వరూపమున నుండును. అతడు చలన రహితుడైయుండును. స్థాణువైయున్న యతనిపై చలనశీలత గల ప్రపంచమున్నది. అతడు చలించినచో ప్రపంచపు అస్తిత్వము నిలిచియుండదు. అతడు ప్రాజ్ఞుడైయుండును. ప్రాజ్ఞుడనగా కుశలుడని యర్థము. సత్త్వ రజస్తమములు లేనివాడైనందున ప్రకృతి కతీతుడై యుండును. త్రిగుణములవలననే ప్రకృతి యేర్పడినదనెడిది విదితమైన విషయమే. అతనికి జ్ఞాన వైరాగ్యములనెడి యుత్కృష్ట గుణములుండును. ఈ గుణములు గలవాడిని తానని భావించికొనుచు శివయోగి ప్రమోదము నొందును.

శ్రీ జగద్గురువుల వారు తమ యుపదేశమునకు ముగింపు నిచ్చుచు క్రింది యుపదేశము నిచ్చిరి :

**పరాత్మని క్రియా సర్వా గన్ధర్వనగరీముఖా ।**
**ప్రకాశత ఇతి ప్రోక్తం క్రియాయాస్తు ప్రకాశనమ్ ॥** (సి.శి. 19 : 82)

దీని యొక్క తాత్పర్యమేమనగా పరశివునిలో ననుసంధానమును వాంఛించెడి శివయోగి యొక్క క్రియలన్నియును నాకాశములోని గంధర్వనగరి వలె యస్థిరములుగను, నిష్ఫలములుగను నుండును. ఆత్మానుసంధాన క్రియల కంటెను భిన్నమైన క్రియలు నిష్ప్రయోజకములగుననెడిదే గ్రహించదగిన విషయము. సాధకులీ విషయమును గ్రహించిన పిదప సాధన ద్వారా శివునితో ననుసంధానమునొందిప్రమోదమును పొందుటకొరకు ప్రయత్నించగలరని యాశించుచు నీ యాశీర్వచనమునకు ముగింపు నివ్వనైనది.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యులవారు క్రియా ప్రకాశము గురించిన సమగ్రమైనట్టి యాశీర్వచనమును ప్రదానము చేసిరి.

మహాకాశ స్థల సంపన్నుడైన శివయోగి సర్వజ్ఞత్వ, సర్వకర్తృత్వ లక్షణములు గల శివునితో తాదాత్మ్యత పొందెడి చిత్తవృత్తిని పెంపొందించికొని నిరంతరమైన యనుసంధానమును చేయుటలో సాధన చేయుచు సఫలత పొందిన దశలో క్రియాప్రకాశస్థలి యగుచున్నాడు.

తాత్త్వికముగా గమనించిన యెడల శరణుని స్థలము శక్తి ప్రకటితమై యుండే స్థానము. క్రియా ప్రకాశ స్థలమున క్రియా శక్తి శరణుని యధీనములోనికి వచ్చునని తెలియుచున్నది. ఈ కారణముననే యతడు శివునివలె సర్వకర్తృత్వ లక్షణములను సంతరించికొనును. క్రియా ప్రకాశము గురించి తెలిసికొనుట కుపయోగపడెడి క్రింది వచనమును గనుడి:

**బయల రూప మాడ బల్లాతనె శరణను**
**ఆ రూప బయల మాడబల్లాతనె**
**లింగానుభావి**
**బయలు రూప మాడలరియ దిద్దడె**
**ఎంతు శరణెంబె?**

**ఆ రూప బయల మాడలరియ దిద్దడె**
**ఎంతు లింగానుభావి యెంబె?**
**ఈ ఉభయ ఒందాదడె నిమ్మల్లి**
**తెరహుంటె?**
**కూడల సంగమ దేవా!** (శ్రీబసవేశ్వర వచ.922)

ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి :

**బయలును రూపముగ చేయగలవాడె శరణుడు**
**ఆ రూపమును బయలుగ చేయగలవాడె లింగానుభావి**
**బయలును రూపము చేయనిచో ఎట్లు శరణుడనియందు**
**ఆ రూపును బయలు చేయకుండినచో**
**యెట్లు లింగానుభావియందు**
**ఈ ఉభయులు నొకటైన యెడల**
**నీ యందున తెరపియుండునే**
**కూడల సంగమ దేవా!**

శరణుని క్రియా ప్రకాశ స్థితి గురించి శ్రీ సోమనాథులవారు నీ క్రింది విధముగా తెలియజేసిరి :

**వ్యాపిత ఘన మహిమానిధి శరణం**
**నిజ లీలాపరివర్తిత శరణం**
**త్రిజగజ్జన సంకీర్తిత శరణం**
**సర్వానుగ్రహ నేత్రం శరణం**
**సర్వవశైక కళత్రం శరణం** (షట్స్థల రగడ)

"శుభం భూయాత్"

## ఆశీర్వచనము - 1 :

## భావ ప్రకాశ స్థలము :

క్రియా ప్రకాశ స్థలమున శివయోగి యొక్క ధ్యానక్రియను మినహాయించిన పిదప నుండెడి క్రియలు గంధర్వనగరి వంటివని తెలిసికొనునని చెప్పబడినది. ఆ పిదప సాధకుడు ప్రవేశించెడి స్థలమే భావ ప్రకాశ స్థలము. ఈ స్థలము గురించి శ్రీ రేణుకాచార్య భగవత్పాదులవారు క్రింది యుపదేశము నిచ్చిరి:

**తరంగాద్యా యథాసింధో ర్నభిద్యంతేతథా2త్మనిః**
**భావా బుద్ధ్యాదయః సర్వే యత్తద్భావ ప్రకాశనం** (సి.శి. 19-83)

దీని తాత్పర్యమేమనగా సముద్రమునందున తరంగములు, నీటి బుడగలు మొదలగునవన్నియు నుత్పన్నమై కన్పట్టును. అవి సముద్రము కంటెను భిన్నమైనవి కావు. అటులనే శివయోగి మనస్సున నుత్పన్న మయ్యెడి శివభావములు శివునికంటెను భిన్నమైనవి కావు. సంపూర్ణముగా శివమయమైన మనోవృత్తిని భావనయని యందురు.

సముద్రపు తరంగముల యందున సముద్ర జలముండునటులే శివయోగి యొక్క భావములలో శివుడే యుండును. అందున శివుడే ప్రకాశకుడగుచున్నాడు. ఇట్టి భావన యొక్క స్వరూపమెట్టులుండునో అనెడి దానిని తెలుపుటకై శ్రీ భగవత్పాదులవారు క్రింది యుపదేశము నిచ్చిరి :

**శివ ఏవ జగత్సర్వం శివేఏవాహమిత్యపి ।**
**భావయన్ పరమోయోగీ భవదోషైర్నబాధ్యతే ॥**
**శివభావే స్థిరే జాతే నిర్లేపస్య మహాత్మనః ।**
**యేయే భావాః సముత్పన్నాస్తే తే శివమయాః స్మృతాః ॥** (సి.శి. 19 : 84 : 85)

దీని భావార్థమేమనగా, జగత్తంతయూ శివ స్వరూపమైయున్నది. నేనూ శివునినే యనుడి భావము గల శివయోగి భవదోషముల వలన బంధితుడు కాడు. శివభావన స్థిరమైన పిదప విషయముల నుండి నిర్లిప్తుడైన శివయోగి యొక్క మనస్సున యే భావనలుత్పన్నమగునో అవన్నియూ శివమయమై యుండునని తెలిసికొనవలెను.

భావ ప్రకాశ స్థలములోని శివయోగి యీ జగత్తును, అటులనే తనను శివరూపముగా భావించును. అందుచేత నతని భావన పరిశుద్ధమైనదై యుండును. అతని మనస్సున సాంసారిక విషయములే రాకుండనుండుటచేత విషయ దోషముల వలన నదెప్పటికైననూ దుష్టమైనది కాజాలదు. భావన మంచిగా నుండుట లేదా చెడ్డదిగా నుండుట యనెడిది మనస్సు కాలంబనగా నుండెడి విషయములే కారణముగా నుండును. సాంసారిక జీవుల భావన యందున కామక్రోధాదులే నిండియుండుటచేత వారి భావములు దోషభూయిష్టములైనవని పిలువబడుచున్నవి. కామక్రోధాదులు స్వతఃగా దూషితములై యుండుటచేత అవి వేటిని స్పృశించునో అవియును దూషితములగును. కామక్రోధాదులచేత కలుషితమైన భావనలుగల సంసారములోని చావుపుట్టుకల చక్రమునందున చిక్కికొని బ్రతుకుచున్నారు. ఇవి వ్యక్తిలోన యుండి యున్నప్పుడు జ్ఞానోత్పత్తి కవకాశమే యుండదు. క్రోధాదులను వెలుపలికి నెట్టినగాని శివభావన గల్గదని గ్రహించవలెను. కామక్రోధాదులను శాసించిన అక్కమహాదేవి గారి యీ వచనమును గమనించిన యెడల యీ విషయము విస్పష్టమగును.

**కామవే నీను నిల్లు నిల్లు**
**క్రోధవే నీను నిల్లు నిల్లు**
**లోభవే నీను నిల్లు నిల్లు**
**మోహవే నీను నిల్లు నిల్లు**
**మదవే నీను నిల్లు నిల్లు**
**మత్సరవే నీను నిల్లు నిల్లు**
**ఆన చెన్నమల్లికార్జునన**
**అవసరద ఓలె బయసుత్తిరువె**
**సచరాచరవే నీను నిల్లు నిల్లు**

ఈ వచనపు తెలుగు రూపమిది :

***కామమా! నీవు నిలువు నిలువు***
***క్రోధమా! నీవు నిలువు నిలువు***
***లోభమా! నీవు నిలువు నిలువు***
***మోహమా! నీవు నిలువు నిలువు***
***మదమా! నీవు నిలువు నిలువు***
***మత్సరమా! నీవు నిలువు నిలువు***

*ఏను చెన్న మల్లికార్జునుని*
*అవసరపు వొలిమి కోరుచుండెదను*
*సచరాచరమా! నీవు నిలువు నిలువు*

ఈ విధముగా అక్కమహాదేవి యరిషడ్ వర్గమునకు దూరమై తన మనస్సును పరిశుద్ధముగా నుంచికొని శివసాయుజ్యము నందినది. శ్రీమన్నిజ శివయోగులవారును తమ పద్యములలోన యిట్టి భావములనే ప్రకటించిరి. కామక్రోధాదుల నిమిత్తమైన శత్రువులనియును, వీటివలన జీవి యనేక శరీరములను ధరించికొని వాటిని పాడు చేసికొనుచున్నాడనియును, మనుష్యుని శరీరమున జొరబడెడి వీటిని తరిమికొట్టి మనస్సును శివధ్యానములో నిమగ్నమయి యుండునటుల చేయవలెనని వీరు సాధకుల కుద్బోధించిరి.

అనేక దినములనుండి మదిరాపానమును చేయుచు దాని వ్యసనాధీనుడైన వ్యక్తి, అది తనకు హానికరమని తెలిసిననూ, మద్యపానమును వీడుట కొరకసమర్థుడగుచున్నాడు. ఇటులనే క్రోధాదులను దూరము చేసికొనుటకు మనస్సు సిద్ధము కాకపోవచ్చును. మలినమైన వస్త్రములను ధరించినవాడు మలినమైన స్థానమున కూర్చుండుటకు జంకడు. అయితే శుభ్రమైన వస్త్రములను ధరించికొనినవాడు మలిన ప్రదేశములయందు కూర్చుండుట కిష్టపడడు. అదేవిధిన మలినమైనట్టి మనస్సు గలవానికి కామక్రోధాదులు వర్జ్యమనిపించవు. అందుకే మనస్సును నిర్మలముగా నుంచికొనినచో కామాదులను సులభముగా వదలవచ్చును. శివభావన వలన మనస్సును నిర్మలము చేసికొనిన శివయోగి సంసారదోషములనుండి నిర్లిప్తుడై యుండును. పద్మపత్రము నీటిలో యున్ననూ నీరు దానినంటజాలదు. అదే విధిన సంసారములో నుండియున్ననూ శివయోగి సంసారమునుండి యలిప్తుడైయుండునని గుర్తించగలరు. ఇతని మనస్సు శివమయమై యుండును. తనలోపల వెలుపల శివునిని వీక్షించెడి శివయోగి సర్వదా ప్రమోదము ననుభవించుచుండును.

భావ ప్రకాశ సంపన్నుడైనట్టి శివయోగికే విధమైన భావనలు గల్గుననెడి దానిని శ్రీ భగవత్‌పాదులవారీ క్రింది విధముగా వివరించిరి :

**అద్వితీయ శివాకార భావనాధ్వస్త కర్మణా ।**
**నకిఙ్చిద్ భావ్యతే సాక్షాత్ శివాదన్యన్మహాత్మనా ॥** (సి.శి. 19–86)

**గలితా జ్ఞాన బంధస్య కేవలాత్మానుభావినః ।**
**యత్ర యత్రేన్ద్రియాసక్తిస్తత్ర తత్ర శివాత్మతా ॥** (సి.శి. 19–87)

ఉపదేశము యొక్క తాత్పర్యమేమనగా పరశివబ్రహ్మ మద్వితీయముగా నున్నది. దీనికి సరిసమానమైనదిగాని లేదా శ్రేష్ఠతరమైనదిగాని వేరొక్కటిలేదు. ఇంతటి అద్వితీయమైనట్టి శివస్వరూపమును తన మనస్సునందున భావించెడి శివయోగి యొక్క కర్మములన్నియును కడతేరిపోవును. ఈ స్థితిలో శివుడు కాకుండగ వేరే యే యితర భావములు నుదయించవు. అజ్ఞానరూపమైన బంధనమునుండి ముక్తుడైన వాడును, కేవల మాత్మానుభావము గలవాడును అయిన యితని యింద్రియము లెచ్చటెచ్చట యాసక్తిని గల్గియుండునో అచ్చటచ్చట శివరూపమే కన్పట్టును. స్వస్వరూపము నెరుగకుండా నుండునదే యజ్ఞానము. ఇది స్వస్వరూపజ్ఞానము గల్గగనే లుప్తమగును. అప్పుడు శివయోగి దృష్టి శివమయమగును. "యథా దృష్టిః తథా సృష్టిః" అనెడి ఉక్తి ప్రకారముగా అతని సృష్టి శివమయముగా దోచుచుండును. ఈ యంశమును స్పష్టము చేసెడి కథ యొకటి కలదు.

ఒక రాజ్యపు రాజు వేటాడుటకై యొక అడవికి పోయియుండెను. అచ్చట గుర్రమునుండి దిగి వట్టి కాళ్ళతో తిరుగాడునప్పుడు ముల్లొకటి రాజుగారి కాలుకు నాటికొనెను. రక్తము కారుచుండెను. ఎంతో నొప్పి గల్గెను. రాజు అంతఃపురము కొరకు బయలదేరి వెడలెను. మంత్రులందరినీ రప్పించి తనకు గల్గిన యిబ్బంది గురించి చెప్పెను. నేనెక్కడ తిరిగినా నా కాలికి ముళ్ళు కుచ్చుకొనకుండగ నుండునట్లేదైనా వొక శాశ్వతమైన ఉపాయమును తెలుపుడని ఆదేశించెను. దర్బారులోని పండితులు విషయమును చర్చించిరి. రాజు తిరుగాడెడి ప్రదేశముమీద చర్మమును పరచవలెనని సూచించిరి. రాజీ సూచన నంగీకరించి అద్దాని యమలుకై ఆదేశములనిచ్చెను. మహామంత్రి వేటకాండ్రను పిలిపించి వారికీ పనిని చేయమని పురమాయించెను. వారెన్ని జంతువులను చంపిననూ కార్యము సాఫల్యత గాకుండెను. వారు చింతాక్రాంతులై యుండగా నొక మహాత్ముడటు విచ్చేసెను. విషయము నెరిగెను. అతడు వేటకాండ్రు కభయమిచ్చి, ఒక పాదరక్షలు చేసెడివానిని తోడుగా గొని రాజు దగ్గరకు వెడలెను. రాజు కాలుకు సరిపడెడి పాదరక్షలను చేయించి యిచ్చి "వీటిని ధరించి భూమండల మంతటా తిరిగినా నీ కాళ్ళకు రాళ్ళుగాని, ముళ్ళుగాని కుచ్చుకొనవు" అని పలికెను. రాజు తానుచేసిన తప్పేమిటో తెలిసికొనినవాడై సిగ్గిల్లెను. వెంటనే జీవహింస పాపమని ఆజ్ఞాపించెను. కాళ్ళకు జోళ్ళను వేసికొనినచో భూమండలమంతయును చర్మపు తొడుగు తొడిగినట్టు లెట్టులగునో అట్లే శివునిని దృష్టియందున నిలిపికొనినచో సృష్టంతయూ శివమయమై కన్పట్టును.

ఎవ్వరియందున రాగద్వేషాది భావనలు లుప్తమైయుండునో వారికే శివభావన గల్గునని తెలుపుచు శ్రీ భగవత్పాదులవారు క్రింది యుపదేశము నిచ్చిరి :

**రాగద్వేషాదయోః భావాః సంసారక్లేశకారణమ్ ।**
**తేషాముపరమో యత్ర తత్ర భావః శివాత్మకః ॥** (సి.శి. 19-88)

దీని తాత్పర్యమేమనగా, సంసారములోని దుఃఖమునకు రాగద్వేషాది భావనలే కారణములై యున్నవి. ఎవ్వరి హృదయమునుండి యీ రాగద్వేషములు దూరమైయుండునో అంతటి శివయోగికి మాత్రమే శివభావన యుద్భవించును.

జగత్తునందున జన్మను దాల్చిన ప్రతియొక్క వ్యక్తి యొకానొక ప్రకారమైన దుఃఖము ననుభవించుచునే యుండును. దుఃఖితుడు కావలెననెడి కోరిక యెవ్వరికిని యుండదు. అయితే దుఃఖము యొక్క మూలము నరయక యెల్లరూ దుఃఖమునకు గురియగుచున్నారు. శ్రీభగవత్పాదులవారు రాగ-ద్వేషములే దుఃఖమును గల్గించునని తెలిపిరి. రాగద్వేషములు నవిద్యాది పంచక్లేశములలోనివని తెలుపబడినది. "క్లిశ్నాతీతి క్లేశః" అనెడి వ్యుత్పత్తి ప్రకారము దేనిచేత దుఃఖము గల్గునో అదియే క్లేశమనబడుచున్నది. చావు పుట్టుకలకు రాగద్వేషముకారణములగుచున్నవి. జన్మించునప్పుడూ దుఃఖమే మరణించునప్పుడు దుఃఖము గల్గుచున్నదని తెలియుచున్నది. ఈ కారణముననే "జన్మదుఃఖం జరాదుఃఖం జాయాదుఃఖం పునః పునః। సంసార సాగరం దుఃఖం తస్మాజ్జాగ్రత జాగ్రత॥" యనెడి హెచ్చరిక చేయబడినది. రాగద్వేషములనుండి దూరమగుట శ్రేయస్కరమని గుర్తించగలరు.

రాగద్వేషములొకే నాణ్యము యొక్క రెండు ముఖములైయున్నవి. రాగము ప్రవేశించిన వెంటనే ద్వేషము ప్రవేశించును. ప్రస్తుతం ఒకే ఒక భావన మొదట రాగముగాను పిదప ద్వేషముగాను దర్శనమిచ్చును. పౌరాణిక కథలలో రాక్షసి అందమైన రూపమును ధరించి యేదో ఒక కార్యమును సాధించుటకు పూనుకొనుటకు చూడగలము. భాగవతములో వచ్చెడి పూతన పాత్ర యిట్టిదే. అందమైన రూపము రాగమునకు చిహ్నము కాగా భయంకరమైనట్టి రూపము ద్వేషమునకు చిహ్నమగును. రెండు రూపములలో నుండెడి రాక్షసి ఒకర్తె మాత్రమే. ఈ మౌలిక భావనను వీడుట చాలా కష్టము. అయితే పరమాత్ముని యెడల వీటిని ప్రదర్శించి ముక్తిని పొందినవారి కథలు గలవు. అనురాగము భక్తిగాను, ద్వేషము వైరముగాను పరిణమించును. త్రిపురాసురులు శివుని యెడల యనురాగమును పెంచికొని భక్తులై శక్తి సంపన్నులైరి. పిదప వారు ద్వేషమును పూని శివుని చేత చంపబడి ముక్తిని బడసిరి. వైష్ణవులు చెప్పెడి హిరణ్యకశ్యపుని కథయు నిట్టిదే. అనురాగముతో ప్రహ్లాదుడు ముక్తిని సాధించెననియును, ద్వేషముతో హిరణ్యకశ్యపుడు పరమ పదమును పొందిరని చెప్పబడినది.

పూర్వోక్తమైన రీతిలో శివభావన గల్గినవాడైన శివయోగిని తామసీశక్తి యేమియూ చేయజాలదు. అతనిపైన యది యెట్టి ప్రభావమును చూపజాలదని చెప్పుటకై శ్రీ భగవత్పాదులవారు క్రింది యుపదేశము నిచ్చిరి :

**యథా సూర్య సమాక్రాన్తౌ న శక్నోతి తమః సదా ।**
**తథా ప్రకాశ మాత్మానం నావిద్యా క్రమతి స్వయమ్ ॥** (సి.శి. 19-89)

దీని తాత్పర్యమేమనగా తన ప్రఖరమైనట్టి ప్రకాశముచేత జగత్తును ప్రకాశింపజేసెడి సూర్యుని చీకటి యేవిధముగా నావరించి యుండజాలదో అదేవిధముగా భావప్రకాశ సంపన్నుడైన శివయోగిని అవిద్య ఆవరించజాలదు. చీకటి-వెలుతురుల మధ్యయందునను, జ్ఞానము-అవిద్యల మధ్యయందునను పరస్పర నివర్త్య నివర్తక రూపమైనట్టి విరోధ భావముండును. చీకటి నివర్త్యమైనదైనచో వెలుతురు నివర్తకమైనదగుచున్నది. అటులనే యవిద్య నివర్త్యమైనప్పుడు జ్ఞానము నివర్తకమగుచున్నది. అవిద్య లేనిచో క్లేశముల కాస్కారమెక్కడిది. అందుచేత శివయోగి దుఃఖమునకు లోనైయుండడని గ్రహించగలరు.

మీరందరు రాగ-ద్వేషములను వీడిన వారై శివయోగి వలె భావప్రకాశ సంపన్నులుగా నగుటకు యత్నింతురుగాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులైన శ్రీ చంద్రశేఖర శివాచార్యులవారు లింగశరణ స్థలియొక్క భావ ప్రకాశము గురించి తెలియజేసిరి. శివజీవాభేద భావము పరిపూర్ణమైన స్థితికి యెదిగి పూర్ణమైన శివత్వభావమును పొందిన దశలో భావప్రకాశమభివ్యక్తమగును.

క్రియా ప్రకాశసంపన్నుడైన లింగస్థల శరణునిలోన నిండికొనియున్న శివత్వ భావన యపూర్వమైనదిగా నుండును. ఇద్దానిని గురించి చెప్పుటకొరకు యత్నించెడి క్రింది సీసమును గనుడి :

**నీవె కర్తవటన్న నిక్కంబు భక్తుండు**
**తానన్న నుభయకర్మానుగతుడు**
**నీకెయన్నను సదా నియతప్రసాదాంగి**
**తనకన్న నింద్రియ తత్పరుండు**
**నిన్ను నెరింగిన నేటైన శరణుండు**
**తన్ను నెరింగిన తామసుండు**
**నీవు తానన్నను నిజము లింగైక్యుండు**
**తాను నీవనిన నద్వైత వాది**

**కాన కాయకర్మగతి మతి శబ్దచై**
**తన్య భావములను దన్ను మరచి**
**లింగగతి జరించు లింగలింగైక్యుల**
**జేర్పవయ్య నన్ను జెన్నమల్లు**

(చెన్నమల్లు సీసము, 27)

కేవలాద్వైతి యొక్క భావ ప్రకాశము "అహం బ్రహ్మాస్మి" యనెడి రూపములో ప్రకటితమగును. వీరశైవులు శంకరాచార్యులచేత ప్రతిపాదించబడిన యీ భావనను తిరస్కరించిరి. ఇది అహంకారమును వృద్ధిజేసెడి భావనయని భావింపబడినది. భజన భావనా సమేతుడై సతీ-పతి న్యాయమున యానందభక్తిని నెరపి సాధనా ఫలముగా శివసాన్నిధ్యమును పొంది, చిదానందము ననుభవించెడి సాధకుడు రాగ-ద్వేష రహితుడై యుండును. తత్ఫలితముగా నతడు నహంకారము నిర్మూలింపబడుచున్నది. అందుచే నతడు "అహం శివోస్మి" యనెడి భావనను పెంపొందించికొనడు. "శివోహం" అనెడి భావమును పెంపొందించికొనును. ఇచ్చట అతడనుభవించెడి అభేదమెట్టిదనగా నీటి బుడగలకును మహాసముద్రమునకును గల యభేదము వంటిది. "తరంగాద్యా యథా సింధో ర్నభిద్యన్తే తథాత్మనః" అనెడి శ్రీ భగవత్పాదులవారి వాక్కులు స్మరణీయములు.

శివభావము పరిపూర్ణముగా నిండియున్న దశ యెట్టులుండునో అనెడి దానిని వివరించెడి క్రింది వచనము గనుడి :

**తెరహిల్లదనడె; తెరవాల్లద నుడి**
**తెరహిల్లద సంభాషణెయ సుఖవు**
**తెరహిల్లదె నంబిదె, స్వానుభవద సుఖవు**
**తెరహిల్లద మహిమే, తెరహిల్లద విచార**
**కూడల సంగమదేవా, నిమ్మ శరణంగె** (శ్రీ బసవేశ్వర వచ. 918)

ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి :

**తెరపిలేని నడత, తెరపిలేని నుడువు**
**తెరపిలేని సంభాషణా సుఖము**
**తెరపిలేని నమ్మిక, తెరపిలేని స్వానుభవసుఖము**
**తెరపిలేని మహిమ, తెరపిలేని విచారము**
**కూడల సంగమదేవా, మీదు శరణునకు**

ఇట్టి శివభావము ప్రకటితమై యెట్టి ప్రకాశమును వెదజల్లుననెడిది తెలిసికొనుట కష్టమే. కాని యథాభావం తద్భవతి అనెడి లోకోక్తి ప్రకారము శివుడే తానై తిరుగాడెడి శరణుని నడతవలన నీ ప్రకాశమును కనుగొనవచ్చును. ఈ విషయమును తెలిపెడి క్రింది పద్యమును గనుడి :

**కనుమూయుదెరచు నీ కన్నుల వెంబడి**
**వినుచుండు వినదు నీ వీనులందు**
**స్వాదించు మోదించు నీదు నాలుకయందు**
**గంధించు సొగయు నీ ఘ్రాణమందు**
**స్పర్శించు బాయు నీ సర్వాంగములయందు**
**దలపించు దలచు నీ తలపులందు**
**గమనించు నిలుచు నీ గమనాగమములందు**
**భాషించు మాను నీ భాషలందు**

**నీడబోలు తాను నీడయై బాహ్యాంత**
**ర ప్రవర్తముల నీ ప్రసాద**
**సౌఖ్యమునను బొదలు ముఖ్య ప్రసాదుల**
**జేర్పవయ్య నన్ను జెన్నమల్లు** (చెన్నమల్లు సీసము - 30)

"కేవలాత్మాను భావినః యత్ర యత్రేంద్రియాసక్తి స్తత్ర తత్ర శివాత్మతాః" అనెడి శ్రీ భగవత్పాదులవారి యుపదేశమినుట స్మరణీయము.

"శుభం భూయాత్"

## ఆశీర్వచనము - 1 :

## జ్ఞాన ప్రకాశ స్థలము :

భావ ప్రకాశ సంపన్నుడై శివయోగి జ్ఞాన ప్రకాశస్థలములోనికి ప్రవేశించును. లింగషట్ స్థలములలోని శరణ స్థలమునకు చెందిన యీ స్థలమున శివయోగి శివ-జీవద్వైత జ్ఞానమును పొందును. శ్రీరేణుకాచార్య భగవత్పాదులవారు శ్రీ అగస్త్యమునీశ్వరుని కీ విషయమున క్రింది యుపదేశమునిచ్చిరి :

**ముఖ్యార్థేః సమ్భవే జాతే లక్షణాయోగ సంశ్రయాత్ ।**
**తజ్జ్ఞానయోజనం యత్తదుక్తం జ్ఞాన ప్రకాశనమ్ ॥** (సి.శి. 19-90)

దీని తాత్పర్యమేమనగా శబ్దమునేదో ఒక ప్రకారమైనట్టి యర్థమును కూడికొనుయుండును. శబ్దముల యర్థము మనకు తెలియవలెనన్నచో తెలిసినవారు వాటిని బోధించవలసి యుండును. శబ్దపు టుపయోగమును తెలిసికొనవలెను.

ఉదాహరణగా ఘటమనెడి శబ్దమునకు కుండ యనెడి అర్థమగును. ఎంతవరకు శబ్దపు టర్థము మనకు తెలియదో అంతవరకు నా శబ్దపు వ్యవహారమునందున మన ప్రవృత్తి కాజాలదు. సంస్కృతభాష తెలియని వ్యక్తికి మనమెన్నిమార్లు "ఘటం ఆనయ" అని చెప్పినా కుండను తెచ్చెడి వ్యవహారమునందున నతడు ప్రవృత్తుడు కాడు. అయితే అతనికి "ఘటం" అంటే "కుండ" అనియు, "ఆనయ" అంటే "తెమ్ము" అనియును అర్థముండునని తెలిపినచో అతడు కుండను తీసికొని రాగలడు. సాక్షాత్తుగా నుపదేశించుచుండగా నుండినను "ఘటం ఆనయ" అని యొక సంస్కృత పండితుడనగానే భాషనెరిగిన మరొకడు కుండను తెచ్చుటను చూడగా చూడగా కొంతకాలము పిదప సంస్కృతమెరుగని వాడైనను "ఘటం ఆనయ" అనగానే కుండను తేగల్గును. ఈ విధముగా శబ్దార్థ బోధనము వ్యవహార ప్రవృత్తికి కారణమగుచున్నది.

ఒక శబ్దమునకు మూడు ప్రకారములగు అర్థములుండును. అవి : వాచ్యార్థము, లక్ష్యార్థము మరియు వ్యంగ్యార్థము. శబ్దము యొక్క ముఖ్యార్థమునే వాచ్యార్థమని యందురు. ఇది సహజముగా అందరూ ఎరిగినదే. ఎచ్చట వాచ్యార్థము సంభవించుట జరగదో అచ్చట లక్ష్యార్థమును గ్రహించవలసియుండును. "గంగాయాం ఘోషః" అనెడి దానిని వినినప్పుడు గంగయందలి స్రోత" అనెడిది దానిని వాచ్యార్థమగును. గంగా ప్రవాహము మీద ధ్వనియుండెడిది సాధ్యము కాదు. గంగాతటము నందున ధ్వని యనెడిది లక్ష్యార్థమగును. అర్థము వాచ్యార్థమునకు పూర్తిగా విరుద్ధమైనదైనప్పుడు అది వ్యంగ్యార్థమగును.

ఒక మూర్ఖునుద్దేశించి మహాపండితుడివి అనుటలో వ్యంగ్యార్థము దోచును. ఈ విధముగా వ్యవహారము నందున ప్రసంగానుసారముగా వాచ్యార్థము, లక్ష్యార్థము మరియు వ్యంగ్యార్థముల ప్రయోగములగుచున్నవి.

ప్రకృతమైన ప్రసంగమునందున గురువులైన వారు శిష్యునికి శివ–జీవుల అయిక్య బోధను నుపదేశించునప్పుడు "తత్త్వమసి" అని బోధింతురు. "నీవు శివ స్వరూపుడవై యున్నావు" అనెడిది దీని అర్థము. ఇచ్చట వాచ్యార్థమునందున విచారము చేయగా జీవుని అల్పజ్ఞత్వము, అల్పకర్తృత్వము, పరిచ్ఛిన్నత్వము మొదలగు గుణములచేత కూడికొనియుండును. శివుని గుణములు వీటికి విరుద్ధముగా నుండును. ఈ స్థితిలో అల్పజ్ఞుడైన జీవుడు సర్వజ్ఞుడైన శివునిగా నెట్టుల కాగలడనెడి సందేహమున కాస్కారమేర్పడును. అందుచేత ముఖ్యార్థమును త్యాగముచేసి శివజీవులలో నుపహితమై యుండెడి చైతన్యమును తీసికొనిన యెడల సమానత్వము సిద్ధించును. శివ–జీవులలోని మాయ–అవిద్య యనెడి ఉపాధులను బహిర్గతము చేసినచో శివుడు–జీవుడు సచ్చిదానంద స్వరూపమైయుందురు. అప్పుడిరువురు సమానులే. ఆనంద స్వరూపమనెడిది లక్ష్యార్థములో స్ఫురించెడిదని గుర్తించవలెను.

అందుచేత శివ–జీవుల మధ్య భేదమును ప్రదర్శించెడి ముఖ్యార్థమును త్యాగముచేసి, అభేదమును సూచించెడి లక్ష్యార్థమును గ్రహించవలెను. శరీరము మరియు మనస్సు యనెడి యుపాధులతో కూడికొనియుండెడి జీవుడు "నీవు శివునివై యున్నావు" అని బోధించినయెడల తానునెటుల శివుడు కాగలడనెడి భావమతనిలో నొడగొనును. అయితే అతనికి శరీరాది యుపాధుల స్వరూపమును తెలియజేసి, వాటియందున వాటికంటెను భిన్నమైనట్టి యొక చైతన్య స్వరూపము గలదని తెలియజేసి, అదే నీవని తెలియజెప్పి అదే ప్రకారముగా మాయోపాధిరహితమైన పరమాత్ముని స్వరూపము గురించి తెలియజేసి, శివ–జీవాభేదంబును బోధించినచో శిష్యుడు తాను శివుడిననెడి భావమును పొందగల్గును.

మృణ్మయ మరియు సువర్ణమయమే రెండు కలశములను ముందిడికొని యా రెంటి యొక్క అభేదమును బోధించవలెననినచో అది సాధ్యము కాకపోవచ్చును. కారణమేమనగా మన్ను మరియు బంగారమనెడి రెండు భిన్నమైన పదార్థములచేత నవి నిర్మింపబడినవి. అయితే రెండు ఘటములలో నుండెడి ఆకారము మాత్రము తత్వతః ఒకటే అయి యుండుటచేత వాటి అభేదత్వమును చెప్పుట కెట్టి బాధయు నుండదు. ఇదే విధిన శివజీవుల సంబంధముండునని గ్రహించగలరు. ఆవులనేక వర్ణములకు చెందినవై యున్ననూ, వాటిలోని పాలు మాత్రమొకే విధముగా నుండునటులే శివ–జీవులలో భిన్నత్వము గోచరించిననూ వారిరువురి మౌళి స్వరూపమొకటే యనెడి దాని గ్రహించిన శివయోగి జ్ఞానప్రకాశ స్థలుడగుచున్నాడు.

శ్రీ జగద్గురు రేణుకాచార్యులవారు జ్ఞాన ప్రకాశపు స్థలమును విశ్లేషణ చేయుచు నీ క్రింది విధముగా నుపదేశము నిచ్చిరి :

**ముక్తస్య జ్ఞానసంబంధో జ్ఞేయాభావః స్వభావతః ।**
**ఉపాధి సహితం జ్ఞానం న భేదమతి వర్తతే ॥**(సి.శి. 19–91)

**జ్ఞానమిత్యుచ్యతే సిద్ధిః పరిచ్ఛేదోఽపివస్తునః ।**
**పరాత్మన్యపరిచ్ఛేదే కుతో జ్ఞానస్య సంభవః ॥** (సి.శి. 19-92)

**జ్ఞానస్యా విషయే తత్వే శివాఖ్యే చిత్సుఖాత్మని ।**
**ఆత్మైకత్వానుసంధానం జ్ఞాన మిత్యుచ్యతే బుధైః ॥** (సి.శి. 19-93)

దీని తాత్పర్యమేమనగా జీవన్ముక్తుడైన శివయోగికి స్వాభావికమైన రీతిచేత లక్ష్యార్థ జ్ఞానము ప్రాప్తమై యుండుటచేత తెలిసికొనుటకొరకు వేరొకటేదియు నుండదు. ఉపాధి యుక్తమైన జ్ఞానముచేత భేదభావము దూరము కాజాలదు. అందుచేత నీ జ్ఞాన ప్రకాశ స్థలమునందున శివ-జీవుల యుపాధులను అటుకడచి ఉపహిత అభేద భావమును లక్ష్యార్థము మూలకముగా తెలిసికొనబడును. లింగము మరియు అంగము లనెడి రెండు వస్తువుల పరస్పర భేదజ్ఞానము, అనగా లింగము అంగము కాదు, అంగము లింగము కాదు అనెడి ఖండిత జ్ఞానమును జ్ఞానులు ద్వైత జ్ఞానమని యందురు. ఉపాధిరహితమైనట్టి పరమ చైతన్యమునందున పరిచ్ఛేదము లేదా ఖండితత్వము సంభవించదు. అందుచేత, అచ్చట ద్వైత జ్ఞానమెట్టులగుననెడి ప్రశ్న రావచ్చును. జ్ఞానము స్వయం ప్రకాశరూపమైనదై యుండుటచేత యది వేరొక్క జ్ఞానమునకు విషయము కాజాలదు. ఇంతటి జ్ఞానరూపమూ, సుఖరూపమూ అయిన పరశివతత్త్వమును తన యాత్మతో నేకత్వాను సంధానమును చేయుటనే జ్ఞానమని జ్ఞానులు పిలుతురు.

జన్మను బడసిన కూనకు నే పేరునుండదు. నామకరణ సంస్కారమును జేసి పేరిడుదురు. ఆ పేరుతో నా పసికూనను మీద మీద పిలిచినప్పుడు బిడ్డ యిది తన పేరని యెరిగి దానితో తానును తాదాత్మ్యమగును. ఏ శరీరమునకు నా పేరును పెట్టుదురో ఆ శరీరముతానే యని భావించికొనును. శరీరపు నామరూపమునకు వ్యతిరిక్తమైనట్టి అస్తిత్వము కలదనెడి పరికల్పన ఆ బిడ్డకుండదు. అయితే గురువు యొక్క ఉపదేశము మూలకముగా శరీరము, శరీరమునకివ్వబడిన పేరు నేను కాదు, నేను వీటికంటెను భిన్నమైన ఆత్మయొక్క రూపుడనై యున్నాననెడి జ్ఞానమెప్పుడు ప్రాప్తమగునో అప్పుడతడు ఆత్మచింతన యందున తల్లీనుడగుచున్నాడు. మున్ముందున తన ఆత్మకు పరమాత్మునికిని యే విధమైన సంబంధముండదని తెలిసినప్పుడు అతని హృదయమునందున ఆత్మ పరమాత్మల అభేదభావన దృఢమగును. ఆత్మ-పరమాత్మ యను సంధానమును చేసికొని యతడు చివరకు శివుడే యగును. ఇదే లింగాంగ సామరస్యము. జ్ఞానులు నిట్టి జ్ఞానమునే నిజమైనట్టి జ్ఞానమని యనిరి.

ఇంతవరకు చెప్పబడినట్టి శివజ్ఞానమే బ్రహ్మజ్ఞానమని తెలుపుటకై శ్రీభగవత్పాదులవారు క్రింది యుపదేశము నిచ్చిరి :

**అపరిచ్ఛిన్నమానన్దం సత్తాకారం జగన్మయం ।**
**బ్రహ్మేతి లక్షణం జ్ఞానం బ్రహ్మజ్ఞానమిహోచ్యతే ॥** (సి.శి. 19 :94)
**బ్రహ్మజ్ఞానే సముత్పన్నే విశ్వోపాధి వివర్జితే ।**
**సర్వం సంవిన్మయం భాతి తదన్యన్నైవదృశ్యతే ॥** (సి.శి. 19 :95)
**తస్మాదద్వైత విజ్ఞానమపవర్గస్య కారణమ్ ।**
**భావయన్ సతతం యోగీ సంసారేణ నలిప్యతే ॥** (సి.శి. 19 :96)

దీని తాత్పర్యమేమనగా, సర్వ ప్రపంచమును బ్రహ్మరూపముగా గాంచుటయే బ్రహ్మ జ్ఞానము. ఏది అఖండమూ, ఆనందరూపముగా నయి యుండునో, ఏది జగత్తునిండా సద్రూపమై యస్తిత్వము నందున నుండునో, దేనియందున సచరాచరాత్మకమైన జగత్తు లయమొందునో, అంతటి బృహత్తరమైనట్టి తత్త్వమునకు బ్రహ్మమనెడి పేరు గలదు. సువర్ణమే ఆభరణముల రూపమున దోచునటుల ఆ పరబ్రహ్మమే జగత్తుగా కన్పట్టును. అజ్ఞానుల దృష్టియందున నియ్యది జగత్తుగా దోచిననూ జ్ఞానుల దృష్టి యందున నిది పరబ్రహ్మమే అయియున్నది. గ్రాహకులు తెచ్చిన వివిధ సొమ్ములను తూకము చేసెడి స్వర్ణకారునికి అవన్నియును బంగారముగానే దోచినట్టులే, సామాన్యులకు వివిధ రూపములలో గోచరించెడి జగత్తు జ్ఞానులకు పరబ్రహ్మ రూపముననే కనిపించును. ఇదియే నిజమైన బ్రహ్మజ్ఞానము.

శ్రీ జగద్గురు రేణుకాచార్యులవారు జ్ఞాన ప్రకాశస్థలము గురించిన తమరి యుపదేశమునకు ముగింపును పలుకుచు క్రింది యుపదేశము నిచ్చిరి :

**నిత్యే నిర్మల సత్త్వయోగిషు పరే నిర్వాసినే నిష్కలే**
**సర్వాతీతపదే చరాచరమయే సత్తాత్మని జ్యోతిషి ।**
**సంవిద్వ్యోమ్ని శివే విలీన హృదయస్తద్భేదవైముఖ్యతః**
**సాక్షాత్ సర్వగతో విభాతి విగలద్విశ్వః స్వయం సంయమీ ॥**

(సి.శి. 19–97; 98)

జ్ఞాన ప్రకాశ సంపన్నుడైన శివయోగి యొక్క హృదయము నందున శివాద్వైత భావన సదావకాశ కాలమున ప్రకాశమగుచుండును. ప్రకాశమానమైనట్టి యీ పరశివతత్త్వముండెడి విధి యెట్టిదో అనెడి దానిని శ్రీ పూజ్యపాదులవారు పై యుపదేశమునందున వివరించిరి. పరశివతత్త్వము భూత–వర్తమాన–భవిష్యత్తులలో సదా వుండెడిదైయున్నది. నిర్మలము, సాత్వికములైన శివయోగుల హృదయముల యందున యది సదావాసము చేయుచుండును. అది సర్వ విధ వాసనా శూన్యము, నిరవయమునయి యున్నది. అది అన్నింటికంటెను నుత్కృష్టమైనట్టి స్థానమున నుండు నట్టిదై యున్నది. దానిని మించిన స్థానము మరొక్కటిలేదు. అది చరాచర జగత్తునందున ననుస్యూతమై యున్నది. ఇది విశ్వములోని ప్రకాశములన్నింటికిని ప్రకాశమునిచ్చుచున్నది. అది జ్ఞానాకాశరూపమున నుండును. ఇట్టి తత్త్వము నందున యెవ్వరి మనస్సునైక్యమగునో అంతటి శివయోగి శివుని తనలోని యభిన్నమైన దానిగా నెరుగుచున్నాడు. ఈ శివయోగి స్వతఃగా శివస్వరూపునిగా యుండుటేకాదు, జగత్తును శివ స్వరూపముగా చూచుచున్నాడు.

ఇచ్చుటివరకు నుపదేశము చేసిన రీతిలో శివ–జీవుల వాచ్యార్థమును త్యాగముచేసి లక్ష్యార్థము మూలకముగా శివాద్వైత జ్ఞానమును బడసి సర్వత్ర శివుని చూసెడి విధిని బడసిన శివయోగియే జ్ఞాన ప్రకాశస్థలియని యెరుగవలెను.

సాధకులు జ్ఞానప్రకాశ సంపన్నుని నాదర్శముగా గొని సర్వత్ర శివుని గాంచే ప్రయత్నమును చేతురుగాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు శ్రీ చంద్రశేఖర శివాచార్యులవారు లింగస్థల శరణుని జ్ఞాన ప్రకాశ విస్తృతిని గురించి వివరించి చెప్పిరి.

భావ ప్రకాశమును పొంది "శివోహ" మ్మనెడి భావము వలన ప్రేరితమైన ప్రవర్తన గల్గిన శివయోగి సర్వజ్ఞత్వ లక్షణ సమన్వితుడై యుండెడి స్థితిని జ్ఞాన ప్రకాశస్థలమని యనవచ్చును. సర్వజ్ఞుడను భావన గురించిన వివరముల తెలిసికొనుట యెంతో యవసరము.

సర్వజ్ఞత్వము శివుని లక్షణమేగాని జీవుని లక్షణము కాదనెడి యభిప్రాయము గురించి తెలియనివారెవ్వరు. అవిద్యా ప్రభావము వైదొలగిన స్థితిలో సాధకుడు శుద్ధవిద్యా సంపన్నుడై ప్రకాశించుచుండును. తత్ఫలితముగా భేదభావము నశించి అభేద భావమేర్పడును. "తత్త్వమసి" మహావాక్యము యొక్క లక్ష్యార్థము నెరుంగును. శివుని గురించియును తన గురించియును తెలిసికొనును. జగత్తు గురించియును తెలిసికొనును. "సర్వం శివమయం జగత్" అనెడి సత్త్వమునెరుగును. శివుడు చిత్స్వరూపుడని యెరుగును. ఆ శివుడు తానే యని యెరుగును. ఈ విధముగా సచ్చిదానంద స్వరూపమైన శివతత్త్వముతో నెల్లప్పుడును సన్నిహిత సంబంధము గల్గియుండెడి లింగస్థల శరణుడు జ్ఞాన ప్రకాశ స్థలియగుచున్నాడు.

జీవునికి లక్షణమైయున్న అల్పజ్ఞత్వము యొక్క నిజమైన స్వభావము గురించి తెలిసికొనవలసి యున్నది. వాస్తవముగా చూచిన యెడల అల్పజ్ఞత్వము ఉపాధి కారణమున నుండెడిదేయని తెలియుచున్నది. ఉపాధి వైదొలగిన స్థితిలో జీవుడు జీవత్త్వమును వీడి సర్వజ్ఞుడగును. ఈ తత్త్వము నెరిగిన శివయోగి జ్ఞాన ప్రకాశ సంపన్నుడగునని గ్రహించగలరు.

జ్ఞాన ప్రకాశస్థలమున నుండెడి శివయోగి యెట్టి బౌద్ధిక స్థితి యందుండు ననెడిది గ్రహించవలసిన విషయము. ఈ విషయమును తెలిపెడి యీ వచనమును గనుడి :

**కంగళు తుంబిద బళిక నోడలిల్ల**

**కివిగళు తుంబిద బళిక కేళలిల్ల**

**కైగాళు తుంబిద బళిక పూజిసలిల్ల**

**మన తుంబిద బళిక నెనెయలిల్ల**

**మహంత కూడల సంగమ దేవన**

ఈ వచనము యొక్క తెలుగు రూపము గనుడి :

**కన్నులు నిండిన పిదప చూడనులేదు**
**చెవులు నిండిన పిదప వినలేదు**
**చేతులు నిండిన పిదప పూజించలేదు**
**మనస్సు నిండిన పిదప తలవనులేదు**
**మహంత కూడల సంగమ దేవుని. (శ్రీ సబవేశ్వర వచనము-852)**

జ్ఞాన ప్రకాశ సంపన్నుడైన శివయోగిని గురించి పాల్కురికి వారు నీ క్రింది విధముగా నుడివిరి :

**స్వచ్ఛందాచార పరం శరణం**

**స్వచ్ఛతర జ్ఞాన తరం శరణం**

**పరమాకాశ శరీరం శరణం**

**పతతత్త్వైకాకారం శరణం** (షట్ స్థలదరగడ)

ఈ రగడ తెలుగు రూపమిది :

**స్వచ్ఛందాచార పరుడు శరణుడు**
**స్వచ్ఛతర జ్ఞానతరుడు శరణుడు**
**పరమాకాశ శరీరుడు శరణుడు**
**పరతత్త్వైకాకారుడు శరణుడు**

ఈ రగడలోని భావమేమనగా శరణస్థలి పూర్ణజ్ఞాన సంపన్నుడై యుండును.

"శుభం భూయాత్"

# వింశతితమ పరిచ్ఛేదము

## ఐక్య స్థలము

## స్వీకృత ప్రసాది స్థలము :

లింగషట్ స్థలములలోని చివరిది ఐక్యస్థలము. శ్రీ అగస్త్య మహర్షి యీ స్థలము గురించి యెరిగెడి యిచ్ఛ గలవాడై, శ్రీ రేణుకాచార్య భగవత్పాదులవారి నుద్దేశించి యీ క్రింది విజ్ఞాపనను చేసిరి :

**స్థలభేదాత్వయా ప్రోక్తాః శరణస్థలసంశ్రితాః ।**
**ఐక్యస్థల గతాన్బ్రూహి స్థలభేదాన్ గణేంద్ర మే ॥** (సి.శి. 20 : 1)

దీని తాత్పర్యమేమనగా "ఓ గణేంద్రా! మీచేత శరణ స్థలాంతర్గతమైన వివిధ స్థలముల గురించి యుపదేశింపనైనది. ఇప్పుడు ఐక్యస్థలములోని స్థల భేదముల గురించి తెలియజేయగలరు.

శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారు క్రింది విధముగా నుత్తరము నిచ్చిరి :

**స్థలానాం నవకం చైక్యస్థలె2స్మిన్ పరికీర్త్యతే ।**
**తత్ స్వీకృతప్రసాదైక్య స్థలమాదౌ ప్రకీర్తితమ్ ।**
**శిష్టోదన స్థలం చాథ చరాచరలయ స్థలమ్ ॥**
**భాణ్డస్థలం తతః ప్రోక్తం భాజనస్థలముత్తమమ్ ।**
**అంగాలేప స్థలం పంశ్చాత్ స్వపరాజ్ఞ స్థలంతతః ॥**
**భావాభావ వినాశం చ జ్ఞానశూన్యస్థలం తతః ।**
**తదేషాం క్రమశో వక్ష్యే శ్రుణు తాపస లక్షణమ్ ॥** (సి.శి. 20 : 2-3-4-5)

దీని తాత్పర్యమేమనగా నీ స్థలమున తొమ్మిది యవాంతర స్థలములు గలవు. అవి యేవనగా స్వీకృత ప్రసాది స్థలము, శిష్టోదన స్థలము, చరాచరలయ స్థలము, భాండస్థలము, భాజన స్థలము, అంగాలేపన స్థలము, స్వపరాజ్ఞా స్థలము, భావాభావ వినాశస్థలము మరియు జ్ఞాన శూన్య స్థలము.

మొదటి స్థలమైన స్వీకృత ప్రసాది స్థలము గురించి శ్రీ భగవత్పాదులవారి ప్రారంభోపదేశము క్రింది విధముగా నున్నది.

**ముఖ్యార్థో లక్షణార్థశ్చ యత్ర నాస్తి చిదాత్మని ।**
**విశృంఖలతయా తస్య ప్రసాదః స్వీకృతో భవేత్ ॥**
(సి.శి. 20 : 6)

దీని తాత్పర్యమేమనగా ముఖ్యార్థ లక్ష్యార్థముల నాశ్రయించచడమే పరిపూర్ణమైన జ్ఞాన రూపమైన ప్రసాదమును సంపాదించి పెట్టెడి స్థలమే స్వీకృత ప్రసాది స్థలము. దీని భావమేమనగా నీ స్థలములోని శివయోగి ముఖ్యార్థ లక్ష్యార్థముల నాశ్రయించకుండా నేరుగా జ్ఞాన ప్రసాదమును స్వీకరించుట చేత నతడు సీకృత ప్రసాదియని పిలువబడుచున్నాడు.

ఈ లోకమునందున ప్రసాదము రెండు విధములుగా నుండును. అవి : అన్నరూప ప్రసాదము మరియు జ్ఞానరూప ప్రసాదము. అన్న ప్రసాదము వలన కాయము నిర్మలమైనదిగా నయినచో జ్ఞాన ప్రసాదముచేత బుద్ధి నిర్మలమైనదగును.

జ్ఞానమును పొందవలెననినచో బహువిధ ప్రమాణముల నాశ్రయించవలెనని తత్త్వశాస్త్రము తెలుపుచున్నది. షడ్విధ ప్రమాణములలో శబ్ద ప్రమాణమున కధికమైన సామర్థ్యము గలదని తాత్వికులచేతను, దార్శనికులచేతను చెప్పబడినది. అనాత్మ విషయముల గురించి యెట్టులుండిననూ

ఆత్మజ్ఞాన సముపార్జన కొరకు శబ్ద ప్రమాణమే యుత్తమమైనదని తెలిసికొనవలెను. ఈ శ్రుతివాక్కుల గనుడి. "యతో వాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహ" శబ్ద ప్రమాణముతో సహా యే ప్రమాణమైననూ ఆత్మ తత్త్వమును దర్శింపజేయజాలదనెడిదే శ్రుతి యొక్క భావము అయితే మిగిలినవాటికంటెను శబ్ద ప్రమాణము సమర్థవంతమైనదని చెప్పబడుచున్నది. బహుదూరముననుండెడి వ్యక్తి యొక్క యోగ క్షేమములను తెలిసికొనుటకై శబ్ద ప్రమాణమెంతమేరకుపకరించుచున్నదదో మనమెరిగిన విషయమే.

ఇచ్చట తెలిసికొనవలసిన విషయమేమనగా దృష్టికి యగోచరమైయుండెడి యంశమునైనను శబ్దమాధ్యమమున తెలిసికొనగలము. నేడు విరివిగా లభ్యమయ్యెడి శ్రవణ యంత్రాంగము యొక్క సామర్థ్యము లోకమెరిగినట్టి విషయమే.

సంసారమునందున దుఃఖము ననుభవించెడి జీవునికి యీ దుఃఖమునుండి ముక్తిని పొందాలనెడి కోరికయుండును. దినదినముపరిశ్రమించెడి వానికి విశ్రాంతి కావలెను. అలసిపోయిన వ్యక్తికి పని చేయాలనెడి ఆసక్తి యుండదు కదా! లౌకిక వ్యక్తికే విధముగా విశ్రాంతి కావలెనో అదేవిధిన యెన్నో జన్మల నెత్తుచు వచ్చుచుండెడి జీవాత్మకును విశ్రాంతి కావలెను. అట్టి విశ్రాంతిని ముక్తియని యందురు. ముక్తి కోరేవాడు శివాద్వైత జ్ఞానమును పొందవలెను. ఇట్టి జ్ఞానమును పొందవలెనన్న శబ్ద ప్రమాణము నాశ్రయించవలసి యుండునని యెరుంగవలెను.

సంసారమునందున నిరాసక్తుడైనవాడును, వివేకాది గుణగణములు గల్గియున్న వాడునునయిన శిష్యునికీ గురువు తనకటాక్షమును ప్రదానము చేసి, తత్త్వమసి అనెడి మహావాక్యమును బోధించును. ఈ విధముగా శబ్ద ప్రమాణము వలన శివాద్వైత జ్ఞానము బోధింపబడును.

ఈ మహావాక్యపు ముఖ్యార్థము గురించియును, లక్ష్యార్థము గురించియును క్రిందటి యాశీర్వచనమున తెలుపనైనది.

జ్ఞానప్రకాశ స్థలములోని శివయోగి లక్ష్యార్థమును గురూపదేశము వలన గ్రహించి శివాద్వైత జ్ఞాని యగుచున్నాడు. ఇతడీ స్థలమున లింగాంగ సామరస్యానుభూతిలో నుండెడివాడై ముఖ్య లక్ష్యార్థములను కూడ త్యజించి ఆత్మానుభవము ద్వార జ్ఞానమును ప్రసాదముగా పొందుచున్నాడు. ఈ కారణముననే యితడు స్వీకృత ప్రసాదియగుచున్నాడు.

స్వీకృత ప్రసాది స్థలములోని శివయోగి స్వస్వరూపముతో ననుసంధానమును చేసికొని యందున స్థిరముగా నుండునని తెలుపుచు నీ క్రింది యుపదేశము నిచ్చిరి :

**మాతృమేయ ప్రమాణాదివ్యవహారే విహారిణీమ్ ।**
**సంవిత్ సాక్షాత్కృతిం లబ్ధ్వా యోగీ స్వాత్మని తిష్ఠతి ॥** (సి.శి. 20-7)

దీని తాత్పర్యమేమనగా నింతకంటెను ముందున వివరింపబడిన స్వీకృత ప్రసాద స్థలములోని శివయోగి ప్రమాతృ, ప్రమాణ, ప్రమేయము లనెడి త్రిపుట వ్యవహారములకు మూలకారణముగా నుండెడి చిత్ శక్తి యొక్క సాక్షాత్కారమును బడసినవాడై స్వరూపాను సంధానముననే సుస్థిరుడై యుండును.

జ్ఞానము యొక్క ప్రాప్తియగు వరకు ప్రమాతృ, ప్రమాణ మరియు ప్రమేయములనెడి త్రిపుటియొక్క వ్యవహారము నడచుచునే యుండును. శివ-జీవైక్య జ్ఞానమును పొందునప్పుడు శివుడు ప్రమేయముగా నుండును. జీవుడు ప్రమాతృగా నుండును. శబ్దాదులు ప్రమాణముగా పనిచేయును. ప్రమాతృ ప్రమాణమును సాధనముగా గొని ప్రమేయమగు శివుని తన యాత్మ యొక్క స్వరూపముగా నెరిగినప్పుడు ప్రమాతృవు మరియు ప్రమేయముల మధ్య నభేదమేర్పడును. అప్పుడు త్రిపుట భేదములుండవు. ఈ విధముగా సుస్థిరుడైన శివయోగి యొక్క మనస్సునందున త్రిపుటములకు సంబంధించినట్టి యాలోచనలు కాని షడ్ ప్రమాణములకు చెందిన చింతగాని యుండదు.

త్రిపుటాదుల గురించి చింతించెడి వ్యవహారములకంటెను మేలైన స్థితిలో నుండుటచేత శివయోగి తనలో తానే సుస్థిరుడై యుండునని తెలుపుటయే పూజ్యపాదుల వారి యాశయమై యున్నదని గ్రహించగలరు.

స్వీకృత ప్రసాది స్థలములోని శివయోగి యొక్క నిర్బాధకత్వమును గురించి శ్రీ భగవత్పాదులవారు క్రింది యుపదేశము నిచ్చిరి :

**అద్వైతబోధనిర్ధూత భేదావేశస్య యోగినః ।**
**సాక్షాత్ కృతమహాసంవిత్ ప్రకాశస్య క్వ బంధనమ్ ॥** (సి.శి. 20-8)

దీని భావమేమనగా శివాద్వైత బోధచేత భేదమును సంపూర్ణముగా తొలగించికొనిన వాడును, సంవిత్ ప్రకాశమును సాక్షాత్కరించికొనినవాడును అయిన శివయోగికి నేవిధమైన బంధముండజాలదు.

శ్రీ జగద్గురువు రేణుకాచార్యులవారు శివాద్వైత బోధ వలన భేదావేశము లేకుండనగునని యుపదేశించిరి. ఇచ్చట ప్రపంచము నందున దోచెడి భేదమును భేదావేశమని పిలుచుట యొక విశేషమైయున్నది. ఆవేశమనగా బలపూర్వకముగా ప్రవేశించినట్టిదని గుర్తింపబడినది. ఒక వ్యక్తి శరీరమునందున నొక భూతము బలాత్కారముగా ప్రవేశించినదనగా నయ్యది ఆ వ్యక్తి యొక్క మూల వ్యక్తిత్వమును మరుగుపరుచుచున్నదని యర్థము. భూతావిష్టుడు తన యిష్టానుసారముగా కాకుండగ, భూతము యొక్క యిష్టము ననుసరించి వ్యవహరించుటను ప్రారంభించును. ఇదే ప్రకాశముగా సంసారములోని ప్రతియొక్క వ్యక్తి యొక్క మనస్సునందున భేదభావము ప్రవేశించి యున్నది. అందుచేత, వ్యక్తి శివ స్వరూపమైన సృష్టిని శివరూపమున చూడక పంచవిధ భేదాత్మకముగా గాంచుచున్నాడు. శివ–జీవులలో భేదము, జీవ–జీవులలో భేదము, జీవ–జడముల మధ్య భేదము, జడ–జడముల యందున గల భేదములను పంచవిధ భేదములని యందురు. భూతవైద్యుని చికిత్సచేత భూతావిష్టుడు భూత బాధనుండి విముక్తిని పొందును. శివాద్వైత బోధవలన భేదభావ మడుగంటునని తెలిసికొనగలరు. లింగాంగ సామరస్య రూపమైన యభేద బోధవలన భేదము అనెడి భూతము సాధకునినుండి దూరమగుచున్నదని గ్రహించగలరు.

వివాహముకంటెను పూర్వమున పరస్పరము అపరిచితులును, భిన్నులును అయినట్టి వధూవరులు వివాహానంతరము పరస్పర మభిమానము గలవారగుచున్నారు. వారిరువురి మధ్యన తాదాత్మ్యభావన పెరిగి పెద్దదగును. ఆ యిద్దరి మధ్యన నే యొక్కరికైనా బాధ గల్గినచో వారిరువురు బాధకు గురియగుటను గాంచగలము. తాదాత్మ్య భావన వలననే యీ పరిణామము సంభవించుచున్నది. ఇట్టి భావనను తండ్రి కొడుకుల మధ్యనను, గురువు–శిష్యుల మధ్యనను గల్గెడి యవకాశము గలదు. తదాత్మ్య భావన చేత భిన్నులైన వ్యక్తులొక్కడై భేద భావమును వీడి ఏకరూపతతో వ్యవహరించుట సుసాధ్యమైనప్పుడు శివ–జీవులలోని భేదభావము సమసిపోయి యేకత్వ మేర్పడుట యెటుల సాధ్యము కాదు? గురూపదేశ ప్రభావమున భేదభావము వైదొలగి పరస్పర తాదాత్మ్య భావన యేర్పడి శివ–జీవ సామరస్యమునకు మార్గము సుగమమగుననుటలో సందేహమున కాస్కారములేదు. ద్వైతము వైదొలగి శివాద్వైత భావన సుస్థిరమై యుండెడి స్థితిలో శివయోగి కెట్టి బంధములైనను బంధింపజాలవని గ్రహించగలరు.

సంసారము నందలి బంధములకు భేదబుద్ధియే కారణమగుచున్నది. భేదబుద్ధి వలన గల్గిన బంధములు దుఃఖమునకు కారణభూతములగుచున్నవి. కొన్ని బంధములు సుఖదాయకమైనవిగా దోచినను, కాలాంతరమున నయ్యవి దుఃఖదాయకములగుచున్నవి. ఈ విషయమును వివరించెడి యుదాహరణ యొకటి గలదు.

చిలుకను పంజరము నందున నుంచినప్పుడు చిలుకకు తాత్కాలికముగా నానందము గల్గెడి యవకాశము గలదు. దాని కిష్టమైనట్టి పళ్ళను తెచ్చి దానిముందు పెట్టుట, త్రాగుటకై నీటిని యేర్పాటు చేయుట వంటివి దానికి సుఖదాయకములు కావచ్చును. ఆహార పానీయాదులకై తిరిగెడి యవశ్యకత యుండని కారణమున దానికి సంతసము కలుగవచ్చును. కాని కాలాంతరమున తాను స్వేచ్ఛగా నెగిరి యాకాశములో విహరించజాలనని తెలిసికొనినప్పుడు దానికి దుఃఖము గల్గును. ఉదాసీన వైఖరి నవలంభించును. ఇష్టమైన పళ్ళైనను రుచించకపోవచ్చును. సంసారములో భార్య–భర్త, తండ్రి–కొడుకు వంటి బంధములకు గురి అయ్యెడి వారు నీ స్థితినే యనుభవింతురు. గురువు తన యుపదేశముల చేత బంధములను ధృంచివేయును. తద్వారా వ్యక్తి భేదభావమును త్యజించును. శివ–జీవ సామరస్యము వలన లభించెడి దివ్యానుభూతిననుభవించును.

ఒక వ్యక్తి నిద్రావస్థలో నుండిన యప్పుడు వస్తువుల గురించి గాని వ్యక్తులు గురించి చింతించకుండగ నుండును. అందుచేత, నానందస్థితి యందున నుండును. మెలకువకు రాగానే చింతన ప్రారంభమగును. బంధము లేర్పడి దుఃఖము గల్గుచున్నది. చింతన వల్ల బంధములు గల్గుచున్నవని గ్రహించవలెను. చింతనను శివోన్ముఖముగా మరల్చికొని శివునితో తాదాత్మ్యమును పొందుటకై కృషి చేయుట వలన బంధములు వైదొలగే యవకాశమేర్పడును. భేదబుద్ధిని వీడి శివునితో నాత్మాను సంధానము జేసికొనెడి శివయోగికి బంధము లెట్టులుండగలవు? శివయోగికి బంధనము లుండవనెడిదే గ్రహించవలసిన యంశము.

శివాద్వైత జ్ఞానము లభించిన పిదప భేద జ్ఞాన మెట్టుల నివృత్తి యగుననెడి దానిని శ్రీ భగవత్పాదులవారు క్రింది విధముగా తెలిపిరి :

**చిదాత్మని శివే న్యస్తం జగదేతచ్చరాచరమ్ ।**
**జ్ఞాయతే తన్మయం సర్వమగ్నౌ కాష్ఠాదికం యథా ॥** (సి.శి. 20–9)

ఉపదేశము యొక్క తాత్పర్యమేమనగా నగ్నిలో వేసి కట్టె యగ్నితో తాదాత్మ్యము చెంది అగ్నివలె గోచరించునటులే చిదగ్ని రూపమైన శివునియందున దోచెడి చరాచర జగత్తు శివయోగికి చిద్రూపముగానే కనిపించును.

శివాద్వైత జ్ఞానము ప్రాప్తమైన పిదప భేద జ్ఞానము నష్ట మయ్యెడి రీతిని శ్రీ భగవత్పాదులవారు కాష్ఠానిల దృష్టాంతము ముఖాంతరముగా దెలియజేసిరి. అగ్నిలో వేయబడిన వివిధ రకములకు చెందిన కట్టెలు తమ జాతి భేదములను వీడి యగ్ని స్వరూపము దాల్చును. అగ్నియే విధముగా కట్టెల మధ్యన నుండెడి భేదభావమును నష్టపరచి వాటికి తన రూపము నిచ్చునో అదేవిధిన శివ-జీవుల భేదమును నష్టము చేసెడి పాత్రను చిదగ్ని పోషించును. జఠరాగ్ని, దివాగ్ని, చితాగ్ని, చింతాగ్ని మొదలగు అగ్నులే విధముగా ఆయా వస్తువులనో లేదా వ్యక్తులనో దహించి వేయునటుల, చిదగ్ని చరాచర జగత్తునందున కన్పట్టెడి భేదభావమును దహించి వేయుచున్నది. అగ్నియే విధముగా వస్తువును మార్చివేసి దానికి తన రూపమునిచ్చునో అదే విధముగా చిదగ్ని సాధకుని చిద్రూపునిగా మార్చుచున్నది. చిద్రూపిగా మారినవాని జగత్తంతయును శివమయముగా కన్పట్టును. "యత్ర యత్ర మనో యాతి తత్ర తత్ర బ్రహ్మ దర్శన" మనెడి జ్ఞానుల నుడి నిజమగును. "యథా దృష్టి తథా సృష్టి" యనెడి ఉక్తియు నిజమగును.

శాస్త్రకారులు సృష్టి-దృష్టివాదము, దృష్టి-సృష్టి వాదమనెడి రెండు శాస్త్రీయ పద్ధతులను నిరూపించిరి. సృష్టి యెట్లున్నదో అటులే దానిని చూచుటయే సృష్టి-దృష్టివాదము యొక్క మూలాంశము. ఇది వ్యావహారికము మరియు నైసర్గికము నయియున్నది. వస్తువులను వస్తువుల యొక్క రూపమున తెలిసికొనుటకై విశేష సాధనముల యొక్క అవశ్యకతలేదు. చూసెడి కన్ను సరిగానుండి మనస్సు దానితో సంబంధము కల్గియుండిన చాలును. వస్తువెట్టులున్నదో అట్లు తెలిసికొనవచ్చును. అయితే దృష్టి-సృష్టివాదమునందున నైసర్గికమైన దృష్టిని శివభావనతో శివమయముగా చేసికొనుటకు నెంతో మేరకుసాధన చేయవలసియుండును. అప్పుడే యీ చరాచరాత్మకమైన సృష్టిని శివమయముగా చూచుటకు సాధ్యమగును. మన యింద్రియములలో నేత్రము మరియు మనస్సులెంతో ముఖ్యమైనవి. ఒక్కమారివి శివమయమైన యెడల విశ్వమును శివమయముగా చూచుట సులభతరమగును. రంగుటద్దములను ధరించినవాడు విశ్వమును తాను ధరించినట్టి యద్దము యొక్క రంగులో చూసినయటుల, శివదృష్టిని బడసినట్టి శివయోగి సృష్టిని శివమయముగా గాంచును. ఇదియే దృష్టి-సృష్టివాదము. ఈ వాదమును స్పష్టముగా తెలుపుటకై శ్రీ భగవత్పాదులవారు క్రింది యుపదేశము నిచ్చిరి :

**న భాతి పృథ్వీ న జలం న తేజోనైవ మారుతః ।**
**నకాశో న పరం తత్త్వం శివేదృష్టే చిదాత్మని ॥** (సి.శి. 20-10)

దీని తాత్పర్యమేమనగా చిద్రూపమైన పరశివ బ్రహ్మ తత్త్వమును సాక్షాత్కరించికొనిన శివయోగికి పృథ్వి, జల, తేజ, వాయువు, మరియు ఆకాశతత్త్వములు వేరుగా దోచవు. సర్వము శివమయముగానే కనిపించును.

విశ్వమును పరివర్తనకు గురిచేయుట సుసాధ్యమైన విషయము కాదు. అయితే దానిని శివమయముగా చూచుటవలన విశ్వములో మార్పును గాంచగలము. కొందరు శివుని యష్ట తనువులు గలవానిగా గాంచుచున్నారు. అష్టతను తత్త్వములోన శివదృష్టిత్త్వ మిమిడియున్నదని గ్రహించగలరు.

స్వీకృత ప్రసాది స్థలములోని శివయోగి తన యంతరంగములోని జ్యోతిర్లింగము నందున తల్లీనుడై యుండుటచేత నతనిని ప్రపంచములోని యెట్టి యంశమైనను లిప్తముకాదు. ఈ విషయమును తెలిపెడి శ్రీ భగవత్పాదులవారి క్రింది యుపదేశమును గనుడి :

**జ్యోతిర్లింజ్గే చిదాకారే జ్వలత్యన్తర్నిరన్తరమ్ ।**
**విలీనం నిఖిలం తత్త్వం పశ్యన్ యోగీ న లిప్యత్ ॥**
(సి.శి. 20-11)

దీని తాత్పర్యమేమనగా తన హృదయపు అష్టదళ కమలము యొక్క మధ్యలో ప్రకాశించెడి చిద్రూపమైనట్టి లింగతత్త్వము నందున శివునినుండి భూమివరకు గల ముప్పదియారు తత్త్వములు లయమొందెడి దానిని చూచుచు నుండెడి శివయోగికి ప్రపంచములోని యే యంశమైననూ అంటదు. ప్రపంచములోని భోగములన్నింటి మధ్యలో నుండియున్ననూ అవి యతని నంటవనెడిది గ్రహించవలసిన యంశము.

తన హృదయమునందున నిరంతరము ప్రజ్వలించుచున్నట్టి చిద్రూపమైన జ్యోతిర్లింగము నందున తల్లీనమైయున్నట్టి చిత్తవృత్తిగల శివయోగి యెచ్చట యున్నను నలిప్తుడై యుండును. ఏదోవొక వస్తువుతో లిప్తమగుటకు మన చిత్తవృత్తియే కారణమగుచున్నది. అలిప్తత యందున శరీరము యొక్క పాత్ర గౌణముగా నుండి, చిత్తము యొక్క పాత్ర ప్రధానముగా నుండును. మనమే వస్తువును స్పృశించుచున్నామనెడిది ముఖ్యమైనట్టి

విషయము కాదు. మనమే భావముతో స్పర్శించుచున్నామనెడిది ప్రధానమైన విషయము. మన శరీరము లేదా యింద్రియము లుండెడి చోటున మనస్సు ఉండుననుటకు వీలులేదు. కొన్ని పనులు మనస్సు ప్రమేయము లేకుండగ జరుగవచ్చును. కాని ఆధ్యాత్మిక విషయమున మనస్సుకెంతో ప్రాముఖ్యత గలదు. "మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" అనెడిది శాస్త్రకారుల నుడి. సంసార బంధములలో నిరికించెడిది మనస్సే. సంసార బంధములను తెగగొట్టెడిది మనస్సే. అందుచేత మనస్సు కీలకమైన పాత్రను పోషించునని గ్రహించగలరు.

శివయోగి యొక్క మనస్సు అతని యంతరంగములోని జ్యోతిర్లింగము యొక్క చింతన యందున నే వస్తువైనను లేదా విషయమైన స్పృశించినచో అది అచ్చట లిప్తమై యుండజాలదు.

లిప్తాలిప్తముల గురించి చెప్పవలెనినచో నేతి మిఠాయిలను తినినవాని నుదహరించి చెప్పవచ్చును. అట్టివాని చేతులకు నేతి జిగట లిప్తమైయుండును. నాలుక కెట్టి జిగటయు నుండదు. నాలుక నలిప్తమైన దానిగను, చేతిని లిప్తమైన దానిగా గ్రహించవలెను.

శివయోగి విషయములన్నింటిని చిదగ్ని యందున వేలుచునని తెలియుచున్నది. క్రింది యుపదేశమును గనుడి :

**అంతర్ముఖేన మనసా సాత్మజ్యోతిషి చిన్మయే ।**
**సర్వాన్పదార్థవిషయాన్ జుహ్వాన ద్యోగీ ప్రమోదతే ॥** (సి.శి. 20-12)

దీని తాత్పర్యమేమనగా చిద్రూపమైనట్టి స్వస్వరూపాగ్ని యందున నంతర్ముఖియైన మనస్సుతో సర్వ విషయములను వేల్చెడి శివయోగి యానందము ననుభవించుచుండును.

సామాన్యుడు విషయ సుఖము వలన ఆనందము బొందుటకై ప్రయత్నించును. ఇంద్రియములను తృప్తి పరచుట యనెడి దుస్సాధ్యమైన విషయము. తత్ఫలితముగా దుఃఖమునే చవిచూచును. శ్రీ రేణుకాచార్య భగవత్పాదులవారు సూచించిన ప్రకారముగా విషయములను చిదగ్నియందున వేల్చుటచేత వచ్చెడి యానందము శాశ్వతమైనదని గుర్తించగలరు. సంసారబంధము లంటని స్థితియ సుసాధ్యమగును. శివయోగి ఆనందము ననుభవించుననియును అదియే అతనికి ప్రసాదమనియు గ్రహించగలరు. ఈ ఆనందమునకు మించిన ఆనందము మరొక్కటుండదని గ్రహించగలరు.

స్వీకృత ప్రసాది స్థలము గురించి తమ యుపదేశమునకు ముగింపుగా శ్రీ భగవత్పాదులవారు క్రింది యుపదేశము నిచ్చిరి :

**సచ్చిదానన్దజలధౌ శివేస్వాత్మని నిర్మలః ।**
**సమర్ప్య సకలాన్ భుంక్తే విషయాన్ తత్ప్రసాదతః ॥** (సి.శి. 20-13)

దీని తాత్పర్యమేమనగా నిర్మలుడైన శివయోగి సచ్చిదానంద సముద్ర రూపుడైన శివునికి తన సర్వస్వము నర్పించి ప్రమోదము నొందును. శివకరుణ రూపముననుండెడి ప్రసాదము యొక్క అనుభోగము చేయుచు ఆనందమును బడయునని గ్రహించగలరు.

విషయోపభోగము వలన మాలిన్యము సంక్రమించుట సర్వ సాధారణమైన విషయము. విషయ లంపటుడు మలిన సహితుడై సంసారమనెడి దానిలో చిక్కికొని దుఃఖముననుభవించుచుండును. శివయోగి యొక్క పరిస్థితి సామాన్యుని స్థితికంటెను పూర్తిగా భిన్నముగా నుండును.

శివయోగి విషయములను శివుని కర్పించును. ఆనంద జలధి వంటి శివుని కర్పించినవి యానంద మయమైన ప్రసాదము రూపములో శివయోగికి లభ్యమగుచున్నవి. సర్ప విషము నుదాహరణగా గొనిని యెడల శివుని కర్పింపబడిన విషము తన స్వభావసిద్ధమైన దోషములనుండి విడివడి ఆనందదాయకమగునని తెలుపు దృష్టాంతములు గలవు. ఇట్టి నిర్మలమైన ప్రసాదమును పొందినవాడును నిత్య నిర్మలుడగును. స్వీకృత ప్రసాది యిట్టివాడే.

అంతులేని సాగరము వంటి ఆనందమునకు నెలవైన శివునితో ననుసంధానమును జేసికొని యనంతమైన ఆనందము ననుభవించెడి శివయోగి జీవన్ముక్తుడనబడును. ప్రసాదవలన నిర్మలత్వము బడసిన స్వీకృత ప్రసాదివలె మీరును శివప్రసాద లబ్ధిని పొంది యంతులేని యానందము ననుభవించుటకొరకు ప్రయత్నింతురుగాక!

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు శ్రీ చంద్రశేఖర శివాచార్యులవారు శివునిలో సమరస భావముతో స్థిరముగా నుండెడి శివయోగి పొందెడి దివ్యమైన యనుభవము గురించి తెలియజెప్పిరి.

జ్ఞాన ప్రకాశస్థలమున నానందభక్తిని నెరపి శివానందమును ననుభవించి సాధనను సుసంపన్నము చేసికొనిన శివయోగి సమరసభక్తిని సలుపుట కొరకు స్వీకృత ప్రసాది యగుటకై యీ స్థలమును చేరును.

శివయోగి తాను గడించిన యనుభవమును సాధనముగా గొని, జీవత్వ భ్రాంతిని తొలగించికొనుటకై ప్రయత్నించును. శివత్వమును పెంపొందించికొనుటకు యత్నించును. ఈ ఉభయ లక్ష్యములను సాధించుటకై చేసెడి సాధన నిమిత్తము సమరస భక్తిని మాధ్యమముగా గొనును. ఆనందభక్తిలో నుండిన సందర్భమున నుండెడి సతి-పతి భావన సమసిపోవును. నదీ సముద్ర న్యాయమున శివునిలో చేరిపోవుటకు సాధన చేయును.

ఈ సాధనా క్రమములోని మౌళికమైనట్టి యంశములను సూచించెడి శ్రీ బసవేశ్వరులవారి వచనము గనుడి :

**గురు శిష్య సంబంధవాదు దక్కె ఇదు చిహ్న**
**హింద బిట్టు ముంద హిడియలెబేకు**
**కూడల సంగమ దేవా కేళయ్యా!**
**కిచ్చినొళగె కోల బచ్చిట్టంతిరబేకు** (బసవేశ్వరులవారి వచనము సం. 928)

దీని తెలుగు రూపమును గనుడి :

**గురు-శిష్య సంబంధమైన దానికిది చిహ్నము**
**వెనుకటిది విడిచి ముందటిది పట్టికొనవలెను**
**కూడల సంగమ దేవా, వినుమయ్యా!**
**చిచ్చులో పెట్టబడిన కోలవలె యుండవలెను.**

ఈ వచనములోని "వెనుకటి" యనెడి దానిని జీవత్వముగాను, "ముందటి" యనెడి దానిని శివత్త్వముగాను గ్రహింతురు గావుత. అదే విధముగా గురు-శిష్య సంబంధమనగా శివ-జీవ సంబంధముగా స్వీకరించవలెను. నిప్పులో పెట్టబడినట్టి కట్టె నిప్పై తన అస్తిత్వమును కోల్పోవును. అగ్నియై విప్పి తేజమును పొందును. ఇదేవిధముగా జీవుడు ద్వైత భావమును వీడి "సమ-రతి", "సమ-కళ" గల వాడగును. ఇదియే జీవన్ముక్తియని తెలిసికొనగలరు.

ఇట్టి స్థితిలో నుండెడి సాధకునికి పంచ భూతాత్మకమైన జగత్తు గోచరించునే? షట్ త్రింషత్ తత్త్వములన్నియును తమ తమ అస్తిత్వములను కోల్పోయిన దశలో సాధకునికి నియ్యవి గోచరించవు. తత్ఫలితముగా జగత్తు శివునిలో లీనమైపోవును. ఈ విషయము గురించిన యవగాహనను కల్గజేసెడి క్రింది వచనము గనుడి :

**దశ దిక్కు ధరా గగనవెంబుద నానరియెనయ్యా!**
**"లింగమధ్యే జగత్ సర్వం" ఎంబుద**
**నా నరియెనయ్యా!**
**లింగ సోంకిన సుఖ దొళగె**
**కూడల సంగమ దేవయ్యా!**
**అంబుధి యొళగె ఆలికల్లినంతె**
**భిన్న భావవ నరియదే**

**శివ శివా ఎనుతిద్దెను నాను**

(శ్రీ బసవేశ్వరుల వారి వచనము సం. 941)

దీని తెలుగు రూపమును గనుడి :

*దశదిక్కుల ధరాగగనంబులనెడి వాటిని నేనరయ నయ్యా!*
*"లింగమధ్యే జగత్సర్వ"మ్మనెడిది నేనరయనయ్యా!*
*లింగము సోకిన సుఖము లోపల*
*కూడల సంగమ దేవయ్యా!*
*అంబుధిలో బడిన వడగల్లువలె*
*భిన్నభావము నరయక*
*శివశివా అనుచున్నాను నేను*

సముద్ర గర్భములో బడియున్న వడగల్లుకును నెటుచూసినా నీళ్ళే కన్పట్టును. అదే విధముగా స్వీకృత ప్రసాదికి సర్వత్ర శివదర్శనమే యగుచుండును. అన్యమును గాంచదు.

జీవన్ముక్తిని సాధించిన సాధకుడు నీ స్థలమున తానే ప్రసాదమై శివునిచేత స్వీకరింపబడిన వాడగుచున్నాడు. ఈ కారణముననే యితడు స్వీకృత ప్రసాదియనబడునని భావించవచ్చును. క్రింది వచనమీ భావమును విశదీకరించుచున్నది. గమనించుడి :

**బెళగి నొళగణ బెళగు మహాబెళగెంబ**
**ప్రసాదదల్లి ఒదగిద ప్రసాదియ పరిణామద**
**పరమానందవనే నెందుపమిసువెనయ్యా**
**పరమాశ్రవెతానాగి, కూడల సంగమ దేవయ్యా**
**చెన్న బసవణ్ణనెంబ మహాప్రసాది**
**ఎన్నవాఙ్మనక్కగోచరనాగి**
**నానేనెంబెనయ్యా!**

దీని తెలుగు రూపమిది :

*వెలుగు లోపటి వెలుగు మహా వెలుగనెడి*
*ప్రసాదమునందున నొదిగిన ప్రసాదియొక్క*
*పరిణామపు పరమానందమును*
*నేనెట్లు నుపమింతునయ్యా?*
*పరమాశ్రయమే తానై*
*కూడల సంగమ దేవయ్యా*
*చెన్న బసవణ్ణ యనెడి మహాప్రసాది*
*నా వాఙ్మయములకగోచరుడైయుండే*
*నేనేమని యందునయ్యా?*

స్వీకృత ప్రసాది విషయ సుఖములన్నిటినీ శివునికి సమర్పించుననియు, శివుడు వాటినారగించి భుక్తావశేషంబు నొసంగగా, అద్దానిని ప్రసాది ప్రసాదముగా స్వీకరించునని తెలిసికొనగలరు.

"శుభం భూయాత్"

## ఆశీర్వచనము - 1 :

## శిష్టోదన స్థలము :

లింగస్థలములలోనిదైనట్టి ఐక్యస్థలమునకు చెందిన తదుపరి స్థలమే శిష్టోదన స్థలము. స్వీకృత ప్రసాద స్థలమందలి శివయోగి తన విషయములను శివునిలో లయమొనర్చి జ్ఞానమును ప్రసాదముగా పొంది ప్రమోదమును పొందెడి స్థితిలో మాయ యనెడిదే స్థితిలో నుండుననెడి దానిని వివరించెడి స్థలమే యీ స్థలము. సామాన్యమైన పరిభాషలో 'ఓదన'మనగా అన్నము శిష్టమనగా మిగిల్చబడినది. ఇచ్చట యీ అర్థము పొసగదు.

తాత్వికముగా చూచిన యెడల యన్నమనగా ననుభవించదగినదని గుర్తించవలెను. యనుభవించినది పోగా మిగిలినదనెడి యర్థము వచ్చును. దీనికి పరిపక్వమై మిగిలియున్న ప్రారబ్దకర్మ యనెడి యర్థమును గ్రహించెడి యవకాశము గలదు. దీని భావవేమనగా స్వీకృత ప్రసాది జ్ఞానప్రాప్తిని పొందిన పిదప కాయమును వీడువరకు నుండెడి యనుభవించదగిన ప్రారబ్ద కర్మావశేషము ఈ సమయమున మాయకు నతనితో నుండెడి సంబంధము గురించి శ్రీ భగవత్పాదులవారు వివరించిరి. మొదట పారిభాషిక పరమైన యంశము తెలుపబడినట్లు దోచుచున్నది. గమనించుడి:

**ప్రకాశతే యా సర్వేషాం మాయా సెవోదనాకృతిః ।**
**లీయతే తత్ర చిల్లింగే శిష్టం తత్పరికీర్తితమ్ ॥** (సి.శి. 20-14)

దీని భావమేమనగా శుద్ధాధ్వ, మిశ్రాధ్వ, అశుద్ధాధ్వముల యందున నివసించెడి ఆణవ మలయుక్తమైన విజ్ఞానకళ, ఆణవకార్మ మలద్వయ యుక్తమైన ప్రలయ కళ, ఆణవ కార్మ మాయా మలత్రయముతో కూడిన సకల జీవులకు యోగ్యమైన తను-కరణ-భువన భోగాదుల రూపమున నిచ్చుచున్నవి. జీవులు పొందెడిది మాయరూపముననే దోచును. ఇది స్వీకృత ప్రసాదస్థలి యొక్క ప్రారబ్ద కర్మ క్షయమొందువరకు నతని వెన్నంటి యుండి చివరకు చిల్లింగమున లయమగును. జ్ఞానోత్తర దశలోను, అవశిష్ట ప్రారబ్దకర్మ యనుభవ కాలమున నుండుటచేత మాయ శిష్టోదనమనెడి పేరున పిలువబడుచున్నదని గ్రహించగలరు.

మాయ చరాచర జగత్తులోని ప్రతి యంశము నావరించి యున్నది. శివుని నయ్యది ఆవరించి యుండుటచేత శివుడగోచరుడగుచున్నాడు. సాధకుడెంతో మేరకు శ్రమించిన పిదప శివుని గురించి యెరుగుచున్నాడు. అజ్ఞుల కతడు నగోచరుడుగానే యున్నాడు.

ఈ విషయమను మరితొంటదార్యులవారు తమ సిద్ధాంత శిఖామణి తత్త్వ ప్రదీపికలో నెంతయో సమగ్రముగా వివరించిరి. మాయ యనెడిది కాయకరణ భువన భోగముల రూపమున నుండును. కాయమనగా శరీరము కరణమనగా నింద్రియములు. భువన మనగా లోకములు. భోగమనగా శబ్ద స్పర్శాది పంచతన్మాత్రలు.

ఎనుబది నాలుగు లక్షల యోనులు గలవని శాస్త్రజ్ఞులు తెలుపుదురు. వీటిలో కొన్ని స్థలములు కాగా మరికొన్ని సూక్ష్మాతి సూక్ష్మముగా నుండును. వీటన్నింటిలోను మాయ యుండును. ఇంద్రియముల గురించి చెప్పవలెనన్నిన జీవాత్మ దశేంద్రియముల సహకారముచేత సకల వ్యవహారముల సలుపుచున్నది. దశేంద్రియములలో నైదు జ్ఞానేంద్రియములు కాగా మిగిలినవి కర్మేంద్రియములు. వీటి ద్వారా మాయ జీవిని విషయోన్ముఖులను చేయుచున్నది. జీవులు చతుర్దశ భువనములలో నేదో ఒక లోకమున నివసించి భోగముల ననుభవించుచున్నవి. చతుర్దశ భువనములలోన యేడు ఊర్ధ్వలోకములు కాగా, మిగిలిన యేడు నధోలోకములు. వీటియందు పంచభూతాత్మకమైన ప్రకృతి రూపమున నుండెడి మాయ జీవుల విషయోప భోగమున కాస్కారము కల్పించుచున్నది. శబ్ద, స్పర్శాదులే పంచవిధ భోగములు. జీవి వీటిననుభవించుచు సంసారియగుచున్నాడు. సామాన్యజీవికి ప్రపంచరూపమున నభివ్యక్తమయ్యెడి మాయ స్వీకృత ప్రసాద స్థలమునధిగమించి వచ్చిన సాధకునికి శిష్టోదన రూపమున గోచరించునని గ్రహించగలరు.

అయితే చరాచర జగత్తును తన వశమున నుంచికొని ఆడించెడి మాయ జీవులకు దుఃఖమును గల్గించుననెడిది అందరెరిగిన విషయమే. శిష్టోదన స్థలమునందున మాయ యే విధముగా నుండుననెడి దానిని శ్రీ భగవత్పాదుల వారు క్రింది విధముగా వివరించిరి :

**జగదంగౌ పరిగ్రస్తే మాయాపాశవిజృంభితే ।**
**స్వాత్మ జ్యోతిషి బోధేన తదేక మవశిష్యతే ॥** (సి.శి. 20-15)

దీని తాత్పర్యమేమనగా జగత్తంతయూ వ్యాపించియుండి తన పాశము చేత జగత్తును తన వశము చేసికొనిన మాయ స్వీకృత ప్రసాద స్థలమునుండి శిష్టోదన స్థలమునకు వచ్చిన సాధకునిని పాశబద్ధుని చేయజాలదు. కారణమేమనగా స్వస్వరూప జ్ఞాన విశిష్టుడైన జ్ఞాని సన్నిధిన మాయ కేలాది భూమ్యంతము వరకు గల తత్త్వములు లుప్తము కాగా తానొక్కటి మాత్రమే మిగిలియుండును. సాధకుడీ తత్త్వముల ప్రభావమునకు లోనుగాని దశలో నుండుననెడిదే గ్రహించవలసిన విషయము. ఈ స్థితిలో మాయ శివయోగికి సేవకురాలిగా నుండునని తెలుపబడినది. క్రింది యుపదేశమును గమనించుడి :

**అఖణ్డ సచ్చిదానన్ద పరబ్రహ్మస్వరూపిణః ।**
**జీవన్ముక్తస్య ధీరస్య మాయా కైఙ్కర్యవాదినీ ॥** (సి.శి. 20-16)

దీని తాత్పర్యమేమనగా నఖండమైన సచ్చిదానంద స్వరూపమైన పరశివ బ్రహ్మమే తన యాత్మ రూపమని తెలిసికొని యున్న జీవన్ముక్తుడును, ధీరుడును అయిన శివయోగి సన్నిధిన మాయ కింకరిగా పడియుండును.

ధీరుడైన శివయోగికి మాయ దాస్యము చేయుననెడిది పరిశీలనార్హమైన విషయము. ధీరుడనగా నెవ్వరనెడి మొదటగా తెలిసికొనవలెను. "వికారహేతౌ సతి విక్రియంతే యేషాం న చేతాంసి చ ఏవ ధీరాః" అనెడిది కవి కాళిదాసు చెప్పిన ఉక్తి. మనస్సును వికారమునకు గురిచేసెడి సన్నివేశములు తన కంటికి యెదురుగా నుండినను యెట్టి మనో వికారమునకు గురికాడో అతడే ధీరుడని కాళిదాసు వివరించిరి. ధీరులకే ధీరుడుగా నుండెడి శివయోగి యెదుట మాయ వివిధ రూపములో నుండియున్నను అతడు వికారమునకు గురికాడు. ధీరులకు లోకము దాసోహమ్మనుచు దాస్యము చేయుననెడిది లోకోక్తి. ఆశను జయించినవాడే ధీరుడు కదా. ఈ ఆశను వీడినచో లోకము వశీకృతమైనదని తెలిపెడి యీ క్రింది సుభాషితమును గనుడి :

**ఆశాయాః దాసాఃతే దాసాః సన్తి సర్వలోకస్య ।**
**ఆశా యేషాం దాసీ తేషాం దాసాయతే లోకః ॥**

ఆశ మనుష్యుని తన దాసునిగా చేసికొనును. ఆశకు లోనైనవాడు నితరులకు చేతిని చాచే యవశ్యకత గల్గును. ఆశను తన అధీనములోనికి తెచ్చికొనినవానికి జగత్తు దాస్యము చేయును. ఆశాబద్ధుడు నందరికి దాసునివలె యుండగా, ఆశాముక్తుడు సర్వత్ర స్వతంత్రుడై మెలగుచుండును. ఈ విషయమును తెలిపెడి కథ యొకటి గలదు.

ఒక రాజుగారి ఆస్థానమునందున బలదేవుడనెడి పేరు గల్గినవాడు మంత్రిగా నుండెను. అతడు రాజుకు విధేయుడైయుండి రాజ్య వ్యవహారములన్నింటిని చక్కగా చూసికొనుచుండెను. ప్రతిదినమురాజు వచ్చెడి సమయము కంటెను ముందుగానే రాజదర్బారుకు వచ్చెడివాడు. రాజు రాగానే లేచి నిల్చుండి తన విధేయతను ప్రకటించి కూర్చుండి తన పని తాను చేసికొనెడి దినచర్య నతడు పాలించెడివాడు. ప్రతిదినమొక సత్పురుషుని సాంగత్యమున కొంత సమయమున వ్యయపరచెడి యలవాటును పెంపొందించికొనెను. ఆత్మ-పరమాత్మల గురించి చింతన చేయుచుండెను. కొంతకాలము పిదప అతని కాత్మ జ్ఞానమబ్బెను. ఆత్మానుసంధాన క్రియలో నిమగ్నుడై యొక్కొక్కసారి యతడు తనను తానే మరచిపోవుచుండెను. ఒకనాడు రాజదర్బారులో నున్నప్పుడు అతడీ స్థితికి లోనైయుండెను. రాజుగారు విచ్చేసినప్పుడు లేచి నిల్చుండి నమస్కరించెడి శిష్టాచారమును పాటించెడిస్థితిలో లేకుండెను. రాజుగారి కాగ్రహము గల్గెను. కోపవశుడై బలదేవ మంత్రిని దర్బారునుండి వెలుపలికి నెట్టించెను. బలదేవుడు చింతించలేదు. ఇంటికి వచ్చి రాజలాంఛనాదులనన్నింటిని తీసివేసి కొపీన ధారియయ్యెను. తన సంపదను బీదవాళ్ళకు పంచి యిచ్చెను. తానేమియును మిగిల్చికొనలేదు. మెల్లిగా నడచుచు నదీతీరమునకు జని యచ్చట కాళ్ళు చాచికొని కూర్చుండెను. ఆత్మానుసంధానమును చేసికొని యానందము ననుభవించుచుండెను.

దర్బారునుండి వెడలగొట్టబడిన బలదేవుడేమి చేయుచున్నాడో చూసిరండని రాజు సైనికుల కాదేశము నిచ్చిరి. సైనికులు బలదేవుని కడకేగి, యతనిని గాంచి, రాజు కడకు తిరిగి వచ్చి విషయమును నివేదించిరి. రాజుగారికి బలదేవుని చూడవలెననెడి కోరిక గల్గెను.వెంటనే నదీతటమునకు వెడలెను. బలదేవుని సన్నిధికి చేరి కాళ్ళు చాచికొనెడి పద్ధతినెప్పుడు నేర్చితివని అడిగెను. చేతులు మడిచికొనుటెప్పుడు నేర్చితినో అప్పుడే కాళ్ళు చాచే పద్ధతిని నేర్చికొంటినని బలదేవుడు బదులు పలికెను. అతని వైరాగ్య భావమును గురించి గుర్తెరిగిన రాజు బలదేవునికి శరణాగతుడై బలదేవునినుండి తత్త్వోపదేశమును పొంది ధన్యుడయ్యెను.

ఆశా ఆమిషములకు లొంగని శివయోగికి మాయ లొంగి యుండుటలో నాశ్చర్యము గల్గునే? ఈ విషయము మరింతగా ప్రచురము చేయుటకు శ్రీభగవత్పాదులవారు క్రింది యుపదేశము నిచ్చిరి :

**విశ్వసమ్మోహినీ మాయా బహుశక్తినిరఙ్కుశా ।**
**శివైకత్వముపేతస్య న పురః స్థాతుమీహతే ॥** (సి.శి. 20-17)

దీని తాత్పర్యమేమనగా దీని యనంతమైన శక్తిచేత నిరంకుశురాలిగా నుండెడి మాయ, విశ్వమునెల్ల సమ్మోహమునకు గురి చేసెడి సామర్థ్యము గల్గినదైనను శివునితో సమానమైన సామరస్య స్థితిని బడసిన శివయోగిని మోహమునకు గురి చేయుట కిష్టపడదు. దీని యర్థమేమనగా మోహకురాలిగా నతని యెదురున నిలువ జాలదు.

“అఘటితఘటనా పటయసీ మాయా” అనుడి ఉక్తి ప్రకారము మాయ యపారమైన సామర్థ్యము గల్గినదైయుండును. ఈమె “కర్తు మకర్తు మన్యథా కర్తుం” సామర్థ్యము గల్గియుండునని చెప్పబడినది. దీని యర్థమేమనగా జేయుటకును, చేయకుండగ నుండుటకును, చేసినదానిని మరొక విధముగా చేయుటకును వలయు శక్తి మాయకుండునని గ్రహించగలరు. అందుచేత మాయ విశ్వమును మోహపరవశము చేయగల్గును. మాయ నిరంకుశురాలని చెప్పబడినది. ఆమెకు అడ్డు పడెడివారుండరని యర్థము.

సమ్మోహనవిద్యను నేర్చిన కొందరు తమ విద్యను ప్రయోగించి యెదుటివ్యక్తి చేత తమ కిష్టమైన పనులను చేయించుటను చూడగలము. సమ్మోహమునకు గురియైనవాడు స్వేచ్ఛను కోల్పోయి దాసుడగును. పరిమితమైన శక్తి సంపన్నుడు ప్రయోగించెడి శక్తి కింది సామర్థ్యముండిన యెడల మాయ యొక్క సమ్మోహన శక్తి కెంత సామర్థ్యముండునో అనెడి దాని నూహించజాలమని గుర్తించగలరు.

అపరిమిత సామర్థ్యము గల్గియుండెడి మాయ శివకృపకు పాత్రుడైన వాని నేమియును చేయజాలదని చెప్పబడినది. “యామేవ ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే” యనెడి గీతోక్తియు నిదే యంశమును తెలిపినది. ఈ యంశము నింకనూ వివరముగా తెలిపెడి కథ యొక్కటి గలదు.

ఒక వూరిలో నొక మహాభక్తురాలుండెను. ఆమె జ్ఞానైశ్వర్య సంపన్నురాలై యుండెను. ఆమె ధాన్యమును విసర్రాయిలో వేసి విసరుచుండగా నొక యోగి భిక్షకు వచ్చెను. ఆమె చేసెడి పనిని చూసిన యోగి విలవిల యేడువదొడంగెను. ఆమె చేసెడి పని నాపివేసి యతని కడకు వచ్చి యతని దుఃఖమునకు గల కారణమేమిటని యడిగెను. “ఓ శివభక్తి సంపన్నురాలా! ఏమని చెప్పను. రెండు రాళ్ళ రాపిడి గురియై గింజలు నుగ్గు నుగ్గై పిండిగా మారుచున్నయటులే మాయయొక్క రాపిడికి గురియై విశ్వములోని జీవులు బాధకు గురియగుచున్నారు కదా! అది జ్ఞప్తి వచ్చినందున దుఃఖించుచున్నా”ననెను. ఆమె యతనికి జ్ఞానోదయమును గల్గించనెంచెను. అతనిని లోపలికి తీసికొని వెడలి విసర్రాయిని లేపి చూపెను. రాళ్ళ కేంద్ర భాగమున కొన్ని గింజలటులనే యుండెను. అవి చెక్కు చెదరక యుండెను. వాటిని చూపి శివకృపకు గురియైన వారిని మాయ యేమియును చేయజాలదని తెలిపెను. అతనికి జ్ఞానోదయమయ్యెను. ఆమెకు నమ్రుడై నమస్కరించి నిష్క్రమించెను. శిష్టోదన స్థలముననుండెడి శివయోగిని మాయ తన ప్రభావమునకు గురి చేయజాలదని గుర్తించవలెను. శివయోగి శివైక్యతాసిద్ధిని, శివదృష్టిని గల్గియుండును. ఈ కారణమును మాయ అశక్తురాలై పోవును.

శివయోగి మనస్సు మీద శబ్ద స్పర్శాదుల ప్రభావముండదని చెప్పబడినది. క్రింది యుపదేశమును గనుడి :

**జ్యోతిర్లిఙ్గే చిదాకారే నిమగ్నేన మహాత్మనా ।**
**భుజ్యమానా యథాయోగం నశ్యన్తి విషయాః స్వతః ॥** (సి.శి. 20-18)

దీని భావమేమనగా చిద్రూపమైనట్టి మహాలింగమునందున నయిక్య స్థితిని బడసి శివయోగి యేయే విషయముల ననుభవించునో అవి తమంత తామే లుప్తములగుచున్నవి.

శిష్టోదన స్థలములోని శివయోగి స్వీకృత ప్రసాద స్థలమున సాధన చేసి విషయముల నుండియును, ప్రపంచములోని ప్రతి యంశము నుండియును అలిప్తతను సాధించినవాడు. విషయములను చిదగ్నిలో వేల్చినవాడు. అట్టి అర్పణ క్రమములోన యనుభోగము చేసెడివన్నియును ప్రసాద రూపమున గ్రహింపబడినవే. అట్టి యెడ అతనిమీద విషయముల ప్రభావమెట్టులుండును. అవి తమంతట తామే నశించుననగా అవి విషయ వాసనల వలన గల్గెడి విషపరిణామములను గల్గింపజాలవని గ్రహించగలరు.

శిష్టోదన స్థలములోని శివయోగి మహాత్ముడుగా గుర్తింపబడినాడు. మహాత్ముడనెడి వాడు నసాధారణమైన వాడై యుండును. శివైక్యతను సాధించినవాడు సామాన్యుడెట్టులౌను? అందుచేత నితడు మహాత్ముడుగా సంబోధింపబడును. మహాత్ములెల్లరూ లోకకళ్యాణమును వాంఛింతురు. శిష్టోదన స్థలములోని శివయోగి కాయానుగ్రహాదుల వలన లోకులను పునీతులను చేయుచు లోకుల నుద్ధరించుచుండునని గ్రహించగలరు.

శిష్టోదన స్థలమునందలి శివయోగి యొక్క విషయము లేవిధముగా లయమగుననెడి దానిని శ్రీ భగవత్పాదులవారు క్రింది విధముగా నుపదేశించిరి :

**శబ్దాదయోఽపి విషయా భుజ్యమానాస్త దీన్ద్రియైః ।**
**ఆత్మన్యేవ విలీయన్తే సరితః సాగరేయథా ॥** (సి.శి. 20-19)

దీని తాత్పర్యమేమనగా శివయోగి ఆయా యింద్రియములచేత ననుభవించెడి శబ్దాది విషయములన్నియును నదులు సముద్రములోన లయమై పోయినట్లు శివయోగి యొక్క ఆత్మలోనే లీనమై పోవును.

విషయోపభోగము ననుభవించిన పిదప సామాన్యుని యొక్క చిత్తములో సంచలనము చెలరేగును. అతడు విషయ వాసనకు లోనై యనంతమైన భోగములను కోరును. ఎంతమేర కనుభవించినను అతనికి తృప్తి లభించదు. అసంతృప్తి వలన మానసిక క్షోభ ననుభవించును.

శిష్టోదన స్థలి కిట్టి పరిస్థితి యుండదు. అనుభవించిన విషయముల వలన తృప్తి లభించును. చిత్తమున సంక్షోభము చెలరేగదు. సముద్రములో కలిసెడి నదులు సముద్రము యొక్క ప్రశాంతత నే విధముగా దెబ్బతీయజాలదో అదే విధముగా శివయోగి యనుభవించెడి శబ్దాదులు నతని యాత్మలో విలీనమగును. అతడు ప్రశాంత చిత్తముతో ఆత్మను సంధానమును చేసికొని యఖండమైనట్టి యానందము ననుభవించుచుండును.

శ్రీ భగవత్పాదులవారు శిష్టోదన స్థలము గురించిన యుపదేశమునకు ముగింపు నిచ్చుచు నీ క్రింది యుపదేశము నిచ్చిరి :

**అర్థజాతమశేషంతు గ్రసన్ యోగీ ప్రశామ్యతి ।**
**స్వాత్మనైవస్థితో భానుస్తేజో జాలమశేషతః ॥** (సి.శి. 20-20)

దీని తాత్పర్యమేమనగా సూర్యుడే విధిన తన కిరణములను తనయందు అడగించికొని అస్తంగతుడగునో అటులనే సకల విషయములను స్వస్వరూపమునందుననుభవించెడి శివయోగి ప్రశాంతుడగును.

నదీ-సముద్ర న్యాయమున చెప్పబడిన యంశమునే యిచ్చట సూర్యుని దృష్టాంతముగా గొని చెప్పబడినది. తన ప్రకాశముతో లోకములకు వెలుగుల నిచ్చెడి సూర్యుడు అస్తమయ సమయమున తన కిరణములనన్నింటిని తనలోనే యిమిడ్చుకొని ప్రశాంతుడగును.

మీరు శిష్టోదన స్థలపు శివయోగినుండి ప్రేరణగొని ప్రశాంతమైన చిత్తముతో మనుగడను కొనసాగింతురు గావుత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులవారు నీ స్థలమున మాయావిలాసమడగిపోయిన స్థితిని వివరించిరి. మాయ "శిష్ట" స్వరూపమును దాల్చి సాధకునికి సేవకురాలై భయభక్తులతో మెలగుచుండునని తెలుపబడినది.

విషయోగభోగ ప్రవృత్తి సర్వ సామాన్యమైనది. విషయేంద్రియలాలసత్వమునకు లోనై వర్తించెడి వారి ప్రవర్తన యెంతో హీనముగా నుండుననియును, నయ్యది పాపహేతువునియును తెలియుచున్నది.

**అంగ దిచ్ఛెగె మద్యమాంసవ తింబరు**
**కంగళిచ్ఛెగె పరవధువ నెరెవరు**
**లింగలాంఛన ధారియాదల్లి ఫలలేను?**
**జంగమముఖదింద నిందె బందడె**
**కొండ మారింగె హోహుదు తప్పదు**
**కూడల సంగమ దేవా!**

(శ్రీ బసవేశ్వరులవారి వచ. 106)

దీని తెలుగు రూపమిది :

***అంగము యొక్క యిచ్ఛకై మద్య మాంసముల గొనెదరు***
***కన్నుల యిచ్ఛకై పర వధువును సమీపింతురు***
***లింగ లాంఛనధారి యైనందున ఫలమేమి?***
***జంగమ ముఖమునుండి నింద వచ్చినచో***
***కొండమారికి గురియైపోవుట తప్పదు***
***కూడల సంగమ దేవా!***

ఇట్టి ప్రవర్తనను గల్గించెడి దెవ్వరనెడిది తెలిసికొనవలసిన విషయము.

మాయా ప్రభావమునకు లోనైన శివుడు జీవుడై ప్రకృతిలో క్రీడించును. ప్రకృతి త్రిగుణాత్మకమైన చరాచర ప్రపంచముగా గోచరించును. జీవుడు పురుషుడు పంచభూతాత్మకమైన దేహమును దాల్చి పంచ భూతాత్మకమైన సృష్టిలో సుఖ-దుఃఖములననుభవించుచున్నాడు.

అవిద్య వలననే పురుషుడు మాయకు వశవర్తియగు ననెడిది యెరుగవలసిన విషయము. అవిద్య వైదొలగిన స్థితిలో మాయ శుద్ధ తత్త్వముల నాశ్రయించియుండెడి ఊర్ధ్వ మాయా స్వరూపమును దాల్చును.

శుద్ధ విద్య, యీశ్వర, సదాశివ తత్త్వముల నావహించి యుండెడి యీ మాయ స్వీకృత ప్రసాది స్థల సంపన్నుని చేరుటకైననూ సాహసించదు. దాని యవశిష్ట రూపము నామమాత్రమైన స్వభావము గలదగును.

ఇట్టి స్థితిలో సాధకుని విషయోపభోగమెట్టులుండుననెడి ప్రశ్న తలయెత్తును.

ఈ విషయము గురించి మన యవగాహనను పెంచెడి క్రింది సీసమును గనుడి :

**నీ ప్రసాదకలింగనిహితమై శ్రోత్రంబు**
**లర్పించు శబ్దలతాంతములను**
**నీ చరలింగ సన్నిహితమై త్వక్కుదా**

**నర్పించు స్పర్శలతాంతములను**
**నీ శివలింగ సన్నిహితమై నేత్రంబు**
**లర్పించు రూపలతాంతములను**

**నీదు నాచార లింగ సన్నిహిత ఘోణ**
**మట్ల యర్పించు గంధలతాంతములను**
**పరిణమంబు మహాలింగ పరము మనసు**
**నె నొసగ నతడు ప్రసాది శ్రీ బసవలింగ!**

(చతుర్వేద సారము, ప.268)

సాధకుడు పంచతన్మాత్రలను పంచలింగములకు సమర్పించును. అర్పితమైన శబ్దాదులు పంచ లింగముల చేత స్వీకృతములై యవి విషయత్వమును కోల్పోయి ప్రసాదములగుచున్నవి. ప్రసాదమును స్వీకరించి సాధకుడు స్వీకృత ప్రసాదియగును. ఈ విధము విషయములు లయమైపోవును. మాయయు చిల్లింగమున లీనమగును. సాధకుడు శిష్టోదన స్థల సంపన్నుడై వెలుంగును.

ఇట్టి స్థితి యెల్లరకూ సంప్రాప్తమయ్యేడిది కాదని గ్రహించవలెను. ఈ విషయము గురించి తెలిపెడి క్రింది వచనము గనుడి :

**మూరరాప్యాయన ఐదు బెట్టైవ**
**నింబు గొండుదు**
**అకటకటా! మాడి కెట్టరు**
**మాడదె కెట్టరు**
**నీడి కెట్టరు నీడదె కెట్టరు**
**కూడల సంగమ దేవన బసుర మధ్యద**
**బయలు సమాధియ లిక్కదె కెట్టరు**

(శ్రీ బసవేశ్వరులవారి వచనము సం॥ 919)

ఈ వచనపు తెలుగు రూపమును గనుడి :

***ముప్పురి యాప్యాయన మైదు***
***గుట్టలను లోగొనినది***
***అకటకటా! చేసి చెడిరి చేయక చెడిరి***
***పెట్టి చెడిరి పెట్టకయే చెడిరి***
***కూడల సంగమ దేవుని పొట్ట నడుమలోని***
***సమాధిని వేయక చెడిరి.***

లింగైక్యస్థితిని సాధించుట యంత సులభతరమైన విషయము కాదనియును, యెందరో కొంతమేరకు మాత్రమే చదువగల్గుదురనియును తెలిసికొనవలెను. ఐక్య స్థలమును ప్రవేశించిన వారు కూడ సఫల మనోరథులగుదురనుటకు శక్యము గాదని తెలియుచున్నది.

"శుభం భూయాత్"

## ఆశీర్వచనము - 1 :

## చరాచర లయ స్థలము :

శిష్టోదన స్థలమున శివయోగి సముద్రుని వలె ప్రశాంతముగా నుండునని చెప్పబడినది. సాధకుడీ స్థలము నధిగమించి చరాచర లయ స్థలమున ప్రవేశించుచున్నాడు. ఇచ్చటనితడు చరాచరములను లయము చేసెడి లయకారకుని యనుభవమును పొందును. చరాచర మనగా స్థావర జంగమాత్మకమైన జగత్తని తెలిసికొనగలరు. ఈ రెంటిని లయము చేసెడి శివయోగి గురించి శ్రీభగవత్పాదులవారు క్రింది విధముగా నుపదేశము నిచ్చిరి :

**లిఙ్గైక్యే తు సమాపన్నే చరణా చరణౌగతే ।**
**నిర్దేహీ స భవేద్యోగీ చరాచర వినాశకః ॥** (సి.శి. 20-21)

దీని సారాంశమేమనగా చరాచరమైన ప్రపంచము మహాలింగమునందున సామరస్య స్థితిని పొందగా శిష్టోదన స్థలమునందలి శివయోగి నిర్దేహియగును. ఇట్టి స్థితిని పొందిన శివయోగిని చరాచర వినాశకుడని యందురు.

శివాద్వైత జ్ఞాన సంపన్నుడైన శివయోగి తనకు ప్రాప్తమైన జ్ఞానము మూలకముగా పరిదృశ్యమైన ప్రపంచము గురించి లయ చింతనను చేయును. సమస్తమైన పదార్థములను పృథ్వి యందునను, పృథ్విని జలమందునను, జలమును అగ్నియందునను, అగ్నిని వాయువునందునను, వాయువు నాకాశమందునను, ఆకాశమును మాయయందునను, మాయను మహాలింగమునందునను లయము చేసెడి చింతనయే లయ చింతనయనబడును. ఈ లయ ప్రక్రియ భావనాత్మకముగా జరుగునని గుర్తించవలెను.

లయాత్మకమైన భావనయొక్క పరిణామ ఫలముగా శివయోగికి తన దేహము గురించియు దైహిక వ్యవహారము యందునను విస్మృతి గల్గును. దేహాభిమానము పూర్తిగా నష్టమగును. ఈ కారణము వలననే యితడే నిర్దేహి యనబడుచున్నాడు. ఈ విధముగా కాయము గురించిన మరియు ప్రపంచము గురించిన "అహం" "మమ" భావనలను నాశనము చేసికొని యీ స్థలములోని శివయోగి చరాచర వినాశకుడగుచున్నాడు.

నిర్దేహి యనెడి పదము సామాన్యముగా దేహమును వీడిని వాడనెడి యర్థమునందున ప్రయోగింపబడుచుండును. ఇచ్చట దేహాభిమానమును వీడిన వాడనెడి యర్థమే పొసగునని గ్రహించగలరు.

మమత్వాభిమానము వలననే వ్యక్తి దేహియగుచున్నాడు. దేహ ధారణతోబాటుగా దేహాభిమానము గలవాడే దేహి. సంసారములోని యిల్లు, ముంగిలి, భార్య, పిల్లలు, బంధు బలగము మొదలగు వాటి యెడల యభిమానమును, మమత్వ భావమును గల్గినవానికి యీ సంసారిక పరమైన యంశములు వెన్నంటియే యుండును. కాశీకి నొంటరిగా వెళ్ళిననూ సాంసారికాంశములు అతని చెంతనే యుండును. అభిమానమును వీడిననాడు సంసారిక పరమైన వాటి మధ్యలోనున్నను అవి అతనికి బంధములు కాజాలవు. అందుచేత అతడు నిస్సంసారి యగుచున్నాడు. జ్ఞానప్రాప్తిని పొందిన వాడు సంసారములోనున్నను వాస్తవముగ నతడు నిస్సంసారి యని చెప్పబడుచున్నాడు.

నిర్దేహి మరియు విదేహి పర్యాయ పదములుగా వాడబడుచున్నవి. జనక మహారాజు విదేహునిగా ప్రఖ్యాతి గాంచెను. ఈ విషయమెరిగిన వారు జనకుని చూచి తరించుటకు వచ్చుచుండిరి. వ్యాసుని ప్రేరణవలన శుకమహర్షి జనక రాజర్షిని చూచుటకు విచ్చేసెను. జనకుని రాజ్య వైభోగమును గాంచిన శుకునికి జనకుని యెడల సదభిప్రాయము కలుగకుండెను. అతనిని విదేహునిగా చూడలేకపోయెను. తనవలె యతని వైరాగ్య సంపదలేదని భావించికొనెను. జనకుడు శుకున కుచితమైన సౌకర్యములను సమకూర్చెను. అతనికి రాజమందిరములోనే విడిది నేర్పాటు చేసెను. శుకమహర్షి భోజనాదులను ముగించికొని విశ్రాంతిని గైకొనెను. సాయం సమయమును పురస్కరించికొని జనకుడు వాహ్యాళికి వెళ్ళుచు శుకునిని తన వెంట నిడుకొని వెడలెను. ఇరువురు నదీ తీరమునకు చేరిరి. ఒక శుభ్రమైన ప్రదేశమన కూర్చుండి తాత్త్విక విషయములను చర్చించికొనుచుండిరి. కొంత సమయమైన పిదప రాజభటుడు పరుగెత్తికొని వచ్చి రాజుకు నమస్కరించి "స్వామీ! రాజమందిరమునకు నిప్పంటికొనినది. ఎంతోమేరకు నాస్తి నష్టము జరిగిన"దని తెలిపెను. ఈ వార్తను వినిన వెంటనే శుకమహర్షి "అయ్యో! అయ్యో! నా కౌపీనాదుల కేమయ్యెనో ఏమో?" అని యనుచు రాజమందిరము వైపు పరుగులు తీసెను. కొంతదూరము వెడలి వెనుదిరిగి చూడగా అతనికి కదలక

మెదలక నిర్లిప్త వైఖరి కూర్చుండి యున్న జనకుడతనికి కనిపించెను. మమత్వము లేనివాడైనందున అగ్ని ప్రమాదపు వార్తవలన యతడు చలించకుండ నుండెనని గ్రహించెను. మమత్వమును వీడలేని తన నిజస్థితిని గాంచి సిగ్గిల్లెను. రాజుకు శరణాగతుడై తత్త్వబోధను పొందెను.

నిర్దేహియగుట అంత సులభమైన విషయము కాదు. సామాన్యుడైతే చచ్చిపోవునంతవరకు దేహియై దుఃఖము ననుభవించుచున్నాడు. జ్ఞాన సంపన్నులైనవారిలో కొందరు మృత్యువు కంటెను ముందుననే నిర్దేహులై చరించుచున్నారు. వీరిలో కొందరు జనకునివలె రాజభోగములననుభవించుచున్నను నిర్దేహస్థితిని పొందగల్గుచున్నారు. విరాగులమని చెప్పికొనెడివారు దేహాభిమానమును వీడజాలని వారై దుఃఖమునకు గురియగుచున్నారు.

చరాచరలయ స్థలముననుండెడి శివయోగి నిజమైన నిర్దేహియై స్థావర జంగమాత్మకమైన ప్రపంచమును లయమొనర్చుచున్నాడని గ్రహించగలరు.

చరాచరలయ స్థలములోని శివయోగికి విశ్వమెందుకు ప్రకాశనము కాదనెడి దానిని వివరించుచు శ్రీ భగవత్పాదులవారు క్రింది యుపదేశము నిచ్చిరి :

**అనాద్యవిద్యామూలా హి ప్రతీతిర్జగతా మియమ్ ।**
**స్వాత్మైక బోధాత్ తన్నాశే కుతో విశ్వ ప్రకాశనమ్ ॥**
(సి.శి. 20-22)

దీని తాత్పర్యమేమనగా చరాచరాత్మకమైన ప్రపంచము యొక్క ప్రతీతికి యనాదిదైనట్టి యవిద్యయే మూలకారణమగుచున్నది. ఆత్మ-పరమాత్మల సమైక్యబోధ గల్గగనే యవిద్య నశించును. మూల కారణమైనట్టి యవిద్య నష్టమైపోయినప్పుడు విశ్వమెట్టుల కన్పట్టును.

అవిద్య వల్లనే చరాచర జగత్తు పుట్టుచున్నదనెడిది శివాద్వైత సిద్ధాంతమున మొట్టమొదటగా వివరింపబడిన యంశము. ఈ అవిద్య నశించినప్పుడు ప్రపంచముండదు. శివుడు జీవుడై దుఃఖమునుభవించుటకు నీ య విద్యయే మూల కారణము. శివ-జీవ భేద జ్ఞానమున్నంతవరకే అవిద్య నెలకొనియుండును. శివ-జీవైక్య బోధగలుగగనే యవిద్య నష్టమగునని గ్రహించగలరు. చరాచరలయ స్థలమును ప్రవేశించిన శివయోగి శివ-జీవైక్యబోధ సంపన్నుడై యుండెడి వాడైనందున యతని సన్నిధిన నవిద్య నిలువజాలదు. అవిద్య వైదొలగిపోయిన పిదప చరాచర జగత్తు లయమైపోవును. ఈ విషయమును దృష్టాంతమూలముగా తెలియజేయుటకై శ్రీ భగవత్పాదులవారు క్రింది యుపదేశము నిచ్చిరి :

**యథా మేఘాః సముద్భూతా విలీయన్తే నభస్థలే ।**
**తథాత్మని విలీయన్తే విషయాః స్వానుభావినః ॥** (సి.శి. 20-23)

దీని తాత్పర్యమేమనగా నే విధముగా మొగులుదారిన పుట్టిన మొగుళ్ళు మొగులు దారిలోన లీనమై పోవునటులే స్వస్వరూపానుభవము బొందెడి శివయోగి యొక్క విషయములు నతని యాత్మలోనే లీనమగును.

వర్షాకాలములో ఆకాశము మేఘావృతమై యుండుటను గాంచగలము. కారుమబ్బుల వలన చీకట్లు అలుముకొనెడి స్థితినికూడ గాంచగలము. ఈ మబ్బులు శరత్కాలములో కనిపించవు. ఆకాశము నిర్మలముగా నుండును. మచ్చుకొక్క మబ్బైననూ గోచరించదు. ఆకసమున పుట్టిన మొగళ్ళు ఆకసముననే సమసిపోవుచున్నదనెడిది మనకు కనిపించెడి వాస్తవము.

సామాన్యుని చిత్తమున విషయములనెడి మబ్బులు నిరంతరము కొనసాగుచునే యుండును. దినదినమునకవి ద్విగుణీకృతమైన ఆక్రమణ చేయుచుండును. తత్ఫలితముగా శివాద్వైత బోధ నిష్క్రమణను చేయును. చరాచర లయ స్థలములోని శివయోగి యొక్క శివాద్వైత బోధ ప్రబలముగా నుండుటచేత నతనిలోన యుత్పన్నమయ్యెడి విషయ చింతనలు మరియు విషయానుభవవాసనలు వెనువెంటనే సమసిపోవును. అతని చిత్తము సదా శరత్కాలములోని యాకాశము రీతిగా నిర్మలముగా నుండునని గ్రహించగలరు.

చరాచర లయ స్థలమునందలి శివయోగి వలన ప్రపంచమేవిధముగా లయము చేయబడుననెడిదానిని శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల వారు క్రింది విధముగా వివరించిరి :

**స్వప్నే దృష్టం యథా వస్తు ప్రబోధే లయ మశ్నుతే ।**
**తథా సాంసారికం సర్వమాత్మజ్ఞానే వినశ్యతి ॥**
(సి.శి. 20-24)

దీని తాత్పర్యమేమనగా స్వప్నమునందున కనిపించెడి దృశ్యము లేవగనే లయమైపోవునటులే సాంసారిక వ్యవహారమంతయూ ఆత్మజ్ఞానము కాగానే కనిపించకుండా పోవును.

మన దైనందిన జీవితమునందున జాగ్రత్, స్వప్న, సుషుప్తిలనెడి మూడవ స్థల ననుభవించుచున్నాము. ఒకే సమయమునొకే యవస్థ యనుభవములోనికి వచ్చుననెడిది సర్వానుభవమైన విషయము. ఈ అవస్థల యొక్క స్వభావమును గురించి తెలిసికొనుట యెంతో అవసరము.

వేదాంతులు జాగ్రదవస్థను వ్యావహారిక సత్యమని యందురు. స్వప్నావస్థ ప్రాతిభాసిక సత్యమని పిలువబడుచున్నది. అయితే వీరీ రెంటిని మిథ్యలుగాను స్వీకరించిరి. పరబ్రహ్మమొక్కటే సత్యమనియును తేల్చిచెప్పిరి. పారమార్థికమైనదే సత్యమనెడిదే వీరి వాదనలోని భావము. జగన్మిథ్యా భావననే యీ వాదమునకు మూలమని వేరుగా చెప్పెడి యవశ్యకత లేదు.

వీరశైవ సిద్ధాంతమునందున జగన్మిథ్యా వాదమున కవకాశముండదు. బ్రహ్మయూ సత్యమే. జగత్తు కూడ సత్యమే. ఈ విషయమును విశదీకరించెడి క్రింది యాగమోక్తుల గనుడి :

**జీవ స్సత్యం జగత్సత్యం శివస్సత్యం స్వభావతః ।**
**తయోరభేదస్సత్యం వా క్రిమిభ్రమరయోరివ ॥**

క్రిమి తన మొదటి స్వరూపము నందున సత్యమే అయియుండును. భ్రమర చింతన చేత సంపూర్ణమైన పరివర్తనకు గురియై భ్రమరమగుచున్నది. భ్రమరమును గాంచి క్రిమిని మిథ్య యనుటలో నౌచిత్యముండదు. కారణమేమనగా క్రిమియూ సత్యమే, భ్రమరమూ సత్యమే. ఇదే విధిన, జీవుడు, జగత్తు మరియు శివుడనెవియూ సత్యములే. అందుచేత నొక దశలో శివ-జీవ భేదములో సత్యము గోచరించును. ఆ దశ నివృత్తిని పొందిన పిదప శివ-జీవాభేదము సత్యమైనదగును.

రెండవ దశలోనికి వచ్చిన పిదప మొదటి దశ మిథ్యయని అనజాలము. ఆ దశలో అది సత్యమైతే యీ దశలో నియ్యది సత్యమగును. మొదట శివుడు సత్యమైయుండును. పరిణామక్రమములో నితడు జీవుడగును. ఇదియు సత్యమే. జీవుడు మిథ్యయనుటకు వీలులేదు. సాధనాక్రమములో జీవుడు శివుడగును. ఇదియును సత్యమే. ఇచ్చట యెరుగవలసినదేమనగా నొక దశయుండియున్నప్పుడు మరొక దశయుండదు. ఈ విధముగా చూసిన యెడల జాగ్రత్ స్వప్న-సుషుప్తులలో గలిగెడి యనుభవములు సత్యములని భావించవలెను. అట్టి యెడ, స్వప్నములోని యనుభవము మిథ్యకాదని అంగీకరించవలెను. ఈ యంశమును నిరూపించుటకై శ్రీ మరితొంటదార్యులవారు "స్వప్నేనాపి ఫలాఫల దర్శనాత్ రేతః పాతాది దర్శనాచ్చ సత్యత్వమేవ" యని ప్రతిపాదించిరి. ఈ వాక్కులలోని వాదమేమనగా నొక వ్యక్తి కలలో నొక స్త్రీతో శారీరక సంబంధమేర్పరచికొని సుఖము ననుభవించినప్పుడు రేతస్సు పడిపోవచ్చును. మేల్కొనిన పిదప స్వప్నములోని యనుభవము మిథ్యయని యన్నచో స్ఖలితమైన రేతస్సు విషయము ప్రశ్నగా నిలుచును. రేతస్సు పడుట నిజము కనుక స్వప్నములోని యనుభవము కూడ సత్యమేయగును.

జీవుడజ్ఞానిగా నున్నప్పుడు సంసారము సత్యమైనదిగానే యుండును. దీనిని స్వప్నదశతో పోల్చవచ్చును. జ్ఞానియైన పిదప సంసారము లయమగుటయూ సత్యమే. సంసారము సత్యమని దోచెడి దశ నివృత్తియైనదని భావించికొనవలెను. ఈ దశలో జీవుడు శివత్వముననుభవించు చుండునని గ్రహించగలరు.

స్వాభావికములైన జాగ్రదాద్యవస్థల వెలుపలన సాధనా జన్యములైన సప్తావస్థలు గలవని శాస్త్రముల యందున చెప్పబడినది. వాటినే సప్తభూమికలని యందురు. మనస్సు యొక్క ఉన్నతమైన యవస్థయే భూమిక. శుభేచ్ఛా, సువిచారణ, తనుమానస, సత్త్వాపత్తి, అసంసక్తి, పదార్థాభావిని మరియు తుర్యగామిని యనెడివే సప్తభూమికలు. శివపూజ, సత్సంగము మరియు సద్గ్రంథాధ్యయనము చేయవలెననెడి యిచ్ఛయే శుభేచ్ఛ. ఇది గల్గిన వాని జీవితమున్నతమైన స్థితిలో నున్నదని తెలిసికొనవలెను. శుభేచ్ఛ గల్గిన వానికి సువిచారణ గురించిన యిచ్ఛ గల్గును.

నిత్యానిత్యముల, ఆత్మానాత్మల వివేకమే సువిచారణ యగును. ఈ విచారణ వలన దేహము కంటె నాత్మ భిన్నమైనదనెడి దృఢమైన బుద్ధి గల్గుటను తనుమానసమని యందురు. ఆత్మపరమాత్మల యభేద జ్ఞానమును పొందుటయే సత్వాపత్తి. ఈ జ్ఞానము వలన మనస్సులో సంసారము గురించి గల్గెడి యనాసక్తియే యసంసత్తి. ఈ భూమిక ఫలితముగా సాధకుడంతర్ముఖుడై బాహ్య ప్రపంచమును చూడజాలకుండుటయే పదార్థభావినీ భూమిక. మరల ప్రపంచము గురించి ఆలోచన రాకుండగుండెడి స్థితి తుర్యగామిని యవస్థ. ఈ భూమికలలో నారవది చరాచరలయ స్థలము గురించి తెలుపునని గ్రహించవలెను. ఈ స్థలమున ప్రపంచము యొక్క నివృత్తి గల్గునని తెలిసికొనవలెను. సాధకుని మనస్సు సూక్ష్మాతిసూక్ష్మమైన రూపమును దాల్చి ప్రపంచపు వ్యవహారములను వీడియుండుటచేత నతనికి చరాచరము లయమైనదనెడి భావము గల్గును.

శ్రీరేణుకాచార్యులవారు శివయోగికి ప్రాప్తించెడి చరాచరలయస్థితిని గురించి మరింత స్పష్టముగా తెలుపుటకై యీ క్రింది యుపదేశము నిచ్చిరి :

**జాగ్రత్ స్వప్న సుషుప్తిభ్యః పరావస్థాముపేయుషః ।**
**కిం వా ప్రమాణం కిం జ్ఞేయం కిం వా జ్ఞానస్య సాధనమ్ ॥** (సి.శి. 20-25)

దీని తాత్పర్యమేమనగా తనుత్రయములను నవలంభించిన జాగ్రదాది అవస్థా త్రయములను మీరినట్టిదియును, ఖేచరీ ముద్రకు మాత్రము సులభముగా నుండెడి సర్వోత్కృష్టమైన తుర్యావస్థను పొందిన శివయోగి త్రిపుటరూపమైన ప్రపంచాతీతావస్థను పొందియుండుట చేత నతనికి ప్రమాణ ప్రమేయముల భేద దర్శనమే యుండదు.

శివయోగ సాధకుడు యోగశాస్త్రమునందున ప్రతిపాదించబడిన ముద్రల సహాయముతో సర్వోత్కృష్టమైన తుర్యావస్థను పొందును. ఖేచరీముద్ర మరియు శాంభవీ ముద్రలను సహాయముగా గొని తుర్యావస్థకు చేరవచ్చునని తెలుపబడినది. బ్రహ్మను మొదలుకొని పిపీలిక పర్యంతము గల చరాచరములలో వ్యాపించియున్న వాడును, సర్వ జగత్తుకును సాక్షియై జ్ఞానజ్యోతిగా నుండెడి వాడును అయిన పరశివ బ్రహ్మను తానేయని యనుసంధానించికొనెడి సాధకుని యోగసాధన ఖేచరీ ముద్రయనబడును. వామహస్తమున గల యిష్టలింగము నందున దృష్టిని నిలిపి యిష్టలింగాకారమైన జ్యోతిని హృదయ కమలమున వెలిగెడి పరంజ్యోతితో అనుసంధానము చేసికొనుటయే శాంభవీ ముద్ర యనబడుచున్నది. ఇట్టి సాధన చేసెడి శివయోగి దృష్టి అంతరంగమున నిలిచియుండుటచేత యతనికి బాహ్య ప్రపంచము లయమైపోవునని తెలిసికొనగలరు. ప్రమాణ ప్రమేయాదులచేత జ్ఞానమును పొందెడి యవశ్యకతయు నుండదని గ్రహించగలరు. ఇట్టి స్థితిలో నుండెడి శివయోగి ప్రపంచమును మళ్ళీ దర్శించడని చెప్పబడినది. క్రింది యుపదేశమును గనుడి :

**తుర్యాతీత పదం యత్తద్ దూరం వాఙ్మనసాధ్వనః ।**
**అనుప్రవిశ్య తద్యోగీ న భూయో విశ్వమీక్షతే ॥** (సి.శి. 20-26)

దీని తాత్పర్యమేమనగా వాక్కుకు మనస్సుకునందని తుర్యాతీత అవస్థలో ననుభవమును పొందెడి వాడగు శివయోగి పునః ప్రపంచమును చూడడు.

తుర్యావస్థ లేదా తుర్యాతీతావస్థలో నుండెడివాడు ప్రపంచమునకు రాజాలడు. వచ్చినా యెక్కువ కాలమువరకు నుండజాలడు. మరల తుర్యావస్థలోనికి వెడలిపోవును. వేసవికాలములో వాతానుకూలితమైన గదిలో కాలమును గడపుచు సుఖమున కలవాటు పడిన వ్యక్తి మధ్యాహ్న సమయమున బయటికి రాగలడా? ఒకవేళ కార్యార్థమై వచ్చినా తిరిగి వాతానుకూలితమైన గతిలోకెంతో వేగముగా వెడలిపోవుటకు యత్నించుచుండును. పగటిపూట పుట్టనుండి బయటికి వచ్చెడి పాము స్థితియు నిట్టిదే. సాధ్యమైనంత త్వరగా నయ్యది భద్రత నిమిత్తము వల్మికము నాశ్రయించును.

చరాచరస్థలము నందలి శివయోగి స్థితిగురించి శ్రీ భగవత్పాదుల వారు క్రింది విధముగా స్పష్టీకరించిరి:

**నాన్యత్ పశ్యతి యోగీన్ద్రో నాన్యజ్జానాతి కించన ।**
**నాన్యచ్ఛృణోతి సంవృష్టే చిదానన్దమయే శివే ॥** (సి.శి. 20-27)

దీని తాత్పర్యమేమనగా చిదానందమయమైన శివుని సందర్శనమును బడసిన శివయోగి వేరొక దానిని చూడడు. వేరొకటి వినడు. వేరే జ్ఞానమును పొందడు. తన స్వస్వరూపస్థితిలోనే నిలుకడగా నుండును.

"ఏక విజ్ఞానే సర్వ విజ్ఞాన"మ్మనెడి ప్రతి వాక్కు ప్రకారము శివాద్వైత జ్ఞానమెరిగిన వాడంతా యెరిగిన వాడే యగుచున్నాడు. సర్వమూ తన యాత్మ రూపమున గోచరించుచున్నప్పుడు వేరే యేదియును తెలిసికొనవలసిన యవశ్యకత లేదు. ఈ కారణముననే యతడు చూచుట, వినుట, తెలిసికొనుట యనెడి వాటియందున నాసక్తిని గల్గియుండడు.

శ్రీ జగద్గురు రేణుకాచార్యులవారు చరాచర లయ స్థలము గురించిన తమ యుపదేశము నీ క్రింది విధముగా ముగింపును చెప్పిరి :

**అసదేవ జగత్ సర్వం సదివ ప్రతిభాసతే ।**
**జ్ఞాతే శివే తదజ్ఞానం స్వరూపముపపద్యతే ॥** (సి.శి. 20-28)

దీని తాత్పర్యమేమనగా చర-అచరాత్మకమైన జగత్తు శివుని కంటెను భిన్నమైనది కాదు. మాయాశక్తి వశము వలన భిన్నమైనదిగా దోచును. పరశివ జ్ఞానమును బడసిన పిదప, భేద ప్రతీతికి కారణమైనట్టి అజ్ఞానము నిర్గమించును. స్వస్వరూప మొక్కటే మిగిలియుండును.

ఈ సందర్భమున నుపయోగింపబడిన "అసత్" శబ్ద మపార్థమునకు నాస్కారము కల్పించెడి యవకాశము కలదు. అసత్తనగా "మిథ్య" అనెడి భావమేర్పడే యవకాశమున్నది. ఇచ్చట గుర్తించవలసినదేమనగా "జగత్తు మిథ్య" అనెడిది వీరశైవ ధర్మమున కంగీకార యోగ్యమైనట్టి భావన కాదు. బ్రహ్మ సత్యమే. జగత్తు సత్యమే. అసత్యమనెడిది భేదభావము. శివుడు-జీవుడు-జగత్తు అనెడివి వాస్తవముగానొక్కటే. ఇవి వేరు వేరనెడి అసత్తు అజ్ఞానము నిర్గమించి శివజ్ఞానము ప్రకాశించెడి తరుణములో అభేదభావము గల్గును.

చరాచర స్థలములో నుండెడి శివయోగి తన చిత్తమును స్వీయ హృదయకమలమున ప్రకాశించెడి పరంజ్యోతిలో లీనమొనేచి తాను శివునికంటెను భిన్నుడను గాననెడి శివాద్వైత జ్ఞాన సంపన్నుడై యుండెడి దశలో చరాచరములయమైపోవును.

మీరందరు శివజ్ఞాన సంపన్నులై చరాచర లయ స్థలములోని శివయోగి వలె ధన్యతను సాధింతురు గావుత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు చంద్రశేఖర శివాచార్యులవారు సాధకుడు నిర్దేహిగా పరిణమించెడి దశయైన చరాచర లయ స్థలము గురించి వివరించిరి :

ఈ దశలో జీవుడు దేహేంద్రియాదులు లేని వాడగుచున్నాడు. రూపము గల్గిన దేహమును వీడి తేజోరూపియగుచున్నాడు. ఈ అంశమును వివరించెడి క్రింది వచనము గనుడి :

**అలికల్ల హరళినంతె అరగిన పుత్తళియంతె**
**తను కరగి నెరెవ సుఖవ నానేనెంబె?**
**కడెగోడివరిదువెనగయ్యా నయనద సుఖ**
**జలంగళు!**
**నమ్మ కూడల సంగమ దేవరముట్టి**
**నెరెవ సుఖవ నానేనెంబె**

(శ్రీ బసవేశ్వర వచ.సం. 847)

ఈ వచనము యొక్క తెలుగు రూపము గనుడి :

*వడగల్లు పలుగువలె, లక్క పుత్తడి వలె*
*తనువు కరగి చేరెడి సుఖమును*
*నేమందునయ్యా*
*కడగంటి కొలకులలో నిండెను నాకయ్యా*
*నయనపు సుఖ జలములు*
*మాదు కూడల సంగమ దేవుని ముట్టి చేరెడి*
*సుఖమును నేనేమందునయ్యా!*

దేహి దేహ గుణములను త్యజించి దైవత్వమును పొందే దశయే నిర్దేహి స్థలమని యెరుగగలరు.

కర్మేంద్రియ జ్ఞానేంద్రియములనెడివియును నష్టమగును. ఎరుగవలసిన దేదియును నుండదు.

జీవన్ముక్త దశలో కాయాదులుండినా నయ్యవి దేహగుణముల నెడబాసి లింగ గుణములను పొందును. ఈ దశలో సాధకుదు సర్వాంగ లింగియై, లింగేంద్రియ సంపన్నుడై చరాచర ప్రపంచమును గాంచని దశ కెదుగును. తత్ఫలితముగా చరాచరములు లయముగాగ, లింగభోగోపభోగియై విషయ సుఖమును లింగములో లయము చేయును.

"శుభం భూయాత్"

## ఆశీర్వచనము - 1 :

## భాండ స్థలము :

లింగషట్ స్థలములలోనిదొకటే ఐక్య స్థలమునందున చరాచర లయ స్థలమునకు పిదప వచ్చెడి స్థలము బాండ స్థలమని శ్రీ జగద్గురు రేణుకాచార్యులవారు మహర్షి యగస్త్యునకు తెలియజెప్పిరని యింతకంటెను క్రితమున చెప్పనైనది.

భాండ స్థలము యొక్క నిర్వచనము నిచ్చుచు శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారు క్రింది యుపదేశము నిచ్చిరి :

**బ్రహ్మాణ్డ శతకోటీనాం సర్గస్థితిలయాన్ ప్రతి ।**
**స్థానభూతో విమర్శో యస్తద్భాణ్డస్థలముచ్యతే ॥** (సి.శి. 20-29)

ఉపదేశము యొక్క తాత్పర్యమేమనగా శతకోటి బ్రహ్మాండముల యుత్పత్తి స్థితి, లయలకాధారభూతమైన స్థలమేదైతే కలదో అదియే భాండ స్థలమనబడుచున్నది.

శ్రీ భగవత్పాదులవారు విమర్శశక్తికి భాండమనెడి పారిభాషిక పదమును వాడుట యనెడిదొక విశిష్టమైన యంశమైయున్నది. లౌకిక వ్యవహారముల యందున భాండమనగా పాత్ర. ఖాద్య పదార్థములను పాత్రయందున వేసి వేయించెడి దానిని మనమందరము చూచుచున్నాము. పదార్థముల నుచితరీతిన పక్వముచేసి తినుటకై భాండము యొక్క యవశ్యత కలదు. ఇటులనే యనంతమైన భువన బ్రహ్మాండములను నిర్మించివలెననినచో నొక భాండము వంటి యొక ఆధారము కావలసియుండును. అది విశ్వముకంటెను విశాలమైనదై యుండవలెను. ఆ దృష్టితో చూసినప్పుడు శివునితో నవినాభావ సంబంధము గల్గినట్టి శివుని విమర్శశక్తి యిందుకై తగినదై యున్నది. అందుచేత శివుని విమర్శ శక్తిని భాండమని యందురు.

వీరశైవ సిద్ధాంత ప్రకారముగా శివుడెల్లప్పుడు శక్తి విశిష్టుడై యుండును. శక్తి యనెడి దొక్కటేయైనను కార్యభేదముననుసరించి యిద్దాని నారు విధములుగా విభజింపవచ్చును. అవి యేమనగా చిచ్ఛక్తి, పరాశక్తి, ఆదిశక్తి, యిచ్ఛాశక్తి, జ్ఞానశక్తి మరియు క్రియాశక్తులు. వీటిలో చిచ్ఛక్తి సచ్చిదానంద స్వరూపము గలదై పరశివ బ్రహ్మతో సమరసముగా నుండును. దీనివలననే సృష్టి–స్థితి–లయాదుల కాధారము లభించుచున్నది. ఇట్టి చిచ్ఛక్తి యిచట భాండమనెడి పేరున పిలువబడినది.

బ్రహ్మాండములెన్నిగలవనెడి విషయమున యేకాభిప్రాయము గోచరించుటలేదు. శ్రీ భగవత్పాదులవారు శతకోటి బ్రహ్మాండములున్నవని చెప్పినయట్లు దోచుచున్నది. ఈ శతకోటి అనెడి దానిని "అనంతమైన" యనెడి అర్థములో గ్రహించుటలోన నౌచిత్యముండును. బ్రహ్మాండము లనంతముగా నున్నవనెడి విషయమందున భేదాభిప్రాయములు లేవు.

శ్రీ జగద్గురు రేణుకాచార్యులవారు విమర్శశక్తి యొక్క స్వరూపము నీ క్రింది విధముగా విశదీకరించిరి:

**విమర్శాఖ్యా పరాశక్తిర్విశ్వో ద్భాశనకారిణీ ।**
**సాక్షిణీ సర్వభూతానాం సమిన్ధే సర్వతోముఖీ ॥** (సి.శి. 20 : 30)

దీని తాత్పర్యమేమనగా విమర్శశక్తి అధ్వరరూపమైన విశ్వము యొక్క ఉత్పత్తికి కారణమైయున్నది. ఇది సర్వతత్త్వములకును సాక్షీభూతమై యుండును. అంతేకాదు, ఇది సర్వతోముఖియై ప్రకాశించుచుండును.

ఆగమముల ప్రకారముగా జగత్తు అధ్వరూపమున నుండును. అధ్వములారని చెప్పబడినది. అవి యేవనగా వర్ణ, పద, మంత్ర, భువన, కల మరియు తత్త్వాధ్వములు. వీటి యుత్పత్తికి విమర్శ శక్తియే కారణభూతమగునని గుర్తించగలరు.

ఈ చరాచర జగత్తునకు లయ స్థానము చిచ్ఛక్తియేయని శ్రీభగవత్పాదులవారు వివరించిరి. క్రింది యుపదేశము గనుడి :

**విశ్వం యత్ర లయం యాతి విభ్యాత్యాత్మా చిదాకృతిః ।**
**సదానన్దమయః సాక్షాత్ సా విమర్శమయీ కలా** (సి.శి. 20 : 31)

దీని తాత్పర్యమేమనగా దేనియందున నీ జగము లయమగునో దేనియందున నాత్మ చిదాకృతిన ప్రకాశించునో, ఏది చిదానంద రూపమున నుండునో అదియే శివుని విమర్శాశక్తి.

విశ్వము యొక్క యుత్పత్తి– స్థితి–లయలకాధారభూతమైన స్థలమే భాండస్థలమని యింతకుముందే చెప్పబడినది. జగత్తు యొక్క సృష్టి నిమిత్తమున యుపాదాన కారణముగా నుండెడి విమర్శాశక్తిలోని విశ్వము లయమగునని గుర్తించవలెను. మన్నునుపాదాన కారణముగ గైకొని చేయబడిన కుండ చివరన మట్టిగానే మారిపోవును. విశ్వము యొక్క స్థితియు నట్టిదేయని గ్రహించవలెను.

చిచ్ఛక్తియే విమర్శాశక్తిగా పిలువబడునని యింతకంటెను ముందున చెప్పనైనది. అందుచేత విమర్శాశక్తి చిదానందమయముగా నుండునని తెలియుచున్నది. శివుడు విమర్శాశక్తి యొక్క సాంగత్యము వలన చిదానందరూపునిగా ప్రకాశించునని తెలిసికొనవలెను.

పరాహంతగా పిలువబడెడి యీ చిచ్ఛక్తితో కలిసియున్నందుననే శివుడు సర్వజ్ఞుడుగాను, సర్వగుడు గాను, సర్వకర్తృవుగాను అగుచున్నాడు. ఈ విషయమును తెలిపెడి క్రింది యుపదేశము గనుడి :

**పరాహంతాసమావేశ పరిపూర్ణవిమర్శవాన్ ।**
**సర్వజ్ఞః సర్వగః సాక్షీ సర్వకర్తా మహేశ్వరః ॥** (సి.శి. 20–32)

దీని తాత్పర్యమేమనగా శివుడు సర్వహంతయనబడెడి యీ శక్తితో సమావేశమును బడసినవాడై సర్వజ్ఞుడును, అందరికీ సాక్షీభూతుడుగను, సర్వగమునునిగాను, సర్వ కర్తృత్వము గలవానిగాను అగుచున్నాడు.

స్వతఃగా శివునిలో నెట్టి గుణములుండవు. అతడు నిర్వికార నిరంజన రూపుడుగా నుండును. శక్తితో సమావేశము కాగానే శివునికి సర్వజ్ఞత్వాది గుణములబ్బునని గుర్తించవలెను.

పరాహంత యొక్క స్వరూపమును విశదము చేయుటకై శ్రీ భగవత్పాదులవారు క్రింది యుపదేశము నిచ్చిరి :

**విశ్వాధారమహాసంవిత్ప్రకాశపరిపూరితమ్ ।**
**పరాహన్తామయం ప్రాహుర్విమర్శం పరమాత్మనః ॥** (సి.శి. 20-33)

దీని తాత్పర్యమేమనగా విశ్వమున కాధారభూతమై మహాజ్ఞానమనెడి ప్రకాశము చేత పరిపూర్ణమైనదై యొప్పుశివుని విమర్శాశక్తి పరాహంతాయని పిలువబడుచున్నది.

శక్తితత్త్వము మొదలుకొని పృథ్వీతత్త్వవరకుగల తత్త్వములన్నీ మహంత మీద ఆధారపడియుండునని గ్రహించగలరు.

ఈ స్థలమున తమ యుపదేశమునకు ముగింపు నిచ్చుచు శ్రీ భగవత్పాదులవారు క్రింది యుపదేశము నిచ్చిరి :

**విమర్శాభాణ్డ విర్యస్తవిశ్వ తత్త్వవిజృంభణః ।**
**అనన్యముఖసమ్ప్రేక్షీ ముక్తః స్వాత్మని తిష్ఠతి ॥** (సి.శి. 20-34)

దీని తాత్పర్యమేమనగా శివయోగి తత్త్వము లన్నింటినీ యీ భాండమున లయము జేసి వేరే యే విచారమును తన మనస్సులోనికి తేనియ్యకుండగ తనలోనే తానుండి ముక్తుడగుచున్నాడు.

విశ్వము షట్త్రింషత్ తత్త్వాత్మక మైనదని వీరశైవ సిద్ధాంతమున చెప్పబడినది. ఈ తత్త్వములన్నింటికినీ భాండస్థలమే మూలాధారమని శ్రీభగవత్పాదులవారు తెలియజెప్పిరి. చరాచరలయ స్థలమునుండి యీ స్థలమున ప్రవేశించిన శివయోగి లయకర్తగా తత్త్వములన్నింటిని భాండస్థలమున లయము జేయుచున్నాడు. లింగాంగ సామరస్య సాధనలో నియ్యదొక ముఖ్యమైన దశయని గుర్తించగలరు. మీరీ తత్త్వమును గ్రహించి లింగాంగ సామరస్య సాధన నిమిత్తము కృషిని సల్పుదురు గావుత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జ్ఞానసింహాసనాధీశ్వరులు చంద్రశేఖర శివాచార్యులవారు శక్తితత్త్వమును గురించిన వివరములను బోధించిరి.

శక్తితత్త్వము షట్త్రింషత్ తత్త్వములకంటెను భిన్నమైనది కాదు. ఇది యీ తత్త్వములలోనిదై యుండియూ సదాశివాది తత్త్వములకు నుత్పత్తి స్థానమగుచున్నది. ఈ విషయమును శివయోగి శివాచార్యులవారు నీ క్రింది విధముగా వివరించి చెప్పిరి :

**సదాశివ ముఖాశేషతత్త్వ మౌక్తికశుక్తికాం ।**
**వందే మాహేశ్వరీం శక్తిం మహామాయాదిరూపిణీం ॥** (సి.శి. 2-2)

ముత్యములు నుద్భవించుటకై ముత్తెపు చిప్ప యెట్టి పాత్రను పోషించునో అట్టి పాత్రనే శక్తి పోషించి సదాశివాది తత్త్వముల జన్మకు కారకురాలగును. లయ సమయమున యీ తత్త్వములను శక్తి తన గర్భములో చేర్చికొనును. శివుడు మృదుడై సృష్టిని నిలుపునప్పుడును శక్తి యుపకరణముగా సహాయపడును. అందుచేత శక్తికి భాణ్డ స్థలమనెడి పేరివ్వనైనది.

ఏకాగిగా నిరాకార నిర్వికార నిరంజన నిశ్చల రూపియైన శివునిలో "నేనున్నాను" "నేను ప్రకాశించుచున్నాను" "నేను ఆనందించుచున్నాను" అనెడి తలంపులు వచ్చెను. వీటి యుమ్మడి స్వరూపమే యొక శక్తియని గ్రహించగలరు. విమర్శాశక్తి యనగా నిదియే ఇది శివుని కంటెను భిన్నమైనదగునే? ఈ శక్తి కారణమున శివునిలో కదలిక యేర్పడి ప్రకటుడై శక్తి విశిష్ట శివుడయ్యెను.

నివృత్తి క్రమములో విమర్శాశక్తి శివునిలో లీనమగును. శివుడు మునుపటి నిశ్చలస్థితిని పొందును. శక్తి శివుని లోనికి పూర్ణముగా విలీనము కాని స్థితిలోనే సాధకుడు శక్తిలోనికి ప్రవేశించును. విలయమొందిన సదాశివాది తత్త్వము చెంతన నిలిచి వాటిని తిలకించుచు ఆనందించుచుండును. చరాచరముల లయముచేయడముతో తానును భాగస్వామియని భావించికొనును.

"శుభం భూయాత్"

## ఆశీర్వచనము - 1 :

## భాజన స్థలము :

విశ్వము యొక్క సృష్టి స్థితి లయలకు నాధార భూతమైనది భాండ స్థలమని క్రిందటి యాశీర్వచనము నందున తెలియజెప్పబడినది. భాండ స్థలమున కాధారభూతమైనదేమిటి? యనెడి దొక ప్రశ్నగా నిలిచిపోవును. ఈ యంశమును శ్రీ భగవత్పాదులవారు యీ స్థలమున వివరించిరి:

లౌకిక వ్యవహారమునందున భాండము, భాజనములొకే యర్థమును సూచించెడివిగా కన్పట్టును. భాండమనినను పాత్రయే భాజనమనినను పాత్రయే. అయితే భాజనమనెడి పదమిచ్చట ఆధారమనెడి యర్థమును సూచించేదిగా నున్నది.

పృథ్వి మొదలుకొని శక్తి తత్త్వము వరకు తత్త్వములన్నింటికినీ భాండమాధారభూతమైనదై యుండగా, భాజనము భాండమున కాధారభూతమైనట్టి యంశమై యుండునని శ్రీ భగవత్పాదుల వారీ స్థలమున తెలియజెప్పిరి. శ్రీ జగద్గురు రేణుకాచార్యులవారి యుపదేశమును గనుడి :

**సమస్త జగదణ్డానాం సర్గస్థిత్యంత కారణమ్ ।**
**విమర్శో భాసతే యత్ర తద్ భాజనమిహోచ్యతే ॥** (సి.శి. 20-35)

దీని తాత్పర్యమేమనగా సమస్తమైన జగముల యండములు సృష్టింపబడుటకును, స్థితికిని మరియు లయమగుటకును కారణభూతమైన విమర్శనామకమైన పరబిందువు శివ సమేతమైన యే తిరోధానశక్తి యందున ప్రకాశించుచుండునో ఆ తిరోధాన శక్తియున్న పరశివ బ్రహ్మమే భాజనము. ఈ పరశివబ్రహ్మకు నాధారభూతమైన దేదియును లేదనెడిది గుర్తించవలెను. ఈ విషయము విశదీకరించుటకై శ్రీ భగవత్పాదుల వారు క్రింది యుపదేశము నిచ్చిరి :

**విమర్శాఖ్యా పరా శక్తిర్విశ్వవైచిత్ర్యకారిణీ ।**
**యస్మిన్ ప్రతిష్ఠితా బ్రహ్మ తదిదం విశ్వ భాజనమ్ ॥** (సి.శి. 20-36)

దీని తాత్పర్యమేమనగా చిత్ర విచిత్రమైనదిగా నుండెడి విశ్వము యొక్క యుత్పత్తికి కారణభూతమైన విమర్శ యనెడి పేరుగల శక్తి యెవ్వరితో నవినాభావ సంబంధముచేత ప్రతిష్ఠితమై యుండునో ఆ పరశివ బ్రహ్మమే విశ్వభాజనమనబడుచున్నది.

కనిపించెడి జగత్తులో చిత్రాతి చిత్రములు గలవు. వైవిధ్యత జగత్తు యొక్క విశిష్ట లక్షణమైయున్నది. ప్రకృతి జన్యమైన వస్తువులలోను, జీవులలోను భిన్నత్వము ప్రస్ఫుటముగా నుండును. ఏకరూపత గల్గినట్లుగా దోచెడి వాటిలోను ఏదో ఒక రకమైన భిన్నత్వమును గాంచగలము. వ్యక్తులలో కూడ భేదమును గాంచగలము. వేలిముద్రల నుదాహరణగా స్వీకరించవచ్చును. ఇట్టి విచిత్రములతో కూడికొనియుండి ఆశ్చర్యమును గల్గించెడి విశ్వమును ధరించియున్న చిచ్ఛక్తియే యీ చిత్రములను రచించునని శ్రీ భగవత్పాదులవారు వివరించిరి. అయితే యీ శక్తియు పరాధీనురాలై యుండుననియును, శివుని యధీనములో నుండుటయే యిట్టి పరాధీనత యొక్క లక్షణమని గుర్తించగలరు.

విశ్వ భాజనముగా గుర్తింపబడిన పరశివుని స్వరూపము గురించి శ్రీభగవత్పాదులవారు క్రింది విధముగా వివరించిరి:

**అంతఃకరణరూపేణ జగదఙ్కురరూపతః ।** (సి.శి. 37)

దీని భావమేమనగా విమర్శశక్తి జగత్తుయొక్క అంకురమైనట్టి మూలాహంకారము రూపములో యే స్థలమున ప్రకాశించుచున్నదో అట్టి విశ్వ భాజన స్థలమే పరబ్రహ్మ తత్త్వమని గుర్తించవలెను.

విచిత్రములతో కూడికొనియుండెడి విశ్వమును రచించిన చిచ్ఛక్తి శివుని యంతఃకరణమునందున మూలాహంకార రూపమునభాసించుచున్నది. ఈ మూలాహంకారమే జగత్తు యొక్క సృష్టికి యఙ్కుర రూపమున తన పాత్రను పోషించును. ఇచ్చట సూచింపబడిన తత్త్వము మహాలింగ తత్త్వమని చెప్పవచ్చును.

శివతత్త్వమునకు శక్తితత్త్వముతో గల సంబంధము నొక దృష్టాంతము ద్వారా యివ్వబడినది. క్రింది యుపదేశమును గమనించుడి :

**యథా చంద్రే స్థిరా జోత్స్నా**
**విశ్వవస్తు ప్రకాశినీ।**
**తథా శక్తి విమర్శాత్మ ప్రకా (శే) బ్రహ్మణి స్థితాః ॥** (సి.శి. 20-38)

దీని భావమేమనగా యే విధముగా చంద్రునితో స్థిరముగా నుండెడి చంద్రకాంతి సమస్త విశ్వమును ప్రకాశమానము చేయుచున్నదో అదేవిధముగా శివునితో అవినాభావ సంబంధము గల్గియున్న శక్తివలన విశ్వము చిత్ర విచిత్రములతో కూడికొని ప్రకాశమానమగుచున్నది.

జగత్తులోనుండెడి సంబంధములనేక రకములుగా నుండునని తెలియుచున్నది. న్యాయశాస్త్రములోన యీ వివరణలను గాంచవచ్చును. ఇట్టి యనేక విధమైనట్టి సంబంధములలో నవినాభావ సంబంధమొక్కటని గుర్తించగలరు. రెండు తత్త్వముల యందునొక దానిని విడిచి మరొక్కటుండని స్థితిలో నుండెడి సంబంధము నవినాభావ సంబంధమనియందురు. శివబ్రహ్మకు విమర్శశక్తికిని గల సంబంధమిట్టిదేయని తెలుపుట కొరకు శ్రీ భగవత్పాదులవారు చంద్ర చంద్రికా సంబంధమును దృష్టాంతముగా నిచ్చిరి .

'అహం' అనెడి పదములో శివశక్తులే విధముగా సూచింపబడిరో అనెడి దానిని శ్రీ భగవత్పాదులవారు క్రింది విధముగా నుపదేశించిరి :

**అకారః శివ ఆఖ్యాతోఽహంకారః శక్తిరుచ్యతే ।**
**శివశక్తిమయం బ్రహ్మ స్థితమేక మహంపదే ॥** (సి.శి. 20-39)

దీని తాత్పర్యమేమనగా అకారము శివవాచకమై యుండును. హంకారము శక్తివాచకముగా నుండును. అహం అనెడి పదములో శివ-శక్తుల స్వరూపమైన బ్రహ్మస్థితమై యున్నది.

వ్యంజనములగు క్, గ్, చ్ ఇత్యాదులకు ప్రాణములవంటివి స్వరములు. స్వరముల సహాయమున వ్యంజనములు సులభముగా నుచ్చరింపబడుచున్నవి. అట్టి స్వరములలో అకారము మొదటిదై యున్నది. 'అ' యనెడి యక్షరమే యక్షరుడైనట్టి పరబ్రహ్మకు సంకేతమని శ్రుతిస్మృతులు తెలుపుచున్నవి. 'అకారోవై సర్వావాక్' అనెడి ఉక్తి అకారము యొక్క విశిష్టతను తెలుపుచున్నది. అదే విధముగా హకారమున కొక ప్రత్యేకత గలదని తెలియుచున్నది. "హ కారోఽత్య కలారూపః" అనెడి ఆగమవాక్కు హకారము జ్ఞాన స్వరూపమని తెలుపుచున్నది.

వీరశైవము శక్తి విశిష్టాద్వైతము బోధించెడిదైనందున పరబ్రహ్మ శక్తితో కూడియుండునని గ్రహించవలెను. అందుచేత కేవల మకారము మాత్రమే బ్రహ్మవాచ్యము కాజాలదు. ఈ కారణముననే శ్రీ భగవత్పాదులవారు 'అహం' పదము పరబ్రహ్మ వాచ్యమని ప్రతిపాదించిరి. ఇచ్చట అహం అనెడి పదము వ్యష్టిరూపమున నుండెడిది కాదనియును, సమిష్టి రూపమున నుండెడిదని గ్రహించవలెను. విశ్వమంతయును తానేయని తెలిసికొనుటే సమిష్టి అహం యొక్క లక్షణమని గుర్తించవలెను.

శివోఽహం భావ పరిపుష్టిని పొందిన శివయోగి విశ్వాత్మస్థితిని బడయునని తెలుపబడినది. శ్రీ భగవత్పాదులవారి క్రింది యుపదేశమును గనుడి :

**అహన్తాం పరమాంప్రాప్య శివశక్తిమయీం స్థిరామ్ ।**
**బ్రహ్మభూయంగతో యోగీ విశ్వాత్మా ప్రతిభాసతే ॥** (సి.శి. 20-40)

దీని భావమేమనగా శివుని కభిన్నమైనదియును, ఉత్కృష్టమైనదియును, అయిన అహంతా రూపమైన చిత్కళను స్థిరమైన దానిగా తెలిసికొన దానిని స్వస్వరూపమున కభిన్నమైనదానిగా భావించిన శివయోగి విశ్వాత్మగా ప్రకాశించును.

భాజన స్థలములోని శివయోగి సమిష్టి అహంభావ సమన్వితుడై యుండుటచేత నతడు విశ్వాత్మస్థితికి యెదుగుచున్నాడని గ్రహించగలరు.

శ్రీ జగద్గురువులవారు తమ యుపదేశమును ముగింపు నీ క్రింది విధముగా నిచ్చిరి :

**వృక్షస్థం పత్ర పుష్పాది వటబీజస్థితం యథా ।**
**తథా హృదయ బీజస్థం విశ్వమేతత్ పరాత్మనః ॥** (సి.శి. 41)

దీని తాత్పర్యమేమనగా యే విధముగా వటవృక్షము యొక్క పత్ర పుష్పాదు వట బీజములో ప్రచ్ఛన్న రూపమున నుండునో అదేవిధముగా చరాచర ప్రపంచమంతయు భాజనస్థలపు స్థలములోని శివయోగి యొక్క హృదయమున యణగియుండును.

మఱ్ఱి వంటి పెద్దచెట్టు మఱ్ఱి విత్తనములో నిమిడియుండుననెడిది వాస్తవమేయైనను అయ్యది కంటికి కనిపించదు. భూమిలో నాటి, నీటిని పోసి, యెరువును వేసి, కలుపును తీసి, రక్షణనిచ్చిన యెడల బీజము మహావృక్షమగును. శివయోగి హృదయములో విశ్వమిమిడియుండెడిదియూ వాస్తవమని గ్రహించవలెను. ఇచ్చట సందేహించవలసిన పనిలేదని తెలుపుచు నీ యాశీర్వచనమునకు విరామమివ్వనైనది.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు శ్రీ చంద్రశేఖర శివాచార్యులవారు శివతత్త్వమే భాజన స్థలమని తెలుపుచు భాజనస్థలి యొక్క లక్షణములను వివరించిరి.

సాత్వికాహంకారములో శివ–శక్తుల సంయోగమును గాంచగలమనెడి భగవత్పాదులవారి బోధన యెంతో జ్ఞానదాయకమైనది. "అహం" జగదుత్పత్తికి కారణభూతమైన యంశము. "అహమస్మి" అనెడి భావన గలుగగనే నిశ్చల నిరంజన బ్రహ్మలో చలనమేర్పడి జగత్తు యొక్క రచనకు నాందీ ప్రస్తావన సంభవించినది. షట్ త్రింషట్ తత్త్వములలోని మొదటి తత్త్వము ప్రకటన యయ్యెను. అదియే శివతత్త్వము. నివృత్తి క్రమములో జగత్తుకు బీజమని యెంచదగిన విమర్శశక్తి శివునిలో కలిసిపోవును. అప్పుడు భాండ భాజనములొక్కటే యగును. శక్తి విశిష్ట శివస్థలమే భాజన స్థలమని తెలిసికొనవలెను. జ్యోత్స్న యేవిధిన చంద్రుని ప్రకాశమునకు కారణమగునో అదే విధిన శక్తి కారణమున శివుడు ప్రకాశించును. శివునిలో లీనమైయుండెడి భాజనస్థలి కూడా శివునివలె ప్రకాశించును.

ఐక్య స్థలమున సాధకుడు సమరస భక్తిని సలుపును. సమరస భక్తియే శివజీవ సామరస్యమునకు కారణమగును. యగ్గియ మాయిదేవుని అనుభవసూత్రము ప్రకారముగా తెలియునదేమనగా శక్తియే భక్తిగా పరిణమించి సాధకుని యౌన్నత్య సాధనకు దోహదకారియగును. అట్టి యీ స్థలమున శక్తిగా రూపాంతరము చెందును. సాధకుని ప్రకాశమునకు కారకురాలగును. ఒకే విధమైన వెలుతురులోని యంతర్భాగములైన శివ–జీవులలో నభేదము పొడచూపుననెడిది గ్రహించవలసిన విషయము.

శ్రీ పాల్కురికి సోమనాథులవారు భాజనస్థలములో నుండెడి సాధకుని గురించి యీ క్రింది విధముగా తెలియజెప్పిరి:

**నడచుచో ప్రాణేశునకు వాహనమునిల్చు**
**చో నీడ గూర్చుండుచోట గద్దె**
**పూజించుచో సజ్జభుజియించుచో బాత్ర**
**భజియించుచో శుద్ధభక్తిభాతి**
**మెలగెడిచో సంబువులు బవళించుచో**
**బాన్పు నిద్రించుచో బ్రాణపదము**

**తలచుచో చిత్తంబు పలుకుచో నాలుక**
**సత్క్రియా వ్యాప్తిచే జంత్ర బొమ్మ**

**అవికలేంద్రియానిభవసుఖవ్యాప్తిచే**
**లింగిదానయై యభంగలీల**
**సహజలింగ మథన సంతత సుఖ సుధా**
**శరధి మగ్నుడై ప్రసాదియుండు.**

ఈ పద్యములోని భుజియించుచో పాత్ర యనెడిది గమనించదగిన యంశమని గుర్తించగలరు. ఈ సందర్భమున "భాండ భాజనము" లొకటే యనెడి శ్రీ బసవేశ్వరులవారి వాక్కులు స్మరణీయములు.

"శుభం భూయాత్"

## ఆశీర్వచనము - 1 :

## అంగాలేప స్థలము :

భాజన స్థలములోని శివయోగి విశ్వాత్మ స్వరూపము దాల్చి అంగాలేప స్థలమున ప్రవేశమును పొందుచున్నాడు. ఈ స్థలము గురించి శ్రీరేణుకాచార్య భగవత్పాదుల వారు క్రింది విధముగా నుపదేశము నిచ్చిరి :

**దిక్కాలాద్యవచ్ఛిన్నం చిదానన్దమయం మహత్ ।**
**యస్య రూపమిదం ఖ్యాతం సోஉఙ్గాలేప ఇహోచ్యతే ॥** (సి.శి. 20-42)

దీని తాత్పర్యమేమనగా అపరిచ్ఛిన్నమూ, సచ్చిదానంద స్వరూపమూ అయిన పరశివ బ్రహ్మ స్వరూపమును పొందిన శివయోగి శరీరమునకు సంబంధించిన క్రియా కలాపముల నుండి యలిప్తుడై యుండుట చేత నతనిని "అంగాలేపుడ"ని పిలుతురు.

దేశకాలమాన యిత్యాది పరిచ్ఛేదములు విశ్వము యొక్క లక్షణములై యున్నవి. ఒక దేశమునుండి మరో దేశమున నుండకపోవుటను దేశపరిచ్ఛేదమని యందురు. అదే విధముగా నొక కాలముననుండి మరొక కాలమున నుండకపోవుట కాలపరిచ్ఛేదమని యందురు. జీవునికివి వర్తించును. కాని శివుడపరిచ్ఛిన్నుడై యుండును.

సచ్చిదానందము పరమాత్మ లక్షణమైయున్నది. ఇది అనిర్వచనీయైన ఆనందమయ స్థితి. జీవులకిది యలభ్యమైయుండును.

చరాచరములను భాండమునందున లయము జేసి భాజనుడై విశాత్మా స్వరూపమును దాల్చిన శివయోగికి అంగముతో సంబంధముండదు. సాధకుడీ స్థితిలో లింగమైయుండునని గ్రహించవలెను. లింగమునకు అంగ లక్షణములుండవు కదా. అందుచేత యీ స్థలమునందలి శివయోగి అంగాలేపుడనబడును. ఈ విషయమునొక దృష్టాంతము ద్వారా తెలుపుటకై పూజ్యపాదుల వారు క్రింది యుపదేశము నిచ్చిరి :

**సమస్త జగదాత్మాஉపి సంవిద్రూపో మహామతిః**
**లిప్యతే నైవ సంసారైర్యథా ధూమాదిభిర్నభః ॥**(సి.శి. 20-43)

దీని తాత్పర్యమేమనగా ఆకాశమే విధముగా పొగ యిత్యాదులచేత నంటబడక యుండునో అదే విధముగా అంగాలేప స్థలములోని శివయోగి సమస్త జగదాత్మగాను, చిద్రూపునిగను, మహాధీమంతుని గను అయియుండుటచేత సాంసారిక మాలినయములంటజాలని స్థితిలోఉండును.

ఆకాశములో పొగ, పొగమంచు, నీరు, నీటిమబ్బు లిత్యాదులెన్నియో గలవు. అది బహుళ విస్తారమైన స్థితిలో యుండుట చేత యీ మాలిన్యములు దాని నంటజాలవు. అంగాలేప స్థలి విశ్వాత్మయైయుండుట చేత నెంతో విస్తృతి గల్గియుండును. ధీశాలియై సంవిత్ స్వరూపమున

నుండెడివాడైనందున నితడు నిర్మలుడై యుండును. పృథివ్యాది శక్తితత్త్వము పర్యంతముగల తత్త్వముల కతీతుడై శివతత్త్వమున స్థిరుడై యుండెడి శివయోగిని సాంసారిక సంబంధమైన దోషములంటవని తెలిసికొనవలెను.

అంగాలేప స్థలములోని శివయోగికి విధి నిషేధాదులుండవని శ్రీ భగవత్పాదులవారు తెలియజెప్పిరి. ఉపదేశమును గనుడి :

**న విధిర్ న నిషేధశ్చ న వికల్పో న వాసనా ।**
**కేవలం చిత్స్వరూపస్య గలితప్రాకృతాత్మనః ॥** (సి.శి. 20-44)

దీని భావమేమనగా నీ స్థలములోని శివయోగికి నే విధములైనట్టి విధి నిషేధములు నుండవు. అంతేకాదు, అతని మనస్సునందున యేవిధమైన విషయ సంబంధము గల్గిన వికల్పముగాని వాసనగాని తలతోపదు. చిత్స్వరూపము నందున విలీనమైయుండుటచేత నతనిలో నేవిధమైన ప్రకృతి పరమైన విచారములు కనిపించవు.

శాస్త్రములలోను, వేదములలోను, ఆగమములలోను ధార్మికుడు చేయవలసిన, చేయకూడని యంశము నుటంకింపబడినవి. వీటినుల్లంఘించిన వాడు దోషము చేసినవాడగుచున్నాడు. అందుచే శాస్త్రోక్త నియమములు పాపభీతిగల వారిచేత పాటింపబడుచున్నవి. అంగాలేపస్థలి కీ నియమములు వర్తించవని గుర్తించవలెను. విహితమైన దానిని చేసినను, అవిహితమైన దానిని చేయకుండను నుండవలెనని చెప్పెడి శాస్త్రపరమైనట్టి నియమాల కితడు అతీతుడుగా నుండునని తెలిసికొనగలరు. విధి నిషేధాదులు లేని స్థితిలో సామాన్యుడు విషయలంపటుడయ్యెడి యవకాశము గలదు. కాని శివయోగికి విషయముల తలపే రాదు. విషయ వాసనలతని నంటజాలవని తెలిసికొనగలరు.

అంగాలేప స్థలమునందలి శివయోగి విశ్వాత్మగా నపరిచ్ఛిన్నుడై యుండునని తెలియుచున్నది. విశ్వాత్మ లక్షణమీ క్రింది విధముగా నుండునని శ్రీభగవత్పాదులవారిచే యుపదేశించనైనది :

**ఘటాదిషు పృథగ్భూతం యథాకాశం నభిద్యతే ।**
**తథోపాధిగతం బ్రహ్మ నానారూపం నభిద్యతే ॥** (సి.శి. 20-45)

దీని తాత్పర్యమేమనగా నుపాధి రూపములైనట్టి ఘటము లనేకములుగా నుండియున్ననూ వాటిలోని యాకాశమొకే రూపమున నుండును.

అంగాలేప స్థలమునందలి శివయోగి తాను ఉపాధిగతుడై యున్నను ఉపాధి భేదముతో సంబంధము లేకుండగ అపరిచ్ఛిన్న బ్రహ్మ స్వరూపమున నున్నానని భావించికొనును. శ్రీభగవత్పాదులవారు తమ యుపదేశమున కీ విధముగా ముగింపును చెప్పిరి :

**అనశ్వరమనిర్దేశ్యం యథా వ్యోమ ప్రకాశతే ।**
**తథా బ్రహ్మాపి చైతన్యమత్ర వైశేశికీ కలా ॥**
**న దేవత్వం న మనుష్యం న తిర్యక్త్వం న చాన్యథా ।**
**సర్వాకార త్వమాఖ్యాతం జీవన్ముక్తస్య యోగినః ॥** (సి.శి. 20 : 46-47)

దీని తాత్పర్యమేమనగా ఆకాశమే ప్రకారముగా ననశ్వరమూ, అనిర్దేశ్యమూ అయియుండునో అదే ప్రకారముగా బ్రహ్మచైతన్యము నాశరహితమై అవాఙ్మానసగోచరమై యుండును. దేవతిర్యగాదుల కంటెను బ్రహ్మతత్త్వము భిన్నమైనదై యుండును. అది సర్వరూపి అయియుండును. అంగాలేప స్థలియు బ్రహ్మతత్త్వము యొక్క అభిన్నాంగమై సర్వరూపుడగుచున్నాడు.

ఆకాశమనశ్వరమైనదనెడిది యందరికీ గల్గియుండెడి యభిప్రాయము. ఆకాశము పంచభూతములలో నొకటి. పంచభూతములు లయమగునటులే ఆకాశము కూడ లయమగును. అయితే యిచ్చట యివ్వబడినది చిదాకాశమని భావించుటలో నౌచిత్యముండును.

బ్రహ్మతత్త్వము శాశ్వతమైనదనియును, అపరిచ్ఛిన్నమైనదనియును, సర్వగతమై యుండెడిదనియును తెలుపబడినది. ఈ బ్రహ్మతత్త్వముతో నభిన్నుడై యుండెడి అంగాలేప స్థలములోని శివయోగికీ లక్షణములుండునని గ్రహించవలెను. ఈ విషయమును మీరు గ్రహించి లింగాంగ సామరస్యమును సాధించుటకై కృషి చేయుదురు గావుత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువుల శ్రీ చంద్రశేఖర శివాచార్యులవారు అంగాలేపన స్థితి గురించి తెలియజేసిరి. అంగము లింగముగా పరిణమించిన దశయే యీ దశయని తెలియజెప్పిరి.

సాంకేతికముగా నంగమనెడి పదమునకు జీవుడనెడి అర్థము నివ్వబడినది. ఈ విషయమును విశదీకరించెడి యీ శ్లోకమును గనుడి :

**అం భవేత్పరమం బ్రహ్మ తత్పరం తత్పరాయణమ్ ।**
**అంగస్థలమితి ప్రాహురంగతత్త్వ విశారదాః ॥** (అనుభవసూత్రము 4-3)

అంగుడు సంస్కారము పొందని దశలోన భవిగా నుండును. పాశుపతతత్త్వము భవిని పశువని పిలుచును. పశువే దేవ తిర్యఙ్మనుష్యాది రూపములను దాల్చి సంసారమురన చరించుచున్నాడని గ్రహించగలరు. మాయా ప్రభావము వైదొలగిన స్థితిలోన యీ భేదములన్నియూ సమసిపోవును. ఈ విషయమును తెలిపెడి క్రింది శ్లోకము గనుడి :

**దేవతిర్యఙ్మనుష్యాది వ్యవహారవికల్పనా ।**
**మాయాకృతా పరే తత్త్వే తల్లయే తత్క్షయో భవేత్ ॥** (సి.శి. 18-63)

అంగాలేప స్థలియైన సాధకుడు మాయకు నతీతుడైయుండుననెడిది గ్రహించవలసిన విషయము. శిష్టోదన స్థలములోనే మాయ చిల్లింగములో లయమగును. ఈ కారణముననే సాధకుడు తాను మనుష్యాదులను కాననెడి తలంపును పొందును. ఈ విషయమునందున మన యవగాహనను పెంచికొనుటకై శ్రీ బసవేశ్వరులవారి క్రింది వచనము లాభదాయకము కాగలదు.

**స్వయలింగదనుభావ తనగె దొరెకొండ బళిక**

**దేవలోకవెంబుదేనో? మర్త్యలోకవెంబెదేనో?**
**అవుదరల్లియూ భేదవేనయ్యా**
**కూడల సంగమ దేవా బళిక ఆలస్య వుంటె?** (వ.సం. 946)

ఈ వచనము యొక్క తెలుగు రూపమును గనుడి :

**స్వయలింగములోని**
**యనుభావము తనకు దొరకొనిన పిదప**
**దేవలోక మనెడిదేమో?**
**మర్త్యలోకమనెడిదేమో?**
**దేనియందైననూ భేదమేమయ్యా!**
**కూడల సంగమదేవా, పిదప నాలస్యముండునే?**

సృష్ట్యారంభమున లింగ అంగములుగా విభజితమైన శివపరబ్రహ్మ నివృత్తి దశలోన నేకీకరణ బొందును. ఇది యే అంగాలేప దశయని గ్రహించగలరు.

"శుభం భూయాత్"

## ఆశీర్వచనము -1 :

## స్వపరాజ్ఞ స్థలము :

అంగాలేప స్థలములోని శివయోగి అపరిచ్ఛిన్నమైన బ్రహ్మ స్వరూపమున వెలుగొందుచుండునని యింతక్రితపు టాశీర్వచనమున తెలుపబడినది. అతడు స్వ-పరభేదభావము లేనివాడై స్వపరాజ్ఞ స్థలియగుచున్నాడు. లింగస్థలమైనట్టి యైక్యస్థలములోని అంగాలేప స్థలమునకు పిదప వచ్చెడి స్థలమే స్వపరాజ్ఞ స్థలము.

శ్రీ జగద్గురు రేణుకాచార్యుల వారు నీ స్థలము గురించి యగస్త్య మహర్షి కీ క్రింది యుపదేశము నిచ్చిరి :

**అప్రమేయే చిదాకారే బ్రహ్మణ్యద్వైతవైభవే ।**
**విలీనః కిం ను జానాతి స్వాత్మానం పరమేవ వా ॥** (సి.శి. 20-48)

దీని భావమేమనగా నూహించుటకైనను శక్యము కానిదియును, చిదాకారముగా నుండెడిదియును, అద్వితీయమైనదియును అయినట్టి బ్రహ్మతత్త్వములో సంపూర్ణముగా విలీనమైపోయిన లింగాలేప స్థలపు శివయోగి యిది నేను యిది నాకంటెనుపరమైన దనెడి భావము పొందనివాడై స్వపరాజ్ఞస్థలియగుచున్నాడు.

స్వ-పర విచక్షణ అహంకార మమకారములుండెడి దశలో గల్గెడి యనుభవము. స్వజాతీయ విజాతీయ భేదములను పరికించెడి జీవుడు సుఖదుఃఖములకు లోనగును. సంసారమనెడి వలలో జిక్కినవానికే యీ భేదము లుండునేగాని, సంసారము నుండి అలిప్తుడైన వానికీ భేదములుండవు. వ్యష్ట్యహంకారమును వీడి తానే శివుడననెడి భావములోనుండెడి శివయోగి కిట్టి భేదములు కన్పట్టవు. అంగాలేప స్థలమును వీడి స్వపరాజ్ఞ స్థలమున ప్రవేశించిన శివయోగికీ భేదభావము గల్గదని గుర్తించగలరు.

ఈ స్థలము గురించి మరింత వివరముగా తెలుపుటకై శ్రీ భగవత్పాదులవారు క్రింది యుపదేశము నిచ్చిరి :

**యత్రనాస్తి భిదాయోగాదహం త్వమితి విభ్రమః ।**
**న సంయోగో వియోగశ్చ న జ్ఞేయజ్ఞాతృకల్పనా ॥** (20-49)
**న బన్ధో న చముక్తిశ్చ న దేవాద్యభిమానితా ।**
**నసుఖం నైవ దుఃఖం చ నాజ్ఞానం జ్ఞానమేవ వా ॥** (20-50)
**నోత్కృష్టత్వం న హీనత్వం నోపరిష్టాన్న చాప్యధః ।**
**న పశ్చాన్నైవ పురతో న దూరేణ కించిదంతర్ ॥** (20-51)
**సర్వాకారే చిదానన్దే సత్యరూపిణి శాశ్వతే ।**
**పరాకాశమయే తస్మిన్ పరే బ్రహ్మణి నిర్మలే ॥** (20-52)
**ఏకీభావముపేతానాం యోగినాం పరమాత్మనాం ।**
**పరాపరం పరిజ్ఞాన పరిహాసకథా కుతః ॥** (సి.శి. 20-53)

దీని తాత్పర్యమేమనగా నే స్థితియందు భేద సంబంధమైనట్టి నేను నీవనెడి విభ్రమ ముండదో, అటులనే సంయోగ వియోగములు, జ్ఞాతృజ్ఞేయముల పరికల్పనలు, బంధమోక్షములు, దేవాదేవాద్యభిమానములు, సుఖ-దుఃఖములు, జ్ఞానాజ్ఞానములు, ఎక్కువ-తక్కువలు, మేలు-కీడులు, ముందు-వెనుకలు, దగ్గర-దూరములు నుండవో, ఎచ్చట సర్వాత్మకము, చిదానంద స్వరూపము, శాశ్వతమైనదియును, నిర్మలము, చిదాకాశరూపమున నున్నదియును అయిన పరశివ బ్రహ్మలో స్వపరాజ్ఞస్థలి సమరసమొందునో అచ్చట శివయోగికి స్వపరజ్ఞానమెట్టుల యేర్పడును?

జీవ-బ్రహ్మలు భిన్నముగా నుండెడి దశలో భేదములు పొడచూపును. ఈ భేదములన్నియును భ్రమవలన దోచెడి భేదములే. రెండు వస్తువులు అసమత్వస్థితిలో నున్నప్పుడీ భేదములు కన్పట్టును. చిన్న-పెద్ద, దూరము-దగ్గర, ఉచ్చము-నీచము మొదలగునవి అసమత్వ స్థితికి సంకేతాలు. భేదములను తగ్గించుటకు చేసే ప్రయత్నములలో సంయోగ వియోగాదులు, బంధ-మోక్షములు, సుఖ-దుఃఖములనెడివి సంప్రాప్తమగును.

అసమత్వము సమసిపోయి సమత్వమేర్పడినప్పుడు భేదము లుండవు. జీవ-బ్రహ్మలేకమై జీవుడే బ్రహ్మమైనప్పుడు అభేద స్థితిగల్గును. అట్టి యద్వైతానుభవద్యుతిలో భేదములు కనిపించుటకు కారణభూతమైన భ్రమకు నాస్కారముండదు. అందుచేత అభేదమే ద్యోతకమగును. అభేదస్థితిలో భేదస్థితిలో కన్పట్టెడి స్వపరభేదములు కనిపించవు కదా!

శ్రీ భగవత్పాదులవారు స్వపరాజ్ఞ స్థలమును గురించిన తమ యుపదేశమును ముగింపు నీ క్రింది విధముగా నిచ్చిరి :

**దేశకాలోనవ చ్ఛిన్నతేజోరూపసమాశ్రయాత్ ।**
**స్వపరాజ్ఞినవిరహాత్ స్వపరాజ్ఞ స్థలం విదుః ॥** (సి.శి. 20-54)

దీని తాత్పర్యమేమనగా దేశ కాలములచేత ఖండితము కాకుండగుండెడిదియును, స్వయంజ్యోతి స్వరూపమైనదియును అయిన పరశివతత్త్వమున మిళితమైపోవుటచేత యతని స్వపరజ్ఞానాభావమేర్పడును. ఈ స్థితిలో నుండెడి శివయోగిని బుధులు స్వపరాజ్ఞుడని యందురు.

దేశకాలాదుల వలన పరిచ్ఛిన్నమైయుండెడి వస్తువుల యెడల మమత్వ భావమేర్పడుట వలననే స్వపరజ్ఞానము గల్గుచున్నది. ఈ జగత్తే శివుడు, ఆ శివుడిని నేనే యని భావించెడి స్థితిలో స్వ-పర భావములుండవని తెలుపుచు నీ ఆశీర్వచనములనకు విరామమివ్వనైనది.

ఓం శాంతిః శాంతిః శాంతి

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువులు శ్రీ చంద్రశేఖర శివాచార్యులవారు స్వ-పర భేదమెరుగని స్థితిలో నుండెడి సాధకుని స్థితి గురించి తెలియజెప్పిరి.

మమత్వభావన వలన స్వ-పర భేదముత్పన్నమగుచున్నది. అవిద్యవలన అస్మదీయులు తస్మదీయులనెడి భేదభావము పుట్టుచున్నది. ఇట్టి భేదబుద్ధి అహంకార-మమకారములకు పుట్టినిల్లగుచున్నది. ఈ విధముగా మమకార-భేదభావనల కవినాభావ సంబంధము గలదు. మమకారమును వీడకుండిన యెడల భేదభావము నశించదు. ఈ విషయమును తెలిపెడి క్రింది వచనమును గనుడి :

**భక్త నాయిత్తె భక్తి దాసోహ**
**యుక్తనాయిత్తెయుక్తి దాసోహ**
**ఐక్య నాయిత్తె మమకారదాసోహ**
**సర్వదలె దాసోహవెబేకు**
**ఈ దాసోహవ అనువ**
**కూడల సంగయ్య తానెబల్ల** (శ్రీ బసవేశ్వరుల వారి వచ.సం. 935)

దీని తెలుగు రూపమును గనుడి :

*భక్తుడనైతిని భక్తిదాసోహము*
*యుక్తుడనైతిని యుక్తి దాసోహము*
*ఐక్యుడనైతిని మమకారము దాసోహము*
*అంతటనూ దాసోహమే వలయు*
*ఈ దాసోహము యొక్క అనువును*
*కూడల సంగయ్య తానే యెరుగు*

ఐక్య స్థలములోని నవిద్యకు నాస్కారముండదు. అయితే సాత్వికాహంకారము నుండెడి యవకాశము గలదు. ఇందులో నుండి యుద్భవించెడి మమకారము త్యాజ్యమని తెలిసికొనగలరు. మమకారమును వీడినవానికి "ఇది నాది, ఇది నీది, ఇది అతని" దనెడి తలంపులుండునే? ఈ విషయమును నొక కవి యీ విధముగా వివరించిరి :

**నీది నాదనే భావంబు నిలిచియాడ**
**వీడు వాడనే తలపులు వెల్లివిరియు**
**వెతలె తప్పవు భవమున యెరుగుమోయి!**
**విడిచివేయు స్వపరమను భేదబుద్ధి** (మార్గం పెదవీరప్ప - అముద్రితము)

"శుభం భూయాత్"

## ఆశీర్వచనము - 1 :
## భావాభావలయ స్థలము :

స్వపరాజ్ఞ స్థలములోని సాధకుడు తన సాధనకు పూర్ణత్వము సిద్ధించిన యనంతరము భావాభావ స్థలమున ప్రవేశించును. ఈ స్థలమును గురించి శ్రీ రేణుకాచార్యులవారు క్రింది యుపదేశము నిచ్చిరి.

**త్వన్తాఽహన్తావినిర్ముక్తే శూన్యకల్పే చిదమ్బరే ।**
**ఏకీభూతస్య సిద్ధస్య భావాభావ కథా కుతః ॥** (సి.శి. 20-55)

దీని భావమేమనగా పరిచ్ఛిన్నములైనట్టి నీవు, నేను అనెడి భావములు లేకుండా శూన్య సదృశమైన పరశివ బ్రహ్మతో సమరసునిగా నుండెడి సిద్ధ శివయోగికి భావాభావము లుండవు.

భావాభావములనగా నేమి? యనెడి సందేహము గల్గెడి యవకాశము గలదు. తన్నివృత్తికై శ్రీ భగవత్పాదులవారు క్రింది యుపదేశము నిచ్చిరి :

**అహంభావస్య శూన్యత్వాదభావస్య తథాత్మనః ।**
**భావాభావ వినిర్ముక్తో జీవన్ముక్తః ప్రకాశతే ॥** (సి.శి. 20-56)

దీని తాత్పర్యమేమనగా అహంభావముతో శరీరమే తానని భావించుటయు, ఆత్మలేదని భావించుటయు భావాభావము లనబడుచున్నవి. ఈ రెంటిని వీడినవాడై శివయోగి జీవన్ముక్తుడై ప్రకాశించును.

భావమనెడి దొక మనోవృత్తి. ఆత్మానాత్మ వివేకశూన్యులకు శరీరమే తాననెడి భావము దోచును. ఇట్టి అహంభావము భావమనబడునని గుర్తించగలరు. "ఆత్మయనెడిది లేదు" అనెడి శూన్యత్వ వాదము మనోవృత్తిగా నుండిన స్థితినాభావ స్థితియని యనబడును. భావాభావ స్థలములో నుండెడి శివయోగి యీ రెంటికినీ అతీతుడై, వ్యష్టి అహంభావము లేనివాడై, విశ్వాత్మ స్వరూపుడై జీవన్ముక్తుడుగా నుండునని గ్రహించగలరు.

సుఖదుఃఖములును నొక విధమైన మనోవృత్తులే. భావాభావలయ స్థలమున నుండెడి శివయోగికి సుఖదుఃఖముల భావముగాని, వాటి ఆ భావముగాని గల్గునా అనెడి సందేహము కలుగవచ్చును. అట్టి సందేహము గలుగకుండుటకై శ్రీ భగవత్పాదులవారు క్రింది యుపదేశము నిచ్చిరి :

**సుఖదుఃఖాది బావేషు నా భావో భావఏవవా ।**
**విద్యతే చిత్స్వరూపస్య నిర్లోపస్య మహాత్మనః ॥** (సి.శి. 20-57)

దీని తాత్పర్యమేమనగా చిత్ స్వరూపునిగా నుండెడివాడును, అంగాలేప లక్షణ సమన్వితుడైనందున నిర్లిప్తుడుగా నున్నవాడును, సమున్నతమైన స్థితిలో నున్నవాడును, అయిన భావాభావ స్థలములోని శివయోగికి సుఖము గలదనెడి భావముగాని, సుఖము లేదనెడి ఆభావానుభవముగాని గలుగదు. ఇటులనే దుఃఖము గురించిన మనోవృత్తులేవియును నేర్పడవు. సచ్చిదానంద స్వరూపమున లీనమై యుండెడి వానికి లౌకిక పరమైన సుఖ-దుఃఖముల యనుభవము కలుగదని తెలిసికొనవలెను. దుఃఖసుఖముల వంటి యనేక విధములగు భేదభావముల కతీతుడై యుండెడి వాడైనందున శివయోగి మహాత్ముడుగా గుర్తింపబడుచున్నాడని గ్రహించగలరు.

ఈ స్థలములోని శివయోగికి సదసద్భావాభావములును ఉండవని తెలిపెడి యుపదేశమును శ్రీ భగవత్పాదులవారు క్రింది విధముగా ప్రదానము చేసిరి :

**యస్మిన్ జ్యోతిషి చిద్రూపే దృశ్యతే నైవ కించన ।**
**సద్రూపం వాప్య సద్రూపం భావాభావం విముఞ్చతః ॥** (సి.శి. 20-58)

దీని తాత్పర్యమేమనగా భావాభావములు లేనివాడును, చిత్స్వరూపమున నున్నవాడును, తేజోమయుడును అయిన శివయోగికి సద్రూపముగాని అసద్రూపముగాని కన్పట్టుల యుండదు.

సదసద్వివేకమెంతో ముఖ్యమైన యంశము. లౌకిక వ్యవహారములలో మునిగి తేలెడి వాడైన సామాన్యునికీ వివేకముండదు. అసత్తులో సత్తును, సత్తులో నసత్తును చూచెడి స్థితి సామాన్యునిదైతే, పండితుడు నీ రెంటిని విడదీసి గుర్తించి యిది సత్తు, యిది అసత్తని చెప్పెడి స్థితిలో నుండును. సాధకుడు గురుకారుణ్యమును పొందవలెననిన సాధకునికి పిండదశలో సదసద్వివేకముండవలెనని యెరుగగలరు. అయితే సాధన పూర్తియైన దశలో ద్వంద్వములను చూచెడి స్థితిలో సాధకుడుండడు. అతనికి సర్వత్ర ఏకత్వమే గోచరించును. అందుచేత నతడు సదసద్భావముల వీడియుండునని గ్రహించగలరు.

శ్రీ భగవత్పాదులవారు భావాభావలయ స్థలము గురించిన యుపదేశమునకీ క్రింది విధముగా ముగింపునిచ్చిరి :

**ప్రతీయమానౌ విద్యేతే భావాభావౌ న కుత్రచిత్ ।**
**లిఙ్గైక్యే సతి యత్తస్మాద్ భావాభావలయస్థలమ్ ॥** (సి.శి. 20-59)

దీని తాత్పర్యమేమనగా లింగైక్యస్థితికి చేరిన శివయోగికి యెప్పుడైనను యెచ్చటైనను భావాభావముల స్ఫురణ కలుగదు. ఈ కారణముననే యీ స్థలము భావాభావలయ స్థలమనబడుచున్నది.

శివయోగి చిద్రూపమైన జ్యోతి స్వరూపమున లీనమైయుండుటచేత నతనికా చిజ్జ్యోతిని మినహాయించితే మరేదియును కనిపించదని తెలిసికొనగలరు.

సదసద్వివేక సంపన్నులైన మీరెల్లరు సదసద్భావ రాహిత్యస్థితికి చేరిన శివయోగి పథమున పయనించి ధన్యులుదురుగాక యని ఆశీర్వదించుచు నీ ఆశీర్వచనమునకు విరామము నివ్వనైనది.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## విశేషప్రదీపిక :

స్వ-పర భేదబుద్ధి నశించిన పిదప సాధకుడు భావాభావములను వీడియుండెడి స్థితి గురించి శ్రీకాశీ జగద్గురువుల వారు నెంతో విపులముగా వివరించి చెప్పిరి.

నేను బ్రహ్మమునై యున్నాననెడి తలపు గల్గియుండుటే భావము. ఈ భావము సాధకుని సాధనా క్రమమును ముఖ్యమైన పాత్రను పోషించును. అయితే సిద్ధిస్థితిలోన యీ భావమును వీడకుండిన యెడల సాధన పరిపూర్ణము కాజాలదు. నేను బ్రహ్మననెడి భావములో నేననేది లుప్తము కానంతవరకూ సిద్ధి చేకూరదు. స్వపరాజ్ఞ స్థల సంపన్నుడు నీ స్థలమును భావాభావమును పొందును. దీనినే భావాభావ లయ స్థలమని యందురు. శిఖి కర్పూర న్యాయములో జీవత్వము నిశ్శేషముగా లుప్తమగునని గ్రహించగలరు.

పాల్కురికి సోమనాథుడీ యంశమును గురించి తెలుపుచు "తాననంగలేని తత్త్వంబు లింగైక్య"మని తెలియజెప్పిరి. (అనుభవసారము, ప॥ 238)

"తాననంగలేని" స్థితియనగా మరణమని భావించవలదు. లింగైక్యతాసిద్ధి యనెడిది జీవన్ముక్తికి సంబంధించిన దశయని గ్రహించగలరు.

"శుభం భూయాత్"

## ఆశీర్వచనము - 1 :
## జ్ఞానశూన్య స్థలము :

లింగ స్థలములలో చివరిదైన ఐక్య స్థలపు చివరి స్థలమే జ్ఞానశూన్య స్థలము.

జ్ఞానశూన్యత అజ్ఞానుల లక్షణమని భావించెడిది సామాన్యమైన యవగాహన. ఈ భావన లౌకికపరముగా గ్రాహ్యమైనదైనను, తాత్త్వికముగా చూచిన యెడల విభిన్నమైన యర్థములు స్ఫురించగలవు. జ్ఞాన శూన్యమనెడి పదమునకొక విశేషార్థము గలదనెడిది గ్రాహ్యమైన యంశము. శ్రీ జగద్గురు రేణుకాచార్యులవారు జ్ఞాన శూన్యస్థలము గురించి క్రింది విధముగా నుపదేశించిరి :

**పరాసర సమాపేక్షభావాభావ వివేచనమ్ ।**
**జ్ఞానం బ్రహ్మణి తన్నాస్తి జ్ఞానశూన్యస్థలం విదుః ॥** (సి.శి. 20-60)

దీని తాత్పర్యమేమనగా స్వపరాజ్ఞుడై యుండెడి వాడును, భావాభావ లయానుభవ సంపన్నుడును అయిన శివయోగి తానే బ్రహ్మమైయుండును. ఇట్టి స్థితిలో జ్ఞానాజ్ఞాన భేదజ్ఞానము శూన్యమైయుండును. అందుచేత నీ స్థలము జ్ఞానశూన్య స్థలమనబడుచున్నది.

జ్ఞానశూన్య స్థలములోని శివయోగి యే విధముగా దోచుననెడి దానిని శ్రీ భగవత్పాదులవారు క్రింది విధముగా వివరించిరి :

**జలే జలమివ న్యస్తం వహ్నౌ వహ్నిరివార్పితమ్ ।**
**పరే బ్రహ్మణి లీనాత్మా విభాగేన న దృశ్యతే ॥**(సి.శి. 20-61)

దీని తాత్పర్యమేమనగా నీటిలో పోయబడిన నీళ్ళు, నిప్పులో వేయబడిన నిప్పు వలె పరబ్రహ్మములో లీనమైయుండెడి జ్ఞానశూన్య స్థలములోని శివయోగి విభజితుడై కనిపించడు. పరబ్రహ్మ యొక్క అభిన్నాంగమగుననెడిది భావము.

పదార్థములు కలుపబడినప్పుడు కొన్ని పూర్తిగా కలిసిపోయి భేదజ్ఞానము కన్పట్టదు. నీటిలో నీళ్ళు, నిప్పులో నిప్పుసంపూర్ణముగా కలిసిపోవును. జీవేశ్వరుల కలయిక పరిపూర్ణమైనదనియును, అచ్చట భేదజ్ఞానము పొడచూపుట కాస్కారము లేదనెడిది గ్రహించవలసిన విషయము.

శ్రీ భగవత్పాదులవారు నీ యంశమును స్పష్టము చేయుటకై క్రింది యుపదేశము నిచ్చిరి :

**సర్వాత్మని పరేతత్త్వే భేద శంకావివర్జితే ।**
**జ్ఞాత్రాది వ్యవహారోత్థం కుతో జ్ఞానం విభావ్యతే ॥** (సి.శి. 20-62)

దీని భావమేమనగా సర్వాత్మకమైనదియును, పరతత్త్వమైన దానిలోను, భేదపరమైన శంకకు నాస్కారము లేనిదానిలోను, జ్ఞాతృత్వాదులుండవు. అట్టి యెడ జ్ఞానమనెడి దానికవకాశమెక్కడిది.

జ్ఞాతృవు, జ్ఞేయముండియున్న స్థితిలోనే జ్ఞానమనెడి దుండును. జ్ఞాతృవు తెలిసికొనగోరువాడు కాగా జ్ఞేయము తెలిసికొనదగినది. సర్వ వ్యాపకత్వము గల పరతత్త్వము నందున లీనమై, ఆ పరతత్త్వము లోనొక యభిన్నాంగముగా నుండెడి శివయోగికి జాతృవు వ్యవహారములతో పనిలేదు.

శ్రీ జగద్గురు రేణుకాచార్యులవారు జ్ఞానశూన్య స్థలమునకు సంబంధించి మరికొన్ని యంశముల నీ క్రింది యుపదేశమునందున యిచ్చిరి :

**నిర్వికారం నిరాకారం నిత్యం సీమావివర్జితమ్ ।**
**వ్యోమవత్ పరమం బ్రహ్మం నిర్వికల్పతయా స్థితమ్ ॥**
**న పృథివ్యాదీని భూతాని నగ్రహో నైవ తారకాః ।**
**న దేవాః న మనుష్యాశ్చ న తిర్యంచో న చాపరే ॥**
**తస్మిన్ కేవల చిన్మాత్ర సత్తానందైక లక్షణే ।**
**త్వం తాఽహంతాది సంరూఢం విజ్ఞానం కేన భావ్యతే ॥** (సి.శి. 20 : 63-65)

దీని తాత్పర్యమేమనగా పరశివ బ్రహ్మ మెట్టి వికారములకు లోనుగాదు. ఆకార రాహిత్యము గల్గియుండును. అది నిత్యమైనది. యెల్లలు లేనిది. అందులో పంచభూతములు గాని, గ్రహనక్షత్రాదులుగాని, దేవాది జీవులుగాని యుండవు. కేవలము సచ్చిదానందమయముగా నుండెడి శివ పరబ్రహ్మలో నహం త్వం యనెడి భావము లుండవు. ఇది శివుడొక్కడే యేకాకియై నిర్వికారుడై యుండెడి నిర్గుణ దశయని గుర్తించగలరు.

ఇట్టి స్థితి త్రిపుటమయమైన ప్రపంచ జ్ఞానముండదని శ్రీ భగవత్పాదులవారు తెలియజేసిరి.

**జ్ఞేయాభావాద్విశేషేణ శూన్యకల్పం విభావ్యతే ।**
**జ్ఞాతృజ్ఞేయాదిభిః శూన్యం శూన్యం జ్ఞానాదిభిర్గుణైః ॥**
**ఆదావన్తేచ మధ్యేచ శూన్యం సర్వత్ర సర్వదా ।**
**ద్వితీయేన పదార్థేన శూన్యం శూన్యం విభావ్యతే ॥** (సి.శి. 20 : 66-67)

దీని తాత్పర్యమేమనగా జ్ఞేయముండిననే జ్ఞానపు వ్యవహారముండును. ఇది జ్ఞేయములేని స్థితి. అందుచేత శూన్యమే గోచరించును. జ్ఞేయాదులుగాని, ఇచ్ఛాదులుగాని, ఆది మధ్యంతములుగాని లేని యీ స్థితిలోనన్ని చోట్ల శూన్యమే యుండును. యెల్లప్పుడూ శూన్యమే యుండును. ఈ స్థితిలో జ్ఞానమెట్లు సంభవించునని శ్రీ భగవత్పాదులవారీ క్రింది విధముగా ప్రశ్నించిరి :

**కేవలం సచ్చిదానంద ప్రకాశాద్వయ లక్షణమ్ ।**
**శూన్య కల్పం పరాకాశం పరబ్రహ్మ ప్రకాశతే ॥** (20-68)
**శూన్య జ్ఞానాది సంకల్పే శూన్య సర్వార్థ సాధనే ।**
**జ్యోతిర్లింగే చిదాకారే స్వప్రకాశే నిరుత్తరే ॥** (సి.శి. 20 : 68-69)
**ఏకీభావముపేవస్య కదం జ్ఞానస్యసంభవః**

దీని తాత్పర్యమేమనగా పరశివ బ్రహ్మము పరాకాశస్వరూపమై కేవలము శూన్యముగానే ప్రకాశించును. దీనిలో తాదాత్మ్యము పొందిన జీవన్ముక్తుని యందు వికల్ప జ్ఞానముదయించదు. శూన్యమైన యిచ్ఛా జ్ఞాన సంకల్పములు, సకల పురుషార్థ సాధనములు శూన్యము కాగా, తనకు తానేయుండి, జ్ఞాన ప్రకాశములో లీనమైయుండెడి శివయోగికి జ్ఞానము గురించిన యనుభవము కలుగదు.

ఇచ్చట తెలుపబడినట్టి శూన్యము బౌద్ధులు ప్రతిపాదించే శూన్యము కంటెను భిన్నమైనదని తెలిసికొనవలెను. శ్రీ భగవత్పాదులవారు తమ యుపదేశము నీ క్రింది విధముగా ముగించిరి :

**యస్య కార్యదశా నాస్తి కారణత్వమథాపి వా ।**
**శేషత్వం నైవ శేషిత్వం స ముక్తః పర ఉచ్యతే ॥** (సి.శి. 20 : 70)

దీని తాత్పర్యమేమనగా యెవ్వనికి కార్య కారణముల వివక్షతగాని, శేష-శేషి భావములుగాని యుండవో, అతడు ముక్తుడనబడును. అతడే పరాత్పరుడు.

ఈ స్థితిలో చేయవలసిన పని లుప్తమగుటచేత కార్య కారణ, శేషాదుల ప్రసక్తి యుండదని తెలుపబడినది. సామాన్యుడిట్టి భావములను పొందుట దుస్సాధ్యమైన విషయము. నిరంతరము నశేషమైన రీతిలో విశేషమైన సుఖమును పొందగోరి, కార్య-కారణ స్వభావముల నెరిగి సాధన సంపత్తిని పొందియు సంపూర్ణమైన సుఖానుభవమును పొందెడి విషయములో విఫలుడయ్యెడి సామాన్యుడెక్కడ నిత్యతృప్తుడై యుండెడి జీవన్ముక్తుడెక్కడ. ఇట్టి లింగాంగ సామరస్యమును పొందినవాడే పరాత్పరుడని తెలిసికొనగలరు.

ఈ విధముగా శ్రీ భగవత్పాదులవారు నగస్త్యునకు నేకోత్తర శత స్థలముల నుపదేశించిన యనంతరము జరిగిన విషయములను శ్రీ శివయోగి శివాచార్యులవారు వివరించిరి.

**ఏతావదుక్త్వా పరమప్రబోధమద్వైతమానన్ద శివప్రకాశమ్ ।**
**దేవ్యై పురా భాషితమీశ్వరేణ**
**తూష్ణీమభూద్ ధ్యానపరో గణేన్ద్రః**
**ఏవముక్త్వా సమాసీనం శివయోగ పరాయణమ్**
**రేణుకం తం సమాలోక్య బభాషే ప్రాజ్ఞలిర్మునిః ॥** (సి.శి. 20 : 71-72)

శివాచార్యులవారు ప్రతిపాదించిన దాని తాత్పర్యమేమనగా పూర్వకాలమున పరమేశ్వరుడు పార్వతికి రహస్యముగా నుపదేశించినట్టి శివానంద ప్రకాశమును, స్వస్వరూపపు సాధకమును, శివాద్వైత స్వరూపమును అయిన పిండస్థలాది జ్ఞాన శూన్య స్థలము వరకు గల వీరశైవ శాస్త్రమును శ్రీమద్రేణుకాచార్యులవారు మహర్షియైన అగస్త్యునికి యింతవరకు చెప్పిన విధముగా నుపదేశించిన పిదప స్వస్వరూప ధ్యానాసక్తుడై మౌనముద్రలో కూర్చొనియుండెను.

అగస్త్యుడతనిని గని, యంజలి బద్ధుడై క్రింది విధముగా కొనియాడిరి :

**శివయోగ విశేషజ్ఞ శివజ్ఞాన మహోదధే ।**
**సమస్త వేదాశాస్త్రాది వ్యవహార దురంధర ॥** (సి.శి. 20-73)
**ఆలోకమాత్ర నిర్ధూత సర్వసంసార బంధన ।**
**స్వచ్ఛంద చరితోల్లాస స్వప్రకాశాత్మవచ్ఛివ** (74)
**అవతీర్ణమిదం శాస్త్రమనవద్యం త్వదాననాత్ ।**
**శ్రుత్వా మే మోదతే చిత్తం జ్యోతిః పశ్య చ్ఛివాభిదమ్ ॥** (75)
**అద్య మే సఫలం జన్మ గతో మే చిత్తవిభ్రమః ।**
**సఞ్జాతా పాశవిచ్ఛిత్తి స్తపాంసి ఫలితానిమే ॥** (76)
**ఇదానీమేవ మే జాతం మునిరాజోత్తమోత్తమమ్ ।**
**ఇతః పరం మయానాస్తి సదృశో భువనత్రయే॥ (77)**
**శాస్త్రం తవ ముఖోద్గీర్ణం శివాద్వైతపరంపరమ్। (78)**
**మాం వినా కస్య లోకేషు శ్రోతుమస్తితపః శుభమ్ ॥ (79)**
**తపసాం పరిపాకేన శఙ్కరస్య ప్రసాదతః ।**
**ఆగతస్త్వం మహాభాగ మాం కృతార్థయితుం గిరా ॥** (20-80) (సి.శి. 20 : 73-80)

ఈ స్తుతి యొక్క తాత్పర్యమేమనగా "ఓ రేణుక గణేశ్వరా! మీరు శివయోగ రహస్యమును బాగుగా నెరిగినవారై యున్నారు. శివజ్ఞాన మహాసాగరమై యున్నారు. వేదాగమ పురాణ శాస్త్రాదులలో ప్రావీణ్యత గలవారు మీరు. కేవలము కృపాదృష్టిచేతనే జీవుల సంసార బంధములను త్రెంచి వేసెడి సామర్థ్యము మీకు కలదు. తమరు సర్వతంత్ర స్వతంత్రులు. స్వయం ప్రకాశ స్వరూపము గల శివుడుగా నున్నారు. అత్యంత పవిత్రమైన మీ ముఖమునుండి నిఃసృతమైనట్టి యీ నిర్మలమైన శాస్త్రమును విని నా మనస్సు ఆనందభరితమై యున్నది. నేను శివరూపమైన జ్యోతిని చూడగల్గుచున్నాను. నేడు నా జన్మ సఫలమైనది. నా చిత్త భ్రమ వైదొలగినది. పాశములు తెగినవి. నా తపస్సులు ఫలించినవి మీ ముఖ కమలమునుండి వెలువడిన శివాద్వైత పరంపరకు చెందిన శుభశాస్త్రమును వినుటకై నేనుకాకుండ మరెవ్వరికినీ తపఃశక్తి యుండును? పరిపక్వమైన నా తపస్సు వలనను, శివుని యొక్క కృప వలనను నన్ను కృతార్థుని చేయుట కొరకు తమరి వాణి బహిర్గతమైనది.

**ఇతి స్తువన్తం వినయాదగస్త్యంమునిపుంగవమ్ ।**
**ఆలోక్య కరుణాదృష్ట్యా బభాషే స గణేశ్వరః ॥** (సి.శి. 20 : 81)

దీని తాత్పర్యమేమనగా ఈ విధముగా వినయముతో స్తుతించిన వాడును, మునిశేష్ఠుడును, అయిన అగస్త్యుని కృపాభరిత దృష్టితో పరికించి శ్రీ రేణుకగణేశ్వరుల వారు క్రింది విధిన యనిరి :

అగస్త్య మునిశార్దూల తపఃసిద్ధ మనోరథ ।
త్వాం వినా శివశాస్త్రస్య కః శ్రోతుమధికారవాన్ ॥ (20-82)
పాత్రం శివప్రసాదస్య భావానేకో న చాపరః ।
ఇతి నిశ్చిత్య కథితం మయాతే తంత్రమీ దృశమ్ ॥ (20-83)
స్థాప్యతాం సర్వలోకేషు తన్త్రమేతత్ త్వయామునే ।
ఈ దృశం శివబోధస్య సాధనం నాస్తి కుత్రచిత్ ॥ (20-84)
రహస్యమేతత్ సర్వజ్ఞః సర్వానుగ్రాహకః శివః ।
అవాదీత్ సర్వలోకానాం సిద్ధయే పార్వతీపతిః ॥ (20-85)
తదిదం శివసిద్ధాన్త సారాణాముత్తమోత్తమమ్ ।
వేదవేదాన్త సర్వస్వం విద్యాచార వర్తకం ॥ (20-86)
వీరమాహేశ్వర గ్రాహ్యం శివాద్వైత ప్రకాశికం
పరీక్షితేభ్యో దాతవ్యం శిష్యేభ్యో నాన్యథా క్వచిత్ ।
ఏతచ్ఛ్రవణ మాత్రేణ సర్వేషాం పాప సంక్షయః ॥ (20-87)
అవతీర్ణం మయాభూమౌ శాస్త్రస్యాస్య ప్రవృత్తయే ।
ప్రవర్తయ శివాద్వైతం త్వమపి జ్ఞానమీదృశమ్ ॥ (20-88)

తపస్సుచేత సిద్ధ మనోరథుడవైన అగస్త్య ముని శార్దూలా! నీవు తప్ప మరెవ్వరికిని శివశాస్త్రమును వినెడి యధికారము లేదు. శివకృపకు పాత్రుడవైన వానివి నీ వొక్కడివే గలవు. మరెవ్వరూ లేరని నిశ్చయించికొని యీ తంత్రమును నీకుపదేశించితిని. నీవు ఈ తంత్రమును ప్రచారములోనికి తెచ్చి సుప్రతిష్ఠమైన దానిగా చేయుము. సర్వజ్ఞుడును, సర్వానుగ్రహకారకుడును అయిన పార్వతీపతి దీనిని అందరి సిద్ధికొరకు నుపదేశించిరి. వేదవేదాంత సర్వస్వమును, విద్యాచార ప్రవర్తకమును వీరమాహేశ్వరులచే స్వీకరింపదగినదియును, శివాద్వైత ప్రకాశమును అయిన యీ శాస్త్రమును పరీక్షింపబడినట్టి శిష్యులకు మాత్రమే ప్రదానము చేయవలెను. యితరులకుపదేశించవలదు. దీనిని వినిన మాత్రమున జనులందరి పాపము క్షీణించిపోవును. ఈ శాస్త్రమును ప్రవర్తింపజేయుటకే నేనవతరించితిని. నీవు కూడ యీ శివాద్వైత జ్ఞానమును ప్రచారము చేయుము.

## విశేషప్రదీపిక :

శ్రీ కాశీ జగద్గురువుల వారు జ్ఞాన శూన్యస్థలము గురించి చెప్పిరి. జ్ఞేయము లేనట్టిదియును, జ్ఞాతృవు లుప్తమై యుండెడి యీ స్థలమే లింగాంగ సామరస్య సిద్ధి స్థలమని గుర్తించగలరు.

శివుని యొక్క కేవలావస్థలో శివుడు యేకాకియై నిస్సీముడై నిర్మల నిరంజన చిత్ స్వరూపుడై నిరాకారస్థితిన నుండును. అట్టి స్థితిలో శక్తియు నతనిలో నణగిపోయి యుండును. ఈ స్థితి శివుని సచ్చిదానంద స్థితియనవచ్చును. దీనినే వీరశైవ పరిభాషలో శూన్య స్థలమని పిలుతురు. శివుడొక్కడే నిలిచియుండుట చేత శివేతరమైనదంతయును శూన్యమైపోవును. ఇచ్చట శివునికి తానున్నాననెడిది తెలివిడి యుండును. స్వయం ప్రకాశుడై చిద్వ్యోముడై యుండి యున్ననూ తాను ప్రకాశించుచున్నాననెడి జ్ఞానము శివునికుండదు. అదే విధిన తాను ఆనందించుచున్నాననెడి యెరుకయు నెరిగెడి స్థితిలో శివుడుండడు. “అహమస్మి” అనెడి జ్ఞానము వల్లనే ప్రవృత్తి మార్గమున శివుడు పయనించుటకు ప్రథమ సోపానమని యెరుగుడి. నివృత్తి క్రమమున దీనికి స్థానము లేదు. ఇట్టి శివుని నిర్వికార నిర్వికల్ప స్థితిలో నతనితో సమరస భావమును పొంది యతనిలో నిశ్శేషముగా లీనమైపోయిన సాధకుడు శివుని యంతర్భాగమై స్వంత అస్తిత్వమును కోల్పోయి నదీ సముద్ర న్యాయమున శివైక్యుడగుచున్నాడు. ఈ స్థితిని యనిలకాష్ఠన్యాయముతోను పోల్చవచ్చును. జీవుడు శివునిలో నిశ్శేషముగా లీనమయ్యెడి దానిని శిఖి కర్పూర న్యాయముగా వివరింపబడినది.

ఈ స్థితి జీవన్ముక్త దశయని గ్రహించగలరు. అల్లమాప్రభువు నిట్టి సిద్ధి బడసెనని తెలిపెడి కథ యొక్కటి ప్రభులింగలీల యనెడి గ్రంథములో చెప్పబడినది.

“శుభం భూయాత్”

# ఏకవింశతితమ పరిచ్ఛేదము

## ఆశీర్వచనము - 1 :

## త్రికోటిలింగ స్థాపనాలీల :

క్రిందటి స్థలమున శ్రీరేణుక భగవత్పాదులవారు శివాద్వైత తత్త్వమును ప్రచారము చేయుమని అగస్త్యునకు నానతి యిచ్చిరని తెలుపబడినది. ఆ పిదప జరిగిన ఘటనలీ స్థలమున వివరింపబడినవి.

**ఇత్యుక్త్వా పశ్యతస్తస్య పురస్తాదేవ రేణుకః ।**
**అంతర్దధే మహాదేవం చిన్తయన్నన్తరాత్మనా ॥** (సి.శి. 21-1)
**య ఇదం శివసిద్ధాన్తం వీరశైవమతాత్మకమ్ ।**
**శ్రుణోతి శుద్ధమనసా సయాతి పరమాంగతిమ్ ॥** (సి.శి. 21-2)

శ్రీ భగవత్పాదులవారు తన అంతరాత్మలో శివధ్యానమును చేయుచు నంతర్హితుడైపోయెను. యెవ్వడైతే యీ వీరశై సిద్ధాంతమును శ్రద్ధాసక్తులతో వినుచున్నాడో అతడు పరమగతిని పొందుచున్నాడు.

**స్వచ్ఛన్దాచార రసికః స్వేచ్ఛానిర్మిత విగ్రహః ।**
**ఆససాద పురీం లఙ్కాం రేణుకోగణనాయకః ॥** (సి.శి. 21-3)

స్వచ్ఛందమైన ఆచరణలోన నానందమును పొందెడివాడును, తన యిచ్ఛానుసారముగా శరీరధారణ చేసెడివాడును అయిన రేణుక గణేశ్వరులవారు లంకానగరమును ప్రవేశించిన వాడయ్యెను.

**తమాగతం మహాభాగం సర్వాగమ విశారదమ్ ।**
**విభీషణః సమాలోక్య గేహం (సౌధం)**
**ప్రవేశాయన్నిజం ॥** (సి.శి. 21-4)
**భద్రాసనే నిజే రమ్యే నివేశ్య గణనాయకమ్ ।**
**అర్ఘ్య పాద్యాదిభిః సర్వైరుపచారై రపూజయత్ ॥** (సి.శి. 21-5)
**పూజితేన ప్రసన్నేన రేణుకేన నిరూపితః ।**
**నిషసాదతదభ్యాశే స నిజాసన మాశ్రితః ॥** (సి.శి. 21 : 6)

సర్వాగమ విశారదుడును, మహాత్ముడును నయిన శ్రీ రేణుక గణనాయకుని ఆగమనమును గాంచి విభీషణుడతనిని తన గృహములోనికి ప్రవేశింపజేసెను. రమణీయమైన నిజాసనమున కూర్చుండబెట్టి అర్ఘ్య పాద్యాతులతో సమస్తమైన యుపచారములను చేసెను. పూజలచేత ప్రసన్నుడై నట్టి శ్రీ రేణుకాచార్యులవారి యానతి మేరకు విభీషణుడు ఆచార్యులవారి సమీపమున నున్నట్టి యాసనమున కూర్చుండెను.

**ఆతభాషే గణేంద్రం తమాభిభాషే కృతాంజలి విభీషణః ।**
**మానుషాకార సంపన్నం సాక్షాచ్ఛివమివాపరమ్ ॥** (సి.శి. 21-7)

దీని తాత్పర్యమేమనగా విభీషణుడు నంజలిబద్ధుడై మనుజాకారమున నున్న శివునివలె దోచుచున్న గణేంద్రుని నుద్దేశించి క్రింది విధముగా

విజ్ఞాపనను చేసెను.

**రేణుక త్వం గణాధీశ శివజ్ఞాన పరాయణ ।**
**అవతీర్ణం మహీమేనామితి సమ్యక్ శ్రుతం మయా ॥** (21-8)
**మద్భాగ్య గౌరవాదద్య సమాయంస్త్వం పురీమిమామ్ ।**
**కథం భాగ్యవిహీనానాం సులభాః స్యుర్భవాదృశాః ॥** (21-9)
**మత్సమో నాస్తి లోకేషు భాగ్యాతి శయవత్తయా ।**
**యస్య సౌధం స్వయంప్రాప్తో భవాన్ సాక్షాన్మహేశ్వరః ॥** (21-10)
**కృతార్థా మే పురీహ్యేషా కృతార్థోరాక్షసాన్వయః ।**
**జానితం చ కృతార్థం మే త్వం దృష్టిగోచరః॥** (21-11)

దీని తాత్పర్యమేమనగా శివజ్ఞాన పరాయణుడవైన రేణుక గణేశ్వరా! మీరు నీ ధీరాతలము మీద యవతరించిన విషయము గురించి యెంతో గొప్పగా వింటిని. నా భాగ్యవశము వలన తమరీ నగరమునకు విచ్చేసిరి. భాగ్యహీనులైనవారికి తమవంటివారు సులభముగా కరుణించరు కదా! ఈ సంసారములోన నాతో సమమై భాగ్యశాలులెవ్వరు? ఎవ్వరి గృహము సాక్షాత్తు పరమేశ్వరులైన మీరు స్వయముగా దయచేసిరి. మీ దర్శన భాగ్యమువలన లంకాపురము రాక్షసజాతి కృతార్థత పొందినవి. నా జన్మయు కృతార్థమైనదైనది.

**ఇతి బ్రువాణం కళ్యాణం రాక్షసేంద్రం గణేశ్వరః ।**
**బభాషే సస్మితో వాణీం విశ్వోల్లాస కరీం శుభామ్ ॥** (సి.శి. 21 : 12)

విభీషణుని కళ్యాణగుణాన్విత వాణిని విని శ్రీ రేణుక గణేశ్వరుల వారు విశ్వోల్లాసకారిణి అయిన తన వాణితో విభీషణుని యుద్దేశించి యిటులనెను.

**విభీషణ మహాభాగ జానే త్వాం ధర్మకోవిదమ్ ।**
**త్వాం వినా కస్య లోకేషు జాయతే భక్తిరీదృశీ ॥** (21-13)
**సమస్తశాస్త్రసారజ్ఞం సర్వధర్మపరాయణమ్ ।**
**ఆధ్యాత్మవిద్యానిరత మాహుస్త్వాం రాక్షసేశ్వర ॥** (21-14)
**త్వదీయ ధర్మ సంపత్తిం శ్రుత్వాహం విస్మితాశయః ।**
**వ్రజన్ కైలాసమచలం త్వదన్తికముపాగతః ॥** (21-15)
**ప్రీతోస్మి తవ చారిత్రైః శోభనైర్లోకవిశ్రుతైః ।**
**దాస్యామితే వరం సాక్షాత్ ప్రార్థయస్వ యథేప్సితమ్ ॥** (సి.శి. 21-16)

దీని తాత్పర్యమేమనగా ఓ భాగ్యశాలియైన విభీషణా! నిన్ను ధర్మకోవిదుడుగా నేనెరుగుదును. ఈ లోకమునందు మిమ్ములను మినహాయించినచో నింకెవ్వరికి యిటువంటి భక్తి యుండగలదు. మీ ధర్మాచార సంపత్తి గురించి విస్మిత చిత్తుడనై నేను కైలాసమునకు వెళ్ళుచు నిటకు వచ్చితిని. మీ చరిత్ర లోకవిశుతమై సుశోభితమైయున్నది. అద్దాని చేత నేను ప్రసన్నుడనైతిని. మీకు వర ప్రదానము చేసెదను. ఏది కావలయునో దానిని కోరుకొనుము.

ఇతి ప్రసాద సుముఖే భాషమాణే గణేశ్వరే ।
ప్రణమ్య పరయాప్రీత్యా వ్యాజహార విభీషణః ॥ (సి.శి. 21-17)

దీని తాత్పర్యమేమనగా ప్రసన్న వదనుడై గణేశ్వరుడిట్టుల పలుకగా విభీషణుడు ప్రసన్న హృదయుడై ప్రణామమును చేసి యిట్టులనెను.

ఆగమానుగ్రహాదేవ భవతః శివయోగినః ।
దుర్లభాః సర్వలోకానాం సమపద్యన్త సంపదః ॥
తథాపి ప్రార్థనీయం మే కిఞ్చదస్తి గణేశ్వర ।
సుకృతే పరిపక్వే హి స్వయం సిద్ధ్యతి వాఞ్ఛితమ్ ॥
రావణోహి మమభ్రాతా మాహేశ్వర శిఖామణిః ।
అదృష్టశతృ సంబాధం శశాస హి జగత్త్రయమ్ ॥
యస్య ప్రతాపమతులం సోఢుమక్షమశక్తయః ।
ఇంద్రాదయః సురాః సర్వే రాజ్యలక్ష్మ్యా వియోజితాః ॥
స తు కాలవశే నేవ స్వచారిత్రవిపర్యయాత్ ।
రణే విష్ణ్వవతారేణ రామేణ నిహితోఽభవత్ ॥
స తు రామ శరావిద్ధః కణ్ఠస్ఖలిత జీవితః ।
అవశిష్టం సమాలోక్య మామవాదీత్ సుదుఃఖితః ॥
విభీషణ విశేషజ్ఞ మహాబుద్ధే సుధార్మిక ।
అవశిష్టోఽసి వంశస్య రక్షసాం భాగ్యగౌరవాత్ ॥
వయమజ్ఞాన సమ్పన్నా మహత్సు ద్రోహకారిణః ।
ఈదృశీం తు గతిం ప్రాప్తా దుస్తారా హి విధి స్థితిః ॥
నవకం లింగకోటీనాం ప్రతిష్ఠాప్యమిహస్థలే ।
ఇతి సంకల్పింతం పూర్వం మయా తద వశిష్యతే ॥
కోటి షట్కంతు లింగానాం మయా సాధు ప్రతిష్ఠితమ్ ।
కోటిత్రయం తు లింగానాం స్థాపనీయ మతస్త్వయా ॥
ఇతి తస్య వచః శ్రుత్వా దీనబుద్ధే ఽర్మరిష్యతః ।
తథా సాధు కరోమీతి ప్రతిజ్ఞాతం మయాతథా ॥
యుగపచ్ఛివలింగానాం కోటిత్రయ మనుత్తమమ్ ।
ప్రతిష్ఠాప్యం యథా శాస్త్రమితి మే నిశ్చయోఽ భవత్ ॥
లింగకోటి త్రయ స్యేహ యుగపత్ స్థాపనావిధౌ ।
అవిద న్నేకమాచార్య మహమేవ అవస్థితః ॥
శివశాస్త్ర విశేషజ్ఞ శివజ్ఞాననిధిర్భవాన్ ।
ఆచార్య భావమాసాద్య మమ పూరయ వాఞ్ఛితమ్ ॥ (సి.శి. 21 : 31)

దీని తాత్పర్యమేమనగా ఓ గణేశ్వరా! నేను కోరదగినదొకటి గలదు. నాయన్న రావణుడు ముల్లోకములను నిరాటంకముగా పాలించెను. ఇంద్రాదులెల్లరూ తమ తమ భాగ్యమును కోల్పోయిరి. కాలవశమున రామునిచేత చంపబడెను. మరణ సమయమున నతడొక కోరికను

తీర్చుమనెను. నవకోటి లింగములను స్థాపించవలెనని సంకల్పించితిననియును, వాటిలో ఆరుకోట్లు తాను ప్రతిష్ఠించి నాడనియును తెలిపి మిగిలిన మూడుకోట్లను ప్రతిష్ఠించమని కోరెను. సరిఅయిన ఆచార్యుడు లభ్యము కాలేదు. మీరా పనిని చేసి మాయన్నగారి కోరికను నెరవేర్చెడి భాగ్యమును నాకు నొసంగుడి :

**తస్యేతి వచనం శ్రుత్వా రాక్షసేంద్రస్య ధీమతః ।**
**తథేతి ప్రతి శుశ్రావ సర్వజ్ఞో గణనాయకః ॥** (సి.శి. 21-32)

దీని తాత్పర్యమేమనగా విభీషణుని వాక్కులను విని శ్రీ గణేశ్వరులవారు "తథాస్తు" అని అనెను.

**తత్రసంతుష్టచిత్తస్య పౌలస్త్యస్యేష్ట సిద్ధయే ।**
**కోటిత్రయం తు లింగానాం యథాశాస్త్రం యథావిధి ॥** (సి.శి. 21-33)
**త్రికోట్యాచార రూపేణ స్థాపితం తేన తత్క్షణే**
**తాదృశం తస్యమాహత్మ్యం సమాలోక్యవిభీషణః ।**
**ప్రణనామ ముహుర్ భక్త్యా పాదయోస్తస్య విస్మితః ॥** (సి.శి. 21-34)
**ప్రణతం వినయోపేతం ప్రహృష్టం రాక్షసేశ్వరమ్।**
**అనుగృహ్య స్వమాహాత్మ్యాద్ రేణుకోన్తర్హితో భవత్ ।** (సి.శి. 21-35)
**విభీషణోఽపి హృష్టాత్మా రేణుకస్య ప్రసాదతః ॥**
**శివభక్తి రసాసక్తః స్థిరరాజ్యమపాలయత్ ॥** (సి.శి. 21-36)

దీని తాత్పర్యమేమనగా శ్రీ రేణుకులవారి మహిమను గాంచి విస్మితుడైన విభీషణుడు ప్రణమిల్లెను. శ్రీ రేణుకుల వారతనిని యనుగ్రహించి యంతర్ధానుడయ్యెను. శ్రీ రేణుకుల వారి ఆశీర్వచనము వలన విభీషణుడు లబ్దిని పొంది సుస్థిరముగా రాజ్యపాలనను గావించెను. తదనంతరము-

**రేణుకోఽపి మహాతేజాః సంచరన్ క్షితిమణ్డలే ।**
**ప్రచ్ఛన్నశ్చ ప్రకాశశ్చ పరమాద్వైతభావితః ॥** (సి.శి. 21-37)
**కాంశ్చిద్ దృష్టినిపాతేన కరుణారసవర్షిణా ।**
**అపరానుపదేశేన శివాద్వైతాభిమర్శినా ॥** (సి.శి. 21-38)
**అన్యాంశ్చసహవాసేన సమస్తమలహారిణా ।**
**కృతార్థయన్ జనాన్ సర్వాన్ కృతినః పక్వకర్మిణః ॥** (సి.శి. 21-39)
**దర్శయిత్వా నిజాధిక్యం శివదర్శనలాలసః ।**
**ఖండయిత్వాదురాచారాన్ పాషండాన్ భిన్న దర్శనాన్ ॥** (సి.శి. 21-40)
**యన్త్ర మన్త్ర కలావిద్ధాన్ విమతాన్ సిద్ధమండలాన్ ।**
**విజిత్య స్వప్రభావేణ స్థాపయిత్వా శివాగమాన్ ॥** (సి.శి. 21-41)
**ఆజగామ నిజావాసం కొల్లిపాకాభిధపురం ॥**

మహాతేజము గల శ్రీరేణుకాచార్యులవారు, ప్రచ్ఛన్నముగాను ప్రత్యక్షముగాను శివాద్వైతభావముతో భూమండలమునసంచరించుచు కొందరిని దయాదృష్టి చేతను, కొందరిని శివాద్వైతోపదేశము చేతను, కొందరిని సహవాసము చేతను మలనివారణ చేసి కృతార్థులను చేసెను. దురాచారులను, పాషండులను, యంత్ర, మంత్ర కలాయుతులను, దుర్మతులును అగు సిద్ధులను జయించి స్వీయాధిక్యమును నిరూపించి, కొలనుపాకకు

తిరిగివచ్చెను.

**తత్ర సంభావితః సర్వైః జనైః శివపరాయణైః ।**
**సోమనాథాభిదానస్య శివస్య ప్రాపమందిరమ్ ॥** (సి.శి. 21-42)
**పశ్యతాం తత్ర సర్వేషాం భక్తానామ్ శివయోగినామ్ ।**
**తన్వానో విస్మయం భావైస్తుష్టావ పరమేశ్వరమ్ ॥** (సి.శి. 21-43)
**దేవ దేవ జగన్నాథ జగత్కారణ కారణ ।**
**బ్రహ్మవిష్ణు సురాధీశ వంద్యమానపదాంబుజ ॥** (సి.శి. 21-44)
**సంసార నాటక భ్రాంతి కలానిర్వహణ ప్రద ।**
**సమస్త వేద వేదాన్త పరిబోధిత వైభవ ॥** (సి.శి. 21-45)
**సంసార వైద్య సర్వజ్ఞ సర్వశక్తి నిరంకుశ ।**
**సచ్చిదానంద సర్వస్వ పరమాకాశ విగ్రహ ॥** (సి.శి. 21-46)
**సమస్త జగదాధార జ్యోతిర్లింగ విజృంభణ ।**
**సదాశివ ముఖానేక దివ్యమూర్తి కలాధర ॥** (సి.శి. 21-47)
**గుణత్రయ ప్రదాతీత మలత్రయ వినాశన ।**
**జగత్రయ విలాసాత్మన్ శ్రుతిత్రయ విలోచన ॥** (సి.శి. 21-48)
**పాహిమాం పరమేశాన పాహిమాం పార్వతీపతే ।**
**త్వదాజ్ఞయా మయైతావత్ కాలమాత్రం మహీతలే ॥** (సి.శి. 21-49)
**ఆచారి భవదుక్తానా మాగమానాం ప్రసిద్ధయే ।**
**ఇతః పరం స్వరూపంతే ప్రాప్తుకామోస్మిః శంకర ॥** (సి.శి. 21-50)
**అంతరం దేహి మే కించిదనుకంపావిశేషతః ।** (సి.శి. 21-51)

కొలనుపాకలోని శివభక్తులచేత సత్కరింపబడిన శ్రీరేణుకాచార్యులవారు సోమనాథుని ఆలయమును చేరిరి. విస్మితులైన శివయోగులు, శివభక్తులును గనుచునుండగా శ్రీరేణుకాచార్యులవారు నీ విధముగా శివస్తుతిని చేసిరి.

“ఓ దేవదేవా! జగన్నాథా! జగత్తు యొక్క పుట్టుకకు కారణమైనదానికి కారణమైనవాడా! బ్రహ్మ విష్ణు సురేంద్రాదులచేత పూజింపబడిన పాదములు గలవాడా! వేద వేదాంగములచేత తెలుపబడిన లీలా వైభవము గలవాడా! సంసారమనెడి రోగమునకు వైద్యుని వంటివాడా! సర్వజ్ఞుడా! సర్వశక్తులను గలిగియుండి నిరంకుశునిగా యున్నవాడా! సచ్చిదానందమునకు నెలవైనవాడా! పరాకాశ స్వరూపమైయున్నవాడా! సమస్త జగత్తుకు నాధారభూతుడవైయున్న వాడా! జ్యోతిర్లింగమై ప్రకాశించువాడా! త్రిగుణములకతీతుడవై యున్నవాడా! త్రిమలములను నాశనము చేయువాడా! ముజ్జగముల వికాస విలాసరూపమై యున్నవాడా! వేదత్రయములే కన్నులై యున్నవాడా పార్వతీపతీ! పరమేశ్వరా! ఈశానా! నన్ను రక్షించుడి ! మీ ఆజ్ఞ ప్రకారము శివాగమములలోని తత్త్వమును భూలోకమున ప్రచారము చేసితిని. నేనిప్పుడు మిమ్ములను పొందగోరుచున్నాను. దయచేసి యనుగ్రహించుడి :

**ఇత్యుక్తే గణనాయకేన సహసాలింగాత్ తతః శంకరాథ్ ।**
**వత్సాగచ్ఛ మహానుభావ భవతో భక్త్యా ప్రసన్నోఽస్మహ్యం ॥**
**ఇత్యుచ్చైరాగదద్ వచస్తనుభృతామాశ్చర్య మాసీత్ త్వవా ।**
**దివ్యో దుందుభిరాననాదగగనే పుష్పం వవర్షుర్గణాః ॥**

**శ్రుత్వాలింగాత్ వచనముదితం శాంకరం సానుకంపం ।**
**సంహృష్టాత్మా గణపతిరథో జ్యోతిషా దీప్యమానః ॥**
**జాతోత్కంఠైః పరమనుపరైర్యోగిభిః స్తూయమానో ।**
**జ్యోతిర్లింగం పరమను విశత్ స్వప్రకాశం తదానీమ్ ॥**
**లీలే తస్మిన్ శాంకరే స్వప్రకాశే దివ్యాకారే రేణుకే సిద్ధనాథే ।**
**సర్వో లోకో విస్మితోఽభూత్ తదానీం శైవీ భక్తిః సప్రమాణా బభూవ ॥** (సి.శి. 21-53)

శ్రీ రేణుక గణేశ్వరులవారు విన్నపమును చేయగనే "ఓ వత్సా! రమ్ము! నీభక్తికి మెచ్చితి"నని శంకరుడు బిగ్గరగా సోమనాథలింగమునుండి పలికెను. అచ్చట నున్నవారు నాశ్చర్యము నొందుచుండగా దేవదుందుభులు మ్రోగెను. దేవతలు పుష్పవృష్టిని కురిపించిరి. శివవాక్కుల వలన సంతుష్టిని పొందిన శ్రీరేణుకులవారు తేజోపుంజమై జ్యోతిర్లింగములో లీనమయ్యెను. లోకులెల్లరూ ఆశ్చర్యచకితులై చూచుచు నుండిరి.

శ్రీ శివయోగి వారిచ్చిన ఫలశ్రుతి యీ విధముగా నున్నది.

**శ్రీ వేదాగమ వీరశైవ సరణిం శ్రీషట్ స్థలోద్యన్మణిం ।**
**శ్రీ జీవేశ్వర యోగ పద్మ తరణిం**
**శ్రీ గోప్య చింతామణిమ్ ।**
**శ్రీ సిద్ధాంత శిఖామణిం లిఖయిత**
**యస్తం లిఖిత్వా పరాన్**
**శ్రుత్వ శ్రావయితా సయాతి**
**విమలాం భుక్తించ ముక్తిం పరామ్ ॥** (సి.శి. 21 : 54)

శ్రీ వేదాగమ వీరశైవాను సరణియును, షట్స్థలములనెడి యారు ప్రకాశమానములైన రత్నములు గలదియును లింగాంగ సామరస్యమనెడి పద్మమును వికసింపజేసెడి సూర్యుని వంటిదియును, శివరహస్యములలో చింతామణి వంటిదియును నయిన శ్రీ సిద్ధాంత శిఖామణిని వ్రాసి వ్రాయించినవారికిని, వినిపించిన వారికిని యిహపర సౌఖ్యములబ్బుననెడిది ఫలశ్రుతిలోని భావార్థము.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ఇంతటితో శ్రీ సిద్ధాంత శిఖామణి ప్రవచన ప్రభయొక్క ఇరువది ఒకటవ పరిచ్ఛేదము సంపూర్ణమైనది.

- శివం భూయాత్ -

## శ్రీ సిద్ధాంత శిఖామణి ప్రవచనప్రభ
## శ్లోకార్థముల ఆకారాది పట్టిక


**అ-కార**

| | |
|---|---|
| అసస్త్య మునిశార్దూల | 5.2; 20.81 |
| అఘోర పాపకాశీతి | 6.62 |
| అంగలింగ జ్ఞానరూపః | 13.2 |
| అంగలింగ సమారూఢం | 12.43 |
| అచరే మంత్ర సంస్కారాల్లింగే | 9.62 |
| అచేతనత్వాత్ పృథివ్యా | 10.53 |
| అజంగమం తు యల్లింగం | 9.62 |
| అజ్ఞానమలినం | 13.25 |
| అజ్ఞానరాక్షసోన్మేష | 12.39 |
| అజ్ఞాన తిమిరోద్రిక్తా | 14.12 |
| అణిమాధికమైశ్వర్యం | 3.47 |
| అతప్తతనురజ్ఞోవై | 6.61 |
| అత్యంత పాప కర్మాపి | 11.50 |
| అత్రప్రేరయితా శంభు | 5.42 |
| అక్రతదానత్రయం ప్రోక్తం | 5.60 |
| అథత్రిలింగ విషయే | 4.1 |
| అథవా శివభక్తానాం | 9.34 |
| అథాగస్త్యవచః శ్రుత్వా | 5.1 |
| అద్వైత భావనాజాతం | 14.14 |
| అధర్మ జోత్తమేవాపి | 9.4 |
| అనంత పరమానంద | 3.13 |
| అనేక జన్మ శుద్ధానాం | 9.13 |
| అంతః పవనసంస్పృష్టే | 12.14 |
| అంతర్గతం చిదాకారం | 12.13 |
| అంతరేణ గురుం సిద్ధం | 13.24 |
| అంతఃషట్చక్రరూఢాని | 12.2 |
| అంతఃస్థితం పరంలింగం | 12.9 |
| అంతఃపురద్వారగతా | 2.33 |
| అంతర్ధారయితుం లింగమశక్తః | 6.48 |
| అంతర్లింగానుసంధాన | 6.43 |
| అపగఛ్ఛేతు సర్వస్వం | 10.22 |
| అపరిచ్ఛిన్నమవ్యక్తం | 6.36 |
| అపరోక్షిత తత్త్వస్య | 13.26 |
| అర్పయిత్వా నిజిలింగే | 9.71 |
| అర్పితేనాన్నపానేన | 10.25 |
| అప్రత్యక్షో మహాదేవః | 9.53 |
| అభిషిచ్య గురుశిష్యమాసీనం | 6.20 |
| అమృతార్థం ప్రపన్నానాం | 1.12 |
| ఆయం శివోగురుశ్చేష | 14.36 |
| అవమానాన్మహాఘోరో | 9.26 |
| అవాంతర స్థలాన్యత్ర | 5.27 |
| అవ్యక్తం | |
| లింగమిత్యాహర్జగతాం | 12.37 |
| అశుద్ధోపాది | 5.45 |
| అష్టకృత్వాథ | 7.21 |
| అస్యమాహేశ్వరస్యోక్తం | 10.21 |
| అహం భృత్యః శివః | 14.37 |
| అహమేవ మునీంద్రాణాం | 4.46 |
| అహం శివోగరుశ్చాహమహం | 14.39 |
| ఆగమా బహుధాః | 5.9 |
| ఆత్మంభోగాయ నియతం | 11.11 |
| ఆత్మానందపరిస్ఫూర్తి | 2.29 |
| ఆప్తాధికారిణః | 3.44 |
| ఆదితః శ్రమశో వక్షే | 10.73 |
| ఆదై భక్తస్థలం ప్రోక్తం | 5.84 |
| ఆంద్రంతు ప్రకృతిం | 7.26 |
| ఆధారే కనకప్రఖ్యం | 6.40 |
| ఆధారే హృదయే | 6.39 |
| ఆదిభౌతికమేతద్ధి | 5.69 |
| ఆధ్యాత్మికం తు ప్రథమం | 5.67 |
| ఆధ్యాతికం ద్విధాప్రోక్తం | 5.78 |
| ఆరోగ్యకారణం | 11.13 |

**ఇ-కార**

| | |
|---|---|
| ఇచ్ఛాజ్ఞాన క్రియారూప | 3.25 |

| | |
|---|---|
| ఇచ్ఛాజ్ఞానాదిరూపేణ | 1.11 |
| ఇతిశుద్ధేన శీర్షేణ | 6.10 |
| ఇత్యుక్తృ పరమేశ్వరః | 3.88 |
| ఇత్యుక్త్వా పశ్యతాం | 4.13 |
| ఇతి పంచప్రకారోయం | 9.24 |
| ఇతి సంప్రర్థితః | 2.20 |
| ఇతి సంబోధితః శిష్యో | 6.28 |
| ఇతి యశ్చింతయేన్నిత్యం | 10.54 |
| ఇందీవర వరజ్యోతి | 4.21 |
| ఇష్టలింగమిదం | 6.49 & 6.51 |
| ఈశ్వరః సర్వభూతానాం | 10.10 |

**ఉ-కార**

| | |
|---|---|
| ఉక్తాఖిలాచార | 1.14 |
| ఉక్తో మహేశ్వరః | 11.1 |
| ఉక్తాభవాన్ సకలయీాశ | 4.54 |
| ఉత్తమాంగతిమాశ్రిత్యం | 9.40 |
| ఉదారగుణమోంకారం | 3.11 |
| ఉపమన్యుభృగువ్యాస | 3.55 |
| ఉమయా సమమాసేనం | 3.36 |
| ఉమాఖ్యయా మహాశక్త్యా | 12.23 |
| ఉవాచ శాంతయా | 4.37 |

**ఏ - కార**

| | |
|---|---|
| ఏతేషాం దేహినాం | 5.50 |
| ఏవమాద్య మహాభాగా | 3.46 |
| ఏవం నవవిధాభక్తిః | 9.6 |
| ఏవమాచార సంయుక్తో | 9.50 |
| ఏవం విధం విభూత్యాహి | 7.40 |
| ఏవం విధానాం చిత్రాణాం | 4.41 |
| ఏవం విధైర్భావ శుద్ధై | 12.20 |
| ఏవం సల్లక్షణోపేతం | 7.38 |
| ఏషామాదిమముత్తైష్ట | 7.14 |
| ఏష్వేక తమమాదాయ | 7.11 |

**ఐ - కార**

| | |
|---|---|
| ఐక్యస్థలమిదం ప్రోక్తం | 14.3 |
| ఐహికే క్షిణకే సౌఖ్యే | 5.62 |

**క - కార**

| | |
|---|---|
| కటేతటేపటేభూత | 4.4 |
| కర్తారం | 2.14 |
| కదాచిదథ కైలాసే | 3.1 |
| కంఠనాలజితనాంగ | 3.30 |
| కపిలః కృష్ణధవల | 7.7 |
| కర్మకాలాదికార్పణ్య | 3.51 |
| కరిపోత కరాకృష్ణ | 4.14 |
| కశ్చీదాచారసిద్ధానామగ్రణీ | 1.13 |
| కామక్రోధ మహామాప | 13.17 |
| కారణం సర్వలోకానం | 11.28 |
| కించిత్వర్తాచ కించిజ్ఞో | 5.47 |
| కించిత్సత్త్వ రజోరూపం | 5.40 |
| కిన్నరిగీతా | 3.4 |
| కిం వేద్యైః కిం తతః | 11.48 |
| కుసుంభ కుసుమాచ్ఛాయా | 3.33 |
| కేవలే సహజేదానే | 10.2 |
| కైవల్య కల్పకరవ్యా | 13.27 |
| కైలాసే మందరేచైవ | 10.72 |

**గ - కార**

| | |
|---|---|
| గచ్ఛంస్తిష్ఠనో స్వపనోవాపి | 14.23 & 19.34 |
| గంధర్వ పురవద్భోమ్ని | 10.67 |
| గంధః సమాది సప్తి రక్షకా | 12.17 |
| గండమండల పర్యంత | 3.19 |
| గణేశ్వరౌ రేణుక | 2.33 |
| గర్భస్తోజాయమానో | 1.72 |
| గుణత్రయభేదేన | 5.38 |
| గుణత్రయాత్మికా శక్తిః | 5.39 |
| గురుత్వాతోసర్వభూతానాం | 9.72 |
| గురుదేవ పరంతత్త్వం | 18.71 |
| గురురేవాత్ర సర్వేషాం | 11.19 |

| | |
|---|---|
| గురుభక్తి విహీనస్య | 11.24 |
| గుఉమహాత్మ్యయోగేన | 11.24 |
| గురులింగాది మహాత్మ్య | 11.57 & 11.67 |
| గురోర్లింగ్య మహాత్మ్య | 11.45 |
| గురుశిష్య సమరూఢ | 11.35 |
| గురోరవజ్ఞా | 14.30 |
| గురోఃశివస్య శిష్యస్యస్వ | 14.34 |
| గురోరాలోక మాత్రేణ | 6.13 |
| గౌరీపయోధరా | 3.21 |

**ఘ - కార**

| | |
|---|---|
| ఘోర సంసారాతిమిర | 11.38 |
| ఘోర సంసార సంతాప | 11.39 |

**చ - కార**

| | |
|---|---|
| చంద్రకాంతే యథాతోయం | 5.36 |
| చంద్రబింబాయకచ్ఛాయా | 3.15 |
| చర్మపాత్రే జలం శ్యలం | 9.42 |
| చలజ్జామరికా హస్తా | 3.40 |
| చామరణాం విలోలానాం | 3.41 |
| చిత్తవృత్తి సమాలీన జగతః | 14.15 |
| చిత్ప్రకాశయశో విశ్వం | 14.32 |
| చిదాకారో పరాకాశే | 14.41 |
| చిదానందమయః సాక్షాచ్ఛివ | 12.34 |
| చిదానంద పరాకాశ | 1.21 |
| చిద్రూపం పరమం లింగం | 6.31 |
| చిద్రూపం హి పరం తత్త్వం | 6.32 |
| చిన్మయే శాంకరే లింగే | 10.26 |
| చూడాలం సోమకలయా | 3.16 |
| చూతప్రవాల సక్షమా | 3.34 |

**జ - కార**

| | |
|---|---|
| జాతస్య హి ధ్రువోమృత్యుర్ధ్రువం | 5.63 |
| జితకామ జితక్రోధి | 11.39 |
| జిజ్ఞాసా శివతత్త్వస్య | 13.30 |
| జ్ఞాత్వాయః సతతం లింగం | 12.44 |
| జ్ఞానచంద్ర సముద్భూతం | 19.14 |
| జ్ఞానినాం యోగయుక్తానాం | 12.8 |
| జ్ఞానశక్తిః పరాయేషాం | 3.49 |
| జ్ఞాయతే లింగమేవ్యకం | 12.45 |
| జ్యోతిర్మయం పరంలింగం | 12.39 |

**త - కార**

| | |
|---|---|
| తటిత్సు విచిమాలాసు | 5.71 |
| తడిత్పింగజవాభార్యై | 4.26 |
| తతో నిర్దేశముద్దిష్టం | 13.4 |
| తతో వివేర సంపన్నో | 6.1 |
| తత్కులం హి సదా | 11.66 |
| తత్రకుత్ర చిదాభోగే | 4.17 |
| తత్సంప్రదాయ సిద్ధేన | 1.29 |
| తత్రలీనమభూతో | 2.7 |
| తతోనంది మహాకాల | 3.45 |
| తదీయా పరమాశక్తిః | 2.12 |
| తదీయాయుధ ధారిణ్యా | 3.43 |
| తదేవ సర్వకాలం | 11.10 |
| తమాగతం మహాసిద్ధం | 4.34 |
| తమపృచ్ఛినోజనాఃసర్వే | 4.9 |
| తమాస్థానగతం | 3.10 |
| తల్లింగం తస్యతుప్రాణే | 6.25 |
| తస్య దక్షిణకర్ణే | 6.21 |
| తస్యమధ్యే సమాసీనం | 4.24 |
| తస్యవంశె సముత్పన్నో | 1.15 |
| తస్య వీరశివాచార్య | 1.20 |
| తస్యానుభావం | 4.35 |
| తస్యాసిన్నందనః శాంతః | 1.17 |
| తస్మాల్లింగం పరం బ్రహ్మ | 12.41 |
| తస్యాలింగమితిఖ్యాతం | 6.38 |
| తస్మాదోగురుం మహాదేవం | 9.78 |
| తస్మాచ్ఛివమయం | 10.67 |
| తస్మాదద్వైతభావస్య | 14.13 |
| తస్మాత్సర్వ ప్రయత్నేన | 6.47 |
| తామస త్యాగ సంబంధాన్నిర్దేశా | 14.1 |
| తేషాం గృహేషు | 9.29 |

| | |
|---|---|
| తేషు ప్రమథ వర్గేషు | 2.26 |
| కేషుశైవం చతుర్విధం | 5.10 |
| త్రైలోక్య | 1.1 |

**ద - కార**

| | |
|---|---|
| దగ్ధం చైవానుకల్పాఖ్య | 7.17 |
| దగ్ధం ప్రాగుక్త విధినా | 7.18 |
| దానం చ త్రివిధం ప్రోక్తం | 9.87 |
| దానాత్ స్వర్ణ సహస్రస్య | 9.86 |
| ధారణీయం సమస్తానాం | 7.46 |
| ధారయేన్నిత్యం కార్యేషు | 7.10 |
| దీయకేచ శివజ్ఞానం | 6.11 |
| దుఃఖేరేత్యేరుపేతస్య | 5.70 |
| దుర్లభం మానుషం ప్రాప్య | 11.65 |
| దుర్లభా హి శివభక్తిః | 11.47 |
| దేహినా ప్రేరకః | 5.51 |

**న - కార**

| | |
|---|---|
| నతస్య సూతకం | 9.46 |
| నమస్తే దేవదేవేశ | 2.18 |
| నమః శివాయతి భస్మకృత్వా | 7.19 |
| నవవల్కల వాసోభి | 4.27 |
| నశ్వరాణి శరీరాణి | 5.59 |
| నయోనియంత్రాపీడా | 9.15 |
| న సూర్యో భాతి | 12.38 |
| న హి స్థావరలింగానాం | 9.33 |
| నాన్య దేవార్చకాన్ | 9.32 |
| నానా పథ మహాశైవ | 2.30 |
| నావమన్యేత కుత్రాపి | 9.65 |
| నాహ్వానం న విసర్జంచ | 10.47 |
| నిత్యం భాతిత్వదీయేషు | 10.74 |
| నిత్యం సంతోషయుక్తానాం | 10.76 |
| నిత్యానంద చిదాకారమాత్మ తత్త్వం | 5.73 |
| నిత్యానిత్య వివేకినః | 5.77 |
| నిత్య సిద్ధో నికాకంశా | |
| నిర్దగ్ధ కర్మబీజస్య | 1.21 |
| నిరస్తదోష సంబంధం | 2.19 |
| నిరస్తమదన్యోన్యషో | 10.18 |
| నిరస్త హృక్కలంకస్య | 5.61 |
| నిరస్త విశ్వ సంభాధే | 15.22 |
| నిరుపాదికమాఖ్యాతం | 9.82 |
| నేంద్రియాణాం న దేహస్య | 5.57 |

**ప - కార**

| | |
|---|---|
| పతీరదల పర్యంక | 14.16 |
| పతివ్రతాయయచ్ఛీలం | 13.34 |
| పత్రం పుష్పం ఫలం తోయం | 11.17 |
| పత్రశాఖాది రూపేణ | 10.70 |
| పతిసాక్షాన్మహాదేవః | 10.40 |
| పతింవినాయథాస్త్రీణాం | 13.34 |
| పంచధా కథ్యకే సద్భిః | 9.21 |
| పంచాక్షరోపదేశీత | 9.41 |
| పదేన మణిమంజీర | 3.23 |
| పరం పవిత్రమమలం | 11.27 |
| పరబ్రహ్మమహాలింగం | 12.24 |
| పరతత్త్వమయాపాది | 5.40 |
| పరిజ్ఞాతే శివే | 13.6 |
| పరిభ్రమంతి సంసారే | 5.48 |
| పృథాదికమిదం సర్వం | 10.50 |
| పృథివ్యాద్యాత్మ పర్యంత | 10.51 |
| పృథివ్యాద్యష్ట మూర్తిత్వ | 10.49 |
| పునస్తం ప్రార్థయామాస | 2.17 |
| పాదాగ్రేణవూ | 11.42 |
| పాద్దై ప్రక్షాలయామాన | 4.35 |
| ప్రత్యువాజ శివాద్వైత | 4.10 |
| పూజాది వ్యవహారః | 10.43 |
| పూజ్యపూజకయోర్లింగ | 10.37 |
| పూర్వాశ్రయ నిరాశఙ్క | 10.5 |
| ప్రాదుర్భూతం తమాలోక్య | 4.2 |
| ప్రపన్న పారిజాతస్య | 11.63 |
| ప్రపన్నానాం మహాదేవో | 11.64 |
| ప్రభోద పరమానంద | 2.26 |

ప్రసన్నం పరమాచార్యం 6.8
ప్రసన్నేసతి 1.14
ప్రసాదదేవ 9.11
ప్రసాదపూర్వికాయేయం 9.12
ప్రసాదోపి మహేశస్య 11.69
ప్రసాద మూలా సర్వేషాం 11.71
ప్రాణవద్ధారణీయం 6.26
ప్రాణలింగమిదం సూక్ష్మం 6.50
ప్రాణలింగాదియోగేన 14.2
ప్రాణావాన సమాఘాతాత్ 12.6
ప్రాణోయత్రలయంయాతి 12.7
ప్రాప్తవిద్యో 2.14
ప్రాయశ్చిత్తేషు సర్వేషు 7.11
పార్వత్యా సహితో 3.88
పార్శ్వస్థ పరివారాణాం 3.54
ఫలాభిసంధి నిర్ముక్త 9.82
ఫలాబిసంధి సంయుక్తం 9.81
ప్రేరకం శంకరం బధ్వా 10.39
ప్రేషితం సకలం 9.30

బ – కార

బద్ధేంద్రియ నవద్వారే 12.15
బహుజన్మకృత్యేః5.31
బహున్నాత్రశిముక్తేన 9.10
బ్రహ్మావిష్ణ్వాదయో 6.56
బ్రహ్మణా విష్ణునా పూర్వం 11.30
బ్రహ్మాది దేవతాజాలం 10.11
బ్రహ్మాది విబుధానో 11.58
బ్రహ్మాదయః సురాః 3.47
బ్రహ్మాడబుదోబుదోద్వేద 17.63
బ్రహ్మాండకుండికాషండ 3.14
బ్రహ్మాద్యా విబుధాఃసర్వే 7.27
బ్రాహ్మణః క్షత్రియావాపి 11.54
భక్తమార్గ క్రియాచైవ 5.29
భక్తస్థలం ప్రవక్ష్యామి 5.25
భక్తస్థలం సమాఖ్యాతం 10.1
భక్తాదిర్నామపర 14.44
భక్తిఃశైవీ మహాఘోర 4.44
భక్తిః స్థిరీకృతా 9.5
భక్తేర్యదా సముత్కర్షో 10.3
భక్తో మహేశ్వరశీతి 12.1
భక్తో మాహేశ్వర శ్చైష్య 12.2
భక్తాపరమయా 9.25
భవదృశానాం సిద్ధానాం 4.51
భవశర్వ మహేశాన 2.23
భస్మోద్ధూలన నిష్ణాతం 6.5
భస్మోద్ధూలన సర్వాంగం 4.3
భస్మాలంకృత సర్వాంగం 4.26
భస్మాలంకృత సర్వాంగం 4.30
భస్మస్నానయుతాః సర్వే 7.28
భావనావిహితం కర్మ 16.68
భ్రాంతిమూల ప్రపంచస్య 12.18
భూత్వాకర్మవశాజ్జంత 5.65
భేదస్య కర్మహేతుత్వాత్ 10.42

మ – కార

మణికంకణ కేయూర 3.20
మత్స్యకూర్మవరాహాంగ్యే 5.64
మంత్రపూతే కలాశ్యవేం 6.23
మంత్రేణ తమసేవంత 3.42
మదద్వైతపరంశాస్త్రం 3.86
మధ్యాంగులి త్రయేణ్యైవ 7.36
మదీయలింగ సంభూతం 3.85
మనోవాక్కాయభేదైశ్చ 9.17
మందార చందన ప్రాయ్యై 4.28
మందార బకుల 3.2
మహతాం శివతాత్పయర్య 11.44
మహాభస్మేతి సంజింత్య 7.2
మాయాశక్తిశరోధానాచ్ఛివే 14.8
మాయాశక్తివశాదీశో 5.46
మాయా వికల్పజం విశ్వం 12.11
మాయీ మహేధశ్వరస్తేషాం 5.35
మాహేశ్వరః ప్రసాదేతి 13.1

| | |
|---|---|
| ముక్తాతార | 3.7 |
| ముక్తావలయ సంబద్ధ | 3.17 |
| ముక్తిరూపమిదం | 12.46 |
| ముద్దానాత్ సర్వజంతూనాం | 1.16 |
| మునికన్యా కరానీతు | 4.11 |
| మునిర్వినయ సంపన్నో | 4.36 |
| మృణాలవల్లరి | 3.32 |
| మూర్ధ్నివా కంఠదేశే | 6.52 |
| మూలాధారేచ హృదయే | 6.35 |
| మూలం విద్యా | 8.23 |
| మోహాంధకార కపనం | 4.33 |
| మోక్షలక్ష్మీ పరిష్వంగముదితా | 3.48 |
| మౌన్య ఘంటాపరిస్పంద | 12.18 |

**య - కార**

| | |
|---|---|
| యత్కటాక్షకలమాత్రాత్ | 9.55 |
| యత్కించిద్భాషితం లోకే | 14.26 |
| యత్రకుత్రాపివాద్వైష్టి | 13.18 |
| యత్ర చాచార నిందాస్తి | 9.37 |
| యథాగురై యథాలింగే | 9.58 |
| యథాచంద్రే స్థిరాజ్యోత్స్నా | 2.38 |
| యథాదేవే జగన్నాథే | 9.52 |
| యథాత్మ శివయోర్వైశ్యం | 10.48 |
| యథాతంతుభిరుత్పన్నః | 10.65 |
| యథాశివ ప్రసాదాన్న | 11.18 |
| యదాశివకలాయుక్తం | 10.45 |
| యద్యచ్ఛింకతే యోగి | 14.25 |
| యద్యత్పశ్యతి సమోదం | 14.24 |
| యది ప్రమాదాత్పతతే | 6.27 |
| యయా మహేశ్వరః | 1.9 |
| యశ్శివః స గురుర్జ్ఞియా | 11.21 |
| యస్మాదేతత్ సముత్పన్నం | 10.63 |
| యస్యజ్ఞానం కమామిశ్వం | 13.14 |
| యస్యోర్మిబుద్బుధాభాసః యజ్ఞస్తపాంసి | 1.6 |
| యామాహుస్సర్వ లోకానాం | 1.8 |
| యయాచేష్టా సముత్పున్నా | 14.27 |
| యః సర్వాభూతాధిపతిం | 9.38 |
| యేన రక్షావతే | 1.23 |
| యేధారయంతి హృదయే | 6.42 |
| యేపశ్యంతి జగజ్జాలం | 11.37 |
| యేప్రసన్నా మహాదేవం | 11.31 |
| యే భజంతి మహాదేవం | 11.46 |
| యే లింగధారిణోలోక | 9.73 |
| యోద్వేష్టి సకలానో | 13.11 |
| యాలింగధారి | 9.73 |

**ర - కార**

| | |
|---|---|
| రజ్జౌసర్పత్వవద్ | 10.68 |
| రేణుకం త్వాం విజనామి | 4.50 |

**ల - కార**

| | |
|---|---|
| లయం గచ్ఛతియశ్శైవ | 6.37 |
| లింగంతు త్రివిధం ప్రోక్తం | 6.49 |
| లింగం ద్వివిధ ప్రోక్తం | 9.60 |
| లింగధారన మాఖ్యాతం | 6.30 & 6.58 |
| లింగధారిః సదాశుద్ధో | 6.54 |
| లింగనిష్యాది భావేన | 11.2 |
| లింగపూజామకృత్వా | 10.23 |
| లింగస్య ధారణం పుణ్యం | 6.29 |
| లింగార్చనపరః శుద్ధః | 10.44 |
| లింగార్చన రతాయశ్చ | 9.44 |
| లింగాన్యాస్తి పరంతత్త్వం | 12.49 |
| లింగేప్రాణం సమాధాయ | 9.8 |
| లింగేయస్య మనోలీనం | 10.27 |

**వ- కారం**

| | |
|---|---|
| వడవాగ్ని శిఖాజాలం | 4.31 |
| వర్ణాశ్రమ సదాచారై | 14.20 |
| వందారుదేవ | 3.9 |
| వసిష్టో వామదేవశ్చ | 3.54 |
| వామపార్శ్వ నివాసిత్యా | 3.24 |
| విద్యయాం రమతేయస్మాన్ | 5.18 |
| విద్యాయాం శివరూపాయాం | 5.15 |

విద్యవ్యైశద్యకరణం 11.14
విధదతు మతిమస్మిన్ 1.32
విధాతుమఖిలాన్ 2.17
విభూతిపట్టిం కృత్వాగ్రే 6.18
విభూతిం శివభక్తిభ్యో 6.14
విషయభ్రాంతిరాహిత్యం 12.11
వీరశైవాస్తు పద్ధేధాః 5.22
వీరశైవ మహాతంత్ర 1.30
వీరశైవ శిఖారత్నం 1.18
విశుద్ధజ్ఞానకరణం 2.11
వేదధర్మాభిధాయిత్వాత్ 5.12
వేదః ప్రధానం సర్వేషా 5.5
వేదమార్గం 1.26
వేదశాస్త్ర పురాణేషు 6.58
వేదసిద్ధాంతయోక్యశ్య 5.13
వేదాంతజన్యం యజ్ఞోజ్ఞానం 5.18
వేదాంతవాక్యజాం 12.36
వైరాగ్య సంపదోమూలం 11.55

**శ - కార**

శబ్ద స్పర్శాది సంపన్నే 10.14
శరణ్య సర్వభూతానాం 11.59
శరీర భూతదే తత్వాత్ 10.52
శరీరాత్పృథగాత్మనమాత్మనః 5.60
శరీరాత్మ వివేశిన 5.55
శరీరేంద్రియ బుద్ధిభ్యో 5.58
శమోదమో వివేశశ్చ 13.15
శంభోరేకత్వభావేన 14.18
శిరసాధారయేద్యస్తు 9.39
శివఏవపరంపాత్రం 9.87
శివగ్న్యాది సముత్పన్న 13.11
శివక్షేత్రోత్సవ 9.47
శివజ్ఞానం 5.32
శివజ్ఞానే సముత్పన్న 13.21
శివతత్వాత్ సముత్పన్నం 1.64
శివప్రసాదే సతి 11.77
శివపూజావరోభూత్వా 9.39
శివభక్తి సుధాసింధు 1.14
శివభక్తిః పరోధర్మః 13.16
శివభక్తి సమావేశే 11.55
శివభక్తి విహీనస్య 11.49
శివయోగి మహత్పాత్రం 9.89
శివయోగి శివః 9.66 & 9.88
శివయోగిని సంతృప్తే 1.11
శివయోగిని యద్దత్తం 9.63
శివలింగ ప్రసాదస్య 9.77
శివరుద్ర మహాదేవ 2.6
శివలింగే శివాచార్యే 9.79
శివనామరతావాణీ 9.17
శివశక్తి సముత్పన్నే 5.32
శివఃసర్వగతశ్చాపి
శివసంస్మారయోగేన శివధర్మా 10.32 s 10.33
శివప్రసాదం యదోద్రవ్యం 11.7
శివస్య బోధల్లింగం 11.26
శివస్య సర్వగత్వేపి 10.61
శివసిద్ధాంత తంత్ర
శివస్తుతి రసాస్వాద 10.16
శివస్థానాని తీర్థాని 9.46
శివం విశ్వగురుం 14.35
శివాగమ పరిజ్ఞాన 1.22
శివాగమ సుధాసింధు 4.6
శివాత్మక మిదం సర్వం 16.31
శివాత్మ బోద్యై కరతః 13.37
శివానందకరం దృష్ట్వా
శివానందం సమాసాధ్య 13.7
శివాదన్యత్ర విజ్ఞానే 13.33
శివదేశానుసారేణ
శివాద్వైత పరిజ్ఞానే 14.7
శివాద్వైత పరానంద 4.42
శివాద్యాది సముత్పన్న 1.10
శివాపరర్ష సంప్రాప్తౌ 10.20
శివాభిదం 2.8 & 12.35

శివానందం
శివాయ శివభక్తాయ
శివాశ్రితానాం జంతూనాం 11.52
శివాసక్త పరానంద మోదినా 13.13
శివేనైక్యం సమాపన్న 14.6
శివేభక్తిః సముత్పన్నా
శివే విశ్వమిదం సర్వం 14.30
శివోక్తధర్మ నిష్ఠాతు 10.36
శివోపచారనిరతః 9.19
శివైకభావనాపన్న 14.16
శీలం శివైక విజ్ఞానం 13.32
శైవతంత్ర మితిప్రోక్తం 5.8
శైవాగమేషు వేదేషు 7.43
శైవర్మాహేశ్వరైశ్చైవ 5.11
శుద్ధానియమ సంయుక్తాః 11.56

**స - కార**

సచ్చిదానంద రూపాయ 1.1
సత్తానంద పరిస్ఫూర్తి 6.33
సత్తాప్రాణమయీశక్తిః 12.12
సతీవ రమణే 13.5
సదాలింగైక్య నిష్ఠానాం 11.68
సద్యః కృతార్థయితుర్మతి 4.54
సద్యేన వామదేవేన 7.27
సభాంతరంగతం తంత్రం 3.66
సమస్త భువనాధీశ 3.62
సమస్త జగదాత్మపి 20.43
సమస్త జగదాత్మ 10.71
సమస్తలోక సందాహ 4.49
సమర్థా సర్వకార్యేషు 2.32
సమాః శత్రౌచ 11.40
సర్వగత్వం మహేశస్య 10.58
సర్వగత్వ నిరాసశ్చ 10.6
సర్వగత్వే మహేశస్య 10.55
సర్వ తత్త్వోపరిగతం 12.22
సర్వలక్షణ సంపన్నే 6.23
సర్వ విద్యా విశేషజ్ఞా 2.28
సర్వస్వం వీరశైవానాం 1.27
సర్వసిద్ధికరంపుంసాం 9.68
సర్వాంగోద్ధూలనం జాపి 7.30
సర్వాద్వైత విచారస్య 10.38
సర్వేషాం శైవతంత్రాణాం 1.31
సర్వేషామపి యజ్ఞ-నాం 11.60
సర్వే చజ్ఞానయోగేన 6.46
సంసారచక్ర నిర్వాహ నిమిత్తం 11.75
సంవిల్లింగ పరామర్శ 12.10
సశంభుర్భగవన్ 2.13
ససంస్కారేషు లింగేషు 10.46
స్వకర్మపరిపాకిన 5.52
స్వచ్ఛందాబౌరి లోకేస్మిన్ 4.12
స్వజాతి కులజాన్ 10.31
స్వమార్గచారవర్తిభ్యః 9.49
స్వస్య సర్వస్య లోకస్య 14.29
సుకృతం దుష్కృతంబాపి 11.51
సుకృతీదుష్కృతివాపి 14.11
సాదీక్షా త్రివిధాప్రోక్తా 6.12
సా పునర్భిద్యతే త్రేధా 9.16
సా భక్తిర్ద్వి విదాజ్ఞేయా 9.6
సాంఖ్యంయోగ 5.4
సూక్ష్మ రంధ్రం విజానీయాత్ 12.27
హస్త పాదాది సామ్యేన 11.22
హేమారవింద 3.5
హృత్యదేశమఘోరేణ 7.22
హారనిహార కర్పూర 4.22
హానూపుర కేయూర 3.35

# శ్రీ సిద్ధాంత శిఖామణి ప్రవచనప్రభ
## శ్లోకార్థముల ఆకారాది పట్టిక


అ–కార

| | |
|---|---|
| అకారణమకార్యం | 19.49 |
| అకారః శివ ఆఖ్యాతో | 20.39 |
| అఖండపరమానంద | 15.39 |
| అఖండానందసంవిత్తి | 19.47 |
| అఖండ సచ్చిదానంద | 20.16 |
| అఖండ సంవిదాకారం | 18.40 |
| అగస్త్యమునిశార్దూల | 5.2 |
| అంగాలీపస్థలం పశ్చాత్ | 20.4 |
| అచలం ధ్రువమాత్మ | 14.68 |
| అజ్ఞానమేఘనిర్ముక్తాః | 19.21 |
| అజ్ఞానమేవ సర్వేషాం | 17.12 |
| అతః పరం స్వరూపం | 21.50 |
| అంతః ప్రకాశమానస్య | 16.71 |
| అంతర్ముఖీన | 16.72 & 20.12 |
| అంతఃస్థితం | 12.9 |
| అంతరాకాశ బింబస్థ | 19.58 |
| అథవా పాదశబ్దీన | 19.7 |
| అర్థజాతమశేషం | 20.20 |
| అర్థహీనా | 16.19 |
| అద్యమే సఫలం జన్మ | 20.76 |
| అద్వైత పరమానంద | 17.73 & 15.61 |
| అద్వైతబోధ | 20.8 |
| అద్వైతవాసనావిష్ట | 18.51 |
| అద్వితీయ | 19.86 |
| అందపంగువద | 16.11 |
| అంధోయథా | 16.32 |
| అనాద్యవిద్యా | |
| అపరిచ్ఛిన్న | 6.36 |
| అపరిచ్ఛేద్య మాత్మానం | 18.39 |
| అపరిచ్ఛేద్య మాత్మస్థవాఙ్మానస | 18.72 |
| అపరోక్ష పరానంద | 19.27 |
| అప్రత్యక్షే | 9.53 |
| అప్రమేయే | 20.48 |
| అప్రాకృతైర్గుణ్యైః | 15.61 |
| అయథార్థ ప్రపంచోయం | 17.77 |
| అవతీర్ణమిదం శాస్త్రం | 20.75 |
| అవిద్యా మాహితా | 5.47 |
| అవిద్యా రాహునిర్ముక్తో | 19.20 |
| అవిశుద్ధే విశుద్దేవా | 18.48 |
| ఆశరీరోపి సర్వత్ర | 18.9 |
| అసదేవ జగత్సర్వం | 20.28 |
| అస్యజ్ఞాన సమాచారోం | 16.76 |
| అహంకార మదోద్రిక్తం | 17.41 |
| అహంకారస్థ్య సంబంధా | 18.21 |
| అహం బ్రహ్మేతి భావస్య | 18.45 |
| అహంభావస్య | 20.56 |
| అహ్యక్తాం పరమాం | 20.40 |
| అహింసా సత్యమస్తేయం | 16.59 |

ఆ – కార

| | |
|---|---|
| ఆగమానుగ్రహాదేవ | 21.18 |
| ఆచార ఏవ | 16.63 |
| ఆచారి భబదుక్తానాం | 15.9 |
| అచినేతి చ | |
| ఆత్మ జ్యోతిషి | 16.72 |
| ఆత్మ జ్యోతి చిద్రూపే | 17.48 |
| ఆత్మజ్ఞానావసానం | 14.56 |
| ఆత్మవత్సర్వభూతాని | 18.7 |
| ఆత్మానమఖిలం | 16.75 |
| ఆత్మానందేన | 19.16 |
| ఆదావంశేచ మధ్యేచ | 20.67 |
| ఆదైనవస్థలానీహ | 15.6 |
| ఆది ప్రసాదనామాథ | 18.4 |
| ఆబభాషే గణేంద్రం | 21.7 |
| ఆలోకమాత్ర నిర్ధూత | 20.74 |

ఇ – కార

ఇతతస్య వచః 4.48
ఇతి ప్రసాద 21.7
ఇతి ప్రశ్నే కృతేపూర్వం 20.74
ఇతి బ్రువాణం 21.12
ఇతిస్తవంతం 20.80
ఇత్యుక్త్వా 3.78
ఇదం ముఖ్యమిదం 15.59
ఇదానీమేవ మేజాతం 20.77
ఇంద్రియ ప్రీతి హేతూని 17.36
ఇంద్రియాణాం సమస్తానాం 17.15
ఇంద్రియాణి సమస్తాని 17.49
ఇంద్రియైరేవ 17.45

ఉ – కార

ఉపదేశోపదేశానాం 14.21
ఉపాధివిహితా భీదా 18.41

ఏ – కార

ఏక వివ శివః 5.33
ఏకభావ నిరూఢస్య 18.46
ఏకీకృతే 11.42
ఏకీభావ మపేతానాం 20.43
ఏకీభూతే నిజాకారే 18.54
ఏకోవశీకృతః 19.63
ఏతచ్ఛ్రవణ మాత్రేణ 20.87
ఏవం ప్రచోదితః శిష్యో 17.80

ఔ – కార

ఔపచారిక 16.43

క – కార

కటాక్షలీశమాత్రేణ 14.28
కటాక్ష చంద్రమాయస్య 15.26
కర్మజ్ఞానాన్నినా దగ్ధం 16.82
కలంకవానసౌ 14.23
కల్పితాని హి 14.48
కరణ్యేః సహితం 17.22
కరణేషు 17.26
కామక్రోధాది 15.58
కాయంవినా 16.26
కాలాతీతం కలాతీతం 19.68
కాంశ్చిదో దృష్టినిపాతేన 21.38
కిం తత్త్వం పరమం 17.74
కిం యజ్ఞైరగ్ని 15.35
కిం సత్యం కిం 17.69
కూటిస్థమచలం 19.81
కేవలం కర్మమాత్రేణ 16.26
కోటి షట్యం కు లింగానాం 21.27

గ – కార

గలితాజ్ఞాన బంధస్య 19.87
గలితాహంకృతి 17.13
గలితేమమతాహంతే 18.37
గుణత్రయ ప్రదాతీత 21.48
గురుదేవః పరంతత్త్వం 18.71
గురుప్రసాద చంద్రేణ 19.18
గురువాక్యామృతా 17.81
గురుశిష్యమయం 19.12
గురోర్లబ్ధా మహాజ్ఞానం 17.67
గురోర్విజ్ఞాన 15.30

ఘ – కార

ఘటాదిషు పృథగ్భాకం 20.45
ఘటోపాధిర్యథాకాశః 19.52

చ – కార

చిత్రనేమి శ్రమేణ్యేవ
చక్షుర్విషయోయథారూపం 16.20
చిత్తద్రవ్యం సమాదాయ 17.47
చిత్తస్థ సకలార్థానాం 17.51
చిత్తవృత్తిష్టు 17.9
చిదాత్మని శివేన్యస్తం 20.9
చోదితాః పరమేశేన 18.15

**జ - కార**

జగదంగే పరిగ్రస్తే 20.15
జపాయాగద్యథారాగః 18.8
జలెజలమివ 20.61
జాగ్రత్ స్వప్నసుషుప్తి 20.25
జాతస్య హిద్రువూ 5.63
జీవత్వం దుఃఖ సర్వస్వం 18.17
జీవభావం 18.5
జ్ఞాతావ్యహం జ్ఞేయ 19.50
జ్ఞానచంద్ర సముద్భూతాం 19.14
జ్ఞానచంద్రోదయే జాతే 19.22
జ్ఞానం పరశివాద్వైత 16.30
జ్ఞానం ముక్తిప్రదం 16.81
జ్ఞానం వస్తు పరిచ్ఛేదో 16.17
జ్ఞానస్య వ్యవహారేపి 19.44
జ్ఞానస్య విషయే తత్వే 19.13
జ్ఞానహీనం సదాకర్మ 16.27
జ్ఞానాగమస్థలంచాథ 16.3
జ్ఞానాదాధిక్య సంపత్తి 17.73
జ్ఞానామృతమపి స్వచ్ఛం 19.11
జ్ఞానామృతేన తృప్తస్య 18.73
జ్ఞానామృతేన తృప్తోపి 16.65
జ్ఞానీ కర్మ నిరూఢోపి 19.33
జ్ఞానిన్యాం యాని 19.30
జ్ఞానే సిద్ధే 16.12
జ్ఞానేన హీనః 16.83
జ్ఞేయాభావాదో 20.66
జ్యోతిర్లింగే 20.11 & 20.18

**త - కార**

తత్ర సంతుష్ట చిత్తస్య 21.33
తత్ర సన్నిహితం సాక్షాత్ 19.57
తత్ర సంభావితః 29.42
తథాపి ప్రార్థనీయం 21.11
తదైక్య సంపదానంద 11.11
తద్భావజ్ఞాపకజ్ఞానం 15.51
తదిదం శివసిద్ధాంత 20.85
తపసాం పరివాకీన 20.71
తపోహిమూలం సర్వాసాం 16.42
తమాగతం మహాభాగం 21.4
తస్మాదద్వైత విజ్ఞాన 19.96
తస్యేతి వచనం 21.32
తాదృశం తస్య మహాత్మ్యం 21.34
త్రిమూర్తిభేద 15.46
త్వంతాహంతావినిర్ముక్తీ 20.55
త్వదీయ ధర్మ సంపత్తిం 12.15
తుర్యాతీత 20.26

**ద - కార**

దదాతి యః పతిజ్ఞానం 15.15
దర్శనాత్పరకాయస్య 17.14
దర్శనాత్ స్పర్శనాదో 17.37
దర్శయిత్వా నిజాధిక్యం 21.40
దిక్కాలాద్యనవచ్ఛిన్నం 20.42
దీక్షాగురురసౌ శిక్షా 15.12
దీక్షాగురుస్థలం పూర్వం 15.5
దీక్షయాపగతద్వైతం 19.6
దీక్షాపాదోదకం 19.3
దీపం వినా యథాగేహే 16.34
దీయతే పరమంజ్ఞానం 15.7
దృష్టేతస్మిన్ పరానందే 19.15
దేవతిర్య జ్మనుష్యాది 5.35
దేవదేవ జగన్నాథ 21.44
దేశకాలానవచ్ఛిన్న 20.54
దేవకాలాద్యవచ్ఛేద 19.10
దేహద్వారేణ యద్యత్ 17.38
దేహాస్థితోప్యయం 18.19
దేహస్త్విష్టతు వా యాతు 16.55
దేహాభిమాన హీనస్య 16.46
దేహీనోపి పరాత్మత్వ 18.36
ధ్యానేన బోధేచ 18.76

న - కార

న కర్మబంధేన 18.76
నకించిదపి ముక్తస్య 18.67
న జరామదరణం నాస్తిన 17.11
న దేవత్వం నమానుష్యం న 20.47
నపృథివ్యాదీని భూతాని 20.64
న ప్రపంచే నిజేదేహీ 14.62
న దేవత్వం నమామనుష్యంన 20.47
న భాతి పృథ్వీ న జలం 20.20
న భావేన వినాజ్ఞానం 19.43
నబిభీతిజరామృత్యూనర్న 18.49
న మనుష్యోన దేవూ 16.48
నవకం లింగకోటినాం 21.26
నయథా విధి లోపః 16.7
న సమ్మానేషుసంప్రీతిం 14.60
నలఘయేద్గురూరాజ్ఞాం 17.65
న బుధ్యతి 17.71
న విధిర్న నిషేధశ్చ 20.44
నానా కర్మ విఫాకాశ్చ 18.13
నానా మార్గ సమారూధ 18.14
నాసౌ దేవూ న గంధర్వో 18.12
నిత్యానందే నిజాకారే 19.15
నిత్యే నిర్మలభావేన 15.71
నిత్యే నిర్మలసత్వయోగిషు 19.97
నిరస్తభేద జల్పస్య 18.56
నిరస్తమలసంబంధం 18.33
నిరస్త విశ్వసంభేదం 14.42
నిరస్తోపాది సంబంధం 19.75
నిరస్తోపాది సంబంధే 19.34
నిరాధారః శివః 17.29
నిర్ధూతే తత్రబోధేన 18.28
నిర్మమో నిరహంకారో 10.17 & 15.53
నిర్మలం హి శివజ్ఞానం 16.78
నిర్వికల్పే పరేధామ్ని 16.80
నిర్వికారం నిరాకారం 20.63
నివర్త్య జన్మజం దుఃఖం 19.40
నిష్కలంకం నిరాకారం 16.23
నిష్కలంక చిదానంద 19.77
నిష్కలంకే నిరాకారే 19.79
నిష్కలోపి మహాదేవః 16.40
నీడస్థితోయథాపక్షి 18.23
నేదం రజతమిత్యుక్తే 17.10
నైరంతర్యేణ సంపన్నే 16.22
నోత్కృష్టత్వం న హీనత్వం 20.57

ప - కార

పత్రశాఖాది రూపేణ 10.70
పరకాయ క్రియాపత్తిః 19.29
పరబ్రహ్మవపుర్యస్య 16.50
పరమాకాశమవ్యక్తం 19.70
పరమాద్వైత విజ్ఞాన 14.20
పరమాత్మ స్థలం 18.3
పరమానంద ఐవోక్తః 19.8
పరలింగే విలీనస్య 16.45
పరసంవిత్ 19.9
పరస్య జ్ఞాన చిహ్నాని 16.24
పరస్య దేహయోగేపి 16.44
పరస్యయా 16.34
పరాకాశ స్వరూపేణ 19.55
పరాత్పరంతు యద్బ్రహ్మ 14.49
పరాత్మని క్రియాసర్వా 19.82
పరాపర సమాపేక్ష 20.60
పరానంద 14.31
పరిత్యజ్య క్రియాః సర్వా 14.33
పరిపూర్ణే మహానందే 19.36
పరిపూర్ణ మహాజ్ఞానం 16.79
పశ్యతాం తత్ర 21.43
పశ్యన్ స్వాణి భూతాని 15.55
పాత్రం శివప్రసాదస్య 20.82
పాదాగ్రేణవో 11.42
పార్శ్వస్థ తిమిరం హంతి 15.24
పాహిమాం పరమేశాన 21.49

పిండాండస్థం యథాకాశం 19.65
ప్రేతోస్మితవ చారిత్రేః 21.16
పునః వికవివ
పునః కర్మావశేషణ 18.16
పూజితేన ప్రసన్నేన 21.6
ప్రకాశతే యా సర్వేషాం 20.14
ప్రకాశమానే 17.46
ప్రణతం వినయోపేతం 21.35
ప్రధ్వస్త వాసనా సంగాత్ 17.33
ప్రసాదిస్థల సంబంధా 18.1
ప్రాకృత్యేశ్చర్య 15.63
ప్రాణఏవ 17.28
ప్రాణోయస్య లయం యాతి 17.25
ఫలం క్రియావతాం పుంసాం 16.28

బ – కార
బహిస్తిమిర 15.27
బ్రహజ్ఞానే సమత్పన్నే 19.95
బ్రహ్మాండబద్బుదోద్భూతం 17.63
బ్రహ్మాండబుద్బుదస్తోమా 18.20
బ్రహ్మాండ శతకోటీనాం 20.29
బ్రహ్మాద్యాః కిం ను 15.69
బ్రహ్మాద్యా దేవతాః 16.41

భ – కార
భక్తాద్యై క్యావసానాని 15.2
భద్రాసనే నిజీరమ్యే 21.5
భస్మనా విహితం 7.23
భావ చిహ్నని విదుషో 16.14
భావ ఏవ హి జంతూనాం 17.52
భావ ప్రకాశనం పశ్చాత్ 19.5
భావనిష్పత్తికం బౌథ 19.4
భావస్య శుద్ధిరాఖ్యాతా 17.53
భావనా విహితం 16.68
భావలింగస్థలంబౌథ 15.6
భావశుద్ధేన 16.21
భావేన కిం ఫలం 16.25
భావేన గృహ్యతే 15.38
భావేన నాస్తి సంబంధః 19.38
భావేన హి మనఃశుద్ధి 16.69
భావోయస్యస్థిరో నిత్యం 17.59
భీదబుద్ధిస్తమస్తానాం 18.42
భీదశూన్యే మహాభోధే 18.50
భోక్తృభోజ్య పరిత్యాగా 18.26

మ – కార
మత్సమోనాస్తి లోకేషు 21.10
మథితాచ్ఛాస్త్ర జలధేర్యుక్తి 19.13
మద్భాగ్య గౌరవాదద్య 21.9
మనోయత్ర ప్రవర్తేత్ 17.20
మహాకాశస్థలం బౌత 19.5
మహాసత్తా మహాసంవిద్ 18.55
మాతృమేయ ప్రమాణది 20.7
మాహేశ్వర స్థలీ సంతి 16.2
ముక్తః సంశయ పాశతః 17.86
ముక్తిరేవ పరాతృప్తిః 18.76
ముఖ్యార్థీ సంభవే 19.90
ముఖ్యార్థ్యా లక్షణార్థశ్చ 20.6
మూర్త్యాత్మనైవదేవస్య 16.39
మూలాధారేథవా చిత్తే 6.35
మృచ్ఛిలా విహితా 15.40

య – కార
యజ్ఞాదయః క్రియాః సర్వా 14.34
యత్రనాస్తిభిదాయోగా 20.49
యత్సూక్తి దర్పణాభోగే 14.18
యథాకాశమవిచ్ఛిన్న 18.66
యథాకాశో విభుర్నియః 19.59
యథా చంద్రేస్థిరా 20.38
యథాజ్యోతిషి 19.74
యథా పద్మ పలాశస్య 18.22
యథా పిడస్థ ఆకాశ 19.51
యథా పుష్ప పలాశాది 19.73
యథా మేఘాః 20.23
యథావ్యాప్య జగత్సర్వం 18.34

యథాసూర్య సమాక్రాంతౌ 19.89
యద్భేశో వాయురాఖ్యాతః
యదా నిరస్తం జీవత్వం 18.18
యదా యోగీ నిజందేహం 17.35
యద్యత్కరణమాలంబ్య 17.40
యద్యత్పశ్యనోద్భశా 17.21
యద్భుజ్ఫలాభ సంతుష్టో
యస్మిన్ జ్యోతిర్గణాః 18.31
యస్మిన్ జ్యోతిషి చిద్రూపే 20.58
యస్మిన్న ప్రాప్త కల్లోలీ 19.27
యస్మిన్ సమస్త వస్తూని 18.32

**ర - కార**

రహస్యమేతత్ సర్వజ్ఞః 20.84
రావణోహి మమభ్రాతా 21.20
రేణుకత్వాం గణాధీశ 21.8

**ల - కార**

లయః సర్వపదార్థ 18.62
లింగకోటి త్రయస్యేహ 21.30

**వ - కార**

వయమజ్ఞానసంపన్నా 21.25
వాలాగ్ర శతభాగేన 18.6
వినాప్రసాద మీశస్య 18.60
విభీషణ మహాభాగ 21.13
విభీషణ విశేషజ్ఞ 21.24
విభీషణోపి హృష్టాత్మా 21.36
విమర్శాఖ్యా పరాశక్తిర్విశ్వో 20.30
విమర్శ భాండవిన్యస్త 20.34
వీరమాహేశ్వర గ్రాహ్యం 20.86

**శ - కార**

శబ్దాదయోపి విషయా 20.19
శంభోః శివప్రసాదేన 18.59
శరణస్థలమాశ్రిత్య 19.2
శాంతత్వాత్ ప్రాణవృత్తీనాం 17.27
శాంతోదాంతస్తశీలః 17.60
శాస్త్రం తవముఖోద్గీర్ణం 20.78
శాస్త్రాభ్యాసాది యత్నేన 16.29
శివ ఏవ జగత్సర్వం 19.84
శివ ఏవ పరం తత్త్వం 17.76
శివ జ్ఞానైకనిష్ఠ్యా 16.47
శివప్రసాద సంపత్త్యా 18.58
శివభావనయా యుక్తః 17.8
శివ భావేస్థిరేజాతీ 1.85
శివస్య దర్శనాత్ 16.33
శివస్య పరకాయస్య 17.24
శివస్య పరూపస్య 19.34
శివస్య పరిపూర్ణస్య 19.77
శివయోగ విశేషజ్ఞ 20.73
శివయోగి శివః 9.66
శివశాస్త్ర విశేషజ్ఞః 21.31
శివాఖ్యం పరమం బ్రహ్మ 19.69
శివాగారమిదం ప్రోక్తం 19.54
శివాచారే శివధ్యానే 19.62
శివాద్వైతపరం జ్ఞానం 16.77
శివాద్వైత పరిజ్ఞాన 4.5
శివాదన్యజ్జగన్మిథ్యా 17.66
శివే ప్రాణో విలీనోపి 17.30
శివే నివేశ్య సకలం 16.74
శివే నిశ్చలభావేన 17.50
శివేన విహితే 16.60
శిష్యస్థలం తతః 17.4
శిష్యాణాం హృదయాలీఖ్యం 14.19
శివోపి పరమః సాక్షాత్ 16.5
శివోహమితి భావేన 17.78
శివోహమితి భావస్య 17.84
శివోహమితి యస్యాస్తి 17.43
శిష్టాదనస్థలం బౌథ 20.3
శూన్య జ్ఞానాది సంకల్పే 20.69

ష – కార

| | |
|---|---|
| షట్స్థలోక్త సదాచార | 15.1 |
| షడద్వాతీత యోగేన | 15.10 |

స – కార

| | |
|---|---|
| సచ్చిదానంద జలధౌ | 20.13 |
| సత్తాత్మనానువృత్తంయద్ | 19.48 |
| సత్తానంద చిదాత్మకీ | 17.86 |
| సదాచార ప్రియః | 16.66 |
| సదాశివార్చనోపాయ | 16.10 |
| సందోహవనసందోహ | 15.27 |
| సమస్త జగదండానాం | 20.35 |
| సమస్తశాస్త్ర సారజ్ఞం | 21.14 |
| సమ్యగ్ జ్ఞానాగ్ని | 16.51 |
| సర్వం కర్మార్చనం | 17.56 |
| సర్వకారే చిదానందే | 20.52 |
| సర్వాత్మని పరే తత్వే | 20.62 |
| సర్వార్థసాధక | |
| సర్వాధిష్ఠాతృకః శంభు | 18.56 |
| సర్వానుగ్రాహకః శంభుః | 18.61 |
| సర్వేంద్రియగతం సౌఖ్యం | 17.57 |
| సర్వేంద్రియ నిరూఢూపి | 17.18 |
| సర్వేషామాత్మ భేదానాం | 18.29 |
| సర్వేషాం | 19.62 |
| సర్వేషాం ప్రేరకత్వేన | 18.27 |
| సంవిదేన పరాకాష్ట | 19.71 |
| సంవిద్యోమ్ని శివే | 19.97 |
| సంసార తిమిరే | 15.26 s 13.8 |
| సంసార నాటిక భ్రాంతి | 21.45 |
| సంసార వైద్య సర్వజ్ఞ | 21.46 |
| సక్షాత్కృతే పరే తత్వే | 18.64 |
| సుఖదుఃఖాది భావేషు | 20.57 |
| స్థలభీదా నవ ప్రోక్తాః | 17.2 |
| స్థలభీదాస్త్వయా | 20.1 |
| స్థలాని తానిచోక్తాని | 17.1 |
| స్థలానం నవకంప్రోక్తం | 18.2 |
| స్థలానాం నవకం | 16.2 |
| స్వచ్ఛందాచార రసికః | 21.3 |
| స్వచ్ఛందాచార | 14.65 |
| స్వతంత్ర సర్వకృత్యేషు | 146.5 |
| స్వప్నజాతం | 19.45 |
| స్వప్నేదృష్టం | 20.24 |
| స్వయమేవ స్వయం | 15.57 |
| స్వస్వరూపం శివాకారం | 16.54 |
| స్వేచ్ఛయా | 14.70 |
| స్వేచ్ఛావిగ్రహయుక్తాయ | 1.6 |

# సహాయక గ్రంథసూచి


అనుభవసూత్ర : మాయిదేవ విరచిత

సంపాదక : ఎచ్.పి. మల్లిదేవరు, ఓ.ఆర్.ఐ, మైసూర్

అమరకోశ : అమసింహ కృత, నిర్ణయసాగర ప్రెస్, ముంబయి

ఇష్టలింగ విజ్ఞాన : శ్రీ టి.జి. అక్కులయ్య దీక్షిత్ కృత, ప్రబోధ పుస్తకమాలి, బెంగళూరు

ఈశాద్యష్టోత్తరశకోపనిషద్ : వాసుదేవశర్మ సంపాదిత, నిర్ణయసాగర ప్రెస్

ఋగ్వేదసంహితా : వైదిక సంశోధన మండలి, పూనా

కిరణావలి : ఉదయనాచార్య కృత, ప్రకాశక - 10, రఘునాథ చటర్జీ స్ట్రీట్, కల్కత్తా, వంగ సంవత్

క్రియాసార : శ్రీ నీలకంఠశివాచార్య విరచిత భాగ 1 - 2, ఓ.ఆర్.ఐ, మైసూర్

కైవల్యపద్ధతి : శ్రీ నిజగుణశివయోగి విరచిత, జడసిద్ధాశ్రమ, గణేశ పేట్, హుబ్బళ్ళి

చంద్రజ్ఞానాగమ : లిం.పం. కాశీనాథశాస్త్రి సంపాదిత, పంచాచార్య ఎలక్ట్రిక్ ప్రెస్, మైసూర్

తంత్రసంగ్రహ : భాగ -1 , సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయ, వారణాసి

తంత్రసంగ్రహ : శంక్రప్పా అచ్చప్పా టోపిగి సంపాదిత, మూరుసావిరమఠ, హుబ్బళ్ళి

న్యాయకోశ : ఝళకీ భీమాచార్య విరచిత
భండారకర ప్రాచ్యవిద్యా సంశోధానాలయ, పూనా

పరమరహస్య : సంతశిరోమణి మన్మథస్వామి విరచిత,
సం. డా. శివలింగశివాచార్య, హిరెమఠ, అహమదపురం

పారమేశ్వరాగమ : మణూర మల్లికార్జునశాస్త్రి సంపాదిత, వీరశైవ
లింగీ బ్రాహ్మణ గ్రంథమాలా, శోలాపూర్

పూర్వప్రయోగరత్న : విద్వాన్ ఎం.జి. నంజుండారాధ్య సంపాదిత,, ప్రబోధ పుస్తకమాల, మైసూర్

బహిరంగయోగ : స్వామి యోగేశ్వరానంద సరస్వతి విరచిత
యోగనికేతన ట్రస్ట్, పంజాబిబాగ్, హోసదల్లి

భగవద్గీతా : అష్టటీకాయుక్త, మున్నిరామ మనోహరలాల్, పబ్లిషర్స్ ప్రై. లి. హోసదల్లి

మంకుతిమ్మన కగ్గ : శ్రీ డి.వి. గుండప్ప విరచిత, కావ్యాలయ ప్రకాశకరు, మైసూర్

యోగప్రతిపాదనస్థల : శ్రీ నిజగుణశివయోగి విరచిత, టీకారార, శ్రీ చిక్కరామారూఢస్వామిగళు, మల్లాపూర

యోగసూత్ర : పతంజలి ప్రణీత, వ్యాసభాష్య, తత్త్వవైశారది సహిత, జీవానంద విద్యాసాగర్, కలకత్తా

రామచరిత మానస : తులసీదాస విరచిత, గీతా ప్రెస్, గోరఖపూర్, వి.సం.

లింగధారణచంద్రికా : నందికేశ్వర శివాచార్య విరచిత, పం. శివకుమార శాస్త్రి కృత, టీకాసహిత, జంగమవాడిమఠ, వారణాసి

,, : ఆస్థాన విద్వాన్, శీర్ఫ్ గురుకాంతశాస్త్రి కృత, కన్నడ టీకా, ఎస్. శివకుమారస్వామి, మైసూరు

లింగమహాపురాణ : వ్యాసప్రణీత, సం. అష్టాదశ పురాణోద్ధారక, పువ్వాడ వెంకటిరాయ, కాంచి

వచనసాహిత్య సంగ్రహ : సం. సం. శి. భూసనూరమఠ, సాహిత్య సంస్కృతి అభివృద్ధి శాఖ, బెంగుళూరు

వాతుల శుద్ధాగమ : భాగ - 2, సం. డా. ఎచ్.పి. మల్లీదేవరు, ఓ.ఆర్.ఐ. ప్రకాశన, మైసూర్

వాతుల శుద్ధాఖ్య తంత్ర : (తంత్ర సంగ్రహ భాగ - 1) సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయ, వారణాసి

వీరశైవరత్న : లిం.పం. కాశీనాథశాస్త్రి విరచిత (మరాఠి) శైవభారతి భవన్, జంగమవాడిమఠ, వారణాసి

వీరశైవానంద చంద్రిక : శ్రీ మన్నిరంజన మరితోంటెదార్య విరచిత, (వాదకాండ) మూరుసావిరమఠ, హుబ్బళ్ళి

వీరశైవాన్వయచంద్రికా : శాకటీపురీ నిలయ, శ్రీ హుబ్బవీరశాస్త్రీ విరచిత, శ్రీ రాజరాజేశ్వరీ ముద్రాణాలయ, బెంగుళూరు

శిమహాపురాణం : వ్యాసప్రణీత, సం. అరుణోదయరాయ, వంగవాసి స్టీమ్ ప్రెస్, కలకత్తా శకో.

శివమహాపురాణ : జయచామరాజేంద్ర గ్రంథమాలా, మైసూర్

శివమహిమ్న స్తోత్ర : పుష్పదంత విరచిత, మధుసూదనీ టీకా సహిత, చౌఖంబా సంస్కృత సంస్థాన, వారణాసి

శివార్చనా చంద్రికా : శ్రీ మదప్పయ్య దీక్షిత్ వరచిత, శివాగమ సంఘ్, దేవసాలపూర్ ప్రకాశన

శ్రుతిసారభాష్యం : శ్రీ శివపూజాశివలింగ శివయోగి విరచిత ప్రకాశక, హోసమఠ శ్రీ బసవలింగస్వామి

సిద్ధాంత శిఖామణి : శివయోగి శివాచార్య విరచిత, శ్రీ మరితోంటదార్య విరచిత తత్త్వప్రదీపికా సహిత 9భాగ - 12) వీరశైవ లింగీ బ్రాహ్మణ గ్రంథమాల, శోలాపూర్

,, ఎన్. ఆర్. కరిబసవశాస్త్రి కృత కన్నడ తాత్పర్య దీపికా సహిత, వీరశైవ గ్రంథ ప్రకాశికా గ్రంథావళి, మైసూరు

,, కాశీనాథశాస్త్రి కృత భావప్రకాశాఖ్య, కన్నడ వ్యాఖ్యాసహిత, కాశీనాథ గ్రంథమాలా, మైసూర్

,, శ్రీ మల్లికార్జున స్వామిగళ ప్రవచన సంగ్రహ సం. శ్రీ సిద్ధేశ్వర స్వామిగళు

సిద్ధాంత శిఖోపనిషత్ : శంకరశాస్త్రి కృత, వీరశైవ భాష్య సహిత, శంకరవిలాస సంస్కృత పాఠశాలా, మైసూరు

సుభాషితరత్న భాండాగార : సంగ్రాహక, కాశీనాథశర్మ పరబ, నిర్ణయసాగర్ ప్రెస్, ముంబయి

స్కందమహాపురాణ : ఖీమరాజ, శ్రీ కృష్ణదాస, ముంబయి విక్రమ సం. 1675

# వ్యాఖ్యానమునకుపయోగపడిన గ్రంథముల పట్టిక

1. పాల్కురికి సోమనాథుని చతుర్వేద సారము
2. శివాగమములు
3. సిద్ధాంత శిఖామణి
4. కైవల్యోపనిషత్తు సా.దా. శివభాష్యము
5. శ్రీకర భాష్యము
6. నీలకంఠభాష్యము
7. సోమనాథ భాష్యము
8. మగ్గియమాయి దేవుని అనుభవసూత్రము
9. మగ్గియమాయి దేవుని శతకత్రయము
10. విశేషార్థ ప్రదీపిక
11. వీరశైవాచార ప్రదీపిక
12. వీరశైవ సంస్కార చంద్రిక
13. పాల్కురికి సోమనాథుని అనుభవసారము
14. పాల్కురికి సోమనాథుని చెన్నమల్లు సీసములు మరియు లఘుకృతులు
15. పాల్కురికి సోమనాథుని బసవోదాహరణద్వయము
16. పాల్కురికి సోమనాథుని వృషాధిప శతకము
17. పాల్కురికి సోమనాథుని బసవపురాణము
18. పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్ర
19. అష్టాదశ పురాణములు
20. చెగళిగె మఠం వీరయ్య, బాడాల రామయ్య, ముదిగొండ శివప్రసాద్, రాచవీర దేవర, కొండా బసవరాజు వారల బసవ వచనానువాదములు మరియు ఇతర అనువదించబడిన వచనములు

# సంకేతాక్షర సూచి

| | | | |
|---|---|---|---|
| 1. | బ.పు.ద్వి.సం. | = | బసవ పురాణము ద్విపద సంఖ్య |
| 2. | వ.సం. | = | వచన సంఖ్య |
| 3. | సి.శి.మ. | = | సిద్ధాంత శిఖామణి |
| 4. | స్కా.పు. | = | స్కాంద పురాణము |
| 5. | బ్ర.ఖం. | = | బ్రహ్మోత్తర ఖండము |
| 6. | కూ.పు. | = | కూర్మ పురాణము |
| 7. | అ.సా.ప. | = | అనుభవ సారము పద్యము |
| 8. | చ.సా.ప. | = | చతుర్వేద సారము పద్యము |
| 9. | య.వే | = | యజుర్వేదము |
| 10. | కై.ఉ.ప. | = | కైవల్యోపనిషత్తు |
| 11. | శి.ఆ. | = | శివాగమము |
| 12. | సో.భా.ము. | = | సోమనాథ భాష్యము |
| 13. | సీ.ప. | = | సీసపద్యము |
| 14. | క.ప. | = | కంద పద్యము |
| 15. | శ్లో | = | శ్లోకము |
| 16. | స.శ.ప. | = | సర్వేశ్వర శతకము పద్యము |
| 17. | శి.పు. | = | శివ పురాణము |
| 18. | చం.జ్ఞా.ఆ. | = | చంద్ర జ్ఞాన ఆగమము |
| 19. | ఉ | = | ఉత్పలమాల |
| 20. | చ | = | చంపకమాల |
| 21. | శి.సూ | = | శివానుభవ సూత్రము |
| 22. | శి.త.సా.ప. | = | శివతత్వ సారము పద్యము |
| 23. | అ.శి.ఉ.ష. | = | అధర్వ శిఖోపనిషత్తు |
| 24. | శి.సం.ఉ.ష. | = | శివసంకల్పోనిషత్తు |
| 25. | శి.ధ.శా. | = | శివధర్మ శాస్త్రము |
| 26. | లిం.పు. | = | లింగపురాణము |
| 27. | ఆ.వె. | = | ఆటవెలది |
| 28. | భా | = | భావము |
| 29. | శ్రీ.భా. | = | శ్రీకర భాష్యము |
| 30. | వీ.ఆ. | = | వీరాగమము |
| 31. | మ | = | మత్తేభము |
| 32. | వా.లా.ము. | = | వాతూలాగమము |